శ్రీమదాంధ్ర మహాభారతము

భీష్మపర్వము

విషయసూచిక

ప్రథమాశ్వాసము

విషయము	సంస్కృతమూలము	పుట
ధృతరాష్ట్రునికడకు వేదవ్యాసుండు వచ్చుట	6 - 2 - 1	02
సంజయుఁడు ధృతరాష్ట్రునకు భూపరిమాణంబు సెప్పుట	6 - 5 - 9	10
సంజయుఁడు ధృతరాష్ట్రునకు భారతవర్షంబునం గలవిశేషంబులు సెప్పుట	6 - 10 - 1	17
ధృతరాష్ట్రుఁడు భీష్మమరణంబు విని విలపించుట	6 - 14 - 1	25
సంజయుఁడు ధృతరాష్ట్రునకు భారతయుద్ధంబు సెప్పఁ బూనుట	6 - 16 - 7	32
భీష్ముఁడు నిజయోధులకెల్ల నుత్సాహంబుగాఁ దెగువ సెప్పుట	6 - 17 - 7	45
పాండవయోధులు యుద్ధంబునకు వెడలుట	. . . . .	48
ధర్మజునకు నర్జునుఁ డుత్సాహంబు గలిగించుట	6 - 1 - 93	59
ధర్మరాజు పాదచారియై భీష్మునియొద్దకుఁ బోవుట	6 - 41 - 6	68
ధర్మరాజు గురుకృపశల్యులచేత యుద్ధమున కనుజ్ఞాతుం డగుట	6 - 41 - 43	73
అర్జునుఁడు స్వజనపంహారంబునకు శంకించి మోహావిష్టుం డగుట	6 - 23 - 30	84
శ్రీకృష్ణుఁ డర్జునునకుఁ దత్త్వజ్ఞానోపదేశంబు సేయుట	6 - 24 - 19	72
అర్జునుఁడు శ్రీకృష్ణునివిశ్వరూపంబు కనుంగొని స్తుతించుట	6 - 33 - 5	100
భీష్ముని ప్రథమ దివసయుద్ధము	6 - 42 - 1	111
భీష్ముఁడు దుర్యోధనప్రేరితుండై పాండవవీరుల నొప్పించుట	6 - 45 - 1	129

ద్వితీయాశ్వాసము

ధర్మజుఁడు గోపాలదేవు పాలికిం జనుట	6 - 46 - 1	143
భీష్ముని ద్వితీయదివస యుద్ధక్రమము	6 - 47 - 1	152
అర్జునుఁడు భీష్మునిమీఁదికి రథంబు దోలించి విజృంభించుట	6 - 48 - 2	156
ధృష్టద్యుమ్న ద్రోణాచార్యులయుద్ధము	6 - 49 - 1	162
భీమసేనునిచేత భానుమంతుండు చచ్చుట	6 - 50 - 30	169
భీష్ముని తృతీయదివస యుద్ధము	6 - 52 - 11	181
దుర్యోధనుఁడు భీమునితో యుద్ధము సేసి మూర్ఛిల్లుట	6 - 54 - 15	187
అర్జునుఁడు శ్రీకృష్ణప్రేరితుఁడై భీష్మునిపైఁ గవియుట	6 - 55 - 40	198
శ్రీకృష్ణుఁడు చక్రంబు ధరించి భీష్మునిమీఁది కురుకుట	6 - 55 - 84	203
భీష్ముని చతుర్థదివసయుద్ధము	6 - 56 - 1	211
శల్యనందనుఁడు ధృష్టద్యుమ్ననితో యుద్ధంబుసేసి చచ్చుట	6 - 57 - 25	217
దుర్యోధనుఁడు భీముని మార్కొని మూర్ఛఁబొందించుట	6 - 60 -7	231
ఘటోత్కచుండు మాయాబలంబునఁ గౌరవసేనపై విజృంభించుట	6 - 68 - 40	236
భీష్ముని పంచమదివస యుద్ధక్రమము	6 - 65 - 1	247
ద్రోణుండు దుర్యోధన ప్రేరితుండై పాండవసైన్యంబుపైఁ గవియుట	6 - 65 - 21	250
అభిమన్యు లక్ష్మణకుమారుల యుద్ధము	6 - 69 - 30	262
భీష్ముని షష్ఠదివసయుద్ధక్రమము	6 - 71 - 1	269
ధృష్టద్యుమ్నుఁడు భీమసేననకుఁ దోడ్పడుట	6 - 73 - 31	279
ధృష్టద్యుమ్నుఁడు ద్రోణునితో యుద్ధము సేయుట	6 - 73 - 67	284

తృతీయాశ్వాసము

భీష్మగాంధారేయుల సంవాదము	6 - 76 - 3	295
భీష్మని సప్తమదివసయుద్ధక్రమము	6 - 77 - 11	297
ధృష్టద్యుమ్ననిచే దుర్యోధనుఁడు విరథుఁడై పోవుట	6 - 78 - 44	303
చేకితాన కృపాచార్యుల ద్వంద్వయుద్ధము	6 - 80 - 20	310
భీష్మని యష్టమదివసయుద్ధక్రమము	6 - 83 - 1	321
సునాభుఁడు మొదలగు కురుకుమారులు భీమునిచేఁ జచ్చుట	6 - 84 - 12	323
అలంబసునిచేత నిరావంతుఁడు మృతుం డగుట	6 - 86 - 48	333
ఘటోత్కచుఁడు ద్రోణాచార్య ప్రభృతులతో యుద్ధంబుసేయుట	6 - 88 - 25	341
అర్జునుఁ డిరావంతుని చచ్చుట భీమునిచే విని దుఃఖించుట	6 - 92 - 1	350
భీష్మని నవమదివస యుద్ధము	6 - 95 - 1	361
అలంబసుఁడు దుర్యోధన ప్రేరితుఁడై యభిమన్యుపైఁ గవియుట	6 - 96 - 24	365
అర్జునుఁడు ద్రోణాచార్యులతో యుద్ధముసేయుట	6 - 98 - 4	371
దుర్యోధనుఁడు శకునిదుశ్శాసనుల భీష్మునకు సహాయంబుగాఁ బంపుట	6 - 101 - 1	378
శ్రీకృష్ణుఁడు రథంబు డిగి భీష్మునిపైకిఁ బోవుట	6 - 102 - 52	388
ధర్మరాజు రహస్యప్రకారంబున భీష్మునియొద్దకుఁ బోవుట	6 - 103 - 50	398
భీష్మని దశమదివసయుద్ధానుక్రమము	6 - 104 - 2	407
అర్జునుఁడు శిఖండికిఁ బ్రోత్సాహంబు గలిగించి భీష్మునైఁ గవియించుట	6 - 104 - 51	411
ద్రోణాచార్యు లశ్వత్థామను భీష్మునకు సహాయంబుగాఁ బంపుట	6 - 108 - 1	419
విరటుతమ్ముఁ డగుశతానీకుండు భీష్మునిచేఁ జచ్చుట	6 - 113 - 24	431
భీష్ముఁడు శరతల్పగతుఁ డగుట	6 - 114 - 80	440
కర్ణుఁడు భీష్మునియొద్దకుఁ బోయి వినతుం డగుట	6 -117 - 1	450

శ్రీమదాంధ్ర మహాభారతము

భీష్మపర్వము

శ్రీరస్తు

శ్రీమదాంధ్ర మహాభారతము

భీష్మపర్వము - ప్రథమాశ్వాసము

శ్రీ సంపాది పదాంబుజ! । నాసాగ్ర నివాస రసిక! నాదామృత ధా
రాసారరూప! వేద । వ్యాస వ్యంజిత విహార! హరిహరనాథా! 1

ప్రతిపదార్థం: శ్రీ, సంపాది, పద+అంబుజ!= ఉత్తమమైన ఐశ్వర్యాన్ని కలుగజేసే పద్మాలవంటి పాదాలు కలవాడా! లేదా, శ్రీ అంటే మోక్షం. మోక్షాన్ని కలుగజేసే పాదపద్మాలు కలవాడా! - పరమేశ్వర పాదపద్మధ్యానం చేత మోక్షం కలుగుతుందని భావం; నాసా+అగ్ర, నివాస, రసిక!= యోగనిష్ఠాగరిష్ఠుని ముక్కుయొక్క కొనయందు నివసించు రసజ్ఞుడా! - యోగనిష్ఠ గరిష్ఠుడికి నాసాగ్రదృష్టి విధించబడింది. దానికి హేతువు మనస్సుకు స్థిరమైన ఆత్మనిష్ఠ కలగటం. ఇట్లా నాసాగ్రదర్శనం ఆత్మనిష్ఠ ప్రతిష్ఠితం కావటంచేత పరమేశ్వరుడు నాసాగ్ర నివాస రసికు డని చెప్పబడింది; నాద+అమృత, ధారా+ఆసార, రూప!= నాదమనే అమృతధార యొక్క జడి రూపం కలవాడా! నాదం అమృతధారా సార రూపమగు పరమేశ్వరుడు, లేదా పరమేశ్వరుడు నాదరూపుడనీ, అమృత ధారా సారరూపుడనీ రెండువిధాల రూపత్వం చెప్పవచ్చును; వేదవ్యాస, వ్యంజిత, విహార!= వేదవ్యాసమహర్షి చేత సుస్పష్టం చేయబడిన విహారం కలవాడా! -పరమేశ్వర విహార స్థానాలైన శ్రుతులు సంకీర్ణాలుగా ఉండగా వాటిని వ్యాసుడు అసంకీర్ణాలుగా చేసి పరమేశ్వర విహారాలను శాస్త్రాల రూపంలోనూ, మహాభారతాది గ్రంథరూపంలోనూ సుస్పష్టం కావించాడని భావం; హరిహరనాథా!= శివకేశవులకు అభేదాధ్యవసాయి అయిన భగవంతుడా!

తాత్పర్యం: ఓ హరిహరనాథా! శ్రేష్ఠమైన ఐశ్వర్యాన్ని కలుగజేసే పాదపద్మాలు కలవాడా! ముక్కుకొసయందు నివాసం కలవాడా! నాదమనే అమృతధార యొక్క జడిరూపం కలవాడా! వేదవ్యాసమహర్షి చేత సుస్పష్టం చేయబడిన విహారం కలవాడా!

విశేషం: ఇది భీష్మపర్వంలో- మొదటి ఆశ్వాసంలోని మొట్టమొదటి పద్యం. కృతిపతి సంబోధన. తిక్కన భారతానికి కృతిపతి హరిహరనాథుడు.

(ii) నాసాగ్రసికుడు - ఆ హరిహరనాథుడు. భగవద్గీతలోని శ్లోకం ఇచ్చట అనుసంధించవలసి ఉంటుంది.

సమం కాయ శిరో గ్రీవం । ధారయ న్నచలం స్థిరః,
సంప్రేక్ష్య నాసికాగ్రం స్వం । దిశశ్చానవ లోకయన్. (అధ్యాయం 6, శ్లోకం 13)

అని శ్రీకృష్ణుడు అర్జునుడితో చెప్పి ఉన్నాడు. అనుభవైకవేద్యమైన యోగాభ్యాస రహస్యం ఇందులో ఇమిడి ఉంది. యోగి నాసికాగ్రమునందు ఉపాసనాదృష్టి కేంద్రీకరించవలసి ఉంది.

(iii) హరిహరనాథుడు - 'నాదామృత ధారాసారరూపుడు!' "వేదానాం సామవేదో zస్మి"- ఇది భగవద్గీతా వాక్యం. భగవంతుడు సామవేద స్వరూపుడు. నాదోపాసకులు మాత్రమే ఇందలి గూఢార్థం గ్రహించగలరు. ఎడతెగని 'అమృతధార' వలె ఆ నాదం అభివ్యక్తం కావాలి. ఇది శ్రుతిలయలకు అతీతమైన సన్నివేశం.

(iv) హరిహరనాథుడు- 'వేదవ్యాస వ్యంజిత విహారుడు.' హరిహరనాథోపాసన - 'విష్ణురూపాయ శివాయ నమః' మాత్రమే కాదు. తిక్కన మాటలలో చెప్పాలంటే - అది "ధర్మాద్వైత" కళోపాసన. దీనిని తిక్కన ఆరంభించినట్లు లోకప్రతీతి. కాని ద్రోణపర్వంలో సంస్కృత మహాభారతంలో సైంధవవధకుముందు అర్జునుడు తాను ఆ కృష్ణుడి మెడలో వేసిన పూలదండను, తనకు స్వప్నంలో సాక్షాత్కరించిన శివుని కంఠంలో చూస్తాడు. శివుడు తనకూ శ్రీకృష్ణుడికీ భేదం లేదని కంఠోక్తిగా ప్రకటిస్తాడు.

అంతేగాక, ఇచట వేదవ్యాస మహర్షి ఉపాసించిన 'వ్యంజన శక్తి' ప్రసక్తి ఉంది. వ్యంజనం - వాచ్యార్థంకంటె అతీతమైనట్టిది. వ్యాస శబ్దానికి సమన్వయత అనే అర్థం ఉంది. వేద వ్యాసుడు, తిక్కన సమన్వయ సిద్ధాంత ప్రవక్తలు. వ్యాసప్రోక్తమైన మహాభారతం - వ్యంజనాదృష్టితో చూస్తే - సమన్వయ వేదాంత విహారం.

ధృతరాష్ట్రుని కడకు వేదవ్యాసుండు వచ్చుట (సం.6-2-1)

క. దేవా! జనమేజయ వసు । ధా వల్లభుఁ డధిక వినయ తత్పరుఁడై సం
భావించి కుతూహలమునఁ । దా వైశంపాయనునకుఁ దగ ని ట్లనియెన్. 2

ప్రతిపదార్థం: దేవా!= ఓ పరమేశ్వరా! (హరిహరనాథా! జనమేజయ, వసుధా, వల్లభుఁడు= జనమేజయుడు అనే పేరుగల రాజు (భూభర్త); అధిక, వినయ, తత్పరుఁడు+ఐ= మిక్కుటమైన నమ్రతతో కూడినవాడై; సంభావించి= మన్నన చూపి; కుతూహలమునన్= వేడుకతో; తాన్= తాను; వైశంపాయనునకున్= వైశంపాయనుడితో; తగన్= సముచితంగా; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఓ హరిహరనాథా! జనమేజయ మహారాజు మిక్కిలి నమ్రతతో కూడినవాడై, మన్నన చూపి వైశంపాయనుడితో ఈ విధంగా అన్నాడు.

విశేషం: (1) తిక్కన మహాకవి - తాను వ్రాసిన మహాభారతాన్ని హరిహరనాథదేవునకు అంకితం ఇచ్చాడు. కృతిపతి - కృతికి మొదటి శ్రోత. ఇది సాహితీ సంప్రదాయం.

(2) మహాభారత కథను - (సంస్కృత మూలభారతం ప్రకారం) జనమేజయ మహారాజు చేసిన సర్పయాగంలో వైశంపాయన మహర్షి మహాభారత కథ ఆ రాజుకు వినిపించాడు. జనమేజయుడు - పరీక్షితుడి కొడుకు. పంచపాండవ మధ్యముడైన అర్జునుడి మునిమనుమడు. అభిమన్యుడి మనుమడు.

క. ఒండొరుల గెలుచు తలఁపునఁ । బాండవులును గౌరవులును బాహా గర్వో
ద్దండత నెట్లు దొడంగిరి? । భండన మెప్పాటఁ జెల్లెఁ బరమమునీంద్రా!' 3

ప్రతిపదార్థం: పరమ, ముని+ఇంద్రా= గొప్పవాడవైన మునిశ్రేష్ఠుడా! (ఇంద్ర శబ్దం శ్రేష్ఠవాచకం); ఒండొరులన్= ఒకరినొకరిని; గెలుచు, తలఁపునన్= జయించవలయుననెడి ఆలోచనతో; పాండవులును, కౌరవులును= పాండురాజు కొడుకులు (ధర్మరాజు, భీముడు, అర్జునుడు, నకులుడు, సహదేవుడును) దుర్యోధనుడును అతని తమ్ములును; బాహా+గర్వ+ఉద్దండతన్= భుజబలం వలని అహంకారం యొక్క అతిశయంతో; ఎట్లు= ఏ రీతిగా; తొడంగిరి?= పూనుకొన్నారు?; భండనము= యుద్ధం; ఏ+పాటన్= ఏ రీతిగా; చెల్లెన్?= జరిగింది?

తాత్పర్యం: మునులలో శ్రేష్ఠుడవైన ఓ వైశంపాయన మహర్షీ! ఒకరినొకరు జయించాలనే అభిప్రాయంతో పాండవులు, కౌరవులు ఏ విధంగా ప్రయత్నించారు? యుద్ధం ఏ రీతిగా జరిగింది? వివరించి తెలుప వేడుతున్నాను.

విశేషం: 1. కౌరవులు అనగా కురురాజు సంతతివారని అర్థం. అనగా పాండవులు కూడా నిజానికి కౌరవులే. పాండురాజు కొడుకులైన వారూ, ధృతరాష్ట్రుడి పుత్రులైన దుర్యోధనుడూ అతడి తమ్ములూ - కురుసంతతివారే. అయితే- వివక్ష కోసం ప్రజలు ఇటు వారిని పాండవులు అన్నారు. అటు వారిని కౌరవులు అన్నారు. అంతే.

2. భీష్మపర్వంలో ఇది కథకు సంబంధించిన మొదటి పద్యం. మహాభారత యుద్ధం - భీష్మపర్వంలోనే ఆరంభమైంది. విశ్వవిఖ్యాతిని ఆర్జించిన మహాభారత యుద్ధం గూర్చి పాండవవంశంలోని వాడైన జనమేజయ మహారాజు ఎంతో ఆసక్తితో అడుగుతున్నాడు.

క. అనుటయు వైశంపాయనుఁ । డనుమోద రసార్ద్రహృదయుఁడై యిట్లనియెన్
జనమేజయు మనమున సం । జనితంబగు కౌతుకంబు సఫలతఁ బొందన్. 4

ప్రతిపదార్థం: అనుటయున్= అని చెప్పిన పిదప; వైశంపాయనుఁడు= (మహాభారత కథకుడు); అనుమోద, రస+ఆర్ద్ర, హృదయుఁడు+ఐ= అంగీకారం అనెడి ద్రవంతో తడిసినట్టి గుండె కలవాడై, సంతోషంతో సమ్మతించినవాడై; జనమేజయు; మనమునన్= జనమేజయుడి యొక్క మనస్సులో; సంజనితంబు+అగు= పుట్టినట్టి; కౌతుకంబు= వేడ్క; సఫలతన్+పొందన్= నెరవేరేటట్లుగా; ఇట్లు+అనియెన్= ఈ రీతిగా అన్నాడు.

తాత్పర్యం: జనమేజయుడు ఆ విధంగా ప్రశ్నించగా, వైశంపాయన మహర్షి మిక్కిలి సంతోషించి, అతడి మనసులోని ఆసక్తి తీరేటట్లుగా ఈ విధంగా బదులు చెప్పాడు.

విశేషం: ఇచ్చట "రస" శబ్ద ప్రయోగం గమనించాలి. జనమేజయుడి ప్రశ్న - వైశంపాయనుడికి మిక్కుటమైన ఆనందం కలిగించింది. శ్రోతయైన రాజు యొక్క జిజ్ఞాస కథకుడైన మునికి నచ్చింది. అతడి హృదయం 'అనుమోద రసంతో' తడిసింది అని కవి వర్ణన. రసములు తొమ్మిది ఆలంకారికుల దృష్టిలో. అందులో "అనుమోదం" ఒకటికాదు. అయితే- "అనంతో వై రసాఃఽ" రసములు అనంతాలు అనే మాట కూడా ఉంది. 'రసం' అంటే హృదయాన్ని కదలింపగల భావం. దానికి గుండెను తడుపగల శక్తి ఉంటుంది.

తిక్కన మహాకవికి - రసశబ్ద ప్రయోగం అంటే మిక్కిలి మక్కువ. కొందరు విమర్శకులు తిక్కన రసశబ్దాన్ని పలుచోట్ల ప్రయోగించి చులకన చేశాడని అధిక్షేపించారు గూడ. అయితే- తిక్కనకు ఇష్టమైన "రసం" హృదయాన్ని తడిపే భావావేశంగా స్వీకరించాలి గాని ఆలంకారికులు ప్రపంచించిన నవరసాలలో చేర్చరాదు.

వ. పుణ్యక్షేత్రోత్తమంబయిన యా కురుక్షేత్రంబున నా రెండు దెఱంగుల వారి కటకంబులును విడిసి కయ్యంబునకుఁ గాలు ద్రవ్వునట్టి సమయంబున ధృతరాష్ట్రుండు గొడుకుల దుర్వినయంబునకు నిర్వేదనంబు నొంది, సంజయద్వితీయుండై చింతించుచున్న యెడకుం ద్రికాలవేదియగు వేదవ్యాసుండు విజయం చేసి యమ్మహీపతి సేయు నర్చనంబులం గైకొని యతని కిట్లనియె: 5

ప్రతిపదార్థం: పుణ్య క్షేత్ర+ఉత్తమంబు+అయిన= పుణ్యమైన ప్రదేశాలలో శ్రేష్ఠమైనది అయిన; ఆ, కురుక్షేత్రంబునన్= ఆ కురుక్షేత్రం అని పేరు వడసిన ప్రదేశంలో; ఆ, రెండు, తెఱంగులవారి= ఆ రెండు పక్షాలవారి (పాండవుల యొక్కయు, కౌరవుల యొక్కయు); కటకంబులును= శిబిరాలు (సేనలు గుమిగూడిన కేంద్ర ప్రదేశం "కటకం"); విడిసి= ఒకచోట చేరి; కయ్యంబునకున్= పోరుకు, యుద్ధానికి; కాలు, త్రవ్వు+అట్టి= సంసిద్ధత చూపించే; సమయంబునన్= తరుణంలో; ధృత రాష్ట్రుండు; కొడుకుల దుర్వినయంబునకున్= తన పుత్రుల యొక్క గర్వానికి (నమ్రత లేకపోవటానికి); నిర్వేదనంబున్+ఒంది= దుఃఖాన్ని పొంది; సంజయ, ద్వితీయుండు+ఐ= సంజయుడు తన చెంత ఉండటం చేత రెండవవాడై- సంజయుడితో కూడినవాడై;

చింతించుచున్+ఉన్న; ఎడకున్= ఆలోచన చేస్తున్న చోటికి; త్రికాల; వేది+అగు= మూడు కాలాలు తెలిసినవాడైన; వేదవ్యాసుండు; విజయం చేసి= వచ్చి; ఆ+మహీపతి= ఆ రాజు (ధృతరాష్ట్రుడు); చేయు, అర్చనంబులన్= చేసే పూజలను; కైకొని= స్వీకరించి; అతనికిన్+ఇట్లు+అనియెన్= ధృతరాష్ట్రుడితో ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: పుణ్యస్థలమైన ఆ కురుక్షేత్రంలో కౌరవులు పాండవులు గుడారాలు నిర్మించి సేనలతో యుద్ధానికి సన్నద్ధమైన సమయంలో ధృతరాష్ట్రుడు సంజయునితో కూడియుండి తన కొడుకుల గర్వానికి దుఃఖించటం గమనించి మూడు కాలాల పోకడ తెలిసినట్టి వ్యాసమహర్షి అక్కడికి వచ్చి అతడితో ఈ విధంగా అన్నాడు:

విశేషం: భారతదేశంలో కొన్ని స్థలాలు 'పుణ్యక్షేత్రాలుగా' ప్రసిద్ధి చెందాయి. ఆయా స్థలాలకు వెళ్ళేవారికి సుకృతం (పుణ్యం) లభిస్తుందని నమ్మకం. అందులో ఒకటి కురుక్షేత్రం. అక్కడ యుద్ధంలో మరణించినవారికి 'పుణ్యం' లభించగలదనే విశ్వాసం ప్రజలలో ఏర్పడింది. వ్యాసమహర్షి వేదాలకు ఒక అనుక్రమణిక ఆకార రేఖలు స్థిరీకరించాడు గనుక అతడికి వేదవ్యాసుడు అనే బిరుదు ఏర్పడింది. వ్యాసుడు అనే పేరుగల మహర్షులు పలువురు ఉండవచ్చును. 'వేదవిద్యాధురంధరుడైన' వ్యాసుడికి ప్రత్యేకత ఏర్పడింది. త్రికాలవేది - అనగా భూత, వర్తమాన, భవిష్యత్ కాలములు, వాటిలో జరిగింది, జరుగుతున్నది, జరుగబోయేది తెలిసినవాడు. సంజయుడు- ధృతరాష్ట్రుడికి ఆంతరంగిక సచివుడు.

క. ' కాలం బగుటయు నృపులకు । నాలము సమకూరె; దీని కడలకు మది నీ
వాలోకింపఁగ వలసిన । నే లోనికి దివ్యదృష్టి నిచ్చెదఁ బుత్రా!' 6

ప్రతిపదార్థం: పుత్రా= ఓ కొడుకా! (ఓ ధృతరాష్ట్రా); కాలంబు+అగుటయున్= ఆయుస్సు తీరటం చేత; నృపులకున్= రాజులకు; ఆలము= యుద్ధం; సమకూరెన్= ఏర్పడింది; మదిన్= మనస్సులో; దీనికిన్= (ఈ యుద్ధం దాపురించినందుకు); అడలకు(ము)= దుఃఖించవద్దు; నీవు+ఆలోకింపఁగన్, వలసినన్= నీవు చూడాలనే అవసరం ఉంటే (నీవు చూడాలని కోరితే); ఏన్= నేను; (నీకు) లోనికిన్= లోపలికి; దివ్య, దృష్టిన్= భగవత్ కృపవలన ఏర్పడే చూపు; ఇచ్చెదన్= ఇస్తాను.

తాత్పర్యం: 'కుమారా! పోయేకాలం దగ్గరపడి రాజులకు యుద్ధం దాపురించింది. దీనికి నీవు విచారించకుము. ఆ యుద్ధాన్ని చూడాలని కోరికగా ఉంటే, నీకు దివ్యదృష్టినిస్తాను.'

విశేషం: 1. ధృతరాష్ట్రుడు వేదవ్యాస మహర్షి వలన అంబికకు జన్మించిన కొడుకు. అందుచే 'పుత్రా!' అనే సంబోధన. దివ్యదృష్టి: చర్మచక్షువులకు సాధ్యంకాని చూపు.

2. కాలంబగుట, కాలము తీరుట, కాలము మూడుట అనే ప్రయోగాలు గమనించదగినవి. ప్రాచీన భారతీయులలో ప్రబలిన విశ్వాసం - ఎవరికైనా భగవంతుడిచేత నిర్ణయించబడిన ఆయుర్దాయం ఉంటుంది. ఆ గడువు అయిపోగానే మరణం సంభవించటం తథ్యం. ఇంతమంది రాజులకు విధినిర్ణీతమైన ఆయుస్సు తీరింది కాబట్టి యుద్ధం సంప్రాప్తించింది. దీనికి దుఃఖించవలసిన అవసరం లేదనివేదవ్యాస మహర్షి ఊరడింపు. ధృతరాష్ట్రుడు పుట్టుకచే గ్రుడ్డివాడేగాన వేదవ్యాసమహర్షి అతడికి 'దివ్యదృష్టి'ని వరంగా అనుగ్రహిస్తానన్నాడు.

చ. అనుడు నతండు 'ఘోరముగ నన్నలుఁ దమ్ములుఁ బోరు క్రూరతం
గనుఁగొనఁజాల, నేను వినఁగా వలతుం; దదనుగ్రహంబు సే
సినఁ గడు లెస్స'యన్న ముని చిత్తమునం గరుణించి సంజయుం
బనిచె మహారణంబు పరిపాటిమెయిన్ సకలంబుఁ జెప్పఁగన్. 7

ప్రతిపదార్థం: అనుడున్= అని (వేదవ్యాసుడు) చెప్పిన పిదప; అతండు= (ధృతరాష్ట్రుడు); ఘోరముగన్= భయంకరంగా; అన్నలున్, తమ్ములున్= సోదరులు; పోరు= యుద్ధం చేయు; క్రూరతన్= చెడ్డతనమును; కనుఁగొనన్+చాలన్= చూడలేను; ఏను= నేను

(ధృతరాష్ట్రుడు); వినఁగాన్, వలతున్= విన కోరుతున్నాను; తత్+అనుగ్రహంబు+చేసినన్= ఆ దయ చూపితే; కడు, లెస్స= మిక్కిలి మంచిది; అన్నన్= అని చెప్పగా; ముని= ఋషి (వ్యాసుడు); చిత్తమునన్= మనస్సునందు; కరుణించి= దయకలిగి; మహా, రణంబు= గొప్ప యుద్ధం; పరిపాటి మెయిన్= సక్రమంగా; సకలంబున్= అంతా; చెప్పఁగన్= చెప్పటానికి; సంజయున్+పనిచెన్= సంజయుడిని నియమించాడు.

తాత్పర్యం: ఆ విధంగా వేదవ్యాస మహర్షి చెప్పిన పిదప, ధృతరాష్ట్రుడు ఈ రీతిగా బదులు పలికాడు: 'అన్నదమ్ములు చేసే ఘోర యుద్ధం నేను చూడలేను. వినగలను అంతే. నేను వినే ఏర్పాటు చేస్తే చాలు.' ఆ మాటలకు వేదవ్యాసుడు కరుణించి, యుద్ధ విషయాలను జరిగినవి జరిగినట్లుగా (యథాతథంగా) చెప్పుమని సంజయుడిని నియోగించాడు.

వ. ఇట్లు ధృతరాష్ట్రునకుం గయ్యంబు తెఱంగు వినిపింప నియోగించి యా సూతనందనునకు నా రెండు తెఱంగులవారి, దివారాత్ర ప్రవర్తనంబులు గనునట్లును, రహస్య ప్రకార భాషణంబులు వినునట్లును మనోవృత్తంబు లెఱుంగునట్లునుంగా వరం బిచ్చి, యతి శీఘ్ర గమనంబు నొసంగి, భారత సమర ధరణిం బరిగినను శస్త్రాస్త్రంబు లెవ్వియుం దాకకుండు నట్టి ప్రభావంబుఁ బ్రసాదించి, దివ్యుల యాలాపంబులు రూపంబులుం దలంపులుం దేటపడునట్టి మహనీయ బోధంబును గలుగ ననుగ్రహించి, యావైచిత్ర వీర్యు నాలోకించి 'యిది ప్రాప్తకాలంబై వచ్చిన భూప్రజాక్షయంబు; దీనికి వగవం బని లేదు 'ధర్మోజయ' తనుచు నిశ్చింతంబున నుండు; మేనును గురుపాండవుల కీర్తిఁ బ్రకటింపంగలవాఁడ' నని యతని నాశ్వాసించి సాత్యవతేయుండు వెండియు. 8

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; ధృతరాష్ట్రునకున్; కయ్యంబు తెఱంగు= యుద్ధం జరిగే తీరు; వినిపింపన్; నియోగించి= ఏర్పాటు చేసి; ఆ సూతనందనునకున్= ఆ సూతుడి కొడుకుకు- (సంజయుడికి) ఆ రెండు తెఱంగులవారి= ఆ రెండు పక్షాలవారి (కురుపాండవుల యొక్క); దివా, రాత్ర, ప్రవర్తనంబులు= పగలు, రేయి జరిగే సంగతులు; కనునట్లును= చూచేటట్లున్నూ; రహస్య, ప్రకార, భాషణంబులు= ఒరులకు తెలియరానట్లుగా జరిగే మాటలు; వినునట్లును; మనస్+వృత్తంబులు= మనస్సులోని తలపులు; ఎఱుంగునట్లును= తెలిసేటట్లున్నూ; వరంబు+ఇచ్చి= దైవబలముచే తీరే కోరిక= వరము; అతిలోకశక్తిని అనుగ్రహించి; అతి, శీఘ్ర, గమనంబును= మిక్కిలి వేగంగా పోగలశక్తిని ఒసంగి= ఇచ్చి; భారత, సమర, ధరణిన్+తిరిగినను= భారత యుద్ధభూమిలో సంచరించినప్పటికినీ; శస్త్ర+అస్త్రంబులు+ఎవ్వియున్= శస్త్రాలు అస్త్రాలు ఏవైనప్పటికినీ; (ఆయుధము లేవియు) తాకక+ఉండు+అట్టి; ప్రభావంబు= మహిమ; ప్రసాదించి= ఇచ్చి; దివ్యుల+ఆలాపంబులు= వేల్పుల మాటలు; రూపంబులున్+తలంపులున్= ఆకారాలు, భావాలు; తేటపడు+అట్టి= తెలిసేటటువంటి; మహనీయ, బోధంబును= గొప్ప జ్ఞానాన్ని; కలుగన్+అనుగ్రహించి; ఆ+వైచిత్ర వీర్యున్= ఆ విచిత్ర వీర్యుడి కొడుకైన (ధృతరాష్ట్రుడిని); ఆలోకించి= చూచి; ఇది= (ఈ యుద్ధం); ప్రాప్తకాలంబు+ఐ= కాలం వలన ఏర్పడినట్టిదై; వచ్చిన, భూ, ప్రజా, క్షయంబు= భూమిమీది ప్రజల వినాశం; దీనికిన్ (ఈ యుద్ధానికి); వగవన్+పనిలేదు= దుఃఖించవలసిన అవసరం లేదు; ధర్మో జయతు= ధర్మః జయతు= ధర్మం జయించుగాక!; అనుచున్; నిశ్చింతంబునన్+ఉండుము= చింత లేకుండా ఉండుము; ఏనును= నేనుకూడా (వ్యాసుడు); కురు, పాండవుల కీర్తిన్= కౌరవుల యొక్కయు పాండవుల యొక్కయు కీర్తిని; ప్రకటింపన్+కలవాఁడను= తెలియచేయగలను; అని, అతనిన్= ధృతరాష్ట్రుడిని; ఆశ్వాసించి= ఓదార్చి; సాత్యవతేయుండు= సత్యవతి కొడుకు (వ్యాసుడు); వెండియున్= మరియు.

తాత్పర్యం: వ్యాసుడు ఈ విధంగా ధృతరాష్ట్రుడికి, యుద్ధ విశేషాలు వినిపించే ఏర్పాటు చేశాడు. అంతేకాక- వార్తాహరుడైన సంజయుడికి కొన్ని అతిలోకశక్తులు ప్రసాదించాడు. సంజయుడు యథేచ్ఛగా యుద్ధభూమిలో అతి

వేగంగా విహరించవచ్చును. అతడిని ఏ ఆయుధాలు తాకజాలవు. అతడు ఇతరుల మనస్సులను పసిగట్టగలడు. వేల్పుల రూపాలు చూడగలడు; మాటలు వినగలడు. ఇట్టి వరాలను అనుగ్రహించి వ్యాసమహర్షి ధృతరాష్ట్రుడిని చూచి, 'ఈ యుద్ధం విధివిలాసం వలన వచ్చింది. భూభారం తగ్గగలదు. దీనికోసం దుఃఖింపవద్దు' అని ఊరడించి 'ధర్మం జయించుగాక! చింత వీడి ప్రశాంతంగా ఉండుము. నేను కురుపాండవుల కీర్తి ప్రకటించగలను' అని చెప్పి మరియు... (తరువాతి పద్యంతో అన్వయం)

విశేషం: (1) ప్రాచీన భారతీయ సాహిత్యంలో సంస్కృతిలో పేర్కొనబడిన విశేషం - వరం. వేల్పులు మహనీయులు వరం అనుగ్రహించటం కద్దు. అమానుషశక్తివలన, కోరికలు ఈడేరటం, అతిలోక సన్నివేశాలు జరగటం వరంలోని ముఖ్యమైన అంశాలు. అట్టిదే దివ్య దృష్టి.

(2) మహాభారతంలో యుద్ధ వృత్తాంతాలు సేకరించిన వాడు సంజయుడు. శాంతి సమయంలోనైనా వార్తా సంకలనం ఒక ప్రత్యేక ప్రజ్ఞ. ఇక యుద్ధవార్తా సంకలనం బహుళ ప్రమాదభూయిష్ఠం. దానికి కావలసిన విశేష ప్రజ్ఞలు ఇందు ఉగ్గడించబడ్డాయి.

(3) సమకాలీనుడైన వ్యాసుడు తాను కురుపాండవ చరిత్ర వ్రాయగలనని ఇందులో సూచించాడు.

క. ' మొగుళులు లేకయు నుఱుములు । గగనక్షోభంబు సేసెఁ; గరి హయ తతిఁ బె
ల్లుగ నశ్రు లురలఁ జొచ్చెను; । మృగములు పక్షులను, బసులు మృగముల నీనెన్. 9

ప్రతిపదార్థం: మొగుళులు, లేకయున్= మబ్బులు లేకుండానే; ఉఱుములు; గగన, క్షోభంబు= ఆకాశంలో గందరగోళం; చేసెన్= చేశాయి; కరి, హయతతిన్= ఏనుగులయందును, గుఱ్ఱాలయందును; పెల్లుగన్= మిక్కుటంగా; అశ్రులు= కన్నీళ్ళు; ఉరలన్+చొచ్చెను= కారసాగాయి; మృగములు= జంతువులు; పక్షులను; పసులు= ఆవులు; మృగములన్= జంతువులను; ఈనెన్= కన్నాయి.

తాత్పర్యం: మబ్బులు లేకుండానే ఆకాశంలో ఉఱుములు సంక్షోభం రేకెత్తించాయి. ఏనుగులూ, గుర్రాలూ మిక్కుటంగా కన్నీరు కార్చాయి. జంతువులు పక్షులను కన్నాయి. ఆవులు జంతువులను కన్నాయి.

విశేషం: భారతంలో పలు తావులలో ప్రకృతి వైపరీత్యాలు అపశకునాలుగా ప్రజాక్షయ సూచనలుగా వర్ణించబడ్డాయి.

క. నలువురు నేవురు బిడ్డలు । గలిగెద రొక్కొక్క వనిత గర్భంబున; వా
రలు పుట్టినపుడ యాడుచుఁ । గలకల నవ్వుచుఁ జెలంగఁ గనియెద మెందున్. 10

ప్రతిపదార్థం: నలువురున్= నల్గురు; ఏవురు= అయిదుగురు; బిడ్డలు= సంతానం; ఒక్కొక్కొ; వనిత; గర్భంబునన్= ఒక్కొక్క స్త్రీ కడుపునుండి; కలిగెదరు= పుడతారు; వారలు= (ఆ బిడ్డలు) పుట్టిన+అపుడు+అ= పుట్టినపుడే; ఆడుచున్= ఆటలాడుతూ; కలకల నవ్వుచున్= పకపక నవ్వుతూ; చెలంగన్= ఒప్పగా; ఎందున్= ఎచ్చటనైనా; కనియెదము= చూస్తాము.

తాత్పర్యం: ఒకే స్త్రీ గర్భం నుండి ఒకేసారి నలుగురైదుగురు బిడ్డలు పుట్టుతారు. వారు పుట్టగానే ఆడతారు, కలకల నవ్వుతారు. అట్టి అద్భుతాలు మనం చూడగలం.

తే. అర్కు నుదయాస్తమయములయందుఁ గృష్ణ । కాంతి ఘోరకబంధంబు గప్పఁ జొచ్చె;
నిందు లాంఛన స్థితి తలక్రిందుగాఁగఁ । దోఁచుచున్నది ప్రజ యెల్లఁ ద్రుంగకున్నె. 11

ప్రతిపదార్థం: అర్కు+ఉదయ+అస్తమయముల అందున్= సూర్యుడు ఉదయించేటప్పుడు; ప్రొద్దుగ్రుంకేవేళలలో; కృష్ణ, కాంతి= నల్లని కాంతిచేత; ఘోర= భయంకరమైన; కబంధంబు= మబ్బు (కబంధ శబ్దానికి మొండెం, మబ్బు, సముద్రం అనే అర్థాలున్నాయి; ఇక్కడ మబ్బు అనే అర్థం స్వీకరించటం లెస్స); కప్పున్+చొచ్చెన్= ముసురుకొనసాగింది; ఇందు లాంఛన స్థితి= చంద్రుడిలోని మచ్చ యొక్క ఉనికి; తల, క్రిందు, కాఁగన్+తోచుచున్నది= తలక్రిందుగా కనపడుతున్నది; ప్రజ+ఎల్లన్= జనమంతా; త్రుంగక+ఉన్నె= నాశనం కాదా!

తాత్పర్యం: ప్రొద్దుపొడుపు వేళ ప్రొద్దుగ్రుంకేటప్పుడు నల్లని కాంతితో భయంకరమైన మబ్బులు క్రమ్ముతున్నాయి. చంద్రుడిలోని మచ్చ తలక్రిందులుగా కన్పిస్తున్నది. ఇది ప్రజాక్షయ సూచన కాదా!

విశేషం: రామాయణంలో కబంధుడు - తలలేని మొండెము చేతులుగల రాక్షసుడు. ఇచ్చట వ్యాపించిన చీకట్లు గూడ అట్టివే.

వ. విశేషించియుం గౌరవ నికేతనంబులఁ గేతనంబులఁ బొగ లెగయుటయు, నాయుధంబులు మండుటయు, నివి మొదలుగా ననేక దుర్నిమిత్తంబులు వుట్టుచున్నయవి; కులక్షయంబును నానా నరేంద్ర నాశంబును నగు; నుపేక్షింపం దగదు; దుష్పథవర్తులగు దుర్యోధనాది కుమారుల వారించి నీ తమ్మునిపా లతని కొడుకుల కొసంగి శాంతి సేయుట మేలు; మము బోంట్ల మనంబులకుం బ్రియంబు గాని యీ రాజ్యంబు నీ కేటి?' కనిన విని యమ్మనుజేంద్రుం డమ్మునీంద్రున కిట్లనియె: 12

ప్రతిపదార్థం: విశేషించియున్= మరియును; కౌరవనికేతంబులన్= కౌరవులయొక్క గృహాలలో; కేతనంబులన్= జెండాలలో; పొగలు ఎగయుటయున్= పొగలు వ్యాపించటమూ; ఆయుధంబులు మండుటయున్= కత్తులు మున్నగు యుద్ధసాధనాలు మండటం; ఇవి మొదలుగాన్= ఇటువంటివి; అనేక+దున్+నిమిత్తంబులు= పెక్కు చెడు శకునాలు; పుట్టుచున్నయవి= కలుగుతున్నవి; కుల, క్షయంబును= వంశ నాశనం; నానా నర+ఇంద్ర, నాశంబును= పలువురు మేటి రాజుల; వినాశం, అగున్= జరుగుతుంది; ఉపేక్షింపన్+తగదు= చూస్తూ ఊరకుండరాదు; దుష్పథ వర్తులు+అగు= చెడుమార్గంలో నడుస్తున్న వారైన; దుర్యోధన+ఆది, కుమారులన్= దుర్యోధనుడు మొదలైన కొడుకులను; వారించి= అడ్డగించి, నీ, తమ్ముని, పాలు= నీ తమ్ముడికి చెందవలసిన (రాజ్య) భాగం; అతని కొడుకులకు= అతడి పుత్రులకు; ఒసంగి= ఇచ్చి; శాంతి+చేయుట= సంధి చేయటం; మేలు= మంచిది; మముబోంట్ల= మావంటివారి; మనంబులకున్= మనస్సులకు; ప్రియంబు కాని= ఇష్టంకాని; ఈ రాజ్యంబు; నీకున్+ఏటికిన్+అనినన్= నీకు ఎందుకు అని అనగా; విని= ఆలకించి; ఆ+మనుజ+ఇంద్రుండు= ఆ రాజు (ధృతరాష్ట్రుడు); ఆ+ముని+ఇంద్రునకున్= మునులలో గొప్పవాడైన ఆతడితో (వ్యాసుడితో); ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: 'కౌరవుల ఇళ్ళ నుండి జెండాల నుండి పొగలు రేగుతున్నాయి. ఆయుధాలు మండుతున్నాయి. ఇట్టి అపశకునాలు ఎన్నో కన్పిస్తున్నాయి. స్వకులస్థులు, పెక్కుమంది రాజులు మరణించటం చూస్తూ ఊరుకోదగింది కాదు. చెడుమార్గంలో నడుస్తున్న దుర్యోధనాది కురుకుమారులను వారించి నీ తమ్ముని పాలు అతని కొడుకుల కిచ్చి శాంతిచేయడం మంచిది. మావంటి వారికి ఇష్టం కాని ఈ రాజ్యం నీకు ఎందుకు?' అని ధృతరాష్ట్రుడితో వ్యాసమహర్షి చెప్పాడు. ధృతరాష్ట్రుడు వ్యాసుడితో ఈ విధంగా సమాధానం చెప్పాడు:

చ. 'హితమును ధర్మముం దలఁచి యిమ్మెయిఁ జెప్పితి రిట్లు మున్ను; నా
సుతుల నయంబుమైఁ దఱిమి చూచితి; వారలఁ బంపు సేయ నేఁ
జతురుఁడఁ గాను; బ్రాభవము సాలదు; నాదెసఁ దప్పులేమి మీ
మతిఁ దలపోసి యీ పలుకు మానుఁడు పాకము దప్పెఁ గార్యముల్.' 13

ప్రతిపదార్థం: హితమును= నాకు మేలైనట్టి దానినీ; ధర్మమున్= చేయదగిన కర్తవ్యాన్నీ; తలఁచి= ఆలోచించి; ఈ+మెయిన్= ఈరీతిగా; చెప్పితిరి= చెప్పారు; ఇట్లు= ఈ విధంగా; మున్ను= లోగడ; నా సుతులన్= నా కొడుకులను; నయంబుమైన్= సాత్త్విక పద్ధతిలో; తఱిమి చూచితిన్= లోతుగా నచ్చచెప్పజూచాను; వారలన్= నా కొడుకులను; పంపు+చేయన్= ఆజ్ఞాపించటానికి (లోబరచుకొనటానికి); నేన్+చతురుఁడన్+కాను= నేను నేర్పరిని కాను; ప్రాభవము+చాలదు= (వారిపై) (నాకు) అధికారం సరిపోవునంతగా లేదు; నా దెసన్= నా యెడ; తప్పు లేమి= దోషం లేకపోవటం; మీ+మతిన్= మీ బుద్ధియందు; తలపోసి= ఆలోచించి; ఈ+పలుకు+మానుఁడు= ఈ మాటలు (ఈ హితోపదేశం) చేయటం మానండి (మీ ఈ బహువచన ప్రయోగం - వ్యాసునియెడ ధృతరాష్ట్రుడికి గల గౌరవాన్ని సూచిస్తుంది); కార్యములన్= పనులు (కర్తవ్యాలు); పాకము+తప్పెన్= పరిపక్వత కోలుపోయాయి అనగా ఇప్పుడు చేయిమించి పోయిందని భావం.

తాత్పర్యం: 'ఓ వ్యాసమహర్షి! మీరు నామీదగల ప్రేమతో పూర్వం కూడా ఈ విధంగా నాకు హితోపదేశం చేశారు. కర్తవ్యం బోధించారు. ఇదివరలో నేను కూడా నా కొడుకులకు బుద్ధి చెప్పాలని ఎంతో ప్రయత్నించాను. వారు నా అదుపు తప్పిపోయారు. వారిని ఆజ్ఞాపించగల శక్తిసామర్థ్యాలు నాకు లేవు. నా యెడ తప్పులేదని మీరు గ్రహించ ప్రార్థన. దయచేసి నాకు హితవు చెప్పవద్దు. చెప్పి లాభం లేదు. నేను ఇప్పుడు ఇంక చేయగలిగింది ఏమీ లేదని తమకు మనవి చేస్తున్నాను.'

విశేషం: 'పాకము తప్పె కార్యములె' చక్కని చిక్కని పదగుంఫనం. శాంతి చేకూర్చటం - మంచి పనే. కానీ అది జరిగే పనికాదు అని ధృతరాష్ట్రుడు వ్యాసుడితో అన్నాడు. ధృతరాష్ట్రుడి శీలానుశీలనానికి ఈ పద్యం తోడ్పడుతుంది. ధృతరాష్ట్రుడు తెలిసిన మూర్ఖుడు. మహాభారతంలోని విచిత్రపాత్ర.

వ. అనిన విని పరాశరసూనుండది యట్లుండ ని మ్మింక నేనేమియుం జెప్పవలయు నది గలదే?' యని పలికిన నాంబికేయుండు గయ్యంబున గెలుపుఁ దెలుపు నిమిత్తంబు లడిగిన నమ్మునివరేణ్యుండు వహ్నులు హోమకాలంబునం బుణ్యగంధములతోఁ బ్రదక్షిణార్చు లగుటయు భేరీ ప్రముఖంబులు గంభీర ఘోషంబు లగుటయు వాయువు లనుకూల మృదు మనోహర ప్రచారంబు లగుటయు నివి మొదలుగాఁ గొన్ని శుభ సూచకంబులు నిర్దేశించి, 'కొంచెంబు పెద్ద యన లేదు; సమరంబున జయంబు దైవాధీనంబు గావునం బెద్దలు పెనఁకువ లొప్పవని చెప్పుదు; రేను బోయివచ్చెద నని చెప్పి సముచిత ప్రకారంబున నంతర్ధానంబు సేసెఁ; దదనంతరంబ యక్కౌరవేంద్రుండు గొండొకసేపు చింతించి నిట్టూర్పు నిగుడించి సంజయున కిట్లనియె. 14

ప్రతిపదార్థం: అనినన్ విని= అని (ధృతరాష్ట్రుడు) చెప్పగా విని; పరాశరసూనుండు= పరాశరుడి కొడుకు (వ్యాసుడు); అది+అట్లు+ఉండనిమ్ము= ఆ విషయం వదలిపెట్టుము; ఇంకన్= ఇకమీద; నేను+ఏమియున్+చెప్పవలయునది+కలదు+ఏ?= నేను చెప్పవలసింది ఏమైనా ఉన్నదా?; అని+పలికినన్= అని చెప్పగా; ఆంబికేయుండు= అంబిక కొడుకైన ధృతరాష్ట్రుడు; కయ్యంబునన్= యుద్ధంలో; గెలుపు+తెలుపు+నిమిత్తంబులు= విజయాన్ని సూచించే శకునాలు; అడిగినన్= ప్రశ్నించగా; ఆ+ముని+వరేణ్యుండు= మునులలో శ్రేష్ఠుడైన వాడు- వ్యాసుడు; వహ్నులు= అగ్నులు; హోమ+కాలంబునన్= హోమం చేసే సమయంలో; పుణ్య+గంధంబులతోన్= మంచి వాసనలతో; దక్షిణ+అర్చులు+అగుటయున్= కుడివైపునకు వ్యాపించే మంటలుగలవి కావటం; భేరీ ప్రముఖంబులు=భేరి మున్నగు యుద్ధ వాద్యాలు; గంభీర+ఘోషంబులు+అగుటయున్= ప్రస్ఫుటమైన ధ్వనులతో కూడినవి కావటం; వాయువులు= గాలులు; అనుకూల+మృదు+మనోహర+ప్రచారంబులు+అగుటయున్= వాలుగా మెల్లగా చల్లగా వీస్తూ ఉండటం. ఇవి+మొదలుగాన్= ఇటువంటివి; కొన్ని శుభసూచకంబులు= కొన్ని మంచి శకునాలను; నిర్దేశించి= ప్రత్యేకంగా చెప్పి; కొంచెంబు పెద్ద+అనన్ లేదు=

(సంఖ్యలో) కొంచెం ఎక్కువ అనే తేడా ముఖ్యం కాదు; సమరంబునన్= యుద్ధంలో; జయంబు= గెలుపు; దైవ+అధీనంబు= భగవంతుడి చేతిలో ఉన్నట్టిది; కావునన్= కాబట్టి; పెద్దలు= వృద్ధులు (జ్ఞానులు); పెనఁకువలు= కలహాలు; ఒప్పవు+అని= మంచివి కావని; చెప్పుదురు= అంటారు; ఏను+పోయివచ్చెదన్= నేను వెళ్ళుతున్నాను; అని+చెప్పి= అని వచించి; సముచిత+ప్రకారంబునన్= ఉచిత రీతిని; అంతర్ధానంబు+చేసెన్= మాయమయ్యాడు; తద్+అనంతరంబు+అ= అటు పిమ్మట; ఆ కౌరవ+ఇంద్రుండు= కౌరవులలో శ్రేష్ఠుడు= ధృతరాష్ట్రుడు; కొండొకసేపు= కొంత కాలం; చింతించి= ఆలోచించి; నిట్టూర్పు నిగుడించి= దీర్ఘ నిశ్వాసంచేసి; సంజయునకున్; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: ఆ విధంగా ధృతరాష్ట్రుడు చెప్పగా వ్యాసుడు 'అది అట్లా ఉంచుము, ఇంక నేను చెప్పవలసింది ఏమైనా ఉన్నదా?' అని అడిగాడు. అప్పుడు ధృతరాష్ట్రుడు 'యుద్ధంలో గెలుపును సూచించే శకునాలను తెలుపు' మని అడిగాడు. వ్యాసుడు చెప్పిన మాటలు: 'హోమకాలంలో అగ్నులు పుణ్యపరిమళాలు వెదచల్లుతూ సవ్యప్రదక్షిణంగా చక్కగా వెలుగొందుతాయి. వాలుగాలులు మనోహరంగా వీస్తాయి. భేరీలవంటి యుద్ధ వాద్యాల నుండి చక్కని చిక్కని ధ్వనులు వినిపిస్తాయి' అని చెప్పాడు. 'అంతేగాక- యుద్ధంలో విజయం సంఖ్యాబలం మీదకాక దైవానుగ్రహం మీద ఆధారపడి ఉంటుంది. కాబట్టి కలహం మంచిది కాదని పెద్దల ప్రవచనం' అని చెప్పి అతడు అంతర్ధానమైనాడు. ధృతరాష్ట్రుడు కొంతసేపు చింతిస్తూ వేడి నిట్టూర్పులు విడిచి సంజయుడితో ఈ విధంగా అన్నాడు:

ఉ. భూమికిఁ గాఁగఁ బ్రాణముల పోక దలంపక రౌద్ర ఘోర సం
గ్రామము సేయుచుండుదురు రాజులు దొల్లియు; నెంత దీపాకో
భూమి; మునీంద్రసంగతి సుబుద్ధము నీకు జగంబు; నాకు నీ
భూమి తెఱంగు సెప్పుము ప్రబోధ నిరూఢముగా సమస్తమున్. 15

ప్రతిపదార్థం: తొల్లియున్= పూర్వకాలంలోకూడా; రాజులు= ప్రభువులు; భూమికిన్+కాఁగన్= భూమిని సంపాదించటం కోసమై; ప్రాణముల+పోక+తలంపక= ప్రాణాలు పోతాయి అనే జంకు లేకుండా; రౌద్ర+ఘోర+సంగ్రామమున్= భయంకరమూ, దారుణమూ అయిన యుద్ధాన్ని; చేయుచుండుదురు= సలుపుతూ ఉంటారు; భూమి= పుడమి; ఎంత+తీపి+ఒకో!= ఎంత ఇష్టమైనదో; ముని+ఇంద్ర+సంగతిన్= శ్రేష్ఠులైన ఋషులతో నీకుగల పరిచయం వలన; జగంబు= ప్రపంచం; నీకున్= నీకు; సుబుద్ధము= బాగుగా తెలిసినటువంటిది; నాకున్= నాకు (ఇది ధృతరాష్ట్రుడు చెప్పుతున్న మాట); ఈ+భూమి+తెఱంగు= భూమి తీరుతెన్నులు; సమస్తమున్= సర్వమును; ప్రబోధ+నిరూఢముగాన్= తేటతెల్లమయ్యేట్లుగా; చెప్పుము= వివరించుము.

తాత్పర్యం: 'ఓ సంజయా! రాజులు భూమి కోసమై ప్రాణాలకు తెగించి, భయంకరమైన పోరాటాలు చేస్తారు. ఇది పూర్వకాలంనుండి సాగుతున్న జరుగుతున్న విషయం. భూమి అంటే రాజులకు ఎంత తీపియో కదా! నీకు ఋషివరేణ్యులతో గాఢపరిచయం ఉంది. నీ కీ జగత్తులోని విశేషాలన్నీ తెలుసు. కాబట్టి నాకు ఈ భూమి విషయాలు అన్నీ తేటతెల్లంగా వివరించి చెప్పుము.

విశేషం: (1) సంజయుడు ధృతరాచిష్ట్రుడికి భూమి విశేషాల వివరాలు చెప్పుతాడు. అనగా సంస్కృత మహాభారత రచనా కాలం నాటి భూమిని గూర్చిన పరిజ్ఞానం మనకు తెలుస్తుంది. పందొమ్మిదవ శతాబ్దినాటికిగాని- మానవులకు - భూ పరిపూర్ణ పరిజ్ఞానం లభించలేదు. సంస్కృత మహాభారత రచనా కాలం నాటికే భారతీయులకు ఏర్పడిన భూ పరిజ్ఞానం ఎన్నదగినది. ఆనాడు ఇతర దేశీయులకు అంతటి పరిజ్ఞానం లేదనే చెప్పవచ్చును.

(2) ఇక రెండవ అంశం. మహాభారత సంగ్రామం జరుగబోతున్నది. అది అవశ్యం. తత్క్షణం వినవలసినది కదా! పానకంలో పుడకవలె ఈ భూగోళ వర్ణనం ఏమిటి? అని పలువురు చేసే విమర్శ సమంజసమైనదే. అయితే మహాభారతం సమకాలీన విజ్ఞాన సర్వస్వంగా తీర్చిదిద్దాలనే రచయిత ఆకాంక్షకు ఈ ఘట్టం ఒక ఉదాహరణ. కథకు తాత్కాలికమైన అంతరాయం కలిగిన మాట నిజమే కాని మహాభారతానికి ఇది విజ్ఞాన పుష్టి కలిగించింది.

వ. అనిన విని సంజయుం డతని కిట్లను 'నా యెఱింగి నంతయు నెఱింగించెద భూతత్త్వప్రకారం బవధరింపుము.' 16

ప్రతిపదార్థం: అనినన్+విని= అని ధృతరాష్ట్రుడు వేసిన ప్రశ్న ఆలకించి; సంజయుండు; అతనికిన్+ఇట్లు+అనున్= ధృతరాష్ట్రుడికి ఈ విధంగా చెప్పాడు; నా+ఎఱింగిన+అంతయున్= నాకు తెలిసిన మేరకు; భూ+తత్త్వ+ప్రకారంబు= భూమికి సంబంధించిన స్వభావాల తెరగు; అవధరింపుము= శ్రద్ధగా వినుము.

తాత్పర్యం: ఆ విధంగా ధృతరాష్ట్రుడు వేసిన ప్రశ్న విని, సంజయుడు ఈ విధంగా సమాధానం చెప్పాడు. 'ఓ ధృతరాష్ట్ర మహారాజా! నాకు తెలిసిన మేరకు నీకు భూగోళ విషయాల నన్నీ తేటతెల్లంగా వివరించి చెప్పగలను. శ్రద్ధగా వినుము.'

విశేషం: (1) భూమి సువిశాలమైనది. మహాభారత రచనా కాలంలో భూగోళపరిజ్ఞానం తక్కువ. అయితే ప్రజలలో ఆసక్తి ఎక్కువ అని ధృతరాష్ట్రుని ప్రశ్న వలన తెలుస్తున్నది. కౌరవులు పాండవులు భూమి కోసమే యుద్ధం చేస్తున్నారు. నిజమే. అయితే వారు చేరింది కురుక్షేత్రంలో. వారి రాజ్య విస్తీర్ణం - భూగోళంతో పోల్చిచూస్తే - అత్యల్ప భాగమే కదా. ఆ విషయం ధృతరాష్ట్రునకు - సంజయుడికీ కూడా తెలుసు. కురుక్షేత్రంలో యుద్ధం చేసింది ఆనాడు కౌరవ పాండవ సేనలు మాత్రమే కాదు. భూగోళంలోని పలు ప్రదేశాల నుండి సేనలు అక్కడకు చేరాయి. ఈ ఘట్టంవలన రెండు విషయాలు తెలుస్తున్నవి. (1) ఆనాటి ప్రజలలో భూగోళ విజ్ఞానంపై గల జిజ్ఞాస. (2) ఆనాటి విజ్ఞులకు భూగోళ విషయకంగా గల పరిమిత పరిజ్ఞానం.

సంజయుఁడు ధృతరాష్ట్రునకు భూపరిమాణంబు సెప్పుట (సం.6-5-9)

**తే. ' అధిప! నానా ప్రకార చరాచరంబు । లింద వేర్వేఱ జనియించు, నింద పెరుఁగుఁ,
బిదప నింద యడంగు; నీ పృథ్వి దాన । సకలమునకుఁ బరాయణస్థాన మరయ. 17**

ప్రతిపదార్థం: అధిప!= ఓ రాజా! (ఓ ధృతరాష్ట్ర!); ఇంద= ఇందే (ఈ భూమియందే); నానా+ప్రకార+చర+అచరంబులు= పెక్కు తెరగులైనవి- కదిలేవి, కదలనట్టివి; వేర్+వేఱ= వేరువేరుగా; జనియించున్= పుట్టుతాయి; ఇందున్+అ= ఈ భూమిమీదనే; పెరుఁగున్= అభివృద్ధి చెందుతున్నవి; పిదపన్= తరువాత; ఇంద= ఈ భూమియందే; అడంగున్= నశిస్తున్నవి; అరయన్= విచారించగా ఈ+పృథ్వి= ఈ భూమి; సకలమునకున్= అన్నింటికిని; పరాయణ+స్థానము= ఆధారమైన చోటు.

తాత్పర్యం: 'ఓ ధృతరాష్ట్ర మహారాజా! ఈ భూమిమీదనే చరాచరాలన్నీ పుట్టుతూ ఉంటాయి, పెరుగుతూ ఉంటాయి, నశిస్తూ ఉంటాయి. ఈ భూమియే అన్నిటికీ ఆధారమైన చోటు.

విశేషం: భూమిమీది భూతకోటిని పూర్వికులు (1) చరములు (2) అచరము లని విభాగించి ఉన్నారు. చరములు ప్రాణికోటి మనుష్యులు, జంతువులు మున్నగు భూతాలు. అచరములు - కొండలు చెట్లు నదులు - మొదలైనవి అచరాలుగానే పరిగణించ బడ్డాయి.

వ. అదియునుంగాక వినుమాకాశంబునకు గుణంబు శబ్దంబు, వాయువునకు శబ్ద స్పర్శంబులును, దేజంబునకు శబ్ద స్పర్శ రూపంబులును, నప్పులకు శబ్ద స్పర్శరూప రసంబులును గుణంబులు; పృథివికి శబ్ద స్పర్శ రూప రసగంధాత్మకం బైన గుణసముదయం బంతయుం గలదు గావున నిమ్మహా భూతంబు లేనింటిలోనం బృథివి యెక్కుడు; దీని యున్న విధంబు వివరించెద నాకర్ణింపుము. 18

ప్రతిపదార్థం: అదియున్+కాక= అంత మాత్రమేకాక; వినుము; ఆకాశంబునకున్= నింగికి; గుణంబు= లక్షణం; శబ్దంబు= నాదం; వాయువునకున్= గాలికి; శబ్ద, స్పర్శంబులును= నాదం మరియును తాకుడు; తేజంబునకున్= ప్రకాశానికి; శబ్ద, స్పర్శ, రూపంబులును= నాదం, తాకుడు, ఆకారమున్నూ; గుణంబులు= లక్షణాలు; అప్పులకున్= నీళ్ళకు; శబ్ద స్పర్శరూపరసంబులును= నాదం, తాకుడు, ఆకారము, ద్రవం, గుణంబులు= లక్షణాలు; పృథివికిన్= భూమికి; శబ్ద, స్పర్శ, రూప, రస, గంధ+ ఆత్మకంబు+ అయిన= నాదం, తాకుడు, ఆకారం, ద్రవం, వాసనలతో కూడిన; గుణ, సముదయంబు+ అంతయున్= లక్షణాల సముదాయం అంతా; కలదు= ఉన్నది; కావునన్= కాబట్టి; ఈ+మహా+భూతంబులు+ఏనింటిలోనన్= ఈ పంచభూతాలలో; పృథివి= భూమి; ఎక్కుడు= అధికమైనది; దీని+ఉన్న+విధంబు= ఈ భూమి యొక్క యదార్థమైన తెరగు; వివరించెదన్= తెల్లముగా చెప్పగలను; ఆకర్ణింపుము= ఆలకించుము.

తాత్పర్యం: అంతేకాక ఆకాశానికి లక్షణం శబ్దం; వాయువునకు లక్షణాలు రెండు. అవి- శబ్దం తాకుడు; తేజానికి లక్షణాలు శబ్ద స్పర్శ రూపాలు; నీటికి లక్షణాలు శబ్దస్పర్శరూపాలేకాక ద్రవత్వంగూడ. భూమికి శబ్దస్పర్శరూప రసాలతోపాటు వాసన గూడ ఉన్నది. అనగా పంచభూతాల లక్షణాలు అన్నీ భూమికి ఉన్నాయి. అందుచేత భూతాలలో పంచభూతాలు ఎన్నదగినవి. పంచభూతాలలో భూమి ఎన్నదగినది. గొప్పది.

సీ. ధాత్రీశ! మేరువు దక్షిణంబున సుద । ర్శన మను నభిధానమునఁ బ్రభూత
విస్తార మై రెండువేలు నేనూఱు యో । జనముల పాడవునై సరస మధుర
విపుల శాశ్వత ఫలవితతి సమేతమై । యొక్క జంబూతరు వొప్పియుండు
దాని పండులు మహీస్థలి మహారవముగ । ననిశంబుఁ బడి రాలి యవియుచుండు

ఆ. వానిరసము పొంగి వాహినీ మూర్తి న । న్నగమునకుఁ బ్రదక్షిణంబు గాఁగ
నొరసికొనుచుఁ దిరిగి యుత్తరకురు భూము । లందుఁ జొచ్చి పాఱు నంబునిధికి. 19

ప్రతిపదార్థం: ధాత్రీ+ఈశ!= ఓ రాజా!; మేరువు= మేరువు అనే పేరుగల పర్వతానికి; దక్షిణంబునన్= దక్షిణ దిక్కున; సుదర్శనము+అను+అభిధానమునన్= సుదర్శనం అనే పేరుతో; ప్రభూత+విస్తారము+ఐ= మిక్కిలి నిడివి కలిగినదై రెండువేల, యేనూఱు, యోజనముల; పాడవును+ఐ= రెండువేల అయిదు నూర్ల ఆమడల పాడవు గలిగిందై; సరస+మధుర+ విపుల+శాశ్వత+ఫల+వితతి+సమేతము+ఐ= తియ్యని ద్రవాలతోనూ; ఎల్లప్పుడు ఉండే పెక్కు పండ్ల సముదాయంతో కూడి ఉండే; ఒక్క+జంబూ+తరువు= ఒక నేరేడు చెట్టు; ఒప్పి+ఉండున్= వర్ధిల్లుతుంటుంది; దాని+పండులు= ఆ (నేరేడు) చెట్టు పండ్లు; మహీ+స్థలిన్= భూభాగంమీద; మహా+రవమున్= పెద్ద ధ్వనితో; అనిశంబున్= ఎల్లప్పుడును; పడి+రాలి+అవియుచున్+ ఉండున్= క్రిందపడి చెల్లాచెదరై పగలిపోతూ ఉంటాయి; వాని+రసము+పొంగి= ఆ పండ్ల ద్రవం పొంగిపోయి; వాహినీ+మూర్తిన్= ఏరు ఆకారంలో; ఆ+నగమునకున్= ఆ చెట్టుకు; ప్రదక్షిణముగన్= కుడినుండి ఎడమ వైపునకు చుట్టు దిరిగి; ఒరసి కొనుచున్= రాసుకొంటూ; తిరిగి= (మలుపు) తిరిగి; ఉత్తర+కురు+భూములందున్= కురుభూమికి ఉత్తరంగా ఉన్న ప్రదేశాలలో; చొచ్చి= ప్రవేశించి; అంబునిధికిన్= సముద్రంలో చేరేటట్లు; పాఱున్= ప్రవహిస్తుంది.

తాత్పర్యం: 'ఓ ధృతరాష్ట్ర మహారాజా! మేరుపర్వతానికి దక్షిణంగా 'సుదర్శనం' అనే పేరుగల పెద్ద ప్రదేశం ఉన్నది. అది మిక్కిలి విస్తీర్ణం కలది. దాని పాడవు రెండు వేల ఏబది నూర్ల యోజనాలు. అందులో ఒక జంబూ వృక్షం

(నేరేడు చెట్టు) ఉన్నది. ఆ చెట్టు నుండి పండ్లు పెద్ద చప్పుడుతో నేలమీదపడి విచ్చుతాయి. ఆ పండ్ల రసం పెద్ద ఏరుగా తయారయి ఆ చెట్టు చుట్టూ ప్రదక్షిణం చేసి, పొంగి పొరలి ఉత్తర కురుభూముల గుండా ప్రవహించి తుదకు సముద్రాన్ని చేరుకుంటుంది.

విశేషం: 1. యోజనము అనగా సుమారు ఎనిమిది మైళ్ళు అని నేటి పండితుల అంచనా.

2. "భరత వర్షే భరతఖండే మేరోర్దక్షిణ దిగ్భాగే జంబూద్వీపే" ఇది సంకల్పంలోని భాగం. మేరు పర్వతం - ఉత్తర ధ్రువ ప్రాంతంలోనిది. సూర్యచంద్రాది గ్రహాలు మేరువుచుట్టూ ప్రదక్షిణం చేస్తాయని వర్ణన. అనగా ప్రాచీన భారతీయులకు ఉత్తర ధ్రువప్రాంతం తెలిసినట్లే.

వ. జంబూనది యనం బరఁగిన యా తరంగిణి నీరు సోఁకిన చోటెల్లను సువర్ణం బగుటం జేసి కనకంబునకు జాంబూనదం బను నామంబునుం గలిగెఁ; దదీయ జలపానంబు సేసిన మానవులకు ముదిమియుం దెవులును దప్పియు లే వని చెప్పుదు; రయ్యేటి పడమటం బెరిఁగి పఱపు గలిగి శరనిధిచందంబున జంబూషండంబు గాఱుకొనుచుండు; నింతటికిం గారణంబయిన యాజంబూవృక్షంబు పేర నీ ద్వీపంబు జంబూ ద్వీపంబు; జంబూద్వీపంబును సుదర్శన ద్వీపంబు నన నెగడి లవణ సముద్ర ముద్రితం బయి పాలుచు నద్దీవియందు. 20

ప్రతిపదార్థం: జంబూనది+అనన్+పరఁగిన= జంబూనది అనే పేరుతో ఒప్పిన; ఆ+తరంగిణి= ఆ నది; నీరు= జలం; సోఁకిన+చోటు+ఎల్లను= పారినస్థలం అంతా; సువర్ణంబు+అగుటన్+చేసి= బంగారుగా మారటంచేత; కనకంబునకున్= బంగారానికి; జాంబూనదంబు= 'జాంబూనదం' అనే నామంబు= పేరు కలిగెన్= ఏర్పడింది; తదీయ+జలపానంబు+చేసిన= ఆ నది నీరు త్రాగిన; మానవులకున్= మనుజులకు; ముదిమియున్= ముసలితనం; తెవులును= రోగమును; దప్పియున్= దాహమును; లేవు+అని+చెప్పుదురు= ఉండవు అని (ప్రజలు) చెప్పుతూ ఉంటారు; ఆ+ఏటి+పడమటన్= ఆ నదియొక్క పడమటి దిక్కున; పెరిఁగి= విస్తరించి; పఱపు+కలిగి= వైశాల్యం ఉండి; శరనిధి+చందంబునన్= సముద్రంవలె; జంబూ షండంబు= నేరేడు చెట్ల గుంపు; కాఱుకొనుచుండున్= విస్తరించి ఉంటుంది; ఇంతటికిన్+కారణంబు+అయిన= ఇంతటికి హేతువయిన; ఆ జంబూ+వృక్షంబు= ఆ నేరేడు చెట్టు; పేరన్= పేరుమీద; ఈ+ద్వీపంబు= ఈ దీవి; జంబూ+ద్వీపంబు= జంబూద్వీపము అను పేరుగలదియును; సుదర్శన ద్వీపంబు+అనన్+నెగడి= సుదర్శన ద్వీపం అనే పేరుతో విలసిల్లి; లవణ+సముద్ర+ముద్రితంబు+అయి= ఉప్పునీటి సముద్రంతో చుట్టబడి; పాలుచున్= విలసిల్లుతుంది; ఆ+దీవియందున్= ఆ (జంబూద్వీపంలో).

తాత్పర్యం: జంబూనది అనే పేరుగల ఆ నది ప్రవహించే చోటులు అన్నీ బంగారంగా మారిపోవటం చేత బంగారానికి 'జాంబూనదము' అనే పర్యాయపదం ఏర్పడింది. ఆ నదీ జలం త్రాగిన వారికి ముసలితనం రాదు. ఏ రోగం రాదు, దాహం ఉండదు అని అంటారు. ఆ నదికి పశ్చిమదిక్కున నేరేడు చెట్ల గుంపు విస్తరించి ఉంటుంది. ఆ చెట్టు పేరుమీద ఆ ప్రాంతానికి జంబూద్వీపం అనే పేరు ఏర్పడింది. దానికే సుదర్శన ద్వీపం అని మారుపేరు. ఆ ద్వీపానికి చుట్టూ ఉప్పునీటి సముద్రం ఉంటుంది. ఆ ద్వీపంలో.

సీ. నిడుపునఁ దూర్పును బడమర నై రెండు । గడలు నంభోనిధి గదిసి యుండు
రత్నమయంబులు రమణీయములు సాధ్య । సిద్ధ చారణ గణసేవితములు
నై హిమాచలమును, నావల హేమకూ । టంబును, నట నిషధంబు నొప్పు;
లలితంబు లైన నీల శ్వేత శృంగవం । తంబులు గ్రమమునఁ దనరి పాలుచు;

ఆ. నివుల మూఁటి కవల నవుల యమ్మూఁటికి । నివలఁ దేజరిల్లు దివిజ నగము
గమలకర్ణికానుకారియై కాంచన । మణిమయత్వ మహిమ మహిత మగుచు. 21

ప్రతిపదార్థం: నిడుపునన్= పొడగున; తూర్పును+పడమరను+ఐ= తూరుపు దిక్కున, పడమటి దిక్కున; రెండు+కడలున్= రెండు వైపుల; అంభోనిధి= సముద్రం; కదిసి+ఉండున్= వ్యాపించి ఉంటుంది; రత్నమయంబులు= రత్నాలతో కూడినవి; రమణీయములు= అందమైనవి; సాధ్య, సిద్ధ, చారణ, గణ, సేవితములు+ఐ= సాధ్యులు, సిద్ధులు, చారణులు అనే దేవతా సమూహాల చేత సేవించబడునవి అయి; హిమ+అచలము= హిమవత్పర్వతం; ఆవల= ఆపైన; హేమకూటంబును= హేమకూటం అనే కొండ; అట= ఆ ప్రదేశంలో; నిషధంబున్= నిషధమనే కొండ; ఒప్పున్= విలసిల్లుతూ ఉంటుంది; లలితంబులు+ఐన= సుకుమారాలైన; నీల, శ్వేత, శృంగవంతంబులు= నల్లని తెల్లని శిఖరాలుగల కొండలు; క్రమమునన్= వరుసగా; తనరి= ఒప్పి; పొలుచున్= వెలుగొందుతాయి; ఇవులన్= ఇటువైపు; మూఁటికిన్+అవల= మూడు (పర్వతాలకు) అవలి వైపు; ఆ+మూఁటికిన్+ఇవల= ఆ మూడు కొండలకు ఇవతలి వైపు; దివిజనగము= వేలుపు కొండ (మేరుపర్వతం); కమల+కర్ణికా+అనుకారి+ఐ= పసిడి తామరలను పోలు దుద్దులవలె భాసిస్తూ; కాంచన+మణిమయత్వ+మహిమన్= బంగారంతో, మణులతో పొదుగబడిన గొప్పదనంతో; మహితము+అగుచున్= గొప్పది అవుతూ; తేజరిల్లున్= ప్రకాశిస్తుంది.

తాత్పర్యం: ఆ దీనికి తూర్పు, పడమర దిక్కులందు పొడవుగా సముద్రం వ్యాపించి ఉంటుంది. ఇక ఇరువైపుల దేవతా జాతులతో కూడిన హిమాలయ పర్వతాలు హేమ కూట పర్వతం నిషధ పర్వతాలు ఉంటాయి. అవి నల్లని తెల్లని శిఖరాలతో విరాజిల్లుతూ ఉంటాయి. ఆ మూడింటికి ఇటు అటు వేల్పుకొండ తామరపువ్వునందలి దుద్దువలె సువర్ణమణిమయమై వెలుగొందుతుంటుంది.

విశేషం: సిద్ధులు, సాధ్యులు, చారణులు దేవతలలోని జాతులు. సిద్ధులు అణిమాది మహిమలు గలవారు. సాధ్యులు (పన్నిద్దరు); మనువు రాజమంతుడు, విష్ణువు, ధర్ముడు, నారాయణుడు మున్నగువారు పరిణామశీలురు. చారణులు: నానా ప్రదేశాలలో సంచరించేవారు. వీరు లోకోత్తరుల చరిత్రలు గానం చేస్తూ సంచరిస్తూ ఉంటారు.

తే. అతిదృఢం బగుపాఁతు పదాఱువేల । యోజనము లంద్రు; దానికి రాజముఖ్య
విందు మెనుబదినాలుగువేల యోజ । నంబులని హేమధాత్రీధరంబు పొడవు. 22

ప్రతిపదార్థం: రాజముఖ్య!= రాజులలో గొప్పవాడా, (ఓ ధృతరాష్ట్ర) మహారాజా!; దానికిన్= ఆ మేరుపర్వతానికి; అతి దృఢంబు+అగు+పాఁతు= మిక్కిలి బలంగల పునాది; పది+ఆఱు+వేల+యోజనములు+అంద్రు= పదారువేల యోజనాలు అని అంటారు; హేమ+ధాత్రీధరంబు+పొడవు= బంగారుకొండ నిడివి; ఎనుబది+నాలుగువేల+యోజనంబులు= ఎనభైనాలుగు వేల యోజనాలు; అని= అని; విందుము= వింటాము.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! ఆ మేరుపర్వతపు పునాది మిక్కిలి లోతైనది, బలమైనది. దాని లోతు పదారువేల యోజనాలు అని అంటారు. ఆ మేరుపర్వతం పొడవు ఎనభైనాలుగువేల యోజనాలు అని వింటాం.

వ. ఇవ్విధంబున భూమధ్యంబున నున్న యమ్మేరుమహీధరంబున దేవతలును, దేవమునులును, గంధర్వ కింపురుషాది దేవయోనులును, దేవేంద్ర ప్రముఖ దిక్పతులును, బరమేష్ఠియుం దత్తత్ప్రదేశంబులఁ బుణ్య వర్తనంబులం బరమ సుఖంబు లనుభవింతు; రుత్తరతటంబునం గర్ణికారవనంబున గౌరీసమేతుండై సిద్ధగణంబులు పరివేష్టింప విశ్వేశ్వరుండు విహరించుచుండు. 23

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ రీతిగా; భూ+మధ్యంబునన్+ఉన్న= భూమికి మధ్యగా ఉన్న; ఆ+మేరు+మహీధరంబున= ఈ మేరు పర్వతంమీద; దేవతలును= వేల్పులు; దేవమునులు= దేవలోకంలోని ఋషులు; గంధర్వ, కింపురుష+ఆది, దేవ

యోనులును= గంధర్వులు, కింపురుషులు మున్నగు దేవతల సంతతులూ; దేవ+ఇంద్ర ప్రముఖదిక్+పతులును= దేవేంద్రుడు మొదలుగాగల దిక్పాలకులూ; పరమేష్ఠియును= బ్రహ్మదేవుడూ; తత్+తత్+ప్రదేశంబులన్= ఆయా స్థలాలలో; పుణ్యవర్తనంబులన్= మంచి కార్యాలను చేస్తూ; పరమ+సుఖంబులు+అనుభవింతురు= మిక్కిలి గొప్పవైన సౌఖ్యాలను అనుభవిస్తారు; తత్+తీర+తటంబున్= ఆ సానువులలో; కర్ణికార, వనంబునన్= కొండ గోగుపూల తోటలలో; గౌరీ+సమేతుండు+ఐ= పార్వతీదేవితో కూడినవాడై; సిద్ధ+గణంబులు= సిద్ధులు అనెడి దేవతల గుంపులు; పరివేష్టింపన్= చుట్టూ చేరి కొలువగా; విశ్వేశ్వరుండు= శివుడు; విహరించుచుండున్= తిరుగుతూ ఉంటాడు.

తాత్పర్యం: ఈ రీతిగా భూమికి మధ్యలో ఉన్న మేరుపర్వతంపై దేవతలు వివిధ వర్గాలు, దేవేంద్రుడు, బ్రహ్మ మున్నగువారు తిరుగాడుతూ ఉంటారు. ఆ కొండ సానువులలో పార్వతీ సమేతుడై శివుడు విహరిస్తూ ఉంటాడు.

విశేషం: గంధర్వులు దేవతలలో ఒక తెగ. సంగీత పరాయణులు. కింపురుషులు, అశ్వముఖం, నరశరీరంగల దేవతలు.

క. తొమ్మిది ఖండములై వ । ర్షమ్ము లనం జాల నొప్పెసఁగు జంబూద్వీ
పమ్మున జనపదములు విను । మమ్మహితాంశములు దెలియ ననువర్ణింతున్. 24

ప్రతిపదార్థం: తొమ్మిది+ఖండములు+ఐ= తొమ్మిది భాగాలుగా ఏర్పడి; వర్షమ్ములు+అనన్= వర్షములు అనే పేరుమీద; చాలన్+ఒప్పు+ఎసఁగు= మిక్కిలి బాగుగా ఉండే; జంబూద్వీపమ్మునన్= జంబూద్వీపంలో; జనపదములు= జనులు నివసించే చోటులు (గ్రామాల సముదాయాలు); ఆ+మహిత+అంశములు= గొప్పవైన అందలి విశేషాలు; తెలియన్= తెలిసేటట్లుగా; అనువర్ణింతున్= వివరించి చెప్పగలను; వినుము= ఆలకింపుము.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! ఆలకించుము. తొమ్మిది భాగాలుగా ఏర్పడిన జంబూద్వీపమును, అందలి జనపదాలను నీకు తెలిసేటట్లు వర్ణించి చెప్పగలను.

వ. ఉత్తర సముద్రంబు శృంగవంతంబు మధ్యమం బైరావతవర్షం బన నొప్పు; శ్వేత పర్వత శృంగవంతంబుల నడుము హైరణ్మయ వక్షం బనం బొలుచు నీలశైలోత్తర దక్షిణదేశంబులు గ్రమంబున రమణక వర్షంబును ననం జెలువమరు; మేరువునకుం బ్రాచ్య ప్రతీచ్యంబు లగు భాగంబులు వరుసన భద్రాశ్వ వర్షంబును గేతుమాలా వర్షంబును ననం బొగడొందు; హేమకూటోత్తర భూమి హరివర్షం బన నెగడు; హిమవంతంబు నక్కడయు నిక్కడయు నోలిన కింపురుష వర్షంబును భారత వర్షంబును ననం బెంపారు; ని ట్లున్న దీనియందు. 25

ప్రతిపదార్థం: ఉత్తర సముద్రంబు= ఉత్తర దిశలో ఉన్న సముద్ర ప్రాంతం నుండి; శృంగవంతంబు= శృంగవంతం; మధ్యమంబు= మధ్యనున్న ప్రదేశం; ఐరావత వర్షంబు+అనన్+ఒప్పున్= ఐరావత వర్షం అనే పేరుతో విలసిల్లుతుంది; శ్వేతపర్వత+శృంగవంతంబుల నడుము= శ్వేతపర్వతం శృంగవంత పర్వతం రెంటికి మధ్య; హైరణ్మయ వర్షంబు+అనన్= హైరణ్మయ వర్షం అనే పేరున; పొలుచున్= విలసిల్లుతుంది; నీల, శైల+ఉత్తర, దక్షిణదేశంబులు= నీలశైలానికి అటు ఉత్తరం, ఇటు దక్షిణంగా ఉన్న ప్రదేశం క్రమంబునన్= వరుసగా; రమణక+వర్షంబును+అనన్= రమణక వర్షం అనే పేరుతో; చెలువు+అమరున్= శోభిల్లుతుంది; మేరువునకున్= మేరుపర్వతానికి; ప్రాచ్య+ప్రతీచ్యంబులు+అగు= తూరుపున పడమట ఉన్న ప్రదేశాలు; వరుసన= క్రమంగా; భద్రాశ్వవర్షం - కేతుమాలా వర్షం; అనన్+పొగడు+ఒందున్= అనే పేరులతో శోభిల్లుతున్నవి; హేమకూట+ఉత్తర భూమి= హేమకూట పర్వతానికి ఉత్తర దిక్కున ఉన్న ప్రదేశం; హరి వర్షంబు+అనన్= హరివర్షం అనే పేరు మీద; నెగడున్= విలసిల్లుతుంది; హిమవంతంబు= హిమాలయ పర్వత ప్రదేశం; అక్కడయు+ఇక్కడయు= ఆ ప్రదేశంలో మరియు ఈ ప్రదేశంలో; ఓలిన= వరుసగా; కింపురుష+వర్షంబును= కింపురుష వర్షం అనే పేరుమీద;

భారత+వర్షంబును అనన్= భారత వర్షం అనే పేరుమీద; పెంపారున్= వర్ధిల్లుతున్నాయి; ఇట్లు+ఉన్న= ఈ విధంగా ఉన్న; దీనియందున్= ఈ భూమియందు.

తాత్పర్యం: ఉత్తర సముద్రానికీ శృంగవంతం అనే పర్వతానికీ మధ్యలో గల ప్రదేశానికి ఐరావతవర్షం అని పేరు. శ్వేతపర్వతం శృంగవంత పర్వతాల మధ్యలోగల ప్రదేశం హైరణ్మయ వర్షం. నీల శైలానికి ఉత్తర దిక్కున దక్షిణ దిక్కునగల ప్రదేశం రమణక వర్షం. మేరు పర్వతానికి తూర్పు దిక్కులో ఉన్న ప్రదేశం భద్రాశ్వవర్షం. మేరు పర్వతానికి పడమర దిక్కులో ఉన్న ప్రదేశం కేతుమాలా వర్షం. హేమకూట పర్వతానికి ఉత్తర దిక్కున గల ప్రదేశం హరి వర్షం. హిమాలయ పర్వతానికి అవ్వలి గట్టున ఉన్న ప్రదేశం కింపురుష వర్షం. హిమాలయ పర్వతానికి ఇవ్వలివైపున ఉన్న ప్రదేశం భారత వర్షం. ఈ విధంగా ఉన్న భూమియందు.

విశేషం: మిక్కిలి ప్రాచీన కాలంలోనే భారతీయులు భూమి సువిశాలమైనదనీ విపుల విస్తీర్ణమైనదనీ గుర్తించారు.

క. ‘ భారతవర్షముఁ దొడఁగి మ । హీరమణ! యుదీచ్యము లను నెక్కుడు బలస
త్త్వారోగ్యాయుస్సుఖపు । ణ్యా రంభ గుణంబు లంతకంతకు నరయన్.’ 26

ప్రతిపదార్థం: మహీరమణ!= భూమిని రంజింపజేసేవాడా - ఓ రాజా! ధృతరాష్ట్ర మహారాజా!; భారత వర్షమునన్= భారత వర్షం అనే పేరుగల ప్రదేశంలో (జంబూద్వీప ఖండమునందు); ఉదీచ్యములను= ఉత్తరదిశయందున్న ప్రదేశాలలో; తొడఁగి= పూని; బల సత్త్వ+ఆరోగ్య+ఆయుస్+సుఖపుణ్య+ఆరంభ+గుణంబులు= శక్తిసామర్థ్యం, ఆరోగ్యం, ఆయుస్సు, సౌఖ్యం, పుణ్యకార్యాలు చేసే లక్షణాలు; అరయన్= పరీక్షించి చూడగా; అంతకున్+అంతకున్= ఒకదానికంటె మరియొక దానికి; ఎక్కుడు= హెచ్చుగా ఉంటాయి.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! భారతవర్షంలో ఉత్తర దిక్కుననున్న ప్రదేశాలలో ఉత్తరోత్తరంగా శక్తి, సామర్థ్యం, ఆరోగ్యం, ఆయువు, సౌఖ్యం, పుణ్య కార్య నిర్వహణలు ఎక్కువగా కనుపిస్తాయి.’

విశేషం: భారతదేశంలో ఉత్తర ప్రదేశాలు సంస్కృతికి నాగరకతకు కాణాచులు అని మహాభారత నిర్దేశం. ఆర్య నాగరికత, ఆర్షసభ్యత ఉత్తర ప్రదేశాలలో ఉద్భవిల్లి వికసించి దక్షిణానికి విస్తరించటం చరిత్రవేత్తలకు తెలిసిన విషయమే.

వ. అనిన విని వైచిత్రవీర్యుండు ‘సమస్తద్వీపంబులు సకలజలనిధులు నున్న పరిపాటియుం బ్రమాణంబులుం బ్రకాశంబుగ నెఱిఁగింపు, మనుటయు, సూతసూనుండు జంబూద్వీప విష్కంభంబు కొలఁది యెనుబదివేలు నాఱు నూఱు యోజనంబులు; దీని రెం డంతలు దొడంగి లవణేక్షు సురాఘృత దధి క్షీరశుద్ధ జలమయంబు లయిన మహార్ణవంబుల విష్కంభంబులు గ్రమంబున నొకటి కొకటి రెట్టి యై యుండుఁ; బ్లక్షద్వీప శాల్మలద్వీప క్రౌంచద్వీప కుశద్వీప శాకద్వీప పుష్కర ద్వీపంబుల విష్కంభంబులు జంబూద్వీప విష్కంభ ద్విగుణ ప్రమాణంబు మొదలుగా నోలి నొకటి కొకటి యినుమడి యై యుండు; నయ్యాఱు దీవులును జంబూ ద్వీపంబుకంటె నెల్లదానను బొగడ్త వడి యనేక పర్వతంబులను నానా నదులను బహు జనపదంబులను నొప్పి వరుస నొండొంటికి గుణవిశేషంబుల నధికంబు లై యుండు; నింతకుం గర్తయు భర్తయు హర్తయునై దుగ్ధాంబుధి యుత్తరంబునం గనకమయం బై యష్టచక్రంబును బ్రభూతభూతయుక్తంబును మనోజవంబును నగు మహనీయ శకటంబున వినోద పరాయణుం డైన నారాయణుండు వికుంఠనిధానుం డగుచు వైకుంఠాభిధా నంబున విఖ్యాతుండై విహరించుచుండు, నని చెప్పుటయు నతండు. 27

ప్రతిపదార్థం: అనినన్+విని= అని చెప్పగా విని; వైచిత్రవీర్యుండు= (విచిత్రవీర్యుడి కుమారుడైన) ధృతరాష్ట్రుడు; సమస్త ద్వీపంబులు= అన్ని ద్వీపాలు; సకల+జలనిధులు= అన్ని సముద్రాలు; ఉన్న; పరిపాటియున్= అనుక్రమం; ప్రమాణంబులున్= కొలత(దు)లు; ప్రకాశంబుగన్= తేటతెల్లమయ్యేటట్లుగా; ఎఱిఁగింపుము+అనుటయున్= తెలుపుము అని చెప్పగా; సూతసూనుండు= సూతుని కొడుకు సంజయుడు; జంబూద్వీప+విష్కంభంబు+కొలఁది= జంబూద్వీపము యొక్క విస్తీర్ణం; ఎనుబదివేలు నాఱునూఱు యోజనంబులు= ఎనభై వేల ఆరువందల యోజనాలు; దీని+రెండు+అంతలు= దీనికి రెండు రెట్లు; తొడంగి= పూని; లవణ+ఇక్షు, సురా+ఘృత, దధి, క్షీర, శుద్ధ జలమయంబులు+అయిన= ఉప్పునీరు, చెరకు, కల్లు, నేయి, పెరుగు, పాలు, మంచినీళ్ళతో కూడిన; మహా+అర్ణవంబుల+విష్కంభంబులు= పెద్ద సముద్రాల విస్తీర్ణాలు; క్రమంబునన్= వరుసగా; ఒకటికి+ఒకటి= ఒకదాని కంటె ఒకటి; రెట్టి+ఐ+ఉండున్= రెండింతలుగా ఉంటాయి, ప్లక్షద్వీప, శాల్మల ద్వీప, క్రౌంచద్వీప, కుశద్వీప, శాక ద్వీప, పుష్కరద్వీప విష్కంభంబులు= ప్లక్ష, శాల్మల, క్రౌంచ, కుశ, శాక, పుష్కరాలు అనే పేరులుగల ద్వీపాల విస్తీర్ణాలు; జంబూద్వీప+ విష్కంభ+ద్విగుణ+ప్రమాణాలు= జంబూద్వీప ప్రమాణానికి రెట్టింపు; మొదలుగాన్+ఓలిన్= మొదలైన వరుసలో ఒకటికి+ఒకటి= ఒకదానికి ఒకటి; ఇనుమడి+ఐ= రెండింతలు అయి; ఉండున్= ఉంటాయి; ఆ+ఆఱుదీవులును= ఆ ఆరు దీవులూ; జంబూద్వీపంబుకంటెన్ ఎల్లదానను= అన్ని రీతులలో; పొగడ్త+పడి= పేరుకు ఎక్కి.; అనేక+పర్వతంబులను= పెక్కుకొండలతో; నానానదులను= పెక్కు ఏరులతో; బహు+జనపదంబులను= జనులు నివసించే పెక్కు ప్రదేశాలతో; ఒప్పి= విలసిల్లి; వరుసన్= క్రమంగా; ఒండు+ఒంటికిన్= ఒకదానికంటె ఒకటి; గుణ+విశేషంబులన్= మంచి లక్షణాలతో; అధికంబులు+ఐ+ఉండున్= అతిశయిల్లుతూ ఉంటాయి; ఇంతకున్= ఇన్నిటికి; కర్తయున్= నిర్మించేవాడును; భర్తయున్= పోషించేవాడును; హర్తయున్= లయించేవాడును; ఐ= అయి; దుగ్ధ+అంబుధి+ఉత్తరంబునన్= పాలకడలి ఉత్తరపు దిక్కున; కనకమయంబు+ఐ= బంగారముతో నిండిన; అష్టచక్రంబును= ఎనిమిది అంచులు గల చక్రమునూ; ప్రభూత+భూత+యుక్తంబును= పెక్కు భూతములతో కూడినది; మనోజవంబును= మనస్సుతో సమానమైన వేగం కలిగినదియు; అగు= అయిన; మహనీయ శకటంబున్= గొప్ప వాహనంతో; వినోద+పరాయణుండు+ఐ= క్రీడాసక్తుడై; వికుంఠ నిధానుండు= వికుంఠమునందు ఉండే వాడు; వైకుంఠ+అభిధానంబునన్= వైకుంఠుడు అనే పేరు గలిగినవాడై; విఖ్యాతుండు+ఐ= పేరుకెక్కినవాడై; నారాయణుండు విహరించుచుండున్= ఆనందంతో తిరుగుతూ ఉంటాడు; అని+చెప్పుటయున్= అని వచింపగా; అతండు= అతడు (ధృతరాష్ట్రుడు).

తాత్పర్యం: "ధృతరాష్ట్రుడు తనకు సమస్త ద్వీపాల విస్తీర్ణాలు సమస్త సాగరాలున్న వరుసక్రమమంతా తెలుపుమని సంజయుడిని కోరినాడు. సంజయుడు, "జంబూద్వీప విస్తీర్ణము ఎనభైవేల ఆరునూరు యోజనములు'', దీనికి రెండింతలుగా లవణ, ఇక్షు, సుర, ఘృతదధి, క్షీర, శుద్ధజలమయంబులైన మహాసముద్రాల వైశాల్యాలు. జంబూ ద్వీప వైశాల్యానికి ఒకదానికొకటి రెండింతలుగా పక్షద్వీప, శాల్మలద్వీప, క్రౌంచద్వీప, కుశద్వీప, శాక ద్వీప, పుష్కర ద్వీప వైశాల్యాలుంటాయి. ఈ ఆరు ద్వీపాలు జంబూ ద్వీపం కంటె అన్నింటిలోనూ పొగడబడుతూ అనేక పర్వతాలతో నానానదులతో బహుజనపదాలతో కూడి వరుసగా ఒకదాని కంటె మరొకటి గుణవిశేషంలో అధికమై ఉంటాయి. వీటన్నిటికి కర్తయై, భర్తయై, హర్తయై, క్షీర సాగరానికి ఉత్తరంలో కనకమయమైన ఎనిమిది చక్రాలతో పెక్కు భూతములతో కూడినది, మనోజవమైనది అయిన మహనీయ శకటం మీద నారాయణుడు వైకుంఠవాసుడై వైకుంఠుడను పేరుతో విహరించుచుండునని చెప్పినాడు. అప్పుడు ధృతరాష్ట్రుడు (తరువాతి పద్యంతో అన్వయం)

విశేషం: 1. ద్వీపం అనగా నాలుగు వైపులా సముద్రంతో పరివృతమైన భూభాగం.

2. ద్వీపాలపేర్లు సార్థకాలు. వాచ్యార్థం కాకపోవచ్చును. ప్లక్ష= జువ్వి, రావి; శాల్మల= బూరుగు చెట్టు, క్రౌంచము= ఒకానొక పక్షి; కుశ= దర్భ; శాక= టేకుచెట్టు; పుష్కర= మెట్టతామర; అట్లే సముద్రాల పేరులు- లవణ= ఉప్పు; ఇక్షు= చెరకు; సురా=

కల్లు; ఘృత= నెయ్యి; దధి= పెరుగు; క్షీర= పాలు. ఈ పేరులు అన్నింటిని ఆలంకారికంగా ఔపచారికమైన అర్థాలలో స్వీకరింపవలెనని కొందరు పండితుల వాదం. ద్వీపాల పేరులు - అందలి వృక్ష విశేష ప్రాముఖ్య సూచకాలు అనీ సముద్రాల పేరులు వైవిధ్య సూచకాలు అనీ కొందరు పండితుల అభిప్రాయం. అలనాటి భూగోళ పరిజ్ఞానం పరిమితమైనదే కాని ప్రాచీనుల ఏతద్విస్తీర్ణ వైవిధ్యాలను నిశితంగా ఊహించారు.

క. ' భారతవర్షమునకుఁ గాఁ । గౌరవులును బాండవులును గాంక్షం గడుఁ బె
ల్లై రాసి యొండొరులతోఁ । బోరం దెగి రిట్టి లుబ్ధబుద్ధులు గలరే?' 28

ప్రతిపదార్థం: భారత వర్షమునకున్+కాన్= భారతవర్షం అనెడు భూభాగం కోసమే కదా; కౌరవులును (దుర్యోధనుడు మున్నగువారు); పాండవులును (పాండురాజు కొడుకులు); కాంక్షన్= కోరికతో; కడున్+పెల్లు+ఐ, రాసి= మిక్కిలి కలహించి; ఒండొరులతోన్+పోరన్+తెగిరి= ఒకరితో ఒకరు యుద్ధం చేయటానికి తెగించారు; ఇట్టి= ఈ విధమైన; లుబ్ధ బుద్ధులు= పిసినారి బుద్ధిగలవారు; కలరు+ఏ?= ఉన్నారా?

తాత్పర్యం: 'భారతవర్షం అనే భూభాగం కోసమే కదా కౌరవులు పాండవులు ఒకరితో ఒకరు పోరాడి వినాశనానికి పాల్పడ్డారు. ఇట్టి లోభబుద్ధి కలవారు ఎక్కడైనా ఉన్నారా?' అని ధృతరాష్ట్రుడు వాపోయాడు.

వ. అనిన విని యమ్మనుజపతికి సంజయుం డిట్లనియె. 29

ప్రతిపదార్థం: అనినన్ విని= అనగా (ధృతరాష్ట్రుడు చెప్పగా విని); ఆ+మనుజపతికిన్= ఆ రాజుకు (ధృతరాష్ట్రుడికి) సంజయుండు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: అప్పుడు ధృతరాష్ట్రుడి మాటలు విని సంజయుడు ఈ విధంగా సమాధానం చెప్పాడు.

ఆ. ' అధిప! పాండుసుతుల కరయంగ నతికాంక్ష । లేదు; లుబ్ధబుద్ధి నీదు సుతుఁడు
శకుని కఱపు విని యసన్మార్గవృత్తికిఁ । జొచ్చి యిట్టి యెడరు దెచ్చికొనియె. 30

ప్రతిపదార్థం: అధిప!= ఓ రాజా! (ధృతరాష్ట్ర మహారాజా); అరయంగన్= పరీక్షించి చూస్తే; పాండుసుతులకున్= పాండవులకు; అతికాంక్ష= అత్యాశ; లేదు= లేదు; లుబ్ధ బుద్ధి= పిసినారిఅయిన; నీదు+సుతుఁడు= నీ కొడుకు (దుర్యోధనుడు); శకుని+కఱపు+విని= శకుని బోధ ఆలకించి; అసత్+మార్గవృత్తికిన్+చొచ్చి= చెడు దారికిపోయి; ఇట్టి+ఎడరున్= ఈ కష్టస్థితిని; తెచ్చికొనియెన్= తెచ్చికొన్నాడు.

తాత్పర్యం: 'ఓ ధృతరాష్ట్ర మహారాజా! పాండవులకు అత్యాశలేదు. నీ కొడుకు దుర్యోధనుడు సహజంగా లోభి. పైపెచ్చు శకుని చెప్పుడు మాటలు విని చెడ్డదారిని పట్టి ఇట్టి ఆపదను తెచ్చికొన్నాడు.

సంజయుండు ధృతరాష్ట్రునకు భారత వర్షంబునం గల విశేషంబులు సెప్పుట (సం. 6-10-1)

క. తమ తమ దేశంబులకై । మిముఁ గొని పాండవుల గెలుచు మెయికోలున భూ
రమణులుఁ గొందఱు వచ్చిరి । సమగ్ర సఖ్యమునఁ గూడు చందమునఁ దగన్. 31

ప్రతిపదార్థం: తమ+తమ+దేశంబులకై= తమ తమ రాజ్యాలను రక్షించుకోవాలనే ఉద్దేశంతో; మిమున్+కొని= మీ పక్షం వహించి; పాండవులన్+గెలుచు+మెయికోలునన్= పాండవులను జయించాలనే ఆలోచనతో; భూరమణులు కొందరు= కొంతమంది రాజులు; సమగ్ర+సఖ్యమునన్= పరిపూర్ణ స్నేహం చొప్పున; కూడు+చందమునన్= చేరేటటువంటి రీతిలో; తగన్= తగినట్లు; వచ్చిరి= (మీపక్షంలో) వచ్చి చేరారు.

తాత్పర్యం: కొందరు రాజులు తమ తమ రాజ్యాలు సంరక్షించుకోవాలనే స్వార్థబుద్ధితో మీమీద పరిపూర్ణ స్నేహం ఉన్నట్లుగా పైకి నటిస్తూ మీ పక్షంలో వచ్చి చేరి పాండవులను గెలువదలచారు.

తే. వారి నన నేల! తొల్లియు వసుధకెయ । నేక న్నపతులు పోరాడి; రిట్లు నేల

ప్రతిపదార్థం: వారిన్= (మీ పక్షంలో చేరిన రాజులను); అనన్+ఏల?= విమర్శించటమెందుకు?; తొల్లియున్= పూర్వకాలంలో కూడ; వసుధకై= భూమికోసం; అనేక+నృపతులు= పెక్కుమంది రాజులు; ఇట్లు= ఈ విధంగా; పోరాడి= యుద్ధాలు చేసి; నేల+వ్రాలి= భూమి మీద పడి (మరణించి); భగీరథ, రఘు, యయాతి, నహుష, ముఖ్యులు= భగీరథుడు, రఘువు, యయాతి, నహుషుడు మున్నగువారు; విశ్రుత+ఉన్నతులు= కీర్తితో గూడిన గొప్పదనాలు; కనిరి= పొందారు.

తాత్పర్యం: ఇప్పుడు మీ పక్షంలో చేరిన రాజులను విమర్శించటం న్యాయం కాదు. పూర్వకాలంలో కూడ భూరాజ్య సంపాదన కోసమేకదా- భగీరథుడు, రఘువు, యయాతి, నహుషుడు మున్నగు మహారాజులు యుద్ధాలు చేసి గొప్ప యశస్సు అభ్యుదయం సాధించగలిగారు.

వ. భారత వర్షంబున నుదార విభూతి విలాసంబున కాసపడి యీసునం బెనంగ కుండుదురె? దీని విస్తారంబు విను వివరించెద. 33

ప్రతిపదార్థం: భారత వర్షంబునన్= భారతదేశమందు; ఉదార+విభూతి+విలాసంబునకున్+ఆసపడి= గొప్పదయిన ఐశ్వర్యం యొక్క వైభవానికి ఆశించి; ఈసునన్= ఈర్ష్యతో; పెనంగక+ఉండుదురె?= పోరాడకుందురా?; దీని= ఈ భారత వర్షం యొక్క; విస్తారంబు= విస్తీర్ణం; వివరించెదన్= వివరాలతో నీకు చెప్పగలను; వినుము= ఆలకించుము.

తాత్పర్యం: భారత వర్షంలో రాజ్యకాంక్షతో భోగలాలసతతో ఎందరో రాజులు పెక్కు యుద్ధాలు చేశారు. వారికంత ఆసక్తి కలిగించిన భారతవర్ష విస్తీర్ణం నీకు వివరించగలను. వినుము.

ఆ. మలయ మనఁగ శుక్తిమంతంబు నా వింధ్య। మనఁగఁ బారియాత్ర మన మహేంద్ర
మనఁగ ఋక్షవంత మన సహ్య మన నిందుఁ। గులనగంబు లేడు వొలుచు నధిప! 34

ప్రతిపదార్థం: అధిప!= ఓ రాజా! (ధృతరాష్ట్ర మహారాజా); ఇందున్= ఈ భరతవర్షంలో; మలయము+అనఁగన్= మలయమనే పేరుగల పర్వతం; శుక్తిమంతంబు+నాన్= శుక్తిమంతం అనే పేరుతో; పారియాత్రము+అని= పారియాత్రం అనే పేరుతో; ఋక్షవంతము+అనన్= ఋక్షవంతము అనే పేరుతో; సహ్యము+అనన్= సహ్యము అనే పేరుతో; కుల+నగంబులు+ఏడు= ఏడు కులపర్వతాలు; పొలుచున్= విలసిల్లుతున్నవి.

తాత్పర్యం: మలయం, శుక్తిమంతం, వింధ్యం, పారియాత్రం, మహేంద్రం, ఋక్షవంతం, సహ్యం అనే ఏడు గొప్ప పర్వతాలు ఈ భారతవర్షంలో కులపర్వతాలుగా ఉన్నాయి.

విశేషం: 1. ఏడు కుల పర్వతాలు భూమిని మోస్తున్నాయని పురాణ కథనం.

"మహేంద్రో మలయ స్సహ్యో శుక్తిమాన్ గంధమాధనః ।
వింధ్యశ్చ పారియాత్రశ్చ సప్తైతే కుల పర్వతాః - త్రికాండశేషం ।"

కుల పర్వతాలు ప్రధాన పర్వతాలు. గంధమాదనం - ఋక్షవంతం పర్యాయ పదాలు.

వ. వీనియందు వివిధ మణిగణంబులు సమకూర్పవచ్చు ననిన ఖనివిశేషంబులు సెప్పనేల? మఱియు నుపమహీధరంబు లనేకంబులు గలిగి యుండు; వానియందు. 35

ప్రతిపదార్థం: వీనియందున్= ఈ పర్వతాలలో; వివిధ+మణి+గణంబులు= పెక్కు రకాలైన మణుల సముదాయాలు; సమ కూర్పవచ్చున్= సేకరింపనగు; అనినన్; ఖని+విశేషంబులు+చెప్పన్+ఏల?= గనులలో దొరికే లోహాలు మున్నగు వాటిని గూర్చి చెప్పనవసరం లేదు గదా! మఱియున్+ఉపమహీధరంబులు= ఇంకా పర్వత శాఖలు; అనేకంబులు= పెక్కులు; కలిగి+ఉండున్

వానియందున్= ఆ ఉప పర్వతాలలో.

తాత్పర్యం: ఈ పర్వత పంక్తులలో ఎన్నో రకాలైన మణులు సంపాదించవచ్చునంటే- ఇక గనులలో దొరికే లోహాల గూర్చి వేరే చెప్పనవసరం లేదు గదా! ఇంకను ఉపపర్వతాలు పెక్కులు ఉన్నాయి. వాటిలో -

క. ఇనుమును రాగియుఁ దగరం । బును వెండియుఁ బసిఁడియుం బ్రభూతములై పే
ర్చిన సిరిఁ జేయఁగ నొప్పెడు । ఖను లెడనెడఁ బెక్కు గలవు కౌరవనాథా! 36

ప్రతిపదార్థం: కౌరవనాథా!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; ఇనుము, రాగియు, తగరంబును, వెండియున్; పసిడియున్= బంగారమును; ప్రభూతములు+ఐ= మిక్కుటములై; పేర్చిన, సిరిన్+చేయఁగన్+ఒప్పెడున్= ప్రోగుచేసిన సంపద వలె భాసించే; ఖనులు= గనులు; ఎడన్+ఎడన్= పలుతావుల; పెక్కు+కలవు= ఎన్నో ఉన్నాయి.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! ఈ ఉపపర్వతాలలో ఇనుము, వెండి, రాగి, తగరం, బంగారం కుప్పవోసిన సంపదవలె పలుచోట్ల దొరుకుతాయి.

క. వెండియు ధనార్జనంబులు । గొండల వలనన ఘటించికొన నగు నేర్పున్
దండితనంబును బాడియు । నొండొంటికి మిగులఁ గలిగి యున్న ట్లయినన్. 37

ప్రతిపదార్థం: వెండియున్= మఱియును; కొండల వలనన్+అ= పర్వతాలవలన; ధన+ఆర్జనంబులు= డబ్బు సేకరించుకొనటం; ఘటించుకొనన్+అగున్= సమకూర్చుకొనవచ్చును; నేర్పున్= సామర్థ్యం; దండితనంబును= గొప్పతనం; పాడియున్= న్యాయం; ఒండు+ఒంటికిన్= ఒకదానిలో ఒకటికి; మిగులన్= మిక్కుటంగా; కలిగి ఉన్నట్లు+అయినన్= కలిగి ఉన్నట్లయితే.

తాత్పర్యం: అంతేకాక, కొండలవలన మిక్కుటమైన ధనం ఆర్జించవచ్చును. నేర్పు, పట్టుదల, న్యాయం అనే గుణాలు ఒకదానితో ఒకటి సంఘటించుకోగలిగితే చాలు.

వ. గంగయుఁ దుంగభద్రయు వేత్రవతియు వేదవతియుఁ గృష్ణవేణియుఁ బెన్నయు యమునయుఁ దమసయు
శిరావతియుఁ గావేరియు గోదావరియు నర్మదయు బాహుదయును సరయువును శతద్రువును వితస్తయు
విపాశయుఁ దామ్రపర్ణియు నను మహానదులు మఱియు ననేక సరిద్విశేషంబులునుం గలిగి వీనివలన
నానాముఖంబులు ధనధాన్యాది సంపదాగమంబులు సొంపు మిగిలి యుండు. 38

ప్రతిపదార్థం: గంగయున్+తుంగభద్రయున్+వేత్రవతియున్+వేదవతియున్+కృష్ణవేణియున్+పెన్నయున్+యమునయున్+తమసయున్+శిరావతియున్+కావేరియున్+గోదావరియున్+నర్మదయున్+బాహుదయును+సరయువును+శతద్రువును+వితస్తయున్+విపాశయున్+తామ్రపర్ణియున్ అను; మహానదులు; మఱియున్; అనేక+సరిత్+విశేషంబులునున్+కలిగి= పెక్కు విధాలైన నదులు కలిగి; వీనివలనన్= ఈ నదుల వలన; నానాముఖంబులు= పెక్కు విధాలైన; ధన+ధాన్య+ఆది సంపద్+ఆగమంబులు= ధనములు ధాన్యములు మొదలగు ఐశ్వర్యాల రాకడలు; సొంపు, మిగిలి+ఉండున్= అందాలు అతిశయిస్తూ ఉంటాయి.

తాత్పర్యం: గంగ, తుంగభద్ర, వేత్రవతి, వేదవతి, కృష్ణవేణి, పెన్న, యమున, తమస, శిరావతి, కావేరి, గోదావరి, నర్మద, బాహుద, సరయువు, శతద్రువు, వితస్త, విపాశ, తామ్రపర్ణి అనే పేరులుగల మహానదులు, మరికొన్ని చిరుప్రవాహాలు ఈ పర్వతాల నుండి పుట్టుతున్నవి. వీని వలన పెక్కు తెరగుల ధనాలు, ధాన్యాలు, సంపదలు లభిస్తాయి.

విశేషం: గంగ భారత వర్షములో పేరుకెక్కిన పెద్ద నది. తుంగ-భద్ర అనే రెండు నదులు దక్షిణాపథంలోనివి కలిసి తుంగభద్ర అయినవి. తుంగభద్ర కృష్ణవేణికి ఉపనది. అయితే తుంగభద్రకు కూడా కృష్ణవేణితోపాటు "పుష్కరం" ఉంది. 'గంగాస్నానం

- తుంగాపానం' అనే సామెత ఏర్పడింది. గంగ హిమాలయ పర్వతాలలో పుట్టి ఋషీకేశ హరిద్వారాల కడ, మైదాన తలం చేరి ఉత్తరప్రదేశ్, బీహార్, బెంగాల్ ద్వారా తూర్పు సముద్రం చేరుతున్నది. వేత్రవతి కృష్ణవేణి, కావేరి, గోదావరి దక్షిణాపథంలోని నదులు. పెన్న, దక్షిణా పథంలోని ఒక చిరునది. ఇది తిక్కన వ్రాసిన తెలుగు మహాభారతంలో- "మహానదుల" పట్టికలో చేరటానికి కారణం ఆ నదీతీరంలో ఉన్న నెల్లూరి వాస్తవ్యుడు ఆ కవి కావటం. నర్మద- వింధ్య పర్వతాలలో ప్రవహించి గుజరాత్‌లో సముద్రంలో కలిసిన పశ్చిమ వాహిని. బాహుద - ఉత్కళలోనిది. సరయువు అయోధ్య ప్రదేశంలోనిది. వితస్త, విపాశ, శతద్రువు పంజాబులోని నదులు. వాల్మీకి తమసాతీరంలోని ఆశ్రమవాసి. నదుల ప్రాచీననామాలు నేడు కొన్నిటిని గుర్తు పట్టటం కష్టం. శిరావతి అట్టి వాటిలో ఒకటి. శతద్రునదిని నేటి సట్లెజ్‌గా గుర్తిస్తున్నారు. కొందరు పండితులు. మూల సంస్కృత మహాభారతంలో 'పెన్న' పేరు లేదు. గంగవలెనే యమున హిమాలయాలలో పుట్టి గంగకు పలుచోట్ల సమాంతరంగా ప్రవహించి ప్రయాగవద్ద గంగానదిలో కలుస్తున్నది. గంగతోపాటు యమునకు కూడా పుష్కరం ఉన్నది.

క. ఎడనెడఁ బఱపై యొప్పెడి । యడవు లనేకములు; వానియం దర్థము సే
రెడు వెరవులు పెక్కులు సా । ప్పడి యుండు నయంబుతోడి బలిమి గలిగినన్. 39

ప్రతిపదార్థం: ఎడన్+ఎడన్= అక్కడక్కడ (ఒకచోట మరియు మరియొకచోట); పఱపు+ఐ= దట్టంగా; ఒప్పెడి= వర్ధిల్లెడి; అడవులు+అనేకములు= పెక్కు అడవులు (ఉంటాయి); వానియందున్= ఆ అడవుల నుండి; అర్థము= ధనం; చేరెడు+వెరవులు= లభించే ఉపాయాలు; పెక్కులు= ఎన్నియో; చొప్పడి+ఉండున్= అనువుగా ఉంటాయి; నయంబుతోడి బలిమి కలిగినన్= సామంతో కూడిన శక్తి సామర్థ్యాలు (రాజులకు) ఉంటే.

తాత్పర్యం: ఈ నదులేకాక, అక్కడక్కడ ఎన్నో అడవులు ఉంటాయి. ఆ అడవుల నుండి ధనం ఆర్జించే ఉపాయాలు ఎన్నో ఉన్నాయి. అయితే రాజులు సామంతో కూడిన శక్తిసామర్థ్యాలు ప్రయోగించాలి.

విశేషం: అడవుల నుండి ధనార్జన చేయటానికి రాజులకు సామంతో కూడిన శక్తిసామర్థ్యాలు ఉండాలి. ఎందుకు? అడవులలో అనాగరికులైన ఆటవికులు నివసిస్తూ ఉంటారు. వారు బలప్రయోగానికి సులువుగా లొంగరుగాని నయనీతికి లొంగుతారు. అమాయకులైన ఆటవికులు ప్రేమపాత్రులు. వారు కష్టజీవులు. నాగరికులు అడవులలోని సంపదను అంతటి శరీర శ్రమకు ఓర్చి సేకరించలేరు. ఆటవికులకే అడవులలోని సంపద సేకరించే సహజశక్తి ఉంటుంది.

వ. పాంచాల బర్బర వత్స మత్స్య మగధ మళయాళ కళింగ కుళింగ కురు కోంకణ టేంకణ త్రిగర్త సామ్రుద్ర సాళ్వ శూరసేన సుదేష్ణ సుహ్మ కురు కరూశ కాశ కోసల యవన యుగంధ రాంధ్ర సింధు చేది చోళ పుళింద పుండ్ర పాండ్యాభీర సౌవీర సౌరాష్ట్ర మహారాష్ట్ర విదేహ విదర్భ ద్రవిళ దశార్ణ కర్ణాట గౌళాంగ వంగ వరాట లాట బాహ్లీక బహుదాన కిరాత కేకయాశ్మంత కాశ్మీర గాంధార కాంభోజ కేరళ మాళవ నేపాళ ఘూర్జర కుంత లావంతి కానూపాది జనపదంబులు సమస్త వస్తు సంపత్సంపాదనంబు లయిన గుణవిశేషంబుల వెలసి పురుషార్థంబులగు ధర్మార్థ కామంబులకుం గారణంబులై కమనీయంబు లగుచుండు. 40

ప్రతిపదార్థం: పాంచాల, బర్బర, వత్స, మత్స్య, మగధ, మళయాళ, కళింగ, కుళింగ, కురు, కోంకణ, టేంకణ, త్రిగర్త, సామ్రుద్ర, సాళ్వ, శూరసేన, సుదేష్ణ, సుహ్మ, కురు, కరూశ, కాశ, కోసల, యవన, యుగంధర+ఆంధ్ర, సింధు, చేది, చోళ, పుళింద, పుండ్ర, పాండ్య+అభీర, సౌవీర, సౌరాష్ట్ర, మహారాష్ట్ర, విదేహ, విదర్భ, ద్రవిళ, దశార్ణ, కర్ణాట, గౌళ+అంగ, వంగ, వరాట, లాట, బాహ్లీక, బహుదాన, కిరాత, కేకయ+అశ్మంత, కాశ్మీర, గాంధార, కాంభోజ, కేరళ, మాళ్వ, నేపాళ, ఘూర్జర, కుంతల+అవంతి, కానూప+ఆది జనపదంబులు (ఇవి అన్నీ భారత వర్షంలోని, ఆనాటి, జనపదాల పేరులు); సమస్త, వస్తు, సంపత్+సంపాదనంబు అయిన=

అన్ని వస్తువులతో సంపదలతో కూడిన, గుణవిశేషంబులన్= గొప్ప లక్షణాలలో, వెలసి= వర్ధిల్లి; పురుషార్థంబులు అగు= (మానవ జీవిత కర్తవ్యాలయిన); ధర్మ+అర్థ+కామంబులకున్= ధర్మమునకు; ధనమునకు కోరికలకును; కారణంబులు+ఐ= హేతువులై; కమనీయంబులు= సుందరములు; అగుచు.

తాత్పర్యం: పాంచాల బర్బర వత్స మత్స్య మగధ, మళయాళ, కళింగ, కురుు, కోంకణ, టేంకణ, త్రిగర్త, సాముద్ర, సాళ్వ, శూరసేన, సుదేష్ణ, సుహ్మ, కురు, కరూశ, కాశ, కోసల, యవన, యుగంధర, ఆంధ్ర, సింధు, చేది, చోళ, పులింద, పుండ్ర, పాండ్య, ఆభీర, సౌవీర, సౌరాష్ట్ర, మహారాష్ట్ర, విదేహ, విదర్భ, ద్రవిళ, దశార్ణ, కర్ణాట, గౌళ, అంగ, వంగ, వరాట, లాట, బాహ్లీక, బహుదాన, కిరాత, కేకయ, అశ్మంత, కాశ్మీర, గాంధార, కాంభోజ, కేరళ, మాళవ, నేపాళ, ఘూర్జర, కుంతల, అవంతి, కామరూపం మొదలైన భారత వర్షాలలోని జనపదాలు. అవి పెక్కు సంపదలకు ఆలవాలాలు. పురుషార్థాలలో ధర్మం, అర్థం, కామం అనుష్ఠానానికి పేరెన్నిక గన్నవి. సుందరములు.

విశేషం: 1. మహాభారతం - నేపాళమును - గాంధారము (నేటి ఆఫ్ఘనిస్థానము) కాంభోజము (నేటి కంబోడియా) భారత వర్షంలోని జనపదాలుగా అభివర్ణించటం గమనింపదగిన అంశం.

2. ఈ జనపదాలలో వర్ధిల్లిన పురుషార్థాలలో మోక్షం చేర్చలేదు మహాభారతం.

క. వినికి గలిగి రక్షించుచు । ననువున దయతోడిపాడి నాయతు లెల్లం
గొనుచుఁ దగ నేలి పాగ డొం । దిన రాజున కుర్వి గామధేనువు గాదే! 41

ప్రతిపదార్థం: వినికి+కలిగి= (ప్రజలు చెప్పే మాటలు) వినే ఓర్పు కలిగి; రక్షించుచున్= కాపాడుతూ; అనువునన్= వెరవుతో; దయతోడి పాడి= కరుణతో రంగరించిన న్యాయం; ఆయతులు+ఎల్లన్= అన్ని రాబడులను; కొనుచున్= స్వీకరిస్తూ; తగన్= ధర్మంతో; ఏలి= పరిపాలించి; పొగడు+ఒందిన= పేరు కెక్కిన; రాజునకున్= ప్రభువుకు; ఉర్వి= భూమి; కామధేనువు= వేల్పుటావు (కోరికలను ఈడేర్చే ఆవు); కాదు+ఏ?= కాదా?

తాత్పర్యం: రాజు అన్ని విషయాలు విని తెలుసుకొనాలి. ప్రజలను రక్షించాలి. కేవలం న్యాయమేకాక ఆ న్యాయం కరుణతో రంగరించి రాబడులను స్వీకరిస్తూ పరిపాలించాలి. ఆ విధంగా పేరు కెక్కిన రాజుకు భూమి కామధేనువై వర్తిల్లగలదు.

విశేషం: 1. ఈ పద్యం తెలుగు మహాభారతంలో మిక్కిలి ప్రశస్తికి ఎక్కింది. భూమి రాజుకు కామధేనువు. ఎట్టి రాజుకు?

న్యాయాన్ని దయతో రంగరించి రాబడులను స్వీకరిస్తూ పాలించే రాజునకు. ప్రజల నివేదనలు విని దయతో పరిపాలించే రాజుకు.

కామధేనువు= వేల్పుటావు స్వర్గలోకంలో ఉంటుంది. కోరికలను ఈడేర్చగలది. కామధేనువు, చింతామణి, కల్పవృక్షం స్వర్గంలోనివి. ఏ కోరికలైనా తీర్చగలవి. ఇది ప్రాచీన భారత సంస్కృతి సృష్టించిన మనోహర కల్పన.

ఆ. వెరవు లావుఁ గలుగు నరనాథు లింత దే । శంబు గలదు తమకుఁ జాలు ననరు;
దండ్రి బిడ్డ యన్న తమ్ముఁడు నా కెత్తి । పోయి పోటులాడి పుడమిఁ గొండ్రు. 42

ప్రతిపదార్థం: వెరవు= ఉపాయం; లావున్= బలము; కలుగు= ఉన్నట్టి; నరనాథులు= రాజులు; ఇంత+దేశంబు= ఎక్కువ విస్తీర్ణంగల భూమి; కలదు= ఉంది; తమకున్= తమకు; చాలున్+అనరు= సరిపోతుంది అని చెప్పరు; తండ్రి; బిడ్డ= పుత్రుడు; అన్న= అగ్ర సోదరుడు; తమ్ముఁడు= (తన తరువాత తల్లిదండ్రులకు పుట్టినట్టివాడు); నాక= అనక; ఎత్తిపోయి= ఎదిరించి; పోటులు+ఆడి= యుద్ధాలు చేసి; పుడమిన్+కొండ్రు= భూమిని జయించిలాగుకుంటారు.

తాత్పర్యం: శక్తిసామర్థ్యాలు, ఉపాయం కల రాజులు, తమకు ఎంతో విశాలమైన రాజ్యం ఉన్నప్పటికీ తృప్తి చెందక, తండ్రి, కొడుకు, అన్న తమ్ముడు అనే విచక్షణ లేకుండా యుద్ధం చేసి భూమిని వారినుండి బలవంతంగా లాగుకొంటారు.

క. కావునఁ గౌరవ పాండవు । లీ వసుధకునై పెనంగు టెగ్గే? దైవం
బే వంక వ్రాలె వారిక । పోవుం గా కిది; నరేంద్ర! పాగులకు మింకన్.' 43

ప్రతిపదార్థం: నర+ఇంద్ర!= ఓ రాజా! (ధృతరాష్ట్ర మహారాజా!); కావునన్= కాబట్టి; కౌరవ పాండవులు= కౌరవులును పాండవులును; ఈ వసుధకున్+ఐ= ఈ భూమి కోసం; పెనంగుట= యుద్ధం చేయటం; ఎగ్గు+ఏ?= తప్పిదమా?; దైవంబు= అదృష్టం; ఏ వంకన్+వ్రాలెన్= ఏవైపు మ్రొగ్గు చూపిస్తుందో; వారికిన్+అ= వారికే; ఇది= (ఈ భూరాజ్యం); పోవున్+కాక= పోతుంది కదా; ఇంకన్= ఇకమీద; పాగులకుము= దుఃఖించవద్దు.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! పూర్వకాలం నుండీ రాజులు భూమికోసం పోరాడుతూనే ఉన్నారు గదా. ఇప్పుడు కౌరవులతో పాండవులు భూరాజ్యం కోసం పోరాడటం వెనుకటి పరిపాటి మాత్రమేకాని క్రొత్త తప్పు కాదు. దైవం ఏ వైపు అనుకూలిస్తుందో అటు వారు యుద్ధంలో విజయం పొందగలరు. నీవు ఇంక దుఃఖించవలసింది ఏమీ లేదు.

వ. అనిన విని యాంబికేయుండు సంజయుతో 'నీ వింక సంగరంబుఁ జూడం బో'మ్మని సముచితంబుగ వీడు కొలిపినం బోయి భారత రణ ప్రకారం బనుసంధించి, యతండు కతిపయ దినంబులకుం జనుదెంచి తగిన తెఱంగునం గాంచి. 44

ప్రతిపదార్థం: అనినన్+విని= (సంజయుడు చెప్పిన మాటలు ఆలకించి); ఆంబికేయుండు= అంబిక కొడుకు ధృతరాష్ట్రుడు; సంజయుతోన్; నీవు+ఇంక= నీవు ఇకమీద; సంగరంబున్= యుద్ధాన్ని; చూడన్+పొమ్ము+అని= చూడటానికి వెళ్లుము అని చెప్పి; సముచితంబుగన్= మర్యాద ప్రకారం; వీడుకొలిపినన్= వీడ్కోలు ఇవ్వగా; పోయి= (సంజయుడు) వెళ్ళి; భారత+రణప్రకారంబు+అనుసంధించి= భారత యుద్ధం జరిగిన తీరు ఆకళింపు చేసుకొని; అతండు= (సంజయుడు); కతిపయదినంబులకున్= కొన్ని రోజులు గడచిన పిదప; చనుదెంచి= వచ్చి; తగిన+తెఱంగునన్+కాంచి= మర్యాద తీరు ప్రకారం (ధృతరాష్ట్రుడి దగ్గరకు వచ్చి) చూచి.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడు సంజయుడి మాటలు విన్నాడు. సంజయుడు భూగోళ విషయాలతోపాటు దుర్యోధనుడిని ప్రత్యక్షంగా నిందించాడు. అది ధృతరాష్ట్రుడిపై పరోక్ష నిందయే. అందుచేత- ధృతరాష్ట్రుడు లోలోపల కోపగించి 'ఓ సంజయా! ఇక నీవు సముచితంగా యుద్ధం చూచి వచ్చి నాకు జరిగిన విషయాలు వివరించుము' అని చెప్పాడు. అందులో అంతర్గర్భితమైన మందలింపు ఇమిడి ఉన్నది.

క. కొడుకుల దెస నెవ్వగఁ జే । డ్పడి వందురి యున్న యా నృపాలు నడుగులం
బడి, భీష్మపాటు సెప్పుచు । నడలి కరుణనాద మెసఁగ నాక్రందించెన్. 45

ప్రతిపదార్థం: కొడుకుల దెసన్= పుత్రుల యెడ (దుర్యోధనాదుల యెడ); నెఱ+వగన్= మిక్కుటమైన శోకంతో; చేడ్పడి= వ్యాకులపడి; వందురి+ఉన్న= బాధపడుతున్న; ఆ+నృపాలు+అడుగులన్+పడి= ఆ ధృతరాష్ట్రుడి పాదాలపై వ్రాలి; భీష్మపాటు= భీష్ముడి పతనం; చెప్పుచున్, అడలి= దుఃఖించి; కరుణ+నాదము= శోకంతో కూడిన గొంతు; ఎసఁగన్= వ్యాపించగా; ఆక్రందించెన్= ఏడ్చాడు.

తాత్పర్యం: కొడుకుల కోసం మిక్కుటమైన శోకంతో వ్యాకులపడియున్న ధృతరాష్ట్రుడి దగ్గరకు వచ్చి సంజయుడు ఆతని పాదాలపైబడి విలపించి భీష్ముడు యుద్ధభూమిలో పడిపోయినట్లు చెప్పాడు. ఆ సంజయుని విలాపం ఈ విధంగా సాగింది.

వ. అయ్యేడ్పుతో నిట్లని విలాపంబు సేయు. 46

ప్రతిపదార్థం: ఆ+ఏడ్పుతో+ఇట్లు+అని= ఈ విధంగా; విలాపంబు+చేయు= ఏడవటం మొదలుపెట్టాడు.

తాత్పర్యం: ఆ యేడ్పు గొంతుతో బావురుమంటూ ఇట్లా అన్నాడు.

సీ. ఆత్మయోధుల కెల్ల నాధార మగునట్టి । తనకు నస్త్రంబు లాధార మయ్యెఁ;
బరశురామునకు మే ల్సరి యైన తన యందుఁ । గలిగె భంగంబు శిఖండిచేత;
జనపతి దను నచ్చి మును జూద మొనరించె । దాను గయ్యంపు జూదమున నోడెఁ;
దనయార్పు టెలుఁగునఁ దలఁకు వైరులు వొంగ । నొఱలుచు నేలకు నొఱగె నేఁడు;

ఆ. తీవ్ర బాణజాల దీప్తులు పరఁగించి । పాండుతనయ సైన్య బహుళ తమము
లీలఁ బది దినంబు లోలి వినోదించి । యధిప! భీష్మభానుఁ డస్తమించె. 47

ప్రతిపదార్థం: అధిప!= ఓ ధృతరాష్ట్రమహారాజా!; ఆత్మ+యోధులకు+ఎల్లన్= తన నాయకత్వంలో యుద్ధం చేసే వీరులకు అందరకు; ఆధారము+అగు+అట్టి= ఆదరువు- రక్షకుడు అయినట్టి; తనకున్= భీష్మునకు; అస్త్రంబులు= ఆయుధాలు (శరతల్పం); ఆధారము+అయ్యెన్= ఆలంబనం అయినవి; పరశురామునకున్= గండ్రగొడ్డలి ఆయుధంగా పేరు పొందిన రామునకు; మేల్+సరి+ఐన= గొప్ప ఈడు అయిన; తన యందున్= (భీష్మునకు); శిఖండి చేతన్= శిఖండి అను వాడిచేత (పేడిరూపంలో ఉన్న వీరమ్మన్యుడి చేత; భంగంబు+కలిగెన్= ఓటమి సంభవించింది; జనపతి= రాజు (దుర్యోధనుడు); తనున్+నచ్చి= (భీష్ముడి) పరాక్రమం మెచ్చుకొని; మును= లోగడ; జూదము+ఒనరించెన్= జూదం ఆడాడు; తాను= (ఇపుడు భీష్ముడు); కయ్యంపు+జూదమునన్= యుద్ధం అనే జూదంలో; ఓడెన్= ఓటమి చెందాడు; తన+ఆర్పు+ఎలుఁగునన్= తనదైన సింహనాదం యొక్క చప్పుడు చేతనే; తలకు+వైరులు= భయపడే శత్రువులు; పొంగన్= సంతోషించగా, ఒఱలుచున్= మూల్గుతూ; నేఁడు= ఈ రోజున (భీష్ముడు); ఒఱగెన్= నేలపై వ్రాలాడు; తీవ్రబాణ+జాల+దీప్తులు= మిక్కుటమైన బాణాల సమూహాల కాంతులు; పరఁగించి= వ్యాపింపచేసి; పాండు తనయ సైన్యబహుళ తమము= పాండవుల సైన్యం అనే దట్టమైన చీకటి; లీలన్= వినోదప్రాయంగా; పదిదినంబులు= పది రోజులు; ఓలి= వరుసగా; వినోదించి= ఆనందంతో విహరించి; భీష్మభానుఁడు= భీష్ముడు అనే సూర్యుడు; అస్తమించెన్= క్రుంకినాడు.

తాత్పర్యం: ఆహా! ఏమిటీ విధివైపరీత్యం! జగదేకవీరుడైన భీష్ముడా ఈ విధంగా నేలమీద పడిపోవటం! తన నాయకత్వంలో పోరాడే వీరులు అందరికీ తాను ఆలంబనమై ఉన్న భీష్ముడికి ఇప్పుడు బాణాలే ఆలంబనమైపోయాయి. (అనగా శరతల్పగతుడైనాడు). రాజలోకాన్ని ఇరువది ఏడు మారులు ఎత్తిన గండ్రగొడ్డలి దించకుండా నరికి విజయాలు సాధించిన పరశురాముడికి లొంగకుండా నిలిచి అతడికి మేల్సరియైన వీరుడు అని పేరుకెక్కిన ఆ భీష్ముడా నేడు మగసిరిలేని పేడి శిఖండి చేత జయించబడ్డాడు. దుర్యోధనుడు ఒకనాడు తనను నమ్ముకొని పాండవులను జూదంలో ఓడించి నిశ్చింతగా ఉన్నాడు. ఇప్పుడు యుద్ధం అనే జూదంలో దుర్యోధనుడు ఓడిపోయాడు గదా! తన సింహనాదము చేత శత్రువులను కంపించేటట్లు చేయగలిగినట్టి భీష్ముడు శత్రువులు ఉత్సాహంతో ఉప్పొంగిపోతూ ఉండగా నేలకువ్రాలాడు. పాండవుల సేనలు అనే చీకట్లను తన బాణాలు అనే కిరణాలతో సులువుగా అవలీలగా పోగొట్టిన భీష్ముడు అనే సూర్యుడు పదిదినములు వినోదించి అస్తమించాడు. కటకటా! ఇది విధివైపరీత్యం కాక మరేమిటి?

విశేషం: 1. భీష్ముడు పరశురాముడి శిష్యుడు. ఒకసారి కాశీరాజపుత్రికలయిన అంబ, అంబిక, అంబాలికలు అనే కన్యకలను, స్వయంవర వేదికనుండి రాజులందరినీ జయించి భీష్ముడు తన తమ్ములకు వివాహం చేయాలని తీసికొనిపోయాడు. అంబ తాను సాళ్వుడు అనే రాజును వరించినట్లు చెప్పింది. భీష్ముడు ఆమెను సాళ్వుడి కడకు పంపాడు. సాళ్వుడు నిరాకరించాడు. అప్పుడు ఆమె భీష్ముడి దగ్గరకు వచ్చి, తనను వివాహం చేసుకోమని కోరింది. భీష్ముడు తన ప్రతిజ్ఞ ప్రకారం ఆజన్మ బ్రహ్మచర్యం పాటిస్తానన్నాడు. అంబ పరశురాముడిని ఆశ్రయించింది. పరశురాముడు అంబ పక్షం వహించి భీష్ముడితో యుద్ధానికి దిగాడు. గురుశిష్యుల పోరు చాలారోజులు జరిగింది. తుదకు సమయుద్ధంగా పరిణమించింది. పరశురాముడు శిష్యుడిని అభినందించి నిష్క్రమించాడు.

2. భీష్మభానుడు= భీష్ముడికి సూర్యుడికి అభేదాధ్యవసాయం. ఈ సీసపద్యం చివరి ఆటవెలదిలో కన్పిస్తున్నది. ఇది రూపకాలంకారం.

క. పదివేవురు రాజులు దన । కెదిరి పొలిసి రా శిఖండి యేమిటివాఁడై
తుదిఁ బోయి తన్ను నాజిం । గదియుచుఁ బొలియించె; నియతిఁ గడవఁగ వశమే! 48

ప్రతిపదార్థం: పదివేవురు రాజులు= పదివేలమంది రాజులు; తనకున్+ఎదిరి= తన్ను ఎదిరించి; పొలిసిరి= మరణించారు; ఆ+శిఖండి= ఆ శిఖండి; ఏమిటివాడై?= ఏమంత ఘనుడై? తుదిన్= చివరకు; పోయి= ఎదురైవచ్చి; తన్నున్= (భీష్ముడిని); ఆజిన్= యుద్ధంలో; కదియుచున్= ఎదిరిస్తూ; పొలియించెన్= పడగూల్చాడు,(నశింపజేశాడు) నియతిన్= (విధి) నిర్ణయం; కడవఁగన్= దాటగా; వశమే?= శక్యమా?

తాత్పర్యం: పదివేలమంది రాజులు భీష్ముడిని ఎదిరించి మరణించారు. ఎంత ఆశ్చర్యం! ఈ శిఖండి ఏపాటివాడు? యుద్ధంలో భీష్ముడిని ఎదిరించి పడగూల్చగలిగాడు! విధినిర్ణయం ఎవరికైనా అతిక్రమించటం సాధ్యం కాదు.

తే. చాపవక్త్రుండు భల్లదంష్ట్రావితాన । ఘోరమూర్తి నారాచనఖుండు ఖడ్గ
జిహ్వికాభీషణుఁడు నరసింహమూర్తి । గాక కేవల నరుఁడె గంగాసుతుండు!' 49

ప్రతిపదార్థం: చాపవక్త్రుండు= విల్లు అనెడి నోరు గలవాడు; భల్ల,దంష్ట్ర,వితాన,ఘోర,మూర్తి= బల్లెములనే కోరల సమూహం చేత భయంకరాకారుడు; నారాచ+నఖుండు= బాణాలనెడి గోళ్ళు కలవాడు; ఖడ్గ జిహ్వికా, భీషణుఁడు= కత్తి అనెడు నాలుకచేత భయం గొలిపేవాడు; నరసింహమూర్తి+గాక= మానవుడు సింహం కలిసిన ఆకారం కలవాడు- విష్ణుదేవుడి అవతారం కాక; గంగాసుతుండు= గంగ కొడుకు- భీష్ముడు; కేవల+నరుఁడు+ఎ?= మానవమాత్రుడా? కాదని అర్థము.

తాత్పర్యం: ధనుస్సు అనెడి నోరు గలవాడు, బల్లెములనెడు పలువరుసలచేత భయంకరాకారుడు, బాణాలు అనెడు గోళ్ళు గలవాడు, కత్తి అనెడు నాలుకతో భీతి కలిగించేవాడు, విష్ణుమూర్తి అవతారమైన నృసింహమూర్తియే భీష్ముడు - కేవలం మానవమాత్రుడు కాడు.

విశేషం: 1. దశావతారాలలో నృసింహాకారం మిక్కిలి భయంకరమైనది. భీష్ముడు యుద్ధభూమిలో అపర నృసింహావతారమే. హిరణ్యకశిపుడిని సంహరించి ప్రహ్లాదుడిని రక్షించిన పౌరాణిక గాథ ఇట స్మరించదగింది. భారత రచన నాటికే నృసింహగాథ బహుళ ప్రచారంలోకి వచ్చింది అనటానికి ఈ పద్యం ఒక నిదర్శనం. నృసింహ పురాణం సంస్కృత మహాభారతం తరువాతనే రచించబడినదని వాదించేవారు ఉన్నారు. అయితే పురాణ గాథలు లోకంలో పురాణాలు రచించబడక పూర్వమే వ్యాపించి ఉన్నట్లు భావించవచ్చును.

ధృతరాష్ట్రుఁడు భీష్ము మరణంబు విని విలపించుట (సం. 6-14-1)

వ. అని సంజయుండు పలవించు పలుకులకుఁ జిత్తంబు జల్లని యొల్లంబోయి మూర్ఛిల్లి కొండొక సేపునకు శిశిర విధానంబుల సేద దేఱి ధృతరాష్ట్రుండు గన్నీరు దొరంగ గద్గదకంఠుండై. 50

ప్రతిపదార్థం: అని సంజయుండు, పలవించు పలుకులకున్= దుఃఖంతో ఆకులుడై చెప్పిన మాటలకు; చిత్తంబు= మనస్సు; జల్లు+అని= సంచలించి, కొట్టుకొని; ఒల్లన్+పోయి= స్వాస్థ్యం తప్పి, అదరిపడి; మూర్ఛిల్లి= స్పృహ తప్పి; కొండొక+సేపునకున్= కొంత సమయము గడచిన పిమ్మట; శిశిర విధానంబులన్= చల్లదనం చేకూర్చే ఉపచారముల వలన; సేద+తేఱి= కోలుకొని; ధృతరాష్ట్రుండు= ధృతరాష్ట్రుడు; కన్నీరు= కంటినీరు; తొరంగన్= కారగా; గద్గదకంఠుండు+ఐ= డగ్గుత్తిక పడిన కంఠం కలవాడై, (బొంగురు వోయిన గొంతుగలవాడై)

తాత్పర్యం: భీష్మపతనమునకు కలతచెంది, దుఃఖంతో వ్యాకులత చెంది పలవిస్తూ ఉన్న సంజయుడి మాటలు విని ధృతరాష్ట్రుడు స్పృహతప్పి పడిపోయాడు. అతడికి శీతలోపచారాలు చేసిన పిమ్మట కోలుకొని కన్నీరు కారుస్తూ.

క. ‘ దేవాసురవరు లొక్కటి । యై వచ్చినఁ జిక్కువఱుచు నాహవమున నా
దేవవ్రతుఁడు శిఖండి శ । రావలి పాలయ్యెఁ; నేమి యనఁగల దింకన్! 51

ప్రతిపదార్థం: దేవ+అసురవరులు+ఒక్కటి+ఐ= దేవతలలో రాక్షసులలో గొప్పవారు ఏకమై; వచ్చినన్= (యుద్ధానికి) వచ్చినప్పటికిని; ఆహవమునన్= యుద్ధంలో; ఆ దేవవ్రతుఁడు= ఆ భీష్ముడు; చిక్కుపఱుచున్= చీకాకుపడేటట్లు చేసి ఓడించగలడు (అట్టివాడు); శిఖండి, శరావలి, పాలు+అయ్యెన్= శిఖండి బాణాల బారిని పడ్డాడు; ఇంకన్= ఇకమీద; ఏమి+అనన్+కలదు?= చెప్పటానికి ఏముంది?

తాత్పర్యం: దేవతలలో రాక్షసులలో ఉన్న గొప్ప వీరులు కలిసి ఏకమై దండెత్తి వచ్చినప్పటికీ వారిని యుద్ధంలో ఓడించగల శక్తిగలవాడు భీష్ముడు. అట్టివాడు ఒక సామాన్య వీరుడైన శిఖండి చేత నిర్జింపబడటం వింతలలో వింత కదా!

ఉ. అంచిత తాలకేతుకిరణాళి మెఱుంగులు గాఁగ, మౌర్వి మ్రో
యించుట గర్జచందముగ నేచి విరోధిదవానలంబు మా
యించు శితాస్త్రవర్షమున నిట్టిది భీష్మమహాభ్ర; మె ట్లడం
గించెనొకో శిఖండి యను కృత్రిమ వాయువు దాఁకి దైవమా! 52

ప్రతిపదార్థం: అంచిత= ఒప్పినట్టి; తాలకేతుకిరణ+ఆళి= తాడిచెట్టు జెండా నుండి వెలువడే వెలుగు రేకల గుంపుల తళతళలు; మెఱుంగులు కాఁగన్= మెఱుపులు కాగా; మౌర్విన్= అల్లె త్రాటిని; మ్రోయించుట= నినదింప చేయటం; గర్జ, చందముగన్= ఉరుముగా; ఏచి= విజృంభించి; విరోధి దవ+అనలంబున్= శత్రువులు అనే కార్చిచ్చును; శిత+అస్త్రవర్షమునన్= వాడి బాణములు అనే వానచేత; మాయించున్= అణగింపచేయును; ఇట్టిది= ఇటువంటిది; భీష్మ మహా+అభ్రము= భీష్ముడు అనే గొప్ప మేఘం; దైవమా!= ఓ భగవంతుడా!; శిఖండి+అను= శిఖండి అనెడి; కృత్రిమ, వాయువు= కపటమైన గాలి; తాఁకి= ఎదిర్చి; సోకి, ఎట్లు= ఏవిధంగా; అడంగించెను+ఒకో!= ఏ విధంగా అణగగొట్టిందో!

తాత్పర్యం: భీష్ముడి రథంపై ఒప్పునట్టి తాడిచెట్టు జెండా వెలుగొందుతూ ఉంటుంది. దాని వెలుగుల మొత్తమే మెరుపు తీగలై మిరుమిట్లుగొలుపుతుంది. అతడి ధనుస్సుకు పొదిగిన అల్లెత్రాటి ధ్వని ఉరుములవలె వినిపిస్తుంది.

శత్రువులు అనే కార్చిచ్చును అతడి బాణవర్షం ఆర్పివేస్తుంది. అయితే- శిఖండి అనే కృతక వాయువు భీష్మ మేఘాన్ని ఏ విధంగా అణగ గొట్టగలిగిందో ఆ దైవానికే తెలియాలి.

విశేషం: అలం: రూపకం. తాళకేతు కిరణాళి మెరుపులుగా, అల్లెత్రాటి మ్రోత గర్జగా, విరోధులు దావాగ్నిగా శితాస్త్రాలు వర్షంగా భీష్ముడు గొప్ప మేఘంగా, శిఖండి కృత్రిమవాయువుగా రూపింపబడ్డారు.

తే. పెరిఁగి పాండవాంబుధి వెల్లివిరిసినపుడు । నిలువ నిమ్ముగు దీవిగా నిన్నుఁ దలఁచి
యుండ నత్యంతతుచ్ఛ శిఖండి పల్వ । లాక్రమంబున మునిగితే యకట తండ్రి! 53

ప్రతిపదార్థం: పాండవ+అంబుధి= పాండవులు అనే సముద్రం; పెరిఁగి, వెల్లివిరిసినపుడు= పొంగి పొరలి విజృంభించినపుడు; నిలువన్+ఇమ్ము+అగు+దీవిగాన్= నిలిచియుండటానికి తగిన ద్వీపంగా; నిన్నున్+తలఁచి+ఉండన్= నిన్ను భావించి ఉండగా; అత్యంత+తుచ్ఛ+శిఖండి+పల్వల+ఆక్రమంబునన్= మిక్కిలి నీచుడైన శిఖండి అనే గుంట వశమై; తండ్రి!= ఓ భీష్ముడా!; అకట= అయ్యో!; మునిగితి(వి)+ఏ?= మునిగిపోయావా?

తాత్పర్యం: పాండవులు అనే సముద్రం పొంగి పొరలి విజృంభించినప్పుడు, ఓ తండ్రి! భీష్ముడా! కౌరవులు నిలిచేందుకు తగిన దీవిగా నిన్ను భావించాము. కాని, మిక్కిలి అల్పుడైన శిఖండి అనే చిన్న గుంతకువశమై మునిగి పోయావా?

విశేషం: అలం: రూపకం. పాండవాంబుధి - పాండవులనెడి సముద్రం, నిన్ను దీవిగా, శిఖండి అనెడి పల్వలం. ద్వీపం. నాలుగు వైపులా నీటిచేత చుట్టబడిన భూప్రదేశం.

ఉ. వీరరసాంబుపూరమును విశ్రుతబాహు మహోగ్ర సత్త్వముం
జారుగదాధ్వజాచలవిశాలము నంబకజాలవీచికా
స్ఫారము నైన భీష్ముఁడను సాగరముం గడవంగ నీఁదఁగా
నేరిమి యెట్లొకో కలుగ నేర్చె శిఖండికి? నేమి సేయుదున్! 54

ప్రతిపదార్థం: వీరరస+అంబు+పూరమును= వీరరసం అనే నీటి ప్రవాహమూ; విశ్రుత, బాహు, మహా+ ఉగ్ర, సత్త్వమున్= పేరుకెక్కిన భయంకరమైన క్రూరమృగాలు కలదియు; చారు, గదా, ధ్వజ+ అచల విశాలము= అందమైన, గదలు జెండాలనెడి కొండలచేత విస్తీర్ణమై నట్టిదియు; అంబక, జాల, వీచికా, స్ఫారము= బాణాల సమూహాలు అనెడి కెరటాలతో వెలుగొందునట్టి; భీష్ముఁడు+అను+సాగరమున్= భీష్ముడు అనెడి సముద్రాన్ని; కడవంగన్+ఈఁదఁగా- అవ్వలి ఒడ్డుచేరేటట్లు ఈదగా; శిఖండికిన్; నేరిమి= నేర్పు, సామర్థ్యం; ఎట్లు+ఒకో= ఏ విధంగా; కలుగనేర్చెన్= చేకూరింది; ఏమి+చేయుదున్?= ఏం చేస్తాను?

తాత్పర్యం: భీష్ముడనే సముద్రాన్ని దాటటానికీ, ఈదటానికీ ఎవరికీ శక్యం కాదు. అది వీరరసమనేజల సమూహం కలదీ, ప్రసిద్ధికెక్కిన బాహుబలమనే భయంకర జలజంతువులు కలదీ, అందమైన గదలు ధ్వజాలు మొదలైన వాటి చేత మహాపర్వతాలతో విశాలమైనదీ బాణ సమూహాలనే అలల పొంకం గలది. అటువంటి భీష్మసాగరాన్ని శిఖండి ఎట్లా దాటగలిగాడు? ఈదగలిగాడు? ఆశ్చర్యంగా ఉన్నది? ఇప్పుడేమి చేసేది? అసహాయుడనయ్యాను.

విశేషం: ఈ పద్యంలో భీష్ముడికీ సముద్రానికీ అభేదాధ్యవసాయం కల్పించబడింది. వీరరసంలో భీష్ముడికి రసాంబుపూరం సముద్రానికి, విశ్రుత బాహు పరాక్రమం భీష్ముడికి, మహోగ్రసత్వం సముద్రానికి (సత్త్వము= బలం అని ఒక అర్థం- జంతువు అని మరో అర్థం) గదాధ్వజములు భీష్ముడికి అచలములు సముద్రమునకు అంబక జాలములు భీష్ముడికి, అంబక జాలముల

వంటి కెరటాలు సముద్రానికి అన్వయం. ఇది రూపకాలంకారం. వీరరసం అంబుపూరంగా, బాహువులు మహోగ్రసత్త్వాలుగా గదాధ్వజములు అచలాలుగా, అంబక జాలాలు కెరటాలుగా భీష్ముడు సముద్రంగా రూపించబడ్డాయి.

తే. అంబకై పూని వచ్చి బలాధికుండు । జామదగ్న్యుండు సాధింపఁ జాలకున్న
వాని భీష్ముఁ బాండవులకై పూని వచ్చి । కడిమి సాధించి తౌర! శిఖండి పోర. 55

ప్రతిపదార్థం: అంబకై= అంబకోసం (కాశీరాజు పుత్రికకై); పూని= కడగి; వచ్చి= యుద్ధానికి వచ్చి; బల+అధికుండు= అధికమైన బలంచేత గొప్పవాడు; జామదగ్న్యుండు= జమదగ్ని కొడుకు - పరశురాముడు; సాధింపన్+చాలక+ఉన్నవానిన్= ఓడింపలేకపోయిన వాడిని; అనగా అట్టి గొప్ప వీరుడిని; భీష్మున్= భీష్ముని, పాండవులకై+పూని= పాండవుల కొరకు కడగి; వచ్చి= (యుద్ధానికి) వచ్చి; కడిమిన్= పరాక్రమంతో; పోరన్= యుద్ధంలో; సాధించితి(వి)= సాధించావు; శిఖండి!= ఓ శిఖండీ!; ఔర!= ఆహా!.

తాత్పర్యం: ఓ శిఖండీ! అంబ కోసం దండెత్తి వచ్చి, పరశురాముడు వంటి మహావీరుడు భీష్ముడిని జయించలేక పోయాడు కదా! నీవు పాండవుల కోసం యుద్ధం చేసి ఆ జగదేకవీరుడిని జయించావు. ఎంతటి ఆశ్చర్యం!

విశేషం: అంబ వృత్తాంతం- 47వ పద్య వ్యాఖ్యానం చూడవచ్చును.

క. ఆ శౌర్యం బా సత్త్వం । బా శీలం బా పరాక్రమాభీలత్వం
బా శుద్ధవ్రత మెందు న । నాశము లని భీష్ముఁ బెద్ద నమ్మితిమి గదే. 56

ప్రతిపదార్థం: ఆ శౌర్యంబు= ఆ పరాక్రమం; ఆ సత్త్వంబు= ఆ బలం; ఆ శీలంబు= ఆ సత్ ప్రవర్తన; ఆ పరాక్రమ+ఆభీలత్వంబు= ఆ పరాక్రమంచేత కూడా భయంకరత్వం; ఆ శుద్ధ+వ్రతము= ఆ మంచినిష్ఠ; ఎందున్= ఎచ్చట అయినా; అనాశములు= నశించనట్టివి; అని; భీష్మున్= భీష్ముడిని; పెద్ద= ఎక్కువగా; నమ్మితిమి+కదే!= విశ్వసించాం కదా!

తాత్పర్యం: ఆహా! ఆ పరాక్రమం, ఆ బలం, ఆ సత్ప్రవర్తన, ఆ భయంకర ప్రతాపం, ఆ మంచి నిష్ఠ ఎప్పుడూ నాశనం కావని ఆ భీష్ముడిని అమితంగా విశ్వసించాము కదా!

విశేషం: భీష్ముడి అసలు పేరు దేవవ్రతుడు. తండ్రియైన శంతనుడు సత్యవతి అనే కన్యకను మోహించాడు. సత్యవతి తన తండ్రిని అడుగుమన్నది. సత్యవతి తండ్రి దాశరాజు తన కూతురు కొడుకుకే రాజ్యం సంక్రమించాలని అన్నాడు.

దేవవ్రతుడు తండ్రికోసం - తాను ఆ జన్మ బ్రహ్మచర్య దీక్షను వహిస్తానని "భీష్మ" ప్రతిజ్ఞ చేశాడు. ఆనాటి నుండి దేవవ్రతుడికి భీష్ముడు అనే బిరుదనామం సంక్రమించింది. శుద్ధవ్రతుడుగా సారస్వతంలో భీష్ముడు సుప్రసిద్ధుడైనాడు.

వ. అని బహుప్రకారంబులం బలవించి యా సూతనందను చేసేతం గీలించి. 57

ప్రతిపదార్థం: అని= అని చెప్పి; బహుప్రకారంబులన్= పలురకాలుగా; పలవించి= దుఃఖంతో కూడిన మాటలు పలికి; ఆ సూతనందను= ఆ సూతపుత్రుడి- సంజయుడి; చే+చేతన్+కీలించి= (తన చేతితో ఆతడి) చేతిని పట్టుకొని.

తాత్పర్యం: ఆ విధంగా చెప్పి, ధృతరాష్ట్రుడు తన చేతితో ఆ సంజయుడి చేయి పట్టుకొని ఈ విధంగా అన్నాడు.

సీ. 'అతఁడు నొచ్చిన తఱి నడ్డంబు సొచ్చెద । మని వచ్చువారు లేరైరె యచట?
నడరి పోరాడక యన్ని యక్షౌహిణు । లొప్పరికించెనె యొకనిఁ గలన?
నతని నోర్వఁగఁ జాలవని నిశ్చయించితి । మంతకు నోపెనే యరిబలములు?
ద్రోణుండుఁ గృపుఁడును ద్రోణసుతుండును । శల్యుండుఁ గ్రేడించి చనిరె యపుడు?

తే. పాండుసుతులు శిఖండియుఁ జండశక్తి । మెఱయ నొక్కటఁ బైఁ బడ్డ వెఱచి తాత
విడిచి నా పుత్రులందఱు విఱిగి యడవిఁ । గలిసిరొకొ? యాతనికిఁ బడవలసె నకట! 58

ప్రతిపదార్థం: అతఁడు= (భీష్ముడు); నొచ్చిన+తఱిన్= బాధపొందినపుడు; అడ్డంబు+చొచ్చెదము+అని= (అతడికి శత్రువులకు) మధ్య నిలువగలమని అని; వచ్చువారు= (ముందుకు వచ్చి) పూనువారలు; అచటన్= అక్కడ; లేరు+ఐరె?= లేకపోయారా?; కలనన్= యుద్ధమునందు; అడరి= పూని; పోరాడక= యుద్ధం చేయక; అన్ని+అక్షౌహిణులు= అన్ని వేల మంది భటులతో కూడిన సేనలు, ఒకనిన్= ఒకనిని ఒంటరిగా చేసి; ఒప్పరికించెను+ఎ= ఉపేక్షించాయా?; అతనిన్= భీష్ముడిని; అరి+బలంబులు= శత్రుసేనలు; ఓర్వఁగన్+చాలవు+అని= గెలువనేరవు; అని; నిశ్చయించితిమి= నిశ్చయించాము; అంతకున్+ఓపెనే?= అంత పనిచేశాయా?- అనగా ఆ భీష్ముడిని జయించగలిగాయా?; అపుడు= ఆ సమయంలో; ద్రోణుండున్= ద్రోణుడున్నూ; కృపుడును= కృపాచార్యుడున్నూ; ద్రోణసుతుండును= ద్రోణాచార్యుడి పుత్రుడు అశ్వత్థామయున్నూ; శల్యుండున్= శల్యుడును; క్రేడించి+చనిరె?= ఉపేక్షించి వెళ్ళిపోయారా?; పాండుసుతులు= పాండవులు; శిఖండియున్= శిఖండియు; చండ+శక్తిన్= తీవ్ర బలం; మెఱయన్= వెలుగొందుతుండగా; ఒక్కటన్+పైన్+పడ్డ= ఏకమై మీదపడగా; వెఱచి= భయపడి; తాత+విడిచి= పితామహుడైన భీష్ముడిని వదలిపెట్టి; నా పుత్రులు+అందఱున్= నా కొడుకులు ఎల్లరు (దుర్యోధనాదులు); విఱిగి= ఓడిపోయి; అడవిన్= అడవిలో; కలిసినారు+ఒకొ?= కలిసిపోయారా! ఏమి?; ఆతనికిన్= భీష్ముడికి; అకట!= అయ్యో!; పడవలసెన్= (నేలమీద) పడవలసి వచ్చింది.

తాత్పర్యం: భీష్ముడు యుద్ధంలో అలసటచెంది బాధపడేటప్పుడు, శత్రువులను ఎదిరించి అడ్డం నిల్చినవారు అక్కడ లేకపోయారా? యుద్ధంలో అక్షౌహిణులలో వేలకొలది భటులు చేరి పోరాడుతున్నారుగదా; భీష్ముడిని ఏకాకిగా చేసి వారందరూ ఊరకున్నారా? భీష్ముడిని శత్రువులు గెలవ లేరనే నమ్మకంతో వారందరూ ఉండగా వారు ఆతడిని పడగొట్టగల్గారా? ద్రోణుడు, కృపాచార్యుడు, అశ్వత్థామ, శల్యుడు ఏమయ్యారు? అక్కడ లేరా? ఉంటే ఉపేక్షించి వేరే చోటికి పారిపోయారా? దేదీప్యమానమైన బలంతో పాండవులు శిఖండితో కూడి భీష్ముడిపై పడినపుడు నా కొడుకులు దుర్యోధనుడు మున్నగువారు భయపడి అడవిలోకి పారిపోయారా? అయ్యో! భీష్ముడు నేలపై పడిపోవలసి వచ్చింది?

వ. దేవవ్రతుండు దెగినయప్పుడ తక్కినయంతవట్టునుం దెగియనకాఁ దలంచెద' నని మఱియు నిట్లనియె. 59

ప్రతిపదార్థం: దేవవ్రతుండు= భీష్ముడు; తెగిన+అప్పుడు+అ= ఓడిపడిపోయినప్పుడే; తక్కిన+అంత+పట్టును= మిగిలిన మేర అంతా (మిగిలిన సేనలోని వారందరూ); తెగి+అన+కాన్= ఓడిపడిపోయినట్లే; తలంచెదన్= భావిస్తాను; అని మఱియున్+ఇట్లు+అనియెన్= అని చెప్పి, తిరిగి ఈ విధంగా అన్నాడు:

తాత్పర్యం: భీష్ముడు పడిపోయినప్పుడే తక్కిన అందరూ పడిపోయినట్లే భావిస్తాను.

సీ. ' కులగురు వృద్ధు నిర్మలచిత్తు గాంగేయుఁ । జంపి రాజ్యము సేయ సమ్మతించి
తొడరిన పాండుపుత్రులకును దైవంబుఁ । దోడయ్యెఁ; ధర్మంబు గీడుపఱిచి
పరఁగి యధర్మంబు పెరిఁగిన ట్లున్నది; । వార లాతనిఁ గూల్చి వసుధఁ గొనఁగ
నిశ్చయించుట గడు నిష్ఠురత్వము; దాని । కంటెను బాపంబు గాదె మనకు

తే. సంగరంబున నాతండు సచ్చు టోర్చి । సంపదకుఁ గాఁ బెనంగిన చంద మరయఁ;
గులములం దెల్ల నీ రాచకులము సాల । బెట్టిదం; బిక్కులంబునఁ బుట్ట నగునె?' 60

ప్రతిపదార్థం: కులగురు వృద్ధున్= వంశంలో పెద్దవాడు ముసలివాడిని; నిర్మల+చిత్తున్= పరిశుద్ధమైన మనస్సు గలవాడిని; గాంగేయున్= గంగకొడుకైన భీష్ముడిని; చంపి= సంహరించి; రాజ్యంబు+చేయన్+సమ్మతించి తొడరిన= ప్రభుత్వం చేయటానికి అంగీకరించి పూనిన; పాండుపుత్రులకును= పాండవులకు; దైవంబు= అదృష్టం; తోడు+అయ్యెన్= సాయం చేసింది; ధర్మంబున్= ధర్మాన్ని; కీడుపఱిచి= చెరిచి; అధర్మంబు= అధర్మం; పరఁగి= ఒప్పి; పెరిఁగినట్లు+ఉన్నది= అభివృద్ధి చెందినట్లు ఉన్నది; పరఁగి= విలసిల్లు; వారలు= (పాండవులు); ఆతనిన్= భీష్ముడిని; కూల్చి= పడగొట్టి; వసుధన్= భూమిని; కొనఁగన్+నిశ్చయించుట= స్వీకరించాలని నిర్ణయించుకొనటం; కడున్= మిక్కిలి; నిష్ఠురత్వము= కఠినమైనవని; దానికంటెను= (పాండవులు భీష్ముడిని పడగొట్టటంకంటె); సంగరంబునన్= యుద్ధంలో; ఆతండు= (భీష్ముడు); చచ్చుట+ఓర్చి= మరణించటం సహించి; సంపదకున్+కాన్= ఐశ్వర్యం కోసం; పెనంగిన= పోరాడిన; చందము= విధం; అరయన్= చూడగా; మనకున్= మనకు (కౌరవులకు); పాపంబు+కాదె?= పాపం కదా?; ఈ రాచకులము= ఈ క్షత్రియ కులం; కులములందున్+ఎల్లన్= అన్ని కులాలలో?; చాల= మిక్కిలి; బెట్టిదంబు= క్రూరమైనది. ఈ+కులంబునన్= (ఈ రాచకొలంలో); పుట్టన్+అగునె?= పుట్టటం మంచిదా?

తాత్పర్యం: ' కౌరవవంశంలో గౌరవపాత్రుడు వయోవృద్ధుడు అయిన భీష్ముడిని సంహరించి రాజ్యం చేయాలని సంకల్పించిన పాండవులకు భగవంతుడు సాయం చేయటం వింతగా ఉన్నది. ధర్మమును అణగద్రొక్కి, అధర్మం అభివృద్ధి చెందినట్లుంది. సరే. భీష్ముడిని చంపి, రాజ్య మేలాలని చూచిన పాండవుల మాట అటుంచి, భీష్ముడుయుద్ధంలో చావడానికి ఓర్చుకొని సంపదకై పోరాడటం దానికంటె పాపం కాదా? అన్ని కులాలలో రాచకొలం మిక్కిలి కఠినమైనది. ఈ క్షత్రియకులంలో పుట్ట వచ్చునా?' అన్నాడు ధృతరాష్ట్రుడు.

వ. అని పలుమాట లాడి వెండియు. **61**

తాత్పర్యం: ఆ విధంగా పెక్కు పలుకులు పలికి, ధృతరాష్ట్రుడు మరల ఈ విధంగా మాటాడాడు.

ఆ. మగఁడు లేని మగువ మాడ్కి గాకున్నె నా । సేన భీష్ము లేమిఁ జేసి నేఁడు;
కురుకుమారు లెంత గుందిరో? యెవ్వరే । మైరొ? యింక నెట్టు లగుదు రొక్కొ! **62**

ప్రతిపదార్థం: నేఁడు= ఈ దినమునందు; నా సేన= నా సైన్యం; భీష్ము+లేమిన్+చేసి= భీష్ముడు లేకపోవటం చేత; మగఁడు, లేని, మగువ, మాడ్కి= భర్తలేని భార్యవలె (విధవవలె); కాక+ఉన్నె?= కాకుండునా?; కురుకుమారులు= కౌరవులు; ఎంత+కుందిరి+ఓ?= ఎంత దుఃఖించినారో; ఎవ్వరు+ఏమి+ఐరొ?= ఎవ్వరు ఏ విధంగా వర్తించారో; ఇంకన్= ఇకమీద; ఎట్టులు= ఏ రీతిగా; అగుదురు+ఒక్కొ!= అవుతారో గదా!

తాత్పర్యం: ఈనాడు, భీష్ముడు లేని నా సైన్యం, భర్త లేని భార్యవలె కాలేదా? ఇక కౌరవులు ఏ విధంగా దుఃఖంలో మునిగిపోయారో? ఏమయ్యారో? ఇకమీద ఏమౌతారో కదా!

క. రాజులు మంత్రులు ననియెడు । నా జూదరు లాత్మ నేమి యని తలఁచిరొ? యే
యోజం బలికిరొకో! తమ । కాజికి నిట మీఁద నెవ్వ రాధారంబో?' **63**

ప్రతిపదార్థం: రాజులు= ప్రభువులు (యుద్ధం చేసే రాజులు); మంత్రులు= రాజులకు హితవు బోధించేవారు; అనియెడు= అని చెప్పబడే ఆ జూదరులు (ఆ జూదం ఆడేటటువంటివారు); ఆత్మన్= మనస్సులో; ఏమి+అని= ఏమని; తలఁచిరొ= ఆలోచించారో; ఏ+ఓజన్= ఏ రీతిగా; పలికిరి+ఒకో= మాటాడారో గదా; తమకున్= ఆ రాజులకు, మంత్రులకు; ఆజికిన్= యుద్ధానికి; ఇటమీదన్= ఇకపై; ఎవ్వరు= ఎవరు; ఆధారంబు+ఓ?= ఆలంబనమో?

తాత్పర్యం: రాజులు (దుర్యోధన దుశ్శాసనులు) మంత్రులు (కర్ణ శకునులు) అనే జూదరులు మనసులో ఏమనుకొన్నారో? ఏ రీతిగా మాట్లాడారో? ఇక మీదట యుద్ధానికి ఆధారమెవ్వరో?

వ. అని పలికి సంజయుకరంబు విడిచి 'కయ్యం బెయ్యెడం బొడిచిరి? పది దినంబులు నుభయబలంబుల వారును నెవ్విధంబున మోహరించి? రెవ్వ రెవ్వ రెప్పు డెప్పు డేమి సేసి? రిన్నాళ్కు గాంగేయుఁ డెబ్భంగుల సంగరంబు సేసెఁ దుది నెత్తెఱంగునం దెగియె? నంతయు వివరించి పరిపాటిం దేటపడం జెప్పుము. 64

ప్రతిపదార్థం: అని పలికి= అని చెప్పి; సంజయుకరంబు= సంజయుడి చేయి; విడిచి= వదలి; కయ్యంబు= యుద్ధం; ఏ+ఎడన్=ఎక్కడ; పొడిచిరి= చేశారు. పది+దినంబులున్= పదిరోజులు; ఉభయ+బలంబులవారును= రెండు సేనలలోని వారును (కురుపాండవ సేనలలోనివారు); ఏ+విధంబునన్= ఏ రీతిగా; మోహరించిరి= వ్యూహాలు పన్నారు?; ఎవ్వరు+ఎవ్వరు= ఎవరెవ్వరు; ఎప్పుడు+ఏమి, చేసిరి?= ఎప్పుడు ఏమేమి చేశారు?; ఇన్నాళ్ళు= ఇన్నిరోజులు; గాంగేయుఁడు= భీష్ముడు; ఏ+భంగులన్= ఏవిధంగా; సంగరంబు+చేసెన్?= యుద్ధం చేశాడు?; తుదిన్= చివరకు; ఏ+తెఱంగునన్= ఏ విధంగా; తెగియెన్?= పడిపోయాడు?; అంతయున్= అంతా; వివరించి= వివరాలతో చెప్పి; పరిపాటిన్= వరుసగా; తేటపడన్= తెల్లమయ్యేటట్లుగా; చెప్పుము= చెప్పుము.

తాత్పర్యం: అని చెప్పి, ధృతరాష్ట్రుడు సంజయుడి చేతిని విడిచిపెట్టి, పిదప ఈ విధంగా ప్రశ్నించాడు. యుద్ధం ఎక్కడ చేశారు? 'ఈ పది రోజులు యుద్ధం ఏ విధంగా జరిగింది? కౌరవ పాండవ సేనలలోనివారు ఏ విధంగా వ్యూహాలు పన్నారు? ఎవ్వ రేమేమి చేశారు? ఇన్ని దినాలు భీష్ముడు ఏ విధంగా యుద్ధం చేశాడు? చివరకు ఏ విధంగా కూలిపోయాడు? అంతా సవిస్తరంగా నాకు వివరించి చెప్పుము?

విశేషం: భీష్ముడు యుద్ధభూమిలో పడిపోయిన సంగతి సంజయుడు చెప్పినపుడు - ధృతరాష్ట్రుడు మూర్ఛపోయాడు. తెప్పిరిల్లిన పిదప ఆతడు సంజయుడి చేయిపట్టుకొని దుఃఖించాడు. 57వ పద్యంలో ధృతరాష్ట్రుడు సంజయుడి చేయిపట్టుకున్నట్లు ఉన్నది 64వ పద్యంలో అతడు సంజయుని చేయి వదలినట్లు ఉన్నది. పదినాళ్ళ యుద్ధంలోని వివరాలు ధృతరాష్ట్రుడు సంజయుడికి దూరంగా కూర్చొని విశ్రాంతిగా విన్నాడు. కథాకథనంలో తిక్కన నిశితదృష్టికి ఇది ఒక చక్కని ఉదాహరణం.

ఉ. నెట్టన యాపగాసుతుఁడు నేలకు వ్రాలె ననంగ విన్న నా
కట్టిఁడి వీను లేమి వినుకాఱియ కోర్వవు? దుర్వినీతికిం
బుట్టినయిల్లనై వినక పోవఁగ వచ్చునె? యింక నాకు నే
దిట్టఁడ నైతి; నెల్లవియుఁ దెల్లముగా వివనేర్తు సంజయా!' 65

ప్రతిపదార్థం: నెట్టన= పూనికతో; ఆపగాసుతుడు= నదీనందనుడు- భీష్ముడు; నేలకున్+వ్రాలెను+అనంగన్= భూమిమీద పడిపోయాడు అని చెప్పగా; విన్న= ఆలకించిన; నా+కట్టిఁడి+వీనులు= కఠినమైన నా చెవులు; ఏమి కాఱియకున్ ఓర్వవు?= ఏ కష్టమును విన సహించవు? (ఎట్టి దుర్వార్తలు ఐనా వినగలవు); దుర్+వినీతికిన్= చెడ్డవిధానానికి; పుట్టిన+ఇల్లను+ఐ= జన్మస్థానమునై; వినక పోవఁగన్ వచ్చునె+ఇంక+నాకున్= ఇకమీద నాకు వినకుండా తప్పుతుందా?; సంజయా= ఓ సంజయా!; నే+దిట్టఁడన్+ఐతి= నేను ధైర్యవంతుడను అయినాను; అనగా నా మనస్సు గట్టిపడింది అని అర్థం; ఎల్ల+అవియున్= అన్నిటిని; తెల్లముగాన్= సుస్పష్టంగా; వినన్‌నేర్తున్= ఆలకించగలను.

తాత్పర్యం: దీక్షతో యుద్ధం చేసిన- భీష్ముడు యుద్ధభూమిలో పడిపోయాడన్న వార్త విన్న నా చెవులు ఎట్టి దుర్వార్తలనైనా వినగలవు. దుష్టమైన నీతికి నేను పుట్టినిల్లును. నా మనస్సు బండబారింది. ఓ సంజయా! నీవు వెనుకాడక, ఏ విధంగా యుద్ధం జరిగిందో- అంతా నాకు తేటతెల్లంగా తెలియచెప్పుము. సందేహించవద్దు.

వ. అనిన విని సంజయుం డతని కిట్లనియె 66

తాత్పర్యం: అనగావిని, సంజయుడు ధృతరాష్ట్రుడితో ఈ విధంగా అన్నాడు.

ఆ. అధిప! నీవు సెప్పినట్టిద; నీ యవి । నీతిఁ జేసి ధర్మనిరతు లైన
పాండుసుతుల కన్ని పాటులు వాటిల్లె; । నింత దెచ్చికొంటి వంత సేసి. 67

ప్రతిపదార్థం: అధిప!= ఓ రాజా! (ధృతరాష్ట్ర మహారాజా!); ఈవు= నీవు; చెప్పిన+అట్టిది+అ= చెప్పిన విషయం వాస్తవం; నీ+అవినీతిన్+చేసి= నీ అవినీతి చేత; ధర్మనిరతులు+ఐన= ధర్మము ఆచరించుటయందు దీక్ష గలిగినట్టి; పాండుసుతులకున్= పాండవులకు; అన్ని+పాటులు= అన్ని దురవస్థలు; పాటిల్లెన్= ఏర్పడ్డాయి; అంత+చేసి= అంత అవినీతి నీవు చేయటం చేత; ఇంత= ఈ దురవస్థ (అనగా భీష్ముడి పతనం); తెచ్చుకొంటివి= తెచ్చుకొన్నావు.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! నీవే ఒప్పుకొన్నావుగదా! నీ అవినీతి వలననే ధార్మికులైన పాండవులకు ఇన్ని బాధలు కలిగాయి. నీవు అవివేకం వలన ఇంతటి దురవస్థ తెచ్చుకున్నావు. నీది స్వయం కృతాపరాధం. నీ కర్మ నిన్ను కట్టికుడుపుతున్నది.

క. కీ డొనరించినవారికిఁ । గీ డగు టరుదయ్య? మేలు గీ డేమియు నీ
వాడక వినుఁ; ననుఁ గయ్యముఁ । జూడఁగఁ బుచ్చుట వినంగఁ జూచియ కాదే! 68

ప్రతిపదార్థం: కీడు= అపకారం; ఒనరించిన వారికిన్= చేసినవారికి; కీడు= అశుభం (నష్టం); అగుట= సంభవించటం; అరుదు+అయ్య?= అరుదా?- అరుదుకాదు- తరచుగా సంభవిస్తుంది; మేలు- కీడు+ఏమియున్= ఇది ఉపకారం; అది అపకారం అనే మాటలు; నీవు+ఆడక= నీవు చెప్పకుండా; వినుఁ(ము)= నేను చెప్పే మాటలు వినుము; ననున్= నన్ను; కయ్యమున్= యుద్ధాన్ని; చూడఁగన్+పుచ్చుట= చూడుమని పంపటం; వినంగన్+చూచియు+అ, కాదే?= వినాలనే ఉద్దేశం తోడనే కదా!

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! అపకారం చేసినవారికి తిరిగి కీడు జరిగితీరుతుంది. అది లోకంలో తరచు చూస్తూనే ఉన్నాం గదా. నీవు ఇది కీడు అది మేలు అని చెప్పకుండా (మధ్య మధ్య ఆపకుండా) నేను చెప్పే మాటలు ఆలకించుము. నీవేకదా యుద్ధం చూచి ఆ వార్తలు నీకు చెప్పుమని నన్ను నియోగించింది. (వినటానికే కదా! ఈ చెప్పటం)

క. వేదవ్యాస మునీశ్వరు । పాదంబులు దలఁచి మ్రొక్కి భక్తిరసైకా
స్వాదన సుకరానందో । ద్వాదన దివ్యమతి నగుచుఁ దగ నెఱిఁగింతున్. 69

ప్రతిపదార్థం: వేదవ్యాస, ముని+ఈశ్వరు, పాదంబులు= వేదములను వర్గీకరించి వ్యాసుడనే పేరుపొందిన గొప్ప ఋషి అడుగులు; తలఁచి= స్మరించి; మ్రొక్కి= నమస్కరించి; భక్తి+రస+ఏక+ఆస్వాదన+సుకర+ఆనంద+ఉత్పాదన+దివ్య+మతిన్+అగుచున్= భక్తి అనే 'రసము'నే ఆస్వాదించటం ద్వారా లభ్యమైన ఆనందం పుట్టే దివ్యమైన బుద్ధితో కూడినవాడను ఔతూ; తగన్= తగినట్టుగా (ఔచిత్యంతో); ఎఱిఁగింతున్= తెలుపగలను.

తాత్పర్యం: వేదవ్యాస మహర్షి శ్రీపాదాలను స్మరించి నమస్కరించి భక్తిరసమునందు ఓలలాడే బుద్ధికలవాడనై యుద్ధ వృత్తాంతం తెలుపగలను.

విశేషం: ఇది యుద్ధ కథనానికి మొదలు. భక్తి నవరసాలలో ఒకటి కాదు. ఇచ్చట 'రస' శబ్దాన్ని తిక్కన ఏ అర్థంలో వాడినట్లు? 'రసం' బ్రహ్మానంద సదృశమని ఆలంకారికుల నిర్దేశం. తిక్కనకు రస శబ్దంపై ఆనంద శబ్దంపై మక్కువ ఎక్కువ. యుద్ధ వర్ణన ఆనందదాయకం కాగలదా? రసం ఆనంద పర్యవసాయి. యుద్ధ వర్ణనకు వీరరసం ఆధారం. వీర రసోపాసనకు సంజయుడు వేదవ్యాస పాదాలను ఆలంబంగా చేసికొన్నాడు. ఇది ఉదాత్త భావ కల్పన.

వ. అనిన నాంబికేయుండు 'నట్లకాక యెటింగింపు' మనుటయు సంజయుండు. 70

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పిన; ఆంబికేయుండు= అంబికా పుత్రుడు- ధృతరాష్ట్రుడు; అట్ల+కాక= అటులే అగుగాక; ఎటింగింపుము= తెలుపుము; అనుటయున్= అని చెప్పగానే; సంజయుండు= సంజయుడు.

తాత్పర్యం: అని సంజయుడు చెప్పాడు. ధృతరాష్ట్రుడు ఆతడి మాటలు అంగీకరించి సరే చెప్పుమన్నాడు. అంతట సంజయుడు చెప్పసాగాడు.

సంజయుఁడు ధృతరాష్ట్రునకు భారతయుద్ధంబు సెప్పఁబూనుట (సం. 6-16-7)

ఉ. 'ప్రాంశుఁ బయోదనీలతనుభాసితు నుజ్జ్వల దండధారుఁ బిం
గాంశు జటాచ్ఛటాభరణు నాగమపుంజపదార్థతత్త్వ ని
స్సంశయకారుఁ గృష్ణమృగచర్మకృతాంబరకృత్యు భారతీ
వంశవివర్ధనుం ద్రిదశవందితు సాత్యవతేయుఁ గొల్చెదన్.' 71

ప్రతిపదార్థం: ప్రాంశున్= ఉన్నతుడిని; పయోద, నీల, తను, భాసితున్= మేఘంవలె నల్లనైన శరీరంచేత వెలుగొందేవాడిని; ఉజ్జ్వల, దండ, ధారున్= ప్రకాశించే దండం ధరించేవాడిని; పింగ+అంశు జటా+ఛటా+ఆభరణున్= గోరోజనం రంగు గల జడల సముదాయమనే సొమ్ములు ధరించిన వాడిని; ఆగమ, పుంజ, పద+అర్థ, తత్త్వ, నిస్సంశయకారున్= వేదాల సముదాయమునందలి పదాల యొక్క భావాల యొక్క యాథార్థ్యమును సంశయం లేకుండా నిరూపించినవాడిని; కృష్ణమృగచర్మకృత+అంబరకృత్యున్= జింక చర్మాన్ని బట్టగా చేసికొన్నవాడిని; భారతీ వంశ వివర్ధనున్= భారత రాజవంశమును వృద్ధి చేసిన వాడిని; త్రిదశ+వందితున్= దేవతలచే నమస్కరించబడినవాడిని, సాత్యవతేయున్= సత్యవతి కొడుకును; కొల్చెదన్= ఆరాధించగలను.

తాత్పర్యం: ఉన్నతుడిని, మేఘంవలె నల్లనైన శరీరకాంతితో వెలుగొందే వాడిని, ప్రకాశించే దండం ధరించే వాడిని, గోరోజనపు వర్ణంగల జడల మొత్తం ధరించిన వాడిని, వేదాలలోని పదాల భావాన్ని సంశయాలు లేకుండా నిరూపించిన వాడిని, కృష్ణాజినం వస్త్రంగా ధరించే వాడిని, భారత వంశాన్ని వర్ధిల్లేటట్లు చేసిన వాడిని, దేవతలచేత నమస్కరించబడిన వాడిని, సత్యవతి కొడుకును ఆరాధిస్తాను.

విశేషం: ఈ పద్యం వేదవ్యాసస్తుతి. తిక్కనకు సంస్కృత మహాభారత కర్త అయిన వేదవ్యాసుడిపైగల, భక్తి ప్రపత్తులు ప్రతిఫలించే పద్యం ఇది.

వ. అని పలికి పారాశర్యుం జిత్తంబున నిలిపి నమస్కరించి ధృతరాష్ట్రున కిట్లనియె. 72

ప్రతిపదార్థం: అని, పలికి= అని వచించి; పారాశర్యున్= పరాశరుడి కొడుకగు వ్యాసుడిని; చిత్తంబునన్= మనస్సులో; నిలిపి= ప్రతిష్ఠించి; నమస్కరించి= మ్రొక్కి; ధృతరాష్ట్రునకున్; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: అని చెప్పి సంజయుడు వేదవ్యాస మహర్షిని మనస్సులో ధ్యానించి, మ్రొక్కి ధృతరాష్ట్రుడితో ఈ విధంగా అన్నాడు:

క. ' వినినదియును, నెయ్యెడ నేఁ । గనినదియును, మునికృపం బ్రకాశంబై తోఁ
చిన యదియును, విశదంబుగ । వినిపించెద మొదలుకొని సవిస్తారముగన్. 73

ప్రతిపదార్థం: వినినదియును= ఆలకించినట్టిదీ; ఏ+ఎడన్= ఎచ్చట; నేన్+కనిన+అదియును= నేను చూచినట్టిదీ; ముని+కృపన్= (వేదవ్యాస) ఋషిదయ వలన; ప్రకాశంబు+ఐ, తోచిన+అదియును= తెల్లమై స్ఫురించినట్టిదీ; మొదలుకొని= యుద్ధం ఆరంభించిన సమయం నుండి; స, విస్తారముగన్= వివరాలు అన్నింటినీ కలిపి; వినిపించెదన్= నీకు చెప్పగలను.

తాత్పర్యం: అని చెప్పి సంజయుడు వేదవ్యాస మహర్షిని మనస్సులో ధ్యానించి, మ్రొక్కి ఈ విధంగా చెప్పాడు. 'నేను విన్న సంగతులు, నేను కళ్ళార చూచిన విషయాలు, వేదవ్యాస మహర్షి కృపవలన నాకు తెలిసిన అంశాలు, యుద్ధం మొదలుపెట్టినప్పటినుండి జరిగిన విశేషాలు అన్నీ నీకు వివరాలతో చెప్పగలను.

వ. ఆ రాత్రి నిన్ను వీడుకొని మన దండునకుం జని, నీ కొడుకు నగరు సముచిత ప్రకారంబునం బ్రవేశించు నప్పు
డతండు గాంగేయాది కౌరవులును దగు రాజులును బరివేష్టింపం బరిమిత స్థానంబున నుండ, నేనును
బొడసూపి,యతని యాదరణంబు వడసి కొలిచి యుండితిం; బదంపడి సమర విషయంబులైన
సంభాషణంబుల సమయంబున నమ్మేదినీశ్వరుండు దుశ్శాసనుం గనుంగొని యిట్లనియె. 74

ప్రతిపదార్థం: ఆ రాత్రి= ఆ రేయి; నిన్నున్= (ఓ ధృతరాష్ట్ర మహారాజా) నిన్ను; వీడుకొని= నీ దగ్గర సెలవు పుచ్చుకొని; మన, దండునకున్+చని= మన సైన్యం విడిసిన చోటికి వెళ్ళి; నీ కొడుకు= నీ పుత్రుని యొక్క (దుర్యోధనుని); నగరున్= అంతఃపురాన్ని; సముచిత ప్రకారంబునన్= యథావిధి (రాజమర్యాద ప్రకారం); ప్రవేశించు+అప్పుడు= చేరేటప్పుడు; అతండు= (దుర్యోధనుడు); గాంగేయ+ఆది, కౌరవులును= భీష్ముడు మున్నగు కౌరవులును; తగు రాజులును= (కొలువుకూటాన్ని ప్రవేశించే అర్హత గల) తగిన దొరలును; పరివేష్టింపన్= చుట్టూచేరియుండగా; పరిమితస్థానంబునన్+ఉండన్= రాజుగారు కూర్చుండడానికి ఏర్పాటు చేయబడిన చోటులో (కొలదిమందితో కలిసి) ఉండగా; ఏనును= నేను గూడ (సంజయుడనైన నేను); పొడ+చూపి= కన్పించి; అతని= దుర్యోధనుడి యొక్క; ఆదరణంబు+పడసి= మన్ననను పొంది, కొలిచి+ఉండితిన్= కొలువు కూటంలో కూర్చొని ఉన్నాను; పదంపడి= పిమ్మట; సమర, విషయంబులు+ఐన= యుద్ధానికి సంబంధించిన అంశాలు గల; సంభాషణంబుల సమయంబునన్= మాటాడేటప్పుడు; ఆ+మేదినీ+ఈశ్వరుండు= ఆ రాజు- దుర్యోధనుడు; దుశ్శాసనున్+కనుంగొని= దుశ్శాసనుడిని చూచి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్రా! ఆ రాత్రి నీదగ్గర సెలవు తీసికొని నేను మన సేనలు విశ్రమించిన చోటు చేరాను. నీ కొడుకు దుర్యోధనుడి నగరులోకి పోయేసరికి అతడు భీష్ముడు మొదలైన కౌరవులూ ఆంతరంగికులైన రాజులూ పరివేష్టించి ఉండగా నేను కన్పించాను. దుర్యోధన మహారాజు నన్ను మన్నించగా కొలిచి ఉన్నాను. తరువాత యుద్ధవిషయాలు మాట్లాడేటప్పుడు దుర్యోధన మహారాజు దుశ్శాసనుడితో ఈ విధంగా చెప్పాడు.

క. ' మనకుఁ బాండురాజ తనయవర్గమునకుఁ । గయ్య మయ్యెఁ; బెద్ద కాలమేని
నెదురు చూచుచుండ నొదవె నివ్విధ, మిందుఁ । బూని చేయవలయుదాని వినుము. 75

ప్రతిపదార్థం: మనకున్= (కౌరవులకును); పాండురాజ, తనయ, వర్గమునకున్= పాండవుల పక్షానికి; కయ్యము+అయ్యెన్= యుద్ధం వచ్చింది; ఏను= నేను; పెద్ద కాలము+ఏని= చాలాకాలం నుండి; ఎదురు చూచుచుండన్= ఎదురు చూస్తూ ఉండగా;

ఈ+విధము= ఈ రీతి; ఒదవెన్= ఏర్పడింది; ఇందున్= ఈ యుద్ధంలో; చేయవలయుదానిన్= కర్తవ్యాన్ని; ఆచరించ వలసినదానిని గూర్చి; వినుము= ఆలకించుము.

తాత్పర్యం: ఎంతోకాలంనుండి ఎదురు చూస్తున్న యుద్ధం మనకూ పాండవ పక్షానికీ ఈ నాటికి ఈ రీతిగా సిద్ధించింది. ఇక ఇప్పుడు మనం చేయవలసినపనిని గురించి, సాధించవలసిన కార్యం గురించి వినుము.

క. కన్నాకు మనకు భీష్ముం; । డిన్నరవరుఁ గావవలయు నెమ్మెయి నైనం;
దన్నుం గాచిన నితఁడు జ । గన్నుతముగ రణమునం బగఱ నడఁగించున్. 76

ప్రతిపదార్థం: మనకున్= మన కౌరవ సేనలకు; భీష్ముండు= భీష్ముడు; కను+ఆకు= కనురెప్పవలె రక్ష - నాయకుడు;; ఈ+నరవరున్= నరులలో శ్రేష్ముడైన ఈతడిని; ఏ+మెయిన్= ఏ రీతిగా అయినా సరే; కావవలయున్= కాపాడాలి; తన్నున్+కాచినన్= తనను రక్షిస్తే; ఇతఁడు= ఈ భీష్ముడు; జగత్+నుతముగన్= ప్రపంచం చేత ప్రస్తుతించబడే రీతిగా; రణమునన్= యుద్ధంలో; పగఱన్= శత్రువులను; అడఁగించున్= నాశం చేస్తాడు.

తాత్పర్యం: భీష్ముడు మన సేనకు ముఖ్యుడు మనకు రక్ష. శ్రేష్ముడైన ఈ వీరుడిని మనం రక్షిస్తే, ఈతడు మనలను అందరినీ రక్షిస్తాడు. అంతేకాక, యుద్ధంలో ప్రపంచం అంతా ప్రస్తుతించే విధంగా ఇతడు శత్రువులను ధ్వంసం చేస్తాడు.

విశేషం: కన్నాకు= కన్ను+ఆకు, తమలపాకు కట్టలో మొదటనుండే పెద్దఆకు అనగా అగ్రేసరుడు= శ్రేష్ముడు అని భావం.

ఆ. ఎల్లవారిఁ గాచు నితఁ డని యెప్పుడుఁ । దలఁతు; మితనిఁ గావవలయు టేమి
యని తలంచె దేని వినుఁ; మిందఱకు నిది । వినఁగవలయు నట్టి పని కుమార! 77

ప్రతిపదార్థం: కుమార!= చిన్నవాడవైన ఓ దుశ్శాసనా?; ఎల్లవారిన్= అందరినీ; ఇతఁడు= (భీష్ముడు); కాచున్= రక్షిస్తాడు అని; ఎప్పుడున్= ఎప్పుడూ; తలఁతుము= భావిస్తాము; ఇతనిన్= (భీష్ముడిని); కావన్‌వలయుట+ఏమి?= రక్షించటం ఏమిటి; అని తలంచెదు+ఏని= అని ఆలోచిస్తున్నావేమో; వినుము= ఆలకించుము; ఇందఱకున్= ఇంతమందికీ; ఇది= ఇపుడు నేను చెప్పునది; వినఁగన్ వలయున్+అట్టి+పని= వినవలసిన విషయం.

తాత్పర్యం: ఎల్లవారిని ఇతడు (భీష్ముడు) యుద్ధంలో రక్షిస్తాడని ఎప్పుడూ అనుకొంటాము గదా! అట్లాంటి ఈయనను రక్షించటమేమిటని అనుకుంటే దుశ్శాసనా! వినుము. ఇది అందరూ వినవలసినట్టి విషయం.

విశేషం: భీష్ముడు చేసిన ప్రతిజ్ఞ ప్రకారం ఆ మానవాతీతుడు ఆడవారితో పోరాడడు. అంతేగాక- ఆడంగి లేకివారితో గూడా పోరాడడు. శిఖండి ఆకృతిచేత స్త్రీ. అందుచేత భీష్ముడు ఆతడితో పోరాడడుగాని, శిఖండి భీష్ముడితో పోరాడుతాడు. బాణాలు ప్రయోగిస్తాడు. ఆడిన మాట తప్పనివాడు భీష్ముడు. సాయుధుడైన శిఖండి, నిరాయుధుడైన భీష్ముడిపై విజృంభించే అవకాశం ఉంది. జాగ్రత్త.

వ. సత్యవ్రతుం డగు నిమ్మహానుభావుండు. 78

ప్రతిపదార్థం: సత్యవ్రతుండు+అగు= ఎల్లప్పుడూ నిజమే మాటాడే దీక్షగల; ఈ+మహానుభావుండు= ఈ గొప్పవాడు (భీష్ముడు).

తాత్పర్యం: సత్యమే జీవితవ్రతంగా కలిగిన ఈ గొప్పవాడు.

క. వినుఁ డన్యు లెవ్వరును నా । మునుమునఁ బడి బ్రదుక రాలమున; నేను శిఖం
డిని నోర్వఁ జాలఁ జుండీ! । యని మన యుద్యోగవేళయప్పుడ చెప్పెన్. 79

ప్రతిపదార్థం: వినుఁడు= ఆలకించండి; అన్యులు= ఇతరులు; ఎవ్వరును= ఎవ్వరుగానీ; నా మునుమున్+పడి= నా యెదురున నిలిచి; ఆలమునన్= యుద్ధంలో; బ్రదుకరు= జీవించలేరు; ఏను= నేను; శిఖండిని; ఓర్వన్+చాలన్+చుండీ!= గెలువలేను సుమా అని; మన ఉద్యోగ వేళ= మనం (యుద్ధ) ప్రయత్నాలు చేసే సమయంలో; అప్పుడు+అ= ఆ సమయంలోనే; చెప్పెన్= చెప్పాడు.

తాత్పర్యం: మనం యుద్ధ ప్రయత్నాలు చేసే సమయంలో, ఆనాడే భీష్ముడు ఒక మాట ఖండితంగా చెప్పాడు. 'నా ముందు యుద్ధంలో ఇంకెవ్వరూ నిలువలేరు. నిలిచి యుద్ధం చేస్తే జీవించలేరు. అయితే, నేను శిఖండితో పోరాడలేను.'

ఉ. ఏమఱి రక్ష సాలని మృగేంద్రుని నక్కయుఁ గోలుపుచ్చు; సం
గ్రామములోనఁ గన్గలిగి కావక తక్కిన నా శిఖండిచే
నీ మనుజేంద్రుఁ గోల్పడమె? యిట్టిది గోల్పులి నిద్రవోవ ను
ద్దామ బలంబుమై గొఱియ దాఁకి వధించినయట్టు లుండదే. 80

ప్రతిపదార్థం: ఏమఱి= మైమరచి ఉపేక్షవహించి; రక్ష+చాలని= రక్షణ సరిపోని; మృగ+ఇంద్రునిన్= (మృగములలో శ్రేష్ఠమైన) సింహాన్ని; నక్కయున్= నక్క కూడా; కోలుపుచ్చున్= చెడగొట్టగలదు; సంగ్రామములోనన్= యుద్ధంలో; కన్+కలిగి= జాగ్రత్తగా చూస్తూ; కావక, తక్కినన్= కాపాడటం మానివేస్తే; ఆ+శిఖండిచేన్= ఆ శిఖండిచేత; ఈ+మనుజ+ఇంద్రున్= మనుజులలో శ్రేష్ఠుడైన ఈ భీష్ముడిని; కోల్పడమె?= పోగొట్టుకోమా?; ఇట్టిది= ఇటువంటిది; కోల్+పులి= పెద్దపులి; నిద్ర+పోవన్= నిదురిస్తూ ఉండగా; ఉత్+దామ+బలంబుమైన్= అరికట్టలేని శక్తితో; గొఱియ= గొర్రె; తాఁకి= ఎదిరించి; వధించిన+అట్టులు= చంపివేసినట్లు; ఉండదే= ఉండదా?

తాత్పర్యం: ఏమరి రక్షణచాలని సింహాన్ని నక్కసైతం చంపుతుంది. జాగ్రత్తగా కనులు మూయకుండా భీష్ముడిని కాపాడాలి. లేకపోతే శిఖండిచేత ఈ మహావీరుడు నిర్జింపబడవచ్చును. పెద్దపులి నిదురిస్తూ ఉండగా, గొర్రె వచ్చి పైబడి పెద్దపులినే సంహరించినట్లు ఔతుంది.

క. కావున నీ యుద్ధటరథి । కావలి నివ్విభునిఁ గాచునట్లుగఁ బనుపం
గావలయు మీర లందఱు । నేవలఁ జూచిన శిఖండి కెదురుం డెపుడున్.' 81

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; ఈ+ఉద్భట+రథిక+ఆవలిన్= గొప్పవీరులైన ఈ రథికుల సమూహాన్ని; ఈ+విభునిన్= ఈ నాయకుడిని (భీష్ముని); కాచున్+అట్లుగన్= కాపాడేటట్లుగా; పనుపంగాన్ వలయున్= ఏర్పాటు చేయాలి; మీరలు+అందఱున్= మీరందరూ; ఏవలన్+చూచినన్= ఏవైపు చూచినా; ఎపుడున్= ఎల్లప్పుడు; శిఖండికిన్= శిఖండికి; ఎదురుండు= ఎదిరి పోరాడండి.

తాత్పర్యం: కాబట్టి గొప్పవీరులైన ఈ రథికులగుంపును నాయకుడైన భీష్ముని రక్షించడానికి పంపాలి. మీరందరూ ఏ వైపు చూచినా ఎప్పుడూ శిఖండిని ఎదిరించండి.

వ. అని నియమించి కొలువు విరిసి చని యుచిత విధంబున నుండె; నంతఁ బ్రభాతం బగుటయు నమ్మహీపతి పడవాళ్యం బనిచి బలుమానిసులను బలంబులను బవరంబునకు వెడల నియోగించిన, శంఖ దుందుభి ప్రముఖ మంగళ తూర్య నిస్వనంబులను నయ్యెసాధనంబులు సమకట్ట సముచిత పరివారంబునకుంజెప్పెడు దొరల పలుకుల గంభీర నాదంబులను, గట్టుమట్లు కదలఁ దిగిచినం జెలంగు కరితురంగంబుల బృంహిత హేషిత ఘోషంబులను బూన్పం దిగుచు రథంబుల నేమిస్వనంబులను, బెలుచ నొండొరులం బిలుచు

పదాతుల యెలుంగుల విపులధ్వనులనుం, బేర్చిన మహారవంబున శిబిరంబు చంద్రోదయ ఘూర్ణమాన మహార్ణవంబును గ్రేణి సేయుచుండ సూర్యోదయంబైన సైన్యంబులు సెలంగుచు వెడలునప్పుడు. 82

ప్రతిపదార్థం: అని+నియమించి= అని చెప్పి, ఏర్పాటు చేసి; కొలువు+విరిసి= కొలువు చాలించి; ఉచిత+విధంబునన్+ఉండెన్= తగిన రీతిని ఉన్నాడు; అంతన్= పిదప; ప్రభాతంబు+అగుటయున్= తెల్లవారుటచేత; ఆ+మహీపతి= ఆ రాజు- దుర్యోధనుడు; పడవాళ్ళన్+పనిచి= చిన్న దండనాథులను ఆజ్ఞాపించి; బలుమానిసులను= బలముకల మనుష్యులను, సేనకు ముందు నడిచేవారిని; బలంబులను= సేనలను; బవరంబునకున్= యుద్ధానికి; వెడలన్= వెళ్ళటానికి; నియోగించినన్= ఆజ్ఞాపించగా; శంఖ+దుందుభి+ప్రముఖ+ మంగళ+తూర్య+నిస్వనంబులను= శంఖాలు దుందుభులు, మొదలైన శుభప్రదమైన వాద్యాల ధ్వనులు; అయ్యెన్= ఆయా; సాధనంబులు= పరికరాలు; సమకట్టన్= సిద్ధం చేయటానికి; సముచిత+పరివారంబునకున్= తమ తమ అనుచరులకు; చెప్పెడు= ఆజ్ఞాపించే; దొరల+పలుకుల= ప్రభువుల వాక్యాల; గంభీర+నాదంబులు= ఠీవితో కూడిన శబ్దాలు, కట్టుమట్లు= ఉండేచోటులు; కదలన్+తిగిచినన్= కదిలేటట్లు లాగగా; చెలంగు= ధ్వనించే; కరి+తురంగంబుల= ఏనుగుల గుర్రాల; బృంహిత+హేషిత+ ఘోషంబులును= ఘీంకారముల, సకిలింపుల పెద్ద ధ్వనులు; పూన్పన్+తిగుచు రథంబులనేమి స్వనంబులును= కట్టటానికి ఆయత్తం చేసే రథచక్రాల ధ్వనులూ; పెలుచన్= పెద్దగా; ఒండు+ఒరులన్= ఒకరిని ఒకరు, పిలుచు= రమ్మని కేకలు వేసే; పదాతుల+ఎలుంగుల= కాలిభటుల కంఠస్వరముల; విపుల+ధ్వనులన్+పేర్చిన= సంకుల నినాదాలతో అతిశయిల్లిన; మహా+రవంబునన్= పెద్ద సంకులశబ్దంచేత; శిబిరంబు= యుద్ధభూమి దరి వేసిన డేరా; చంద్ర+ఉదయ, ఘూర్ణమాన, మహా+అర్ణవంబును= చంద్రుడు ఉదయించే సమయంలో తిరుగుడుపడే గొప్ప సముద్రాన్ని; క్రేణి+చేయుచుండన్= పరిహసించే విధంగా ఉండగా; సూర్య+ఉదయంబు+ఐనన్= ప్రొద్దు పొడువగా (సూర్యుడు ఉదయించగా); సైన్యంబులు= సేనలు; చెలంగుచున్= ధ్వనిచేస్తూ; వెడలు+అప్పుడు= వెళ్ళే సమయంలో.

తాత్పర్యం: అని ఏర్పాట్లు చేసి, కొలువు చాలించి, వెళ్ళి తగిన రీతిని ఉన్నాడు. అంతట తెల్లవారింది. దుర్యోధనుడు చిరుదండనాథులను బలముగల వారినీ సేనలను యుద్ధభూమికి తరలించండని నియోగించాడు. శంఖాలు దుందుభులు మున్నగు వాద్యాలు మ్రోగాయి. అంతవరకు నిశ్శబ్దంగా ఉన్న ఆ మైదానాలలో పెద్ద గోల గందరగోళం ఏర్పడింది. దొరలు తమ తమ పరివారాలకు ఆజ్ఞలు ఇస్తున్నారు. ఏనుగులు గీపెట్టుతున్నవి. గుర్రాలు సకిలిస్తున్నవి. కదిలే రథాల చక్రాలు ఘోషిస్తున్నవి. భటులు ఒకరినొకరు రమ్మని పిలుస్తున్నారు. ఇన్ని స్వరాలు ఇన్ని శబ్దాలు కలిస్తే, చంద్రోదయ సమయంలో ఘోషించే సముద్రంవలె సేనా శిబిరం కన్పించింది. అంతట సూర్యోదయమయింది. సైన్యాలు ఉత్సాహంతో బయలుదేరేటప్పుడు-

విశేషం: బృంహితం ఏనుగు ఘీంకారానికి మాత్రమే పరిమితమైన శబ్దం. హేష: గుర్రం చేసే సకిలింపునకు మాత్రమే వాడబడేశబ్దం.

తే. కనకభూషణజాలంబుకతన గజము । లెరవళులు పోవు కొండల నెనసి యొప్పె;
వల్గనంబుల హేషలవలన నబ్ధి । ఘనతరంగంబు లనఁ దురంగములు వొలిచె. 83

ప్రతిపదార్థం: కనక, భూషణ, జాలంబు, కతనన్= బంగారు ఆభరణ సముదాయాల కారణంగా; గజములు= ఏనుగులు; ఎరవళులు+పోవు= కార్చిచ్చులతో కూడిన; కొండలన్= పర్వతాలను; ఎనసి+ఒప్పెన్= పోలి కన్పించాయి; వల్గనంబులన్= ఏకగతి వేగంలో నడవటం వలన; హేషలవలనన్= సకిలింతలచేత; అబ్ధి, ఘన, తరంగంబులు+అనన్= సముద్రంలోని పెద్ద కెరటాలు అనేటట్లుగా; తురంగములు= గుర్రాలు; పొలిచెన్= వెలుగొందాయి.

తాత్పర్యం: బంగారు ఆభరణాలు ఉండటం చేత ఏనుగులు మంటలు చెలరేగిన కొండలవలె కన్పించాయి; అడుగులు క్రమబద్ధంగా వేస్తూ నడవటం చేత సకిలింతల చేత గుర్రాలు సముద్రంలో చెలరేగే పెద్ద పెద్ద కెరటాలవలె భాసించాయి.

విశేషం: 1. వల్గనం: గుర్రం నడక. ఆ నడకలో ఒక వేగం కాళ్ళు ముందుకు పెట్టి దూకుడుగా నడవటం. ఇది పరుగెత్తటం కాదు, వల్గనం అనే శబ్దం ఒకానొక అశ్వగతికి మాత్రమే వాడబడుతుంది. అట్లే హేష - గుర్రం చేసే సకిలింపు సవ్వడికి మాత్రమే వాడబడుతుంది.

క. అరదములు సవరణలతోఁ । బరపై యొక్కొక్క యూరి పరపున నరిగెం
బరుసని పలుకుల నాకృతి । పరుషత నసురాలివోలె భటతతి మెఱసెన్. **84**

ప్రతిపదార్థం: అరదములు= రథాలు; సవరణలతోన్= అలంకారాలతో; పరపు+ఐ= నిడివిగలట్టివై; ఒక్కొక్క= ఒక ఒక; ఊరి+పరపునన్= విస్తరించిన గ్రామం వలె; అరిగెన్= వెళ్ళాయి; భటతతి= భటుల సమూహం; పరసని పలుకులన్= కఠోరమైన మాటలచేత; ఆకృతి పరుషతన్= ఆకారముల కర్కశత్వముచేత; అసుర+ఆళి+పోలెన్= రాక్షసుల గుంపువలె; మెఱసెన్= వెలుగొందింది.

తాత్పర్యం: సవరణలతో గూడిన రథాలు మిక్కుటమై ఒక్కొక్క ఊరు కదలిపోతున్నదా అన్నట్లు వెళ్ళాయి. పరుషవాక్యాలతో, కఠినాకారాలతో రక్కసుల గుంపువలె, భటులగుంపు వెలుగొందింది. అనగా విస్తరించిన గ్రామాలవలె, రథాలు అలంకరింపబడిన గుర్రాలతోపాటు కదలి వెళ్ళాయి.

వ. అట్టియెడ. **85**

తాత్పర్యం: ఆ సమయంలో.

మ. పరిధానంబును దేరు నశ్వములుఁ జాపంబుం బరిస్ఫీత వ
జ్రరుచివ్యాప్త సువర్ణతాళమయ చంచత్కేతువున్ వర్మముం
గర మొప్పం దెలుపారు వెల్గొడుగుతో గంగాసుతుం డా సుధా
కరుఁడుంబోలె వెలింగె దర్ప మెసఁగం గౌరవ్యసైన్యాబ్ధికిన్. **86**

ప్రతిపదార్థం: పరిధానంబును= (ధరించిన) వస్త్రాలు; తేరున్= రథం; అశ్వములున్= గుర్రాలు; చాపంబున్= ధనుస్సు; పరిస్ఫీత, వజ్ర, రుచి, వ్యాప్త, సువర్ణ, తాళమయ, చంచత్, కేతువున్= అధికమైన వజ్రాల కాంతితో ప్రకాశించే బంగారు తాడిచెట్టుతో కూడి కదలి ఆడే జెండా; వర్మమున్= కవచం; కరము+ఒప్పన్= మిక్కుటంగా విలసిల్లగా; తెలుపారు= తెల్లనైన; వెల్గొడుగుతోన్= తెల్లని ఛత్రంతో; గంగాసుతుండు= గంగకొడుకు= భీష్ముడు; కౌరవ్య, సైన్య+అబ్ధికిన్= కౌరవుల సేన అనే సముద్రానికి; ఆ+సుధాకరుఁడున్+పోలెన్= ఆ చంద్రుడివలె; దర్పము+ఎసఁగన్= గర్వం,ఠీవి విలసిల్లగా; వెలింగెన్= ప్రకాశించాడు.

తాత్పర్యం: సేనాపతి అయిన భీష్ముడు కౌరవసేన అనే సముద్రానికి చంద్రునివలె ఒప్పారినాడు. భీష్ముడికి చెందిన అంశాలు అన్నీ విలక్షణాలైనవే. ఆతడి ఆహార్యం- ధరించిన వస్త్రాలు నిగనిగలాడిపోతున్నాయి. రథమా? అది సేనాధిపతి రథం అనిపిస్తున్నది. ఇక ఆ రథానికి కట్టిన గుర్రాలు, కదం త్రొక్కుతున్నవి. ధనుస్సు - వజ్రాలు పొదగబడి వెలుగొందుతున్నది. జెండా బంగారు తాడిచెట్టుతో రెపరెపలాడుతున్నది. కవచం కాంతులీనుతున్నది రథంపై తెల్లగొడుగు ప్రకాశిస్తున్నది.

విశేషం: తెలుపారు వెల్గొడుగుతో= తెల్లనగు తెల్లని గొడుగుతో అని తిక్కన వ్రాస్తారా? అనే సందేహం విజ్ఞులకు కల్గవచ్చు. కాని అన్ని పుస్తకాలలో ఇలాగే ఉన్నది. తెలుపారునకు బదులు పొలుపారు వెల్గొడుగుతో అన్నప్పుడు ఈపునరుక్తి దోషం పరిహారమౌతుంది.

సీ. కాంచనమయ వేదికా, కనత్కేతనో । జ్జ్వల విభ్రమం బొప్పఁ గలశజుండుఁ,
గనక గోవృషసాంద్ర కాంతి కాంతధ్వజ । విభవ విలాసంబు వెలయఁ గృపుఁడుఁ,
మణిసింహ లాంగూల మహితకేతుప్రభా । స్ఫురణంబు మెఱయంగ గురుసుతుండు,
రత్నశిలారశ్మి రాజిత కదళికా । మహిమ శోభిల్లంగ మద్రవిభుఁడు

తే. వెడలి తమ తమ చతురంగ వితతు లెల్ల । నుచిత గతి నూల్కొనంగఁ జేయుచుఁ గడంగి
సంగరోత్సవ సంభృతోత్సాహు లగుచు । నగుచుఁ దగుమాట లాడుచు నడచి రెలమి. 87

ప్రతిపదార్థం: కాంచన మయ, వేదికా, కనత్+కేతన+ఉజ్జ్వల, విభ్రమంబు+ఒప్పన్= బంగారుతో నిర్మించబడిన అరుగుతో ప్రకాశించే జెండా యొక్క వైభవం విలసిల్లుతుండగా; కలశజుండు= ద్రోణుడు; కనక+గోవృష+సాంద్ర+కాంతి+కాంత+ధ్వజ+విభవ+విలాసంబు= బంగారు ఆబోతు యొక్క దట్టమైన వెలుగులచేత ప్రకాశించే జెండా వైభవం యొక్క విలాసం; వెలయన్= విలసిల్లగా; కృపుఁడు= కృపాచార్యుడు; మణి, సింహ, లాంగూల, మహిత, కేతు, ప్రభా, స్ఫురణంబు= మణులచేత నిర్మించబడిన సింహంతోకతో గొప్పదైన జెండా కాంతుల అతిశయము; మెఱయంగన్= మిరుమిట్లు గొల్పగా; గురుసుతుండు= (ఆచార్యుడి పుత్రుడైన) అశ్వత్థామ; రత్న, శిలా, రశ్మి, రాజిత, కదళికా, మహిమ= రత్నాల రాళ్ళ వెలుగులతో భాసించే అరటిచెట్టు గొప్పదనం; శోభిల్లంగన్= విలసిల్లగా; మద్రవిభుఁడు= మద్రదేశరాజు- శల్యుడు; వెడలి= వెళ్ళి; తమ తమ, చతురంగ, వితతులు+ఎల్లన్= తమకు తమకు, సంబంధించిన (రథ, గజ, తురగ, పదాతి సమూహాలు అన్నీ); ఉచిత రీతిన్= తగు విధంగా; నూల్కొనంగన్+చేయుచున్= పురికొలుపుతూ; సంగర+ఉత్సవ+సంభృత+ఉత్సాహులు+అగుచున్= యుద్ధపు పండుగలో నిండిన ఉత్సాహం కలవారు ఔతూ; నగుచున్= నవ్వుకొంటూ; తగు, మాటలు+ఆడుచున్= తగిన పలుకులు పలుకుతూ; ఎలమిన్= సంతోషంతో; నడచిరి= వెళ్ళారు.

తాత్పర్యం: ద్రోణాచార్యులవారు స్వీకరించిన జెండా బంగారంతో నిర్మింపబడిన వేదిక (యజ్ఞం ఆస్థానం) కృపాచార్యుల వారి జెండా పసిడి వన్నె చిన్నెలుగల గొప్ప ఆబోతు చిహ్నం గలది. అశ్వత్థామ జెండాపై వెలుగొందే గుర్తు మణి నిర్మితమైన సింహం తోక. రత్నాలు పొదిగి అమర్చిన అరటిచెట్టు మద్రరాజు అయిన శల్యుడి జెండాపై వెలుగొందుతుంది. ద్రోణుడు, కృపుడు, అశ్వత్థామ, శల్యుడు వారి వారి జెండాలు ఆకాశంలో మిరుమిట్లుగొలుపుతూ వెలుగొందుతుండగా చతురంగ బలాలతో కదలి ఉత్సాహ సంభరితులై యుద్ధభూమికి తరలి వెళ్ళారు పరిహాస వచనాలు వెదజల్లుకొంటూ.

విశేషం: 1. కలశజుడు= కలశంలో పుట్టినవాడు. ఇరవై శతాబ్దిలో 'కలశజుడిని' ఉత్పత్తి చేయాలనే ప్రయత్నాలు జరుగుతున్నవి. ద్రోణుడు స్త్రీ పురుష సంగమం వలన ఉద్భవించినవాడు కాడట. 'కలశజుడు'. ఈ భావన ప్రాచీనతమ కావ్యమైన సంస్కృత మహాభారతంలోకి ఎట్లా చొరబడింది? ఇది భావి పరిశోధనల వలన తేలవలసిన అంశం.

2. అలనాటి వీరులు పతాకా ప్రియులు. దూరం నుండి జెండా చూచి ఆ రథంలో ఉన్న వీరుడిని గుర్తించగలిగేవారు.

3. వీరులు - నవ్వుతూ ఆడుతూ పాడుతూ, వినోదకేళీ విహారానికి వెళ్ళేటట్లు యుద్ధభూమికి వెళ్ళేవారట!

క. సమరక్రీడా సన్నా । హము లొప్పఁగఁ దక్కఁ గలుగునట్టి దొరలు ద
ర్పము పల్లవింప వెడలిరి । తమ తమ కేతువులు గ్రాల ధరణీనాథా! 88

ప్రతిపదార్థం: ధరణీనాథా!= ఓ రాజా! ధృతరాష్ట్ర మహారాజా; సమర, క్రీడా, సన్నాహములు+ఒప్పఁగన్= యుద్ధం అనే ఆటకు చేయవలసిన ప్రయత్నాలు అన్నీ వర్ధిల్లుతుండగా; తక్కు+కలుగు+అట్టి, దొరలు= మిగిలిన ప్రభువులు; దర్పము= ఆటోపం;

పల్లవింపన్= చిగురించగా; తమ తమ కేతువులు= తమ తమ జెండాలు; క్రాలన్= మిరుమిట్లు గొలుపుతూ వెలుగొందగా; వెడలిరి= వెళ్ళారు (యుద్ధభూమికి బయలుదేరి నడిచారు).

తాత్పర్యం: సమర క్రీడా సన్నాహంతో మిగిలిన దొరలు యుద్ధభూమికి తమ తమ గొప్పదనం చూపిస్తూ పటాటోపంతో తమ జెండాలు మిరుమిట్లు గొలిపి వెలుగులు వెలారుస్తూ ఉండగా బయలుదేరి వెళ్ళారు.

విశేషం: 1. యుద్ధమును, సంస్కృతభారతంలో తిక్కన తెలుగు భారతంలో 'క్రీడ' గ అభివర్ణించటం కనిపిస్తుంది. యుద్ధం ఒక ఆట, వినోదం ఎట్లా అవుతుంది? అని నవీనులు ప్రశ్నించవచ్చును. అయితే- ఆనాటి వారు యుద్ధాన్ని మారణహోమం క్రింద పరిగణించలేదు. అయితే అది హత్యాకాండ కూడా కాదు. వీరుడు హంతకుడు కాడు. యుద్ధం రమణీయ భయానకమైన ఆట. 'మధ్యవర్తి' (రిఫరీ) లేనట్టి క్రీడా విశేషం. వీరుడును, చంపవచ్చును, లేక చావవచ్చు అక్కడ ముఖ్యమైన అంశం.

2. యుద్ధంలో రంగురంగుల జెండాలు కన్నుల పండువుగా రెపరెపలాడేవి. ప్రతివీరుడూ ప్రత్యేకమైన జెండా ఎన్నుకొనేవాడు. ఆ జెండాను, దూరం నుండి చూచి ఆ రథం ఏవీరుడిదో చెప్పగలిగేవారు. బహుశః రంగు రంగుల జెండాలు, గుర్రాలకు, ఏనుగులకు చేసిన ఆహార్యాలు యుద్ధ బీభత్సాన్ని భటులు మానసికంగా భావింపగలిగేటట్లు చేసేవి.

వ. వా రెవ్వ రంటేని వినుము. **89**

ప్రతిపదార్థం: వారు= (ఆ విధంగా యుద్ధభూమికి బయలు వెడిలినవారు); ఎవరు+అంటి(వి)+ఏని= ఎవరని ప్రశ్నిస్తే; వినుము= వినుము.

తాత్పర్యం: వా రెవ రంటావా? చెప్పుతాను వినుము.

క. కల్పితదృఢచతురంగా । నల్పం బై గండు మిగిలి యాదవబల మా
కల్పోజ్జ్వలతఁ గొలువ నవి । కల్పుఁడు గృతవర్మ సనియె గాఢస్ఫూర్తిన్. **90**

ప్రతిపదార్థం: కల్పిత+దృఢ+చతురంగ+అనల్పంబు+ఐ= ఏర్పాటు చేయబడిన శక్తిగల (రథ గజ అశ్వపదాతులను) నాలుగు అంగాలతో గొప్పదై; గండు మిగిలి= పరాక్రమంతో అతిశయించి; యాదవ+బలము= యాదవజాతికి చెందిన సైన్యం; ఆ కల్ప+ఉజ్జ్వలతన్= ధగధగ మెరిసే ఆహార్యంతో; కొలువన్= పరివారమై వెంటరాగా; అవికల్పుఁడు= మొక్కవోని పరాక్రమం కలవాడు- కృతవర్మ; గాఢస్ఫూర్తిన్= మిక్కిలి దర్పంతో వెలుగొందుతూ; చనియెన్= (యుద్ధభూమికి) వెళ్ళాడు.

తాత్పర్యం: కృతవర్మ మొక్కవోని పరాక్రమంగల మహావీరుడు. అతడి పరివారమైన యాదవ సైన్యం రథ, గజ, తురగ, పదాతులలో మిక్కిలి దృఢమైనది. ఆ భటుల ఆహార్యం, ధరించిన దుస్తులు మిల మిల మెరిసిపోతూ కన్పిస్తున్నవి. ఆతడు ఆ ప్రచండ సేనా సమూహంతో యుద్ధభూమికి కదలి వెళ్ళాడు.

విశేషం: యాదవులలో ప్రముఖుడు శ్రీకృష్ణుడు పాండవుల పక్షంలో ఉన్నాడు. కృతవర్మ యాదవుడే అయినప్పటికీ కృష్ణుడితో పాటు చేరలేదు. అంతేకాక అతడికి శ్రీకృష్ణుడిపైగల ద్వేషమే దుర్యోధనుడి యెడగల ప్రేమకంటె హెచ్చు. శత్రువునకు శత్రువు తనకు మిత్రుడు అనే రాజనీతి చొప్పున కృతవర్మ కౌరవ పక్షం వహించాడు. మహాభారత యుద్ధం జరిగిన తర్వాత, కౌరవ సేనలో చావక మిగిలిన వారు - రథికత్రయం, కృతవర్మ, కృపాచార్యుడు, అశ్వత్థామ. మహాభారత యుద్ధానంతరం కూడ ఆ విద్వేషాలు సమసిపోలేదు. సుమారు ముప్పదిఆరు సంవత్సరాల పిదప యాదవులలో అంతఃకలహాలు చెలరేగాయి. పాండవ పక్షాన పోరాడిన సాత్యకి, దుర్యోధన పక్షాన పోరాడిన కృతవర్మ ఆ అంతఃకలహంలో మరణించారు.

క. రథములు దఱచై చెలువగు । పృథుసైన్యముతోడ బంధుబృందముఁ దానుం
బ్రథనోత్సుకవృత్తి మహా । రథుఁడు జయద్రథుఁడు వొలిచెఁ బ్రస్ఫురితగతిన్. 91

ప్రతిపదార్థం: రథములు= రథాలు; తఱచు+ఐ= మిక్కిలి దట్టమై; చెలువు+అగు= అందంగా కనిపించే; పృథుసైన్యము తోడన్= పెద్ద సేనతో; బంధు+బృందము= చుట్టాల సమూహం; తానున్; ప్రథన+ఉత్సుక+వృత్తిన్= యుద్ధం చేయాలనే ఉత్సాహంతో; జయద్రథుఁడు (సైంధవుడు - సింధు దేశాధిపతి)= జయద్రథుడునే పేరుగల; మహారథుఁడు= గొప్ప రథికుడు, మహావీరుడు; ప్రస్ఫురిత గతిన్=ప్రకాశించే నడకతో; పొలిచెన్= వెలుగొందాడు.

తాత్పర్యం: సింధుదేశాధిపతి మహావీరుడు జయద్రథుడు తాను తన చుట్టాలతో కలిసి, క్రిక్కిరిసిన రథాలతో కూడి సుందరంగా భాసించే సైన్యంతో యుద్ధం చేయాలనే ఉత్సాహంతో బయలుదేరి వెళ్ళాడు.

విశేషం: 'మహారథుడు' వాచ్యార్థం గొప్ప రథం కలవాడు. అయితే మహాభారత కాలంలో వీరుల వర్గీకరణం గమనించ దగింది. 'రథికుడు' ఒక సేనాంగానికి అధినేత. అతడికి బాసటగా చతురంగ బలాలు (రథ గజ తురగ పదాతులు) ఉంటాయి. రథానికి చక్రరక్షకులు ఉంటారు. అనేక రథికులకు నాయకుడు మహారథుడు. అంతకుమించిన సైన్యం గలవాడు అతిరథుడు. అంతకంటె గొప్పవాడు అతిరథశ్రేష్ఠుడు.

మ. చలదుర్వీధరలీలఁ గ్రాలు మదవత్సామోద్భవస్తోమ మ
గ్గలమై యేచిన సేన లొప్పఁగ దిశల్ గంపింప విందానువిం
దులుఁ గాళింగ మహీవిభుండు భగదత్తుండున్ భవత్సేనయో
ధులకుం గన్నుల పండువై నడచి రుత్తుంగాంగ సంరంభులై. 92

ప్రతిపదార్థం: చలత్+ఉర్వీధర+లీలన్= నడిచే కొండలవలె; క్రాలు= వెలుగొందే; మదవత్+సామోద్భవ, స్తోమము= దానజలధారలుగల ఏనుగుల గుంపులు; అగ్గలము+ఐ= అతిశయించి; ఏచిన= విజృంభించిన; సేనలు= సైన్యాలు; ఒప్పఁగన్= విలసిల్లగా; దిశల్= దిక్కులు; కంపింపన్= కదలగా; వింద+అనువిందులు= విందుడు, అనువిందుడు అనేవారు (అన్నదమ్ములు); కాళింగ+మహీవిభుండు= కళింగ దేశం పరిపాలించే రాజు; భగదత్తుండున్= భగదత్తుడును; భవత్+సేన+యోధులకున్= నీ సేనలలోని వీరులకు; కన్నుల+పండువు+ఐ= చూడటానికి అందంగా; ఉత్తుంగ+అంగ+సంరంభులు+ఐ= ఎత్తైన దేహాల సంరంభం కలవారలై; నడచిరి= వెళ్ళారు.

తాత్పర్యం: నీ సేనలలోని వీరులు అందరూ కన్నుల పండువుగా చూస్తూ ఉండగా, విందుడు అనువిందుండు అనే రాజ సోదరులు, కళింగరాజు భగదత్తుడు, నడచే కొండలవలె భాసించే ఏనుగుగుంపులతో పొంగారే ఉత్సాహంతో యుద్ధభూమికి బయలుదేరి వెళ్ళారు.

విశేషం: 1. మదించిన ఏనుగుల కుంభస్థలం నుండి పరిమళ పూరితమైన మదజలం స్రవిస్తూ ఉంటుందని కవులు వర్ణించారు.

2. విందానువిందులు, కళింగ ప్రభువు, భగదత్తుడు మత్తేభయూథాలకు ప్రసిద్ధి చెందినవారు. వారు అంగసౌష్ఠవం గల ఆజానుబాహులు. భగదత్తుడి ఏనుగు పేరు సుప్రతీకం.

3. మహాభారత సంగ్రామం - సమకాలీన వీరులకు తమ పరాక్రమ ప్రాభవాలు ప్రదర్శించుకొనేందుకు అవకాశం కల్పించింది. అక్కడ ముఖ్యమైనని జయాపజయాలు కాదు. తమ తమ పరాక్రమ ప్రదర్శనమే. కళింగదేశం పౌరాణిక కాలంలోనేకాక చారిత్రక కాలంలో గూడ ఏనుగులకు ప్రసిద్ధి కెక్కింది. కళింగరాజు 'గజపతి'గా చరిత్రలో సుప్రసిద్ధుడు.

క. కొడుకులుఁ దమ్ములు గుఱ్ఱపు । దడములుఁ బెక్కైన బలవితానముఁ దగుమై
నడపించుచు మెలుపున సం । గడములతో నరుగు శకుని గడు నొప్పారెన్. 93

ప్రతిపదార్థం: కొడుకులున్= పుత్రులు; తమ్ములున్= తనకంటె వయస్సులో చిన్నవారైన సోదరులు; గుట్టపు దడములు= అశ్వసేనలు; పెక్కు+అయిన+బలవితానము= ఎక్కువ అయిన సేనాసమూహం; తగుమైన్= తగినట్లుగా, క్రమబద్ధంగా; నడపించుచున్= వెడల చేస్తూ; మెలుపునన్= ఒడుపుతో; సంగడములతోన్= స్నేహితులతో; అరుగు= వెడలే; శకుని= శకుని (దుర్యోధనాదుల మేనమామ); కడున్= ఎక్కువగా; ఒప్పారెన్= వెలుగొందాడు.

తాత్పర్యం: తన కొడుకులతో, గుర్రపు దళాలతో; పెద్ద సైన్యంతో - క్రమబద్ధంగా నడిపిస్తూ, సపరివారంగా యుద్ధభూమికి వెడలే శకుని వెలుగొందాడు.

విశేషం: శకుని గాంధార దేశాధిపతి. జూదం ఆటలో గడుసరి. దుష్టచతుష్టయంగా ప్రసిద్ధికెక్కిన వారు (దుర్యోధనుడు, దుశ్శాసనుడు, శకుని, కర్ణుడు), గాంధార దేశం గుర్రాలకు పేరు కెక్కింది. గుర్రాల నడక క్రమబద్ధంగా భాసిస్తుంది.

మ. తనతోఁ గాల్వురు సాలఁ గల్గు బలసంతానంబుతోఁ బ్రీతిఁ బు
త్రుని వీరోత్తము సోమదత్తు విలసద్దోర్దర్ప దుర్దాంతుఁ బౌ
త్రుని భూరిశ్రవసుం గనుంగొనుచు నింద్రుం గ్రేణి సేయంగ నే
చిన పెంపొప్పఁగ బాహ్లికుం డరిగె నిశ్చింతంబునం బోరికిన్. 94

ప్రతిపదార్థం: తనతోన్= తనకు తోడుగా (బాహ్లికుడికి బాసటగా); కాల్వురు= పదాతి భటులు; చాలన్= మిక్కుటంగా; కల్గు= ఉన్న; బల+సంతానంబుతోన్= సేనల సమూహాలతో; ప్రీతిన్= ఇష్టంగా; పుత్రుని= కొడుకును; వీర+ఉత్తమున్= శూరులలో గొప్పవాడైన; సోమదత్తున్= సోమదత్తుడు అనే పేరుగలవాడిని; విలసత్+దోఃదర్ప+దుర్దాంతున్= ప్రకాశించే భుజపరాక్రమంయొక్క ఆటోపం చేత దుస్సహుడు అయిన వాడిని; పౌత్రునిన్= కొడుకు కొడుకును; భూరిశ్రవసున్= భూరిశ్రవసుడు అనే పేరుగల వాడిని; కనుంగొనుచున్= చూస్తూ; ఇంద్రున్= వేల్పుదొరను (స్వర్గలోకాధిపతిని); క్రేణి+చేయంగన్+ఎంచిన= పరిహసింప జాలిన; పెంపు+ఒప్పఁగన్= గొప్పదనము విలసిల్లగా; బాహ్లికుండు= బాహ్లికుడు; పోరికిన్= యుద్ధానికి; నిశ్చితంబునన్= జంకులేకుండగా; అరిగెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: మిక్కుటమైన కాల్బలముగల సైన్యంతో బాహ్లికుడు వీరోత్తముడైన కుమారుడు సోమదత్తునితో, ప్రకాశించే భుజపరాక్రమాటోపంచేత అణచరానివాడైన తన మనుమడు భూరిశ్రవునితో-దేవేంద్రుని పరిహసించగల గొప్పతనంతో యుద్ధభూమికి నిశ్చింతగా వెళ్ళాడు.

విశేషం: 1. బాహ్లికుడు యుద్ధానికి వెళ్ళటాన్ని తిక్కన ఒక చక్కని చిక్కని మత్తేభవృత్తంలో వర్ణించాడు. మహాభారత సంగ్రామంలో పాల్గొన్న వృద్ధవీరులలో ప్రముఖులు బాహ్లికుడు, భీష్ముడు, భగదత్తుడు. బాహ్లికుడిలో ఇంకో విశేషం ఉన్నది. మూడు తరాల వారు ఆతడి సేనలో ఉన్నారు. బాహ్లికుడూ, అతడి కొడుకు సోమదత్తుడూ, సోమదత్తుడి కొడుకు భూరిశ్రవసుడూ. ముగ్గురూ పేరుకెక్కిన వీరాధివీరులే.

వ. కాంభోజరా జగు సుదక్షిణుం డక్షీణ విభవంబున వెడలె; మఱియుం గోసలపతి యగు బృహద్బలుండును, మాహిష్మతీ పురనాథుం డగు నీలుండును, బ్రిగర్తేశ్వరుం డగు సుశర్మయు, నసురేంద్రులగు నలంబస హలాయుధులును, సాల్వ సౌవీర శూరసే నాభీర యవన వసుధాధిపులును లోనుగా ననేక దేశాధీశు లాత్మీయ చతురంగ బలసమన్వితులును నిజధ్వజ విరాజమానులును నానాభరణోజ్జ్వలాంగులును నయి సంగర కౌతుకంబు మొగంబులం దొంగలింప నరిగి ; రివ్విధంబునం బది యక్షౌహిణులు నడవం బదునొకండవ యక్షౌహిణితోఁ గురుక్షోణీవల్లభుండు విస్ఫురిత భూషణభూషితం బైన గంధ సింధురంబు నెక్కి వెలి గొడుగులు మెఱయం దొడవులం దఱచైన వజ్రంబుల యుద్దామంబు లగు

దీధితిస్తోమంబులును జామరంబులుం గలయం బొలయ బహురత్నప్రభా విభాసితం బయిన భుజంగకేతనంబు గ్రాలఁ గెలంకుల దుశ్శాసన దుర్మర్షణ వివింశతి వికర్ణాదు లగు సోదరులు వాహన వల్గనంబులు మెఱసి మెఱుఁగారు తమ తమ సిడంబు లుల్లసిల్లం జెలువు మిగిలి చనుదేరం జనియె; నిట్లు కౌరవసైన్యంబు గూడికొని కోదండ గదాదండ కుంత క్షురికా ముసల ముద్గర తోమర పరశు భింది పాల శూల ప్రముఖ నిఖిల హేతివ్రాతంబులను భర్మపరికర్మ నిర్మాణశోభిత వర్మంబులును వివిధవర్ణ విచిత్ర తనుత్రాణంబులును, మణిగణోజ్జ్వలజ్వాలాజటిల కేతనంబులం బరమాభీలసుందర సమ్మర్దం బయ్యె; నట్లున్న యప్పుడు. 95

ప్రతిపదార్థం: కాంభోజ+రాజు+అగు= కాంభోజ దేశానికి పరిపాలకుడు అయిన; సుదక్షిణుండు= సుదక్షిణుడు; అక్షీణ, విభవంబునన్= గొప్ప ఐశ్వర్యంతో; వెడలెన్= వెళ్ళాడు; మఱియున్= అంతేకాక; కోసల+పతి+అగు= కోసల దేశానికి రాజు అయిన; బృహద్బలుండును= బృహద్బలుడూ; మాహిష్మతీ, పుర, నాథుండు+అగు= మాహిష్మతీ నగరం ఏలే రాజు; నీలుండును= నీలుడూ; త్రిగర్త+ఈశ్వరుండు+అగు= త్రిగర్త దేశాధిపతి అయిన; సుశర్మయు; అసుర+ఇంద్రులు+అగు= రాక్షస ప్రముఖులు అయిన అలంబస హలాయుధులును; సాల్వ, సౌవీర, శూరసేన+ఆభీర, యవన, వసుధా+అధిపులును= సాల్వసౌవీర శూరసేన ఆభీర, యవన రాజులును; లోనుగాన్= మొదలగు; అనేక దేశ+అధీశులు= పెక్కు దేశాలను పరిపాలించే రాజులూ; ఆత్మీయ, చతురంగ, బల, సమన్వితులును= తమకు చెందిన నాలుగు అంగాలుగల సేనలతో కూడిన వారూ; నిజ, ధ్వజ, విరాజమానులును= తమకు ప్రత్యేకమైన జెండాలతో భాసించే వారూ; నానా+ఆభరణ+ఉజ్జ్వల+అంగులును= పెక్కు రకాల భూషణాలలో వెలుగొందే శరీరాలు గలవారూ; అయి; సంగర+కౌతుకంబు= యుద్ధమునందలి కుతూహలంతో; మొగంబులన్= ముఖాలపై; తొంగలింపన్= ప్రతిఫలించగా; అరిగిరి= (యుద్ధభూమిని) వెళ్ళారు; ఈ+విధంబునన్= ఈ రీతిగా; పది+అక్షౌహిణులు= పది అక్షౌహిణులు నిర్ణీత సంఖ్యలో చతురంగబలాలు గల సేనలు; నడవన్= తరలగా; పదునొకండవ+అక్షౌహిణితోన్- పదకొండో అక్షౌహిణితో; కురుక్షోణీ వల్లభుండు= కురురాజ్యనేత- దుర్యోధనుడు; విస్ఫురిత, భూషణ, భూషితంబు+ఐన= దేదీప్యమానంగా ఆభరణాలతో అలంకరించబడిన; గంధ+సింధురంబున్= మదపుటేనుగును; ఎక్కి= అధిరోహించి; వెలిగొడుగులు= తెల్లగొడుగులు; మెఱయన్= ప్రకాశించగా; తొడవులన్= ఆభరణాలందు; తఱచు+ఐన= దట్టమైన; వజ్రంబుల= రవ్వలతోను; ఉద్దామంబులు+అగు= గొప్పవి అగు; దీధితి స్తోమంబులన్= వెలుగుల సముదాయాలతో; చామరంబులున్+కలయన్+పొలయన్= చమరీమృగం వెంట్రుకలతో గూర్చిన వీవెనల కలిసి మెలిసి; బహు రత్న ప్రభా విభాసితంబు+అయిన= పెక్కురత్నాల కాంతులతో వెలుగొందుతున్న; భుజంగ, కేతనము= పాము బొమ్మ ఉన్న జెండా; క్రాలన్= మిరుమిట్లతో ప్రకాశించుండగా; కెలంకులన్= ఇరువైపుల; దుశ్శాసన దుర్మర్షణ వివింశతి వికర్ణ+ఆదులు+అగు= దుశ్శాసనుడు, దుర్మర్షణుడు, వివింశతి, వికర్ణుడు మున్నగు; సోదరులును= తమ్ములూ; వాహన+వల్గనంబులు= గుర్రాల గిట్టల చప్పుడు నడకలు; మెఱసి+మెఱుఁగారు= మిరుమిట్లు గొలిపే; తమతమ సిడంబులు= జెండాలు; ఉల్లసిల్లన్= శోభిల్లగా; చెలువు, మిగిలి= అందం అతిశయించి; చనుదేరన్= రాగా; చనియెన్= యుద్ధభూమికి వెళ్ళాడు; ఇట్లు= ఈ రీతిగా; కౌరవ+సైన్యంబు= కౌరవుల సేనతో; కూడికొని= కలిసి; కోదండ, గదాదండ, కుంత, క్షురికా, ముసల, ముద్గర, తోమర, పరశు, భింది పాల, శూల, ప్రముఖ, నిఖిల, హేతి, వ్రాతంబులన్= ధనుస్సు, నడికట్టు, ఈటె, చిన్న కత్తి, రోకలి, ఇనుపగుదియ, చిల్లకోల, గండ్రగొడ్డలి, రెండు మూడు నాల్కలుగల పెద్దసూది, ఈటె మొదలైనటువంటి అన్ని ఆయుధాలగుంపుతో; భర్మ, పరికర్మ, నిర్మాణ, శోభిత, వర్మంబులును= బంగారుతో చేయబడి శరీరమందలి మురికి పోగొట్టేటట్లు తయారు చేయబడిన కవచాలూ; వివిధ, వర్ణ, విచిత్ర, తనుత్రాణంబులును= పెక్కురంగులతో ఆశ్చర్యకరంగా కనుపించే శరీర రక్షలును; మణి, గణ, ఉజ్జ్వల, జ్వాలా, జటిల, కేతనంబులన్= మణుల సముదాయాల యొక్క కాంతుల మంటలతో దట్టమైన జెండాలతో; పరమ+ఆభీల, సుందర, సమ్మర్దంబు+అయ్యెన్= మిక్కిలి భయంకరంగానూ అందంగాను దట్టంగాను కన్పించింది; అట్లు+ఉన్న+అప్పుడు= ఆ రీతిగా ఉన్నప్పుడు.

తాత్పర్యం: కాంభోజ దేశాన్ని పరిపాలించే రాజు సుదక్షిణుడు గొప్ప వైభవంతో యుద్ధభూమికి తరలివెళ్ళాడు. కోసల దేశరాజు, బృహద్బలుడు, మాహిష్మతీ నగరాన్ని ఏలే ప్రభువు నీలుడు, త్రిగర్తదేశాధిపతి సుశర్మ, రాక్షస నాయకులగు అలంబసుడు, హలాయుధుడు, సాల్వ, సౌవీర, శూరసేన, ఆభీర, యవన, రాజులు మున్నగు అనేక దేశాలను పరిపాలించే ప్రభువులు రథ, గజ, తురగ భట బలాలతో తమ జెండాలు కన్నుల పండువుగా శోభిలుతుండగా, అనేకాలైన ఆభరణాలు శరీరాలపై వెలుగొందుతుండగా యుద్ధం చేయాలనే ఉత్సాహం మొగాలలో తాండవిస్తూ ఉండగా యుద్ధభూమికి వెడలసాగారు.

ఈ విధంగా పది అక్షౌహిణుల సైన్యం తరలి వెళ్లగా, పదకొండో అక్షౌహిణిబలంతో కురుపతి దుర్యోధనుడు ఆభరణాలతో శోభిల్లే మదపు టేనుగును అధిరోహించి యుద్ధానికి తరలివెళ్ళాడు. తెల్లని గొడుగులు అతడి శిరసుపై ప్రకాశించాయి. వజ్రాల తళతళలతో మిరుమిట్లు గొలిపే చామరాలు అతడికి వీస్తున్నారు. రత్నాలు పొదిగిన భుజంగకేతనంతో అతడు ప్రకాశించాడు. అతడి తమ్ములు దుశ్శాసనుడు, దుర్మర్షణుడు, వివింశతి, వికర్ణుడు మొదలైనవారు తమ తమ వాహనాలలో జెండాలతో అతడి వెంట వెళ్ళారు.

ఈ విధంగా యుద్ధానికి సన్నద్ధుడై తరలి వెళ్ళే ఆ కురుసేనలో ధనువులు, గదలు, ఈటెలు, వంకర కత్తులు, రోకళ్ళు, ఇనుపగుదియలు, చిల్లకోలలు, గండ్రగొడ్డళ్ళు, రెండు మూడు నాల్కలుగల పెద్ద సూదులు, బల్లెములు అన్ని ఆయుధాలు కన్పించాయి. బంగారు కవచాలు రంగు రంగుల తనుత్రాణాలు మణులతో పొదగబడిన జెండాలు గల ఆ కౌరవసైన్యం సుందరంగా భయంకరంగా దట్టంగా కనుపించింది.

విశేషం: 1. మహాభారత యుద్ధంలో నేటి భారత దేశం ఎల్లలు దాటిన కాంభోజదేశం నుండి సేనలు యవనులు రాక్షసులు కూడా పాల్గొనటం ఒక విశేషం. ఒక విధంగా అది తొలి ప్రపంచ యుద్ధం.

2. అలనాటి వీరులు యుద్ధాన్ని ఒక వినోద విహార క్రీడగా భావించారు.

3. ఆనాటి ఆయుధ విశేషాలు ధనువులేగాక ఎన్నో రకాలు ఉన్నాయి.

4. ఇక కవచాలు. కవచాల వంటి తను త్రాణాలు. కవచం కడుపును, వక్షఃస్థలాన్నీ రక్షిస్తుంది. మిగిలిన అవయవాలను రక్షించేవి తను త్రాణాలు. శిరస్కం, ముఖత్రాణం, దలపం, ఉదరత్రాణం, నాగోదం, జంఘాత్రాణం, మంఖుణం, బాహుత్రాణం, బాహులం, అంగుళీత్రాణం, గోధ.

5. అక్షౌహిణి: ఇరవై ఒక్కవేల ఎనిమిది వందల రథాలు, అన్ని యేనుగులు, అరవై వేల ఆరువందల గుర్రాలు, లక్షా తొమ్మిదివేల మూడు వందల ఏభైమంది కాల్బలం కలిస్తే ఒక అక్షౌహిణి అని గణితం. ప్రతి రథానికి నలుగురు చక్రరక్షకులు ఉంటారు. అట్టి 18 అక్షౌహిణులు కురుక్షేత్రంలో చేరాయి.

తే. అమరు తొడవుల వజ్రాంశు లంచపిండు । కరణి హరినీలములఁ బేర్చుకాంతి యళుల
పగిది మాణిక్యరుచి పద్మభంగి మెఱయఁ । గురుబలంబు గెందామర కొలనిఁ బోలె. 96

ప్రతిపదార్థం: అమరు, తొడవుల= పొందిక పడిన ఆభరణాలయొక్క; వజ్ర+అంశులు= రవలకాంతులు; అంచ, పిండు, కరణిన్= హంసల సముదాయాలవలె; హరినీలములన్+పేర్చు, కాంతి= ఇంద్రనీలమణుల అధికమైన వెలుగు; అళుల పగిదిన్= తుమ్మెదలవలె; మాణిక్య+రుచి= కెంపుల కాంతి; పద్మభంగిన్= పద్మాలవలె; మెఱయన్= వెలుగొందగా; కురు+బలంబు= కౌరవసేన; కెందామర కొలనిన్= ఎర్ర దామర పువ్వులతో కూడిన సరస్సును; పోలెన్= పోలింది.

తాత్పర్యం: ఆభరణాలలోని వజ్రాల కాంతులు హంసలవలె ఉన్నాయి. ఇంద్రనీలమణుల వెలుగులు తుమ్మెదలవలె ఉన్నాయి. కెంపుల కాంతులు పద్మాలవలె భాసించాయి. కౌరవసేన ఎర్రతామరలు వికసించిన సరోవరం వలె వెలుగొందింది.

విశేషం: అలం: ఉపమ.

వ. అట్టియెడ భీష్ముండు భూవల్లభులనెల్లం గూడం బిలిపించి వారలతో నిట్లనియె. 97

ప్రతిపదార్థం: అట్టి+ఎడన్= ఆ సమయంలో; భీష్ముండు= భీష్ముడు; భూవల్లభులన్+ఎల్లన్= రాజులను అందరను; కూడన్+పిలిపించి= సమావేశం అయ్యేటట్లు ఆహ్వానించి; వారలతోన్= వారితో; ఇట్లు అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఆ సమయంలో సేనాపతి అయిన భీష్ముడు రాజులను అందరను ఒక చోట సమావేశపరచి ఈ విధంగా చెప్పాడు.

విశేషం: భీష్ముడు సేనాధిపతి గనుక వీరులకు ప్రబోధం చేయటం అతడి ప్రథమ కర్తవ్యం.

భీష్ముఁడు నిజయోధులకెల్ల నుత్సాహంబుగాఁ దెగువ సెప్పుట (సం. 6-17-7)

క. 'ఆరయ వివృతస్వర్గ। ద్వారము రాజులకు నాహవం; బందు మహో
దారులు దొల్లియు నరిగిరి;। మీ రీ మార్గమున నడవ మెయికొనుటొప్పున్. 98

ప్రతిపదార్థం: ఆరయన్= పరీక్షించి చూడగా; ఆహవంబు= యుద్ధం; రాజులకున్= ప్రభువులకు; వివృత, స్వర్గ, ద్వారము= తెరచబడిన స్వర్గం యొక్క తలుపు- అనగ ప్రవేశమార్గం; మహా+ఉదారులు=గొప్పవారు; తొల్లియున్=పూర్వంకూడా; అందున్= (ఆ ద్వారమునందు); అరిగిరి= వెళ్ళారు; మీరు= రాజులైన మీరు; ఈ మార్గమునన్= ఈ దారినే; నడవన్, మెయికొనుట+ఒప్పున్= నడవటానికి ఇష్టపడటం మంచిది.

తాత్పర్యం: ఆలోచించి చూస్తే, రాజులకు యుద్ధం స్వర్గంలో ప్రవేశించటానికి తెరువబడిన ద్వారం. పూర్వకాలంలో ఎందరో గొప్పవారు ఈ దారినే వెళ్లారు. మీరు ఈ మార్గంలో నడవడానికి ఇష్టపడటం తగినది.

విశేషం: యుద్ధభూమిలో మరణించిన వీరులు (వీరుల ఆత్మలు) స్వర్గలోకంలోకి వెళ్ళగలవు అనే నమ్మకం ప్రాచీనకాలంలో వీరులకు ఉండేది.

క. ఇంటం దెవులునఁ జచ్చుట। కంటెను బాపంబు లొండు గలవె నృపులకున్?
బంటకలను పాలిగల నిది। గంట నిధానంబు గంట గాదే మనకున్?' 99

ప్రతిపదార్థం: నృపులకున్= రాజులకు; ఇంటన్= గృహంలో; తెవులునన్= జబ్బుతో; చచ్చుట కంటెను= మరణించటం కంటె; పాపంబులు= పాపాలు; ఒండు= వేరు; కలవు+ఎ?= ఉన్నాయా?; పాలిగలను= యుద్ధభూమి; పంటకలను= పంటభూమి; ఇది= ఇది; కంట= చూడటం; మనకున్= మనకు; నిధానంబు= ధననిధిని; కంట= చూడటం; కాదు+ఏ?= కాదా?

తాత్పర్యం: ఇంటిలో జబ్బు చేసి మంచమెక్కి బాధపడుతూ మరణించటం కంటే రాజులకు వేరే పాపం ఏమీ ఉండదు. రణరంగమే రాజులకు పంట చేను. యుద్ధభూమిని దర్శించటం అంటే రాజులు పెన్నిధిని పొడగాంచినట్లే.'

తే. అనిన విని వార లందఱు నగ్గలికలు । నెఱయు మాటలఁ దనతన తెఱఁగు మెఱయ
బహువిధంబుల నతనికి బాస యిచ్చి । యేచి నిజసైన్యములలోని కేఁగి రధిప! 100

ప్రతిపదార్థం: అనినన్= అని (భీష్ముడు) పలుకగా; విని= ఆలకించి; వారలు+అందఱున్= ఆ రాజులు అందరూ; అగ్గలికలు= ఉత్సాహాలు; నెఱయు+మాటలన్= అతిశయించే పలుకులతో; అతనికిన్= సేనాపతి అయిన భీష్ముడికి; బహువిధంబులన్= ఎన్నో రీతుల; బాస+ఇచ్చి= ప్రతిజ్ఞలు చేసి; అధిప!= ఓరాజా! (ధృతరాష్ట్ర మహారాజా!); ఏచి= పూని; నిజ+సైన్యములలోనికిన్= తమ సేనలలోనికి; ఏఁగిరి= వెళ్ళారు.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! సేనాపతి అయిన భీష్ముడు ఆ విధంగా ప్రబోధించగా విని, యుద్ధం చేయటానికి వచ్చిన ఆ రాజులు అందరూ ఉత్సాహంతో పొంగి పోయి అతడి యెదుట ఎన్నో విధాలుగా శపథాలు చేసి తమ తమ సేనలలోనికి వెళ్ళి నిలిచారు.

వ. అయ్యవసరంబున గాంగేయుండు గాంధారేయు నాలోకించి 'మదీయ సంగర సమయంబునఁ గర్ణుండు పుత్రమిత్రామాత్యబంధు సహితంబుగాఁ గయ్యంబునకు రాకుండం గలవాడని తేటపడం బలికిన. 101

ప్రతిపదార్థం: ఆ+అవసరంబునన్= ఆ సమయంలో; గాంగేయుండు= గంగ కొడుకు- భీష్ముడు; గాంధారేయున్= గాంధారి కొడుకును దుర్యోధనుడిని; ఆలోకించి= చూచి; మదీయ, సంగర, సమయంబునన్= నేను యుద్ధం చేసే కాలంలో; కర్ణుండు= కర్ణుడు; పుత్ర మిత్ర అమాత్య బంధు సహితంబుగాన్= కొడుకులతో, స్నేహితులలో, మంత్రులలో, చుట్టాలతోపాటు; కయ్యంబునకున్= యుద్ధానికి; రాకుండన్+కలవాఁడు= రాగూడదు; అని= అని; తేటపడన్+పలికినన్= సుస్పష్టంగా చెప్పిన.

తాత్పర్యం: ఆ సమయంలో భీష్ముడు దుర్యోధనుతో ఈ విధంగా అన్నాడు. 'ఓ దుర్యోధనా! నీ మిత్రుడైన కర్ణుడు నేను యుద్ధం చేసేటప్పుడు తాను యుద్ధంలో పాల్గొనరాదు. అట్లే అతడి కొడుకులు స్నేహితులు మంత్రులు, చుట్టాలు సయితం యుద్ధంలో పాల్గొనరాదు.

విశేషం: 1. దుర్యోధనుడు భీష్ముడిని సేనాపతిగా నియమించి, ఉభయ పక్షాలలోని యోధుల శక్తిసామర్థ్యాల తారతమ్యాలు వెలకట్టి చెప్పుమని అర్థించాడు. భీష్ముడు వీరులందరినీ పొగడి కర్ణుడిని 'అర్ధరథుడు' అని చెప్పాడు. అనగా వీరులలో రథుడు, మహారథుడు, అతిరథుడు, అతిరథశ్రేష్ఠుడు ఉత్తరోత్తర బలీయములైన పదవులు. వీరులలో అందరి కంటె తక్కువ వాడు రథుడు. ఇక అర్ధరథుడు అంతకంటె మిక్కిలి అధముడు అన్నమాట. అప్పుడు కర్ణుడు కోపించి భీష్ముని నాయకత్వంలో తాను యుద్ధం చేయనని ప్రతిజ్ఞ చేశాడు.అందుచేత భీష్ముడు ఈ మాట చెప్పవలసి వచ్చింది దుర్యోధనునితో.

2. అయితే భీష్మ పతనానంతరం కర్ణుడు రహస్యంగా భీష్ముడిని కలిసికొని అతడికి తన మన్నన తెలిపాడు. భీష్ముడు గూడ కర్ణుని లోకోత్తర వీరుడిగా ప్రశంసించాడు! ఒకనాడు ఆ భీష్ముడేకదా కర్ణుడిని అర్ధరథుడు అని అన్నది!? భీష్ముడిని తూలనాడిన ఆ కర్ణుడే భీష్ముడికి పాదాభివాదం చేశాడు. మానవ మనస్తత్వాన్ని మథించిన మహాభారతంలోనే ఇట్టి విచిత్ర విరోధాభాసం వర్ణించబడింది.

క. ' చలముకొని యొరుల నుడుపుట । బలియుండై తెంపు సేసి బవరమునకుఁ దాఁ
దెలియుట గాదే!' యని కురు । కులముఖ్యుఁడు వొంగి యతనిఁ గొనియాడెఁ దగన్. 102

ప్రతిపదార్థం: చలము+కొని= మిషపెట్టి; ఒరులన్= ఇతరులను; ఉడుపుట= నిగ్రహించటం; బలియుండు+ఐ= బలంకలవాడై; తెంపు+చేసి= చొరవ వహించి; బవరమునకున్= యుద్ధానికి; తాన్= తానై; తెలియుట+కాదే!= పూనిక వహించటమే కదా!; అని= అని పల్కి; కురు కుల ముఖ్యుఁడు= కౌరవ శ్రేష్ఠుడు- దుర్యోధనుడు; పొంగి= (ఉత్సాహంతో) అతిశయించి; అతనిన్= (భీష్ముడిని); తగన్= తగునట్లుగ (యథోచితంగా); కొనియాడెన్= ప్రశంసించాడు.

తాత్పర్యం: 'నెపం పన్ని ఇతరులను ప్రక్కకు నెట్టివేయటం అంటే యుద్ధంలో తానే బలవంతుడై బాధ్యత వహించి పోరాడటానికీ సంసిద్ధం కావటమేగదా' అని దుర్యోధనుడు భీష్ముడిని పొగిడాడు.

విశేషం: 1. దుర్యోధనుడికి కర్ణుడికిగల మైత్రి జగత్ప్రసిద్ధం. అయితే, సేనాపతి అయిన భీష్ముడు కర్ణుడిని- యుద్ధంలోకే రాకూడదు అని నిషేధించాడు. ఇది దుర్యోధనునికి బాధ కలిగించే అంశమే. అయినప్పటికీ, ఆతడు భీష్ముడిని ప్రశంసించాడు. 'కర్ణుడిని రావద్దంటే - భీష్ముడే యుద్ధ బాధ్యత సర్వం తనమీద వేసుకొన్నట్లేకదా!' అన్నాడు తెలివిగా పరిపాలనాదక్షుడైన దుర్యోధనుడు.

2. చలము అన్న మాట ఇక్కడ మిక్కిలి అర్థవంతమైనది. వాది ఒక అర్థంలో ప్రయోగించిన శబ్దానికి ప్రతివాది, మరి యొక అర్థం కల్పించి చేయు దూషణ. ఇది జల్ప దోషాలలో ఒకటి. ఛల శబ్దప్రయోగంవలన కర్ణుడిపై దుర్యోధనుడికి గల ఆంతరంగిక సానుభూతి స్వయం వ్యక్తమైంది.

వ. ఇట్లు పితామహు నెత్తికోలునకుం జిత్తంబు వికసిల్ల ననుజసహితంబుగా నతనిం బరివేష్టించి యన్నరపతి 'నిబిడచారుసన్నాహంబుగా నుచితవ్యూహం బమర్పు' మని యతనికిం జెప్పిన, నతండును బడమరమొగంబయి తానును ద్రోణుండును దాలధ్వజంబును వేదికాకేతనంబును గ్రాలుచుండ ముందఱ నిలిచి వలపటఁ గృపాశ్వత్థామలును దాపటం గృతవర్మమద్రేశ్వరులును వెనుక బాహ్లిక సోమదత్తభూరిశ్రవసులును నడుమం గురుకుమారసమేతంబుగా నమ్మహీనాథుండును, నతని యగ్రభాగంబున 'నర్జునుం జంపుదుము చత్తు మింతియ కాని యొండులే' దని శపథంబులు పలికి సంశప్తకు లనం బ్రఖ్యాతు లయిన సుశర్మ మొదలుగాఁ గల పదివేవురు రథిక ముఖ్యులును గలయ నెడనెడం దక్కిన యోధవీరులును నిలుచునట్లుగా నియమించి, తగ నయ్యెసైన్యంబుల కేనుంగులు నేనుంగుల కరదంబులు నరదంబులకుం దురంగంబులుఁ దురంగంబులకు విండ్లవారు విండ్లవారికి నద్ధాయుధులు నడ్డం బగు తెఱంగున నిలువ నియోగించి, మానుషవ్యూహంబు సమకట్టిన, నెన్నండును నిట్టి దృఢవ్యూహంబు గనియును వినియు నెఱుంగమని యెల్లవారు నచ్చెరువునం బొరయుచుఁ బ్రియంబందుచుండిరి; బృందారక ప్రముఖ దేవయోనులును దివంబున నున్న పురాతన ధరారమణులును భారత రణంబు గనుంగొను కుతూహలంబున వివిధ విమానారూఢులై యేతెంచి; రంతకు మున్న యక్కడ. 103

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; పితామహు+ఎత్తికోలునకున్= తాతగారి నిర్ణయానికి, భీష్ముడి నిర్ధారణకు; చిత్తంబు= మనస్సు; వికసిల్లన్= వికసించగా; అనుజ, సహితంబుగాన్= తమ్ములతో గూడ; అతనిన్= భీష్ముడిని; పరివేష్టించి= చుట్టూ వినయంగా చేరికొలిచి; ఆ+నరపతి= ఆ రాజు - దుర్యోధనుడు; నిబిడ, చారు, సన్నాహంబుగాన్= దట్టమైన, అందమైన, యుద్ధ ప్రయత్నాలతో కూడినదై; ఉచిత, వ్యూహంబు+అమర్పుము+అని= తగిన వ్యూహం ఏర్పాటు చేయుము అని; ఆతనికిన్= (భీష్ముడికి); చెప్పినన్; అతండును= (భీష్ముడును); పడమర+మొగంబు+అయి= పడమటి దిక్కువైపు ముఖము కన్పించునట్లుగా; తానును= (భీష్ముడును); ద్రోణుండును= ద్రోణుడును; తాల+ధ్వజంబును= తాడిచెట్టు జెండా; వేదికా+కేతనంబును= యజ్ఞంకోసం అమర్చబడిన తిన్నెగల జెండా; క్రాలుచుండన్= మిరుమిట్లు గొలుపుతూ వెలుగొందుతుండగా; ముందరన్+నిలిచి= అగ్రభాగంలో నిలిచి; వలపటన్= కుడివైపు; కృప+అశ్వత్థామలును= కృపాచార్యుడును, అశ్వత్థామయును; దాపటన్= ఎడమ ప్రక్కగా; కృతవర్మ, మద్ర+ఈశ్వరులున్= కృతవర్మ, శల్యుడును; వెనుకన్= వెనుకభాగంలో; బాహ్లిక, సోమదత్త, భూరిశ్రవసులును= బాహ్లికుడు, (అతని కొడుకు సోమదత్తుడు) సోమదత్తుని కొడుకు భూరి శ్రవసుడును; నడుమన్= మధ్యభాగమందు; కురు, కుమార, సమేతంబుగాన్= కురుకుమారులతోపాటుగా; ఆ+మహీనాథుండును= ఆ రాజు (దుర్యోధనుడు); అతని+అగ్రభాగంబునన్= ఆతడిముందు; అర్జునున్= అర్జునుడిని; చంపుదుము= సంహరిస్తాము; చత్తుము= మరణిస్తాము; ఇంతియ కాని= ఇంతేకాని; ఒండు+తెఱంగు= వేరుమార్గం; లేదు+అని= లేదంటూ; శపథంబులు= ప్రతిజ్ఞలు; పలికి= వచించి; సంశప్తకులు+అనన్= సంశప్తకులు అనే పేరుమీద;

ప్రఖ్యాతులు+అయిన= పేరుకెక్కిన; సుశర్మ+మొదలుగాన్+కల= సుశర్మ మున్నగువారలైన; పదివేవురు, రథిక, ముఖ్యులును= పదివేల మంది గొప్ప రథికులూ; కలయన్+ఎడన్+ఎడన్= అక్కడ అక్కడ కలిసిపోయేటట్లుగా; తక్కిన= మిగిలిన; యోధ+వీరులును= యుద్ధం చేసే శూరులును; నిలుచు+అట్లుగాన్= నిలబడేటట్లుగా, నియమించి= ఆజ్ఞాపించి; తగన్ తగురీతిగా, అయ్యె+సైన్యంబులన్= ఆయాసేనలను; ఏనుంగులన్= ఏనుగులను; ఏనుంగులకున్+అరదంబులు= ఏనుగులకు రథాలు; అరదంబులకున్+తురంగములు= రథాలకు గుర్రాలు; తురంగబులకున్= గుర్రాలకు; విండ్లవారున్= ధనుస్సులు ధరించేవారు (ధానుష్కులు); విండ్లవారికిన్= చాపములు ధరించేవారికి; నద్ధాయుధులు= కట్టబడిన ఆయుధాలు కలవారు; అడ్డంబు+అగు+తెఱంగున్= అడ్డంగా (రక్షగా) ఉండేటట్లు; నిలువన్= నిలుచున్నట్లు; నియోగించి= ఏర్పాటు చేసి; మానుష, వ్యూహంబు= మనిషి ఆకారంగా వ్యూహం; సమకట్టినన్= ఏర్పాటు చేసినప్పుడు; ఎన్నండును= ఏకాలంలో గూడ; ఇట్టి= ఇటువంటి; దృఢ, వ్యూహంబున్= గట్టిదైన వ్యూహాన్ని; కనియున్+వినియున్+ఎఱుంగము= చూడలేదు, వినలేదు; అని= అని; ఎల్లవారున్= అందరూ; అచ్చెరువునన్+పొరయుచున్= ఆశ్చర్యానికి లోనయి; ప్రియంబు+అందుచుండిరి= సంతోషిస్తూ ఉన్నారు; బృందారక, ప్రముఖ, దేవయోనులును= దేవతలు మున్నగు వేల్పుల తెగలవారూ; దివంబునన్+ఉన్న= స్వర్గలోకంలో ఉన్న; పురాతన, ధరారమణులును= పూర్వకాలంలోని రాజులూ; భారత+రణంబు= భారత యుద్ధాన్ని; కనుంగొను= చూడాలి అనీ; కుతూహలంబునన్= కోరికతో; వివిధ, విమాన+ఆరూఢులు+ఐ= వేరు వేరు విమానాలను ఎక్కి వచ్చినవారై; ఏతెంచిరి= వచ్చారు; అంతకుమున్ను+అ= అంతకు ముందే; అక్కడన్= ఆచట (ఆ యుద్ధభూమియందు).

తాత్పర్యం: ఈ విధంగా భీష్ముడి విజృంభణ సంకల్పానికి, మనస్సు వికసించగా దుర్యోధనుడు తమ్ములతోపాటు అతడి చుట్టుచేరి చక్కని చిక్కని వ్యూహం పన్నుమని అర్థించాడు. భీష్ముడు మనుష్యాకారమైన ఒక గొప్ప వ్యూహాన్ని అమర్చాడు. ముఖం పడమర దిక్కుగ ఉన్నది. ముఖద్వారం కడ తాను. తాడిచెట్టు జెండాతో, యజ్ఞవేదిక ఉన్న జెండాతో ద్రోణాచార్యుడూ నిలిచారు. కుడివైపున కృపాచార్యుడు అశ్వత్థామ, ఎడమ వైపున కృపవర్మ, శల్యుడు నిలిచారు. వెనుక బాహ్లికుడు, అతడి కొడుకు సోమదత్తుడు, సోమదత్తుడి కొడుకు భూరిశ్రవసుడు నిలిచారు. మధ్యలో దుర్యోధనుడు తమ్ములతో పాటు నిలబడ్డాడు.

దుర్యోధనుడి ముందు సంశప్తకులు వారి నాయకుడు సుశర్మ నిలిచారు. 'అర్జునుని చంపుతాము లేదా అర్జునుడి చేత చస్తాము. అంతేగాని ఇక వెనుదిరిగే ప్రసక్తియే లేదు, అనేది వారి ప్రతిజ్ఞ. వారి సంఖ్య పదివేలు . ఇక ఎడనెడ మిగిలిన యోధులు నిలబడ్డారు.

ఆ వ్యూహంలో ఇంకో విశేషం ఉన్నది. ఆయా సైన్యాలను కాపాడేందుకు రక్షగా ఏనుగులు అమర్చబడ్డాయి. ఏనుగులకు ముందు రక్షగా రథాలు, రథాలకు రక్షగా అశ్విక బలాలు, ఆశ్విక బలాలకు రక్షగా విలుకాండ్రు, విలుకాండ్రకు రక్షగా తగిన ఆయుధాలు కత్తులు కటారులు ధరించినవారు నిలిచే ఏర్పాటు జరిగింది. ఇట్లాంటి దృఢమైన వ్యూహాన్ని కనీవినీ ఎరుగమంటూ అందరూ ఆశ్చర్యం చెందుతూ ఆనంద పడుతున్నారు.

భారత యుద్ధాన్ని చూడటానికి, దేవతలు, దేవతా జాతులు, స్వర్గలోకంలో ఉన్న పురాతన మహారాజులు తమ తమ విమానాలలో వచ్చారు. అంతకు ముందే అక్కడ

విశేషం: 1. వ్యూహాలు భారతయుద్ధంలో మిక్కిలి ప్రాముఖ్యం వహించినట్టివి. 'వ్యూహాలు.' ఇవి పలు ఆకారాలలో సేనాపతులు ఏర్పాటు చేసేవారు. 'వ్యూహం' సమరక్రీడలో అంతర్భాగం.

2. విమానాలు: ఆధునిక నాగరకత, విజ్ఞానశాస్త్రం ప్రసాదించిన అద్భుతాలలో విమానం ఒకటి. అయితే భారత రామాయణాలు చదివిన భారతీయులకు 'విమానాలు' సుపరిచితాలు. ఆకాశయానం- విమానయానం ప్రాచీన భారతీయుల ఆలోచనలను - కావ్యకథలను విశేషంగా తీర్చిదిద్దాయి.

3. ఆత్మ - మరణానంతరం ఉంటుందనీ, కర్మానుగుణంగా స్వర్గలోకవాసం, నరకలోకవాసం ఏర్పడుతుందని ప్రాచీన భారతీయులలో అధిక సంఖ్యాకులు విశ్వసించారు. 'ఆత్మ' నిత్యం; శరీరం అనిత్యం అనే భావాన్ని బహుళ ప్రచారంలోకి తీసికొనివచ్చింది. మహాభారతంలో అంతర్భాగమైన భగవద్గీత.

పాండవయోధులు యుద్ధంబునకు వెడలుట

సీ. ఏనిక మదమున కెలయు తేటుల మొత్త । ములు వెలిగొడుగుల చెలువు గెలువఁ,
దురగఖురోద్ధూతధూళి యప్సరసల । యలక పూవులతోడఁ జెలిమిసేయఁ,
గేతనంబుల మణివ్రాతంబు రోచులు । రవికిరణంబుల నవలఁ ద్రోవ,
జైత్రభేరుల మహాస్వనములు సకల ప । ర్వతములఁ బ్రతివిరావముల నీన,
తే. నంబరము రథఘోష భీమాభిరామ । కింకిణీ గణఝణఝణత్కృతిమయముగఁ
బటు పదాతిహేతిప్రభా పటలియెల్ల । దిశలు వెలిఁగింప వెడలె యుధిష్ఠిరుండు. 104

ప్రతిపదార్థం: ఏనిక, మదమునకున్= ఏనుగుల యొక్క దానజలమునకు; ఎలయు= వ్యాపించే; తేటుల+మొత్తము= తుమ్మెదలగుంపు; వెలిగొడుగుల+చెలువున్= తెల్లగొడుగుల అందాన్ని; గెలువన్= జయించగా; తురగ ఖుర+ఉద్ధూత ధూళి= గుర్రాల గిట్టలచేత పైకి లేపబడిన దుమ్ము; అప్సరసల= దేవతాస్త్రీల యొక్క; అలక+పూవుల తోడన్= ముంగురుల యందలి పుష్పాలతో; చెలిమి+చేయన్= స్నేహం చేయగా; కేతనంబుల= జెండాల యొక్క; మణివ్రాతంబు+రోచులు= మణుల సముదాయాల కాంతులు; రవి+కిరణంబులన్= సూర్యుడి వెలుగులను; అవలన్+త్రోవన్= దూరానికి నెట్టివేయగా; జైత్ర, భేరుల, మహా, నిస్వనములు= విజయసూచకములైన, పెద్ద డోళ్ళ నుండి వెలువడే గొప్ప శబ్దాలు; సకల, పర్వతములన్= అన్ని కొండలలో; ప్రతి రావములన్+ఈనన్= మారుమ్రోగగా; అంబరము= ఆకాశం; రథఘోషన్= రథాల నుండి వెలువడే ధ్వనితో; భీమ+అభిరామ, కింకిణీ, గణ, ఝణఝణత్+కృతిమయముగన్; భయంకరం సుందరం అయిన చిరుగంటల సవ్వడులతో నిండి ఉండగా; యుధిష్ఠిరుండు= ధర్మరాజు; పటు+పదాతి+హేతి+ప్రభా+పటలి= మిక్కుటములైన కాలి భటుల కత్తి తళతళల వెలుగు గములు, ఎల్ల దిశలు= దిక్కులు అన్నిటిని; వెలిఁగింపన్= వెలుగొందచేయగా; వెడలెన్= యుద్ధభూమికి తరలి వెళ్ళెను.

తాత్పర్యం: ధర్మరాజు యుద్ధభూమికి తరలి వెళ్ళాడు. ఏనుగుల మదం వలన ఏర్పడే సువాసనకు ఆకర్షించబడిన తుమ్మెదల గుంపులు తెల్లగొడుగుల సొగసును జయిస్తున్నట్లు గుమిగూడాయి. గుర్రాల గిట్టలవలన చెలరేగిన దుమ్ము కణాలు, ఆకాశం వరకు వ్యాపించి, దేవతాస్త్రీల ముంగురులలో అలంకరించబడిన పువ్వులతో స్నేహం చేశాయి. జెండాలపై గుర్తులుగా ఉన్న బొమ్మలలో పొదగబడిన మణులయొక్క కాంతులు సూర్యకిరణాలను మించి ప్రకాశించాయి. విజయభేరిధ్వనులు అన్ని కొండలలో మారుమ్రోగాయి. ఆకాశం, రథచక్రాల ధ్వనులతో వెరపు గొలుపుతూ సొగసులు చిందుతూ మారుమ్రోగుతున్న చిరుగంటల సవ్వడులతో నిండిపోయింది. కాల్బలం పట్టుకొన్న కత్తుల యొక్క తళతళల వెలుగులు దిక్కులన్నిటినీ వెలుగొందచేశాయి. ధర్మరాజు యుద్ధానికి తరలి వెళ్ళటం శోభాయమానంగా పరిణమించింది.

విశేషం: మదధారలు ఏనుగుల కుంభస్థలాలనుండి స్రవించటం, ఆ మదధారల పరిమళానికి తుమ్మెదలు ఆకర్షించబడటం హృదయంగమమైన 'కవిసమయం'. వెలిగొడుగులంటే బహిశ్ఛత్రాలని కొందరు అన్వయించారు.

మ. ప్రమదం బాననకాంతిఁ గ్రొత్తవలుపం బాదాతిభూయిష్ఠ సై
న్యముతో భీముఁడు భూషణద్యుతి నికాయంబున్ గదాద్యాయుధో
గ్ర మరీచి ప్రకరంబునుం గలిసి చిత్రస్ఫూర్తి శోభిల్లఁ గా
సమరక్రీడకు వచ్చె జృంభిత భుజాస్తంభోజ్జ్వలాకారుఁడై. 105

ప్రతిపదార్థం: భీముఁడు= భీముడు; ప్రమదంబు= సంతోషం; ఆననకాంతిన్= ముఖంలోని వెలుగును; క్రొత్త, పఱుపన్= కొత్తదిగా చేయగా; పాదాతి, భూయిష్ఠ, సైన్యముతోన్= కాల్బలాలతో కూడిన సేనతో; భూషణ, ద్యుతి, నికాయంబున్= ఆభరణాల కాంతుల పుంజము; గదా+ఆది+ఆయుధ+ఉగ్ర, మరీచి, ప్రకరంబునున్= గద మున్నగు ఆయుధాల యొక్క భయంకరమైన కాంతుల సమూహమూ; కలిసి= కలిసి; చిత్ర స్ఫూర్తిన్+శోభిల్లఁగాన్= చిత్రవర్ణ స్ఫూర్తితో; విలసిల్లగా; జృంభిత, భుజా, స్తంభ+ ఉజ్జ్వల+ ఆకారుఁడు+ఐ= విస్తరిల్లిన కంబముల వంటి భుజములతో మెరిసే ఆకారం కలవాడై; సమర+క్రీడకున్= యుద్ధం అనే ఆటకు; వచ్చెన్= (తరలి) వచ్చాడు.

తాత్పర్యం: సంతోషం మొగమందు వెలుగొందుతుండగా, వెంట గొప్ప కాల్బలంతో కూడిన సేన రాగా, ఆభరణాలు గద మున్నగు ఆయుధాల నుండి వెలువడే భయంకరమైన కాంతులు కలిసి చిత్రవిచిత్రమైన శోభ ఏర్పడగా కంబములవంటి భుజాలతో ప్రకాశించే దేహ సౌష్ఠవం కలవాడై యుద్ధ వినోద విహారానికి సన్నద్ధుడై భీముడు వచ్చాడు.

సీ. దివ్యరథస్ఫారదీప్తిజాలంబులు । పద్మరాగోజ్జ్వలప్రభలు గాఁగ,
మహనీయ రథ్యవిగ్రహముల జిగిసొంపు । ఘనవజ్ర వసు సముత్కరము గాఁగ,
నొగలపై నున్న కృష్ణుని మేని నునుఁజాయ । హరినీల కాంతివిస్ఫురణ గాఁగఁ,
బ్రస్ఫీత కేతనాగ్రస్థిత కపిదేహ । రోచులు గరుడాశ్మరుచులు గాఁగ

ఆ. నంపపాదుల నిగుడు నంశువితానంబు । దీప్రమరకతముల దీధితులుగఁ
దాలిమియును బెంపుఁ దనకు నైజములుగ । విజయరోహణాద్రి వెడలి వెలిఁగె. 106

ప్రతిపదార్థం: దివ్య, రథ, స్ఫార, దీప్తి, జాలంబులు= దేవతా సంబంధమైన రథంయొక్క విస్తారమైన కాంతి సమూహాలు; పద్మ, రాగ, ఉజ్జ్వల, ప్రభలు, కాఁగన్= కెంపులనుండి వెలువడు మెరపు వెలుగులు కాగా; మహనీయ, రథ్యవిగ్రహముల, జిగి, సొంపు= గొప్పవైన గుర్రాల శరీరాల యొక్క వెలుగుల సొగసు; ఘన, వజ్ర, వసు, సముత్కరము, కాఁగన్= గొప్ప రవ్వల సంపదల సమూహంకాగా; నొగలపైన్= రథం ముంగలి భాగంపై; ఉన్న= (కూర్చొని) ఉన్న; కృష్ణుని, మేని, నును, చాయ= ఆ కృష్ణుడి దేహము యొక్క జిలుగు వన్నెల రంగు; హరినీల, కాంతి, విస్ఫురణ, కాఁగన్= ఇంద్రనీలమణుల ప్రకాశ ప్రకటనకాగా, ప్రస్ఫీత, కేతన, అగ్ర, స్థిత, కపి, దేహ, రోచులు= ప్రకాశించే జెండాపైన ఉన్న కోతి (ఆంజనేయుడి) శరీర కాంతులు; గరుడ+అశ్మరుచులు కాఁగన్= ఆకుపచ్చ వన్నెగల మాణిక్యకాంతులు కాగా; అంపపాదులన్= బాణాలు పెట్టుకునే పాదులలో; నిగుడు= వ్యాపించు; అంశు వితానంబు= కాంతిపుంజం; దీప్ర, మరకతముల, దీధితులుగన్= ప్రకాశించే పచ్చల వెలుగులు కాగా; తాలిమియును+పెంపు= ఓర్పు గొప్పతనము; తనకున్= తనకు (అర్జునుడికి); నైజములుగన్= స్వభావసిద్ధములుగ; విజయ రోహణ+అద్రి= అర్జునుడు అనే రోహణపర్వతం - లేదా - పరాక్రమం రూపొందిన పర్వతం; వెడలి= (యుద్ధానికి) బయలుదేరి; వెలిఁగెన్= ప్రకాశించింది.

తాత్పర్యం: కరుడు గట్టిన పరాక్రమంవలె, వెలుగొందే నడగొండవలె అర్జునుడు యుద్ధభూమికి బయలుదేరి వెళ్ళాడు. దివ్యమైన రథం నుండి వ్యాపించిన కాంతులు కెంపు రవ్వ వెలుగులు విస్తరిస్తూండగా, గొప్పవైన గుర్రాల ఆకారరేఖలు వజ్రాల వెలుగులు వ్యాపింప చేయుచుండగా, రథంముందు సారథి స్థానంలో కూర్చొని ఉన్న శ్రీకృష్ణుడి శరీరకాంతి ఇంద్రనీలమణుల వెలుగులు చిమ్ముతుండగా దేదీప్యమానంగా ప్రకాశించే జెండామీద ఉన్న ఆంజనేయుడి శరీర కాంతులు గరుడపచ్చల వెలుగులు వెల్లివిరియ చేయగా, తూణీరంలో మిరుమిట్లు గొలిపే బాణాల కాంతులు ప్రకాశించే పచ్చల వెలుగులు వెలార్చగా, ఓర్పు గొప్పతనం తనకు పుట్టుకతో అలవడిన గుణాలుగా అర్జునుడు యుద్ధభూమికి బయలుదేరి వెళ్ళాడు.

విశేషం: 1. రోహణ+అద్రి= రోహణ పర్వతం. లంకానగరంలో పేరుకెక్కిన కొండ- ఒక అర్థం. రోహణ= వీర్యం, పరాక్రమం. రోహణాద్రి అంటే వీర్యం మానవశరీర రూపం ధరించి కొండవలె కన్పించటం అని రెండో అర్థం. ఇచ్చట రెండవ అర్థమే సందర్భోచితం అని చెప్పాలి.

2. అలం: రూపకం. విజయ రోహణాద్రి= అర్జునుడు అనే రోహణ పర్వతం. ఇక్కడ రోహణ పర్వతానికి, అర్జునుడికి అభేదం కల్పించబడింది. అలంకారం రూపకం. అర్జునుని రథం అతిలోక దీప్తి కలది. అగ్నిదేవుడిచే అతడికి బహూకరించబడినట్టిది. మహాభారత యుద్ధం ముగిసిన పిమ్మట శ్రీకృష్ణుడు అర్జునుణ్ణి రథం దిగమన్నాడు. అర్జునుడు రథం దిగిన తదుపరి అది అగ్నికి దగ్ధమైపోయింది. దివ్యరథం కాబట్టి శత్రువులు ప్రయోగించిన అస్త్రాల శక్తిని ఆ రథం తనలో ఇముడ్చుకున్నదని అంతరార్థం.

క. అతులితరథప్రతానో । ద్ధతసైన్యము గొలువ దేవదత్తం బంగీ
కృత సకల తూర్యనాదో । ద్ధతి యగుచుఁ జెలంగఁ గ్రీడి గడు నొప్పారెన్. 107

ప్రతిపదార్థం: అతులిత, రథ, ప్రతాన+ఉద్ధత, సైన్యము= సాటిలేని రథాల సమూహాలతో అతిశయించిన సేన; కొలువన్= సేవిస్తూ ఉండగా; దేవదత్తం= దేవదత్తము (దేవతలచేత ఇవ్వబడిన శంఖం); అంగీకృత, సకల, తూర్య, నాద+ఉద్ధతి+అగుచున్= ఢక్కా, బూరా, పటాహం మున్నగు వాద్యాల మ్రోతల సమాహారంగా అందరిచేత అంగీకరించబడినదిగా; చెలంగన్= శోభిల్లగా; క్రీడి= అర్జునుడు; కడున్= మిక్కిలి; ఒప్పారెన్= విలసిల్లాడు.

తాత్పర్యం: సాటిలేని రథసైన్యసమూహం తనను సేవిస్తూ, అర్జునుడు దేవదత్తం అనే శంఖం పూరిస్తూ మిక్కిలి శోభతో వెలుగొందాడు.

విశేషం: అర్జునుడి శంఖానికి దేవదత్తం అనిపేరు. భారత వీరులు తమ తమ శంఖాలకు ప్రత్యేకమైన పేరులు పెట్టుకొనేవారు. (శ్రీకృష్ణుడి శంఖంపేరు పాంచజన్యం, ధర్మరాజు శంఖం పేరు అనంత విజయం, భీముడి శంఖం పేరు పౌండ్రం; నకుల సహదేవుల శంఖాలపేర్లు సుఘోష, మణిపుష్పకములు.

2. యుద్ధంలో భేరి మున్నగు వాద్యాలు మ్రోయించేవారు. ఢక్క, పటహం, కాహళ, తిరుచిన్నం-ఇలా ... ఎన్నెన్నో- దేవదత్తం నుండి వెలువడే నాదం సకల వాద్య విశేష శబ్ద సమాహారంగా ప్రసిద్ధి కెక్కింది. యోధుడుగా అర్జునుడికీ దేవదత్తానికీ అవినాభావ సంబంధం ఏర్పడింది. అట్లే అర్జునుడి ధనుస్సు గాండీవం.

తే. గాండివం బింద్రచాపంబుకరణి నొప్ప । మెఱసి దివ్యకిరీటంబు మెఱుఁగు లడర
జ్యానినాదంబు గర్జగా మేని కృష్ణ । కాంతిఁ బొలిచెఁ గవ్వడి యను కారుమొగులు. 108

ప్రతిపదార్థం: గాండివంబు= (అర్జునుడి ధనుస్సు); ఇంద్రచాపంబు, కరణిన్= ఆకాశంలో నీటికణాలలో సప్త వర్ణ శబలితంగా ఏర్పడే విల్లును పోలి; ఒప్పన్, మెఱసి= శోభిల్లి; దివ్యకిరీటంబు= అతిలోకమైన కిరీటం; మెఱుఁగులు+అడరన్= మిరుమిట్లు గొల్పగా; జ్యా+నినాదంబు= అల్లెత్రాటిమ్రోత; గర్జగాన్= (మేఘ) ఘోషగా; (ఉఱుముగా); మేని= దేహానికి సంబంధించిన; కృష్ణ, కాంతి= నల్లని కాంతితో; కవ్వడి+అను, కారు, మొగులు= అర్జునుడు అనే నల్లని మబ్బు; పొలిచెన్= శోభించింది.

తాత్పర్యం: అర్జునుడు అనే నల్లని మేఘం శోభిల్లింది. అనగా అర్జునుడు నల్లని మబ్బువలె భాసించాడు. అతడి ధనుస్సు ఇంద్రచాపంవలె శోభిల్లింది. అతడి దివ్యకిరీట కాంతి మెఱపు తీగల వెలుగులుగా మిరుమిట్లు కొల్పింది. అతడి వింటి అల్లెత్రాటి మ్రోత మేఘగర్జనవలె విన్పించింది. అతడి నల్లని శరీరం మేఘవర్ణాన్ని పోలింది.

విశేషం: అలం: ఉపమానుప్రాణితం. కవ+వడి= రెండు వేగాలు కలవాడు- సవ్యసాచి; అర్జునుడు తన రెండు చేతులతో బాణాలు ప్రయోగించే సామర్థ్యం సంపాదించాడు.

మ. వివిధోద్దామ హయావళీబహుళ మై విక్రాంతి కేళీ సము
త్సవ కౌతూహల సుందరం బగు మహాసైన్యంబుతో మేదినీ
ధవ సందోహము ప్రీతిఁ బొంద మహిమోదాత్తోగ్రయానంబులం
గవ లేతెంచిరి వేడ్క నొండొరులకుం గయ్యంబుమైఁ జెప్పుచున్. 109

ప్రతిపదార్థం: వివిధ+ఉద్దామ హయ+ఆవళీ+బహుళము+ఐ= పెక్కు రకాల భయంకరాలు అయిన గుర్రాల గుంపులతో దట్టమై; విక్రాంతి, కేళీ, సముత్సవ, కౌతూహల, సుందరంబు+అగు= పరాక్రమక్రీడ అనే సంబరాన్ని సందర్శించుటచే అందగించిన; మహా+సైన్యంబుతోన్= గొప్ప సేనతో; మేదినీధవ, సందోహము= రాజుల సమూహం; ప్రీతిన్+పొందన్= సంతోషించగా; మహిమ+ఉదాత్త+ఉగ్రయానంబులన్= గొప్పదనంతో అతిశయించి భయంకరంగా కనిపించే వాహనాలతో; కవలు= (జంట) నకుల సహదేవులు; వేడ్కన్= సంతోషంతో; ఒండొరులకున్= ఒకరితో ఒకరు; కయ్యంబుమైన్+చెప్పుచున్= యుద్ధం గూర్చి మాటాడుతూ; ఏతెంచిరి= యుద్ధానికి వచ్చారు.

తాత్పర్యం: అమడ బిడ్డలైన నకుల సహదేవులు ఒకరితో ఒకరు యుద్ధాన్ని గూర్చి సల్లాపాలు ఆడుకొంటూ బయలుదేరి యుద్ధరంగానికి వచ్చారు. వారితోపాటు గొప్ప సైన్యం ఉన్నది. ఆ సైన్యంలో పెక్కు రకాలయిన వాహనాలు ఉన్నాయి. అవి శత్రువులకు భయంకరంగా కన్పించాయి; కదన కుతూహలంతో ఉత్సాహంతో సైన్యాలు కదలసాగాయి. కవలు అధిరోహించిన వాహనాలు గంభీరంగా భాసించాయి.

విశేషం: 1. యానములు: అనగా వాహనాలు. బండి, రథం, పల్లకి, గుర్రం, ఏనుగు మొదలైనవి. ప్రాచీన యుద్ధ తంత్రం అయిదు విధాలయిన 'యానములను' పేర్కొన్నది. 1. సంధానయానం 2. ప్రసంగయానం 3. నిగృహ్యయానం 4. సంభూయయానం 5. ఉపేక్ష్యయానం.

మ. రభసక్షోభితమేదినీతలముపై రథ్యప్రచారంబు లొ
ప్ప భుజాగర్వము నెమ్మొగంబులఁ దలిర్పం గన్నెకయ్యంబు న
ర్థి భవత్పుత్రులమీఁది కోపమున నుద్దీపింప నేతెంచి ర
య్యభిమన్యుండును ద్రౌపదేయులును మాద్యద్దంతియూథాకృతిన్. 110

ప్రతిపదార్థం: రభస, క్షోభిత, మేదినీ, తలముపైన్= వేగముచేత కలతపెట్టబడిన భూప్రదేశంమీద; రథ్యప్రచారంబులు+ఒప్పన్= గుర్రాల కదలికలు ఒప్పగా; భుజా+గర్వము= పరాక్రమం యొక్క దర్పం; నెఱ+మొగంబులన్= నిండు మొగాల అందు; తలిర్పన్= శోభిల్లగా; కన్నె, కయ్యంబున్+అర్థిన్= మొదటిసారిగా యుద్ధం చేయాలని కోరుతూ; భవత్+పుత్రులమీది కోపమునన్= నీ కొడుకులమీది ఆగ్రహంతో; ఉద్దీపింపన్= వెలుగొందగా; ఆ+అభిమన్యుండును= ఆ అభిమన్యుడును (అర్జునునకు సుభద్రకు పుట్టినవాడు); ద్రౌపదేయులును= ద్రౌపదికి పుట్టిన వారున్నూ; మాద్యత్+దంతి, యూథ+ఆకృతిన్= మదించిన ఏనుగుల గుంపు యొక్క ఆకారముతో; ఏతెంచిరి= వచ్చారు.

తాత్పర్యం: భూమి దద్దరిల్లిపోయేటట్లుగా గుర్రాలను నడిపిస్తూ పరాక్రమాతిశయం ముఖాలలో ప్రతిబింబిస్తుండగా, నీ కొడుకుల మీది కోపం ప్రేరేపించగా కన్నెకయ్యం చేయాలనే కోరికతో అభిమన్యుడు, ద్రౌపదీపుత్రులు మదించిన ఏనుగుల గుంపువలె రణరంగానికి బయలుదేరి వచ్చారు.

విశేషం: కన్నె కయ్యము= ప్రథమ సంగ్రామం. సుభద్ర కొడుకైన అభిమన్యుడు అందరికంటె చిన్నవాడు - వయసులో ద్రౌపది కొడుకులు యువకులు. వారు ఇంత వరకు యుద్ధంలో పాల్గొనలేదు. కురుక్షేత్ర సంగ్రామమే వారికి ప్రప్రథమ యుద్ధం. అదే వారికి మొదటి అవకాశం కాబట్టి వారి ఉత్సాహం పేర్కొనదగింది. కన్నె= పెండ్లికాని అమ్మాయి. కన్నెకు మొదటిరాత్రి అనుభూతి ఎట్టిదో - అట్టిదే ఈ యువకులకు ప్రప్రథమ యుద్ధం 'కన్నెకయ్యము' ప్రౌఢ ప్రయోగం.

"కన్నె కయ్యంబనగ - ప్రథమ యుద్ధాఖ్య"- ఆంధ్ర భాషార్ణవం 2-222.

వ. ఇవ్విధంబునం బ్రతివింధ్యుండును, శ్రుతసోముండును, శ్రుతకీర్తియు, శతానీకుండును, శ్రుతసేనుండును సౌభద్రుండును దమకుం గన్నాకుగాఁ జెన్నుమిగిలి చనుదేరం గనుంగొని కౌంతేయ బలంబులు సంతసంబునం బొదలె; నప్పుడు. 111

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ రీతిగా; ప్రతివింధ్యుండును= ప్రతివింధ్యుడును; శ్రుతసోముండును= శ్రుతసోముడును; శ్రుతకీర్తియున్= శ్రుతకీర్తియు; శతానీకుండును= శతానీకుడును; సౌభద్రుండును= సుభద్ర కొడుకు అభిమన్యుడును; తమకున్= తమకు; కన్నాకుగాన్= నాయకులుగా; చెన్ను+మిగిలి= అందం అతిశయించగా; చనుదేరన్+కనుంగొని= రావటం చూచి; కౌంతేయ+బలంబులు= కుంతీసుతులైన పాండవుల సేనలు; సంతసంబునన్+పొదలెన్= సంతోషంతో వర్ధిల్లాయి; అప్పుడు= ఆ సమయంలో.

తాత్పర్యం: ఈ రీతిగా, ద్రౌపది కొడుకులైన ప్రతివింధ్యుడు, శ్రుతసోముడు, శ్రుతకీర్తి, శతానీకుడు, శ్రుతసేనుడును మరియు సుభద్ర కొడుకు అగు అభిమన్యుడు తమకు నాయకులుగా రావటం చూచి పాండవుల సేనలు సంతోషంతో ఒప్పారాయి. ఆ సమయంలో-

విశేషం: ధర్మరాజుకు, ద్రౌపదికి పుట్టిన కొడుకు - ప్రతివింధ్యుడు. భీముడికి ద్రౌపదికి పుట్టిన కొడుకు - శ్రుతసోముడు.అర్జునుడికి ద్రౌపదికి పుట్టిన కొడుకు - శ్రుతకీర్తి. నకులుడికి ద్రౌపదికి పుట్టిన కొడుకు - శతానీకుడు. సహదేవుడికి ద్రౌపదికి పుట్టిన కొడుకు - శ్రుతసేనుడు. అర్జునుడికి సుభద్రకు పుట్టిన కొడుకు - అభిమన్యుడు.

సీ. కరుల సందడి నొప్పు ఘనసేన దుర్దమ । లీలఁ దో నడవఁ బాంచాలవిభుఁడుఁ
దనుజులు ననుజులు దర్పదుర్జయసైన్య । మహిమఁ దో నేతేర మత్స్యపతియు
యాదవానీకంబు లవని గ్రక్కదలఁ దోఁ । జనుదేరఁ బొలుపారి సాత్యకియును
యోధవీరులు ప్రతాపోగ్ర వాక్యములతోఁ । దనుఁ జుట్టిరాఁ జేకితానవిభుఁడు

తే. బాసటై వీరరథికులు బలసి యెలమి । నొండొరుల గరువంబుగ నుల్లసంబు
లాడుచును జేరి నడతేర నత్యుదార । గతి శిఖండియు నడచిరి కౌరవేంద్ర! 112

ప్రతిపదార్థం: కౌరవ+ఇంద్ర!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; కరుల సందడిన్+ఒప్పు= ఏనుగుల సంరంభంతో విలసిల్లే; ఘన+సేన= గొప్ప సైన్యం; దుర్దమ లీలన్= నిర్జించటానికి వీలులేని విధంగా; తోన్+నడవన్= కూడి కదలగా; పాంచాలవిభుఁడున్= పాంచాల రాజు ద్రుపదుడూ; తనుజులు+అనుజులు= కొడుకులును తమ్ముళ్ళూ; దర్ప, దుర్జయ, సైన్య, మహిమన్= గర్వం కలిగి, జయింపరానట్టి సేనయొక్క గొప్పదనంతో; తోన్+ఏతేరన్= వెంట రాగా; మత్స్యపతియున్= మత్స్యదేశానికి రాజు (విరాటుడును); యాదవ+అనీకంబులు= యదుకులమునకు సంబంధించిన సేనలు; అవని= భూమి; క్రక్కదలన్= దద్దరిల్లగా; తోన్+చనుదేరన్= వెంబడి రాగా; పొలుపారి= ఒప్పుతూ; సాత్యకియును= సాత్యకియును; యోధ+వీరులు= యుద్ధం చేసే శూరులు; ప్రతాప+ఉగ్ర వాక్యములతోన్= పరాక్రమంతో కూడిన భయంకరములైన మాటలతో; తనున్= తనను; చుట్టిరాన్= పరివేష్టించి రాగా; చేకితానవిభుడు= చేకితాన రాజు; బాసట+ఐ= తోడై; వీర+రథికులు= వీరులైన రథికులు (రథము నెక్కి యుద్ధం చేసేవారు); బలసి= దట్టంగా చేరి; ఎలమిన్= ప్రీతితో; ఒండొరులన్= ఒకరితోనొకరు; గరువంబుగన్= దర్పంతో; ఉల్లసంబులు+ఆడుచున్+చేరి= సల్లాపాలు చేస్తూ కూడి; నడతేరన్= నడచిరాగా; అతి+ఉదార+గతిన్= మిక్కిలి గొప్పదనం గోచరించే విధంగా; శిఖండియున్= శిఖండియు; నడచిరి= తరలి వెళ్ళారు.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! ఏనుగుల సంరంభంతో విలసిల్లే గొప్ప సేనతో, జయించటానికి వీలులేని విధంగా పాంచాలప్రభువైన ద్రుపదుడూ, తన కొడుకులూ, తమ్ముళ్ళూ తమను ఎవరూ నిర్జించలేరనే ధైర్యంతో

తన వెంట వచ్చే సైన్యంతో మత్స్యరాజు అయిన విరాటుడూ, యాదవ సైన్యాలు భూమి దద్దరిల్లేటట్లు తనతో రాగా సాగసుగా సాత్యకీ, యుద్ధం చేయాలనే ఉత్సాహంతో పరాక్రమం వెల్లివిరిసే సల్లాపాలు ఆడుతూ తన వెంట యోధవీరులు రాగా చేకితానుడూ, తోడై ఒకరితో ఒకరు దర్పం ఉట్టిపడే విధంగా మాటాడుతూ వీరులు తమ వెంట శిఖండీరాగా, రణభూమికి నడిచారు.

చ. బధిరిత దిఙ్ముఖంబగుచు బంధుర తూర్య నికాయనాద మం
బుధియును బోలె సేనకు విభూతి యొనర్పఁగ నేఁగుదెంచె మా
గధ సహదేవుఁ డప్డు రణకౌతుక సల్లపనంబు నుజ్జ్వలా
యుధ విభవంబుఁ జెన్నొసఁగ నొప్పెడు తమ్మునిఁ బ్రీతిఁ జూచుచున్. 113

ప్రతిపదార్థం: బధిరిత, దిక్+ముఖంబు+అగుచున్= చెవుడుపరచబడిన దిక్కుల యొక్క అగ్రభాగాలు కలది ఔతూ;; బంధుర+తూర్య+నికాయనాదము= దట్టమైన యుద్ధవాద్య సముదాయం యొక్క ధ్వని; అంబుధియును+పోలెన్= సముద్రాన్ని పోలుతూ; సేనకున్= సైన్యానికి; విభూతి+ఒనర్పఁగన్= సంపద చేకూర్చగా; మాగధ, సహదేవుఁడు= మగధ దేశానికి ప్రభువైన సహదేవుడు; అప్డు= అపుడు; రణ, కౌతుక, సల్లపనంబున్= యుద్ధం చేయటంలోగల ఉత్సాహాన్ని తెలిపే సంభాషణలును; ఉజ్జ్వల+ఆయుధ, విభవంబున్= ప్రకాశించే ఆయుధాల గొప్పదనమూ; చెన్ను+ఒసఁగన్= సొగసు నింపగా; ఒప్పెడు= విలసిల్లెడు; తమ్మునిన్= సోదరుడిని; ప్రీతిన్= వేడ్కతో; చూచుచున్= చూస్తూ; ఏగుదెంచెన్= (యుద్ధానికి) తరలివచ్చాడు.

తాత్పర్యం: మగధ దేశరాజు అయిన సహదేవుడు తన తమ్ముడితో కలిసి యుద్ధభూమికి తరలి వచ్చాడు. ఆతడి సేననుండి వెలువడిన భేరీ పటహకాహళాలు మున్నగు యుద్ధ వాద్యాల ధ్వనులు దిక్కులు పిక్కటిల్ల చేశాయి. ఆ సేన సముద్రం వలె ఉప్పొంగిపోతూ కదలింది. రణకౌతూహలం తెలిపే ఆతని సంభాషణలూ ధగధగా మెరిసే ఆయుధాలూ ఆ దండయాత్రకు శోభను చేకూర్చాయి.

విశేషం: ఆనాడు మగధ సామ్రాజ్యం భారతదేశంలో సువిశాలమైనది. సహదేవుడు ఆ మహాసామ్రాజ్యపాలకుడు. అతడి తండ్రి జరాసంధుడు. శ్రీకృష్ణుడిపై పలుమారులు దండెత్తాడు. ఆతడి ధాటికి ఓర్వలేక శ్రీకృష్ణుడు తన రాజధానిని మధుర నుండి ద్వారకకు తరలించాడు. రాజసూయయాగ సందర్భంలో శ్రీకృష్ణుడు అర్జునుడిని, భీముడిని వెంటపెట్టుకొని వెళ్ళి జరాసంధుడి ఎక్కటి కయ్యంలో భీముడిచే చంపించాడు. అయితే శ్రీకృష్ణుడు పాండవులు మగధసామ్రాజ్యాన్ని జరాసంధుని కొడుకు సహదేవునికే ఇచ్చి పట్టాభిషిక్తుడిని చేసి అతడిని మిత్రుడిగా చేసికొన్నారు. మగధ ప్రభువు మహాభారత యుద్ధంలో కృతజ్ఞతతో పాండవపక్షంలో చేరి పోరాడాడు.

ఉ. చండ భుజాబలంబుఁ బటుశౌర్యసముల్లసనంబుఁ దోఁప ను
ద్దండత నాత్మ సైనికుల దర్ప మెలర్పఁగ నెమ్మిఁ బల్కుచున్
బాండవకోటి చూడ్కులకుఁ బండువుగాఁ జనుదెంచె ధృష్టకే
తుండు సహోదరుండు దనతో నడతేరఁ బరాక్రమోద్ధతిన్. 114

ప్రతిపదార్థం: చండ, భుజా, బలంబున్= తీవ్రమైన పరాక్రమమూ; పటు శౌర్య సముల్లసనంబున్= మిక్కిలి గొప్పదైన వీరత్వంయొక్క ఉత్సాహమూ; తోఁపన్= కన్పిస్తుండగా; ఉద్దండతన్= మిక్కుటంగా; ఆత్మ, సైనికుల, దర్పము+ఎలర్పఁగన్= తన భటుల గర్వం అతిశయించగా; నెమ్మిన్+పల్కుచున్= ప్రీతితో చెప్పుతూ; పాండవ, కోటి, చూడ్కులకున్+పండువుగాన్= పాండవసేనా సమూహాల కన్నులకు పండుగగా; ధృష్టకేతుండు= ధృష్టకేతుడు (అనే పేరుగల రాజు); సహోదరుఁడు= సోదరుడు (తమ్ముడు); తనతోన్= తన వెంట; నడతేరన్= రాగా; పరాక్రమ+ఉద్ధతిన్= శౌర్యం యొక్క ఆటోపంతో; చనుదెంచెన్= (యుద్ధభూమికి) వచ్చాడు.

తాత్పర్యం: ధృష్టకేతుడు అనే రాజు తన తమ్ముడితోపాటు యుద్ధభూమికి తరలివచ్చాడు. తీక్ష్ణమైన పరాక్రమం యుద్ధం చేయటంలో చాకచక్యం వెల్లడించే సంభాషణలతో అతడు తన సైనికులకు ప్రోత్సాహం కల్పించాడు. అతడి దండయాత్ర పాండవసేనలలోని భటులకు కన్నుల పండువుగా భాసించింది.

మ. విచలద్దండధరోపమాశ్రయ వపుర్విస్ఫార మై దానవ
ప్రచయం బుద్ధత లీలఁ గొల్వఁగఁ దమోరాశిప్రతీకాశ ఘో
రచలద్రూపము భంగికిం దగిన దంష్ట్రాయుగ్మ మొప్పన్ ఘటో
త్కచుఁ డేతెంచెఁ గరస్థ శూల రుచు లాకాశంబునన్ బర్వఁగన్. 115

ప్రతిపదార్థం: విచలత్+దండధర+ఉపమ+ఆశ్రయ, వపుః+విస్ఫారము+ఐ= చలించేటటువంటిదియును; యముడితోడి పోలికకు ఆశ్రయమైన శరీరకాంతి కలిగినట్టిదియు అయిన; దానవ, ప్రచయంబు= రాక్షసులమూక; ఉద్ధతలీలన్= దర్పం వెల్లివిరిసే రీతిగా; కొల్వఁగన్= ఆరాధిస్తూ వెంటరాగా; తమః+రాశి, ప్రతీకాశ, ఘోర, చలత్+రూపము+భంగికిన్= చీకటి ప్రోగులకు సమానమై భయంకరంగా కదిలే ఆకారం రీతికి; తగిన= సరిపోయే; దంష్ట్ర, యుగ్మము= కోరల జత; ఒప్పన్= విలసిల్లగా; ఘటోత్కచుఁడు= ఘటోత్కచుడు (అనే పేరుగల రాక్షసుడు); కరస్థ, శూల, రుచులు= చేతియందు ఉన్న బల్లెం వెలుగులు; ఆకాశంబునన్= ఆకసంలో; పర్వఁగన్= వ్యాపించగా; ఏతెంచెన్= వచ్చాడు.

తాత్పర్యం: ఘటోత్కచుడు అనే రాక్షసుడు చేతిలో ఉన్న త్రిశూలం ఆకాశంలో వెలుగులు విరజిమ్మేటట్లు త్రిప్పుతూ యుద్ధభూమికి వచ్చాడు. కదలే చీకటి రాశికి సరిపోయే ఆకారానికి తగినట్లుగా అతడి నోటి నుండి భయంకరమైన రెండు కోరలు కనుపిస్తున్నాయి. అతడి వెంట, యమధర్మరాజు శరీరచ్ఛాయతో సమానమైన దేహాలు కల రాక్షసుల మూకలు అతడిని ఆరాధిస్తూ తరలివచ్చాయి.

విశేషం: ఘటోత్కచుడు హిడింబాభీముల కొడుకు. ఈతడు మహాభారత యుద్ధంలో పాండవ పక్షాన పోరాడి శత్రు విధ్వంసం చేశాడు. మాయాయుద్ధ నిపుణుడైన ఈతడిని కర్ణుడు తనకు దేవేంద్రుడు (సహజ కవచకుండలాలు అతనికి దానం చేసినపుడు) ఇచ్చిన శక్తిని ప్రయోగించి సంహరించాడు.

వ. పాండ్యపతియును గేకయపంచకంబును శైబ్యుండును మఱియుం గాశకరూశాది బహుదేశాధీశులును దమతమ
బలంబుల దళంబుల సవరణల యొప్పును గయ్యంపుఁ గడంకయు నెఱయం గేతనంబులు మెఱయం దోఁతెంచి;
రిత్తెఱంగునం గూడి సప్తాక్షౌహిణీ బంధురంబుగాఁ బేర్చిన పాండవసేన మొగంబునకుం దిలకం బై. 116

ప్రతిపదార్థం: పాండ్యపతియును= పాండ్యరాజూ; కేకయ పంచకంబును= కేకయ రాజ్యాధిపతులైన అయిదుగురు రాజులూ; శైబ్యుండును= శిబి వంశానికి చెందిన రాజూ; మఱియున్, కాశ+కరూశ, ఆది, బహు, దేశ+అధీశులును= కాశదేశం కరూశదేశం మున్నగు పెక్కు దేశాలను పరిపాలించే రాజులును; తమ+తమ+బలంబుల= తమ తమ సేనల; దళంబుల= సేనా సమూహాల; సవరణల+ఒప్పును= అలంకారాల అందచందాలు; కయ్యంపు+కడంకయున్= యుద్ధము నందలి పూనికయు; నెఱయన్= ప్రకాశించగా; కేతనంబులు= జెండాలు; మెఱయన్= ప్రకాశించగా; తోఁతెంచిరి= వచ్చారు; ఈ+తెఱంగున్= ఈ రీతిగా; కూడి= కలిసి; సప్త+అక్షౌహిణీ బంధురంబుగాన్= ఏడు అక్షౌహిణులతో కూడినదై, పేర్చిన= అతిశయించిన; పాండవ సేన మొగంబున కున్=పాండవుల సైన్యం యొక్క అగ్రభాగానికి (నుదుటికి); తిలకంబు+ఐ= బొట్టువలె వెలిగొందుతూ (ధృష్టద్యుమ్నుడు).

తాత్పర్యం: పాండవుల సైన్యం ఏడు అక్షౌహిణులు అయింది. అందులో పాండ్యరాజు, శిబి వంశీయుడైన రాజు, కాశ కరూశాది రాజులు, పంచ కేకయులు తమ తమ సేనలతో ఆయుధాలతో వెలుగొందుతూ వచ్చి చేరారు.

విశేషం: 1. శిబి కథ - ప్రాచీన భారత సారస్వతంలో బౌద్ధ వాఙ్మయంలో సుప్రసిద్ధం. 'పరోపకారార్థ మిదం శరీరం' అనే ఆదర్శం ఆచరణలో అనువదించి శరణార్థియైన పావురం కోసం తన శరీర మాంసాన్ని కోసి ఇచ్చిన వదాన్యుడు శిబి.

2. భారతదేశంలో దక్షిణపు కొస ఉన్న దేశం పాండ్యరాజ్యం. ఆ రాజు కూడా మహాభారత యుద్ధంలో పాల్గొన్నాడు.

శా. పుష్టోదంచిత సారవీరరససంపూర్ణాంగమున్ సంగరా
వష్టంభోజ్జ్వల వీరరేఖయును భాస్వద్వాహ సంవల్గనో
త్కృష్ట స్యందనముం గనద్ధనువు నుద్దీప్త ధ్వజంబుం దగన్
ధృష్టద్యుమ్నుఁడు వొల్చె నైజవిలసత్తేజోవిరాజద్గతిన్. 117

ప్రతిపదార్థం: పుష్ట+ఉదంచిత, సార, వీర రస, సంపూర్ణ+అంగమున్= ప్రకాశించే నిండుదనం యొక్క నిగ్గుగా వీరరసంతోనూ అంగాలతో ఉపాంగాలతో సమృద్ధమైన శరీరమై; సంగర+అవష్టంభ+ఉజ్జ్వల, వీర, రేఖయును= యుద్ధగర్వంతో చేసికొన్న వీరత్వ చిహ్నితమైన ఆకారమూ; భాస్వత్+వాహ, సంవల్గన+ఉత్కృష్ట, స్యందనమున్= ప్రకాశించే గుర్రాల యొక్క దౌడు తీయటంచేత గొప్పదైన రథమూ; కనత్+ధనువు= ప్రకాశించే విల్లు; ఉద్దీప్త ధ్వజంబున్= దేదీప్యమానంగా వెలుగొందే జెండా; తగన్= ఒప్పగా; నైజ, విలసత్+తేజస్+విరాజత్+గతిన్= స్వభావసిద్ధంగా వెలుగొందే ప్రభుశక్తితో ప్రకాశించే రీతిగా; ధృష్టద్యుమ్నుఁడు= (పాండవ సర్వసేనాధిపతి, ద్రుపద మహారాజు కొడుకు ద్రౌపది అన్నగారు); పొల్చెన్= విలసిల్లాడు.

తాత్పర్యం: పాండవ పక్షంలో సర్వసేనాధిపతి అయిన ధృష్టద్యుమ్నుడు దేదీప్యమానంగా వెలుగొందాడు. అతడి శరీరం కరడుగట్టిన వీరరసంగా కనుపించింది. నిండైన ఆతడి విగ్రహం పరాక్రమసారంగా భాసించింది. యుద్ధగర్వం తోడి వీరరేఖ ఆతడి ముఖంలో వెలిగింది. ఆతడి రథం క్రమశిక్షణతో దౌడు తీయగల గుర్రాలతో పూన్చబడింది. నాయకత్వ లక్షణాలు, ప్రభుశక్తి ఆతడికి స్వభావసిద్ధాలుగా భాసించాయి.

విశేషం: ధృష్టద్యుమ్నుడు కారణజన్ముడుగా మహాభారతంలో అభినుతుడు. ద్రోణుడు ద్రుపద మహారాజు శైశవంలో సహపాఠకులు. తదుపరి ద్రుపదుడు రాజైనప్పుడు ఆతడు అర్థిగా తనవద్దకు వచ్చిన ద్రోణుడిని మన్నించలేదు. ద్రోణుడు గురుదక్షిణగా అర్జునుడిని కోరి, ద్రుపద రాజును బందీకృతుడిని చేయించాడు. అవమానఖిన్నుడైన ద్రుపదుడు తపస్సు చేసి ద్రోణుడిని సంహరించగల కొడుకుగా ధృష్టద్యుమ్నుడిని పడశాడు.

వ. ఇట్లొప్పి సేనాపతి యగు నా ద్రుపదసుతుండు ముంగలియై నడపించుచుండ. 118

ప్రతిపదార్థం: ఇట్లు+ఒప్పి= ఈ విధంగా విలసిల్లి; సేనాపతి+అగు= సేనకు నేత అయిన; ఆ+ద్రుపద+సుతుండు= ఆ ద్రుపద రాజు కొడుకు- ధృష్టద్యుమ్నుడు; ముంగలి+ఐ= సైన్యమునకు ముందున్న వాడై; నడపించుచుండన్= సేనలను నడిపించుచుండగా.

తాత్పర్యం: ఈ విధంగా విలసిల్లుతూ ధృష్టద్యుమ్నుడు ముందుండి పాండవ సైన్యాన్ని నడిపిస్తూ ఉండగా.

సీ. ఇల ధూళి యెగసినఁ బలుచగాకుండంగ । రాసిన తొడవుల రజము దొరఁగు,
సమరవికాసంబు చెమట నొప్పఁకుండ । హేతి దీధితులు రేయెండ నొడుచు,
భేరీధ్వనుల నింగి బీటలు వోకుండఁ । గరికర శీకరోత్కరము దడుపు,
దర్పంబు గనుఁజాటు దాఁకకుండఁగ గొడు । గులపెల్లు ఖచర ధృక్కోటి నాఁగు,

తే. ననిన నిజమైనయట్లుండె మనుజనాథ! । ధరణి వడవడ వడఁకె దిక్తటము లద్రువ
భూరి చతురంగ చండ విస్ఫూర్తిఁ బాండు । నందనులసేన గలనికి నడచునవుడు. 119

ప్రతిపదార్థం: ఇల+ధూళి+ఎగసినన్= భూమి మీది దుమ్ముపైకి వ్యాపించగా; పలుచగాకుండంగన్= పలచవైపోకుండా; రాసిన, తొడవుల, రజంబు= రాపిడిపొందిన ఆభరణాల కణాలు; తొరఁగున్= పడతాయి; సమర, వికాసంబు, చెమటన్= యుద్ధం గూర్చిన శ్రమవలన ఏర్పడిన చెమటచేత; ఒప్పఱకుండన్= ఒప్పుచెడకుండా; హేతి+దీధితులు= కత్తుల కాంతులు; రే+ఎండన్= లేతయెండను; ఒడుచున్= వ్యాపింపచేస్తున్నాయి; భేరీ, ధ్వనులన్= యుద్ధవాద్యమైన భేరీ నాదాలచేత; నింగి= ఆకసం; బీటలు+పోకుండన్= బ్రద్దలు కాకుండగా; కరికర, శీకర+ఉత్కరము= ఏనుగుల తుండాల నుండి వెలువడే నీటి చిరుజల్లుల సముదాయం; తడుపున్= (నీటితో) చెమ్మగిల్ల చేస్తుంది; దర్పంబు= అహంకార గర్వం; (పాండవసేన యొక్క అతిశయానికి) కనుబాటు+కాకుండన్= (దిష్టి) దృష్టిదోషం తగులకుండా; గొడుగుల పెల్లు= ఎక్కువ గొడుగులు ఉండటం (గొడుగుల గుంపు); ఖచర దృక్+కోటిన్+ఱగున్= ఆకాశంలో సంచరిస్తున్న వారి దృష్టులను అరికట్టుతుంది; అనినన్= అని అభివర్ణిస్తే; నిజము+ఐన+అట్లు+ఉండెన్= అది సత్యమే అయినట్లు తోస్తున్నది.; మనుజనాథ!= (ఓ ధృతరాష్ట్ర మహారాజా!); పాండునందనుల+సేన= పాండవుల సైన్యం; భూరి, చతురంగ, చండ, విస్ఫూర్తిన్= ఎక్కువైన, నాలుగు అంగాల (రథ, గజ, తురగ, పదాతి); చండ+విస్ఫూర్తిన్= తీవ్రమైన ప్రకాశంతో; దిక్+తటములు+అద్రువన్= దిక్కుల అంచులు అదిరిపోగా; ధరణి= భూమి; వడవడ= గజగజ (ఎక్కువగా); వడఁకెన్= చలించింది.

తాత్పర్యం: ఈ పద్యం పాండవసేన కురుక్షేత్రానికి తరలివెళ్లటం అభివర్ణిస్తున్నది. భూమిమీద ధూళి ఎగసింది. సేనలోని భటులు, వాహనాలు కదిలి వెళ్ళుతుండగా వీరులు ధరించిన ఆభరణాల రాపిడి వలన ఏర్పడిన రజం ఆ ధూళిని ఇనుమడింపచేసింది. యుద్ధ సన్నద్ధులయిన వీరులకు చెమట పట్టింది. ఆ చెమట ఆరిపోయేటట్లు వీరుల కత్తుల తళతళలు లేతయెండ ప్రసరింపచేశాయి. భేరీ ధ్వనులు ఆకాశాన్ని అంటాయి. ఆకాశం బీటలు వారకుండ ఏనుగుల తొండాల నుండి నీటితుంపురులు విస్తరిల్లాయి. దర్పంతో విజృంభించే పాండవ సైన్యానికి ఆకాశంలో విమానాల నుండి చూచే దేవతల, పితరుల 'దృష్టిదోషం' తగులకుండగా, వెల్లగొడుగులు అడ్డు వచ్చాయి. పాండవ సైన్యం చతురంగబలాలతో దండయాత్ర ఆరంభించినపుడు ధరణి గజగజ వణికింది అనీ, దిక్కులు దద్దరిల్లి పోయాయి అనీ సంజయుడు ధృతరాష్ట్రుడితో చెప్పాడు.

విశేషం: అలం: అతిశయోక్తి. ఈ సీసపద్యం- తిక్కన విరాటపర్వంలో ధర్మరాజును గూర్చి 'ఎవ్వాని వాకిట నిభమద పంకంబు । రాజభూషణరజో రాజి నణగు' అనే పద్యాన్ని జ్ఞప్తికి తెస్తుంది.

వ. ఇట్లు నడచి కురుక్షేత్రంబులోన నుత్తమప్రదేశం బగు శమంతపంచక సమీప స్థలంబు సేరు సమయంబున ధర్మనందనునకు దోఁచు దక్షిణాక్షిస్పందనాది శుభసూచకంబులకు మెఱుంగు వెట్టిన చందంబున. 120

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; నడచి= (దండెత్తి) వెళ్ళి; కురుక్షేత్రంబులోనన్= కురుక్షేత్రంలో; ఉత్తమ,ప్రదేశంబు+అగు= మంచిచోటఅయిన; శమంతపంచక, సమీప, స్థలంబునన్= శమంతపంచకం అనే పేరుగలచోటుకు దగ్గరగా; చేరు+సమయంబునన్= చేరిన వేళ; ధర్మనందనునకున్= ధర్మరాజుకు; తోఁచు= స్ఫురించే; దక్షిణ+అక్షి, స్పందన+ఆది+శుభ సూచకంబులకున్= కుడికన్ను అదరటం మొదలైన మంచి శకునాలకు; మెఱుంగున్+పెట్టిన+చందంబునన్= అతిశయమైన దీప్తిని కలిగించిన రీతిగా.

తాత్పర్యం: ఉత్సాహం పెల్లుబుకుతూ పాండవ సైన్యం ఈ విధంగా కురుక్షేత్రంలో గొప్ప చోటుగా ప్రసిద్ధికి ఎక్కినట్టి శమంతపంచకం అనే చోటికి దగ్గరగా చేరినప్పుడు, ధర్మరాజునకు కుడికన్ను అదరటం మొదలైన శుభశకునాలు తోచాయి. అంతేకాక- (మరికొన్ని మంచి శకునాలు ఏర్పడ్డాయి. తరువాతి పద్యంతో అన్వయం)

విశేషం: 1. శమంతపంచకం- కురుక్షేత్రంలో భారతసంగ్రామ సమయంలో మిక్కిలి పేరుకెక్కిన ప్రదేశం. అయిదు సరస్సులతో కూడిన ప్రదేశం అది. పరశురాముడు, క్షత్రియులను నిర్జించిన పిదప, తన గండ్రగొడ్డలిని ఈ సరస్సులలో కడుగుకున్నాడని పురాణ కథనం.

2. ప్రాచీనకాలంలో విరోధిసేనలు - ఇరుపక్షాలకు అనువైనచోట చేరి యుద్ధం చేసేవి. అట్టి యుద్ధస్థలాలలో పురాణ ప్రసిద్ధమైనది "కురుక్షేత్రం." భౌగోళికంగా కురుక్షేత్రం కీలకమైన చోటు అని చెప్పవచ్చు. చారిత్రక కాలంలో గూడ ఎన్నో యుద్ధాలు కురుక్షేత్ర సమీపంలో ఉన్న పానిపట్టు ప్రదేశంలో జరగటం వేత్తలకు తెలిసినట్టి అంశమే.

క. ఏనుఁగుల మదము తావియు । సైనిక నికరానులేపసౌరభ్యములుం
దా నుపలాలించుచుఁ బవ । మానుం డనుకూల మృదు గమనమునఁ బొలసెన్. 121

ప్రతిపదార్థం: పవమానుండు= గాలిదేవుడు; ఏనుఁగుల, మదము, తావియున్= ఏనుగుల కుంభస్థలాల నుండి కారే మదజలము వలన ఏర్పడే పరిమళము; సైనిక, నికర+అనులేప, సౌరభ్యములున్= భటుల సమూహాలు చేసికొన్న మైపూతల నుండి వ్యాపించిన సుగంధములును; తాన్= తాను (గాలిదేవుడు); ఉపలాలించుచున్= నిమిరి బుజ్జగిస్తూ; అనుకూల, మృదు, గమనమునన్= సరిపడి సాయం చేసే మందగమనంతో, పొలసెన్= వ్యాపించాడు.

తాత్పర్యం: ఆ సమయంలో చక్కని చల్లని గాలులు కమ్మని తెమ్మెరలు వీచాయి. ఏనుగుల కుంభస్థలాల నుండి స్రవించే మదజలానికి సంబంధించిన పరిమళం, వీరులు తమ శరీరాలకు అలదుకొన్న మైపూతల సుగంధం ఆ గాలిలో కలిసిపోయి తేలియాడుతూ, పాండవులకు శుభసూచకమైన మంచి శకునంగా పరిణమించాయి.

వ. దానికయ్యుధిష్ఠిరుండు ప్రముదితచిత్తుండగుచుఁ బ్రీతచేతస్కులగు తమ్ములుం బాంచాలమాత్స్యాధిపతులును సకలజనంబులును పరివేష్టింపం దూర్పుమొగంబై కౌరవులున్న చక్కటికిం గట్టెదురుగా నిలిచి, యెల్లవారి సైన్యంబులుం గ్రమంబునఁ గొలంది వెట్టుకొనుచు , నందఱకు సంజ్ఞలు నడియాలంబులుం గల్పించి, దొరలదెసం గనుంగొని, మన మీ రణంబునందు ధరణీ రాజ్యంబు వడసెద మొండెఁ బూజ్యం బగు నాకలోకనివాసంబు గనియెద మొండె' నని నిశ్చయించి, నా కెలంకుల నిలువుం డని పలికిన, విని, వారలు ధీరోదాత్తంబులగు వివిధ వాక్యంబులం బ్రతిజ్ఞలు సేసి, నిజశంఖంబులు పూరించి, తమతమ బలంబులలోనికిం జని; రజ్జనపతియును దన కమర్చిన కజ్జంబులును బుష్పఫల కర్పూర కస్తూరికాదులును వారలకుం బుచ్చుచుండె.' 122

ప్రతిపదార్థం: దానికిన్= (ఆ శుభ శకునాలకు); యుధిష్ఠిరుండు= ధర్మరాజు; ప్రముదిత, చిత్తుండు+అగుచున్= సంతోషించిన మనస్సుకలవాడై; ప్రీత, చేతస్కులు+అగు= సంతోషించిన మనస్సులుకలవారైన; తమ్ములున్= తమ్ములును (భీమార్జున నకుల సహదేవులు); పాంచాల, మాత్స్య+అధిపతులును= పాంచాల రాజు (ద్రుపదుడు), మత్స్యరాజు (విరాటుడు)ను; సకల+జనంబులును= అందరూ; పరివేష్టింపన్= కొలువగా; తూర్పు+మొగంబు+ఐ= తూరుపు దెసకు మొగం పెట్టినవాడై; కౌరవులు+ఉన్న= (దుర్యోధనాదులు చేరిన); చక్కటికిన్= ప్రదేశానికి, చోటునకు; కడు+ఎదురుగాన్= మిక్కిలి ఎదురుగా; నిలిచి= నిలిచి; ఎల్లవారి+సైన్యంబులన్= అందరి సేనలనూ; క్రమంబునన్= వరుసగా; కొలంది+పెట్టుకొనుచున్= లెక్కలు కట్టుకొంటూ; అందరకున్= ఎల్లవారలకు; సంజ్ఞలు= గుర్తులు; అడియాలంబులున్= రాజలాంఛనాలు; కల్పించి= ఏర్పరిచి; దొరల, దెసన్+కనుంగొని= నాయకులవైపు చూచి; మనము= మనం; ఈ రణంబునందున్= ఈ యుద్ధంలో; ధరణీ రాజ్యంబు= భూపరిపాలన; పడసెదము= పొందగలం; ఒండు+ఎ= ఒకటి (అనగా పక్షాంతరము); రెండింటిలో ఒకటి (లేదా) (మరి యొకటి). పూజ్యంబు+అగు= పూజింప దగినది అయిన; నాక లోక నివాసంబున్+కనియెదము= స్వర్గలోకంలో ఉండటం అనేది పొందుదాము; అని= అని; నిశ్చయించి= నిర్ణయించి; నా కెలంకులన్= నాప్రక్కల; నిలువుండు= ఉండండి; అని+పలికిన= చెప్పిన; విని= ఆలకించి; వారలు= (పాండవ సేనలోని నాయకులు); ధీర+ఉదాత్తంబులు+అగు= ధైర్యసాహసాలతో కూడిన; వివిధ+వాక్యంబులన్= పెక్కుమాటలతో; ప్రతిజ్ఞలు= శపథాలు; చేసి= (పలికి); నిజ, శంఖంబులు+పూరించి= తమ తమ శంఖాలు ఊది; తమ తమ, బలంబులలోనికిన్+చనిరి= తమ తమ సేనలలోనికి వెళ్ళారు; ఆ+జనపతియును= ఆ రాజును (ధర్మరాజును); తనకున్+అమర్చిన= తనకు ఏర్పరచిన;

కజ్జంబులును= భక్ష్యములను; పుష్ప, ఫల, కర్పూర, కస్తూరిక+ఆదులును= పువ్వులు, పండ్లు, కర్పూరం, కస్తూరి మున్నగువాటిని; వారలకున్= ఆ దొరలకు; పుచ్చుచుండెన్= పంపుతూ ఉన్నాడు.

తాత్పర్యం: ఆ శుభశకునాలు చూచి ధర్మరాజు సంతోషించాడు. అతని తమ్ములు, పాండవ సేనలోని దొరలు కూడా సంతోషించారు. అప్పుడు ధర్మరాజు, ద్రుపద విరాటాదులైన రాజులనందరినీ కొలువుకూటానికి పిలిపించి ఈ విధంగా అన్నాడు: 'యుద్ధంలో మనం గెలుస్తామా, ఈ భూరాజ్యాన్ని ఏలుకుందాము. లేదా స్వర్గలోక సౌఖ్యం అనుభవించగలం. ఏదైన మనకు మంచిదే. దీనికి మీరు సిద్ధమై నా పక్షంలో చేరండి.' రాజులు అందరూ ఏకగ్రీవంగా ధర్మరాజు చెప్పిన మాటలు ఆమోదించి ధైర్యసాహసాలతో ఆ విధంగా ప్రవర్తించటానికి ప్రతిజ్ఞలు చేసి తమ తమ సేనలలోనికి వెళ్ళారు. వెళ్ళుతూ ఉత్సాహంతో శంఖాలు ఊదారు. ధర్మరాజు వారందరకు అభినందన చందనం, కర్పూరం, పూవులు ఫలాలు భక్ష్యాలు పంచిపెట్టాడు.

విశేషం: అడియాలములు, తిక్కన ఈ శబ్దాన్ని విరివిగా ప్రయోగించాడు. అడియాలాలు రాజలాంఛనాలు. గొడుగులు, అందలాలు, చామరాలు, మేల్కట్టులు, ముద్రికలు మున్నగునవి.

క. అనిన విని యాంబికేయుఁడు । మనమొన 'గడుఁ బెద్ద దీని మార్కొనఁ గుంతీ
తనయులు గొంచెంబయ్యును । ననుమానింపక కడంగు టది యెట్లొక్కో!' 123

ప్రతిపదార్థం: అనినన్+విని= అని (సంజయుడు చెప్పగా ఆలకించి); ఆంబికేయుఁడు= అంబిక కొడుకు- ధృతరాష్ట్రుడు; మనమొన= మనసేన; కడున్+పెద్ద= మిక్కిలి గొప్పది; దీనిన్= (ఈ కౌరవసేనను); మార్కొనన్= ఎదిరించి యుద్ధం చేయటానికి; కుంతీతనయులు= కుంతి కొడుకులైన పాండవులు; కొంచెంబు+అయ్యును= (తమసేన) మిక్కిలి చిన్నది అయినప్పటికిని; అనుమానింపక= సందేహించక; (పరాజయం కలుగుతుంది అనే సందేహం లేకుండగా); కడంగుట= పూనటం (యుద్ధం చేయటానికి పూనటం); అది= అది; ఎట్లు+ఒక్కో!= ఏ విధంగా జరిగిందో (ఆశ్చర్యంగా ఉందే)!

తాత్పర్యం: పాండవ సైన్యం ఉత్సాహంతో యుద్ధం చేయటానికి కురుక్షేత్రం చేరింది' అని సంజయుడు చెప్పగా ఆలకించి, ధృతరాష్ట్రుడు ఒక ఎదురు ప్రశ్న వేశాడు. 'ఓ సంజయా! కౌరవుల సేన చాలా పెద్దది కదా! అంతటి పెద్ద సైన్యాన్ని ఎదిరించి యుద్ధం చేస్తే ఓడిపోతామేమో అని పాండవులకు ఎందుకు సందేహం కలగలేదు? అంత ధైర్యంతో యుద్ధానికి ఏ విధంగా పూనుకున్నారు?'

వ. అనుటయు సంజయుం 'డదియునుంజెప్పెద విను' మని యతని కిట్లనియెఁ 'గౌంతేయాగ్రజుండు కురుబలంబు
గనుంగొని కొండొక విన్నవై వివ్వచ్చు నాలోకించి. 124

ప్రతిపదార్థం: అనుటయున్= అని (ధృతరాష్ట్రుడు చెప్పగా); సంజయుండు= సంజయుడు; అదియునున్+చెప్పెద, వినుము= దానిని గూడ నీకు చెప్పగలను ఆలకించవలసింది; అని+అతనికిన్+ఇట్లు+అనియెన్= అని ధృతరాష్ట్రుడికి ఈ విధంగా చెప్పాడు; కౌంతేయ+అగ్రజుండు= కుంతీకుమారులలో పెద్దవాడు- ధర్మరాజు; కురు+బలంబున్= కౌరవసేనను; కనుంగొని= చూచి; కొండొక+విన్నవై= కొంత దైన్యం చెంది; వివ్వచ్చున్= అర్జునుడిని; ఆలోకించి= చూచి.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడికి సంజయుడు ఈ విధంగా సమాధానం చెప్పాడు: 'ఓ ధృతరాష్ట్ర మహారాజా! నీకు ఆ సంగతి కూడా వివరించి చెప్పగలను. కుంతీకుమారులలో పెద్దవాడైన ధర్మరాజు పెద్దదైన కౌరవ సైన్యాన్ని చూచి, కొంత మేర భయపడి, ఆందోళన చెంది, అర్జునుడిని చూచి (తరువాతి పద్యంతో అన్వయం).

చ. ' ఘన మయి తోఁచుచున్నయది కౌరవసైన్యము చూడ్కి కందు శాం
తనవుని తాలకేతన ముదగ్రత ముందటఁ బొల్చెఁ జూచితే'
యనవుడుఁ బిన్ననవ్వు నగి యన్నరుఁ డన్నమొగంబుఁ జూచి నె
ట్టన బలుమాట లాడఁగఁ గడంగఁగ నొల్లక యత్యుదాత్తతన్. 125

ప్రతిపదార్థం: చూడ్కికిన్= చూపునకు (స్థూలదృష్టికి); కౌరవ+సైన్యము= (దుర్యోధనాదులైన) కౌరవుల సైన్యం; ఘనము+అయి, తోఁచుచున్నఅది= చాలా పెద్దదిగా కన్పిస్తున్నది; అందున్= (ఆ కురుసేనలో); శాంతనవుని, తాల, కేతనము= శంతనుడి కొడుకు అయిన భీష్ముడి తాడిచెట్టు జెండా; ఉదగ్రతన్= భయంకరంగా; ముందటన్= ముందుగా (అగ్ర భాగంలో); పొల్చెన్= విలసిల్లుతున్నది; చూచితి+ఏ= చూచావుగదా!; అనవుడున్= అని (ధర్మజుడు) చెప్పగా; ఆ+నరుఁడు= ఆ అర్జునుడు; పిన్న+నవ్వు+నగి= చిరునవ్వునవ్వి; అన్న+మొగంబున్+చూచి= అన్నగారి (ధర్మరాజు) ముఖం ఆలోకించి; నెట్టన= పూనికతో; పలు, మాటలు+ఆడఁగన్= పెక్కు మాటలు చెప్పటానికి; కడంగఁగన్+ఒల్లక= పూనుకొనుటకు ఇష్టపడక; అతి+ఉదాత్తతన్= మిక్కిలి గొప్పదనంతో.

తాత్పర్యం: 'ఓ అర్జునా! చూచావుగదా. స్థూలదృష్టికి కౌరవ సైన్యం చాలా పెద్దదిగా కనిపిస్తున్నది. ఆ సేనలో ముందర నిలిచిన భీష్ముడి జెండా చూడుము. ఎంత ఎత్తుగా కన్పిస్తున్నదో తాడిచెట్టు బొమ్మతో. ఎంత భయంకరంగా ఉన్నదో. అని ధర్మరాజు చెప్పగా, చిరునవ్వు చిందిస్తూ అర్జునుడు అన్నగారి ముఖం చూచి, అధిక ప్రసంగం చేయటానికీ ఇష్టం లేక, సముచితంగా సమాధానం చెప్పాడు.

విశేషం: తిక్కన ప్రయోగించిన నవ్వులు పేర్కొనదగినవి. అందులో 'పిన్న నవ్వు' ఒకటి. నవ్వు నవరసఖని. నవ్వు అగాధ హృదయ విషయసూచిక. ఇచ్చట అర్జునుడు మాటలలో చెప్పిన సమాధానం ఒక యెత్తు. అతడు చేసిన మందహాసం మరియొక ఎత్తు. మాటల మాటున - మాటలు చెప్పలేని భావం - మందహాసంలో దాగి ఉంటుంది.

ధర్మజునకు నర్జునుఁ డుత్సాహంబు గలిగించుట (సం. 6.1.93)

వ. అతనితో నిట్లనియె. 126

తాత్పర్యం: ధర్మరాజుతో అర్జునుడు ఈ విధంగా చెప్పాడు:

చ. ' మునివరుఁ డైన నారదుఁడు మున్నొకయప్పుడు సెప్పె 'ధర్మ నా
శను లగు వారలం బ్రబలసైన్యము గల్గినయేనిఁ గొంచె మై
నను రిపుసేన గెల్చు' నని నాకు గురుండును దేవతానదీ
తనయుఁడు నేర్పడన్ వినఁగఁ దాను బరాశరసూనుఁడుం గృపన్. 127

ప్రతిపదార్థం: మునివరుఁడు+ఐన+నారదుఁడు= ఋషులలో శ్రేష్ఠుడు అయిన నారదుడు; మున్ను+ఒక+అప్పుడు= పూర్వకాలంలో ఒకసారి; నాకున్= నాకు; గురుండును= ద్రోణాచార్యుడును; దేవతా నదీ తనయుఁడున్= దేవలోకంలోని నది (గంగ) కొడుకును; తాను= తాను; పరాశర, సూనుఁడున్= పరాశరుడి కొడుకు అయిన వ్యాసుడు; ఏర్పడన్+వినఁగన్= స్పష్టంగా ఆలకిస్తుండగా; ధర్మనాశనులు+అగు+వారలన్= ధర్మాన్ని పాడుచేసేవారలకు; ప్రబల+సైన్యము= పెద్దసేన; కల్గెన+ఏనిన్= ఉన్నప్పటికీ; రిపుసేన= శత్రుసైన్యం; కొంచెము+ఐనను= మిక్కిలి తక్కువే అయినప్పటికి; గెల్చున్= జయిస్తుంది; అని= అని; చెప్పెన్= చెప్పాడు.

తాత్పర్యం: ధర్మరాజుతో అర్జునుడు ఈ విధంగా చెప్పాడు: 'మునుపు మునిశ్రేష్ఠుడు అయిన నారద మహర్షి

ఒకసారి నాతో 'ధర్మనాశకులకు పెద్ద సైన్యం ఉండవచ్చునుగాని యుద్ధంలో వారిని చిన్నసేన ఉన్నప్పటికి శత్రువులే గెలుస్తారు అనిచెప్పాడు. నాతోపాటు ఈ మాటలు అన్నప్పుడు ద్రోణాచార్యులు, భీష్ముడు, వేదవ్యాసమహర్షి కూడా స్పష్టంగా విన్నారు.

విశేషం: ప్రాచీన భారతీయ సారస్వతంలో- మహాభారతంలో 'ధర్మ' శబ్ద ప్రయోగం చాల చోట్ల కన్పిస్తుంది. ధర్మ శబ్ద నిర్వచనం - మిక్కిలి కష్టం. స్థూలంగా 'ధర్మం' అంటే మంచిపని అనీ, కర్తవ్య సూత్రం అనీ చెప్పవచ్చు. "యతో ధర్మః తతో జయః' ' మహాభారత సారసంగ్రహం. అయితే ఏది ధర్మం. ధర్మాన్ని గుర్తించటానికి మనుధర్మ శాస్త్రం - పది లక్షణాలు పేర్కొన్నది.

"ధృతిః క్షమా దమోzస్తేయం । శౌచ మింద్రియనిగ్రహః,
ధీ ర్విద్యా సత్య మక్రోధో । దశకం ధర్మలక్షణమ్"

వ. అది య ట్లుండె నమానుషశక్తిసముద్దామం బగు భీము గదావిహారంబు వైరిదుస్సహంబు; ధృష్టద్యుమ్న శిఖండి ప్రముఖ పాంచాలవర్గం బనర్గళ విక్రమంబు, విరాట శంఖ ముఖ్య మాత్స్యనికరం బరిభయంకరంబు; సాత్యకి చేకితానాది యాదవ నివహంబు భవజ్జ యావహం; బభిమన్యు హైడింబ ప్రభృతి కుమారలోకం బలోకసామాన్య బలశౌర్యధుర్యంబు; నీ కటాక్షంబును గృష్ణ సంరక్షణంబునుం గలిగి గాండివం బను పామునకు ఱెక్కలు వచ్చిన ట్లున్నయది; యట్లుంగాక యేనుఁగుంబోలె నీ లావు నీ వెఱుంగవు; దివిజులకు నజయ్యుండవు; నీ వలిగిన నెవ్వరె ట్లయ్యెదరో యటు సూడు' మనినం దెలివొంది సంక్రందనందనునకు ధర్మనందనుం డిట్లనియె. 128

ప్రతిపదార్థం: అది= (నారద మహర్షి చెప్పినమాట); అట్లు+ఉండెన్= ఆ విధంగా ఉన్నది= (దానికేమిగాని); అమానుష, శక్తి, సముద్దామంబు+అగు= మనుజులకు అతీతమైన బలంతో భయంకరమైన; భీము, గదా, విహారంబు= భీమసేనుడి యొక్క గద త్రిప్పులాట; వైరి, దుః+సహంబు= శత్రువులు సహించలేనిది; ధృష్టద్యుమ్న, శిఖండి, ప్రముఖ, పాంచాల, వర్గంబు= ధృష్టద్యుమ్నుడు శిఖండి మున్నగు పాంచాల పక్షం; అనర్గళ విక్రమంబు= అడ్డులేని పరాక్రమం (కలది); మాత్స్య+నికరంబు= మత్స్యదేశానికి సంబంధించిన సేనాసమూహం; అరి+భయంకరంబు= శత్రువులకు భయం కలుగజేసేది; సాత్యకి+చేకితాన+ఆది, యాదవ, నివహంబు= సాత్యకి చేకితానుడు మున్నగు యాదవుల బలగం; భవత్+జయ+ఆవహంబు= నీకు జయం కలిగించేది; అభిమన్యు, హైడింబ, ప్రభృతి, కుమార, లోకంబు= అభిమన్యుడు, హిడింబ కొడుకైన ఘటోత్కచుడు మున్నగు కొడుకుల గుంపు; అలోక సామాన్య, బల, శౌర్య, ధుర్యంబు= లోకంలో సాధారణంగా కనుపించనట్టి శక్తి పరాక్రమాలతో కూడినది; నీ కటాక్షంబును= నీ(క్రీగంటిచూపు) దయ; కృష్ణ, సంరక్షణంబును+కలిసి= శ్రీకృష్ణుడి రక్షణ కలిసి; గాండివంబు+అను, పామునకున్= గాండీవం (ధనుస్సు) అనే పామునకు; రెక్కలు, వచ్చినట్లు+ఉన్న+అది= రెక్కలు మొలిచినట్లు ఉన్నది; అట్లు+కాక= ఆ రీతిగా కాక; ఏనుఁగున్+పోలెన్= ఏనుగువలె; నీలావు= నీ బలం; నీవు+ఎఱుంగవు= నీవు తెలిసికోలేవు; దివిజులకున్= దేవతలకు; అజయ్యుండవు= జయింపశక్యంకానివాడవు; నీవు+అలిగినన్= నీవు కోపిస్తే; ఎవ్వరు+ఎట్లు+అయ్యెదరో= ఎవరు ఏ విధంగా ఔతారో; అటు+చూడుము= ఆ దృక్పథంతో వీక్షించుము; అనినన్= అని అర్జునుడు చెప్పగా; తెలివి+ఒంది= జ్ఞానం చేకూర్చుకొన్నవాడై; సంక్రందన నందనునకున్= (దేవేంద్రుడి కుమారుడైన) అర్జునుడికి; ధర్మనందనుండు= ధర్మరాజు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు:

తాత్పర్యం: అది అట్లా ఉండనీ, అమానుషశక్తి సంపన్నుడగు భీముడి గదా విహారం శత్రువులు సహించలేనిది. ధృష్టద్యుమ్నుడు, శిఖండి మొదలైన పాంచాల వర్గం అడ్డులేని పరాక్రమం కలది. విరాటుడు, శంఖుడు మొదలైన మత్స్యదేశ సేనాసమూహం శత్రుభయంకరం. సాత్యకి చేకితానుడు మొదలైన యాదవుల బలగం నీకు జయం కలిగించేది. అభిమన్యుడు, ఘటోత్కచుడు మొదలైన కొడుకుల గుంపు లోకంలో సాధారణంగా కనిపించనట్టి పరాక్రమాలతో కూడినది. నీ దయా వీక్షణం, కృష్ణ రక్షణ కలిగి గాండీవం అనే పాముకు రెక్కలు వచ్చినట్లున్నది.

అంతేగాక ఏనుగుకువలె నీశక్తి నీకు తెలియదు. నీవు దేవతలకు కూడ జయింపరానివాడవు. నీవు కోపగిస్తే ఎవ్వరెట్లౌతారో చూడు అనగా విని వికాసం పొంది అర్జునుడితో ధర్మరాజిట్లన్నాడు.

విశేషం: 1. పాము సహజంగా ప్రమాదం కలిగించే శక్తి కలది. అసలే చురుకైనది పాము. పాముకూ రెక్కలు వస్తే ఇంకేముంది! ఇది ఒక గొప్ప ఉత్ప్రేక్ష.

2. ఏనుగు భూమిమీదగల జంతువులలోకెల్ల బలమైనట్టిది. అయితే అది క్రూరజంతువు కాదు. ఏనుగులు విచ్చలవిడిగా ప్రకోపించి విహరిస్తే ఏనుగునకుగల సహజ సాధుత్వం లోకోపకారకం, ధర్మరాజు తన శక్తి తెలియని ఏనుగు వంటివాడు. మంచి ఉపమ.

తే. కౌరవవ్యూహమునకుఁ దగంగ నొక్క। బంధురవ్యూహ మొనరింపఁ బంపు' మనిన
నతఁడు ద్రుపదాత్మజుని నచలాఖ్యమైన। ఘనతర వ్యూహ మొనరింపఁ బనుచుటయును. 129

ప్రతిపదార్థం: కౌరవ, వ్యూహమునకున్= కౌరవులు పన్నిన వ్యూహానికి; తగంగన్= అనువుగా; ఒక్క, బంధుర, వ్యూహము= ఒక చిక్కని వ్యూహాన్ని; ఒనరింపన్= ఏర్పాటు చేయటానికి; పంపుము= ఏర్పాటు చేయుము; అనినన్= అని ధర్మరాజు చెప్పగా; అతఁడు= (అర్జునుఁడు); ద్రుపద+ఆత్మజునిన్= ద్రుపదుడి కొడుకైన ధృష్టద్యుమ్నుడిని; అచల+ఆఖ్యము+ఐన= అచలము (కొండ) అనే పేరుగల; ఘనతర, వ్యూహంబు= మిక్కిలి గొప్పదైన వ్యూహాన్ని; ఒనరింపన్= ఏర్పరుప; పనుచుటయును= ఆజ్ఞాపించుటయు.

తాత్పర్యం: కౌరవసేనాపతి భీష్ముడు 'నర' వ్యూహం పన్నాడు. దానిని దేవతలు గూడ అద్భుతమని మెచ్చుకొన్నారు. ధర్మరాజు అర్జునుడితో 'కౌరవుల వ్యూహానికి అనురూపమైన గొప్ప వ్యూహాన్ని పన్నాలని కోరాడు. అర్జునుడు పాండవ సేనాధిపతి అయిన ధృష్టద్యుమ్నుడిని పిలిచి 'అచల' వ్యూహాన్ని పన్నుమని ఆదేశించాడు.

వ. ఆ ధృష్టద్యుమ్నుండును గలయ మెలంగి మోహరం బమర్చె; నయ్యచలవ్యూహమ్మునందు దా నగ్రభాగంబున నభిమన్యు ప్రభృతి కుమార నకుల సహదేవ సహితంబుగా భీమసేన పరిపాలితుండై నిలిచెఁ; దమతమ బంధువులకును బలంబులకును బలువుతోడి చెలువు గలుగఁ జేకితాన సాత్యకి సమేతంబుగాఁ బాంచాల మాత్స్యాధిపతులు దక్షిణోత్తర భాగంబుల నిలిచిరి; నడుమ నడగొండగమియుం బోని గజరాజితో రాజు రథారూఢుండై ధవళచ్ఛత్ర చామరంబులు మెఱయ విప్రవర్గంబునకు నంబర జాంబూనదంబు లొసంగుచు విజయాశీర్వాదంబు లాదరించుచుండె; ముందటఁ బురందరనందన సంరక్షితుండై శిఖండి గాంగేయునకుఁ గట్టెదురుగా నిలిచి గండు మిగిలి యొప్పె; నపరభాగస్థులై మాగధ సహదేవ ధృష్టకేతు లవష్టంభ విజృంభణంబునఁ బొలిచి; రివ్విధంబునం జారుభీషణం బై. 130

ప్రతిపదార్థం: ఆ ధృష్టద్యుమ్నుండును= ఆ ధృష్టద్యుమ్నుడున్నూ; కలయన్ మెలంగి= (సేన) అంతటను పూర్ణంగా తిరిగి; మోహరంబున్+అమర్చెన్= వ్యూహాన్ని ఏర్పాటు చేశాడు; ఆ+అచల+వ్యూహమ్మునందున్= 'అచల'మనే పేరుగల్గిన ఆ వ్యూహంలో; తాన్= తాను (ధృష్టద్యుమ్నుడు); అగ్రభాగంబునన్= మొదటనే; అభిమన్యు, ప్రభృతి, కుమార, నకుల, సహదేవ, సహితంబుగాన్= అభిమన్యుడు మున్నగు పాండవుల కుమారులతోపాటుగా, నకులుడు సహదేవుడుకూడి ఉండగా; భీమసేన+పరిపాలితుండు+ఐ= భీముడి రక్షణకు లోనైన వాడై; నిలిచెన్= నిలిచాడు; తమ తమ+బంధువులకును= తమ తమ చుట్టాలకు; బలంబులకును= సేనలకు; బలువు తోడిచెలువు= శక్తితో కూడిన సౌందర్యం; కలుగన్= ఏర్పడేటట్లుగా; చేకితాన, సాత్యకి, సమేతంబుగాన్= చేకితానుడు సాత్యకి అనే యాదవ వీరులతోపాటుగా; పాంచాల, మత్స్య, అధిపతులు= పాంచాల రాజు ద్రుపదుడును- మత్స్యరాజు

విరాటుడును; దక్షిణ+ఉత్తర భాగంబులన్= దక్షిణంవైపు, ఉత్తరంవైపు; నిలిచిరి= నిలబడ్డారు; నడుమన్= మధ్యలో; నడకొండ గమియున్+పోలి= నడిచే కొండల గుంపు వలె ఉన్న; గజరాజితోన్= ఏనుగుల సమూహంతో; రాజు= (ధర్మరాజు); రథ+ఆరూఢుండు+ఐ= రథాన్ని ఎక్కినవాడై; ధవళ, ఛత్ర, చామరంబులు= తెల్లని గొడుగులు వీవనలు; మెఱయన్= ప్రకాశించగా; విప్రవర్గంబునకున్= బ్రాహ్మణ సమూహానికి; అంబర+జాంబూనదంబులు= వస్త్రాలు, బంగారు కాసులు; ఒసంగుచున్= ఇస్తూ; విజయ+ఆశీర్వాదంబులు= గెలుపుపొందే దీవనలు; ఆదరించుచుండెన్= మన్నిస్తూ ఉన్నాడు; ముందరన్= ముందు భాగంలో; పురందర నందన, సంరక్షితుండు+ఐ= అర్జునుడి చేత కాపాడబడినవాడై; శిఖండి, గాంగేయునకున్= భీష్ముడికి; కడు+ఎదుటన్= కట్టెదుటనే- ఎదురు బొదురుగా; నిలిచి= నిల్చుండి; గండు, మిగిలి ఒప్పెన్= వీరత్వంతో మిక్కిలి వెలుగొందాడు; అపర భాగస్థులు+ఐ= వెనుకభాగంలో ఉన్నవారై; మాగధ+సహదేవ+ధృష్టకేతులు= మగధదేశానికి సంబంధించిన సహదేవ మహారాజు అతని తమ్ముడు ధృష్టకేతుడు; అవష్టంభ+విజృంభణంబునన్= గర్వాతిశయంతో పాలిచిరి= శోభిల్లారు; ఆ+విధంబునన్= ఆ రీతిగా; చారు, భీషణంబు+ఐ= రమణీయ భయానకంగా (అందంగానూ, భయంకరంగాను).

తాత్పర్యం: పాండవసేనాపతి అయిన ధృష్టద్యుమ్నుడు తన సేనలలో నలువైపుల తిరిగి, 'అచల వ్యూహం' అమర్చాడు. ఆ అచలవ్యూహంలో మునుముందు తాను అభిమన్యుడు మున్నగు పాండవకుమారులు నకుల సహదేవులు నిలిచారు. అక్కడే, తనకు బాసటగా భీమసేనుడు నిలిచాడు. ఉత్తరంవైపు దక్షిణంవైపు తమ బలాలకు చుట్టాలకు బలం చేకూరుస్తూ విరాటుడు - ద్రుపదుడూ నిలిచారు. వ్యూహం మధ్యభాగంలో, జంగమ పర్వతాలవలె శోభిల్లే ఏనుగుల గుంపు మధ్య ధర్మరాజు రథం మీద ఉన్నాడు, ఛత్రచామరాలతో. బ్రాహ్మణులు ఆశీర్వదించారు. ధర్మరాజు వారికి వస్త్రాలూ, బంగారు కాసులు బహూకరించాడు. ముందు అర్జునుడిచేత కాపాడబడుతూ శిఖండి, అటు కౌరవసేనలోని భీష్ముడికి ఎదురుబొదురుగా నిలిచాడు. వెనుకభాగంలో మగధదేశానికి చెందిన సహదేవుడు, ధృష్టకేతుడు గర్వాతిశయంతో శోభిల్లారు. ఈ విధంగా అందంగానూ, భయంకరంగానూ పాండవులసైన్యం విలసిల్లిందని మీది పద్యంతో అన్వయం.

క. అరదములు దీవు, లున్నత । కరులు గిరులు, హరులు వీచికలు, సుభటసము
త్కర ముగ్రసత్త్వములుగా । శరనిధి గతిఁ బాండుపుత్ర సైన్యం బొప్పెన్. 131

ప్రతిపదార్థం: అరదములు= రథాలు; దీవులు= ద్వీపాలు; ఉన్నత, కరులు= ఎత్తైన ఏనుగులు; గిరులు= పర్వతాలు; హరులు= గుర్రాలు; వీచికలు= కెరటాలు; సుభట, సముత్కరము= మంచి భటుల సముదాయం; ఉగ్ర, సత్త్వములుగాన్= భయంకరమైన జంతువులుగా; పాండుపుత్ర, సైన్యంబు= పాండవుల సేన; శరనిధి గతిన్= సముద్రంవలె; ఒప్పెన్= విలసిల్లింది.

తాత్పర్యం: పాండవుల సేన సముద్రం వలె శోభిల్లింది. రథాలు దీవులుగా, ఎత్తైన ఏనుగులు కొండలుగా, గుర్రాలు కెరటాలుగా, భటుల సముదాయం భయంకరమైన జంతువులుగా భాసించాయి.

విశేషం: అలం: ఉపమ (రూపకానుప్రాణితం).

క. ఉభయబల దీప్తకేతు । ప్రభలం గీడ్పఱిచి కురుధరావల్లభ సై
న్య భయంకరమై శక్ర । ప్రభవు కపిధ్వజము వెలిఁగె బ్రకటస్ఫురణన్. 132

ప్రతిపదార్థం: ఉభయ, బల, దీప్త, కేతు, ప్రభలన్= రెండు సేనలలో ప్రకాశించే జెండాల కాంతులను; కీడ్పఱిచి= తక్కువ చేసి; కురు, ధరావల్లభ, సైన్య, భయంకరము+ఐ= కురురాజు అయిన దుర్యోధనుడి సేనలకు భయం కలిగించేదై; శక్రప్రభవు, కపిధ్వజము= దేవేంద్రుడి కొడుకు అయిన అర్జునుడి యొక్క కోతి జెండా; ప్రకట+స్ఫురణన్= దేదీప్యమాన కాంతితో; వెలిఁగెన్= ప్రకాశించింది.

తాత్పర్యం: అర్జునుడి రథంపై వెలుగొందే కోతి జెండా, రెండు సేనలలోని జెండాలన్నిటినీ మించి, దుర్యోధనుడి సేనలకు భయం కలిగిస్తూ దేదీప్యమానంగా ప్రకాశించింది.

తే. అరుణములును సితంబులు నసితములును । నైన జోడులతో దొరలందు నిందు
నాలలోని యాఁబోతులఁ బోలి పాలిచి । రెసఁగు బెడిదంపుమాట లాకసము ముట్ట. 133

ప్రతిపదార్థం: అరుణములును= ఎర్రనైనట్టి; సితంబులును= తెల్లనివి; అసితములును= నల్లనైనట్టివి; ఐన= ఐనట్టి; జోడులతోన్= కవచాలతో; దొరలు= దండనాయకులు; అందున్+ఇందున్= ఆ కౌరవ సేనలోను పాండవసేనలోనూ; ఆలలోని= ఆవులమధ్య ఉన్న; ఆఁబోతులన్+పోలి= ఆబోతులరీతిగా; ఎసఁగు బెడిదంపు మాటలు= అతిశయంతో కూడిన గొప్ప మాటలు; ఆకసము, ముట్టన్= ఆకాశాన్ని తాకగా; పొలిచిరి= శోభిల్లారు.

తాత్పర్యం: పాండవసైన్యంలోనూ కౌరవసైన్యంలోనూ గల దండనాయకులు ఎర్రని, తెల్లని, నల్లని కవచాలు ధరించి ఆవుల మధ్య ఉన్న ఆబోతులవలె అతిశయించిన గొప్పమాటలు ఆకసమంటగా శోభిల్లారు.

తే. కొన్ని భూముల బలములు గురునృపాలుఁ । బాండవులఁ గొన్ని భూముల బలము లీసు
గలిగి పాయలై కొన్ని భూముల బలములు । రెండు దిక్కులయందుఁ జేరినవి యధిప! 134

ప్రతిపదార్థం: కొన్ని, భూముల, బలములు= కొన్ని ప్రదేశాలకు చెందిన సేనలు; కురు, నృపాలున్= కురురాజు దుర్యోధనుడి; కొన్ని, భూముల, బలములు= కొన్ని ప్రదేశాలలోని సేనలు; పాండవులన్= పాండవులను; ఈసు+కలిగి= అసూయచేత; పాయలు+ఐ= చీలిపోయి; కొన్ని+భూముల+బలములు= కొన్ని ప్రదేశాలకు చెందిన సేనలు; రెండు దిక్కులయందున్= రెండువైపులయందు; అధిప!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; చేరినవి= చేరాయి.

తాత్పర్యం: కొన్ని ప్రదేశాలలోని సేనలు కౌరవపక్షంలో చేరాయి. కొన్ని ప్రదేశాలలోని సేనలు పాండవ పక్షంలో చేరాయి. కొన్ని ప్రదేశాలలోని సేనలు వారిలో వారికి గల అసూయ వలన చీలిపోయి, రెండు పక్షాలలో కూడా ఒక చీలిక కౌరవపక్షంలోనూ, మరియొక చీలిక పాండవ పక్షంలోనూ చేరాయి.

విశేషం: కురుక్షేత్రంలో జరిగింది కౌరవులకు పాండవులకు మధ్య కలహం. అయితే ఆ యుద్ధంలో చాలా ప్రదేశాలలోని సేనలు రెండు పక్షాలలో చేరి, పోరాడాయి. ఒక ప్రదేశంలోని సేనలు కౌరవపక్షంలో చేరితే, వారి శత్రుపక్షం సేనలు పాండవ సైన్యంలో చేరాయి. అనగా వారికీ వారికీగల పూర్వవైరాలు తీర్చుకునేందుకు- చిన్న చిన్న ప్రదేశాలలోని వారు- రెండు పక్షాలలో చేరారన్నమాట. విశేషించి, ఉదాహరణకు యాదవులలో సాత్యకి శ్రీకృష్ణుల పక్షం పాండవ పక్షం వహించింది. కృతవర్మ పక్షం కౌరవ సేనలో చేరింది.

వ. కావున. 135

తాత్పర్యం: కాబట్టి.

క. బాలురు వృద్ధులుఁ దక్కఁగ । వ్రాలి యిలం గలుగు పురుషవర్గంబు జయ
శ్రీలోలత నేతెంచుట । నేల యవిసి మూఁగినట్లు నెఱసె బలంబుల్.' 136

ప్రతిపదార్థం: బాలురు= చిన్న పిల్లవాండ్రు; వృద్ధులున్= ముసలివారు; తక్కఁగన్= తప్ప; వ్రాలి= చేరి; ఇలన్+కలుగు= భూమిమీద ఉండే; పురుష+వర్గంబు= మగవారందరూ; జయ, శ్రీ, లోలతన్= గెలుపు అనే గొప్ప సంపదయందలి ప్రీతితో; ఏతెంచుటన్= రావటం మూలాన; (యుద్ధంలో చేరటం వలన); నేల= భూమి; అవిసి= పొంగి; మూఁగిన+అట్లు= ఒకచో చేరినట్లుగా, బలంబుల్= సేనలు; నెఱసెన్= వ్యాపించాయి.

తాత్పర్యం: చిన్న పిల్లలు ముసలివాళ్ళు తప్ప మగవాళ్ళు అందరూ విజయశ్రీని కాంక్షిస్తూ నేల పిగిలిన, ఈనిన రీతిగా ఒక చోటికి సేనలు చేరాయి.'

వ. అనిన విని ధృతరాష్ట్రుం 'డప్పుడప్పాండవ కౌరవ సైన్యంబులలో నెయ్యది యుబ్బు గలిగి యుండె'నని యడిగిన సంజయుం డతని కిట్లనియె. 137

ప్రతిపదార్థం: అనినన్= అని (సంజయుడు చెప్పగా); విని= ఆలకించి; ధృతరాష్ట్రుండు= ధృతరాష్ట్రుడు; అప్పుడు= ఆ సమయంలో; ఆ+పాండవ, కౌరవ, సైన్యంబులలోన్= ఆ పాండవసేనలో మరియు ఆ కౌరవ సేనలో; ఏ+అది= ఏది; ఉబ్బు కలిగి= అతిశయం కలిగి; ఉండెన్= ఉన్నది; అని+అడిగినన్= అని ప్రశ్నించగా; సంజయుండు= సంజయుడు; అతనికిన్= ధృతరాష్ట్రుడికి; ఇట్లు+అనియెన్= ఈ రీతిగా చెప్పాడు.

తాత్పర్యం: సంజయుడి మాటలు ఆలకించిన పిదప ధృతరాష్ట్రుడు ఒక ప్రశ్న వేశాడు. 'ఓ సంజయా! ఆ సమయంలో పాండవుల సైన్యం కౌరవ సైన్యం ఏది ఎక్కువ ఉత్సాహంతో ఓలలాడింది?' ఈ ప్రశ్నకు సంజయుడు ధృతరాష్ట్రుడితో ఈ విధంగా సమాధానం చెప్పాడు.

క. రెండు బలంబుల వారలు । నొండొరువులకంటెఁ జాల నుక్కు మిగిలి యొం
డొండ కడంగుచు నుజ్జ్వల । చండస్థితి నొప్పి రపుడు జగతీనాథా! 138

ప్రతిపదార్థం: జగతీనాథా!= (ఓ ధృతరాష్ట్రమహారాజా!); రెండు+బలంబుల వారలు= ఉభయసేనలలోనివారు (కౌరవులలో చేరినవారు పాండవులలో చేరినవారు) ఒండు+ఒరువుల కంటెన్= ఒకరికంటె ఒకరు (ఒకరిని మించి మరి యొకరు); చాలన్= మిక్కిలి; ఉక్కు+మిగిలి= బలంచేత అతిశయించి; ఒండు+ఒండ, కడంగుచున్= ఒకరితో ఇంకొకరు పూనుతూ; అపుడు= ఆ సమయంలో; ఉజ్జ్వల, చండ స్థితిన్= భయంకరంగా ప్రకాశించే విధంగా; ఒప్పిరి= శోభిల్లారు.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! అపుడు కౌరవసైన్యంలోనివారూ- పాండవసేనల్లోని వారూ, ఒకరిని మించి మరొకరు బలంచేత అతిశయించి పరస్పరం ఎదురుకొంటూ భయంకరంగా ప్రకాశించారు.

వ. అని వెండియు. 139

తాత్పర్యం: అని చెప్పి, ఇంకా ఇట్లా అన్నాడు.

క. ఆ రెండు బలములందును । దోరం బైయున్న యట్లు దోఁచెం బాండు
క్ష్మారమణసుతు బలము నర । నారాయణు లునికిఁ జేసి నాకుం జూడన్. 140

ప్రతిపదార్థం: ఆ+రెండు, బలములందును= ఆ కౌరవ పాండవ సేనలలో; పాండుక్ష్మారమణసుతు బలము= పాండు రాజు కొడుకు సైన్యం; నర, నారాయణుల+ఉనికిన్+చేసి= నరుడు నారాయణుడు (ఇద్దరూ ఉండటం చేత); తోరంబు+ఐ= అధికమై; ఉన్న+అట్లు; నాకున్+చూడన్= నా దృష్టికి; తోఁచెన్= తోచింది.

తాత్పర్యం: 'కౌరవుల సేనలో పాండవుల సేనలో పాండవుల సేనయే నా దృష్టికి బలవత్తరంగా తోచింది. ఎందుకంటే- పాండవసేనలో నరనారాయణులు ఉన్నారు.

విశేషం: 1. నరుడు - నారాయణుడు పురాణ ప్రసిద్ధులైన గొప్ప మునులు. నరుడు - మానవ ప్రతీక, మానవమాత్రుడు, నారాయణుడు- అధిమానవ ప్రతీక. విజయం= పురుషకారం+దైవం అనగా మానవ ప్రయత్నం+దైవానుగ్రహం. అర్జునుడు నరాంశసంభూతుడు, శ్రీకృష్ణుడు నారాయణాంశ సంభూతుడు. వారు ఇద్దరు ఉన్నచో విజయం తథ్యం. భగవద్గీతలోని శ్లోకం ఇట స్మరించ దగినది.

"యత్ర యోగీశ్వరః కృష్ణో । యత్ర పార్థో ధనుర్ధరః,
తత్ర శ్రీ ర్విజయో భూతిః । ధ్రువా నీతి ర్మతిర్మమ". (18-78)

క. ఎలసి పయివారి దంతిఘ । టల మదములఁ దావి వెట్టుటయుఁ గౌరవసే
నల యేనుంగుల మదధా । రలు డొంకెం బొలయు మధుకరములుబ్బడఁగన్. 141

ప్రతిపదార్థం: ఎలసి= అతిశయించి; పయివారి= పైన చెప్పబడిన (నరనారాయణులకు చెందిన); దంతి, ఘటల, మదముల తావి+పెట్టుటయున్= ఏనుగుల గుంపుల దాన జలములు; తావి, పెట్టుటయున్= సువాసన లీనుటయున్ను; కౌరవ, సేనల, ఏనుంగుల, మద, ధారలు= కౌరవసేనలలోని ఏనుగుల దాన జలములు; పొలయు= చేరే; మధుకరములు= తుమ్మెదలు; ఉబ్బు+అడఁగన్= ఉత్సాహం తగ్గిపోయేటట్లుగా; డొంకెన్= తగ్గిపోయాయి (ముసలితనం చెందాయి).

తాత్పర్యం: పాండవసైన్యంలోని ఏనుగుల మదజలాలు పరిమళాలు వెదజల్లాయి. కౌరవుల సైన్యంలోని ఏనుగుల మదం ఇంకిపోయింది. అందుచేత వాటిపై చేరే తుమ్మెదల గుంపు యొక్క ఉత్సాహం అణగిపోయింది.

విశేషం: 1. 140, 141, 142 సంఖ్యలుగల పద్యాలలో 143 సంఖ్యగల వచనంలోగూడ. కృష్ణార్జునులను గూర్చియే వర్ణన ఉన్నది. అందుచేత 141 పద్యంలోని పయివారి- అనగా కృష్ణార్జునుల యొక్క అని అర్థం చెప్పటం సమంజసం.

2. 'దంతి పుటల మదముల రాహువెట్టుటయు' అని ముద్రిత పాఠం. ఆ గ్రంథంలోనే పాఠాంతరం 'తావి' వెట్టుటయు 'గాలి' వెట్టుటయు అని ఉన్నది. మత్తేభాల మదము యొక్క పరిమళానికి తుమ్మెదలు వచ్చి వ్రాలటాన్ని - తిక్కన పలుసారులు భారతంలో వర్ణించాడు. అందుచే 'తావి'- పరిమళం అనే పాఠమే గ్రహించటం మంచిది. దానికి అర్థం సరిపోతుంది. అంతేగాక- ఆ క్రింది పద్యంలో ఉత్తరార్ధంలో కౌరవసేనలలోని ఏనుగుల మదం తగ్గటం - అందుచేత తుమ్మెదల ఉబ్బు అణగటం వర్ణింపబడింది. అందుచే ఈ క్రింది పద్యంలో పూర్వార్ధంలో 'తావి' పెట్టుట= పరిమళించటం అనే అర్థం చక్కగా సరిపోతున్నది. అందుచే 'తావి' వెట్టు అనే పాఠం-స్వీకరించబడింది.

తే. అధిప! నీ తనయుండు గయ్యంబు వొడుచు । తెంపు వదలక విభవంబు పెంపు మెఱసె;
సారసానకు వచ్చిన చందమునను । నెలమిఁ బొందిరి పాండవేయులును హరియు. 142

ప్రతిపదార్థం: అధిప!= (ఓ ధృతరాష్ట్ర మహారాజ!); నీ+తనయుండు= నీ కొడుకు- దుర్యోధనుడు; కయ్యంబు+పొడుచు తెంపు= యుద్ధం ప్రారంభించే తెగువ; వదలక= విడిచిపెట్టక; విభవంపు+పెంపు+మెఱసెన్= (తన) వైభవం యొక్క అతిశయం వెలుగొంద చేశాడు; సారసానకున్= వినోదానికి; వచ్చిన+చందమునను= వచ్చిన రీతిగా; పాండవేయులును= పాండవులును; హరియున్= శ్రీకృష్ణుడును; ఎలమిన్+పొందిరి= సంతోషం పొందారు.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! నీ కొడుకైన దుర్యోధనుడు యుద్ధాన్ని చేసే తెగువ వదలక అత్యంతవైభవంతో వెలుగొందాడు. పాండవులును, శ్రీకృష్ణుడూ వినోదానికై వచ్చినట్లు సంతోషించారు. (అనగా వారికి యుద్ధం చేయటం వినోదప్రాయమైనది అని భావం).

వ. అట్టియెడఁ గృష్ణార్జునులు పాంచజన్య దేవదత్తంబులు పూరించిన. 143

ప్రతిపదార్థం: అట్టి+ఎడన్= ఆ సమయంలో; కృష్ణ+అర్జునులు= శ్రీకృష్ణుడును, అర్జునుడును; పాంచజన్య+దేవత్తంబులు= పాంచజన్యం, దేవదత్తం (అనే శంఖాలను); పూరించినన్= మ్రోగించగా.

తాత్పర్యం: ఆ సమయంలో సంతోష పారవశ్యంతో శ్రీకృష్ణుడు పాంచజన్యం అనే శంఖాన్ని, అర్జునుడు దేవదత్తం అనే శంఖాన్ని పూరించగా (తరువాతి పద్యంతో అన్వయం).

క. ఆ నినదము విని పాండవ । సేన లలరె; ధార్తరాష్ట్ర సేనాగత యో
ధానీక ములికె; నెత్తురు । వాన గురిసె నంతఁ గౌరవవ్యూహమునన్. 144

ప్రతిపదార్థం: ఆ+నినదము= ఆ ధ్వని; విని= ఆలకించి; పాండవ, సేనలు= పాండవుల సైన్యాలు; లలరెన్= సంతోషించాయి; ధార్తరాష్ట్ర సేనా+గత, యోధ+అనీకము= ధృతరాష్ట్రుడి కొడుకులకు చెందిన సేనలో ఉన్న వీరుల సమూహం; ఉలికెన్= భయపడ్డది; కౌరవ+వ్యూహమునన్= కౌరవుల వ్యూహంలో; అంతన్= అంతట; నెత్తురు+వాన= రక్తవర్షం; కురిసెన్= కురిసింది.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు పూరించిన పాంచజన్య శంఖారావం, అర్జునుడు పూరించిన దేవదత్త శంఖనినాదం విని పాండవుల సేనలు సంతోషంతో ఉప్పొంగిపోయాయి. కౌరవసేనలు భయపడ్డాయి. కౌరవ వ్యూహంపై నెత్తురు వాన కురిసింది.

విశేషం: 1. యుద్ధంలో కత్తులు, కటార్లు, విండ్లు బాణాలు సముచిత పాత్ర నిర్వహిస్తాయి. అది సహజం. అయితే- జెండాలు కనుల పండువుగా ఆకసంలో రెపరెపలాడటం యుద్ధ వాద్యాలు ఎన్నెన్నో భేరీ కాహళ తూర్యనినాద పరంపరలు మ్రోగటం ఏదో ఒక వర్ణనాతీతమైన వాతావరణాన్ని సృష్టిస్తాయి. ఇక- ముఖ్యంగా పేర్కొనదగింది శంఖనినాదం. ప్రతి వీరుడి చేతిలో విల్లు, కత్తి, డాలు ఉండటం ఒక యెత్తు; శంఖం ఉండటం ఒక యెత్తు, వీరుడు శంఖం ఊదే నేర్పు; అతడి పరాక్రమ ప్రాభవానికి భారమితిగా భాసించింది భారత మహేతిహాస కావ్యంలో.

వ. మఱియు ననేక దుర్నిమిత్తంబులు వుట్టెఁ; బుట్ట కేల తక్కు? దేవవ్రతుండును గురుండును గురునందనుండును గృపుండును నిచ్చలుఁ గయ్యంబునకు వెడలు నప్పుడు 'పాండవులకు జయం బవశ్యంబు నయ్యెడు' మనుచు వెడలుదు; రది యట్లుండె నయ్యశుభసూచకంబులకు ధార్తరాష్ట్రులు దలంకక తూర్యంబులు మొరయింప నియోగించిన. 145

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకా; అనేక, దుర్నిమిత్తంబులు= పెక్కు చెడ్డ శకునాలు; పుట్టెన్= అగుపించాయి; పుట్టక+ఏల, తక్కున్?= అగుపించకుండా ఎందుకు ఉంటాయి?; దేవవ్రతుండును= భీష్ముడూ; గురుండును= ద్రోణాచార్యుడూ; గురు+నందనుండును= అశ్వత్థామయు; కృపుండును= కృపాచార్యుడును; నిచ్చలున్= ఎల్లప్పుడు; కయ్యంబునకున్= యుద్ధానికి; వెడలు+అప్పుడు= వెళ్లేటప్పుడు; పాండవులకున్; జయంబు= గెలుపు; అవశ్యంబు+అయ్యెడున్= తప్పకుండా కలుగుతుంది; అనుచున్= అని తలపోయుచు; వెడలుదురు= వెళ్ళుతుంటారు; అది+అట్లు+ఉండెన్= అది ఆ విధంగా ఉండనీ; ఆ+అశుభ, సూచకంబులకున్= ఆ చెడ్డశకునాలకు; ధార్తరాష్ట్రులు= ధృతరాష్ట్రుడి కొడుకులు- కౌరవులు; తలంకక= చలించక; తూర్యంబులు= (మంగళ సూచకములు అయిన) వాద్యాలు; మొరయింపన్= మ్రోగించటానికి; నియోగించినన్= ఆజ్ఞాపించగా.

తాత్పర్యం: ఇంకా ఎన్నో చెడ్డ శకునాలు దాపురించాయి. ఎందుకు దాపురించవు? అపజయం రాక తప్పుతుందా? భీష్ముడు, ద్రోణుడు, అశ్వత్థామ, కృపుడు పాండవులే గెలుస్తారు అని రోజూ అనుకుంటూనే యుద్ధానికి తరలివెళ్ళారు. దానికేమిగాని, కౌరవులు మాత్రం ఆ దుశ్శకునాలకు జంకకుండా, యుద్ధ వాద్యాలు మ్రోగించేందుకు ఆజ్ఞ ఇచ్చారు.

ఉ. అప్పుడు రెండు సైన్యములు నాహవకేళికి నుత్సహించి పె
ల్లొప్పెఁ జెలంగి యుబ్బినసముద్ధతిఁ బొల్పగు తొంటి చందముల్
దప్పి యుగాంతకాలచలితత్వము నొంది పరస్పరాకృతుల్
గప్ప నెదుర్చు నంబుధియుగంబు మహోగ్రతఁ గ్రేణిసేయుచున్. 146

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో; రెండు, సైన్యములున్= (కౌరవుల సైన్యం, పాండవుల సైన్యం); ఆహవ, కేళికిన్= పోరాటమనే ఆటకు; ఉత్సహించి= ఉత్సాహంతో పూనుకొని; పెల్లు+ఒప్పెన్= అతిశయించి శోభించాయి; చెలంగి, ఉబ్బిన, సముద్ధతిన్= చెలరేగిన ఉత్సాహంతో అతిశయించిన గర్వంతో; పొల్పు+అగు= సొగసుగా ఉన్న; తొంటి+చందముల్= మునుపటి విధాలు; తప్పి= మారిపోయి; యుగ+అంతకాల+చలితత్వమున్+ఒంది= ప్రళయకాలంలో వచ్చే మార్పు పొంది; పరస్పర+ఆకృతుల్+కప్పఁగన్+ఎదుర్చు= తమకు తమకు నైసర్గికంగా ఉన్న ఆకారాలు కనిపించకుండా చేయటానికి మీదికి దూకే; అంబుధి+యుగంబున్= రెండు సముద్రాలను; మహా+ఉగ్రతన్= మహాభయంకరంగా; క్రేణి+చేయుచున్= పరిహసిస్తూ.

తాత్పర్యం: ఆ సమయంలో పోరాటం అనే ఆటకు కౌరవ పాండవ సేనలు ఉత్సాహంతో పూనుకొన్నాయి. ఆ రెండు సేనలు ఏ విధంగా ఉన్నాయంటే ప్రళయకాలంలో తొల్లిటి సౌమ్యరూపం వదలిపెట్టి, భయంకరంగా మారిపోయి ఒకదాని ఆకారం ఇంకొకటి పూర్తిగా మారిపోయేటట్లు చేయటానికి ఉప్పొంగే రెండు సముద్రాల వలె కన్పించాయి.

వ. తదవసరంబున నుభయ బలంబులవారును. 147

తాత్పర్యం: ఆ తరువాత కౌరవ పాండవుల రెండు పక్షాలవారు.

చ. బవరము సేయుచుండియును భాషణముల్ దగఁ బల్కుచుండఁగా
నవినయవృత్తి మై వలవ దాయుధ మార్చుటఁ దాఁకి పడ్డఁ గై
దువు వడినం దొలంగినను దోర్బల మేది భయంబుఁ బొందినం
గవియక బీఱువోయినను గాదు వధింపఁగ నెట్టి శత్రునిన్. 148

ప్రతిపదార్థం: బవరము+చేయుచుండియును= యుద్ధం చేస్తూకూడా; భాషణముల్+తగన్+పల్కుచుండఁగాన్= మాటలాడుచుండగా, సమయోచిత సంభాషణ సలుపు చుండగా; అవినయ+వృత్తిమైన్= ఉద్ధతితో; ఆయుధము+ఆర్చుట= ఆయుధం ప్రయోగించటం; వలవదు= కూడదు; తాకి+పడ్డన్= ఎదిరించి పడిపోయినచో; కైదువు= కత్తి; పడినన్= పడిపోయినా; దోర్బలము+ఏది= భుజబలం నశించి; తొలంగినన్= ప్రక్కకు తప్పుకొన్నా; భయంబు+పొందినన్= పిరికితనంతో భయపడితే; కవియక= యుద్ధం చేయకుండా; బీఱు+పోయినను= పారిపోతే; ఎట్టి+శత్రునిన్= ఎటువంటి శత్రువైనప్పటికీ; వధింపఁగన్+కాదు= చంపరాదు.

తాత్పర్యం: యుద్ధం చేస్తూనే అవసరానికి తగిన మాటలు మాటాడుతున్న శత్రువుపై సందు చూచుకొని ఆయుధ ప్రయోగం చేయరాదు. యుద్ధం చేసేటప్పుడు క్రింద పడిపోయిన వాడి జోలికి పోరాదు; చేతిలోని కత్తి జారి నేలమీద పడినప్పుడు భుజబలము నశించి యుద్ధమునకు తొలగినా ఆ శత్రువును చంపరాదు. పిరికితనంతో యుద్ధం వదలిపెట్టి పారిపోయేవారిని భయపడిన వారిని - ఎట్టి శత్రువునైనా సంహరించరాదు.

వ. అని సమయంబుసేసి; రా సమయంబున. 149

ప్రతిపదార్థం: అని= అని; సమయంబు+చేసిరి= ఒడంబడిక చేసుకొన్నారు.; ఆ సమయంబున్= ఆ సమయంలో.

తాత్పర్యం: అని ఆ విధంగా ఆ సమయంలో శపథం చేశారు. (ఇరుపక్షాల వారూ కలిసి)

క. పలు చాయల నొప్పిన యా । బలము లొకటి కొకటి కెదురఁ బల్లవ పుష్పా
వలి గల వనములక్రియ ని । శ్చలత నిలిచి పొలిచె నసమసమధైర్యములన్. 150

ప్రతిపదార్థం: పలు, చాయలన్= పెక్కు కాంతులతో; ఒప్పిన= శోభిల్లిన; ఆ+బలములు= ఆ సైన్యాలు; ఒకటికి+ఒకటికిన్+ఎదురన్= ఒకదానికి మరి యొకటి ఎదురు బొదురుగా నిలువగా; (ఆరెండు సేనలు); పల్లవ, పుష్ప+ఆవళి= చిగురుటాకులు పువ్వుల సముదాయాలు; కల= ఉన్నట్టి; వనముల క్రియన్= తోటలవలె; నిశ్చలతన్= ధైర్యంగా; అసమ, సమ, ధైర్యములన్= సాటిలేనట్టి మరియు సమానమైన ధైర్యసాహసాలతో; నిలిచి= నిలబడి; పొలిచెన్= శోభిల్లాయి.

తాత్పర్యం: అలం: ఉపమ. రంగురంగులతో శోభిల్లిన ఆ రెండు సేనలూ సాటిలేని సమాన ధైర్యాలతో ఒకదానికి మరి యొకటి ఎదురుగా నిలబడినప్పుడు చిగురాకులతో పువ్వులతో విలసిల్లే తోటలవలె నిశ్చలంగా నిల్చి శోభిల్లాయి.

క. అత్తఱి సురఖచరాదుల । చిత్తము లనిఁ జూచువేడ్కఁ జిడిముడి వడఁగా
నొత్తొరవున నిరుదెఱఁగుల । యుత్తమవీరులును దాఁక నుంకింపంగన్. 151

ప్రతిపదార్థం: ఆ+తఱిన్= ఆ సమయమునందు; సుర, ఖచర+ఆదుల, చిత్తములు= దేవతలు, ఆకాశమునందు సంచరించేవారు మొదలైనవారి మనస్సులు; అని, చూచు, వేడ్కన్= యుద్ధాన్ని చూడాలనే కోరికతో; చిడిముడి+పడఁగాన్= తొందరపడగా; ఒత్తొరవునన్= రాపిడితో; ఇరు+తెఱఁగుల+ఉత్తమ, వీరులు= రెండు పక్షాలలోని గొప్ప యోధులు; తాఁకన్= యుద్ధంలో మార్కొనటానికి; ఉంకింపంగన్= పూనుకొనగా.

తాత్పర్యం: ఆ సమయంలో దేవతలు మున్నగు ఆకాశ సంచారులు కురుక్షేత్రంలో జరిగే ఆ మహాసంగ్రామాన్ని చూడాలని వేడుకతో తహతహలాడుతుండగా, ఉభయ పక్షాలలోని యోధులు యుద్ధాన్ని ప్రారంభించాలని ఉత్సాహపడుతుండగా. (తరువాతి పద్యంతో అన్వయం).

ధర్మరాజు పాదచారియై భీష్ముని యొద్దకుఁ బోవుట (సం. 6.41.6)

తే. సమరకౌతుకి యైన యజాతశత్రుఁ । డొప్పు మిగిలెడు మైమఱు వూడ్చి యాయు
ధములతోఁ గూడఁ దనయరదమునఁ బెట్టి । యిలకు దిగి మౌనియై కరంబులు మొగిడ్చి. 152

ప్రతిపదార్థం: సమర, కౌతుకి+ఐన= యుద్ధం చేయాలనే అభిలాషకలవాడైన; అజాత శత్రుఁడు= పుట్టని శత్రువులు కలవాడు - శత్రువులు లేనివాడు; ధర్మరాజు; ఒప్పు, మిగిలెడు= శోభాయమానమైన; మైమఱువు+ఊడ్చి= కవచాన్ని తీసివేసి; ఆయుధములతోన్+కూడన్= యుద్ధ పరికరాలతోకూడ; తన+అరదమునన్+పెట్టి= రథం మీద ఉంచి; ఇలకున్= నేలకు; డిగి= దిగి; మౌని+ఐ= మాటలాడటం మానివేసినవాడై; కరంబులు+మొగిడ్చి= చేతులు జోడించి.

తాత్పర్యం: అజాతశత్రువుగా పేరుకెక్కిన ధర్మరాజు చిట్టచివరకు యుద్ధం చేయటానికి సంసిద్ధుడై కురుక్షేత్రానికి వచ్చాడు. ఉన్నట్లుండి కవచం తీసివేసి ఆయుధాలతోపాటు రథంమీద పెట్టి, తాను రథం దిగి, మౌనవ్రతం పూని అంజలి ఘటించి.

వ. భీష్ము దెసకుం జనుచున్నం గనుంగొని యమ్మహీవల్లభు తమ్ములును శౌరి సాత్యకులును బరమాప్తు లగు ధరణీశులు నతని చేతోవృత్తం బెఱుంగమి నుత్తలపడు చిత్తంబులతో వాహనంబులు డిగ్గి యతనిం గూడం జని యప్పుడు. 153

ప్రతిపదార్థం: భీష్మ దెసకున్+చనుచున్నన్= భీష్ముడున్న వైపునకు వెళ్ళుతుండటం; కనుంగొని= చూచి; ఆ+మహీవల్లభు+తమ్ములును= ఆ(ధర్మ)రాజు తమ్ములూ; శౌరి, సాత్యకులును= శ్రీకృష్ణుడూ- సాత్యకీ; పరమ+ఆప్తులు+అగు= హృదయానికి మిక్కిలి దగ్గరివారైన స్నేహితులు అయిన; ధరణీ+ఈశులును= రాజులూ; అతని+చేతస్+వృత్తంబు= ధర్మరాజు మనస్సులో ఉన్నది; ఎఱుంగమి= తెలియకపోవటం చేత; ఉత్తలపడు+చిత్తంబులతోన్= కలత చెందిన మనస్సులతో; వాహనంబులు+డిగ్గి= వాహనాలను (రథ, గజ తురగాదులు) దిగి; అతనిన్+కూడన్+చని= ధర్మరాజు దరికి చేరబోయి; అప్పుడు= ఆ సమయమునందు.

తాత్పర్యం: ధర్మరాజు భీష్ముడు ఉన్నచోటికి వెళ్ళటం చూచి, అతడి తమ్ములు, శ్రీకృష్ణుడు, సాత్యకి, అతడికి మిక్కిలి దగ్గర స్నేహితులైన రాజులు, అతడి మనస్సులో ఏమున్నదో తెలియక కంగారు పడ్డారు. అయితే వారు గూడ వాహనాలు దిగి, ధర్మరాజును అనుసరించసాగారు. ఆ సమయంలో వారు ధర్మరాజుతో పలికిన మాటలు.

సీ. 'ఏ మెల్ల నుండ నీ విట్లొంటి గాల్నడ । నేఁగుచున్కికిఁ గత మెద్దియొక్కొ?
పన్నిన పగఱపై సన్నాహ మంతయు । నెడలించి నడచుట యెట్టులొక్కొ?
రిపులు దేఁకువ సెడఁ గృపణత దుర్బలు । చాడ్పునఁ జను టేమి చంద మొక్కొ?
యడరి పోరాటకు నదనైనచో నొప్పు । పాలిపోవఁ బోవుట వోలు నొక్కొ?

తే. యని క్రమంబున నా మరుత్తనయ విజయ । నకుల సహదేవు లడుగ భూనాథుఁ డొక్క
పలుకుఁ బలుకక యరుగంగఁ బద్మనాభుఁ । డక్కుమారులతో నిట్టలనియె నగుచు. 154

ప్రతిపదార్థం: ఏము+ఎల్లన్+ఉండన్= మేము అందరం ఉండగా; ఈవు= నీవు; ఇట్టు= ఇట్లు; ఒంటి= ఒంటరిగా; కాల్నడన్= కాలి నడకతో; ఏగుచున్కికిన్= వెళ్ళటానికి; కతము= కారణం; ఎద్ది+ఒక్కొ= ఏది అయి ఉంటుంది?; పన్నిన-పగఱపైన్+సన్నాహము+అంతయున్= శత్రువులపై చేసిన యుద్ధ ప్రయత్నమంతా; ఎడలించి= విడిచిపెట్టి; నడచుట= వెళ్ళటం; ఎట్టులు+ఒక్కొ?= ఏ విధంగా సమంజసం?; రిపులు= శత్రువులు; తేఁకువ+చెడన్= జంకు పోయేటట్లుగా; కృపణతన్= దైన్యంతో; దుర్బలు+చాడ్పునన్= బలహీనుడి వలె; చనుట= వెళ్ళటం; ఏమి చందము+ఒక్కొ?= ఏవిధంగా సమంజసం?; అడరి= ప్రజ్వలించి; పోరాటకున్= యుద్ధానికి; అదను= సరియైన సమయం; ఐనచోన్= ఐనప్పుడు; ఒప్పు= శోభ; పాలి+పోవన్+పోవుట= క్షీణించునట్లు వెడలుట; పోలును+ఒక్కొ?= సరియైనదా?; అని= అని; క్రమంబునన్= వరుసగా; ఆ+మరుత్+తనయ, విజయ, నకుల, సహదేవులు= భీముడు, అర్జునుడు, నకులుడు, సహదేవుడు; అడుగన్= ప్రశ్నింపగా; భూనాథుఁడు= రాజు (ధర్మరాజు); ఒక్క పలుకు పలుకక= ఒక మాట గూడ మాటాడక; అరుగంగన్= వెళ్ళగా; పద్మనాభుఁడు= (పద్మం నాభియందు కల) విష్ణువు-శ్రీకృష్ణుడు; ఆ+కుమారులతోడన్= ఆ పాండవ కుమారులతో; ఇట్లు= ఈ విధంగా; నగుచున్= నవ్వుతూ; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: ధర్మరాజు నిరాయుధుడై మౌనం వహించి నమస్కారముద్రతో పాదచారియై నడచి వెళ్ళటం చూచి అతడి తమ్ములు ఈ విధంగా ప్రశ్నించారు. భీముడు: 'మే మందరం ఉండగా అన్నయ్యా! నీవు ఒంటరిగా పాదచారివై ఎక్కడకు ఎందుకు వెళ్లుతున్నావు?' అర్జునుడు: 'శత్రువులను ఎదిరించటానికి, ఓడించటానికి మనం ఎన్నో వ్యూహాలు పన్నాము. వాటిని అన్నిటినీ ఉజ్జగించి నీవు ఎక్కడకు ఎందుకు వెళ్ళుతున్నట్లు?' నకులుడు: 'శత్రువులు జంకుపడకుండగా, దైన్యంతో బలహీనుడి వలె ఎందుకు నడచి వెళ్ళుతున్నట్లు?' సహదేవుడు: 'ఉత్సాహంతో ప్రజ్వరిల్లి యుద్ధం చేయవలసిన సమయం ఇది. ఎందుకు ఒప్పు తరుగునట్లు వెళ్ళడం?' ఈ ప్రశ్నలు అడుగుతూ ఉంటే ధర్మరాజు ఒక మాటకూడా మాట్లాడక పోతూఉండగా వారితో శ్రీకృష్ణుడు నవ్వుతూ ఈ విధంగా అన్నాడు.

వ. 'ఇతని తలం పే నెఱింగితి; నితండు భీష్మద్రోణ కృప శల్యులకు నమస్కరించి, వారలచేత ననుజ్ఞాతుండై భండనంబు సేయువాఁడు గాఁ దలంచి చనియెడుఁ; బెద్దల యనుజ్ఞఁ గొని కయ్యంబు సేసిన జయం బగుట నిశ్చయం బని యార్యులు సెప్పుదురు, గావున నా సుకర్మం బాచరించుట మేల కాక, యనిన వినియజాతశత్రు వెనుక నప్పు డరిగినవారలు పలుకు లుడిగి నిలిచి వెఱగుపడి చిత్రరూపంబుల చందంబై చూచుచుండిరి; కృష్ణార్జునులును భీముండును గవలును దోన చనం గౌంతేయాగ్రజుండు గాంగేయు తేరు సేరంబోవం, గౌరవ సైన్యజనంబు లేపు మిగిలి మెడ లెత్తి కనుంగొని; రయ్యవసరంబున నందలి యోధవీరు 'లితం డింత వెఱచునే' యనువారును 'వెఱవ నిప్పు డితని కేమి వచ్చె' ననువారును, 'వృకోదరుండు విష్వచ్చుండు గవలు సౌభద్రుండు సాత్యకి విరాటుండు ద్రుపదుండు ధృష్టద్యుమ్నుండు శిఖండియుం గలుగఁ దన కింత యేల?' యనువారును 'ధర్మతనయుండు భీతుండు గాఁ' డేమి తలంపున వచ్చెనో? యనువారును; మఱియు ననేక ప్రకారంబులం బలుకు వారునునై యుండిరి; పాండవ సైనికులు 'మానధనుండగు నిమ్మానవనాథుండు నదీనందనుతో నేమనువాఁ? డతం డితని నేమిభంగి సమ్మానించు? మాధవ ధనంజయు లెట్లు పలుకువారు? మారుతసుతుండును మాద్రీసూనులును నెత్తెఱంగున మాటలాడుదురు? వీరేమిటి కివ్విధంబునకుం దొడంగి రనుచు వగచి వెండియు వివిధ వచనముఖరు లగుచుండి; రయ్యుధిష్ఠిరుండు సముద్యత నానాయుధ బహుళంబైన కురువ్యూహంబు దఱిసి, పితామహుపాలికిం బోయి తత్పాదంబులకుఁ, బ్రణామంబు సేసి సవినయంబుగా నతని కిట్లనియె. 155

ప్రతిపదార్థం: ఇతని, తలంపున్= ఇతడి (ధర్మరాజు) అభిప్రాయం; ఏను= నేను; ఎఱింగితిన్= తెలిసికొన్నాను; భీష్మ, ద్రోణ, కృప, శల్యులకున్= భీష్ముడికి, ద్రోణుడికి, కృపుడికి, శల్యుడికి నమస్కరించి= వందనం సమర్పించి; వారలచేతన్= భీష్మ, ద్రోణ, కృప, శల్యులచేత; భండనంబు+చేయువాఁడుగాన్= యుద్ధం చేసేవాడుగా; తలంచి= ఆలోచించి; చనియెన్= వెళ్ళుతున్నాడు; పెద్దల+అనుజ్ఞన్= పెద్దవారి అనుమతి; కొని= పొంది; కయ్యంబు+చేసినన్= యుద్ధం చేస్తే; జయంబు+అగుట= గెలుపు లభించటం; నిశ్చయంబు+అని= తథ్యం అని; ఆర్యులు= పూజ్యులు; చెప్పుదురు= వచిస్తారు; కావునన్= కాబట్టి; ఆ+సుకర్మంబు= ఆ మంచి పని; ఆచరించుట= చేయటం; మేలు+అ+కాక+అనినన్= శుభం కదా! అని చెప్పగా; విని= ఆలకించి; అజాత శత్రు, వెనుకన్= ధర్మరాజు వెంట; అప్పుడు= ఆ సమయంలో; పలుకులు+ ఉడిగి= మాటలు మాట్లాడటం ఉజ్జగించి; నిలిచి= ఆగి; వెఱగు పడి= ఆశ్చర్యం చెంది; చిత్ర, రూపంబుల, చందంబు+ఐ= చిత్రలేఖనంలో ఉన్న బొమ్మల మాదిరిగా అయి (కదలకుండగా మెదలకుండగా నిలిచి); చూచుచున్+ఉండిరి= చూస్తూ ఉండిపోయారు; కృష్ణ+అర్జునులును= శ్రీకృష్ణుడూ, అర్జునుడూ; భీముండును= భీముడూ; కవలును= (నకుల సహదేవులూ); తోన+చనన్= వెనువెంట రాగా; కౌంతేయ+అగ్రజుండు= కుంతి పెద్ద కొడుకు- ధర్మరాజు; గాంగేయు, తేరు+చేరన్+పోవన్= భీష్ముడి రథాన్ని సమీపించగా; కౌరవ, సైన్య, జనంబు= కౌరవసేనలోని ప్రజ; ఏపు, మిగిలి= అతిశయించి; మెడలు+ఎత్తి= తలపైకిఎత్తి; కనుంగొనిరి= చూచారు; ఆ+అవసరంబునన్= ఆ సమయంలో; అందలి= (ఆ కౌరవ సైన్యంలోని); యోధవీరులు= యుద్ధం చేసే శూరులు; ఇతండు= (ఈ ధర్మరాజు); ఇంత+వెఱచునే!= ఇంతగా భయపడుతున్నాడే!; అనువారును= అనేవారూ; వెఱవన్= భయపడటానికి; ఇప్పుడు= ఈ సమయంలో; ఈతనికిన్+ఏమి, వచ్చెన్?= ఈ ధర్మరాజుకు ఏ అవసరం కలిగింది; అనువారును= అనేవారూ; వృకోదరుండు= భీముడు; విష్వచ్చుండు= అర్జునుడు; కవలు= నకుల, సహదేవులు; సౌభద్రుండు= అభిమన్యుడు; సాత్యకి, విరాటుడు; ద్రుపదుండు= ద్రుపదుడు; ధృష్టద్యుమ్నుండు= ధృష్టద్యుమ్నుడు; శిఖండియున్= శిఖండీ; కలుగఁగన్= ఉండగా; తనకున్?= (ధర్మరాజుకు); ఇంత+ఏల?= ఇంత (భయం) ఎందుకు? అనువారును= అనేవారూ; ధర్మతనయుండు= ధర్మరాజు; భీతుండు+కాఁడు= భయపడేవాడుకాడు; ఏమి, తలంపునన్= ఏ అభిప్రాయంతో; వచ్చెనో?= వచ్చాడో?; అనువారును= అనేవారూ; మఱియున్= ఇంకా; అనేక+ప్రకారంబులన్=

పెక్కు విధాలుగా; పలుకువారును+ఐ= మాటలాడేవారై; ఉండిరి= ఉన్నారు. పాండవ+సైనికులు= పాండవసేనలోని భటులు; మానధనుండు+అగు= అభిమానమే ధనంగా గల వాడగు; ఈ+మానవనాథుండు= ఈ రాజు; నదీ+నందనుతోన్= భీష్ముడితో (గంగా కొడుకుతో); ఏమి+అనువాఁడు?= ఏమి మాటాడునో?; అతండు= ఆ భీష్ముడు; ఇతనిన్= ధర్మరాజును; ఏమి, భంగిన్= ఏ రీతిగా; సమ్మానించున్?= గౌరవిస్తాడు?; మాధవ, ధనంజయులు= శ్రీకృష్ణుడు, అర్జునుడూ; ఎట్లు+పలుకువారు?= ఏ విధంగా మాటాడుతారు?; మారుత సుతుండును= భీముడు; మాద్రీసూనులు= మాద్రి కొడుకులు- నకుల సహదేవులు; ఏ+తెఱంగునన్= ఏమార్గంలో; మాటలాడుదురు?= మాటాడగలరో; వీరు= వీరు (ధర్మజాదులు); ఏమిటికిన్= ఎందుకు; ఈ+విధంబునకున్= ఈ రీతికి; తొడంగిరో= పాల్పడ్డారో?; అనుచున్+వగచి= అని విచారించి; వెండియున్= మరల; వివిధ, వచన, ముఖరులు+అగుచుండిరి= పెక్కు మాటలు ధ్వనించినవారు అయ్యారు; ఆ+యుధిష్ఠిరుండు= ఆ ధర్మరాజు; సముద్యత, నానా, ఆయుధ, బహుళంబు+ఐన= ఎన్నో విధాలైన ఆయుధాలతో కూడిన; కురు, వ్యూహంబున్= కౌరవులు పన్నిన వ్యూహాన్ని; దటిసి= సమీపించి; పితామహు పాలికిన్ పోయి= తాతగారి దగ్గరకు వెళ్ళి (భీష్ముని దరికి వెళ్ళి); తద్+పాదంబులకున్= ఆతని చరణాలకు; ప్రణామంబు+చేసి= నమస్కారం చేసి; సవినయంబుగాన్= నమ్రతతో; అతనికిన్= భీష్ముడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: 'ధర్మరాజు అభిప్రాయం నేను పసికట్టాను. ఇతడు భీష్ముడికీ, ద్రోణుడికీ, కృపుడికీ, శల్యుడికీ నమస్కరించి యుద్ధం చేయటానికి ముందు పెద్దలు పూజ్యులు అయిన వారి అనుమతి పొందాలని వెళ్ళుతున్నాడు. పెద్దల ఆశీస్సుల వలన విజయం సిద్ధిస్తుందని ఆర్యుల ప్రవచనం.' అంత అజాతశత్రువైన ధర్మరాజు వెంట వెళ్ళేవారు మౌనం వహించి చిత్రపటంలోని బొమ్మలవలె ఆశ్చర్యంతో చూస్తూ నిలబడ్డారు. కృష్ణుడు అర్జునుడు భీముడు, నకులసహదేవులు అనుసరించి తన వెనుక రాగా, కుంతి పెద్ద కొడుకు ధర్మరాజు భీష్ముడి రథం దగ్గరకు చేరేటప్పుడు కౌరవసేనలోని వారు తలలెత్తి చూచారు. అప్పుడు ఆ కౌరవసేనలో నుండి వినిపించిన మాటలు- 'అయ్యో ధర్మరాజు ఎందుకు ఇంత భయపడుతున్నాడు?' 'అసలు భయపడటానికి మూలకారణం ఏమిటి?' 'భీముడు అర్జునుడు నకుల సహదేవులు అభిమన్యుడు. ద్రుపదుడు, విరాటుడు, ధృష్టద్యుమ్నుడు, శిఖండి వంటి ఎందరో వీరులు తన పక్షంలో ఉండగా ధర్మరాజుకు ఈ పిరికితనం ఎందుకు?' 'ధర్మరాజు పిరికివాడు కాడు. అతడు రావటానికి ఏదో కారణం ఉండి ఉంటుంది.' 'అతడి మనస్సులో అసలు ఏముందో' - అని ఇంకా అనేక విధాలైన మాటలు వినిపించాయి. పాండవ సేనలో, 'ధర్మరాజు అభిమానవంతుడు. అతడు భీష్ముడితో ఏమి సంభాషిస్తాడో? భీష్ముడు ధర్మరాజును ఏ విధంగా మన్నిస్తాడో? చూడాలి. శ్రీకృష్ణుడు ఏమంటాడో? అర్జునుడు ఏమంటాడో? భీముడు నకుల సహదేవులు ఏ విధంగా సంభాషిస్తారో? వీరందరు ఈ విధంగా ప్రవర్తించటానికి కారణం ఏమిటో? చూడాలి.' 'ఈ విధంగా ఎన్నో మాటలు వెలువడ్డాయి. ధర్మరాజు ప్రౌఢ సన్నాహాలతో చక్కగా చిక్కగా అమర్చబడిన కౌరవవ్యూహాన్ని చేరి, పితామహుడైన భీష్ముడి దగ్గరకు పోయి, అతడి పాదాలకు నమస్కారం చేసి, నమ్రతతో అతడితో ఈ విధంగా అన్నాడు:

ఆ. ' అనఘ! నీ కెదిర్చి యని సేయువాఁడనై । ము న్ననుజ్ఞ గొనఁగ నిన్నుఁ గాన
నెమ్మి వచ్చినాఁడ; నీచేత దీవన । వడసి చనిన నేను బగఱ గెలుతు.' 156

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడవైన ఓ భీష్మ పితామహా!; నీకున్+ఎదిర్చి= నిన్ను ఎదిరించి; అని+చేయువాడను+ఐ= యుద్ధం చేసేవాడినై; మున్ను= మొదట; అనుజ్ఞన్+కొనఁగన్= అనుమతి పుచ్చుకొనాలని; నిన్నున్= నిన్ను; కానన్= చూడటానికి; నెమ్మిన్= ప్రీతితో; వచ్చినాఁడన్= వచ్చాను; నీచేతన్= నీ చేత; దీవన= ఆశీస్సు; పడసి= పొంది; చనినన్= వెళ్ళితే; పగఱన్= శత్రువులను; ఏను= నేను; గెలుతున్= జయిస్తాను.

తాత్పర్యం: 'పుణ్యపురుషుడవైన ఓ భీష్మపితామహా! నీవు అన్ని విధాలా పెద్దవాడవు. పూజనీయుడవు. దురదృష్టవశాత్తు నిన్ను యుద్ధంలో ఎదిరించవలసిన అవసరం ఏర్పడింది మాకు. అయితే, ముందుగా నీ అనుమతిని అర్థించి నీ దీవనలు పొంది, తదుపరి యుద్ధం చేయాలని నేను నీ దగ్గరకు ప్రాంజలినై వచ్చాను. నీ ఆశీర్వచనం లభిస్తే నేను శత్రువులను జయించగలను.'

విశేషం: ఇది ధర్మరాజు శీలానికి గీటురాయి. పరాక్రమ ప్రాభవాలలో ధర్మరాజుకంటె అతడి తమ్ములే అధికులు. అయితే, శక్తి సామర్థ్యాల కంటె సౌశీల్యమే గొప్పది. ప్రపంచ చరిత్రలో 'అజాత శాత్రవుడు' అనిపించుకొన్న వ్యక్తి ఉన్నాడా? ఇక మానవ సాహిత్యం మానవ వేదాంతం అటువంటి ఆదర్శ వ్యక్తి కోసం అన్వేషిస్తూనే ఉన్నాయి. ప్రపంచ సాహితీజగత్తులో ఆదర్శ వ్యక్తి అజాతశత్రువు. మహాభారతంలో 'ధర్మరాజు' పాత్రలో సాక్షాత్కరిస్తున్నాడు.

సీ. ' అన విని గాంగేయు! డక్కట! నీ విట్లు । సనుదేక తక్కిన శాపమిత్తు;
వచ్చితి మేలయ్యె; వైరుల నిర్జింపు, । మిది గాకయును వర మెద్దియైన
నడుగుము, నీకుఁగా ననిసేయు టొక్కటి । దక్కంగ' నావుడు ధర్మసుతుఁడు
' రారాజు పక్షమై రణము సేయుము; నాకు । హిత మగు కార్యంబు మతిఁ దలంపు'

ఆ. మనుడు 'నట్ల కాక యట నీతలం పేమి?' । యనిన భీష్మతోడ నతఁడు 'నిన్నుఁ
బోర గెలుచు విధము బోధింపు' మనుటయు । సస్మితాస్యుఁ డగుచు శాంతనవుఁడు. 157

ప్రతిపదార్థం: అనన్= అని ధర్మరాజు చెప్పగా; విని= ఆలకించి; గాంగేయుఁడు= గంగకొడుకు- భీష్ముడు; అక్కట!= ఆహా!; నీవు+ఇట్లు+చనుదేక+తక్కినన్= నీవు ఈ రీతిగా రాకపోతే; శాపము+ఇత్తున్= శాపం ఇచ్చేవాడిని; వచ్చితి(వి)= వచ్చావు; మేలు+అయ్యెన్= మంచిదయింది; వైరులన్= శత్రువులను; నిర్జింపుము= జయించుము; ఇది+కాకయును= ఇంతేకాక; నీకున్+కాన్+అని+చేయుట+ఒక్కటి+తక్కంగన్= నీ పక్షం చేరి యుద్ధం చేయమనటం ఒకటి తప్ప; వరము+ఎద్ది+ఐనన్= ఏదైన కోరిక; అడుగుము= కోరుకొమ్ము; నావుడున్= అని (భీష్ముడు) చెప్పగా; ధర్మసుతుఁడు= ధర్మరాజు; రారాజు+పక్షమై= దుర్యోధనుడివైపు; రణము+చేయుము= యుద్ధం చేయుము; మతిన్= (నీ) మనస్సులో; నాకున్+హితము+అగు+కార్యంబునన్= నాకు మేలు గలిగే పనిని; తలంపుము= యోజించుము; అనుడున్= అని (ధర్మరాజు) చెప్పగా; అట్లు+అ+కాక= సరే ఆ విధంగానే జరుగుగాక; అటన్= అచట; నీ, తలంపు+ఏమి?= నీ మనస్సులోని ఆలోచన ఏమిటి?; అనినన్= అని చెప్పగా; భీష్మతోడన్= భీష్ముడితో; అతఁడు= ధర్మరాజు; నిన్నున్= నిన్ను (భీష్ముడా! నిన్ను); పోరన్= యుద్ధంలో; గెలుచు+విధము= జయించే ఉపాయం; బోధింపుము= తెల్పుము; అనుటయున్= అని చెప్పగా; సస్మిత+ఆస్యుఁడు+అగుచున్= చిరునవ్వుతో కూడిన మొగం కలవాడు అవుతూ; శాంతనవుండు= శంతనుడి కొడుకు- భీష్ముడు.

తాత్పర్యం: అని ధర్మరాజు పలుకగా, భీష్ముడు ఈ విధంగా సమాధానం చెప్పాడు: 'ఓ ధర్మరాజా! నీవు రావటం మంచిది అయింది. నీవు ఈ విధంగా నా దగ్గరకు రాకపోతే నాకు నీమీద కోపం వచ్చి ఉండేది. నిన్ను శపించి ఉండేవాడిని. నీకు నా ఆశీస్సులు. నీవు శత్రువులను జయిస్తావు. అంతేకాదు, నీకు నేను ఒక వరం ఇవ్వదలిచాను. కోరుకో. నీవైపు నన్ను యుద్ధం చేయుమనే కోరిక తప్ప, ఇంకేది కోరినా నీమాట చెల్లిస్తాను' అన్నాడు. ఆ మాటలకు ధర్మరాజు ఈ విధంగా బదులు పలికాడు. "ఓ భీష్మపితామహా! నీవు రాజరాజు అయిన దుర్యోధనుడివైపే యుద్ధం చేయుము. అయితే- నీ మనస్సులో మాత్రం నా మేలు తలపోయుము' అని కోరాడు. 'అట్లాగే; అయితే అసలు నీ మనస్సులో ఉన్న మాట నీవు విప్పి చెప్పుము' అని అడిగాడు. ధర్మరాజు 'మహానుభావా! నిన్ను యుద్ధంలో మేము గెలిచే ఉపాయం దయచేసి చెప్పు'మని అన్నాడు. ఆ మాటలు విని భీష్ముడు చిరునవ్వు చిందే ముఖంతో ఈ విధంగా పలికాడు:

విశేషం: ధర్మరాజు (తిక్కన మాటలలో) 'మెత్తని పులి.' 'పితామహా! మేము కోరుకునేది నీ మరణం' అన్నాడన్నమాట ధర్మరాజు. భీష్ముడికి ఆ మాట ఆగ్రహం కలిగించలేదు. పైగా ఆతడు సుందర మందహాస మండన ముఖారవిందుడైనాడట! అప్పుడు భీష్ముడి ముఖంలో విరిసిన చిరునవ్వును ఏ చిత్రకారుడైనా చిత్రించగలడా?

క. ' నను మార్కొని గెలువఁగ న । య్యనిమిషులకు నరిది' యనుడు 'న ట్లగుటఁగదా
నిను వేఁడెద' నని కుంతీ । తనయుఁడు వలుకుటయు విని పితామహుఁడు గృపన్. 158

ప్రతిపదార్థం: ననున్= నన్ను (భీష్ముడిని); మార్కొని= ఎదిరించి; గెలువఁగన్= జయించగా; ఆ+అనిమిషులకున్= ఆ దేవతలకు కూడ; అరిది= అపురూపం (దుర్లభం); అనుడున్= అని భీష్ముడు చెప్పగా; అట్లు+అగుటన్+కదా= అందు చేతనే గదా; నినున్= నిను; వేడెదను= ప్రార్థిస్తున్నాను; అని= అని; కుంతీ+తనయుఁడు= కుంతి కొడుకు- ధర్మరాజు; పలుకుటయును= చెప్పగా; విని= ఆలకించి; కృపన్= దయతో; పితామహుఁడు= తాత - భీష్ముడు.

తాత్పర్యం: 'నన్ను జయించటం ఆ దేవతలకు కూడా సాధ్యం కాదు. ఇక మానవుల మాట చెప్పటం ఎందుకు?' అన్నాడు భీష్ముడు. 'అందుచేతనేగదా, నిన్ను ఈ విధంగా ప్రార్థించవలసి వచ్చింది' అని సమాధానం చెప్పాడు ధర్మరాజు. ధర్మరాజు చెప్పిన సమాధానం విని, పితామహుడు అయిన భీష్ముడు దయగలవాడై. (తరువాతి పద్యంతో అన్వయం.)

ఉ. ' చుట్టరికంబునన్ మనసు సొచ్చి ననుం గరఁగించి వేఁడినన్
దిట్టతనంబు వో విడిచి తీవ్రరణంబు కడంక దక్కి నేఁ
బట్టిన యాయుధంబు పెడఁబాసినఁ గాని వధింపఁ బోల ద
ట్టిట్టన కేఁగు; మిప్పరుస యింతక కాలము గాదు దానికిన్. 159

ప్రతిపదార్థం: చుట్టరికంబునన్= బంధుత్వంచేత; మనసు+చొచ్చి= నా మనస్సులో దూరి; ననున్= నన్ను; కరఁగించి (నా హృదయం) కరగించి; వేఁడినన్= ప్రార్థిస్తే; దిట్టతనంబు+పోన్+విడిచి= శక్తిసామర్థ్యాలు విడిచి పెట్టి; తీవ్రరణంబు+కడంక+తక్కి= ఘోర యుద్ధమందలి పూనిక విడనాడి; నేన్= నేను; పట్టిన+ఆయుధంబు+పెడన్+పాసినన్+కాని= చేతపట్టిన యుద్ధ పరికరాన్ని ప్రక్కకు వదలివేస్తే తప్ప; వధింపన్+పోలదు= (నన్ను) చంపటానికి వీలులేదు; ఈ+పరుస= ఈ విధంగా; అట్టు+ఇట్టు+అనక= ఇది అది అనక (ఎదురు మాటలు చెప్పకుండా); ఏఁగుము= వెళ్లిపొమ్ము; ఇంతకు+అ= ప్రస్తుతం; దానికిన్= నన్ను గెలిచే ఉపాయం ఏదో నీకు చెప్పటానికి; కాలము+కాదు= సమయం కాదు.

తాత్పర్యం: బంధుత్వం చొప్పున నా మనస్సులో దూరి నా హృదయం కరగించి ప్రార్థిస్తే, నా శక్తిసామర్థ్యాలు విడిచి పెట్టి, ఘోర యుద్ధంమీద పూనిక సడలించి, నేను పట్టిన ఆయుధం ప్రక్కకు పెట్టివేస్తే తప్ప, నన్ను ఎవరూ సంహరించలేరు. నాతో అది ఇది అని వాదానికి దిగవద్దు. ప్రస్తుతానికి మారు మాటాడకుండా వెళ్లిపొమ్ము. నన్ను జయించే ఉపాయం చెప్పటానికి ఇది తగిన సమయం కాదు.

ధర్మరాజు గురుకృపశల్యులచేత యుద్ధమున కనుజ్ఞాతుం డగుట (సం. 6.41.43)

తే. క్రమ్మఅంగ నేతెంచెదు గాక!' యనుడు । నతిముదంబునఁ బ్రణమిల్లి, యతని వాక్య
మపుడు దల నిడుకొనినవాఁ డగుచు నప్పి । తామహుని నెమ్మి వీడ్కొని ధర్మసుతుఁడు. 160

ప్రతిపదార్థం: క్రమ్మఱంగన్= మరల; ఏతెంచెదు(వు)+కాక= వచ్చెదవు రాక; అనుడున్= అని చెప్పగా; ధర్మసుతుడు= ధర్మరాజు; అతి+ముదంబునన్= మిక్కిలి సంతోషంతో; ప్రణమిల్లి= నమస్కరించి; అపుడు= ఆ సమయంలో; అతడి+వాక్యము= అతడి (భీష్ముని మాట); తలన్= శిరస్సుపై; ఇడికొనినవాడు+అగుచున్= పెట్టుకొన్నవాడై; ఆ+పితామహునిన్= ఆ తాతగారిని (భీష్ముని); నెమ్మిన్= ప్రీతితో; వీడ్కొని= సెలవు గైకొని.

తాత్పర్యం: 'ధర్మరాజా! నీవు మరల నన్ను సందర్శించు' అని భీష్ముడు చెప్పగా. ధర్మరాజు మిక్కిలి సంతోషించి, అతడి మాట శిరసావహించి తాతగారైన భీష్ముడి కడ సెలవు పుచ్చుకొని. (తరువాతి పద్యంతో అన్వయం).

వ. కృష్ణార్జునాదులుం దోడన చనుదేర గురుకృపశల్యుల కడకుం గ్రమంబున నరిగి పాదప్రణామంబు లాచరించి, వారలచేత రణంబునకు ననుజ్ఞ వడసి, యమ్మనుజపతి దనకు జయం బాశాసింపుమని యభ్యర్థించిన నయ్యాచార్యుండు 'నీకుం గృష్ణుండు మంత్రి యై యుండ నొరుల జయం బాశాసింపు మననేల? ధర్మం బేవలనం గలుగు నవ్వలన కృష్ణుండు గైకొను; నవ్వలనికి జయం బగు' ననియె; నిజవధోపాయంబు వేఁడిన నతండు 'నాచేత నాయుధం బున్నంతసేపు నన్నుం జంప నెట్టివారికి నశక్యం; బేను బ్రాయోపవేశంబున సన్న్యస్తశస్త్రుండ నైనం జంపుటకు నోపు నట్టివారికి నది దొరఁకొనుఁ; బెద్దయు నమ్మఁగలవాఁడు సెప్ప నత్యంతదుస్సహం బైన కీడుమాట వింటినేని నట్టివాఁడ నగుదు; నప్పు డట్టి పగఱకు నప్పని దీర్ప ననువై యుండు ' నని చెప్పినఁ గృపాచార్యునిం బరిమార్చు తెఱంగు నడుగం దొడంగి యేర్పడం బలుకనేరకున్న , నతం డెఱింగి తాను వధ్యుండు గామి యెఱింగించి 'గెలువు' మని దీవించె మద్రపతితో 'నీవు రాధేయునకు సారథి వగుట సంభవింప నోపు నని చెప్పి కయ్యంబు నప్పుడు కర్ణతేజంబు దూలం బలికి యతనిఁ జిక్కువఱుపవలయు' నని వరంబు గోరిన 'నతం; డవ్విధంబు నీ యుద్యోగ సమయంబున నియ్యకొనినయది గాదే' యట్ల చేయుదు' నని పలికె నిత్తెఱంగున నందఱ వీడ్కొని యజాతశత్రుం డనుజవర్గానుగతుండై మరలె నయ్యవసరంబున 161

ప్రతిపదార్థం: కృష్ణ+అర్జున+ఆదులున్= కృష్ణుడు; అర్జునుడు మున్నగువారు; తోడన్+అ+చనుదేరన్= తోడుగా వెనువెంట రాగా; గురు, కృప, శల్యుల, కడకున్= గురువైన ద్రోణాచార్యుడి కడకు; కృపుడి కడకు, శల్యుడి కడకు; క్రమంబునన్= వరుసగా; అరిగి= వెళ్ళి; పాద+ప్రణామంబులు= పాదాలకు నమస్కారాలు; ఆచరించి= చేసి; వారలచేతన్= (గురు కృప శల్యుల చేత); రణంబునకున్= యుద్ధానికి; అనుజ్ఞ= అనుమతి; పడసి= పొంది; ఆ+మనుజపతి= ఆ రాజు- ఆ ధర్మరాజు; తనకున్= తనకు; జయంబు= గెలుపు; ఆశాసింపుము+అని= ఆశీర్వదించుమని; అభ్యర్థించినన్= కోరగా; ఆ+ఆచార్యుండు= ఆ గురుడు- ద్రోణుడు; నీకున్= నీకు; కృష్ణుండు= శ్రీకృష్ణుడు; మంత్రి+ఐ+ఉండన్= మంత్రిగా ఉండగా; ఒరులన్= ఇతరులను; జయంబు= గెలుపు; ఆశాసింపుము+అనన్+ఏల?= ఆశీర్వదించుమని కోరనేల; ధర్మంబు= ధర్మం; ఏవలనన్+కలుగున్= ఏవైపు ఉంటుందో; ఆ+వలనన్= ఆ వైపే; కృష్ణుండు= శ్రీకృష్ణుడు; కైకొనున్= స్వీకరిస్తాడు; ఆ+వలనికిన్= ఆ పక్షానికి; జయంబు+అగున్= గెలుపు వస్తుంది; అనియెన్= అని చెప్పాడు; నిజ, వధ+ఉపాయంబున్= తనను సంహరించే తెరువు; వేఁడినన్= అర్థించగా (చెప్పుమని ప్రార్థింపగా); అతండు= ద్రోణుడు; నా చేతన్= నా హస్తమునందు; ఆయుధంబు+ఉన్నంత సేపు= యుద్ధ పరికరం ఉన్నంత కాలం; నన్నున్+చంపన్= నన్ను చంపేందుకు; ఎట్టివారికిన్= ఎవ్వరికైనా సరే; అశక్యంబు= సాధ్యం కాదు; ఏను= నేను; ప్రాయోపవేశంబునన్= ఉపవాసవ్రతంతో (అన్నపానాలు త్యజించి); సన్న్యస్త+శస్త్రుండన్+ఐనన్= విడిచి పెట్టిన ఆయుధాలు కలవాడను అయితే (అనగా శస్త్ర సన్న్యాసం చేస్తే); చంపుటకున్+ఓపు= సంహరించటానికి సామర్థ్యం కల్గిన; అట్టివారికిన్= అటువంటివారికి అది= నన్ను చంపటం; దొరఁకొనున్= వీలుపడుతుంది; పెద్దయున్= మిక్కిలి; నమ్మన్+తగువాఁడు=

విశ్వసింపదగినవాడు; చెప్పన్= చెప్పగా; అత్యంత, దుస్సహంబు+అయిన కీడుమాట= మిక్కిలిగా భరించలేని చెడుమాట; వింటిన్+ఏనిన్= ఆలకిస్తే; అట్టివాఁడన్+అగుదున్= అటువంటి వాడను= (శస్త్ర సన్న్యాసం చేసినట్టివాడను); కాగలను; అప్పుడు= ఆసమయంలో; అట్టి+పగఱకున్= అటువంటి శత్రువులకు; ఆ+పని= ఆకార్యం (నన్ను వధించటం); తీర్పన్+అనువు+ఐ ఉండున్= నెరవేర్చటానికి వీలుకలుగుతుంది; అని చెప్పినన్= అని ద్రోణుడు చెప్పగా; కృపాచార్యునిన్= కృపుడిని; పరిమార్చు+తెఱంగు= చంపదగిన ఉపాయం; అడుగన్+తొడంగి= ప్రశ్నించటానికి పూని; ఏర్పడన్= స్పష్టంగా; పలుక నేరక+ఉన్నన్= చెప్పజాలకపోవటం చేత; అతండు= కృపుడు; ఎఱింగి= తెలిసికొని; తాను= తాను (కృపుడు); వధ్యుండు+కామి= చంపుటకు వీలైన వాడు కాకపోవటం; ఎఱింగించి= తెలిపి (ధర్మరాజునకు చెప్పి); గెలువుము+అని= విజయం పొందుము అని; దీవించెన్= ఆశీర్వదించాడు; మద్రపతితోన్= మద్రరాజుతో- శల్యుడితో; నీవు= నీవు; రాధేయునకున్= రాధ కొడుకునకు - కర్ణుడికి; సారథివి+అగుట= రథచోదకుడవు కావటం; సంభవింపన్+ఓపున్= జరుగవచ్చును; అని చెప్పి= అని పలికి; కయ్యంబు+అప్పుడు= యుద్ధం చేసే సమయంలో; కర్ణు+తేజంబు= కర్ణుడి యొక్క దీప్తి; తూలన్+పలికి= పడిపోయేటట్లుగా మాటలాడి; అతనిన్= (కర్ణుడిని); చిక్కుపఱుపవలయున్= చీకాకు పెట్టవలెను; అని; వరంబు= వరమును; కోరినన్= అర్థించగా; అతండు= (శల్యుడు); ఆ+విధంబునన్= ఆ రీతిని; నీ+ఉద్యోగ, సమయంబునన్= నీవు యుద్ధ ప్రయత్నాలు చేస్తున్న సమయంలో; ఇయ్యకొనిన+అది= ఒప్పుకొన్నదే; కాదే= అవును గదా; అట్లు+అ= ఆ రీతిగా; చేయుదున్= చేస్తాను; అని పలికెన్= అని చెప్పాడు; ఈ+తెఱంగునన్= ఈ విధంగా; అందఱున్+వీడ్కొని= అందరి దగ్గర సెలవు తీసికొని; అజాతశత్రుండు= ధర్మరాజు; అనుజ, వర్గ+అనుగతుండు+ఐ= తమ్ములగుంపుచేత అనుసరించబడినవాడై; మరలెన్= వెనుకకు తిరిగి వెళ్ళాడు; ఆ+అవసరంబునన్= ఆ సమయంలో.

తాత్పర్యం: తనతోపాటు శ్రీకృష్ణుడూ అర్జునుడూ - అనుసరించి రాగా, ధర్మరాజు ముందుకు సాగి, ద్రోణుడు కృపుడు శల్యుడు ఉన్న చోట్లకు వెళ్లి, వారి పాదాలకు నమస్కారాలు చేసి, తాను వారితో యుద్ధం చేయటానికి అనుమతి ప్రసాదించండని అర్థించాడు. తనకు విజయం చేకూరవలెనని ఆశీర్వదించుమన్నాడు. అప్పుడు ద్రోణుడు - 'ధర్మరాజా! నీకు భగవంతుడైన శ్రీకృష్ణుడే మంత్రిగా ఉన్నాడు. ఇంకొకరి దీవనలు నీకు ఎందుకు? ధర్మం ఎక్కడ ఉంటుందో అక్కడ శ్రీకృష్ణుడు ఉంటాడు; శ్రీకృష్ణుడు ఎక్కడ ఉంటాడో అక్కడే విజయం సిద్ధిస్తుంది' అని ద్రోణుడనగా అది విన్న ధర్మరాజు ద్రోణుడిని మిమ్ములను ఏ రీతిగా చంపటానికి వీలు అవుతుందో చెప్పుమన్నాడు. అందులకు ద్రోణుడు చెప్పిన సమాధానం 'నా చేతిలో ఆయుధం ఉన్నంతవరకూ, నన్ను ఎవరూ చంపలేరు. నేను ఉపవాసవ్రతం స్వీకరించి, శస్త్రాలను విసర్జిస్తే, పిదప నన్ను చంపవచ్చును. ఎంతో నమ్మదగిన వాడు, నా గుండె భరించలేని కీడుమాట వినిపిస్తే నేను శస్త్ర సన్న్యాసం చేస్తాను. అట్టి సమయాన శత్రువులు నన్ను సంహరింపవచ్చు.' పిదప ధర్మరాజు కృపాచార్యుడిని అడిగాడు ఆయనను ఏ విధంగా సంహరించటానికి వీలౌతుందో తెలుపుమని. కృపాచార్యుడు తాను వధ్యుడు కాడనీ, అయితే యుద్ధంలో ధర్మరాజు గెలవాలని తాను దీవిస్తున్నట్లు చెప్పాడు. తరువాత- ధర్మరాజు శల్యుడితో, 'మామా! నీవు రాధేయుడైన కర్ణుడికి రథసారథివి కావచ్చును. అప్పుడు అతడి తేజస్సు మాసిపోయేటట్లు చూడుము' అని అర్థించాడు. శల్యుడు ఇట్లా సమాధానం చెప్పాడు. 'ధర్మరాజా! నేను నీవు యుద్ధ సన్నాహాలు చేసేటప్పుడే నీకు వాగ్దానం చేశాను కదా!. ఆ విధంగానే చేస్తాను.' అని ఈ విధంగా అందరి దగ్గర సెలవు తీసికొని ధర్మరాజు తన తమ్ములతో కలిసి మరలి వెళ్ళాడు. ఆ సమయంలో.

విశేషం: 1. మంత్రి= మంత్రం తెలిసినవాడు. హితవు తెలిపేవాడు. చతురుడు. రాజ్యతంత్రజ్ఞుడు.

2. ధర్మం- నిర్వచించటం కష్టం. స్థూలంగా ధర్మం అంటే మంచి పని - కర్తవ్యం అని చెప్పవచ్చును. 'ధర్మంబు బహు మార్గ దృష్టంబు' అని భారతంలోనే చెప్పబడింది. పురుషార్థాలలో 'ధర్మం' మొదటిది. మానవ జీవితానికి పరమ ధ్యేయం ధర్మం.

'ధారయతీతి ధర్మః' జగత్తును ధరించేది ధర్మం.

శ్లో॥ "ధృతిః క్షమా దమోzస్తేయం । శౌచ మింద్రియనిగ్రహః,

ధీ ర్విద్యా సత్య మక్రోధో । దశకం ధర్మలక్షణమ్." (మనుస్మృతి-6-92)

3. మహాభారత మహేతిహాస సారసంగ్రహంగా చెప్పదగిన వాక్యం- "యతో ధర్మ స్తతో జయః." ఎక్కడ ధర్మం ఉంటుందో అక్కడే విజయం ఉంటుంది. ఈ మాటకు ఎవరూ ఎట్టి అభ్యంతరం పెట్టనక్కరలేదు. ఈ వాక్యం గాంధారి అన్నట్లు సుప్రసిద్ధం. అయితే "యతో ధర్మ స్తతో జయః" అన్న వాక్యం భారతంలో పెక్కు చోట్ల కన్పిస్తుంది. ఇక్కడ- ద్రోణుడు ఆ మాటే అంటాడు. అయితే ఈ వాక్యానికి పూర్వ వాక్యం- "యతో ధర్మ స్తతో కృష్ణ," ఎక్కడ ధర్మం ఉంటుందో అక్కడే శ్రీకృష్ణుడు ఉంటాడు. ఈ వాక్యం కూడ నిరభ్యంతరమైనదే. కాని- సుప్రసిద్ధ పాఠం-

"యతః కృష్ణ స్తతో ధర్మః । యతో ధర్మ స్తతో జయః" శ్రీకృష్ణుడు ఎక్కడ ఉంటే- అక్కడే ధర్మం ఉంటుంది. ధర్మం ఎక్కడుంటే విజయం అక్కడ ఉంటుంది.

ధర్మం నిత్యచైతన్యవంతం అనీ, దేశకాల పాత్రలనుబట్టి ధర్మస్వరూపం మారుతుందనీ- ఈ విషయాన్ని నిరూపించేందుకే మహాభారతం అవతరించింది అనీ ఒక వాదం ఉన్నది. 'ఒకే నదిలో - మానవుడు రెండుసార్లు స్నానం చేయలేడు' అనే వాక్యం ఉదాహరించవచ్చును. సతత ప్రవాహిని నది. నరుడు నదిలో రెండవసారి స్నానం చేసేటప్పుడూ అది మొదట నది కాదు. నది మారుతుంది. నరుడు కూడా మారిపోవచ్చును.

శ్రీకృష్ణుడు మూర్తీభవించిన ధర్మం. ద్రోణుడు సంహరించబడింది- ధర్మరాజు "అశ్వత్థామా హతః (కుంజరః)" అని అబద్ధమాడటం చేత. అసత్యం చెప్పుమని అతడిని ప్రేరేపించింది శ్రీకృష్ణుడు. అది ధర్మమా? 'ఆచార్య దేవో భవ' 'సత్యమేవ జయతే' 'సత్యం వద' అనే వేదవాక్యాలు ఏమైనట్లు? ద్రోణుడి చేతిలో ధనుస్సు ఉన్నంత సేపు అతడు అవధ్యుడు. పాండవ సైన్యం సర్వనాశనం కావలసిందేనా? శ్రీకృష్ణుడు "సత్యం వద" అనే వేదవాక్యానికి - విప్రతిపత్తి చూపించాడు 'ప్రతిసూత్రానికి ఏదో ఒక అపవాదం ఉంటుంది.' అది దేశకాల పాత్రలనుబట్టి ఏర్పడుతుంది. ఆ పరిస్థితులలో అసత్యవాక్యం సత్యంతో సమానం. 'భూతహితంబుగాఁ బలుకు బొంకును సత్యఫలంబు నిచ్చు.' ఇది భారతంలోని వాక్యం.

'యతః కృష్ణ స్తతో ధర్మః" "యతో ధర్మ స్తతః కృష్ణ" అనే వాక్యాలు స్థూలదృష్టికి విప్రతిపన్నాలుగా కన్పించవచ్చు. సూక్ష్మదృష్టికి, 'ధర్మసూక్ష్మవేత్తలకు' అవి సమానార్థకాలే. మహాభారతం- 'ధర్మసూక్ష్మ సారసంగ్రహం.'

క. మొనల వినోదంబునకుం । గనుఁగొన నేతెంచియున్న కర్ణునికడకుం
జని హరి యిట్లను నొండొరుఁ । గని యప్పటి యుచితభంగి గడతేర్చి తగన్. **162**

ప్రతిపదార్థం: మొనలన్=సేనలను; వినోదంబునకున్= వేడుక కోసం; కనుఁగొనన్+ఏతెంచి+ఉన్న= చూడటానికి వచ్చి నట్టి; కర్ణుని+కడకున్+చని= కర్ణుడి వద్దకు వెళ్ళి; హరి= శ్రీకృష్ణుడు; ఒండొరున్+కని= ఒకరి నొకరు చూచి; అప్పటి+ఉచిత+భంగిన్= ఆ సందర్భానికి సరిపోయే మర్యాదలు తీరు తీయాలు జరిపి; తగన్= తగిన రీతిని; ఇట్లు+అనున్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: ఆ సమయంలో అచటికి సేనల విన్యాసాలను చూడాలనే వేడుకతో కర్ణుడు వచ్చి ఉన్నాడు. శ్రీకృష్ణుడు కర్ణుడి దగ్గరకు వెళ్ళి, తగిన మర్యాదగా పలుకరించి ఈ విధంగా అన్నాడు.

విశేషం: 1. భీష్ముడు యుద్ధం చేసేటపుడు తాను యుద్ధం చేయనని కర్ణుడు ప్రతిజ్ఞ చేశాడు. మరి యుద్ధభూమిలో కర్ణుడు

ఎట్లా ఉన్నాడు? అనే ప్రశ్న రావచ్చును. కర్ణుడు యుద్ధంలో పాల్గొనటానికి రాలేదు. ప్రేక్షకుడుగా మాత్రమే, వినోద కాలక్షేపానికి మాత్రమే వచ్చాడు అనేది తిక్కన చేర్చిన వివరణ, సమాధానం.

తే. ' అమరతటినీతనూజుపై నలుకఁ జేసి । యనికిఁ జొర వటె! యట్లైన నతఁడు సచ్చు
నంతదాఁకఁ బాండవులకై కొంత సమర । కేలి వేడుకఁ జలుపుట పోలదొక్కొ!' 163

ప్రతిపదార్థం: అమర+తటినీ+తనూజుపైన్= దేవతానదియైన గంగ కొడుకు భీష్ముడిపై; అలుకన్+చేసి= కోపం చేత; అనికిన్= యుద్ధానికి; చొరవు+అటె!= నీవు యుద్ధంలో చేరవట కదా!; అట్లు+ఐనన్= అట్లా అయితే; అతఁడు= భీష్ముడు; చచ్చునంతదాకన్= మరణించు వరకూ; పాండవులకై= పాండవ పక్షంలో చేరి; కొంత= కొంత; సమర కేలి= పోరాటం అనే ఆట; వేడుకన్= వినోదంగా; చలుపుట= చేయటం; పోలదు+ఒక్కొ!= సరిపోదా!

తాత్పర్యం: 'ఓ కర్ణా! భీష్ముడిపై కోపంచేత నీవు యుద్ధంలో పాల్గొనటం లేదని తెలిసింది. అయితే, ఆ భీష్ముడు మరణించే వరకు నీవు సరదాగా పాండవపక్షంలో చేరి యుద్ధం చేయగూడదా? భీష్ముడిపై నీవు పగదీర్చుకొనేందుకు ఇది మంచి అవకాశం.

విశేషం: శ్రీకృష్ణుడి రాజనీతి చతురతకు ఈ వాక్యం ఒక ఉదాహరణ. కార్యసాధనకు సామ, దాన, భేద, దండోపాయాలు నీతిజ్ఞులు ప్రవచించారు. ఇది భేదనీతి.

వ. అనిన విని దేవకీనందనునకు రాధానందనుం డిట్లనియె. 164

ప్రతిపదార్థం: అనిన= శ్రీకృష్ణుడు ఆ విధంగా చెప్పగా; విని= ఆలకించి; దేవకీనందనునకున్= దేవకి కొడుకైన శ్రీకృష్ణుడికి; రాధానందనుండు= రాధ కొడుకు కర్ణుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు;

తాత్పర్యం: అనిన ఆలకించి, శ్రీకృష్ణునితో కర్ణుడు ఈ విధంగా చెప్పాడు.

క. ' కినుక పొడమి గంగాపు । త్రుని కయ్యమునప్పు డనికిఁ దొలఁగితి నేనిం
జనుఁగా; కేఁ గురుపతికి । చ్చిన ప్రాణం బొండువలనఁ జేర్పం దగునే?' 165

ప్రతిపదార్థం: కినుక+పొడమి= కోపం వచ్చి; గంగాపుత్రుని+కయ్యము+అపుడు= గంగ కొడుకు భీష్ముడు యుద్ధం చేసేటపుడు; అనికిన్= యుద్ధానికి; తొలఁగితిన్+ఏనిన్= తప్పుకొంటే; చనున్+కాక= సరిపోవచ్చు; ఏన్= నేను; కురుపతికి+ఇచ్చిన= దుర్యోధనునకు సమర్పించిన; ప్రాణంబు= ప్రాణము- ఉసురు; ఒండువలనన్= వేరొక చోటికి; చేర్పన్+తగును+ఏ= చేర్చటం తగునా?

తాత్పర్యం: 'శ్రీకృష్ణా! నాకు ఏదో కోపం వచ్చి భీష్ముడి నాయకత్వంలో ఆతడు యుద్ధం చేసేటప్పుడు నేను యుద్ధం చేయనని శపథం చేశాను. అంతేకాని రారాజు అయిన దుర్యోధనుడికి ఏనాడో నా ప్రాణం సమర్పించాను. ఇక వేరే పక్షంలో చేరను. చేరే ప్రసక్తి లేదు. చేరటం న్యాయం కాదు.

విశేషం: కర్ణుడి స్వామిభక్తికి ఈ మాట ఉదాహరణ ప్రాయం. ఇంతేకాక- తాత్కాలిక కోప ప్రకోపానికేమి కాని- కర్ణుడికి భీష్ముడిపై అపారగౌరవం ఉన్నది. భీష్మ పతనానంతరం కర్ణుడు భీష్ముడికి అభివాదం చేసి అతడి మన్ననలు అందుకొన్నాడు.

వ. అనవుడు నప్పలుకులకు సంతోషించినవాఁడయి వాసుదేవుండు గౌంతేయులం గూడఁ జనుదెంచె నివ్విధంబున ధర్మనందనుండు గౌరవసైన్యంబు వెడలి నిలిచి యద్దిక్కు మొగంబు సేసి యెలుం గెత్తి యిట్లనియె: 166

ప్రతిపదార్థం: అనవుడున్= అని (కర్ణుడు) చెప్పగా; ఆ+పలుకులకున్= ఆ మాటలకు; సంతోషించినవాఁడు+ఐ= ఆనందం చెందినవాడై; వాసుదేవుండు= వసుదేవుడి కొడుకు- శ్రీకృష్ణుడు; కౌంతేయులన్+కూడన్+చనుదెంచెన్= కుంతీపుత్రులైన పాండవులను చేరేందుకు వచ్చాడు; ఈ+విధంబునన్= ఈ రీతిగా; ధర్మనందనుండు= ధర్మరాజు; కౌరవ సైన్యంబు వెడలి= కౌరవసేననుండి బయటకు వచ్చి; నిలిచి= నిలబడి; ఆ+దిక్కు, మొగంబు, చేసి= ఆ వైపు తన ముఖం పెట్టి; ఎలుంగు+ఎత్తి= కంఠస్వరం పెద్దదిగా చేసి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: అని కర్ణుడు పలుకగా, అతడి స్వామిభక్తికి సంతోషించి శ్రీకృష్ణుడు, పాండవులను చేరటానికై మరలి వచ్చాడు. ఈ విధంగా ధర్మరాజు కౌరవసేన నుండి వెడలి వచ్చి, ఆ సేనవైపు తన ముఖం పెట్టి, తన కంఠస్వరం పెద్దదిగా చేసి ఈ విధంగా ప్రకటించాడు.

తే. ‘ మమ్ము నెమ్మిమైఁ గలయఁ జిత్తంబు గలుగు । వార లెవ్వరు గలిగిన వచ్చి కలయుఁ;
డట్టివారిని నా తమ్ము లంతవారి । గాఁగఁ బాటింతు నెంతయు గారవమున.’ **167**

ప్రతిపదార్థం: మమ్మున్= మమ్ము (మా పాండవ పక్షాన్ని); నెమ్మిమైన్= ప్రీతితో; కలయన్= చేరటానికి; చిత్తంబు+కలుగువారలు= మనస్సు ఉన్నవారు; ఎవ్వరు+కలిగినన్= ఎవ్వరైనా ఉన్నట్లయితే; వచ్చి+కలయుఁడు= రండి చేరండి; అట్టివారిని= (ఆ విధంగా మా పక్షంలో చేరే వారిని); నాతమ్ములు+అంతవారిన్+కాఁగన్= నా తమ్ములతో సమానులనుగా; ఎంతయున్, గారవమునన్= మిక్కిలి గౌరవంతో; పాటింతున్= చూస్తాను (అనుసరిస్తాను).

తాత్పర్యం: ‘కౌరవపక్షంనుండి మా పక్షంలోకి ఎవరయినా వచ్చి చేరితే వారికి నా హృదయపూర్వకమైన స్వాగతం. అట్టివారిని నేను నా తమ్ములతో సరిసమానంగా చూస్తానని వాగ్దానం చేస్తున్నాను.’

వ. అనిన విని నీ పుత్త్రుండు యుయుత్సుం ‘డేను వచ్చెద నన్నుం గలపికొను’ మని పలికిన దానికిం బాండవాగ్రజుండు ప్రియంబందిన పలుకులు పలుకుటయును నతండు దుర్యోధనాదుల దుశ్చేష్టితంబు లుగ్గడించుచుఁ గౌంతేయుల గుణంబు లగ్గించుచు నిజసేనాసమేతంబుగా నిస్సాణాది రావంబులు సెలంగం జని ధర్మనందను బలంబులం గలసె; నది యట్టిద కాక సవతాలి ప్రజలు పొంద నేర్తురే? యది యట్లుండె; నిట్లు దన్నుం గలసిన సంతుష్టాంతరంగుం డగుచు నయ్యుధిష్ఠిరుండు యుయుత్సునకు నత్యుపచార సమాచారంబులం బ్రమోదం బొనరించి. **168**

ప్రతిపదార్థం: అనినన్+విని= అని (ధర్మరాజు) చెప్పగా ఆలకించి; నీ+పుత్త్రుండు= నీ కొడుకు; యుయుత్సుండు= యుయుత్సుడు; ఏను= నేను; వచ్చెదన్= వస్తాను; నన్నున్= నన్ను; కలిపికొనుము+అని= నన్ను మీపక్షంలో చేర్చుకొనవలసింది; అని; పలికినన్= చెప్పగా; దానికిన్= ఆ మాటకు; పాండవ+అగ్రజుండు= పాండవులలో పెద్దవాడు ధర్మరాజు; ప్రియంబు+అందిన= ప్రీతితో కూడిన; పలుకులు+పలుకుటయున్= మాటలు చెప్పుట చేత; అతండు= (యుయుత్సుడు); దుర్యోధన+ఆదుల+దుస్ చేష్టితంబులు= దుర్యోధనుడు మున్నగు వారు చేసిన చెడ్డపనులు; ఉగ్గడించుచున్= పేర్కొంటూ; కౌంతేయుల+గుణంబులు= కుంతీకుమారుల మంచి లక్షణాలు; అగ్గించుచున్= పొగడుతూ; నిజ సేనా సమేతంబుగాన్= తనయొక్క సైన్యంతోపాటుగా; నిస్సాణ+ఆది రావంబులు+చెలంగన్= పెక్కు చర్మవాద్యాల ధ్వనులు విస్తరిల్లగా; చని= వెళ్ళి; ధర్మనందను+బలంబులన్= ధర్మరాజు సైన్యంలో; కలసెన్= చేరాడు; అది+అట్టిది+అ+కాక= అది అంతే; సవతి+ఆలి+ప్రజలు= సవతులకు పుట్టిన సంతానం; పొందన్+నేర్తురు+ఏ?= కలిసి పొత్తుగా ఉంటారా?; అది= ఆ విషయం; అట్లు ఉండెన్= ఆ విధంగా ఉండుగాక; ఇట్లు= ఈ రీతిగా; తన్నున్+కలసినన్= తనతో చేరగా; సంతుష్ట+అంతరంగుండు+అగుచున్= తృప్తిపొందిన మనస్సు కలవాడై; ఆ+యుధిష్ఠిరుండు=

ఆ ధర్మరాజు; యుయుత్సునకున్; అత్యుపచార+సమాచారంబులన్= మిక్కిలి మర్యాదతో గూడిన సేవలతో; ప్రమోదంబున్+పొనరించి= సంతోషము కల్గించి

తాత్పర్యం: ధర్మరాజు ఆ విధంగా ప్రకటించ, నీ కొడుకు యుయుత్సుడు 'నేను వస్తాను. నన్ను మీ పక్షంలో చేర్చుకొనండి' అని పలికిన దానికి ధర్మరాజు సంతోషించి ప్రియ వాక్యాలతో అతడికి స్వాగతం చెప్పాడు. యుయుత్సుడు దుర్యోధనాదులు మున్నగువారు చేసిన చెడ్డపనులను ఉద్ఘాటిస్తూ పాండవుల సద్గుణాలను కీర్తిస్తూ తన సేనలతోపాటు పాండవ సైన్యంలో చేరిపోయాడు. అప్పుడు పెక్కు వాద్యాలు ఘోషించాయి. సవతి బిడ్డలు - సామరస్యంగా కలిసి మెలిసి ఉండలేరు గదా అది అట్లా ఉంచుము. యుయుత్సుడు ఈ విధంగా తన పక్షంలో చేరినందుకు సంతోషించి, అతడికి ఎన్నో మర్యాదలు చేసి ధర్మరాజు అతడిని మన్నించాడు.

విశేషం: 1. యుయుత్సుడు- ధృతరాష్ట్రుడికి వైశ్యభార్యవలన కలిగిన కొడుకు.

తే. 'రథముమీఁదికిఁ జనుదెంచి పృథులసైన్య । హర్షభాషణధ్వనులుఁ దూర్యస్వనములు
నెగసి దివి ముట్ట మైమఱు విడి తలిర్చు । నెలమిఁ గోదండ తూణీరములు ధరించె. 169

ప్రతిపదార్థం: రథము మీఁదికిన్+చనుదెంచి= (ధర్మరాజు) రథాన్ని అధిరోహించి; పృథుల, సైన్య, హర్ష, భాషణ, ధ్వనులున్= గొప్పదైన సేనలో సంతోషమును తెలిపే మాటల సవ్వడులూ; తూర్య స్వనములు= మంగళ వాద్యధ్వనులు; దివి ముట్టన్= ఆకాశాన్ని తాకుతూ; ఎగసెన్= వ్యాపించాయి; మైమఱువు+ఇడి= కవచాన్ని ధరించి; తలిర్చు+ఎలమిన్= చిగిర్చే సంతోషంతో; కోదండ+తూణీరములు= విల్లు అమ్ములూ; ధరించెన్= తాల్చాడు.

తాత్పర్యం: ధర్మరాజు రథం ఎక్కి కవచం ధరించాడు. అప్పుడు ఆ గొప్పసేనలో మంగళవాద్యాలు మ్రోగాయి. అతడు సంతోషంతో కవచం తొడిగి ధనుస్సు అమ్ముల పొదులు తాల్చాడు.

విశేషం: ధర్మరాజు పాదచారియై భీష్మ ద్రోణ కృప శల్యుల కడకు వెళ్ళే ముందు కవచం తీసివేశాడు. నిరాయుధుడై నడచి వెళ్ళాడు. ఇప్పుడు కవచం ధరించి ఆయుధాలు చేపట్టి యుద్ధానికి సిద్ధం అయ్యాడు. కథాచిత్రణలో తిక్కన మహాకవికి గల సమ్యక్‌దృష్టికి ఇది ఒక ఉదాహరణం.

వ. తదవసరంబున నితని తమ్ములుం దక్కటి దొరలును దమతమ రథంబు లెక్కి యెప్పటి నెలవుల నిలిచినం, దదీయవ్యూహంబు పూర్వప్రకార సన్నాహం బై యొప్పె నట్టియెడ రెండు బలంబులవారును బాండవులు దొల్లి పడినపాట్లు సెప్పికొని వగచుచు వారు సంధికై చేసిన యత్నంబు వాక్రుచ్చి మెచ్చుచు నప్పుడు గురుజనంబులయెడఁ బాటించిన వినయంబు వర్ణించి యనురాగించుచుండి'రని చెప్పిన విని ధృతరాష్ట్రుండు సంజయున కిట్లనియె. 170

ప్రతిపదార్థం: తత్+అవసరంబునన్= ఆ సమయంలో; ఇతని, తమ్ములున్= ధర్మరాజు తమ్ములూ; తక్కటి దొరలును= తక్కిన దండనాథులూ; తమ, తమ, రథంబులు+ఎక్కి= తమ తమ రథాలు అధిరోహించి; ఎప్పటి+నెలవులన్= ఇదివరకు ఉన్నచోటులలో; నిలిచినన్= నిలబడగా; తదీయ+వ్యూహంబు= ఆ వ్యూహం (పన్నుగడ); పూర్వ, ప్రకార, సన్నాహంబు+ఐ= ఇది వరకు మాదిరిగానే సన్నద్ధమై; ఒప్పెన్= విలసిల్లింది; అట్టి+ఎడన్= అప్పుడు; రెండు, బలంబులవారును= (కౌరవుల యొక్కయు పాండవుల యొక్కయు సేనలు); పాండవులు; తొల్లి= పూర్వం; పడినపాట్లు= అనుభవించిన అవస్థలు; చెప్పికొని= మాటలాడి; వగచుచున్= విచారిస్తూ; వారు= పాండవులు; సంధికై= శాంతికై; చేసిన యత్నంబు= చేసిన ప్రయత్నాలు; వాక్రుచ్చి= వచించి; మెచ్చుచున్= పొగడుతూ; అప్పుడు= ఆ సమయంలో; గురు జనంబుల+ఎడన్= పెద్దల యెడ; పాటించిన= అవలంబించిన; వినయంబు=

నమ్రత; వర్ణించి= పొగడి; అనురాగించుచున్+ఉండిరి= ప్రేమను వెదజల్లారు; అని చెప్పినన్= అని చెప్పగా; విని= ఆలకించి; ధృతరాష్ట్రుండు= ధృతరాష్ట్రుడు; సంజయునకున్+ఇట్లు అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఆ సమయంలో ధర్మరాజు తమ్ములు మిగిలినవారూ తమ తమ రథాలు అధిరోహించి లోగడ తాము ఉన్న చోటులకు పోయి నిలిచారు. అప్పుడు పాండవుల వ్యూహం మునుపటిలాగానే సన్నద్ధమై విలసిల్లింది. ఇరు పక్షాలలోని సైనికులు - లోగడ పాండవులు పడిన పాట్లు చెప్పుకొని చింతిస్తూ వారు సంధి కోసం చేసిన ప్రయత్నాలు స్మరించి పాండవులను ప్రశంసించారు. ఇప్పుడు పాండవులు శత్రుపక్షంలో ఉన్నపెద్దలు భీష్మ ద్రోణ కృప శల్యుల యెడ చూపిన పూజ్యభావాన్ని వర్ణిస్తూ ప్రేమను వెదజల్లారు' అని సంజయుడు చెప్పగా అతడితో ధృతరాష్ట్రుడు ఈ విధంగా అన్నాడు.

క. ' మానుగ ధర్మక్షేత్రం । బైన కురుక్షేత్రమున మహాహవమునకుం
బూని మన బలముఁ బాండవ । సేనయు నిటు వన్ని యేమి సేసెం జెపుమా!' 171

ప్రతిపదార్థం: మానుగన్= ప్రశస్తంగా (లెస్సగా); ధర్మక్షేత్రంబు+ఐన= ధర్మానికి కుదురైన నేల అయిన; కురుక్షేత్రమునన్= కురుక్షేత్రం అనే పేరుగల ప్రదేశంలో; మహా+ఆహవమునకున్= గొప్ప యుద్ధానికి; పూని= సిద్ధమై; మన+బలమున్= మన సేనయు; పాండవ సేనయున్= పాండవుల సైన్యమూ; ఇటు= ఈ రీతిగా; పన్ని= తలపడి (సిద్ధమై); ఏమి+చేసెన్+చెపుమా!= ఏ విధంగా ప్రవర్తించాయో చెప్పుము.

తాత్పర్యం: ఓ సంజయా! మన సేనలు పాండవుల సేనలు ధర్మక్షేత్రంగా సుప్రసిద్ధమైన కురుక్షేత్రం చేరి, యుద్ధానికి సంసిద్ధములై ఏమి చేశాయో నాకు వివరించి చెప్పుము.

విశేషం: కురుక్షేత్రము= ప్రస్తుతం హర్యానాలో ఉన్న ప్రదేశం. ఢిల్లీకి ఉత్తరదిశగా, సుమారు 120 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. రైలుస్టేషను ఉన్నది. ఢిల్లీకి కురుక్షేత్రానికి మార్గమధ్యంలో పానిపట్టు ఉన్నది. పౌరాణిక యుగాలలో 'కురుక్షేత్రం' సుప్రసిద్ధ రణరంగం. అట్లే చారిత్రక కాలంలో పానిపట్టు. కురు అనే పేరు గల రాజు పరిపాలించిన ప్రాంతం కురుక్షేత్రం. 'క్షేత్రం' అనే శబ్దానికి ప్రదేశం అని అర్థం అయినా, 'క్షేత్రం' అంటే పుణ్యప్రదేశం అనే రూఢ్యర్థం ఏర్పడింది. పెద్ద సంఖ్యలో జనులు చేరాలంటే అక్కడ కొన్ని వసతులు ఉండాలి. జలతృణకాష్ఠ సమృద్ధి ఉండి, విస్తీర్ణం గలిగి ఉండాలి. అట్టి ప్రదేశం యజ్ఞవాటికకు అనువైనది. అట్లే సంగ్రామరంగంగా ఉండదగింది. కురుక్షేత్రంలో పౌరాణిక కాలంలో యజ్ఞాలు జరిగాయి. అందుచేత అది 'పుణ్య క్షేత్రం' అయింది. తదుపరి ఆ ధర్మక్షేత్రం - కురుక్షేత్రంగా - సంగ్రామ రంగంగా ప్రసిద్ధికెక్కింది. 'మానుగ ధర్మక్షేత్రంబైన కురుక్షేత్రమున' అనే తిక్కన ప్రయోగం. 'ధర్మ క్షేత్రే - కురుక్షేత్రే' అనే పదగుంఫనంతోనే సంస్కృతంలో భగవద్గీత ప్రారంభమౌతుంది.

ఈ పద్యం నుండి భగవద్గీత ప్రారంభం. సంస్కృత భారతంలోని భగవద్గీతలో 700 శ్లోకాలు ఉన్నాయి. తిక్కన తెలుగు సేతలో ఉన్న పద్యాలు 60 మాత్రమే. దీనినిబట్టి తిక్కన - భగవద్గీతను యథాతథంగా అనువదించ లేదని స్పష్టంగా తెలుస్తున్నది. మూల సంస్కృత మహాభారతం - ఏకలక్ష శ్లోక సంభృతమైన మహేతిహాసం. యావత్ ప్రపంచంలో అంత పెద్ద కావ్యం ఇంకోటి లేదు. కవిత్రయ తెలుగు భారతం మూల భారతానికి అనుసృజనమేకాని అనువాదం కాదు. తిక్కన ఆధ్యాత్మిక భాగాలను చాలా చోట్ల సంక్షేపించాడు. సనత్సుజాతీయాన్ని పూర్తిగా వదలివేశాడు. భగవద్గీతను వదలి పెట్టలేదుగాని - మదించి మదించి - చిన్నదిగా చేశాడు. తిక్కన తెలుగు గీత - సంస్కృత భగవద్గీతా సారసంగ్రహం అని చెప్పవచ్చు. తిక్కన వ్రాసిన భగవద్గీతా భాగంలో ఉన్న 60 పద్యాలలో 20 పద్యాలు సంస్కృత మహాభారతంలో కథాభాగానికి సంబంధించి మొదటి అధ్యాయం అర్జున విషాదయోగానికి చెందినట్టివే. అనగా గీతాప్రబోధాన్ని - తిక్కన కేవలం 40 పద్యాలలో సంక్షేపించినాడన్న మాట.

వ. అనిన విని సంజయుం డతని కి ట్లను: 'దుర్యోధనుండు పాండవవ్యూహంబు గనుంగొని గురుని కడకుం బోయి 172

ప్రతిపదార్థం: అనినన్= (ధృతరాష్ట్రుడు) చెప్పగా; విని; సంజయుండు; అతనికిన్+ఇట్లు+అనున్= ధృతరాష్ట్రుడితో ఈ విధంగా చెప్పాడు; దుర్యోధనుండు= దుర్యోధనుడు; పాండవ+వ్యూహంబున్= పాండవులు ఏర్పరచిన సైనిక విన్యాసాన్ని; కనుంగొని= చూచి; గురుని+కడకున్+పోయి= ద్రోణాచార్యుడి దగ్గరకు వెళ్లి.

తాత్పర్యం: అనగా విని సంజయుడు ధృతరాష్ట్రుడితో ఇట్లా అన్నాడు: దుర్యోధనుడు పాండవుల వ్యూహాన్ని చూచి, గురువైన ద్రోణుని దగ్గరకు వెళ్లాడు.

తే. ' చూడు మాచార్య! నీదు శిష్యుండు ద్రుపద । సుతుఁ డమర్చినయది పాండుసుతుల సేన
పెంపు బలుపును గలిగి యొప్పినది: యందు । భీము నర్జునుఁ బోలిన బిరుదుమగలు. 173

ప్రతిపదార్థం: ఆచార్య!= ఓ ద్రోణాచార్య గురుదేవ!; చూడుము; నీదు+శిష్యుండు= నీ విద్యార్థి; ద్రుపద+సుతుఁడు= ద్రుపదుడి కొడుకు- ధృష్టద్యుమ్నుడు; అమర్చిన+అది= పన్నినట్టిది; పాండు సుతుల సేన= పాండవుల సైన్యం; పెంపు= అతిశయం; బలుపును= బలం కూడ; కలిగి= ఉండి; ఒప్పినది= శోభిల్లింది; అందున్= ఎచట చూచినా సరే; భీమున్= భీముడిని; అర్జునున్= అర్జునుడిని; పోలిన= సాటి అయ్యే; బిరుదు మగలు= శక్తి సామర్థ్యాలుగల వీరులు.

తాత్పర్యం: 'ఓ ద్రోణాచార్య! గురుదేవా! నీ శిష్యుడైన ధృష్టద్యుమ్నుడు - ద్రుపద మహారాజు కొడుకు, పన్నిన వ్యూహం - పాండవ సేనా విన్యాసం వీక్షించుము. ఎంత గొప్పగా, బలంగా శోభిల్లుతున్నదో. ఆ సేనలోని వీరులు శక్తి సామర్థ్యాలుగలవారు. భీముడికీ అర్జునుడికీ దీటైనవారు.

వ. సాత్యకి విరాటుండు ద్రుపదుండు ధృష్టకేతుండు చేకితానుండు గాశిరాజు పురుజిత్తు కుంతిభోజుండు శైబ్యుండు యుధామన్యుండు నుత్తమౌజుండు నభిమన్యుండు ద్రౌపదేయులు వార లందఱుం జాలు మానిసుల యిట్లు గూడి భీమాభిరక్షితంబగు నబ్బలంబు సాల సమర్థంబునుం బోలె మెఱసె; మన సేనా నాయకులం జెప్పెద; నిన్నును భీష్ముని నెన్న నేల? కృపాచార్యుం డశ్వత్థామ శల్యుండు వికర్ణుండు భూరిశ్రవసుండు మఱియుం బెక్కండ్రు రథికులు గలరు; నానాస్త్ర కోవిదులు, వివిధయుద్ధవిశారదులు, వీర లందఱు నాకై ప్రాణంబులు విడిచెద మని యున్నవా రిట్లు బెరసి భీష్మపరిపాలితం బయిన యీ సైన్యంబు పెద్దయు సమర్థం బై తోఁచుచున్నయది; మీరెల్లను వలయునెడల నిలిచి భీష్మునకుఁ గావలి గావలయు' ననిన ద్రోణుం' డట్ల కాక! యింత సెప్పనేమిటి? కనియె; నప్పలుకులు విని యమ్మహీపతికిఁ బ్రియంబు వుట్ట శాంతనవుండు సింహనాదంబు సేసి శంఖంబు పూరించిన. 174

ప్రతిపదార్థం: సాత్యకి, విరాటుండు, ద్రుపదుండు, ధృష్టకేతుండు, చేకితానుండు, కాశిరాజు, పురుజిత్తు, కుంతిభోజుడు, శైబ్యుండు, యుధామన్యుండు, ఉత్తమౌజుండు, అభిమన్యుండు, ద్రౌపదేయులు= సాత్యకి, విరాటుడు, ద్రుపదుడు, ధృష్టకేతుడు; చేకితానుడు, కాశిరాజు అయిన పురజిత్తు, కుంతి భోజుడు, శైబ్యుడు, యుధామన్యుడు, ఉత్తమౌజుడు, అభిమన్యుడు, ద్రౌపది కొడుకులు; వారలు+అందరున్= వారు అందరూ; చాలు+మానిసులు+అ= సమర్థులైన మనుష్యులే; ఇట్లు= ఈ రీతిగా; కూడి= కలసి; భీమ+అభి రక్షితంబు+అగు= భీముడిచే లెస్సగా కాపాడబడిన; ఆ+బలంబు= ఆ సేన; చాలన్= మిక్కిలి; సమర్థంబునున్+పోలెన్= మిక్కిలి బలం కలిగి నట్టిదిగా; మెఱసెన్= వెలుగొందుతున్నది; మన+సేనా+నాయకులన్= మన పక్షాన ఉన్న సేనాధిపతులను; చెప్పెదన్= చెప్పుతాను; నిన్నునున్= నిన్ను (ద్రోణుని); భీష్మునిన్= భీష్ముడిని; ఎన్నన్+ఏల?= ప్రత్యేకంగా ఎంచనేల?; కృపాచార్యుండు= కృపాచార్యుడు, అశ్వత్థామ, శల్యుండు, వికర్ణుండు, భూరిశ్రవసుండు; మఱియున్= ఇంకా; పెక్కండ్రు= పెక్కుమంది; రథికులు= రథములపై యుద్ధం చేసే వీరులు; కలరు= ఉన్నారు; నానా+అస్త్ర, కోవిదులు, వివిధ+యుద్ధ+విశారదులు= పెక్కు మంత్రపూతములైన

ఆయుధాలు తెలిసిన వారు, పెక్కు రకములైన యుద్ధాలు చేయటంలో ఆరితేరినవారు; వీరలు+అందఱున్= వీరంతా; నాకై= నా కోసమై; ప్రాణంబులు= అసువులు; విడిచెదము= త్యాగం చేస్తాము; అని; ఉన్నవారు= ఉన్నారు; ఇట్లు= ఈ రీతిగా; బెరసి= సమకూడి; భీష్మపరిపాలితంబు+అయిన= భీష్ముడిచే నడుపబడుచున్న; ఈ సైన్యంబు= ఈ సేన; పెద్దయున్= ఎక్కువగా; సమర్థంబు+ఐ= శక్తి కలదై; తోఁచుచున్నయది= మనస్సుకు అనిపిస్తున్నది; మీరు+ఎల్లరున్= మీరు అందరూ; వలయు+ఎడలన్= అవసరమైన స్థలాలలో; నిలిచి= నిలబడి; భీష్మునకున్= భీష్మునకు; కావలి+కావలయున్= రక్షణ చేకూర్చవలసింది; అనినన్= అని దుర్యోధనుడు; చెప్పగా; ద్రోణుండు= ద్రోణుడు; అట్ల+కాక= అట్లే అగుగాక; ఇంత+చెప్పన్+ఏమిటికిన్?= ఇంతగా నొక్కి వక్కాణించటం ఎందుకు?; అనియెన్= అని ద్రోణుడు పలికాడు; ఆ+పలుకులు= ఆ మాటలు; విని= ఆలకించి; ఆ+మహీపతికిన్= రాజునకు- దుర్యోధనుడికి; ప్రియంబు+పుట్టన్= ప్రీతి కలిగేటట్లుగా; శాంతనవుండు= శంతనుడి కొడుకు- భీష్ముడు; సింహనాదంబు= సింహగర్జన; చేసి= ఒనరించి; శంఖంబు+పూరించినన్= శంఖం ఒత్తగా.

తాత్పర్యం: సాత్యకి, విరాటుడు, ద్రుపదుడు, ధృష్టకేతుడు, చేకితానుడు, కాశీరాజగు పురుజిత్తు, కుంతిభోజుడు, శైబ్యుడు, యుధామన్యుడు, ఉత్తమౌజుడు, అభిమన్యుడు, ఉపపాండవులు, శక్తిసామర్థ్యాలు గల రథికులు. భీముడిచే కాపాడబడుతున్న ఈ సేన మిక్కిలి బలం కలదిగా కన్పిస్తున్నది. మన పక్షంలోని సేనానాయకులను చెప్పుతాను. నిన్ను గూర్చి భీష్ముడి గూర్చి చెప్పే అవసరం లేదు కదా? కృపుడు, అశ్వత్థామ, శల్యుడు, వికర్ణుడు, భూరిశ్రవసుడు ఇంకా ఎందరో రథికులు ఉన్నారు. వీరందరు అస్త్ర నిపుణులు. పెక్కు యుద్ధాలలో ఆరితేరిన యోధులు - నాకై ప్రాణాలు త్యాగం చేయటానికి సంసిద్ధులు. ఈ విధంగా సమకూడి, భీష్ముడి నాయకత్వంలోని మన సైన్యం మిక్కిలి బలంగా మనస్సుకు తోస్తున్నది. మీరందరు పూని, భీష్ముడికి రక్షణ చేకూర్చాలి. అని దుర్యోధనుడు చెప్పగా ద్రోణుడు సరే నీవు ఇంతగా నొక్కి వక్కాణించే అవసరం లేదు అన్నాడు. ఆ మాటలు విని, భీష్ముడు సంతోషించి సింహనాదం చేసి తన శంఖాన్ని ఒత్తాడు.

విశేషం: 1. సంస్కృత భారతంలో దుర్యోధనుడు కౌరవవీరుల గూర్చి చెప్పేటప్పుడు "భవాన్ భీష్మశ్చ కర్ణశ్చ" అని కర్ణుడిని కలిసి చెప్పాడు. తిక్కన కర్ణుడి పేరు చేర్చలేదు. తాత్కాలికంగా శస్త్ర సన్న్యాసం చేసిన కర్ణుడి పేరు ఎత్తకపోవటమే మంచిది అనిపిస్తుంది.

2. సాత్యకి - కృష్ణుడి తాతగారి మనుమడు. కృష్ణుడికి వరుసకు తమ్ముడు. అర్జునుడికి శిష్యుడు. విరాటుడు - మత్స్యదేశరాజు. అజ్ఞాతవాస సమయంలో పాండవులకు ఆశ్రయ ప్రదాత. అభిమన్యుడికి పిల్లనిచ్చిన మామగారు. ధృష్టకేతుడు- రాజసూయ యాగంలో శ్రీకృష్ణుడు సంహరించిన శివుపాలుడి కొడుకు. చేకితానుడు - యాదవవీరులలో ఒకడు. పురుజిత్తు - కాశీరాజు, కుంతిభోజుడి తమ్ముడు. కుంతిభోజుడు - యాదవ ప్రభువు. కుంతికి పెంపుడు తండ్రి. శైబ్యుడు - ధర్మరాజునకు రెండవ భార్య దేవికకు తండ్రి. ఉత్తమౌజుడు పాంచాలరాజు కొడుకు.

క. తనతన శంఖంబును ద । క్కును గల దొరలెల్ల ననికి గొనకొని పూరిం
చిన వివిధతూర్యనాదం । బును జెలఁగె నభంబు దిశలుఁ బూర్ణంబులుగాన్. 175

ప్రతిపదార్థం: తన, తన, శంఖంబును= తన తన శంఖాలను; తక్కున్+కల+దొరలు+ఎల్లన్= మిగిలిన దండనాథులు అందరూ; అనికిన్+గొనకొని= యుద్ధానికి సిద్ధమై; పూరించినన్= ఊదగా; నభంబు= ఆకాశమూ; దిశలున్= దిక్కులు; పూర్ణంబులు+కాన్= నిండిపోగా; వివిధ, తూర్య, నాదంబును= బూరాలు మొదలైన పెక్కు వాద్యాల ధ్వని; చెలఁగెన్= అతిశయించింది.

తాత్పర్యం: సేనాపతి అయిన భీష్ముడు సింహనాదం చేసి శంఖం ఊదగా, తక్కిన దండనాథులు తమ తమ శంఖాలు పూరించి యుద్ధానికి తమ సంసిద్ధత వ్యక్తం చేశారు. ఆకాశం- దిక్కులు పిక్కటిల్లగా యుద్ధవాద్యాల నాదంతో నిండిపోయింది.

వ. అప్పుడు కృష్ణార్జునులు పాంచజన్యదేవదత్తంబులును భీమసేనుండు పౌండ్రంబున యుధిష్ఠిరుండనంతవిజయంబును నకులసహదేవులు సుఘోషమణిపుష్పకంబులును పాంచాల విరాట సాత్యకి ధృష్టద్యుమ్నశిఖండి ప్రముఖ దండనాయకులు దమతమ శంఖంబులుఁ బూరించిన. 176

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో; కృష్ణార్జునులు= శ్రీకృష్ణుడూ, అర్జునుడూ; పాంచజన్య+దేవదత్తంబులు= పాంచజన్యం అనే శంఖం, దేవదత్తం అనే శంఖం; భీమసేనుండు= భీముడు; పౌండ్రంబును= పౌండ్రం అనే శంఖం; యుధిష్ఠిరుండు= ధర్మరాజు; అనంత విజయంబును= అనంత విజయం అనే శంఖాన్ని; నకుల సహదేవులు= నకులుడు, సహదేవుడు; సుఘోషం, మణిపుష్పకం అనే శంఖాలను; పాంచాల, విరాట, సాత్యకి, ధృష్టద్యుమ్న, శిఖండి, ప్రముఖ, దండనాయకులు= ద్రుపదుడు, విరాటుడు, సాత్యకి, ధృష్టద్యుమ్నుడు, శిఖండి మొదలైన రథికులు; తమ తమ+శంఖంబులున్+పూరించినన్= శంఖాలను ఊదగా.

తాత్పర్యం: అప్పుడు శ్రీకృష్ణుడు పాంచజన్యం అనే శంఖాన్ని ఊదాడు. అర్జునుడు దేవదత్తం పూరించాడు. ధర్మరాజు అనంతవిజయం అనే శంఖాన్ని ఊదాడు. అట్లే భీముడు పౌండ్రం, నకుల, సహదేవులు సుఘోషం, మణిపుష్పకం ఊదారు. ద్రుపదుడు, విరాటుడు, సాత్యకి, ధృష్టద్యుమ్నుడు, శిఖండి మున్నగు రథికులు తమ తమ శంఖాలు ఊదారు.

విశేషం: 1. సింహనాదాలు, శంఖాలు పరాక్రమ ప్రకటనలో అంతర్భాగాలు.

2. అటు భీష్ముడు - కౌరవ వీరులు సింహనాదాలు చేసి శంఖాలు పూరించారు. ఇటు పాండవ వీరులు శంఖాలు ఒత్తారు. ఈ విధంగా యుద్ధవాతావరణం ఏర్పడింది.

మహాకవులు కథను నడపటం, పాత్రల శీలాలు చిత్రించటం మాత్రమేకాక 'వాతావరణ కల్పన'కు మిక్కిలి ప్రాధాన్యం ఇస్తారు. భగవద్గీతోపదేశానికి ఈ వాతావరణ కల్పన పూర్వరంగాన్ని సృష్టించింది. ముసలివాడై సర్వసంగపరిత్యాగి అయిన మునీశ్వరుడు - వేరే పనిలేక తీరికగా తన పాద సన్నిధిని చేరిన శిష్యుడికి కన్నులు మూసికొని ఏకాంతంగా అందించిన సందేశం కాదు 'భగవద్గీత'. యుద్ధ సన్నద్ధమై పద్దెనిమిది అక్షౌహిణుల సైన్యం మధ్య తాత్కాలిక నిర్వేదంతో కుమిలిపోయిన వీరుడు అర్జునుడికి చేసిన కర్తవ్యోపదేశం భగవద్గీత. మూల సంస్కృత భారతంలోనూ తెలుగు భారతంలోనూ కూడా భగవద్గీతోపదేశానికి అనువైన వాతావరణ కల్పన చేయబడింది. తిక్కన 'భగవద్గీత సందేశాన్ని' సంక్షేపించాడుగాని వాతావరణ కల్పనను యథాతథంగా తెలుగులో నిర్వహించాడు.

క. అనయము నుగ్రం బగు త । ద్ధ్వని గాంధారేయహృదయదారణ మై పాం
డునరేంద్ర పుత్రసైనిక । మనోరమం బగుచుఁ జెలఁగె మనుజాధీశా! 177

ప్రతిపదార్థం: మనుజ+అధీశా!= ఓ రాజా!; అనయమున్= అత్యంతము, మిక్కిలి; ఉగ్రంబు+అగు= భయంకరం అయిన; తత్+ధ్వని= ఆ శబ్దం; గాంధారేయ, హృదయ, దారణము+ఐ= గాంధారి కొడుకులగు కౌరవుల గుండెలను చీల్చునట్టిదై; పాండు నరేంద్ర పుత్ర, సైనిక, మనస్+రమంబు+అగుచున్= పాండురాజు కొడుకుల సేనలలోని వారి మనస్సులను రంజింప చేసేది అగుచు; చెలంగెన్= ఒప్పినది.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! శ్రీకృష్ణుడు పాండవులు పూరించిన శంఖాల ధ్వని, కౌరవుల గుండెలను చీల్చి, పాండవుల సేనల మనస్సులను రంజింప చేసింది.

వ. తదనంతరంబ శస్త్రసంపాతంబునకు సమయం బగుటయుఁ గపిధ్వజుండు గాండీవంబు వుచ్చికొని గుణంబు సారించి బాణపాణియై నీ కొడుకులం జూచి కృష్ణునితో నిట్లనియె. 178

ప్రతిపదార్థం: తద్+అనంతరంబు+అ= అటుపిమ్మట; శస్త్ర+సంపాతంబునకున్= ఆయుధాలు ప్రయోగించటానికి; సమయంబు+అగుటయున్= అదను ఏర్పడగా; గాండీవంబు+పుచ్చికొని= గాండీవం అనే పేరుగల విల్లు చేతిలో పట్టుకొని; గుణంబున్+సారించి= అల్లెత్రాటిని మ్రోగించి; బాణపాణి+ఐ= బాణాలు (అమ్ములు) చేత గల వాడై; నీ కొడుకులన్= నీ పుత్రులైన దుర్యోధనుడు మున్నగు వారిని; చూచి= అరసి; కృష్ణునితోన్= శ్రీకృష్ణుడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అటు పిమ్మట, ఇంక ఆయుధాలు ప్రయోగించి, యుద్ధం ప్రారంభించవలసిన సమయం ఆసన్నం కావటం చేత అర్జునుడు తన విల్లు గాండీవాన్ని గ్రహించి, అల్లెత్రాటిని మ్రోగించి, బాణములు చేతిలో నిడుకొని కౌరవులగు దుర్యోధనుడు మున్నగు వారిని చూచి, శ్రీకృష్ణుడితో ఈ విధంగా అన్నాడు:

తే. ' కౌరవులలోన నిప్పు డెవ్వారితోడ । ననికిఁ గడఁగుదునో చూచికొనఁగవలయు
నరద మల్లన యుభయసైన్యముల నడిమి । నేల కటు పోవఁగా నిచ్చి నిలుపు మచట.' 179

ప్రతిపదార్థం: కౌరవులలోనన్= కురుసేనలో ఉన్నవారిలో; ఇప్పుడు= ఇపుడు; ఎవ్వారితోడన్= ఎవరితో; అనికిన్= యుద్ధానికి; కడఁగుదునో= పూనవలసి వస్తుందో; చూచి కొనఁగ+వలయున్= పరీక్షించి చూడాలి; అరదము= రథాన్ని; అల్లన= మెల్లగా; ఉభయ+సైన్యముల+నడిమి+నేలకున్= రెండు సైన్యాల మధ్య ప్రదేశానికి; అటు= అదుగో ఆ వైపుగా; పోవగాన్+ఇచ్చి= పోయేటట్లు చేసి; అచటన్= అక్కడ; నిలుపుము= ఆపుము.

తాత్పర్యం: 'శ్రీకృష్ణా! ఇప్పుడు కౌరవ సేనలో ఎవ్వరితో నేను యుద్ధం చేయాలో నిర్ణయించుకొనాలి. రథాన్ని రెండు సేనలు నాకు కనిపించేటట్లుగా మధ్య ప్రదేశం చేర్చి అక్కడ నిలుపగోరుతున్నాను.

అర్జునుఁడు స్వజన సంహారంబునకు శంకించి మోహావిష్టుం డగుట (సం. 6.23.30)

వ. అనిన గుడాకేశు పలుకులకు హృషీకేశుండు భీష్మద్రోణప్రముఖ యోధవీరులు గనుంగొనుచుండ నత్తెఱంగున రథోత్తమంబు నిలిపి యతనితో 'నీ వీ కూడిన కౌరవులం జూడు' మనవుడు నప్పార్థుండు రెండు బలంబుల యందు నున్న సోదర సుత మాతులాచార్యాదు లగు బంధుశిష్టజనంబుల నాలోకించి పరమకృపావేశంబున నత్యంత విషాదంబు నొంది, గోవిందు మొగంబు గనుంగొని 'దుర్మదాంధుం డయిన దుర్యోధను దుర్వినయంబున నింత వుట్టెం జూచితే!' యని పలికి వెండియు. 180

ప్రతిపదార్థం: అనినన్= అని (అర్జునుడు) చెప్పగా; గుడాకేశు+పలుకులకున్= అర్జునుడి మాటలకు; హృషీకేశుండు= శ్రీకృష్ణుడు; భీష్మ, ద్రోణ, ప్రముఖ, యోధవీరులు= భీష్ముడు, ద్రోణుడు మున్నగు వీరులు; కనుంగొనుచుండన్= చూస్తూ ఉండగా; ఆ+తెఱంగునన్= ఆ రీతిగా; రథ+ఉత్తమంబున్= శ్రేష్ఠమైన రథాన్ని; నిలిపి= ఆపి; అతనితోన్= అర్జునుడితో; ఈవు= నీవు; ఈ+కూడిన, కౌరవులన్+చూడుము= ఈ విధంగా చేరిన కౌరవులను వీక్షించుము; అనవుడున్= అని చెప్పగా; ఆ+పార్థుండు= ఆ అర్జునుడు; రెండు+బలంబులయందున్+ఉన్న= రెండు సేనలలో ఉన్నట్టి; సోదర, సుత, మాతుల+ఆచార్య+ఆదులను= సహోదరులు, కొడుకులు, మేనమామలు, గురువులు మొదలైన వారిని; బంధు, శిష్ట, జనంబులన్= చుట్టములు గొప్ప వారగు జనులను; ఆలోకించి= చూచి; పరమ, కృపా+ఆవేశంబునన్= మిక్కుటమైన దయ తనలో ప్రవేశించడం చేత; అత్యంత విషాదంబున్+ఒంది= మిక్కుటమైన దుఃఖాన్ని పొంది; గోవిందు+మొగంబు+కనుంగొని= శ్రీకృష్ణుడి ముఖాన్ని చూచి; దుర్మదాంధుండు= చెడ్డగర్వంతో గ్రుడ్డివాడు; అయిన; దుర్యోధను+దుర్వినయంబునన్= దుర్యోధనుడి యొక్క గర్వంవలన; ఇంత పుట్టెన్= ఇటువంటి అనర్థం దాపురించింది అనగా దారుణ యుద్ధం ఏర్పడింది; చూచితి+ఏ= చూచావా!; అని పలికి= అని వచించి; వెండియున్= మరల.

తాత్పర్యం: అర్జునుడి మాటలు విని, శ్రీ కృష్ణుడు రథాన్ని రెండు సేనలమధ్య- భీష్ముడు ద్రోణుడు మొదలైన వీరులు చూస్తుండగా- నిలిపి 'అర్జునా! నీ కోరిక మేరకు రథాన్ని నిలిపినాను. కౌరవ వీరులను అందరినీ నీవు చూడవచ్చును' అన్నాడు. అర్జునుడు రెండు సేనలలో ఉన్న సోదరులను, సుతులను, బంధువులను, మేనమామలను, గురువులను, మిత్రులను అందరినీ చూచి, కృపావేశంతో మిక్కిలి దుఃఖానికి లోనై శ్రీకృష్ణుడి మొగం తేరిపార చూచి, ఇట్లా అన్నాడు: 'శ్రీకృష్ణా! చూచావుకదా! దురాశతో కన్నులుండి కూడ గ్రుడ్డివాడైన దుర్యోధనుడి మూలాన ఈ మహాయుద్ధం దాపురించింది' అని, ఇంకా ఇట్లా అన్నాడు.

విశేషం: 1. ఇంతవుట్టె- అనే ప్రయోగం మిక్కిలి అర్థవంతమైనది. అందులో 'ఇంతటి ఘోర యుద్ధం దాపురించింది, దాని వలన ఏర్పడే దుష్పరిణామాలు వర్ణనాతీతాలు' అనే భావం ఉన్నది. ఆ భావం అర్జునుడి గుండెను కరగించింది. అందులో అగ్ని పర్వత విజృంభణాలు, భూకంపాలు ఎన్నెన్నో ఇమిడి ఉన్నాయి.

చ. సరసిజనాభ! బంధుజన సంతతిఁ గయ్యపునేలఁ జూడఁగా
విరవిరఁ బోయి మేను నిడువెండ్రుక వెట్టుచుఁ గంప మొందెఁ, జే
నిరతము గాదు గాండివము, నిల్వఁగ నోర్వవు గాళ్లు, నేను ని
ష్ఠురతకుఁ జాల నొల్ల, నొకఁడున్ మహియేలుట యేటి సౌఖ్యముల్? 181

ప్రతిపదార్థం: సరసిజనాభ!= పద్మం బొడ్డులో కలవాడా! విష్ణుడవైన ఓ శ్రీకృష్ణా!; బంధు+జన+సంతతిన్= చుట్టాలు పక్కాలు అందరినీ; కయ్యపు+నేలన్= యుద్ధభూమిలో; చూడఁగాన్= వీక్షించగా; విరవిరన్ పోయి= కూలుటకు సిద్ధమై పరవశించి; మేను= శరీరం; నిడు+వెండ్రుక+వెట్టుచున్= నిక్కబొడుచుకొన్న వెండ్రుకలతో; కంపము+ఒందెన్= వణకింది; చేన్= చేతిలో; గాండివము= గాండివము అను పేరుగల విల్లు; నిరతము+కాదు= స్థిరంగా ఉండదు; కాళ్ళు= పాదాలు, నిల్వఁగన్+ఓర్వవు= నిలబడటం లేదు; ఏను= నేను; నిష్ఠురతకున్= కఠినత్వానికి; చాలన్= మిక్కిలి; ఒల్లన్= సమ్మతింపలేను; ఒకఁడున్= ఒక్కడు (ఒంటరిగా); మహిన్= భూమిని; ఏలుట= పరిపాలించటం; ఏటి+సౌఖ్యముల్= ఏ విధంగా సౌఖ్యాలు కలిగిస్తుంది?

తాత్పర్యం: ఓ శ్రీకృష్ణా! యుద్ధభూమిలో పోరాటానికి చేరిన కావలసిన చుట్టాలను అందరినీ చూడటం నాకు దుఃఖంగా ఉన్నది. శరీరం విడిపోయినట్లు అయి, గగురుపాటు కలిగింది. వెంట్రుకలు నిక్కబొడుచుకొన్నాయి. గాండీవం చేతిలో నుండి జారిపోతున్నది. కాళ్ళు నిలబడటం లేదు. ఈ క్రౌర్యానికి నేను ఒడిగట్టలేను. ఇంత మంది చచ్చిపోయాక, ఒంటరిగా ఈ భూమిని పరిపాలిస్తే కలిగే సౌఖ్యాలు ఏపాటివి?

విశేషం: కవిత యుగళకళ. శబ్దార్థ సమ్మేళనం. అర్ధనారీశ్వర యోగంలో పార్వతీ పరమేశ్వరులవలె శబ్దం అర్థం అభేద దాంపత్యం నిర్వహించాలి. ఇక తెలుగు కవిత - యుగళకళలో యుగళ కళ. తెలుగు పదాలు సంస్కృత పదాలు చక్కగా చిక్కగా కలిసిపోవాలి. అతుకులు కన్పించకుండా. ఈ పద్యంలో శబ్దార్థాలు 'పొసగ ముత్తెపు సరుల్ పోహళించిన లీల' కలిసి మెలిసి కన్పిస్తున్నాయి.

2. తిక్కన కవితా శిల్పంలోని వైలక్షణ్యం పాత్రల ఆంగిక సాత్త్వికాభివర్ణన. చిత్తవృత్తి నిరూపణ. ప్రసన్న కథాకవితార్థయుక్తి నన్నయ శైలి. తిక్కనది నాటకీయ శైలి. పద్యంలో తిక్కన వర్ణించిన 'అర్జునుని మూర్తి' ఏ చిత్రలేఖకుడు చిత్రపటంలో చూపించగలడు? అయితే- ఈ వర్ణన అంతా సంస్కృతమూలంలో ఉన్నట్టిదే. ఇష్టమైన ఈ సన్నివేశం లభించింది. తిక్కన గంటం చిందులు త్రొక్కింది. తెలుగు భారతంలో మరువరాని మధురమైన మంచి పద్యం అవతరించింది.

3. విరవిర: త్రెళ్లుట యందలి ధ్వన్యనుకరణ.ఇతరములైన ఉదాహరణలు: ఎండ విరవిర కాసె; కటాక్ష జ్యోత్స్న విరవిర. కరగుచుండ; విరవిరఁ ద్రెళ్లి నొవ్వ... దశకంఠుడు

. (తిక్కన నిర్వచనోత్తర రామాయణం.)

తే. ఎవ్వరికిఁ గాఁగ ధరణియు నెల్లసుఖముఁ । గోరెదము వార లందఱు వీరె వచ్చి
ప్రాణములు నర్థములు నొల్లఁబాటు సేసి । కయ్యమునఁ జావ నఱుముట గంటి గాదె! 182

ప్రతిపదార్థం: ఎవ్వరికిన్+కాఁగన్= ఎవరి కోసమై; ధరణియున్= భూమియును; ఎల్ల+సుఖమున్= సర్వసౌఖ్యం; కోరెదము= కావాలి అనుకుంటామో; వారలు+అందఱున్= అంత మందీ; వీరె= వీరే; వచ్చి= అరుగుదెంచి; ప్రాణములు= అసువులు; అర్థములు= సంపదలు; ఒల్లఁబాటు+చేసి= ఉపేక్షించి (నిరసించి); కయ్యమునన్= యుద్ధంలో; చావన్+అఱుముట= మరణించటానికి; ప్రతీక్షించడం, ఎదురుచూడ్డం; కంటి(వి)+కాదె!= చూస్తున్నావు కదా!

తాత్పర్యం: ఎవరిని మెప్పించటానికై ఈ భూమిని సమస్త సౌఖ్యాలను కోరుకుంటామో, వారందరు పోరాటానికి రావటం. ప్రాణాలు సంపదలు ఒడ్డటం, చూస్తున్నావుకదా!

ఉ. తాతల, మామలన్, సుతులఁ, దండ్రులఁ, దమ్ముల, నన్నలన్, గురు
వ్రాతము, శిష్టకోటి, సఖివర్గముఁ, దుచ్ఛజనానురూప దు
ర్నీతి వధించి యేఁ బడయు నెత్తుటఁ దోఁగిన రాజ్యభోగముల్
ప్రీతి యొనర్చునే? యశము పెల్లొడఁగూర్చునె? పెం పొనర్చునే? 183

ప్రతిపదార్థం: తాతలన్= పితామహులను మాతామహులను; మామలన్= తల్లికి సోదరులను (పిల్లనిచ్చిన వారిని); సుతులన్= కొడుకులను, తండ్రులన్= పితృవర్గాన్ని; తమ్ములన్+అన్నలన్= సోదరులను; గురు+వ్రాతమున్= గురువుల సమూహాన్ని; శిష్టకోటిన్= మంచివారిని; సఖి+వర్గమున్= మిత్రుల సముదాయాన్ని; తుచ్ఛ, జన+అనురూప, దుర్నీతిన్= నీచులైనవారి చెడ్డ ప్రవర్తనను అనుసరించి; వధించి= చంపి; ఏన్= నేను; పడయు= సంపాదించే; నెత్తుటన్+తోఁగిన= రక్తంతో తడిసిన; రాజ్యభోగముల్= రాజ్యపరిపాలన వలన సంక్రమించే సౌఖ్యాలు; ప్రీతి= సంతోషం; ఒనర్చును+ఏ?= కలిగిస్తాయా?; యశము= కీర్తి; పెల్లు= మిక్కుటంగా; ఒడన్+కూర్చును+ఎ?= చేకూర్చగలవా?; పెంపు= గొప్పదనం; ఒనర్చునే?= కలుగ చేస్తాయా?

తాత్పర్యం: తాతలను, మామలను, కొడుకులను, తండ్రులను, సహోదరులనూ, గురువుల సముదాయాన్ని గొప్పవారిని, మిత్ర బృందాన్ని నీచమైన స్వార్థ ప్రవృత్తితో సంహరించి, నేను పొందే రాజ్యసౌఖ్యాలు - రక్తంతో తడిసినట్టివి నాకు ఏ సంతోషం కలిగిస్తాయి? ఎట్టి కీర్తిని తెచ్చిపెట్ట గలవు? ఏ అభ్యున్నతిని చేకూర్చగలవు?

క. అక్కడి బంధులఁ జంపుచు, । నిక్కడి బాంధవులు సచ్చు టియ్యకొనుచు, నిం
దెక్కడి పెం పొందెదఁ? దుదిఁ । ద్రెక్కొను పాపంబు రణము తెరు వే నొల్లన్. 184

ప్రతిపదార్థం: అక్కడి+బంధులన్= ఆ ఎదిరిపక్షంలో ఉన్న చుట్టాలను; చంపుచున్= సంహరిస్తూ; ఇక్కడి+బాంధవులు= ఇక్కడి చుట్టాలు; చచ్చుట= మరణించటానికి; ఇయ్యకొనుచున్= ఇష్టపడుతూ; ఇందున్+ఎక్కడి+పెంపు= ఏ చోటగల అభ్యుదయం; ఒందెదన్?= సంపాదించగలను?; తుదిన్= చివరకు; పాపంబు= పాపం; త్రెక్కొనున్= వస్తుంది; రణము+తెరువు= యుద్ధమార్గం; ఏను+ఒల్లన్= నేను సమ్మతించను.

తాత్పర్యం: ఎదిరిపక్షంలో ఉన్న చుట్టాలను చంపటం, ఈ పక్షంలో ఉన్న చుట్టాలు చచ్చిపోవటానికి సమ్మతించటం - ఇది మంచిది కాదు. దీనివలన నాకు ఏ అభ్యున్నతి రాదు. చివరకు మిగిలేది పాపం. యుద్ధమార్గం నేను అంగీకరింపలేను.

విశేషం: పాపము, పుణ్యము అనే ప్రాతిపదికలు ప్రాచీన భారతీయ సంస్కృతి సృష్టించిన భావదీపికలు. పుణ్యం= సుకృతం కలది. శుభదృష్టియగు ధర్మం కలది. పవిత్రత- ధర్మము పుణ్యానికి బొమ్మ బొరుసులు. పుణ్యానికి వ్యతిరేకపదం పాపం. ఆ పదంలో నీచత్వం అన్యాయం ఇమిడి ఉన్నవి. పుణ్యంచేస్తే మరణానంతరం స్వర్గం. పాపం చేస్తే మరణానంతరం నరకం. పుణ్యపాపాలు పునర్జన్మలో కర్మసిద్ధాంతంలో ముడివడి ఉంటాయి. ఇవి వ్యాఖ్యాన నిరపేక్షాలు. అక్షరాలలో నిర్వచించటం కష్టమేగాని, పుణ్యపాపాలు కర్మసిద్ధాంతం పాటించే భారతీయులకు సులువుగా అర్థం అయ్యే పదాలు. అణువులో బ్రహ్మాండం ఇమిడి ఉన్నట్లు విత్తనంలో చెట్టు అదృశ్యంగా ఉన్నట్లు పుణ్యం పాపం అనే శబ్దాలలో విశ్వజనీనమైన విపుల వేదాంతం ఇమిడి ఉన్నది.

ఆ. ఎల్ల భువనములను నేలుట కైనను । నిట్టి క్రూరకర్మ మెట్లు సేయ
వచ్చుఁ గడఁగి? యెదిరివా రేమి సేసిన । మాఱుసేయ నాకు మనసురాదు. 185

ప్రతిపదార్థం: ఎల్ల+భువనములను= అన్ని లోకాలను; ఏలుటకున్+ఐనను= పరిపాలించుట కోసమే అయినప్పటికిని; ఇట్టి= ఇటువంటి; క్రూర+కర్మ=కనికరం లేని కఠోర కార్యం= (యుద్ధం); ఎట్లు, చేయన్+వచ్చున్= ఏవిధంగా ఆచరించవచ్చును; కడఁగి= పూని; ఎదిరివారు+ఏమి చేసినన్= శత్రువులు ఏమి చేసినా సరే; మారుచేయన్= ప్రతీకార చర్య చేయటానికి; నాకున్= నాకు; మనసు+రాదు= మన సొప్పదు.

తాత్పర్యం: ఈ భూలోకంలో ఒక భాగమైన కౌరవ రాజ్యం కోసమేగాక అన్ని లోకాలూ పరిపాలించటానికైనా ఇటువంటి క్రూరకర్మ- ఘోర యుద్ధం- చేయలేను. ఒక వేళ శత్రువులు ఏమి చేసినప్పటికీ నాకు మారు చేయటం కూడా మనస్కరించదు.

చ. అకట! నితాంతలోభమున నావలఁ బాటిలు కీడు గానఁ జా
లక ధృతరాష్ట్రసూనులు కులక్షయ మయ్యెడుదాని కోర్చి పో
రికిఁ దెగి వచ్చి రన్కలుచ రెండు నెఱింగెడు నీవు నేను దీ
నికిఁ జొర నేల? వీరి నిటు నిర్దయఁ జంపిన నేమి యయ్యెడున్? 186

ప్రతిపదార్థం: అకట!= అయ్యో!; నితాంత, లోభమునన్= అధికమైన దురాశతో; ఆవలన్= తరువాత; పాటిలు= వచ్చే; కీడు= నష్టం; కానన్+చాలక= చూడకుండగా; ధృతరాష్ట్ర సూనులు= ధృతరాష్ట్రుడి కొడుకులు- దుర్యోధనుడు మున్నగువారు; కుల+క్షయము= వంశనాశనం; అయ్యెడు దానికిన్+ఓర్చి= జరిగే దానికి ఇష్టపడి; పోరికిన్= యుద్ధానికి; తెగి= సాహసించి; వచ్చిరి+అన్= వచ్చారనే; కలుచ= తప్పు; రెండున్= రెండింటిని; ఎఱింగెడు= తెలిసికొనగలిగిన; నీవు= నీవు; ఏను= నేను (ఓ కృష్ణా నీవు నేనూ= అర్జునుడు); దీనికిన్= దీనిలోనికి (యుద్ధంలోనికి); చొరన్+ఏల?= ప్రవేశించటం ఎందుకు?; వీరిన్= వీరిని (కౌరవులను); నిర్దయన్= దయ లేకుండగా; చంపినన్= సంహరించినా; ఏమి+అయ్యెడున్?= ఏమి జరుగుతుంది?

తాత్పర్యం: అయ్యో! దుర్యోధనాదులు తరువాత వచ్చే నష్టం గూర్చి, వంశనాశం అవుతుందని గుర్తించకుండా; ఈ ఘోర యుద్ధానికి సాహసించి వచ్చారు. వారి దోషం పూర్తిగా తెలిసిన నీవూ నేనూ ఇట్టి యుద్ధానికి పూననేల? పూని దయలేకుండగా వారిని చంపి వేసినా ఏమి లాభం చేకూరుతుంది?

క. కులనాశము సేసినఁ ద । త్కులధర్మము లడఁగు నష్టకులధర్ములకుం
గలుగును దుస్సంకర; మ । క్కులఘ్ను లేఁగుదురు నరకకూపంబులకున్. 187

ప్రతిపదార్థం: కుల నాశము+చేసినన్= కులమును నాశనం చేస్తే; తత్+కుల, ధర్మములు= ఆ కులానికి సంబంధించిన (ధర్మాలు); కర్తవ్యాలు; అడఁగున్= అణగిపోతాయి; నష్టకులధర్ములకున్= కులధర్మాలు నష్టమైన వారికి; దుస్సంకరము+అ= చెడు సంయోగం; కలుగును= ఏర్పడుతుంది; ఆకులఘ్నులు= కులానికి కీడు చేసినవారు; నరక కూపంబులకున్= నరకంలోని గోతులలోనికి; ఏఁగుదురు= వెళ్ళుతారు.

తాత్పర్యం: కులనాశనం జరిగితే, కులధర్మాలు నశిస్తాయి. కులధర్మాలను నాశనం చేస్తే, సాంకర్యం ఏర్పడుతుంది. కులానికి కీడు చేసినవారు (మరణానంతరం) నరకకూపంలో పడిపోతారు.

విశేషం: ప్రాచీన భారతదేశంలో సమాజంలో నాలుగు ముఖ్యకులాలు ఉండేవి. బ్రహ్మ, క్షత్రియ, వైశ్య, శూద్రుల కులాలు. దానికి వర్ణవ్యవస్థ అనిపేరు. బ్రాహ్మణులు - విద్య, క్షత్రియులకు యుద్ధ పరాక్రమం, వైశ్యులకు వాణిజ్యం పశుపాలన శూద్రులకు సేవ కులధర్మాలుగా ఎంచబడ్డాయి. వర్ణసాంకర్యం వలన సమాజ శ్రేయస్సుకు భంగం అని పలువురు భావించేవారు. అర్జునుడు ఆ అభిప్రాయాలనే వ్యక్తం చేశాడు.

2. పుణ్యం, పాపం, నరకం, స్వర్గం గూర్చి భారతంలో పలుచోట్ల ప్రసక్తి వస్తుంది.

3. మహాభారతకాలంనాటికే వర్ణ వ్యవస్థ బీటలు వారింది. ద్రోణుడు పుట్టుకచేత బ్రాహ్మణుడు. చేపట్టింది క్షాత్రం. అట్లే అతడి కొడుకు అశ్వత్థామ, బావమరది కృపుడు. ఉపకులాలు ఏర్పడ్డాయి. ఉదాహరణకు సూతకులం. వ్యాసుడు, పరాశర మహర్షికి పల్లెల తేడగు దాశరాజు కూతురు సత్యవతికి సుతుడు.

తే. ఇంత పాపంబు సేయంగ నెత్తికొందు ।, మయ్య? రాజ్యలోభంబున నఖిలబంధు
జనుల వధియింపఁ దొడఁగితి మని' రథంబు ।, మీఁదఁ గూర్చుండఁ బడియెఁ జే యూఁదికొనుచు. 188

ప్రతిపదార్థం: ఇంత+పాపంబు+చేయంగన్= ఇంతటి పాపం చేసేందుకు; ఎత్తికొందుము+అయ్య?= పూనుకొంటామా?; రాజ్య+లోభంబునన్= రాజ్యంమీది దురాశచేత; అఖిల+బంధుజనులన్= అందరు చుట్టాలను; వధియింపన్+తొడఁగితిమి= చంపటానికి పూనుకొన్నాము; అని= అని చెప్పి; రథంబుమీదన్= రథంపైన; చేయి+ఊఁదికొనుచున్= చేతిని ఆలంబంగా చేసికొంటూ; (అర్జునుడు) కూర్చుండన్+పడియెన్= కూలబడి కూర్చున్నాడు.

తాత్పర్యం: 'ఇంతటి పాపం చేయటానికి పూనుకొనటమా? రాజ్యంమీద దురాశతో అందరు బంధువులను చంపివేయటానికి సిద్ధమయ్యామే!' అని అర్జునుడు పలుకుతూ, రథం మీద తన చేతిని ఆసరాగా చేసుకొని కూలబడి కూర్చున్నాడు.

విశేషం: 1. అర్జునుడు మహావీరుడుగదా. ఇది పిరికితనం కాదా? అతడి శీలానికి- ఈ 'విషాదయోగం' ఒక కళంకం కాదా? అనే ప్రశ్న ఉదయించడం సహజం. దానికి ఒక సమాధానం మహాభారత రచయిత - జరిగిన దానిని జరిగినట్లు చెప్పాడు. అందులోని మంచిచెడ్డలు వేరే విషయం. మహాభారతాన్ని ఇతిహాసం అనటానికి ఇది ఒక కారణం. ఏతద్రచయిత రంగుపూసి సన్నివేశాలు మార్చలేదు. ఇక అర్జునుడి శీలానికి ఇది కళంకం కాదా? కాదు అని సమాధానం చెప్పవచ్చును. జీవితంలో ఎట్టివారికైనా సందేహాలు ఏర్పడటం సహజం. అవి జీవలక్షణాలు. బలచిహ్నాలు వాటిని దాటగలవాడే వీరుడు. రాయి, రప్పకు, మూఢులకు ఏ సందేహాలు రావు. బాగోగులు గుర్తించి స్థిర నిశ్చయం చేసికొనగలవాడే వీరుడు. ధైర్యశాలి. అర్జునుడు మహావీరుడేకాని ఘోర హంతకుడు కాదు. అర్జున విషాదయోగం - అతడు ఎట్టి సుకుమార హృదయుడో నిరూపిస్తున్నది. లోకోత్తర పరాక్రమంలో కరుణార్ద్ర హృదయం మారురూపంలో దాగి ఉంటుంది.

వ. ఇవ్విధంబున శోకసంవిగ్నమానసుండును విషాదవిహ్వలుండును బరమకరుణాభరితుండును నై శరశరాసనంబులు విడిచి కన్నీరు దొరంగ నూరకున్న, సవ్యసాచిం జూచి మధుసూదనుం డిట్లనియె. 189

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ రీతిగా; శోక+సంవిగ్న+మానసుండును= దుఃఖంచేత కలతచెందిన మనస్సుగలవాడును; విషాద+విహ్వలుండును= శోకంచేత వశం తప్పిన వాడును; పరమ+కరుణా+భరితుండును+ఐ= గొప్ప దయతో కూడిన వాడును అయి; శర, శరాసనంబులు= విల్లు, అమ్ములు; విడిచి= వదలిపెట్టి; కన్నీరు+తొరంగన్= కంటినీరు కారుతుండగా; ఊరకున్నన్= కదలక మెదలక కూర్చుండగా; సవ్యసాచిన్= అర్జునుడిని; చూచి= వీక్షించి; మధుసూదనుండు= మధువు అనే రాక్షసుని సంహరించినవాడు- శ్రీకృష్ణుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు:

తాత్పర్యం: ఈ విధంగా దుఃఖంచేత కలతచెందిన మనస్సుగలవాడూ శోకంచేత వశం దప్పినవాడూ, పరమ కరుణాపూరిత హృదయుడూ అయి విల్లూ బాణాలు వదలి కన్నీరు కారుచుండగా ఊరకున్న అర్జునుడిని చూచి శ్రీకృష్ణుడు ఈ విధంగా అన్నాడు.

విశేషం: 1. భగవద్గీతలో ఇంత వరకు అర్జున విషాదయోగం. 2. ఇక్కడనుండి భగవద్గీతోపదేశం ప్రారంభం.

క. ‘ దెప్పరపుఁ జోట నీ కీ । యొప్పని విధ మెచటినుండి యొదవెను? వినుఁ మీ
చొ ప్పవివేకులయది; యిది । దప్పించును సద్గతియు నుదాత్తయశంబున్.’ **190**

ప్రతిపదార్థం: దెప్పరపున్+చోటన్= ఆపద సంభవించినప్పుడు; నీకున్= నీకు; ఈ+ఒప్పని విధము= ఇటువంటి సరిపడని తీరు; ఎచటన్+ఉండి= ఎక్కడ నుండి; ఒదవెను?= ఏర్పడింది?; వినుము= ఆలకింపుము; ఈ+చొప్పు= ఈ తీరు; అవివేకుల+అది= మూర్ఖులది; ఇది= ఈ అవివేకం; సద్గతియున్= మంచి తీరును (ఉత్తమగతిని); ఉదాత్త+యశంబున్= గొప్పది పవిత్రమునైన కీర్తిని; తప్పించును= చెందకుండా చేస్తుంది.

తాత్పర్యం: కానిచోట నీకు ఈ సరిపడని తీరు ఎట్లా ఏర్పడింది? ఇది అవివేకుల తీరు. నీకు తగనిది. ఈ అవివేకం నిన్ను సద్గతి నుండి (సరియైన మార్గం నుండి) పవిత్రమైన కీర్తి నుండి తప్పిస్తుంది.

వ. అని మఱియును. **191**

తాత్పర్యం: అని ఆగక శ్రీకృష్ణుడు మరల ఈ విధంగా అన్నాడు.

తే. ‘ తగునె యర్జున! యీ పెంటితనము నీకు? । దండివై లెమ్ము’ మనసు పేదఱిమి విడిచి;
యనిన నట్లున్న భంగిన యల్ల నిట్టు । లనియె నాతండు పుండరీకాక్షుతోడ. **192**

ప్రతిపదార్థం: అర్జున!= ఓ అర్జునా; ఈ+పెంటితనము= ఈ ఆడంగితనం; నీకున్= నీకు; తగును+ఎ?= తగునా?; మనసు, పేదఱిమి, విడిచి= మానసిక దారిద్ర్యాన్ని వదలిపెట్టి; దండివి+ఐ= గొప్పవాడవై; లెమ్ము= లేచి నిలబడు (ఉత్సాహంతో కర్తవ్య నిర్వహణకు ఉద్యుక్తుడవుకమ్ము); అనినన్= అని శ్రీకృష్ణుడు చెప్పగా; అట్లు+ఉన్న, భంగిని+అ= ఎట్లా ఉన్నాడో అట్లాగే ఉండి- అనగా చేయి ఊతగా రథంమీద కూలబడినవాడు అట్లే ఉండి; అల్లన్= మెల్లగా; పుండరీక+అక్షు తోడన్= తెల్ల తామర పువ్వుల వంటి కన్నులుగలవాడితో- శ్రీకృష్ణుడితో; ఆతండు= అర్జునుడు; ఇట్లు= ఈ రీతిగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు ఇట్లా అన్నాడు. ‘ఓ అర్జునా! నీకు ఇట్టి ఆడంగితనం కూడదు. మనస్సులోని తక్కువ భావం విడిచిపెట్టి, గొప్పవాడవై లెమ్ము’ అని హెచ్చరించాడు. అర్జునుడు విషాద తన్మయత్వంతో రథంమీద కూలబడి కూర్చుండి ఉండే, పుండరీకాక్షుడైన శ్రీకృష్ణుడితో ఈ విధంగా అన్నాడు.

విశేషం: పెంటి= పశుపక్ష్యాదులలో ఆడుది. మూలంలో ఉన్న మాటలు. ‘క్లైబ్యం మాస్మగమః పార్థ!= క్షుద్రం హృదయ దౌర్బల్యమ్’ ‘నపుంసకత్వం’ వదలుమన్నాడు. ఒకనాడు అజ్ఞాతవాసంలో అర్జునుడు ధరించిన భూమిక అది. తెలుగులో పెంటితనం- అనే

మాటలో మనుష్యజాతిలోని స్త్రీత్వం కంటె పశుపక్ష్యాదుల లోనిది మరీ హేయమైనది అనే ధ్వని ఉన్నది. 'దండివై లెమ్ము' అనే తెలుగులో క్షుద్రం హృదయ దౌర్బల్యం త్యక్త్వా ఉత్తిష్ఠ పరంతప' అనే సంస్కృతంలోని ఘాటు లేదు.

సీ. 'అక్కట! పూజార్హులగు ద్రోణ భీష్ముల ।, నమ్ముల నొప్పింప నగునె చెపుమ!
మాన్యులఁ జంపుట మగపాడి గాదు; భి ।, క్షాశనం బైన నత్యంత సుఖము;
కడఁగి యెవ్వరిఁ జంపఁగాఁ బెద్ద బ్రదుకయ్యు ।, నూహింప బ్రదుకు గాకుండు నాకు;
వినుమట్టి ధృతరాష్ట్ర తనయులు గారె యీ ।, యొడ్డిన మొనలలో నున్నవార;

ఆ. లింద్రియముల నెల్ల నివురంగఁ జేయుచు ।, నడరు శోకవహ్ని యాఱ నేర
దింద్రపదవి సేరె నేనియుఁ; గావున ।, భండనంబు సేయకుండువాఁడ. 193

ప్రతిపదార్థం: అక్కట!= అయ్యో!; పూజా+అర్హులు+అగు= పూజించదగినవారైన; ద్రోణ భీష్ములన్= ద్రోణాచార్యుడినీ, భీష్ముడినీ, అమ్ములన్= బాణాలతో; నొప్పింపన్+అగునె?= బాధింపతగునా?; చెపుము+అ= నీవే చెప్పుము; మాన్యులన్= గౌరవించదగినవారిని; చంపుట= సంహరించటం; మగపాడి+కాదు= పరాక్రమం ఉన్నవారికి న్యాయం కాదు; భిక్షా+అశనము= ముష్టి ఎత్తుకొని సంపాదించే కూడు; ఐనన్= అయినను; అత్యంత+సుఖము= మిక్కిలి సంతోషం; కడఁగి= పూని; ఎవ్వరిన్= ఎవరిని; చంపగాన్= సంహరించగా; పెద్ద+బ్రదుకు+అయ్యున్= గొప్ప జీవితమే అయినప్పటికి; ఊహింపన్= ఆలోచిస్తే; బ్రదుకు= జీవితం; నాకున్+కాకుండున్= నాకు కాకుండా ఉంటుందో; వినుము; అట్టి= అటువంటి; ధృతరాష్ట్ర తనయులు+కారె= ధృతరాష్ట్రుడి కొడుకులు కారా; ఈ+ఒడ్డిన, మొనలలోన్= ఈ పన్నిన సేనలలో; ఉన్నవారలు= ఉన్న వారు; ఇంద్రియములన్+ఎల్లన్= అన్ని ఇంద్రియాలను; ఇవురంగన్+చేయుచున్= శుష్కింపజేయుచు; అడరు= వ్యాపించే; శోక వహ్ని= దుఃఖమనే అగ్ని; ఇంద్రపదవి+చేరెన్+ఏనియున్= ఇంద్రపదవి వచ్చిపుడు గూడ; ఆఱన్+నేరదు= ఆరిపోదు; కావునన్= కాబట్టి; భండనమ్ము= యుద్ధం; చేయక+ఉండువాఁడన్= చేయకుండా ఉంటాను.

తాత్పర్యం: అయ్యో! పూజార్హులైన ద్రోణభీష్ములను బాణాలతో బాధించ తగునా చెప్పుము? మాన్యులను చంపడం పరాక్రమం కాదు. అంతకంటె భిక్షాన్నమయినా మిక్కిలి సుఖకరం. పూనుకొని ఎవరినిచంపితే గొప్ప జీవితం అవుతుందో ఆలోచిస్తే నాకది బ్రతుకే కాదనిపిస్తుంది. వినుము! అట్లా చంపదగని, ధృతరాష్ట్ర పుత్రులే గదా ఈ పన్నిన సేనలో ఉన్నవారు? అన్ని ఇంద్రియాలను శుష్కింపజేస్తూ వ్యాపించే శోకాగ్ని ఇంద్ర పదవి లభించినా చల్లారదు. కనుక నేను యుద్ధం చెయ్యలేను.

విశేషం: ఇంద్రియాలు ఐదు. జ్ఞానేంద్రియాలు: త్వక్కు (చర్మం), చక్షువు (కన్ను) శ్రోత్రం (చెవి), జిహ్వ (నాలుక), ఘ్రాణము (ముక్కు). కర్మేంద్రియాలు: వాక్కు, పాణి, పాదం, పాయువు, ఉపస్థ; మనస్సు- పదకొండో ఇంద్రియం. శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలు ఇంద్రియార్థాలు.

వ. ఎల్ల భంగుల గురుజనంబుల నొప్పించుటకుం జాల వారిని గెలిపించుటయును మనము వారల గెలిచినవారల మగుటయు నను నీరెంటియందును బెద్ద మే లెయ్యది యేను గార్పణ్య దోషోపహత స్వభావుండను, ధర్మసమ్మూఢచేతస్కుండనునై నిన్ను శరణు సొచ్చి యడిగెద నీశిష్యుండ నగు నన్ను శాసింపు, మనిన విని కలకల నవ్వి నారాయణుండు నరున కిట్లనియె. 194

ప్రతిపదార్థం: ఎల్లభంగులన్= అన్ని విధాల; గురు+జనంబులన్= పెద్దలను; నొప్పించుటకున్= బాధించటానికి; చాలన్= సమర్థుడనుగాను; వారిని+గెలిపించుటయును= వారు జయించేటట్లు చేయటం; మనము, వారలన్+గెలిచిన వారలము+అగుటయున్=

వారిని మనం జయించటం; అను= అనే; ఈ రెంటిలోన్= ఈ రెండింటిలో; పెద్ద మేలు+ఎయ్యది= ఏదీ గొప్ప మేలుకాదు; ఏను= నేను; కార్పణ్య, దోష+ఉపహత, స్వభావుండను= నేను దీనుడను (కార్పణ్యం అనే దోషంచేత కొట్టబడిన స్వభావం గలవాడను); ధర్మ సమ్మూఢ+చేతస్కుండను= ధర్మం తెలియని మూఢ మనస్సుకలవాడను; ఐ= అయి; నిన్నున్= కృష్ణా నిన్ను; శరణు+చొచ్చి= ఆశ్రయించి; అడిగెదన్= ప్రశ్నిస్తాను; నీ శిష్యుండన్+అగు= నీ దగ్గర చేరి జ్ఞానం ఆర్జించే వాడిని; నన్నున్= నన్ను; శాసింపుము= ఆజ్ఞాపించుము; అనినన్= అని (అర్జునుడు) చెప్పగా; విని; కలకల+నవ్వి= పక పక నవ్వి; నారాయణుండు= విష్ణువు- శ్రీకృష్ణుడు; నరునకున్= అర్జునుడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: 'అన్ని విధాలా ఆలోచించి చూస్తే, పెద్దలను నొప్పించటం మంచిది కాదు. వారు మనలను జయించినా, లేదా మనం వారిని జయించినా, రెంటిలో పెద్ద తేడా లేదు. రెండూ దుఃఖకారణాలే. నేను దీనుడను. నేను నీ శిష్యుడను. జిజ్ఞాసువను. ధర్మం తెలియని మూఢుడను. నాకు జ్ఞానోపదేశం చేసి కర్తవ్యం తెలుపవలసినది' అని అర్జునుడు అనగా విని శ్రీకృష్ణుడు కలకల నవ్వి ఈ విధంగా అన్నాడు:

విశేషం: 1. నవ్వులలోని వైవిధ్యం గుర్తించి ప్రయోగించిన కవి తిక్కన. 2. కలకల- నవ్వుకు ధ్వన్యనుకరణం.

చ. ' వగవఁగ నేమియుం దగనివారికినై హృదయంబు గుందఁగా
వగచెదు; బుద్ధి మాటలును వావిరి నాడెదు నీవు, పండితుల్
వగతురె యున్నవారికి నవశ్యవిధేయతఁ జన్నవారికిం;
దెగు వగలెల్లఁ జిత్తము ప్రదీప్త వివేకమయత్వ మొందినన్.' 195

ప్రతిపదార్థం: వగవఁగన్+ఏమియున్+తగని వారికిన్+ఐ= ఏమాత్రం దుఃఖించవలసిన అవసరం లేనివారి కోసం; హృదయంబు= గుండె; కుందఁగాన్= విషాదం చెందగా; వగచెదు= దుఃఖిస్తున్నావు; బుద్ధి+మాటలును= (ప్రజ్ఞావాదములను) తెలివితేటలతో మెరసే పలుకులు; వావిరిన్= అధికంగా; ఆడెదు= పలుకుతున్నావు; పండితుల్= తెలిసినవారు (జ్ఞానం కలవారు); ఉన్నవారికిన్= జీవించి ఉన్నవారికోసం; అవశ్య+విధేయతన్= తప్పనిసరిగా; చన్నవారికిన్= మరణించిన వారి కోసం; వగతురు+ఎ= దుఃఖిస్తారా? (దుఃఖించరు); చిత్తము= మనస్సు; ప్రదీప్త, వివేకమయత్వము+ఒందినన్= వెలుగొందే ప్రాజ్ఞతతో కూడింది అయితే; వగలు+ఎల్లన్= దుఃఖాలన్నీ; తెగున్= తొలగి పోతాయి.

తాత్పర్యం: ఏ మాత్రం దుఃఖించదగని, వారి కోసం హృదయం క్రుంగగా దుఃఖిస్తున్నావు. నీవు తెలివైన మాటలు ఎక్కువగా మాట్లాడుతున్నావు. ఉన్నవారికి (బ్రతికున్నవారికి), విధివశంచేత తప్పనిసరిగా చన్నవారికి (చనిపోయినవారికి) పండితులు దుఃఖిస్తారా? మనసు ఉజ్జ్వలమైన వివేకంతో కూడిన దయితే దుఃఖాలన్నీ నశిస్తాయి.

విశేషం: సంస్కృత భగవద్గీతలో ఉన్న 'ప్రజ్ఞావాదము' అన్న పదాన్ని తిక్కన 'బుద్ధి మాటలు' అని తెనిగించాడు. అర్జునుడి మాటలలో 'తెలివి తేటలు' ఉన్నాయి. చిత్తమునకు కావలసింది వెలుగు. ఆ వెలుగు 'వివేకం'. చిత్తం ప్రదీప్తమైనప్పుడు వివేకపూరితమైన జ్ఞానం లభిస్తుంది. అతడే అచ్చమైన జ్ఞాని. పండితుడు.

వ. అని పలికి పార్థునిం బరమ జ్ఞానంబునకుఁ గారణంబు లగు వాక్యంబులు వినుటకుం జొనిపి, యద్దేహంబునందు బాల్యంబు యౌవనంబు వార్ధకంబుననం గలుగు నవస్థలం బొందినట్లు జీర్ణంబులైన వస్త్రంబులు విడిచి నూతనంబు లైన వానిం గైకొనిన చాడ్పుననుంగాని దేహాంతరగమనం బాత్మహానిం జేయదనియుఁ బుట్టువుఁ జావు నను నివి లేమిం జేసి శరీరంబు వోలె శస్త్రచ్ఛేదనంబు మొదలైన వికృతికారణంబులకు నాత్ముండు లోను గాఁ డనియు నప్పురుషుండు నొప్పించువాఁడును నొప్పింప

బడియెడు వాఁడును గాఁ డనియుం జెప్పి మఱియు ననేక వాక్యంబుల నాత్మకు నభావంబును శరీరంబునకు భావంబును గలుగమి దెలిపి యాత్మతత్త్వంబు శాశ్వతం బగుట యెఱింగించి యిట్లనియె. 196

ప్రతిపదార్థం: అని, పలికి= అని (శ్రీకృష్ణుడు) చెప్పి; పార్థునిన్= అర్జునుడిని (పృథాకుమారుడిని); పరమ+జ్ఞానంబునకున్= అన్నిటి కంటె మిక్కుటమైన జ్ఞానానికి; కారణంబు+అగు= మూలహేతువులైన; వాక్యంబులు= సార్థకమైన పలుకులు; వినుటకున్+చొనిపి= ఆలకించేటట్లు చేసి; ఈ+దేహంబునందున్= ఈ శరీరంలో; బాల్యంబు= చిన్నతనం (శైశవం); యౌవనంబు= పడుచుతనం; వార్ధకంబును= ముసలితనం; అనన్+కలుగు+అవస్థలన్= అని చెప్పదగిన శారీరక స్థితిగతులను; పొందినట్లు= అనుభవించేటట్లు; జీర్ణంబులు+ఐన, వస్త్రంబులు= చినిగిపోయిన బట్టలు; విడిచి= వదలిపెట్టి; నూతనంబులు+ఐన= క్రొత్తవి అయిన; వానిన్= వాటిని; కైకొనిన+చాడ్పుననున్= స్వీకరించిన విధంగా; దేహ+అంతరగమనంబు= ఇంకొక శరీరాన్ని (పొందటం, చేరటం); ఆత్మ+హానిన్+చేయదు+అనియున్= ఆత్మకు కీడు చేయదు అనియును; పుట్టువు, చావు+అను+ఇవి+లేమిన్+చేసి= జననం మరణం అనేవి లేవు కాబట్టి; శరీరంబు+పోలెన్= దేహంవలె; శస్త్ర+ఛేదనంబు= ఆయుధాల వలన చీల్చబడటం; మొదలు+ఐన= మొదలైన (మున్నగునట్టి); వికృతి+కారణంబులకున్= వికారహేతువులకు; ఆత్ముండు= ఆత్మ; లోను+కాఁడు+అనియున్= బద్ధుడు కాడనీ; ఆ+పురుషుండు= ఆ ఆత్మ(ఆత్ముండు); నొప్పించువాఁడును= బాధించేవాడున్నూ; నొప్పింపన్+పడువాఁడును= బాధించబడే వాడున్నూ; కాడు+అనియున్= కాడు అనీ; చెప్పి= పలికి; మఱియున్= ఇంకా; అనేక+వాక్యంబులన్= పెక్కు వాక్యాలతో; ఆత్మకున్= ఆత్మకు; అభావంబును= లేకపోవటం; శరీరంబునన్= దేహానికి; భావంబును= అస్తిత్వమునూ (ఉండటమూ); కలుగమి= కలగకపోవటం; తెలిపి= తెలియచేసి; ఆత్మతత్త్వంబు= ఆత్మయొక్క స్వరూపం; శాశ్వతంబు+అగుట= స్థిరంకావటం; ఎఱింగించి= తెలిపి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు అర్జునుడికి తత్త్వజ్ఞానం ఉపదేశించాడు. మానవదేహం బాల్యం, యౌవనం, వార్ధకం అనే అవస్థలు పొందినట్లుగా చినిగిపోయిన పాత బట్టలు విడిచి క్రొత్త బట్టలు ధరించినట్లు ఆత్మ ఒక దేహాన్ని విడిచి మరియొక దేహాన్ని పొందుతుంది. ఆత్మ దేహాంతరగమనం వలన నశించదు. నశించేది శరీరం మాత్రమే. ఆత్మకు పుట్టుక, చావు అనేవి లేవు. ఆయుధాలు శరీరానికే తప్ప ఆత్మకు హాని చేయలేవు. ఆత్మ (పురుషుడు) బాధించేవాడు కాడు; బాధను పొందేవాడూ కాడు.' ఆత్మకు అభావం లేదు. ఆత్మ శాశ్వతం. శరీరం నశించేది. దానికి అస్తిత్వం లేదు. ఈ విధంగా పెక్కు భంగుల శ్రీకృష్ణుడు ఆత్మతత్త్వం అర్జునుడికి వివరించి చెప్పాడు.

విశేషం: 1. మూల సంస్కృత భారతంలో చాలా విపులంగా ఉన్న ఆత్మ తత్త్వం తిక్కన తెలుగులో ఎంతో కుదించివేశాడు.

2. 'పురుషుడు' అనే శబ్దం ఈ ప్రకరణంలో ఆత్మకు పర్యాయపదంగా చెప్పబడింది.

3. అవస్థలు పెక్కు రకాలు. ఈ పద్యంలో చెప్పబడినట్టివి బాల్యం, యౌవనం, వార్ధకం మాత్రమే.

బాల్యం- పుట్టినప్పటి నుండి అయిదేండ్ల వరకు.

కౌమారం- ఆరేండ్ల నుండి ముప్పయి ఏండ్ల వరకు.

యౌవనం- ముప్పైఏండ్ల నుండి యాభై సంవత్సరాల పర్యంతం.

వార్ధకం- ఏబదేండ్ల పిదప వయసు.

శ్రీకృష్ణఁ డర్జునునకుఁ దత్త్వజ్ఞానోపదేశంబు సేయుట (సం. 6-24-19)

ఆ. ఇట్టు లగుటఁ జేసి యెవ్వరి దెసకు శో । కంబుఁ బొందఁ గారణంబు లేదు;
జీవుఁ డెల్లభంగిఁ జెడియెడువాఁడు గాఁ । దలఁచితేని వగవవలదు మున్న. 197

ప్రతిపదార్థం: ఇట్టులు+అగుటన్+చేసి= ఈ విధంగా ఉన్నది కాబట్టి; ఎవ్వరి+దెసకున్= ఎవరి యెడలను; శోకంబున్= దుఃఖాన్ని; పొందన్= అనుభవించటానికి; కాణంబు+లేదు= హేతువు లేదు; జీవుఁడు= ఆత్మ; ఎల్లభంగిన్= ఏ విధంగానూ; చెడియెడువాఁడు+కాన్= చెడిపోయేవాడు అని; తలచితి(వి)+ఏని= అనుకుంటే; మున్ను+అ= మున్నే; వగవన్+వలదు= దుఃఖించవలసిన అవసరం లేదు.

తాత్పర్యం: ఈ కారణం చేత, ఎవరి కోసమూ శోకించవలసిన అవసరం లేదు. ఒకవేళ జీవుడు చెడేవాడే అని అంగీకరించినా శోకించవలసిన అగత్యం అసలే లేదు. అది సహజ పరిణామం అని సరిపెట్టుకొనాలి.

విశేషం: ఈ పద్యానికి సంస్కృత మూల శ్లోకం

శ్లో॥ "అథ చైనం నిత్యజాతం । నిత్యంవా మన్యసే మృతమ్,
తథాఽపి త్వం మహాబాహో । నైవం శోచితు మర్హసి." (భ.గీ.2.26)

ఎల్లప్పుడు ఆత్ముడు పుట్టేవాడనీ, గిట్టేవాడనీ నీవు తలపోస్తే ఇక అటువంటప్పుడు దుఃఖానికి తావే లేదు కదా. ఇది మాట వరుసకు, వాదం కోసం అంగీకరించిన ప్రాతిపదిక మాత్రమే. ఆత్మ, నిత్యం, శాశ్వతం అని నిష్కర్షగా భగవద్గీతా ప్రోక్తమైన అభిప్రాయం.

క. పురుషుఁడు సెడు ననువాఁడును, । బురుషుఁడు సెఱుచు నని పలుకు పురుషుండును న
య్యిరువురు నవివేకుల; య । ప్పురుషుఁడు సెఱుపండు సెడఁడు భుజవీర్యనిధీ! 198

ప్రతిపదార్థం: భుజ+వీర్య+నిధీ!= బాహుపరాక్రమానికి నెలవైనవాడా! ఓ అర్జునా!; పురుషుఁడు= ఆత్ముఁడు; చెడును+అనువాఁడును= నశిస్తాడు అని చెప్పేవాడున్నూ; పురుషుఁడు= ఆత్ముడు; చెఱుచున్= నశింప చేస్తాడు; అని+పలుకు= అని చెప్పే; పురుషుండును= మానవుడున్నూ; ఆ+ఇరువురున్= ఆ ఇద్దరూ; అవివేకులు+అ= అవివేకులే! మూఢులే; ఆ+పురుషుఁడు= ఆత్ముడు; చెఱుపండు= నాశనం చేయడు; చెడఁడు= నశించడు.

తాత్పర్యం: ఓ అర్జునా! ఆత్ముడు నశిస్తాడు అనేవాడూ, ఆత్ముడు నశింపచేస్తాడు అనేవాడూ- ఇరువురూ అవివేకులే. ఆత్మ నశించదు, ఎవరినీ నాశనం చేయదు.

విశేషం: ఈ పద్యంలో పురుషుడు అనే శబ్దం - మనుష్యుడు అనే అర్థంలో ఒకచోట- ఆత్మ అని మూడుచోట్ల ప్రయోగించబడింది. మొదటి పంక్తిలో పురుషుడు అంటే ఆత్మ. రెండవ పాదంలో పురుషుడు మొదటి పదానికి అదే అర్థం. రెండవ పాదంలో యతిస్థానంలో ఉన్న పురుషుడు అనే శబ్దానికి మనుష్యుడు అని అర్థం. నాలుగో పాదం మొదటి శబ్దం - పురుషుడు అనే మాటకు ఆత్మ అని అర్థం.

క. పురుషుఁ డన వే ఱొకండే । పురుషోత్తముఁ డైన యేన; పురుషోత్తమతా
స్ఫురణకుఁ బురుషత్వం బను । మెరమెర గల; దదియ కాదె మెయికొనుఁ గ్రియకున్. 199

ప్రతిపదార్థం: పురుషుఁడు+అనన్= ఆత్ముడు అనగా; వేఱు+ఒకండే?= వేరే ఇంకొకడా?; పురుష+ఉత్తముఁడు+ఐన= పురుషులలో గొప్పవాడైన; ఏను+అ= నేనే; పురుషోత్తమతా+స్ఫురణకున్= పురుషోత్తమత్వం అభివ్యక్తం అయ్యేందుకు; పురుషత్వంబు= ఆత్మత్వం; అను+మెరమెర= అనే తళతళల కాంతి; కలదు= ఉన్నది; అది+అ= అదియ- అదే; క్రియకున్= పనిచేయటానికి; మెయికొనున్+కాదె!= పూనుకొంటుంది కదా!

తాత్పర్యం: పురుషుడు, ఆత్మ అంటే నేనే; వేరొకడు కాడు. పురుషోత్తమత్వం అభివ్యక్తం కావటానికి ఆత్మత్వస్ఫూర్తి ఉంటుంది. అదే సర్వక్రియలకూ పూనుకొంటుంది.

విశేషం: 1. పురుషుడు- పురుషోత్తముడు అనేది శాబ్దిక వ్యత్యాసమేగాని పురుషుడు- పురుషోత్తముడు అనేది అభేదాధ్యవసాయమే అని ఈ పద్యం చెపుతోంది. అంతేగాక- ఆ పురుషోత్తముడు ఎవరు? తానే అని శ్రీకృష్ణుడు నొక్కివక్కాణించాడు.

తిక్కన - అద్వైతి అని చెప్పవచ్చు. భగవద్గీతలోని శ్రీకృష్ణ వాక్యాలకూ, మతత్రయకర్తలు ఎవరికి అనుకూలమైన వ్యాఖ్యలు వారు చేశారు.

వ. అని వెండియు వివిధవాక్యంబుల నాత్మునకు బాధ్యబాధకత్వంబులు లే కునికి వివరించి విచ్చునకుం గృపాశోకంబులకు మూలంబు లగు నహంకారంబులు వారించి, యతనికి రణోత్సాహంబునకుం గారణం బైన స్వకర్మావలంబనంబు వదలం దగమి దెలియుటకు వలయు వాక్యంబులు పెక్కు లుపన్యసించి.200

ప్రతిపదార్థం: అని= ఆ విధంగా చెప్పి; వెండియున్= మరియు; వివిధ+వాక్యంబులన్= పెక్కు వాక్యాలలో; ఆత్మునకున్= పురుషుడికి; బాధ్య, బాధకత్వంబులు= బాధను పొందటం బాధను కలిగించటం; లేకునికి= లేకపోవటం; వివరించి= ప్రస్ఫుటంగా చెప్పి; కృపా+శోకంబులకున్= దయకు దుఃఖానికి; మూలంబులు+అగు= కారణాలు అయిన; అహంకారంబులు= అహంకార మమకారాలు; వారించి= తొలగించి; అతనికిన్= (అర్జునుడికి); రణ+ఉత్సాహంబునకున్= యుద్ధం చేయాలనే ఆవేశంతో కూడిన అభిలాషకు; కారణంబు+ఐన= హేతువైన; స్వకర్మ+అవలంబనంబు= కర్తవ్య నిర్వహణం; వదలన్+తగమి= వదలి పెట్టటం మంచిది కాదని; తెలియుటకున్= తెలిసికొనేందుకు; వలయు= అవసరమైన; వాక్యంబులు= సార్థకమైన మాటలు; పెక్కులు= అనేకాలు; ఉపన్యసించి= వివరించి చెప్పి.

తాత్పర్యం: అని మరల ఎన్నో వాక్యాలతో శ్రీకృష్ణుడు అర్జునుడికి జ్ఞానోపదేశం చేశాడు. 'ఆత్మకు బాధింపబడటం లేదు. బాధించటమూ లేదు అని వివరించాడు. అర్జునుడి కృపావేశానికీ దుఃఖానికీ మూలం అతడి అహంకార మమకారాలే గనుక వాటిని తొలగించాడు. అర్జునుడు చేయవలసిన పని యుద్ధానికి తగిన స్వకర్మావలంబనం.' దానిని వదలరాదు అని తెలియటానికి తగిన వాక్యాలు ఎన్నో శ్రీకృష్ణుడు అర్జునుడికి ఉపన్యసించాడు.

విశేషం: 'అని వెండియు వివిధ వాక్యంబులన్' అని తిక్కన వ్రాశాడు. అయితే ఆ వివిధ వాక్యాలు ఏమిటో తిక్కన చెప్పలేదు. అవి అన్నీ అర్జునుడిని కర్తవ్యోన్ముఖుడిని గావించాయి అని మాత్రం చెప్పాడు. దీనిని బట్టి తిక్కన బుద్ధిపూర్వకంగానే భగవద్గీతను సాంతంగా అనువదించలేదని తేలుతున్నది.

క. సమరంబు రాజులకు ను । త్తమకర్మం బది; యపావృతస్వర్గ ద్వా
రము సుమ్ము; లెమ్ము! దగఁ గ । య్యము సేయుము; దీనికేల యనుమానింపన్? 201

ప్రతిపదార్థం: సమరంబు= యుద్ధం; రాజులకున్= క్షత్రియులకున్; ఉత్తమ+కర్మంబు= మంచి పని -మేటి కర్తవ్యం; అది= యుద్ధం; అపావృత, స్వర్గ, ద్వారము= తెరువబడిన స్వర్గం యొక్క తలుపు; సుమ్ము= సుమా!; లెమ్ము= లేచి నిలబడుము; (కర్తవ్యానికి పూనుకో); తగన్= తగునట్లుగా; కయ్యము+చేయుము= యుద్ధం చేయుము; దీనికిన్= ఈ విధంగా యుద్ధం చేయటానికి; ఏల+అనుమానింపన్?= సందేహం ఎందుకు?

తాత్పర్యం: క్షత్రియులకు ముఖ్యకర్తవ్యం యుద్ధం. దానివలన స్వర్గం లభిస్తుంది. లెమ్ము. యుద్ధం చెయ్యి. సందేహించవద్దు.

విశేషం: 1. యుద్ధంలో మరణించేవారు (అనగా వారి ఆత్మలు) స్వర్గంలోకి చేరుతాయనే ఆ ప్రాచీన విశ్వాసాన్ని భగవద్గీత అంగీకరించిందా? అసలు స్వర్గనరకాలు ఉన్నాయా?; అధర్వ వేదంలో:

శ్లో॥ "న మోక్షో నభసః పృష్ఠే । న పాతాళే న భూతలే,
సర్వాశా సంక్షయే చేతః । క్షమో మోక్ష ఇతీర్యతే. "

మోక్షం అనేది ఆకాశం వెనుక గాని పాతాళ లోకంలోగాని భూమి మీద గాని ఉండే ఒక స్థాన విశేషం కాదు. ఆశాపరివృతమైన చిత్తవృత్తి నశించటమే నిజమైన మోక్షం. - **'మన ఏవ మనుష్యాణాం కారణం బంధ మోక్షయోః'**- అని చెప్పబడింది. భగవద్గీతలో చెప్పబడిన "స్వర్గ నరకాలు", స్థాన విశేషాలుగా కాకుండా వాచ్యార్థంలో కాకుండా, ఔపచారికంగా యోగికార్థంలో మానసికమైన అనుభూతులుగా స్వీకరించవచ్చును.

క. ఫలముల యెడ బ్రహ్మార్పణ । కలనపరుం డగుచుఁ గార్యకర్మము నడపన్
వలయుం దత్త్వజ్ఞానము । తలకొనినం గర్మశమము దానై కలుగున్. 202

ప్రతిపదార్థం: ఫలముల+ఎడన్= ఫలితాల పట్ల; బ్రహ్మ+అర్పణ, కలన, పరుండు+అగుచున్= పరమాత్మకు అంకితం చేసినవాడు అవుతూ; కార్య+కర్మము= కర్తవ్యమును; నడపన్+వలయున్= నెరవేర్చాలి; తత్త్వజ్ఞానము= ఆధ్యాత్మిక విద్య; తలకొనినన్= ఏర్పడితే; కర్మశమము= కర్మ వినాశనం; తాను+ఐ+కలుగున్= దాని అంతట అదే ఏర్పడుతుంది.

తాత్పర్యం: ఫలితాల యెడ మమకారం విడిచి కర్తవ్యాలను నిర్వహించాలి. ఫలితాలు జయాపజయాలు భగవదర్పితం చేయాలి. తత్త్వజ్ఞానం లభిస్తే ఇక కర్మనాశనం తానంతట అదే కలుగుతుంది.

విశేషం: ఈ పద్యం - తిక్కన వ్రాసిన భగవద్గీతకు కేంద్ర గరిమనాభి. ఇది భగవద్గీతాసారసంగ్రహం అన దగిన పద్యం. ఇందులోని అంశాలు:

1. కార్యకర్మము= చేయవలసినపని- ధర్మం= కర్తవ్యం చేయాలి. అయితే జయాపజయాలతో కర్తవ్యానికి సంబంధం లేదు. ఉండకూడదు. నిజానికి నరుడు కర్తవ్యం చేయగలడుగాని- ఆశించిన ఫలం- విజయం చేకూరవచ్చును. చేకూరక పోవచ్చును. చేయవలసిన పని చేస్తే చాలు. ఆ తృప్తి చాలు. అదే పరమార్థం. అట్టివాడే కర్మయోగి. జయం వచ్చినా, అపజయం సంప్రాప్తించినా, అతడు కృతకృత్యుడే.

ఇక కర్మ చేయకుండా ఏ మానవుడూ ఉండలేడు గదా!. ఏ పనీ చేయని వాడు - అనుకొన్న వాడు కూడా ఏదో పని చేయక తప్పదు. ఊపిరి పీల్చటం కూడా ఒక పనే కదా. ఎన్ని పనులు చేసినా, ఏ పనీ చేయనివాడే యోగి. దోషికి మరణ శిక్ష విధించాడు అనుకుందాం ఒక న్యాయమూర్తి. అతడు హంతకుడా? కాడు. అట్లే యుద్ధం చేసి ఎంత మందిని చంపినా సరే - కర్తవ్యం నిర్వహించిన వీరుడు కారకుడు కాడు. ఎవరినీ చంపనట్లే. ఈ పద్యంలో ఇంకో చక్కని చిక్కని పదగుంఫన ఉన్నది. అది 'కర్మశమము'.

కర్మ అనే శబ్దానికీ - పని చేసే క్రియ అని వ్యావహారికమైన అర్థం. భగవద్గీత పరిభాషలో- "కర్మ సిద్ధాంతం"లో కర్మకు విపులమైన అర్థం ఉంది. భగవద్గీతలో కర్మ మూడు విధాలుగా వింగడింపబడింది.

శ్లో॥ "కర్మణో హ్యపి బోద్ధవ్యం । బోద్ధవ్యం చ వికర్మణః,
అకర్మణ శ్చ బోద్ధవ్యం గహనా కర్మణో గతిః" (భ.గీ.4-17)

కర్మరీతులు గ్రహించటం కష్టం. అన్ని పనులు చేసే గృహస్థుడు, సర్వసంగపరిత్యాగియైన సన్న్యాసి సమానులే. "తత్త్వజ్ఞానం' ' తలకొన్న యెడల. ఇక్కడ వినోభా భావేగారి వ్యాఖ్యానం సంగ్రహింప దగినట్టిది. "కర్మ - వికర్మ - అకర్మ, ఈ మూడు శబ్దములును నాల్గవ అధ్యాయంలో చాలా మహత్త్వం కలవి. కర్మ అనగా స్వధర్మాచరణ యొక్క స్థూలరూపం. ఈ బాహ్యకర్మలో చిత్తమును లగ్నం చేయటమే వికర్మ. మనం ఎవరికైనా నమస్కరించినపుడు శిరమువంచే బాహ్యక్రియతోపాటే లోపలి మనస్సును కూడా వినయంతో వంచక పోతే ఆ బాహ్యక్రియ వ్యర్థం.

'తత్త్వజ్ఞానము తలకొనిన' యెడల అనగా- **"జ్ఞానాగ్ని స్సర్వ కర్మాణి । భస్మసాత్కురుతే తథా"** - భ.గీ. 4-37 జ్ఞానాగ్ని, సర్వకర్మలను భస్మం చేయగలదు. ఉదాహరణకు కట్టె ఉన్నది. అది అగ్నిదగ్ధమైనపుడు మిగిలేది బూడిద. కర్ర కాదు.

'తత్త్వ జ్ఞానం తలకొనిన యెడల' అర్జునుడు చేసే యుద్ధకర్మ - కర్మ కాదు. అది జ్ఞానాగ్ని అనే వికర్మ వలన - 'అకర్మ' ఐపోతుంది. అర్జునుడు అప్పుడు ఏ పనీ చేయనట్టి సర్వసంగపరిత్యాగియైన సన్న్యాసితో సముడు. తత్త్వజ్ఞానం వలన 'కర్మ శమము' కర్మవినాశనం సంభవిస్తుంది. ఈ విధంగా జ్ఞాని పుణ్యపాపాలకు అతీతుడు కాగలడు.

వ. అని మఱియు నీదృశంబు లగు వాక్యంబు లనేకంబు లనుగ్రహించుచు వివిధప్రకారంబుల వికల్పించి విజయుం డడిగిన వాని కెల్ల సదుత్తరంబు లిచ్చి సందేహంబు వాపుచు. 203

ప్రతిపదార్థం: అని మఱియున్= అని చెప్పి మరల; ఈదృశంబులు+అగు= ఈ రీతి వయిన; వాక్యంబులు+అనేకంబులు= పెక్కు వాక్యాలు; అనుగ్రహించుచున్= దయతో చెప్పుతూ; వివిధ+ప్రకారంబులన్= పెక్కురీతుల; వికల్పించి= ఇది అదీ అని విభజించి చెప్పి; విజయుండు= అర్జునుడు; అడిగిన వానికిన్+ఎల్లన్= వేసిన ప్రశ్నలు అన్నింటికీ; సత్+ఉత్తరంబులు= మంచి సమాధానాలు; ఇచ్చి= చెప్పి; సందేహంబు+పాపుచున్= అనుమానాలు పోగొట్టుతూ.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు మరల ఈ విధమైన వాక్యాలను పెక్కింటిని దయతో చెప్పి, అనేక మార్గాలు వివరించి, అర్జునుడు అడిగిన ప్రశ్నలకు సరియైన సమాధానాలు చెప్పి, అతడి అనుమానాల నన్నిటినీ పోగొట్టాడు.

విశేషం: 1. వివిధ ప్రకారంబులు, వికల్పించి= ఎన్నో మార్గాలు తాత్త్విక దర్శనాలు వివరించి అని అర్థం; భగవద్గీత మూలంలో 18 అధ్యాయాలు. అర్జున విషాదయోగం - సాంఖ్యయోగం-కర్మయోగం మున్నగునవి మూలంలో ఉన్నాయి. తిక్కన అన్నిటినీ పృథక్కరించి చెప్పలేదు. భగవద్గీత ముముక్షువులు అందరికీ ఏకైక తరణోపాయం ప్రవచించలేదు. అందుచే 'వివిధ ప్రకారంబులు' వికల్పించి అనే తిక్కన ప్రయోగం ఎంతో అర్థవంతమైనది.

2. అర్జునుడు మూఢ భక్తుడు కాడు. శ్రీకృష్ణుడు అర్జునుడి ప్రశ్నలకు, కొన్ని చిక్కు ప్రశ్నలకు సమాధానం చెప్పవలసివచ్చింది. అర్జునుడు వేసిన ప్రశ్నలుగాని శ్రీకృష్ణుడు చెప్పిన సమాధానాలుగాని తిక్కన వివరించలేదు.

క. భారమున నులిచి త్రెంపక । కారాకులు డుల్లినట్లు కర్మము లెల్లం
దార పెడఁబాయ వలయుట । సారకృపం దెలియఁ జెప్పె శౌరి యతనికిన్. 204

ప్రతిపదార్థం: భారమునన్+నులిచి+త్రెంపక= కష్టయాతన చొప్పున ఊడదీసి, త్రుంచివేయకుండా; కారాకులు= పండుటాకులు; డుల్లినట్లు= క్రిందకు పడిపోయినట్లుగా; కర్మములు+ఎల్లన్= అన్ని కర్మలూ; తార+పెడన్+పాయ వలయుట= తమంతట తామే ప్రక్కకు తప్పుకొనుట; సార+కృపన్= మిక్కిలి దయతో; అతనికిన్= అర్జునుడికి; శౌరి= శ్రీకృష్ణుడు; తెలియన్+చెప్పెన్= తెలిసేటట్లు విశదీకరించి చెప్పాడు.

తాత్పర్యం: కర్మలు అన్నీ ఎంతో కష్టపడి త్రుంచి వేయనక్కరలేదు. పండిపోయిన ఆకులు చెట్టు నుండి నేలమీద రాలిపోయేటట్లుగా, సహజంగా ఎట్లా విడిపోగలవో, ఆ విషయం అంతా దయతో శ్రీకృష్ణుడు అర్జునుడికి వివరించి చెప్పాడు.

విశేషం: 1. 202వ పద్యం వ్యాఖ్యానంలో కర్మ ఏ విధంగా అకర్మగా పరిణమిస్తుందో చెప్పబడింది. ఈ పద్యంలో తిక్కన చక్కని ఉపమానం ప్రయోగించాడు. ఎట్లా 'పండిపోయిన ఆకులు చెట్ల నుండి సహజంగా రాలిపోతాయో. అట్లాగే కర్మలు కూడ జ్ఞానిని వీడిపోతాయి. జ్ఞానిని కర్మలు అంటిపెట్టుకొని ఉండవు. జ్ఞానయోగంవలన కర్మలు ఎండిన ఆకులవలె మారిపోయి క్రిందికి రాలిపోతాయి. కర్తకు మరి కర్మలతో అనుబంధం ఉండదు- ఎండిన ఆకులకూ చెట్లకూ సంబంధం ఉండనట్లే.

2. ఈ పద్యంలో మొదటి పదం- 'వైరమున' అని ఉన్నది. పాఠాంతరం 'భారమున' అని ఇవ్వబడింది. ఎండిన ఆకులు సులభంగా సహజంగా రాలిపోతాయి. 'భారంగా' త్రుంచవలసిన అవసరం లేదు అనే పాఠం సుగమంగా ఉన్నది.

'వైరమున' అనే పాఠం అన్వయక్లిష్టతకు గురి చేస్తున్నది. 'సారమతిం దెలియ' అనే పాఠం బాగానే ఉన్నది కాని- నాలుగోపాదంలో 'సారకృపం' - అని ఉన్నది కాబట్టి అది పునరుక్తి దోషం అవుతుంది శాబ్దికంగా. కావున భారమున అనే పాఠమే స్వీకరించబడింది.

వ. ఇవ్విధంబునం జెప్పిన విని కవ్వడి సముత్థితుం డై జగన్నాథున కిట్లనియె. 205

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ రీతిగా; చెప్పినన్= చెప్పగా; విని= ఆలకించి; కవ్వడి= సవ్యసాచి= అర్జునుడు; సముత్థితుంప+ఐ= లేచినిల్చినవాడై; జగత్+నాథునకున్= జగతికి ప్రభువైన శ్రీకృష్ణుడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఈ రీతిగా శ్రీకృష్ణుడు చెప్పగా ఆలకించి అర్జునుడు లేచి నిల్చి ఆ జగన్నాథునితో ఈ విధంగా అన్నాడు:

మ. ' అతిగుహ్యం బిది; నీవు భూరికృప నీ యధ్యాత్మముం గానఁ జే
సితి; నా కిమ్మెయి విన్కిఁ గొంత భ్రమ వాసెన్; యోగిహృద్ధ్యేయ మై
యతులైశ్వర్యవిభూతి నొప్ప భవదీయం బైన రూపంబు సూ
చు తలం పెత్తెడుఁ; బోలునేని దయఁ జక్షుఃప్రీతిఁ గావింపవే.' 206

ప్రతిపదార్థం: అతి, గుహ్యంబు+ఇది= ఇది మిక్కిలి రహస్యమైనది; నీవు= నీవు (ఓ శ్రీకృష్ణా నీవు); భూరి+కృపన్= మిక్కుటమైన దయతో; ఈ+అధ్యాత్మమున్= ఆ ఆత్మతత్వాన్ని; కానన్+చేసితి(వి)= కనిపించేటట్లు చేశావు; నాకున్= నాకు; ఈ+మెయిన్= ఈ రీతిగా; విన్కి= వినటం వలన; కొంత= కొంత; భ్రమ+పాసెన్= భ్రమ తొలగింది; యోగి+హృత్+ధ్యేయము+ఐ= యోగుల హృదయాలకు లక్ష్యమై; అతుల+ఐశ్వర్య+విభూతిన్+ఒప్పు= సాటిలేని సంపద మహత్వంతో శోభిల్లే; భవదీయంబు+ఐన= నీదైన; రూపంబు= ఆకారం; చూచు= వీక్షించవలెననే; తలంపు+ఎత్తెడున్= కోరిక కలిగింది; పోలున్+ఏనిన్= అది తగినదైతే; దయన్= కరుణతో; చక్షుః ప్రీతిన్= కన్నులకు వేడుకను; కావింపవు+ఏ?= చేయవా?

తాత్పర్యం: నీవు నాకు అందించిన సందేశం చేసిన ఉపదేశం మిక్కిలి రహస్యమైనవి. నామీద నీకు ఎంతో దయ ఉన్నది కాబట్టి ఈ ఆత్మజ్ఞానం నాకు కలిగించావు. ఈ ఆధ్యాత్మికతత్వం వినటంచేత నాకు కొంత భ్రమ తొలగింది. యోగీశ్వరులు నీ రూపం చూడాలని తహ తహలాడుతూ ఉంటారు. సాటిలేని విభూతితో వెలుగొందే నీ ఆకారం వీలైతే దయచేసి నన్ను కన్నుల పండువుగా దర్శింపజేయుము.

విశేషం: 1. భ్రమ అంటే చలనం. లేనిది ఉన్నట్లు తోచటం. అర్జునుడు అన్నాడు శ్రీకృష్ణుడి ఉపదేశం విని 'శ్రీకృష్ణా నాకు 'కొంత' భ్రమ తొలగింది' అని. భ్రమ పూర్తిగా ఎందుకు తొలఁగలేదు అనే ప్రశ్న ఉద్భవిస్తుంది. వినుకలి= వినటం కంటె కనుకలి= కన్నులార చూడటం శ్రుతికంటె ప్రత్యక్ష ప్రమాణం గొప్పది అని కాదు. సిద్ధాంత జ్ఞానం వలన కొంత వరకే భ్రమ తొలగుతుంది. ప్రత్యక్షానుభూతి సిద్ధాంత జ్ఞానాన్ని బలపరుస్తుంది. సిద్ధాంతం కంటె అనుభూతి గొప్పది. అంతే కాదు. జ్ఞానం పరిమిత గమనం కలది. తర్కం ఆగిపోయే చోట అనుభూతి ప్రారంభిస్తుంది. తర్క సిద్ధాంత జ్ఞానం పరిధి కొంత మేర వరకే. "అనుభవైక వేద్య మధ్యాత్మ యోగంబు, తర్క పరిథులెల్ల దాటిపోవు. అర్జునుడు తనకు విశ్వరూప సందర్శనం అనుగ్రహించి 'చక్షుః ప్రీతి గావింపవే' అని ప్రార్థించాడు. అయితే శ్రీకృష్ణుడు, అది మానవుల కన్నులకు అతీతమైనది అని అతడికి 'దివ్యదృష్టి' ప్రసాదించాడు.

3. యోగి= యోగం కలవాడు. యోగశబ్ద నిర్వచనం - భీష్మ అశ్వాసం 110 పద్యం చూడవచ్చు.

వ. అనిన విని యచ్యుతుం డతని కిట్లనియె. 207

ప్రతిపదార్థం: అనినన్+విని= అని అర్జునుడు పలుకగా ఆలకించి; అచ్యుతుండు= శ్రీకృష్ణుడు; అతనికిన్= అర్జునునితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: అర్జునునితో శ్రీకృష్ణుడు ఈ విధంగా చెప్పాడు:

క. ‘ నానాస్ఫుట వర్ణంబులు । నానాభంగులును గలుగు నారూపములో
నానాశ్చర్యవిధంబులు । గానఁగ నగుఁ జూపెదం బ్రకాశస్ఫూర్తిన్. 208

ప్రతిపదార్థం: నానా, స్ఫుట, వర్ణంబులు= పెక్కు విధాలుగా భాసించే రంగులు; నానా, భంగులును= పెక్కు రీతులును; కలుగు= ఉన్న; నా రూపములోన్= నా ఆకారంలో; నానా+ఆశ్చర్యవిధంబులు= పెక్కు విచిత్రాలైనవి, భిన్నములైన తీరుతెన్నులు; కానఁగన్+అగున్= కనుపిస్తాయి; ప్రకాశ+స్ఫూర్తిన్= మిరుమిట్లు గొలిపే వెలుగుతో; చూపెదన్= చూపిస్తాను.

తాత్పర్యం: పెక్కు రంగురంగులు పెక్కు రీతులు ఉన్న నా రూపంలో పెక్కు ఆశ్చర్యకరాలైన తీరుతెన్నులు కనిపిస్తాయి. వెలుగువెల్లువతో కూడిన నా రూపం చూపిస్తాను. చూడుము.

క. వినుమానుషచక్షుర్గతి । గనుఁగొన శక్యంబు గాదు గావున దానిం
గనుట కయి దివ్యచక్షు । ర్జననం బొనరింతు నీకు శత్రువిదారీ!’ 209

ప్రతిపదార్థం: శత్రు విదారీ!= శత్రువులను ఖండించగల వాడా! ఓ అర్జునా!; వినుము= ఆలకించుము; మానుష చక్షుః+గతిన్= మనుజులకున్న నేత్ర దృష్టి ప్రసారంతో; కనుంగొనన్= చూడటానికి; శక్యంబు+కాదు= శక్తి చాలదు; కావునన్= కాబట్టి; దానిన్= విశ్వరూపాన్ని; కనుటకున్+అయి= చూడటం కోసం; నీకున్= నీకు (ఓ అర్జునా నీకు); దివ్య+చక్షుస్+జననంబు= అతిలోకమైన కన్నులు పుట్టేటట్లు; ఒనరింతున్= చేస్తాను.

తాత్పర్యం: శత్రుసంహారం చేయగల సామర్థ్యం ఉన్న ఓ అర్జునా! ఆలకించుము. మనుజులకు సహజంగా ఉండే చర్మచక్షువులతో నా విశ్వరూపాన్ని వీక్షించే వీలు లేదు. కాబట్టి నీకు దివ్యదృష్టి ప్రసాదించగలను.

వ. అని యతనికి దివ్యదృష్టి యొసంగి యోగీశ్వరేశ్వరుం డైన యాలక్ష్మీశ్వరుండు దనదివ్యరూపంబు సూపె; నా విశ్వరూపుని దివ్యతేజంబు సహస్రసూర్యప్రభానిభం బనుటయుం జాలకుండుం గావున వాక్రువ్వం గొలఁది గా; దట్టి మహామూర్తిఁ గనుంగొని ధనంజయుండు విస్మయరోమహర్షణప్రహర్షోత్కర్షంబులతో దండప్రణామంబులు సేసి నిలిచి కేలు మొగిడ్చి యి ట్లనియె. 210

ప్రతిపదార్థం: అని= ఆ విధంగా చెప్పి; దివ్య+దృష్టి= అతిలోకమైన చూపు; (అర్జునునకు); ఒసంగి=ఇచ్చి; యోగి+ఈశ్వరుండు+అయిన= యోగులలో శ్రేష్ఠుడు అయిన; ఆ+లక్ష్మీ+ఈశ్వరుండు= లక్ష్మీదేవికి భర్త- శ్రీకృష్ణుడు; తన+దివ్య+రూపంబు+చూపెన్= తనదైన అతిలోకమైన ఆకారాన్ని ప్రదర్శించాడు; ఆ+దివ్య+రూపుని= లోకాతీతమైన రూపంగల ఆ శ్రీకృష్ణుడియొక్క; దివ్య+తేజంబు= దైవానికి సంబంధించిన పెను వెలుగు; సహస్ర, సూర్య, ప్రభా, నిభంబు= వేయి సూర్యుల వెలుగుతో సమానం; అనుటయున్+చాలకుండున్= అని వర్ణించటం గూడ తక్కువే అని చెప్పాలి; కావునన్= కాబట్టి; వాక్రువ్వన్= వర్ణించటానికి; కొలఁది+కాదు= అలవి కాదు; అట్టి= అటువంటి; మహా+మూర్తిన్= గొప్ప ఆకృతిని; కనుంగొని= చూచి; ధనంజయుండు= అర్జునుడు; విస్మయ, రోమహర్షణ, ప్రహర్ష+ఉత్కర్షంబులతోన్= ఆశ్చర్యం, గగుర్పాటుతో కూడిన ఆనందాతిశయాలతో; దండ, ప్రణామంబులు చేసి= సాగిలపడి నమస్కారాలు ఆచరించి; నిలిచి= నిలబడి; కేలుమోడ్చి= చేతులు జోడించి; అనియెన్= ఈ విధంగా అన్నాడు:

తాత్పర్యం: శ్రీకృష్ణుడు అర్జునుడికి దివ్యదృష్టి అనుగ్రహించాడు. యోగీశ్వరుడూ లక్ష్మీవల్లభుడూ అయిన శ్రీకృష్ణుడి విశ్వరూపాన్ని అర్జునుడు సందర్శించాడు. ఆ విశ్వరూపుడి లోకాతీతమైన తేజస్సు వేయి సూర్యుల వెలుగును మించింది అని చెప్పవచ్చును. అది వర్ణనాతీతం. ఆ విశ్వరూపాన్ని దర్శించి, అర్జునుడు ఆశ్చర్యం చెంది, రోమాంచంతో పులకించిన దేహం కలవాడై ఆనందంతో పరవశించిపోయి, చేతులు మోడ్చి నమస్కరించి ఈ విధంగా అన్నాడు:

విశేషం: 1. యోగీశ్వరుడు శ్రీకృష్ణుడు . భగవద్గీత శ్రీకృష్ణుడికి ప్రసాదించిన బిరుదు "యోగీశ్వరుడు." యోగి అనగా యోగం కలవాడు. యోగం అంటే? యోగ శబ్దానికి ఎన్నో అర్థాలు ఉన్నాయి. సనాతన భారతీయ సాహిత్యంలో విపుల ప్రయుక్తమైన శబ్దం - యోగం.

1. యోగశబ్దానికి వ్యావహారికమైన అర్థం కలయిక= పొందిక.

2. సారస్వతార్థం - సామరస్య సంధానం.

3. శ్రీకృష్ణుడు - అర్జునుడిని కర్మవీరుడవు కమ్మని ఉద్బోధిస్తూ ఇట్లా అంటాడు-

శ్లో॥ "యోగస్థః కురు కర్మాణి । సంగం త్యక్త్వా ధనంజయ!

సిద్ధ్యసిద్ధ్యోః సమో భూత్వా । సమత్వం యోగ ఉచ్యతే" (భగవద్గీత - 2-48)

"యోగస్థుడవై కర్మలు చేయుము. సంగముక్తుడవై జయాపజయాలు సమంగా భావించుము. 'సమత్వం' అని యోగం చెప్పబడింది.

4. భగవద్గీత అభిప్రాయంలో- యోగి, తపస్వి కంటె గొప్పవాడు - భగవద్గీత 4-46.

5. యోగం అంటే శ్రీకృష్ణుడు ఇచ్చిన నిర్వచనం- 'యోగః కర్మసు కౌశలం' యోగం అంటే క్రియా కౌశలం. నిర్వహణ పాటవం - సమబుద్ధికి గీటురాయి. నిర్వహణచాతురి నిస్సంగత్వం వల్లనే సిద్ధిస్తుంది. ఫలాపేక్షతో పనిచేసేవాడు నిరంతరం అపజయ భయ ప్రేరితుడు కాక తప్పదు. అందుచేత భగవద్గీత ప్రకారం యోగం అంటే - సమతా భావం, క్రియా కౌశలం. ఈ రెండు నిర్వచనాలు బొమ్మ బొరుసులే.

యోగి అంటే భిన్నత్వంలో ఏకత్వం చూడగల ద్రష్ట. క్రాంతదర్శి. యోగశబ్దానికి వ్యావహారిక జగత్తులో కలయిక - పొందిక అనే అర్థం స్ఫురిస్తుంది. సాహిత్య ప్రపంచంలో సామరస్య సంధానం స్ఫురిస్తుంది. ద్వంద్వబద్ధమైన ప్రాణికోటి, వికారమయమైన జీవితం, అవ్యక్త స్థితమైన సృష్టిలో సతమతమయ్యే మానవుడు తన ఆంతర్యంలో సామరస్య సంధానం సాధింపగల్గినపుడు అతడే యోగి కాగలడు. యోగికి యావత్ సృష్టి 'సత్యం శివం సుందరంగా' భాసిస్తుంది. అతడు "ఏకమే వాద్వితీయం బ్రహ్మ' అనీ 'ఏకం సత్ విప్రాః బహుధా వదంతి' అనీ అనగలడు. ఇది అనుభవైకవేద్యం. అవాఙ్మానస వేద్యమైన ఈ అనుభూతిని వేత్తలు 'యోగం' అనే పరిభాషతో నిర్దేశించారు. వేదాంతపరంగా యోగం అంటే జీవాత్మ, పరమాత్మల సమ్మేళనం. ఐహికాముష్మికాల సమన్వయం. శ్రీకృష్ణుడు యోగీశ్వరుడు అని మహాభారతం అభివర్ణించింది. పతంజలి- "యోగః చిత్తవృత్తి నిరోధః" అని నిర్వచించాడు. పతంజలి - యోగసాధనను 'అష్టాంగ మార్గం'గా విశ్లేషించాడు.

1. యమం 2. నియమం 3. ఆసనం 4. ప్రాణాయామం 5. ప్రత్యాహారం 6. ధారణ 7. ధ్యానం 8. సమాధి.

పతంజలి అష్టాంగ యోగంలోని ప్రాథమిక దశలు రెండు- యమం, నియమం సౌశీల్యసంబంధాలు.

యోగసాధనకు సౌశీల్యమే పునాది.

1. యమం: 1. అహింస 2. సత్యం 3. అస్తేయం 4. బ్రహ్మచర్యం 5. అపరిగ్రహం.

2. నియమం: 1. శౌచం 2. సంతోషం 3. తపస్సు 4. స్వాధ్యాయం 5. ఈశ్వర ప్రణిధానం

3. ఆసనం: శారీరక మానసిక వ్యాయామం. యోగసాధన చిరకాల సాధన కాబట్టి, చిరసుఖప్రదమైన శరీర భంగిమ కుదుర్చుకొనాలి. శీర్షం, కంఠం, వక్షఃస్థలం ఒకే ఋజురేఖలో ఉండాలి. ఈ ఆసనశాఖ హఠయోగంగా పరిణమించింది.

4. ప్రాణాయామం: ఈ ప్రక్రియ ఊపిరి పీల్చటంతో ప్రారంభిస్తుంది. నిశ్చల మనస్సును సాధించేందుకు - నాసాగ్రంపై ధ్యాస నిలిపి సాధన చేయాలి.

5. ప్రత్యాహారం: మనోనిగ్రహం ద్వారా, ఇంద్రియ నిగ్రహసాధన.

6. ధారణ: చిత్తవృత్తిని ఏకాగ్రం చేయటం ధారణ. మనస్సును కేంద్రీకరించి ఒక బిందువుపై పెట్టవచ్చును. ఉదాహరణకు ఆయా అవయవాలపై దృష్టి కేంద్రీకరించవచ్చును. ముక్కు చెవి కన్నులు మాత్రమేగాక గుండెకాయ కూడా యోగి ఇష్టానుసారం కొట్టుకునేటట్లు చేయవచ్చును.

7. ధ్యానం: యోగసాధనకూ హేతువాదానికీ వ్యతిరేకత ఏమీ లేదు.

శ్లో॥ "ఇంద్రియాణి పరాణ్యాహుః । ఇంద్రియేభ్యః పరం మనః,
మనసస్తు పరా బుద్ధిః । యో బుద్ధేః పరతస్తు సః. (భగవద్గీత - 23-42)"

దేహం కంటె ఇంద్రియాలు గొప్పవి. ఇంద్రియాలకంటె మనస్సు గొప్పది. బుద్ధి మనస్సు కంటె శ్రేష్ఠం. అయితే బుద్ధికంటె గొప్పది ఆత్మ.

మానవబుద్ధికి అతీతమైన అంశాలు ఏ విధంగా గ్రహించాలి? అది యోగసాధన వల్లనే సాధ్యం. జంతువులకు తార్కికమైన బుద్ధి ఉండదు. జంతువులకు మనస్సు మాత్రమే ఉంటుంది. హేతువాద తర్కం ఆగిపోయే చోటు నుండి, సమ్యక్ స్ఫూర్తి ప్రారంభిస్తుంది. ఈ అనుభూతి ధారణవలన చేకూరుతుంది. మౌన ప్రబోధం వాక్ ప్రకర్షకంటె గొప్పది. గురువు మౌనమే వ్యాఖ్యాన భరితం అవుతుంది.

8. సమాధి: యోగసాధనలో తుది మెట్టు సమాధి. నిర్వికల్ప సమాధి ఏర్పడిన పిదప - యోగి చైతన్యసముద్రుడే. ధారణ, ధ్యాన, సమాధులు మూడింటిని కలిపి సంయమం అని పేరు పెట్టారు యోగులు. సంయమ చిత్తవృత్తులు నిరోధించిన పిదప యోగి తరంగాలు లేని సచ్చిదానంద సముద్రుడు, జీవన్ముక్తుడు. ప్రతి అధ్యాయం చివర- ఉపనిషద్ విద్యగా- యోగశాస్త్రంగా భగవద్గీత అభివర్ణితం. భగవద్గీత ప్రోక్త శ్రీకృష్ణుడు యోగీశ్వరుడు.

అర్జునుఁడు శ్రీకృష్ణుని విశ్వరూపంబు గనుంగొని స్తుతించుట (సం. 6-33-5)

సీ. 'దేవ! నీదగు దివ్యదేహంబునందు సు । రాసురగంధర్వ్వ లాది గాఁగఁ
గల దేవమౌనులుఁ గమలాసనుండును । సచరాచరం బైన జగము నాకు
దోఁచె; మొగంబులు దోర్దండములును బా । దములుఁ గన్నులు ననేకములు గంటి,
మకుటాది భూషణనికరంబుఁ జక్రగ । దాద్యాయుధములు మాల్యాంబరములుఁ

ఆ. బెక్కు గానవచ్చె; నక్కజమై యిది । నడుము మొదలు తుది యనంగ రాదు;
తేజ మప్రమేయదేదీప్యమాన ని । ర్వికృతి మహిమ దుర్నిరీక్ష మయ్యె. 211

ప్రతిపదార్థం: దేవ!= ఓ పరమాత్మా! శ్రీకృష్ణా!; నీది+అగు+దివ్య+దేహంబునందున్= నీదైన అతిలోకశరీరంలో; సుర+అసుర, గంధర్వులు+ఆది, కాఁగన్= వేల్పులు, రాక్షసులు, గంధర్వులు మొదలైనవారు; కల= ఉన్నట్టి; దేవ+మౌనులు= దేవతా ఋషులు; కమల+ఆసనుండును= పద్మం ఆసనంగా గలవాడు- బ్రహ్మదేవుడును; స+చర+అచరంబు+ఐన= కదిలేది కదలలేనట్టి వాటితో

కూడిన; జగము= ప్రపంచం; నాకున్= నాకు; తోఁచెన్= కన్పించింది; మొగంబులు= ముఖాలు; దోర్దండములున్= భుజస్కంధాలు; పాదములున్= చరణాలు; కన్నులున్= నేత్రాలు; అనేకములు= పెక్కు; కంటిన్= చూచాను; మకుట+ఆది, భూషణ, నికరంబున్= కిరీటాలు మున్నగు అలంకారాల సముదాయాలూ; చక్ర, గదా+ఆది+ఆయుధములు= చక్రములు గదలు మొదలగు యుద్ధపరికరాలు; మాల్య+అంబరములు= పూలదండలు వస్త్రాలు; పెక్కు= ఎన్నో; అక్కజము+ఐ= ఆశ్చర్యాన్ని కలిగిస్తూ; కానవచ్చెన్= కన్పించాయి. ఇది= ఇది; నడుము= మధ్యది; మొదలు= మొదటిది; తుది= చివర ఉన్నట్టిది; అనంగన్+రాదు= చెప్పటానికి వీలు లేదు; తేజము= ప్రకాశం; అప్రమేయ, దేదీప్యమాన, నిర్వికృతి, మహిమన్= మితిలేని కాంతితో వెలుఁగొందుతూ మార్పులేని గొప్పదనంతో; దుర్నిరీక్షము+అయ్యెన్= చూడటానికి అలవి కానిది అయింది.

తాత్పర్యం: 'ఓ పరమాత్మా! శ్రీకృష్ణా! లోకాతీతమైన నీ శరీరంలో, దేవతలు రాక్షసులు గంధర్వులు మొదలైన వారూ, దివ్యమునులు, బ్రహ్మదేవుడు, చరాచరమైన సర్వప్రపంచం నాకు కనిపించింది. మొగాలు, భుజాలు, పాదాలు, కన్నులు ఎన్నో కన్పించాయి. కిరీటాలు మున్నగు ఆభరణాలు, చక్రం గద మొదలైన ఆయుధాలు, రకరకాల పూలదండలు, వస్త్రాలు కన్పించాయి. ఆశ్చర్యంలో మునిగి తేలాను. నీ దివ్య దేహమునకు మొదలు ఏదో మధ్య ఏదో, తుది ఏదో నాకు తెలియలేదు. నీ తేజస్సు మితిలేనిది. ఊహకు అతీతం. దేదీప్యమానం, ఎల్లప్పుడు వెలుగొందేది. నాకు చూడటానికి అలవి కాకుండా ఉన్నది.

విశేషం: గంధర్వులు, దేవతలలో ఒక తెగవారు. సంగీతప్రియులు.

క. జగములకు నాది కారణ । మగు పరమజ్ఞేయ మీవ యని కనియెద భూ
గగనదిగంతర మంతయు । నగణితమూర్తీ! భవన్మయం బై తోఁచెన్. 212

ప్రతిపదార్థం: అగణితమూర్తీ!= లెక్కకు మిక్కిలియైన ఆకారం కలవాడా! శ్రీకృష్ణా; జగములకున్= ప్రపంచాలకు; ఆది, కారణము+అగు= మూలహేతువు అగు; పరమ, జ్ఞేయము= చిట్టచివరిగా తెలిసికొదగిన లక్ష్యం; ఈవు+అ= నీవే; అని+కనియెదన్= అని గ్రహిస్తాను; భూ, గగన, దిక్+అంతరము+అంతయున్= భూమి ఆకాశం దిక్కుల మధ్యభాగం అంతా; భవత్+మయంబు+ఐ= నీవే అయి; తోఁచెన్= కన్పించింది.

తాత్పర్యం: 'ఓ శ్రీకృష్ణా! నీ ఆకారం ఏ లెక్కలకు అందేది కాదు. ఈ సమస్త సృష్టికీ మూలకారణం నీవే అని గ్రహించగలిగాను. తెలిసికొనదగింది నీవు మాత్రమే. ఈ భూమి, ఆకాశం దిక్కులు అన్నీ నీ రూపంలో అంతర్భాగాలే.

వ. చంద్రార్కులు లోచనంబులు గాఁ గలిగి దంష్ట్రాకరాళంబులైన నీ ముఖంబులు ప్రజ్వరిల్లుచున్నయవి; నిన్ను రుద్రాదిత్య మరుద్వసువులు ప్రవేశించెదరు; సంఘంబు లై వచ్చి మహామునులు ప్రస్తుతించెదరు సిద్ధసాధ్యవియచ్చరులు వెఱఁగంది వీక్షించెద; రిట్లు దీప్తోగ్రంబగు భవదీయ దివ్యరూపంబు గనుంగొని నాకు విభ్రాంతి వొడమి ధృతి దూలి సుఖంబు వడయ నేరక చిక్కువడి యున్నవాఁడఁ; బ్రసన్నుండ వగుము రక్షింపుము. 213

ప్రతిపదార్థం: చంద్ర+అర్కులు= చంద్రుడూ, సూర్యుడూ; లోచనంబులున్= కన్నులు; కాన్= అగునట్లుగా; కలిగి= ఉండి; దంష్ట్ర, కరాళంబులు+ఐన= కోరలతో భయంకరాలు అయిన; నీ+ముఖంబులు= నీ మొగాలు; ప్రజ్వరిల్లుచున్నవి= దేదీప్యమానంగా వెలుగొందుతున్నవి; నిన్నున్= నిను; రుద్ర+ఆదిత్య, మరుత్, వసువులు= రుద్రుడు, సూర్యుడు, మరుత్తులు, వసువులు ప్రవేశిస్తారు; మహా+మునులు= గొప్ప ఋషులు; సంఘంబులు+ఐ= గుంపులు గూడి; వచ్చి= ఏతెంచి; ప్రస్తుతించెదరు= పొగడ గలరు; సిద్ధ, సాధ్య, వియత్+చరులు= సిద్ధులు సాధ్యులు అనే వేల్పు తెగల వారు ఆకాశంలో సంచరించేవారు;

వెఱగు+అంది= ఆశ్చర్యం పొంది; వీక్షించెదరు= చూస్తారు; ఇట్లు= ఈ విధంగా; దీప్త+ఉజ్జ్వలంబగు= ధగధగలతో వెలుగొందే; భవదీయ+దివ్య+రూపంబు= నీదైన లోకోత్తరమైన ఆకారం; కనుంగొని= చూచి; నాకున్= నాకు; విభ్రాంతి+పొడమి= కలవరపాటు కలిగి; ధృతి+తూలి= ధైర్యం సడలిపోయి; సుఖంబు+పడయన్+నేరన్= సంతోషం పొందలేక; చిక్కుపడి, ఉన్నవాఁడన్= బయటపడలేక కష్టాలలో కూరుకొని ఉన్నాను; ప్రసన్నుండవు+అగుము= సౌమ్యతతో కూడిన దయగల వాడవు కమ్ము; రక్షింపుము= నన్ను కాపాడుము.

తాత్పర్యం: 'శ్రీకృష్ణా! చంద్రుడూ, సూర్యుడూ కన్నులుగా గలిగి నీ ముఖాలు దేదీప్యమానంగా వెలుగొందుతున్నాయి. నీయందు రుద్రులు, ఆదిత్యులు, మరుత్తులు ప్రవేశిస్తున్నారు. గుంపులు గుంపులుగా వచ్చి, మహర్షులు నిన్ను కీర్తిస్తున్నారు. వేల్పులు, సిద్ధులు, సాధ్యులు, ఆకాశంలో చరించేవారు ఆశ్చర్యంతో నిన్ను చూస్తున్నారు. 'లోకోత్తరమైన నీ విశ్వరూపం చూస్తే నాకు మతిపోతున్నది. ధైర్యం సడలింది. భయం వేస్తున్నది. ఇటు అటు కదలలేక మెదలలేక బాధపడుతున్నాను. నీవు దయగలిగి సౌమ్యుడవై నన్ను అనుగ్రహించి కాపాడుము.'

విశేషం: 1. రుద్రులు: శివమూర్తి భేదాలు. వీరు పదకొండుమంది. 1. అజైకపాదుడు 2. అహిర్బుధ్న్యుడు 3. విరూపాక్షుడు 4. సురేశ్వరుడు 5. జయంతుడు 6. బహురూపుడు 7. త్ర్యంబకుడు 8. అపరాజితుడు 9. వైవస్వతుడు 10. హరుడు 11. రుద్రుడు.

2. సాధ్యులు - పన్నిద్దరు గణదేవతలలో ఒక తెగ. సిద్ధులు- అణిమాది సిద్ధులుగల వారు; దేవతలలో ఒక తెగవారు.

చ. అనలజ్వాలలు పర్వు నీ ముఖములం దా ధార్తరాష్ట్రవ్రజం
బును భీష్మాదులు నిద్దెసం గలుగు నీ భూపాలలోకంబు గ్ర
క్కున నొక్కుమ్మడి వచ్చి చొచ్చెదరు; నాకుం జెప్పవే యెవ్వరో
యని శంకించెద నిన్ను భూరికరుణాయత్తైకచిత్తుండవై.' 214

ప్రతిపదార్థం: అనల+జ్వాలలు= అగ్నిమంటలు; పర్వు= వ్యాపించే; నీ+ముఖములందున్= నీమొగాల యందు; ఆ+ధార్తరాష్ట్ర వ్రజంబును= ఆ దుర్యోధనాదుల సముదాయమూ; భీష్మ+ఆదులున్= భీష్ముడు మొదలైనవారూ; ఈ+దెసన్+కలుగు= ఈ వైపున ఉన్న (పాండవ పక్షంలోని); భూపాల+లోకంబు= రాజుల సమూహం; గ్రక్కునన్= వెంటనే; ఒక్కుమ్మడిన్= ఏకంగా కలిసి; వచ్చి= వచ్చి; చొచ్చెదరు= ప్రవేశిస్తున్నారు; నిన్నున్+ఎవ్వరో+అని, శంకించెదన్= నీవు ఎవరవా అని సందేహిస్తున్నాను; భూరి, కరుణా+ఆయత్త+ఏక+చిత్తుండవు+ఐ= గొప్ప దయతో కూడిన మనస్సుగలవాడవై; నాకున్+చెప్పవు+ఏ= నాకు తెలియజేయవా.

తాత్పర్యం: శ్రీకృష్ణా! అగ్నిజ్వాలలు నీ ముఖాలలోనుండి వెలువడుతున్నాయి. ఆ వైపున ఉన్న దుర్యోధనుడు మున్నగు వారలేగాక, ఈ వైపున ఉన్న రాజులు గుంపులు గుంపులుగా వచ్చి నీ ముఖంలో ప్రవేశించి ప్రగ్గుతున్నారు. నీవు ఎవ్వరవో అని నేను సందేహిస్తున్నాను. అధిక, కరుణ గలిగిన చిత్తంగలవాడవై అసలు నీ వెవ్వరో నాకు చెప్పవా?

విశేషం: 1. ఈ పద్యంలో అర్జునుడు తన దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నాడు. ఇది మత్తేభవృత్తం. 'భూరికరుణాయత్తైకచిత్తుండవై' అనే ఆ సమాసంలోని గంభీర గమనం - అక్షరాల పరిధిని దాటిన మహత్వాన్ని ప్రతిబింబిస్తున్నది.

వ. అనవుడు నప్పరమేశ్వరుం 'డేను లోకక్షయకర్త యగు కాలుండ; నిచ్చో జనసమాజ సమాహరణంబునకుఁ
బ్రవృత్తుండ నైతి; నీవు సంపవలయు, నని లే; దీ గురుభీష్మాదు లెట్లును లేకుండువార; నాచేతం జచ్చిన వీరి
నెల్లను జయించినవాఁడ వగుటకు నిమిత్తమాత్రమ్ము గమ్ము; లెమ్ము! రాజ్యమ్ము గైకొను!' మనిన విని వడవడ
వడంకుచుం జేతులు మొగిడ్చి గద్గదకంఠంబుతో గాండీవి యిట్లనియె. 215

ప్రతిపదార్థం: అనవుడున్= అని (అర్జునుడు) చెప్పగా; ఆ+పరమ+ఈశ్వరుండు= ఆ పరమాత్మ (శ్రీకృష్ణుడు); ఏను= నేను; లోక, క్షయ, కర్త, అగు, కాలుండన్= లోకాలను నాశనం చేసేటటువంటి యముడను; ఈ+చోన్= ఈచోట (ఈ కురుక్షేత్ర సంగ్రామరంగంలో); జన, సమాజ, సమాహరణంబునకున్= మనుజుల గుంపుల వినాశానికి; ప్రవృత్తుండన్+ఐతిన్= పూనుకొనిన వాడను అయ్యాను; ఈవు= ఓ అర్జునా! నీవు; చంపవలయున్+అని+లేదు= సంహరించాలని లేదు; ఈ+గురు, భీష్మ+ఆదులు= ఈ గురువుగారైన ద్రోణుడు భీష్ముడు మున్నగువారు; ఎట్లును= తప్పకుండా ఏదో రీతిగా; లేకుండు వారు+అ= ఉండకుండా పోయేవారే; నా చేతన్= నా చేతనే; చచ్చిన= మరణించిన; వీరిన్+ఎల్లన్= వీరందరినీ; జయించినవాడవు+అగుటకున్= గెలిచినట్లు కనిపించే వాడవు అవటానికి; నిమిత్తమాత్రుండవు+కమ్ము= (పైకి కనిపించే) కారణానివి కావలసింది; లెమ్ము= లే (యుద్ధం చేయుము); రాజ్యమ్మున్= పరిపాలించే భూమిని; కైకొనుము= స్వీకరించుము; అనినన్+విని= అని శ్రీకృష్ణుడు చెప్పగా ఆలకించి; గాండీవి= అర్జునుడు (గాండీవం కల వాడు); వడవడ+వడంకుచున్= గజగజ కంపిస్తూ; చేతులు+మొగిడ్చి= చేతులు జోడించి నమస్కరించి; గద్గద+కంఠంబుతోన్= డగ్గుత్తిక వడిన గొంతుకతో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అర్జునుడు ఆ విధంగా చెప్పగా, పరమాత్మ అయిన శ్రీకృష్ణుడు అతడితో ఈ విధంగా పలికాడు. 'నేను లోకాల నన్నిటినీ నాశనం చేసే యముడను సుమా.'' ఇప్పుడు ఈ కురుక్షేత్ర సంగ్రామ రంగంలో ఈ జనసందోహాన్ని సంహరించటానికి ఉద్యుక్తుడను అయ్యాను. నీవు చంపుతున్నట్లు భ్రమలో పడనవసరం లేదు. ఈ ద్రోణుడు భీష్ముడు మొదలైన వారు అందరూ అవశ్యం చావవలసిందే. నేను చంపే వీరిని అందరినీ నీవు చంపినట్లుగా కనిపించి విజయం గైకొని, రాజ్యాన్ని ఏలుకొమ్ము. నీవు నిమిత్తమాత్రుడవు సుమా! లే. ఇక యుద్ధం చేయుము.'' ఆ మాటలు ఆలకించి, అర్జునుడు వడవడ వణకుతూ చేతులు జోడించి శ్రీకృష్ణుడికి నమస్కారం చేసి, డగ్గుత్తికవడ్డ గొంతుతో ఈ విధంగా అన్నాడు.

తే. అంబు పవమాన సూర్య చంద్రానలాది । వివిధ తత్త్వంబులును నీవ; విశ్వలోక
సంప్రవర్తనకరుఁడవు శాశ్వతుండ । వచ్యుతుండవు పుండరీకాక్ష! నీవు. 216

ప్రతిపదార్థం: పుండరీక+అక్ష!= తెల్లని పద్మాలవంటి కన్నులు కలవాడా! శ్రీకృష్ణా!; నీవు; అంబు, పవమాన, సూర్య, చంద్ర+అనల+ఆది, వివిధ తత్త్వంబులును= నీరు, గాలి, సూర్య, చంద్ర, అగ్ని, మొదలైన పెక్కురూపాలు (యాథార్థ్యాలు); నీవు+అ= నీవే; విశ్వలోక, సంప్రవర్తన, కరుఁడవు= సర్వ లోకాలను నడపేవాడవు; శాశ్వతుండవు= ఎల్లప్పుడూ ఉండేవాడవు; అచ్యుతుండవు= పతనం లేని విష్ణుడవు.

తాత్పర్యం: తెల్లని తామరపూవుల వంటి కన్నులు గల శ్రీకృష్ణా! నీరు, గాలి, సూర్యచంద్రులు, అగ్ని మున్నగు తత్త్వాలన్నీ నీవే. అన్ని లోకాలను నడిపేవాడవు నీవే. నీవు ఎల్లప్పుడు ఉండేవాడవు. ఎన్నడూ పతనం లేని వాడవు.

విశేషం: తత్త్వములు: అనగా సత్యాలు: యథాస్థితాకారాలు. సృష్టికి ప్రథమావయమైన ప్రకృతి మొదటి పదార్థం. 'భిన్నమతాలు' 'తత్వాలను' భిన్నభిన్నాలుగా ప్రతిపాదించాయి.

మతాలు	తత్త్వములు
1.బౌద్ధం	శూన్యం
2. చార్వాకులు	పృథివి, నీరు, తేజస్సు, వాయువు
3. అర్హతులు-ఒక వర్గం	జీవం, అజీవం
4. అర్హతులు- ఇంకో వర్గం	జీవం, ఆకాశం, ధర్మం, అధర్మం, పుర్గలం

5. అర్హతులు - ఒక వర్గం	జీవం, అజీవం, అస్రతం, బంధం, సంవదం, నిర్జరం, మోక్షం
6. ద్వైతం	స్వతంత్రం, అస్వతంత్రం
7. విశిష్టాద్వైతం	చిత్తు, అచిత్తు, ఈశ్వరుడు
8. పాశుపతులు	పశువు, పరి, పాశం
9. సాంఖ్యం	అవ్యక్తం, బుద్ధి, అహంకారం, పంచతన్మాత్రలు, పంచభూతాలు, ఏకాదశేంద్రియాలు, ఆత్మ.
10. యోగులు	సాంఖ్యుల 25 తత్వాలు + ఈశ్వరుడు, వెరసి 26
11. అద్వైతం	బ్రహ్మం

పలువురు తాత్వికులు పెక్కు తత్వాలను ప్రతిపాదించారు.

క. నిను నెఱుఁగకుండి యాదవుఁ ; డని సఖుఁడని మేనబావ యని యే సహభో
జనములు సల్లాపంబులు ; నొనరించుచు మేలమాడుచుండుదు నెపుడున్. 217

ప్రతిపదార్థం: నినున్= నిన్ను (ఓ శ్రీకృష్ణా! నిన్ను); ఎఱుఁగకుండి= తెలియక; యాదవుఁడు+అని= యదువంశీయుడవు అని; సఖుఁడు= మిత్రుడు; అని= అనీ; మేనబావ+అని= మేనత్త కొడుకు అనీ; ఏన్= నేను; సహభోజనములు= కలిసి ఆహారం స్వీకరించటం; సల్లాపంబులున్= పరస్పర సంభాషణలు; ఒనరించుచున్= చేస్తూ; ఎపుడున్= ఎల్లప్పుడు; మేలము+ఆడుచుండుదున్= వేళాకోళం చేస్తూ ఉంటాను.

తాత్పర్యం: ఓ శ్రీకృష్ణా! పరమాత్మా! నిను తెలియక యదువంశంలో జన్మించిన మానవమాత్రుడిగా, స్నేహితునిగా, మేనబావగా భావించి, కలిసి తిండి తినటం, వేళాకోళం ఆడటం చేశాను. నన్ను క్షమించుము.

తే. మఱియుఁ బెక్కులు లోకసామాన్యభంగు ; లాచరించితి నీదెస, నంతవట్టుఁ
దల్లిదండ్రులు ప్రజలకుఁ దప్పుదారు ; లెల్ల సైరించునట్లు సహింపవలయు.' 218

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకా; పెక్కులు= ఎన్నో; లోక+సామాన్య+భంగులు=లోకంలో సాధారణంగా జరిగే రీతులు; నీదెసన్= నీ యెడల; ఆచరించితిన్= చేశాను; అంత+పట్టున్= వాటిని అన్నిటినీ; తల్లిదండ్రులు= మాతాపితలు; ప్రజలకున్= కన్నబిడ్డలకు; తప్పు+దారులు+ఎల్లన్= దోషముల తీరులు అన్నీ; సైరించునట్లు= క్షమించేటట్లుగా; సహింపన్‌వలయున్= క్షమించవలసింది.

తాత్పర్యం: శ్రీకృష్ణా! నీ యెడ నేను ఎన్నో తప్పులు చేశాను. వాటిని అన్నిటినీ తల్లిదండ్రులు తమ బిడ్డలు చేసే తప్పులను క్షమించేటట్లుగా క్షమించ ప్రార్థన.'

వ. అని సంప్రార్థనంబు సేసి పార్థుండు వెండియు నిట్లను 'నదృష్టపూర్వం బైన భవదీయరూపంబు గనుంగొనం
బడయుటం బ్రమోదంబును, బిట్టు చూచిన వెక్కసంబును, హృదయవ్యథయునుం బుట్టియున్నయది;
నీతొంటి సౌమ్యాకారంబు గైకొని నిలిచి నాకు నాహ్లాదంబు సేయుము.' 219

ప్రతిపదార్థం: అని, సంప్రార్థనంబు+చేసి= అని హృదయపూర్వకంగా ప్రార్థించి; పార్థుండు= అర్జునుడు; వెండియున్= మరల; ఇట్లు+అనున్= ఇట్లా అన్నాడు; అదృష్ట పూర్వంబు+ఐన= ఇంతవరకు చూడబడనట్టి; భవదీయ+రూపంబున్= నీ ఆకృతిని; కనుంగొనన్+పడయుటన్= చూడటం చేత; ప్రమోదంబును= సంతోషమూ; బిట్టు+చూచిన్= ఎక్కువగా చూచిన; వెక్కసంబును= సహింపరాని స్థితియు; హృదయ+వ్యథయును= గుండెలోని బాధయూ; పుట్టి+ఉన్న+అది= కలిగింది; నీతొంటి+సౌమ్య+ఆకారంబున్=

మొదటినుండీ ఉన్న నీ శాంతమైన ఆకృతిని; కైకొని= స్వీకరించి; నిలిచి= నిలబడి; నాకున్= నాకు; ఆహ్లాదంబు+చేయుము= ఆనందాన్ని కలిగించుము.

తాత్పర్యం: అర్జునుడు ఆ రీతిగా శ్రీకృష్ణుడిని ప్రార్థించి, ఇంకా ఈ రీతిగా అన్నాడు: 'శ్రీకృష్ణా! లోగడ నేను చూడని నీ విశ్వరూపాన్ని చూచి ఆనందించాను. కాని ఎక్కువ సేపు చూస్తే భరించలేని బాధ కలుగుతుంది. కాబట్టి, ఎప్పటి రీతిగా నీ శాంతస్వరూపం ధరించి నాకు సంతోషం చేకూర్చుమని నిన్ను మరల వేడుకొంటున్నాను.'

చ. అనుడు దయార్ద్రచిత్తుఁ డగు నప్పరమేశ్వరుఁ డక్కిరీటి కి
ట్లనుఁ 'దపమాచరించి నిగమాధ్యయనం బొనరించి కానరా
దనఘ! మదీయదివ్యపరమాకృతి; పేర్చిన ఏకభక్తి భా
వమునఁ దోఁచు; దీని జనవర్గము గానదు; నీక చూపితిన్. 220

ప్రతిపదార్థం: అనుడున్= అని (అర్జునుడు) చెప్పగా; దయా+ఆర్ద్ర, చిత్తుడు+అగు= దయతో తడిసిన మనస్సు కలవాడు అయిన; ఆ+పరమ+ఈశ్వరుఁడు= ఆ పరమాత్మ- శ్రీకృష్ణుడు; ఆ+కిరీటికిన్= ఆ అర్జునుడికి; ఇట్లు+అనున్= ఈ విధంగా అన్నాడు; తపము+ఆచరించి= తపస్సు చేసి; నిగమ+అధ్యయనంబు+ఒనరించి= వేదాలు చదివి; అనఘ!= ఓ పాపరహితుడైన అర్జునా!; మదీయ, దివ్య, పరమ+ఆకృతి= నాదైన లోకాతీతమైన గొప్ప ఆకారం; కానన్‌రాదు= దర్శింపవీలుగాదు; పేర్చిన= అతిశయించిన; ఏక+భక్తి+భావమునన్= ఏకాంత భక్తిపూర్వకమైన తలంపుతో; తోఁచున్= కన్పిస్తుంది; దీనిన్= ఈ నా విశ్వరూపాన్ని; జన+వర్గము= జనసందోహం; కానదు= చూడలేదు; నీకున్+అ= నీకు మాత్రమే; చూపితిన్= చూపించాను.

తాత్పర్యం: అర్జునుడు ఆ మాటలు పలుకగా, దయతో నిండిన చిత్తం కలవాడై శ్రీకృష్ణ పరమాత్మ ఆతడితో ఈ విధంగా చెప్పాడు: 'వేదాలు పఠించిన విద్వాంసులుగానీ కఠోర తపస్సులు చేసిన మహర్షులుగానీ సమాహిత భక్తిభావంతో మాత్రమే చూడగలిగిన నా విశ్వరూపాన్ని సాధారణ జనులు దర్శించలేదు. నీకు మాత్రమే చూపాను.

వ. నీకు హృదయవ్యథం బొంద నేల? మూఢత్వంబు విడిచి విగతభయుండ వై సంప్రీతచేతస్కుండవు గ'
మ్మని చెప్పి పూర్వప్రకారరూపంబు దాల్చి నిల్చినం గనుంగొని , కౌంతేయుం డా సౌమ్యరూపంబు సూచి
'సచేతనత్వంబు నొందితిఁ బ్రకృతిస్థుండ నైతి, నని పలుకుటయు, వాసుదేవుండు 'మత్కర్మపరుండును
మద్భక్తుండును నైనవానికి నన్నుఁ బడయవచ్చు' నని యతని నాశ్వాసించి. 221

ప్రతిపదార్థం: నీకున్= ఓ అర్జునా నీకు; హృదయ, వ్యథన్+పొందన్+ఏల?= మనసులో బాధ అనుభవించనేల?; మూఢత్వంబు+విడిచి= బుద్ధిమాంద్యం వీడి; విగత, భయుండవు+ఐ= పోయిన భీతి గల వాడవై; సంప్రీత, చేతస్కుండవు, కమ్ము= సంతోషంతో కూడిన మనస్సు గలవాడవుగా మారుము; అని చెప్పి= అని పలికి; పూర్వప్రకారరూపంబున్+తాల్చి= మునుపటి రూపం ధరించి; నిల్చినన్= నిలబడగా; కనుంగొని= చూచి; కౌంతేయుండు= కుంతీ కుమారుడు - అర్జునుడు; ఆ+సౌమ్య, రూపంబు+చూచి= ప్రశాంతంగా కనిపించే ఆ ఆకారం చూచి; సచేతనత్వంబున్+ఒందితిన్= కదలికతో కూడిన వాడను అయినాను; ప్రకృతిస్థుండన్+ఐతిన్= సహజస్థితిని పొందాను; అని+పలుకుటయున్= అని చెప్పగా; వాసుదేవుండు= వసుదేవుడి కొడుకు- శ్రీకృష్ణుడు; మత్+కర్మపరుండును= నాదైన కర్మలు చేసేవాడున్నూ (అనగా నాకు ఇష్టమైన సత్‌క్రియలు చేసేవాడును); మత్+భక్తుండును= నా భక్తుడైన వాడున్నూ (నన్ను ప్రేమతో ఆరాధించే వాడూ); ఐనవానికిన్= ఐనట్టివానికి; నన్నున్+పడయన్+వచ్చున్= నన్ను పొందవచ్చును (మోక్షం అందుకొనవచ్చును); అని= అని; అతనిన్= అర్జునుడిని; ఆశ్వాసించి= ఓదార్చి.

తాత్పర్యం: 'ఓ అర్జునా! నీవు బాధపడవద్దు. ఆ అవసరం లేదు. నీ అజ్ఞానాన్ని విడిచిపెట్టి భయంలేనివాడవై, ఆనందం పొందిన వాడవై ఉండుము' అని శ్రీకృష్ణుడు చెప్పి, వెనుకటి ఆకారం ధరించి, ప్రశాంతమూర్తిగా కన్పించాడు. ఆ సౌమ్య స్వరూపం చూచి, అర్జునుడు ఈ విధంగా అన్నాడు. 'ఓ శ్రీకృష్ణా! నీ విశ్వరూపం చూచినప్పుడు నేను కొయ్యబారిపోయాను. ఇప్పుడు ఆ భయం పోయింది. నేను తిరిగి యథాప్రకారంగా కదలిక మెదలిక కల మనిషిని కాగలిగాను.' అర్జునుడు చెప్పిన ఆ మాటలు విని, శ్రీకృష్ణుడు అతడిని ఓదార్చి ఈ విధంగా చెప్పాడు. 'నాకు ఇష్టమైన మంచి పనులు చేసేవాడూ. నాకు భక్తుడు అయినవాడూ నన్ను పొందగలడు.'

విశేషం: 1. మద్భక్తుండు అని మాత్రమేగాక, మత్ కర్మపరుండును అని శ్రీకృష్ణుడు చెప్పాడు. అనగా కర్మయోగం - భక్తియోగం వేరుకావని - రెండూ కలిసే ఉంటాయని శ్రీకృష్ణుడి సందేశం.

తే. అతఁడు మఱియును బ్రహ్మవిద్యాన్వయమునఁ । దనకు సందిగ్ధ మైనట్టి దాని నెల్ల
నడుగఁగా నమ్మహాత్ముఁ డత్యంతకరుణఁ । దెలియఁ జెప్పుచు హృదయసంచలత మాన్చె. 222

ప్రతిపదార్థం: అతఁడు= శ్రీకృష్ణుడు; మఱియును= ఇంకా; బ్రహ్మ+విద్యా+అన్వయమునన్= పరమాత్మకు సంబంధించిన జ్ఞానాన్ని అనుసంధించటంలో; తనకున్= అర్జునునకు; సందిగ్ధము+ఐనట్టి+దానిన్+ఎల్లన్= సందేహములు ఏర్పడిన వాటిని అన్నింటినీ; అడుగఁగాన్= ప్రశ్నింపగా; ఆ+మహా+ఆత్ముడున్= ఆ మహాత్ముడు- గొప్ప ఆత్మగలవాడు; అత్యంత+కరుణన్= మిక్కిలి దయతో; తెలియన్+చెప్పుచున్= వివరించి చెప్పుతూ; (అర్జునుడి) హృదయ+సంచలతన్= హృదయానికి సంబంధించిన కలతను; మాన్చెన్= పోగొట్టాడు.

తాత్పర్యం: అంతేకాక, శ్రీకృష్ణుడు ఆధ్యాత్మిక విజ్ఞానాన్ని అర్జునుడికి బోధించాడు. అర్జునుడికి కలిగిన సందేహాలను అతడు అడుగగా, ఆ సందేహాలు అన్నిటినీ పోగొట్టాడు. అర్జునుడి గుండెలో ఉన్న కలతను పోగొట్టాడు.

విశేషం: 1. ఈ పద్యం వలన తిక్కన భగవద్గీతను సంక్షేపించినట్లు సుస్పష్టం.

2. 'బ్రహ్మవిద్యా+అన్వయమున' అనే ప్రయోగం గమనించదగ్గది. స్థూల దృష్టికి భగవద్గీతలోని వాక్యాలలో విప్రతిపత్తి కన్పించవచ్చును. సూక్ష్మదృష్టితో పరిశీలిస్తే ఆ వైరుద్ధ్యాలు తొలగిపోతాయి. అర్జునుడికి శ్రీకృష్ణుడు ఉపదేశించింది - బ్రహ్మవిద్య మాత్రమేకాదు. 'అన్వయం'గూడ. ఈ వాక్యంలోని నిష్ఠ, విద్య మీదగాక 'అన్వయం' మీద ఉన్నది.

వ. ఇవ్విధంబునఁ బార్థున కుపనిషదర్థజాతం బవగతంబు సేసి, మనసుకసటు వాపి, వివేకంబునకుం జేవ గలిగించి కృష్ణుం 'డీ గుహ్యతరజ్ఞానం బుపదేశించితి; దీని నెఱింగికొని నీ కెట్లు సూడం బోలె నట్లు ప్రవర్తింపు మను పలుకు పలికి, యింతకంటెం బరమరహస్యం బొక్కటి సెప్పెద వినుఁ' మని యతని కిట్లనియె. 223

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ రీతిగా; పార్థునకున్= అర్జునుడికి; ఉపనిషత్+అర్థ+జాతంబు= ఉపనిషత్తులకు సంబంధించిన భావ సముదాయం; అవగతంబు+చేసి= వివరించి చెప్పి; మనసు+కసటు+పాపి= మనస్సులోని సందేహాలు అన్నీ తీర్చి; వివేకంబునకున్+చేవ కలిగించి= ఆత్మజ్ఞానానికి గట్టిదనం కలిగించి; కృష్ణుండు= శ్రీకృష్ణుడు; ఈ+గుహ్య, తర, జ్ఞానంబు= మిక్కిలి రహస్యమైన జ్ఞానాన్ని; ఉపదేశించితిన్= తెలియచేశాను; దీనిన్= ఈ రహస్య జ్ఞానాన్ని; ఎఱింగికొని= తెలిసికొని; నీకున్+ఎట్లు= నీకు ఏరీతిగా; చూడన్+పోలెన్= కనిపిస్తుందో; అట్లు= ఆ రీతిగా; ప్రవర్తింపుము= ఆచరించుము; అను+పలుకు+పలికి= అను మాటలు చెప్పి; ఇంత కంటెన్= దీని కంటెను; పరమ+రహస్యంబు= గొప్పదైన రహస్యం; ఒక్కటి+చెప్పెదన్= ఒకటి చెప్పగలను; వినుము+అని= ఆలకింపుము అని; అతనికిన్= అర్జునుడికి; ఇట్లు+అనియెన్= ఈ రీతిగా చెప్పాడు.

తాత్పర్యం: ఈ రీతిగా అర్జునుడికి ఉపనిషత్తులలోని సారం అనదగిన సందేశం అందించి, శ్రీకృష్ణుడు ఇట్లా చెప్పాడు. 'ఓ అర్జునా! నీకు మిక్కిలి రహస్యమైన జ్ఞానాన్ని అందించాను. నీవు ఈ సందేశాన్ని అవగాహన చేసికొని, నీకు నచ్చిన రీతిగా ప్రవర్తించుము. ఇంకో మాట. ఇంత కంటె గూడ గొప్ప రహస్యం ఒకటి ఉన్నది. దానిని చెప్పగలను. జాగ్రత్తగా ఆలకించుము.

విశేషం: వివేకం= రెండు వస్తువుల సూక్ష్మభేదం గుర్తించి వేరుపరచటం; ఆత్మ- అనాత్మ భేదం తెలుసుకొనటం, మిథ్యా ప్రపంచం నుండి పరమాత్మను వేరుగా గుర్తించటం.

తే. ' క్రందుకొను సర్వధర్మవికల్పములను । నెడల విడిచి దృఢంబుగ నే నొకండ
శరణముగ నాశ్రయింపుము సకలదురిత । ములకుఁ దొలఁగింతు నిన్నుఁ బ్రమోద మొంద. 224

ప్రతిపదార్థం: క్రందుకొను= గుమిగూడే; సర్వ+ధర్మ+వికల్పములను= అన్ని ధర్మాల ప్రత్యామ్నాయాలను; ఎడలన్+విడిచి= తొలగునట్లుగా విడిచిపెట్టి; దృఢంబుగన్= గట్టిగా- ఏకైక దీక్షతో; ఏన్+ఒకండన్= నేను ఒకడను మాత్రమే; శరణముగన్= ఏకైక రక్షణగా; ఆశ్రయింపుము= ఆధారంగా చేసికొనుము; నిన్నున్= నిన్ను; సకల, దురితములకున్= అన్ని పాపాలకు; ప్రమోదము+ఒందన్= సంతోషం చెందేటట్లుగా; తొలఁగింతున్= పోగొట్టగలను.

తాత్పర్యం: 'ఓ అర్జునా! ఇది అన్నిటిని మించినట్టి గొప్ప సందేశం. ఆలకించుము. ధర్మాలు ఎన్నో ఉండవచ్చును. ధర్మాలకు ప్రత్యామ్నాయాలు ఉండవచ్చును. వాటిని అన్నిటినీ వదలిపెట్టి, రక్షించేవాడను నేను ఒకడనే అని నమ్మి నన్ను శరణుపొందుము చాలు. నీ పాపాలు అన్నీ పోగొట్టి నీకు సంతోషం చేకూర్చగలను.

విశేషం: 1. ఈ పద్యానికి భగవద్గీతలో- మాతృక అనదగిన సంస్కృత శ్లోకం ఇది.

శ్లో॥ 'సర్వధర్మాన్ పరిత్యజ్య । మా మేకం శరణం వ్రజ,
అహం త్వా సర్వపాపేభ్యో । మోక్షయిష్యామి మా శుచఃʼ.(భ.గీ. 18-66)

దీనికి లోకంలో చరమశ్లోకం అని ప్రఖ్యాతి ఏర్పడింది. ఈ శ్లోకంతో గీతా సందేశం సమాప్తి అవుతుంది.

మూల సంస్కృత శ్లోకంలో. సర్వ ధర్మాన్ పరిత్యజ్య; అన్ని ధర్మాలనూ పరిత్యజించి అని ఉన్నది. తిక్కన తెలుగుసేతలో వ్యాఖ్యాన ప్రాయంగా (క్రందుకొను) సర్వధర్మ వికల్పములను విడిచిపెట్టుమని ఉన్నది. భగవద్గీతా సందేశంలో ఎన్నో ధర్మాలు క్రందుకొని కన్పిస్తాయి. భగవద్గీత - ఏకైక ధర్మాన్ని ప్రబోధించలేదు. ధర్మం వైకల్పికము - అని భగవద్గీత ప్రబోధిస్తున్నది. అందుచేతనే సాంఖ్యయోగం, కర్మయోగం, జ్ఞానయోగం, కర్మ సన్న్యాసయోగం, ఆత్మసంయమయోగం మొదలైనవి ఎన్నో ఉన్నాయి. సంసారతరణోపాయాలు ఎన్నోఉన్నాయి. చిట్టచివరకు శ్రీకృష్ణ పరమాత్మ అందించిన సందేశం 'సరే, తరణోపాయాలు ఎన్నో చెప్పాను కదా. అవి అన్నీ ఆచరణీయాలే. అయితే, ఏ కారణం చేతనైనా నీవు వాటిని వేటినీ ఆచరించలేకపోతే దిగులుపడ నవసరం లేదు. అందరకూ సులభ సాధ్యమైన ఒక ఉపాయం ఉన్నది. అది శరణాగతి. నన్ను (భగవంతుని) శరణు వేడితే చాలు. నేను నిన్ను పాపాలనుండి విముక్తుడిని చేసి మోక్షం ఇస్తాను.

శాంతిపర్వంలో 'క్రందుకొను ధర్మవికల్పములను' తిక్కన పేర్కొన్నాడు. భీష్ముని ఉపదేశం చివర.

"కొందఱు బ్రహ్మచర్యమునఁ గొందఱు భవ్యగృహస్థ ధర్మముం
బొందుటఁ, గొంద ఱిద్ధ తపమున్ వనభూమిఁ దగం జరించుటం
గొందఱు నిష్క్రియత్వమునఁ, గొందఱు యజ్ఞ విధానశాలితం

గొంద ఱనూన దానమును గోరి యొనర్తురు నిత్య సౌఖ్యమున్."
జననీజనకారాధన । మున గురుభక్తిని సువృత్తమున శాంతిని దాం
తిని సత్యమున నహింసను । విను కాంతురు మోక్షపదము వేర్వేఱ జనుల్" - (శాంతిపర్వం 6 అశ్వా - పద్యం 553) భగవద్గీతలో... శ్రీకృష్ణపరమాత్మ చిట్టచివరకు చెప్పిన మాట 'శరణాగతి'. ఇది భక్తిమార్గం. భక్తి చాలు. భక్తితో సర్వపాపాలు నశించిపోతాయి.

హిందూమతంపై కొందరు పాశ్చాత్యులు చేసే విమర్శ ఒకటి ఉన్నది. 'హిందువులు కర్మ సిద్ధాంతం ప్రతిపాదించారు. మంచి కర్మలు చేస్తే పుణ్యం వస్తుంది. చెడ్డపనులు చేస్తే పాపం వస్తుంది. ఇక దేవుడు చేసేది ఏముంది? జీవుడు హైందవ వేదాంతం ప్రకారం - ఈ కర్మ చక్రబంధంలో సదా పరిభ్రమించవలసిందే అనేక జన్మలు ఎత్తుతూ.''

ఈ చరమ శ్లోకంలో సుస్పష్టంగా చెప్పబడింది. శరణాగతి చేస్తే చాలు భగవంతుడు సర్వపాపాలను పోగొట్టి మోక్షం ప్రసాదించగలడు. వైష్ణవులు ఈ చరమ శ్లోకం గీతా సందేశానికి కేంద్ర గరిమనాభి అని అంటారు. 'ముక్తికి - భక్తి చాలు.' ఇది శ్రీవైష్ణవ వేదాంతం.

విశిష్టాద్వైత మతప్రోక్తయైన రామానుజాచార్యుడు చరమ శ్లోకానికి ప్రత్యేక ప్రాముఖ్యం ఇచ్చారు. అయితే పఠితలు గుర్తుంచుకోవలసిన అంశం - ఇది చరమ శ్లోకమేగాని ప్రథమ శ్లోకమూ కాదు. ఏకైక శ్లోకమూ కాదు.

రామానుజాచార్యుల తరువాత, ఈ భక్తిమార్గం - 1. మార్జాల కిశోర న్యాయం 2. మర్కట కిశోర న్యాయం అని రెండు మార్గాలుగా చీలింది. భగవంతుడే భక్తుడిని తల్లిపిల్లి పిల్లలను మోసికొని పోతుంది మార్జాల కిశోర న్యాయంలో. తల్లికోతి పొట్టకు అంటిపెట్టుకొని చెట్టునుండి ఇంకో చెట్టుకు పోతాయి మర్కట కిశోరాలు.

భగవద్గీత కేవలం శరణాగతికి ఏకాంత భక్తికి మాత్రమే ప్రాముఖ్యం ఇచ్చియుంటే ఈ ఒక్క శ్లోకం చాలు. ఇన్ని అధ్యాయాలు ఇన్ని శ్లోకాలు ఉన్నాయి కదా. ముక్తికి ఎన్నో ఉపాయాలను భగవద్గీత పేర్కొన్నది. 'శరణాగతి' పరమోపాయం అని తిక్కన స్పష్టీకరించి, ఇది అన్నిటి కంటే గొప్ప రహస్యం అని కూడా చెప్పియున్నాడు.

వ. ఇప్పరమోపాయంబు. **225**

తాత్పర్యం: మిక్కిలి గొప్పది అయిన ఈ వెరవు.

క. నియతియుఁ దపమును నా దెస । భయభక్తులు గలిగి నాకు భక్తుం డై ని
శ్చయనిపుణుఁ డయినవానికిఁ । బ్రియమున నెఱిఁగింపు వలదు పెఱవారలకున్.' **226**

ప్రతిపదార్థం: నియతియున్= ఇంద్రియ నిగ్రహమును; తపమును= శరీర క్లేశమునకు జంకక పాటించే ఆధ్యాత్మిక చింతన; నా దెసన్= నా యెడల; భయ+భక్తులు= భీతి గౌరవ పురస్సరమైన ప్రేమ; కలిగి= ఉండి; నాకున్= నాకు; భక్తుండు+ఐ= ఆరాధించేవాడయి; నిశ్చయ+నిపుణుండు+అయిన వానికిన్= దృఢమైన మనస్సు గలవాడికి; ప్రియమునన్= ప్రీతితో; ఎఱిఁగింపుము= ఉపదేశించుము; పెఱ+వారలకున్= ఇతరులకు (అనగా భక్తులు కాని వారలకు); వలదు= ఎరిగించవద్దు.

తాత్పర్యం: ఇంద్రియ నిగ్రహం, నీతినియమాలు గల సౌశీల్యవంతుడు, నా యెడ భక్తి కలిగినవాడికి మాత్రమే నేను నీకు చేసిన ఈ సందేశం అందించుము. అంతేకాని, దృఢమైన మనస్సు లేనివాడికి తదితరులకు ఈ సందేశం వినిపించవద్దు సుమా!

విశేషం: 1. సత్యమూ జగద్విదితమూ అయిన భగవద్గీతా సందేశం రహస్యంగా ఉంచమనటంలో శ్రీకృష్ణుడి ఆంతర్యం ఏమిటి? జిజ్ఞాస లేనివారికి - యోగ్యత లేనివారికి ఈ సందేశం అందించరాదు. ఎందుచేతనంటే- అది నిష్ఫలం కావటం మాత్రమే గాక ప్రమాదాలకు దారితీయవచ్చును.

వ. అని వెండియుఁ బుండరీకాక్షుండు 'నాచెప్పిన యది లెస్సగా నాకర్ణించితే? నీయజ్ఞాన సమ్మోహం బంతయుం బాసెనే?' యనవుడు నర్జునుండు. 227

ప్రతిపదార్థం: అని, వెండియున్= అని చెప్పి - మరల; పుండరీక+అక్షుండు= తెల్లతామర పువ్వుల వంటి కన్నులు గలవాడు - శ్రీకృష్ణుడు; నా+చెప్పిన+అది= నేను చెప్పినట్టిది; లెస్సగాన్= బాగుగా; ఆకర్ణించితి(వి)+ఏ= విన్నావుగదా; నీ, అజ్ఞాన, సమ్మోహంబు= నీ తెలివి లేకుండటం - భ్రాంతి; అంతయున్= సర్వమూ; పాసెను+ఏ?= పోయినదా?; అనవుడున్= అని చెప్పగా; అర్జునుండు= అర్జునుడు.

తాత్పర్యం: అని మరల శ్రీకృష్ణుడు తన సందేశం అందించగా అర్జునుడు విన్నాడు. చివరకు శ్రీకృష్ణుడు అర్జునుడికి ఒక ప్రశ్న వేశాడు. 'అర్జునా! నీకు చెప్పిన విషయాలు అన్నీ విన్నావు గదా. నీ అజ్ఞానం తొలగిపోయిందా? నీ భ్రాంతి అంతా పోయింది కదా!' అని అడిగాడు. అప్పుడు అర్జునుడు ఈ విధంగా చెప్పాడు:

విశేషం: అనవుడు అనగా, నావుడు అనగా అని చెప్పగా అని అర్థం. తెలుగు భారతంలో ఈ పదాలు చాలా చోట్ల ప్రయోగించబడ్డాయి. భారత కథ చాలా భాగం సంభాషణ రూపంలో నడిచింది. 'వైశంపాయనుండు జనమేజయునకు ఇట్లనియె' 'సూతుండు శౌనకాది మహర్షులకు ఇట్లనియె', శ్రీకృష్ణుడు అర్జునుడితో ఇట్లనియె, సంజయుండు ధృతరాష్ట్రునకు ఇట్లనియె - ఈ విధంగా.

అందుచే అనవుడు- నావుడు శబ్దాలు విరివిగా వాడబడ్డాయి. ఇవి డుకారాంతాలుగదా! తెలుగులో "డు" ప్రథమా విభక్తి ప్రత్యయం. పురుషనామాల చివర 'డు' తరచుగా వస్తుంది. ఒక శ్రోత అడిగాడట- "అనవుడుకు నావుడు ఏమౌతాడని'. ఇంకో శ్రోత చెప్పిన సమాధానం- 'అనవుడు నావుడు అన్నదమ్ములు'. ఈ చమత్కార కథ తెలుగు సీమలో ఎక్కువ ప్రచారంలో ఉండేది.

ఉ. ' మోహ తమంబు వాసెఁ; దుది ముట్టిన నీదు ప్రపత్తి వీత సం
దేహుఁడనైతి; గాఢపరిదీప్త మహాకృతిఁ గాంచి బోధ స
న్నాహనిరామయస్థిరమనస్థితిఁ బొందితి; సర్వలోక ని
ర్వాహవినోద! నీ విమల వాక్యము చొప్పున నెల్లఁ జేసెదన్.' 228

ప్రతిపదార్థం: మోహ+తమంబు+పాసెన్= మోహం అనే చీకటి తొలగిపోయింది; తుదిన్+ముట్టిన= చివరి భాగాన్ని తాకిన, పరిపూర్ణత చెందిన; నీదు+ప్రపత్తిన్= నీ యందలి భక్తిచేత; వీత+సందేహుఁడన్+ఐతిన్= పోయిన అనుమానాలు గలవాడను అయ్యాను; గాఢ, పరిదీప్త, మహా+ఆకృతిన్= గొప్పగా దేదీప్యమానంగా వెలుగొందిన ఆకృతిని (నీ విశ్వరూపాన్ని); కాంచి= చూచి; బోధ+సన్నాహ+నిరామయ+స్థిర+మనస్+స్థితిన్= జ్ఞానంతో నిండిన ఆరోగ్యంతో కూడి చలించనట్టి మనస్సు యొక్క ఉనికిని; పొందితిన్= సంపాదించాను; సర్వ, లోక, నిర్వాహ వినోద!= అన్ని లోకాలను నడపటమే క్రీడగా గలవాడా!- శ్రీకృష్ణా!; నీ, విమల, వాక్యము, చొప్పునన్= నీవు చెప్పిన మాటల ప్రకారం; ఎల్లన్= అంతా; చేసెదన్= చేస్తాను.

తాత్పర్యం: 'భ్రాంతి అనే చీకట్లు నానుండి తొలగిపోయాయి. నీయెడ నాకు కుదిరిన పరిపూర్ణ భక్తి విశ్వాసం చేత అన్ని అనుమానాలు నాకు తొలగిపోయాయి. నీ విశ్వరూప సందర్శనం చేత నా జ్ఞానం దృఢంగా పాదుకున్నది. సర్వలోకాలను నడపటమే క్రీడగాగలవాడా, ఓ శ్రీకృష్ణా, నీవు చెప్పినట్లుగా నేను నడచుకోగలను.'

విశేషం: 1. ఇక్కడ శ్రీకృష్ణుడి ప్రబోధం - అర్జునుడి అనుభూతి రెండూ కలిశాయి. ఒకటి శాస్త్రం. అది సిద్ధాంత భాగం. రెండవది కళ. అనుష్ఠానం. సిద్ధాంతం అనుభూతి వలన ధ్రువీకరించబడుతుంది.

2. భగవద్గీత బోధించే వేదాంతం ఏమిటి? వేదాంత తత్త్వం ఐహిక కర్మ విదూరం కాదు; కర్తవ్య ఆచరణ అందులో ఇమిడి ఉన్నది ఎందుచేతనంటే గీతా ప్రబోధం విన్న తదుపరి అర్జునుడు గాండీవాన్ని పట్టి యుద్ధం చేశాడు. కాషాయాంబరాలు ధరించి అడవికి పోలేదు. అడవికి పోవటం తప్పని కాదు. కర్తవ్యం నిర్వహించటం ఒప్పు అని చెప్పటమే.

వ. అని పలికి యప్పరమపురుషునకు సభక్తిక సాష్టాంగ దండ ప్రణామంబు సేసి పార్థుండు గృతార్థుండై ధృతాయుధుండయ్యె' ననిచెప్పి సంజయుండు వెండియు నిట్లనుం 'గురుకులేశ్వరా! యేను మునిగణేశ్వరుండైన పారాశర్యు కారుణ్యంబునఁ గృష్ణార్జునుల యద్భుతపుణ్యసంవాదంబు వినుటకు మహాయోగీంద్ర హృదయానందకరుం డైన యద్దేవుని దివ్యరూపంబు గనుటకుం బాత్రభూతుండ నైతి; నమ్మహాత్ముండు దన మధురవాక్యంబుల నుపదేశింప నత్యంతగుహ్యం బైన యోగప్రకారంబు విశదంబుగా ననుసంధించితి; నమ్మహానుభావుల సంభాషణములు నవ్విశ్వరూపుని మహనీయాకారంబునుం దలంచి తలంచి యచ్చెరువందుచుఁ బ్రియం బందుచు నుండుదు' నని మఱియును. 229

ప్రతిపదార్థం: అని+పలికి= అని (అర్జునుడు చెప్పి); ఆ+పరమ, పురుషునకున్= ఆ (కృష్ణ) పరమాత్మకు; స, భక్తిక, స+అష్టాంగ దండ, ప్రణామంబు+చేసి= భక్తితో కూడిన ఎనిమిది అవయవాలు భూమిని సోకు నమస్కారం చేసి; పార్థుండు= అర్జునుడు (పృథ= కుంతి); కృత+అర్థుండు+ఐ= ధన్యుడై; ధృత+ఆయుధుండు+అయ్యెన్= ఆయుధాన్ని ధరించినట్టి వాడయ్యె; అని+చెప్పి= అని వచించి; సంజయుండు= సంజయుడు; వెండియున్= మరల; ఇట్లు+అనున్= ఈవిధంగా చెప్పాడు; కురు+కుల+ఈశ్వరా= కురు వంశానికి అధిపతీ- ఓ ధృతరాష్ట్రా!; ఏను= నేను; ముని, గణ+ఈశ్వరుండు+ఐన= మునుల సముదాయంలో శ్రేష్ఠుడు ఐన; పారాశర్యు+కారుణ్యంబునన్= పరాశర మహర్షి కొడుకైన వ్యాసుడి దయవలన; కృష్ణ+అర్జునుల= శ్రీకృష్ణుడికి అర్జునుడికి మధ్య జరిగిన; అద్భుత+పుణ్య+సంవాదంబు= ఆశ్చర్యకరమైనట్టిదియు, సుకృతమును చేకూర్చునట్టిదియును అయిన సంభాషణ; వినుటకున్= వినటానికి; మహా, యోగి+ఇంద్ర, హృదయ, ఆనందకరుండు+ఐన= గొప్ప ఋషులలో శ్రేష్ఠులైనవారి హృదయాలకు సంతోషం చేకూర్చేవాడైన; ఆ+దేవుని= ఆ భగవంతుడి; దివ్య+రూపంబు= లోకోత్తరమైన ఆకారం; కనుటకున్= చూడటానికి; పాత్ర, భూతుండన్+ఐతిన్= యోగ్యుడను కాగలిగాను; ఆ+మహా+ఆత్ముండు= గొప్ప ఆత్మగల ఆతడు- శ్రీకృష్ణుడు; తన+మధుర+వాక్యంబులన్+ఉపదేశింపన్= తియ్యనైన తన మాటలు చెప్పగా; అత్యంత+గుహ్యంబు+ఐన= మిక్కిలి రహస్యమైనట్టి; యోగ+ప్రకారంబు= యోగ పద్ధతి; విశదంబుగాన్= తేటతెల్లం అయ్యే రీతిలో; అనుసంధించితిన్= తగినట్లుగా కూర్చి చెప్పాను; ఆ+మహా+అనుభావుల+సంభాషణములు= ఆ మహాత్ముల మాటలు; ఆ+విశ్వరూపుని= విశ్వమే తన ఆకారంగా గల ఆ శ్రీకృష్ణుడి; మహనీయ+ఆకారంబున్= గొప్ప ఆకృతిని; తలంచి; తలంచి= మరల మరల స్మరించి; అచ్చెరువు+అందుచున్= ఆశ్చర్యం అనుభవిస్తూ; ప్రియంబు+అందుచున్= ప్రీతిని అనుభవిస్తూ; ఉండుదున్= ఉంటాను; అని మఱియును= అని చెప్పి మరల.

తాత్పర్యం: అప్పుడు అర్జునుడు శ్రీకృష్ణుడికి భక్తితో సాష్టాంగ నమస్కారం చేసి గాండీవం ధరించి నిలిచాడు, అని సంజయుడు ధృతరాష్ట్రుడికి చెప్పి, మరల ఈ విధంగా అన్నాడు. 'ఓ ధృతరాష్ట్ర మహారాజా! నేను ఋషివరేణ్యుడైన వ్యాసుడి కరుణవలన కృష్ణార్జునుల సంభాషణ విన్నాను. యోగీశ్వరుల హృదయానికి ఆనందం కలిగించే శ్రీకృష్ణుడి విశ్వరూపం సందర్శించగలిగాను. అంతేకాక మహానుభావుడైన శ్రీకృష్ణుడు అర్జునుడికి అందించిన దివ్య సందేశం యోగ విద్యా సారసంగ్రహం ఆలకించాను. ఆ మహానుభావుల సంభాషణలు- ప్రపంచస్వరూపుడైన శ్రీకృష్ణుడి మహనీయస్వరూపం మాటి మాటికి తలపోసి ఆశ్చర్యము, ఆనందము చెందుతూ ఉంటాను.

విశేషం: 1. భగవద్గీత ప్రత్యక్షంగా విన్నది, శ్రీకృష్ణుడి విశ్వరూపం సందర్శించింది అర్జునుడు. అయితే అతడితోపాటు ప్రత్యక్షంగా వినే అవకాశం చూచే అవకాశం సంజయుడికి సంక్రమించింది గదా వ్యాసమహర్షి దయవలన. అటు అర్జునుడి మాట అటుంచి- ఇటు సంజయుడు ఆనందతన్మయుడై ఉప్పొంగి పోతున్నాడు.

2. సాష్టాంగదండప్రణామం: దండాకారంగా ఎనిమిది అంగాలు, అవయవాలు నేలకు తగిలేటట్లుగా చేసే నమస్కారం. 1. మోకాళ్ళు 2. పాదాలు 3. చేతులు 4. రొమ్ము 5. బుద్ధి 6. తల 7. మాట 8. చూపు- ఇవి అష్టాంగాలు.

తే. ‘ అధిప! యోగీశ్వరేశ్వరుం డైన కృష్ణఁ ।డును ధనుర్ధరవర్యుఁ డర్జునుఁడు నెచట
నిలిచి రచ్చట విజయంబు నీతి సిరియు ।భూతి నిత్యంబు లగు; నిది నా తలంపు.’ 230

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; ఓ ధృతరాష్ట్ర మహారాజా!; యోగి+ఈశ్వర+ఈశ్వరుండు+ఐన= ఉత్తమ యోగులలో గొప్పవాడు అయిన; కృష్ణుఁడును= శ్రీకృష్ణుడూ, ధనుస్+ధర+వర్యుఁడు= ధానుష్కులలో- ధనువు ధరించే వారలలో శ్రేష్ఠుడైన; అర్జునుఁడు= అర్జునుడును; ఎచటన్= ఏ స్థలంలో; నిలిచిరి= నిలబడ్డారో; అచ్చటన్= ఆ స్థలంలో; విజయంబు= గెలుపు; నీతి= మంచి నడవడి తీరు; సిరియున్= ఐశ్వర్యం; భూతి= ప్రాభవం; నిత్యంబులు+అగున్= సర్వదా ఉంటాయి; ఇది= ఇది; నా+తలంపు= నా అభిప్రాయం.

తాత్పర్యం: ‘ఓ ధృతరాష్ట్ర మహారాజా! యోగీశ్వరుడైన శ్రీకృష్ణుడూ, విలుకాండ్రలో శ్రేష్ఠుడైన అర్జునుడూ, ఎచ్చట కలిసి మెలిసి ఉంటారో అచ్చట నీతి, సిరిసంపదలు, విజయం సర్వదా ఉంటాయి.

విశేషం: 1. శ్రీకృష్ణుడు యోగీశ్వరుడుగా భారతంలో భగవద్గీతలో అభివర్ణితుడు.

2. ఆధ్యాత్మిక శక్తికి ప్రతీక శ్రీకృష్ణుడు, ఐహికశక్తికి ప్రతీక అర్జునుడు. శ్రీకృష్ణుడు దైవశక్తికి, పురుషకార శక్తికి అర్జునుడూ ప్రతీకలు. యోగం+పురుషకారం= విజయం అని సంజయుడి వ్యాఖ్యానం.

వ. అనిన విని ధృతరాష్ట్రుం డిట్లనియె. 231

ప్రతిపదార్థం: అనినన్+విని= అని (సంజయుడు చెప్పగా) ఆలకించి; ధృతరాష్ట్రుండు= ధృతరాష్ట్రుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: అని సంజయుడు చెప్పగా ఆలకించి ధృతరాష్ట్రుడు ఈ రీతిగా చెప్పాడు.

క. ‘ ఇవ్విధమున నాయిత మై ।క్రొ వ్వెలరారంగ నిలిచి కురుపాండవులం
దెవ్వరు మును గడఁగిరి? రణ ।మెవ్విధి నూలుకొని చెల్లె? నెఱిఁగింపు తగన్.’ 232

ప్రతిపదార్థం: ఈ+విధమునన్= ఈ రీతిగా; ఆయితము+ఐ= సంసిద్ధమై; క్రొవ్వు+ఎలరారంగన్= గర్వం అతిశయించగా; నిలిచి= నిలబడి; కురు+పాండవులందున్+ఎవ్వరు= కౌరవులలో పాండవులలో ఎవ్వరు; మును= ముందుగా; కడఁగిరి= పూనిరి; రణము= యుద్ధం; ఏ+విధిన్= ఏ రీతిగా; నూలుకొని= ప్రారంభించి; చెల్లెన్= జరిగింది; తగన్= తగినట్లుగా; ఎఱిఁగింపు(ము)= తెలియజేయుము.

తాత్పర్యం: ‘ఈ విధంగా యుద్ధానికి సంసిద్ధమై, గర్వంతో కురు పాండవులు నిలిచారు గదా! ఉభయ పక్షాలలో మునుముందుగా యుద్ధం ఎవరు ప్రారంభించారు? యుద్ధం ఏ విధంగా జరిగింది? వివరించి చెప్పుము.’

భీష్ముని ప్రథమ దివస యుద్ధము (సం. 6-42-1)

వ. అనుటయు సంజయుం డతని కి ట్లనియె భవదగ్రనందనుం డత్యంతోదగ్రవ్యగ్రుండై యాగ్రహంబునం బనిచినం బ్రకటదోర్గర్వదుర్దముం డగు దుశ్శాసనుండు పురి కొలుపం గురుసైన్యంబులు శంఖ భేరీ మృదంగాది నిస్వనమ్ములు సెలంగ గాంగేయుండు దొలుతం గదలఁ గేతుశోభాభిరాముం డగుచు నుద్దామ గతిం గవిసినం గనుంగొని. 233

ప్రతిపదార్థం: అనుటయున్= అని (ధృతరాష్ట్రుడు) చెప్పగా; సంజయుండు= సంజయుడు; అతనికిన్+ఇట్లు+అనియెన్= ధృతరాష్ట్రుడికి, ఈ విధంగా చెప్పాడు; భవత్+అగ్ర నందనుండు= నీ పెద్ద కొడుకు (దుర్యోధనుడు); అత్యంత+ఉదగ్ర

వ్యగ్రుండు+ఐ= మిక్కిలి భయంకరమైన స్ఫూర్తితో చలించినవాడై; ఆగ్రహంబునన్= కోపంతో; పనిచినన్= ఆజ్ఞాపింపగా; ప్రకట, దోర్గర్వ, దుర్దముండు+అగు= పైకి వెల్లడి అయిన భుజబలంచేత అడపరానివాడగు; దుశ్శాసనుండు= దుశ్శాసనుడు; పురికొలుపన్= ప్రోత్సహించగా; కురు, సైన్యంబులు= కౌరవ సేనలు; శంఖ, భేరీ, మృదంగ+ఆది, నిస్వనమ్ములు= శంఖాలు, పెద్దమూతి ఒకటిగల డోళ్లు; మద్దెళ్లు మొదలుగా గల వాద్యాల మ్రోతలు; చెలంగన్= ధ్వనించగా; గాంగేయుండు= గంగ కొడుకు- భీష్ముడు; తొలుతన్= మొదట; కదలన్= నడవగా; కేతు, శోభా+అభిరాముండు+అగుచున్= జెండా యొక్క వైభవంచేత అందంగా కనిపిస్తూ; ఉద్దామ+గతిన్= భయంకరమైన రీతిగా, కవిసినన్= మార్కొనగా; కనుంగొని= చూచి.

తాత్పర్యం: సంజయుడు ధృతరాష్ట్రుడితో ఈ రీతిగా చెప్పాడు- 'నీ పెద్ద కొడుకు మిక్కిలి కోపంతో ఆజ్ఞాపించగా పరాక్రమ గర్వంతో దుశ్శాసనుడు ప్రోత్సహించగా, కౌరవసేనలు శంఖాలు, భేరులు, మద్దెలలు మున్నగు వాద్యాలు మ్రోగించి, ముందు భీష్ముడు సేనాధిపతిగా ఎత్తైన జెండా ఆకాశంలో అందంగా వెలుగొందుతూ ఉండగా, భయం కరంగా మార్కొనటం చూచి. (తరువాతి పద్యంతో అన్వయం).

ఉ. పాండునృపాలనందనులు పావని మున్నగ నేచి యప్డు భీ
ష్ముండు గడంక మై నడచు చోటికిఁ జక్కటి గాఁగఁ ద్రోచి యొం
డొండ కడంగి సేన తమ యుబ్బున కుబ్బఁగ నన్యసైన్య వే
దండ ముఖాంగముల్ దృణ వితానముగాఁ గొని నిర్వికారులై. 234

ప్రతిపదార్థం: పాండు, నృపాల, నందనులు= పాండురాజు కొడుకులు పాండవులు; పావని= భీముడు; మున్నగన్= ముందుండగా; ఏచి= విజృంభించి; అప్డు= అపుడు; భీష్ముండు= భీష్ముడు; కడంకమైన్= పూనికతో; నడచుచోటికిన్= కదలి వెళ్ళే స్థలానికి; చక్కటి+కాఁగన్= చేరువ అయ్యేటట్లుగా; త్రోచి= ముందుకు చేరి; ఒండొండ= ఒకరితో ఒకరు; కడంగి= పూని; సేన= సైన్యం; తమ+ఉబ్బునకున్+ఉబ్బఁగన్= తమ అతిశయానికి ఉప్పొంగగా; అన్య, సైన్య, వేదండ, ముఖ+అంగముల్= శత్రుసైన్యంలోని ఏనుగుల ముందున్న బారులు; తృణ+వితానముగాన్= గడ్డి పోచలవలె; కొని= భావించి; నిర్వికారులు+ఐ= వికారం లేనివారలై ధైర్యంతో ఉన్నవారై.

తాత్పర్యం: పాండవులు భీముడిని ముందు పెట్టుకొని, భీష్ముడు నడుస్తున్న చోటుకు చేరువగా తమ సైన్యాలను తరలించారు. పాండవుల ఉత్సాహం చూచి, ఆ సేనలు ఉప్పొంగాయి. ఉప్పొంగి శత్రుసైన్యంలోని గజబలాన్ని గడ్డిపోచలుగా భావించి ధైర్యంతో (ముందుకు సాగి).

వ. ఉరవడించు సమయంబున. 235

ప్రతిపదార్థం: ఉరవడించు+సమయంబునన్= వేగిరపడే వేళలో.

తాత్పర్యం: వేగిరపడే వేళలో.

క. ఘనతరగర్జా ధ్వనులును, । ఘనపథమఖిలంబుఁ దూఁటు కట్టెడు తూర్య
స్వనములునుం గబళించుచు । ననిలతనయు సింహనాద మడరెం బెలుచన్. 236

ప్రతిపదార్థం: ఘన, తర, గర్జా, ధ్వనులును= మిక్కిలి గొప్పదైన మదపుటేనుగులు చేసే ధ్వనులూ; ఘనపథము+అఖిలంబున్= ఆకాశం అంతయు; తూఁటు+కట్టెడు= చిల్లులు పడచేసే; తూర్య+స్వనములున్= బూరాలు మున్నగు వాద్యాల ధ్వనులునూ; కబళించుచున్= మ్రింగి వేస్తూ; అనిల తనయు, సింహనాదము= వాయుపుత్రుడు అయిన భీముడు చేసిన సింహనాదం; పెలుచన్= ఎక్కువగా; అడరెన్= అతిశయించింది.

తాత్పర్యం: ఉభయసైన్యాలు తలపడాలని వేగిరపడే ఆ వేళలో, భీమసేనుడు సింహనాదం చేశాడు. మదపు టేనుగుల గర్జా నినాదాలను, ఆకాశాన్ని చిల్లులుపడేటట్లు చేసే తూర్యరావాలను భీముడి సింహనాదం కబళించివేసింది.

విశేషం: సింహనాదం: ప్రాచీనకాలంలో యుద్ధవీరుడి నోటి నుండి వెలువడే గర్జన. అది సింహగర్జన సదృశం. అలనాడు వీరులు చేసే సింహనాదాలు 'పూరించే శంఖాలు' భేరీ కాహళ తూర్యాది రావాలు యుద్ధ పరాక్రమంలో అంతర్భాగాలే.

వ. ఇట్లు ప్రతిభటతురంగమాతంగంబుల గుండియ లవియ నందంద యార్చి పేర్చిన భీము నెదిర్చి దుశ్శాసనుండును దుర్ముఖుండును దుష్ప్రహుండును దుర్మర్షణుండును వివింశతియు వృషసేనుండును జిత్రసేనుండును వికర్ణుండును బురుమిత్రుండును దుర్యోధను చూడ్కికి వేడ్క సేయుచుం దాఁకిన. 237

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; ప్రతిభట, తురంగ, మాతంగంబుల, గుండియలు+అవియన్= శత్రువుల గుర్రాలు ఏనుగుల దండుల గుండెలు బ్రద్దలయ్యేటట్లుగా; అందంద= అక్కడికక్కడే; ఆర్చి, పేర్చిన= అతిశయించి విస్తరిల్లిన; భీమున్= భీమసేనుడిని; ఎదిర్చి= మార్కొని; దుశ్శాసనుండును= దుశ్శాసనుడూ; దుర్ముఖుండును= దుర్ముఖుడూ; దుష్ప్రహుండును= దుష్ప్రహుండూ; దుర్మర్షణుండును= దుర్మర్షణుడూ; వివింశతియున్= వివింశతీ; వృషసేనుండును= వృషసేనుడూ; చిత్రసేనుండును= చిత్రసేనుడూ; వికర్ణుండును= వికర్ణుడూ; పురుమిత్రుండును= పురుమిత్రుడూ; దుర్యోధను చూడ్కికిన్= దుర్యోధనుడి దృష్టికి; వేడ్క= సంతోషం; చేయుచున్=కలిగిస్తూ; తాఁకినన్= మార్కొనగా.

తాత్పర్యం: ఈ విధంగా శత్రువులకు చెందిన గుర్రాల ఏనుగుల దండుల గుండెలు అదిరిపోయేటట్లు సింహనాదం చేసి విజృంభించిన భీముడిని, దుశ్శాసనుడు, దుర్ముఖుడు, దుష్ప్రహుడు, దుర్మర్షణుడు, వివింశతి, వృషసేనుడు, చిత్రసేనుడు, వికర్ణుడు (దుర్యోధనుడి తమ్ములు) ఎదిరించి, దుర్యోధనుడికి కన్నుల పండువుగా మార్కొన్నారు.

క. ఉద్యతులై కవలును ధృ। ష్టద్యుమ్నుఁడుఁ గడఁగఁ దోన సౌభద్రుండున్
మాద్యద్గతిఁ గవియుడు నే। కోద్యోగత ద్రౌపదీసుతోత్కర మడరెన్. 238

ప్రతిపదార్థం: ఉద్యతులు+ఐ= ఉత్సాహంతో విజృంభించినవారై; కవలును= నకుల సహదేవులు - కవల జంట; ధృష్టద్యుమ్నుఁడు= ద్రుపదుడి పెద్ద కొడుకు- పాండవ సేనాపతి; కడఁగన్= పూనికతో విజృంభించగా; తోన= వెంటనే; సౌభద్రుండున్= సుభద్ర కొడుకు అభిమన్యుడు; మాద్యత్+గతిన్= మదించిన రీతిలో; కవియుడున్= మార్కొనగా; ఏక+ఉద్యోగతన్= ఒకే యత్నంతో; ద్రౌపదీ, సుత+ఉత్కరము= ద్రౌపది పుత్రుల సముదాయం; అడరెన్= విజృంభించింది.

తాత్పర్యం: యుద్ధ సన్నద్ధులై నకులుడు, సహదేవుడు, ధృష్టద్యుమ్నుడు విజృంభించారు. వారితోపాటు అభిమన్యుడు కూడా విజృంభించాడు. అట్లే ద్రౌపది కొడుకులూ చెలరేగారు.

వ. ఇవ్విధంబున వృకోదరునకుం దలకడచి తాఁకి వజ్రనిభమ్ములగు వాలమ్ములు శైలోపములగు కౌరవవీరుల పయిం గురియ నక్కుమారవర్గంబు ననర్గళప్రసారం బగు శరాసారంబుల వారలఁ గప్పె; నట్టియెడం గొండొకసేపు. 239

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ రీతిగా; వృకోదరునకున్= భీముడికి; తలకడచి= అతిక్రమించి; తాఁకి= మార్కొని; వజ్ర, నిభమ్ములు+అగు= వజ్రంతో సమానములు అయిన; వాలు+అమ్ములు= వాడి బాణాలు; శైల+ఉపములు+అగు= కొండలతో సాటి అయిన; కౌరవ, వీరులపయిన్+కురియన్= కౌరవ వీరులపై (ధార్తరాష్ట్రులపయి) వర్షించగా, ఆ+కుమార+వర్గంబు= ఆ

కుమారుల సముదాయం (ధార్తరాష్ట్రులు); అనర్గళ+ప్రసారంబులు+అగు= అడ్డు లేకుండా ప్రయోగించబడిన; శరాసారంబులన్= బాణాల జడులతో; వారలన్+కప్పెన్= పాండవ కుమారులను కప్పింది; అట్టి+ఎడన్= ఆ సమయంలో; కొండొక+సేపు= కొంతసేపు.

తాత్పర్యం: ఈ విధంగా పాండవ కుమారులు భీమసేనుడికంటె ముందుకురికి వజ్రాయుధాలవంటి వాడిబాణాలను పర్వతాల వంటి కౌరవవీరులమీద కురిపించారు. కౌరవ కుమారులు కూడా ఎడతెరిపి లేకుండా బాణాల వరుసలతో పాండవ కుమారులను కప్పివేశారు. ఆ సమయంలో కొంతసేపు.

విశేషం: యుద్ధం ప్రారంభిస్తూ కౌరవుల పక్షంలో ముందుకు దూసుకు వచ్చింది దుశ్శాసనుడు. పాండవుల పక్షంలో భీముడు. దుశ్శాసనుడికి బాసటగా నిలిచింది ధృతరాష్ట్రుడి యువకుమారులు. భీముడికి అండగా చేరింది పాండవ యువ కుమారులు. అనగా యుద్ధానికి ముందున్నది ఉభయ పక్షాలలో యువకులే.

క. అచ్చవడి యుభయబలములు । నచ్చెరువుగఁ జిత్రరూపు లట్లుండ శర
ప్రోచ్చలితచండదీప్తి స । ముచ్చయములు పెలుచఁ బరఁగె ముసుఁగువడంగాన్. 240

ప్రతిపదార్థం: ఉభయ, బలములున్= రెండు సేనలూ; అచ్చవడి= మ్రాన్పడి - కొయ్యబారిపోయి; అచ్చెరువుగన్= ఆశ్చర్యకరముగా; చిత్రరూపులు+అట్లు+ఉండన్= చిత్రపటంలోని బొమ్మల వలె (కదలక, మెదలక) ఉండగా; శర, ప్ర+ఉచ్చలిత, చండ, దీప్తి, సముచ్చయములు= బాణాలచేత ప్రజ్వలింపచేయబడిన గొప్ప కాంతుల సముదాయం; ముసుఁగు+పడంగాన్= విస్తరించేటట్లుగా; పెలుచన్+పరఁగెన్= ఎక్కువగా వర్ధిల్లాయి.

తాత్పర్యం: పాండవ కుమారులూ, కౌరవ కుమారులూ ఆ రీతిగా ఒకరిపై నొకరు బాణాల వర్షం కురిపించగా, ఉభయ పక్షాలలోని సేనలూ రిచ్చవడి ఆశ్చర్యకరంగా చిత్రలేఖనంలోని బొమ్మలవలె కన్పించారు. కురు కుమారులు, పాండు కుమారులు ప్రయోగించిన బాణాల సముదాయముల వెలుగు వెల్లువ విస్తరించింది.

క. పదపడి దుర్యోధనుఁ డు । న్మదుఁడై తఱుమంగ ధర్మనందనుఁడు జయా
స్పదముగఁ బురికొల్పఁగ బె । ట్టిదముగ నొండొంటిఁ దలపడియె సైన్యంబుల్. 241

ప్రతిపదార్థం: పదపడి= పిమ్మట; దుర్యోధనుఁడు= సుయోధనుడు; ఉత్+మదుఁడు+ఐ= అతిశయించిన గర్వం కలవాడై; తఱుమంగన్= పురికొల్పగా; ధర్మనందనుఁడు= ధర్మరాజు; జయ+ఆస్పదముగన్= గెలుపు కలిగేటట్లుగా; పురికొల్పఁగన్= ప్రోత్సహించగా; సైన్యంబుల్= ఉభయ సేనలు; బెట్టిదముగన్= ఎక్కువగా; ఒండు ఒంటిన్= ఒక దానితో ఒకటి; తలపడియెన్= ఎదుర్కొన్నాయి.

తాత్పర్యం: దుర్యోధనుడు గర్వాతిశయంతో తన సేనలను ప్రోత్సహించాడు. గెలుపుమీద దృష్టిని కేంద్రీకరించి, ధర్మరాజు తన సేనలను పురికొల్పాడు. ఆ రెండు సేనలు అతిశయించిన పూనికతో ఒకదానిని మరొకటి మార్కొని విజృంభించాయి.

సీ. కప్పారు రేణువు గమలాప్తబింబంబు । రాహుమండలమన రమణఁ గప్పుఁ,
దెల్లని రజము శోభిల్లు సంగ్రామరం । గమునకుఁ దగు మేలుకట్టునట్లు,
ఖచరకాంతల యలకములందుఁ గెందూళి । యళులపై పుప్పొడి ననుకరించు,
నడరి పచ్చని పాంశు వమరు దిశాభిత్తి । తలములఁ గనకంపుఁ దగడు పగిదిఁ,

తే. బాండవానీకమును గురుబలము నొక్క। పెట్ట రథ గజ హయ భటాభీలచటుల
గతిఁ బరిక్షుణ్ణ సంగరక్షితితలముగ। వీఁక బెరసిన యత్తొలుతాఁకు నపుడు 242

ప్రతిపదార్థం: పాండవ+అనీకమును= పాండవుల సేనయును; కురు+బలమున్= కౌరవులసేనా; ఒక్కొ+పెట్టన్= ఒకేసారిగా; రథ+గజ+హయ+భట+ఆభీల+చటుల+గతిన్= రథాలు, ఏనుగులు, గుర్రాలతో, కాల్బలంతో భయంకరంగా కదలు పద్ధతిలో; పరిక్షుణ్ణ, సంగర, క్షితి, తలముగన్= ఎక్కువగా నలగగొట్టబడిన యుద్ధభూమి అగుచు; వీఁకన్= ఉత్సాహంతో; బెరసిన= వ్యాపించిన; ఆ+తొలు, తాకు+అపుడు= ఆ మొదటి తాకిడి ఏర్పడినప్పుడు; కప్పారు= నల్లనైనట్టి; రేణువు= దుమ్ము; కనుల+ఆప్త, బింబమ్ము= సూర్యగోళం; రాహు, మండలము+అనన్= రాహుగోళం అనునట్లుగా; రమణన్+కప్పున్= శోభిల్లి కప్పివేసింది; తెల్లని+రజము= తెల్లగా ఉన్న దుమ్ము; సంగ్రామ, రంగమునకున్= యుద్ధభూమికి; తగు= తగిన; మేలు కట్టు+అట్లు= ఉల్లెడ (వితానం)వలె; శోభిల్లున్= విలసిల్లింది; కెంపు, దూళి= ఎర్రని దుమ్ము; ఖచర, కాంతల+అలకములందున్= ఆకాశంలో సంచరించే వేలువు స్త్రీల ముంగురులలో; అళులపై+పుప్పొడిన్= తుమ్మెదలపై; పుష్పపరాగాన్ని; అనుకరించున్= పోలుతుంది; పచ్చని, పాంశువు= పచ్చని రంగు దుమ్ము; అడరి= వ్యాపించి; దిశా, భిత్తి, తలములన్= దిక్కులు అనెడి గోడలపైభాగాలపై; కనకంపు, తగడు, పగిదిన్= బంగారు రేకు తొడుగు వలె; అమరున్= ఏర్పడుతుంది.

తాత్పర్యం: పాండవ కౌరవసేనలు ఒక్కసారిగా రథగజ హయభటావళి భయంకరంగా కదలగా భూమి నలగగొట్టబడేటట్లు విస్తరించిన ప్రతాపాలతో ఆతొలితాకు ఏర్పడినప్పుడు రకరకాల దుమ్ములు ఆకసానికి ఎగశాయి. నల్లని దుమ్ము కప్పటం చేత సూర్యబింబం రాహుమండలం కప్పినట్లుగా కన్పించింది. తెల్లని దుమ్ము యుద్ధభూమిపై వితానంవలె (మేలుకట్టుగా) భాసించింది. కెంపు వన్నె దుమ్ము, దేవతాస్త్రీల ముంగురులనే తుమ్మెదలపై పుప్పొడి వలె శోభిల్లింది. పచ్చని వన్నెగల దుమ్ము దిశాభిత్తికలమీది బంగారు రేకు తొడుగు వలె విలసిల్లింది.

విశేషం: 1. చతురంగబలములు: రథ+గజ+హయ+భట వర్గాలు. ప్రాచీన భారతదేశంలో సేన చతురంగబలముగ అభివర్ణితం.

2. కమలములకు ఆప్తుడు సూర్యుడు. ఇది కవి సమయం.

3. రాహు మండలం: అసలు లేనే లేదు. రాహువు ఒక బిందువు. ఈ బిందు సంచలనం క్రాంతి వలయంలో వక్రగతిని సంచరిస్తుంది. రాహు గ్రస్తమైనపుడు సూర్యునకు గ్రహణం ఏర్పడుతుంది. ఇట్లే కేతుగ్రస్తమైనపుడు చంద్రునకు. రాహు, కేతువులు గ్రహాలు కావు. రాహు మండలం నల్లగా ఉండటం కవి సమయం.

రాహు కేతువులను ఛాయాగ్రహాలుగా ప్రాచీనులే గుర్తించారు. అసలు రాహు, కేతు సంకేతాలను భారతీయులు ప్రాచీన కాలంలోనే గుర్తించటం విశేషం. ప్రాచీన భారతీయుల ఖగోళ పరిజ్ఞానానికి రాహుకేతు ప్రస్తారం ఒక నిదర్శనం. రాహుగ్రస్తమైనప్పుడు సూర్యబింబం నల్లగా మారటం - అనే వర్ణన ఖగోళ పరిజ్ఞానానికి నిదర్శనం. సూర్యగోళం గ్రహణంనాడు మాత్రమే నల్లనౌతుంది. మహాభారత యుద్ధం అమావాస్యనాడు ఆరంభించినదనీ ఆనాడు గ్రహణం పట్టిందనీ ఒక వాదం ఉన్నది.

మ. కరిఘంటానిచయస్వనంబులుఁ దురంగస్ఫీతహేషా సము
త్కరనాదంబులు హేతిపంక్తిపటుసంఘట్టోత్థరావంబులున్
ధరణీభాగనభోంతరం బడరి యుద్యత్తూర్యనానాధ్వని
స్ఫురణం బేమియుఁ దోఁప నీవ మొనలన్ భూపాలచూడామణీ! 243

ప్రతిపదార్థం: భూపాల చూడామణీ!= రాజులలో శ్రేష్ఠుడవైనవాడా ధృతరాష్ట్ర మహారాజా!; కరి, ఘంటా, నిచయ, స్వనంబులున్= ఏనుగులకు కట్టిన గంటల సముదాయం వలన ఏర్పడిన ధ్వనులు; తురంగ, స్ఫీత, హేషా, సముత్కర, నాదంబులున్= గుర్రాల

నుండి వ్యాపించిన సకిలింతల వలన ఏర్పడిన సామూహిక ధ్వనులు; హేతి, పంక్తి, పటు, సంఘట్ట+ఉత్థ, రావంబులున్= కత్తుల వరుసల పలు రాపిడుల వలన పైకి లేచిన ధ్వనులూ; ధరణీ, భాగ, నభస్+ అంతరంబు= భూమి ఆకాశాల మధ్యభాగం; అడరి= వ్యాపించి; మొనలన్= సేనలలో; ఉద్యత్+తూర్య, నానా, ధ్వని, స్ఫుర+ణంబు= పైకి విస్తరించిన తూర్యములు మున్నగు వాటివలన ఏర్పడిన ధ్వనులు విస్తరించటం వలన; ఏమియున్+తోఁప నీవ= ఏమీ ఆలోచించటానికి వీలులేకుండా చేశాయి.

తాత్పర్యం: రాజోత్తమా! ఏనుగులకు కట్టిన గంటల సముదాయాలు మ్రోగుటవలన కల్గిన ధ్వనులూ, గుఱ్ఱాల గుంపుల సకిలింపుల వల్ల ఏర్పడిన ధ్వనులూ, కత్తుల రాపిడుల వల్ల పై కెగసిన ధ్వనులూ భూనభోంతరాళాలలో వ్యాపించి సైన్యంలోని తూర్యాది యుద్ధవాద్యాల మ్రోతలు ఏమీ వినిపించనీయవు.

వ. తదనంతరంబ. **244**

తాత్పర్యం: అటు పిమ్మట.

క. కరికరశీకర తురగో ।త్కరలాలాజాల రక్తధారాపటలీ
పరిషిక్తంబై సంగర । ధరణీ రజ మడఁగె నద్భుతం బలరారన్. **245**

ప్రతిపదార్థం: కరి, కర, శీకర, తురగ+ఉత్కర, లాలా, జాల, రక్త, ధారా, పటలీ, పరిషిక్తంబు+ఐ= ఏనుగుల తుండాల నుండి జారిన నీటి తుంపురలచే, గుర్రాల గుంపుల నోళ్ళ నుండి వెలువడే జొల్లు మొత్తం వలన, రక్తధారల సముదాయాల వలన తడుపబడినట్టిదై; అద్భుతంబు+అలరారన్= ఆశ్చర్యం శోభిల్లునట్లుగా; సంగర, ధరణీ, రజము= యుద్ధభూమిలోని దుమ్ము; అడఁగెన్= తగ్గిపోయింది.

తాత్పర్యం: రెండు సేనలు మొట్టమొదట ఢీకొనినప్పుడు 'దుమ్ము'' చెలరేగి భూమ్యాకాశాలను చుట్టుముట్టింది. అంతకంటె ఆశ్చర్యకరమైన అంశం, ఏనుగుల తుండాల నుండి కమ్మిన నీటి తుంపురుల వలన; గుర్రాల నోటినుండి కారిన చొంగవలన, యుద్ధభూమిపై పడిన నెత్తుటి ధారల వలన ఆ దుమ్ము అణగిపోయింది.

విశేషం: 1. నలిగిన యుద్ధభూమి నుండి చెలరేగిన దుమ్ము భూమ్యాకాశాలను క్రమ్మటం ఆశ్చర్యం కాదు.

2. ఆకాశం వరకు ఎగసిన దుమ్ము అణగిపోవటమే ఆశ్చర్యం. దానికి కారణం ఏనుగుల తుండాల నుండి వెలువడిన నీటి తుంపురులు, గుర్రాల చొంగ, కారిన నెత్తురు. ఎన్ని ఏనుగులు!! ఎన్ని గుఱ్ఱాలు!! ఎంతమంది భటులు!!?

క. కురుపాండవసైన్యంబుల । దొర లడియాలముల నొప్పుతో మెఱయు సము
ద్ధురవీరధ్వజములఁ బొలి । చిరి శౌర్యస్ఫూర్తి మూర్తి సేకొన్నక్రియన్. **246**

ప్రతిపదార్థం: కురు, పాండవ, సైన్యంబుల, దొరలు= కౌరవుల సేనలోని రాజులు పాండవుల సేనలోని రాజులు; అడియాలముల+ఒప్పుతోన్= రాజలాంఛనాల శోభతో; మెఱయు= ప్రకాశించే; సముద్ధర, వీర, ధ్వజములన్= మిక్కుటంగా ప్రజ్వరిల్లే - శౌర్య సూచనలైన జెండాలతో; శౌర్య+స్ఫూర్తి= పరాక్రమ ప్రాభవం; మూర్తి, చేకొన్న, క్రియన్= ఆకారం ధరించినట్లుగా; పొలిచిరి= శోభిల్లారు.

తాత్పర్యం: కౌరవ సేనలోని రాజులు, పాండవ సేనలోని రాజులు రాజచిహ్నాలతో భాసించే జెండాలతో, శౌర్యం మూర్తీభవించినట్లు విలసిల్లారు.

విశేషం: 1. అలం: ఉత్ప్రేక్ష. 'అడియాలములు' - తిక్కన నాటి సమాజంలో సుప్రసిద్ధమైన పదం. కేతన- తన దశకుమార చరిత్రలో తిక్కన గూర్చి వ్రాసిన పద్యం.

"అందలంబు గొడుగు లడపంబు మేల్కట్టు
చామరములు జమిలి శంఖములును
గంబకట్లు భూమి కానిక గాఁగ - పెం
పెసఁగు రాచపదవులెల్లఁ బడసె."

నేడుగూడ సేనలోని దండనాథుల ఆహార్యంలో అడియాలాలు - వర్మప్రకర్ష కనిపిస్తాయి. భారతయుద్ధపు అడియాలాలు - వర్మప్రకర్ష కనిపిస్తాయి. భారత యుద్ధ కాలంలో ఆ చిహ్నాలు ఆయా వీరుల పతాకాలపై ప్రదర్శించేవారు అని తిక్కన వర్ణన.

వ. అట్టియెడ. **247**

తాత్పర్యం: ఆ సమయంలో.

క. మీతండ్రి భవత్సుతులకుఁ, జేతోముద మొదవఁ గడఁగి సేన మిగిలి ప్ర
ద్యోతనుఁడు నభోమధ్య, స్థితుం డైనట్లు వెలిఁగె భీషణమూర్తిన్. **248**

ప్రతిపదార్థం: మీతండ్రి= భీష్ముడు; భవత్+సుతులకున్= నీ కొడుకులకు; చేతస్+ముదము+ఒదవన్= మనస్సునకు ఆనందం కలిగేటట్లుగా; కడఁగి= పూని; సేనన్+మిగిలి= సైన్యంలో అధికుడై; ప్రద్యోతనుఁడు= సూర్యుడు; నభస్, మధ్య, స్థితుండు+ఐన+అట్లు= ఆకాశమధ్యంలో ప్రకాశించేవాడై ఉన్నట్లుగా; భీషణమూర్తిన్= భయంకరమైన ఆకారంతో; వెలిఁగెన్= వెలుగొందాడు.

తాత్పర్యం: మీ తండ్రి నీకుమారులకు ఆనందం కలుగగా పూని సైన్యంలో అధికుడై ఆకాశమధ్యంలో ప్రకాశించే సూర్యుడివలె భయంకరమైన ఆకారంతో వెలుగొందాడు.

విశేషం: అలం: ఉపమ.

వ. ఇట్లు మెఱసిన. **249**

తాత్పర్యం: ఈ రీతిగా ప్రకాశించగా.

ఉ. అర్జునుఁ డప్డు భీష్ముఁ గని యగ్గలికన్ గుణరావ సంగమ
స్ఫూర్జిత దేవదత్తరవశోభితుఁ డై రణకేళి కౌతుకా
వర్జితచిత్తవృత్తి ననివార్యపరాక్రమలీలఁ దాఁక న
త్యూర్జితరౌద్ర మయ్యె బహుళోగ్రమహాస్త్ర గతాగతంబులన్. **250**

ప్రతిపదార్థం: అర్జునుఁడు= అర్జునుడు; భీష్మున్+కని= భీష్ముని చూచి; అగ్గలికన్= అతిశయంతో; గుణ, రావ, సంగమ, స్ఫూర్జిత, దేవదత్త, రవ, శోభితుడు+ఐ= అల్లెత్రాటి మ్రోతతో కలిసి వ్యాపించే దేవదత్తం అనే పేరుగల శంఖనాదంతో విలసిల్లేవాడై; రణ, కేళి, కౌతుక, ఆవర్జిత, చిత్త, వృత్తిన్= పోరాటం అనే ఆటయందుగల వేడుక విస్తరించిన మనస్సుయొక్క ప్రసారంతో; అనివార్య, పరాక్రమ, లీలన్= వారించటానికి వీలులేని శౌర్యంతో భాసించే క్రీడతో; తాఁకన్= మార్కొనగా; బహుళ+ఉగ్ర, మహా+అస్త్ర, గత+ఆగతంబులన్= పెక్కు భయంకరములైన గొప్ప అస్త్రముల రాక పోకలతో; అత్యూర్జిత+రౌద్రము+అయ్యెన్= మిక్కిలి భయంకరమైన పోరాటం జరిగింది.

తాత్పర్యం: ఆ సమయంలో అర్జునుడికి భీష్ముడికి మధ్య భీకరమైన పోరాటం జరిగింది. అర్జునుడు గాండీవ ధనుస్సు యొక్క అల్లెత్రాటిని మ్రోగించాడు. తన శంఖం దేవదత్తం పూరించాడు. ఆ రెండు ధ్వనులు కలిసి దిక్కులు పిక్కటిల్లచేశాయి. అర్జునుడు యుద్ధక్రీడయందు వేడ్కకలవాడై, అడ్డులేని పరాక్రమంతో భీష్ముడిని తాకాడు. వారి ఇద్దరి మధ్య రౌద్రరసం తాండవించింది.

విశేషం: రౌద్రరసమునకు స్థాయి భావం కోపం. భీష్ముడు అర్జునుడు ఆగ్రహావేశంతో యుద్ధం చేశారు.

తే. తటిమి సాత్యకి గృతవర్మఁ దాఁక నతఁడు । నేచి మార్కొన నిరుమేను పూచి యొప్పు
మిగులు మోదుగు మ్రాఁకుల పగిది గాఁగ । నడరె మార్కొన్న రెండువా లంపగములు. 251

ప్రతిపదార్థం: తటిమి= ఉత్సాహంతో తలపడి; సాత్యకి= సాత్యకి; కృతవర్మన్= కృతవర్మను; తాఁకన్= ఎదిరింపగా; అతఁడున్= ఆ కృతవర్మ; ఏచి= అతిశయించి; మార్కొనన్= ఎదిరించి యుద్ధం చేయగా; ఇరు+మేను= రెండు శరీరాలు; పూచి= పుష్పించి; ఒప్పుమిగులు= మిక్కుటంగా శోభిల్లే; మోదుగు మ్రాఁకుల, పగిదిన్+కాఁగన్= మోదుగుచెట్లు మాదిరిగా తోచగా; మార్కొన్న రెండు+వాలు+అంపగములు= ఎదురుకొనిన రెండు విధములైన వాడి బాణాల గుంపులు (అనగా ఉభయులూ ఒకరిపై ఒకరు ప్రయోగించిన బాణాల మార్పిడి ఇటువి అటు, అటువి ఇటు చేరి) అడరెన్= వ్యాపించాయి.

తాత్పర్యం: ఉత్సాహం పొంగి పొరల సాత్యకి, కృతవర్మతో యుద్ధం చేయటానికి తలపడ్డాడు. కృతవర్మగూడ సాత్యకిని ఎదిరించి యుద్ధం చేశాడు. ఇరువురూ ఒకరిపై ఒకరు బాణాలు ప్రయోగించుకొన్నారు. ఆ బాణాలు ఇరువురి శరీరాలను గాయపరచాయి. ఇద్దరి శరీరాల నుండి నెత్తురు కారజొచ్చింది. ఆశరీరాలు పూచిన మోదుగు చెట్లవలె శోభిల్లాయి.

విశేషం: అలం: ఉపమ. మోదుగు చెట్టు పువ్వులు ఎట్టగా ఉంటాయి. అంతేకాదు. మోదుగు చెట్టు పుష్పించినప్పుడు- ఆకులు మిక్కిలి తక్కువ పువ్వులు ఎక్కువగా కన్పిస్తాయి. చెట్టునిండా పువ్వులే. అట్లే సాత్యకి కృతవర్మల శరీరాల నిండా నెత్తురు కన్పించింది.

చ. మదమునఁ గోసలేంద్రు నభిమన్యుఁడు దాఁకిన నా బృహద్బలుం
డెదిరి కడంగి సూతుఁ బడ నేసి హయంబులఁ జంపఁ జూడ్కి గెం
పొదవఁగఁ బార్థసూనుఁడు మహోగ్రత నట్టుల చేసి, కేతనం
బు దునిమి విల్లుఁ ద్రుంచి శరపూరితగాత్రునిఁ జేసె నాతనిన్. 252

ప్రతిపదార్థం: అభిమన్యుఁడు= అర్జునుడి కొడుకు- యువవీరుడు; మదమునన్= గర్వంతో; కోసల+ఇంద్రున్= కోసల దేశరాజును; తాఁకినన్= తలపడగా; ఆ+బృహద్బలుఁడు= బృహద్బలుడు అనే ఆ కోసల రాజు; ఎదిరి+కడంగి= ఎదిరించి పూని; సూతున్= సారథిని; పడన్+ఏసి= చంపి; హయంబులన్= గుర్రాలను; చంపన్= వధింపగా; చూడ్కిన్= చూపునందు; కెంపు+ఒదవఁగన్= ఎర్రతనం భాసించగా (అనగా కోపించి); పార్థసూనుఁడు= అర్జునుడి కొడుకు అభిమన్యుడు; మహా+ఉగ్రతన్= మిక్కిలి భీకరంగా; అట్టుల+చేసి= ఆ విధంగానే చేసి (సారథిని గుర్రాలను చంపి); కేతనంబు+తునిమి= జెండాను ముక్కలు చేసి; విల్లున్+త్రుంచి= ధనుస్సును ముక్కలు చేసి; ఆతనిన్= ఆ బృహద్బలుడిని; శర, పూరిత, గాత్రున్= బాణాలతో నిండిన శరీరం కలవాడిగా; చేసెన్= చేశాడు.

తాత్పర్యం: అభిమన్యుడు గర్వంతో కోసలరాజైన బృహద్బలుడిని మార్కొన్నాడు. ఆ బృహద్బలుడు కోపించి, అభిమన్యుడి రథసారథిని చంపి అశ్వాలను సంహరించాడు. అంతట అర్జునుడి కొడుకు అభిమన్యుడు ఆ విధంగానే

ఆ బృహద్బలుడి రథసారథిని అశ్వాలను చంపటమే కాకుండా ఆతడి ధనుస్సును ముక్కలు చేసి, అతడి శరీరాన్ని బాణాలతో నింపాడు.

తే. భీమసేనునిపై మనభీష్ముఁ డలుక । నడరె నక్కురుముఖ్యుల యస్త్రశస్త్ర
కౌశలంబులు సూడ నక్కజము లైన । నచ్చెరువు నొంది సేనలు పిచ్చలింప. 253

ప్రతిపదార్థం: భీమసేనునిపైన్= భీముడిమీద; మన భీష్ముఁడు= (మన కౌరవసేనాపతియైన భీష్ముడు); అలుకన్= కోపంతో; అడరెన్= విజృంభించాడు; ఆ+కురు+ముఖ్యుల= కురువంశంలో గొప్పవారైన ఆ ఇరువురి యొక్క అనగా భీమ భీష్ముల యొక్క; అస్త్ర+శస్త్ర+కౌశలంబులు, చూడన్= బాణాలు, మంత్ర పూర్వకములైన బాణాల ప్రయోగంలోని నేర్పులు అరయగా; అక్కజములు+ఐనన్= ఆశ్చర్యకరములుకాగా; అచ్చెరువున్+ఒంది= ఆశ్చర్యం చెంది; సేనలు= పాండవుల సేన మరియు కౌరవుల సేన; పిచ్చలింపన్= భయపడగా.

తాత్పర్యం: భీమసేనుడిపై భీష్ముడు కోపంతో విజృంభించాడు. కురుముఖ్యులిద్దరి (భీమభీష్ముల) అస్త్రశస్త్ర ప్రయోగనైపుణ్యాలు అచ్చెరువు గొల్పగా ఇటు కౌరవ సేన, అటు పాండవసేన ఆశ్చర్య చకితాలు అయ్యాయి.

విశేషం: 1. భీష్ముడు ఆరితేరిన ధానుష్కుడు. అతడికి భీముడు ఎంత? విలువిద్యలో. ఇచ్చట భీముడు గద పట్టక ధనుస్సు పూని భీష్ముడితో యుద్ధం చేయటం ఒక విశేషం. అంతేకాక, భీష్ముడితో సమయుద్ధం చేయగల్గటం వింత.

2. కౌరవులు కురువంశీయులే. పాండవులు గూడ కురువంశీయులే గదా. అయితే దుర్యోధనాదులు రూఢ్యర్థంలో కౌరవులు. ఈ పద్యంలో భీష్ముడు- భీముడు గూడ 'కురుముఖ్యులు'గా అభివర్ణింపబడ్డారు. ఇది గమనించదగిన అంశం.

సీ. వీఁకమై నకులునిఁ దాఁకి దుశ్శాసనుఁ । డత్యుగ్రబాణచయమునఁ బొదివె,
నక్కుమారుఁడు దరహాసాభిరాముఁ డై । భల్ల మొక్కటి దొడ్డి విల్లు దునిమి
యేడ్తెఱ నిరువదియేనుదూపులు వడి । నడరింప రయమున నతఁడు నొండు
విల్లెత్తికొని శరవితతి నంతంతన । నఱకి పాండవుకేతనంబు ద్రుంచె;

తే. దుర్ముఖుఁడు సహదేవునితోడఁ దొడరి । మెఱుఁగు వాలమ్ము లేసిన నఱక యాతఁ
డన్నియును మగిడించి రథ్యముల నొంచి, । యతని సారథిఁ దెగటార్చి యార్చి పేర్చె. 254

ప్రతిపదార్థం: దుశ్శాసనుఁడు= దుర్యోధనుడి పెద తమ్ముడు; వీఁకమైన్= ఉత్సాహంతో; నకులునిన్+తాఁకి= నకులుడిని యుద్ధంలో మార్కొని; అతి+ఉగ్ర+బాణ+చయమునన్= మిక్కిలి భయంకరమైన అమ్ముల సముదాయంతో; పొదివెన్= కప్పాడు; ఆ+కుమారుడు= ఆ (పాండు కుమారుడు) నకులుడు; దరహాస+అభిరాముఁడై= చిరునవ్వుచే అందం చిందినవాడై; భల్లము= బాణం; ఒక్కటి= ఒకటి; తొడిగి= సంధించి; విల్లున్+తునిమి= ధనువును ఖండించి; ఏడ్తెఱన్= విజృంభించి; ఇరువది+ఏను+తూపులు= ఇరవై అయిదు బాణాలు; వడిన్= వేగంగా; అడరింపన్= ప్రయోగించగా; రయమునన్= వేగంగా; అతఁడు= అతడు (దుశ్శాసనుడు); ఒండు+విల్లు+ఎత్తికొని= ఇంకో ధనువు పుచ్చుకొని; శర వితతిన్= బాణాల సముదాయాన్ని; అంతంతన= క్రమక్రమంగా; నఱకి= ఖండించి; పాండవు+కేతనంబు= పాండవుని జెండాను (నకులుడి పతాకాన్ని); త్రుంచెన్= ఖండించాడు; దుర్ముఖుఁడు= దుర్ముఖుడు (దుర్యోధనుడి తమ్ములలో ఒకడు); సహదేవునితోడన్= సహదేవుడితో; తొడరి= వూని; మెఱుఁగు+వాలు+అమ్ములు+ఏసినన్= వెలుగొందే కఠినమైన బాణాలను ప్రయోగింపగా; ఆతఁడు= అతడు (సహదేవుడు); ఉఱక= లక్ష్యపెట్టక; అన్నియును= అన్ని బాణాలు; మగిడించి= తిరుగగొట్టి; రథ్యములన్+నొంచి= గుర్రాలను నొప్పించి, నొవ్వజేసి; అతని+సారథిన్= దుర్ముఖుడి రథం తోలేవాడిని; తెగటార్చి= చంపి; ఆర్చి= సింహనాదం చేసి; పేర్చెన్= అతిశయించాడు.

తాత్పర్యం: ఈ పద్యంలో దుర్ముఖుడికీ సహదేవుడికీ మధ్య జరిగిన యుద్ధం వర్ణించబడింది. ఉత్సాహంతో దుశ్శాసనుడు నకులుడితో తలపడ్డాడు. అతడిపై మిక్కిలి భయంకరాలైన వాడి బాణాలు ప్రయోగించాడు. నకులుడు చిరునవ్వుతో ఆ బాణాలను అన్నిటినీ ఖండించి వేసి దుశ్శాసనుడి ధనుస్సును ఒక్క బాణంతోనే ఖండించాడు. ఇరువది అయిదు బాణాలు ఆ రకంగా ప్రయోగించాడు. దుశ్శాసనుడు వేగంగా ఇంకో విల్లు ధరించి, నకులుడి బాణాలు నరికి, అతడి జెండాను కూలద్రోశాడు. దుర్ముఖుడు సహదేవుడితో యుద్ధానికి మార్కొన్నాడు. ప్రకాశమానమైన వాడి బాణం ప్రయోగించాడు. సహదేవుడు దుర్ముఖుడి బాణాలు అన్నీ తుత్తునియలు చేసి, అతడి రథం గుర్రాలను నొప్పించి, సారథిని గూల్చి సింహనాదం చేసి విజృంభించాడు.

విశేషం: 1. దరహాసాభిరాముడయ్యాడట నకులుడు - దుశ్శాసనుడు తనపై బాణాలు ప్రయోగించినపుడు. ఆ నవ్వులో ఎంతో అంతరార్థం ఇమిడివుంది. నకులుడి దృష్టిలో దుశ్శాసనుడు తనకు సరియైన ఉజ్జీకాడు. అంతేకాక యుద్ధభూమిలో, దారుణ సంగ్రామం మధ్య చిరునవ్వు చిందించగల వీరులను చిత్రించాడు తిక్కన. తరువాతి పద్యంలో కూడ ధర్మరాజు శల్యుడితో యుద్ధం చేసేటప్పుడు తన విల్లును శల్యుడు ఖండించినపుడు 'కన్నుల నవ్వు' వెలయించాడట. పెదవుల మీది నవ్వు వేరు. కన్నుల నవ్వు వేరు. నకులుడిది పెదవుల మీది నవ్వు. ధర్మరాజు అంతకంటె ప్రగల్భుడు. అతని నవ్వు కన్నులలో మెరిసింది.

చ. సరభసుఁ డై యుధిష్ఠిరుఁడు శల్యునిఁ దాఁకుడు నాతఁ డమ్మహీ
శ్వరు మహనీయచాప మనివారణఁ ద్రుంచిన, నొండు విల్లు భీ
కరతరశీఘ్రలీలఁ గొని కన్నుల నవ్వుచుఁ బాండవాగ్రజుం
డరిబల ముక్కు దక్క వడి నాతనిపైఁ గురిసెన్ శితాస్త్రముల్. 255

ప్రతిపదార్థం: ఈ పద్యంలో- ధర్మరాజ శల్యుల మధ్య జరిగిన యుద్ధం వర్ణించబడింది. స+రభసుఁడు+ఐ= వేగిరపాటుతో కూడిన వాడై; యుధిష్ఠిరుఁడు= ధర్మరాజు; శల్యునిన్+తాఁకుడున్= శల్యుడిని మార్కొనగా; ఆతఁడు= ఆ శల్యుడు; ఆ+మహీ+ఈశ్వరు, మహనీయచాపము= రాజు (ధర్మరాజుయొక్క) గొప్పవిల్లు; అనివారణన్= అడ్డగించటానికి వీలులేకుండగా; త్రుంచినన్= ఖండించగా; ఒండు+విల్లు= ఇంకో ధనుస్సు; భీకర, తర, శీఘ్ర, లీలన్= మిక్కిలి భయంకరమైన వేగంతో; కొని= పరిగ్రహించి; కన్నులన్, నవ్వుచున్= కన్నులతో నవ్వుతూ; పాండవ+అగ్రజుండు= పాండవుల అన్నగారు- ధర్మరాజు; అరి+బలము= శత్రుసేన; ఉక్కు+తక్కున్= బలమును కోలుపోయేటట్లుగా; వడిన్= శీఘ్రంగా; శిత+ఆస్త్రములన్= వాడి అయిన బాణాలు; ఆతనిపైన్= శల్యుడిపై; కురిసెన్= వర్షించాడు.

తాత్పర్యం: ఉత్సాహవేగంతో ధర్మరాజు శల్యుడిని మార్కొన్నాడు. శల్యుడు నకుల సహదేవులకు సాక్షాత్తు మేనమామ. బహుముఖప్రజ్ఞా ధురీణుడు అయిన వీరుడుగా సుప్రసిద్ధుడు. అతడు- ధర్మరాజు విల్లును ఖండించాడు. ధర్మరాజు కన్నులలో చిరునవ్వు మెరిసింది. మరొక విల్లు చేబూని ధర్మరాజు శల్యుడిపై వాడి బాణాలు వర్షించాడు.

విశేషం: 1. ధర్మరాజు ధైర్యంగా శల్యుడిపైకి విజృంభించగలడు. అంత ధైర్యంగా శల్యుడు ధర్మరాజు మీదికి విజృంభించలేడు. శల్యుడు స్వీయాంతరాత్మ పీడితుడు. అతడు దుర్యోధనుడి పక్షంలో చేరటం, తెలిసి చేసిన తప్పు. ఆతడనేక యుద్ధాలలో ఆరి తేరిన వృద్ధవీరుడు. శల్యుడు తన తల నరుక లేడని ధర్మరాజుకు తెలుసు. అది అతడి కన్నుల నవ్వులోని ఆంతర్యం. తిక్కన - నవ్వుల గూర్చి 254 పద్య వ్యాఖ్యానం చూడవచ్చు.

సీ. ఏచి ధృష్టద్యుమ్నుఁ డేడ్తెఱ ద్రోణుపై । నడరిన నవలీల నాతఁ డతని
ఘనశరాసనముఁ ద్రిఖండంబుగాఁ జేసె । నారాచ మొక్కటి నాటె మేన;
వేఱొక్క విల్లెత్తి వెసఁ బదునాలుగు । శాతబాణములఁ బాంచాలసుతుఁడు
గలశజు నేసె; మాగధసహదేవుండు । భూరిశ్రవునిఁ దాఁకి భుజశిఖరము
తే. మెఱుఁగుటమ్ముల నొంచిన నుఱక యతఁడు । వానియుర ముగ్రశరమున వ్రయ్యఁజేయ,
వార లిరువురు వృత్రుండు వాసవుండుఁ । బోలెఁ బోరిరి సేనలు వొగడుచుండ. 256

ప్రతిపదార్థం: ఏచి= విజృంభించి; ధృష్టద్యుమ్నుఁడు= ధృష్టద్యుమ్నుడు (పాండవసేనాని ద్రుపద మహారాజు కొడుకు); ఏడ్తెఱన్= పరాక్రమంతో; ద్రోణుపైన్= ద్రోణాచార్యుడిపై; అడరినన్= చెలరేగి మార్కొనగా; అవలీలన్= సులువుగా; ఆతఁడు= ద్రోణుడు; అతని= ఆ ధృష్టద్యుమ్నుడి యొక్క; ఘన, శర+అసనమున్= గొప్ప వింటిని; త్రి+ఖండంబుగాన్+చేసి= మూడు ముక్కలు చేసి; నారాచము+ఒక్కటి= ఒక బాణాన్ని; మేనన్= శరీరంలో (ధృష్టద్యుమ్నుని శరీరంలో); నాటెన్= గ్రుచ్చుకొనునట్లు ప్రయోగించాడు; పాంచాల+సుతుఁడు= పాంచాల దేశరాజుకొడుకు- ధృష్టద్యుమ్నుడు; వేఱు+ఒక్క+విల్లు+ఎత్తి= ఇంకో ధనుస్సు సమకూర్చుకొని; వెసన్= శీఘ్రంగా; పదు నాలుగు, శాత, బాణములన్= పద్నాలుగు వాడి అమ్ములతో; కలశజున్= ద్రోణుడిని; ఏసెన్= కొట్టాడు; మాగధ సహదేవుండు= మగధ దేశాధిపతి అయిన సహదేవుఁడు; భూరిశ్రవునిన్+తాఁకి= భూరిశ్రవునితో తలపడి; భుజ శిఖరమున్= అతని మూపును; మెఱుఁగు+అమ్ములన్= ప్రకాశించే బాణాలతో; నొంచినన్= నొవ్వచేయగా; ఉఱుక+అతఁడు= లక్ష్యపెట్టక; అతఁడు(భూరిశ్రవుడు); వాని+ఉరము= అతని (మగధ సహదేవుడి) వక్షఃస్థలం; ఉగ్ర+శరమునన్= భీకరమైన బాణంతో; వ్రయ్యన్+చేయన్= పగులగొట్టగా; వారలు+ఇరువురున్= మాగధ సహదేవుడూ భూరిశ్రవుడూ; వృత్రుండు+వాసవుండున్+పోలెన్= వృత్రుడు అనే రాక్షసుడు మరియు దేవేంద్రుడు వలె; సేనలు+పొగడుచుండన్= పాండవ కౌరవ సైన్యాలు ప్రశంసిస్తూ ఉండగా; పోరిరి= యుద్ధం చేశారు.

తాత్పర్యం: పాండవ సేనాపతి అయిన ధృష్టద్యుమ్నుడు ద్రోణుడిని తాకాడు ఉత్సాహంతో. ద్రోణుడు ధృష్టద్యుమ్నుడి ధనుస్సును మూడు ముక్కలు చేశాడు. అంతేకాక అతడి శరీరంలో గ్రుచ్చుకొనేటట్లుగా బాణం వేశాడు. పాంచాల రాజు ద్రుపదుడి కొడుకు ధృష్టద్యుమ్నుడు ఇంకొక ధనుస్సు ఎత్తి పద్నాలుగు వాడి బాణాలు ద్రోణుడిపై ప్రయోగించాడు. మగధ దేశాధిపతి అయిన సహదేవుడు, భూరిశ్రవుడిని తాకి అతడి మూపును ఛేదించాడు. భూరిశ్రవుడు సహదేవుడి వక్షఃస్థలం ఛేదించేటట్లుగా బాణాలు వేశాడు. వారు ఇద్దరూ అలనాడు వృత్రుడు దేవేంద్రుడు పోరాడినట్లుగా యుద్ధం చేశారు. ఇరుపక్షాలలోని సైనికులు ఆ ద్వంద్వయుద్ధం చూచి ప్రశంసించారు.

విశేషం: 1. కలశజుఁడు= కలశంలో పుట్టినవాడు= ద్రోణుడు- మహాభారతంలోని వర్ణనలు కొన్నిటిని నవీనవిజ్ఞానశాస్త్రం ఋజువు పరిచింది. ఇరవయ్యో శతాబ్దంలో టెస్ట్‌ట్యూబ్ సంతానం గూర్చి ప్రయోగాలు జరుగుతున్నాయి. ఫలించాయి కూడా. ద్రోణుడు అయోనిజుడు. ఈ విషయం భావిశాస్త్ర పరిశోధనల వలన ఇంకా తేలవలసి ఉన్నది.

2. పౌరాణిక కాలంలో సుప్రసిద్ధమైన యుద్ధం ఇంద్రుడికీ వృత్రునకు మధ్య జరిగిన ఘోర సంగ్రామం. ఉభయులూ వీరాధివీరులే. మాగధ సహదేవుడు, భూరిశ్రవుడు వీరాధివీరులే.

తే. ధృష్టకేతుండు కౌరవోత్కృష్టుఁ డైన । బాహ్లికుని మాఱుకొని తీవ్రబాణనవక
మేసె; నాతండు లాఘవ మెసక మెసఁగ । ఘనశరంబులు పదినవకములు గురిసె. 257

ప్రతిపదార్థం: కౌరవ+ఉత్కృష్టుఁడు+ఐన= కౌరవులలో గొప్పవాడైన బాహ్లికుని; ధృష్టకేతుండు= ధృష్టకేతుడు; మాఱుకొని= తలపడి; తీవ్ర, బాణ, నవకము+ఏసెన్= వాడి బాణాలు తొమ్మిది ప్రయోగించాడు; ఆతండు= బాహ్లికుడు; లాఘవము+ఎసకము+ఎసఁగన్= సౌలభ్యం శోభిల్లగా; ఘన+శరంబులు= గొప్ప బాణాలు; పది+నవకములు= తొంభై; కురిసెన్= వర్షించాడు.

తాత్పర్యం: ధృష్టకేతుడు కౌరవులలో వృద్ధుడూ వీరుడూ అయిన బాహ్లికుడిపై తలపడ్డాడు. తలపడి వాడి అయిన తొమ్మిది బాణాల వరుస బాహ్లికుడిపై ప్రయోగించాడు. బాహ్లికుడు ధృష్టకేతుడిపై తొంభై బాణాలు ప్రయోగించాడు.

విశేషం: 1. మహాభారత యుద్ధంలో పాల్గొనిన వృద్ధవీరులలో పేర్కొనదగినవాడు బాహ్లికుడు. అతడు శంతనుడి (భీష్ముడి తండ్రికి) తమ్ముడు. అతడితోపాటు భారత యుద్ధంలో అతని కొడుకు సోమదత్తుడు, మనుమడు భూరిశ్రవుడు గూడ పాల్గొన్నారు.

2. ధృష్టకేతుడు శిశుపాలుడి కొడుకు.

క. అచలనిభుఁ డగు నలంబసుఁ। బ్రచలితభూభాగుఁ డగుచుఁ బఱతెంచి ఘటో
త్కచుఁడు దలపడిన నా రజ। నిచరేంద్రుల పోరు కీర్తనీయం బయ్యెన్. 258

ప్రతిపదార్థం: అచలనిభుఁడు+అగు= కొండతో సమానుడైన; అలంబసున్= అలంబసుడు అనే పేరుగల వాడిని; ఘటోత్కచుఁడు= ఘటోత్కచుడు; ప్రచలిత, భూభాగుఁడు+అగుచున్= కంపించిన భూభాగం కలవాడౌతూ (నడుస్తుంటే భూమి కంపించేటట్లుగా దాడి చేసిన వాడౌతూ అని భావం) పఱతెంచి= వచ్చి; తలపడినన్= మార్కొనగా; ఆ+రజనిచర+ఇంద్రుల+పోరు= ఆ రాక్షసుల మధ్య జరిగిన యుద్ధం; కీర్తనీయంబు+అయ్యెన్= పొగడదగినది అయింది.

తాత్పర్యం: కొండలాంటి అలంబసుణ్ణి భూమి కంపించేటట్లు ఘటోత్కచుడువచ్చి మార్కొనగా ఆ రాక్షసుల పోరు ప్రశంసనీయ మయింది.

విశేషం: 1. తిక్కన యుద్ధాన్ని ఒక పరాక్రమ యజ్ఞంగా భావించాడు. ఒక్క చోట కూడా దానిని మారణహోమంగా నరమేధంగా భావించి నిరసించలేదు. యుద్ధభూమి 'రమణీయ' భయానకమని అభివర్ణించాడు తిక్కన. ఇచ్చట రాక్షసవీరుల మధ్య యుద్ధం కీర్తనీయం అని తిక్కన అభివర్ణన.

సీ. గర్వంబు మెఱయ శిఖండి యశ్వత్థామ। నెదిరిన, నాతండు మద మెలర్ప
నారాచ ము�రమున నాటింప, నొచ్చియు। ద్రుపదనందనుఁ డతిక్రూరశరముఁ
దద్వక్షమునఁ గీలితము సేసె; భగదత్తు। డుఱక విరాటుపై నురవడించి
కదిసిన గగనంబు గప్పె బాణాసార। యుగమును బెరసి మహోగ్రభంగిఁ

తే. గైకయాధీశుఁ డగు బృహత్ క్షత్రవిభుఁడు। గృపుఁడు దలఁపడి యొండొరు కేతనముల
హరుల ధనువులఁ దునిమి నిష్ఠురకృపాణ। దారుణాకారు లై యరదములు డిగిరి. 259

ప్రతిపదార్థం: శిఖండి= ద్రుపదుడి కొడుకు; గర్వంబు+మెఱయన్= మదం వెలుగొందగా; అశ్వత్థామన్= ((ద్రోణుడి కొడుకైన) అశ్వత్థామను; ఎదిరినన్= తాకగా; ఆతండు= (అశ్వత్థామ); మదము+ఎలర్పన్= గర్వం శోభిల్లగా; నారాచము= బాణం; ఉరమునన్= వక్షఃస్థలంపై; నాటింపన్= గ్రుచ్చుకొనేటట్లు చేయగా; నొచ్చియున్= బాధపడికూడా; ద్రుపద నందనుఁడు= ద్రుపదుని కొడుకు- శిఖండి; అతిక్రూర శరము= మిక్కిలి కఠినమైన బాణం; తద్+వక్షమునన్= ఆతడి (అశ్వత్థామ) ఉరమందున; కీలితము+చేసెన్= నాటేటట్లు చేశాడు; భగదత్తుఁడు= భగదత్తుడు (అనే వృద్ధవీరుడు); ఉఱుక= లెక్కచేయక; విరాటుపైన్= విరాట రాజు మీద; ఉరవడించి= విజృంభించి; కదిసినన్= తాకగా; బాణ+ఆసార యుగమును= ఉభయులు ప్రయోగించిన బాణాల వర్షం; బెరసి= కూడి; మహా+ఉగ్రభంగిన్= మిక్కిలి భయంకరమైన విధంగా; గగనంబున్+కప్పెన్= ఆకాశాన్ని ఆవరించింది; కైకయ+అధీశుఁడు+అగు= కేకయ దేశ ప్రజలకు రాజు అయిన; బృహత్క్షత్ర+విభుఁడు= బృహత్క్షత్రుడు అనే రాజు; కృపుఁడున్= కృపాచార్యుడు; తలపడి= యుద్ధం చేసి; ఒండు+ఒరుల= ఒకరిదింకొకరు; కేతనములన్= జెండాలను; ధనువులన్= విండ్లను; తునిమి= ఖండించి; నిష్ఠుర, కృపాణ, దారుణ+ఆకారులు+ఐ= కఠినమైన కత్తులు ధరించటంచేత భయంకరమైన ఆకారాలు కలవారై; అరదములు డిగిరి= రథాలనుండి నేలపైకి దిగారు.

తాత్పర్యం: గర్వం వెలుగొందగా శిఖండి అశ్వత్థామ నెదిరించాడు. అశ్వత్థామ దర్పం శోభిల్లగా బాణాన్ని అతడి గుండెలో గుచ్చాడు. దెబ్బతిని కూడ శిఖండి మిక్కిలి కఠినమైన బాణాన్ని అశ్వత్థామ వక్షాన నాటేటట్లు వేశాడు. భగదత్తుడు లక్ష్యపెట్టకుండా విరాటుడిపై విజృంభించి తాకగా వారిద్దరి బాణవర్షం ఆకాశాన్ని మహాభయంకంగా ఆచ్ఛాదించింది. కేకయరాజైన బృహత్ క్షత్రవిభుడూ, కృపుడూ తలపడి ఒకరొకరి కేతనాలు, గుఱ్ఱాలు, విండ్లూ త్రుంచుకొని భయంకరాకారాలతో కఠినమైన కత్తులు గైకొని రథాలు దిగారు.

విశేషం: 1. శిఖండి- ద్రుపదుడి కొడుకు. మొదట స్త్రీగా ఉద్భవించి పిదప లింగంమారి పురుషవీరుడైనాడు. పాంచాల ప్రభువు ద్రుపదుడికి ద్రోణాచార్యుడికీగల వైరం సుప్రసిద్ధం. అందుచేత ద్రోణుడి కొడుకు అశ్వత్థామ ద్రుపదుడి కొడుకు శిఖండి ద్వంద్వ యుద్ధానికి పూనుకొన్నారు.

2. భగదత్తుడు- వృద్ధవీరుడు. ఇతడి వాహనం సుప్రతీకం అనే పేరుగల ఏనుగు. అది భయంకరమైనది. భారత యుద్ధంలో భగదత్తుడినీ, అతని ఏనుగు సుప్రతీకాన్నీ అర్జునుడు సంహరిస్తాడు.

ఉ. అట్టియెడం గనుంగొని జయద్రథుఁడున్ ద్రుపదుండు వచ్చి యా
కట్టుపకాసు లిద్దఱకు గ్రక్కున నడ్డము సొచ్చి యొండొరున్
బెట్టుగఁ దాఁకి తీవ్రశరపీడితదేహులఁ జేసి, రెట్టి లా
వెట్టిపరాక్రమస్ఫురణ యెట్టిరయం బని పిచ్చలింపఁగన్. 260

ప్రతిపదార్థం: అట్టి+ఎడన్= ఆ సమయంలో (కృపాచార్యుడు - బృహత్ క్షత్ర విభుడూ విరథులూ, నేలకు దిగి కత్తులతో తలపడి యుద్ధం చేసే సమయంలో); జయద్రథుడున్= సైంధవుడూ; ద్రుపదుండు= ద్రుపదుడు; వచ్చి= చేరి; ఆ+కట్టుపకాసులు+ఇద్దరకున్= ఆ వీరులు ఇద్దరకు; గ్రక్కునన్= వేగంగా; అడ్డము+చొచ్చి= మధ్యగా నిలబడి; ఒండు+ఒరున్= ఒకరితో ఒకరూ; బెట్టుగన్+తాకి= తీవ్రంగా మార్కొని; ఎట్టి+లావు= ఎటువంటి బలము; ఎట్టి+పరాక్రమ+స్ఫురణ= ఎటువంటి శౌర్య ప్రదర్శనం; ఎట్టి+రయంబు= ఎటువంటి వేగం; అని= అని (సేనలు); పిచ్చలింపగన్= భయపడునట్లుగా (ఆశ్చర్య చకితంకాగా); తీవ్ర+శర+పీడిత+దేహులన్= మిక్కుటముగా బాణాలచే పీడింపబడిన శరీరాలు కలవారినిగా; చేసిరి= చేశారు;

తాత్పర్యం: ఆ సమయంలో చూచి జయద్రథుడు ద్రుపదుడూ ఆ వీరులిద్దరికీ వేగంగా అడ్డుపడి ఎట్టి బలం, ఎట్టి శౌర్య ప్రదర్శనం, ఎట్టి వేగం అని సేనలు రెండూ భీతి చెందే విధంగా వారు ఒకరినొకరు తీవ్రంగా ఎదుర్కొని మిక్కుటమైన బాణాలతో ఒకళ్ళొకళ్ళ దేహములను గాయపరచుకొన్నారు.

విశేషం: కట్టు పకాసి: కట్టుప కాసుడు= వీరుడు అని శబ్దరత్నాకర నిఘంటువులోని అర్థం. బ్రౌను దొర నిఘంటువులో గట్టుపకాసు- గట్టు= పర్వతము, వంటివాడు - ధీరుడు అని అర్థం ఉన్నది. ఈ శబ్ద స్వరూపంపై ఇంకా పరిశోధన జరగాలి. 'గట్టుపకాసి'యే సాధురూపంగా గ్రహించాలి అని నా అభిప్రాయం.

ఉ. మన్యుసముజ్జ్వలుండు నభిమానియు నైన వికర్ణుఁడున్ యుధా
మన్యుఁడు నేచి యొండొరుల మార్కొని రౌద్రరసం బలోక సా
మాన్యము గాఁగ నస్ఖలితమత్సరముల్ మెఱయంగఁ బోరి ర
న్యోన్యనిశాతసాయక నిరంతరవర్షములన్ మునుంగుచున్. 261

ప్రతిపదార్థం: మన్య+సమ్+ఉజ్జ్వలుండు= రోషంతో కూడి వెలుగొందే వాడు; అభిమానియున్+ఐన= ఆత్మగౌరవం కలవాడూ అయిన; వికర్ణుఁడున్= వికర్ణుడు; యుధామన్యుఁడున్= యుధామన్యుడూ; ఏచి= విజృంభించి; ఒండొరులన్= ఒకరి నొకరు; మార్కొని= ఎదిరించిపోరాడి; రౌద్రరసం= కోపంతో నిండిన రోషం; అ+సామాన్యము+కాఁగన్= సాటిలేనిది అయ్యేటట్లుగా; న+స్ఖలిత, మత్సరముల్= జారిపోని ద్వేషములు; మెఱయంగన్= ప్రకాశించేటట్లుగా, అన్యోన్య, నిశాత, సాయక, నిరంతర, వర్షములన్= ఒండొరులపై ప్రయోగించిన వాడి బాణాల వానతో ఎల్లప్పుడు తడిసిపోతూ; మునుంగుచున్= మునకలువేస్తూ (నిమగ్నులౌతూ); పోరిరి= యుద్ధం చేశారు.

తాత్పర్యం: రోషంతో- ఆత్మగౌరవంతో కూడిన వికర్ణుడూ, యుధామన్యుడూ, విజృంభించి ఒండొరులను ఎదిరించి, అలోక సామాన్యమైన రౌద్రరసంతో తగ్గిపోవని పగతో వారిద్దరు ఒకరిపై వొకరు ప్రయోగించుకొన్న ఎడతెరిపి లేని బాణవర్షాలలో మునుకలు వేశారు.

విశేషం: రౌద్రము - నవరసాలలో ఒకటి. రౌద్రానికి స్థాయి భావం - క్రోధం.

ఆ. ధరణినాథ! చేకితానుండు గడఁగి సు । శర్మమీఁద నిశితశరచయంబు
గురియ, నితఁడు నతనిఁ గ్రూరాస్త్రనికర సం । పిహితగాత్రుఁ జేసి పేర్చి యార్చె. 262

ప్రతిపదార్థం: ధరణినాథ!= ఓరాజా! (ఓ ధృతరాష్ట్ర మహారాజా!); చేకితానుండు= చేకితానుడు; కడఁగి= పూని; సుశర్మ మీఁదన్= సుశర్మ (అనే రాజు) మీద; నిశిత+శర+చయంబున్= వాడి బాణాల సముదాయమును; కురియన్= వర్షింపగా; ఇతఁడు= సుశర్మ; అతనిన్= ఆ చేకితానుడిని; క్రూర+అస్త్ర, నికర, సంపిహిత+గాత్రున్+చేసి= కఠోరములైన మంత్ర బాణ సముదాయంచేత పీడించబడిన శరీరంగల వాడినిగా చేసి; పేర్చి= అతిశయించి; ఆర్చెన్= సింహనాదం చేశాడు.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! చేకితానుడు సుశర్మపై వాడియైన బాణాలను ప్రయోగించాడు. అంతట సుశర్మ చేకితానుడి శరీరాన్ని తీవ్రమైన బాణాల సముదాయంతో కప్పివైచి సింహనాదం చేశాడు.

క. శకుని ప్రతివింధ్యుఁ దాఁకిన । బ్రకటబలుం డా యుధిష్ఠిరప్రియసుతుఁ డు
ద్భృకుటి యగుచుఁ గవిసెను సిం । హ కిశోరము గజముఁ బొదువున ట్లతనిపయిన్. 263

ప్రతిపదార్థం: శకుని= శకుని (సుయోధనుడి మేనమామ); ప్రతివింధ్యున్= ధర్మరాజు కొడుకును; తాఁకినన్= మార్కొనగా; ప్రకట+బలుండు= కనిపించిన పరాక్రమం కలవాడు; ఆ+యుధిష్ఠిర, ప్రియ, సుతుఁడు= ధర్మరాజు అనుగు కొడుకు; సింహ+కిశోరము= సింగపు పిల్ల; గజమున్= ఏనుగును; పొదువు+అట్లు= పట్టుకొనినట్లు; అతనిపయిన్= ఆ శకునిపై; ఉద్+భృకుటి+అగుచున్= పైకెత్తిన కనుబొమలు కలవాడౌతూ; కవిసెన్= మార్కొన్నాడు.

తాత్పర్యం: ప్రతివింధ్యుడిని శకుని మార్కొన్నాడు పరాక్రమంతో భాసిల్లే ధర్మరాజు ప్రియ పుత్రుడైన ప్రతివింధ్యుడు కొదమసింగం ఏనుగుపై పడినట్లు కనుబొమలు పైకెత్తి ఆ శకునిపై పడ్డాడు.

తే. భీమనందనుఁ డగు శ్రుతసోముఁ గడిమిఁ । దాఁకెఁ గాంభోజనృపతి సుదక్షిణుండు
వార లిరువురు నొండొరుం గ్రూరబాణ । జాలముల నెట్లుఁ దెరలుపఁ జాలరైరి. 264

ప్రతిపదార్థం: కాంభోజ+నృపతి= కాంభోజ దేశం పాలించేరాజు; సుదక్షిణుండు= సుదక్షిణుడు అనే పేరుగలవాడు; భీమ+నందనుఁడు+అగు= భీముడి కొడుకైన; శ్రుతసోమున్= శ్రుతసోముడిని; కడిమిన్= పౌరుషంతో; తాఁకెన్= మార్కొన్నాడు; వారలు+ఇరువురున్= వారు ఇద్దరు (సుదక్షిణుడూ, శ్రుతసోముడూ); ఒండొరులన్= ఒకరి నొకరు; క్రూర, బాణ, జాలములన్= కఠినములైన అమ్ముల సముదాయాలతో; ఎట్లు= ఏ విధంగానూ; తెరలుపన్+చాలరు+ఐరి= చెదర గొట్టలేకపోయారు.

తాత్పర్యం: కాంభోజరాజు భీముడి కొడుకైన శ్రుతసోముడిని మార్కొన్నాడు. ఉభయులు ఒకరిపై ఒకరు వాడి బాణాలు ప్రయోగించుకొన్నారు. ఒకరి ధాటిని ఒకరు అరికట్ట లేకపోయారు. సమయుద్ధం కొనసాగింది.

ఉ. అంతకవిక్రముండు మహిమాస్పదమూర్తి భుజంగకన్యకా
సంతతకీర్తనీయబలశాలి గిరీటితనూభవుం డిరా
వంతుఁడు బాహుగర్వధనవంతు శ్రుతాయువుఁ దాఁకె వార ల
త్యంతరయంబునన్ విరథు లైరి పరస్పరబాణఘట్టనన్. 265

ప్రతిపదార్థం: అంతక+విక్రముండు= యముడి పరాక్రమం వంటి పరాక్రమం కలవాడు; మహిమ+ఆస్పద, మూర్తి= గొప్పతనానికి నెలవైన ఆకృతి గలవాడు; భుజంగ, కన్యకా, సంతత, కీర్తనీయ, బలశాలి= నాగకన్యక ఉలూచి చేత ఎడతెగకుండ పొగడదగిన బలము గలవాడు; కిరీటి, తనూ, భవుండు= అర్జునుడి కొడుకు; ఇరావంతుఁడు= ఇరావంతుడనే పేరుగలవాడు; బాహు+గర్వ, ధనవంతున్= భుజబల పరాక్రమం అనే గొప్ప ధనంతో కూడినవాడిని; శ్రుతాయువున్= శ్రుతాయువు అనే పేరుగలవాడిని; తాఁకెన్= మార్కొన్నాడు; వారలు= ఆ ఇరువురూ - ఇరావంతుడూ, శ్రుతాయువూ; అత్యంత+రయంబునన్= మిక్కిలి వేగంగా; పరస్పర, బాణ ఘట్టనన్= ఒకరి బాణాలచేత మరియొకరు కొట్టబడి; విరథులు+ఐరి= రథాలు పోగొట్టుకొన్నవారైనారు.

తాత్పర్యం: యముడివంటి పరాక్రమం కలవాడూ, గొప్పతనానికి చోటైన ఆకృతి కలవాడూ,నాగకన్యక ఉలూచి చేత ఎల్లప్పుడు కొనియాడదగిన బలముగల వాడునూ అయిన అర్జునుడి కొడుకు ఇరావంతుడు, ధృతరాష్ట్రుడి కుమారుడైన శ్రుతాయువును మార్కొన్నాడు. వారు ఇరువురూ పోరాడారు. ఇరువురి రథాలు కూలిపోయాయి.

విశేషం: అర్జునుడికి నాగకన్యక అయిన ఉలూచికి పుట్టినవాడు ఇరావంతుడు.

సీ. విందానువిందులు గ్రందుగ వెసఁ గుంతి । భోజుని నాతనిపుత్రుఁ దాఁకి
రా పురజిత్తు బాణాసారమున విందుఁ । బొదివె నుగ్రతఁ గుంతిభోజుఁ డేయు
తూపులు పెనుగద దొలఁగంగ జడియుచు । ననువిందుఁ డతనిపై నడరె బెలుచఁ;
గైకేయు లేవురు గాంధారరాజు లే । వురతోడఁ గ్రూరసంగర మొనర్చి;

తే. రుత్తరునిమీఁద నీ తనయుండు దీర్ఘ । బాహుఁ డురవడిఁ గదిసి యుత్సాహలీల
నెఱపె; నకులాత్మజుఁడు శతానీకుఁ డేచి । వడి నులూకునిఁ దలపడి కడిమి మెఱసె. 266

ప్రతిపదార్థం: వింద+అనువిందులు= విందుడూ అనువిందుడూ (అనేవారు); క్రందుగన్+వెసన్= ఒక్కుమ్మడిగా- వేగంగా; కుంతిభోజునిన్+ఆతని పుత్రున్= కుంతిభోజుడిని అతడి కుమారుని; తాఁకిరి= తలపడిరి; ఆ+పురజిత్తు= ఆపురజిత్తు అనేవాడు; బాణ+అసారమునన్= అమ్ముల జడివానచేత; విందున్= విందుని; పొదవెన్= కప్పాడు; ఉగ్రతన్= భయంకరంగా; కుంతి భోజుఁడు+ఏయు= కుంతిభోజుడు ప్రయోగించే; తూపులు= బాణాలు; పెను+గదన్= పెద్ద గదతో; తొలఁగంగన్+జడియుచున్= తొలగిపోయేటట్లు చలింపజేస్తూ; అనువిందుఁడు= అనువిందుడనే వాడు (విందుడి తమ్ముడు); పెలుచన్= అతిశయించి; అతనిపైన్+అడరెన్= అతడిపై విజృంభించాడు; కైకేయులు+ఏవురు= కేకయ దేశానికి చెందిన రాజులు అయిదుగురు; గాంధార, రాజులు+ఏవుర తోడన్= గాంధార రాజ్యానికి చెందిన అయిదుగురు రాజులతో; క్రూర, సంగరము+ఒనర్చిరి= భీకరమైన యుద్ధం చేశారు; ఉత్తరునిమీఁదన్= ఉత్తరుడిపైన; నీ+తనయుండు= నీ కొడుకు; దీర్ఘబాహుఁడు= దీర్ఘబాహుడు; ఉరవడిన్= మిక్కిలి వేగంగా; కదిసి= మార్కొని; ఉత్సాహ, లీలన్+నెఱపెన్= ఆవేశపూరితమైన యుద్ధం చేశాడు; నకుల+ఆత్మజుఁడు= నకులుడి కొడుకు; శతానీకుఁడు= శతానీకుడనేవాడు; ఏచి= విజృంభించి; వడిన్= వేగంగా; ఉలూకునిన్= ఉలూకుడు అనువాడిని; తలపడి= మార్కొని; కడిమి+మెఱసెన్= పరాక్రమంతో వెలుగొందాడు.

తాత్పర్యం: విందుడు అనువిందుడు అనే వీరులు కుంతిభోజుడినీ, అతడి పుత్రుడినీ మార్కొన్నారు. పురజిత్తు విందుడితో తలపడి బాణవర్షంతో అతడిని ముంచెత్తాడు. కుంతిభోజుడు ప్రయోగించిన బాణ పరంపరలను తన గదతో ఎదుర్కొని అనువిందుడు అతడిపై విజృంభించాడు. కేకయ రాజ్యానికి ప్రభువులైన ఐదుగురు వీరులూ గాంధార రాజులు అయిదుగురితో తలపడ్డారు. దీర్ఘబాహుడు (ఓ ధృతరాష్ట్ర మహారాజా, నీ కొడుకు) ఉత్తరుడి మీదికి విజృంభించాడు. నకులుడి కొడుకు శతానీకుడు విజృంభించి ఉలూకుడిని మార్కొన్నాడు.

విశేషం: 1. భారతయుద్ధంలో 'ఎక్కటి కయ్యం' ఒకే వీరుడు మరో వీరుడితో మాత్రమే పోరాడటం. అది ఒక పద్ధతి. ఇద్దరు మరో ఇద్దరితో, ఐదుగురు ఐదుగురితో క్రందడిపోరు. ఇంకొక పద్ధతి. విందానువిందులు కుంతిభోజుడితో ఆతని కొడుకులతో యుద్ధం చేశారు. అట్లే కేకయ పంచకం గాంధారరాజ పంచకంతో.

2. ఉత్తరుడు విరాటరాజు కొడుకు. ఉలూకుడు శకుని కొడుకు. శకుని దుర్యోధనుడి మేనమామ.

వ. ఇవ్విధంబున వెండియు రెండు సేనలం జేయంగల దండి మగ లొండొరులం దాఁకిన, నధికసంరంభ ద్వంద్వయుద్ధంబు సిద్ధచారణఖేచరులు సూచి పొగడుచుండ నిగిడి, చతురంగంబులుం దనతన జాతిం బదులు పదులును నూఱులు నూఱులును, వేలు వేలును, బెక్కులు పెక్కులునుం దలపడి,యెడనెడంగలయన్ బెరయం గ్రమంబున సందడి కయ్యంబు నూలుకొనినఁ గ్రందునం దమకించి యుభయ సైనికు లున్మత్తుల గతిం గవియ బాణంబులుఁ గృపాణంబులుఁ గరిదంతంబులు నరదంబుల నొగలు నొండొంటిం దాఁకి తుత్తుమురులయిన తుములంబు కతన భయంకరం బగు నతిసంకులంబున సామజవాజిరథంబుల యురవడికి నోసరింపని కాలు బలంబులు, నుత్తుంగమాతంగస్యందన సందోహంబుల పయిం బఱపు రాహుతులును, గరటిఘటావిఘటనంబు గావించు రథికులును, నిది యది యనక యెల్ల బలంబులం జొచ్చిన మొగంబునఁ జిందఱవందఱ సేయు గజారోహకులు నగుచు నిర్మర్యాదంబుగాఁ బెనంగు సైన్యద్వితయంబు మందరక్షుభితాంబుధిచందం బగుటకుం దగి, యుచ్చి పోయెడు శరంబులు నిరుమెయిన్ గెలిచిన కుంతక్షురి కాదులును, బ్రవాళజాలంబులుం బోలి బొలుపు మిగులుచండ విశిఖంబులు ముఖంబులన్ బెట్టు నాటిన జిఱ్ఱనం దిరుగుశుండాలంబులు ప్రళయకాలంబున సురకరువలిచే దిర్దిరం దిరిగెడు కులనగంబులఁ గ్రేణిసేయఁ గరవాలగదాభల్లప్రముఖంబు లగు శస్త్రాస్త్రంబులఁ గుంభికుంభతురంగముఖ భటకపాలాదు లవియు చప్పళ్ళును, వివిధాయుధ ప్రహతుల నొఱలు హరినరనాగంబుల రావంబులును, దారుణప్రకారంబున దిక్తటదారణంబు సేయుచుం జెలంగఁ, జేయి దునిసినం దక్కటిచేతం గైదువు గొని కవియువారును, గాలు దునిసిన నెదిరి మీఁదికి లంఘించువారును, దల దునిసినం దారు మును గన్నిడినవారిం బొడిచిపడువారును, దెగిపడియు నవుడు గఱచుటయు బొమముడి వడుటయును సడలని తలల నొప్పువారును, మావంతులు నేనుంగులు వికలంబు లైన సమీపవర్తుల వాహనంబుల సమారోహణంబు సేసి పరాక్రమించువారును, నొచ్చియు నీడం బోక చెలులకుం జుట్టంబులకు నడ్డపడువారును మార్బలంబునం జేరి చుట్టం బని తప్పింపక నొప్పించువారును సుభటులు సొచ్చి చెండిన వండం దఱిగినట్లుండు వేదండహయచయంబులును నాశ్వికులు పైకొని మీఁది మానిసులం దునిమిన మ్రోడుపడు రథంబులును, రథనేమి ఘట్టనంబున దట్టంబు లగు పదాతిగాత్రంబులును, నిభంబులు వొదివి నేలతో వ్రేసియుఁ గాలం జమరియుఁ దూల వైచియుఁ గొమ్ముల గ్రుచ్చి యెత్తియు బారిసమరిన

వికటాకారంబు లగు ఘోటకంబులునై ఘోరభంగి యగు నంగరంబు సెల్లుచుండ మధ్యాహ్నసమయంబున. 267

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ రీతిగా; వెండియున్= మరియునూ; రెండు, సేనలన్= ఉభయ సైన్యాలలో; చేయన్+కల= కార్యశూరులైన - సమర్థులైన; దండి, మగలు= గొప్ప వీరులు; ఒండు+ఒరులన్= ఒకరిని ఒకరు; తాఁకినన్= తలపడగా; అధిక, సంరంభ, ద్వంద్వ, యుద్ధంబు= మిక్కిలి ఉత్సాహంతో కూడుకొనిన ఎక్కటి కయ్యము; సిద్ధ, చారణ, ఖేచరులు= సిద్ధులు, చారణులు, ఖేచరులు అనే వేల్పుతెగలు; చూచి= అరసి; పొగడుచుండన్= ప్రశంసిస్తూ ఉండగా; నిగిడి= అతిశయించి; చతురంగంబులున్= నాలుగు తెగలు (రథాలు, ఏనుగులు, గుర్రాలు, కాలిభటులు); తన+తన జాతిన్= తమ వర్గాలకు చెందిన (అనగా రథాలు రథాలను, ఏనుగులు ఏనుగులను, గుర్రాలు, గుర్రాలను, కాల్బలంలోని భటులు ఆ భటులను); పదులు పదులును= పది సంఖ్యలు ఆ సంఖ్యలో ఉన్న వాటిని; నూఱులు నూఱులును= వందలు వందలను; వేలు వేలును= నూరుపదుల సంఖ్య- ఆ సంఖ్యలో ఉన్న సమూహాన్ని; పెక్కులు+పెక్కులునున్= పెక్కు సంఖ్యలో ఉన్న అట్టి సంఖ్యాసమూహాన్ని; తలపడి= మార్కొని; ఎడన్+ఎడన్= అప్పుడప్పుడు; కలయన్+బెరయన్= కలసికొంటూ- తారసిల్లుతూ; క్రమంబునన్= వరుసగా; సందడి+కయ్యంబు= సంకుల సమరం; నూలుకొనినన్= విస్తరించగా; క్రందునన్= వేగంగా; తమకించి= ఉత్సహించి; ఉభయ, సైనికులు= రెండు వర్గాలలోని భటులు, కౌరవ పాండవ సేనలలోని భటులు; ఉన్మత్తుల గతిన్= పిచ్చివారివలె; కవియన్= తాకగా; బాణంబులున్= అమ్ములు; కృపాణంబులున్= కత్తులు; కరి, దంతంబులున్= ఏనుగుల దంతాలు; అరదంబుల, నొగలున్= రథాల ముందు భాగాలు; ఒండు+ ఒంటిన్+తాకి= ఒక దానితో మరియొకటి ఎదుర్కొని; తుమురులు+తుమురులు= ముక్కచెక్కలు; అయిన, తుములంబు+కతవన్= సంకుల సమరం కావటం చేత; భయంకరం+బగు= భీకరమైన; అతిసంకులంబునన్= మిక్కిలి దట్టమైన సందడి యుద్ధంలో; సామజ, వాజి, రథంబుల+ఉరవడికిన్= ఏనుగుల యొక్క, గుర్రాలయొక్క, రథాలయొక్క మిక్కిలి వేగానికి; ఓసరింపని= తప్పుకొనలేని; కాలు బలంబులున్= పదాతులు, కాలిభటులును; ఉత్తుంగ, మాతంగ, స్యందన, సందోహంబులపయిన్= ఎత్తైన ఏనుగులు, రథాల గుంపులపై; పఱపు= పరుగెత్తించే; రాహుతులును= రౌతులు (గుర్రాలపై స్వారీ చేసే భటులు); కరటి, ఘటా, విఘటనంబు+కావించు= ఏనుగుల సమూహాలను ముక్కలు ముక్కలుగా చేసే; రథికులును= రథాలపై యుద్ధం చేసే వీరులూ; ఇది+అది+అనక= ఇటు అటు అడ్డులేకుండా లెక్కచేయకుండగా; ఎల్ల+బలంబులన్= అన్ని సైన్యాలలో; చొచ్చిన= ప్రవేశించిన; మొగంబునన్= ముందలి భాగంలో; చిందఱ వందఱ+చేయు= ముక్కలు ముక్కలుగా చీల్చి వేసే, గజ+ఆరోహకులు= ఏనుగులపై ఎక్కి యుద్ధం చేసే వారూ; అగుచున్= అవుతూ; నిస్+మర్యాదంబుగాన్= హద్దు లేకుండగా; పెనంగు= యుద్ధం చేసే; సైన్య+ద్వితయంబు= రెండు సేనలూ; మందర, క్షుభిత+అంబుధి+చందంబు+అగుటకున్= మందర పర్వతంచేత తరచబడిన సముద్రంవలె కావటానికి; తగి= ఒప్పి; ఉచ్చి+పోయెడు+శరంబులు= నాటి వెడలే బాణాలు; ఇరు+మెయిన్= రెండు వైపుల; గెలిచిన= చెలరేగిన; కుంత+క్షురిక+ఆదులును= ఈటెలు చిరుకత్తులు మొదలైనవిన్నూ; ప్రవాళ+జాలంబులన్+పోలి= చివుళ్ళను పోలుతూ; పొలుపు+మిగులు= అందంతో అతిశయించే; చండ+విశిఖంబులు= వాడి బాణాలు (బాణాలు); ముఖంబునన్= మొగంపై (కుంభస్థలంపై); బెట్టు+నాటినన్= గట్టిగా గ్రుచ్చుకొనిన; జిట్టునన్= వేగంగా వెనుకకు; తిరుగు= తిరిగే; శుండాలంబులు= ఏనుగులు; ప్రళయ+కాలంబునన్= ప్రళయం దాపురించిన సమయంలో; సుర+కరువలిచేన్= సుడిగాలిచేత; దిర్దిరన్+తిరిగెడు= చుట్టూ తిరిగే; కుల+నగంబులన్= కులపర్వతాలను; క్రేణి+చేయన్= పరిహసిస్తూ ఉండగా; కరవాల+గదా+భల్ల+ప్రముఖంబులు అగు= కత్తులు, గదలు, ఈటెలు మొదలైనవి అగు; శస్త్ర+అస్త్రంబులన్= ఆయుధాలు మంత్రాయుధాల చేత; కుంభి, కుంభ, తురంగ+ముఖ+భట+కపాల+ఆదులు= ఏనుగు కుంభస్థలాలు, గుర్రాల ముఖాలు, సేనలలోని భటుల తలలు మున్నగునవి; అవియు+చప్పుళ్ళను= పగిలే ధ్వనులూ; వివిధ+ఆయుధ ప్రహతులన్= పెక్కు విధాలైన ఆయుధాల వలన తగిలిన దెబ్బలచేత; ఒఱలు= వ్యాపించే; హరి, నర, నాగంబుల, రావంబులును= గుర్రాల యొక్కయు భటుల యొక్కయు; ఏనుగుల యొక్కయు ధ్వనులు; దారుణ ప్రకారంబునన్= భయంకరమైన విధంగా; దిక్+తట+దారణంబు+చేయుచున్= దిక్కుల యొక్క అంచులు చీలేటట్లుగా చేస్తూ; చెలంగఁగాన్= ధ్వనించగా; చేయి+తునిసినన్= చేయి తెగిపడిపోయినప్పటికీ; తక్కటి+చేతన్= మిగిలిన చేతితో;

కైదువు+కొని= కత్తిపట్టి; కవియు వారును= యుద్ధం చేసేవారూ; కాలు+తునిసినన్= పాదం విరిగిపోయినప్పటికీ; ఎదిరి మీఁదికిన్= శత్రువుపైకి; లంఘించువారును= దూకేవారూ; మును= మునుపు; కన్ను+ఇడిన వారిన్= చూచినవారిని- గురిపెట్టిన వారిని; తల+తునిసినన్= తన తలకాయ తెగిపడిపోయినప్పటికీ; పొడిచి+పడువారును= పొడిచి పడిపోయే వారునూ; తెగిపడియున్= ఖండింపబడి క్రింద పడిపోయినప్పటికీ; అవుడు+కరచుటయున్= పెదవి కరచుటా; బొమముడి+పడుటయును= కనుబొమ్మలు దగ్గరగా చేర్చటం; సడలని= తప్పని; తలల= శిరస్సులతో; ఒప్పువారును= శోభిల్లే వారూ; ఏనుంగులు= ఏనుగులు; వికలంబులు+ఐన= చెడిపోయినప్పటికీ (కూలిపోయినప్పటికీ, చచ్చిపోయినప్పటికీ); సమీప, వర్తుల, వాహనంబులు= దగ్గరగా ఉన్నవారి వాహనాలను; సమారోహణంబు+చేసి= ఎక్కి; పరాక్రమించువారును= వీరత్వం చూపేవారు; నొచ్చియున్= తనకు దెబ్బతగిలి బాధగా ఉన్నప్పటికీ; ఈడంబోక= వెనుదీయక; చెలులకున్= స్నేహితులకూ; చుట్టంబులకున్= బంధువులకు; అడ్డుపడు వారలు= సాయం చేసేవారు (శత్రువుల దెబ్బలు తాకకుండా అడ్డగించేవారు); మార్+బలంబునన్+చేరి= శత్రుసైన్యంలోకి చొచ్చుకొనిపోయి; చుట్టంబు+అని+తప్పింపక= తనకు బంధువు అనే ఆలోచనతో విడువకుండా; నొప్పించు వారును= ఎదిరించి యుద్ధం చేసే వారూ; సుభటులు+చొచ్చి= వీరులు ప్రవేశించి; చెండినన్= ఖండించగా; వండన్+తటిగినట్లు+ఉండు= వండటానికి ముక్కలుగా తరిగినట్లు పడియున్న; వేదండ, హయ, చయంబులును= ఏనుగుల, గుర్రాల సముదాయాలు; ఆశ్వికులు = రౌతులు; పైకొని= విజృంభించి; మీఁది మానిసులన్+తునిమిన= పైనున్న (వీరులను) సంహరింపగా; మ్రోడు, పడిన, రథంబులును= ఆకులులేని చెట్ల కాండంవలె ఉన్న రథాలూ; రథ, నేమి, ఘట్టనంబునన్= రథచక్రాల తాకిడిచేత; దట్టంబులు+అగు= దళసరిగా అయిన; పదాతి+గాత్రంబులును= కాలిబంటుల కళేబరాలూ; ఇభంబులు= ఏనుగులు; పొదివి= డీకొని; నేలతోన్+వ్రేసియున్= నేలపై రాయటం; తూలవైచియున్= విసిరివేయటం; కొమ్ములన్+గ్రుచ్చి= దంతాలతో పొడిచి; ఎత్తియున్= పైకి విసరి; బారి సమరిన= హింసించగా; వికట+ఆకారంబులు అగు= వికారమైన రూపాలు ఏర్పడిన; ఘోటకంబులును= గుర్రాలూ; ఐ= కలిగి; ఘోరభంగి+అగు= భయంకరవిధం కలదైన; సంగరంబు+చెల్లుచుండన్= యుద్ధం జరుగుతూ ఉండగా; మధ్యాహ్న+సమయంబునన్= మధ్యాహ్నవేళ.

తాత్పర్యం: "ఈ విధంగా కౌరవపాండవసేనల్లోని గొప్పవీరులు ఒకరితో ఒకరు తలపడగా జరిగిన మిక్కిలి సంరంభంతో కూడిన ద్వంద్వ యుద్ధమును ఆకాశంలో సంచరించే వేల్పు తెగలు సిద్ధులు, చారణులు, ఖేచరులు ప్రశంసించారు. చతురంగబలాలు ఒండొంటిని తాకాయి. రథాలు రథాలతో, ఏనుగుల బలాలు ఏనుగుల బలాలతో, అశ్వికులు అశ్వికులతో, కాలి బంటులు కాలి బంటులతో డీకొనడం జరిగింది. ఆ నాలుగు రకాల జాతులూ, తమ తమ జాతులతో పదింటితో పదియూ, వందింటితో వందయూ, వేయింటితో వేయియున్నూ పెక్కింటితో పెక్కులున్నూ అక్కడక్కడా కలసిపోతూ విడిపోతూ తలపడగా క్రమంగా సంకుల సమరం ఏర్పడింది. ఉభయసేనలలోని భటులు పిచ్చివారి వలె పోరాడారు. బాణాలు, కత్తులు, ఏనుగుల దంతాలు, రథాల నొగలూ ఒకదానితో నొకటి కొట్టుకొని తుత్తునియలై యుద్ధభూమిపై పడ్డాయి. ఆ భయంకరయుద్ధంలో ఏనుగుల,గుర్రాల రథాలధాటికి ఓర్వని కాలిబంటులు, ఎత్తైన ఏనుగుల రథాలపై విజృంభించిన రౌతులు, ఏనుగుల గుంపులను చీల్చి చెండాడే రథికులు ఇది అది అనకుండా అన్ని రకాల శత్రు సేనలను ప్రవేశించిన మొనలను చిందరవందర చేసిన గజారోహకులు కలిగి హద్దులేకుండా యుద్ధంచేసే ఆ రెండు సేనలు మందర పర్వతం చిలికిన సముద్రాల వలె కనిపించాయి. దూరిపోయే బాణాలు ఇరువైపుల నుండి ప్రయోగింపబడిన ఈటెలు, వంకర కత్తులూ, రక్తసిక్తమై ప్రవాళజాలంబులను పోలి అందంతో అతిశయించాయి. ముఖాలలో బాణాలు గట్టిగా నాటుకోగా వేగంగా వెనుదిరిగి పోయే ఏనుగులు ప్రళయకాలంలో సుడిగాలి చేత దిర్దిరతిరిగే కుల పర్వతాలవలె కనిపించాయి. కత్తులు గదలు బల్లెములు మొదలగు శస్త్రాస్త్రములచే ఏనుగుల కుంభస్థలాలు, తురంగ బలాల తలలు భటుల పుర్రెలు

పగిలేటప్పుడయ్యే ధ్వనులూ మరియు వివిధా యుధముల చేత దెబ్బతిని పడిపోయే గుర్రాలు భటులు ఏనుగుల ధ్వనులు దారుణంగా దిక్ప్రదేశాలను చీల్చుచు చెలరేగాయి ఒక చేయి తెగిపోయిననూ రెండవచేతితో ఆయుధము పట్టి మీదికి దుముకువారునూ, కాలుతెగిననూ, ఎదుటివాని మీదికి లంఘించువారునూ, తల తెగిననూ, మునుపు కన్నిడినవారిని పొడిచి నేలగూలువారునూ, ఖండింపబడినప్పటికిని పెదవులు కొరుకుతూ ముడివీడని కనుబొమలతో, తలలతో వెలుగువారునూ, తమ వాహనములైన గుర్రాలు, ఏనుగులు నేలగూలినప్పుడు చెంతనున్నవారి వాహనా లెక్కి పరాక్రమించేవారునూ, బాధచెందినప్పటికీ వెనుదీయక స్నేహితులకూ, బంధువులకూ సాయపడేవారూ, శత్రు పక్షంలో నున్నవారు తనకు చుట్టమని వదలకుండా నొప్పించేవారూ, ఇట్లు వీరభటులు చొచ్చుకొని పోయి ఏనుగుల గుఱ్ఱాల గుంపులను చెండగా వంటకొరకు తరిగినకూరలట్లు అవి కన్పించాయి. ఆశ్వికులు పైబడి రథాలమీది యోధులను చంపగా రథాలు శూన్యాలైనాయి. రథ చక్రాల క్రిందబడినలిగిన భటుల కళేబరాలు దట్టంగా గుట్టలు గుట్టలుగా పడిపోయాయి. ఏనుగులు విజృంభించి గుఱ్ఱాలను నేలపై పడవేసి కాళ్లతో త్రొక్కాయి, విసరివేశాయి, దంతాలతో పొడిచాయి. ఆ గుఱ్ఱాల కళేబరాలు రూపుమాసి తీవ్ర వికారంగా కనిపించాయి. యుద్ధం ఈ రీతిగా మధ్యాహ్న సమయం వరకు సాగింది.

విశేషాలు: 1. ఆ యుద్ధం దేవతలు చూడగోరారు. 2. ఏనుగులు కులపర్వతాలవలె ఉన్నాయి. కులపర్వతాలు భూమిని మోస్తాయి అని పురాణకథనం. మహేంద్రము, మలయము, సహ్యము, శుక్తి మంతము, గంధమాదనము - వింధ్యము - పారియాత్రము ఈ ఏడు కులపర్వతాలు. 3. ఈ యుద్ధ వర్ణన మహాభారత కాలం నాటిదా? తిక్కన కాలం నాటిదా? తిక్కన తాను కనులార గాంచిన యుద్ధభూమిని వర్ణించినట్లు కన్పిస్తున్నది. (రథాల వర్ణన విడిచిపెడితే) 4. కోపతాపాల వలన బొనుముడిపాటు మొగంపై ఏర్పడటం కద్దు. ఆ ముద్ర వీరుల శవాల ముఖాలలో స్తంభించి కన్పించటం విశేషం. అట్లే ఇరువురు భటుల కత్తి యుద్ధంలో తలతెగిన మొండెం ముందుకు కొన్ని అడుగులు వేసి శత్రువును పొడిచి చంపటం! బహుశః ఇవి అతిశయోక్తులు కావేమో! యుద్ధభూమిని ప్రత్యక్షంగా చూచిన తిక్కన చేసిన వర్ణనలు.

భీష్ముఁడు దుర్యోధన ప్రేరితుండై విజృంభించి పాండవవీరుల నొప్పించుట (సం. 6-45-1)

సీ. మనుజేంద్ర! వినుము నీ తనయుండు వనుపంగ । దుర్ముఖ కృప కృతవర్మ మద్ర
పతి వివింశతులు విస్ఫారబాణార్చులఁ । బంచాగ్నులును బోలెఁ బ్రజ్వరిల్ల
తన కెలంకులఁ గోలుతలసేసి తఱుమంగఁ । దాలకేతువు మహోత్తాలమూర్తి
నాభీల మై క్రాల నడరి పాండవసేనఁ । దఱిసి మండాకినీతనయుఁ డేచి
తే. చేది పాంచాల కేకయు లాది గాఁగఁ । గల్గు భూపాల కోటి మొగ్గరము లెల్లఁ
గలఁగఁ దిరుగుడువడ నోరగిలఁగఁ బెల్ల । గిల్లఁ దల్లడపడ రణక్రీడ సల్పె. 268

ప్రతిపదార్థం: మనుజ+ఇంద్ర!= మనుజేంద్ర!; ఓ రాజా!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; వినుము= ఆలకించుము; నీ+తనయుఁడు= నీ కొడుకు; అనుపంగన్= పంపగా; దుర్ముఖ, కృప, కృతవర్మ, మద్రపతి, వివింశతి= దుర్ముఖుడు, కృపాచార్యుడు, కృతవర్మ, శల్యుడూ; వివింశతీ; విస్ఫార, బాణ+అర్చులన్= ప్రకాశించే బాణాలయొక్క జ్వాలలతో; పంచ+అగ్నులును+పోలెన్= ఐదు నిప్పులవలె; ప్రజ్వరిల్లన్= ప్రకాశించగా; తన+కెలంకులన్= తన ప్రక్కల; కోలుతల+చేసి= యుద్ధం చేయటానికి సంసిద్ధమై; తఱుమంగన్= ప్రోత్సహించగా; తాలకేతువు= తాడిచెట్టు జెండా కలవాడు (భీష్ముడు); మహా+ఉత్తాలమూర్తి= మిక్కిలి పొడుగైన ఆకృతి కలవాడు; ఆభీలము+ఐ= భయంకరంగా; క్రాలన్= మిరుమిట్లు గొలిపి వెలుగొందగా; అడరి= విజృంభించి; పాండవ+

సేనన్+తఱిసి= పాండవుల సైన్యాన్ని సమీపించి; మందాకినీ తనయుఁడు= గంగ కొడుకు(భీష్ముడు); ఏచి= అతిశయించి; చేది, పాంచాల, కేకయులు+ఆదిగాఁగన్= చేది దేశం, పాంచాల దేశం, కేకయ దేశం ఏలే ప్రభువులు; కల్గు= ఉన్న; భూపాలకోటి= రాజుల సమూహాలయొక్క; మొగ్గరాలు= వ్యూహాలు; ఎల్లన్= అన్నిటినీ; తిరుగుడు+పడన్= తారుమారగునట్లుగా; ఓరగిలఁగన్= వ్రాలేటట్లుగా; పెల్లగిల్లన్= అడుగునుండి పైకి వచ్చేటట్లుగా; తల్లడ+పడన్= చీకాకుపడగా; రణ+క్రీడ= యుద్ధం అనే ఆట; సల్పెన్= చేశాడు.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! వినుము. నీ కొడుకు దుర్యోధనుడు పంపగా, దుర్ముఖుడు, కృపాచార్యుడు, కృతవర్మ, శల్యుడు, వివింశతి భీష్ముడికి బాసటగా నిలిచి ప్రకాశించే బాణాల మంటలతో పంచాగ్నులవలె ప్రజ్వరిల్లి అతడికి ప్రక్కల నిల్చి శత్రుసైన్యాన్ని తరుముతూ తాటిచెట్టు జెండాతో వెలుగొందేవాడూ, ఎత్తైన విగ్రహం కలవాడూ అయిన భీష్ముడు భయంకరుడై విజృంభించి పాండవసేనదరిజేరి చెలరేగి పాంచాల కేకయ రాజులు మొదలైనవారు పన్నిన వ్యూహాలను అన్నింటిని చెదరిపోయేటట్లు, పారిపోయేటట్లు, ఒరిగిపోయేటట్లు, పెల్లగిలేటట్లు, చీకాకుపడేటట్లు, రణక్రీడ సలిపాడు.

విశేషాలు: 1. పంచాగ్నులు: దక్షిణాగ్ని, ఆహవనీయం, గార్హపత్యం - సభ్యం - అవసథ్యం. 2. రణక్రీడ : యుద్ధాన్ని ఆటగా అభివర్ణించటం తిక్కనకు ఇష్టం.

క. పాయవడఁ జొచ్చు గుంపులు । సేయును మలఁకలఁ జరించి చించును గోణ
వ్యాయామ గతుల వలయము । లై యుండం దిరిగి కలఁచు నరి సైన్యంబున్. 269

ప్రతిపదార్థం: గుంపులు= మూకలు; పాయ+పడన్= చీలికలు ఏర్పడేటట్లుగా; చొచ్చున్= లోపలికి చేరుకొంటాడట; మలకలన్+చరించి= వంకరటింకరగా తిరిగి; చించున్= విడగొట్టుతాడు; అరి సైన్యంబుల్= శత్రువుల సేనలు; కోణ వ్యాయామ గతులన్+వలయములై+ఉండన్= రెండు రేఖలు కలిసే రీతిని యుద్ధం చేస్తూ, చక్రాకారం సృష్టించి; తిరిగి= చరించి; కలఁచున్= కలతపెట్టుతాడు.

తాత్పర్యం: భీష్ముడు యుద్ధ విద్యలో గొప్ప నేర్పరి. శత్రుసేనలను చీలికలు చేస్తూ లోపలికి దూరుతాడు. గుంపులు చేస్తాడు. వంకర టింకరగా తిరిగి చించుతాడు. కోణాలు ఏర్పడేటట్లు, వృత్తాలు ఏర్పడేటట్లు తిరుగుతూ కలత పెడతాడు.

విశేషం: శత్రుసేనలు గుమిగూడి వలయాకారంగా మోహరించవచ్చు, భీష్ముడు 'కోణవ్యాయామ గతి' తిరిగి శత్రుసేనను చెండాడాడు. కోణము: రెండు రేఖలు కలిసేచోటు. వలయము: చక్రాకారము.

క. డొల్లెడు తలయును దునిసెడు । విల్లును ధర కొఱగు మేను విఱిగెడు సిడముం
బెల్లు దొరఁగు నెత్తురు నై । పల్లటిలం దొడఁగె నపుడు పాండవ బలముల్. 270

ప్రతిపదార్థం: అపుడు= ఆ సమయంలో (భీష్ముడు యుద్ధం చేసే సమయంలో); డొల్లెడు= ఊడి క్రిందపడే; తలయును= శిరస్సు; తునిసెడు+విల్లు= ముక్క చెక్కలయ్యే ధనువూ; ధరకున్+ఒఱగు మేను= నేలమీద పడే శరీరం; విఱిగెడు, సిడమున్= ముక్కలయ్యే జెండా; పెల్లు, తొరఁగు, నెత్తురు= మిక్కుటంగా కారే నెత్తురు; ఐ= కలవై; పాండవ+బలముల్= పాండవుల సైన్యాలు; పల్లటిలన్+తొడఁగెన్= చెల్లా చెదురై పోసాగాయి.

తాత్పర్యం: భీష్ముడు యుద్ధం చేసిన సమయంలో పాండవుల సైన్యాలు తల్లడిల్లిపోయాయి. ఎక్కడ చూచినా, డొల్లిన శిరస్సులు, విరిగిన ధనువులు, భూమిపై పడిపోయే శరీరాలు, విరిగిన జెండాలు, మిక్కుటంగా స్రవించే నెత్తురు కన్పించాయి.

వ. ఇట్లు ప్రళయకాలతాండవంబునం బ్రచండమూర్తి యగు నష్టమూర్తియుం బోలె విజృంభించిన భీష్ము మార్కొను మగలు లేక పాండవసైన్యంబు బెండువడియున్న యెడ నభిమన్యుండు గనకవర్ణ తురంగంబులుం గర్ణికారధ్వజంబును మెఱయం దాఁకి. 271

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; ప్రళయ+కాల+తాండవంబునన్= ప్రళయకాలంలో నాట్యం చేసే; ప్రచండ+మూర్తి+అగు= భయంకరమైన ఆకృతిగల వాడైన; అష్టమూర్తియున్+పోలెన్= ఎనిమిది ఆకృతులుగల శివుడివలె; విజృంభించిన= అతిశయించిన= చెలరేగిన; భీష్మున్= భీష్ముడిని; మార్కొను= ఎదిరించే; మగలు= వీరులు; లేక= కనిపించక; పాండవ+సైన్యంబు= పాండవులసేన; బెండుపడి+ఉన్న+ఎడన్= నీరసించి, శుష్కించి ఉన్న వేళ; అభిమన్యుండు= అభిమన్యుడు (అర్జునుడి కొడుకు యువవీరుడు); కనక, వర్ణ, తురంగంబులన్= బంగారు రంగు గల గుర్రాలనూ; కర్ణికార+ధ్వజంబును= కొండగోగు పువ్వు గుర్తుగల జెండా; మెఱయన్= ప్రకాశించగా; తాఁకి= మార్కొని.

తాత్పర్యం: ఈ విధంగా ప్రళయకాలంలో నాట్యం చేస్తూ చెలరేగే ఎనిమిది ఆకృతులుగల శివుడివలె విజృంభించే భీష్ముడిని ఎదుర్కొనే వీరులు లేక, పాండవసైన్యం చెదరి శుష్కించిపోయిన సమయంలో, అభిమన్యుడు బంగారు రంగుగల గుర్రాలు పూన్చిన రథంపై కొండగోగు పువ్వు గుర్తుగల జెండా వెలుగొందుతుండగా కౌరవసేనను మార్కొన్నాడు.

విశేషం: అష్టమూర్తి : శివుడు - ఎనిమిది ఆకృతులు గలవాడు, పంచభూతాలు, సూర్యచంద్రులు, యజ్ఞంచేసినవాడు వెరసి శివుడి అష్టమూర్తులు.

సీ. శల్యు నారాచ పంచకమున నొప్పించి । యొకకోలఁ గృతవర్మయురము నొంచి,
క్రూరభల్లమున దుర్ముఖి సూతు తల ద్రుంచి । తటిమి వివింశతి ధనువుఁ దునిమి
వెడఁద యమ్మున నేసి వెండియు మూఁడు వా । లికయమ్ము లొడలఁ గీలించి కృపుని
హయముల శరచతుష్టయతాడనమున ను । బ్బడఁగించి భీష్ముపై నడరి మేన

తే. విశిఖ నవకంబు నాటించి వెగడు పఱిచి । పేర్చి యార్చిన సురకోటి పిచ్చలించె;
మెచ్చి భీష్ముఁడు లెల్ల విచ్చుఁ బోలు । నెక్కు డగుఁ గాని యసదుగాఁ డీతఁ డనిరి. 272

ప్రతిపదార్థం: నారాచ+పంచకమునన్= అయిదు బాణాలతో; శల్యున్= శల్యుడిని; నొప్పించి= బాధపడేటట్లు చేసి; ఒక+కోలన్= ఒక బాణంతో; కృతవర్మ+ఉరమున్= కృతవర్మ వక్షాన్ని; నొంచి= బాధించి; క్రూర+భల్లమునన్= కఠినమైన బాణంతో; దుర్ముఖి, సూతు, తలన్+త్రుంచి= దుర్ముఖుడి యొక్క రథసారథి శిరసు తునిమి; తటిమి= ఉత్సాహంతో పూని; వివింశతి, ధనువు, తునిమి= వివింశతి విల్లు ముక్కలు చేసి; వెండియున్= మరల; వెడఁద+అమ్మునన్= వాడి బాణంతో; ఏసి= కొట్టి; మూఁడు+వాలిక+అమ్ములన్= మూడు వాడి బాణాలతో; ఒడలన్= దేహమునందు; కీలించి= సంధించి; కృపుని, హయములన్= కృపుడి గుర్రాలను; శర, చతుష్టయ, తాడనమునన్= నాలుగు బాణాల తాకిడితో; ఉబ్బు+అడఁగించి= అతిశయం అణగగొట్టి; భీష్ముపైన్= భీష్ముడిపై; అడరి= విజృంభించి; మేనన్= శరీరంపై; విశిఖ+నవకంబు= తొమ్మిది బాణాలు; నాటించి= గ్రుచ్చుకొనేటట్లుగా చేసి; వెగడు+పఱిచి= తల్లడిల్లచేసి; పేర్చి= విజృంభించి; ఆర్చినన్= సింహనాదం చేయగా; సురకోటి= (ఆకాశంలో విమానాలు అధిరోహించి చూచే) వేల్పుల సముదాయం; పిచ్చలించెన్= ఆశ్చర్య చకితం అయింది; భీష్మ+ఆదులు+ఎల్లన్= భీష్ముడు మొదలైన వారు అందరూ; ఈతఁడు= ఈ అభిమన్యుడు; విచ్చుచున్+పోలున్= అర్జునుడితో సరితూగుతాడు; ఎక్కుడు+అగున్= అధికుడు అవుతాడు; కాని= అంతేగాని; అసదు+కాడు= తక్కువ కాఁడు; అనిరి= అన్నారు.

తాత్పర్యం: ఈ సీస పద్యంలో అభిమన్యుడి పరాక్రమం వర్ణించబడింది. అభిమన్యుడు శల్యుడిపై అయిదు బాణాలు ప్రయోగించి నొప్పించాడు. కృతవర్మ రొమ్మును ఒక బాణంతో నొప్పించి వాడిబాణంతో దుర్ముఖుని రథసారథిని సంహరించాడు. తరిమి వివింశతి విల్లు దునిమి వెడలై ్పన బాణంతో కొట్టి ఇంకా మూడు వాడిబాణాలు శరీరమునందు నాటి, నాల్గు బాణాలతో కృపుని గుర్రాలను కొట్టి అతడి ఉత్సాహాన్ని చెరిచాడు. తరువాత భీష్ముడిపై విజృంభించి అతని దేహమునందు తొమ్మిది అమ్ములు నాటి తల్లడపరచి చెలరేగిసింహనాదం చేశాడు. అభిమన్యుడి పరాక్రమప్రాభవమునకు దేవతలు ఆశ్చర్యచకితులయ్యారు. భీష్ముడు మొదలగు వీరాధివీరులు ఈ అభిమన్యుడు అర్జునుడికి సాటివస్తాడు. అతడి కంటే అధికుడేగాని, తక్కువ వాడుకాడు అని ప్రశంసించారు.

చ. అమరతరంగిణీ తనయుఁ డర్జుననందనుసూతుఁ గేతుదం
డము నిరు మూఁడు దూపులఁ బడం గడు బెట్టిదమేసి యుజ్జ్వలా
స్త్రము లడరింపఁ గూడికొని తక్కటి యేవురుఁ బెక్కులమ్ము లొ
క్కమొగి రయంబునం గురియఁగా గిరి వోలె నతం డుదగ్రుఁడై. 273

ప్రతిపదార్థం: అమర, తరంగిణీ, తనయుఁడు= దేవనదీసూనుడు (భీష్ముడు); అర్జును, నందను, సూతున్= అర్జునుడి కొడుకుయొక్క రథసారథిని; కేతు, దండమున్= జెండా కర్రను; ఇరుమూఁడు తూపులన్= ఆరు బాణాలతో; పడన్= పడిపోయేటట్లుగా; కడు, బెట్టిదము+ఏసి= మిక్కిలి గట్టిగా కొట్టి; ఉజ్జ్వల+అస్త్రములు= ప్రకాశవంతములైన మంత్ర బాణాలను; అడరింపన్= ప్రయోగించగా; కూడికొని= కలిసి; తక్కటి+ఏవురు= మిగిలిన ఐదుగురు= శల్యుడు, కృతవర్మ, దుర్ముఖుడు, వివింశతి, కృపుడు; పెక్కులు+అమ్ములు= అనేక బాణాలు; ఒక్క+మొగిన్= ఒకేసారి; రయంబునన్= వేగంగా; కురియఁగాన్= వర్షించగా; అతండు= అభిమన్యుడు; గిరి+పోలెన్= పర్వతంవలె; ఉదగ్రుఁడు+ఐ= భయంకరుడై.

తాత్పర్యం: గంగాసుతుడు భీష్ముడు అర్జునుడి కొడుకైన అభిమన్యుడి రథసారథిని, జెండాకర్రను ఆరు బాణాలతో ఖండించి వెలుగొందే మంత్ర బాణాలను ప్రయోగించాడు. అంతలో శల్యుడు, కృతవర్మ, దుర్ముఖుడు, వివింశతి, కృపుడు కూడుకొని పెక్కు బాణాలు అభిమన్యుడిపై వర్షించారు. అయితే అభిమన్యుడు పర్వతంవలె చలించక నిలిచాడు.

క. వారల శరవర్షంబులు । వారించుచు వేఱువేఱ వాలంపగముల్
వారలపైఁ గురియుచుఁ గురు । వీరుని తాలధ్వజంబు విఱుగఁగ నేసెన్. 274

ప్రతిపదార్థం: వారల, శర, వర్షంబులు= వానవలె (కురువీరులు) కురిపించిన బాణాలను; వారించుచున్= నిరోధిస్తూ; వేఱు+వేఱున్= వేరువేరుగా (అనగా ఆయా వీరులందరిపై వేరుగా); వాలు+అంపగముల్= వాడియైన బాణాల గుంపులు; కురియుచున్= వర్షిస్తూ; కురు+వీరుని= కౌరవులలో వీరుడైన భీష్ముడి యొక్క; తాల+ధ్వజంబు= తాడిచెట్టు గుర్తుగల జెండా; విఱుగఁగన్= తునకలు అయ్యేటట్లుగా; ఏసెన్= బాణాలు ప్రయోగించాడు.

తాత్పర్యం: వారు తనపై వర్షించిన బాణాలన్నింటినీ నిరోధిస్తూ, వారి వారిపై వేరు వేరుగా బాణాల గుంపులు కురిపిస్తూ, కురువీరుడైన భీష్ముని తాటి చెట్టు జెండా పడిపోయేటట్లు శరాలు ప్రయోగించాడు.

ఆ. తాటిసిడము విఱిగి ధరణిపైఁ గూలినఁ । బాండురాజ సుతుల బలము లెల్ల
నొక్కపెట్ట యార్చె నుక్కఱి కౌరవ । సేన జోదుపిండు చిన్నఁబోయె. 275

ప్రతిపదార్థం: తాటి+సిడము= తాడిచెట్టు గుర్తుగా గల జెండా; విఱిగి= ముక్కలై; ధరణిపైన్+కూలినన్= భూమిమీద పడేసరికి; పాండురాజ, సుతుల, బలములు+ఎల్లన్= పాండవుల సేనలు అన్నీ; ఒక్క+పెట్ట= ఒకేసారిగా; ఆర్చెన్= సింహనాదాలు చేశాయి; ఉక్కు+అఱి= బలం క్షీణించి; కౌరవ, సేన, జోదు, పిండు= కౌరవుల సేనలోని యోధుల సమూహం; చిన్నఁబోయెన్= క్రుంగిపోయింది.

తాత్పర్యం: తాటిచెట్టు గుర్తుగల జెండా విరిగి నేలమీద పడిపోయింది. పాండవ సేనలన్నీ ఒక్కసారిగా సింహనాదాన్ని చేశాయి. బలం తగ్గి కౌరవసేనలోని యోధావళి చిన్న వోయింది.

విశేషం: అలనాటి యుద్ధ విద్యలో జెండాను కాపాడుకొనటం వీరుడి కర్తవ్యం; పరాక్రమంలో అంతర్భాగం. జెండా పడిపోవటం అవమానమే. అభిమన్యుడు సేనాపతినే అవమానించగలిగాడు.

తే. సింహనాదంబుతో భీమసేనుఁ డప్పు । డనుజ తనయునిఁ జేకొని యరిబలంబు
దరలఁ దాకిన నతని యుత్తాల సింహ । కేతనముఁ గూల్చె సురనదీసూతి యలిగి. 276

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో; భీమసేనుఁడు= భీముడు; సింహనాదంబుతోన్= సింహగర్జనవంటి కేకతో; అనుజ, తనయునిన్= తమ్ముడి కొడుకును (అభిమన్యుడిని); చేకొని= స్వీకరించి (అనగా బాసటగా తాను వచ్చి నిలిచి); అరి+బలంబు= శత్రువుల సేన; తరలన్= వెనుకంజవేసేటట్లుగా;తాఁకినన్= తలపడగా; అతని= ఆ భీమసేనుడియొక్క; ఉత్తాల, సింహ, కేతనమున్= ఎత్తైనది సింహం గుర్తు గలది అయిన జెండాను; అలిగి= కోపంతో; సుర, నదీ, సూతి= భీష్ముడు (వేల్పు నది కొడుకు); కూల్చెన్= క్రిందపడేటట్లు (బాణాలు ప్రయోగించి) చేశాడు.

తాత్పర్యం: అభిమన్యుడు భీష్ముడి జెండా కూల్చి, వీర విహారం చేసేటప్పుడు భీముడు సింహనాదం చేస్తూ అక్కడకు వచ్చి, తన తమ్ముడి కొడుకుకు బాసటగా నిలిచి, శత్రుసేనలు వెనుకంజ వేసేటట్లుగా తలపడ్డాడు. ఆ భీముడిపై కోపించి, గంగాసుతుడైన భీష్ముడు ఎత్తుగా సింహం గుర్తుతో ఎగిరే ఆతడి జెండాను నేలపై కూల్చాడు.

క. పవనజుఁడు మూఁడు శరముల । దివిజనదీసూను నేసి దృఢగతిఁ గృపు మే
నవియ నొకటఁ గృతవర్ముని । యవయవతతి నెనిమిదింట నార్చుచు నేసెన్. 277

ప్రతిపదార్థం: పవనజుఁడు= వాయుపుత్రుడు (భీముడు); మూఁడు+శరములన్= మూడు బాణాలతో; దివిజ, నదీ, సూనున్= గంగానదీ పుత్రుడిని (భీష్ముడిని); ఏసి= కొట్టి; దృఢగతిన్= గట్టిగా; ఒకటన్= ఒక బాణంతో; కృపుమేను= కృపునిశరీరం; అవియన్= నొచ్చునట్లుగా; ఎనిమిదింటన్= ఎనిమిది(అమ్ముల)తో; కృతవర్ముని+అవయవతతిన్= కృతవర్మ యొక్క దేహంలోని అంగాలను; ఆర్చుచున్= సింహనాదం చేస్తూ; ఏసెన్= కొట్టాడు.

తాత్పర్యం: భీముడు భీష్ముడిపై మూడు బాణాలు వేశాడు. కృపాచార్యుడి శరీరం నొచ్చేటట్లుగా ఒక్క బాణంతో గట్టిగా కొట్టాడు. ఎనిమిది బాణాలు వేసి కృతవర్మ అవయవాలను నొప్పించి సింహనాదం చేశాడు.

వ. మఱియు నమ్మారుతతనయుండు. 278

ప్రతిపదార్థం: మఱియున్= వెండియు; ఆ+మారుత+తనయుండు= వాయుపుత్రుడైన ఆ భీముడు.

తాత్పర్యం: అంతేకాక వాయుపుత్రుడైన ఆ భీముడు.

శా. మద్రేశున్ వెగడొంద నేసె; నతనిన్ మన్నించు జోదుల్ ప్రతా
పోద్రేకంబున నొక్కపెట్ట రథవేగోద్ధీప్తులై తాఁకినన్
రౌద్రం బాకృతిఁ బొంద సూతహయగాత్రంబుల్ వెసం ద్రుంచి చం
చద్రక్తోదకవీచులం దడిపె నాశ్చర్యంబుగా నందఱన్. 279

ప్రతిపదార్థం: మద్ర+ఈశున్= మద్రదేశరాజు శల్యుడిని; వెగడొందనన్+ఏసెన్= సొమ్మసిల్లి పోయేటట్లుగా బాణాలతో కొట్టాడు; అతనిన్+మన్నించు+జోదుల్= ఆ శల్యుడిని గౌరవించే వీరులు; ప్రతాప+ఉద్రేకంబునన్= పరాక్రమం పొంగి పొరలిపోయేటట్లుగా; ఒక్కపెట్టన్= ఒకేసారిగా (ఒక్కుమ్మడిగా); రథ, వేగ, ఉత్+దీప్తులు+ఐ= రథాల వేగాలతో వెలుగొందే వారై; తాఁకినన్= మార్కొనగా; భీముడు; రౌద్రంబు+ఆకృతిన్+పొందన్= మూర్తీభవించిన రోషమో అనునట్లుగా; సూత, హయ, గాత్రంబుల్= సారథులయొక్కయు, గుర్రాల యొక్కయు శరీరాలు; వెసన్= వేగంగా; త్రుంచి= ఖండించి; అందఱన్= ఆ యోధుల నందరినీ; ఆశ్చర్యంబుగాన్= అబ్బురం కలిగేటట్లు; చంచత్+రక్త+ఉదక, వీచులన్= చలించే నెత్తురుఅనే నీటి కెరటాలతో; తడిపెన్= తడిసేటట్లుగా చేశాడు.

తాత్పర్యం: భీముడు శల్యుడిని సొమ్మసిల్ల చేశాడు. ఆ శల్యుడి మీద గౌరవంతో తన మీదకు ఉరికివచ్చిన యోధులను పరాక్రమ వేగంతో రథాలను తనపైకి మళ్ళించిన వారిని అందరినీ కరడుగట్టిన రోషమో అన్నట్లుగా విజృంభించి, వారి రథసారథులను, గుర్రాలను చీల్చి చెండాడి, ప్రవహించే నెత్తురు అనే నీటి కెరటాలతో తడిపి వేశాడు.

వ. తదనంతరంబ సాత్యకియు ధృష్టద్యుమ్నుండును గేకయ పంచకంబును విరాటుండు నతని కొడుకులుం దలకడచి యురవడించిన. 280

ప్రతిపదార్థం: తద్+అనంతరంబు+అ= అటుపిమ్మట; సాత్యకియున్= సాత్యకీ; ధృష్టద్యుమ్నుండును= ధృష్టద్యుమ్నుడూ; కేకయ, పంచకంబును= కేకయదేశానికి ప్రభువులైన అయిదుగురు రాజులూ; విరాటుండు= విరాటుడు; అతని, కొడుకులున్= అతడి పుత్రులూ; తలకడచి= ముందుకు వచ్చి; ఉరవడించినన్= విజృంభించగా.

తాత్పర్యం: అటు పిమ్మట (అభిమన్యుడికీ, భీముడికీ బాసటగా) సాత్యకి, ధృష్టద్యుమ్నుడు, కేకయరాజులు అయిదుగురు, విరాటరాజు, అతని కొడుకులు ముందుకు వచ్చి నిలిచి విజృంభించారు.

విశేషం: మొట్టమొదట ఒంటరిగా అభిమన్యుడు కురుసేనలో ప్రవేశించాడు. భీష్ముడు మున్నగు వారితో పోరు సలిపి వారిని అవమానించగలిగాడు. అట్లా ఎంతకాలం నిలువగలడు? భీముడు వచ్చి ఆదుకొన్నాడు అభిమన్యుడిని అంతమంది కురువీరుల మధ్య 'ఇద్దరు' మాత్రం ఏం చేయగలరు? ఆ సంగతి గ్రహించి ఇంతలో పాండవ వీరులు పలుపురు అక్కడకు చేరారు.

క. అందఱ మేనుల గంగా । నందనుఁడు శరత్రయములు నాటించెను; శ
ల్యుం దాఁకె నుత్తరుఁడు గరి । సందోహముతోడ నధిక సంరంభమునన్. 281

ప్రతిపదార్థం: గంగానందనుఁడు= గంగకొడుకు (భీష్ముడు); అందఱ+మేనులన్= అందరి శరీరములయందు (అనగా సాత్యకి, ధృష్టద్యుమ్నుడు, కేకయ పంచకం, విరాటుండు, అతని కొడుకుల శరీరాలను); శర+త్రయములు= మూడు బాణాల చొప్పున; నాటించెను= గ్రుచ్చుకొనేటట్లుగా చేశాడు; కరి, సందోహముతోడన్= ఏనుగుల సముదాయంతో; అధిక+సంరంభమునన్= మిక్కుటమైన సన్నాహంతో; ఉత్తరుఁడు= విరాటుడి కొడుకు; శల్యున్+తాఁకెన్= శల్యుడితో తలపడ్డాడు.

తాత్పర్యం: భీష్ముడు తనను మార్కొనిన వీరులు అందరిపై అనగా సాత్యకి, ధృష్టద్యుమ్నుడు, కేకయపంచకం, విరాటుడు, అతడి కొడుకులపై, ఒక్కొక్కరిపై మూడేసి బాణాలు వారి శరీరాలు నొచ్చేటట్లుగా ప్రయోగించాడు. అంతట ఏనుగుల గుంపుతోపాటుగా ఉత్తరుడు శల్యుడిని మార్కొన్నాడు.

విశేషం: ఉత్తర గోగ్రహణ యుద్ధంలో ఉత్తరుడు పిరికి పందగా కన్పిస్తాడు. నిజమే. ఆనాడు అతడు ఒంటరిగా అంతటి కౌరవ సైన్యాన్ని ఎదిరించటం అసాధ్యం అని భావించాడు. అది మానవసహజమైన భావన. ఇప్పుడు మహాభారతంలో మహావీరుల గుంపులో ఒకడు. తనచుట్టూ ఎందరో వీరులు ఉన్నారు. ఈ సమయంలో అతడికి వచ్చే ఉత్సాహం, కలిగే ధైర్యం వేరు. వ్యక్తిగతంగా ధైర్యహీనులుగూడా, పదిమందితో కూడినపుడు పెద్దసంఘంలో కలిసిపోయినపుడూ, ఎక్కడలేని ధైర్యసాహసాలు ప్రదర్శించగలుగుతారు. అట్లాగే. ఉత్తరుడు ఇపుడు ధైర్యంగా, మహావీరుడైన శల్యుడితో తలపడటం మనోధర్మవేత్తలకు ఆశ్చర్యం కలిగించదు.

క. నిజ ఘటకు మిగిలి, యుత్తరు । గజ మమ్మద్రేశు రథము గదిసి తురంగ
వ్రజము పయి కడరి కడు న । క్కజముగ వెస నేలఁ బెట్టి కాలం జమరెన్. **282**

ప్రతిపదార్థం: ఉత్తరు, గజము= ఉత్తరుడి ఏనుగు; నిజ, ఘటకున్+మిగిలి= తన తక్కిన ఏనుగు గుంపును మించి; ఆ+మద్రేశు, రథము= ఆ మద్రరాజు (శల్యుడి) రథాన్ని; కదిసి= సమీపించి; తురంగ, వ్రజముపయికిన్= గుర్రాల సముదాయంపైకి; అడరి= విజృంభించి; కడున్= మిక్కిలి; అక్కజముగన్= ఆశ్చర్యకరంగా; వెసన్= శీఘ్రంగా; నేలన్+పెట్టి= భూమిపై పడగొట్టి; కాలన్= కాలితో; చమరెన్= రాసింది.

తాత్పర్యం: ఉత్తరుడి ఏనుగు తక్కిన ఏనుగుల గుంపును మించి శల్యుడి రథాన్ని సమీపించి, గుర్రాల గుంపు పైకి విజృంభించి ఆశ్చర్యకరంగా గుర్రాలను నేలపై పడవేసి తన కాలితో రాసింది.

తే. శల్యుఁ డుగ్రకోపంబున శక్తి యెత్తి । రయము మెఱయ వైరాటి యురఃస్థలంబు
దూఱ వైచిన నంకుశ తోమరములు । విడిచి నడుమన చచ్చుచుఁ బుడమిఁ బడియె. **283**

ప్రతిపదార్థం: శల్యుఁడు= శల్యుడు; ఉగ్ర+కోపంబునన్= భయంకరమైన ఆగ్రహంతో; శక్తి+ఎత్తి= శక్తి అనే ఆయుధాన్ని ఎత్తి; రయము+మెఱయన్= వేగం వెలుగొందగా; వైరాటి+ఉరఃస్థలంబున్= విరాటరాజు కొడుకు ఉత్తరుడి వక్షఃస్థలం; తూఱన్+వైచినన్= లోనికి చొచ్చుకొని పోయేటట్లుగా విసరగా; (ఉత్తరుడు) అంకుశ, తోమరములు= ఏనుగును అదుపులో పెట్టి నడిపే కొరముట్టు - ఇనుపగుదియలు; నడుమన= మధ్యలో; విడిచి= వీడి; చచ్చుచున్= మరణిస్తూ; పుడమిన్= భూమిపై; పడియెన్= కూలాడు.

తాత్పర్యం: తాను విరథుడు కావటంచేత ఆగ్రహించి శల్యుడు, ఉత్తరుడి వక్షఃస్థలం చొచ్చుకొని పోయేటట్లు 'శక్తి' అనే ఆయుధాన్ని ప్రయోగించాడు. అంకుశం తోమరం ఏనుగు మీదనే విడిచిపెట్టి ఉత్తరుడు చచ్చి నేలమీద పడిపోయాడు.

విశేషం: 1.శక్తి - ఈటెవంటి ఇనుప ఆయుధం. గురి తప్పకపోతే - ఎదుటివాడి చావు తప్పదు. కత్తి, బల్లెం, బాణం కలిసినట్టి ఆయుధ విశేషం.

క. మద్రేశుఁ డంత నిలువక । రౌద్రంబున వాలు వెఱికి రయము మెఱయ న
త్యుద్రేకత డాసి యుఱికి । భద్రకరిం గరముఁ దునిమి పదవైచె నిలన్. **284**

ప్రతిపదార్థం: మద్ర+ఈశుఁడు= మద్రరాజు(శల్యుడు); అంతన్= అంతట; నిలువక= ఆగక; రౌద్రంబునన్= రోషంతో; వాలు+పెఱికి= కత్తిదూసి; రయము+మెఱయన్= వెలుగొందే వేగంతో; అతి+ఉద్రేకతన్= మిక్కుటమైన ఆవేశంతో; డాసి+ఉఱికి=

సమీపించి గంతువేసి; భద్ర+కరిన్= మదించిన ఏనుగుయొక్క; కరమున్+తునిమి= తొండాన్ని ఖండించి; ఇలన్= నేలపై; పడవైచెన్= విసిరివేశాడు.

తాత్పర్యం: ఉత్తరుడిని సంహరించటంతో ఆగకుండా, శల్యుడు రోషంతో తన కత్తిదూసి, వేగంగా ముందుకు దూకి, గొప్ప ఆవేశంతో ఆ ఏనుగు తొండం నరికి నేలపైకి విసిరివేశాడు.

క. తన విక్రమంబు సేనలు । వినుతింపఁగ నిట్లు సేసి వేగమ కృతవ
ర్ముని రథము పైకి లంఘిం । చెను శల్యుఁడు గిరికి దాఁటు సింగము భంగిన్. 285

ప్రతిపదార్థం: తన+విక్రమంబు= తన పరాక్రమం; సేనలు= సైన్యాలు; వినుతింపఁగన్= పొగడుతుండగా; ఇట్లు+చేసి= ఈ విధంగా చేసి; వేగము+అ= శీఘ్రంగా; కృతవర్ముని+రథముపైకిన్= కృతవర్మ రథం మీదికి; శల్యుఁడు= శల్యుడు; గిరికిన్+దాఁటు= పర్వతానికి లంఘించే; సింగము+భంగిన్= సింహంరీతిగా; లంఘించెను= దూకాడు.

తాత్పర్యం: తన పరాక్రమాన్ని సేనలు పొగడుతుండగా, ఈ విధంగా చేసి (ఉత్తరుడిని 'శక్తి'తో చంపి ఏనుగుతుండం తన కత్తితో నరికి) శల్యుడు, దాపున ఉన్న కృతవర్మ రథంపైకి కొండ మీదికి లంఘించే సింహంవలె చేరుకొన్నాడు.

చ. అనుజుఁడు వడ్డ శంఖుఁడు మహోగ్రహవృత్తిఁ గడంగి శల్యుపైఁ
దన రథరాజితోఁ గవియు దారుణ దర్పముఁ జూచి దంతి ము
ట్టినఁ బరికాఱు మొత్తము వడిం బఱతెంచిన మాడ్కి నాపగా
తనయుఁడు లోనుగా రథికదంబము బిట్టడరెన్ సముద్ధతిన్. 286

ప్రతిపదార్థం: అనుజుఁడు= సోదరుడు; పడ్డన్= పడిన (ఈ యుద్ధభూమి యందు పడి మరణించగా); శంఖుఁడు= శంఖుడు, విరటుడి కొడుకు; మహా+ఉగ్రహ, వృత్తిన్= మిక్కుటమైన కోప స్వభావంతో; కడంగి= పూని; శల్యుపైన్= శల్యుడిపై; తన రథరాజితోన్= తన రథాల సమూహంతో; కవియు= మార్కొనే; దారుణ, దర్పము= ఘోరమైన పరాక్రమాడంబరం; చూచి= అరసి; దంతిన్= ఏనుగును; ముట్టినన్= తాకగా; పరికాఱు+మొత్తము= తెగకు ముఖ్యమైన ఏనుగుల సమూహాలు; వడిన్= వేగంగా; పఱతెంచినమాడ్కిన్= పరుగెత్తుకొని వచ్చే తీరుగా; ఆపగా తనయుఁడు= నదీపుత్రుడు= భీష్ముడు; లోనుగా+రథికదంబము= మున్నగు రథికుల సముదాయం; సముద్ధతిన్= మిక్కుటమైన గర్వంతో; బిట్టు+ అడరెన్= ఎక్కువగా విజృంభించింది.

తాత్పర్యం: ఉత్తరుడు యుద్ధభూమిపై కూలిపోగా, అతడి సోదరుడైన శంఖుడు మిక్కుటమైన కోపంతో శల్యుడిని తాకటం చూచి, యేనుగును ఎదుర్కొంటే, ఏనుగుల గుంపుకు నాయకత్వం వహించే పెద్ద యేనుగు, తక్కిన ఏనుగులు పరుగెత్తుకొని వచ్చే విధంగా కౌరవసేనాపతి భీష్ముడు, తదితర రథికులు గర్వంతో కూడుకొని (శంఖుడిపై) విజృంభించారు.

తే. భీష్మునంపఱ కోర్వక పెల్లగిల్లి । శంఖుతోడి రథావళి జలదపంక్తి
భూరిమారుతహతిఁ దూలపోవునట్లు । వఱచెఁ గని క్రీడి యడ్డంబు వఱపెఁ దేరు. 287

ప్రతిపదార్థం: భీష్ము+అంపఱకున్= భీష్ముడు ప్రయోగించిన బాణపరంపరకు; ఓర్వక= తాళజాలక; పెల్లగిల్లి= క్షోభించి; శంఖుతోడి= శంఖునితో కూడిన; రథ+ఆవళి= రథాలగుంపు; జలదపంక్తి= మబ్బుల దొంతర; భూరి+మారుత+హతిన్= గొప్పగాలి తాకిడిచే; తూలపోవునట్లు= దూరంగా నెట్టివేయబడునట్లు; పఱచెన్= పారిపోయింది; కని= (దానిని) చూచి; క్రీడి= అర్జునుడు; తేరు= తన రథం; అడ్డంబు+పఱపెన్= అడ్డంగా త్రిప్పించి చేరాడు.

తాత్పర్యం: భీష్ముడు ప్రయోగించిన బాణాలకు తాళజాలక శంఖుడి రథ సమూహం, పెద్దగాలి తాకిడికి చెదరిపోయే మబ్బు దొంతరవలె చెదరిపోయింది. ఆ దృశ్యం చూచి అర్జునుడు తన రథాన్ని అడ్డం తిప్పి ఆ చోటికి చేరుకొన్నాడు.

క. కొఱవియుఁ గొఱవియుఁ దాఁకిన । తెఱఁగున నర్జునుఁడు సురనదీ సూనుఁడుఁ జూ
పఱు వొగడఁ దాఁకుటయు ని । ద్దఱ దిక్కుల సైన్యములును దలపడియె వడిన్. 288

ప్రతిపదార్థం: కొఱవియున్+కొఱవియున్+తాఁకిన+తెఱఁగునన్= మండేకర్ర మండే కర్రతో మార్కొనిన రీతిగా; అర్జునుఁడు= అర్జునుఁడూ; సుర+నదీ+సూనుఁడు= గంగకొడుకు(భీష్ముడూ); చూపఱు= చూచేవారలు; పొగడన్= కీర్తించగా; తాకుటయున్= తలపడగా; ఇద్దఱ, దిక్కుల, సైన్యములును= ఇరువైపుల సేనలూ; వడిన్= వేగంగా; తలపడియెన్= ఎదుర్కొన్నాయి.

తాత్పర్యం: కొఱవీ కొఱవీ మార్కొన్న మాదిరిగా, అర్జునుడూ భీష్ముడూ ఒకరిపై ఒకరు విజృంభించారు. అంతట ఇరుపక్షాల సేనలు సయితం వేగంగా ఒకదానితో ఒకటి ఢీకొన్నాయి.

వ. అంత నపరాహ్ణం బయ్యె నట్టియెడ; 289

ప్రతిపదార్థం: అంతన్= అప్పుడు; అపర+అహ్ణంబు+అయ్యెన్= మధ్యాహ్నం అయింది; అట్టి+ఎడన్= ఆ సమయంలో;

తాత్పర్యం: అంత మధ్యాహ్నసమయం అయింది. ఆ సమయంలో.

క. కృతవర్మ రథము డిగి యు । ద్ధతుఁ డై మద్రపతి ఘనగదామండితహ
స్తత మెఱయఁ గవిసి రథ్య । వ్రతతిన్ ధరఁ గూల్చె శంఖుబలము దలంకన్. 290

ప్రతిపదార్థం: కృతవర్మ+రథము+డిగి= కృతవర్మయొక్క రథంనుండి క్రిందికిదిగి; మద్రపతి= మద్రదేశరాజు (శల్యుడు); ఉద్ధతుఁడు+ఐ= అతిశయించినవాడై; ఘన, గదా, మండిత, హస్తత, మెఱయన్= గొప్ప గదచేత శోభిల్లిన చేయిగలవాడై ప్రకాశించగా; కవిసి= విజృంభించి; రథ్యవ్రతతిన్= గుర్రాల సముదాయాన్ని, శంఖు+బలము= శంఖుడిసేన; తలంకన్= తల్లడిల్లునట్లుగా; ధరన్+కూల్చెన్= భూమిపై పడగొట్టాడు.

తాత్పర్యం: కృతవర్మరథం నుండి శల్యుడు క్రిందికి దూకి, గద చేత బట్టి ప్రకాశిస్తూ విజృంభించి, శంఖుడి సేన తల్లడిల్లేటట్లుగా అతడి గుర్రాలను నేలపై పడగొట్టారు.

క. విరథుఁడయి మాత్స్యపుత్రుఁడు । గరవాలము గొని రథంబు గ్రక్కున డిగి యా
తురత సురరాజనందను । నరదము మాటునకు నతిరయంబున నరిగెన్. 291

ప్రతిపదార్థం: మాత్స్యపుత్రుఁడు= మత్స్యదేశరాజ పుత్రుడు శంఖుడు; విరథుడు+అయి= రథం లేనివాడయి; కరవాలమున్+కొని= కత్తిని పట్టుకొని; రథంబు, గ్రక్కునన్+డిగి= వేగంగా రథంనుండి దూకి; ఆతురతన్= తొట్రుపాటుతో కూడిన వేగంతో; సుర, రాజ, నందను+అరదము+మాటునకున్= దేవేంద్రుడి కొడుకు అగు అర్జునుడి రథం చాటునకు; అతి రయమునన్= మిక్కుటమైన వేగంతో; అరిగెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: మత్స్య దేశ రాజు కొడుకు శంఖుడు విరథుడై, కత్తి చేతపట్టుకొని, రథం నుండి దూకి వేగంగా అర్జునుడి రథం వెనుకకు పోయి దాగుకొన్నాడు.

క. దిక్కులఁ దనబాణంబులు । పిక్కటిలఁగ నుల్లసిల్లి భీష్ముఁడు నరు తే
రక్కడ డించి ద్రుపదవిభుఁ । డుక్కుఱు దత్సేనమీఁద నురవడిఁ గవిసెన్. 292

ప్రతిపదార్థం: భీష్ముఁడు= భీష్ముడు; దిక్కులన్= దెసలయందు; తన+బాణంబులు= తన అమ్ములు; పిక్కటిలంగన్= నిండగా; ఉల్లసిల్లి= శోభిల్లి; నరు+తేరు= అర్జునుని రథం; అక్కడన్= ఆ చోట; డించి= విడిచిపెట్టి; ద్రుపదవిభుఁడు= ద్రుపదరాజు; ఉక్కు+అఱన్= బలం తగ్గగా; తద్+సేనమీఁదన్= ఆతడి సైన్యంపై; ఉరవడిన్= మిక్కుటమైన వేగంతో; కవిసెన్= మార్కొన్నాడు.

తాత్పర్యం: భీష్ముడు తన బాణాలు దెసలలో నిండగా శోభిల్లి, అర్జునుడి రథం విడిచిపెట్టి, ద్రుపదరాజు బలం కోలుపోయి నిస్సహాయుడై చూస్తూ ఉండగా అతడి సేనను మిక్కిలి వేగంతో మార్కొన్నాడు.

వ. ఇట్లు గవిసి. **293**

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; కవిసి= విజృంభించి.

తాత్పర్యం: భీష్ముడు ఈ విధంగా విజృంభించి.

క. ఎండిన యడవిన్ దరికొని । మండెడు కార్చిచ్చు మాడ్కి మారి మసఁగిన
ట్లొండొండ నేచి హయవే । దండ స్యందన పదాతి తతిఁ బొడ వడఁచెన్. **294**

ప్రతిపదార్థం: ఎండిన+అడవిన్= ఎండిపోయిన చెట్లతో కూడిన అడవిని; దరికొని మండెడు=కాలుస్తూ, ప్రజ్వలించే; కార్చిచ్చు మాడ్కిన్= దావాగ్నివలె; మారి+మసగినట్లు= విజృంభించినట్లు; హయ, వేదండ, స్యందన, పదాతితతిన్= గుర్రాలు, ఏనుగులు, రథాలు, కాలిభటుల మొత్తమును; ఒండుఒండన్= ఒకదాని పిదప ఒకదానిని; ఏచి= విజృంభించి; పొడవు+అడఁచెన్= రూపుమాపినాడు.

తాత్పర్యం: భీష్ముడు ఈ విధంగా విజృంభించి, ఎండిపోయిన చెట్లతో కూడిన అడవిని కార్చిచ్చు తగులబెట్టే రీతిగా, చతురంగ బలాలను ఒకదాని తరువాత ఒకదానిని వరుసగా నాశనం చేశాడు.

క. కేకయు లేవుర బలములు । నాకులతం బొంద మార్గణాసారమునం
జీకాకు పఱిచె భీష్ముఁ డ । నేక గతులఁ దన రథంబు నేడ్తెర మెఱయన్. **295**

ప్రతిపదార్థం: కేకయులు+ఏవుర+బలములు= కేకయరాజులు అయిదుగురిసేనలు; ఆకులతన్+పొందన్= చీకాకుపడునట్లుగా; మార్గణ+ఆసారమునన్= బాణాల జడివానచేత; భీష్ముఁడు= భీష్ముడు; అనేక గతులన్= పెక్కు రీతుల; తన రథంబు= తన తేరుయొక్క; ఏడ్తెఱ+మెఱయన్= విజృంభణము ప్రకాశింపగా; చీకాకు+పఱిచెన్= ఆకుల పరిచాడు.

తాత్పర్యం: కేకయరాజులు అయిదుగురి సేనలు చీకాకు పడేటట్లుగా భీష్ముడు తన రథం యొక్క విజృంభణం వెలయగా బాణ వృష్టిలో వారిని ముంచెత్తాడు.

క. ఉఱక విరాటుబలముపై । గొఱియల పిండునకుఁ గవియు కోల్పులిక్రియ బి
ట్టఱఁ గవిసి నదీసూనుఁడు । నుఱుమాడె వియచ్చరులు వినుతి సేయంగన్. **296**

ప్రతిపదార్థం: ఉఱక= లెక్కచేయక; విరాటు, బలముపైన్= విరటుడి సేనపై; గొఱియల పిండునకున్= గొర్రెల మందమీదికి; కవియు= విజృంభించే; కోల్పులి+క్రియన్= పెద్దపులివలె; బిట్టు+అఱన్+కవిసి= పెద్దపెట్టున మార్కొని; నదీ+సూనుఁడు= నదికొడుకు(భీష్ముడు); వియత్+చరులు= ఆకాశ సంచారులు(దేవతలు); వినుతి+చేయంగన్= ప్రస్తుతింపగా; నుఱుమాడెన్= సంహరించాడు.

తాత్పర్యం: గొర్రెలమందమీద పడే పెద్దపులివలె భీష్ముడు లక్ష్య పెట్టకుండా విరాటుడి సైన్యాలపై పెద్ద పెట్టున దుమికి ఆకాశ సంచారులు పొగడే విధంగా సంహరించాడు.

తే. ఇట్లు పాండవ సైన్యంబు లెల్లఁ గలఁగి । యిక్కడక్కడఁ బడుచుండ నక్కజంపుఁ
గడిమి కచ్చెరువడి యొక్క కడకు వచ్చి । పాండుసూనులు నివ్వెఱపాటు నొంద. 297

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; పాండవ+సైన్యంబులు+ఎల్లన్= పాండవుల సేనలు అన్నీ; కలఁగి= చీకాకై; ఇక్కడన్+అక్కడన్= ఇచట అచట; పడుచుండన్= కూలుతుండగా; అక్కజంపు+కడిమికిన్= అద్భుతమైనభీష్ముడి పరాక్రమానికి; అచ్చెరువడి= ఆశ్చర్యం చెంది; ఒక్క, కడకున్, వచ్చి= ఒకేచోటికి వచ్చి; పాండుసూనులు= పాండవులు; నివ్వెఱపాటున్+ఒందన్= మిక్కిలి వెఱగు పొందగా.

తాత్పర్యం: ఈ విధంగా పాండవ సేనలు అన్నీ కలతచెంది, ఇక్కడ అక్కడ కూలిపోతూ ఉండగా, భీష్ముడి అద్భుతపరాక్రమానికి ఆశ్చర్య చకితులై పాండవులందరూ ఒక చోటికి వచ్చి నివ్వెరపాటు పొందగా (తరువాతి పద్యంతో అన్వయం)

క. శాంతనవుఁడు దేజోదు । ర్దాంతుం డై నావెలుంగు ధరకెల్లను జా
లింతు నినుఁ డస్తశైలో । పాంతమునకుఁ జనిన నేమి యనిన ట్లుండెన్. 298

ప్రతిపదార్థం: శాంతనవుఁడు= శంతనుడి కొడుకు భీష్ముడు; తేజస్+దుఃదాంతుండు+ఐ= తేజస్సుచేత అణచరాని వాడవుతూ; నావెలుంగు= నా ప్రకాశం; ధరకున్+ఎల్లను= భూమికి అంతటికిని; చాలింతున్= సరిపోయేటట్లుగా చేయగలను; ఇనుఁడు= సూర్యుడు; అస్త, శైల, ఉపాంతమునకున్= అస్తగిరి ప్రాంతానికి(అస్తమించే కొండదరికి); చనినన్+ఏమి= వెళ్ళితే ఏమిలే; అనిన+అట్లు= అనినరీతిగా; ఉండెన్= ఉన్నాడు.

తాత్పర్యం: భీష్ముడు సూర్యుడి మాదిరిగా తేజస్సుతో వెలుగొందాడు. 'నా వెలుగు చాలు. ఈ భూమిని అంతటిని ప్రకాశించేటట్లు చేయటానికి. ఇక ఇప్పుడు సూర్యుడు అస్తమిస్తే మాత్రం ఏ లోటు ఉంటుంది?' అని చెప్పేటట్లుగా ఉన్నది. అనగా భీష్ముడు సూర్యుడివలె దేదీప్యమానంగా వెలుగొందాడు.

క. సోమాన్వయ ప్రదీపకుఁ । డీ మెయి దేజో విశేష మెసకం బెసఁగం
గా మెఱయుట గనుఁగొని సి । గ్గై మఱువడుమాడ్కిఁ గ్రుంకె నర్కుం డంతన్. 299

ప్రతిపదార్థం: సోమ+అన్వయ, ప్రదీపకుఁడు= చంద్రవంశాన్ని వెలుగొంద చేసేవాడు(భీష్ముడు); ఈ మెయిన్= ఈ విధంగా; తేజస్+విశేషము+ఎసకంబు+ఎసఁగన్= గొప్ప తేజస్సు అతిశయిల్లగా; మెఱయుట+కనుఁగొని= ప్రకాశించటం చూచి; సిగ్గు+ఐ= సిగ్గుకలిగి, లజ్జతో; మఱుఁగు పడు మాడ్కిన్= చాటగు రీతిగా; అంతన్= ఆ సమయంలో; అర్కుండు= సూర్యుడు; క్రుంకెన్= అస్తమించాడు.

తాత్పర్యం: చంద్రవంశాన్ని ప్రకాశమానం చేసే భీష్ముడు ఈ విధంగా గొప్ప తేజస్సుతో వెలుగొందటం చూచి, సూర్యుడు సిగ్గుపడి తాను కనిపించకుండా వెళ్ళిపోయాడా అన్నట్లు అస్తమించాడు.

తే. జలరుహంబులు పాండవసైనికుల మొ । గంబు లట్టుల విన్నన్నై కాంతి దఱిఁగె;
వారి మనముల భీత్యంధకార మడరు । కరణిఁ జీఁకటి యెడనెడఁ గవియుఁదెంచె. 300

ప్రతిపదార్థం: జలరుహంబులు= నీటిలో పుట్టినవి(కమలాలు); పాండవ+సైనికుల+మొగంబులు+అట్టులన్= పాండవసేనలోని భటుల మొగాలవలె; విన్నన్నై= వెలవెలబోయి; కాంతి+తఱిగెన్= తేజస్సును కోల్పోయాయి; వారి+మనములన్= పాండవసైనికుల

మనస్సులలో; భీతి+అంధకారము= భయం అనే చీకటి; అడరు+కరణిన్= వ్యాపించే రీతిగా; చీఁకటి= అంధకారం; ఎడన్+ఎడన్= ఆయా చోటులందు; కవియుఁదెంచెన్= వ్యాపించింది.

తాత్పర్యం: సూర్యుడు అస్తమించాడు. పద్మాలు పాండవసేనలలోని భటుల మొగాలవలె ముడుచుకుపోయాయి. వారి మనస్సులలో భయం అనే చీకట్లు క్రమ్ముకొన్నట్లుగా ఆయా చోటులలో చీకట్లు వ్యాపించసాగాయి.

విశేషం: అలం: ఉపమ, ఉత్ప్రేక్ష. 1. పద్మాలు సూర్యాస్తమయంతో ముడుచుకొనిపోతాయి అని కవిసమయం. 2. ప్రబంధ యుగంలో - ఇట్టి ఉత్ప్రేక్షలు తామర తంపరలు. వీటికి తిక్కన ఒజ్జబంతులు తీర్చాడని చెప్పవచ్చును. అయితే తిక్కన వీటిని చాలా అరుదుగా వాడాడు. 3. మహాభారత యుద్ధంలో ఇరుపక్షాల ఒడంబడిక సూర్యోదయం నుండి సూర్యాస్తమయం వరకు పోరాటం జరగాలి. (ఈ నియమాన్ని అతిక్రమించటం ఒకేసారి జరిగింది. పదునాల్గవ రోజు సైంధవవధా నంతరం రాత్రి యుద్ధం జరిగింది.)

వ. అప్పుడు గయ్యంబు సాలించి. **301**

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో; కయ్యంబు= యుద్ధం; చాలించి= విరమించి.

తాత్పర్యం: అప్పుడు యుద్ధం ఆపివేసి.

తే. ఉభయసేనలుఁ దమతమ యునికిపట్ల । కరిగెఁ దాత పరాక్రమ స్ఫురణమునకుఁ
గురువిభుండును దమ్ములుఁ బరమహర్ష । భరితహృదయులై యుండిరి భరతముఖ్య! 302

ప్రతిపదార్థం: భరత ముఖ్య!= భరతవంశంలో ముఖ్యుడైనవాడా, ఓ ధృతరాష్ట్ర మహారాజా!; ఉభయ+సేనలున్= రెండుసైన్యాలూ; తమతమ+ఉనికిపట్లకున్= తమ తమ నివాసాలకు; అరిగెన్= వెళ్ళాయి; తాత, పరాక్రమ, స్ఫురణమునకున్= భీష్ముడి శౌర్య ప్రసారానికి; కురు+విభుండును= కురురాజు(దుర్యోధనుడు); తమ్ములు= అతని సోదరులు; పరమ, హర్ష, భరిత, హృదయులు+ఐ= మిక్కిలి సంతోషంతో నిండిన గుండెలు కలవారై; ఉండిరి= ఉన్నారు.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! భరతవంశంలో ముఖ్యుడైనవాడా! అప్పుడు యుద్ధం ఆపివేసి రెండు సేనలలోనివారు తమ తమ ఆవాసాలకు వెళ్ళిపోయారు. తమ తాత భీష్ముడి శౌర్య ప్రసారానికి దుర్యోధనుడూ అతడి తమ్ములూ ఆనందంతో నిండిన హృదయాలు కలవారై ఉన్నారు.'

వ. అని సంజయుండు భీష్మోపంబు సెప్పెనని పలుకుటయుఁ 'దొలునాఁటి కయ్యంబున గాంగేయుచేత
నట్లయినఁ బాండునందనులు పదంపడి యేమి సేసి?'రని యడిగిన 303

ప్రతిపదార్థం: అని= అనిచెప్పి; సంజయుండు= సంజయుడు; భీష్మ+ఆటోపంబు= భీష్ముడియొక్క విజృంభణం; చెప్పెన్+అని= చెప్పాడు; అని; పలుకుటయున్= అని చెప్పటం; తొలునాటి కయ్యంబునన్= మొదటిరోజు యుద్ధంలో; గాంగేయుచేతన్= భీష్ముడిచేతిలో; అట్లు+అయినన్= ఆ విధంగా కాగా (ఆ రీతిగా పరాజయం అనుభవించిన); పాండునందనులు= పాండవులు; పదంపడి= పిదప; ఏమి+చేసిరి?= ఏం చేశారు?; అని+అడిగినన్= అని ప్రశ్నించగా.

తాత్పర్యం: భీష్ముడి పరాక్రమ విజృంభణం గూర్చి సంజయుడు ధృతరాష్ట్రుడికి చెప్పాడు. 'మొదటిరోజు యుద్ధంలో ఆ విధంగా తల్లడిల్లిపోయిన పాండవులు పిదప ఏమి చేశారు?' అని ధృతరాష్ట్రుడు ప్రశ్నించాడు.

ఆశ్వాసాంతము

చ. నిగమశిఖా విహారమహనీయ! మునీశ్వర భావనీయ! స
ర్వగురు మహానుభావ! మధురప్రకటాప్రతిమ స్వభావ! దే
వగణనిషేవ్య! వారిగిరి వాస వినోద విభావ్య! విశ్వలో
కగతవపుర్వికస్వర! వికారవిదూర విలాస భాస్వరా! 304

ప్రతిపదార్థం: నిగమ, శిఖా, విహార, మహనీయ!= ఉపనిషత్తులు విహారరంగాలుగా కలిగిన గొప్పవాడా!; ముని+ఈశ్వర+భావనీయ!= గొప్ప ఋషులచేత భావింపబడదగినవాడా!; సర్వ, గురు, మహానుభావ!= అందరు దేశికుల గొప్ప అనుభవం కలవాడా!; మధుర, ప్రకట+అప్రతిమస్వభావ!= తియ్యగా అభివ్యక్తమయ్యే సాటిలేని స్వభావం కలవాడా!; దేవ, గణ, నిషేవ్య!= వేల్పుల సమూహం చేత సేవింపతగినవాడా!; వారి, గిరి, వాస, వినోదభావ్య!= నీటియందును పర్వతమునందును నివసించి ఆనందించేవాడా!; విశ్వ, లోక, గత, వపుఃవికస్వర!= సమస్త లోకాలకు వ్యాపించిన దేహ వికాసం గలవాడా!; వికార, విదూర, విలాస, భాస్వరా!= స్వభావంలో మార్పులేని భోగములందు ప్రకాశించేవాడా!

తాత్పర్యం: ఓ హరిహరనాథా! ఉపనిషత్తులలో విహరించేవాడా! ముని శ్రేష్ఠులచేత భావించబడేవాడా! గురువులందరి గొప్పతనానికి ఆకారమైనవాడా! సాటిలేని మధురమైన ఆంతర్యం కలవాడా! దేవతల సముదాయంచేత సేవింపబడేవాడా! సముద్రంలో (క్షీరసాగరంలో) (హరి) కొండపై (కైలాసగిరిపై) (హర) నివసించేవాడా! యావత్ ప్రపంచం దేహంగా పరిణమించినవాడా! చెరుపులేని భోగాలలో ప్రకాశించేవాడా!

క. దూరాంతిక దుర్గమ వి । స్తార! సుగమసన్నివేశ! తావదచల స
ర్వారంభక నిష్క్రియ! సం । స్కారోజ్జ్వల విశ్వసంప్రకాశనమూర్తీ! 305

ప్రతిపదార్థం: దూరాంతిక+దుర్గమ+విస్తార!= దవ్వుల ఉండటం, దగ్గరగా ఉండటం, చేరలేకపోవటం, వ్యాపనం కలవాడా!; సుగమ, సన్నివేశ!= సులువుగా పొందదగినవాడా!; తావత్, అచల, సర్వ+ఆరంభక+నిస్+క్రియ= అంతమాత్రమే కదలకుండగా అన్ని ప్రయత్నాల యందు తటస్థంగా ఉండేవాడా! అనగా అన్ని కార్యముల యెడ సాక్షీభూతుడవుగా ఉండేవాడా!; సంస్కార+ఉజ్జ్వల!= పరిశుద్ధతతో ప్రకాశించేవాడా!, విశ్వ సంప్రకాశన మూర్తీ!= సృష్టిని వెలుగొందజేసే ఆకృతి కలవాడా!

తాత్పర్యం: దవ్వుల ఉండటం, దగ్గరగా ఉండటం, చేరలేకపోవటం అనే విభిన్న గుణాలకు సమన్వయ కేంద్రమైనవాడా! సులువుగా పొందదగినవాడా! సర్వకార్యాలకు సాక్షీభూతుడవైన వాడా! పరిశుద్ధతతో ప్రకాశించేవాడా! సర్వసృష్టిని ప్రకాశమానంగా చేసేవాడా!

విశేషం: హరిహరనాథుడు - తిక్కన సమన్వయం వేదాంత తత్వానికి ప్రతీక.

మాలిని.

నిరతిశయమహత్వోన్మేష! నిర్ధూతదోషా!
విరతి హృదయ రమ్యావేశ! నిత్యప్రకాశా!
భరితభువన తేజోభవ్య యోగానుభావ్యా!
స్ఫురితగుణ నమశ్శ్రీ పుణ్య నైర్గుణ్య గణ్యా! 306

ప్రతిపదార్థం: నిరతిశయ+మహత్త్వ+ఉత్+మేష= సాటిలేని గొప్పతనంచేత మిరుమిట్లు గొలిపేవాడా!; నిర్ధూతదోషా!= చెదరగొట్టబడిన తప్పులు కలవాడా, పవిత్రుడా!; విరతి+హృదయ+రమ్య+ఆవేశా= కోరికలు లేనిగుండెలలో అందమైన పొందిక కలవాడా!; నిత్యప్రకాశా= ఎల్లప్పుడు వెలుగొందేవాడా!; భరిత+భువన+తేజస్+భవ్య+యోగ+అనుభావ్య!= నిండిన లోకప్రకాశంచేత వెలిగే పవిత్రమైన యోగంచేత తెలియదగినవాడా!; స్ఫురిత+గుణ+నమశ్రీ= ప్రకాశించే గుణాలచేత గొప్పతనం చెందినవాడా!; పుణ్య నైర్గుణ్యగణ్యా!= ఏ గుణాలు లేకపోవటం చేత గొప్పదనం పొందినవాడా.

తాత్పర్యం: సాటిలేని గొప్పతనంచేత దేదీప్యమానంగా వెలుగొందేవాడా! దోషరహితుడా! నిష్కామ హృదయాలలో స్ఫూర్తిని కలిగించేవాడా! ఎల్లప్పుడు ఉండేవాడా! సర్వలోకాలలో ప్రకాశించే యోగంవలన తెలిసికొనదగినవాడా! వెలుగొందే గుణాలవలన గొప్పదనం పొందినవాడా! నిర్గుణతత్త్వమునకు లక్ష్యమైనవాడా!

గద్యము.

శ్రీమదుభయకవిమిత్ర, కొమ్మనామాత్యపుత్ర బుధారాధనవిరాజి తిక్కన సోమయాజి ప్రణీతం బయిన శ్రీమహాభారతంబున భీష్మపర్వంబునందుఁ బ్రథమాశ్వాసము.

ప్రతిపదార్థం: శ్రీమత్= మంగళకరమైన; ఉభయకవిమిత్ర= సంస్కృత ఆంధ్రభాషలకు చెందిన రెండు రకాల కవులకు-మిత్రుడైనవాడూ; కొమ్మన+అమాత్యపుత్ర= కొమ్మనామాత్యుని కుమారుడు; బుధ+ఆరాధన, విరాజి= పండితులను సేవించటం చేత ప్రకాశించేవాడు, లేదా, పండితులు (తమను) సేవించటం చేత ప్రకాశించేవాడు; తిక్కన సోమయాజి; ప్రణీతంబు+అయిన= రచించబడిన; శ్రీమత్+మహాభారతంబునన్= శుభప్రదమైన మహాభారతంలో; భీష్మపర్వంబునందున్= భీష్మపర్వంలో; ప్రథమ+ఆశ్వాసము= మొదటి అశ్వాసం.

తాత్పర్యం: ఉభయ కవిమిత్రుడూ, కొమ్మనామాత్యుడి కుమారుడూ, పండితులచేత ఆరాధించబడుతూ ప్రకాశించేవాడూ, (పండితుల ఆరాధనంచేత ప్రకాశించేవాడూ) అయిన తిక్కన సోమయాజి రచించిన శ్రీమహాభారతంలోని భీష్మపర్వంలో ప్రథమాశ్వాసం.

భీష్మపర్వంలో ప్రథమాశ్వాసం సమాప్తం.

శ్రీరస్తు

శ్రీమదాంధ్ర మహాభారతము

భీష్మపర్వము - ద్వితీయాశ్వాసము

శ్రీ నిర్మాణ విచక్షణతా । నిష్కాపర కటాక్ష! ధర్మసరోజా
సీన ! నిరంజన భక్తో । ద్యాన వసంతాయమాన! హరిహరనాథా! 1

ప్రతిపదార్థం: శ్రీ నిర్మాణ+విచక్షణతా నిష్కా+పర కటాక్ష= సంపద చేకూర్చటంలో వివేకంతో కూడిన దీక్ష వహించిన దృష్టి కలవాడా! ; హరిహరనాథా!= విష్ణు శివతత్వాలు సంగమించిన దేవా!; ధర్మ సరోజ+ఆసీన!= ధర్మం అనే పద్మం కూర్చొనే చోటుగ చేసికొన్నవాడా!; నిరంజన= ప్రాపంచిక విషయాలందు వైరాగ్యం గల; భక్త+ఉద్యాన, వసంతాయమాన!= భక్తులు అనే తోటకు, ఆమని వంటివాడా!

తాత్పర్యం: ఓ హరిహరనాథా! సంపదలను ప్రసాదించటంలో యుక్తాయుక్త పరిజ్ఞానం కలవాడా! ధర్మం అనే పద్మాన్ని ఆసనంగా చేసికొన్నవాడా! ప్రాపంచిక విషయ విరక్తిగల భక్తులు అనే తోటకు అభ్యుదయ పరంపరాభివృద్ధులు చేకూర్చే వసంత ఋతువు వంటివాడా!

విశేషాలు: 1. శ్రీ శబ్దానికి సంపద, కాంతి మున్నగు ఎన్నో అర్థాలు ఉన్నాయి. 2. పద్మాసనం వేసికొని యోగులు తపస్సు చేస్తారు. హరిహరనాథుడు ధర్మ పద్మాసనుడుగా వర్ణించబడ్డాడు. 3. వసంతఋతువులో చెట్లు చిగిరించి మొగ్గతొడిగి కన్నుల పండువుగా కన్పిస్తాయి. భక్తులు అనే చెట్లకు హరిహరనాథుడు వసంతఋతువు వంటివాడు. 4. భక్తుడు= భక్తి కలవాడు - దేవునియందు ఎడతెగని భక్తి కలవాడు భక్తుడు 5. ధర్మము= పురుషార్థాలలో మొదటిది. భారతీయ సంస్కృతికి ఆత్మ ధర్మం. ధర్మ నిర్వచనం చేయటం మిక్కిలి కష్టం.

ధర్మనిర్వచనం చేసిన సుప్రసిద్ధ ప్రాచీన సంస్కృత శ్లోకం :

- "ధృతిః క్షమా దమోZ స్తేయం శౌచమింద్రియ నిగ్రహః,

ధీ ర్విద్యా సత్య మక్రోధో దశకం ధర్మలక్షణమ్" - (మనుస్మృతి - 6-92)

6. 'భక్తోద్యాన వసంతాయమాన' అన్న ప్రయోగంలో ఎంతో విశాలమైన అర్థం ఇమిడిఉన్నది. భక్తిలో సౌశీల్యం కూడా ఇమిడి ఉన్నది.

" అద్వేష్టా సర్వభూతానాం మైత్రః కరుణ ఏవ చ

నిర్మమో నిరహంకారః సమదుఃఖసుఖః క్షమీ" - (భగవద్గీత 12-13)

ఇతరులను ద్వేషించనివాడు, సర్వభూతాల యెడ స్నేహభావం కలవాడు, నిరహంకారుడు, సుఖదుఃఖాతీతుడు, క్షమా బుద్ధిగలవాడు మాత్రమే భక్తుడు.

ధర్మజుఁడు గోపాలదేవు పాలికిం జనుట (సం. 6-46-1)

వ. దేవా! వైశంపాయనుండు జనమేజయున కిట్లనియె. 2

ప్రతిపదార్థం: దేవా!= ఓ పరమాత్మా! హరిహరనాథా!; వైశంపాయనుండు= వైశంపాయనుడు అనే మహర్షి; జనమేజయునకున్= జనమేజయుడు అనే రాజునకు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: ఓ హరిహరనాథా! వైశంపాయన మహర్షి జనమేజయ మహారాజుతో ఈ విధంగా అన్నాడు.

తే. అట్లు దనవారు మేలు చే యైన భంగి వినిన ధృతరాష్ట్రుఁ డా సూత తనయుతోడ
నెలమి నటమీఁది వృత్తాంత మెట్లు సెప్ప మనినఁ గురువంశవర్య యిట్లనియె నతఁడు. 3

ప్రతిపదార్థం: అట్లు= ఆ విధంగా; తనవారు= తనకు సంబంధించినవారు(ధృతరాష్ట్రుడు, అతడికి సంబంధించిన వారు- కౌరవులు) మేలుచేయి+ఐనభంగి= పై చేయిగా ఉన్నరీతిని (యుద్ధంలో పాండవులను మించుతున్న రీతిని); వినిన= ఆలకించిన; ధృతరాష్ట్రుఁడు= ధృతరాష్ట్ర మహారాజు; ఆ సూత+తనయుతోడన్= (తనకు యుద్ధవృత్తాంతం వినిపిస్తున్న సంజయుడితో) సూతుడి కుమారుడితో; ఎలమిన్= ఉత్సాహంతో; అటమీఁదివృత్తాంతము= ఆపైన జరిగిన సంగతి; ఎట్లు+చెప్పుము+అనినన్= ఏ విధంగా జరిగిందో వచింపుము అని అడుగగా; కురువంశవర్య!= కురువంశంలో శ్రేష్ఠుడవైనవాడా(ఓ జనమేజయ మహారాజా)!; అతఁడు= ఆ సంజయుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఆ విధంగా కౌరవులు యుద్ధంలో పాండవులకంటె పైచేయిగా ఉండటం విని, ధృతరాష్ట్రుడు ఉత్సాహపడి, ఆ తరువాత జరిగిన వృత్తాంతాన్ని వినిపించుమని సంజయుడిని కోరాడు. జనమేజయమహారాజా! అప్పుడు సంజయుడు ఈ విధంగా చెప్పాడు.

వ. ఆ రాత్రి ధర్మతనయుండు విషణ్ణచిత్తుండై తమ్ములం దగువారలం గూర్చికొని గోపాలదేవుపాలికిం జని యతనితో నిట్లనియె. 4

ప్రతిపదార్థం: ఆ+రాత్రి= ఆ రేయి,(కురుక్షేత్ర సంగ్రామం జరిగిన మొదటినాటి రాత్రి); ధర్మతనయుండు= ధర్మరాజు; విషణ్ణ చిత్తుండు+ఐ= దుఃఖంతో కూడిన మనస్సు కలవాడై; తమ్ములన్= తమ్ములను; తగువారలన్+కూర్చుకొని= తగినవారిని వెంటపెట్టుకొని; గోపాలదేవుపాలికిన్+చని= శ్రీకృష్ణుడి దగ్గరకు వెళ్ళి; అతనితోన్= ఆ శ్రీకృష్ణుడితో; ఇట్లు+ అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: కురుక్షేత్ర సంగ్రామంలో మొదటి రోజు యుద్ధంలో కౌరవులు పాండవులను మించారు. అందుచేత ధర్మరాజు మనస్సు దుఃఖభరితమై పోయింది. తన తమ్ములను, మరికొందరు ఆప్తులను వెంటబెట్టుకొని, ధర్మరాజు శ్రీకృష్ణుడి దగ్గరకు వెళ్ళి ఈ విధంగా తన మనోవేదన విన్నవించుకొన్నాడు.

విశేషాలు: తిక్కన తెలుగు మహాభారతానికి శ్రోతలు. 1. కృతిపతి హరిహరనాథ దేవుడు, 2. శౌనకుడు - నైమిశారణ్యంలో సూతుడు చెప్పాడు. 3. జనమేజయుడు - సత్రయాగంలో వైశంపాయన ప్రోక్తం. అంతేకాక, యుద్ధ కథనంలో, 4.ధృతరాష్ట్రుడు-యుద్ధ వృత్తాంతం ధృతరాష్ట్రుడికి నివేదించింది సూతసుతుడు అయిన సంజయుడు. యావద్భారతం నైమిశారణ్యంలో పండ్రెండేండ్లు జరిగిన సత్రయాగంలో శౌనకాది మహర్షులకు వినిపించినది ఉగ్రశ్రవసుడు అనే పేరుగల సూతసూనుడు.

చ. ' ఎరగలి చిచ్చు గాఱడవి యెల్లను బెల్లుగ నొక్కపాయగా
దరికొని రూపడంచిన విధంబున నిక్కడిసేన యంతయుం
దరమిడి చంపె భీష్ము బలదర్ప మహోగ్రతఁ గంటె? నింక నే
బిరుదొకొ నీలమేఘు మనఁ బేర్చి యనిం దెగటార్చు నాతనిన్? 5

ప్రతిపదార్థం: ఎరగలి+చిచ్చు= దావాగ్ని(కార్చిచ్చు); కాఱు+అడవి= దట్టమైన అరణ్యం; ఎల్లను= అంతటిని; పెల్లుగన్= మిక్కుటంగా; ఒక్క+పాయగాన్= ఏకమొత్తంగా; దరికొని= కాల్చి; రూపు+అడంచిన, విధంబునన్= నాశనం చేసిన రీతిగా; ఇక్కడి, సేన+అంతయున్= ఈ పక్షంలో ఉన్న సైన్యాన్ని అంతటినీ; తరము+ఇడి,చంపెన్= హెచ్చు తగ్గులు లేకుండా సంహరించాడు; భీష్ము, బల, దర్ప, మహా+ఉగ్రతన్= భీష్ముని యొక్క పరాక్రమము యొక్క గొప్ప తీవ్రతను; కంటె!= చూచావుగద!; ఇంకన్= ఇకమీద; అనిన్= యుద్ధంలో; ఆతనిన్= ఆ భీష్ముడిని; నీల,మేఘము+అనన్=నల్లని మబ్బు అనేటట్లుగా; పేర్చి= అతిశయించి; ఏ బిరుదు+ఒకొ= ఏ పరాక్రమవంతుడో; తెగటార్చున్?= సంహరింపగలడు?

తాత్పర్యం: దట్టమైన అడవిని అంతటినీ కార్చిచ్చు ఒకేసారిగా నాశనం చేసే రీతిగా, ఈ సేనను అంతటినీ విచక్షణలేకుండా భీష్ముడు సంహరించాడు గదా! భీష్ముడి ప్రతాపం మిక్కుటమైనది చూశావుగదా! ఇంక కారుమబ్బుతో సమానమైన ఏ శూరుడు అతడిని యుద్ధంలో సంహరింపగలడు?

విశేషాలు: i).ఎరగలి+చిచ్చు - దావాగ్నికి చక్కని చిక్కని తెలుగు పలుకుబడి. ii). ఈ పద్యంలో తెలుగు నుడికారపు సొంపులు, ప్రౌఢ సంస్కృత పదములు తిక్కన అతుకులు కనిపించకుండా చక్కగా సంధించాడు. భావానుగుణమైన భాషకు భావోచితమైన ఛందస్సు ప్రయోగించటంలో తిక్కన నేర్పరి. అలంకారం ఉపమ.

చ. అలవి యెఱుంగ నేరక మహాత్ముని లోకముతోడి పాటిగాఁ
దలఁచితి; బేలనైతి; శరతాడనపీడితు లైరి నీ మఱం
దులు; నమరాపగా తనయుతోడి రణంబునకున్ దిశాధినా
థులు నఱుమంగఁ జాల రని తోఁచుచునున్నది నా మనంబునన్. 6

ప్రతిపదార్థం: అలవి= పరిమితి (శక్తి సామర్థ్యముల కొలది); ఎఱుంగ+నేరక= తెలియజాలక; మహా+ఆత్మునిన్= గొప్ప ఆత్మగల (భీష్ముడిని); లోకము+తోడి+పాటిగాన్= భూలోకంలో నున్న మానవులతో సరిపోలే వాడిగా; తలఁచితిన్= అనుకొన్నాను; బేలన్+ఐతిన్= అవివేకిని అయ్యాను; నీ+మఱందులు= నీ బావలు; శర,తాడన,పీడితులు+ఐరి= (భీష్ముడి) బాణాల తాకిడిచేత బాధింపబడిన వారు అయ్యారు; అమర+ఆపగా,తనయు,తోడి, రణంబునకున్= దేవనదీసూనుడితోడి (భీష్ముడితోడి) యుద్ధానికి; దిశా+అధినాథులున్= దిక్పాలకులుకూడ; అఱుమంగన్+చాలరు+అని= ఎదుర్కొనటానికి సమర్థులు కారు అని; నా+మనంబునన్= నా మనసుకు; తోఁచుచున్+ఉన్నది= తట్టుతున్నది.

తాత్పర్యం: భీష్ముడు మహానుభావుడు, జగదేకవీరుడు. ఏదో లోకంలోని వీరులసాటివాడు అని భ్రమించి ఉన్నాను. అది నా అవివేకం. ఇప్పుడు ఆతని శౌర్యం పరిమితి ఎట్టిదో తెలిసికొనగలిగాను. నీ బావలు అతడి బాణాల తాకిడికి తట్టుకోలేక బాధ చెందారు. మరి దిక్పాలకులు గూడ భీష్ముడితో యుద్ధం చేయటానికి సమర్థులు కారు అని నా అభిప్రాయం.

విశేషాలు: i). దిశాధినాథులు= అష్టదిక్పాలకులు - 1. ఇంద్రుడు, 2. అగ్ని, 3. యముడు, 4. నిర్ఋతి, 5.వరుణుడు, 6. మరుత్తు, 7. కుబేరుడు, 8. ఈశుడు.

చ. అతని జయించు నంచు మన మర్జును నెంతయు నమ్మి యుండఁగా
నితఁడును సంగరంబున నుపేక్షకుఁ డయ్యెఁ; వృకోదరుం డొకం
డ తఱికిఁ జొచ్చి దోర్బలము డాఁపక పోరెడు; నేమి సేయు? నా
కితనిని నీతనిం దడవ నేటికిఁ? గయ్యపుజోలి మానెదన్? 7

ప్రతిపదార్థం: అతనిన్= (భీష్ముడిని); జయించున్+అంచున్= గెలువగలడు అని; మనము+అర్జునున్= మనము అర్జునుడిని; ఎంతయున్= మిక్కుటంగా; నమ్మిఉండఁగాన్= విశ్వసించి ఉండగా; ఇతఁడును= అర్జునుడుకూడా; సంగరంబునన్= యుద్ధమునందు; ఉపేక్షకుఁడు+అయ్యెన్= ఉదాసీనుడైనాడు (లెక్కచేయనివాడైనాడు); వృకోదరుండు+ఒకండ= భీముడు ఒక్కడే; తఱికిన్+చొచ్చి= సమయానికి పూనుకొని; దోస్+బలము-దోర్బలము= భుజపరాక్రమం; డాఁపక= దాచుకొనకుండా; పోరెడున్= యుద్ధం చేశాడు; ఏమి+చేయున్?= అంతకుమించి ఏమి+చేయగలడు?; నాకున్= నాకు; ఇతనినిన్+ఈతనిన్= ఇతడినీ, ఇతడినీ; తడవన్+ఏటికిన్?= విమర్శించటం ఎందుకు?; కయ్యపు, జోలి+మానెదన్= యుద్ధం చేసే ప్రసక్తిని విరమించుకొంటాను.

తాత్పర్యం: మన అర్జునుడు భీష్ముడిని జయించగలడని ఆశలు పెంచుకొన్నాము కాని ఆతడు యుద్ధరంగంలో ఏమీ చేయలేకపోయాడు. భీష్ముడి ధాటిని ఎదుర్కొనలేక ఉదాసీనుడైపోయాడు. భీమసేనుడు ఒక్కడు మాత్రమే యుద్ధంలో తన శక్తి వంచన లేకుండ పోరాడాడు. అంతకంటె ఏమి చేయగలడు? వీరినీ వారినీ నేను ఎందుకు నిందించాలి? యుద్ధం విరమించాలని నాకు అనిపిస్తున్నది.

విశేషం: ఈ పద్యం - ధర్మరాజ - భీమ అర్జునుల శీలానుశీలనానికి ఉపకరిస్తుంది. ధర్మరాజు శాంతి ప్రియుడు. యుద్ధ విముఖుడు. అర్జునుడు వివేకి. వివేకం పరాక్రమంలో అంతర్భాగమే. అసమయ సాహస ప్రదర్శన మంచిది కాదు. అది బూడిదలో పోసిన పన్నీరు. (కర్ణ పర్వంలో చండమార్తాండుడుగ వెలుగొందుతున్న కర్ణుడి వర్చస్సు చూచి, 'మాధవా మన రథమింక మరలనిమ్ము। బ్రతికి యుండిన శుభములు పడయవచ్చు' అని , అప్పుడు యుద్ధము చేయలేదు. సరియైన సమయం చూచుకొని కర్ణుడిని సంహరించాడు. భీముడిలో ఆవేశం ఎక్కువ. ఆలోచన తక్కువ. చిత్తశుద్ధి పరాక్రమానికి గాని వివేకానికి గాని పర్యాయపదం కాదు.

మహా భారతం- మానవ స్వభావ వైవిధ్యాన్ని హృదయంగమంగా చిత్రించింది. కురుక్షేత్ర సంగ్రామంలో తొలి దినమందు - ధర్మరాజు దృష్టిలో - అర్జునుడు 'ఉపేక్షకుఁడయ్యె'. అది ఉపేక్ష కాదు. అర్జునుడు ఎంత పోరాడినప్పటికీ, భీష్ముడి విజృంభణాన్ని అరికట్ట సాధ్యం కాలేదు. సర్వసైన్యాధిపతి భీష్ముడు. అది తొలిదినం. అతడు జగదేక ధనుర్ధరుడు. అర్జును డెంత పరాక్రమోపేతుడైనప్పటికీ ఏమి చేయగలడు? ఒకనాడు - ధర్మజ, భీమ, నకుల సహదేవులు నలుగురు కలిసి, జయద్రథుడి విజృంభణ మరికట్టలేకపోయారు.

అర్జునుడు 'పట్టపగటింటి సూర్యుని పగిది' వెలుగొందే కర్ణుడిని - అప్పుడే మూర్ఖంగా ఎదుర్కొని ఉంటే ఏమయ్యేవాడో ఎవరు చెప్పగలరు? మానవ మానస క్షీర సాగర మథనం మహాభారతంలో కన్పిస్తుంది.

క. నరపతుల నెల్ల భీష్మున । కెరగా నొప్పింపఁజాల; నే నడవులకున్
మరలం బోయెద; నచటం । దిరిగెదఁ; గూరాకు గోసి తినియెద ననఘా! 8

ప్రతిపదార్థం: నరపతులన్+ఎల్లన్= రాజులను అందరనూ; భీష్మునకున్= భీష్ముడికి; ఎరగాన్= ఆహారంగా; ఒప్పింపన్+చాలన్= పడవేయ నేరను; ఏన్= నేను; అడవులకున్= అరణ్యాలకు; మరలన్= మళ్ళీ; పోయెదన్= వెళ్ళిపోతాను; అనఘా! పాపరహితుడైనవాడా!= ఓ కృష్ణా!; అచటన్= (ఆ అడవులలో); తిరిగెదన్= తిరుగుతాను; కూర+ఆకు= కూరలు, ఆకులు; కోసి= త్రుంచి; తినియెదన్= తింటాను.

తాత్పర్యం: శ్రీ కృష్ణా! నా పక్షాన యుద్ధం చేయటానికి వచ్చిన రాజులను అందరినీ భీష్ముడికి ఎరగా సమర్పించలేను. నేను తిరిగి అడవులకు పోయి అక్కడే కూరలూ, ఆకులూ తింటూ ఉంటాను.

విశేషాలు: 1. ఎర వాచ్యార్థంలో వానపాము. చేపలను పట్టేందుకు గాలానికి చివర సూదికి 'ఎర' గ్రుచ్చుతారు. చేప ఆ ఎరను తినటానికి వచ్చి సూదికి గ్రుచ్చుకొని పోతుంది. ఎర అనగా పశుపక్ష్యాదులకు వేసే ఆహారం. ఇచ్చట 'ఎర' అనే మాట చాటున చాలా అర్థం దాగుకొని ఉన్నది. ఎర ఒక భ్రమ కల్పిస్తుంది. అట్లాగే, పాండవపక్షంలో పోరాడే రాజులను ఎరగా చూపి భీష్ముడు వచ్చినపుడు ఈ పాచిక పారాలి. ఆతడిని అర్జునుడు పట్టుకొనాలి.

ఈ విధంగా భీష్ముడిని మోసగించటానికి వీలు కాలేదు. మాయోపాయాలు పన్ని యుద్ధం చేయటం కంటె అడవులలో కూరాకు తిని బ్రదకటమే మంచిది అని ధర్మరాజు అభిప్రాయం.

2. లోగడ ధర్మరాజు పండ్రెండు ఏండ్లు వనవాసం చేసి ఉన్నాడు గదా! అందుకే 'మరలన్' అనటం.

క. నీ మాట మెయిన చేయుదు । మే మెయ్యది యైన నెందు నెప్పుడు మాకున్
దామోదర! యశుభస్థితి । లేమి శుభము కలిమి నీదు లీలయ కాదే! 9

ప్రతిపదార్థం: దామోదర!= ఓ శ్రీకృష్ణా!, నీ,మాట, మెయిన్+అ= నీమాట చొప్పున, చేయుదుము= చేయగలం; ఏ+అది+ఐనన్= ఏదైననూ; ఎందున్= ఏ చోటనైనా; ఎప్పుడున్= ఏ సమయంలో అయినా; మాకున్= మాకు; అశుభ+స్థితి+లేమి= అమంగళ పరిస్థితి లేకపోవటం; శుభము= మంచిస్థితి; కలిమి= కలగడం; నీదులీల+అ= నీ ఆట మాత్రమే; కాదు+ ఏ!= కాదా!(అవును)

తాత్పర్యం: ఓ శ్రీకృష్ణా! మేము నీవు చెప్పినట్లుగానే నడచుకొంటున్నాం. ఎప్పుడైనా, ఎచటనైనా, దేనినైనా నీ ఇష్టాన్నే పాటిస్తున్నాం. మాకు అశుభం లేకపోవడం, శుభం కలగడం అది అంతా నీ లీలామహిమ మాత్రమే!

వ. చేయం గల పని యెయ్యది? పనుపు' మనినం బద్మనాభుండు పాండవాగ్రజున కిట్లనియె. 10

ప్రతిపదార్థం: చేయన్+కల పని= చేయవలసిన క్రియ- కర్తవ్యం; ఏది+అది=ఎయ్యది= ఏది; పనుపుము= ఆజ్ఞాపించుము; అనినన్= అని అనగా; పద్మనాభుండు= నాభియందు పద్మం కలిగినవాడు, విష్ణువు= శ్రీ కృష్ణుడు; పాండవ+అగ్రజునకున్= పాండవులలో మొదట పుట్టినవాడికి- ధర్మరాజుకు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఇక కర్తవ్యం ఏది? దయచేసి తెలుపుము' అని ధర్మరాజు అడుగగా శ్రీకృష్ణుడు అతడితో ఈ విధంగా అన్నాడు.

విశేషాలు: 1. పద్మనాభుఁడు= పద్మం నాభియందు కలవాడు శ్రీవిష్ణువు. ఆతడి నాభి కమలం నుండి బ్రహ్మదేవుడు ఉద్భవించాడు. ఇది పురాణ కథ. శ్రీకృష్ణుడు విష్ణుదేవుడి అవతారం అని పురాణ కథనం. సంస్కృత మహాభారత రచనా కాలం నాటికే అందలి పాత్ర అయిన శ్రీకృష్ణుడు, విష్ణువు అవతారంగా సుప్రసిద్ధుడు. 'విష్ణు ర్నారాయణః కృష్ణో వైకుంఠో విష్టరశ్రవాః' - అని అమరకోశం. ఇక తిక్కన తెలుగు మహాభారత కాలం నాటికి ఆ కృష్ణుడికి విష్ణువుకు అభేదం సిద్ధించి యుగయుగాంతరాలయింది.

ఉ. ' నెవ్వగ యింత యేల? వినుఁ! నీ కెదు రెవ్వరు? నీదు తమ్ములం
దెవ్వరు సూచినన్ జగము లిన్నియు గెల్వఁ గలారు; లావునం
గ్రొవ్విన భీష్ము నోర్చు రణకోవిదుఁ డైన శిఖండి; యేను నీ
కొవ్వనివారి నెల్లఁ గ్రమయుక్తి లయం బొనరింతు నెమ్మెయిన్. 11

ప్రతిపదార్థం: నెవ్వగ (నెఱ+వగ)= పూర్ణమైన అనగా మిక్కుటమైన దుఃఖం; ఇంత+ఏల?= ఇంతగా నీకు ఎందుకు? (అనగా ఇంతటి ఆవేదన నీకు అనవసరం అన్నమాట); వినుము= ఆలకించుము; నీకున్+ఎదురు+ఎవ్వరు?= నీకు వ్యతిరేకంగా ఎవరు నిలువగలరు?; నీ+తమ్ములందున్= నీ సహోదరులలో ఎవరైన; చూచినన్= చూడగా; జగములు= లోకాలు; ఇన్నియున్= అన్నింటినీ; గెల్వన్+కలారు= జయించగలరు; లావునన్= పరాక్రమంతో; క్రొవ్వినన= గర్వించిన; భీష్మున్= భీష్ముడిని; ఓర్చు= జయించగల; రణ+కోవిదుఁడు+ఐన= యుద్ధమునందు నేర్పుగల; శిఖండి; ఓర్చున్= జయింపగలడు; నేను; నీకున్+ఒవ్వనివారిన్+ఎల్ల= నీకు ఇష్టులు కాని వారిని అందరినీ; క్రమ+యుక్తిన్= వరుసగా; ఎమ్మెయిన్= ఏదో విధంగా, తప్పకుండా; లయంబు+ఒనరింతున్= సంహరించగలను.

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! నీకు ఇంత ఆవేదన ఎందుకు? నీ కెదురెవ్వరు? నీ తమ్ములలో ఎవరినిచూచినా లోకాలన్నిటినీ జయించగలసమర్థులు. బలగర్వితుడైన భీష్మున్ణి రణకోవిదుడైన శిఖండి జయిస్తాడు. నీకు ఇష్టులు కాని వారినందరినీ నేను వరుసగా ఏదో ఒక తీరున సంహరిస్తాను.

విశేషం: శిఖండి - ద్రుపద మహారాజు పుత్రుడు. పుట్టినపుడు అతడు ఆడశిశువు. పిదప మగవాడైనాడు. పూర్వజన్మంలో అతడు అంబ. ఆమె భీష్ముడిపై పగ వహించి, శివుడిని గూర్చి తపస్సు చేసి, అతడిని సంహరించేటట్లు వరం పొంది, పునర్జన్మలో శిఖండిగా జన్మించినట్లు పూర్వగాథ. ఉస్మానియా ముద్రిత ప్రతిలో పై పద్యములోని రెండవ చరణంలో యతి తప్పింది. 'జగములన్నియు' అనటానికి మారుగా 'జగములిన్నియు' - అనే వావిళ్ళ ప్రతిపాదం సమంజసం.

క. సత్య పరాక్రముఁ డగు నీ । సాత్యకి బాహాబలంబు సమరవిహారౌ
ద్ధత్యముఁ జూచెదు గాదే । యత్యాశ్చర్యంబు లితని యస్త్రవిధంబుల్. 12

ప్రతిపదార్థం: సత్య, పరాక్రముఁడు+అగు= యథార్థమైన గొప్ప శౌర్యం కలవాడైన; ఈ+సాత్యకి= ఈ సాత్యకి; బాహా,బలంబు= భుజబలం - శౌర్యం; సమర,విహార+ఔద్ధత్యము= యుద్ధమునందు విచ్చలవిడిగా సంచరించే అతిశయత్వము; చూచెదు+కాదు+ఏ!= నీవే చూస్తావుగదా!; ఇతని= (ఈ సాత్యకి యొక్క); అస్త్ర+విధంబుల్= మంత్రబాణాలు ప్రయోగించే తీరు తెన్నులు; అతి+ఆశ్చర్యంబుల్= మిక్కిలి వింత గొలిపేవి.

తాత్పర్యం: సత్యపరాక్రముడైన ఈసాత్యకి భుజబలం, ఇతని సమరవిహారంలోని గడుసుతనం చూస్తున్నావుగదా! ఈతని అస్త్ర ప్రయోగనైపుణ్యం అత్యాశ్చర్యకరమైనది.

విశేషం: 1. రామాయణంలో వాల్మీకి పలుసార్లు శ్రీరాముడిని "సత్య పరాక్రముడు" అని అభివర్ణిస్తాడు. ఆ ప్రౌఢ సంస్కృత ప్రయోగాన్ని తిక్కన తెలుగు భారతములో ఇచ్చట ప్రయోగించినాడు. 2. సాత్యకి యాదవవీరుడు. వరుసకు శ్రీకృష్ణుడికి తమ్ముడు, ద్రోణ శిష్యుడు. అర్జునుడికి సతీర్థ్యుడు. కురుక్షేత్ర సంగ్రామంలో చావకుండా మిగిలిన వీరులలో ఒకడు. ఇతడు భారతయుద్ధానంతరం 36 సంవత్సరాలకు సంభవించిన అంతఃకలహంలో కృతవర్మ (కౌరవ పక్షంలో చేరిన యాదవ వీరుడు)తో జరిగిన ద్వంద్వయుద్ధంలో మరణించాడు.

శా. ఉద్యద్విక్రము లైన యీ ద్రుపద మత్స్యోల్వీపతుల్ నిన్ను సం
పద్యోగోజ్జ్వలుఁ జేయఁ బూని కడఁకం బ్రాణంబు లీనున్న ని
ట్లుద్యోగం బెడలంగ నేమిటికి? నీ కుర్వీశ! వే యేల? ధృ
ష్టద్యుమ్నుం డొకరుండ విద్విషదవష్టంభంబు మాన్పింపఁడే?' 13

ప్రతిపదార్థం: ఉద్యత్,విక్రములు+ఐన= ప్రకాశించే శౌర్యం కలిగినవారు అయిన; ఈ+ద్రుపద,మత్స్య+ఉర్వీపతుల్= ఈ ద్రుపదరాజు మరియు విరాటరాజూ; నిన్నున్= నిన్ను; సంపద్+యోగ+ఉజ్జ్వలున్+చేయన్+పూని= ఐశ్వర్యంతో కూడిన యోగంతో మిక్కుటంగా ప్రకాశించేవాడినిగా చేసేదీక్ష గొని; కడఁకన్= పూనికతో; ప్రాణంబులు+ఈన్+ఉన్నన్= అసువులు అర్పించటానికి సిద్ధమై ఉండగా; ఉర్వీ+ఈశ!= రాజా! ధర్మరాజా!; నీకున్= నీకు; ఇట్లు= ఈ విధంగా (నిరుత్సాహం చెంది); ఉద్యోగంబున్= యుద్ధప్రయత్నాన్ని; ఎడలంగన్= వదలటం, విరమించటం; ఏమిటికిన్?= ఎందుకు?; వేయి+ఏల?= వేయిమాటలెందుకు?(ఇన్నిమాటలు అనవసరమని భావం); ధృష్టద్యుమ్నుండు+ఒకరుండు+ అ= ఒక్క ధృష్టద్యుమ్నుడు ఒక్కడే; విద్విషత్+అవష్టంభంబు= శత్రువుల విజృంభణ; మాన్పింపఁడు+ఏ?= అరికట్టడా?

తాత్పర్యం: ఓ ధర్మరాజా! నీ కోసం తమ ప్రాణాలను అర్పించటానికి సంసిద్ధులై, గొప్ప పరాక్రమంతో ప్రకాశించే ద్రుపద మహారాజు, మత్స్య దేశాధీశుడు విరాటరాజు బాసటగా నిలిచి నీకు రాజ్యసంపద కలిగించాలని యత్నిస్తూ ఉండగా నీ విప్పుడు యుద్ధప్రయత్నం మానటమెందుకు? వేయిమాటలెందుకు? జగదేక వీరుడైన ధృష్టద్యుమ్నుడు ఒకడే చాలు, శత్రువుల విజృంభణం అంతా అరికట్టే సమర్థుడు ఆతడు.

విశేషం: 1. ధృష్టద్యుమ్నుడు - ద్రుపద మహారాజు కొడుకు - పాండవుల సర్వసేనాపతి.

వ. అనవుడు ధర్మతనయుండు ధృష్టద్యుమ్ను నాలోకించి. 14

ప్రతిపదార్థం: అనవుడున్= అని శ్రీకృష్ణుడు చెప్పగా; ధర్మతనయుండు= ధర్మసుతుడు= ధర్మరాజు; ధృష్టద్యుమ్నున్+ఆలోకించి= ధృష్టద్యుమ్నుడిని చూచి.

తాత్పర్యం: అని అనగా ధర్మరాజు ధృష్టద్యుమ్నుడివైపు చూచి.

ఉ. పాండవ సైన్య సంఘ పరిపాలన సేయు నితండ యంచుఁ గృ
ష్ణుం డభిషేక సంపదుపశోభితుఁ జేయఁగ, నాధిపత్య ము
ద్దండతఁ బూని తీ నృపులుఁ దమ్ములు నేనును జుట్టి రాఁ; జమూ
మండలి నూలుకొల్పికొని మార్తుర నోర్చినఁ గాక యొప్పనే!' 15

ప్రతిపదార్థం: పాండవ,సైన్య,సంఘ,పరిపాలన,చేయున్= పాండవుల సేనాసమూహాల నెల్లను చేర్చి ఆధిపత్యం వహించగలడు; ఇతండు+అ= ఇతడు(ధృష్టద్యుమ్నుడు); అంచున్= అని చెప్పుతూ; కృష్ణుండు= శ్రీ కృష్ణుడు; అభిషేక+సంపద్+ఉపశోభితున్+చేయఁగన్= శిరస్సుపై శుభజలాలు ప్రోక్షించి-శ్రీమంతుడిని చేసి నిన్ను ప్రకాశమానుడిని చేయగా; ఆధిపత్యము= (సేనపై) అధికారం; ఉద్దండతన్+పూనితి(వి)= గొప్పగా వహించావు; ఈ నృపులు= ఈ రాజులు; తమ్ములు+నేనును= సహోదరులూ, నేనూ; చుట్టిరాన్= పరివేష్టించి యుండగా; చమూ+మండలిన్= సేనా సమూహమును; నూలు కొల్పికొని= ప్రోత్సహించి; మార్తురన్= శత్రువులను; ఓర్చినన్+కాక+ఒప్పును+ఏ?= జయిస్తే తప్ప (నీ సామర్థ్యం) సార్థకం కాదుకదా!

తాత్పర్యం: 'ఓ ధృష్టద్యుమ్నుడా! పాండవసైన్య సమూహాన్ని పరిపాలించగల సమర్థుడితడే - అని శ్రీకృష్ణుడు నిన్ను చూపి సర్వసైన్యాధ్యక్ష పదవిలో అభిషిక్తుడిని చేయగా అధికారాన్ని గొప్పగా వహించావు. ఈ రాజులూ, నా తమ్ములూ, నేనూ కలిసి నిన్ను పరివేష్టించిరాగా సేనాసమూహాన్ని పురికొల్పుకొని శత్రువులను జయించకపోతే ఆ పదవికి వన్నెలభిస్తుందా?

వ. అని యగ్గించినం బొంగి పృషతపౌత్రుండు గుంతీపుత్రున కిట్లనియె. 16

ప్రతిపదార్థం: అని+అగ్గించినన్= అని పొగడగా, పొంగి= ఉత్సాహాన్ని పొంది, పృషతపౌత్రుండు= పృషతరాజు మనుమడు- ధృష్టద్యుమ్నుడు; కుంతీ పుత్రునకున్= ధర్మరాజునకు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: ఈ విధంగా ధర్మరాజు తనను పొగడగా, ఆ ధృష్టద్యుమ్నుడు ధర్మరాజుతో ఇట్లా అన్నాడు:

చ. 'జగ మెఱుఁగంగ ద్రోణు ననిఁ జంపుటకై సృజియించె ధాత న;
న్మగఁటిమి గాఁగ దీనిఁ బలుమాఱు ననం బని లేదు; భీష్ముఁ డా
దిగఁ గురుసేనలోన గణుతింపఁగఁ బేర్చిన యోధకోటి నా
మొగమునఁ బడ్డ నె ట్లడరి ముట్టెదనో యటు సూచుచుండుమీ!' 17

ప్రతిపదార్థం: జగము+ఎఱుఁగంగన్= ప్రపంచమంతా తెలిసేటట్లుగా; అనిన్= యుద్ధంలో; ద్రోణున్= ద్రోణుడిని; చంపుటకున్+ఐ= సంహరించటం కోసమే; ధాత= బ్రహ్మదేవుడు; నన్= నన్ను సృజియించెన్= సృష్టించాడు; మగటిమి+కాఁగన్= శౌర్యమే కాగా; దీనిన్= ఈ విషయాన్ని; పలుమాఱు= చాలాసార్లు; అనన్+పని+లేదు= చెప్ప నవసరం లేదు; భీష్ముఁడు+ఆది+కన్= భీష్ముఁడు మొదలుకొని; కురు+సేనలోనన్= కౌరవుల సైన్యంలో; గణుతింపఁగన్+పేర్చిన= లెక్కపెట్టగా అతిశయించిన; యోధకోటి= వీరుల సముదాయం; నా+మొగమునన్+పడ్డన్= నాకు ఎదురైనప్పుడు; ఎట్లు+అడరి= ఏ విధంగా అతిశయించి; ముట్టెదనో= పోరాటం చేస్తానో; అటు= ఆ రీతిని; చూచుచుండుమా!= చూస్తూ ఉండుము!

తాత్పర్యం: 'ద్రోణుడిని చంపటానికై నన్ను బ్రహ్మదేవుడు సృష్టించాడన్న సంగతి లోకానికి తెలుసు. దీనిని నా పరాక్రమ సూచకంగా పలుసార్లు పేర్కొన పనిలేదు. అది అట్లా ఉండగా, కౌరవసేనలో భీష్మాదులవంటి పేరుమోసిన యోధులందరూ నాకెదురై నిలిచినప్పుడు ఏ విధంగా విజృంభించి ఎదిరిస్తానో గమనించి చూస్తూ ఉండుము!'

తే. పృషతకులముఖ్యుఁ డిమ్మెయిఁ బేర్చి పలుకు । సంగరోత్సాహకరవాక్యభంగి కపుడు
పాండుసుతులును సకల భూపతులు సంత । సంబు నొందిరి, హరియుఁ బ్రియంబు నొందె. 18

ప్రతిపదార్థం: పృషతకులముఖ్యుఁడు= పృషతుడి వంశంలో జనించిన వారిలో పేర్కొనదగినవాడు- ధృష్టద్యుమ్నుడు; ఈ+మెయిన్= ఈ రీతిగా; పేర్చి= అతిశయించి; పలుకు= మాటలాడే; సంగర+ఉత్సాహకర, వాక్య,భంగికిన్= యుద్ధం చేయటానికి ప్రేరేపణ కలిగించే మాటల తీరుకు; అపుడు= ఆ సమయంలో; పాండు సుతులును= పాండవులును; సకల+భూపతులున్= అందరు రాజులును; సంతసంబున్+ఒందిరి= సంతోషించారు; హరియున్= శ్రీ కృష్ణుడును; ప్రియంబున్+ఒందెన్= ప్రీతిచెందాడు.

తాత్పర్యం: ఈ విధంగా పృషత వంశస్థులలో ముఖ్యుడైన ధృష్టద్యుమ్నుడు అతిశయించి యుద్ధోత్సాహాన్ని కలిగించే పౌరుషవాక్యాల పద్ధతికి, పాండవులు సంతోషించారు, అచటి రాజులు అందరూ ఆనందించారు. శ్రీకృష్ణుడు కూడ మిక్కిలి ప్రీతిచెందాడు.

వ. తదనంతరంబ యుధిష్ఠిరుండు ధృష్టద్యుమ్నున కిట్లనియె. 19

ప్రతిపదార్థం: తద్+అనంతరంబు+అ= అటు పిమ్మట; యుధిష్ఠిరుండు= ధర్మరాజు; ధృష్టద్యుమ్ననకున్= ధృష్టద్యుమ్ననకు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: అటు పిమ్మట యుధిష్ఠిరుడు ధృష్టద్యుమ్నుడితో ఈ విధంగా అన్నాడు.

ఉ. ‘ తొల్లి గురుండు దానవులతోడి రణంబున వజ్రపాణికిన్
దెల్లమి గాఁగఁ జెప్పె నది దీప్తతరం బగు నొడ్డనంబు శో
భిల్లుచు వైరి దృష్టులకు భీకరమై చనుఁ గ్రౌంచనామకం
బెల్లి ఘటింపు నీదు వెర వేర్పడ నమ్మొన యద్భుతంబుగన్.’ **20**

ప్రతిపదార్థం: తొల్లి= పూర్వకాలమునందు; గురుండు= ఒజ్జ(బృహస్పతి); దానవులతోడి+ రణంబునన్= రాక్షసులతోడి యుద్ధంలో; వజ్రపాణికిన్= దేవేంద్రుడికి; తెల్లమి+కాఁగన్= స్పష్టంగా తెలిసేటట్లు; చెప్పెన్= వచించాడు; అది= అది; దీప్త+తరంబు+అగు= మిక్కుటంగా ప్రకాశించేటటువంటి; ఒడ్డనమ్ము= వ్యూహం; శోభిల్లుచున్= విలసిల్లుతూ; వైరిదృష్టులకున్= శత్రువుల చూపులకు; భీకరము+ఐ= భయం కలిగించేదై; చనున్= ఒప్పును; క్రౌంచ+నామకంబు= క్రౌంచము అనే పేరు గలది; ఎల్లి= రేపు; నీదు,వెరవు+ఏర్పడన్= నీ నేర్పరితనం ప్రస్ఫుటమయ్యేటట్లుగా; అమ్మొన= ఆ వ్యూహం; అద్భుతంబుగన్= ఆశ్చర్యకరంగా; ఘటింపుము= నిర్మించుము.

తాత్పర్యం: పూర్వకాలంలో రాక్షసులకూ దేవతలకూ యుద్ధం జరిగింది. అప్పుడు దేవతల గురువైన బృహస్పతి దేవేంద్రుడితో ‘క్రౌంచ వ్యూహం మిక్కిలి గొప్పది; శత్రువుల దృష్టికి భయం కలిగించగలదు.’ అని స్పష్టం చేశాడు. నీవు రేపు ఆ క్రౌంచ వ్యూహాన్ని నిర్మించి నీ తెలివితేటలు చూపించుము. అది అద్భుతంగా ఉండాలి.’

వ. అనిన విని యతండట్లు చేయువాఁడ నని పలికె నట్లు గలంక దేఱి కృష్ణ వీడ్కొని యెల్లవారల నిజనివాసంబులకుం బోవం బనిచి ధర్మతనయుం డభ్యంతరావాసంబున కరిగెఁ; బ్రభాతం బగుటయుఁ బాండవసైనికుల డెందంబులతోడన యరవిందంబులు వికాసంబు నొందెం‘బదంపడి తదీయప్రతాపోదయసహవర్తి యగుచు మార్తాండోదయంబు వెలుంగుటయుం గాలోచిత కృత్యంబులు నిర్వర్తించి కౌంతేయాగ్రజుండు వెడలెఁ; గ్రౌంచవ్యూహంబు సంఘటించు నెడం జంచుత్వంబు భజించి ఫల్గునుండు గాండీవకపిధ్వజంబులు మెఱయం బొలిచి నిలిచెఁ; గుంతిభోజుండును శైబ్యుండును జక్షుస్థ్సానంబులం దేజరిల్లిరి; ద్రుపదుండు శిఖకు నమరె; దశార్ణ శూరసేన కిరాత దేశాధీశులు కంఠాకారంబుఁ దాల్చిరి భీమసేనుండును ధృష్టద్యుమ్నుండును దక్షిణవామపక్షంబు లయిరి; సౌభద్ర సాత్యకి ద్రౌపదేయ పౌండ్ర చోళపాండ్యులు భీమసేను వలను నకుల సహదేవ హైడింబశంబర వత్సమహీపతులు ధృష్టద్యుమ్ను దిక్కునం బన్నిరి; కేకయ కాశిరాజులతోడం గూడి విరాటుండు జఘన భాగభంగికిం దగియుండె; హూణపతి ప్రముఖులు పరివేష్టింప వెన్నయి యుధిష్ఠిరుం డొప్పె; నివ్విధంబున మోహరించిన యప్పుడు . **21**

ప్రతిపదార్థం: అనినన్= అని(ధర్మరాజు) చెప్పగా; విని= ఆలకించి; అతండు= అతడు(ధృష్టద్యుమ్నుడు); అట్లు= ఆ రీతిగా; చేయువాఁడన్= చేయగలను; అని+పలికెన్= అని చెప్పాడు; అట్లు= ఆ రీతిగా; కలంకన్+తేఱి= కలతవీడి,(స్వాస్థ్యం చెంది); కృష్ణున్+వీడ్కొని= శ్రీకృష్ణుడిచే సెలవు గైకొని; ఎల్లవారలున్= అందరూ; నిజ+నివాసంబులకున్= తమ తమ విడిదులకు; పోవన్+పనిచి= పంపి; ధర్మతనయుండు= ధర్మరాజు; అభ్యంతర+ఆవాసంబునకున్+అరిగెన్= లోపలనున్న నివాస గృహానికి వెళ్ళాడు; ప్రభాతంబు+అగుటయున్= తెల్లవారగా; పాండవ+సైనికుల+డెందంబులతోడన్+అ= పాండవసేనలలోని భటుల హృదయాలవలెనే; అరవిందంబులు= పద్మాలు; వికాసంబున్+ఒందెన్= వికసించాయి; పదంపడి= పిదప; తదీయ, ప్రతాప+ఉదయ, సహవర్తి+అగుచున్= వారి యొక్క పరాక్రమంతో సాటియైనది అవుతూ; మార్తాండ+ఉదయంబు= సూర్యోదయం; వెలుంగుటయున్= ప్రకాశించింది కాగా; కాల+ఉచిత,కృత్యంబులు= కాలమునకు సరియగు కార్యములు (ఉదయం నిర్వర్తించే పనులు); నిర్వర్తించి= చేసి; కౌంతేయ+అగ్రజుండు= కుంతీ కుమారులలో మొదటివాడు- ధర్మరాజు; వెడలెన్= వెళ్ళాడు; క్రౌంచ+వ్యూహంబు= క్రౌంచము

అనే పేరుగల ఒడ్డనం; సంఘటించు+ఎడన్= నిర్మించే పట్టున; ఫల్గునుండు= అర్జునుడు; చంచుత్వంబు+భజించి= ముక్కు అయి; గాండీవ, కపిధ్వజంబులు, మెఱయన్= గాండీవం అనే విల్లు, కోతి జెండా వెలుగొందుతుండగా; పొలిచి, నిలిచెన్= విలసిల్లాడు; కుంతిభోజుండును= కుంతిభోజుడు; శైబ్యుండును= శైబ్యుడును; చక్షుఃస్థానంబులన్= కన్నులుగా ఉండేచోటులో; తేజరిల్లిరి= వెలుగొందారు; ద్రుపదుండు= ద్రుపదుడు(పాంచాలరాజు); శిఖకున్+అమరెన్= నెత్తిమీది తురాయిగా ఏర్పడ్డాడు; దశార్ణ+శూరసేన+కిరాత+దేశ+అధీశులు= దశార్ణరాజు; శూరసేనరాజు; కిరాతరాజు; కంఠ+ఆకారంబున్= గొంతుక భాగంగా; తాల్చిరి= ధరించారు(ఏర్పడ్డారు); భీమసేనుండును+ధృష్టద్యుమ్నుండును= భీముడు, ధృష్టద్యుమ్నుడు; దక్షిణ,వామ,పక్షంబులు+అయిరి= కుడి ఎడమ రెక్కలవలె ఏర్పడ్డారు; సౌభద్ర,సాత్యకి, ద్రౌపదేయ, పౌండ్ర, చోళ,పాండ్యులు= అభిమన్యుడు, సాత్యకి, ద్రౌపది కొడుకులు, పౌండ్రరాజు, చోళరాజు, పాండ్యరాజు; భీమసేను+వలను= భీముడివైపు; నకుల+సహదేవ+హైడింబ+శంబర+ వత్స+మహీపతులు= నకులుడు, సహదేవుడు, ఘటోత్కచుడు(హిడింబి కొడుకు), శంబరరాజు, వత్సరాజు; ధృష్టద్యుమ్ను దిక్కునన్+పన్నిరి= ధృష్టద్యుమ్నుడి దగ్గర నిలిచి వ్యూహంలో ఒక భాగంగా ఏర్పడ్డారు; కేకయ, కాశిరాజులతోడన్+కూడి= కేకయరాజు కాశీరాజులతో కూడి; విరాటుండు= విరాటరాజు; జఘన,భాగ,భంగికిన్+తగియుండెన్= మొలచోటుగా చేరి ఉన్నాడు; హూణపతి+ప్రముఖులు= హూణరాజు మున్నగు వారిలో ముఖ్యులు; పరివేష్టింపన్= చుట్టుచేరి ఉండగా; వెన్న+అయి= వెనుకభాగంలో; యుధిష్ఠిరుండు= ధర్మరాజు; ఒప్పెన్= విలసిల్లాడు; ఇవ్విధంబునన్= ఈ విధంగా; మోహరించిన+అప్పుడు= వ్యూహం ఏర్పరచిన సమయంలో.

తాత్పర్యం: ధృష్టద్యుమ్నుడు - తాను ధర్మరాజు చెప్పినట్లే చేస్తానన్నాడు. ధర్మరాజు ఆవేదన తొలగింది. అతడు అందరినీ, వారి వారి నివాసాలకు వెళ్ళండని ఆదేశించి తాను తన లోపలి మందిరానికి వెళ్ళాడు. పిదప తెల్లవారింది. పాండవ సైనికుల హృదయాల వలె, పద్మాలు వికసించాయి. సూర్యుడు పాండవభటుల పరాక్రమం వలె ప్రచండ కిరణాలతో వెలుగొందాడు. ధర్మరాజు కాలకృత్యాలు నిర్వర్తించి, బయలుదేరాడు. ధృష్టద్యుమ్నుడు క్రౌంచ వ్యూహం ఏర్పాటు చేశాడు. అర్జునుడు గాండీవ ధనుస్సుతో కోతి జెండాతో వ్యూహానికి 'ముక్కు'గా నిలిచాడు. కుంతిభోజుడు, శైబ్యుడు కన్నులుగా అమరారు. ద్రుపదుడు తురాయి అయ్యాడు. దశార్ణరాజు, శూరసేనరాజు, కిరాతరాజు కుత్తుకగా ఏర్పడ్డారు. భీముడు, ధృష్టద్యుమ్నుడు కుడి ఎడమ రెక్కలయ్యారు. అభిమన్యుడు, సాత్యకి, ద్రౌపది కొడుకులు పౌండ్ర చోళ పాండ్యులు భీముడి దగ్గరకు చేరారు. నకుల సహదేవులు, ఘటోత్కచుడు, శంబర వత్స రాజులు ధృష్టద్యుమ్నుడి కడ చేరారు. కేకయరాజు కాశిరాజులతో కూడి విరాటుడు మొలస్థానంలో నిలిచారు. హూణపతి మున్నగు వారు ధర్మరాజు చుట్టూచేరి వెనుక ఉన్నారు. ఈ విధంగా ఆ వ్యూహం ఏర్పడింది.

విశేషాలు: 1. కురుక్షేత్ర సంగ్రామంలో హూణులు మున్నగు పాశ్చాత్యులు కూడా పాల్గొనినట్లు మహాభారత కథనం. 2. క్రౌంచము= కొంగను పోలిన ఒకానొక పక్షి. 3. భారత యుద్ధంలోని ఒక విశిష్టత - భటులను వ్యూహంగా తీర్చిదిద్ది నిలపటం. వ్యూహాలు - వివిధ మనుజ జంతు పక్షుల ఆకారాలలో ఉండవచ్చును.

భీష్ముని ద్వితీయదివస యుద్ధక్రమము (సం. 6-47-1)

తే. పుండరీకంబు లుద్దండపుండరీక । చారుభంగి లేయెండ కెంజాయ నొప్పె
నంత నక్కడఁ గురుబల మధికరభస । తుములముగఁ ద్రోచి నడతెంచె సమరమునకు. 22

ప్రతిపదార్థం: పుండరీకంబులు= తెల్లతామరపువ్వులు; ఉద్దండ, పుండరీక, చారు, భంగిన్= గొప్పవైన తెల్ల గొడుగుల వలె అందంగా; లేఁత+ఎండ, కెంపు, చాయన్= లేత ఎండలోని అరుణోదయం రంగుతో; ఒప్పెన్ = విలసిల్లాయి; అంతన్= పిమ్మట; అక్కడన్= ఆ స్థలంలో; కురు+బలము= కౌరవుల సైన్యం; అధిక,రభస, తుములముగన్= మిక్కుటమైన తొందరపాటుతో కూడిన సందడితో; సమరమునకున్= యుద్ధానికి; త్రోచి= ముందుకు దూకి; నడతెంచెన్= వచ్చింది.

తాత్పర్యం: ఆ సూర్యోదయ సమయంలో తెల్లతామర పువ్వులు తెరచిన తెల్లగొడుగులవలె మనోజ్ఞంగా శోభిల్లాయి. కౌరవ సైన్యం మిక్కుటమైన ఉత్సాహంతో ముందుకు త్రోసుకొంటూ సంరంభంతో యుద్ధభూమికి చేరింది.

విశేషాలు: i. ఈ పద్యంలో 'అంతన్' - 'అక్కడ' అనే చిన్న పదాలలో పెద్ద భావం ఇమిడి ఉంది. అంతన్= సూర్యోదయ సమయంలో. కురుపాండవసేనలు రెండూ కురుక్షేత్ర సంగ్రామంలో సూర్యోదయ సమయంలో యుద్ధం ప్రారంభించేవి. అక్కడ= ఇంతవరకు, అనగా ఈ తేటగీతిపద్యానికి వెనుకనున్న గద్యంలో పాండవసేన వర్ణన ఉన్నది. అది 'ఇక్కడ' నున్న పాండవసేన వర్ణన. ఇక ఈ పద్యంలో 'అక్కడ' - అనగా ఎదురుగా ఉన్న కౌరవసేన వర్ణన ఉన్నది. ii.. సూర్యోదయ సమయంలో తామర పూవులు వికసిస్తాయి. ఇది కవి సమయం.

వ. అయ్యవసరంబున దుర్యోధనుండు భీష్మ ద్రోణాశ్వత్థామ కృప శల్య కృతవర్మల నాలోకించి. 23

ప్రతిపదార్థం: ఆ+అవసరంబునన్= ఆ సమయంలో; దుర్యోధనుండు= దుర్యోధనుడు; భీష్మ, ద్రోణ, అశ్వత్థామ, కృప, శల్య, కృతవర్మలన్= భీష్ముడిని, ద్రోణుడిని, అశ్వత్థామను, కృపుడిని, శల్యుడిని, కృతవర్మను; ఆలోకించి= చూచి.

తాత్పర్యం: ఆ సమయంలో దుర్యోధనుడు తన పక్షాన ఉన్న వీర ప్రముఖులు - భీష్ముడిని - ద్రోణుడిని, అశ్వత్థామను, కృపుడిని, శల్యుడిని, కృతవర్మను చూచి (ఇట్లు పలికాడు). (తరువాతి పద్యంతో అన్వయం.)

క. ఒకఁ డొకఁడ పాండుపుత్త్రుల । సకల బలంబులను గెలువఁ జాలుదు రుగ్రా
ధిక శౌర్య సత్త్వులందఱు! నొకతల యటె । మిమ్ము నోర్వ నోపునె హరుఁడున్? 24

ప్రతిపదార్థం: ఒకఁడు+ఒకఁడు+అ= ఒకడు ఒకడే; పాండు పుత్త్రుల, సకల, బలంబులను= పాండవుల యొక్క సేనలను అన్నింటినీ; గెలువన్+చాలుదురు= జయించగలరు; ఉగ్ర,అధిక,శౌర్య,సత్త్వులు+అందఱున్= భయంకరమూ, మిక్కుటమూ అయిన పరాక్రమం బలం కలవారు మీరు అందరూ; ఒక, తల+అటె!= (మీరు) ఒక్కటైనారంటే; హరుఁడున్= శివుడు గూడ; మిమ్మున్= మిమ్ము; ఓర్వన్+ఓపును+ఎ= జయించగలడా?(జయించలేడు).

తాత్పర్యం: మీలో ఒక్కొక్కడే పాండవుల సేనలను అన్నింటినీ జయించగలడు. మిక్కిలి భయంకరపరాక్రమము గల్గిన ఇంతమంది మహావీరులు ఒక్కటైనారంటే శివుడు గూడ మిమ్ము యుద్ధంలో జయింపలేడు.

క. ఐనను గ్రౌంచవ్యూహవి । ధానంబున మోహరించి దారుణచారు
స్థానక మై కుంతీసుత । సేన వొలిచె మనము నిర్విశేషంబునకున్. 25

ప్రతిపదార్థం: ఐనను= (మీరు అందరునూ జగదేకవీరులే అయినప్పటికి;) క్రౌంచ, వ్యూహ, విధానంబునన్= క్రౌంచపక్షి ఆకారం ఒనగూడేటట్లుగ ఒడ్డనం; మోహరించి= తీర్చి దిద్ది; దారుణ, చారు, స్థానకము+ఐ= భయంకరమును సుందరమును అయిన తీరుగా; కుంతీ, సుత, సేన= పాండవుల సేన(కుంతి కొడుకుల సైన్యం); పొలిచెన్= శోభిల్లింది; మనము= మనం; నిర్విశేషంబునకున్= సమానంగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

తాత్పర్యం: మీరందరు జగదేకవీరులు అయినప్పటికీ, పాండవులు రమణీయ భయానకమైన క్రౌంచవ్యూహంగా తమ సేనలను అమర్చారు. మనం కూడా ఆ వ్యూహానికి తీసిపోనట్లుగా. (ప్రతివ్యూహం ఏర్పరచుకోవాలి). (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: మహాభారత యుద్ధకాలంలో పోరాటంలో "వ్యూహ" నిర్మాణానికి మిక్కుటమైన ప్రాధాన్యం ఉండేది. వ్యూహాలలో క్రౌంచ వ్యూహం గొప్పది.

క. అనురూపము లగు మాఱొ । డ్డనముల్ ప్రస్ఫురితములు ధృఢంబులుగాఁ దీ
ర్చినఁ గాక తెఱం గగునే?' యని మొన లేర్పఱిచెఁ గౌరవాన్వయముఖ్యా! 26

ప్రతిపదార్థం: కౌరవ+అన్వయ,ముఖ్యా!= కురువంశంలో ప్రధానుడైనవాడా!= ఓ ధృతరాష్ట్ర మహారాజా! అనురూపములు+అగు= సరిపోయే (క్రౌంచ వ్యూహానికి సరితూగునటువంటివి); మాఱు+ఒడ్డనముల్= ప్రతివ్యూహాలు; ప్రస్ఫురితములు= ప్రకాశమానాలు; ధృఢంబులుగాన్= గట్టివి అగునట్టివిగా; తీర్చినన్+కాక= ఏర్పాటు చేస్తే తప్ప; తెఱంగు+అగును+ఏ?= పద్ధతి అవుతుందా?; అని= అని పలికి; మొనలు= వ్యూహాలు; ఏర్పఱిచెన్= ఏర్పాటు చేశాడు.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! పాండవులు యుద్ధ విద్యలో గొప్పదిగా పేరు కెక్కిన 'క్రౌంచవ్యూహం' ఏర్పాటు చేశారు కదా! మనం గూడ ఆ వ్యూహానికి సరిపోయే మరికొన్ని బలమైన వ్యూహాలు ప్రకాశమానా లైనవి నిర్మించాలి కదా!' అని ఆ విధంగా వ్యూహాలు ఏర్పరిచాడు.

వ. దుశ్శాసన వికర్ణవిందాను విందులును శూరసేనయవన త్రిగర్త కురుకు దేశంబులవారు నొక్కవలనను ద్రోణాచార్యుండును గుంతల దశార్ణ విదర్భులును గాంధార సింధుసౌవీరపతులు నొక్కదిక్కునను భీష్ముండు మహాసైన్యంబుతో నడుమనుం గా మూఁడు మోహరంబులయ్యెఁ; గృతవర్మయు శల్యుండును నశ్మంత కాశ్మీరులు గొందఱు దమ్ములుం దానును మానవేంద్రుండును వెనుక దెస నిలిచె నిత్తెఱంగున రెండు బలంబులు నాయితంబులై శంఖభేరీ మృదంగాది తూర్యస్వనంబులు సెలంగ నొండొంటిం గదియ నడచె' ననిన విని ధృతరాష్ట్రుం 'డివ్విధంబునం గదిసి యెవ్వరెట్లు గయ్యంబు సేసి?' రని యడిగిన నతనికి సంజయుం డిట్లనియె. 27

ప్రతిపదార్థం: దుశ్శాసన,వికర్ణ,వింద, అనువిందులును= దుశ్శాసనుడు, వికర్ణుడు, విందుడు, అనువిందుడున్నూ, శూరసేన, యవన,త్రిగర్త, కురుకు దేశంబులవారున్= శూరసేన దేశీయులు, యవనులు, త్రిగర్తులు కురుకు దేశీయులు, ఒక్క+వలనను= ఒకచోటను; ద్రోణ+ఆచార్యుండును= ద్రోణాచార్యుడూ; కుంతల, దశార్ణ, విదర్భులును= కుంతల దేశీయులూ, దశార్ణ దేశీయులూ; విదర్భ దేశీయులూ; గాంధార,సింధు,సౌవీరపతులు= గాంధార రాజు, సింధురాజు; సౌవీరరాజును; ఒక్కదిక్కునను= ఒకవైపున; భీష్ముండు= భీష్ముడు; మహాసైన్యంబుతోన్= గొప్పసేనతో; నడుమనున్+కాన్= మధ్యగా; మూఁడు+మోహరంబులు= మూడు వ్యూహాలు; అయ్యెన్= (కురుసేన) ఏర్పడింది; కృతవర్మయున్+శల్యుండును= కృతవర్మ మరియు శల్యుడు; అశ్మంత, కాశ్మీరులు= అశ్మంత దేశీయులు మరియు కాశ్మీర దేశీయులు; కొందఱు= కొందరు;తమ్ములున్+తానును= సహోదరులు, తానును,(దుర్యోధనుడు); వెనుక+దెసన్+నిలిచెన్= వెనుక భాగమందు నిలిచారు; ఆ+తెఱంగునన్= ఆ విధంగా; రెండు+బలంబులు= రెండుసేనలు (కురు, పాండవ సేనలు); ఆయితంబులు+ఐ= సంసిద్ధాలు అయి, శంఖ,భేరీ,మృదంగ+ఆది+తూర్య+స్వనంబులు= శంఖాలు, భేరులు, మద్దెలలు, మున్నగు శుభవాద్య స్వరాలు; చెలఁగన్= మ్రోయగా; ఒండు+ఒంటిన్= ఒక దానిని ఒకటి; కదియన్+నడచెన్= ఎదుర్కోవటానికి వెళ్ళాయి; అనినన్+విని= అని(సంజయుడు) చెప్పగా విని; ధృతరాష్ట్రుండు= ధృతరాష్ట్రుడు; ఈ+విధంబునన్= ఈ రీతిగా; కదిసి= ఎదుర్కొని; ఎవ్వరు+ఎట్లు= ఎవరెవరు ఏ విధంగా; కయ్యంబు+చేసిరి?= పోరాడారు?; అని+అడిగినన్= అని ప్రశ్నించగా; అతనికిన్= ఆ ధృతరాష్ట్రుడికి; సంజయుండు= సంజయుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: దుశ్శాసనుడు, వికర్ణుడు, విందుడు, అతని తమ్ముడు అనువిందుడు, శూరసేన, యవన, త్రిగర్త దేశపురాజులు వారి సైన్యము, ఒకవైపున నిల్చారు. ద్రోణాచార్యుడు, కుంతలరాజు, దశార్ణరాజు, విదర్భరాజు తమ తమ సేనలతో ఒకచోట నిలబడ్డారు. వీరు ఇరువురికి మధ్యగా గొప్ప సైన్యంతో భీష్ముడు నిలబడ్డాడు. ఈ విధంగా కౌరవసైన్యం మూడు వ్యూహాలుగా ఏర్పడింది. దుర్యోధనుడు తన తమ్ములతో వెనుక నిలిచాడు. అతనికి తోడుగ అశ్మంత కాశ్మీర రాజులు నిలిచారు. కురు పాండవ సేనలు రెండూ, యుద్ధానికి సన్నద్ధాలై, శంఖాలు, భేరులు, మద్దెలలు మున్నగు తూర్య రావాలు చేశాయి అని సంజయుడు చెప్పగా విని, ఇక, 'ఆ రెండు సేనలు ఏ విధంగా పోరాటం కొనసాగించాయో వివరంగా చెప్పుమని ధృతరాష్ట్రుడు కోరగా, సంజయుడు ఈ రీతిగా సమాధానం చెప్పాడు.

తే. 'ఏచి దుర్యోధనుండు చేపీచి యెలుఁగు । సూపి పురికొల్ప నెంతయు నేపు మిగిలి
మనబలంబులు పాండు కుమారసైన్య । సమితితోఁ దాఁకె నత్యంత సంకులముగ. 28

ప్రతిపదార్థం: ఏచి= విజృంభించి; దుర్యోధనుండు= దుర్యోధనుడు; చే,వీచి= చేయి ఊపి; ఎలుఁగు+చూపి= గొంతెత్తి; పురికొల్పన్= ప్రోత్సహించగా; ఎంతయున్= మిక్కుటంగా; ఏపు+మిగిలి= అతిశయించి; మన+బలంబులు= మన సేనలు(కౌరవసేనలు); పాండు కుమార+సైన్య+సమితితోన్= పాండవుల సేనా సమూహంతో; అత్యంత+సంకులముగన్= మిక్కుటమైన సందడితో; తాఁకెన్= ఎదుర్కొన్నాయి.

తాత్పర్యం: దుర్యోధనుడు ఉత్సాహంతో తన చేయి వీస్తూ గొంతెత్తి పురికొల్పగా, మనసేనలు గొప్ప సంరంభంతో పాండవ సైన్యాలను ఢీకొన్నాయి.

వ. అట్టి యెడ. 29

తాత్పర్యం: ఆ సమయంలో.

ఉ. తెక్కలు సించి, కంఠమున తేకులు వాపి, శిరంబు వ్రచ్చి పే
రుక్కునఁ గ్రొంచచంద మగు నొడ్డు గలంగఁగఁ జేసి భీష్ముఁ డే
దిక్కునఁ దానయై దిశలు దీటుకొనన్ శరకోటి నింపఁ గెం
పెక్కిన కంటిక్రేవ చెలువెక్కుడు సేయఁగ గ్రీడి కృష్ణతోన్. 30

ప్రతిపదార్థం: (ఆ క్రౌంచపక్షి ఆకారంలో ఉన్న వ్యూహానికి) తెక్కలు+చించి= రెక్కలు కత్తిరించి; కంఠమునన్= కుత్తుకలో; తేకులు+పాపి= ఈకలు పోగొట్టి; శిరంబు+వ్రచ్చి= తల బ్రద్దలు కొట్టి; క్రౌంచచందమగు= క్రౌంచపక్షి ఆకారంలో ఉన్న; ఒడ్డు= వ్యూహం; కలంగఁగన్+చేసి= కలతపొందించి; భీష్ముఁడు= భీష్ముడు; ఏ+దిక్కునన్= ఎటువైపు చూచినా; తాన+ఐ= తానే అయి; దిశలు+దీటుకొనన్= దెసలందు వ్యాపించగా; శర+కోటి= బాణాల సముదాయం; నింపన్= నిండునట్లు చేయగా; క్రీడి= అర్జునుడు; కెంపు+ఎక్కిన= ఎర్రబడిన; కంటి+క్రేవ= కన్నుల కొసలు; చెలువు= అందాన్ని; ఎక్కుడు+చేయఁగన్= అతిశయింప చేయగా; కృష్ణతోన్= శ్రీ కృష్ణుడితో.

తాత్పర్యం: భీష్ముడు పాండవసేనాని పన్నిన క్రౌంచపక్షి ఆకారంలోని ఆ వ్యూహపు రెక్కలు ఛేదించాడు. కంఠంలోని రేకులు ఊడగొట్టాడు. తలను బ్రద్దలు చేశాడు. వ్యూహాన్ని కలచివేశాడు. ఏ వైపు చూచినా తానే కన్పించాడు. దిక్కులు అన్నీ నిండేటట్లుగా బాణాల సమూహాలు ప్రయోగించాడు. భీష్ముడి విజృంభణ చూచి అర్జునుడు ఆగ్రహించాడు.అతడి

కన్నులు ఎఱ్రబడ్డాయి. అవి అతడి ముఖానికి అందంపెంచాయి. అప్పుడు అర్జునుడు శ్రీకృష్ణుడితో. (తరువాతి పద్యంతో అన్వయం.)

అర్జునుఁడు భీష్మునిమీఁదికి రథంబు దోలించి విజృంభించుట (సం-6-48-2)

మ. మన సేనం గలగంగఁ జేయుచు మదిన్ మందాకినీ నందనుం
డు ననుం గైకొనకున్నవాఁ; డితని యాటోపం బడంగించెదన్;
నిను మెప్పించెదఁ జూడు! ఖేచరులు వర్ణింపన్; విజృంభించెదన్
దనుజధ్వంసి! రథంబు వే పఱపు ముద్యద్విక్రమప్రక్రియన్.' 31

ప్రతిపదార్థం: దనుజధ్వంసి!= రాక్షసులను నాశనం చేసేవాడా! శ్రీకృష్ణా!; మందాకినీ+నందనుండు= గంగ కొడుకు భీష్ముడు; మన+సేనన్= మన సైన్యాన్ని; కలగంగన్+చేయుచున్= కలతపెట్టుతూ; మదిన్(తన) మనసులో; ననున్= నన్ను(అర్జునుడిని); కైకొనక+ఉన్నవాఁడు= లెక్కచేయటంలేదు; ఇతని= ఈ భీష్ముడి; ఆటోపంబు= విజృంభణ; అడంగించెదన్= అణచివేస్తాను; నినున్+మెప్పించెదన్= నిన్ను మెప్పిస్తాను; చూడు(ము)= వీక్షించుము; ఖేచరులు= ఆకాశచరులు; వర్ణింపన్= పొగడేటట్లుగా; విజృంభించెదన్= అతిశయిస్తాను; ఉద్యత్+విక్రమ, ప్రక్రియన్= ప్రకాశించే శౌర్యం ప్రతిఫలించేటట్లుగా; రథంబు= రథాన్ని; వే= వేగంగా; పఱపుము= తోలుము.

తాత్పర్యం: శ్రీకృష్ణా! చూడుము. గంగాపుత్రుడైన భీష్ముడు మన సేనను ఛేదించి విజృంభిస్తున్నాడు. నన్ను లెక్కచేయటంలేదు. ఈతడి విజృంభణ ఇంక నేను అరికట్టాలి. నేను గూడ విజృంభిస్తాను. నిన్ను మెప్పిస్తాను. చారణులు నా శౌర్యం పొగడేటట్లు పోరాడుతాను. రథాన్ని వేగంగా భీష్ముడిపైకి పోనిమ్ము.'

విశేషం: లోకోత్తరమైన పరాక్రమం ఎవరైనా ప్రదర్శిస్తే, ఆకాశంలో సంచరించే దేవతా చారణులు ప్రశంసాగీతాలు పాడుతూ ఆ వీరుని కీర్తి వ్యాపింప చేస్తారు అని కవి సమయం.

క. అనిన విని విష్ణుఁ డా జి । ష్ణునిఁ గనుఁగొని 'యేను నీ మనోరథము తెఱం
గునకుఁ దగ రథముఁ గడపెద । విను! తిరమై నాదు పలుకు వీరవినోదీ! 32

ప్రతిపదార్థం: అనినన్+విని= అని అర్జునుడు చెప్పగా ఆలకించి; విష్ణుఁడు= శ్రీకృష్ణుడు; ఆ+జిష్ణునిన్= జయశీలుడైన ఆ అర్జునుడిని; కనుఁగొని= చూచి; ఏను= నేను; నీ+మనోరథము= నీ కోరిక; తెఱంగునకున్= తీరునకు; తగన్= అనువుగా; రథము= తేరు; కడపెదన్= నడుపుతాను; వీర+వినోదీ!= పరాక్రమమునందు విహరించటం ఇష్టమైనవాడా!= ఓ అర్జునా!; తిరము+ఐ= స్థిరంగా (జాగ్రత్తగా); నాదు+పలుకు= నామాట; వినుము!= ఆలకించుము.

తాత్పర్యం: అనగా విని శ్రీకృష్ణుడు అర్జునుడిని చూచి ఇట్లా అన్నాడు: 'ఓ వీరవినోదీ, నీ కోరిక మేరకు నేను తేరు నడుపుతాను. ముందుగా నేను చెప్పే మాటలు జాగ్రత్తగా వినుము.

చ. ' గజిబిజి లేక, యుబ్బక, యఖండిత శౌర్యము నస్త్రవిద్యయున్
భుజబలముం బొగడ్త వడ, భూరిపరాక్రమశాలి భీష్ము న
క్కజముగఁ దాఁకి యద్దెస నకంపితులై నడతెంచు శల్య కుం
భజ కురురాజు లచ్చెరువుపాటు భయంబును బొందఁ జేయుమీ!' 33

ప్రతిపదార్థం: గజిబిజి+లేక= కలవరం లేకుండా; ఉబ్బక= పొంగిపోకుండగా; అఖండిత,శౌర్యము= మొక్కవోని పరాక్రమం; అస్త్ర+విద్యయున్= మంత్ర బాణాలు ప్రయోగించటంలో గల నేర్పు; భుజబలమున్= పరాక్రమం; పొగడ్త+పడన్= పేరు కెక్కేటట్లుగా; భూరి+పరాక్రమశాలి= గొప్ప శౌర్యం గలవాడు; భీష్మున్= భీష్ముడిని; అక్కజముగన్= ఆశ్చర్యం కలిగేటట్లుగా; తాఁకి= ఎదిరించి; ఆ+దెసన్= ఆతడి వైపు(అతడికి తోడ్పడేందుకు); నడతెంచు= వచ్చునటువంటి; శల్య,కుంభజ,కురురాజులు= శల్యుడు, ద్రోణుడు, దుర్యోధనుడు; అచ్చెరువుపాటు= ఆశ్చర్యం; భయంబును= వెఱపును; పొందన్+చేయుము+ఈ= పొందేటట్లు చేయుము.

తాత్పర్యం: 'నీవు తొట్రుపాటు చెందకుండా, ఉప్పొంగిపోకుండా, మొక్కవోని పరాక్రమాన్నీ, అస్త్రవిద్యనూ, భుజబలాన్నీ ప్రశంసనీయంగా ప్రదర్శించి, మహాపరాక్రమశాలి అయిన భీష్ముడిపై అద్భుతంగా దాడి చేయాలి. అతడికి బాసటగా నిలిచి నిర్భయంగా వచ్చే శల్యుడికీ, ద్రోణుడికీ, దుర్యోధనుడికీ, ఆశ్చర్యం, భయం కలిగేటట్లు చేయాలి.'

విశేషాలు: 1. ఈ పద్యంలో శ్రీకృష్ణుడు చేసిన హెచ్చరిక గమనించదగింది. శ్రీకృష్ణుడు కేవలం సారథిమాత్రుడే కాడు.2. కుంభజుడు= కుంభమునందు పుట్టినవాడు= ద్రోణుడు. ఇరువదియవ శతాబ్ది చివరిభాగమున శోధన నాళికలలో గర్భోత్పత్తి కోసం వినూత్న ప్రయోగాలు జరుగుతున్నవి గదా! 'కుంభజ' ప్రయోగం మరికొంతకాలం గడచాక సుబోధం కావచ్చు.

వ. అని పలికి యచ్యుతుం డుచితరయంబున రథంబు నడప ధనంజయుండు తన కడ్డం బైన శూరసేన సేనా కాననంబు పటుబాణ పరంపర యను మహావాతవేగంబున బడలుపడం జేయుచుఁ గవిసినం గని గాంగేయుం డెదిర్చి పేర్చి డెబ్బదేడు క్రూర నారాచంబు లేసిన నప్పుడు గూడుకొని ద్రోణుం డిరువదేనింటను శారద్వతుం డేనూటను వికర్ణుండు మూఁటను శల్యుండు తొమ్మిదింటను దుర్యోధనుం డఱువది నాల్గింటను రభసోల్లాసంబున నేసిన. 34

ప్రతిపదార్థం: అని పలికి= అని చెప్పి; అచ్యుతుండు= శ్రీకృష్ణుడు; ఉచిత+రయంబునన్= తగిన వేగంతో; రథంబు= తేరు; నడపన్= నడపగా; ధనంజయుండు= అర్జునుడు; తనకున్+అడ్డంబు+ఐన= తనకు ఎదురైన; శూరసేన, సేనా, కాననంబు= శూరసేన దేశానికి సంబంధించిన సైన్యం అనే అరణ్యాన్ని; పటు, బాణ, పరంపర+అను= మిక్కుటమైన అమ్ముల సముదాయం అనే; మహా, వాత, వేగంబునన్= గొప్ప గాలియొక్క త్వరవలన; బడలుపడన్+చేయుచున్= నేలమట్టంగా పడేటట్లు చేస్తూ; కవిసినన్= ఎదుర్కొనగా; కని= చూచి; గాంగేయుండు= భీష్ముడు; ఎదిర్చి= ఎదుర్కొని; పేర్చి= విజృంభించి; డెబ్బది+ఏడు= డెబ్భైయేడు; క్రూర, నారాచంబులు= కఠినమైన బాణాలు; ఏసినన్= ప్రయోగించగా; అప్పుడు= ఆ సమయంలో; కూడుకొని= కలిసి; ద్రోణుండు; ద్రోణుడు; ఇరువదేనింటను= ఇరువది ఐదు(బాణాల)చేతను; శారద్వతుండు= కృపాచార్యుడు; ఏనూటను= ఐదువందల బాణాలతోనూ; వికర్ణుండు= వికర్ణుడు; మూఁటను= మూడు(బాణాలతో); శల్యుండు= శల్యుడు; తొమ్మిదింటను= తొమ్మిది బాణాలతోనూ; దుర్యోధనుండు= దుర్యోధనుడు; అఱువది+నాల్గింటను= అరవై నాలుగు బాణాలతోనూ; రభస+ఉల్లాసంబునన్= సంరంభంతో కూడిన ఉత్సాహంతో; ఏసినన్= ప్రయోగించగా.

తాత్పర్యం: ఆ విధంగా శ్రీకృష్ణుడు హితోపదేశం చేసి, రథం తగిన వేగంతో నడపాడు. అర్జునుడు తనకు అడ్డంగా వచ్చిన శూరసేన దేశానికి సంబంధించిన సేనలను అవలీలగా జయించాడు. అంత భీష్ముడు అర్జునుడిని ఎదిర్చి విజృంభించి డెబ్భై ఏడు కఠినబాణాలు ప్రయోగించాడు. భీష్ముడికి సాయంగా వచ్చి, ద్రోణుడు అర్జునుడిపై ఇరువది బాణాలు, కృపాచార్యుడు అయిదునూర్ల బాణాలు, వికర్ణుడు మూడింటిని, శల్యుడు తొమ్మిదింటిని, దుర్యోధనుడు అరవై నాల్గింటిని ఉద్వేగపూరితంగా ప్రయోగించారు.

క. అవి యెల్లను బైఁ గురియఁగ । నవికలమూర్తి యగు ననిమిషాధిపతనయుం
డవిరళ వర్షము మీఁదం । గవియంగా నొప్పు నగము కరణిం బొలిచెన్. 35

ప్రతిపదార్థం: అవి+ఎల్లను= ఆ బాణాలు అన్నీ; పైన్= తనపైన; కురియఁగన్= వర్షించగా; అవికలమూర్తి+అగు= చలించని దేహం కలిగినట్టి; అనిమిష+అధిప, తనయుండు= దేవేంద్రుడి కొడుకు- అర్జునుడు; అవిరళ+వర్షము= ఎడతెగని వాన; మీఁదన్+కవియంగాన్+ఒప్పు= మీద కురిసేటప్పుడు శోభిల్లే; నగము, కరణిన్= కొండవలె; పొలిచెన్= ప్రకాశించాడు.

తాత్పర్యం: భీష్ముడూ, అతడికి తోడుగా వచ్చిన కౌరవ వీరులు అందరూ ప్రయోగించిన బాణాలు అన్నీ తనమీద పడినప్పుడు, ఎడతెగని వాన కురిసేటప్పుడు శోభిల్లే కొండవలె అర్జునుడు శోభిల్లాడు.

వ. ఇట్లు సుస్థిరుండై. 36

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; సుస్థిరుండు+ఐ= చలింపని వాడుగా నిలిచి.

తాత్పర్యం: ఈ విధంగా చలించనివాడై.

సీ. ఇరువదేనమ్ముల సురనదీనందను, । ద్రోణుని నఱువది బాణములను,
తొమ్మిది సునిశితాస్త్రమ్ములఁ గృపుని, । వికర్ణశల్యుల విశిఖత్రయముల,
రారాజు నైదు నారసముల నొప్పించె । నప్పుడు గడఁగి సాత్యకియు మత్స్య
జనపాలకుండు ధృష్టద్యుమ్నుఁడును ద్రౌప । దీ సూనులును సుభద్రాసుతుండు

తే భీష్మునకుఁ దోడుపడువారి బెట్టుదాఁక । నతఁడు ఫల్గును నేఁబది శితశరముల
నేసి పేర్చినఁ గౌరవు లెల్ల నార్వ । నుఱక యాతఁడు కురుసేనఁ దఱియఁ జొచ్చె. 37

ప్రతిపదార్థం: ఇరువది+ఏను+అమ్ములన్= ఇరువది అయిదు బాణాలతో; సురనదీ, నందనున్= గంగకొడుకు అయిన భీష్ముడిని; అరువది+బాణములన్= అరువది అమ్ములతో; ద్రోణునిన్= ద్రోణుడిని; కృపునిన్= కృపాచార్యుడిని; తొమ్మిది, సునిశిత+అస్త్రమ్ములన్= తొమ్మిది వాడి అమ్ములతోనూ; విశిఖ, త్రయములన్= మూడేసి బాణాలతో; కర్ణ, శల్యులన్= కర్ణుడిని, శల్యుడిని; రారాజున్= రాజులకు రాజైన దుర్యోధనుడిని; ఐదు, నారసములన్= అయిదు బాణాలతో; నొప్పించెన్= బాధించాడు; అప్పుడు= ఆ సమయంలో; కడఁగి= పూని; సాత్యకియున్= సాత్యకి; మత్స్య జనపాలకుండు= మత్స్య దేశానికి రాజైన విరాటుడు; ధృష్టద్యుమ్నుఁడును= ధృష్టద్యుమ్నుడూ; ద్రౌపదీ, సూనులును= ద్రౌపది కొడుకులును; సుభద్రా, సూనుండు= సుభద్ర కొడుకు అభిమన్యుడును; భీష్మునకున్+తోడు పడువారిన్= భీష్ముడికి సాయం చేసేవారిని; బెట్టు, తాఁకన్= తీవ్రంగా ఎదుర్కొనగా; అతఁడు= ఆ భీష్ముడు; ఫల్గునున్= అర్జునుడిని; ఏఁబది,శిత,శరములన్+ఏసి= ఏభై వాడి బాణాలు ప్రయోగించి; పేర్చినన్= అతిశయించగా; కౌరవులు+ఎల్లన్= కురుసేనలోనివారు అందరూ; ఆర్వన్= పెద్ద ధ్వని చేయగా; ఉఱుక= లెక్క చేయకుండగా ; ఆతఁడు= అర్జునుడు; కురుసేనన్= కౌరవ సైన్యాన్ని; తఱియన్+చొచ్చెన్= సమీపించాడు.

తాత్పర్యం: అప్పుడు పలువురు కౌరవవీరులు తన మీదకు వచ్చిపడి యుద్ధం చేసినా అర్జునుడు చలించలేదు. అర్జునుడు భీష్ముడిపై ఇరువది అయిదు బాణాలు ప్రయోగించాడు. ద్రోణుడిపై అరవైబాణాలు వేశాడు. కృపుడిపై, వికర్ణుడిపై, శల్యుడిపై మూడేసి అమ్ములు విసరాడు. రాజరాజు అయిన దుర్యోధనుడిని ఐదు బాణాలతో కొట్టాడు. ఆ సమయంలో అసహాయ శూరుడుగా భీష్ముడితో అతడికి తోడుగా వచ్చిన వీరులతోనూ అర్జునుడు పోరాడుతుండగా చూచి, పాండవ పక్షంలోని వీరులు సాత్యకి, విరాటుడు, ధృష్టద్యుమ్నుడు, ద్రౌపదీ పుత్రులు,

అభిమన్యుడు అర్జునుడికి బాసటగా వచ్చి, భీష్ముడికి సాయం చేసేవారిని తాకారు. అప్పుడు భీష్ముడు అర్జునుడిని ఏభై బాణాలతో కొట్టగా, కౌరవులందరు సింహనాదాలు చేసి సంతోషం వ్యక్తం చేశారు. అర్జునుడు వారిని అందరినీ లెక్కచేయకుండా కౌరవసేనలోకి చొచ్చుకొని పోయాడు.

వ. ఇట్లు క్రీడించి గాంగేయు డించి గాండీవి దనయరదంబు రయంబున. 38

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; క్రీడించి= లెక్క చేయకుండా ఉపేక్షించి; గాంగేయున్= భీష్ముడిని; డించి= విడిచిపెట్టి; గాండీవి= అర్జునుడు(గాండీవం అనే విల్లు తాల్చినట్టివాడు); తన+అరదంబున్= తన రథాన్ని; రయంబునన్= వేగంగా.

తాత్పర్యం: ఈ విధంగా అర్జునుడు భీష్ముడిని లెక్కచేయక, ఆతడిని విడిచిపెట్టి తన రథాన్ని వేగంగా.

క. పఱపి రథికులను సూతుల । నఱకిన మ్రోడుపడియుండె నానారథముల్
వెఱచఱచిరి కురువీరులు । పఱిపఱి యై మనబలంబు భయముం బొందెన్. 39

ప్రతిపదార్థం: పఱపి= నడపి; రథికులను= రథంపై యుద్ధం చేసే వీరులను; సూతులన్= సారథులను; నఱకినన్= చంపగా; నానారథముల్= పెక్కు తేరులు; మ్రోడుపడి+ఉండెన్= మోడుపడిన చెట్లవలె కనుపించాయి; కురువీరులు= కురుసేనలోని వీరులు; పఱిపఱి+ఐ= చెల్లా చెదరై; వెఱ చఱచిరి= భీతిచెందారు; మన+బలంబు= మన సైన్యం; భయమున్+పొందెన్= భయపడింది.

తాత్పర్యం: ఈ విధంగా అర్జునుడు భీష్ముడిని సరకుగొనక, ఆతడిని విడిచిపెట్టి తన రథాన్ని వేగంగా తోలించి కౌరవసేనమీద విజృంభించాడు. రథికులను సంహరించాడు, సారథులను చంపివేశాడు, రథాలు మ్రోడులవలె కన్పించాయి. కౌరవ వీరులు చెల్లాచెదరైనారు. మనసైన్యం భయపడింది.

వ. అట్టియెడ నీ కొడుకు నీ తండ్రితో నిట్లనియె. 40

ప్రతిపదార్థం: అట్టి+ఎడన్= ఆ సమయంలో; నీ కొడుకు= దుర్యోధనుడు; నీ తండ్రితోన్= భీష్ముడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఆ సమయంలో నీ కొడుకైన దుర్యోధనుడు నీ తండ్రిఅయిన భీష్ముడితో ఈ విధంగా అన్నాడు:

చ. తన భుజసార మేర్పడఁగ దర్పితుఁడై మనయందుఁ జేయఁగ
ల్గిన నృపకోటి నెల్ల నవలీలమెయిన్ మును మించి త్రుంచె న
ర్జునుఁ డదె నీవు సూడ ననురూపమె నీ కిది? మున్ను కర్ణు భం
డనము దొలంగఁ జేసి తకటా! యిటు లొప్పరికింపఁ బాడియే?' 41

ప్రతిపదార్థం: అర్జునుఁడు= అర్జునుడు; అదె= అదిగో; నీవు+చూడన్= నీవు చూస్తూ ఉండగనే తన, భుజ, సారము+ఏర్పడఁగన్= తన పరాక్రమం సుస్పష్టంగా వెల్లడి కాగా; దర్పితుఁడు+ఐ= గర్వం కలవాడై; మన+అందున్= మన సేనలో; చేయన్+కల్గిన= పోరాటం చేయగల్గిన; నృప+కోటిన్+ఎల్లన్= రాజుల సమూహాన్ని అంతటినీ; అవలీల+మెయిన్= సులువుగా; మును, మించి, త్రుంచెన్= ముందు అతిశయించి సంహరించాడు; నీకున్+ఇది= నీ కనుల యెదుట ఈ విధంగా జరగటం; అనురూపము+ఎ?= తగినదేనా?; మున్ను= లోగడ; కర్ణున్= కర్ణుడిని; భండనము= యుద్ధం; తొలంగన్+చేసితి(వి)= విడిచి పోయేటట్లుగా చేశావు; అకటా!= అయ్యో!; ఇటులు= ఈ విధంగా; ఒప్పరికింపన్= ఉపేక్షించటం; పాడియే?= న్యాయమా?

తాత్పర్యం: అదిగో! అర్జునుడు నీవు చూస్తుండగా తన పరాక్రమం స్పష్టంగా వెల్లడికాగా గర్వంతో మనవైపు పోరాడగల్గిన రాజులందరినీ అవలీలగా మునుముపట్టి చంపినాడు. నీ కిదిసమ్మతమా! కర్ణుడిని యుద్ధంచేయకుండాచేసి అకటా ఈ విధంగా ఉపేక్షించడం నీకు న్యాయమా?

వ. అనిన విని యనిమిషనదీ నందనుం 'డితం డింత యొప్పని పల్కువల్కునే?' యని మనంబునం గుత్సించుచు బీభత్సు దెసకు నడరుటయు, దుర్యోధన వికర్ణులు వలపటను గురుపుత్రుండు దాపటను గూడుకొని యా క్రీడిపైఁ బటు శరపరంపరలు పరఁగించి; రతనికి నన్నలుఁ దమ్ములు బాసట యయి కడంగి కవిసి రిట్లు దొరలు దలపడిన నిరువాఁగును జిందమ్ములు గర్జిల్ల సందడికయ్యంబుగాఁ బెనంగిన గాండీవి గాంగేయు లొండొరుల చండబాణంబులఁ ద్రుంచుచు వర్మంబులు సించుచు నొకళ్ళొకళ్ళ వెలిమావులం బడగలం దాఁక నేయుచుం జేరి పోరు సమయంబున. 42

ప్రతిపదార్థం: అనినన్+విని= (అని దుర్యోధనుడు చెప్పగా ఆలకించి); అనిమిష+నదీ+నందనుండు= గంగకొడుకు-భీష్ముడు; ఇతండు= (దుర్యోధనుడు); ఇంత+ఒప్పని,పల్కు= ఇంతగా సరిగాని మాట; పల్కును+ఏ?= అంటాడా?; అని= అని; మనంబునన్= మనస్సులో; కుత్సించుచున్= చెడ్డ బాధ పొందుతూ; బీభత్సు,దెసకున్= అర్జునుడు ఉన్న వైపునకు; అడరుటయున్= విజృంభించగా; దుర్యోధన+వికర్ణులు= దుర్యోధనుడు, వికర్ణుడు; వలపటను= కుడివైపున; గురుపుత్రుండు= గురువైన ద్రోణాచార్యుడి కొడుకు అశ్వత్థామ; దాపటను= ఎడమవైపున; కూడుకొని= కలిసి; ఆ క్రీడిపైన్= ఆ అర్జునుడిపై; పలు,శర,పరంపరలు= మిక్కుటమైన అమ్ముల సముదాయాలు; పరఁగించిరి= ప్రయోగించారు; అతనికిన్= ఆ అర్జునుడికి; అన్నలున్+తమ్ములున్= సహోదరులు; బాసట+అయి= తోడు అయి; కడంగి= పూని; కవిసిరి= (శత్రువులపై)విజృంభించారు; ఇట్లు= ఈ రీతిగా; దొరలు, తలపడినన్= ప్రభువులు డీకొనగా; ఇరువాగును= ఇరువైపుల; చిందమ్ములు= శంఖాలు; గర్జిల్లన్= పెద్ద ధ్వని చేయగా; సందడి+కయ్యంబుగాన్= సంకుల సమరంగా; పెనంగినన్= పోరాడగా; గాండీవి, గాంగేయులు= అర్జునుడు, భీష్ముడు; ఒండు+ఒరులన్= పరస్పరం (ఒకరిపై ఇంకొకరు వేసే; చండ+బాణంబులన్= తీవ్రమైన అమ్ములను; త్రుంచుచున్= నడుమ నరకుచు; వర్మంబులు= కవచాలు; చించుచున్; ఒకళ్ళొకళ్ళ= ఒక్కొకళ్ళ, వెలిమావులన్ పడగలన్= తెల్ల గుర్రాలను, జెండాలను; తాఁకన్+ఏయుచున్= తాకేటట్లుగా (బాణాలు) వేస్తూ; చేరి= సమీపించి; పోరు సమయంబునన్= యుద్ధం చేసేటప్పుడు.

తాత్పర్యం: ఆ విధంగా దుర్యోధనుడు అధిక్షేపించగా, 'ఇతడు ఇటువంటి అనుచితమైన మాటలంటాడా?' అని భీష్ముడు తన మనస్సులో నొచ్చుకొన్నాడు. వెంటనే భీష్ముడు అర్జునుడు ఉన్న చోటికి తన రథాన్ని తరలించాడు. దుర్యోధనుడు, వికర్ణుడు భీష్ముడికి కుడివైపున చేరారు. అశ్వత్థామ ఎడమవైపున చేరాడు. వారు అందరూ అర్జునుడిపై అమ్ములు ప్రయోగించారు. అర్జునుడికి తోడుగా అతడి అన్నదమ్ములు చేరారు. ఈ విధంగా ఇరుపక్షాలలోని వీరులు శంఖాలు పూరించి ఉత్సాహంతో యుద్ధం చేశారు. అది దొమ్మియుద్ధంగా పరిణమించింది. భీష్ముడూ, అర్జునుడూ ఒండొరులపై వాడి అమ్ములు ప్రయోగించుకొన్నారు. ఒకరు ఇంకొకరి గుర్రాలను జెండాలను బాణాలతో కొట్టారు. ఆ సమయంలో.

విశేషం: మహాభారత యుద్ధంలో "సందడి కయ్యము" అనగా ఇరు పక్షాలలోని వీరులు ఒకరిపై ఒకరు వివక్షలు లేకుండా బాణాలు ప్రయోగించి యుద్ధం చేయటం. ద్వంద్వ యుద్ధం అనగా ఒక వీరుడు మరొక వీరుడితో పోరాడటం. ఆ పోరాటంలో ప్రక్క యోధులు జోక్యం కల్పించుకోరు. ఇది అలనాటి కట్టుబాటు.

తే. ఆపగానందనుండు మురారి యురము । బాణవితతిని భేదింప శోణితమునఁ
దోఁగి యతఁ డొప్పెఁ దలిరాకు దుఱఁగలింప । మెఱయు నవపారిజాతంబు తెఱఁగు దాల్చి. 43

ప్రతిపదార్థం: ఆపగా, నందనుండు= నదీపుత్రుడు(భీష్ముడు); మురారి+ఉరమున్= శ్రీకృష్ణుని వక్షఃస్థలాన్ని; బాణ వితతిని= అమ్ముల సముదాయంతో; భేదింపన్= గాయం చేయగా; అతఁడు= ఆ శ్రీకృష్ణుడు; శోణితమునన్+దోఁగి= నెత్తుటిలో తడిసి; తలిరాకు= చిగురాకు; తుఱఁగలింపన్= పొటమరించగా; మెఱయు= ప్రకాశించే; నవ, పారిజాతంబు, తెఱఁగు+తాల్చి= నూత్నమైన పారిజాత వృక్షంతీరు ధరించి; ఒప్పెన్= శోభిల్లాడు.

తాత్పర్యం: భీష్ముడు అనేక బాణాలు ప్రయోగించి అర్జునుడి రథసారథి అయిన శ్రీకృష్ణుడి వక్షఃస్థలం ఛేదించాడు. అప్పుడు శ్రీకృష్ణుడు రక్తంతో తడిసి, ఎఱ్ఱని చిగురుటాకులతో శోభిల్లే నవ పారిజాత వృక్షంవలె వెలుగొందాడు.

విశేషాలు: 1. మురారి= ముర+అరి= మురుడు అనే రాక్షసుడికి శత్రువు- విష్ణువు, విష్ణువు అవతారం శ్రీకృష్ణుడు. 2. సారథిని సంరక్షించుకోవలసిన బాధ్యత రథికుడిదే. భీష్ముడు శ్రీకృష్ణుడిని వక్షఃస్థలం ఛేదించటం అంటే - అది అతడు సాధించిన ఘనకార్యంగానే చెప్పవచ్చును. శ్రీకృష్ణుడు, సారథి. నిరాయుధుడు. రాయబారిగా సంధికై యత్నించి, తాను ఆయుధం ధరించనని ప్రతిజ్ఞ చేసినవాడు. రెండవనాటి యుద్ధంలో శ్రీకృష్ణుడు గాయపడ్డాడు. మూడవనాడు శ్రీకృష్ణుడు, ప్రతిజ్ఞాభంగం చేసికొని, చక్రధారియై భీష్ముడిపైకి ఉరికాడు. శ్రీకృష్ణుడి ప్రతిజ్ఞా భంగానికి ఇది పునాదియై పూర్వరంగం సృష్టించింది.

క. కనుఁగొని కోపంబున న । ర్జునుఁ డమరనదీ తనూజు సూతుని నొప్పిం
చిన నాతఁ డతని య । రదము మునుగంగాఁ జేసె బాణముల వెల్లువలన్. 44

ప్రతిపదార్థం: కనుఁగొని= చూచి= (శ్రీకృష్ణుడు గాయపడటం చూచి); కోపంబునన్= ఆగ్రహంతో; అర్జునుఁడు= అర్జునుడు; అమర నదీ, తనూజు, సూతునిన్= గంగానది కొడుకు భీష్ముడి రథసారథిని; నొప్పించినన్= బాణాలతో కొట్టగా; ఆతఁడు= ఆ భీష్ముడు; అతని+అరదము= అర్జునుడి తేరును; బాణముల+వెల్లువలన్= అమ్ముల వరదలతో; మునుఁగంగన్+చేసెన్= మునిగిపోయేటట్లు చేశాడు.

తాత్పర్యం: భీష్ముడు ఆ విధంగా తన రథసారథియైన శ్రీకృష్ణుడిని గాయపరచటం చూచి అర్జునుడు ఆగ్రహంతో భీష్ముడి సారథిని నొప్పించాడు. భీష్ముడు గూడ అర్జునుడి రథం కనిపించకుండా అమ్ముల వరదలలో-మునిగిపోయేటట్లు చేశాడు.

క. ఆ వెల్లువ శరజిహ్వలఁ । ద్రావి ధనంజయ మహాగ్ని దరికొని కవియం
గా వెగ డొందెడు కురుబల । దావము శాంతనవుఁ డంబుదము క్రియఁ గాచెన్. 45

ప్రతిపదార్థం: ధనుంజయ-మహా+అగ్ని= అర్జునుడనే గొప్ప అగ్ని; ఆ-వెల్లువన్= ఆ(బాణ) ప్రవాహాన్ని; శర-జిహ్వలన్= బాణాలనెడి నాలుకలతో; త్రావి= త్రాగి; దరికొని= సమీపించి; కవియంగాన్= చుట్టుముట్టగా; వెగడు+ఒందెడు= భయపడునట్టి; కురుబల దావమున్= కౌరవసేన అనెడి కార్చిచ్చును; శాంతనవుఁడు= భీష్ముడు; అంబుదము క్రియన్= మేఘంవలె; కాచెన్= రక్షించాడు.

తాత్పర్యం: భీష్ముడు ప్రయోగించిన బాణాల వరదను అర్జునుడు అనే మహాగ్ని బాణాలనే జిహ్వలతో త్రాగి వెలుగొందింది. ఆ అగ్ని కురుసేనలను కార్చిచ్చువలె బాధించింది. అయితే భీష్ముడు మేఘం వలె బాణవర్షం కురిపించి ఆ కార్చిచ్చు నుండి కౌరవసేనలను రక్షించాడు.

విశేషం: అలం: రూపకం. ఈ పర్వంలో రూపకాలంకారాన్ని, ఉపమాలంకారాన్ని ప్రయోగించి తిక్కన - భీష్మార్జునుల యుద్ధ కౌశలాన్ని అభివర్ణించాడు. అర్జునుడు-మహాగ్ని వంటివాడయితే, భీష్ముడు - మేఘంవలె ఆ అగ్నిని ఆర్పగలిగాడు.

వ. ఇత్తెఱంగున నెక్కువ దక్కువలు లేక యక్కజంబుగాఁ బోరువారిం జారణ సిద్ధ గంధర్వాదులు గనుంగొనుచుండి తమలో నిట్లనిరి: 46

ప్రతిపదార్థం: ఈ+తెఱంగునన్= ఈ రీతిగా; ఎక్కువ+తక్కువలు+లేక= సరిసమానంగా; అక్కజంబుగాన్= ఆశ్చర్యకరంగా; పోరు వారిన్= యుద్ధం చేసేవారిని(భీష్ముడిని-అర్జునుడిని); చారణ, సిద్ధ, గంధర్వ+ఆదులు= చారణులు, సిద్ధులు, గంధర్వులు మున్నగువారు; కనుంగొనుచుండి= చూస్తూ; తమలోన్= వారిలో వారు; ఇట్లు+అనిరి= ఈ విధంగా అనుకొన్నారు.

తాత్పర్యం: ఈ రీతిగా, ఒకరికి ఒకరు తీసిపోకుండా, గొప్ప సమయుద్ధం చేసే భీష్ముడిని, అర్జునుడిని వేల్పు తెగలకు చెందిన వారు చూచి తమలో తాము ఈ విధంగా అనుకొన్నారు.

విశేషం: లోకోత్తరమైన ప్రతాప ప్రాభవాలు ప్రదర్శించినవారి కీర్తిని పొగడుతూ వేల్పు తెగలకు చెందిన చారణులు సిద్ధులు గంధర్వులు గానం చేస్తారని పురాణకథనం. కవి సమయం.

ఉ. ఒండొరు చండవిక్రమము లోర్తురు వీరల కాక వీరితో
నొండొకరుండు మార్కొనఁగ నోపునె? పూని కృతాంతుఁడైన నా
ఖండలుఁ డైన నివ్విధపుఁ గయ్యము లెక్కడ నైనఁ గంటిమే!
పాండవ కౌరవోత్తముల బాహు విలాసము లిట్టులుండునే!' 47

ప్రతిపదార్థం: ఒండు+ఒరు= ఒకరొకరు; చండ,విక్రమములు+ఓర్తురు= తీవ్రమైన పరాక్రమాలను సహించగలరు; వీరల+కాక= వీరులు ఇర్వురు కాకుండా; వీరితోన్= (ఈ భీష్ముడితో, అర్జునుడితో); ఒండు+ఒకరుండు= మరి ఇంకొకడు; మార్కొనఁగన్+ఓపునె?= యుద్ధం చేయటానికి సమర్థుడు ఉన్నాడా?; పూని= కడగి; కృతాంతుఁడు+ఐనన్= యముడే కావచ్చు; ఆఖండలుడు+ఐనన్= దేవేంద్రుడే కావచ్చు; ఇవ్విధపు+కయ్యములు= ఈ రీతిని జరిగే యుద్ధాలు; ఎక్కడన్+ఐనన్= ఏ స్థలంలో అయినా; కంటిమే?= చూశామా?; పాండవ, కౌరవ+ఉత్తముల,బాహు, విలాసములు= పాండవులలో శ్రేష్ఠుడైన అర్జునుడి యొక్కయు, కౌరవులలో శ్రేష్ఠుడైన భీష్ముడి యొక్కయు పరాక్రమ ప్రాభవాలు; ఇట్టులు= ఈ రీతిగా; ఉండున్+ఏ?= ఉంటాయా?

తాత్పర్యం: 'ఈ భీష్ముడు, అర్జునుడు ఒకరికి ఒకరు దీటైనవారు. ఇతరులు వీరితో సమానులు లేనే లేరు. భీష్ముడితో పోరాడగలవాడు అర్జునుడు ఒక్కడే. అట్లే అర్జునుడితో యుద్ధం చేయగల సమర్థుడు మరి భీష్ముడు ఒక్కడే. వీరితో యముడుగాని దేవేంద్రుడుగాని యుద్ధం చేయలేడు. పాండవోత్తముడైన అర్జునుడి పరాక్రమం, కౌరవ ప్రముఖుడైన భీష్ముడి పరాక్రమం ఇంత గొప్పగా ఉంటాయని అనుకొన్నామా?'

ధృష్టద్యుమ్న ద్రోణాచార్యుల యుద్ధము (సం. 6-49-1)

వ. అని యగ్గించి రంత మార్తాండుండు గగనమధ్యవర్తియయ్యె; నప్పుడు ధృష్టద్యుమ్నుండు ద్రోణాచార్యు పయిం గవిసిన నతండు. 48

ప్రతిపదార్థం: అని+అగ్గించిరి= అని పొగడారు; అంతన్= పిదప; మార్తాండుండు= సూర్యుడు; గగన,మధ్యవర్తి+అయ్యెన్= ఆకాశంలో మధ్యకు చేరాడు; అప్పుడు= ఆ మధ్యాహ్న కాలంలో; ధృష్టద్యుమ్నుండు= ధృష్టద్యుమ్నుడు; ద్రోణాచార్యు, పయిన్= గురువైన - ద్రోణుడిపై; కవిసినన్= తాకగా; అతండు= ద్రోణుడు.

తాత్పర్యం: ఆ విధంగా చారణులు, సిద్ధులు, గంధర్వులు భీష్ముడిని, అర్జునుడిని ప్రశంసించారు. అంతలో - మధ్యాహ్నం అయింది. ఆకాశమధ్యంలో సూర్యుడు ప్రకాశించాడు. అప్పుడు ధృష్టద్యుమ్నుడు ద్రోణాచార్యుడిని మార్కొన్నాడు.

తే. సూతు నొక్క వాలమ్మున స్రుక్క నేసి । యశ్వముల నాలుగింట నుబ్బడఁగఁ జేసి,
సిడము నడిమికి వెసఁ ద్రుంచె వెడఁదవాతి । దొడ్డ తూపునఁ గురుసేన దొంగలింప. 49

ప్రతిపదార్థం: సూతున్= సారథిని(ధృష్టద్యుమ్నుడి సారథిని); వాలు+అమ్మునన్= వాడి బాణంతో; స్రుక్కన్+ఏసి= నొవ్వచేసి; అశ్వములన్= గుర్రాలను; నాలుగింటన్= నాలుగు బాణాలతో; ఉబ్బు+అడఁగన్+చేసి= అతిశయం అణగగొట్టి; వెసన్= వేగంగా; సిడమున్= జెండా; నడిమికిన్= మధ్యకు; వెడద, వాతి, దొడ్డ+తూపునన్= నిడివి నోరుగల గొప్ప బాణంతో; కురుసేన= కౌరవ సైన్యం; తొంగలింపన్= అతిశయించగా; త్రుంచెన్= విరుగగొట్టాడు.

తాత్పర్యం: ద్రోణుడు విజృంభించి, ధృష్టద్యుమ్నుడి సారథిని ఒక్క బాణంతో నొవ్వచేశాడు. నాలుగు బాణాలతో గుర్రాలను పడగొట్టాడు. ఒక పెద్ద బాణంతో జెండాను మధ్యకు రెండు ముక్కలు చేశాడు. కౌరవసేన ఉత్సాహంతో ఉరకలు వేసింది.

క. ఆ ధృష్టద్యుమ్నుఁడు స । క్రోధుండై బాణవితతి గురిసిన దృఢ సం
వేధం బగు నారస మ । య్యోధాగ్రణి యేసి నఱకె నఱుక యతండున్. 50

ప్రతిపదార్థం: ఆ+ధృష్టద్యుమ్నుఁడు; సక్రోధుండు+ఐ= కోపంతో కూడినవాడై; బాణ+వితతిన్= అమ్ముల సముదాయాన్ని; కురిసినన్= వర్షించగా; ఆ+యోధ+అగ్రణి= వీరులలో శ్రేష్ఠుడు(ద్రోణుడు); దృఢసంవేధంబు+అగు= గట్టిగా పీడించే శక్తిగల; నారసము= బాణం; ఏసి= ప్రయోగించి; నఱకెన్= తునియలు చేశాడు. అతండున్= (ఆ ధృష్టద్యుమ్నుడు); ఉఱుక= లెక్కచేయక; (మిగది పద్యంతో అన్వయం.)

తాత్పర్యం: ఆ ధృష్టద్యుమ్నుడు ఆగ్రహించి ద్రోణాచార్యుడిపై బాణాలవాన కురిపించాడు. ద్రోణుడు ధృష్టద్యుమ్నుడిపై గొప్ప బలమైన బాణాలు ప్రయోగించాడు. ద్రోణుడు వేసిన బాణాలను ధృష్టద్యుమ్నుడు తునియలు చేశాడు.

క. ఆచార్యుఁ దీవ్ర ఘన నా । రాచము లేయంగఁ ద్రుంచె గ్రక్కున; నవి వ
మ్మై చెడిపోయిన నార్చెం । జూచి భవద్బలముఁ బాండుసుతసైన్యంబున్. 51

ప్రతిపదార్థం: ఆచార్యున్= గురుడిని(ద్రోణుడిని); తీవ్ర, ఘన,నారాచములు= వాడిమిగల గొప్ప బాణాలు; ఏయంగన్= ప్రయోగించి; కొట్టగా, ((ద్రోణుడు); గ్రక్కునన్= వెంటనే; త్రుంచెన్= ఖండించాడు; అవి= ఆ వాడి వేడి గల అమ్ములు; వమ్ము+ఐ= వ్యర్థాలై; చెడిపోయినన్= పాడైపోవగా; చూచి= అరసి; భవత్+బలమున్= నీ సేన; పాండుసుత+ సైన్యంబున్= పాండవుల సేన; ఆర్చెన్= పెద్ద పెట్టున ధ్వని చేశాయి.

తాత్పర్యం: ధృష్టద్యుమ్నుడు ద్రోణాచార్యుడిపై మిక్కిలి వాడిమి గల గొప్ప బాణాలు ప్రయోగించాడు. ద్రోణుడు ఆ బాణాలను అన్నిటినీ ఖండించాడు. అట్టి గొప్ప అమ్ములు వమ్మైపోవటం చూచి, కౌరవసేన పాండవసేన పెద్దపెట్టున నినాదాలు చేశాయి.

విశేషం: ఆచార్యుడు అనగా గురువు అని అర్థం. అయితే ఆచార్య శబ్దం ద్రోణుడికి సార్థకమైన బిరుదుగా సమకాలీన సమాజంలో ప్రచారానికి వచ్చింది. ఆచార్యుడు అన్నా, గురుడు అన్నా, ధనుర్విద్యా గురుడు అన్నా అర్థం- ద్రోణుడే మహాభారతంలో.

వ. ద్రోణుండలిగి శరాసనంబు ద్రుంచిన . 52

ప్రతిపదార్థం: ద్రోణుండు= ద్రోణుడు; అలిగి= కోపించి; శర+అసనంబున్= విల్లును; త్రుంచినన్= ఖండించగా.

తాత్పర్యం: ద్రోణుడు కోపించి ధృష్టద్యుమ్నుడి విల్లు ఖండించివేయగా.

ఆ. పార్షతుండు శక్తిఁ బరఁగింప నతఁడు ము । త్తునియఁ జేసె మఱియు ద్రుపదసుతుఁడు
పెక్కుశక్తు లొక్కపెట్ట వైచినఁ దును । మాడె రయము మెఱయ నగ్గురుండు. 53

ప్రతిపదార్థం: పార్షతుండు= (పృషతుని వంశీయుడు) ధృష్టద్యుమ్నుడు; శక్తిన్= శక్తి అనే పేరుగల ఒక గొప్ప ఆయుధాన్ని; పరఁగింపన్= ప్రయోగించగా; అతఁడు= (ద్రోణుడు); ముత్తునియన్= మూడు చిన్న చిన్న ముక్కలు; చేసెన్= చేశాడు; మఱియున్= ఇంకను; ద్రుపద+సుతుఁడు= ద్రుపదుడి కొడుకు ధృష్టద్యుమ్నుడు; పెక్కు+శక్తులు= అనేక శక్తులను; ఒక్క+పెట్టన్= ఒకేసారి; వైచినన్= ప్రయోగించగా; ఆ+గురుండు= ఆ గురుడు ద్రోణుడు; రయము+మెఱయన్= వేగం వెలుగొందేటట్లుగా (శీఘ్రముగా); తునుమాడెన్= ఖండించాడు.

తాత్పర్యం: ధృష్టద్యుమ్నుడు ద్రోణుడిపై 'శక్తి' ఆయుధాన్ని ప్రయోగించాడు. ద్రోణుడు ఆ 'శక్తి' ని మూడుముక్కలుగా చేశాడు. వెంటనే ధృష్టద్యుమ్నుడు ఎన్నో శక్తులను ద్రోణుడిపై ప్రయోగించాడు. ఆ శక్తులను అన్నిటినీ ద్రోణుడు ఖండించాడు.

విశేషం: 1. మహాభారత యుద్ధకాలంలో 'శక్తి' అనే ఆయుధ విశేషం గూర్చి పలుచోట్ల వర్ణన ఉన్నది. పేరును బట్టే అది బాణం కంటె గొప్పది అని చెప్పవచ్చును. కర్ణుడి సహజ కవచ కుండలాలు మాయాబ్రాహ్మణ వేషంలో దానంగా పరిగ్రహించిన దేవేంద్రుడు ప్రత్యామ్నాయంగా 'శక్తి' అనే ఆయుధ విశేషం అతడికి ఇచ్చాడు. దీనినిబట్టి 'శక్తి' ఎంతటి గొప్ప ఆయుధమో ఊహించవచ్చును.

తే. పృషతపౌత్రుండు గద వైవఁ బిడుగుఁ బోలె । నడరునెడఁ బొడిగాఁ జేసె నస్త్రగురుఁడు
భల్లముల గట్టి మైమఱు వెల్లఁ జించి । యతని నెత్తుటిలో ముంచె శితశరముల. 54

ప్రతిపదార్థం: పృషత+పౌత్రుండు= పృషతుడి మనుమడు - ధృష్టద్యుమ్నుడు; గద= గద అనే ఆయుధాన్ని; వైవన్= విసరగా; (అది); పిడుగు+పోలెన్= పిడుగువలె; అడరు+ఎడన్= భయంకరంగా విజృంభించే సమయంలో; అస్త్ర గురుఁడు= ద్రోణుడు; (దానిని= ఆ గదను); పొడిగాన్+ చేసెన్= అణువులుగా ఖండించాడు.(అంతేకాక); భల్లములన్= ఈటె బాణాలతో; మైమఱువు+ఎల్లన్= కవచాన్ని అంతటినీ; చించి= ఖండించి; అతనిన్= ఆ ధృష్టద్యుమ్నుడిని; శిత శరములన్ =వాడి బాణాలతో; నెత్తుటిలోన్+ముంచెన్= రక్తంలో తడిపి వేశాడు.

తాత్పర్యం: ధృష్టద్యుమ్నుడు ద్రోణాచార్యుడిపై గద విసరాడు. పిడుగువలె మీదకు వచ్చే ఆ గదను ద్రోణుడు పొడి పొడి చేశాడు. అంతేకాక ఈటె బాణాలలో ధృష్టద్యుమ్నుడి కవచం ఛేదించి, వాడి బాణాలు ప్రయోగించి ఆతడిని నెత్తుటిలో ముంచివేశాడు.

విశేషం: గద - ఆయుధ విశేషం. బాణం కంటె బలవత్తరమైనదే. అయితే 'శక్తి' - గదకంటె కూడా గొప్పది. గద - ఆకారరేఖలు నేటివారికి తెలిసినట్టివే కాని 'శక్తి' స్వరూప స్వభావాలు ఊహకు అందనట్టివే.

ఉ. ఒండొక చాప మెత్తికొని యుగ్రత నా పృషతాన్వయాగ్రగ
ణ్యుం డడరించు నారసము లుచ్చి చనంగ గురుండు గ్రొవ్విరుల్
నిండిన కింశుకంబు రమణీయతఁ జూడఁగ నొప్పి వాని వి
ల్వెండియు రెండు సేసి యవలీల హయంబుల సూతుఁ జంపినన్. 55

ప్రతిపదార్థం: ఒండు+ఒక= ఇంకొక; చాపము= విల్లు; ఎత్తికొని= తీసికొని గ్రహించి; ఆ పృషత+అన్వయ+అగ్రగణ్యుండు= ఆ పృషతుని వంశంలో మొదట పరిగణించ దగినవాడు- ధృష్టద్యుమ్నుడు; అడరించు= ప్రయోగించే; నారసములు= బాణాలు; ఉచ్చి చనంగన్= చీల్చుకొనిపోగా; గురుండు= ద్రోణాచార్యుడు; క్రొవ్విరుల్-క్రొత్త+విరుల్= కొత్తగా పూచిన పూవులు; నిండిన= దట్టంగా వ్యాపించిన; కింశుకంబు+రమణీయతన్= చిలుకముక్కురంగు పువ్వులు పూచే మోదుగు వృక్షంయొక్కఅందంతో; చూడఁగన్+ఒప్పి= చూచేందుకు శోభిల్లి; వాని= ఆ ధృష్టద్యుమ్నుడి; విల్= ధనుస్సును; వెండియున్= మరల ఇంకోసారి; రెండు+చేసి= ఖండించి; అవలీలన్= సులువుగా; హయంబులన్= గుర్రాలను; సూతున్= రథసారథిని; చంపినన్= చంపగా.

తాత్పర్యం: ఒకసారి ద్రోణుడు ధృష్టద్యుమ్నుడి విల్లు ఖండించాడు. ఇంకో విల్లు ఎత్తుకొని ధృష్టద్యుమ్నుడు అమ్ములు వేయగా, ద్రోణుడు గాయపడ్డాడు. ఆ గాయాలలో నుండి నెత్తురు పైకి స్రవించి వచ్చింది. అప్పుడు ద్రోణుడు క్రొత్త పూవులు పూచిన మోదుగ చెట్టువలె అందంగా కనుపించాడు. అయితే ద్రోణుడు ఇంకోసారి ధృష్టద్యుమ్నుడి విల్లు ఖండించి, అతడి రథసారథినీ గుర్రాలను సంహరించాడు.

విశేషం: కింశుక వృక్షం= మోదుగుచెట్టు. దాని పువ్వులు చిలుక ముక్కు రంగువలె ఎర్రగా ఉంటాయి.

మ. విరథుండై పొలివోని బంటుతనమున్ వేగంబు నొప్పంగ బి
ట్టరదంబున్ డిగునప్డు చేతిగద నుగ్గెరాల నేసెన్ ధను
ర్ధరుఁ డవ్వీరుఁడు వాలునుం బలుకయున్ ఘోరాకృతిం బుచ్చికొం
చు రయంబారఁ గడంగి బె ట్టడర సంక్షోభించె నీ సైన్యముల్. 56

ప్రతిపదార్థం: విరథుండు+ఐ= రథం లేనివాడై; పొలి+పోని+బంటుతనమున్= మొక్కవోని పరాక్రమంతో; వేగంబున్= తీవ్రతా; ఒప్పంగన్= శోభిల్లగా; బిట్టు= మిక్కుటంగా; అరదంబున్+డిగు+అప్డు= తేరునుండి క్రిందికి దిగే సమయంలో; చేతి+గద= చేతిలో ఉన్న ఆయుధ విశేషం- గద; నుగ్గు+ఐ= పొడి పొడి అయిపోయి; రాలన్= క్రింద పడేటట్లుగా; ధనుస్+గురుఁడు= ధనురాచార్యుడు- ద్రోణుడు; ఏసెన్= బాణాలు ప్రయోగించాడు; ఆ+వీరుడు= ధృష్టద్యుమ్నుడు; వాలునున్+పలుకయున్= కత్తిడాలు; ఘోర+ఆకృతిన్= భయంకరమైన రూపంతో; పుచ్చికొంచున్= పట్టుకొంటూ; రయంబు+ఆరన్= వేగంగా; కడంగి= పూని; బెట్టు+అడరన్= మిక్కుటంగా విజృంభించగా; నీ సైన్యముల్= నీ సేనలు (కౌరవ సైన్యాలు); సంక్షోభించెన్= వ్యాకులతచెందాయి.

తాత్పర్యం: ద్రోణాచార్యుడు - ధృష్టద్యుమ్నుడిని విరథుడిని చేశాడు. కాని ధృష్టద్యుమ్నుడు జంకు గొంకులు లేకుండగా పరాక్రమోపేతుడై గద చేబూని క్రిందికి దూకుతుండగా, ద్రోణుడు ఆ గదను నుగ్గు నుగ్గు చేశాడు. అయినా, ఆ మహావీరుడు - ధృష్టద్యుమ్నుడు - కత్తి డాలు పట్టుకొని నేలమీదికి ఉరికి - విజృంభించాడు. ఆతని రౌద్రాకృతి చూచి కౌరవ సైన్యం గజగజ వణకిపోయింది.

క. గురుఁడను నురుతర గిరి ని । ష్ఠుర భంగిం బుట్టి వచ్చు సునిశితబాణో
త్కరచండవేగనదికి నె । దురు చన రాదయ్యె నపుడు ద్రుపదసుతునకున్. 57

ప్రతిపదార్థం: గురుఁడు+అను= ద్రోణాచార్యుడు అనే; ఉరుతర, గిరి= గొప్ప కొండ; నిష్ఠురభంగిన్+పుట్టి,వచ్చు= కఠినరీతిలో ఉద్భవించి వచ్చే; సునిశిత బాణ+ఉత్కర చండవేగ నదికిన్= మిక్కిలి వాడియైన అమ్ముల సముదాయం అనే గొప్ప వేగంతో కూడిన ఏటికి; అపుడు= ఆ సమయంలో; ద్రుపద సుతునకున్= ద్రుపదుడి కొడుకు ధృష్టద్యుమ్నుడికి; ఎదురు చన రాదు+అయ్యెన్= ఎదురుగా వెళ్ళటానికి శక్యం కాలేదు.

తాత్పర్యం: ద్రోణాచార్యుడి ధాటికి, ధృష్టద్యుమ్నుడు ఆగలేకపోయాడు. ద్రోణుడు ఒక పెద్ద కొండవలె ఉన్నాడు. అతడు ప్రయోగించే బాణాలు కొండనుండి అతివేగంతో క్రిందికి దూకే నదివలె ఉన్నాయి. ఆ ఏటికి ధృష్టద్యుమ్నుడు ఎదురీదలేకపోయాడు.

విశేషం: అలం: రూపకం. గురుడు ఉపమేయం. ఉరుతరగిరి - ఉపమానం. చండవేగనది - ఉపమానం. సునిశిత బాణోత్కరము - ఉపమేయం. పెద్ద కొండనుండి ప్రవహించే నదికి ఎవరు ఎదురేగగలరు?

కొందరు ఇట్లా అన్వయం చెప్పారు: ఇందు గురుఁడు ఉరుతరగిరి. అది ధృష్టద్యుమ్నుడి సునిశిత బాణోత్కర మనెడి చండవేగ నదికి ఎదుర్కొనరానిదయింది.

క. గతి గుందియుఁ బైఁ దొరఁగెడు । శితశరములు పలక జడియఁజేయుచు ద్రుపద
క్షితిపతిసుతుండు మెఱయఁగ । నతిరయమున ననిలతనయుఁ డడ్డము సొచ్చెన్. 58

ప్రతిపదార్థం: గతి= గమనము - వేగము; కుందియున్= తగ్గినప్పటికిని; పైన్+తొరఁగెడు= పైనవచ్చిపడే; శిత+ శరములు= వాడిబాణాలు; పలకన్= డాలుతో; జడియన్+చేయుచున్= ఆపుకొంటూ; ద్రుపద+క్షితిపతి+సుతుండు= ద్రుపద రాజు కొడుకు-ధృష్టద్యుమ్నుడు; మెఱయఁగన్= వెలుగొందగా; అతి+రయమునన్= మిక్కుటమగు వేగంతో; అనిలతనయుఁడు= వాయుసుతుడు(భీముడు); అడ్డము+చొచ్చెన్= అడ్డుపడ్డాడు; అనగా ద్రోణునకు - ధృష్టద్యుమ్ననకు మధ్య వచ్చి నిలబడ్డాడు.

తాత్పర్యం: ధృష్టద్యుమ్నుడు విరథుడై - గతిలేనివాడయినప్పటికీ - తనపై బడే వాడి బాణాలను తన చేతి డాలుతో నివారించుకొంటూ, ధైర్యంగా నిలబడినప్పుడు - మిక్కుటమైన వేగంతో భీమసేనుడు అతడి దగ్గరకు చేరి, అతడిని ఆదుకోగలిగాడు.

విశేషం: కురుక్షేత్ర సంగ్రామంలో ఇది ఒక అద్భుతఘట్టం. ద్రోణాచార్యుడికి - ద్రుపదుడికి గల వైరం జగత్ప్రసిద్ధం. ద్రుపదసుతుడు, పాండవసేనాధిపతీ అయిన ధృష్టద్యుమ్నుడు యుద్ధంలో మొట్టమొదటిసారి ద్రోణుడిని మార్కొని - పోరాటంలో పొందిన అవమానం - ఈ ఘట్టంలో తిక్కన హృదయంగమంగా వర్ణించాడు.

వ. ఇట్లు సొచ్చి వృకోదరుండు గురుం గ్రూరాస్త్రసప్తకంబున నొప్పించి పాంచాలపతిసుతు నొండొకయరదం
బెక్కించుటయుఁ గనుంగొని నీకొడుకు కళింగపతికిం జేయి వీచి వాయుతనయుం దలపడ నియోగించిన
నతండు మహాసైన్యసహాయత్వంబునం బేర్చి భీమసేనుపై నురవడించి నడచెఁ గుంభసంభవుండును
విజృంభితుం డై విరాటద్రుపదులం దాఁకె ధర్మతనయుండు ధృష్టద్యుమ్నుం గలిసికొని వెన్నుదన్ని నిలిచెఁ
జేదికరూశదేశంబులబలంబులు మహాబలనందను ముందటికి వచ్చె నట్టియెడ. 59

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; వృకోదరుండు= భీముడు; చొచ్చి= ప్రవేశించి; గురున్= ద్రోణుని; క్రూర+అస్త్ర+సప్తకంబున్= కఠినమైన ఏడు బాణాలతో; నొప్పించి= బాధించి; పాంచాలపతి+సుతున్= పాంచాలరాజపుత్రుని= ధృష్టద్యుమ్నుని; ఒండొక+అరదంబు+ఎక్కించుటయున్= వేరొక రథంపైకి ఎక్కించటాన్ని; కనుంగొని= చూచి; నీకొడుకు= దుర్యోధనుడు; కళింగపతికిన్= కళింగదేశ రాజునకు; చేయి+వీచి= చేతితో సైగచేసి; వాయుతనయున్= భీముడిని; తలపడన్= మార్కొనటానికి; నియోగించినన్= ఆజ్ఞాపించగా; అతండు= ఆ కళింగ దేశరాజు;

మహాసైన్య సహాయత్వంబునన్= గొప్పసేన యొక్క తోడ్పాటుతో; పేర్చి= విజృంభించి; భీమసేనుపైన్= భీమునిపై; ఉరవడించి+నడచెన్= ఉత్సాహంతో మార్కొన్నాడు; కుంభసంభవుండును= ద్రోణాచార్యుడును; విజృంభితుండై= అతిశయించినవాడై; విరాటద్రుపదులన్= విరాటరాజును, ద్రుపదరాజును; తాఁకెన్= మార్కొన్నాడు; ధర్మతనయుండు= ధర్మరాజు; ధృష్టద్యుమ్నున్= ధృష్టద్యుమ్నుని; కవిసికొని; వెన్న+ తన్ని+నిలిచెన్= బాసటగా నిలబడ్డాడు; చేది, కరూశ, దేశంబుల బలంబులు= చేది దేశానికి. కరూశదేశానికి చెందిన సేనలు; మహాబల నందను ముందటికిన్= భీమసేనుని ముందుకు; వచ్చెన్; అట్టి+ఎడన్= ఆ సమయమందు.

తాత్పర్యం: అప్పుడు భీముడు మిక్కిలి వేగంతో ఆ స్థలానికి వచ్చి ద్రోణుడికీ ధృష్టద్యుమ్నుడికీ మధ్య నిలబడి ద్రోణుడిపై ఏడు వాడి బాణాలు ప్రయోగించి, ధృష్టద్యుమ్నుడిని వేరే రథంపైకి ఎక్కించాడు. అప్పుడు దుర్యోధనుడు-భీమసేనుడు విరథుడైన ధృష్టద్యుమ్నుడిని రక్షించటం చూచి, చేతిసన్నతో కళింగదేశ రాజును అక్కడకు రమ్మని ఆజ్ఞాపించాడు. కళింగదేశ రాజు గొప్పసైన్యంతో వచ్చి, భీమసేనుడిని మార్కొన్నాడు. ద్రోణుడు విజృంభించి విరాటరాజును ద్రుపద రాజును మార్కొన్నాడు. ధర్మరాజు ఆ చోటికి సత్వరం ఏతెంచి, ధృష్టద్యుమ్నుడికి బాసటగా నిలబడ్డాడు. చేది, కరూశ దేశాల సేనలు భీమసేనుడికి బాసటగా చేరి నిలిచాయి. ఆ సమయంలో.

విశేషం: తిక్కన యుద్ధ వర్ణన- ఆంధ్ర వాఙ్మయ జగత్తులో పేరుకెక్కింది. ఈ ఘట్టం ఉదాహరణప్రాయమైనట్టిది. ద్రోణ ధృష్టద్యుమ్నుల మధ్య జరిగిన పోరాటం కన్నులకు కట్టేటట్లు తిక్కన వర్ణించాడు. ఈ తరుణంలో వచ్చి ఆదుకొని భీముడు ధృష్టద్యుమ్నుడిని రక్షించాడు.

తే. అడరెఁ గాళింగనాయకుం డగు శ్రుతాయు । వునకుఁ దో డయి వీఁకమైఁ దననిషాద
సైన్యమును దాను భీముపై సరభసముగఁ । గేతుమంతుండు ఫణిరాజకేతుఁ డలర. 60

ప్రతిపదార్థం: కళింగ నాయకుండు+అగు= కళింగదేశాధీశుడైన; శ్రుతాయువునకున్= శ్రుతాయువు అను పేరుగల రాజునకు; తోడు+అయి= సాయం చేసేందుకు చేరినవాడై; కేతుమంతుండు= కేతుమంతుడు అనే పేరుగల రాజు; తన+నిషాద+ సైన్యమును= ఆటవికులతో కూడిన తన సైన్యాన్ని; తాను= తాను; వీఁకమైన్= ఉత్సాహంతో; ఫణిరాజకేతుఁడు= పాముగుర్తు జెండాయందు కలవాడు, దుర్యోధనుడు; అలరన్= సంతసించునట్లుగా; సరభసముగన్= వేగిరపాటుతో, అడరెన్= విజృంభించాడు.

తాత్పర్యం: దుర్యోధనుడు చేసన్నతో నియోగించగా, కళింగదేశరాజు సేనాసమేతంగా వచ్చి భీమసేనుడిని మార్కొన్నాడు. అప్పుడు కేతుమంతుడు అనే వీరుడు - ఆటవిక సైన్య నాయకుడు, వేగంగా వచ్చి - కళింగరాజు శ్రుతాయువునకు బాసటగా నిలిచాడు. దుర్యోధనుడు ఆ దృశ్యం చూచి ఎంతో సంతోషించాడు.

క. భీమునిముందటి బల ము । ద్దామతఁ గాళింగసేనఁ దలపడి హేతి
స్తోమావృత మై వ్రాలెను । భూమిపయిన్ సగముసగము పాలుపఱి విఱిగెన్. 61

ప్రతిపదార్థం: భీముని+ముందటి+బలము= భీమునకు బాసటగా ముందునకు చేరి నిలిచిన సేన(చేది కరూశ దేశములకు సంబంధించిన సేనలు); ఉద్దామతన్= అతిశయంతో; కాళింగ+సేనన్= కళింగదేశానికి సంబంధించిన సేనను; తలపడి= మార్కొని; హేతి+స్తోమ+ఆవృతమై= కత్తుల సముదాయంలో కూడుకొని; భూమిపయిన్= నేలమీదకు; వ్రాలెను= పడిపోయాయి; సగము+సగము= సగానికి సగం; పాలుపు+అఱి= శోభ తరిగిపోయి; విఱిగెన్= పారిపోయింది.

తాత్పర్యం: భీమసేనుడికి బాసటగా ముందుకు వచ్చి నిలిచిన సేనలు- చేది కరూశ దేశాలకు సంబంధించిన సేనలు- కళింగసేనలను తీవ్రంగా మార్కొని, తమ తమ కత్తులతో గూడ సగం సేననేల కూలింది. మిగిలిన సగం శోభ తిరిగి పారిపోయింది.

ఆ. మదము మిగిలి కేతుమంతుఁడు గొంతేయు । పైకిఁ గవిసి యతని బాణశిఖల
మ్రుందిపోయెఁ గడఁగి మంటలో నుఱికిన । మిడుతవోలె మెలఁగ మిడుక లేక. 62

ప్రతిపదార్థం: మదము+మిగిలి= గర్వం అతిశయించి; కేతుమంతుండు= కేతుమంతుడు; కొంతేయుపైకిన్= భీమునిపైకి; కవిసి= మార్కొని; అతని బాణ శిఖలన్= భీమునియొక్క బాణ జ్వాలలలో; మంటలోన్= అగ్నిలో; ఉఱికిన= దూకిన; మిడుత+పోలెన్= శలభం వలె; మెలఁగన్= తిరుగ; మిడుక+లేక= వీలులేక; మ్రుంది+పోయెన్= నశించిపోయాడు.

తాత్పర్యం: కేతుమంతుడు భీమునిపైకి విజృంభించాడు. కాని, అగ్నిలోపడి తప్పించుకోలేని శలభంవలె భీముని బాణాగ్నిలో పడి నశించిపోయాడు.

విశేషం1. శలభం= (ఒకకీటకం, చిన్న పురుగు - మిడుత) అగ్ని కనిపిస్తే చాలు అందులో పడిపోతుంది. ఇది సుస్పష్టమైన ఆత్మహత్య. శలభం ఎందుకు అగ్నిలోకి దూకుతుంది? అది సృష్టిస్వభావ రహస్యం. కేతుమంతుడు భీమునితో మార్కొనటం అటువంటిదే. అంతేకాదు- మానవ హృదయ కుహరాంతరాల దొంతరలలో ఎక్కడో ఆత్మహత్యా సదృశమైన యుద్ధప్రీతి బహుశః - శలభ స్వభావ సన్నిభమైనట్టిది రహస్యంగా దాగి ఉందేమో! లేకపోతే ప్రపంచ చరిత్రలో - ఎన్నెన్ని యుద్ధాలు జరిగాయి? ఎందరు మరణించారు? ఈ చిన్ని పద్యంలో తిక్కన ఈ అత్యద్భుత సృష్టి రహస్యాన్ని పొందు పరచాడా? తిక్కన ప్రత్యక్షంగా ఎన్నో యుద్ధాలు చూచినట్టివాడు. తిక్కన యుద్ధవర్ణనలలో ఆతని ప్రత్యక్ష పరిజ్ఞానం కనిపిస్తుంది.

చ. పవనసుతుం గళింగనరపాలసుతుం డగు శక్రదేవుఁ డు
గ్రవిశిఖవృష్టిఁ దేల్చి తురగంబులఁ గూల్చినఁ గ్రోధదీప్తుఁ డై
యవిహతభంగి భూరిగద నాతఁడు వైచినఁ గూలె వాఁడు వ
జ్ర విహతిఁ గూలు శైల మన సారథికేతుయుతంబుగా నిలన్. 63

ప్రతిపదార్థం: కళింగ+నరపాల+సుతుండు+అగు= కళింగరాజు కొడుకైన; శక్రదేవుఁడు= శక్రదేవుడు అను పేరుగలవాడు; పవన+సుతున్= వాయుపుత్రుడైన భీముని; ఉగ్ర విశిఖ వృష్టిన్ తేల్చి= భయంకరమైన బాణవర్షంలో తేలునట్లుగా చేసి; తురగంబులన్= గుర్రాలను; గూల్చినన్= సంహరించగా; ఆతఁడు= భీమసేనుడు; క్రోధ దీప్తుఁడు+ఐ= కోపంచే వెలుగొందినవాడై; అవిహత భంగిన్= ఎదురులేని రీతిగా; భూరి+గదన్= పెద్ద గదను; వైచినన్= విసరగా; వాఁడు= ఆ శక్రదేవుడు; వజ్ర+విహతిన్= వజ్రం యొక్క దెబ్బవలన; కూలు= నేలమీదకు పడిపోయే; శైలము+అనన్= కొండ అనునట్లుగా; సారథి కేతు యుతంబుగాన్= సారథితో, జెండాతో పాటుగా; ఇలన్= నేలయందు; కూలెన్= పడిపోయాడు.

తాత్పర్యం: కళింగరాజపుత్రుడు - శక్రదేవుడు భీమసేనుని మార్కొని, భయంకరములైన బాణాలు ప్రయోగించి - గుర్రాలను చంపివేశాడు. భీముడు కోపించి పెద్ద గదను ఆతనిపై విసిరాడు. ఆ దెబ్బకు శక్రదేవుడు సారథితోపాటు, జెండాతోపాటు- వజ్రాయుధం తాకిడికి కూలే కొండ వలె - నేలపై కూలిపోయాడు.

విశేషం: మిక్కిలి ప్రాచీన కాలంలో కొండలకు రెక్కలుండేవట. అవి, ఇచ్చ వచ్చిన చోట నేలపై వ్రాలి - అపార జననష్టం కలిగించేవట. అప్పుడు దేవేంద్రుడు - కొండల రెక్కలు తన వజ్రాయుధం చేత నరికివేశాడని, అప్పటినుండీ కొండలు కదలికలేకుండా 'నగము' లై నేలమీద పడి ఉన్నాయనీ పురాణకథ.

వ. ఇవ్విధంబున నద్భుతభయావహం బగు పరాక్రమంబునం బేర్చి భీమసేనుండు ఘటితకాంచన బిందు
సందోహసుందరంబును దృఢవిశాలంబును నగు పలకయుం గల్పాంతకృతాంతజిహ్వాభీలం బగు
కరవాలంబును బుచ్చికొని హతహయం బగు నరదంబు డిగ్గిన. 64

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ రీతిగా; అద్భుత+భయ+ఆవహంబు+అగు= ఆశ్చర్యకరమూ, భయముతో కూడినట్టిదీ అగు; పరాక్రమంబునన్= శౌర్యంతో; పేర్చి= అతిశయించి; భీమసేనుండు; ఘటిత కాంచన+బిందు+సందోహ+సుందరంబును= పొదగబడిన బంగారు చిరువలయ సముదాయంతో అందమైనట్టిదీ; దృఢ విశాలంబును+అగు= గట్టిగా ఉండి నిడివిగా ఉన్నట్టిదీ; పలకయున్= డాలును; కల్ప+అంత+కృతాంత+జిహ్వా+ఆభీలంబు+ అగు= కల్పము చివర(ప్రళయకాలంలో) యముని నాలుకవలె భయంకరమైనదీ అయిన; కరవాలంబును= కత్తిని; పుచ్చికొని= గ్రహించి; హత+హయంబు+అగు= చచ్చిపోయిన గుర్రాలుగల; అరదంబున్= రథమును; డిగ్గినన్= దిగిపోగా.

తాత్పర్యం: ఈ రీతిగా (విరథుడైన) భీమసేనుడు, ఆశ్చర్యకరమూ భయంకరమూ అయిన శౌర్యాన్ని ప్రదర్శించాడు. భీముడు ఒక చేతితో డాలు పట్టుకున్నాడు. ఆ డాలు దృఢమైనదీ, విశాలమైనదీ. మధ్యలో బంగారు బిందువులు ఎన్నో పొదగబడి ఉన్నాయి. ఇంకోచేతితో కత్తి పట్టుకున్నాడు. ఆ కత్తి ప్రళయకాలంలో యమధర్మరాజు నాలుకవలె భయంకరంగా ఉంది. ఆ రీతిగా -గుర్రాలు చచ్చిపోయిన రథం విడిచిపెట్టి భీముడు క్రిందికి దిగాడు.

ఆ. కొడుకుపాటుఁ జూచి కోపించి కాళింగ । పతి రయమునఁ దేరు వఱపి భీముఁ
బొదివి పిడుగుఁ గొదమ వోని నారసము బి । ట్టేసె నది యతండు వేసెఁ దునియ. 65

ప్రతిపదార్థం: కొడుకు+పాటున్= పుత్రుని పతనం; చూచి= కాంచి; కోపించి; కాళింగపతి= కళింగదేశరాజు; రయమునన్= వేగంగా; తేరు+పఱపి= రథాన్నితోలి; భీమున్+పొదివి= భీముని మార్కొని; పిడుగు+కొదమ+పోని నారసము= చిన్న పిడుగువంటి బాణం; బిట్టు+ఏసెన్= గొప్పగా ప్రయోగించాడు; అది= దానిని(ఆ బాణాన్ని); అతండు= భీముడు; తునియన్= ముక్కలుగా; వేసెన్= చేశాడు.

తాత్పర్యం: తన కొడుకైన శక్రదేవుడు మరణించడం చూచి, ఆగ్రహించి, కళింగదేశరాజైన శ్రుతాయువు వేగంగా తన రథాన్ని భీమునిపైకి తరలించాడు. భీమునిపై పిడుగువంటి బాణం ప్రయోగించాడు. అయితే భీముడు ఆ బాణాన్ని తునియలుగా ఖండించాడు.

క. మదమున శ్రుతాయు వొక్కటఁ । బదునాలుగు తోమరములు వరఁగించిన నే
ర్పొదవఁగఁ బవనజుఁ డన్నిటిఁ । జిదురుపలుగఁ జేసె ఖడ్గచిత్రనిహతులన్. 66

ప్రతిపదార్థం: మదమునన్= గర్వంతో, శ్రుతాయువు= శ్రుతాయువు అను పేరుగల కళింగదేశరాజు; ఒక్కటన్= ఒకేసారి; పదునాలుగు+ తోమరములు= పద్నాలుగు చిల్లకోలలు; పరఁగించినన్= ప్రయోగింపగా; నేర్పు+ఒదవఁగన్= సామర్థ్యం బయటపడేటట్లుగా; పవనజుఁడు= వాయుసుతుడు(భీముడు); అన్నిటిన్= ఆ పదునాలుగు చిల్లకోలలనూ; చిదురుపలుగన్= చిన్ని చిన్ని ముక్కలుగా; ఖడ్గ+చిత్ర+నిహతులన్= ఆశ్చర్యకరంగా కత్తితో కొట్టబడిన వాటినిగా; చేసెన్= చేశాడు.

తాత్పర్యం: మిక్కుటమగు గర్వంతో, శ్రుతాయువు ఒకేసారి పదునాలుగు చిల్లకోలలు భీమునిపై ప్రయోగించాడు. భీముడు చాకచక్యంతో అన్నిటినీ చిన్నిచిన్ని ముక్కలుగా ఆశ్చర్యకరంగా తన చేతికత్తితో ఖండించాడు.

భీమసేనునిచేత భానుమంతుండు సచ్చుట (సం-6-50-30)

వ. అప్పుడా కళింగపతియనుజుం డగు భానుమంతుండు దంతి నికరంబుతో నగ్రజునకుం దలమిగిలి పవమాన సూనుపై నడరి నిజఘటలకుం దలకడచి యతనిమేన నారాచంబులు నాటించుచుఁ గదిసి తన యెక్కిన యేనుంగు నేపునం బురికొల్పిన. 67

ప్రతిపదార్థం: అప్పుడు; ఆ కళింగపతి+అనుజుండు అగు= ఆ కళింగరాజైన శ్రుతాయువు యొక్క తమ్ముడు అయిన; భానుమంతుండు= భానుమంతుడు అను పేరుగలవాడు; దంతి+నికరంబుతోన్= ఏనుగుల గుంపుతో; అగ్రజునకున్+తల+మిగిలి= అన్నగారిని అతిక్రమించి; పవమాన సూనుపైన్= భీమునిపై; అడరి= విజృంభించి; నిజ+ఘటలకున్+తలకడచి= తన ఏనుగుల సముదాయాన్ని దాటి; అతని+మేనన్= భీముని శరీరమందు; నారాచంబులు= బాణాలు; నాటించుచున్= గ్రుచ్చుతూ; కదిసి= పూని; తన+ఎక్కిన+ఏనుంగున్= తాను అధివసించిన ఏనుగును; ఏపునన్+పురికొల్పినన్= మిక్కుటముగా ప్రోత్సహించగా.

తాత్పర్యం: ఆ సమయంలో కళింగరాజు శ్రుతాయువు తమ్ముడు భానుమంతుడు, ఏనుగుల సముదాయంలో అన్నను అతిక్రమించి, భీమునిపై వాడిబాణాలు నాటేటట్లు చేశాడు. అంతేగాక - తాను ఎక్కిన ఏనుగును పురికొల్పగా (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: పురాణాలలో, చరిత్రలో కూడా కళింగదేశం ఏనుగులకు ప్రసిద్ధి కెక్కింది. భీముడు ఏనుగులను చంపటంలో సిద్ధహస్తుడు. అందుచే కళింగులకూ భీముడికీ సహజవైరం ఏర్పడింది.

శా. కుంతీసూనుఁడు సింహనాదమున దిక్కుల్ పిక్కటిల్లంగ దు
ర్దాంతస్ఫారగతిం గరిం గదిసి రౌద్రస్ఫూర్తి లంఘించి త
ద్దంతంబుల్ వెస నెక్కి త్రొక్కి తునిమెన్ ధారాళరక్తచ్ఛటా
క్రాంతంబై నభమొప్ప వానిఁ బటుఖడ్గస్ఫారధారాహతిన్. 68

ప్రతిపదార్థం: కుంతీసూనుఁడు= కుంతికొడుకు - ఈ సందర్భంలో భీముడు; సింహనాదమునన్= సింహగర్జన వంటి అరుపుతో; దిక్కుల్= దెసలు; పిక్కటిల్లంగన్= మారుమ్రోగగా; దుర్దాంత+స్ఫార+గతిన్= అదుపులో పెట్టుటకు వీలులేకుండా విస్తరించిన నడకతో; రౌద్ర స్ఫూర్తిన్= తీవ్రకోపం భాసించగా; లంఘించి= దూకి; తద్+దంతంబుల్= ఆ ఏనుగు దంతాలు; వెసన్= వేగంగా; ఎక్కి; త్రొక్కి; ధారాళ+రక్త+ఛటా+ఆక్రాంతంబు+ఐ= మిక్కిలి ఎక్కువగా స్రవించే నెత్తుటి ధారల సముదాయంతో కూడి; నభము+ఒప్పన్= ఆకాశం శోభిల్లేటట్లుగా; పటు ఖడ్గ స్ఫార+ధారా+హతిన్= మిక్కుటమగు కత్తికొనల అంచుల దెబ్బలతో; వానిన్= ఆతనిని; తునిమెన్= సంహరించాడు.

తాత్పర్యం: అంతట భీముడు సింహనాదం చేశాడు. దిక్కులు మారుమ్రోగేటట్లుగా, వెనువెంటనే శీఘ్రగమనంతో ఆ ఏనుగు దంతాల మీదికి ఎక్కి, మర్దించాడు తీవ్ర కోపంతో. పిమ్మట ఆకాశంలో రక్తధారలతో చిమ్మేటట్లుగా, అతనిని తన కత్తి అంచులు తళతళ మెరిసేట్లు సంహరించాడు.

వ. ఇట్లు భానుమంతు నంతకుపురికిం బనిచి. 69

ప్రతిపదార్థం: అట్లు= ఆ రీతిగా; భానుమంతున్= భానుమంతుని; అంతకుపురికిన్= యముని పట్టణానికి; పనిచి= పంపించి. (అనగా చంపి) (తరువాతి పద్యంతో అన్వయం.)

తాత్పర్యం: భీముడు ఆ విధంగా భానుమంతుని యమలోకానికి పంపించి.

తే. మలఁగి గజకంధరము ద్రుంచి తొలఁగ నుఱికి । కెంపు దళుకొత్త వాలుతోఁ గ్రేళ్ళువాఱు
నా వృకోదరుపైఁ గవియంగఁ జేయి । వీచె సేనకుఁ గాళింగవిభుఁడు గడఁగి. 70

ప్రతిపదార్థం: మలఁగి= తిరిగి; గజ+కంధరము= ఏనుగు మెడను; త్రుంచి= ఖండించి; తొలఁగన్+ఉఱికి= తప్పించికొని దూకి; కెంపు+తళుకు+ఒత్తన్= ఎఱ్ఱదనం మెరయగా; వాలుతోన్= ఖడ్గముతో; క్రేళ్ళువాఱు= దుముకు; ఆ+వృకోదరుపైన్= ఆ భీమునిపై;

కవియంగన్= మార్కొనటానికి; కాళింగ+విభుఁడు= కళింగరాజు; కడఁగి= పూని; సేనకున్= సేనవైపు; చేయివీచెన్= తన చేతిని ఎత్తి సన్న చేశాడు.

తాత్పర్యం: భీముడు తిరిగి విజృంభించి, ఏనుగు మెడ ఖండించి, అటునుండి తొలగి క్రిందికి ఉరికి, ఎర్రదనంతో వెలుగొందు కత్తితో ముందుకు ఉరుకుతున్న ఆ భీముని మార్కొనుమని కళింగరాజు తన చేయివీచి సైనికులను పురికొల్పాడు.

వ. ఇట్లు శ్రుతాయువు సేయి వీచినఁ దచ్చతురంగంబులు వొదివినం బవనతనయుండు నిజభుజశిఖరంబులు వెఱుగం దాను బాదచారి యగుటయు నొంటియైన తెఱంగునుం దలంపని దర్పంబునం బేర్చి రణక్రీడకుం జొచ్చి కరవాలంబు శుండాలకుంభస్థలంబులు పగుల వ్రేసిన మెదడంటి మొదుక నైనం గేతుదండంబులు నఱికి, చులుకం జేయుచు రథికసారథి సహితంబుగా నరదంబులు చక్కడంచి, మొక్కలు వోయిన నస్థిసారంబులగు నశ్వశరీరంబులు గోసి, పాఱవైచి, వాఁడి సేయుచు నుబ్బున గుఱ్ఱంబుల కుఱికి బడలుపడ నఱిముఱి విసరిన నోర వోయిన సురియం జెరివి, యవలీలం గాలుబలంబులపైఁ బడి చక్కంజేయుచు మఱియు నానాప్రకారంబులగు చిత్రవధవిహారంబుల నమ్మోహరంబు విఘటితవిభ్రాంతపలాయితంబు గావించి యపరాహ్ణంబునం గళింగపతిం గవియు నవసరంబున. 71

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; శ్రుతాయువు= శ్రుతాయువు(కళింగభూపతి); చేయివీచినన్= చేయి ఊపి పురికొల్పగా; తద్+చతురంగంబులు= ఆతని చతురంగబలములు; పొదివినన్= చుట్టుముట్టగా; పవన తనయుండు= వాయుపుత్రుడు(భీముడు); నిజ భుజ శిఖరంబులు+వెఱుగన్= తన యొక్క మూపులు ఉబ్బగా; తాను; పాదచారి+అగుటయున్= నేలమీద తిరిగేవాడు కావటం; ఒంటి+ఐన+తెఱంగునున్= ఏకాకియైన తీరును; తలంపని= ఆలోచింపని; దర్పంబునన్= గర్వంతో; పేర్చి= విజృంభించి; రణ+క్రీడకున్+చొచ్చి= ఆటవలె యుద్ధం చేయటానికి పూని; కరవాలంబు= కత్తి; శుండాల+కుంభస్థలంబులు= ఏనుగుల కుంభములు; పగుల+వ్రేసినన్= బ్రద్దలు కొట్టగా; మెదడు+అంటి= తలలోపలి మాంసపు గుజ్జు సోకి; మొదుకన్+ఐనన్= మొద్దుబారగా; కేతు దండంబులు= జెండా కొయ్యలు; నఱికి= ఖండించి; చులుకన్+చేయుచున్= అవమానిస్తూ; రథిక+సారథి+సహితంబుగాన్= రథికులతో సారథులతోపాటుగా; అరదంబులు= రథాలు; చక్కడంచి= నాశనంచేసి; మొక్కలు+పోయిన= మ్రోడుపడిన(శిథిలములు అయిన); అస్థిసారంబులు+అగు= ఎముకలు మాత్రమే మిగిలిన; అశ్వ+శరీరంబులు= గుఱ్ఱాల కంకాళాలు; కోసిపాఱవైచి= ఖండించి విసిరివేసి; వాఁడి+చేయుచున్= పదను పెట్టుచూ; ఉబ్బునన్= ఉత్సాహంతో; గుఱ్ఱంబులకున్+ఉఱికి= గుఱ్ఱాలపై బడి; బడలుపడన్= శ్రమపడేటట్లుగా; అఱిముఱి+విసరినన్= వేగంగా విసరగా; ఓరవోయిన= మొద్దుబారిన; సురియన్= చిరుకత్తిని; చెరివి= త్రిప్పి; అవలీలన్= సులువుగా; కాలు బలంబులపైన్+పడి= పాదచారులగు భటులపైబడి; చక్కంజేయుచున్= సరిపరచుచూ; మఱియున్= ఇంకను; నానా ప్రకారంబులు+అగు= పెక్కు విధములైన; చిత్రవధ విహారంబులన్= వింతగొలిపే సంహార సంచారములచేత; ఆ+మోహరంబున్= ఆ వ్యూహాన్ని; విఘటిత,విభ్రాంత, పలాయితంబు+కావించి= చీలిపోవునట్లుగా, కలతచెందునట్లుగా, పారిపోయేటట్లుగా, చేసి; అపర+అహ్నంబునన్= మధ్యాహ్నకాలమున; కళింగ పతిన్+కవియు+సమయంబునన్= కళింగరాజును మార్కొన్న వేళలో.

తాత్పర్యం: ఈ రీతిగా శ్రుతాయువు చేయివిసరగా చతురంగబలాలు భీమసేనుడిని చుట్టు ముట్టాయి. అపుడు భీముడు మూపులు ఉబ్బగా తాను పాదచారి అగుటనూ, ఏకాకియైన తీరునూ, ఆలోచించని దర్పంతో విజృంభించి యుద్ధం అనే అటకు పూనుకున్నాడు. అతడు తన చేతి ఖడ్గంతో ఏనుగుల కుంభస్థలాలను పగుల వేశాడు. ఏనుగుల మెదడు కత్తికి అంటుకొని మొద్దుబారగా జెండాల కొయ్యలను నరికి మొద్దుబారిన కత్తికి పదును

బెట్టుకొన్నాడు. రథికులు సారథులతో కూడ రథాలను నాశనం చేశాడు. అట్లా చేయడం వల్ల కత్తి మొక్క పోయింది. మొక్కవోయిన కరవాలాన్ని ఎముకలతో గూడ గుఱ్ఱాల శరీరాలను కోసిపారవైచి తిరిగి వాడి అయ్యేటట్లు చేస్తూ ఉత్సాహంతో గుర్రాలమీదికి ఉరికి అవిబడలుపడేటట్లు అడ్డదిడ్డంగా విసరగా మొద్దుబారిన తనకత్తిని త్రిప్పి అవలీలగా కాల్బలంపైబడి పదును బెట్టుకుంటూ ఇంకా రకరకాల చిత్రవధ విహారాలతో ఆ కౌరవ వ్యూహాన్ని చెల్లాచెదరయేట్లుగా, కలతచెందేటట్లుగా, పారిపోవునట్లుగా చేసి అపరాహ్ణకాలంలో కళింగపతి శ్రుతాయువును మార్కొన్న సమయంలో (తరువాతి పద్యంతో అన్వయం)

విశేషాలు: 1. ఇది భీముడి వీరవిహార వర్ణన.

ఏ యోధుడైనా విరథుడు అయితే - ఇక అతడు నిర్వీర్యుడయినట్లే. కాని భీమసేనుని తీరువేరు. మహాబలవంతుడైన భీమునికి అది తన చేవ- బలం చూపించటానికి ఒక గొప్ప అవకాశం. తాను రథంమీద నిలిచి -విల్లు, అమ్ములు ధరించి- ఎదుటి రథికుడితో యుద్ధం చేయటం కంటె- క్రిందికి దిగి - శత్రువీరుని రథం - సారథితో గుర్రాలతోపాటు విసిరివేయటం - భీమసేనునికి సులువు! రథంమీద విల్లుచేత పట్టిన భీముని కంటె, కత్తి ,డాలు పట్టుకొని పాదచారియైన భీముడు ఎక్కువ బలవంతుడు. 2.చతురంగబలము: రథ-గజ-తురగ-భటులు - రథాలు - ఏనుగులు-గుర్రాలు-పాదచారులైన భటులు నాలుగు అంగాలుగా ప్రాచీనకాలంలో భారతీయ సేనలో విభజింపబడ్డాయి.

తే. వివిధ సన్నాహయుతముగాఁ బవనతనయు । తేరు దగురథ్యములఁ బూన్చి తెచ్చి సూతుఁ
డతనిముందట నిలిపిన నతఁడు వాని । నాదరంబునఁ గనుగొని యరదమెక్కె. 72

ప్రతిపదార్థం: వివిధ+సన్నాహ+యుతముగాన్= పెక్కు పరికరములతో కూడిన;పవనతనయు+తేరు= భీముని రథం; తగు= యోగ్యములైన; రథ్యములన్= గుఱ్ఱాలను; పూన్చి= జతచేసి; తెచ్చి; సూతుఁడు= రథసారథి(భీముని సారథి); అతని ముందటన్= భీముని ఎదురుగా; నిలిపినన్= నిలబెట్టగా; అతడు= ఆ భీముడు; వానిన్= సారథిని; ఆదరంబునన్+కనుఁగొని= గౌరవముతో చూచి; అరదమున్= రథాన్ని; ఎక్కెన్= అధిరోహించాడు.

తాత్పర్యం: భీముని సారథి, క్రొత్తతేరును అన్నిహంగులతో సమకూర్చి, గుర్రాలు పూన్చి తీసికొనివచ్చి అతని ముందట నిలిపాడు. భీముడు సంతోషించి, సగౌరవంగా సారథిని చూచి ఆ తేరు ఎక్కాడు.

ఉ. చాపము వేడ్కఁ బుచ్చికొని సజ్యము సేయునెడం గళింగుఁ డ
ష్టాపద దీప్తపుంఖనవశాతశరంబులు నాట నేసినం
గోపితుఁడై కడంగి బరిగోలలపోటుల నుగ్రవారణా
టోపము పేర్చునట్లుగఁ గడున్ వెస డగ్గఱి భీముఁ డుద్ధతిన్. 73

ప్రతిపదార్థం: చాపమున్= విల్లును; వేడ్కన్= ప్రీతితో; పుచ్చికొని= తీసికొని; సజ్యము+చేయు+ఎడన్= అల్లెత్రాటిని పూన్చే తరుణంలో; కళింగుఁడు= కళింగరాజు; అష్టాపద, దీప్త, పుంఖ, నవ, శాత, శరంబులు= బంగారంవలె మెరిసే ఎనిమిది కొసలుగల క్రొత్త వాడి అమ్ములు; నాటన్+ఏసినన్= భీముడిపై ప్రయోగించగా; కోపితుఁడు+ఐ= భీముడు ఆగ్రహం చెందినవాడై; కడంగి= పూని; బరిగోలల+పోటులన్= అర్ధచంద్రాకారముగల బాణాల ప్రయోగంవల్ల; ఉగ్ర+వారణ+ఆటోపము= మదించిన ఏనుగు విజృంభణ; పేర్చునట్లుగన్= అతిశయించేటట్లుగా; కడున్= మిక్కిలి; వెసన్= శీఘ్రంగా; డగ్గఱి= సమీపించి; ఉద్ధతిన్= గర్వంతో; భీముడు.

తాత్పర్యం: భీముడు ప్రీతితో ధనుస్సు చేత పట్టుకొని, అల్లెత్రాటిని బిగించేటప్పుడు, కళింగరాజు ఎనిమిది పుంఖాలుగల మెరిసేకొంగ్రొత్త బాణాలు ప్రయోగించాడు. భీముడికి కోపం వచ్చింది. అతడు బరిగోలలు ప్రయోగించినపుడు రెచ్చిపోయే ఏనుగువలె విజృంభించాడు. భీముడు అతిశీఘ్రంగా శ్రుతాయువును సమీపించి గర్వంతో (తరువాతి పద్యంతో అన్వయం)

విశేషం: అష్టాపదదీప్త= బంగారుతో దీపించిన; పుంఖ= చివరిభాగాలు కల క్రొత్త వాడిబాణాలు అని కొందరు అర్థం చెప్పారు. 1. బరిగోల= బరి+కోల - ఏనుగులను తోలేటపుడు పొడిచెడి అర్ధచంద్రాకృతిగల అలుగుగల వేణుదండం. 'బరిగోల చేత మదసింధురముం గదలించినట్లు' భారతం - అరణ్య. 1- 283. బరిగోలల పోటునకు రెచ్చిపోయే మత్తేభంవలె భీముడు కోపించి విజృంభించాడు.

ఆ. అయిదు నారసముల నాతనిఁ జదికిలఁ। బడఁగ నేసి మూర్ఛపాలు సేసి
యతని చక్రరక్షు లైన సత్యుని సత్య। దేవుఁ జంపి నభము దివుర నార్చె. 74

ప్రతిపదార్థం: అయిదు+నారసములన్= అయిదుబాణాలతో; ఆతనిన్= కళింగప్రభువు శ్రుతాయువును; చదికిలన్+పడఁగన్= పిర్రలు నేలమీద ఆనేటట్లుగా; ఏసి= బాణాలు ప్రయోగించి; మూర్ఛపాలు+చేసి= స్పృహతప్పేటట్లు చేసి; అతని= కళింగప్రభువుయొక్క; చక్ర+రక్షకులు+ఐన= రథచక్రాలను కాపాడే వారలైన; సత్యునిన్= సత్యుడు అనుపేరు గలవానిని; సత్యదేవున్= సత్యదేవుడు అనే పేరుగలవానిని; చంపి= సంహరించి; నభము= ఆకాశం; తివురన్= మారుమ్రోగేటట్లుగా; ఆర్చెన్= సింహనాదం చేశాడు.

తాత్పర్యం: భీముడు- కళింగభూపతి శ్రుతాయువుపై అయిదు బాణాలు ప్రయోగించి ఆతనిని చతికిలబడవేశాడు. శ్రుతాయువు స్పృహతప్పి రథంపై పడిపోయాడు. భీముడు అతని రథచక్ర రక్షకుడైన సత్యుడిని, సత్యదేవుడిని సంహరించి, ఆకాశం దద్దరిల్లేటట్లుగా సింహనాదం చేశాడు.

వ. అట్లు శ్రుతాయువు మూర్ఛిల్లినం దదీయ సారథి రథంబు దొలంగం దోలికొనిపోయినఁ గర్ణధారుండు లేని యానపాత్రంబునుం బోలెఁ దద్బలంబు దిరుగుడు వడియె నప్పుడు కిమ్మీరవైరి శంఖంబు పూరించిన. 75

ప్రతిపదార్థం: అట్లు= ఆ రీతిగా; శ్రుతాయువు= కళింగప్రభువు; మూర్ఛిల్లినన్= స్పృహకోలుపోగా; తదీయ రథ సారథి= ఆతని తేరు తోలువాడు; రథంబున్= తేరును; తొలంగన్+తోలికొని పోయినన్= రణభూమిని తొలగి బయటికి తీసికొనిపోగా; కర్ణధారుండు= చుక్కాని పట్టువాడు; లేని= లేనట్టి; యానపాత్రంబునున్+పోలెన్= పడవవలె; తద్+బలంబు= ఆతనిసేన(కళింగసైన్యం); తిరుగుడు+పడియెన్= కలత చెందింది; అప్పుడు= ఆ సమయంలో; కిమ్మీర+వైరి= భీముడు; శంఖంబు పూరించినన్= శంఖము నూదగా

తాత్పర్యం: ఆ విధంగా శ్రుతాయువు మూర్ఛపోయాడు. ఆతని రథసారథి రథాన్ని యుద్ధభూమినుండి తరలించి బయటకు తీసికొనివెళ్ళాడు. అప్పుడు చుక్కాని పట్టేవాడు లేని పడవవలె, కళింగసైన్యం సంక్షోభించింది. భీముడు విజయోత్సాహంతో శంఖం పూరించగా - (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: కిమ్మీర వైరి= భీముడు; భీముడు సంహరించిన రాక్షసులలో పేర్కొనదగినవాడు బకాసురుడు. అతడి సహోదరుడే కిమ్మీరుడు, భీముడు, అరణ్యవాస సమయంలో కిమ్మీరుని ఎదుర్కొని అతడిని సంహరించాడు.

క. విని గాంగేయుం డడరినఁ। గని ధృష్టద్యుమ్నుఁడును శిఖండియు నరిభం
జనుఁ డగు సాత్యకియు మరు త్తనయుఁ। గడచి యతనిఁ దాఁకి దర్ప మెలర్పన్. 76

ప్రతిపదార్థం: విని= ఆలకించి (భీముడు శ్రుతాయువును మూర్ఛిల్లచేసినట్లు ఆలకించి); గాంగేయుండు= గంగకొడుకు(భీష్ముడు); అడరినన్(భీముని) మార్కొనిన; కని= చూచి; ధృష్టద్యుమ్నుఁడును= ధృష్టద్యుమ్నుడును; శిఖండియున్= శిఖండియు; అరి+భంజనుఁడు అగు= శత్రువులను సంహరించు; సాత్యకియున్= సాత్యకియును; మరుత్+తనయున్= వాయుసుతుడగు భీమును; కడచి= దాటి; అతనిన్= భీష్ముడిని; దర్పము+ఎలర్పన్= గర్వం అతిశయింపగా; తాఁకి= మార్కొని.

తాత్పర్యం: భీముడు కళింగ భూపతిని మూర్ఛిల్ల చేసిన శంఖారావాన్ని సేనాపతి అయిన భీష్ముడు విన్నాడు. వెంటనే భీముని మార్కొన్నాడు. అంతట ధృష్టద్యుమ్నుడు, శిఖండి, శత్రుభంజనుడయిన సాత్యకి భీమునిదాటి, గర్వోత్సాహంతో భీష్ముని తాకి. (తరువాతి పద్యంతో అన్వయం.)

తే. బెడిదముగ నేయ రథములపిండు మఱియుఁ । గవిసి తోడ్పడ నతఁడు శిఖండి యొకడు
దక్క నందఱ తనువులఁ బెక్కు నిశిత । విశిఖములు నాటి బకరిపు వెగడుపఱిచి . 77

ప్రతిపదార్థం: బెడిదముగన్+ఏయన్= మిక్కుటముగ(బాణాలు) ప్రయోగింపగా; రథముల+పిండు= తేరుల సముదాయం; మఱియున్= ఇంకా; కవిసి= చేరి; తోడ్పడన్= సాయం చేయగా; అతఁడు= భీష్ముడు; శిఖండి+ఒకఁడు+తక్కన్= శిఖండిని ఒకనిని మినహాయించి; అందఱ+తనువులన్= అందరి శరీరాలయందు; పెక్కు= ఎన్నో(అనేక); నిశిత+విశిఖములు= వాడిబాణాలను; నాటి= గ్రుచ్చుకొనేటట్లు చేసి; బక+రిపున్= భీమునిబకాసురుని శత్రువును); వెగడు+పఱిచి= కలచి.

తాత్పర్యం: వారు మిక్కుటంగా బాణాలు ప్రయోగింపగా, రథముల సముదాయం, ఇంకా తనకు సాయం చేయగా, భీష్ముడు శిఖండిపై తప్ప మిగిలినవారందరిపై వాడిబాణాలు ప్రయోగించి, భీముడిని కలత పెట్టాడు.

విశేషం: భీముడు చంపిన రాక్షసవీరులలో పేర్కొనదగినవారు బకుడు, ఏకచక్రపురంలో పాండవులు అజ్ఞాతంలో ఉన్నప్పుడు - సంఘకంటకుడైన బకుని సంహరించి పేరుకెక్కాడు.

వ. అతని యరదంబు గుఱ్ఱంబులం గూల నేసిన నతండు కోపించి. 78

ప్రతిపదార్థం: అతని+అరదంబు గుఱ్ఱంబులన్= అతని తేరుకు కట్టిన అశ్వాలను; కూలన్+ఏసినన్= సంహరింపగా; అతండు= భీముడు; కోపించి.

తాత్పర్యం: భీముడిని కలతచెందించి, అతడి తేరుకు కట్టిన గుర్రాలను సంహరించాడు. భీముడికి కోపం వచ్చి. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. ఘనశక్తి వైవ నది శాం । తనవుఁడు ముత్తునియ సేయ దానం గోపం
బినుమడిగా నుజ్జ్వలగదఁ । గొని యరదము డిగ్గి కవిసె ఘోరాకృతియై. 79

ప్రతిపదార్థం: ఘనశక్తివైవన్= గొప్పశక్తిని ప్రయోగింపగా; అది= దానిని; శాంతనవుఁడు= (శంతనుని కొడుకైన) భీష్ముడు; మూఁడు+తునియలు+చేయన్= మూడు ముక్కలు చేయగా; దానన్= దానివలన; కోపంబు; ఇనుమడిగాన్= రెండురెట్లు కాగా; ఉజ్జ్వల+గదన్+కొని= ప్రకాశించే గదను చేతపట్టుకొని; అరదము+డిగ్గి= రథం దిగి; ఘోర+ఆకృతి+ఐ= భయంకరమైన రూపం కలవాడై; కవిసెన్= మార్కొన్నాడు.

తాత్పర్యం: అప్పుడు భీముడు గొప్ప 'శక్తి' ని భీష్ముడిపై విసరాడు. అయితే ఆ శక్తిని భీష్ముడు మూడు ముక్కలు చేశాడు. దానితో భీముడి కోపం రెండింతలు అయింది. అతడు గదను చేతబూని, రథం దిగి, భయంకరమైన ఆకారంతో, భీష్ముని మార్కొన్నాడు.

విశేషం: 1. విల్లమ్ములు ధరించిన 'ధానుష్కుడు' గా భీముని భూమిక కంటె, గదాధారియైన భీముని భూమిక గొప్పది. 71వ పద్య వ్యాఖ్యాన విశేషాలు అనుశీలించవచ్చు. 2. శక్తి ఆయుధ విశేషం. 53వ పద్య వ్యాఖ్యాన విశేషములు అనుశీలించవచ్చును.

క. తదవసరంబున సాత్యకి । మదమునఁ గౌంతేయుఁ గడచి మంత్రంబున బె
ట్టిదముగఁ బడవైచిన యొ । ప్పిదమున నస్త్రమునఁ గూల్చె భీష్ముని సూతున్. 80

ప్రతిపదార్థం: తద్+అవసరంబునన్= ఆ సమయంలో; సాత్యకి; మదమునన్= గర్వంతో; కౌంతేయున్= కుంతీపుత్రుడైన భీముని; కడచి= దాటి; మంత్రంబునన్= మంత్రముతో; బెట్టిదముగన్= గొప్పగా; పడవైచిన+ఒప్పిదమునన్= పడగొట్టిన సొగసుతో; అస్త్రమునన్= బాణంతో; భీష్ముని సూతున్= భీష్ముని రథసారథిని; కూల్చెన్= సంహరించాడు.

తాత్పర్యం: ఆ సమయంలో సాత్యకి, భీముడినిదాటి, మంత్రప్రయోగంతో గొప్పగా పడగూల్చిన సొగసుతో అస్త్రం ప్రయోగించి భీష్ముని సారధిని కూల్చినాడు.

వ. ఇట్లు సారథి వడుటయు. 81

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; సారథి= భీష్ముడి రథంతోలేవాడు; పడుటయున్= నేలగూలి మరణించగా.

తాత్పర్యం: ఈ రీతిగా భీష్ముడి సారథి హతుడు కాగా.

తే. వాయువేగంబు లైన తద్వాహనములు । భీష్ముతే రెత్తికొని పాఱెఁ బృథివి యద్రువ
నపుడు మనసైనికులు గీచకారి నెదుర । నలికి పాసిన బయలయ్యె నతని మునుము. 82

ప్రతిపదార్థం: వాయువేగంబులు+ఐన= గాలితో సమానమైన వేగం గలవిఐన; తద్+వాహనములు= ఆ గుర్రాలు; భీష్ము+తేరు= భీష్ముడి రథాన్ని; పృథివి+అద్రువన్= భూమి కంపింపగా; ఎత్తికొని+పాఱెన్= తమతో తీసికొని వెళ్ళిపోయాయి; అపుడు; మనసైనికులు; కీచక+అరిన్= భీముడిని, ఎదురన్+అలికి= మార్కొనటానికి భయపడి; పాసినన్= పారిపోగా; అతని మునుము= భీముడి ఎదుటి చోటు; బయలు+అయ్యెన్= శూన్యం అయింది.

తాత్పర్యం: గాలివేగంతో సరియైన వేగంగల భీష్ముని గుర్రాలు, ఆతడి రథాన్ని ఎత్తుకొని పారిపోయాయి. ఆ ధాటికి భూమి అదిరిపోయింది. అపుడు మన సేనలోని భటులు పారిపోయారు. భీముడి పురోభాగం వెలితిపడింది.

విశేషం: అద్రువ అనగా అదరుట అని అర్థం. ఇచ్చట ఒక ఛందో విశేషం - తెలుగులో అపురూపమైనట్టిది ఉన్నది. అద్రువ శబ్దంలోని మూడు అక్షరాలూ లఘువులే. ఇందలి 'ద్రు' సంయుక్తాక్షరం కాదు. దీనికి 'శిథిల ద్విత్వం' అని ఛందస్సులో పేరు. ఉచ్చారణలో 'అద్రువ' 'అ' తేల్చి పలకాలి.

వ. అట్టియెడ ధృష్టద్యుమ్నుండు గారవంబున నమ్మారుతిం దనరథం బెక్కించుకొనియె నంతఁ గృష్ణానుజుండు
దన తేరు సేరం దెచ్చి యా వృకోదరు నుపలక్షించి. 83

ప్రతిపదార్థం: అట్టి+ఎడన్= ఆ తరుణంలో; ధృష్టద్యుమ్నుండు; గారవంబునన్= ప్రేమతో కూడిన ఆదరణతో; ఆ+మారుతిన్= వాయుదేవుని కొడుకైన ఆ భీముని; తన+రథంబు= తనతేరిని; ఎక్కించుకొనియెన్; అంతన్= అటుపిమ్మట; కృష్ణ+అనుజుండు= శ్రీకృష్ణుని తమ్ముడైన సాత్యకి; తన+తేరు= తన రథం; చేరన్+తెచ్చి= (భీముడి) దగ్గరకు చేరేటట్లు చేసి; ఆ+వృకోదరున్+ఉపలక్షించి= ఆ భీముని మన్నించే దృష్టితో చూచి.

తాత్పర్యం: భీముడి వీరవిహారం, భీష్ముడి పరాజయం పాండవుల సేనాని యైన ధృష్టద్యుమ్నుడికి సంతోషం కలిగించాయి. ఆ క్షణంలో కౌరవసేనాపతి భీష్ముడు యుద్ధభూమిలో లేడు. ధృష్టద్యుమ్నుడు భీముడిని తన రథంమీదికి ఎక్కించుకున్నాడు. సాత్యకి కూడా కొంతవరకు భీష్ముని తాత్కాలిక పరాజయానికి కారకుడు. అతడు తన రథాన్ని ధృష్టద్యుమ్నుడు, భీముడు కలిసి ఉన్న రథం దగ్గరకు చేర్చి, భీముడిని చూచి. (తరువాతి పద్యంతో అన్వయం.)

ఆ. ' ఒంటిమైఁ గళింగు నురవడిఁ దలపడి । పుత్రసోదరాప్త భూరిసైన్య
హీనుఁ జేసి కౌరవానీకములు సూడ । నుఱక భంగపెట్టి పఱపు టొప్పె.' 84

ప్రతిపదార్థం: ఒంటిమైన్= ఒంటరిగా; కళింగున్= కళింగరాజును; ఉరవడిన్+తలపడి= అతివేగంగా మార్కొని; పుత్రసోదర+ఆప్త భూరి సైన్యహీనున్+చేసి= కొడుకులు, తమ్ములు; దగ్గర బంధువులు, పెద్దసేనలు లేనివానిని చేసి; కౌరవ+అనీకములు= కౌరవుల సేనలు చూడన్= చూస్తూ ఉండగా; ఉఱుక= సులువుగా; భంగపెట్టి; పఱపుట+ఒప్పెన్= అవమానపరచి తరమడం జరిగింది.

తాత్పర్యం: సాత్యకి భీముడిని ఈ విధంగా అభినందించాడు. 'ఓ భీమసేనా! నీవు ఎంతో గొప్ప కార్యం నెరవేర్చావు. ఏకాకివై పోరాడి, కళింగ ప్రభువు శ్రుతాయువును జయించి అవమానించి తరమగలిగావు. అతడి తమ్ముడిని, పుత్రుడిని, ఆప్తులను కౌరవసేనలు చూస్తూ ఉండగా సంహరించావు.

వ. అని యగ్గించె నంతఁ గడంగి వచ్చు శల్యకృపాశ్వత్థామలం గని పార్షతుండు దనయరదంబున నున్న భీమసేనుని సవినయంబుగా డించి 'నీవు నన్ను వెన్ను దన్ని చూడు' మని పలికి యద్దెసం దేరు వఱపి యశ్వత్థామరథ్యంబులం బదిబాణంబులం బడ నేసిన నతండు శల్యుని రథంబుపైకిం బోయి పాంచాలపతి సూనుమేన నిశితాస్త్రంబులు నినిచెఁ దక్కటి యిరువురు నట్ల చేసి రివ్విధంబున నమ్మువ్వురచేత నతం డొక్కరుండును బొదువం బడియుంట దవ్వులంజూచి విజయనందనుండు నిజ స్యందనంబు దోలికొని వచ్చి కృపాశ్వత్థామలం దొమ్మిదేసి యమ్ముల నొప్పించి మద్రపతి యంగమునఁ బంచవింశతి విశిఖంబులు నాటించె వారును నతనిఁ బండ్రెండు శరంబు లేసి రా సమయంబున భవదీయపౌత్త్రుం డగులక్ష్మణకుమారుం డయ్యభిమన్యుం దలపడి మర్మభేదులయిన నారాచమ్ముల నొప్పించిన నతం డక్కుమారుఁ బంచాశత్సాయకంబులం గప్పి తన హస్తలాఘవంబు ప్రకటించిన. 85

ప్రతిపదార్థం: అని+అగ్గించెన్= అని ప్రస్తుతించాడు; అంతన్= అటుపిదప; కడంగివచ్చు= మార్కొనటానికి పూనివచ్చే; శల్య+కృప+అశ్వత్థామలన్+కని= శల్యుడిని; కృపుడిని; అశ్వత్థామను చూచి; పార్షతుండు= ధృష్టద్యుమ్నుడు; తన+అరదంబునన్+ఉన్న= తన రథంమీద ఉన్న; భీమసేనుని; సవినయంబుగాన్= మన్ననతో; డించి= దించి; నీవు+నన్నున్; వెన్ను+తన్ని+చూడుము= వెనుకతట్టుగా నిలిచి వీక్షించుము; అని+పలికి; ఆ+దెసన్= ఆ వైపుగా; తేరు= రథం; పఱపి= నడిపించి;అశ్వత్థామ+రథ్యంబులన్= అశ్వత్థామ రథానికి పూన్చిన గుఱ్ఱాలను; పదిబాణంబులన్= పది అమ్ములతో; పడన్+ఏసినన్= కూల్చగా; అతండు= ఆ అశ్వత్థామ; శల్యుని+రథంబు+పైకిన్+పోయి= శల్యుని తేరుపైకి ఎక్కి; పాంచాలపతి సూను+మేనన్= పాంచాల రాజపుత్రుడైన ధృష్టద్యుమ్నుని శరీరంపై; నిశిత+అస్త్రంబులు= వాడి బాణాలు; నినిచెన్= నిండించాడు; తక్కటి= మిగిలిన; ఇరువురును= ఇద్దరును(కృపుడు, శల్యుడు); అట్ల+చేసిరి= ఆ విధంగానే చేశారు; (అనగా బాణాలు ప్రయోగించారు); ఈ+విధంబునన్= ఈవిధంగా; ఆ+మువ్వురచేతన్= ముగ్గురిచేత; అతండు= ధృష్టద్యుమ్నుడు; ఒక్కరుండును= ఒక్కడే; పొదువంబడియుంట= మార్కొనబడి ఉండటం; దవ్వులన్+చూచి= దూరమునుండి వీక్షించి; విజయనందనుండు= అర్జునుడి కొడుకు - అభిమన్యుడు; నిజ+స్యందనంబు= తన రథాన్ని; తోలికొనివచ్చి= తోడ్కొని అరుదెంచి; కృప+అశ్వత్థామలన్= కృపుడిని, అశ్వత్థామను; తొమ్మిది+ఏసి అమ్ములన్=

తొమ్మిదిబాణాల చొప్పున; నొప్పించి= ప్రయోగించి బాధించి; మద్రపతి+అంగమునన్= శల్యుని దేహమునందు; పంచవింశతి విశిఖంబులు= ఇరువది ఐదు బాణాలు; నాటించెన్= గ్రుచ్చుకొనేటట్లు చేశాడు; వారును= కృపుడూ అశ్వత్థామా; అతనిన్= అభిమన్యుడిపై; పండ్రెండు+శరంబులు+ఏసిరి= పన్నెండు అమ్ములు వేశారు; ఆ సమయంబునన్; భవదీయ+పౌత్రుండు+అగు= నీ మనుమడైన; లక్ష్మణ+కుమారుండు= లక్ష్మణకుమారుడు అను పేరుగలవాడు; ఆ+అభిమన్యున్+తలపడి= ఆ అభిమన్యుడిని ఎదుర్కొని; మర్మభేదులు+అయిన+నారాచంబులన్= ఆయువుపట్టులు చీల్చే బాణాలతో; నొప్పించినన్= బాధించగా; అతండు= అభిమన్యుడు; ఆ+కుమారున్= ఆ లక్ష్మణకుమారుని; పంచాశత్+సాయకంబులన్= ఏబదిబాణాలతో; కప్పి; తన+హస్త+లాఘవంబున్= తన చేతి చొరవను; ప్రకటించినన్= వెల్లడిచేయగా.

తాత్పర్యం: సాత్యకి భీముడిని ప్రశంసించాడు. ఇంతలో శల్యుడు, కృపుడు, అశ్వత్థామ మార్కొనటానికి వచ్చారు. అదిచూచి ధృష్టద్యుమ్నుడు తన రథంమీద ఉన్న భీముడిని సగౌరవంగా క్రిందికి దించాడు. అతడితో 'నీవు వెనుక నిలిచి చూస్తూ ఉండుమని' చెప్పాడు. వెంటనే ధృష్టద్యుమ్నుడు వారలవైపు రథం మళ్ళించి, అశ్వత్థామ రథానికి పూన్చిన గుర్రాలను పది బాణాలతో కూల్చాడు. అతడు శల్యుడి తేరునెక్కి, ధృష్టద్యుమ్నుడి శరీరంపై వాడి బాణాలు ప్రయోగించాడు. శల్యుడు, కృపుడు అట్లే బాణాలు గుప్పించారు.

ఈ విధంగా ధృష్టద్యుమ్నుడు ఒక్కడూ ముగ్గురు వీరులతో పోరాడటం దూరం నుంచి చూచి, అభిమన్యుడు తన రథాన్ని తోలుకొని వచ్చి, కృపుడిపై, అశ్వత్థామపై తొమ్మిదేసి అమ్ములు గుప్పినొప్పించారు. శల్యుడి శరీరంపై ఇరువది ఐదు బాణాలు నాటించాడు. వారు కూడ అభిమన్యునిపై పన్నెండు బాణాలు ప్రయోగించారు. ఆ సమయంలో నీ మనుమడు లక్ష్మణ కుమారుడు వచ్చి అభిమన్యుడిని మార్కొని, ఆయువుపట్టులు భేదించే బాణాలు అతడిపై గుప్పించినొప్పించాడు. అభిమన్యుడు - ఏభై అమ్ములు అతనిపై ప్రయోగించి తన చేతి ఒడుపును ప్రకటించాడు.

తే. లస్తకంబున కొలఁదికి లక్ష్మణుండు । వెడఁదయమ్మున నభిమన్యువిల్లు దునియ
నేసి యార్చినఁ గౌరవు లెల్ల నార్వ । నతఁడు వేఱొకబలువింట నతని నొంచె. 86

ప్రతిపదార్థం: లస్తకంబున కొలఁదికి= విల్లు మధ్యభాగాన్ని పిడికిలితో గట్టిగా పట్టుకొని అల్లెత్రాటిని లాగి; లక్ష్మణుండు= లక్ష్మణ కుమారుడు; వెడఁద+అమ్మునన్= నిడివిగల బాణంతో; అభిమన్యు+విల్లు= అభిమన్యుని ధనుస్సు; తునియన్+ఏసి= ఖండించి; ఆర్చినన్= సింహనాదం చేయగా; కౌరవులు+ఎల్లన్+ఆర్వన్= కౌరవులందరు గూడ సింహనాదాలు చేయగా; అతఁడు= అభిమన్యుడు; వేఱు+ఒక= ఇంకొక; బలువింటన్= బలమైన ధనుస్సుతో; అతనిన్= ఆ లక్ష్మణకుమారుని; నొంచెన్= నొప్పించాడు.

తాత్పర్యం: లక్ష్మణకుమారుడు వెడల్పయిన బాణంతో అభిమన్యుడి వింటిని లస్తకము వద్ద తునిగేటట్లుచేసి - సింహనాదం చేశాడు. కౌరవులందరూ గూడ సింహనాదాలు చేశారు. అభిమన్యుడు వేరొక గట్టి వింటితో లక్ష్మణకుమారుని నొప్పించారు.

విశేషం: శత్రువీరుని విల్లు ఖండించడం ఘనకార్యంగా అందరూ భావించేవారు.

క. తనయుఁడు నొచ్చిన దుర్యో । ధనుఁ డర్జునతనయుమీఁదఁ దనతే రలుకం
జన నిచ్చుట గనుఁగొని శాం । తనవద్రోణముఖ రథికతతి వెసఁ గవిసెన్. 87

ప్రతిపదార్థం: తనయుఁడు= కొడుకు; నొచ్చినన్= దెబ్బతినటంచేత; దుర్యోధనుఁడు= దుర్యోధనుడు(లక్ష్మణుడితండ్రి); అర్జున+తనయుమీఁదన్= అభిమన్యునిపై; అలుకన్= కోపంతో; తన+తేరు= తన రథాన్ని; చననిచ్చుట= వెళ్ళేటట్లు చేయటం;

కనుఁగొని= చూచి; శాంతనవ ద్రోణ ముఖ రథిక తతి= భీష్ముడు, ద్రోణుడు, మున్నగు రథికుల సమూహం; వెసన్= శీఘ్రముగా; కవిసెన్= మార్కొనెను.

తాత్పర్యం: తన కొడుకు నొచ్చిన సంగతి తెలిసికొని తండ్రియైన దుర్యోధనుడు అర్జునుని కుమారుడైన అభిమన్యునిపైకి తన రథాన్ని తరలించాడు. దానిని చూచి, భీష్ముడు, ద్రోణుడు మున్నగు వీరులందరూ శీఘ్రంగా అభిమన్యుని మార్కొన్నారు.

క. అతిముఱి నడరిన రథికుల । తఱచునకు సుభద్ర కొడుకు దలఁకక తా నం
దఱ కన్నిరూపులై యే । డ్తెఱ నవ్వుచు నేటులాడె ధీరత మెఱయన్. 88

ప్రతిపదార్థం: అతిముటిన్+అడరిన= వేగంగా విజృంభించిన; రథికుల+తఱచునకున్= రథికుల సమూహానికి; సుభద్రకొడుకు= అభిమన్యుడు; తలఁకక= జంకక; తాన్= తాను; అందఱకున్= అందరకు; అన్ని+రూపులు+ఐ= అన్ని ఆకారాలుగా అయి; ఏడ్తెఱన్+నవ్వుచున్= విజృంభణతో నవ్వుతూ; ధీరత+మెఱయన్= ధైర్యం వెలుగొందగా; ఏటులాడెన్= పోరాడాడు.

తాత్పర్యం: వీరాధివీరులు అందరూ చేరి గుంపుగా వచ్చి తన పైబడినప్పటికీ - అభిమన్యుడు ధైర్యంతో వారినందరినీ మార్కొని నవ్వుతూ పోరాటం కొనసాగించాడు.

వ. తదవసరంబున. 89

ప్రతిపదార్థం: తద్+అవసరంబునన్= ఆ సమయంలో.

తాత్పర్యం: ఆ సమయంలో.

మ. కని తే రుప్పరవీదిఁ దోలుకొని యాకౌరవ్యసైన్యంబు న
జ్జననాథుం దటినీతనూజు గురుఁ జంచద్బాణ వర్షంబులన్
మునుఁగం జేయుచు దేవదత్త మెలమిన్ మ్రోయించుచున్ సంగరా
వని యల్లాడ వియచ్చరుల్ వొగడ వివ్వచ్చుండు వచ్చెన్ వడిన్. 90

ప్రతిపదార్థం: కని= చూచి; తేరు= రథము; ఉప్పర+వీదిన్= ఆకాశమార్గాన; తోలుకొని= నడిపి; ఆ+కౌరవ్య+సైన్యంబున్= ఆ కౌరవసేనను; ఆ+జననాథున్= ఆ రాజునూ(దుర్యోధనుని); తటినీ+తనూజున్= నదీసూనునీ(భీష్ముని); గురున్= ద్రోణాచార్యుని; చంచత్+బాణ+వర్షంబులన్= చలించే అమ్ములవానలో; మునుఁగన్+చేయుచున్= మునిగేటట్లు చేస్తూ; దేవదత్తము= దేవదత్తం అనే పేరుగల శంఖాన్ని; ఎలమిన్= సంతోషంతో; మ్రోయించుచున్= పూరిస్తూ; సంగర+అవని= రణరంగం; అల్లాడన్= కంపింపగా; వియత్+చరుల్= ఆకాశసంచారులు; పొగడన్= ప్రస్తుతించగా; వడిన్= వేగంగా; వివ్వచ్చుండు= అర్జునుడు; వచ్చెన్= అరుదెంచాడు.

తాత్పర్యం: అభిమన్యుని అనేకవీరులు చుట్టుముట్టడం చూచి, తండ్రియైన అర్జునుడు తన రథాన్ని ఆకాశవీథిలో తోలించుకొని రణరంగానికి వచ్చాడు. వస్తూ వస్తూ కౌరవ సైన్యంపై, దుర్యోధనునిపై, సేనాపతి భీష్ముడిపై పలుమారులు బాణవర్షం కురిపించాడు. దేవదత్త శంఖం పూరించాడు. ఆతని ధాటికి రణరంగం కంపించింది. ఆకాశసంచారులు అతనిని కీర్తించసాగారు.

విశేషం: 1. భావాన్ని బట్టి భాషను సంఘటిస్తాడు తిక్కన. 2. అట్లే భావానుగుణంగా ఛందస్సును కూడా ఎన్నుకుంటాడు మహాకవి తిక్కన. ఇక్కడ మత్తేభంలో అర్జునుని రణరంగప్రవేశం వర్ణించటం ఉదాహరణప్రాయం.

వ. అంతయుఁ గనుంగొని యుధిష్ఠిరుండు గడంగి సేనలకెల్లను జేయివీచిన నొక్కపెట్ట యురవడించి కురుసైన్యంబు దలంకం దలపడియె నప్ప డాదిత్యుం గప్పి ధరణీరేణువులు చీఁకట్లు గవియింపం గరితురగనరగాత్ర గళితరుధిరధారాసారం బది యడంగునట్లు సేసె నంత నర్జును వివిధ బాణపాతంబులఁ గౌరవానీకంబునం దునియ లైన శరాసనశరకరవాలపరిఘపరశ్వధాదులును బఱియ లయిన హరిశిరఃకుంభికుంభపదాతికపాలప్రభృతులును దుమురు లైన రథాంగధ్వజచ్ఛత్రచామర ప్రముఖంబులుం గలిగి కయ్యంపునేల కరంబు ఘోరం బయ్యె నట్టియెడఁ దమమీఁది మానుసులు వడినం జెడి తిరిగెడు హయగజస్యందనంబులును దురంగమాతంగస్యందనంబులు రూపఱిన నేపఱి మెలంగునయ్యె యారోహకులును నై యాకులతం బొంది మనబలంబు దెరలి మరల వెఱచఱచి కనుకనిం బఱచినం గృష్ణార్జునులు పాంచజన్యదేవదత్తంబులు పూరించిన మందాకినీనందనుండు గుంభసంభవున కిట్లనియె. 91

ప్రతిపదార్థం: అంతయున్= సమస్తం; కనుంగొని= చూచి; యుధిష్ఠిరుండు= ధర్మరాజు; కడంగి= పూని; సేనలకున్+ఎల్లను= సైన్యాలకు అన్నిటికీ; చేయి+వీచినన్= చేతిని ఇటునటుకదల్చగా= ప్రోత్సహించగా; ఒక్క+పెట్ట= ఒక్కసారిగా; ఉరవడించి= అతిశయించి; కురు+సైన్యంబు= కౌరవసేన; తలంకన్+తలపడియెన్= చలింపగా మార్కొన్నవి (పాండవసేనలు); అప్పుడు; ఆదిత్యున్+కప్పి= సూర్యుని మరుగుపరచి; ధరణీ రేణువులు= భూమినుండి చెలరేగిన ధూళికణాలు; చీఁకట్లు+కవియింపన్= అంధకారం వ్యాపింపచేయగా; కరి, తురగ, నర, గాత్ర, గళిత, రుధిర, ధారా, ఆసారంబు= ఏనుగులు -గుర్రాలు, మనుజుల కళేబరాల నుండి జారిన నెత్తుటి చాళ్ళ జడివాన అది= ఆ ధూళిని; అడంగు+అట్లు= సమసిపోయేటట్లుగా; చేసెన్; అంతన్= పిదప; అర్జును, వివిధ, బాణ, పాతంబులన్= అర్జునుని యొక్క పెక్కు అమ్ముల ప్రయోగం వల్ల; కౌరవ+అనీకంబునన్= కౌరవులసేనలో; తునియలు+ఐన= ముక్కలు అయిన; శరాసన, శర, కరవాల, పరిఘ, పరశ్వధ, ఆదులును= ధనువులు, బాణాలు, కత్తులు,ఇనుపగుదియలు, గండ్రగొడ్డళ్ళూ మొదలైనవి; పటియలు+ఐన= ముక్కలు అయిన; హరి శిరస్+కుంభి కుంభ పదాతి కపాల, ప్రభృతులును= గుర్రాల తలలు, ఏనుగుల తలలు కాల్బలముల పుర్రెలు, మొదలయినవి; తుమురులు+ఐన= చిన్న చిన్న ముక్కలు అయిన; రథాంగ ధ్వజ చత్ర చామర ప్రముఖంబులున్= రథచక్రాలు, జెండాలు, ఛత్రాలు, చామరలు మున్నగునవి; కలిగి= ఉండి; కయ్యంపునేల= రణరంగం; ఘోరంబు+అయ్యెన్= భయంకరంగా కనిపించింది; అట్టి+ఎడన్= ఆ సమయంలో; తమ+మీఁది+మానుసులు= తమపై ఎక్కిన మనుష్యులు; పడినన్= కూలగా; చెడి= పాడయి; తిరిగెడు= సంచరించునట్టి; హయ, గజ, స్యందనంబులును= గుర్రాలు, ఏనుగులు, రథాలున్నూ; తురంగ మాతంగ స్యందనంబులు= గుర్రాలు, ఏనుగులు, రథాలు; రూపు+అఱినన్= నశించగా; ఏపు+అఱి= అతిశయం నశించి; మెలంగు= తిరుగాడు; అయ్యె= ఆయా; ఆరోహకులును= ఎక్కినవారు; ఐ= అయి; ఆకులతన్+పొంది= కలతచెంది; మన+బలంబు= మన సైన్యం; తెరలి= కలతచెంది; మరలన్= ఇంకను; వెఱచఱచి= భయపడి; కనుకనిన్+పఱిచినన్= సంభ్రమంతో పరుగెత్తగా; కృష్ణ+అర్జునులు= కృష్ణుడును, అర్జునుడును; పాంచజన్య+దేవదత్తంబులు= పాంచజన్యం, దేవదత్తం అనే శంఖాలు; పూరించినన్= ఒత్తగా; మందాకినీ నందనుండు= భీష్ముడు; కుంభసంభవునకున్= ద్రోణునితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: ధర్మరాజు చేయెత్తి తనసేనలను పురికొల్పాడు. పాండవసేనలు ఒక్కపెట్టున ఉత్సాహంతో విజృంభించి కౌరవ సేనలను మార్కొన్నాయి. అప్పుడు నేలమీది నుండి రేగిన దుమ్ము సూర్యబింబాన్ని కప్పివేసింది. చీకట్లు క్రమ్మినట్లయింది. అయితే-చనిపోయిన ఏనుగులు, గుర్రాలు, భటుల దేహాలనుండి స్రవించిన నెత్తుటి ధారలవలన, ఆ దుమ్ము అణగిపోయింది. తరువాత, అర్జునుడు ప్రయోగించిన బాణ పరంపరల వలన కౌరవసేనలో ఖండఖండాలు అయిన విల్లులు, అమ్ములు, కత్తులు, ఇనుపగుదియలు, గండ్రగొడ్డళ్ళు - మరియు ముక్కచెక్కలయిన గుర్రాల తలలు, ఏనుగుల కుంభస్థలాలు, కాలిభటుల పుర్రెలు, దట్టంగాపడిపోయిన చక్రాలు, జెండాలు, గొడుగులు, చామరాలు మున్నగు వాటితో రణరంగం భయంకరంగా కన్పించింది.

ఆ సమయంలో, తమమీది మనుష్యులు కూలిపోవటంతో చెడి తిరిగే గుర్రాలు, ఏనుగులు, రథాలు - గుర్రాలు, ఏనుగులు, రథాలు చెడిపోతే, దీనులై తిరిగే ఆరోహకులు కలిగి మనసేన భీతితో వెనుకంజ వేసి పారిపోవటం చూచి, కృష్ణుడు, అర్జునుడు విజయగర్వంతో తమ శంఖాలు పాంచజన్యం, దేవదత్తం పూరించారు. అప్పుడు, భీష్ముడు కౌరవసేన దుఃస్థితి గమనించి ద్రోణుడితో ఈ విధంగా చెప్పాడు.

విశేషం: శ్రీకృష్ణుడి శంఖంపేరు పాంచజన్యం. అర్జునుడి శంఖంపేరు దేవదత్తం. వీరులు యుద్ధం చేసేది విల్లు అమ్ములు గదలు మొదలైన ఆయుధాలలో అయినప్పటికీ, శంఖాలు, తప్పెట్లు, భేరులు మొదలైన వాద్యాలు- యుద్ధంలోని ఉత్సాహానికి భారమితులుగా గోచరించేవి. వివిధ వాద్య విశేషాలు పరాక్రమ ప్రతీకలై శౌర్యసంరంభానికి దోహదం కల్పించేవి.

తే. ' కృష్ణసారథ్యమున నొప్పుక్రీడి యిపుడు । కౌరవానీకముల నెల్లఁ గసిమసంగి
కృష్ణసారథ్యమున నొప్పుక్రీడి యైన । నెట్లు సేయంగవలయుఁ దానట్లు సేసె. 92

ప్రతిపదార్థం: కృష్ణ+సారథ్యమునన్= శ్రీకృష్ణుడు తన రథాన్ని నడుపుతున్నప్పుడు, ఒప్పు= శోభిల్లు; క్రీడి= అర్జునుడు; ఇపుడు= ఈ సమయంలో; కౌరవ+అనీకములన్+ఎల్లన్= కౌరవసేనలను అన్నింటినీ; కసిమసంగి= సంహరించి; కృష్ణ+సారథ్యమునన్= శ్రీకృష్ణుని నాయకత్వంలో; ఒప్పు= శోభిల్లు; క్రీడి= క్రీడించునట్టివాడు; అయినన్= అయినప్పుడు; ఎట్లు= ఏ రీతిగా; చేయంగవలయున్= చేయాలో; తాను= అర్జునుడు; అట్లు= అదేరీతిగా; చేసెన్= చేశాడు.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు తన రథానికి సారథియై యుండగా, అర్జునుడు కౌరవసేనలను సంహరించాడు. ఆనాడు- రథం నడపటంలో శ్రీకృష్ణుని మించిన నేర్పుగల సారథి లేడని ప్రసిద్ధి. అంతగొప్ప సారథి లభించటంచేత రథికుడుగా రాణించి అర్జునుడు కౌరవసేనలను చీల్చి చెండాడగలిగాడు. అంతేగాక - శ్రీకృష్ణుని నాయకత్వంలో రథిక వీరుడైన అర్జునుడు గొప్ప ఆటగాడుగా మారిపోయి - ఘోర యుద్ధభూమిని క్రీడారంగంగా చేసికొని వీరవినోద విహారం చేశాడు.

విశేషం: 1. ఈ పద్యంలో మొదటి రెండు పాదాలలో క్రీడి= అర్జునుడు రథికుడు. మూడు నాలుగు పాదాలలో అర్జునుడు= క్రీడి. పద్య పూర్వార్ధంలో కృష్ణుడు - అర్జున విధేయుడు. ఉత్తరార్ధంలో అర్జునుడు శ్రీకృష్ణ విధేయుడు. ఈ మాటలు అన్నది ఎవరు? భీష్ముడు. భీష్ముడి దృష్టిలో శ్రీకృష్ణుడు జగన్నాటక సూత్రధారి. సాక్షాత్తు పరమాత్మ, అవతారమూర్తి. ఆనాడు జగదేక ధనుర్ధరుడుగా ప్రసిద్ధికెక్కిన తాను కౌరవసేనాపతి యైనప్పటికీ - అర్జునుడు తాను చూస్తూ ఉండగనే కౌరవసేనలను చీల్చి చెండాడగలిగాడు. భీష్ముని దృష్టిలో - అర్జునుడికి ఆ శక్తి సామర్థ్యాలు కలగటానికి కారణం శ్రీకృష్ణ సారథ్యం.

2. శ్రీకృష్ణుడు ఆదర్శకర్మయోగి. అతని దృష్టిలో - నీచకర్మ లేనేలేదు. ఉదాహరణకు ఆతడు సారథి భూమికను ధరించేవాడు. గుర్రాలకు దాణా వేసేవాడు. వాటికి స్నానం చేయించేవాడు. రాజసూయయాగ సూత్రధారి శ్రీకృష్ణుడు. జరాసంధ కథకు హేతువు భీముని శక్తికంటె శ్రీకృష్ణుని యుక్తియే ఎక్కువ కారణం అని చెప్పవచ్చు. రాజసూయయాగంలో అతిథులు భోజనం ముగించిన పిమ్మట శ్రీకృష్ణుడు ఎంగిలి విస్తళ్ళు ఎత్తినట్లు జనశ్రుతిలో ప్రచారంలో ఉన్న జానపద గాథ.

క. వినుమలుక పొడమి మిక్కిలి । కనుదెఱచిన త్రిపురవైరి కైవడి యీ య
ర్జునునందుఁ దోఁచుచున్నది । మనమొనలున్ వశముగావు మరలుపు మింకన్. 93

ప్రతిపదార్థం: వినుము= ఆలకింపుము; అలుక+పొడమి= కోపంవచ్చి; మిక్కిలి+కను+తెఱచిన= అధికమైన కన్ను అనగా మూడవకన్ను విప్పిన; త్రిపుర+వైరి+కైవడి= పరమశివుడి రీతి; ఈ+అర్జును+అందున్= ఈ అర్జునుడిలో; తోఁచుచున్నది= కనపడుతున్నది; మన+మొనలున్= మన సేనలు; వశము+కావు= మన అధీనంలో లేవు; ఇంకన్+ఇకమీద; మరలుపుము= (పారిపోయే) సేనలను మళ్ళించునది.

తాత్పర్యం: అర్జునుడినిచూస్తే, అతడు మూడవకన్ను విప్పిన పరమ శివుడుగా కనిపించుతున్నాడు. మన సేనలు మన అధీనంలో లేవు. పారిపోయే సేనలను మళ్ళించుము.

విశేషం: 1. త్రిపుర+వైరి= శివుడు -'త్రిపుర'ములు నాశనం చేసినట్లు పురాణకథనం. కొందరు పండితులు 'త్రిపురములు' హరప్పా నాగరికతకు చెందినవనీ, ఆర్యుల దేవుడు శివుడు వాటిని నాశనం చేశాడనీ, ఆర్యులు గ్రామీణ నాగరికతకు చెందినవారనీ ఒకవాదం లేవదీశారు. ఈవాదంలోని సత్యాసత్యాలు భావి పరిశోధనల వలన తేలవలసినట్టివే. 2. శివుడు ఫాలనేత్రుడనీ - ఆతని మూడవ కన్ను ప్రళయాగ్ని సదృశమనీ పురాణకథనం.

వ. పోక నిలిచిన బలు మానుసులుం బెద్దయు డస్సి యోహటించినయట్లున్నవారు వారిజ మిత్రుండు నపరగిరిశిఖరంబునకుం జేరె' నేఁటికిఁ గయ్యంబు సాలింత మని చెప్పి యతం డియ్యకొన నెల్లవారలం దివియ నియమించి నడపించె నప్పుడు పాండవులు పాంచాల మాత్స్యాది పరివార సహితంబుగా నార్పులు సెలంగి నింగి ముట్ట మరలి రిట్లు రెండవనాఁటి సంధ్యాసమయంబున రెండుదెఱంగులవారును దమతమ శిబిరంబులకుం జనిరి; మఱునాఁడు. 94

ప్రతిపదార్థం: పోక+నిలిచినన్= పారిపోకుండా నిలువగా; బలుమానుసులు= గొప్ప భటులు; పెద్దయున్= మిక్కుటముగా; డస్సి+ఓహటించిన+అట్లు+ఉన్నవారు= బడలి వేసారినట్లు కన్పించుతున్నారు; వారిజమిత్రుండు= పద్మమిత్రుడు, సూర్యుడు; అపర గిరి శిఖరంబునకున్= పడమటికొండ కొసకు; చేరెన్; నేఁటికిన్= ఈరోజుకు; కయ్యంబు+చాలింతము= యుద్ధం విరమించుదాము; అని+చెప్పి; అతండు= ద్రోణుడు; ఇయ్యకొనన్= అంగీకరించగా; ఎల్లవారలన్= అందరినీ; తివియన్+నియమించి= మరలుటకు ఆజ్ఞాపించి; నడపించెన్= సైన్యమును నడపించాడు; అప్పుడు= ఆ సమయంలో; పాండవులు; పాంచాల మాత్స్య+ఆది+పరివార, సహితంబుగాన్= పాంచాలురు, మత్స్యదేశానికి సంబంధించినవారు మున్నగు అనుచరులతో పాటు; ఆర్పులు+చెలంగి+నింగి+ముట్టన్= సింహనాదాలు మ్రోగి ఆకాశం అంటగా; మరలిరి= తమతమ నివాసాలకు వెనుదిరిగి వెళ్ళారు; ఇట్లు= ఈ విధంగా; రెండవనాఁటి= రెండవరోజు; సంధ్యా+సమయంబున్= సంజవేళ(సూర్యాస్తమయ సమయం పిమ్మట); రెండు+తెఱంగుల వారును= రెండు పక్షాలవారును, కౌరవ పాండవసేనలలోని వారలు; తమ తమ శిబిరంబులకున్= తమ తమ స్కంధావారాలకు, తాము విడిదిచేసిన చోట్లకు; చనిరి= వెళ్ళారు; మఱునాఁడు= ఆపై దినమున.

తాత్పర్యం: "పారిపోకుండా రణరంగంలో నిలిచిన పోటరులైన భటులుకూడా, బడలి వేసారి ఉన్నారు. సూర్యుడు అస్తమించుతున్నాడు. నేడు ఇంక యుద్ధం ఆపటం మంచిది' అని భీష్ముడు చెప్పాడు. ద్రోణుడు అతని మాటకు అంగీకరించాడు. అప్పుడు భీష్ముడు అందరినీ యుద్ధభూమి నుండి నిష్క్రమించమని ఆజ్ఞాపించి కౌరవసేనలను మరలించాడు. పాండవులు పాంచాల సేనలు, మత్స్యసేనలు మున్నగు అనుచరులతోపాటు సింహనాదాలు చెలరేగి ఆకాశం అంటుతుండగా తమ తమ శిబిరాలకు తరలివెళ్ళారు. ఇది రెండవనాటి సాయంకాలం జరిగిన యుద్ధంతీరు. మరునాడు. (తరువాతి పద్యంతో అన్వయం.)

భీష్ముని తృతీయ దివస యుద్ధము (సం. 6-52-1)

క. రేపకడ రభసమున గం । గాపుత్రుఁడు సేనఁ గూర్చి గరుడవ్యూహం
బేపారఁ దీర్చికొని ము । క్కై పాలుపును బలుపు మెఱయునట్లుగ నిలిచెన్. 95

ప్రతిపదార్థం: రేప+కడ= ప్రొద్దుపొడుపు వేళ; రభసమునన్= తొందరగా; గంగా పుత్రుడు= భీష్ముడు; సేనన్+కూర్చి= సేనను ప్రోగుచేసి; గరుడ వ్యూహంబు+ఏపారన్= గరుడాకారంగా ఉండే వ్యూహాన్ని అతిశయించేటట్లు; తీర్చికొని= తీర్చిదిద్ది; ముక్కు+ఐ=

తాను ఆ గరుడ వ్యూహానికి "ముక్కు" స్థానంలో నిలిచి; పాలుపును+బలుపు+మెఱయు+అట్లుగన్= అందమూ బలమూ ప్రకటమగునట్లుగా; నిలిచెన్= నిలబడ్డాడు.

తాత్పర్యం: తెల్లవారగానే, భీష్ముడు కౌరవసేనలను అన్నిటినీ ప్రోగుచేసి 'గరుడవ్యూహం'గా తీర్చిదిద్దాడు. తాను ఆ గరుడాకారంలో ఉన్న ఆ వ్యూహానికి 'ముక్కు'గా నిలబడ్డాడు. భీష్ముడు 'ముక్కు' స్థానంలో నిలబడడం చేత ఆ వ్యూహానికి అందం, బలం కూడా చేకూరాయి.

వ. దానికిద్రోణకృతవర్మలు కన్ను లయిరి కృపాశ్వత్థామలు శిరం బయి నిలిచిరి త్రిగర్తులతోఁ గూడి భూరి శ్రవశ్శల్య భగదత్తులును సౌవీరజయద్రథులును గంఠత్వంబు నొందిరి మనుజపతి యనుజులుం దానును వెన్నయ్యె విందానువిందులుం గాంభోజుండును శూరసేనుండునుం బుచ్ఛం బైరి మాగధకళింగాదిగణంబులు దక్షిణపక్షం బయ్యును గర్ణాటకోసలప్రముఖనికాయంబులు వామపక్షం బయ్యును బొలిచిరి తక్కునుం గలవారలుఁ గలయం బన్ని రంతం బాండవబలంబులును భండనంబునకు వెడలె నయ్యవసరంబున నర్జునుండు. 96

ప్రతిపదార్థం: దానికిన్= ఆ గరుడవ్యూహానికి; ద్రోణ+కృతవర్మలు= ద్రోణుడు కృతవర్మ; కన్నులు+అయిరి= నేత్రాలు అయ్యారు; కృప+అశ్వత్థామలు= కృపాచార్యుడు, అశ్వత్థామ;శిరంబు+అయి= తల అయి; నిలిచిరి= నిలబడ్డారు, త్రిగర్తులతోన్+కూడి= త్రిగర్తులు అనేవారితో కలిసి; భూరిశ్రవస్+శల్య భగదత్తులును= భూరిశ్రవుడు, శల్యుడు, భగదత్తుడు, సౌవీర, జయద్రథులును= సౌవీరరాజు; (సింధురాజు); జయద్రథుడు; కంఠత్వంబున్+ఒందిరి= కుత్తుకభావం పొందారు; మనుజపతి= రాజు(దుర్యోధనుడు); తానును+అనుజులున్= తాను తన తమ్ములు; వెన్న+అయ్యెన్= వీపుగా అయ్యారు; వింద+అనువిందులున్= విందుడును, అనువిందుడును; కాంభోజుండును= కాంభోజరాజూ; శూరసేనుండునున్= శూరసేన రాజూ; పుచ్ఛంబు+అయిరి= తోక అయినారు; మాగధ కళింగాది గణంబులు= మగధకు, కళింగానికి చెందిన సేనలు; దక్షిణ+పక్షంబు+అయ్యును= కుడి రెక్కగాను; కర్ణాట కోసల ప్రముఖ నికాయంబులు= కర్ణాటదేశం, కోసలదేశం - మున్నగు దేశాలకు సంబంధించిన సేనా సమూహాలు, వామపక్షంబు+అయ్యును= ఎడమ రెక్కగాను; పొలిచిరి= శోభిల్లారు; తక్కునున్+కలవారలున్= మిగిలినట్టివారు; కలయన్+పన్నిరి= ఇటూ, నటూ కలిసి పోయేట్లుగా చేరారు; అంతన్= పిమ్మట; పాండవ+బలంబులును= పాండవుల సేనలును; భండనంబునకున్= యుద్ధానికి; వెడలెన్= వెళ్ళాయి; ఆ+అవసరంబునన్= ఆ సమయంలో; అర్జునుండు.

తాత్పర్యం: గరుడాకారంలో ఏర్పడిన ఆ వ్యూహానికి ద్రోణుడు, కృతవర్మ కన్నులుగా నిలిచారు. కృపుడు, అశ్వత్థామ శిరస్సు అయ్యారు. త్రిగర్తులు - భూరిశ్రవుడు - శల్యుడు - భగదత్తుడు సౌవీరరాజు సింధుభూపతి జయద్రథుడు కంఠంగా అయ్యారు. దుర్యోధనుడు - తమ్ములు వీపు అయ్యారు. విందుడు, అనువిందుడు, కాంభోజరాజు, శూరసేనరాజు తోక అయ్యారు. మాగధరాజు - కళింగరాజు మున్నగువారు కుడి రెక్క అయ్యారు. కర్ణాట కోసల సేనలు మున్నగునవి ఎడమరెక్క అయ్యాయి. తక్కినవారు ఇటు అటు సర్దుకున్నారు. అప్పుడు పాండవసేనలు కూడా, యుద్ధభూమికి తరలివెళ్ళాయి. ఆ సమయంలో అర్జునుడు (తరువాతి పద్యంతో అన్వయం.)

క. మనమొనఁ గని ధృష్టద్యు । మ్నున కిట్లనుఁ బన్నఁబంపు మోహర మర్ధం
దుని చందంబున దుర్యో । ధనుసైన్యముఁ బొదువుననువు దలకొనవలయున్. 97

ప్రతిపదార్థం: మన+మొనన్= మన సైన్యాన్ని; కని= చూచి; ధృష్టద్యుమ్ననకున్= ధృష్టద్యుమ్ననితో; ఇట్లు+అనున్= ఈ విధంగా చెప్పాడు; మోహరము= వ్యూహాన్ని; అర్ధ+ఇందుని+చందంబునన్= అర్ధచంద్రుని ఆకారంలో; పన్నన్+పంపు= పన్నుట కాజ్ఞాపించుము; దుర్యోధను+సైన్యమున్= దుర్యోధనుని సైన్యమును; పొదువు= మార్కొనే; అనువు+తలకొనన్+వలయున్= అనుకూలత ఏర్పడాలి.

తాత్పర్యం: అర్జునుడు కౌరవసేనను చూచి ధృష్టద్యుమ్నుడితో ఈ రీతిగా చెప్పాడు. 'అర్ధచంద్రాకారంలో మన వ్యూహాన్ని అమర్చవలసింది. ఎందుకంటే దుర్యోధనుడి వ్యూహాన్ని ఛేదించే ఉపాయం మనం అనుసరించాలి గదా!'

విశేషం: వ్యూహాన్ని బట్టి - ప్రతివ్యూహం ఉంటుంది. కౌరవులు గరుడవ్యూహం పన్నారుకదా! పాండవులు అర్ధచంద్రాకార వ్యూహం పన్నితే-గరుడపక్షి కుత్తుక ఉత్తరించటానికీ వీలు కలుగుతుంది.

వ. అనిన విని యతం డట్ల చేసినం బాండ్యమగధబలపరివృతుం డై భీమసేనుండు దక్షిణశృంగంబున నిలిచెఁ దదనంతరంబ విరాటద్రుపదులును మఱియు నీలుండును గాశకరూశగణసమేతుండై ధృష్టకేతుండును నిలిచిరి శిఖండి సహితుం డగు ధృష్టద్యుమ్ను మున్నిడికొని యుధిష్ఠిరుండు శుండాలమాలికాభీలంబుగా మధ్యప్రదేశం బలంకరించె నవ్వలన సాత్యకి మొదలుకొని యొలిన కవలును ద్రౌపదేయులు నభిమన్యుండు ఘటోత్కచుండుఁ గేకయ పతులుం బన్నిరి సకలలోకంబులకు రక్షకుండైన రాజీవాక్షుం డెవ్వానికి రక్షణం బొనర్చు నట్టి రథికశ్రేష్ఠుండు డాపలికొమ్మునం బన్నెఁ దక్కటి దొరలుం గలయమోహరించిరి ట్లుభయసైన్యంబులు సన్నద్ధంబు లయి నడచి నిస్సాణాదుల రావంబులు సెలంగ రౌద్రంబు దలకొనం దార్కొనియెఁ దత్సమయంబున ధనంజయుండు మన పదాతులు బడలువడం దనరథంబు వఱపించి శరంబులు నిగిడించి. 98

ప్రతిపదార్థం: అనినన్+విని= అని అర్జునుడు చెప్పగా ఆలకించి; అతండు= ధృష్టద్యుమ్నుడు; అట్లు+అ+చేసినన్= ఆ విధంగా చేయగా; పాండ్య, మగధ, బల పరివృతుండు+ఐ= పాండ్య మగధ సేనలు తన చుట్టూచేరగా; భీమసేనుండు; దక్షిణ+శృంగంబునన్= దక్షిణముననున్న కొసకు; నిలిచెన్; తద్+అనంతరంబు+అ= అటుపిమ్మట; విరాట ద్రుపదులును= విరాటుడు, ద్రుపదుడును; మఱియున్= అదనంగా; నీలుండును= నీలుడును; కాశ కరూశ గణ సమేతుండు+ఐ= కాశీదేశానికి, కరూశదేశానికి సంబంధించిన సేనలతో కూడినవాడై; ధృష్టకేతుండును= ధృష్టకేతుడును; నిలిచిరి; శిఖండి సహితుండగు= శిఖండితో కూడుకొనిన; ధృష్టద్యుమ్నున్= ధృష్టద్యుమ్నుని; మున్ను+ఇడికొని= ముందుపెట్టుకొని; యుధిష్ఠిరుండు= ధర్మరాజు; శుండాల+మాలికా+ఆభీలంబుగా= ఏనుగుల గుంపువలె భయంకరంగా; మధ్య+ప్రదేశంబు= నడిమిచోటును; అలంకరించెన్= అందముగా చోటు చేసుకున్నాడు; ఆవలనన్= అటువైపు; సాత్యకి+మొదలుకొని= సాత్యకి మొదలగువారు; ఓలిన్+ఆ= వరుసగా; కవలును= కూడిన నకుల సహదేవులును; ద్రౌపదేయులు= ద్రౌపది కొడుకులు; అభిమన్యుండు; ఘటోత్కచుండున్; కేకయపతులున్= కేకయరాజులును; పన్నిరి= వ్యూహంలో చేరారు; సకల లోకంబులకున్= అన్ని లోకాలకు; రక్షకుండు+ఐన= కాపాడే వాడైన; రాజీవాక్షుండు= పద్మనయనుడు, శ్రీకృష్ణుడు; ఏ+వానికిన్+రక్షణంబు+ఒనర్చున్= ఎవనిని కాపాడుచుండునో; అట్టి= అటువంటి; రథిక+శ్రేష్ఠుండు= తేరెక్కి యుద్ధం చేసేవారిలో గొప్పవాడు, అర్జునుడు; డాపలి+కొమ్మునన్+పన్నెన్= ఎడమకొసగా చేరాడు; తక్కటి+దొరలున్= మిగిలినరాజులు; కలయన్+మోహరించిరి= కలిసిపోయేటట్లుగా వ్యూహంలో చేరారు; ఇట్లు= ఈ రీతిగా; ఉభయ సైన్యంబులున్= రెండుసేనలు; సన్నద్ధంబులు+ఐ= సంసిద్ధమై; నడచి= దండు వెడలి; నిస్సాణ+ఆదుల+రావంబులు= బూరాలు మొదలగు వాద్యాల ధ్వనులు; చెలంగన్= ధ్వనించగా; రౌద్రంబు= అధికకోపం; తలకొనన్= వ్యాపింపగా; తార్కొనియెన్= మార్కొన్నాయి; తద్+సమయంబునన్= ఆ కాలంలో; ధనంజయుండు= అర్జునుడు; మన పదాతులు= మన కాలిబంటులు; బడలు+పడన్= డస్సిపోవునట్లుగా; తన+రథంబు= తన తేరు; పఱపించి= నడిపించి; శరంబులు= బాణాలు; నిగిడించి= ప్రయోగించి.

తాత్పర్యం: అర్జునుని సూచన మేరకు ధృష్టద్యుమ్నుడు పాండవ సేనను అర్ధచంద్రవ్యూహంగా అమర్చాడు. భీముడు- పాండ్య మగధ సేనలతో కూడిన వాడై, కుడి కొసను నిలిచాడు. అటుపిమ్మట విరాటుడు, ద్రుపదుడు నిలిచారు. నీలునితోపాటుగా ధృష్టకేతుడు కాశీదేశ కరూశదేశ సేనలతో పాటు నిలిచాడు. శిఖండితోపాటు ధృష్టద్యుమ్నుని ముందు పెట్టుకొని, యుధిష్ఠిరుడు తన చుట్టూ ఏనుగుల దండును కాపుగా పెట్టుకొని వ్యూహానికి

మధ్యగా నిలిచాడు. అటు ప్రక్కగా సాత్యకి, నకుల సహదేవులు, ద్రౌపది కొడుకులు, అభిమన్యుడు, ఘటోత్కచుడు, కేకయరాజులు వ్యూహంలో భాగంగా నిలిచారు. జగద్రక్షకుడైన శ్రీకృష్ణుడు రథసారథిగా గల అర్జునుడు ఎడమ కొసను నిలిచాడు. మిగిలిన రాజులు యథోచిత స్థానాలలో నిలిచారు. ఆ విధంగా ఉభయసేనలూ యుద్ధానికి సంసిద్ధమై బూరాలు మొదలైన వాద్యాల ధ్వనులు మిన్నుముట్టగా, మిక్కిలి రోషంతో మార్మ్రోన్నాయి. ఆ సమయంలో అర్జునుడు విజృంభించి, కౌరవసేనలలోని కాల్బలాన్ని చీకాకు పరచాడు.

విశేషం: 1.ఈ వ్యూహ రచనలో గమనింపవలసిన అంశాలు: ఇది కౌరవులు పన్నిన గరుడవ్యూహానికి ప్రతివ్యూహం. గరుడాకృతి వ్యూహంలో కుత్తుక ఉత్తరించటానికి - అర్ధచంద్రవ్యూహం అమర్చబడింది. ఒక కొసలో ధృష్టద్యుమ్నుడు, మరియొక కొసలో అర్జునుడు సుదూరంలో ఉన్నారు. ఇక - మధ్యభాగం ఏమికావాలి? అక్కడ ధర్మరాజు నిలిచాడు. అతనికి తగిన రక్షణ కావాలి. చుట్టూ ఏనుగులు. వాటికి చుట్టు సాత్యకి - కవలు - ద్రౌపదేయులు- అభిమన్యుడు - ఘటోత్కచుడు. 2. ఉపపాండవులు - ఒకేచోట ఉంటారు ఏ వ్యూహంలో అయినా - అట్లే నకుల సహదేవులుకూడా. 3. ఏ దేశానికైనా - ఒక ప్రభువు ఉంటాడు. ఉదాహరణకు విరాటుడు, ద్రుపదుడు మొదలుగా కేకయ దేశానికి మాత్రం కేకయ రాజులు అని బహువచన ప్రయోగమే భారతంలో అన్ని చోట్లా కన్పిస్తుంది. అది 'బహురాజుల' ఆధిపత్యంగల గణతంత్ర రాజ్యాంగం కావున.

క. అరదములు రథికవరులును । హరి సారథి కేతుసహిత మై పొడిపొడిగాఁ
గరులును జోదులు డొల్లఁగఁ । దురగంబులు రావుతులును దుత్తునియలుగన్. 99

ప్రతిపదార్థం: అరదములు= రథాలు; రథిక వరులును= తేరెక్కి యుద్ధం చేసే వీరులు; హరి సారథి కేతు సహితము+ఐ= గుర్రాలు, తేరు నడిపే సూతులు= జెండాలతో కూడ; పొడిపొడిగాన్= చూర్ణము అయ్యేటట్లుగా; కరులును= ఏనుగులు; జోదులు= భటులు; డొల్లఁగన్= కూలిపోగా; తురగంబులు= గుర్రాలు; రావుతులును= గుర్రాలపై ఎక్కి యుద్ధంచేసే భటులూ; తునియలు+తునియలుగాన్= ముక్కలు ముక్కలుకాగా; (అర్జునుడు యుద్ధం చేయగా)

తాత్పర్యం: రథాలు, రథాలపై ఎక్కి యుద్ధం చేసే వీరులూ, గుర్రాలు - సారథులు జెండాలతోపాటు పొడిపొడి అయ్యేటట్లు అర్జునుడు అమ్ములు ప్రయోగించాడు. ఏనుగులు- భటులు కూలారు. గుర్రాలు, గుర్రాలను ఎక్కి యుద్ధం చేసేవాళ్ళూ. ముక్కలుగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. చేయఁ దొడంగిన గాంధా । రేయులు వెస నొక్కపెట్ట రేఁగి యతనిపైఁ
గో యని కవిసినఁ గని కౌం । తేయులు నందఱుఁ గడంగి తేరులు పఱపన్. 100

ప్రతిపదార్థం: చేయన్+తొడంగినన్= ముక్కలు చేయసాగిన; గాంధారేయులు= గాంధారి కొడుకులు(కౌరవులు); వెసన్= వేగంగా; ఒక్క+పెట్ట+రేఁగి= ఒకేమారు విజృంభించి; అతనిపైన్= అర్జునుడిపై; 'కో'+అని+కవిసినన్= గోల చేస్తూ మార్మ్రోనగా; కౌంతేయులు+అందరు= పాండవులు అందరూ; కడంగి= పూని; తేరులు= రథాలు; పఱపన్= తోలగా.

తాత్పర్యం: అర్జునుడు కౌరవసేనను విధ్వంసం చేయగా, కౌరవులు అందరూ ఏకమై అతనిపై మార్మ్రోన్నారు. దానితో పాండవులు అందరూ ఏకమై వారిపైకి తమరథాలను మళ్ళించగా.

విశేషాలు: 'కోయని కవిసిన' - అది ఎక్కటి కయ్యం కాదు. అది సంకుల సమరం. అందరూ కలిసి- శత్రుసేనను తాకేటప్పుడు అది మౌనంగా అమ్ములు ప్రయోగించడం కాదు. ఆ దొమ్మి సంరంభంలో హెచ్చరికతో కూడిన 'నినాదం' వహించే భూమిక అర్థం చేసుకోవాలి. 'కో' అని మార్మ్రోనిన అనే ప్రయోగం సార్థకం. 'కో' ధ్వని అనుకరణ.

వ. కని తమకించి బలంబులు రెండును గలయన్ బెరయఁ గెందూళి యెగసిన. 101

ప్రతిపదార్థం: కని= చూచి; తమకించి= ఉత్సహించి; బలంబులు రెండును= ఉభయసైన్యాలు, కౌరవపాండవసేనలు రెండూ; కలయన్ బెరయన్= మార్కొనగా; కెంపు+దూళి= కెందూళి(ఎఱని దుమ్ము); ఎగసినన్= ఎగురగా;

తాత్పర్యం: కురు పాండవుల సేనలు రెండు తారసిల్లి యుద్ధం చేస్తుండగా కెందూళి ఎగరగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. నామములఁ బితృపితామహ । నామంబుల నుగ్రబిరుదనామంబుల సాం
గ్రామికు లెఱిఁగింతురు దము । నా మొన నీ మొనను జూపు లడరక యున్నన్. 102

ప్రతిపదార్థం: నామములన్= పేరులతో; పితృ+పితామహ+నామంబులన్= తండ్రి తాతల పేరులతో; ఉగ్ర+బిరుద+నామంబులన్= భయంకరములైన బిరుదుల పేరులతో; సాంగ్రామికులు= యుద్ధం చేసేవారు; తమున్= తమ్ము; ఆ మొనన్+ఈ మొనన్= ఆ సేనయందు ఈ సేనయందు, (పాండవుల సేనయందు , కౌరవసేనయందు); చూపులు+అడరక+ఉన్నన్= కన్నులు కనుపించక ఉన్నప్పుడు; ఎఱిఁగింతురు= తెలియచేసుకుంటారు.

తాత్పర్యం: ఎవరెవరో - ఎవరికీ తెలియని ఆ సమయంలో యుద్ధం చేసేవారు తామెవరో తెలిసేటట్లుగా - బిగ్గరగా తమ పేరులు - తమ తండ్రుల పేరులు, తాతల పేరులు తమ బిరుదులు ప్రకటించుకుంటారు.

విశేషం: తిక్కన కాలంలో, తదుపరి భారతదేశ చరిత్రలో మధ్యయుగాలలో 'బిరుదావళులు' మిక్కిలి ప్రాముఖ్యం వహించాయి. 'గండరగండ', 'మూరురాయరగండ' ఉదాహరణప్రాయాలు.

తే. ఇవ్విధంబునఁ గ్రందుపా టింతయైన । భీష్ము కడఁక నీ సైన్యంబు భీముబలిమిఁ
జేసి యా సేనయును నప్డు సిక్కు వడక । పోరె నేమని చెప్పుదుఁ గౌరవేంద్ర! 103

ప్రతిపదార్థం: కౌరవ+ఇంద్ర!= కౌరవ శ్రేష్ఠుడవైన ఓ ధృతరాష్ట్ర మహారాజా!; ఈ+విధంబునన్= ఈ రీతిగా; క్రందుపాటు= సమ్మర్దం; ఇంత+ఐన= ఇంతగా విస్తరించగా; భీష్ము+కడఁకన్= భీష్ముని యొక్క పూనికచే; నీ+సైన్యంబు= నీ సేన; భీము+బలిమిన్+చేసి= భీముని యొక్క శక్తిచేత; ఆ+సేనయును= ఆ పాండవుల సైన్యం; అప్డు= ఆ సమయంలో; చిక్కు+పడక= చీకాకుకాకుండా; పోరెన్= యుద్ధం చేశాయి; ఏమి+అని+చెప్పుదున్= ఇంక ఏమి చెప్పగలను?

తాత్పర్యం: ఈ రీతిగా సమ్మర్దం ఇంతగా సాగింది. భీష్ముడి నాయకత్వంలో కౌరవసేన, భీముడి నాయకత్వంలో పాండవసేన - ఒకరినొకరు మార్కొన్నారు. ఏ పక్షమూ వెనుకంజ వేయలేదు, జంకలేదు. ఓ ధృతరాష్ట్ర మహారాజా!; ఉభయపక్షాల పరాక్రమమూ వర్ణనాతీతం.

విశేషం: 'ఏమని చెప్పుదు' అనే ప్రయోగంలోని సారస్యం గమనింపదగినట్టిది. ఘోరమైన పోరాటంలో ఉభయసేనలు చూపిన తెగువ, తెంపు - చూపరియైన సంజయుడికి ఆశ్చర్యావహాలుగా కనుపించాయి.

క. శోణితము వెల్లి గవిసిన । రేణు వడంగుటయు మొనలు ప్రియపడి వెస గీ
ర్వాణాసురసమరము క్రియ । బాణాదినిశాతహేతిపంక్తులు మెఱయన్. 104

ప్రతిపదార్థం: శోణితము+వెల్లి= నెత్తుటి ప్రవాహం; కవిసినన్= క్రమ్మగా; రేణువు= దుమ్ము; అడంగుటయున్= అణగిపోవుటయు; మొనలు= సేనలు; ప్రియపడి= సంతోషించి; వెసన్= వేగంగా; గీర్వాణ+అసుర+సమరము క్రియన్=

దేవతల రాక్షసుల యొక్క యుద్ధంవలె; బాణ+ఆది+నిశాత+హేతి+ పంక్తులు= అమ్ములు మొదలైన వాడి కత్తుల వరుసలు; మెఱయన్= ప్రకాశింపగా.

తాత్పర్యం: కురు పాండవసేనల తాకిడికి దుమ్ము చెలరేగింది. అంత దుమ్ము ఏ విధంగా అణగారగలదు? యుద్ధంలో ప్రవహించిన నెత్తుటి ధారలచే ఆ దుమ్ము అణగింది. కురు పాండవ సేనల యుద్ధం - దేవతలు రాక్షసులు చేసిన యుద్ధంవలె ఉన్నది. బాణాలు మొదలైన వాడి ఆయుధాల వరుసలు ప్రకాశించాయి.

విశేషం: ఈ పద్యంలో 'ప్రియపడి' అనే ప్రయోగం గమనింపదగినట్టిది. ఘోర సంగ్రామంలో 'ప్రియపడటం' ఏమిటి? దట్టంగా క్రమ్మిన దుమ్ము అణగారటం వీరులకు సంతోషదాయకమే. ఇక నెత్తురు ప్రవాహం మాట ఏమిటి? అది యుద్ధం. వీరులు చావుకు తెగించినవారు. వారికి నెత్తురు అన్న భయంలేదు.

వ. పెనంగునట్టియెడ గాంగేయుండును గురుండును బురుమిత్రుండును సైంధవుండును సౌబలుండును వికర్ణుండును బాండవసేనపయి నడరిన భీమసేన ఘటోత్కచసాత్యకిశైబ్యచేకితానద్రౌపదేయులు వారిం దలపడినం బోరు ఘోరం బయ్యె నప్పుడు రథబృందంబులతో భవదగ్రనందనుండు వాయునందన తదీయనందను లున్నయెడకు నురవడించినం గని భీష్మద్రోణు లతని మించి వారలం దాఁకినం జూచి సవ్యసాచి యగ్రజు నగ్రభాగంబునకు వచ్చి. 105

ప్రతిపదార్థం: పెనంగునట్టి+ఎడన్= పోరాడేటపుడు; గాంగేయుండును= భీష్ముడును; గురుండును= ద్రోణుడును; పురుమిత్రుండును= పురుమిత్రుడును; సైంధవుండును= సింధురాజును; సౌబలుండును= శకునియు; వికర్ణుండును; పాండవ సేనపయిన్= పాండవుల సైన్యంపై; అడరినన్= విజృంభించగా; భీమసేన ఘటోత్కచ సాత్యకి శైబ్య చేకితాన ద్రౌపదేయులు= భీముడు, ఘటోత్కచుడు, సాత్యకి, శైబ్యుడు, చేకితానుడు, ద్రౌపది కొడుకులూ; వారిన్= కౌరవులను; తలపడినన్= మార్కొనినపుడు; పోరు= యుద్ధం; ఘోరంబు+అయ్యెన్= భీకరం అయింది; అప్పుడు= ఆ సమయంలో; రథ+బృందంబులతోన్= తేరుల గుంపులతో; భవత్+అగ్ర+నందనుండు= నీ పెద్ద కొడుకు(దుర్యోధనుడు);వాయునందన+తదీయనందనులు+ఉన్న+ఎడకున్= భీముడు-అతని కొడుకు ఘటోత్కచుడు ఉన్న చోటికి; ఉరవడించినన్= ఉత్సాహంతో తరలివెళ్ళగా; కని= చూచి; భీష్మ ద్రోణులు= భీష్ముడు, ద్రోణుడు; అతనిన్ మించి= ఆ దుర్యోధనుని దాటి; వారలన్= పాండవపక్షంలోని వీరులను; తాఁకినన్= మార్కొనగా; చూచి; సవ్యసాచి= కవ్వడి(అర్జునుడు); అగ్రజు+అగ్రభాగంబునకున్= అన్నగారైన భీముని ముందునకు; వచ్చి.

తాత్పర్యం: కురుపాండవసేనలు యుద్ధం చేస్తున్నప్పుడు, భీష్ముడు, ద్రోణుడు, పురుమిత్రుడు, సైంధవుడు, శకుని, వికర్ణుడు పాండవసేనపై విజృంభించారు. భీముడు, ఘటోత్కచుడు, సాత్యకి, శైబ్యుడు, చేకితానుడు, ద్రౌపదీపుత్రులు వారిని మార్కొన్నారు. ఘోర యుద్ధం జరిగింది. అప్పుడు, రథసమూహాలతో దుర్యోధనుడు భీముడూ అతడి కొడుకు ఘటోత్కచుడూ ఉన్న చోటికి ఉత్సాహంతో తరలి వెళ్ళటం చూచి, భీష్ముడూ ద్రోణుడూ అతనిని దాటి వెళ్ళి వారిని మార్కొన్నారు. అదిచూచి, అర్జునుడు భీముని ముందర చేరి.

క. భూరిశరాసారంబునఁ। గౌరవుల కడంక యుడిపె గాంధారబలాం
భోరాశిఁ దఱియఁ జొచ్చిరి। వీరాగ్రణి సాత్యకియును విజయసుతుండున్. 106

ప్రతిపదార్థం: భూరి+శర+ఆసారంబునన్= గొప్పదైన అమ్ముల జడివానచే; కౌరవుల+కడంక+ఉడిపెన్= కౌరవుల విజృంభణ అరికట్టెను; గాంధార+బల+అంభస్+రాశిన్= గాంధారసేన అనే సముద్రాన్ని; వీర+అగ్రణి= వీరులలో శ్రేష్ఠుడు; సాత్యకియును= సాత్యకీ; విజయ+సుతుండున్= అర్జునుని కొడుకు అయిన అభిమన్యుడూ; తఱియన్+చొచ్చిరి= మథించసాగారు.

తాత్పర్యం: గొప్ప అమ్ముల జడివాన కురిపించి, కౌరవుల విజృంభణ అరికట్టాడు అర్జునుడు. వీరులలో శ్రేష్ఠుడు అయిన సాత్యకి, అభిమన్యుడు గాంధార సేనతో పరాక్రమం చూపి పోరాడారు.

క. పొదివికొని శకునిబల ము । న్మదగతి సాత్యకి రథంబు నఱకిన నాతం
డది దిగ్గదఁటి ధైర్యా । స్పదమతి నభిమన్యుతేరిపైకిం జనియెన్. 107

ప్రతిపదార్థం: పొదివికొని= చుట్టుముట్టి; శకుని బలము= శకునిసేన; ఉన్మదగతిన్= గర్వంతో; సాత్యకి+రథంబు= సాత్యకి తేరు; నఱకినన్= ఖండింపగా; ఆతండు= సాత్యకి; దిగ్గదఁటి= దిగిపోయి; ధైర్య+ఆస్పద+మతిన్= ధైర్యంతో కూడిన బుద్ధితో; అభిమన్య+తేరిపైకిన్= అభిమన్యుని రథంమీదికి; చనియెన్= వెళ్ళాడు(అధిరోహించాడు).

తాత్పర్యం: శకునిసేన - సాత్యకి రథాన్ని చుట్టుముట్టి ధ్వంసం చేసింది. సాత్యకి రథం దిగి, ధైర్యం విడువకుండా, ఉపాయంగా తప్పించుకొని - అభిమన్యుడి రథం ఎక్కాడు.

క. వా రిరువురుఁ జలమున గాం । ధారపతి ప్రముఖ రథికతతులను జంచ
న్నారాచతతుల నొంచిరి । క్రూరతఁ గవిసెన్ యుధిష్ఠిరుఁడు భీష్మపయిన్. 108

ప్రతిపదార్థం: చలమునన్= పట్టుదలతో; వారు+ఇరువురున్= వారు ఇద్దరును- అభిమన్యుడు, సాత్యకి; గాంధారపతి ప్రముఖ రథిక తతులన్= శకుని మున్నగు వీరుల సముదాయాన్ని; చంచత్ నారాచ తతులన్= చలించే అమ్ముల గుంపులతో; నొంచిరి= నొవ్వజేశారు; యుధిష్ఠిరుఁడు= ధర్మరాజు; క్రూరతన్= కఠినత్వంతో; భీష్మ+పయిన్= భీష్మునిమీద; కవిసెన్= మార్కొన్నాడు.

తాత్పర్యం: సాత్యకి, అభిమన్యుడు, మిక్కుటమగు పట్టుదలతో శకుని మున్నగు వీరులపై వాడి అమ్ములు ప్రయోగించి యుద్ధం చేశారు. ధర్మరాజు - క్రౌర్యంతో భీష్ముని మార్కొన్నాడు.

క. భూరిబలఘోర మగు నా । భూరమణుని కోలుతలకుఁ బోవక భీష్మ
స్ఫారబలము ద్రోణుని దో । స్సారంబును నచ్చి నీదుసైన్యము పెనఁగెన్. 109

ప్రతిపదార్థం: భూరి బల ఘోరము+అగు= గొప్ప సైన్యముతో భయంకరమైన; ఆ+భూరమణుని= ఆ రాజుయొక్క(ధర్మరాజుయొక్క); కోలుతలకున్+పోవక= ప్రత్యక్ష యుద్ధమునకు జంకక; భీష్మ, స్ఫార, బలమున్= భీష్ముని యొక్క విస్తారమైన శక్తిని; ద్రోణుని; దోఃసారంబును= భుజబలమును(పరాక్రమమును); నచ్చి= ఇష్టపడి, నమ్మి; నీదు+సైన్యము=నీ సేన; పెనఁగెన్= పోరాడింది.

తాత్పర్యం: గొప్ప సేనతో కూడి ధర్మరాజు -భీష్ముడిపైబడి ప్రత్యక్షయుద్ధం ప్రారంభించాడు. కౌరవసేన- ధర్మరాజు ధాటికి తట్టుకొని పోరాడింది. కౌరవసేన ఆ విధంగా నిలవటానికి కారణం - భీష్ముని యొక్క విస్తారమైన శక్తి, - ద్రోణుడి భుజబలం మీద కౌరవసేనకు గల గౌరవం.

విశేషం: కోలుతల: ఎదుట నిలిచి యుద్ధం చేయటం. ఇది ప్రత్యక్ష యుద్ధం. సంకుల సమరము దొమ్మియుద్ధం.

దుర్యోధనుఁడు భీమునితో యుద్ధము సేసి మూర్ఛిల్లుట (సం. 6-54-15)

చ. తదవసరంబునం బతి యుదగ్రత భీమునిఁ దాఁకి విస్ఫుర
త్ప్రదరము లేసినన్ నగుచుఁ బాండవవీరుఁడు రాజుమేన బె
ట్టిద మగుబాణ మొక్కటి వడింగొని తూఱఁగ నేయఁ దేరిపైఁ
జదికిలఁ బడ్డ మూర్ఛ నృపసత్తము లేవఁగనీక కప్పినన్. 110

ప్రతిపదార్థం: తద్+అవసరంబునన్= ఆ సమయంలో; పతి= రాజు(దుర్యోధనుడు); ఉదగ్రతన్= భీకరంగా; భీమునిన్+తాఁకి= భీముని మార్కొని; విస్ఫురత్+ప్రదరములు= ప్రకాశమానములైన అమ్ములు; ఏసినన్= ప్రయోగింపగా; నగుచున్= నవ్వుచు; పాండవ+వీరుఁడు= భీముడు; రాజు+మేన= దుర్యోధనుని శరీరంపై; బెట్టిదము+అగు= కఠినము అయిన; బాణము+ఒక్కటి= ఒక అమ్ము; వడిన్+కొని= వేగంగా గ్రహించి; తూఱఁగన్+ఏయన్= తూట్లుపడేటట్లు ప్రయోగింపగా; తేరిపైన్= రథముమీద; చదికిల+వడ్డ= కూలబడగా; మూర్ఛ= స్పృహలేని స్థితి; నృప+సత్తమున్= రాజశ్రేష్ఠుడిని - దుర్యోధనుడిని; లేవఁగనీక= నిలుచుండేందుకు వీలు కాకుండా; కప్పినన్= ఆవరింపగా

తాత్పర్యం: ఆ సమయంలో దుర్యోధనుడు భీముని మార్కొని, వెలుగొందే అమ్ములు విసిరాడు. భీముడు నవ్వుతూ - ఒక కఠినమైనబాణంతో దుర్యోధనుని శరీరం తూట్లు పడేటట్లు కొట్టాడు. దుర్యోధనుడు రథముపై చదికిలబడి లేవలేకుండేటట్లుగా మూర్ఛక్రమ్ముకోగా.

ఆ. సంభ్రమమున నపుడు సారథి యచ్చోటు । దొలఁగ బెలుచఁ దేరు దోలుటయును
గని భయంబు నొంది కలఁగి యొక్కుమ్మడి । బలములెల్లఁ దెరలి పాఱఁ జొచ్చె. 111

ప్రతిపదార్థం: సంభ్రమమునన్= తొట్రుపాటుతో; అపుడు= ఆ సమయంలో; సారథి= దుర్యోధనుని రథ చోదకుడు; ఆ+చోటు= ఆ స్థలం; తొలఁగన్= వీడునట్లుగా; పెలుచన్= వేగంగా, తేరు= రథము; తోలుటయును= నడిపించుటయు; కని= చూచి; భయంబున్+ఒంది= భీతిచెంది; కలఁగి= చీకాకై; బలములు+ఎల్లన్= సేనలు అన్నీ, ఒక్కుమ్మడిన్= ఒక్కసారిగా; తెరలి+పాఱన్+చొచ్చెన్= మరలి పారిపోసాగాయి.

తాత్పర్యం: దుర్యోధనుడు మూర్ఛపోవటం చూచి, సంభ్రమంతో అతని సారథి రథాన్ని వేగంగా తోలుకొని, యుద్ధభూమిని వదలిపోవటం చూచి, కౌరవసేనలు కలతచెంది, భీతిచెంది, వెనుదిరిగిపోయాయి.

క. వెనుకొని విఱిగిన సైన్యము । గనుకనిఁ బాఱంగఁ జేసి క్రౌర్యోద్రేకం
బున ధృష్టద్యుమ్నుండును । దన కెలనం దఱుమ వాయుతనయుం డెగిచెన్. 112

ప్రతిపదార్థం: వెనుకొని= వెనుకకు మరలి; విఱిగిన+సైన్యమున్= ఓడిపోయిన సేనను; కనుకనిన్= సంభ్రమంతో; పాఱంగన్+చేసి= పారిపోయేటట్లు చేసి; క్రౌర్య+ఉద్రేకంబునన్= క్రూరమైన ఆవేశంతో; ధృష్టద్యుమ్నుండును; తనకెలనన్+తఱుమ= తన పార్శ్వాలతో తఱిమి కొట్టగా; వాయు తనయుండు= భీముడు; ఎగిచెన్= విజృంభించాడు.

తాత్పర్యం: ఓడిపోయిన కౌరవసేన - వెనుదిరిగి పారిపోతూ ఉండగా, క్రూరత్వంతో కూడిన ఆవేశంతో తన ప్రక్క ధృష్టద్యుమ్నుడు తరిమికొట్టగా, భీముడు విజృంభించాడు.

క. అదలిచి ద్రోణుఁడు భీష్ముఁడు । మదమున నిలునిలు మనంగ మఱియును మొగ క
ట్టద సేన భీమసేనుఁడు । గదిసి పిఱుఁద నంట నార్వఁ గౌరవనాథా! 113

ప్రతిపదార్థం: కౌరవ+నాథా!= కౌరవరాజా!(ధృతరాష్ట్రమహారాజా); ద్రోణుఁడు= ద్రోణుడు; అదలిచి= బెదరించి; భీష్ముఁడు= భీష్ముడు; మదమునన్= గర్వంతో; నిలునిలుము= ఆగు, మాగుముఅని; అనంగన్= అని చెప్పగా; భీమసేనుఁడు= భీముడు; గదిసి= చేరి; పిఱుఁదన్+అంటన్= వెనుకచేరి తరుమగా; ఆర్వన్= కేకలు వేయగా - సింహనాదం చేయగా; మఱియును= ఇంకను; సేన= సైన్యం; మొగకట్టదు+అ= మూగదు.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! కౌరవసేన పారిపోతూ ఉండగా, ద్రోణుడూ భీష్ముడూ మరలించటానికి ప్రయత్నించారు. అయినా - కౌరవ సేన- నిలువ లేకపోయింది. భీముడు పారిపోయే సేనను వెంబడించి తరిమి కొట్టి సింహనాదం చేసినప్పుడు- కౌరవసేన ఎదురుతిరిగి ప్రతిస్పందన చేయక నోరు మూసికొని పారిపోయింది.

విశేషం: మొగకట్టు= మూగు; మొగకట్టదు - అంటే మౌనంగా ఎట్టి ప్రతిస్పందననూ చూపకపోవటం. భీముడు వెన్నాడి తరిమినప్పుడు కౌరవసేన మొగకట్టలేదు. అంటే - భీముడికి అభిముఖంగా కూడి నిలబడలేకపోయిందని భావం.

క. సభయ మయి శకుని సైన్యం । బభమన్యుఁడు సాత్యకియు రయంబునఁ దోలం
బ్రభ సెడి పఱచుట గని యా । ప్రభువు చలం బెడలి విఱిగె బంధులుఁ దానున్. 114

ప్రతిపదార్థం: అభిమన్యుఁడు= అభిమన్యుడు; సాత్యకియున్; రయంబునన్= వేగంగా; తోలన్= వెన్నాడగా; సభయమయి= భీతిల్లి; శకుని+సైన్యంబు= శకుని సైన్యం(గాంధారసేన); ప్రభ+చెడి= తేజము నశించి, వెలవెలపోయి; పఱచుటన్+కని= పారిపోవటం చూచి; ఆ ప్రభువు= ఆ రాజు(శకుని); చలంబు+ఎడలి= పట్టుదల చెదరి; బంధులు= చుట్టాలు; తానున్= తానును; విఱిగెన్= ఓడిపోయాడు.

తాత్పర్యం: సాత్యకి, అభిమన్యుడు కలిసి వెన్నాడగా, శకుని సైన్యం ధైర్యం కోల్పోయి పారిపోయింది. ఆ సన్నివేశం చూచి, శకుని బంధువులతోపాటు పట్టుదల చెదరి ఓటమికి లోనయ్యాడు.

క. ఊర్జితశాత్రవసేనా । దుర్జయుఁ డగునర్జునుండు దోర్బల లీలా
స్ఫూర్జితుఁ డై యొక్క దెసన్ । గర్జారౌద్రముగఁ దోలెఁ గౌరవబలమున్. 115

ప్రతిపదార్థం: ఊర్జిత, శాత్రవ, సేనా, దుర్జయుఁడు, అగు= పూనికగల శత్రువులసేన చేత జయించుటకు శక్యముగాని; అర్జునుండు= అర్జునుడు; దోస్ బల, లీలా స్ఫూర్జితుఁడు+ఐ= భుజబలము యొక్క అనగా పరాక్రమము యొక్క ఆటచే వెలుగొందునట్టివాడై, మిఱుమిట్లు గొలిపే గొప్ప పరాక్రమము కలవాడై; కౌరవ+బలమున్= కౌరవుల సేనను; ఒక్క+దెసన్= ఒక్కవైపుగ; గర్జా రౌద్రముగన్= భయంకరంగా గర్జించుతూ, భయంకర సింహనాదం చేస్తూ; తోలెన్= తరిమికొట్టాడు.

తాత్పర్యం: అర్జునుని శాత్రవులు - ఎంత పట్టుదలతో మార్కొనినప్పటికీ అతడిని జయింపలేరు. అతడు దుర్జయుడు. అతడు - ఒక ఆటలోవలె పరాక్రమం ప్రదర్శించి సింహనాదం చేస్తూ కౌరవసేనను ఒక వైపునకు చేర్చి - వెన్నాడి తరిమికొట్టాడు.

తే. అంతఁ దెప్పిఱి నీ కొడు కనికి రథము । దొలఁగఁ దెచ్చుట గనుఁగొని యలిగి సూతుఁ
బలికి సరభసముగ నడుకలని కేఁగి । యెలుఁగు సూపిన బలములు నిలిచి పొదివె. 116

ప్రతిపదార్థం: అంతన్= పిదప; తెప్పిరి= సేదతీరి; నీ కొడుకు= నీ పుత్రుడు= దుర్యోధనుడు; అనికిన్+రథము+తొలఁగన్+తెచ్చుట+కనుఁగొని= యుద్ధభూమినుండి తేరును తరలించి తీసికొని రావటం తెలిసికొని; సూతున్= సారథిని; అలిగి= కోపగించి; పలికి= మాటాడి; సరసభసముగన్= తొట్రుపాటుతో; నడు+కలనికిన్+ఏఁగి= యుద్ధ మధ్యమునకు వెళ్ళి; ఎలుఁగు+చూపిన= సింహనాదం చేయగా(కేకవేయగా); బలములు= సేనలు; నిలిచి+పొదివెన్= ధైర్యంతో విలసిల్లి నిలిచాయి.

తాత్పర్యం: అంతట - దుర్యోధనుడు మూర్ఛనుండి తేరుకొన్నాడు. రణరంగంనుండి తేరు తరలించి తనను తెచ్చినందుకు అతడు సారథిని కోపంతో మందలించి, సంభ్రమంతో తిరిగి యుద్ధభూమికి చేరుకొని సింహనాదం చేశాడు. కౌరవసేనలు ధైర్యం పుంజుకొని నిలబడ్డాయి.

తే. ఉన్నచోటన కదలకయున్న ద్రోణ । భీష్ములును గోలుతలసేయఁ బెఱిగి సేన
చంద్రుఁ డుదయింపఁ బెఱిగిన శరధియట్లు । దోడుతోడుతఁ బొంగారి చూడనొప్పె. 117

ప్రతిపదార్థం: ఉన్న+చోటన్+అ= నిలిచియున్న స్థలమునందే; కదలక+ఉన్న= చలింపకుండా నిలిచిన; ద్రోణ+భీష్ములును= ద్రోణుడును, భీష్ముడును; కోలుతల+చేయన్= కట్టెదురుగ నిలిచి యుద్ధం చేయగా; సేన= సైన్యం(కౌరవసేన); పెఱిగి= అతిశయించి; చంద్రుడు+ఉదయింపన్= చంద్రుడు పొడిచినప్పుడు; పెఱిగిన= పొంగిన; శరధి+అట్లు= సముద్రం వలె; తోడు+తోడుతన్= క్రమక్రమంగా; పొంగారి= అతిశయించి; చూడన్+ఒప్పెన్= శోభిల్లింది.

తాత్పర్యం: ద్రోణుడు, భీష్ముడు (దుర్యోధనుడు మూర్ఛితుడైనప్పటికీ) చలించకుండా ఉన్న చోటులోనే నిలిచి, కట్టెదురుగా ఉన్న పాండవసేనపై విజృంభించారు. అప్పుడు కౌరవసేన- చంద్రుడు ఉదయంచేటప్పుడు పొంగే సముద్రంవలె - అతిశయించి, క్రమక్రమంగా శక్తి పుంజుకొని శోభిల్లింది.

వ. ఇట్లు బలంబుల నిలిపి సుయోధనుండు సత్వరంబుగా భీష్మద్రోణుల పాలికిం జని వారలతో నిట్లనియె. 118

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; బలంబులన్= సేనలను; నిలిపి= ఆపి; సుయోధనుండు; సత్వరంబుగాన్= శీఘ్రంగా; భీష్మద్రోణుల పాలికిన్+చని= భీష్ముడు, ద్రోణుడు ఉన్న చోటికి పోయి; వారలతోన్= భీష్మ ద్రోణులతో; ఇట్లు అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఈ విధంగా సేనలను కూడగట్టుకొని, వేగంగా భీష్మద్రోణులు ఉన్న చోటికి వెళ్ళి దుర్యోధనుడు ఈ విధంగా అన్నాడు.

ఉ. 'ఉక్కున మూఁడు లోకములు నొక్కటఁ దాఁకెన యేనిఁ బోర మీ
రొక్కఁ డొకండ గెల్చుటకు నోపుదు రశ్రమవృత్తి నిట్టి మీ
ముక్కున నూర్పు గల్గ మనమోహర మీ దురవస్థఁ బొందునే?
యక్కట మున్న పాండవుల కల్గఁగ నొల్లమిసెప్ప రైతిరే!' 119

ప్రతిపదార్థం: ఉక్కునన్= పరాక్రమంతో; మూఁడులోకములున్= త్రిభువనాలు; ఒక్కటన్= ఏకమై; తాఁకెన+ఏనిన్= మార్కొనినప్పటికీ; పోరన్= యుద్ధంలో; మీరు; ఒక్కఁడు+ఒకండు+అ= ఒకడు ఒక్కడే; అశ్రమవృత్తిన్= సులువుగా; గెల్చుటకున్; ఓపుదురు= చాలుదురు; ఇట్టి= ఇటువంటి; మీ+ముక్కునన్+ఊర్పు+కల్గన్= మీరు బ్రదికి ఉండగానే - మీరు ఊపిరి పీల్చుచుండగానే; మన+మోహరము= మన మొగ్గరము, మన సేనా వ్యూహము; ఈ+దురవస్థన్+పొందునే?= ఈ చెడ్డ స్థితికి వస్తుందా?; అక్కట!= అయ్యో!; మున్ను+అ= ముందుగానే; పాండవులకున్+అల్గఁగన్+ఒల్లమి= పాండవులమీద ఆగ్రహించటం ఇష్టం లేకపోవటం; చెప్పరు+ఐతిరే!= చెప్పలేదుకదా!

తాత్పర్యం: 'మూడు లోకాలు కలిసి ఒక్కపెట్టున మీమీదకు దండెత్తి వచ్చినప్పటికీ- మీలో ఒకడు చాలు వారిని జయించటానికి. మీరు సజీవులై ఉండగా మనసేన ఈ దురవస్థను పొందటం శోచనీయం. పాండవులపై మీకు పక్షపాతం ఉంది. ఆ విషయం మీరు ముందుగానే చెప్పి ఉంటే బాగుండేది కదా!'

విశేషం: మూడు లోకాలు-భూలోకం; పైలోకం - స్వర్గలోకం; క్రిందిలోకం - పాతాళలోకం.

వ. అని పలికి గాంగేయుం గనుంగొని. 120

ప్రతిపదార్థం: అని+పలికి= అని చెప్పి; గాంగేయున్= గంగ కొడుకును= భీష్ముని; కనుంగొని= చూచి.

తాత్పర్యం: అని చెప్పి దుర్యోధనుడు భీష్ముడిని చూచి.

ఆ. ' నాఁడె చెప్పఁగన్న నాకు రాధేయున । కెట్లు సూడఁ బోలె నట్లు వోలెఁ
బడినపాటుఁ బడుదు మడియాస నీచేత । భంగపడితి మింకఁ బలుకు లేల?' 121

ప్రతిపదార్థం: నాకున్= నాకు; నాఁడె= ఆ దినమే(యుద్ధానికి ముందు- కర్ణుని నిరసించిన నాడే); చెప్పన్+కన్నన్= చెప్పి ఉంటే; రాధేయునకున్= కర్ణునకు; ఎట్లు= ఏ విధంగా; చూడన్+పోలెన్= చూచినట్లుగానే; అట్లుపోలెన్= ఆ విధంగానే; పడినపాటు, పడుదుము= మా పాట్లు మేము పడియుండే వాళ్ళము; అడియాసన్= వ్యర్థమైన ఆశతో; నీచేతన్= నీవలన; భంగపడితిమి= మోసపోయాము; ఇంకన్= ఇక; పలుకులు+ఏల?= మాటలు ఎందుకు?

తాత్పర్యం: ఆనాడే (యుద్ధానికి ముందే) ఆవిషయం (పాండవులపై ఆగ్రహించజాలననే విషయం) చెప్పి ఉంటే నాకూ కర్ణుడికీ ఏది తోస్తే ఆ విధంగా మా పాట్లు మేము పడియుందుము. వ్యర్థమైన ఆశచేత నీ వల్ల భంగపడ్డాము. ఇక మాటలెందుకు?

విశేషం: యుద్ధానికి ముందు భీష్ముడు కర్ణుని ' అర్ధరథుడు' అని నిర్ణయించి అధిక్షేపించాడు. అప్పుడు భీష్ముడు దుర్యోధనుడితో చెప్పినమాట 'నీవు కర్ణుని వదలుకొంటావా? నన్ను వదలుకొంటావా?' దుర్యోధనుడు కర్ణుని వదలుకొని భీష్ముడికి, కౌరవ సర్వసేనాధిపతిగా పట్టం కట్టాడు. ఈ పర్వంలో దుర్యోధనుడు ఆ ప్రసక్తి తెచ్చాడు.

వ. అనిన విని చిఱునవ్వు నవ్వుచు మీతండ్రి నీ కొడుకును బ్రియభాషణంబులం దేర్చి యిట్లనియె. 122

ప్రతిపదార్థం: అనిన+విని= అని దుర్యోధనుడు చెప్పగా ఆలకించి; మీ తండ్రి= మీ తండ్రి(భీష్ముడు); నీ కొడుకును= నీ పుత్రుని, దుర్యోధనుడిని; ప్రియ+భాషణంబులన్= ప్రీతి కలిగించే మాటలతో; తేర్చి= సంతృప్తి పరిచి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు;

తాత్పర్యం: అనగా విని చిరునవ్వుతో భీష్ముడు దుర్యోధనుడిని ప్రీతి కల్గించే మాటలతో సంతృప్తి పరచియిట్లన్నాడు.

క. పురుహూతసహితమగు ని । ర్జరబలమున కైన గెలువ శక్యమె? సమర
స్థిరులగు పాండుతనూజుల । నరనాయక! నీకు నిట్లనం దగ వగునే? 123

ప్రతిపదార్థం: నరనాయక!= ఓ రాజా; దుర్యోధనా!; పురుహూత సహితము+అగు= దేవేంద్రునితో కూడిన; నిర్జర+బలమునకున్= దేవతలసేనకు; ఐనన్= కూడా; సమర+స్థిరులు+అగు= యుద్ధంలో కదలకుండా నిలబడే; పాండు తనూజులన్= పాండవులను; గెలువన్+శక్యము+ఎ?= జయింప సాధ్యమా?; నీకున్; ఇట్లు+అనన్= ఈ విధంగా మాటాడుట; తగవు+అగును+ఏ?= న్యాయం అవుతుందా?

తాత్పర్యం: 'దేవేంద్రునితో పాటు దేవతల సేన దండెత్తి వచ్చినా సరే, యుద్ధభూమిలో పాండవులు నిలబడితే జయింప సాధ్యం కాదు. ఓ దుర్యోధనా! నీవు - ఈ విధంగా మాటాడటం న్యాయం కాదు సుమా!

క. వృద్ధులు గతాయువులు దు । ర్బుద్ధులు నగువారిచేతఁ బోదురె శస్త్రా
స్త్రోద్ధతియు బాహుగర్వ సమృ । ద్ధియుఁ గల పాండు సుతు? లమిత్రధ్వంసీ! 124

ప్రతిపదార్థం: అమిత్ర+ధ్వంసీ!= శత్రువులను నాశనము చేసేవాడా - దుర్యోధనా!; వృద్ధులు= ముసలివారు; గత+ఆయువులు= గతించిన ఆయుస్సు కలవారలు; దుస్+బుద్ధులు= చెడ్డబుద్ధిగలవారు; అగువారిచేతన్= అయినట్టి వారిచేత; శస్త్ర+అస్త్ర+ఉద్ధతియున్= బాణముల మంత్రబాణముల గొప్పతనం; బాహు+గర్వ+సమృద్ధియున్= భుజబలము ఉన్నదనే గర్వం ఎక్కువగా; కల= ఉన్న; పాండు+సుతులు= పాండురాజు కొడుకులు; పోదురె?= ఓడిపోతారా?

తాత్పర్యం: శత్రువులను ధ్వంసం చేయగల ఓ దుర్యోధనా! శస్త్రములలో, అస్త్రములలో నిపుణులు, పరాక్రమోపేతులు అయిన పాండవులు, ముసలివారు ఆయువు క్షీణించిన వారిచే ఓడిపోతారా?

విశేషం: మహాభారతంలో - భీష్మపర్వంలో పేర్కొనదగిన పద్యాలలో ఇది ఒకటి. ఈ మాటలు పలికినది భీష్ముడు. ఇందులో- కొంత వ్యంగ్య ధోరణి ఎత్తి పొడుపు ఉంది. భీష్ముడు అంటున్నాడు. 'వృద్ధులు - గతాయువులు' (దుర్బుద్ధులు)పాండవులను గెలువగలరా? ఈ మాటలు భీష్ముడు తనను గూర్చి, ద్రోణుని గూర్చి చేసికొన్న ఆత్మనింద కాజాలదు. ఆ మాటలు దుర్యోధనాదులు, కర్ణుడు లోగడ అన్నవే. ఇప్పుడు దుర్యోధనుడు - ద్రోణుడిని, భీష్ముడిని ఆకాశానికి ఎత్తి పొగడుతున్నాడు. "మిమ్ము దేవతలు గూడ గెలువలేరు - అంటాడు. ఎందుచేత ఇప్పుడు పొగడవలసి వచ్చింది? కౌరవ సేనలు పాండవుల చేత ఓడిపోయి, పారిపోయాయి కాబట్టి. భీష్ముడు - దుర్యోధనుడిని 'అమిత్రధ్వంసీ' అని సంబోధిస్తున్నాడు. ఈ సంబోధనలోని ఎత్తిపొడుపు సుస్పష్టం. ప్రస్తుతం దుర్యోధనుడు మూర్ఛపోయి తిరిగివచ్చాడు. సేనలు పారిపోయాయి. పారిపోకుండా నిలిచింది- ద్రోణుడు, భీష్ముడు మాత్రమే. దుర్యోధనుడు 'అమిత్రధ్వంసి' కానే కాదు. అతనికి ఆ శక్తి లేదని తేలిపోయింది!

తదుపరి దుర్యోధనుడికి భీష్ముడు చీవాట్లు పెట్టాడు. పాండవులు దుర్జయులు అని చెప్పాడు. తాము ఆ విషయం అంతకు ముందే పలుసారులు చెప్పి ఉన్నారు. ఆ విషయం జ్ఞాపకం చేశాడు - భీష్ముడు మరల దుర్యోధనుడికి. 'అయినా ఇక చూడు - శక్తివంచన లేకుండా యుద్ధం చేసి విజృంభించి పాండవసేనను హతమార్చగలను' అని ప్రతిజ్ఞ చేశాడు భీష్ముడు. అయితే భీష్ముడు అంతకుముందే - తన శక్తిని ఎందుకు చూపలేదు? ఒక సమాధానం - పాండవుల శక్తి సామర్థ్యాలు లోకోత్తరాలు. ఆకస్మికంగా వారు విజృంభించారు. ఇంకో సమాధానం:

దుర్యోధనుడు గర్వాంధుడు. అతనికి పాండవుల శక్తి సామర్థ్యాలు తెలియటం మంచిదే. అప్పుడు గాని అతడు భీష్మద్రోణుల గొప్పతనం గుర్తింపలేడు. అందుకని వారు ఉపేక్ష చేసి ఉండవచ్చు. మరియొక సమాధానం - మనోధర్మవేత్తలు సూచించేది. భీష్మ ద్రోణులకు - వారి మనస్సులలో - అంతరాంతరాలలో పాండవులపై అభిమానం, గౌరవం ఉన్నాయి. అంతేగాక - తాము అధర్మపక్షం, వహించి యుద్ధం చేస్తున్నామనే అపరాధశంక వారి హృదయాలను వారికి తెలియకుండానే వేధించుతూ ఉండవచ్చును.

మహాభారతంలో మానవహృదయ క్షీరసాగరమథనం కన్పిస్తుంది.

క. ఐనను నోపిన భంగిని । భూనాయక! పాండు రాజపుత్ర సముద్య
త్సేనలఁ గూల్చెదఁ గనుఁగొను । మీ! నీవును బంధులును సమీపస్థులరై. 125

ప్రతిపదార్థం: భూనాయక!= ఓ రాజా(దుర్యోధనా)!; ఐనను= ఐనప్పటికీ(పాండవులు దుర్జయులు అయినప్పటికీ); పాండురాజపుత్ర+ సముద్యత్+సేనలన్= పాండవులయొక్క ఉద్యమించుచున్న సైన్యాలను; నా+ఓపిన భంగిన్= నా శక్తివంచన లేకుండగా; కూల్చెదన్= సంహరింపగలను; నీవును= నీవూ; బంధులును= చుట్టాలూ; సమీపస్థులరు+ఐ= దగ్గరగా ఉన్నట్టివారై; కనుఁగొనుము+ఈ!= చూడవయ్యా!

తాత్పర్యం: ఓ దుర్యోధన మహారాజా! పాండవులు దుర్జయులే అయినప్పటికీ, నా శక్తివంచన లేకుండా పాండవుల సేనలను సంహరింపగలను. నీవూ నీ బంధువులూ దగ్గరగా నిలిచి చూడవచ్చు.

విశేషం: భీష్ముడు దుర్యోధనుని 'భూనాయక' అని సంబోధించాడు. దుర్యోధనుడు రాజు. భీష్ముడు ఇపుడు 'పితామహుడు కాడు. దుర్యోధనుడు మనుమడూ కాడు. దుర్యోధనుడు రాజు, భీష్ముడు రాజ సేనాధిపతి. భీష్ముడు - తన విధ్యుక్త ధర్మాన్ని 'శక్తివంచన లేకుండా' 'ఓపినభంగి' నిర్వహించగలనని పునరుద్ఘాటించాడు.

వ. అని పలికి సంరంభంబున విజృంభించిన ధార్తరాష్ట్రులు ముదితమానసులై శంఖంబులు పూరింప భేరీ మృదంగాదితూర్యస్వనంబులు సెలంగుటయును. 126

ప్రతిపదార్థం: అని+పలికి= అనిచెప్పి; సంరంభంబునన్= ఆవేశంతో; విజృంభించినన్= అతిశయించగా; ధార్తరాష్ట్రులు= ధృతరాష్ట్రుని కొడుకులు; ముదిత+మానసులు+ఐ= సంతోషించిన మనస్సులు కలవారై; శంఖంబులు+పూరింపన్= శంఖాలు మ్రోగింపగా; భేరీ, మృదంగ+ఆది, తూర్య, స్వనంబులు= భేరులు, (మద్దెలలు మున్నగు బూరాల మ్రోతలు; చెలంగుటయును= మ్రోయగా.

తాత్పర్యం: భీష్ముడు ఆ విధంగా పలికి, విజృంభించాడు. దుర్యోధనుడు మున్నగువారు - సంతోషించిన మనస్సులు కలవారై శంఖాలు పూరించారు. సైనికులు ఉప్పొంగిపోయి భేరులు- మద్దెలలు-తూర్యాలు మున్నగు జంత్రవాద్యాలను మ్రోగించారు.

క. విని పాండు నందనులు శం । ఖ నినాదము లుల్లసిల్లగా బహుతూర్య
ధ్వను లడరఁగఁ దిరమై తమ । మొన నిరతముగా నొనర్చి ముదము దలిర్పన్. 127

ప్రతిపదార్థం: విని= కౌరవుల శంఖరావములు మున్నగు హర్షధ్వానాలు ఆలకించి; పాండు నందనులు= పాండవులు; శంఖ+నినాదములు= శంఖముల ధ్వనులు; ఉల్లసిల్లఁగాన్= చెలరేగగా; బహు తూర్య ధ్వనులు= పెక్కు బూరాల ధ్వనులు; అడరఁగన్= వ్యాపింపగా; తమ+మొన= తమసేన; తిరము+ఐ= స్థిరమై; నిరతముగాన్= ఎల్లపుడు ఉండేటట్లుగా; ఒనర్చి= చేసి; ముదము+తలిర్పన్= సంతోషం అతిశయింపగా.

తాత్పర్యం: కౌరవుల శంఖనాదాలు, భేరీమృదంగాది తూర్యస్వనాలు విని, పాండవులు శంఖ నాదాలు చేలరేగగా బహుతూర్య నాదాలు వ్యాపింపగా స్థిరంగా తమ సేన ఎల్లప్పుడుండేటట్లుచేసి సంతోషం ఒప్పగా (తరువాతి వచనంతో అన్వయం)

పాండవులు కూడా- శంఖాలు పూరించి హర్షోద్వేగంతో సేనలను పురికొల్పి వెడలారు.

వ. నడచి రనిన విని సంజయునకు ధృతరాష్ట్రుం డిట్లనియె. 128

ప్రతిపదార్థం: నడచిరి+అనినన్= వెడలిరి అని చెప్పగా; సంజయునకున్; ధృతరాష్ట్రుండు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: అని చెప్పగా, ధృతరాష్ట్రుడు సంజయుడితో ఇట్లా అన్నాడు:

క. దుర్యోధనుమాటకు భుజ । వీర్యోద్ధతి భీష్ముఁడేచి విక్రమలీలా
ధుర్యతఁ గడఁగినఁ గయ్యం । బార్యస్తవనీయ! యెట్టులయ్యెం జెపుమా.' 129

ప్రతిపదార్థం: ఆర్యస్తవనీయ!= ఆర్యుల (ఉత్తముల)చేత కీర్తింపబడిన సంజయా!; దుర్యోధను మాటకున్= దుర్యోధనుని పలుకులకు; భుజ+వీర్య+ఉద్ధతిన్= భుజబల పరాక్రమ ప్రకర్షచే; భీష్ముఁడు; ఏచి= విజృంభించి; విక్రమ+లీలా+ధుర్యతన్= శౌర్యం అనే క్రీడను వహించటం చేత; కడఁగినన్= పూనగా; కయ్యంబు= యుద్ధము; ఎట్టులు+అయ్యెన్= ఏ విధంగా అయింది; చెపుమా!= చెప్పవయ్యా!

తాత్పర్యం: పూజ్యుల ప్రశంసలకు పాత్రుడవైన ఓ సంజయా!, దుర్యోధనుడి పలుకులు విని, భీష్ముడు ఏ విధంగా విజృంభించి, తన పరాక్రమం ప్రదర్శించాడో, ఆతడి యుద్ధం ఎట్లా సాగిందో వివరించి చెప్పవయ్యా!'

వ. అనిన విని సంజయుం డతని కి ట్లనియె నప్పుడు ప్రభాకరుండు నభోమధ్యంబునకు వచ్చి వెలుంగుచున్న నతనితోడిపురుడునం దేజోమహిమ దలకొన్న తెఱంగునం దనమెఱుంగువాలమ్ము లనుకిరణమ్ములు వరఁగించుచుఁ బ్రతాపదీపితుండగు దేవవ్రతుండు దేవేంద్రసుతుం డాఁకిన . 130

ప్రతిపదార్థం: అనినన్+విని; సంజయుండు; అతనికిన్= ధృతరాష్ట్రునకు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు; అప్పుడు= ఆ సమయంలో; ప్రభాకరుండు= సూర్యుడు; నభస్+మధ్యంబునకున్= నభోమధ్యమునకు= ఆకాశం మధ్యకు; వచ్చి= అరుదెంచి; వెలుంగుచున్నన్= ప్రకాశించుచుండగా; అతనితోడి+పురుడునన్= ఆ సూర్యునితో సమానత్వంతో; తేజస్+మహిమ= ప్రభాప్రభావం; తలకొన్న+తెఱంగునన్= ఏర్పడిన రీతిగా; తన+మెఱుంగు+వాలు+అమ్ములు= తనవైన ప్రకాశించే వాడి బాణాలు; అను+కిరణమ్ములు= అనే మయూఖములు(వెలుగులు); పరఁగించుచున్= ప్రసరిస్తూ; ప్రతాప+దీపితుండు= పరాక్రమంతో వెలుగొందే; దేవవ్రతుండు= భీష్ముడు; దేవేంద్ర+సుతున్= దేవేంద్రుని కొడుకు అర్జునుడిని; తాఁకెన్= మార్కొన్నాడు.

తాత్పర్యం: సంజయుడు ధృతరాష్ట్రునితో ఈ విధంగా చెప్పాడు. 'అప్పుడు సూర్యుడు ఆకాశమధ్యానికి వచ్చి ప్రకాశించాడు. ఆ సూర్యుడితో తేజోమహిమలో సమానుడు అయినట్లుగా భీష్ముడు, వాడి బాణాలు అనే తీక్ష్ణ కిరణాలను ప్రసరించాడు. ఈ విధంగా ప్రతాపంతో వెలుగొందుతూ, భీష్ముడు అర్జునుని మార్కొన్నాడు.

విశేషం: దేవవ్రతుడు= భీష్ముని ఔరస నామధేయం. దేవవ్రతుడు తండ్రికోసం - ఆజన్మ బ్రహ్మచర్య దీక్ష వహిస్తానని ప్రతిజ్ఞ చేయటం చేత అతడికి 'భీష్ముడు' అనే బిరుదనామం సంక్రమించింది.

చ. కడఁగి సుయోధన ప్రభృతి కౌరవవీరులు భీష్ముతోన బె
ట్టడరిన భీమముఖ్యులగు నక్కడి యోధులు నొక్క యుమ్మడిన్
వడిఁ దలపడ్డ సైన్యము లవారణ రెండును నేచి త్రోచి య
ప్పుడు రభసంబునన్ బెరసి పోరె వియచ్చరకోటి మెచ్చఁగన్. 131

ప్రతిపదార్థం: కడఁగి= పూని; సుయోధన ప్రభృతి కౌరవవీరులు= దుర్యోధనుడు మున్నగు కౌరవ శూరులు; భీష్ముతోన్+అ= భీష్మునితోపాటుగనే; బెట్టు+అడరినన్= మిక్కుటముగ విజృంభించగా; అక్కడి+యోధులు= అక్కడ పాండవపక్షంలోని వీరులు; ఒక్క ఉమ్మడిన్= ఒకే మారుగా; వడిన్= వేగంగా; తలపడ్డన్= మార్కొనగా; సైన్యములు+రెండును= రెండు సేనలూ; అవారణన్= వారించుటకు వీలులేకుండా; త్రోచి= ముందునకు వచ్చి; అప్పుడు; రభసంబునన్+బెరసి= ఉద్రేకంతో తాకి; వియత్+చర+కోటి= ఆకాశంలో సంచరించే దేవతల సమూహం; మెచ్చఁగన్= ప్రశంసించగా; పోరెన్= యుద్ధం చేశాయి.

తాత్పర్యం: కౌరవవీరులు - సుయోధనుడు మున్నగువారు - భీష్మునితోపాటుగా విజృంభించారు. అటు పాండవ యోధులూ విజృంభించారు. రెండు సేనలూ ఒక్కుమ్మడి తారసిల్లగా ఘోరయుద్ధం జరిగింది. ఉభయ సేనలలోని యోధుల పరాక్రమాన్నీ ఆకాశంలో సంచరించే దేవతాగణాలు ప్రస్తుతించాయి.

విశేషం: యుద్ధంలో వీరులు ప్రదర్శించే పరాక్రమాన్ని ఖేచరులైన చారణులు మెచ్చుకోవటం తిక్కన పలుచోట్ల వర్ణించాడు.

వ. అట్టియెడ. 132

ప్రతిపదార్థం: అట్టి+ఎడన్= ఆ సమయంలో.

తాత్పర్యం: ఆ సమయంలో, యుద్ధభూమిలో.

క. హుంకారములు నదల్పులు । జంకెలు ధిక్కరణములును సంస్తుతులును వీ
రాంకోక్తులు నిస్సాణజ । ధ్వంకృతులును గలిసి యుద్ధటంబుగఁ బెఱిగెన్. 133

ప్రతిపదార్థం: హుంకారములు= హుం అనే ధ్వనులు (రా- నీ ప్రతాపం చూస్తాను అని అర్థం వచ్చేటట్లు యుద్ధవీరులు చేసే నినాదం); అదల్పులు= మందలింపులు; జంకెలు= బెదరింపులు; ధిక్కరణములు= నిరసనలు; సంస్తుతులును= పొగడ్తలు; వీర+అంక+ఉక్తులు= వీరులకు చిహ్నములైన మాటలు; నిస్సాణజ+ఢాంకృతులును= జంత్ర వాద్య విశేషమునుండి పుట్టిన 'ఢాం' శబ్దాలు; కలిసి; ఉద్భటముగన్= భయంకరంగా; పెఱిగెన్= వ్యాపించాయి.

తాత్పర్యం: ఆ సమయంలో - యుద్ధభూమిలో హుంకారాలు - మందలింపులు - నిరసనలు - పొగడ్తలు వీరోచితమైన పలుకులు - జంత్రవాద్యాల ఢాంకృతులతో కలసి భయంకరంగా వ్యాపించాయి.

విశేషం: మూల సంస్కృత భారతంలో శంఖరావాలు మున్నగునవి అక్కడక్కడ యుద్ధంలో అంతర్భాగంగా పేర్కొనబడ్డాయి. ఈ పద్యంలో వర్ణింపబడినవన్నీ - తిక్కన సమకాలీన యుద్ధవృత్తాలుగానే ఎంచవచ్చును.

క. తునిసిన బాహామస్తక । తనుచరణంబులును బాణ తరవారి గదా
ధనువులుఁ గిరీట కంకణ । కనదంగదములును దఱచుగా ధరఁ దొరఁగెన్. 134

ప్రతిపదార్థం: తునిసిన= ముక్కలు ముక్కలయిన; బాహా, మస్తక+తను, చరణంబులును= చేతులు, తలలు, శరీరాలు, పాదాలు; బాణ తరవారి గదా ధనువులున్= అమ్ములు, కత్తులు, గదలు, చాపాలు; కిరీట కంకణ కనత్ అంగదములును= కిరీటాలు, చేతికడియాలు, ప్రకాశించే భుజకీర్తులును; తఱచుగాన్= దట్టముగా; ధరన్= భూమిపై; తొరఁగెన్= పడ్డాయి.

తాత్పర్యం: ఖండింపబడిన చేతులు, తలలు, శరీరాలు, పాదాలు, బాణాలు, కత్తులు, గదలు, విండ్లు, కిరీటాలు, చేతికడియాలు, భుజకీర్తులు దట్టంగా యుద్ధభూమిపై పడ్డాయి.

తే. సగము సచ్చిన యొడళులు జలచరములు । రక్త పూరంబు దోయంబు ప్రచురమాంస
పటలి పంకంబుగాఁగల బహునదీ ప్ర । వాహములు వాఱె సంగరావని నృపాల! 135

ప్రతిపదార్థం: నృపాల!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; సగము+చచ్చిన= సగము మరణించిన; ఒడళులు= కళేబరాలు; జలచరములు= చేపలు; రక్తపూరంబు= నెత్తురు వరద; తోయంబు= నీరు; ప్రచుర, మాంస, పటలి పంకంబుగాన్= అధికమైన మాంసపు ముక్కల బురద సమూహంగా; కల= ఉన్న; బహు+నదీ+ప్రవాహములు= పెక్కు నదుల ప్రవాహాలు; సంగర+అవనిన్= యుద్ధభూమిలో; పాఱెన్= ప్రవహించాయి.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! సగము చచ్చిన శరీరాలు చేపలుకాగా, నెత్తురు వెల్లువ జలము కాగా, అధికమైన మాంసఖండముల సముదాయం బురదకాగా పెక్కు నదీప్రవాహాలు యుద్ధభూమిలో ప్రవహించాయి.

క. అఱవఱ లైన రథంబులు । నెఱిదప్పఁగఁ బడిన యశ్వనికరంబులుఁ బెం
దఱచుగఁ గూలిన కరులు । న్నిఱిగొనియెన్ సమరమేదినీతల మెల్లన్. 136

ప్రతిపదార్థం: అఱవఱలు+ఐన+రథంబులు= చిన్న చిన్న ముక్కలయిన తేరులు; నెఱి+తప్పఁగన్+పడిన= ఆకారము మారిపోయి పడిన; అశ్వ+నికరంబులున్= గుర్రాల గుంపులూ; పెన్+తఱచుగన్= మిక్కిలి దట్టంగా; కూలిన= పడిపోయిన; కరులున్= ఏనుగులూ; సమర+మేదినీ+తలము+ఎల్లన్= యుద్ధభూమి స్థలము అంతటినీ; గిఱికొనియెన్= ఆవరించాయి.

తాత్పర్యం: చిన్న చిన్న ముక్కలైన తేరులు, ఆకారం మారిపోయిన గుఱ్ఱాలు. మిక్కిలి దట్టంగా మారిన ఏనుగులు - యుద్ధభూమిని ఆవరించాయి.

వ. ఇవ్విధంబున విషమం బగు రణభూభాగంబునం జరియింపం జతురులు గాక రథికజనుఁ లంతంత గుంపులు గట్టిరి గాంగేయుండు ప్రతియోధులం బేరువేరం బిలుచుచు నుక్కుమిగిలి దిక్కు లమ్ములం బిక్కటిల్లం జేయుచు నెక్కడఁ జొచినం దానయై మెఱుంగు మెఱసిన తెఱంగునం గొఱవి ద్రిప్పిన యొప్పున నింద్రజాలంబు సూపిన చందంబునం దన రథంబు నెఱయ శక్తి శౌర్యంబులు నెఱయ నెవ్వరికి నిలువరింపరాక యెదిరిన రూపంబులం బెక్కింటి నొక్కబాణంబునం బెక్కుబాణంబుల నొక్కంటిఁ గూల్చి కేళి సలుపుచు నఱిమి పయింబడినవీరులం గీలెడలినజంత్రంబులుం బోలె నేలం గూల నేయుచు దృఢత్వలక్ష్యశుద్ధిలాఘవంబులకు వియచ్చరులు పిచ్చలింప ననేక ప్రకారంబు లగు క్రూరశరంబులఁ జతురంగంబులుం దునియలుం బఱియలుం దుమురులుం గుదులు నై బడలువడం జేయుచుం గార్చిచ్చు పొదివిన పోలిక మాయ గావించిన మాడ్కి మంత్రించి పడవైచిన పగిదిం గసిమసంగి కౌంతేయసేనం గనుపుకొట్టుచుఁ బ్రళయ కాలతాండవ ప్రవర్తి యైన ఫాలలోచనులీల నాజిరంగంబునం బరాక్రమనృత్యంబు సేయుచున్నం బాంచాలయాదవాదియోధులు వెఱఁగుపడి చూచుచుండఁ బాండవులునుం జేయునదిలేక చేష్టలు దక్కినం దదీయసైన్యంబులు రూపఱి భయభ్రాంతంబు లై దీనదశకు వచ్చె నప్పుడు శౌరి యుగ్యంబుల పగ్గంబులఁ బట్టి పార్థునితో ని ట్లనియె. 137

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ రీతిగా; విషమంబు+అగు= అడ్డదిడ్డంగా ఉన్న; రణ+భూ+భాగంబునన్= యుద్ధభూమిమీద; చరియింపన్= తిరుగుటకు, చతురులు+కాక= తెలివితేటలు గలవారుగాక; రథిక+జనులు= యోధులు; అంతంతన్= అక్కడక్కడ; గుంపులు+కట్టిరి= మూగారు; గాంగేయుండు= గంగకొడుకు(భీష్ముడు); ప్రతియోధులన్= శత్రువులను; పేరుపేరన్+పిలుచుచున్= వారి వారి పేరులతో పేర్కొనుచు; ఉక్కు+మిగిలి= పరాక్రమం అతిశయించి; దిక్కులు= దెసలు; అమ్ములన్= బాణాలతో; పిక్కటిల్లన్+చేయుచున్= నిండిస్తూ; ఎక్కడన్+చూచినన్= ఏ చోటున అరసినా; తాను+ఐ= తానే కన్పించి; మెఱుంగు+ మెఱసిన+ తెఱంగునన్= మెరపుతీగె మిరుమిట్లు గొల్పినట్లు; కొఱవి+త్రిప్పిన+ఒప్పునన్= మండేకట్ట గిఱగిఱా త్రిప్పినట్లుగా; ఇంద్రజాలంబు+చూపిన+చందంబునన్= గారడీ చేసినట్లుగా; తన+రథంబు+నెఱయన్= తనతేరు మెరయగా; తన+శక్తి+శౌర్యంబులు నెఱయన్= తన బలము పరాక్రమము నిండార భాసింపగా; ఎవ్వరికిన్; నిలువరింపన్ రాక= ఆపవీలుగాక; ఎదిరిన+రూపంబులన్= మార్కొనిన ఆకారాలను; పెక్కింటిన్= చాలావాటిని; ఒక్క+బాణంబునన్= ఒకే అమ్ముతో; పెక్కు+బాణంబులన్= పలు అమ్ములతో; ఒక్కంటిన్= ఒకదానితో; కూల్చి= క్రిందపడవేసి; కేళి సలుపుచున్= ఆట ఆడుచు; అఱిమి+పయింబడిన= ఆర్చిపై బడిన; వీరులన్= యోధులను; కీలు+ఎడలిన+జంత్రంబులున్+పోలె= (తిరుగుటకు బొమ్మలలో ఏర్పరచిన); మర సడలిన యంత్రాలవలె; నేలన్= భూమిపై; కూలన్+ఏయుచున్= పడిపోయేటట్లు చేస్తూ; ధృఢత్వ లక్ష్య శుద్ధి, లాఘవంబులకున్= గట్టిగా (లక్ష్యాన్ని) సులువుగా గురిని కొట్టడంలో తప్పని సూటిదనాన్ని; వియత్+చరులు= ఆకాశంలో సంచరించే దేవతలు; పిచ్చలింపన్= భయపడగా; అనేక+ ప్రకారంబులు+అగు= పెక్కు విధాలుగా ఉన్న; క్రూర శరంబులన్= భయంకరమైన బాణాలలో; చతుఃఅంగంబులున్= నాలుగు అంగాలు(రథ-గజ-తురగ-పదాతులు); తునియలున్= ముక్కలు; పఱియలున్= బ్రద్దలును; తుమురులును= ముక్కలును; గుదులును+ఐ= గుత్తులుగానై; బడలు+పడన్+చేయుచున్= నొవ్వజేస్తూ; కార్చిచ్చు+పొదివిన పోలికన్= దావానలము క్రమ్ముకున్న రీతిగా; మాయ, కావించిన, మాడ్కిన్= భ్రాంతి కలిగించినట్లుగా; మంత్రించి పడవైచిన పగిదిన్= మంత్రంతో అద్భుతం సృష్టించినట్లుగా; కసిమసంగి= విజృంభించి; కౌంతేయ+సేనన్= పాండవసేనను(కుంతీ పుత్రుల సైన్యాన్ని); కనుపుకొట్టుచున్= పోరాటంలో ముంచుతూ; ప్రళయ కాల తాండవ ప్రవర్తి+ఐన= ప్రళయం ఏర్పడిన సమయంలో

నృత్తం చేసే; ఫాలలోచనులీలన్= ముక్కంటివలె; ఆజి రంగంబునన్= యుద్ధక్షేత్రమునందు; పరాక్రమ+నృత్యంబు+చేయుచున్నన్= శౌర్యనాట్యం చేయుచుండగా; పాంచాల యాదవ+ఆది యోధులు= పాంచాల దేశానికి, యాదవజాతికి చెందిన వీరులు; వెఱగుపడి= భయపడి; చూచుచుండన్= వీక్షింపగా; పాండవులు; చేయునదిలేక= చేయగల ప్రక్రియలేక; చేష్టలు+తక్కినన్= నివ్వెఱగంది చూడగా; తదీయ+సైన్యంబులు= వారి సేనలు; రూపఱి= ఆకారములు తప్పి; భయ భ్రాంతంబులు+ఐ= భీతితో సమ్మోహితులై; దీన+దశకున్+వచ్చెన్= హీనస్థితికి చేరాయి; అప్పుడు; శౌరి= శ్రీకృష్ణుడు; యుగ్యంబుల= అశ్వముల; పగ్గంబులన్= గుర్రాలకు వేసిన; త్రాళ్ళు; పట్టి; పార్థునితోన్= అర్జునునితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఈ రీతిగా - అడ్డదిడ్డంగా ఉన్న యుద్ధభూమిలో చరించటానికి వీలుగాక, యోధులు అక్కడక్కడ గుంపులు గూడారు. భీష్ముడు పరాక్రమంతో విజృంభించాడు. దిక్కులు పిక్కటిల్లేటట్లుగా అమ్ములు ప్రయోగించాడు. ఎక్కడ చూచినా భీష్ముడే కన్పించాడు. కొఱవి త్రిప్పిన చందంబున - ఇంద్రజాలము వలె - తన రథం తోలించాడు. అతని ధాటికి ఎవ్వరూ ఆగలేకపోయారు. ఎదిరించిన పెక్కు ఆకారాలను ఒక్క బాణంతో ఛేదించాడు. ఒక్క ఆకృతిని పెక్కు బాణాలతో కూల్చాడు. ఆ విధంగా సంగ్రామ క్రీడ సాగించాడు. తన మీదకు వచ్చి పడిన యోధులను - కీలెడలిన జంత్రాల వలె చేసి క్రింద పడవేశాడు. భీష్ముడి దృఢత్వం - లక్ష్యశుద్ధి - సులువుగా అమ్ములు ప్రయోగించటంలో గల నేర్పు దీనినంతటినీ ఆకాశ సంచారులయిన చారణులు ప్రశంసించారు. శాత్రవుల చతురంగ బలాలను భీష్ముడు నేలమట్టం చేశాడు. అతని క్రూరబాణాలకు - రథాలు విరిగాయి, ఏనుగులు చచ్చాయి. అశ్వాలు ముక్కచెక్కలయ్యాయి. పదాతులు నేలగూలారు. కార్చిచ్చు అడవిని దహించినట్లు అతడు విలయతాండవం చేశాడు. అతడు బాణాలను అభిమంత్రించి వదలాడా? అన్నట్లు ప్రళయకాల రుద్రుడివలె పరాక్రమనృత్యం చేశాడు. పాంచాలయాదవ వీరులు చేష్టలు దక్కి నివ్వెఱగంది చూచారు. పాండవులు ఏమీ చేయలేకపోయారు. పాండవసేనలు భయభ్రాంతితో అలమటించి పోయాయి. అప్పుడు శ్రీకృష్ణుడు తేరుకు కట్టిన గుఱ్ఱాల పగ్గాలు చేతితో పట్టుకొని, అర్జునుడితో ఈ విధంగా అన్నాడు:

చ. కృపగురుభీష్మయుక్తముగ గెల్తు సుయోధనుసేన నంచు నీ
వపరిమితోగ్రశక్తి మెఱయం దఱి గోరుచు నుండు దెప్పుడుం
గుపితయుగాంతరుద్రుగతిఁ గోలుమసంగినవాఁడు భీష్ముఁ డే
చి పటుభుజాబలంబు విలసిల్లఁగ మార్కొన కున్కి యొప్పనే?' 138

ప్రతిపదార్థం: కృప, గురు, భీష్మ, యుక్తముగన్= కృపుడు - ద్రోణుడు - భీష్ముడు కలిసియుండగా; సుయోధను సేనన్= దుర్యోధనుని సైన్యాన్ని; గెల్తున్+అంచున్= జయింపగలను అని చెప్పుతూ; నీవు; ఎప్పుడున్= ఎల్లప్పుడు; తఱిన్= అవకాశమును; కోరుచున్; ఉండుదు= ఉంటావు; అపరిమిత ఉగ్ర శక్తి మెఱయన్= అంతులేని భయంకరమైన సామర్థ్యం వెలుగొందునట్లుగా; భీష్ముఁడు= భీష్ముడు; కుపిత యుగ అంత రుద్రుగతిన్= యుగముల చివరి భాగ సమయంలో కోపించిన ఈశ్వరునివలె; కోలుమసంగిన వాఁడు= మిక్కుటంగా విజృంభించాడు; ఏచి= అతిశయించి; పటు భుజా బలంబు= గొప్పదైన పరాక్రమం; విలసిల్లఁగన్= ప్రకాశించగా; మార్కొనక+ఉన్కి= తాకకుండా ఉండటం; ఒప్పనే?= న్యాయమా?(మంచిదా?)

తాత్పర్యం: 'ఓ అర్జునా!, కృపాచార్యుడు -ద్రోణుడు, భీష్ముడు కలిసియున్న కౌరవ సేనను ఓడించగలనని నీవు ఎన్నోసారులు చెప్పి ఉన్నావుగా! ఇదిగో. ఇప్పుడు అట్టి అవకాశం వచ్చింది. ఇప్పుడు ప్రళయ సమయంలో రుద్రునివలె భీష్ముడు విజృంభించాడు. నీవు నీ పరాక్రమం చూపి అతనిని మార్కొనక యుండటం మంచిదికాదు.

అర్జునుఁడు శ్రీకృష్ణప్రేరితుం డై భీష్మునిపైఁ గవియుట (సం. 6-55-40)

క. ‘ అనిన విని యర్జునుం డి । ట్లను ‘నీ విం తనఁగ నేల? యాతనిమీఁదన్
మనరథముఁ బఱపు మిప్పుడ । సునిశితబాణముల నతని సొం పడఁగింతున్.’ 139

ప్రతిపదార్థం: అనినన్= అని శ్రీకృష్ణుడు చెప్పగా; విని; అర్జునుండు; ఇట్లు; అనున్= చెప్పాడు; నీవు; ఇంత+అనఁగన్+ఏల?= నీవు ఇంతగా నొక్కి చెప్పాలా?; ఆతనిమీఁదన్= ఆ భీష్ముని మీదకు; మనరథమున్; పఱపుము= తోలునది; ఇప్పుడు+అ= ఈ సమయంలోనే; సు నిశిత బాణములన్= మిక్కిలి వాడిగల అమ్ములతో; అతని+సొంపు= ఆ భీష్ముని అందము; అడఁగింతున్= పోగొట్టగలను.

తాత్పర్యం: అని- శ్రీకృష్ణుడు చెప్పగా విని - అర్జునుడు ఈ విధంగా అన్నాడు. ‘నీవు ఇంతగా నొక్కి వక్కాణింపవలెనా? వెంటనే మనరథం భీష్మునిపైకి తరలించుము. నేను మిక్కిలి వాడి అమ్ములు ప్రయోగించి అతని గొప్పదనం - అణగారునట్లు చేయగలను.’

చ. అనుటయు ‘నట్లకాక’ యని యచ్యుతుఁ డుద్ధతిఁ దేరు పోవని
చ్చినఁ గని పొంగి యా రథికసింహుఁ డుదంచితసింహనాదుఁడై
నినిచెఁ దురంగదేహముల నీరజనాభునిమేనఁ బాండునం
దను నొడలం బ్రదీప్త ఘనదారుణమార్గణపుంజముల్ వడిన్. 140

ప్రతిపదార్థం: అనుటయున్= అని చెప్పగా; అట్లు+అ= ఆ విధంగానే; కాక+అని= అగునుగాక అని చెప్పి; అచ్యుతుడు= శ్రీకృష్ణుడు; ఉద్ధతిన్= గర్వంగా; తేరు= రథం, పోవనిచ్చినన్= తోలగా; కని= చూచి; ఆ+రథిక+సింహుఁడు= యోధులలో సింహమువంటివాడు (భీష్ముడు); ఉదంచిత+సింహనాదుఁడు+ఐ= గొప్ప సింహనాదం చేసినవాడై; తురంగ+దేహములన్= గుఱ్ఱాల శరీరాలపై; నీరజనాభుని మేనన్= శ్రీకృష్ణుని శరీరంపై; పాండు నందను+ఒడలన్= పాండురాజు కొడుకు అయిన అర్జునుని దేహంపై; వడిన్= వేగంగా; ప్రదీప్త ఘన దారుణ మార్గణ పుంజముల్= మిక్కిలి ప్రకాశంగల, గొప్పవైన, భయంకరములైన అమ్ముల గుంపులు; నినిచెన్= గ్రుచ్చుకొనునట్లు ప్రయోగించాడు.

తాత్పర్యం: అని అర్జునుడు చెప్పగా, శ్రీకృష్ణుడు రథాన్ని భీష్మునిపైకి తరలించాడు. రథికశ్రేష్ఠుడైన భీష్ముడు - సింహనాదం చేసి, గుఱ్రాల శరీరాలపై, శ్రీకృష్ణుడిపై, అర్జునుడిపై వెలుగొందే గొప్ప బాణసమూహాలను ప్రయోగించాడు.

తే. తనదు నొవ్వున కలుకక ధైర్యవృత్తి । నయ్యుపేంద్రుండు నొచ్చిన హయచయంబుఁ
దడవి తేర్పి యుదగ్రతఁ దఱుముటయును । గుణరవం బుల్లసిల్ల ఫల్గునుఁడు గడఁగి. 141

ప్రతిపదార్థం: తనదు+తనయొక్క; నొవ్వునకున్= వేదనకు; అలుకక= భయపడక; ధైర్య వృత్తిన్= దీమసముతో, ఆ+ఉపేంద్రుండు= ఆ కృష్ణుడు; నొచ్చిన= దెబ్బతిన్న; హయ చయంబున్= గుఱ్రాల సముదాయమును; తడవి= నిమిరి; తేర్పి= సేదదీర్చి; ఉదగ్రతన్ భయంకరంగా; తఱుముటయును= తోలుటతో; ఫల్గునుఁడు= అర్జునుడు; గుణ రవంబు= వింటి అల్లెత్రాటినుండి వెలువడే ధ్వని; ఉల్లసిల్లన్= వ్యాపింపగా; కడఁగి= పూని.

తాత్పర్యం: భీష్ముడు శ్రీకృష్ణుని రథాశ్వాలను, అర్జునుడిని నొప్పించాడు. శ్రీకృష్ణుడు తన బాధ మరచిపోయి, గుఱ్రాలను నిమిరి వాటి బాధ పోగొట్టి - రథాన్ని భయంకరంగా తోలాడు. అర్జునుడు అల్లెత్రాటి ధ్వని ఒప్పగా పూని.

విశేషం: శ్రీకృష్ణుడు కర్మయోగి. అతని దృష్టిలో హేయమైన పనిలేదు. సారథిగా ఉండటానికి సమ్మతించడమే గాక - గుర్రాలకు బాధ కలిగినపుడు, తన బాధను కూడా మరచిపోయి వాటికి సేవచేశాడు. సేవాధర్మములోని పవిత్రత గుర్తించిన మహానుభావుడు శ్రీకృష్ణుడు.

క. భల్లంబొకటఁ బితామహు । విల్లు దునుమ వేఱొకండు వెస నెత్తిన న
వ్విల్లును దునిమినలాఘవ । ముల్లంబునఁ బొగడి యేసె నొండొకవింటన్. 142

ప్రతిపదార్థం: భల్లంబు+ఒకటన్= ఒక ఈటె బాణంతో; పితామహు+విల్లు= భీష్ముని ధనుస్సు; తునుమన్= ఖండింపగా; వేఱు+ఒకండు= ఇంకో విల్లు; వెసన్= వేగంగా; ఎత్తినన్= తీసుకోగా; ఆ+విల్లును= ఆ ధనువునుగూడా(అర్జునుడు); తునిమిన లాఘవము= ఖండించిన నేర్పును; ఉల్లంబునన్= మనస్సులో; పొగడి;(భీష్ముడు); ఒండొక+వింటన్= ఇంకో ధనుస్సుతో; ఏసెన్= అమ్ములు వేశాడు.

తాత్పర్యం: అర్జునుడు ఒక ఈటె బాణంతో భీష్ముడి విల్లు తునిమాడు. భీష్ముడు మరియొక ధనుస్సు పుచ్చుకున్నాడు. మరల ఆ ధనువును ఖండించాడు అర్జునుడు. అర్జునుని ప్రయోగనైపుణ్యాన్నీ శక్తి సామర్థ్యాలనూ భీష్ముడు తన మనస్సులో మెచ్చుకొంటూ - మరియొక విల్లుతో అమ్ములు ప్రయోగించాడు.

విశేషం: ఒకండు= ఒకటి - రెండూ గ్రాంథికాలే. ఏడార్థకమైన ఒకఁడు మహదమహదుభయార్థకంగా ప్రయోగింపబడుతుంది. ఇక్కడ అమహదర్థంగా ప్రయోగించబడింది. పురుషుఁడొక్కడు - ఇక్కడ మహత్తు. పుస్తకమొకఁడు - ఇక్కడ అమహత్తు.

తే. ఇట్లు గాంగేయుఁ డేయుననేక విశిఖ । వితతి యసురారి రథచిత్రగతుల దప్పి
పోవఁ జేయంగ నతఁ డంతఁ బోక నొంచె । నరుని నారాయణుని బలునారసముల. 143

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; గాంగేయుఁడు= గంగకొడుకు(భీష్ముడు); ఏయు= వేసే; అనేక+విశిఖ+వితతి= పెక్కు బాణాల సముదాయం; అసుర+అరి= రాక్షసుల విరోధి, శ్రీకృష్ణుడు; రథ+చిత్ర+గతులన్= అచ్చెరువు గొలిపేటట్లు తేరు నడిపి; తప్పి+పోవన్+చేయంగన్= తప్పిపోయేటట్లు చేయగా; అతండు= భీష్ముడు; అంతన్+పోక= అంతటితో ఆగక; నరునిన్= అర్జునుని; నారాయణునిన్= శ్రీకృష్ణుని; బలు+నారసములన్= గొప్ప అమ్ములతో; నొంచెన్= నొప్పించాడు.

తాత్పర్యం: ఈ విధంగా భీష్ముడు బాణాలు ప్రయోగించగా రథాన్ని చిత్ర విచిత్రంగా నడిపి - ఆ బాణాలు తప్పిపోయేటట్లుగా చేశాడు సారథియైన శ్రీకృష్ణుడు. భీష్ముడు అంతటితో ఊరుకోకుండా కృష్ణుడినీ - అర్జునుడినీ అమ్ములతో నొప్పించాడు.

క. నొచ్చియు భీష్మునిపై వి । వ్వచ్చుఁడు బెడిదముగఁ గురిసె వాలమ్ము లతం
డచ్చెరువుతోడ వెసఁ గా । ల్చిచ్చు గవిసినట్లు పొదివె శితవిశిఖములన్. 144

ప్రతిపదార్థం: నొచ్చియున్= బాధపడుతూనే; భీష్మునిపైన్; వివ్వచ్చుఁడు= అర్జునుడు; బెడిదముగన్= ఎక్కువగా; వాలు+అమ్ములు= వాడి బాణాలు; కురిసెన్= వర్షించాడు; అతండు= భీష్ముడు; అచ్చెరువుతోడన్= ఆశ్చర్యంతో, వెసన్= వేగంగా; కాల్చిచ్చు= దావానలం; కవిసినట్లు= పైబడినట్లుగా; శిత+విశిఖములన్= వాడి అమ్ములను; పొదివెన్= చుట్టూ ప్రయోగించాడు.

తాత్పర్యం: తాను బాధపడుతూనే, అర్జునుడు భీష్మునిపై గట్టిబాణాలు గుప్పాడు. భీష్ముడు - ఆశ్చర్యంతో మరలా వాడి బాణాలతో అర్జునుడిని కప్పాడు.

వ. అంత నపరాహ్ణం బయ్యె నట్టియెడ. 145

ప్రతిపదార్థం: అంతన్= అటుపిమ్మట; అపర+అహ్ణంబు= మధ్యాహ్న సమయం; అయ్యెన్= ఏర్పడింది; అట్టి+ఎడన్= ఆ సమయంలో.

తాత్పర్యం: అంత మధ్యాహ్నమయింది, ఆ సమయంలో.

క. హరి దాను నొచ్చి నొచ్చిన । నరునితెఱం గెఱిఁగి భీష్మునకు నించుకయుం
గరలాఘవ మెడలమియుం । దిర మై పరికించి తనమదిం దలపోయున్. 146

ప్రతిపదార్థం: హరి= శ్రీకృష్ణుడు; తాను నొచ్చి= బాధింపబడి; నొచ్చిన+నరుని+తెఱంగు= బాధపడుచున్న అర్జునునితీరు; ఎఱిఁగి= తెలిసికొని; భీష్మునకున్= భీష్మునకు; ఇంచుకయున్= ఏ మాత్రమూ; కర+లాఘవము= చేతులందలి సులువు; ఎడలమియున్= తగ్గకపోవటం; తిరము+ఐ+పరికించి= బాగుగా అరసి; తన మదిన్= తన మనస్సులో; తలపోయున్= ఆలోచించాడు.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు తాను దెబ్బతిన్నాడు. అర్జునుడు కూడా దెబ్బతిన్నట్లు తెలుసుకున్నాడు. అయితే భీష్ముని 'కరలాఘవము' (చేతుల ఒడుపు) ఏ మాత్రం తగ్గలేదని గ్రహించి - తన మనస్సులో ఈ విధంగా అనుకున్నాడు.

ఉ. ' పాండవసైన్యముల్ గలఁగి పాఱెడు సిగ్గఱి వీరిలోన నొ
క్కండును భీష్ముమార్కొని మగంటిమి సూపఁగ లేఁడ యింద్ర పు
త్రుండును జూల నొవ్వడరి తూఁగెడు నిట్టిద యైన నేఁడ తీ
ర్పండె? యితండు కౌరవనృపాలుసమస్తమనోరథంబులున్. 147

ప్రతిపదార్థం: సిగ్గు+అఱి= సిగ్గులేకుండా; పాండవ+సైన్యముల్= పాండవుల సేనలు; కలఁగి= నొచ్చి; పాఱెడున్= పారిపోతున్నాయి; వీరిలోనన్= ఈ పాండవసైనికులలో; ఒక్కండును= ఒక్కడుగూడ; భీష్మున్= భీష్ముని; మార్కొని= ఎదిరించి; మగంటిమి= పౌరుషం; చూపలేడు+అ= చూపించలేకుండా ఉన్నాడు కద!; ఇంద్రపుత్రుండును= ఇంద్రుని కొడుకు(అర్జునుడుకూడా); చాలన్= మిక్కిలి; నొవ్వు+అడరి= నొప్పి అతిశయించి; తూఁగెడున్= వ్రాలుచున్నాడు; ఇట్టిది+అ+ఐనన్= ఈ విధంగానే అయితే; నేఁడు+అ= ఈ దినమే; ఇతండు= ఈ భీష్ముడు; కౌరవ నృపాలు సమస్త మనోరథంబులన్= కౌరవరాజు దుర్యోధనుని కోరికలు అన్నీ; తీర్పండు+ఎ?= నెరవేర్చడా?

తాత్పర్యం: 'పాండవసేనలు సిగ్గులేకుండా పారిపోతున్నాయి. భీష్ముని ఎదిరించి పౌరుషం చూపగల వీరుడు వీరిలో ఒక్కడూ లేడుకదా! అర్జునుడు గూడా వేదనతో తూలిపోతున్నాడు. ఇక - ఈ స్థితిలో దుర్యోధనుడి కోరికలు అన్నీ భీష్ముడు నేడే నెరవేర్చేటట్లు అనిపిస్తున్నది.

క. యాదవకేకయ పాంచా । లాదులు వాఱుటలు సూచి యస మెక్కి జయో
న్మాదంబునఁ గురుసైన్యము । లే దిక్కునఁ దామ యగుచు నేడ్తెఱఁ బొదివెన్. 148

ప్రతిపదార్థం: యాదవ+కేకయ+పాంచాల+ఆదులు= యాదవులు; కేకయ దేశస్థులు; పాంచాల రాజ్యానికి చెందిన వారు-మొదలగు వారు; పాఱుటలు+చూచి= పారిపోవటం వీక్షించి; అసము+ఎక్కి= గర్వం పొంది; జయ+ఉన్మాదంబునన్= విజయం వల్ల వచ్చే పిచ్చితో; కురుసైన్యములు= కౌరవుల సేనలు; ఏ+దిక్కునన్= ఏ వైపున అయినను; తాము+అ+అగుచున్= తామే ఉంటూ; ఏడ్తెఱన్= పరాక్రమంతో; పొదివెన్= చుట్టుముట్టాయి.

తాత్పర్యం: పాండవుల పక్షంలో యుద్ధం చేస్తున్న యాదవుల కేకయుల, పాంచాలుర సేనలు పారిపోవటం చూచి, పొగరెక్కిన విజయోన్మాదంతో కురుసైన్యం అన్నివైపులా చేరి పాండవుల సేనలను చుట్టుముట్టింది.

వ. ఇప్ప డే నూరకున్నం బోవ దీ దేవవ్రతుం జంపి ధర్మతనయు గెలిపింపవలయు' నని యిట్లు దలపోయునెడ మఱియు మందాకినీనందనుండు బెట్టిదమ్ములగు నారసమ్ములు గురియం దఁకువ సెడి క్రీడి యున్నంగని కృప కృతవర్మాశ్వత్థామలును భూరిశ్రవస్సైంధవ వికర్ణులును నొక్కమొగంబై రథమ్ముల మొత్తమ్ములతోడం గడంగి వచ్చి కవ్వడిపయిం బడి రాసమయంబున సాత్యకి సామజఘటలతో నురవడించి యిరుగెలంకుల యోధుల నాలోకించి. 149

ప్రతిపదార్థం: ఇప్పుడు, ఏను= నేను(శ్రీకృష్ణుడు); ఊరకున్నన్= ఉపేక్షిస్తే; పోవదు= సరిపోదు; ఈ+దేవవ్రతున్+చంపి= ఈ భీష్ముని సంహరించి; ధర్మతనయున్= ధర్మపుత్రుని; గెలిపింపవలయున్= నెగ్గేటట్లు చేయాలి; అని= అని ఈ రీతిగా; తలపోయు+ఎడన్= ఆలోచించేటపుడు; మఱియున్= ఇంకను; మందాకినీ+నందనుండు= గంగకొడుకు(భీష్ముడు); బెట్టిదమ్ములు+అగు= కఠినములు అయిన; నారసమ్ములు= బాణాలు; కురియన్= వర్షింపగా; తఁకువ+చెడి= ధైర్యం చెడి; క్రీడి+ఉన్నన్+కని= అర్జునుడు ఉండటం చూచి; కృప కృతవర్మ అశ్వత్థామలును= కృపుడు,కృతవర్మ, అశ్వత్థామ; భూరిశ్రవస్ సైంధవ వికర్ణులును= భూరిశ్రవుడు -సింధురాజు జయద్రథుడు; వికర్ణుడు; ఒక్క+మొగంబు+ఐ= ఏకమై; రథమ్ముల+మొత్తమ్ములతోడన్= తమ రథాలు అన్నిటితోపాటు; కడంగి+వచ్చి= పూని అరుదెంచి; కవ్వడి పయిన్+పడిరి= అర్జునునిపై మార్కొన్నారు; ఆ సమయంబునన్= ఆ సమయంలో; సాత్యకి= సాత్యకి; సామజ+ఘటలతోన్= ఏనుగుల యూథాలతో, ఉరవడించి= వేగంగా చేరి; ఇరు+కెలంకుల యోధులన్= ఇరుపక్షాల వీరులను; అవలోకించి= చూచి.

తాత్పర్యం: ఇపుడు నేను ఉపేక్షిస్తే వీలులేదు - భీష్ముడిని చంపి ధర్మతనయునికి జయం చేకూర్చాలి' అని శ్రీకృష్ణుడు ఆలోచించాడు. ఇదిగాక, భీష్ముడు వాడి బాణాలు ప్రయోగించటం చేత అర్జునుడు వాడిపోయాడు. కృపుడు - కృతవర్మ - అశ్వత్థామ -భూరిశ్రవుడు, జయద్రథుడు, వికర్ణుడు, కౌరవ పక్షంలోని గొప్ప వీరులు అందరూ ఏకమై రథారూఢులై వచ్చి అర్జునుని మార్కొన్నారు. ఆ సమయంలో సాత్యకి ఏనుగుల గుంపులతో - వేగంగా చేరి ఇరుపక్షాల వీరులను సమీక్షించి.

విశేషం: యుద్ధంలో ఎంతటి వీరులకైనా ఒక్కొక్కసారి వేసట ఏర్పడవచ్చు. ఈ పట్టున జగదేకవీరుడు కావచ్చు, అర్జునుడు క్రుంగిపోయాడు మానసికంగా. మహాభారతం ఇట్టి మానసికమైన అవస్థా విశేషాల్ని గుర్తించింది. కవ్వడి = కవ+వడి= జోడువడులు కలవాడు ఈ అచ్చతెలుగు పదానికి సంస్కృత పర్యాయపదం - 'సవ్యసాచి' -రెండు చేతులతో వింటినుండి బాణాలు గుప్పింపగలవాడు.

క. ' మఱతురె? యాడిన మాటలు । పిఱుసనిపోఁ దగునె? మీకు బెదరక యెదురై
తఱుముఁడు భీష్ముని గీష్ముని । నెఱుఁగరె? ము న్నేను గలుగ నేలా వెఱవన్?' 150

ప్రతిపదార్థం: ఆడిన+మాటలు= చేసిన బాసలు; మఱతురె= మరచిపోయారా?; మీకున్= మీకు; పిఱుసనిపోన్+తగునె?= వెనుకంజవేయదగునా? బెదరక= భయపడక; ఎదురు+ఐ= ఎదిరించి; భీష్ముననిన్+గీష్ముననిన్= భీష్ముని(సరకుగొనక); తఱుముఁడు= వెనుకకు తిరిగి పోయేటట్లు త్రిప్పికొట్టండి; ఎఱుఁగరె?= మీకు తెలియదా?; మున్ను+ఏను+కలుగన్= ముందు నేనుండగా; ఏలా+వెఱవన్?= భయం ఎందుకు?.

తాత్పర్యం: 'మీరు చేసిన వాగ్దానాలు - ప్రతిజ్ఞలు మరచిపోయారా? మీరు వెనుకంజ వేయవచ్చా? భీష్ముడు గాని గీష్ముడుగాని ఎవరైనా సరే మీరు బెదరకుండా, ఎదిరించండి - నేనున్నాను - మీకు భయం ఎందుకు?'

విశేషం: భీష్ముడు -గీష్ముడు, నిజానికి గీష్ముడంటూ ఎవడూ లేడు. రాముడు - గీముడు - నిందను తెలిపేటప్పుడు 'గీ' అక్షరం తెలుగులో ముందుకు వస్తుంది. అంతే.

వ. అనుచు నేచి యెదిరిన బలంబుల నిలునిలుమని యదల్చుచు నర్జును తేరికిం దలకడచి వచ్చునతనికి దనుజాంతకుండిట్లనియె : 151

ప్రతిపదార్థం: అనుచున్=అని చెప్పుచు; ఏచి= విజృంభించి; ఎదరిన+బలంబులన్= ఎదిరించిన సేనలను; నిలునిలుము+అని= ఆగు మాగు మని; అదల్చుచున్= మందలించుచు; అర్జును+తేరికిన్= అర్జునుని రథానికి; తల కడచి వచ్చు+అతనికిన్; దాటి ముందునకు వచ్చే అతనికి= సాత్యకికి; దనుజాంతకుండు= రాక్షసులను చంపువాడు= శ్రీకృష్ణుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: అని విజృంభించి ఎదిరిన సేనలను నిలు నిలుమని అదలించి అర్జును రథానికి ముందుకు వచ్చి చేరిన సాత్యకితో శ్రీకృష్ణుడు ఈ విధంగా అన్నాడు:

క. ' తిరిగినపందల నేటికఁ । బురికొల్పఁగనున్నవారు పోదురు గా; కేఁ
గురుపతి జయంబు గొని యి । ద్ధరయేలం జూడ నేర్చెదనె? విను నన్నున్. 152

ప్రతిపదార్థం: తిరిగిన= వెనుకంజవేసిన; పందలన్= పారుబోతులను; ఏటికిన్= ఎందుకు; పురికొల్పఁగన్= ప్రోత్సహించాలి?; ఉన్నవారు= నిలిచినవారు; పోదురుగాక= సరిపోతారుగాక; కురుపతి+జయంబున్+కొని= కురురాజు దుర్యోధనుడు జయించి; ఈ+ధరన్= ఈ భూమిని; ఏలన్= పరిపాలించటం; చూడ+నేర్చెదను+ఎ?= చూడజాలుదునా?; నన్నున్+వినుము= నేను చెప్పే మాటలు వినుము.

తాత్పర్యం: 'పారిపోయే పిరికిపందలను నిలవండని ఎందుకు హెచ్చరిస్తున్నావు? మిగిలిన వారు గూడ పారిపోతే పోదురు గాక! దుర్యోధనుడు జయించి ఈ భూమిని ఏలుకోవటం చూచి నేను సహించగలనా? నా మాట ఆలకించుము.

శా. గంగానందనుఁ గూల్చి ద్రోణుపని సక్కంజేసి కౌరవ్య వీ
రాంగమ్ముల్ నుఱుమాడి తత్పబలసైన్యం బెల్ల మాయించి యి
త్తుం గౌంతేయుల కిమ్మహీవలయమున్ దుర్దాంతచంచద్భుజా
సంగస్ఫూర్జితచక్రవిక్రమకళాసంక్రీడనోన్మాది నై.' 153

ప్రతిపదార్థం: గంగా+నందనున్+కూల్చి= గంగకొడుకు భీష్ముని సంహరించి; ద్రోణు+పని+చక్కంజేసి= ద్రోణుని పని సరిదిద్ది; కౌరవ్య+వీర+అంగమ్ముల్= కౌరవయోధుల అవయవాలను; నుఱుమాడి= నాశనం చేసి; తద్+ప్రబల+సైన్యంబు+ఎల్లన్= ఆ కౌరవుల గొప్ప సేనను అంతటినీ, మాయించి= నశింపచేసి; కౌంతేయులకున్= కుంతీపుత్రులకు(పాండవులకు); ఈ+మహీ+వలయమున్= ఈ భూమండలాన్ని; దుర్దాంత చంచత్ భుజా సంగ స్ఫూర్జిత చక్ర విక్రమ కళా సంక్రీడన+ఉన్మాదినై= అణచరానిదై కదలుచున్న నా బాహువునందు నెలకొన్న చక్రాయుధము యొక్క వీరవిహారమనే క్రీడయందు, మత్తెక్కిన వాడనై; ఇత్తున్= ఇవ్వగలను.

తాత్పర్యం: భీష్ముడిని సంహరిస్తాను. ద్రోణుడిని పనిబట్టగలను, కౌరవ యోధుల అవయవాలను చీల్చి చెండాడ గలను. కౌరవసేనలను నాశనం చేయగలను. ఈ భూరాజ్యాన్ని కుంతీపుత్రులైన పాండవులకు కట్టబెట్టగలను. నా భుజ పరాక్రమాన్ని చూపి, చక్రాయుధాన్ని ప్రయోగించి, విక్రమ వీరవిహారం చేస్తాను.'

విశేషం: ఇంతవరకు తేటగీతలు వ్రాసిన తిక్కన - ఇక్కడ శ్రీకృష్ణుని ప్రతిజ్ఞ శార్దూల వృత్తంలో చెప్పించాడు. ఈ పద్యం చివర - సుదీర్ఘ సంస్కృత సమాస ప్రయోగం గమనించదగింది. వీర రసోచితంగా - భావానుగుణంగా తిక్కన మహాకవి భాషను వాడటం గుర్తించవచ్చు.

శ్రీకృష్ణుఁడు చక్రంబు ధరించి భీష్మునిమీఁది కురుకుట (సం- 6-55-84)

వ. అని పలికి సుదర్శనంబుం దలంచినం దత్క్షణంబ యది సన్నిహితం బగుటయుం బద్మనాభుండు సునాభంబగు నా చక్రంబు గైకొని దక్షిణకరంబున నమర్చి పేర్చి యుగ్యంబుల పగ్గంబులు నొగల ముడిచి యరదంబు డిగ్గ నుఱికి. 154

ప్రతిపదార్థం: అని+పలికి; సుదర్శనంబున్= సుదర్శనం అనే పేరుగల 'చక్ర' ఆయుధాన్ని; తలంచినన్= స్మరింపగా; తద్+క్షణంబు+అ= ఆ క్షణమునందే; అది= ఆ 'సుదర్శన చక్రం'; సన్నిహితంబు+అగుటయున్= దరిచేరగా; పద్మనాభుండు= శ్రీకృష్ణుడు(పద్మం నాభియందుగల విష్ణుదేవుడు); సునాభంబు+అగు= శీఘ్రగమనముగల; ఆ చక్రమున్= ఆ చక్రమును; కైకొని= చేతబట్టి; దక్షిణ+కరంబునన్= కుడిచేత; అమర్చి= పెట్టి; పేర్చి= అతిశయించి; యుగ్యంబుల పగ్గంబులు= గుర్రాల కళ్ళాలు; నొగలన్= రథం నొగమీద; ముడిచి= ముడిపెట్టి; అరదంబు+డిగ్గన్+ఉఱికి= రథంనుండి క్రిందికి దుమికి

తాత్పర్యం: అని చెప్పి- శ్రీకృష్ణుడు తన ఆయుధమైన సుదర్శన చక్రాన్ని సంస్మరించాడు. వెంటనే ఆ చక్రం అతని దగ్గరకు వచ్చింది. శ్రీకృష్ణుడు శీఘ్రగమనం గల ఆ చక్రాయుధాన్ని తన కుడి చేతికి అమర్చుకున్నాడు. గుర్రాల కళ్ళాలు తేరునొగలమీద జాగ్రత్తగా ముడిచి క్రిందికి దూకాడు.

**తే. అవని గంపింప లలిత పీతాంబరంబు । చెఱఁగు దూలఁ జక్రాంశులు దుఱఁగలింప
సింహనాదంబు క్రోధరంజితభయంక । రాననంబునఁ జెలఁగంగ నడరుఁ బెలుచ. 155**

ప్రతిపదార్థం: అవని+కంపింపన్= భూమి దద్దరిల్లునట్లుగా; లలిత+పీత+అంబరంబు= మృదువైన పట్టుబట్ట; చెఱఁగు+తూలన్= అంచు చెదరిపోగా; చక్ర+అంశులు= చక్రము యొక్క కాంతులు; తుఱఁగలింపన్= మిరుమిట్లు గొలుపగా; క్రోధ రంజిత భయంకర+ఆననంబునన్= కోపముతో ఎర్రనైన వెరపుగొలిపే ముఖమునందు; సింహనాదంబు= సింహనాదము, చెలఁగంగన్= ధ్వనింపగా; పెలుచన్= ఎక్కువగా; అడరున్= విజృంభించాడు.

తాత్పర్యం: భూమి దద్దరిల్లగా, కోమలమైన పట్టుబట్ట అంచులో చలింపగా, చక్రాయుధం కాంతులు వెల్లివిరియగా కోపంతో ఎర్రనైన భయంకర ముఖం నుండి సింహనాదం శోభిల్లగా విజృంభించాడు.

**శా. అంహోమర్దనుఁ డాజనార్దనుఁడు మాద్యద్భీష్మకుంభీంద్రుపై
సింహోల్లాసవిలాసి యై కవియు నుత్సేకంబు నాటోపమున్
రంహఃస్ఫూర్తియు దీప్తమూర్తియును సంరంభంబుఁ జూడన్ జగ
త్సంహారోన్ముఖుఁ డైన రుద్రుగతి రౌద్రప్రక్రియం బొల్చినన్. 156**

ప్రతిపదార్థం: అంహస్+మర్దనుఁడు= పాపాలను పొగొట్టువాడు; ఆ+జనార్దనుఁడు= ఆ శ్రీకృష్ణుడు; మాద్యత్+భీష్మ+కుంభి+ఇంద్రు పైన్= మదించిన భీష్ముడు అనే గజరాజుపై; సింహ+ఉల్లాస+విలాసియై= సింహం యొక్క ఉత్సాహ పూరితమైన లాలిత్యం కలవాడై; కవియు+ ఉత్సేకంబు= మార్కొనే ఉద్రేకము; ఆటోపమున్= దర్పమును; రంహస్+స్ఫూర్తియున్= వేగోద్వేగం; దీప్తమూర్తియును=

వెలుగొందే ఆకారం; సంరంభంబున్= ఆ వేగం, చూడన్= అరయగా; జగత్+సంహార+ఉన్ముఖుఁడైన= ప్రపంచాన్ని సంహరించటానికి పూనుకున్న; రుద్రుగతిన్= శివునివలె; రౌద్ర+ప్రక్రియన్= రోషముతో కూడిన ప్రవృత్తితో; పొల్చినన్= శోభిల్లగా.

తాత్పర్యం: పాపాలను పొగొట్టునట్టి శ్రీకృష్ణుడు గర్వించి ఉన్న భీష్ముడు అనే మదపుటేన్గుపై సింహం చూపే ఉద్వేగంతో సౌందర్యపురీవితో మార్కొన్నప్పుడు స్వయంవ్యక్తమయ్యే ఉద్రేకం - దర్పం- వేగోద్ధతి - వెలుగొందే ఆకృతి - దీనినంతా చూడగా - ప్రపంచాన్ని నాశనం చేయటానికి ఉద్యుక్తుడైన లయకాలరుద్రుని ప్రవృత్తితో ఆయన శోభిల్లుతున్నాడు.

విశేషం: అలం: ఉపమ. రూపకానుప్రాణితం. తెలుగు పద్య శిల్ప సౌష్ఠవమునకు ఈ పద్యం ఉదాహరణప్రాయమైనది. బిందుపూర్వక హకార ప్రాసము యతులు - ప్రౌఢ సంస్కృత సమాసాలు చక్రం చేతపట్టి భీష్మునిపైకి లంఘించిన శ్రీకృష్ణుని ఆకృతిని హృదయంగమంగా సహృదయుల కన్నులకు కట్టిస్తున్నాయి.

చ. పులిఁ బొడగన్న లేళ్ళగమివోలె సుయోధను నగ్రసైనికుల్
దలఁకి కలంగి నివ్వెఱఁగు దక్కినఁ జేష్టలు దక్కి చిత్రరూ
పులక్రియ నుండి రక్కురువిభుండును మాఱు దలంపలేని కొం
దలమునఁ బొందుడెందమునఁ దానును రూపఱియుండె వెల్ల నై. 157

ప్రతిపదార్థం: పులిన్= పెద్దపులిని; పొడగన్న= చూచిన; లేళ్ళ+గమి+పోలెన్= లేళ్ళ గుంపువలె; సుయోధను+అగ్రసైనికుల్= దుర్యోధనుని ముందు ఉన్న భటులు; తలఁకి= భయపడి; కలంగి= కలతచెంది; నివ్వెఱఁగు దక్కినన్= ఆశ్చర్యం కలుగగా; చేష్టలు దక్కి= కదలిక లేక; చిత్ర రూపుల క్రియన్= చిత్ర లేఖనమునందలిఆకృతుల వలె; ఉండిరి= ఉన్నారు; ఆ+కురు+విభుండును= ఆ కురురాజు (దుర్యోధనుడు); మాఱు+తలంపన్‌లేని= మారు ఆలోచించలేని; కొందలమునన్= ఆవేదనను; పొందుడెందమున్= అనుభవించే గుండెతో; తానును= తానుకూడా; వెల్లనై= వెలవెలబోయి; రూపు+అటి+ఉండెను= మారిన ఆకృతి గలవాడై ఉన్నాడు.

తాత్పర్యం: పులినిచూచిన లేళ్ళగుంపువలె దుర్యోధనుని యోధముఖ్యులు, భయపడి, కలతచెంది నివ్వెఱగున చేష్ట దక్కి చిత్రరూపములవలె వున్నారు. ఆ దుర్యోధనుడు కూడ మారు ఆలోచించలేని ఆవేదన చెందిన హృదయంతో తానుకూడ వెలవెలపాటుతో మారిపోయిన రూపు కలవాడైనాడు.

ఉ. అప్పుడు భీష్ముఁ డెంతయుఁ బ్రియంబున నిట్లను సంభ్రమంబు లే
కప్పరమేశుతో నిటు కృతార్థునిఁ జేయుదెఁ నీవు వచ్చి న
న్నిప్పుడు నీకుఁ బోలినటు లెల్లను జేయుదు గాని వేగ ర
మ్మొప్పదె నాకు నిట్టి తెఱఁ గుజ్జ్వలపుల్లసరోజలోచనా?' 158

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో; భీష్ముడు= భీష్ముడు; ఎంతయున్+ప్రియంబునన్= మిక్కిలి ప్రీతితో; ఆ+పరమేశుతోన్= ఆ కృష్ణుడితో; సంభ్రమంబులేక= తొట్రుపాటు లేక; ఇట్లు+అనున్= ఈ విధంగా చెప్పాడు; ఇటు= ఈ రీతిగా; కృతార్థునిన్+చేయుదె?= ధన్యుని చేస్తున్నావా; నీవు; వేగన్= శీఘ్రంగా, వచ్చి; నన్నున్; ఇప్పుడు= ఈ సమయంలో; నీకున్+పోలిన+అటులు+ఎల్లను= నీకు తోచినట్లుగా అంతయు; చేయుదుకాని= చేయుదువు కాని; వేగరమ్ము= శీఘ్రమే రమ్ము ఉజ్జ్వల పుల్ల సరోజ లోచనా!= ప్రకాశించేటటువంటి, వికసించినట్టి పద్మముల వంటి కన్నులు గలవాడా; నాకున్= నాకు; ఇట్టి= ఈ విధమైన; తెఱఁగు= రీతి; ఒప్పదు+ఎ?= సరికాదా?

తాత్పర్యం: అప్పుడు భీష్ముడు మిక్కిలి ప్రీతితో తొట్రుపాటు లేకుండా ఆ శ్రీకృష్ణుడితో ఇట్లన్నాడు. ప్రకాశించే, వికసించిన పద్మములవంటి కన్నులుగలవాడా! ఈ విధంగా నన్ను ధన్యుని చేస్తున్నావా? నీవు వచ్చి నన్నిప్పుడు నీకు తోచిన విధంగా చేతువుగాని శీఘ్రంగా రమ్ము. ఈ రీతి నాకు తగినదే గదా!

విశేషం: భీష్ముడు శ్రీకృష్ణుడిని ఎదిరించలేదు - సరికదా వినయంతో స్వాగతం పలికి అర్చించాడు.

వ. అను నట్టియెడ నర్జునుండు రయంబున రథంబు డిగ్గనుఱికి పఱచి పురుషోత్తము పిఱిందిదెసం గ్రుచ్చి పట్టిన నతండు దీర్ఘబాహుం డగునతని నాయతశాఖం బగుపిపులశాఖిం గొనిపోవు మహావాతంబునుం బోలెఁ గొనిపోవ నాతండు పదియడుగులకొలఁది నిలాతలంబు చిక్కం ద్రొక్కి యీడిగిలంబడి నిలువం బట్టి యిట్లనియె. 159

ప్రతిపదార్థం: అను+అట్టి+ఎడన్= భీష్ముడు అట్లా పలుకుతున్నప్పుడు; అర్జునుండు; రయంబునన్= వేగంగా; రథంబు+డిగ్గి= తేరునుండి దిగి; పఱచి= పరుగెత్తి; పురుషోత్తము= శ్రీకృష్ణుని; పిఱింది+దెసన్+గ్రుచ్చి+పట్టిన= వెనుకనుండి గట్టిగా బంధించి పట్టగా; అతండు= శ్రీకృష్ణుడు; దీర్ఘ+బాహుండు+ అగు= ఆజానుబాహుడు అయిన(పొడుగు చేతులుగల); అతనిన్= అర్జునుడిని - ఆయత+శాఖంబగు= పొడుగు కొమ్మలుగల; విపుల+శాఖిన్= పెద్ద చెట్టును; కొనిపోవు= తీసికొనిపోవు; మహా+వాతంబునున్+పోలెన్= గొప్ప వాయువువలె; కొనిపోవన్= తీసికొని పోగా; ఆతండు= ఆతడు(అర్జునుడు); పది అడుగుల కొలఁది= పది అడుగుల మేర; ఇలాతలంబు= భూమిభాగం; చిక్కన్+త్రొక్కి= గట్టిగా త్రొక్కిపట్టి; ఈడిగిలంబడి= మొండితనంతో కూర్చుండగా; నిలువన్+పట్టి= నిలువబెట్టి; ఇట్లు; అనియెన్= చెప్పాడు.

తాత్పర్యం: భీష్ముడట్లా అంటూండగానే అర్జునుడు వేగంగా రథంనుంచి క్రిందికి దుమికి పరుగెత్తి పోయి పురుషోత్తముని వెనుక వైపునుంచి గట్టిగా పట్టుకున్నాడు. అప్పుడు శ్రీకృష్ణుడు పొడవైన చేతులు గల అర్జునుణ్ణి పొడవైన కొమ్మలతో కూడిన పెద్ద వృక్షాన్ని లాగుకొని పోయే పెనుగాలిమాదిరి ఈడ్చుకొని పోయాడు. అంతట అర్జునుడు పది అడుగులమేర నేలను కాళ్ళతో త్రొక్కిపట్టి మొండికేసి కూర్చుండి నిలువరించి శ్రీకృష్ణుడితో ఇట్లన్నాడు.

విశేషం: అలం: ఉపమ. 1. మహాభారతంలో ఈ సన్నివేశం ప్రత్యేక ప్రాముఖ్యం సంతరించుకున్నది. శ్రీకృష్ణుడు ఆయుధం ధరించనని ప్రతిజ్ఞ చేశాడు కదా! మరి చక్రాయుధం ధరించి - భీష్ముని మీదికి లంఘించటం ప్రతిజ్ఞా భంగం కాదా? ప్రతిజ్ఞాభంగమే! ఇది మూడవనాటి యుద్ధంలో - ఒకసారి మాత్రమే గాదు శ్రీకృష్ణుడు తొమ్మిదవనాడు కూడ ఈ విధంగానే ప్రవర్తించాడు. అంతేకాదు 'అశ్వత్థామ' చచ్చిపోయినట్లు ధర్మరాజును అసత్యమాడుమని ఉద్బోధించాడు శ్రీకృష్ణుడు తదుపరి.

'ధర్మం' నిత్య చైతన్య ప్రవంతి. స్థబ్ధసూత్రంగాదు. మహాభారతసారంగా చెప్పబడే శ్లోకంలో ధర్మం ఎక్కడ ఉంటే అక్కడ శ్రీకృష్ణుడు ఉంటాడని లేదు సరికదా 'కృష్ణుడు ఎక్కడ ఉంటే అక్కడే ధర్మం ఉంటుంది, అని ఉంది. **'యతో కృష్ణ స్తతో ధర్మ: యతో ధర్మస్తతో జయ:'** శ్రీకృష్ణుడు శాంతి ప్రియుడు- సంగ్రామ ప్రియుడు కాడు. అందుచే ఆతడు - అచ్చమైన శాంతి సంధాతగా' ఆయుధ విసర్జన చేసి అస్త్రసన్న్యాసం చేశాడు. శ్రీకృష్ణుడు చక్రం పట్టింది - ప్రతిజ్ఞ మీరటానికి కాదు. అర్జునుడికి ప్రోత్సాహం కల్పించటానికే. అది శ్రీకృష్ణుడి తత్క్షణ కర్తవ్యం. అయితే - ప్రతిజ్ఞ - ఉత్తమ లక్ష్యంగా ఉండవలసిందేగాని తప్పించుకోలేని 'బంధం' కాకూడదు. ప్రతిజ్ఞాపాలన గొప్పదే. అయితే - జగద్ధితం కోసం ప్రతిజ్ఞాభంగం చేయటం అహంకార పరిత్యాగమే. ప్రతిజ్ఞకు దాస్యం చేయటం అవివేకమే. భీష్ముడు అధర్మపక్షంలో చేరిన జగదేకవీరుడు. భీష్ముడు ప్రతిజ్ఞకు దాస్యం చేశాడు. తన తండ్రి కోసం - తాను బ్రహ్మచర్య నిష్ఠ స్వీకరించాడు. ఎందుకంటే - తండ్రి వలచిన సత్యవతి సంతానానికి రాజ్యం సంక్రమించేటందుకు. విధి వైపరీత్యం వలన, సత్యవతి సంతానం మరణించి, సింహాసనానికి వారసులు లేకపోయారు.

భీష్ముడి ప్రతిజ్ఞకు కాలదోషం పట్టింది. అయినాసరే - అతడు భీష్ముడై సార్థక బిరుదాంకితుడై ప్రతిజ్ఞనే పాటించాడు. అందుచేత అతడు ప్రతిజ్ఞకు దాసుడేగాక- ధృతరాష్ట్రుడికి - తదుపరి దుర్యోధనుడికీ గూడ దాసుడు కావలసివచ్చింది. బహుశః భీష్ముడికి ఆ విషయం తెలియుననే అనుకోవచ్చు. భీష్ముడు శ్రీకృష్ణుడిని అధిక్షేపించలేదు ప్రతిజ్ఞాభంగం చేసినందుకు. అంతేగాక - శ్రీకృష్ణుడికి భక్తితో స్వాగతం పలికి జేజేలు చెప్పాడు. ధర్మసూక్ష్మం వేరు - అది నిత్య చైతన్యపూరితం. గ్రాంథిక జడధర్మం వేరు. శ్రీకృష్ణుడు అనుష్ఠాన వేదాంతి.

2. ఇంక రెండవ అంశం: ఈ ఘట్టాన్ని తిక్కనా వ్రాశాడు, పోతన్నకూడా వ్రాశాడు. 'కుప్పించి ఎగసిన కుండలమ్ముల కాంతి గగనభాగంబెల్లఁ గప్పికొనఁగ' - శ్రీకృష్ణుడు 'కరికి లంఘించు సింహమ్ము కరణి' భీష్ముడి మీదికి ఉరికినట్లు మనోజ్ఞంగా ఆపాతమధురమైన శైలిలో పోతన ఈ సన్నివేశం అభివర్ణించాడు. పోతన్న శైలి - భక్తిరసతుందిలం. తిక్కన తీర్చిదిద్దిన శ్రీకృష్ణుడు లీలా మానుష వేషధారి. 'ధర్మాద్ధ్వైతమూర్తి', అనుష్ఠాన వేదాంతి. పోతన్న శ్రీకృష్ణుడు ఆ మహానుభావుడి ఇష్టదైవము.

ఉ. కోపము సంహరింపు యదుకుంజర! పాండవకోటి కెల్లనుం
దేపవు గావె నీ విటు లధీరతఁ బూనికి దప్పినం బ్రతి
జ్ఞాపరుఁడైన ధర్మసుతు శౌర్యము ధైర్యము బాహువీర్యమున్
రూపఱిపోక కాదె యనురూపమె నీకిది లోకనాయకా! 160

ప్రతిపదార్థం: కోపము= ఆగ్రహం; సంహరింపు(ము)= విడువుము; యదు+కుంజర!= యదువంశీయులలో ఏనుగువంటివాడా= యాదవ శ్రేష్ఠా!; పాండవ+కోటికిన్+ఎల్లనున్= పాండవులకు పాండవుల అనుయాయులకు; తేపవు+కావె= నావకాదా?; నీవు+ఇటులు= నీవు ఈ రీతిగా; అధీరతన్= అధైర్యంతో; పూనిక+తప్పినన్= ప్రతిజ్ఞను ఉల్లంఘించినచో; ప్రతిజ్ఞా+పరుఁడైన= ఆడినమాట తప్పనట్టి, శపథము మీరనట్టి; ధర్మ+సుతు= ధర్మపుత్రుని; శౌర్యము= పరాక్రమం; ధైర్యము= ధీరత్వం; బాహువీర్యమున్= భుజబలం; రూపు+అఱి+పోకకాదె= నశించటమే కదా!; లోక+నాయకా!= లోకాలకు అధినేతా(శ్రీకృష్ణా)!; నీకున్+ఇది= నీకు ఈ విధమైన ప్రవర్తన; అనురూపము+ఎ?= తగినట్టిదా?

తాత్పర్యం: 'యదువంశంలో శ్రేష్ఠుడవైన ఓ శ్రీకృష్ణా! నీ కోపం ఉపశమింప చేసుకోవయ్యా! నీవే కదా పాండవులకు అందరకూ సంరక్షకుడవు! నీవే ప్రతిజ్ఞను తప్పితే - ఇక ప్రతిజ్ఞను పాలించే ధర్మరాజు మాట ఏమిటి? ధర్మరాజు పరాక్రమం ఏమి కావాలి? శౌర్యము, ధైర్యము, బాహు వీర్యము అన్నీ నశించి పోవా? ఓ లోకనాయకా - ఈ చర్య నీకు తగినదా?

చ. ఇటు దగునయ్య? కృష్ణ! శమియింపుము సాత్యకిఁ జంపినాఁడ విం
కట చనితేని నీదగు సహాయతఁ గౌరవసేన రూపు మా
పుట యవలీల నాకు ననుఁ బొల్లుగఁ జేయుట నీకుఁ బాడియే?
కటకట! నా పరాక్రమము గాసిగ చక్రము చేతనంటితే! 161

ప్రతిపదార్థం: కృష్ణ!= ఓ శ్రీకృష్ణా!; ఇటు= ఈ విధంగా చేయటం; తగును+అయ్య!= మంచిదా?; శమింపుము= శాంతించునది; ఇంకన్= ఇకమీద; అట+చనితి+ఏనిన్= అక్కడకు (రణరంగానికి) వెళ్ళితే ; సాత్యకిన్= సాత్యకిని చంపినాఁడవు= చంపినట్లే సుమా!; నీది+అగు+సహాయతన్= నీ సాయంవలన; కౌరవ+సేన= కౌరవుల సైన్యాన్ని; రూపు+మాపుట= నశింపచేయటం; నాకున్= నాకు; అవలీల= సులువు; ననున్= నన్ను; పొల్లుగన్+చేయుట= వ్యర్థుడిగ చేయటం; నీకున్= నీకు; పాడియే?= న్యాయమా?; కటకట!= అయ్యో!; నా పరాక్రమము; గాసిగన్= పాడయిపోయేటట్లుగా; చక్రమున్= చక్రమును; చేతన్+అంటితే!= చేతితో పట్టుకున్నావుకదా!

తాత్పర్యం: ఓ శ్రీకృష్ణా! ఈ విధంగా ఆయుధం పట్టుకొని - ప్రతిజ్ఞమీరి యుద్ధం చేయటం నీకు తగునయ్యా?, శాంతించుము. ఇక నీవు భీష్ముని మీదకుపోతే సాత్యకిని చంపినట్లే సుమా! నీ సహాయంతో కౌరవసేనను రూపుమాపడం నాకు సులువు. నన్ను దండుగమారిని చేయడం నీకు న్యాయమా! అయ్యయ్యో! నా పరాక్రమము పాలిపోవునట్లుగా చక్రాన్ని చేత ధరిస్తావా?

వ. అనిన సవ్యసాచి సమయనిష్ఠకు శౌరి సంతోషించి రోషం బుడిపికొని యతనికిం బ్రియంబుగా మగిడి నొగలపైకి వచ్చి దిక్కులు పిక్కటిల్లఁ బాంచజన్యంబు పూరింప నాధనంజయుండును దేవదత్తం బొత్తి గాండీవ గుణ చండనిస్వనం బొండొండ నిగిడించుటయుం గౌరవబలంబులు భేరీమృదంగాదితూర్యనాదంబులు సెలంగ మార్కొని కడంగిన. 162

ప్రతిపదార్థం: అనినన్;సవ్యసాచి+సమయ+నిష్ఠకున్= అర్జునునకు ప్రతిజ్ఞపై గల దీక్షకు; శౌరి= శ్రీకృష్ణుడు; సంతోషించి; రోషంబు+ఉడిపికొని= క్రోధము మాని; అతనికిన్= అర్జునునకు; ప్రియంబుగాన్= ప్రీతిగా; మగిడి= వెనుకకు తిరిగి; నొగలపైకిన్= రథమునకు ముందు భాగానికి (సారథి స్థలమునకు); వచ్చి; దిక్కులు+ పిక్కటిల్లన్= దెసలు మారు మ్రోగగా; పాంచజన్యంబు= శ్రీకృష్ణుడి శంఖం; పూరింపన్= ఒత్తగా; ఆ+ధనంజయుండును= ఆ అర్జునుడు కూడా; గాండీవ+ గుణ+చండ+నిస్వనంబు= గాండీవము(అర్జునుని విల్లు) యొక్క అల్లె త్రాటి భయంకర ధ్వని; ఒండు+ఒండ= క్రమంగా; నిగిడించుటయున్= వర్తిల్ల చేయుటయు; కౌరవ+ బలంబులు= కౌరవుల సేనలు; భేరీ+మృదంగ+ఆది+ తూర్యనాదంబులు= భేరులు, మద్దెలలు, మున్నగు బూరాల ధ్వనులు; చెలంగన్= మ్రోయగా; మార్కొని= తాకి; కడంగినన్= పూనిన.

తాత్పర్యం: అర్జునుడికి శపథంపై గల దీక్షకు శ్రీకృష్ణుడు సంతోషించాడు. క్రోధం పోగొట్టుకొని శ్రీకృష్ణుడు వెనుకకు మరలి, తేరు చేరి, సారథి పీఠం మీద కూర్చుని, దెసలు మారు మ్రోగేటట్లుగా పాంచజన్యం పూరించాడు. అర్జునుడు కూడా అదే రీతిలో తన శంఖం దేవదత్తం పూరించి తన విల్లు గాండీవం యొక్క అల్లెత్రాటిని భయంకరంగా మ్రోగించాడు. కౌరవసేనలు కూడా- భేరులు మ్రోగించి, మద్దెలలు వాయించి, బూరాలు ఊది, ఉత్సాహం ప్రకటించారు.

క. అగ్గలిక దూది దరికొను । నగ్గి తెఱం గమర నప్పుడర్జునుఁడు గడున్
డగ్గఱి మెఱుంగుటమ్ముల । మ్రుగ్గించె వియచ్చరోత్కరం బగ్గింపన్. 163

ప్రతిపదార్థం: అగ్గలికన్= పూనికతో; అప్పుడు= ఆ సమయంలో; అర్జునుఁడు= అర్జునుడు; దూదిన్+దరికొను= దూదిని కాల్చు; అగ్గి+తెఱంగు+అమరన్= అగ్నిరీతి తోచునట్లుగా; కడున్= మిక్కుటముగ; డగ్గఱి= సమీపానికివచ్చి; వియత్+చర+ఉత్కరంబు= ఆకాశంలో సంచరించే దేవతాచారణ గణములు; అగ్గింపన్= ప్రశంసింపగా; మెఱుంగు+అమ్ములన్= మిరుమిట్లు గొలిపే బాణాలతో; మ్రుగ్గించెన్= మాడేటట్లు చేశాడు.

తాత్పర్యం: అర్జునుడు కౌరవసేనను తాకి, పూనికతో, దూదిని దహించే అగ్ని వలె సమీపించి, మిరుమిట్లు గొలిపే బాణాలు ప్రయోగించి ఆ సేనను కూల్చివేశాడు. ఆతడి పరాక్రమాన్ని ఆకాశంలో సంచరించే దేవతాచారణగణాలు ప్రస్తుతించాయి.

విశేషం: చారణులు చేసే ప్రశంస గూర్చి తిక్కన పలుమారులు వర్ణించాడు.

వ. ఆ సేనకుం దలకడచి భీష్ము భూరిశ్రవశ్శల్యదుర్యోధను లడరి యర్జునుపై శక్తిగదాసప్తనారాచతోమరంబులు ప్రయోగించిన నతండు శక్తియు గదయును దోమరంబును నొక్కొక్కభల్లంబునను నేడునారాచంబు లేడింటను

దునిమి పేర్చి యైంద్రాస్త్రంబు ప్రయోగించిన నది నానా ప్రకారక్రూరశరకలాపరూపంబునం గవిసి కౌరవ సైన్యంబు నొప్పింపమఱియును దాను మందాకినీనందను నిశిత నారాచజాలంబునం బొదివి భూరి శ్రవసుని చాపంబు ద్రుంచి తొమ్మిదివాలమ్ములు శల్యుమేనం గీలించి కురుపతి వక్షంబు వెడందవాతి యమ్మున ఛేదించె నప్పుడు పాంచాలపతివిరాటప్రముఖులగు జోదులు గోలుతల సేసిరి మన బలంబులు గాండీవ గుణనిష్ఠుర నినదంబునం జేడ్పడి యొల్లంబోయి వెల్ల నయి యుండ భవదీయ సుతులు శౌర్యోద్రేకంబున నాకేశనందను నరదంబుఁ బొదివి రట్టి సంకులసమరంబున మహేంద్రబాణంబుచేత మనదిక్కున. **164**

ప్రతిపదార్థం: ఆ+సేనకున్= ఆ సైన్యానికి; తలకడచి= దాటి ముందునకు వచ్చి; భీష్మ+భూరిశ్రవన్+శల్య+దుర్యోధనులు= భీష్ముడు; భూరిశ్రవుడు; శల్యుడు; దుర్యోధనుడు; అడరి= విజృంభించి; అర్జునుపైన్= అర్జునుడిపైన; శక్తి+గదా+సప్త+నారాచ+తోమరంబులును=శక్తి; గద; ఏడు బాణాలు ఇనుప గుదియలును; ప్రయోగించినన్= వేయగా; అతండు= అర్జునుడు; శక్తియున్= శక్తిని; గదను= గదను; తోమరంబును= ఇనుపగుదియను; ఒక్క+ఒక్క భల్లంబునకున్= ఒక్కొక్క-ఈటె బాణంతో; ఏడు+నారాచంబులున్= ఏడు బాణాలను; ఏడింటను= ఏడు బాణాలతో; తునియన్= ఖండించి; పేర్చి= అతిశయించి; ఇంద్ర+అస్త్రంబు= ఇంద్రునకు సంబంధించిన మంత్రబాణం; ప్రయోగించినన్= వేయగా; అది= ఆ ఇంద్రాస్త్రము; నానా+ప్రకార+క్రూర+శర+కలాప+ రూపంబునన్= పెక్కు విధములైన భయంకర బాణ సమూహాల రూపంతో; కవిసి= మార్కొని; కౌరవ+సైన్యంబు= కౌరవసేనను; నొప్పింపన్= బాధింపగా; మఱియును= ఇంకను; తాను= అర్జునుడు; మందాకినీ+నందనున్= గంగకొడుకును; నిశిత+నారాచ+జాలంబునన్= వాడియైన బాణాల సముదాయం చేత; పొదివి= చుట్టుముట్టి; భూరిశ్రవసుని+చాపంబు+త్రుంచి= భూరి శ్రవసుని విల్లును తునిమి; తొమ్మిది+వాలు+అమ్ములు= తొమ్మిది వాడి బాణాలు; శల్య+మేనన్= శల్యుని దేహంపై; కీలించి= హత్తుకొనజేసి; కురు+పతి+వక్షంబున్= కురురాజు దుర్యోధనుని ఉరము; వెడంద+వాతి+అమ్మునన్= పెద్ద నోరుగల బాణంతో; ఛేదించెన్= త్రుంచాడు; అప్పుడు= ఆ సమయంలో; పాంచాలపతి+విరాట+ప్రముఖులు+అగు= ద్రుపదుడు విరాటుడు మున్నగు జోదులు= యోధులు; కోలుతల+చేసిరి= కౌరవసేనకు; ఎదురుబొదురుగా నిలిచి యుద్ధం చేశారు; మన+బలంబులు= కౌరవసేనలు; గాండీవ+గుణ+నిష్ఠుర నినదంబులనన్= గాండీవము యొక్క అల్లె త్రాటినుండి వెలువడిన కఠిన శబ్దంచే; చేడ్పడి= నివ్వెరబోయి; ఒల్లంబోయి= కలగి; వెల్లన్+అయి= వెలవెలబోయి; ఉండెన్= ఉండగా; భవదీయ+సుతులు= నీ కొడుకులు; శౌర్య+ఉద్రేకంబునన్= పరాక్రమంతో కూడిన ఉత్సాహంతో; నాక+ఈశ+నందను= అర్జునుని; అరదంబు= తేరు; పొదివిరి= చుట్టుముట్టారు; అట్టి+సంకుల+సమరంబునన్= అటువంటి దొమ్మి యుద్ధంలో, మహేంద్ర బాణంబు చేతన్= ఐంద్రాస్త్రం చేత; మన+దిక్కునన్= మన పక్షంలో.

తాత్పర్యం: కౌరవసేనకు ముందుకువచ్చి భీష్ముడు, భూరిశ్రవసుడు, శల్యుడు, దుర్యోధనుడు విజృంభించి అర్జునుడి మీద శక్తి, గద, ఏడు బాణాలు, ఇనుప గుదియలు ప్రయోగించారు. అర్జునుడు శక్తి, గద, ఇనుప గుదియలకు ఒక్కొక్క బాణంతో, ఏడు బాణాలను ఏడు బాణాలతో ఖండించి - విజృంభించి ఐంద్రాస్త్రం ప్రయోగించాడు. ఆ ఐంద్రాస్త్రం - పెక్కు ఆకారాలుగల భయంకర బాణసముదాయంక్రింద మారి, కౌరవసైన్యాన్ని చీకాకు చేసింది. అంతేకాక, అర్జునుడు భీష్ముడిపై వాడి బాణాలు ప్రయోగించి మార్కొన్నాడు. మరియు భూరిశ్రవసుడి విల్లు ఖండించి, శల్యుడి దేహంపై తొమ్మిది అమ్ములు నాటి, దుర్యోధనుడి, ఉరము ఛేదించి, విక్రమించాడు. అప్పుడు ద్రుపదుడు - విరాటుడు మున్నగు వీరులు కౌరవసేనకు ఎదురుగా నిలిచి పోరాటం సాగించారు. కౌరవసేనలు - అర్జునుడి విల్లు గాండీవం యొక్క నారి నుండి వెలువడిన భీకరధ్వనికి

తట్టుకొనలేక నివ్వెరపాటు చెందారు. నీ కొడుకులు పరాక్రమప్రకర్షతో, అర్జునుడి రథాన్ని చుట్టుముట్టారు. ఆ దొమ్మి యుద్ధంలో-ఐంద్రాస్త్రం చేత మన పక్షంలో -

ఆ. కెడసె హయము లొడ్డగెడ వయ్యె రథములు । చాఁపకట్టు వడియె సామజములు
చదిసెఁ గాలుబలము చామరచ్ఛత్రకే । తువులు నాయుధములుఁ దునియలయ్యె. 165

ప్రతిపదార్థం: హయములు= గుఱ్ఱములు; కెడసెన్= నశించాయి; రథములు+ఒడ్డగెడవు+అయ్యెన్= తలక్రిందులయ్యాయి; సామజములు= ఏనుగులు; చాఁపకట్టు వడియెన్= నేలమీద చాపపరిచినట్లు కూలి పడిపోయాయి; కాలు+బలము= పదాతి; చదిసెన్= నలిగిపోయాయి; చామర+ఛత్ర+కేతువులు= వీవనలు- గొడుగులు-జెండాలు; ఆయుధములు= యుద్ధ పరికరాలు; తునియలు+ అయ్యెన్= ముక్కలై పోయాయి.

తాత్పర్యం: గుర్రాలు నాశనమై పోయాయి. రథాలు ఒరగిపోయాయి. ఏనుగులు నేలమీద కూలిపోయాయి. కాలుబలము నలిగిపోయింది. చామరలు - గొడుగులు - జెండాలు ముక్కలైపోయాయి.

విశేషం: 1.చామరములు = చమరీమృగం జూలుతో చేయబడిన వీవన. 2. ఛత్ర చామరములు= రాజలాంఛనాలు. యుద్ధంలో ఆయుధాలుగదా కావలసినది. అయితే ఆయుధాలకంటె ఈ రాజలాంఛనాలకే ఎక్కువ ప్రాముఖ్యం ఉంది ఆనాటి యుద్ధ సంప్రదాయంలో.

వ. అప్ప డర్జునుండు కేశకలాపంబు శైవాలంబును బ్రేవుల ప్రోవులు ఫేనపుంజంబులును మేదోమాంసమస్తిష్క పటలంబు పంకంబును నగురక్తనదీప్రవాహంబు భవదీయ సేనామధ్యంబునం బఱపి బేతాళక్రవ్యాది భూతంబుల నోలలాడ్చె నతండు దేవదత్తంబును దామోదరుండు పాంచజన్యంబును బూరించి సింహనాదంబులు సేసి రంత నరుణగభస్తి యస్తగిరి మస్తకాంతరితుం డయ్యె నాసంధ్యాసమయంబున నిజసైన్యంబు నొవ్వునుం గవ్వడి దివ్యబాణజాలంబుల దుర్నివారత్వంబును విచారించి భీష్మద్రోణబాహ్లికదుర్యోధనులు బలంబులఁ దివియం బంచి మరలి కరదీపికలు వెలుంగ విడిదలకు వచ్చిరి పాండవులును కృష్ణసహితంబుగా నుబ్బునం బొంగుచు వందిజనకీర్తనంబులు సెలంగ మగిడి శిబిరంబునకుంజని రమ్మాడవనాఁటి రాత్రి గురుపతివీటి జనంబులు గిరీటిపరాక్రమప్రకారంబులందమదెసనానాదేశంబులచతురంగంబులు వొలిసినపెల్లును నంతంతఁగములుగట్టి చెప్పికొనుచుండ. 166

ప్రతిపదార్థం: అప్పుడు; కేశ కలాపము= వెండ్రుకల సముదాయం; శైవాలంబును= నీటి పాచిగా; ప్రేవుల+ప్రోవులు= ప్రేగుల గుట్టలు, కడుపులోని పేగుల సముదాయం; ఫేన పుంజంబులును= నురుగుల సముదాయములుగా; మేదస్+మాంస+మస్తిష్క+పటలంబు= క్రొవ్వు మాంసం మెదడు వీని సముదాయం; పంకంబును= బురదగా; అగు= అయిన; రక్త+నదీ+ప్రవాహంబు= నెత్తుటి ఏటి వెల్లువ; భవదీయ+సేనా+మధ్యంబునన్= నీ సైన్యం నడుమగా; పఱపి= ప్రవహింపజేసి; బేతాళ+క్రవ్యాత్+ఆది+భూతంబులన్= మృత కళేబరాలను ఆవేశించే పిశాచములను రాక్షసులు మున్నగు దయ్యాలను; ఓలలాడ్చెన్= మునుగునట్లుచేశారు; అతండు= అర్జునుడు; దేవదత్తంబును= దేవదత్తం అనే శంఖాన్ని; దామోదరుండు= శ్రీకృష్ణుడు; పాంచజన్యంబును= పాంచజన్యం అనే శంఖాన్ని; పూరించి= ఒత్తి; సింహనాదంబులు= సింహగర్జనల వంటి కేకలు; చేసిరి= పెట్టారు; అంతన్= తరువాత; అరుణ+గభస్తి= సూర్యుడు(ఎఱ్ఱని కిరణములు కలవాడు); అస్తగిరి+మస్తక+అంతరితుండు+అయ్యెన్= పడమటి కొండ శిఖరంలో దూరినవాడు అయ్యాడు(అనగా అస్తమించాడు.); ఆ+సంధ్యా+సమయంబున్= ఆ సంజవేళ; నిజ+సైన్యంబు+నొవ్వునున్= తమ సేనలు పడిన బాధను; కవ్వడి దివ్య బాణ జాలంబుల దుస్+నివారత్వంబును= అర్జునుడు ప్రయోగించిన వేల్పుటమ్ముల సముదాయం యొక్క అడ్డరానితనమును;

విచారించి= ఆలోచించి; భీష్మ ద్రోణ బాహ్లిక దుర్యోధనులు= భీష్ముడు, ద్రోణుడు, బాహ్లికుడు, దుర్యోధనుడు; బలంబులన్= సేనలను; తివియన్+పంచి= యుద్ధం ఆపించుటకు ఆజ్ఞాపించి; మరలి= వెనుకకు తిరిగి; కర దీపికలు= చేతి దీపాలు(కాగడాలు); వెలుంగన్= ప్రకాశింపగా; విడిదలకున్= నివాస స్థలాలకు; వచ్చిరి; పాండవులును= పాండవులుగూడ; కృష్ణ+సహితంబుగాన్= శ్రీకృష్ణునితో పాటుగా; ఉబ్బునన్+పొంగుచున్= ఉత్సాహంతో అతిశయించుచు; వంది+ జన+ కీర్తనంబులు+చెలంగన్= వృత్తిగా ప్రస్తుతి చేసే వారి ప్రశంసలు ఒప్పగా; మగిడి= తిరిగి; శిబిరంబునకున్+చనిరి= స్కంధావారములకున్= విడిదులకు వెళ్ళారు; ఆ+మూఁడవ+నాఁటి+రాత్రి; కిరీటి+పరాక్రమ+ప్రకారంబులన్= అర్జునుడు విక్రమం ప్రదర్శించిన రీతులను; కురుపతి వీటి జనంబులు= కురురాజైన దుర్యోధనుడి పక్షానికి సంబంధించిన వారు; తమ+దెసన్= తమ ఎడ; నానా దేశంబుల చతురంగ బలంబులు= వివిధ దేశాలకు సంబంధించిన నాలుగు సైన్య విభాగాలు (రథ - గజ- తురగ -పదాతులు); పొలిసిన పెల్లును= చచ్చిన మొత్తాన్ని; అంతంతన్= అంత అంతగా; గుములు+కట్టి= గుంపులుగా చేరి; చెప్పికొనుచుండన్= మాటాడుకొనుచుండగా.

తాత్పర్యం: ఆ సమయంలో అర్జునుడు నీ సేనల మధ్య నెత్తురు ఏటి వరదలు ప్రవహింప చేశాడు. అందులో వెండ్రుకలు నీటి పాచిగా ఏర్పడ్డాయి. తలకాయల్లోని క్రొవ్వు మాంసం మెదడు అనువాని సముదాయం బురదగా తయారయింది. ఆ రక్తనదిలో పిశాచాలు - రాక్షసులు- దయ్యాలు ఓలలాడాయి. అర్జునుడు దేవదత్తం పూరించాడు. శ్రీకృష్ణుడు పాంచజన్యం ఒత్తాడు. పిమ్మట వారిరువురు సింహనాదాలు చేశారు. అప్పుడు సూర్యుడు పడమటి కొండలలో చేరాడు. ఆ మలిసంజలో - తమ సైన్యాలు పొందిన దీనావస్థ ఆపటానికి సాధ్యం కానట్టి అర్జునుని విజృంభణ - దివ్యాస్త్రప్రయోగం గూర్చి విచారించి, భీష్ముడు ద్రోణుడు బాహ్లికుడు - తమ సేనలను ఉపసంహరించి - కాగడాల వెలుగులో తమ విడిదులకు వెళ్ళారు. పాండవులు శ్రీకృష్ణునితోపాటు, తమ్ములందరు ప్రస్తుతించుతుండగా, ఉత్సాహంతో ఉప్పొంగిపోయి తమ తమ నివాసస్థానాలకు వెళ్ళారు. ఆ మూడవనాటి కురుక్షేత్ర సంగ్రామ విశేషాలను గూర్చి, గుంపులు గుంపులుగా చేరి కౌరవభటులు ముచ్చటించసాగారు. ఆనాడు అర్జునుడు చూపిన పరాక్రమం, అతడు ప్రయోగించిన ఐంద్రాస్త్రం గూర్చి, తమ సైన్యంలో వివిధ దేశాలకు సంబంధించిన చతురంగబలాలు చెడిన తీరు తెన్నుల గూర్చి, వారు చర్చించుకున్నారు. అటు పిమ్మట.

విశేషం: 1. ఐంద్రాస్త్ర ప్రయోగం : మహాభారతంలో పలుచోట్ల -అస్త్రప్రయోగ ప్రస్తావన ఉన్నది. ఇవి అత్యద్భుత మారణాయుధాలు. చాలాకాలం క్రిందట జరిగిన కురుక్షేత్ర సంగ్రామం ఏమిటి? ఇటువంటి మారణాస్త్రాలు ఏమిటి? ఇవి కవి కల్పితాలు మాత్రమేనా? కవుల ఊహలకు కూడా అందనట్లు తోచే ఈ అస్త్రాలు మహాభారతంలో (రామాయణంలో కూడా) ఎట్లా చేరాయి? జల ప్రళయానికి ముందు పెరిగిన నాగరికత అంశాలు కొన్నివేల సంవత్సరాల తదుపరి మానవజాతి భద్రపరచుకొన్న జ్ఞాపక శకలాలు ఇట్టి రచనలకు ఆధారం కావచ్చునని కొందరు విద్వాంసుల అభిప్రాయం.

2. వంది: ప్రస్తుతి వృత్తిగా స్వీకరించినవాడు. రాజులను ఆశ్రయించుకొని వారు బ్రదికేవారు.

3. బేతాళ క్రవ్యాదాది భూతంబులు: మృతశరీరాన్ని ఆవేశించే పిశాచం బేతాళుడు. పీనుగులను తినే రాక్షసులు క్రవ్యాత్తులు.

భూతాలు : మృతశరీరాలను కబళించే పిశాచాలు - అని పురాణ వాఙ్మయ వర్ణన.

4. భీష్మ ద్రోణ బాహ్లిక దుర్యోధనుల మంతనం: భీష్ముడు సేనాపతి. ద్రోణుడు గురువు. దుర్యోధనుడు రాజు. బాహ్లికుడు కౌరవ పక్షంలోనే గాక కురుక్షేత్రంలో చేరిన పదునెనిమిది అక్షౌహిణీబలాల వీరులలో వృద్ధతముడు. అతడు శంతనుని తమ్ముడు. భీష్ముడికి పినతండ్రి. అందుచే ఆ ముగ్గురకు పూజనీయుడు.

భీష్ముని చతుర్థ దివస యుద్ధము (సం. 6-56-1)

క. వేగుటయు సత్వరంబుగ । నా గాంగేయుండు మించి యనికి నడచినన్
సాగరతరంగములగతి । వేగమ తరతరమ మొనలు వెడలఁ దొడంగెన్. 167

ప్రతిపదార్థం: వేగుటయున్= తెల్లవారుటయు; సత్వరంబుగన్= వేగంగా; ఆ+గాంగేయుండు= ఆ భీష్ముడు; మించి= అతిశయించి; అనికిన్= యుద్ధానికి; నడచినన్= వెడలగా; సాగర తరంగముల గతిన్= కడలి కెరటాల వలె; వేగము+అ= శీఘ్రముగా; తరతరమ= క్రమంగా; మొనలు= సేనలు; వెడలన్+తొడంగెన్= వెళ్ళటానికి మొదలుపెట్టాయి.

తాత్పర్యం: తెల్లవారగానే శీఘ్రంగా - సేనాధిపతియైన భీష్ముడు ముందు నడచివెళ్ళాడు రణరంగానికి. అతని వెంట సముద్రపు కెరటాలవలె - కౌరవ సేనలు వరుసగా బారులు తీర్చి కదలి వెళ్ళాయి.

క. అతిరయమున గురుఁడు భవ । త్సుతుఁడును బాహ్లికుఁడు నెయిది తోడ్తో బలసం
తతి గూడికొనఁగఁ బటుబృం । హితహేషానేమి రవము లెసఁగెం దఱచై. 168

ప్రతిపదార్థం: అతి+రయమునన్= మిక్కిలి వేగంతో; గురుఁడు= ద్రోణుడు; భవత్+సుతుఁడును= నీ కొడుకు(దుర్యోధనుడును); బాహ్లికుఁడు= శంతనుని తమ్ముడు, భీష్ముని పినతండ్రి అయిన బాహ్లికుడు; ఎయిది తోడ్తోన్= చుట్టుముట్టి; వెనువెంటనే; బల+సంతతిన్= సేనలను; కూడికొనఁగన్= కలుసుకోగా; పటు+బృంహిత+హేషా+నేమి+రవములు= గొప్పవైన ఏనుగుల ఘీంకారములు; గుర్రాల సకలింపులు; రథచక్రాల ధ్వనులు; తఱచు+ఐ= సాంద్రములై; ఎసగెన్= వర్ధిల్లాయి.

తాత్పర్యం: మిక్కిలి శీఘ్రంగా, ద్రోణుడు - నీ కొడుకు దుర్యోధనుడు, బాహ్లికుడు వెనువెంట కదలి సేనలను కలిసికొన్నారు. ఏనుగుల ఘీంకారాలు, గుర్రాల సకిలింపులు రథచక్రాల ధ్వనులు - దట్టంగా విలసిల్లాయి.

క. కారుకొని మేఘమాలా । కారంబునఁ జాల నొప్పెఁ గౌరవసైన్యం
బారూఢవీరరసవి । స్ఫారం బై యంతఁ దోఁచెఁ బాండవ బలమున్. 169

ప్రతిపదార్థం: కారుకొని= నల్లగా క్రమ్ముకొని; మేఘ+మాలా+ఆకారంబునన్= మబ్బుల దొంతర దండవంటి ఆకారంతో; కౌరవ+సైన్యంబు= కురుసేన; చాలన్= మిక్కుటముగా; ఆరూఢ వీర రస విస్ఫారంబు+ఐ= ప్రసిద్ధమైన పరాక్రమ రసంతో విస్తరించినట్టిదై; ఒప్పెన్= శోభిల్లింది; పాండవ+బలమున్= పాండవసేనకూడా; అంతన్= అంతట; తోఁచెన్= కన్పించింది.

తాత్పర్యం: దట్టమైన మబ్బుల దొంతరవలె కౌరవసేన ప్రసిద్ధమైన వీరరసంతో విస్తరిల్లినదై శోభిల్లినదై అంతటా కన్పించింది.

క. కురుసేనఁ జూచి యప్పుడు । నర నారాయణులు దమ మొనకు మిగిలి సము
ద్ధురలీల సూర్య చంద్ర । స్ఫురణము లొక్కెడన మెఱయుపోలిక నమరన్. 170

ప్రతిపదార్థం: కురుసేనన్= కౌరవసేనను; చూచి; అప్పుడు; నర+నారాయణులు= అర్జునుడు మరియు శ్రీకృష్ణుడు; తమ+మొనకున్= తమసేనకు; మిగిలి= అతిశయించి; సమ్+ఉద్ధుర+లీలన్= మిక్కిలి పట్టరాని విధంగా; సూర్య చంద్ర స్ఫురణములు= సూర్య,చంద్ర ప్రకాశములు; ఒక్క+ఎడమ+అ= ఒకేచోటనే; మెఱయు+పోలికన్= ప్రకాశించే రీతిగా; అమరన్= పొందికపడగా

తాత్పర్యం: కౌరవసేనను చూస్తూ, అప్పుడు అర్జునుడు, శ్రీకృష్ణుడు ఒకేచోట సూర్యుడు, చంద్రుడు కూడి ప్రకాశించినట్లు కన్పించారు.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. ఈ పద్యంలో 'నరనారాయణులు - సూర్యచంద్రుల పోలిక నమరన్' అని అసమాపక క్రియ ఉంది. తరువాతి పద్యంలో (171 పద్యంలో) వెలిగిరి అనే క్రియ ఉంది. దానితో అన్వయించుకోవాలి.

క. వెలిఁగిరి; బలములు దూర్యం । బులు నార్పులుఁ జెలఁగ రెండుఁ బురికొని చతురం
గలసద్గతు లొప్పఁగ వడిఁ । దలపడియెం గైదువులు నదరు లెగయంగన్. 171

ప్రతిపదార్థం: వెలిఁగిరి= ప్రకాశించారు; బలములు+రెండున్= రెండుసేనలూ; తూర్యంబులు= జంత్రనాదాలు; ఆర్పులు= సింహనాదాలు; చెలఁగన్= మ్రోయగా; పురికొని= ఉత్సహించి; చతురంగ+లసత్+గతులు+ఒప్పఁగన్= నాలుగు అంగములకు తగిన ప్రకాశమానమైన రీతులు విలసిల్లగా; వడిన్= వేగంగా; కైదువులు= కత్తులు; అదరులు= మిడుగురులు, నిప్పురవ్వలు; ఎగయంగన్= పైకిలేవగా; తలపడియెన్= మార్కొన్నాయి.

తాత్పర్యం: వెలిగారు. (కృష్ణార్జునులు సూర్యచంద్రుల వలె - వెనుకటి పద్యంతో అన్వయం.) కురు పాండవుల రెండు సేనలు - జంత్ర వాద్య నినాదాలతో - సింహనాదాలతో - కత్తుల నుండి నిప్పురవ్వలు పైకిలేవగా-ఒకరి నొకరు మార్కొని యుద్ధం చేశారు.

వ. ఇట్లు దాఁకి తోమరప్రాసప్రముఖంబులం డొల్లవైచుచుఁ గుంతక్షురికాదులఁ గూలం బొడుచుచుం గరవాల పరశ్వథ ప్రభృతులం దునియవ్రేయుచు గదాముసలముద్గరంబులఁ జదియ మోఁదుచు నఖర ప్రాసంబులం బగులవ్రచ్చుచు. 172

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; తాఁకి= మార్కొని; తోమర+ప్రాస+ప్రముఖంబులన్= ఇనుపగుదియలు, ఈటెలు మొదలైన ఆయుధాలను; డొల్లవైచుచున్= నశింపజేస్తూ; కుంత+క్షురిక+ఆదులన్= బల్లెములు-చిరుకత్తులు మొదలైన వాటిచేత; కూలన్+పొడుచుచున్= కూలవేస్తూ; కరవాల+పరశ్వథ+ప్రభృతులన్= కత్తులు, గండ్రగొడ్డళ్ళు మొదలైన వాటిచేత; తునియవ్రేయుచున్= ముక్కలు చేస్తూ; గదా+ముసల+ముద్గరంబులన్= గదలు; రోకళ్ళు, గుదియలచేత; చదియన్+మోఁదుచున్= నేల కూల్చుచూ; నఖర+ప్రాసంబులన్= నఖరం అనే ఆయుధము ఈటెలతో; పగులవ్రచ్చుచున్= శత్రువులను పగులునట్లుగా గ్రుచ్చుతూ.

తాత్పర్యం: ఈ విధంగా మార్కొని తోమర ప్రాసప్రముఖములైన ఆయుధాలచేత తమతమ శత్రువులను పడవైచుచూ, కుంత క్షురి కాదులచేత కూలబొడుస్తూ, కరవాల పరశ్వధాదులతో ముక్కలు చేస్తూ, గదా ముసల ముద్గరాలతో పడమోదుతూ, నఖర ప్రాసములతో పగులగొడుతూ (తరువాతి పద్యంతో అన్వయం)

క. పురికొనుచుం దెరలుచు నో । హరిసాహరి నొక్కచోట నలవడు నొకచో
విరియు నొకచోటఁ దిరుగుం । దిరుగక యొకచోట రెండుదెఱఁగులు నొచ్చున్. 173

ప్రతిపదార్థం: పురికొనుచున్= ఉత్సహిస్తూ; తెరలుచున్= తొలగిపోతూ; ఓహరిసాహరిన్= తండోపతండాలుగా; ఒక్కచోటన్= ఒక స్థలంలో; అలవడున్= చేరును; ఒకచోన్= ఒకచోట; విరియున్= చెదరును; ఒకచోటన్= ఒకచోటను; తిరుగున్= మరలును; ఒకచోటన్= మరోచోట; తిరుగక; రెండు తెఱఁగులు= రెండు పక్షాలు; నొచ్చున్= బాధ చెందుతాయి.

తాత్పర్యం: ఉత్సహిస్తూ - తొలగిపోతూ, తండోపతండాలుగా ఒకచోట చేరుతూ, ఒకచోట విడిపోతూ, ఒకచోట మరలిపోతూ ఇంకోచోట మరలిపోక, రెండు పక్షాలూ నొచ్చాయి.

క. పలుచోటులఁ బలుభంగులఁ । బలుమొన లిమ్మాడ్కిఁ బోరఁ బార్థునిపై న
గ్గలిక నడరెఁ దాటిసిడము । తలతల మని మెఱయఁ గురుపితామహుఁ డధిపా ! 174

ప్రతిపదార్థం: పలు+చోటులన్= ఎన్నో స్థలాలలో; పలు+భంగులన్= ఎన్నో విధాలుగా; పలు+మొనలు= పెక్కు సైన్యాలు; ఈ+మాడ్కిన్= ఈ రీతిగా; పోరన్= యుద్ధం చేయగా; అధిపా!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; తాటి+సిడము= తాడిచెట్టు పతాకం; తలతలమని+ మెఱయన్= వెలుగు చిమ్ముతూ ప్రకాశింపగా; కురు+పితామహుఁడు= కురువంశానికి చెందిన తాతగారు(భీష్ముడు); పార్థునిపైన్= అర్జునునిపై; అగ్గలికన్= అధికంగా; అడరెన్= విజృంభించాడు.

తాత్పర్యం: ఎన్నో తావులలో - ఎన్నో రీతులలో ఎన్నో సేనలు ఈ విధంగా పోరాటం సాగించగా, ఓ ధృతరాష్ట్ర మహారాజా! కురువంశానికే తాతగారైన భీష్ముడు, తాళధ్వజం ప్రకాశించగా అర్జునుడిపై అధికంగా విజృంభించాడు.

క. పతియును ద్రోణుండు వివిం । శతియుం గృపసోమదత్తశల్యులు గంగా
సుతుతోడఁ గడఁగి రర్జున । సుతుఁ డయ్యేడ్వురను దాఁకె సురలు నుతింపన్. 175

ప్రతిపదార్థం: పతియును= రాజును(దుర్యోధనుడును); ద్రోణుండున్= ద్రోణుడు; వివింశతియున్; కృప+సోమదత్త+శల్యులున్= కృపుడు-సోమదత్తుడు-శల్యుడు; గంగాసుతుతోడన్= భీష్మునితో చేరి; కడఁగిరి= పూనిరి(పోరాటం సాగించారు); ఆ+ఏడ్వురను= ఆ ఏడుమందిని; సురలు+నుతింపన్= వేల్పులు అగ్గించునట్లుగా; అర్జునసుతుఁడు= అర్జునుని కొడుకు(అభిమన్యుడు); తాఁకెన్= మార్కొన్నాడు.

తాత్పర్యం: దుర్యోధనుడు, ద్రోణుడు, వివింశతి - కృపుడు, సోమదత్తుడు - శల్యుడు - భీష్ముడితో కలిసి పూనుకొనగా అభిమన్యుడు - ఆ ఏడుగురినీ దేవతలు ప్రశంసించేటట్లుగా మార్కొన్నాడు.

క. వారల శరనిచయము దు । ర్వార విశిఖపంక్తిఁ దునిమి వాసవపౌత్రుం
డారూఢతేజుఁడై వెలుఁ । గారెను హుతవహ్ని క్రియ రణాంగణవేదిన్. 176

ప్రతిపదార్థం: వారల శర నిచయమున్= వారల అమ్ముల సముదాయమును; దుర్వార విశిఖపంక్తిన్= వారించటానికి వీలులేని తన బాణాల గుంపుతో; తునిమి= ఖండించి; వాసవ+పౌత్రుండు= దేవేంద్రుని మనుమడు, అర్జునుని పుత్రుడు, అభిమన్యుడు; ఆరూఢ+తేజుఁడై= అధికమైన తేజస్సుగలవాడై; హుతవహ్ని క్రియన్= హోమద్రవ్యమును స్వీకరించు అగ్ని హోత్రుడివలె; రణ+అంగణ+వేదిన్= యుద్ధభూమి అనెడు యజ్ఞ వేదికపై; వెలుఁగారెను= ప్రకాశించాడు.

తాత్పర్యం: ఆ ఏడ్గురు వీరుల బాణసముదాయాన్ని - అభిమన్యుడు వారించుటకు వీలులేని తన బాణాలతో ఖండించి, హోమద్రవ్యమును గ్రసించు అగ్నిహోత్రుని వలె ఆ యుద్ధభూమి అనెడు యజ్ఞవేదికపై ప్రకాశించాడు.

తే. భీష్ముఁ డభిమన్యుఁ గడచి యాభీలబాణ । జాలములు దీవ్రతరముగ సవ్యసాచి
మీఁదఁ గురియంగ నాతఁ డమేయభల్ల । తతుల నన్నింటిఁ దునుమాడెఁ దరతరంబ. 177

ప్రతిపదార్థం: భీష్ముఁడు; అభిమన్యున్+కడచి= అభిమన్యుని దాటి వెళ్ళి; ఆభీల+బాణ+జాలములు= భయంకరములైన బాణ సముదాయం; తీవ్రతరముగన్= మిక్కిలి తీక్ష్ణముగా; సవ్యసాచిమీఁదన్= అర్జునుడిపై; కురియంగన్= వర్షింపగా; ఆతఁడు= అర్జునుడు; అమేయ+భల్ల+తతులన్+అన్నింటిన్= సాంద్రమైన ఆ బాణసమూహాలను అన్నింటినీ; తరతరంబ= వరుసగా; తునుమాడెన్= ఖండించాడు.

తాత్పర్యం: భీష్ముడు అభిమన్యుడిని దాటి వెళ్ళి, భయంకరమైన బాణాలు అర్జునుడిపై ప్రయోగించాడు. అర్జునుడు ఆ దట్టమైన బాణసమూహాలను అన్నింటినీ వరుసగా ఖండించాడు.

వ. ఇట్లు దొడంగి యుద్ధటప్రకారంబునఁ బెల్లు సెల్లు భీష్మార్జునులకయ్యం బయ్యిరువాఁగును గొండొకసేపు నివ్వెఱపడి చూచుచుండె నశ్వత్థామభూరిశ్రవశ్శల్యపుత్రచిత్రసేనులు మత్తమాతంగంబులు సింగంబు కొదమం బొదువుపోలిక నభిమన్యుం బొదివిన నతండు. 178

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; తొడంగి= పూని; ఉద్భట+ప్రకారంబునన్= పరాక్రమోపేతంగా; పెల్లు+చెల్లు= మిక్కుటముగా కొనసాగే; భీష్మ+అర్జునుల+కయ్యంబు= భీష్ముని యొక్కయు, అర్జునుని యొక్కయూ పోరాటం; ఆ+ఇరు+వాఁగును= ఆ రెండు పక్షాలూ; కొండొక+సేపు= కొంత తడవు; నివ్వెఱపడి= ఆశ్చర్యపడి; చూచుచుండెన్; అశ్వత్థామ+భూరిశ్రవస్+శల్యపుత్ర+చిత్రసేనులు= అశ్వత్థామ - భూరిశ్రవుడు - శల్యపుత్రుడు - చిత్ర సేనుడును; మత్తమాతంగంబులు= మదపుటేనుగులు; సింగంబుకొదమన్= కొదమసింహాన్ని, లేత వయస్సులో ఉన్న సింహాన్ని; పొదువు+పోలికన్= చుట్టుముట్టే రీతిగా; అభిమన్యున్+పొదివినన్= అభిమన్యుని చుట్టుముట్టగా; అతండు= అభిమన్యుడు.

తాత్పర్యం: ఈ విధంగా పరాక్రమోపేతుడైన భీష్ముడు, అర్జునుడు పోరాడుతున్నప్పుడు - ఉభయ పక్షాలలోని వీరులు ఆశ్చర్యం పొంది కొంతసేపు (తాము యుద్ధం చేయటం మాని) వారిని వీక్షించారు. అప్పుడు అశ్వత్థామ , భూరిశ్రవుడు, శల్యపుత్రుడు, చిత్రసేనుడు మదపుటేన్గులు పిల్ల సింగాన్ని చుట్టుముట్టినట్లు అభిమన్యుడిని చుట్టుముట్టారు.

క. కని యల్లన నవ్వుచు గురు । తనయుని యుర మేసి శల్యతనయుని సిడముం
దునిమి వెస నీదుతనయుని । ధనువు నఱకి సోమదత్తతనయుని నొంచెన్. 179

ప్రతిపదార్థం: కని= చూచి; అల్లన+నవ్వుచున్= తిన్నగా నవ్వుతూ; గురు+తనయుని+ఉరము+ఏసి= అశ్వత్థామ వక్షంపై బాణం నాటి; శల్యతనయుని సిడమున్+తునిమి= శల్యుని కొడుకు జెండా త్రుంచి, వెసన్= వేగంగా; నీదు+తనయుని+ధనువు= నీ కుమారుని విల్లు; నఱకి= ఖండించి; సోమదత్త+తనయునిన్= సోమదత్తుని పుత్రుడైన భూరి శ్రవసుని; నొంచెన్= నొవ్వ చేశాడు.

తాత్పర్యం: అభిమన్యుడు - తన్ను చుట్టుముట్టిన వారిని చూచి, చిరునవ్వుతో అశ్వత్థామ వక్షంమీద బాణం గ్రుచ్చాడు. శల్యుని కొడుకు జెండా త్రుంచాడు. వేగంగా నీ కొడుకు విల్లు నరికాడు. భూరిశ్రవసుడిని నొప్పించాడు.

క. వారును ముందటి యార్వురు । నీరసమున నొక్కపెట్ట యేయఁగఁ బటుదో
స్సారుండగు సౌభద్రుఁ డు । దార స్ఫురణమున నద్భుతంబుగఁ బోరెన్. 180

ప్రతిపదార్థం: వారును= ఆ వీరులును; ముందటి ఆర్వురు= ముందు అతనిని మార్కొనిన ఆరుగురు; ఈరసమునన్= కోపంతో; ఒక్క+పెట్ట= ఒకేసారి; ఏయఁగన్= బాణాలు వేయగా; పటు+దోస్+సారుండగు= మిక్కిలి భుజపరాక్రమం కలిగిన; సౌభద్రుఁడు= సుభద్రకొడుకు(అభిమన్యుడు); ఉదార+స్ఫురణమునన్= గొప్ప స్ఫూర్తితో; అద్భుతంబుగన్= ఆశ్చర్యకరంగా; పోరెన్= పోరాటం సాగించాడు.

తాత్పర్యం: ఆ వీరులు - అంతకుముందు మార్కొనిన ఆరుగురూ కోపంతో ఒక్కపెట్టున అభిమన్యునిపై బాణాలు వేశారు. అప్పుడు మిక్కిలి భుజ పరాక్రమం గలిగిన సుభద్రా తనయుడు గొప్పస్ఫూర్తితో ఆశ్చర్యకరంగా యుద్ధం చేశాడు.

విశేషం: ఉదారస్ఫురణన్= ఉదారత కనిపించేటట్లుగా. అటు కౌరవవీరులు పదిమంది వచ్చి తనమీద పడ్డారు. 'కోపంతో' - 'ఈర్ష్యతో'. అభిమన్యుడు 'అల్లన నవ్వుచు' ఆత్మ సంరక్షణకోసం గొప్పగా యుద్ధం చేశాడు. ఉదారతతో. అనగా వారిని ఎవరినీ సంహరించకుండా యుద్ధం చేశాడన్నమాట.

ఆ. హస్తలాఘవమున నతులబలంబున । శౌర్య మహిమ నధికధైర్యమునను
సవ్యసాచితనయు సరి గార యమ్మహా । వీరు లంతవట్టఁ గౌరవేంద్ర! 181

ప్రతిపదార్థం: కౌరవ+ఇంద్ర!= కౌరవులలో శ్రేష్ఠుడవైన ఓ ధృతరాష్ట్రమహారాజా!; హస్తలాఘవమునన్= చేతుల సౌలభ్యంలో; అతుల+బలంబునన్= గొప్ప శక్తిలో; శౌర్య+మహిమన్= పరాక్రమ మహత్త్వంలో; అధిక+ధైర్యమునను= మిక్కుటమగు ఆత్మవిశ్వాసంలో; ఆ+మహా+వీరులు= ఆ మహాశూరులు; అంత+పట్టు= అంతవరకు; సవ్యసాచి+తనయు= కవ్వడి కొడుకు అభిమన్యునితో; సరిగారు+అ= సమానం కారు సుమా!

తాత్పర్యం: కౌరవులలో శ్రేష్ఠుడవైన ఓ ధృతరాష్ట్రమహారాజా! చురుకుగా, సులువుగా చేతినుండి అమ్ములు గుప్పటంలో, మిక్కుటమైన ఆత్మవిశ్వాసంలో అంతగొప్ప వీరులునూ కవ్వడి కొడుకు అభిమన్యునితో సరిగారు.

వ. ఇట్లు పెక్కండ్రతోడం బెనంగుపుత్రుం గనుంగొని యర్జునుం డంట నార్చి యడరి యందఱ కన్నిరూపులై
నొప్పించి చిక్కువఱిచె నప్పుడు నీ కొడుకు పంపునం ద్రిగర్తులుఁ గృతవర్మయుఁ గేకయులును ముప్పదేనువేల
రథంబులవారునుఁ గవిసి కిరీటిం గొడుకునుం బొదివి రట్టియెడ. 182

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; పెక్కండ్రతోడన్= పెక్కుమందితో; పెనంగు= పోరాడే; పుత్రున్= కొడుకును; కనుంగొని=చూచి; అర్జునుండు= అర్జునుడు; అంటన్+ఆర్చి= దద్దరిల్లునట్లుగా సింహనాదంచేసి; అడరి= విజృంభించి; అందఱకు; అన్ని+రూపులు+ఐ= ఒక్కొక్కడుగా కన్పించే ఆకృతి గలవాడై; నొప్పించి ; చిక్కు+పఱచెన్= చీకాకు నొందించాడు; అప్పుడు; నీ+కొడుకు+పంపునన్= నీ పుత్రుని ఆనతిచే(దుర్యోధనుని ఆజ్ఞచే); త్రిగర్తులు; కృతవర్మయున్= యాదవవీరుడు కృతవర్మయు; కేకయులును= కేకయ దేశ ప్రభువులును; ముప్పది+ఏను+వేల+రథంబులవారును= ముప్పది అయిదువేల తేరుల వీరులును కలిసి; మార్కొని= ఎదుర్కొని; పొదివిరి= చుట్టుముట్టారు; అట్టి+ఎడన్= ఆ సమయమందు.

తాత్పర్యం: ఈ విధంగా, పెక్కుమందితో యుద్ధం చేసే కొడుకును చూచి, అర్జునుడు సింహనాదం చేసి విజృంభించాడు. కౌరవ వీరులు అందరూ, ఎవరికి వారే తాము అర్జునునితో పోరాడుతున్నట్లుగా భ్రమ కల్పించి అర్జునుడు వారిని అందరినీ చీకాకు పరచాడు. అప్పుడు దుర్యోధనుని పంపున త్రిగర్తులు, కృతవర్మ, కేకయులు ముప్పది అయిదువేల రథికులతోపాటు అర్జునుడిని, అతని కొడుకు అభిమన్యుడిని చుట్టుముట్టారు.

మ. తఱికిం జొచ్చి కడంగి పోరు విజయున్ దొడవ్వులం జూచి యే
డ్తెఱఁ బాంచాలసుతుండు సత్వరగతిం దే రద్దెసన్ సారథిం
బఱపం బంచి నిశాతబాణపటలీపాతంబునన్ వైరు లు
క్కఱఁ దాఁకెం దమసైన్యముల్ సెలఁగ శౌర్యస్ఫూర్తి శోభిల్లఁగన్. 183

ప్రతిపదార్థం: తఱికిన్= అదనులో; చొచ్చి= చేరి; కడంగి= పూని; పోరు= యుద్ధం చేసే; విజయున్= అర్జునుని; దొడవ్వులన్+చూచి= దూరదూరంలో చూచి; ఏడ్తెఱన్= వేగంగా; పాంచాల+సుతుండు= ద్రుపదరాజు కొడుకు(ధృష్టద్యుమ్నుడు); సత్వర+గతిన్= వేగంగా; తేరు+అద్దెసన్= రథం ఆవైపుగా;సారథిన్; పఱపన్+పంచి= నడుపుమని ఆజ్ఞాపించి; నిశాత బాణపటలీ పాతంబునన్= వాడి అమ్ముల

సముదాయం ప్రయోగించటం చేత; వైరులు= శత్రువులు; ఉక్కు+అఱన్= బలం నశించగా; తమ+సైన్యముల్= తమసేనలు; చెలఁగన్= సొంపార; శౌర్య స్ఫూర్తి= పరాక్రమ ప్రకటన; శోభిల్లఁగన్= విలసిల్లగా; తాకెన్= మార్కొన్నాడు.

తాత్పర్యం: అదనులో కౌరవసేనను ఎదిర్చి పూని పోరాడే అర్జునుడిని దూరం నుండి చూచి, పాంచాల రాజు పుత్రుడు ధృష్టద్యుమ్నుడు - వేగంగా రథం అచటికి తరలించమని సారథిని ఆజ్ఞాపించాడు. శత్రువుల బలం చెదరిపోగా తన సేనలు ఉప్పొంగగా ధృష్టద్యుమ్నుడు వాడి అమ్ముల గుంపులు ప్రయోగించాడు. పరాక్రమ ప్రకర్షతో శోభిల్లాడు.

వ. ఇట్లు ధృష్టద్యుమ్నుండు పురందరనందనునకుం దలకడచి తాఁకి. 184

ప్రతిపదార్థం: ఇట్లు; ధృష్టద్యుమ్నుండు; పురందర+నందనునకున్= దేవేంద్రుని కొడుకైన అర్జునుడిని; తలకడచి= ముందుదాటి (అతిక్రమించి); (కౌరవసేనను మార్కొన్నాడు.)

క. శరములు మూఁటం గృపుఁ బది । శరముల మద్రేశు నొంచి శరమొక్కట ను
ద్ధురగతి యగు కృతవర్ముని । యరదముఁ దురగముల నొకట నవనిం గూల్చెన్. 185

ప్రతిపదార్థం: శరములు మూఁటన్= మూడు బాణాలతో; కృపున్= కృపాచార్యుని; పదిశరములన్= పదిబాణాలతో; మద్ర+ఈశున్= మద్రరాజు శల్యుని; నొంచి= నొప్పించి; శరము+ఒక్కటన్= ఒక బాణంతో; ఉద్ధుర+గతి+అగు కృతవర్ముని= శీఘ్రగమనం గల కృతవర్మయొక్క; అరదమున్= రథాన్ని; ఒకటన్= మరొకబాణంతో; తురగములన్= గుర్రాలను; ఒకటన్= ఒక బాణంతో; అవనిన్= భూమిపై; కూల్చెన్= పడవేశాడు.

తాత్పర్యం: ఈ విధంగా ధృష్టద్యుమ్నుడు అర్జునుడిని దాటి కౌరవ వీరుల్ని మార్కొన్నాడు. మూడు బాణాలతో కృపుడిని, పదిబాణాలతో మద్ర ప్రభువు శల్యుడిని నొప్పించి, ఒక బాణంతో కృతవర్మను అతని రథాన్ని, గుర్రాలను భూమిపై పడవేశాడు.

వ. అప్పుడు శల్యనందనుండు. 186

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో; శల్య+నందనుండు= శల్యుని కొడుకు.

తాత్పర్యం: ఆ సమయంలో శల్యుడికొడుకు (తరువాతి పద్యంతో అన్వయం).

క. పదిటన్ ధృష్టద్యుమ్ననిఁ । బదియమ్ముల నతని సూతుఁ బటురయమున ను
న్మదుఁడై నొప్పించినఁ గెం । పొదవిన మో మలఁతి నవ్వు నొప్పన నొప్పెన్. 187

ప్రతిపదార్థం: పదిటన్= పది బాణాలతో; ధృష్టద్యుమ్ననిన్= ధృష్టద్యుమ్నుని; పది+అమ్ములన్= పది బాణాలతో; అతని+సూతున్= అతని రథసారథిని; ఉన్మదుఁడై= మిక్కిలి గర్వించినవాడై; పటు+రయమమునన్= మిక్కుటమగు వేగంతో; నొప్పించినన్; కెంపు+ఒదవిన +మోము= ఎఱబడిన ముఖం; అలఁతి+నవ్వు= మందహాసము యొక్క; ఒప్పునన్+ఒప్పెన్= శోభతో శోభిల్లింది.

తాత్పర్యం: శల్యుడి కొడుకు ధృష్టద్యుమ్నుడిని పదిబాణాలతో, మరో పదిబాణాలతో అతని రథసారథిని - గర్వంతో మిక్కుటమైన వేగంతో నొప్పించాడు. అప్పుడు అతని ముఖం ఎఱబారింది. అతడి పెదవులపై మందహాసం విరిసింది.

క. ఆ పృషతపాత్రుఁ డుద్ధత । కోపానలుఁ డగుచు శల్యకొడుకుధనువు నా
టోపమునఁ దునిమి ఫణిరా । జోపమితాస్త్రంబు లతనియొడలం జొనిపెన్. 188

వ. ఇవ్విధంబున 189

ప్రతిపదార్థం: ఆ+పృషత+పౌత్రుఁడు= పృషతుని మనుమడగు ధృష్టద్యుమ్నుడు; ఉద్ధత+కోప+అనలుఁడు+అగుచున్= మిక్కుటమగు ఆగ్రహము అనే అగ్ని గలవాడగుచు; ఆటోపమునన్= దర్పముతో; శల్య+కొడుకు+ధనువు= శల్యుని కొడుకుయొక్క విల్లు; తునిమి= ఖండించి; ఫణి+రాజ+ఉపమిత+అస్త్రంబులు= శేషునితో సరిపోల్చదగిన బాణాలను; అతని+ఒడలన్= అతని శరీరము నందు; చొనిపెన్= నాటాడు.

తాత్పర్యం: పృషతుని మనుమడైన ధృష్టద్యుమ్నుడు మిక్కుటమగు ఆగ్రహమనే అగ్ని గలవాడై దర్పముతో శల్యుని కొడుకు వింటిని విరిచి శేషుడితో సమానమైన అస్త్రాలను అతని శరీరంలోనికి నాటాడు.

విశేషం: ఫణిరాజోపమితాస్త్రంబు - సాధారణ బాణమే - వాడి నాలుక గలది. ఫణిరాజు= శేషుడికి వేయి నాల్కలు ఉంటాయని ప్రసిద్ధి.

క. నోనేసి సూతు హయసం । తానముఁ జంపుటయు శల్యతనయుఁడు విరథుం
డై నిరుపమాన మగు తన । మానమ వాహనము గాఁగ మద మెలరారన్. 190

ప్రతిపదార్థం: నోన్+ఏసి= నొచ్చునట్లుగా వేసి; సూతున్= రథసారథిని; హయ+సంతానమున్= గుర్రాల సముదాయాన్ని; (ధృష్టద్యుమ్నుడు) చంపుటయున్= సంహరించుటయు; శల్య+తనయుఁడు= శల్యుని కొడుకు; విరథుండు+ఐ= రథములేనివాడై; నిరుపమానము+అగు= సాటిలేని; తన+మానము+అ= తన ఆత్మగౌరవమే; వాహనము+కాఁగన్= వాహనముకాగా (తనను మోసి నడపునట్టిదిగా); మదము+ఎలరారన్= గర్వం అతిశయింపగా.

తాత్పర్యం: ధృష్టద్యుమ్నుడు - శల్యతనయుడిని నొప్పించి, అతని రథసారథినీ - గుర్రాలనూ సంహరించాడు. శల్యుడి కొడుకు - విరథుడై సాటిలేని తన ఆత్మాభిమానమే తనకు వాహనంగా చేసికొని గర్వంతో నిలబడ్డాడు.

శల్య నందనుఁడు ధృష్టద్యుమ్ననితో యుద్ధంబు సేసి చచ్చుట (సం.6-57-25)

క. పలకయు వాలును గొని ఱె । క్కలు గల పెనుఁబాము పగిదిఁ గవిసినఁ గౌంతే
యులు సూచి వెఱగుపడి రా । బలమును నీ బలముఁ బొగడెఁ బటు శౌర్యంబున్. 191

ప్రతిపదార్థం: పలకయున్, వాలును+కొని= డాలును, కత్తినీ పట్టుకొని; ఱెక్కలు కల పెను పాము, పగిదిన్= రెక్కలు ఉన్న పెద్ద సర్పంవలె; కవిసినన్= విజృంభించగా; కౌంతేయులు= పాండవులు; చూచి; వెఱగుపడిరి= ఆశ్చర్యం చెందారు; పటు+శౌర్యంబున్= గొప్ప పరాక్రమాన్ని; ఆ బలము= అటు పాండవుల సేన; నీ బలమున్= నీ సేనయు; పొగడెన్= ప్రశంసించాయి.

తాత్పర్యం: శల్యుడి కొడుకు - విరథుడైనప్పటికీ జంకుగొంకులు లేకుండా చేతులలో కత్తిని, డాలును పుచ్చుకొని రెక్కలు మొలిచిన పెద్ద పాములవలె విజృంభించాడు. ఆతడి ధైర్యసాహసాలకు ఆశ్చర్యపడి అటు పాండవసేన, ఇటు కౌరవసేన అతడిని ప్రశంసించాయి.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష.

వ. ఇట్లు గవిసి. 192

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; కవిసి= ఎదుర్కొని.

తాత్పర్యం: ఈ విధంగా ఎదుర్కొని. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: 1. భారతంలో అభిమన్యుడు అసాధారణంగా శౌర్యం చూపించిన బాలవీరుడు - అర్జునుడి కొడుకు. అటువంటి వాడే శల్యుడి కొడుకు కూడా. ఇతనిపేరు కూడా ప్రకటించలేదు భారత రచయిత. ఇతడు అభిమన్యుడి వలె తండ్రికి పేరు తెచ్చిన తనయుడు.

2. యుద్ధంలో అంత సులువుగా చావరు పెద్దలు! అయితే మహాభారతంలో చిత్తశుద్ధితో చావుకు తెగించి పోరాడినది యువవీరులు. చరిత్రకూడా బాలవీరులే సృష్టించారు. మరో ఉదాహరణ పలనాటి వీరయుద్ధంలో బాలచంద్రుడు.

క. వెరవున ధృష్టద్యుమ్నుని । శరనికరం బెల్లఁ బలక జడియుచుఁ గిరణ
స్ఫురణాతిభీషణం బై । కరవాలము మెఱయఁ జిత్రగతులం గవిసెన్. **193**

ప్రతిపదార్థం: వెరవునన్= ఉపాయంతో; ధృష్టద్యుమ్నుని శర నికరంబు+ఎల్లన్= ధృష్టద్యుమ్నుని బాణ సమూహాలను అన్నింటినీ; పలకన్+జడియుచున్= డాలుతో నివారిస్తూ; కిరణ+స్ఫురణ+అతి భీషణంబు+ఐ= సూర్యరశ్మి ప్రకాశంవలె మిక్కిలి భయంకరమైన; కరవాలము= కత్తి; చిత్ర+గతులన్= ఆశ్చర్యకరముగ; మెఱయన్= వెలుగొందగా; కవిసెన్= మార్కొన్నాడు.

తాత్పర్యం: శల్యుడి కొడుకు - ధృష్టద్యుమ్నుడు ప్రయోగించిన బాణాలను అన్నిటినీ తన డాలుతో త్రోసివేస్తూ సూర్య కిరణాల వంటి కాంతులు వెదజల్లే తన కత్తి ప్రకాశిస్తూ ఉండగా విజృంభించాడు.

తే. కవిసి వ్రేసిన గ్రక్కున గద యమర్చి । యాఁగి వజ్రప్రహారంబు ననుకరింప
ద్రుపదనందనుఁ డడిచినఁ దునియలయ్యెఁ । బలక రెండవవాటునఁ బగిలె శిరము. **194**

ప్రతిపదార్థం: కవిసి= ఎదుర్కొని; వ్రేసినన్= వేయగా; గద; గ్రక్కునన్= శీఘ్రంగా; అమర్చి; ఆఁగి; వజ్ర ప్రహారంబున్= వజ్రము యొక్క దెబ్బను; అనుకరింపన్= పోలునట్లు; ద్రుపద నందనుఁడు= ద్రుపదరాజు కొడుకు (ధృష్టద్యుమ్నుడు); అడిచినన్= కొట్టగా; పలక= శల్యుడి కొడుకు చేతి డాలు; తునియలు+అయ్యెన్= ముక్కలయింది; రెండవ+వాటునన్= రెండవ దెబ్బతో, శిరము= తలకాయ; పగిలెన్= బ్రద్దలయింది.

తాత్పర్యం: ధృష్టద్యుమ్నుడు విజృంభించి, గద అమర్చికొని - వజ్ర ప్రహారమును అనుకరిస్తూ కొట్టగా - శల్యనందనుడి డాలు ముక్కలై పోయింది. రెండవ దెబ్బకు- అతని శిరస్సు పగిలిపోయింది.

విశేషం: వజ్రము= దేవేంద్రుని ఆయుధం.

క. తల వ్రయ్య లైనఁ బ్రాణం । బులును గృపాణంబు విడిచి భువిఁ ద్రెళ్ళె నతం
డలుకొంది కురుబలం బా । కులతం బొందంగఁ గొండ గూలినభంగిన్. **195**

ప్రతిపదార్థం: కురుబలంబు= కౌరవసేన; అలుకు+ఒంది= భయపడి; ఆకులతన్+పొందంగన్= కలతచెందగా; తల= శిరము; వ్రయ్యలు+ఐనన్= ముక్కలైపోగా; ప్రాణంబులును; కృపాణము= కత్తి; విడిచి= వదలి; అతండు= శల్యుని కొడుకు; కొండ+కూలిన+భంగిన్= పర్వతం విరిగి పడిపోయినట్లుగా; భువిన్+త్రెళ్ళెన్= నేలమీద కూలాడు.

తాత్పర్యం: శల్యుడి కొడుకు ప్రాణాలు పోయేవరకు తల ముక్కలై పోయేవరకు చేతిలోని కత్తి వదలకుండా పోరాటం సాగించాడు! అతడు కొండ విరిగి నేలమీద పడిపోయేటట్లుగా కూలిపోవటం చేత - కౌరవసేన కలత చెందింది.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష.

తే. ఇత్తెఱంగున నిజపుత్రుఁ డీల్గుటయును । గ్రోధదీప్తుఁ డై శల్యుండు ద్రుపదసూతి
మీఁదఁ గవిసిన నాతఁ డమేయ బాణ । పంక్తి వరఁగించె నుజ్జ్వల ప్రభలు నిగుడ. 196

ప్రతిపదార్థం: ఈ+తెఱంగునన్= ఈ రీతిగా; నిజ+పుత్రుఁడు= తన సొంత కొడుకు; ఈల్గుటయును= మరణించటం చేత; క్రోధ+దీప్తుఁడు+ఐ= ఆగ్రహంతో భాసించేవాడయి; శల్యుండు; ద్రుపదసూతిమీఁదన్= ద్రుపదుని కొడుకుమీద; కవిసినన్= విజృంభింపగా; ఆతడు= ఆ ధృష్టద్యుమ్నుడు; ఉజ్జ్వల+ప్రభలు= గొప్ప కాంతులు; నిగుడన్= వ్యాపించగా; అమేయ+బాణ+పంక్తిన్= దట్టమైన అమ్ముల వరుసను; పరఁగించెన్= ప్రయోగించాడు.

తాత్పర్యం: ఈ విధంగా తన పుత్రుడు మరణింపగా, ఆగ్రహావేశ పరవశుడై శల్యుడు - ధృష్టద్యుమ్నుని మీద విజృంభించాడు. ధృష్టద్యుమ్నుడు - దట్టమైనట్టి మిక్కిలి దీప్తి గలిగినటువంటి అమ్ముల గుంపు శల్యునిపై ప్రయోగించాడు.

వ. అనిన విని ధృతరాష్ట్రుండు సంజయున కిట్లనియె: 197

ప్రతిపదార్థం: అనినన్+విని= అని చెప్పగా ఆలకించి; ధృతరాష్ట్రుండు= ధృతరాష్ట్రుడు; సంజయునకున్= సంజయుడికి; ఇట్లు+అనియెన్= ఈరీతిగా చెప్పాడు.

తాత్పర్యం: అని చెప్పగా విని, ధృతరాష్ట్రుడు సంజయుడితో ఈ విధంగా చెప్పాడు:

క. ‘ మానుష మేటికిఁ దైవా । ధీనము సర్వంబు నస్మదీయస్వాయ
త్తేనలఁ బాండునృపాలక । సూనులు గెల్చెదరు కంటె? సూతతనూజా! 198

ప్రతిపదార్థం: సూత+తనూజా!= ఓ సంజయా!, మానుషము+ఏటికిన్?;= మానవ ప్రయత్నం దేనికి?; సర్వమ్మున్= అంతా; దైవ+అధీనము= భగవంతునికి లోబడి ఉన్నట్టిదే; అస్మదీయ+ స్వాయత్+సేనలన్= మిక్కిలి విస్తరించియున్న నా సేనలను; పాండు నృపాలక సూనులు= పాండురాజు కొడుకులు; గెల్చెదరు= జయింపగలరు; కంటె= చూస్తున్నావా?

తాత్పర్యం: ‘ఓ సంజయా, మనుష్య ప్రయత్నం దేనికి? అంతా దైవాధీనమే. చూస్తున్నావుగా. సంఖ్యాబలంలో ఎక్కువై, మిక్కిలి విస్తరించి ఉన్న నా సేనను పాండవులు జయింపగలరు.

విశేషం: విజయసిద్ధికి - మానవ ప్రయత్నం పురుషకారం ముఖ్యమా? దైవబలం ముఖ్యమా? అనే చర్చ మిక్కిలి పురాతనమైనది. ధృతరాష్ట్రుడి అభిప్రాయంలో దైవం మానుషం కంటె బలమైనట్టిది.

క. చావును నోవును మన యో । ధావలికిన్ గెలుపునుబ్బు నావలికిని నీ
చే వినియెదఁ దుది నెట్టులు । శ్రీవిభవము పాండవకులకుఁ జేపడున కదే! 199

ప్రతిపదార్థం: చావును= మరణం; నోవును= నొప్పి; మన+యోధ+ఆవళికిన్= మన వీరుల సముదాయానికి (చెల్లుతుంది). గెలుపు+ఉబ్బు= జయము; అతిశయము, ఆవలికిని= అవతలివారికి; నీచేన్; వినియెదన్= వింటున్నాను గదా; తుదిన్= చివరకు; ఎట్టులున్= తప్పకుండా; శ్రీ+విభవము= శుభము, సంపద; పాండవులకున్= పాండవులకు; చేపడును+అ+కదే!= చేకూరగలదు కదా!

తాత్పర్యం: ఇప్పుడే తేలిపోయింది. చావు, బాధ - మన వీరుల సముదాయానికి తప్పదు. చిట్టచివరకు జయము, శుభము, సంపద పాండవులకు చేకూరగలదు కదా!

వ. దుర్యోధను దుర్ణయంబున నేను దుర్వార్తలు వినుచు దుఃఖంబులనుభవించువాఁడ నైతిఁ గౌంతేయుల గెలుచునుపాయం బెద్దియుం గన్నవారముగా' మనిన సంజయుం 'డది యట్టిద నీసైన్యంబుల సేనాంగంబు లనేకంబులు వొలిసె దొరలు మడిసెదరు దిర మై వినుఁ' మని యి ట్లనియె నట్లు శల్యుచేత బహుబాణంబులం బొదువంబడి పార్షతుం డతని నపరిమిత నిశితశరంబులం బొదువ నతం డతనివిల్లు దునిమి వివిధాస్త్రంబుల వెగడు వఱచిన నాధృష్టద్యుమ్నుండు నొచ్చుటయుఁ జూచి సుభద్రాసూనుండు మద్రపతిం దాఁకె నప్పుడు కురుపతి పురికొల్ప దుర్ముఖుండును దుస్సహుండును దుర్మర్షణుండును సత్యవ్రతుండును జిత్రసేనుండును బురుమిత్రుండును వివింశతియును వికర్ణుండును నయ్యభిమన్యు మార్కొనుట కలికి పాంచాల నందనుపై నడరి యొక్కొక్కండపెక్కమ్ము లేసిన నా పృషతపౌత్రుండు చలింపక యొక్కొక్కరినిం బెక్కమ్ము లేసి కరలాఘవంబు నెఱపి యందఱకుం జాలి సమరంబు సేయుచుండె. 200

ప్రతిపదార్థం: దుర్యోధను+దుర్ణయంబునన్= దుర్యోధనునియొక్క దుర్నీతివలన; నేను; దుర్వార్తలు= చెడ్డ సమాచారములు; వినుచు; దుఃఖంబులు; అనుభవించువాఁడను+ఐతిన్= భరింపవలసినట్టి వాడను అయ్యాను; కౌంతేయులన్= కుంతీపుత్రులను (పాండవులను); గెలుచు= జయించే; ఉపాయంబు; ఎద్దియున్= దేనిని; కన్నవారము+కాము= అరసినట్టివారము కాము; అనినన్= అని చెప్పిన; సంజయుండు= సంజయుడు; అది= పాండవులను జయించే వెరవు కన్పించకపోవటం; అట్టిది+అ= అట్టిదే; నీ సైన్యంబుల సేనా+అంగంబులు= నీ సేనలోని శాఖలు; అనేకంబులు= పెక్కులు; పొలిసెన్= నశించాయి; దొరలు= వీరులు(ప్రభువులు); మడిసెదరు= చనిపోగలరు, తిరము+ఐ= దిట్టముగా (మనస్సు స్థిరంగా ఉంచికొని); వినుము; అని; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు; అట్లు= ఆ రీతిగా; శల్యుచేతన్= శల్యునిచేత; బహు బాణంబులన్= పెక్కు అమ్ములచేత; పొదువంబడి= ఆక్రమించబడి; పార్షతుండు= పృషతుని వంశీయుడు(ధృష్టద్యుమ్నుడు); అతనిన్= శల్యుడిని; అపరిమిత నిశిత శరంబులన్+పొదువన్= అసంఖ్యాకమైన వాడి అమ్ముల నొప్పింపగా; అతండు= శల్యుడు; అతని+విల్లు+తునిమి= ధృష్టద్యుమ్నుని ధనువు ఖండించి; వివిధ+అస్త్రంబులన్= పెక్కు బాణాలతో; వెగడు+ పఱచినన్= తల్లడిల్ల చేయగా; ధృష్టద్యుమ్నుండు; నొచ్చుటయున్= నొప్పి చెందుటయు; చూచి; సుభద్రా సూనుండు= సుభద్ర కొడుకు - అభిమన్యుడు; మద్ర+పతిన్= మద్రరాజును(శల్యుని); తాఁకెన్= మార్కొన్నాడు; అప్పుడు= ఆ సమయంలో; కురుపతి= కురురాజు(దుర్యోధనుడు); పురికొల్పన్= ప్రోత్సహించటంచేత; దుర్ముఖుండును; దుస్సహుండును; దుర్మర్షణుండును; సత్యవ్రతుండును; చిత్రసేనుండును; పురుమిత్రుండును; వివింశతియును; వికర్ణుండును; ఆ+అభిమన్యున్= ఆ అభిమన్యుని; మార్కొనుటకున్= తాకుటకు; అలికి= భయపడి; పాంచాల నందనుపైన్= పాంచాల రాజు ద్రుపదుని కొడుకైన ధృష్టద్యుమ్నునిపై; అడరి= విజృంభించి; ఒక్కొక్కండు+అ= ఒక్కొక్కడే; పెక్కు+అమ్ములు+ఏసిన్= ఎక్కువ బాణాలు ప్రయోగింపగా; ఆ పృషత+పౌత్రుండు= ఆ ధృష్టద్యుమ్నుడు; చలింపక= కదలక(సరకుచేయక); ఒక్కొక్కరినిన్= ఒక్కొక్కరినే; పెక్కు+అమ్ములు+ఏసి= ఎన్నో బాణాలు ప్రయోగించి; కరలాఘవంబు నెఱపి= చేతి నైపుణ్యం చూపి; అందఱకున్+చాలి= ప్రతివీరులు అందరకు సరిపోయి; సమరంబు+చేయుచుండెన్= యుద్ధం చేస్తున్నాడు.

తాత్పర్యం: 'దుర్యోధనుడి చెడు నిర్ణయం వలన, నేను చెడు వార్తలు వినవలసి వస్తోంది. దుఃఖం అనుభవించవలసి వస్తోంది. పాండవులను జయించే వెరవు 'ఏదీ కన్పించటంలేదు'. అని ధృతరాష్ట్రుడు పలుకగా సంజయుడు ఈ విధంగా చెప్పాడు - 'నిజమే- నీ సైన్యాంగములు ఎన్నో నశించాయి. దొరలు మరణించారు - గుండె దిటవు చేసుకొని ఆలకింపుము' - అని చెప్పి, మరల ఈ విధంగా అన్నాడు.

'ఆ విధంగా శల్యుడు వేసిన బాణాలచే నొచ్చి, ధృష్టద్యుమ్నుడు అతడిమీద పెక్కు వాడి బాణాలు ప్రయోగించాడు. శల్యుడు ధృష్టద్యుమ్నుడి ధనువు ఖండించాడు. పెక్కు బాణాలు వేశాడు. ఆ సమయంలో

ధృష్టద్యుమ్నుడు డస్సిపోవటం చూచి అభిమన్యుడు వచ్చి శల్యుని మార్కొన్నాడు. ఆ సమయంలో దుర్యోధనుడు ప్రోత్సహింపగా దుర్ముఖుడు - దుస్సహుడు- దుర్మర్షణుడు - సత్యవ్రతుడు - చిత్రసేనుడు - పురుమిత్రుడు - వివింశతి - వికర్ణుడు ఆ అభిమన్యుడిని ఎదిరించటానికి జంకి - ధృష్టద్యుమ్నుడిపై విజృంభించి - పెక్కువాడి బాణాలు ఒకేసారిగా ప్రయోగించారు. పృషతుని మనుమడైన ఆ ధృష్టద్యుమ్నుడు ఏ మాత్రం చలింపక, ఒక్కొక్కరిమీద పెక్కు బాణాలు ప్రయోగించి తన చేతి నైపుణ్యం ప్రదర్శించాడు. ధృష్టద్యుమ్నుడు - అంతమందికీ సరిపోయి సంగ్రామం చేశాడు.

విశేషం: 1. 'సేనాంగంబులు అనేకంబులు' - సేన రథ గజ తురగ పదాతులు అనే చతురంగములుగా విభజింపబడినప్పటికీ అవిగాక ఎన్నో అంగాలు ఉన్నట్లుగా తిక్కన గుర్తించాడు. తిక్కన సప్తాంగములను గూర్చి నిర్వచనోత్తరరామాయణంలో ప్రస్తావించాడు. సేనాంగములు కాలక్రమంగా పెరిగాయి. 2. కరలాఘవము - లాఘవము అనే మాటకు లఘుత్వము అని తప్పు అర్థం చెప్పకూడదు.

హస్త లాఘవము - అనుమాట ఐంద్రజాలకుని పరంగా లోక వ్యవహారంలో ఉంది. కరలాఘవంలో అంతర్లీనంగా ఉండే అంశాలు - చురుకుదనం - సులువు. అయితే - కరలాఘవం అద్భుతరస పర్యవసాయి.

క. నకులుఁడు సహదేవుఁడు మా । మకు నచ్చెరువాటుఁ బ్రియము మదిఁ దలకొన నం
బకవృష్టి గురియ నస్త్ర । ప్రకరంబునఁ బొదివె మద్రపతియును వారిన్. 201

ప్రతిపదార్థం: నకులుఁడు+సహదేవుఁడు; మామకున్= మామయైన శల్యునకు; అచ్చెరువాటు= ఆశ్చర్యము; ప్రియము= సంతోషం; మదిన్= మనస్సులో; తలకొనన్= కలుగగా; అంబక+వృష్టి= బాణాల వాన; కురియన్= కురిపించగా; వారిన్= ఆ నకుల సహదేవులను; మద్రపతియును= (మద్రదేశానికి రాజు అయిన) శల్యుడును; అస్త్రప్రకరంబునన్= మంత్ర బాణాల సముదాయంతో; పొదివెన్= కప్పివేశాడు.

తాత్పర్యం: ఆ సంగ్రామంలో నకులుడు, సహదేవుడు తమ మేనమామైన శల్యుడితో మార్కొనవలసి వచ్చింది. శల్యుడు కౌరవ పక్షంలో యుద్ధం చేస్తున్నాడు. ఆ నకుల సహదేవుల పరాక్రమం చూచి, మేనమామగారైన శల్యుడికి ఆశ్చర్యంతో పాటు ఆనందం కలిగింది. ఆశ్చర్యం ఎందుకంటే, వయస్సులో నకుల సహదేవులు చాలా చిన్నవారు. శల్యుడు బహుముఖ ప్రజ్ఞాధురీణుడు. మహావీరుడు. అంతటివాడిని వయస్సులో చిన్నవారైన నకుల సహదేవులు ఎదుర్కొన్నారు. ఆనందం ఎందుకంటే - తన మేనల్లుళ్ళు అంతటి శౌర్యం ప్రదర్శిస్తున్నారు గదా! అని.

విశేషం: మానవజీవితం - విచిత్ర విరోధాభాస సంయుతం. అందులో యుద్ధం - వింత సన్నివేశాలకు ఆలవాలం. పూజనీయుడైన మేనమామపై ప్రేమ చూపించటానికి బదులు మేనల్లుళ్ళు బాణవర్షం కురిపించవలసి వచ్చింది!

వ. వారికి బాసట యై పాంచాల మత్స్యపతులు సైన్యోపేతంబుగాఁ దటిమిన మనయందుఁ గలదండిమగలు
శల్యునకు సాహాయ్యంబు సేసి రంత దినమణి యంబరమధ్యం బలంకరించె నట్టియెడ. 202

ప్రతిపదార్థం: వారికిన్= ఆ నకుల సహదేవులకు; బాసట+ఐ= తోడై; పాంచాల మత్స్య పతులు= పాంచాలరాజైన ద్రుపదుడు, మత్స్యరాజైన విరాటుడు; సైన్య+ఉపేతంబుగాన్= సేనలతోపాటుగా; తటిమినన్= విజృంభించిన; మనయందున్+కల= మన పక్షంలో ఉన్నట్టి; దండి+మగలు= గొప్ప వీరులు; శల్యునకున్= నకుల సహదేవుల మేనమామ, మద్ర దేశరాజు అగు శల్యుడికి;

సాహాయ్యంబు+చేసిరి= తోడుపడ్డారు; అంతన్; దిన మణి= సూర్యుడు; అంబర+మధ్యంబు+ అలంకరించెన్= ఆకాశ మధ్యంలో ప్రకాశించాడు.

తాత్పర్యం: ఆ నకుల సహదేవులకు సాయంగా ద్రుపదుడు విరాటుడు వచ్చి చేరారు. వారు విజృంభించి కౌరవ సేనలను తరిమి తరిమి కొట్టగా, కౌరవసేనలోని వీరులు పలువురు శల్యుడికి తోడుపడి యుద్ధం చేశారు. అప్పుడు మధ్యాహ్నం అయింది. సూర్యుడు ఆకాశమధ్యంలో ప్రకాశింపసాగాడు.

విశేషం: మహాభారత సంగ్రామం పద్దెనిమిది రోజులు జరిగింది. ప్రతి రోజు సూర్యోదయం పోరాటం ఆరంభమై, సూర్యాస్తమయ సమయంలో ముగిసేది. ఉదయంనుండి మధ్యాహ్నం వరకు - మరల మధ్యాహ్నం నుండి సాయంకాలం వరకు యుద్ధం సాగేది. మహాభారతంలోని యుద్ధవర్ణనలో - మధ్యాహ్నసమయ సూచన కనిపిస్తోంది.

అయితే - మధ్యాహ్న సమయంలో ఆగకుండానే యుద్ధం జరిగేది. మధ్యాహ్నవిరామం గూర్చిగాని, భోజన ప్రస్తావనగాని కన్పించటం లేదు. అనగా నిర్విరామంగా నిరాహారంగా యుద్ధం జరిగినట్లు భావించాలి.

తే. భీమసేనుండు నేఁడు సంగ్రామమునకుఁ । దీఱుదల యగుఁ గా కని తీవ్రకోప
దీప్తుఁడై గద సూచుచుఁ దేరు నీదు । తనయునకు సమ్ముఖంబుగఁ దఱుముటయును. 203

ప్రతిపదార్థం: భీమసేనుండు; నేడు; సంగ్రామమునకున్= యుద్ధానికి; తీఱుదల+అగున్+గాక+అని= అంతము అగుగాక అని పలికి; తీవ్ర కోప దీప్తుఁడు ఐ= మిక్కుటమగు ఆగ్రహముతో వెలుగొందువాడగుచు; గద+చూచుచున్= గదను పరికిస్తూ; తేరు= రథం; నీదు+తనయునకున్= ఓ ధృతరాష్ట్ర - నీ కొడుకైన దుర్యోధనునకు; సమ్ముఖంబుగన్= ఎదురుగా(దగ్గరగా); తఱుముటయును= త్వరితపరచటంతో.

తాత్పర్యం: భీమసేనుడు విజృంభించాడు. గద పట్టుకున్నాడు. తన రథాన్ని దుర్యోధనుని దగ్గరకు - ఎదురుగా తోలించాడు. 'నేడు ఈ యుద్ధం సమాప్తి కావాలి' అన్నాడు. మిక్కుటమగు రోషంతో కౌరవులను మార్కొన్నాడు.

క. నీ కొడుకు లందఱును వెఱ । నాకులతం బొంది రప్ప డగ్రజుఁడు గదా
నీకఘను మగధు వీరో । द्रేకంబునఁ బనిచె మారుతిం దలపడఁ గన్. 204

ప్రతిపదార్థం: నీ కొడుకులు+అందఱును; వెఱన్= భయముతో; ఆకులతన్+పొందిరి= కలత చెందారు, అప్పుడు; అగ్రజుడు= నీ పెద్ద కొడుకు (దుర్యోధనుడు); గదా+అనీక+ఘనున్= వివిధములగు గదా యుద్ధాలలో ఆరితేరినవాడైన; మగధున్= మగధరాజును; మారుతిన్+తలపడఁగన్= భీముని మార్కొనుటకై; వీర+ ఉద్రేకంబునన్= శౌర్యము విజృంభించునట్లుగా; పనిచెన్= నియమించాడు.

తాత్పర్యం: భీముని విజృంభణ చూచి నీ కుమారులందరు ఆకులత చెందారు. నీ పెద్ద కొడుకు దుర్యోధనుడు వివిధ గదా యుద్ధాలలో ఆరితేరిన మగధుని భీముడిని మార్కొనుటకై నియమించాడు.

వ. పనుచుటయు నతం డురవడించిన. 205

ప్రతిపదార్థం: పనుచుటయున్= ఆజ్ఞాపించగా; అతండు= ఆ మగధుడు; ఉరవడించినన్= విజృంభించగా.

తాత్పర్యం: మగధుడు-తన్ను దుర్యోధనుడు కోరి ఎన్నుకొని పంపటంచేత, ఉత్సాహం ఉరకలు వేయగా. (తరువాతి పద్యంతో అన్వయం).

చ. గజఘటలం గనుంగొని వికాసము మోమునఁ బల్లవింపఁగా
భుజశిఖరంబునందు గద పూన్చి మదంబునఁ దేరు డిగ్గి వా
యుజుఁడు గడంగి భీషణసముద్ధతిమైఁ దలపడ్డఁ బర్వత
వ్రజముపయిన్ వెసం గవియు వాసవుచందము దోఁచె నత్తఱిన్. 206

ప్రతిపదార్థం: గజ+ఘటలన్+కనుంగొని= ఏనుగుల గుంపులను చూచి; వికాసము= సంతోషం; మోమునన్= ముఖమునందు; పల్లవింపఁగా= చిగురించగా; భుజ శిఖరంబునందున్= మూపు కొసయందు; గద+పూన్చి= గదను అమర్చి; మదంబునన్= గర్వంతో; తేరు= రథం; డిగ్గి= దిగి; వాయుజుఁడు= భీముడు(వాయుదేవుని పుత్రుడు); కడంగి= పూనుకొని; భీషణ+సం+ఉద్ధతిమైన్= భయంకరమైన విజృంభణతో; తలపడ్డన్= మార్కొనగా; పర్వత వ్రజము= కొండల సముదాయము; పయిన్= పైన; వెసన్=వేగంగా; కవియు= మార్కొను; వాసవు+చందము= దేవేంద్రుని పోలిక; ఆ+తఱిన్= ఆ సమయంలో; తోఁచెన్= కన్పించింది.

తాత్పర్యం: ఏనుగుల గుంపులపై భీముడు విజృంభించాడు. అతడు తన గదను మూపుపై అమర్చి, గర్వంగా రథం దిగి భయంకరంగా కౌరవసేనలోని ఏనుగులను మార్కొనినపుడు, అతడు కొండలపై మార్కొన్న దేవేంద్రుడి వలె కన్పించాడు.

విశేషం: అలం: ఉపమ. పూర్వకాలంలో కొండలకు రెక్కలుండి - ఆకాశ మార్గంలో విహరించి, క్రిందికి దిగి నేలమీది జనపదాలను ధ్వంసం చేసేవట. అప్పుడు దేవేంద్రుడు వజ్రాయుధంతో కొండల రెక్కలు తునిమేవాడని పురాణకథనం. ఇప్పుడు - కొండలవంటి ఏనుగులను భీముడు ధ్వంసం చేయసాగాడు.

క. నిజసింహనాదమున న । గ్గజములు గుండియలు వగిలి కలగుండువడన్
విజయాగ్రజుఁ డి ట్లేచి ది । విజవర్గము పిచ్చలింప విస్ఫురితగతిన్. 207

ప్రతిపదార్థం: నిజ+సింహనాదమునన్= తాను చేసిన సింహనాదం చేత; ఆ గజములు= ఆ ఏనుగులు; గుండియలు+పగిలి= గుండెలు ప్రక్కలై; కలగుండు+ పడన్= కలత చెందగా; విజయ+అగ్రజుఁడు= అర్జునుని అన్న(భీముడు); ఇట్లు= ఈ విధంగా; విస్ఫురిత గతిన్= ప్రకాశమానమైన రీతిలో; ఏచి= విజృంభించి; దివిజ వర్గము= వేల్పులగుంపు; పిచ్చలింపన్= ప్రశంసించగా.

తాత్పర్యం: తన సింహనాదం వలన, కౌరవసేనలోని ఏనుగులు గుండెలు పగిలి కలత చెందగా. దేవతలు ప్రశంసించగా ప్రకాశమానమైన రీతిలో ఈ విధంగా విజృంభించి (మిాది వచనంతో అన్వయం)

విశేషం: 1. ఏనుగులకు సింహం అంటే భయం. సింహస్వప్నం - అంటే కలలో సింహం కన్పించినా సరే ఏనుగులు భయపడతాయట. ఇక సింహగర్జన పట్టపగలే వినిపిస్తే? 2. సింహనాదం : సింహము చేసే గర్జన అని వాచ్యార్థం. కానీ మహాభారతంలో 'సింహనాదం' అంటే సంగ్రామసమయంలో ఉత్సాహంతో వీరులు పెట్టే పెద్ద కేక. అది సింహగర్జనవలె ఉంటుంది. పరాక్రమంలో ఆయుధ విద్యాపాటవానికి ఉన్న ప్రాముఖ్యం - సింహనాదానికి కూడా ఉంది.

వ. విక్రమవిహారంబునకుం జొచ్చె నప్పుడు ద్రౌపదేయులు నభిమన్యుండును నవలును ధృష్టద్యుమ్నుండును గరిసముత్కరంబుపై శరనికరంబులు నిగిడించుచు భీముని నిరుగెలంకులం జేరి కవిసి రందు నకుల నందనుండగు శతానీకుండు హస్తికులమస్తకంబులు భల్లంబుల డొల్ల నేయుచు నడరె నట్టియెడ. 208

ప్రతిపదార్థం: విక్రమ విహారంబునకున్+చొచ్చెన్= శౌర్యము ప్రకటించుచు సంతోషముతో విహరింపసాగాడు; అప్పుడు; ద్రౌపదేయులు= ద్రౌపది కొడుకులూ; అభిమన్యుండును= అభిమన్యుడూ (సుభద్రకొడుకు); కవలును= నకుల సహదేవులూ; ధృష్టద్యుమ్నుండును= ధృష్టద్యుమ్నుడూ; కరి+సమ్+ఉత్కరంబుపైన్= ఏనుగుల పెనుగుంపులపై; శర+నికరంబులు= అమ్ముల

సముదాయాలు; నిగిడించుచున్= వ్యాపింపచేయుచు; భీమునిన్+ఇరు+కెలంకులన్+చేరి= భీముడికి ఇరువైపులకు చేరి; కవిసిరి= మార్కొన్నారు; అందున్= వారిలో; నకుల+నందనుండు+అగు= నకులుని కొడుకు అయిన; శతానీకుండు అనెడువాడు; హస్తి, కుల, మస్తకంబులన్= ఏనుగుల సమూహాల తలలు; భల్లంబులన్= ఈటెబాణాలతో; డొల్లన్+ఏయుచున్= కూలునట్లు ప్రయోగిస్తూ; అడరెన్= విజృంభించాడు; అట్టి+ఎడన్= ఆ సమయంలో.

తాత్పర్యం: భీముడు యుద్ధరంగంలో విహరింపసాగాడు. అతనికి ఇరు ప్రక్కల - నకుల సహదేవులు, అభిమన్యుడు, ధృష్టద్యుమ్నుడు, ద్రౌపది కొడుకులు చేరి ఏనుగుల గుంపులపై బాణాలు ప్రయోగించారు. నకులుడి కొడుకు శతానీకుడు ఏనుగుల తలకాయలు నేలపై పడేటట్లు ఈటె బాణాలు ప్రయోగించాడు.

చ. మగధమహీశుఁ డేచి యభిమన్యునిపైఁ గరిఁ గొల్ప నుజ్జ్వలం
బగు నొక నారసంబు దొడి యాతఁ డుదగ్రత ఫాలకుంభ సం
ధిగతము గాఁగ నేయ నది దీనత మ్రొగ్గఁగ నప్పుడక్కజం
బుగ వెస మాగధుం డునిమె భూస్థలి నయ్యురు పీనుఁగుం బడన్. 209

ప్రతిపదార్థం: మగధ+మహీశుఁడు= మగధరాజు; ఏచి= విజృంభించి; అభిమన్యునిపైన్= అభిమన్యుని మీద; కరిన్= ఏనుగును; కొల్పన్= పురికొల్పగా; ఉజ్జ్వలంబు+అగు= తీవ్రమైన; ఒక+నారసంబు+తొడి= ఒక బాణాన్ని ప్రయోగించి; ఆతఁడు= అభిమన్యుడు; ఉదగ్రతన్= ఉత్సాహంతో; ఫాల కుంభ సంధిగతము+కాఁగన్= ఆ యేనుగుయొక్క తల, కుంభస్థలం కలిసేచోట ఉండేదిగా; ఏయన్= బాణాలు ప్రయోగింపగా; అది= ఆ ఏనుగు; దీనతన్= బాధతో; మ్రొగ్గఁగన్= నేలకూలగా; అప్పుడు; అక్కజంబుగన్= ఆశ్చర్యకరముగా; వెసన్= వేగంగా; మాగధున్= మగధరాజును; ఆ+ఇరు+పీనుఁగున్= ఆ రెండు పీనుగులు (మాగధుడి పీనుగు - ఏనుగు పీనుగు); భూస్థలిన్= భూతలముమీద; పడన్= కూలగా; తునిమెన్= సంహరించెను.

తాత్పర్యం: మగధరాజు విజృంభించి - తన ఏనుగును పురికొల్పి అభిమన్యుడిని మార్కొన్నాడు. అభిమన్యుడు ఒక భయంకరమైన బాణంతో ఆ ఏనుగు కుంభస్థలాన్ని ఛేదించాడు. ఆ ఏనుగు కలగి నేలకూలింది. అప్పుడు ఆశ్చర్యకరంగా అభిమన్యుడు ఒక వాడి బాణంతో మగధరాజును సంహరించాడు. అప్పుడు - ఏనుగు పీనుగు, మగధరాజు పీనుగు నేలమీదకు కూలాయి.

క. ధృష్టద్యుమ్నుఁడు నుజ్జ్వల । దష్టాపదపుంఖ మార్గణావళి నయ్యు
త్కృష్టగజఘటలఁ గలఁచె న । వష్టంభ విజృంభణంబు వైరులు మొగడన్. 210

ప్రతిపదార్థం: ధృష్టద్యుమ్నుఁడున్= ధృష్టద్యుమ్నుడును; ఉజ్జ్వలత్ అష్టాపద పుంఖ మార్గణ+ఆవళిన్= ప్రకాశించే; బంగారు కొనలుగల బాణముల యొక్క సమూహముతో; ఆ+ఉత్కృష్టగజ ఘటలన్= ఆ గొప్ప ఏనుగుల గుంపులను; అవష్టంభ+విజృంభణంబు= గర్వాతిశయం; వైరులు+పొగడన్= శత్రువులు ప్రశంసించేటట్లుగా; కలఁచెన్= నొప్పించాడు, చీకాకు పరచాడు.

తాత్పర్యం: ధృష్టద్యుమ్నుడు ప్రకాశించే బంగారు ములుకులు గల బాణముల సమూహముతో శ్రేష్ఠములయిన ఆ ఏనుగుల గుంపును చీకాకుపరచాడు. అతడి దర్పముతో కూడిన విజృంభణను శత్రువులు ప్రశంసించారు.

విశేషం:. ధృష్టద్యుమ్నుడు ప్రయోగించినట్టివి మామూలు బాణాలు కావు. అవి అష్టాపదపుంఖములు కలవి. అష్టాపద= బంగారు, ఏనుగుల స్థూలకాయాలు చీల్చేందుకు ప్రత్యేకంగా ఉపకరించేవి 'అష్టాపద పుంఖ' బాణాలు. అనగా ఎనిమిది మొనలు గల బాణాలు.

ఉ. కొన్నిటి హస్తముల్ సదియఁ గొన్నిటిఁ గొమ్ములు దుమ్ము ధూళిగాఁ
గొన్నిటిఁ గుంభముల్ వగులఁ గొన్నిటిఁ గాళులు నుగ్గునూచగాఁ
గొన్నిటిఁ బార్శ్వముల్ నలియఁ గొన్నిటి వీఁపులు పిండుపీఁచుగా
నన్నిటి భీముఁ డుద్భటగదాహతి నేనికవేఁట లాడఁగన్. 211

ప్రతిపదార్థం: కొన్నిటిన్= కొన్ని ఏనుగులను; హస్తముల్= తుండములు; చదియన్= నలుగగా; కొన్నిటిన్=కొన్ని ఏనుగులను; కొమ్ములు= దంతాలు; దుమ్ము+ ధూళిగాన్= రేణువులు, అణువులుకాగా; కొన్నిటిన్= కొన్నింటిని; కుంభముల్= ఫాలభాగాలు; పగులన్; కొన్నిటిన్= కొన్నింటిని; కాళులు= కాళ్ళు; నుగ్గు నూచగాన్= ముక్కలు చెక్కలుకాగా; కొన్నిటిన్= కొన్నింటిని; పార్శ్వముల్= కడుపు ప్రక్క భాగాలు, నలియన్= పగిలిపోగా; కొన్నిటిన్= కొన్నింటిని, వీఁపులు; పిండు+పీఁచుగాన్= సన్నని దారపు పింజెలుగా; అన్నిటిన్= అన్ని ఏనుగులను; భీముఁడు= భీముడు; ఉద్భట+గదా+ఆహతిన్= భయంకరములైన గద యొక్క వ్రేటులచేత; ఏనిక+వేఁటలు= ఏనుగుల సంహరించటం అనే వినోద విహారం; ఆడఁగన్= చేయగా.

తాత్పర్యం: భీముడు - భయంకరమైన గదాదండం చేతపూని, ఏనుగులను వేటాడాడు - కొన్నిఏనుగుల తుండాలు నరికివేశాడు. కొన్నిటి దంతాలు పొడి పొడి చేశాడు. కొన్ని ఏనుగుల కుంభస్థలాలు పగులకొట్టాడు. కొన్ని ఏనుగుల కాళ్ళు విరుగ గొట్టాడు. కొన్నిటి వీపులు పింజలుపింజలుగా చేశాడు. కొన్నిటి కడుపు ప్రక్క భాగాలు ముక్కలు చేశాడు.

విశేషం: యుద్ధంలో ఏనుగులను సంహరించటంలో భీముడు సిద్ధహస్తుడుగా ప్రఖ్యాతిని ఆర్జించాడు.

క. అభిమన్యుద్రుపదసుత । ప్రభృతు లతనితోన మెలఁగి బడలువడఁగ న
య్యిభచయము నిశితవిశిఖ । క్షుభితముగాఁ జేసి రేపు సొంపారంగన్. 212

ప్రతిపదార్థం: అభిమన్యు ద్రుపద సుత ప్రభృతులు= అభిమన్యుడు, ద్రుపదుడి కొడుకులు మున్నగువారలు; అతనితోన+ మెలఁగి, = భీముడితో సహకరించి; బడలువడఁగన్= శ్రమపడగా; ఆ+ఇభ+చయమున్= ఆ ఏనుగుల గుంపును; నిశిత, విశిఖ, క్షుభితము గాన్= వాడి అయిన బాణములు సోకుట చేత కలత చెందినట్టివిగా; ఏపు+సొంపారన్= తమ విజృంభణ అందము చిందులాడు నట్లుగా; చేసిరి= చేశారు.

తాత్పర్యం: భీముడు గదపుచ్చుకొని విజృంభించి ఏనుగులను వేటాడుతుండగా, అభిమన్యుడు, ద్రుపదునికొడుకులు అతనితో సహకరించి చెలరేగి ఆ యేనుగుల గుంపును వాడియైన బాణాలచేత మిక్కిలి కలత నొందించారు.

విశేషం: భీముడు - సాహసంతో పాదచారియై గద చేత పుచ్చుకొని ఏనుగుల గుంపులలోనికి చొరబడ్డాడు. అభిమన్యుడు - ద్రుపదపుత్రులు దూరమున రథాలపై నిలిచి - బాణాలు ప్రయోగించి ఏనుగుల గుంపును సంక్షోభింప జేశాడు.

క. ద్విరదము లొఱగెడివియు నె । త్తురు గ్రక్కుచుఁ గూలెడివి గదుపు లై కలయం
దిరుగుడువడియెడివియు భువిఁ । బొర లెడివియు నయ్యెఁ బవనపుత్రు మునుమునన్. 213

ప్రతిపదార్థం: ద్విరదములు= ఏనుగులు (రెండు దంతములు గలవి); ఒఱగెడివియున్= ప్రక్కకు వాలి పడిపోవునట్టివియును; నెత్తురు= రక్తము; క్రక్కుచున్+కూలెడివి= నోటి నుండి వెలువడ చేయుచు చచ్చిపోవునట్టివియు; కదుపులు+ఐ= గుంపులు గుంపులుగా ఏర్పడి; కలయన్+తిరుగుడు+పడియెడివియున్= కలిసిపోవుచు, విడిపోవుచు, మరలిపోయెడివియు అగుచు; భువిన్= భూమిమీద; పొరలెడివియున్= పొరలాడునట్టివియునై; పవన పుత్రు+మునుమునన్= భీముని మునుములో; అయ్యెన్= అయ్యాయి.

తాత్పర్యం: భీముడి మునుములో ఏనుగులు కొన్ని ఒరగెడివి, కొన్ని నెత్తురు గ్రక్కుతూ కూలెడివీ, కొన్ని గుంపులై త్రొక్కిసలాటలో తిరుగుడుపడేవి. కొన్నినేలపై పొరలాడేవి అయినాయి.

క. ఏనుఁగు నెత్తుట గదయుం । దానుఁ దడిసి విలయ కాలదండధరుని చం
దానం బావని మాగధ । సేనం బీనుంగుపెంటఁ జేసి చెలంగెన్. 214

ప్రతిపదార్థం: పావని= వాయుపుత్రుడు(భీముడు); ఏనుఁగు+నెత్తుటన్= ఏనుగుల రక్తంలో; తాను= తానును; గదయున్= గదయును; తడిసి= తడిసిపోయి; విలయ కాల దండధరుని చందానన్= ప్రళయ సమయమునందలి యముని వలె; మాగధ సేనన్= మగధ దేశానికి చెందిన సైన్యాన్ని; పీనుఁగు+పెంటన్+చేసి= మృతకళేబరాల కుప్పగా చేసి; చెలంగెన్= విలసిల్లాడు.

తాత్పర్యం: భీముడు ఏనుగుల నెత్తుటిలో తానూ, తన గదాదండం తడిసి, ప్రళయకాలమందలి యముడివలె- మగధసేనను చీల్చి చెండాడుతూ ప్రకాశించాడు.

విశేషం: 'ప్రళయం' - కల్పాంత కాలంలో సంభవిస్తుందనీ అప్పుడు సృష్టి సమస్తం - సర్వనాశనం అయిపోతుందనీ ప్రాచీన భారతీయ పురాణ కథనం. అప్పుడు ప్రకృతిలోని సర్వశక్తులు - విజృంభించి సర్వనాశనం చేయగలవు సృష్టి అంతటినీ. దానికి ' ప్రళయము-ప్ర+లయము= విశేషమైన లయము (నాశనము) అని వ్యపదేశము. 'వి+లయము' ప్రళయమునకు పర్యాయపదం. యముడు సంహారకారుడు. ఇక 'ప్రళయకాలంలో' యముడి మాట వేరే చెప్పాలా?

క. శరములవేగంబున గద । పరుసదనంబునను గలఁగఁబడి చేడ్పడ నా
కరులం దోలెను భీముఁడు । వెరవున గోపకుఁడు గదుపు వెలిచిన మాడ్కిన్. 215

ప్రతిపదార్థం: శరముల వేగంబునన్= వడిగా వేయబడిన అమ్ములచేతను; గద+పరుసదవంబునను= గదయొక్క కఠినత్వమువలనను; కలఁగన్+పడి= కలత చెంది; చేడ్పడన్= దెబ్బతినగా; భీముఁడు; కరులన్= ఏనుగులను; గోపకుఁడు= ఆవుల కాపరి; కదుపు+వెలిచిన+మాడ్కిన్= గోవుల గుంపును మరలించిన విధముగా; వెరవునన్= ఉపాయముతో; తోలెను= తరిమికొట్టాడు.

తాత్పర్యం: అటు అభిమన్యుడు, ద్రుపదరాజు కొడుకులు వేగంగా ప్రయోగించిన బాణాలవల్లను, తన గదా ప్రహరణాల వల్లను కలత చెందిన ఏనుగులను భీముడు గోపాలుడు ఆవులమందను అదలించినట్లుగా ఉపాయంతో మరలించి తరిమికొట్టాడు.

క. పెనుగాలిఁ దూలు మొగిళులొ । యన నిభములు విఱిగి నిజబలావలి సదియం
దనమీఁదఁ బాఱ దుర్యో । ధనుఁ డదలిచి సర్వసైన్యతతిఁ బురికొల్పెన్. 216

ప్రతిపదార్థం: ఇభములు= ఏనుగులు; పెనుగాలిన్= పెద్ద వాయువుచే; తూలు= చెదరిపోవు; మొగిళులు+ఒ= మబ్బులో అనునట్లుగా; విఱిగి= దెబ్బతిని; నిజ+బల+ఆవలి= తనయొక్క సైన్య సమూహము; చదియన్= గలిగిపోగా; తనమీఁదన్+పాఱన్= తన మీదికి పరుగెత్తుకొని రాగా; దుర్యోధనుఁడు; అదలిచి= అదలించి; సర్వ సైన్య తతిన్= తన సేనా సమూహము నంతటినీ; పురికొల్పెన్= క్రమ్ముకొనజేశాడు.

తాత్పర్యం: పెద్ద గాలి దుమారం వలన చెల్లాచెదరైన మబ్బులవలె, ఏనుగులు దెబ్బతిని, తన సైన్యం వైపునకు పారిపోగా, దుర్యోధనుడు, ఆ ఏనుగులను అదలించి తన సైన్యాల గుంపు లన్నింటిని ప్రోత్సహించాడు. (క్రమ్ముకొనునట్లు చేశాడు)

విశేషం: అలం: ఉత్ప్రేక్ష.

క. పతి పురికొలిపిన నమవస । నతిశయముగఁ బొంగు జలధి యనఁ గ్రమ్మిన యు
ద్ధతబలము నిలిపె నమ్మా । రుతి సెలియలికట్టక్రియ నిరూఢస్థితి యై. 217

ప్రతిపదార్థం: పతి= రాజు(దుర్యోధనుడు); పురికొలిపినన్= ప్రోత్సహింపగా; అమవసన్= అమావాస్యనాడు; అతిశయముగన్= ఎక్కువగా; పొంగు= పొంగే; జలధి+అనన్= సముద్రమో అనునట్లుగ; క్రమ్మిన= ఆవరించిన; ఉద్ధత+బలమున్= అతిశయించిన సేనను; ఆ+మారుతి= వాయుపుత్రుడైన ఆ భీముడు; చెలియలికట్ట క్రియన్= చెలియలికట్టవలె; నిరూఢ+స్థితి+ఐ= స్థిరమైన నిలుకడ కలవాడై; నిలిపెన్= అడ్డగించాడు-వారించాడు.

తాత్పర్యం: రాజు అయిన దుర్యోధనుడు ప్రోత్సహించగా, అమావాస్యనాడు ఉప్పొంగే సముద్రమో అనునట్లుగా విజృంభించిన కౌరవసేనలను అరికట్టి చెలియలికట్టగా భీముడు నిలిచాడు.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. 1. చెలియలికట్ట: సముద్రము ఆటు పోటులతో కెరటాలతో ఎల్లపుడు చెలువొందు చున్నప్పటికి - ఒక 'మేర' మీరదు. ఆ రేఖకు చెలియలికట్ట అని పేరు. 2. అమావాస్యనాడు, పౌర్ణమినాడు సముద్రం ఉప్పొంగటం అందరకూ తెలిసినట్టిదే.

వ. ఇట్లు నిలిపి యార్చి తఱియం జొచ్చువృకోదరునకుం దోడయి ధృష్టద్యుమ్న సౌభద్ర ప్రముఖులగు రథికజనంబులు. 218

ప్రతిపదార్థం: ఇట్లు; నిలిపి; ఆర్చి= పెద్దకేకవేసి (సింహనాదం చేసి); తఱియన్+చొచ్చు= తరిమికొట్టే; వృకోదరునకున్= భీముడికి; ధృష్టద్యుమ్న, సౌభద్ర ప్రముఖులు+అగు= ధృష్టద్యుమ్నుడు; అభిమన్యుడు మొదలైన; రథికజనంబులు= రథాన్నెక్కి యుద్ధం చేసే వీరులు; తోడు+అయి= సాయంగా నిలిచి.

తాత్పర్యం: ఈ విధంగా సింహనాదం చేస్తూ, కౌరవసేనలను ఎదిర్చిన భీముడికి ధృష్టద్యుమ్నుడు, అభిమన్యుడు మొదలైన రథికులు సహాయంగా నిలిచి. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. విడువక దాపట వలపటఁ । గడిమి మెఱయ నిలిచి యపుడు కౌరవ సేనం
గడుఁ జిక్కు వఱిచి రొక్కు । మ్మడి నమ్ములవానఁ గురిసి మదమెలరారన్. 219

ప్రతిపదార్థం: విడువక= వదలిపెట్టక; దాపటన్= ఎడమ ప్రక్కను; వలపటన్= కుడి ప్రక్కను; కడిమి+మెఱయన్= పరాక్రమం ప్రకాశింపగా; నిలిచి= నిలబడి; అపుడు; కౌరవ+సేనన్= కౌరవ సైన్యాన్ని; ఒక్కుమ్మడిన్= ఏకంగా; అమ్ములవానన్= బాణముల వర్షంతో; మదము+ఎలరారన్= గర్వము విలసిల్లునట్లుగా; కడున్+చిక్కు+పఱిచిరి= ఎక్కువగా చీకాకు చేశారు.

తాత్పర్యం: కుడివైపున ఒకరు - ఎడమ ప్రక్క ఇంకొకరు నిలబడి, పరాక్రమం చూపించి, కౌరవసేనపై బాణాలు కురిపించి చీకాకు పరచారు. (వీరు ఎవరు?) అటు ధృష్టద్యుమ్నుడు - ఇటు అభిమన్యుడు అని సమాధానం చెప్పుకోవాలి - వెనుకటి గద్యనుబట్టి.

క. అడవి దరికొనిన పావకు । వడువున భీముండు గౌరవవ్యూహంబుం
బొడిసేయుచుఁ బేర్చెం దన । యొడలు మనము నంతకంత కుబ్బుచునుండన్. 220

ప్రతిపదార్థం: భీముండు; అడవిన్+దరికొనిన= అడవిని చుట్టుముట్టిన; పావకు+వడువునన్= అగ్నివలె; కౌరవ+వ్యూహంబున్= కౌరవులు పన్నిన సేనను; పొడి+చేయుచున్= పిండిచేయుచు, అణువులుగా కొట్టి అణగార చేయుచు; తన+ఒడలు= తన శరీరము; మనము= మనస్సు; అంతకున్+అంతకున్= మాటిమాటికి; ఉబ్బుచున్+ఉండన్= అతిశయించుచుండగా; పేర్చెన్= విజృంభించాడు.

తాత్పర్యం: అడవిని చుట్టుముట్టి దహించే అగ్నిహోత్రుడివలె, భీముడు కౌరవసేనను నాశనం చేశాడు. అతడి శరీరం, మనస్సు అంతకంతకు ఉత్సాహం పుంజుకొన్నాయి.

క. ఉరమునఁ గటిమైఁ దొడలం । జరణములం గౌరవేంద్రు చతురంగంబుల్
ధరఁ జాపకట్టు వడ ని । ష్ఠురగతిఁ దాఁకుచు సమీరసుతుఁడు చరించెన్. 221

ప్రతిపదార్థం: కౌరవ+ఇంద్రు, చతురంగంబుల్= దుర్యోధనుడి చతురంగ బలాలు; ధరన్= భూమియందు; చాఁపకట్టు+పడన్= చాపవలె పరుచుకొన్నట్లు పడిపోగా; సమీర సుతుఁడు= వాయునందనుడు - భీముడు; ఉరమునన్= వక్షముతో; కటిమైన్= మొలతో; తొడలన్= తొడలతో; చరణములన్= పాదములతో; నిష్ఠురగతిన్= పరుషమైన విధంగా; తాఁకుచున్= కొట్టుతూ; చరించెన్= విహరించాడు.

తాత్పర్యం: కురురాజు బలాలు నేలపై చాపకట్టుగా సాగిలపడేటట్లు భీముడు రొమ్ముతో, మొలతో, తొడలతో, పాదాలతో పరుషంగా తాకుతూ విహరించాడు.

తే. తుంగ మడువున నాడు మాతంగవిభుని । భంగి భవదీయసైన్యంబు బడలువడఁగ
లీల నిస్సంభ్రముం డయి కేలి సలిపె । గాలిచూ లప్డు గగనచరాలి పొగడ. 222

ప్రతిపదార్థం: తుంగ+మడువునన్= తుంగ మొక్కలు దట్టముగా మొలిచియున్న చెరువులో; ఆడు= వినోదవిహారం చేసే; మాతంగ+విభుని+భంగిన్= ఏనుగులరాజువలె; భవదీయ+ సైన్యంబు= నీ సేన; బడలు+పడఁగన్= డస్సిపోవునట్లుగా; లీలన్= సులువుగా ఆటవలె; నిస్+సంభ్రముండు అయి= తొట్రుపాటు లేనివాడయి; గాలిచూలు= వాయునందనుడు, భీముడు; గగన+చర+ఆలి= ఆకాశ సంచారులగు దేవతల సమూహం; పొగడన్= ప్రశంసింపగా; అప్డు= ఆ సమయాన; కేలి+సలిపెన్= ఆట ఆడాడు.

తాత్పర్యం: తుంగతో నిండిన చెరువులో విహరించే మదపుటేనుగు వలె భీముడు తొట్రుపాటు ఏమాత్రం లేకుండగా - నీ సేనను చీకాకు పరచాడు. భీముని శౌర్యధైర్యసాహసాలు చూచి, చారణులు ప్రశంసించారు.

విశేషం: 1.తుంగ= పెద్ద గడ్డికాడలు గల మొక్క. దానిని పడగొట్టేందుకు కుక్కపిల్ల చాలు. ఇక మదపుటేనుగు మాట చెప్పనక్కరలేదు. 2. గగనచరులు= చారణులు. ఆకాశంలో ఒక తెగకు చెందిన దేవతలు సంచరిస్తారని, వారు గొప్ప సహృదయులు అని - గొప్పతనం ఎక్కడ కన్పించినా వారు గుర్తించి దేశదేశాలలో సంచరించి పొగడగలరని - ప్రాచీన భారతీయ సంప్రదాయం.

క. వెఱచఱచి వెగడువడి ని । వ్వెఱఁగందుచుఁ గురుబలంబువీరు లతని డ
గ్గఱ కంతనంతఁ జూడఁగ । నుఱక నదీసుతుఁడు దాఁకె నుద్భటభంగిన్. 223

ప్రతిపదార్థం: వెఱచఱచి= భయపడి; వెగడు+పడి= ఆశ్చర్యమునంది; నివ్వెఱఁగు+అందుచున్= మ్రాన్పడి(మిక్కిలి అచ్చెరువుతో స్తంభించి పోయి); కురు+బలంబువీరులు= కౌరవసైన్యంలోని శూరులు; అతని+డగ్గఱక= భీముడిని సమీపించలేక; అంతన్+అంతన్+చూడఁగన్= దూర దూరమునుండియే చూచుచుండగా; నదీసుతుఁడు= గంగాపుత్రుడు= భీష్ముడు; ఉఱక= లక్ష్యపెట్టక; ఉద్భటభంగిన్= భయంకర రీతితో(అతడిని); తాఁకెన్= ఎదిరించాడు.

తాత్పర్యం: భీమసేనుడి విజృంభణం చూచి కురుసేనలోని వీరులు ఆశ్చర్యచకితులై నివ్వెరపాటుతో అతడిని సమీపించక దూరమునుండియే చూస్తుండగా అప్పుడు సేనాధిపతి అయిన భీష్ముడు వచ్చి, ఉద్రేకంతో భీముడిని లక్ష్యపెట్టక మార్కొన్నాడు.

క. అరదంబురవము సెలఁగఁగ । శరములు వాయుజునిమీఁద సాంద్రముగ వెసం
గురియుచు నడరెడు భీష్ముని । సరభసముగ మాఱుకొనియె సాత్యకి గడిమిన్. 224

ప్రతిపదార్థం: అరదంబు+రవము= రథము యొక్క ధ్వని; చెలఁగఁగన్= మ్రోయగా; వాయుజుని మీఁదన్= భీముడిపై; శరములు= బాణాలు; సాంద్రముగన్= దట్టముగా; వెసన్=వేగముగా; కురియుచున్= ప్రయోగించుచూ; అడరెడు= విజృంభించెడు; భీష్మునిన్ సరభసముగన్= వేగముగా; సాత్యకి; కడిమిన్= పరాక్రమంతో; మాఱుకొనియెన్= తాకాడు.

తాత్పర్యం: భీష్ముడు తన రథధ్వని మ్రోయుచుండగా భీముడిపై దట్టంగా వేగంగా బాణాలు కురిపిస్తూ విజృంభించే భీష్ముడిని పాండవసేనలోని వీరులలో ప్రముఖుడైన సాత్యకి - వేగంగా పరాక్రమంతో ఎదిరించాడు.

వ. ఇట్లెదిర్చినం జూచి. 225

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; ఎదిర్చినన్= మార్కొనగా; చూచి= వీక్షించి.

తాత్పర్యం: ఈ విధంగా సాత్యకి భీష్ముడిని ఎదుర్కొనటం గమనించి. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. అంబరము వగుల నార్చి జ । నంబు మొగడఁ గృష్ణననుజునకు మార్కొని తీ
వ్రాంబకములు పదియింట న । లంబుసుఁడు దదంగకం బులం గీలించెన్. 226

ప్రతిపదార్థం: అంబరము+పగులన్+ఆర్చి= ఆకాశం చిల్లులు పడేటట్లుగా కేకవేసి; జనంబు+పొగడన్= అందరూ ప్రశంసించుతూ ఉండగా; అలంబుసుడు= కౌరవ పక్షంలోని ఒక రాక్షస వీరుడు; కృష్ణ+అనుజునకున్= శ్రీకృష్ణుని తమ్ముడు అయిన సాత్యకికి; మార్కొని= ఎదురొడ్డి; తీవ్ర+అంబకములు= వాడియైన అమ్ములు; పదియింటన్= పది సంఖ్యగలవాటితో; తద్+అంగకంబులన్= ఆతనియొక్క(సాత్యకియొక్క) శరీరమునందలి అవయవాలలో; కీలించెన్= గ్రుచ్చుకొనునట్లు చేశాడు;

తాత్పర్యం: కౌరవ సేనలోని రాక్షసవీరుడు అలంబుసుడు ఆకాశము పగులునట్లు గొప్ప కేకవైచి, అందరూ ప్రశంసించుతుండగా, కృపుని తమ్ముడైన సాత్యకిని ఎదిరించి పది బాణాలు ఆతని అవయవములందు గ్రుచ్చాడు.

వ. ఇవ్విధంబునఁ దాఁకి బెట్టు నొప్పించినం గోపించి. 227

ప్రతిపదార్థం: ఈ+విధంబున్= ఈ రీతిగా; తాఁకి= మార్కొని; బెట్టు= ఎక్కువగా; నొప్పించినన్= బాధింపగా; కోపించి= ఆగ్రహించి.

తాత్పర్యం: ఈ విధంగా అలంబుసుడు మార్కొని మిక్కిలి నొప్పించగా సాత్యకికి కోపం వచ్చి (తరువాతి పద్యంతో అన్వయం).

చ. శినిమనుమండు నద్దనుజు శీఘ్రమ నాలుగు నారసంబులన్
వెనుక కొదుంగఁజేసి పటువిక్రమ మొప్పఁగ నార్చె నార్చినన్
విని కనుగ్రేవఁ గెంపడర వీరరసోద్ధతిఁ జూచి సోమద
త్తునితనయుండు బి ట్టతనితోఁ దలపడ్డ నుతించె సైన్యముల్. 228

ప్రతిపదార్థం: శిని+మనుమండు= శిని అనేయాదవవీరుని మనుమడైన సాత్యకి; ఆ+దనుజున్=ఆ రాక్షసుని; శీఘ్రము+అ= వేగంగా; నాలుగు+నారసంబులన్= నాలుగు బాణాలతో; వెనుకకున్+ఒదుంగన్+చేసి= వెనుకకు తిరుగునట్లు చేసి; పటు, విక్రమము ఒప్పఁగన్= గొప్ప పరాక్రమం విలసిల్లేటట్లుగా; ఆర్చెన్= సింహనాదం చేశాడు; ఆర్చినన్= అట్లా సింహనాదం చేయగా; విని;

కను+క్రేవన్+కెంపు+అడరన్= నేత్రాంచలములు ఎఱ్ఱపడగా; వీర రస+ఉద్ధతిన్+చూచి; పరాక్రమోద్రేకముతో వీక్షించి; సోమదత్తుని+తనయుండు= సోమదత్తుడు అను కౌరవవీరుని కొడుకు - భూరిశ్రవుడు; బిట్టు= ఎక్కువగా; అతనితోన్= ఆ సాత్యకితో; తలపడ్డన్= మార్కొనగా; సైన్యములు= సేనలు; నుతించెన్= ప్రశంసించాయి.

తాత్పర్యం: సాత్యకి నాలుగు బాణాలు ప్రయోగించి, రాక్షస వీరుడైన అలంబుసుని వెనుకకు మరలేటట్లు చేశాడు. చేసి - విజయగర్వంతో సింహనాదం చేశాడు. ఆ సింహనాదం విని, కురువీరులలో ప్రముఖుడు, సుప్రసిద్ధ రథికుడు అయిన సోమదత్తుడి కొడుకు - భూరిశ్రవుడు - కడకన్ను ఎఱ్ఱబడగా పరాక్రమోద్రేకంతో చూచి సాత్యకిని మార్కొనగా సేనలు అతడిని స్తుతించాయి.

వ. ఇత్తెఱంగునం దలపడి. **229**

ప్రతిపదార్థం: ఈ+తెఱంగునన్= ఈ విధంగా; తలపడి= మార్కొని

తాత్పర్యం: ఈ విధంగా సాత్యకి - భూరిశ్రవుడు ఒకరినొకరు మార్కొని. (తరువాతి పద్యంతో అన్వయం).

క. భూరిశ్రవుండు దొమ్మిది । నారాచము లతనిమేన నాటించిన నా
కౌరవ్యునిఁ బటు విశిఖా । సారంబున ముంచి నొంచె శైనేయుండున్. **230**

ప్రతిపదార్థం: భూరిశ్రవుండు= భూరిశ్రవుడు; తొమ్మిది+నారాచములు= తొమ్మిదిబాణాలు; అతని+మేనన్= సాత్యకి యొక్క శరీరమందు; నాటించినన్= గ్రుచ్చుకొనేటట్లు చేయగా; శైనేయుండున్= శినివంశానికి చెందిన సాత్యకియు; ఆ కౌరవ్యునిన్= కౌరవ పక్షానికి చెందిన ఆ భూరిశ్రవుడిని; పటు+విశిఖ+ఆసారంబునన్= పెక్కు బాణాల వర్షంలో; ముంచి= మునుగునట్లు చేసి; నొంచెన్= నొప్పించాడు.

తాత్పర్యం: ఈ విధంగా సాత్యకి, భూరిశ్రవుడు ఒకరినొకరు మార్కొని యుద్ధం చేశారు. భూరిశ్రవుడు తొమ్మిది బాణాలు ప్రయోగించి సాత్యకి శరీరంపై గ్రుచ్చుకొనేటట్లు చేశాడు. సాత్యకి బాణవర్షంలో భూరిశ్రవుని ముంచి నొప్పించాడు.

విశేషం: కురుక్షేత్రం - కురుపాండవుల మధ్య జరిగిన యుద్ధానికి నిలయమేగాక ఇరుపక్షాలలోని వీరులూ - తమ తమ పూర్వ వైరాలను తీర్చుకునేందుకు అవకాశంగా పరిణమించింది. (తదుపరి పలుసారులు సాత్యకి భూరిశ్రవుల మధ్య ద్వంద్వ యుద్ధాలు - చూపరులకు కనులపండువైనవి జరిగాయి. చివరకు - భూరిశ్రవుడు సాత్యకిని ఓడించి - క్రిందపడ చేసి అతడిపైకెక్కి కత్తి గ్రుచ్చే సమయంలో - అర్జునుడు - శ్రీకృష్ణ ప్రేరితుడై భూరిశ్రవుని చేతిని ఖండించాడు. అది ద్వంద్వయుద్ధనీతికి విరుద్ధం. సాత్యకి - క్రిందపడినవాడు లేచి, నిరాయుధుడైన భూరిశ్రవుని సంహరించాడు.

ఉ. ఈసునఁ దానుఁ దమ్ములు నరేంద్రుఁడు గ్రందుగ సౌమదత్తికిన్
బాసట యై కడంగ నట పాండవులున్ హరితమ్ముఁ గూడి పె
ల్లేసిరి వారిపై నధిప! యేడ్తెఱమీఱ బకారి యప్డు సం
త్రాసన భాసురుం డగుచుఁ దాఁకి తెరల్చె భవత్కుమారులన్. **231**

ప్రతిపదార్థం: ఈసునన్= కోపంతో; నరేంద్రుఁడు= దుర్యోధనుడును, తానున్+తమ్ములున్= తాను, తమ్ములును; క్రందుగన్= దట్టముగా; సౌమదత్తికిన్= సోమదత్తుని కొడుకునకు(భూరిశ్రవునకు); బాసటయై= సాయమై; కడంగన్= పూనగా; అట= ఆవైపున; పాండవులున్; హరితమ్మున్= కృష్ణుని సోదరుని(సాత్యకిని); కూడి= కలిసి; వారిపైన్= ఆ కౌరవులపై; పెల్లు+ఏసిరి= మిక్కుటముగా

బాణాలు ప్రయోగించారు; అధిప!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; అప్డు= ఆ సమయంలో; బక+అరి= బకునకు విరోధి (భీముడు); ఏడ్తెఱ+మీఱన్= పరాక్రమం అతిశయింపగా; సంత్రాసన+భాసురుండు+అగుచున్= భయోత్పాతం కలిగిస్తూ ప్రకాశించునట్టివాడై; భవత్+కుమారులన్= నీ కొడుకులను; తాఁకి= మార్కొని; తెరల్చెన్= మరలించాడు.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! ఆ సమయంలో దుర్యోధనుడు, తమ్ములు కోపంతో యుద్ధంలో చేరి భూరిశ్రవుడికి తోడుగా నిలిచారు. అటు పాండవపక్షంలో పాండవులు - సాత్యకికి సాయంగా నిలిచి, కౌరవులపై మిక్కుటంగా బాణాలు ప్రయోగించారు. భీముడు భయంకర స్వరూపం ధరించి, నీ కుమారులను అందరినీ వెనుకకు పారద్రోలాడు.

విశేషం: భీముడు అని చెప్పటానికి - 'బకారి' అని ఉల్లేఖించటం వలన - అలనాడు ఏకచక్రపురంలో ఒంటరిగా వెళ్ళి బకుడు అనే రాక్షసుని సంహరించిన వృత్తాంతం - భీముని ఏకాంత పరాక్రమం ప్రస్ఫుటమైనది.

దుర్యోధనుఁడు భీముని మార్కొని మూర్ఛఁ బొందించుట (సం. 6-60-7)

ఉ. తమ్ములు వీఁగినం బతి యుదగ్రత భీము నెదిర్చి యార్చుచుం
దొమ్మిది యమ్ములం దనువు దూఁటులు సేసిన సూతుఁ బిల్చి వే
గమ్మ రథమ్ముపై కరిగి కన్నుల నిప్పులు రాల నవ్వి యొ
క్కుమ్మడి నాతఁ డేసె నృపు నుగ్రగతిం బది నారసంబులన్. 232

ప్రతిపదార్థం: తమ్ములు= సోదరులు; వీఁగినన్= యుద్ధమునుండి పారిపోగా; పతి= రాజు(దుర్యోధనుడు); ఉదగ్రతన్= భయంకరముగా; భీమున్= భీముని; ఎదిర్చి= మార్కొని; ఆర్చుచున్= సింహనాదం చేస్తూ; తొమ్మిది+అమ్ములన్= తొమ్మిది బాణాలతో; తనువు= శరీరం; తూఁటులు+చేసినన్= గ్రుచ్చుకొని గాయాలు ఏర్పడేటట్లు చేయగా; సూతున్+పిల్చి= సారథిని పిలిచి; వేగమ్ము+అ= మిక్కిలి తొందరగా; రథమ్ము పైకిన్+అరిగి= తేరునెక్కి; కన్నుల+నిప్పులు+రాలన్= నేత్రాల నుండి విస్ఫులింగాలు రాలునట్లుగా; నవ్వి; ఒక్కుమ్మడిన్= ఏకంగా(ఒకేసారి); ఆతఁడు= భీముడు, నృపున్= రాజును(దుర్యోధనుని); పది నారసమ్ములన్= పది బాణాలతో; ఉగ్రగతిన్= భయంకరంగా; ఏసెన్= కొట్టాడు.

తాత్పర్యం: తన తమ్ముడు యుద్ధంలో ఓడిపోయి పారిపోగా, దుర్యోధనుడు మాత్రం ధైర్యంగా నిలబడి భీముడిని ఎదిరించి, ఆతడిపై తొమ్మిది బాణాలు ప్రయోగించి ఆతడి శరీరం చిల్లులు పడేటట్లు చేశాడు. అంతట భీముడు కన్నుల నుండి నిప్పులు రాలగా నవ్వి, సూతుని పిలిచి వేగంగా రథాన్ని ఎక్కి, పదిబాణాలు ప్రయోగించి దుర్యోధనుడిని కొట్టాడు.

విశేషం: ఇంతవరకు - భీముడు నేలమీద దిగి - గద పుచ్చుకొని వీరవిహారం చేశాడు. దుర్యోధనుడి తమ్ములు పారిపోయారు. అయితే దుర్యోధనుడు రథియై తనమీద తొమ్మిది అమ్ములు తన శరీరం తూట్లు పడేటట్లు కొట్టగా, ఇక భీముడు గూడ రథం ఎక్కి విల్లు ధరించవలసివచ్చింది.

సీ. అంతఁబోవక సూతుఁడగు నందకుని మూఁడుశరముల నేసిన ధరణినాథుఁ
డరువది యమ్ముల నతని నాతనిరథచోదకుం డైనవిశోకు మూఁట
నటిముటి నో నేసి మటియు నొక్కమ్మున ఘనశరాసనముఁ ద్రుంచినఁ బ్రదీప్త
కోపుఁ డై యొండొక చాపంబు గైకొని యుగ్రభల్లమున వృకోదరుండు

ఆ. విల్లు దునుముటయును వేఱొక్క వింట వ । జ్రంబుఁ బోని నారసంబు దొడిగి
రాజరాజు వెస నురం బాడ నేసిన । మూర్ఛవచ్చి యతఁడు మ్రొగ్గె నధిప! 233

ప్రతిపదార్థం: అంతన్+పోవక= అంతటితో ఆగక; సూతుఁడు+అగు= సారథి అయిన; నందకుని= నందకుడు అను పేరు గల వాడిని; మూఁడు శరములన్= మూడు బాణాలతో; ఏసినన్= కొట్టిన; ధరణినాథుఁడు= రాజు(దుర్యోధనుడు); అరువది+అమ్ములన్= అరవై బాణాలతో; ఆతనిన్= భీముని; ఆతని+రథ+చోదకుండు+అయిన విశోకున్= భీముడి రథాన్ని తోలే విశోకుడిని; మూఁటన్= మూడు బాణాలతో; ఆటిముటిన్= సంభ్రమంతో; నోన్+ఏసి= నాటునట్లుగా ప్రయోగించి; మటియున్; ఒక్క+అమ్మునన్= ఒక బాణంతో; ఘన+శరాసనమున్= పెద్దవిల్లు; త్రుంచినన్= ఖండించగా; వృకోదరుండు= భీముడు; ప్రదీప్త+కోపుఁడు+ఐ= హెచ్చయిన ఆగ్రహము కలవాడై; ఒండు+ఒక= మరియొక; చాపంబు= విల్లు; కైకొని= పుచ్చుకొని; ఉగ్ర+భల్లమునన్= భయంకరమైన ఈటె బాణంతో; విల్లు; తునుముటయును= ఖండించుటయు; వేఱు+ఒక్క+వింటన్= మరియొక ధనుస్సుతో; వజ్రంబున్+పోని= వజ్రంతో సమానమయిన; నారసంబు= బాణము; తొడిగి= సంధించి; రాజరాజు= దుర్యోధనుడు; వెసన్= వేగంగా; ఉరంబు= వక్షము; ఆడన్+ఏసినన్= నాటేటట్లు ప్రయోగించగా; అతఁడు= భీముడు; అధిప!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; మూర్ఛవచ్చి= స్పృహ కోల్పోయి; మ్రొగ్గెన్= వాలిపోయాడు.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! భీముడు అంతటితో ఊరుకొనక, దుర్యోధనుడి సారథియైన నందకుని మూడు బాణాలతో కొట్టాడు. దుర్యోధనుడు భీముడి రథసారథియైన విశోకుడిని మూడు బాణాలతో కొట్టి, భీముడిపై అరవై అమ్ములు ప్రయోగించాడు. అంతేకాక ఒక బాణం ప్రయోగించి భీముడి విల్లు ఖండించాడు. భీముడు ఆగ్రహించినవాడై వేరొక విల్లు ధరించి, ఒక ఈటె బాణంతో దుర్యోధనుడి విల్లు త్రుంచాడు. రాజరాజైన దుర్యోధనుడు - ఇంకో విల్లు పూని, వజ్రంతో సమానమైన ఒక బాణంతో భీముడి వక్షాన్ని కొట్టాడు. ఆ అమ్ము తాకిడికి - భీముడు స్పృహ తప్పి పడిపోయాడు.

క. కని కడు నలిగి సుభద్రా । తనయుఁడుఁ బాంచాలరాజతనయుఁడు గృష్ణా
తనయులు నొక్కుమ్మడి నీ । తనయునిఁ బొదివిరి పటుప్రదరపుంజములన్. 234

ప్రతిపదార్థం: సుభద్రా+తనయుఁడున్= సుభద్ర కొడుకగు అభిమన్యుడూ; పాంచాలరాజతనయుఁడున్= ద్రుపదపుత్రుడు ధృష్టద్యుమ్నుడు; కృష్ణాతనయులున్= ద్రౌపది కొడుకులు; కని= చూచి(భీముడు మూర్ఛిల్లుట చూచి); ఒక్కుమ్మడిన్= అందరును ఏకమై; నీ+తనయునిన్= నీ కొడుకును(దుర్యోధనుని); పటు ప్రదర పుంజములన్= పెక్కు అమ్ముల సముదాయాలతో; పొదివిరి= చుట్టు ముట్టినారు.

తాత్పర్యం: అభిమన్యుడు, ధృష్టద్యుమ్నుడు, ద్రౌపదీపుత్రులు మూర్ఛపోవటం చూచి, అందరూ ఏకమై నీ కొడుకైన దుర్యోధనుడిపై పెక్కుబాణాలు ప్రయోగించి చుట్టుముట్టారు.

ఉ. అంతకు సేద దేఱి విలయాంతకు నాకృతి భీముఁడేచి దు
ర్దాంతపరాక్రమస్ఫురణఁ దాఁకి నరేంద్రతనూజు శల్యు న
త్యంతరయంబునం బటుశరావలి నొంచిన నీదుసైనికుల్
సెంతలఁ జేర రైరి బలు సింగముఁ గన్న గజంబులట్ల యై 235

ప్రతిపదార్థం: అంతకున్= కొంతసేపటికి; సేద+తేఱి= స్పృహ వచ్చి; భీముఁడు; విలయ+అంతకు+ఆకృతిన్= ప్రళయ కాలమునందలి యముని రూపంతో; ఏచి= విజృంభించి; దుర్దాంత+పరాక్రమ+స్ఫురణన్= ఎదుర్కొనుటకు వీలులేని శౌర్య

ప్రకటనతో; నరేంద్ర తనూజున్= రాజకుమారుడైన; శల్యున్= శల్యుడిని (మద్రరాజును); అతి+అంత+రయంబునన్= మిక్కిలి వేగంతో; పటు+శర+ఆవలిన్= మిక్కుటమగు అమ్ముల సముదాయంతో; నొంచినన్= నొప్పించగా; నీదు+సైనికుల్= నీ భటులు; బలు+సింగమున్= బలముగల సింహాన్ని; కన్న= చూచిన; గజంబులు+అట్ల+ఐ= ఏనుగుల వలె అయి; చెంతలన్+చేరరు+ఐరి= చేరువకు చేరలేకపోయారు.

తాత్పర్యం: కొంతసేపటికి భీముడు మూర్ఛనుండి తేరుకొన్నాడు. తేరుకొని, ప్రళయకాలమందలి యముడివలె విజృంభించి, మిక్కిలి వేగంగా, పరాక్రమం ప్రకటించి శల్యుడిని మార్కొని ఆతడిపై బాణవర్షం కురిపించాడు. నీ సైనికులు భీముడి ధాటికి జంకి, సింహాన్ని చూచిన ఏనుగుల వలె అతడి సమీపానికి వెళ్ళటానికి జంకారు.

విశేషం: అలం: ఉపమ. ప్రాచీన భారతీయ సారస్వతంలో సింహం ఏనుగును సంహరించగల శక్తి గలదని వర్ణింపబడింది. ఈ వర్ణన ఒక కవి సమయంగా పరిణమించింది. అయితే వాస్తవజగత్తులో సింహానికి - ఏనుగును చంపే శక్తి లేదని తేలిపోయింది.

వ. అప్పు డపరాహ్ణం బయ్యెఁ దత్సమయంబున భవత్సూనులు సేనాపతి సుషేణ జలసంధ సులోచనులు భీమ భీమరథ భీమబాహు దుష్ప్రధర్ష దుర్ముఖులును వివిత్సు వికటోగ్రాలోలు పసములు నీ పదునలువురు బహుశరంబు లడరించుచు నతనిం బొదివిన నజ్జరాసంధమర్దనుండు ఘనశార్దూలంబు బాలమృగంబులం గని కవియు చందంబున నెదుర్కొని సేనాపతి శిరంబు భల్లంబునం ద్రుంచి బాణ త్రయంబున జలసంధు నంతకాలయంబున కనిచి సుషేణువక్షస్స్థలంబున వలుఁదనారసంబు నాటించి పడవైచి భీమబాహు నస్త్రపంచకంబునం జంపి యుగ్రునుత్తమాంగంబు వెడఁదవాతియమ్మునం గుండలమ్ములతోఁ గూల్చి భీమ భీమరథుల నొక్కుమ్మడిం బెక్కమ్ములం గూల నేసి నగుచు మిక్కుటమ్మగు నాలుగమ్ముల సులోచనుం గీటడంగించిన. 236

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయమున; అపర+అహ్నంబు+ అయ్యెన్= సాయంకాలం అయింది, తద్+సమయంబునన్= ఆ సమయంలో; భవత్+సూనులు= నీ కొడుకులు; సేనాపతి సుషేణ జలసంధ సులోచనులు= భీమ, భీమరథ, భీమబాహు, దుష్ప్రదర్ష దుర్ముఖులును; ఈ+పదునలువురు= ఈ పద్నాలుగు మంది; బహు+శరంబులు= పెక్కుబాణాలు; అడరించుచున్= ప్రయోగించుతూ; అతనిన్+పొదివినన్= అతడిని (భీముడిని) కవియగా; ఆ+జరాసంధ+మర్దనుండు= ఆ జరాసంధుని సంహరించినవాడు, భీముడు; ఘన+శార్దూలంబు= గొప్ప పెద్ద పులి; బాల మృగంబులన్+కని= చిన్న లేడిపిల్లలను చూచి; కవియు+చందంబునన్= మీద పడునట్లుగా; ఎదుర్కొని; సేనాపతి+శిరంబు= సేనాపతియను పేరుగల వాని తల; భల్లంబునన్= ఈటె బాణంతో; త్రుంచి= ఖండించి; బాణత్రయంబునన్= మూడు బాణాలతో; జలసంధున్= జలసంధుడు అను పేరు గలవానిని; అంతక+ఆలయంబునకున్= యముని గృహానికి; అనిచి= పంపి; సుషేణు+వక్షస్+స్థలంబునన్= సుషేణుని యొక్క ఉరమున; వలుఁద+నారసంబు= పొడుగు పాటి బాణం; నాటించి= గ్రుచ్చుకొనునట్లు చేసి; పడవైచి= కూల్చి; భీమబాహున్= భీమబాహుడు అను పేరు గలవాని; అస్త్రపంచకంబునన్= అయిదు బాణాలతో; చంపి; ఉగ్రు+ఉత్తమ+అంగంబు= ఉగ్రుడు అనువాని తల; వెడఁద+వాతి+అమ్మునన్= విశాలమగు నోరుగల బాణంతో; కుండలమ్ములతోన్= కుండలాలతోపాటు; కూల్చి= సంహరించి; భీమ, భీమరథులన్= భీముడు, భీమరథుడు అను పేరుగల వారిని; ఒక్కుమ్మడిన్= ఏకంగా; పెక్కు+అమ్ములన్= పలుబాణాలతో; కూలన్+ఏసి= చంపి; నగుచున్= నవ్వుచు; మిక్కుటమ్ము+అగు+అ= గొప్పవి అయిన; నాలుగు+అమ్ములన్= నాలుగు బాణాలతో; సులోచనున్= సులోచనుడు అనువానిని; గీటు+అడంగించినన్= సంహరించగా.

తాత్పర్యం: అప్పుడు అపరాహ్ణ సమయం అయింది. ఆ సమయంలో నీ కొడుకులుపదునాలుగు మంది 1. సేనాపతి, 2. సుషేణుడు, 3. జలసంధుడు, 4. సులోచనుడు, 5. భీముడు, 6. భీమరథుడు, 7. భీమబాహుడు, 8. దుష్ప్రధర్షుడు,

9. దుర్ముఖుడు, 10. వివిత్సుడు, 11. వికటుడు, 12 . ఉగ్రుడు, 13. ఆలోలుపుడు, 14. సముడు అనే వారలు పెక్కుబాణాలు భీమునిపై ప్రయోగిస్తూ అతడిని చుట్టుముట్టారు. అంతట జలసంధుడిని సంహరించిన భీముడు, చిన్న లేడిపిల్లల గుంపుపై బడిన పెద్దపులి వలె వారిని అందరినీ ఎదుర్కొన్నాడు. సేనాపతి తల ఒక ఈటె బాణంతో ఖండించాడు. జలసంధుడిని మూడుబాణాలు ప్రయోగించి సంహరించాడు. పొడుగు బాణంతో సుషేణుడి ఉరము చీల్చాడు. అయిదు బాణాలతో భీమబాహుడిని చంపాడు. కుండలాలతో మెరిసిపోయే ఉగ్రుడి శిరస్సును విశాలమగు నోరుగల ఒక బాణంతో కూల్చాడు. పలు బాణాలు ప్రయోగించి భీముడిని, భీమరథుడిని, చంపాడు. అట్లే, గొప్ప బాణాలతో సులోచనుడిని వధించాడు.

క. పెఱవార లధికభీతిన్ । విఱిగి చనిరి భీష్ముఁ డేచి వీరరథికు లం
దఱఁజూచి రాచకొడుకుల । నఱుమాడెడు భీముఁ డిట్లు నడుఁకం దగునే?' 237

ప్రతిపదార్థం: పెఱవారలు= ఇతరులు; అధికభీతిన్= మిక్కుటమగు భయముతో; విఱిగి+చనిరి= ఓడిపోయి పారిపోయారు; భీష్ముఁడు+ఏచి= భీష్ముడు విజృంభించి; వీర+రథికులు+అందఱన్+చూచి= శూరులైన రథికులలో శ్రేష్ఠులను అందరను చూచి; భీముఁడు+ఇట్లు= భీముడు ఈ విధంగా; రాచకొడుకులన్= రాజపుత్రులను; నఱుమాడెడున్= నశింపచేస్తున్నాడు; నడుఁకన్+తగును+ఏ?= మీరు కంపించదగునా?

తాత్పర్యం: భీముడు దుర్యోధనుడి తమ్ములైన రాజపుత్రులను ఆ విధంగా సంహరించటంచేత - ఇతరులు భయపడి పారిపోయారు. సేనాపతియైన భీష్ముడు ముందరకు వచ్చి 'భీముడు రాజపుత్రులను సంహరిస్తూ ఉండగా, రథికులు భయపడి పారిపోవటం న్యాయమా?'

విశేషం: అలం: ఉపమ.

వ. అని పురికొల్పికొని తొడరునట్టియెడ. 238

ప్రతిపదార్థం: అని= పలికి; పురికొల్పికొని= ఉత్సాహం కల్పించి; తొడరు+అట్టి+ఎడన్= మార్కొనే సమయంలో.

తాత్పర్యం: అని సేనలోని వీరులకు ఉత్సాహవాక్యాలు పలికి, సైన్యాన్ని కూడగట్టుకొని ఎదిరించే సమయంలో (తరువాతి పద్యంతో అన్వయం.)

క. మిగిలి పవమానసుతుపై । భగదత్తుఁడు మత్తగజముఁ బఱపి యతని నా
శుగములఁ బొదవిన నమ్మెయి । మొగిళులు రవిఁ బొదువు దర్పముం దలఁపించెన్. 239

ప్రతిపదార్థం: మిగిలి= అతిశయించి; పవమాన+సుతుపైన్= వాయునందనునిపై(భీమునిపై); భగదత్తుఁడు; మత్త+గజమున్= మదించిన ఏనుగును; పఱపి= తోలి; అతనిన్= భీముని, ఆశుగములన్= బాణాలతో; పొదివినన్= క్రమ్మిన; ఆ+మెయిన్= ఆ రీతి; మొగిళులు= మేఘాలు; రవిన్= సూర్యుని; పొదువు+దర్పమున్= కప్పివేయు ఆటోపమును; తలఁపించెన్= స్మరింపచేసింది.

తాత్పర్యం: భగదత్తుడు భీముడిపై తన మదపుటేనుగును తోలి, బాణాలతో అతడిని ముంచెత్తాడు. ఆ సన్నివేశం మబ్బులు ప్రకాశించే సూర్యుడిని కప్పివేసే విధాన్ని తలపించింది.

విశేషం: అలం: ఉపమ. 1.భీముడు - సూర్యుడివలె ప్రకాశించాడు. అయితే - ఎంతటి సూర్యుడినయినా మబ్బులు క్రమ్మి సూర్యరశ్మి ప్రసరించకుండా చేయగలవు. అనగా సూర్యరశ్మి తగ్గదు గాని - తగ్గినట్లుగా పైకి కనిపిస్తుంది.

2. ఏనుగులను మార్కొనటంలో భీముడు సుప్రసిద్ధుడు. ఏనుగులను రణరంగంలో నడిపించటంలో అనుభవజ్ఞుడు అయిన వృద్ధవీరుడు భగదత్తుడు. (భగదత్తుడి ఏనుగు పేరు సుప్రతీకం. కురుక్షేత్ర సంగ్రామంలో సుప్రతీకం నిర్వహించిన భూమిక చిరస్మరణీయం. భగదత్తుడికి సుప్రతీకానికి గల అవినాభావ సంబంధం మహాభారత పఠితలకు మరపరానట్టిది. చిట్టచివరకు భగదత్తుడి సుప్రతీకాన్ని అర్జునుడు సంహరిస్తాడు.)

చ. కని యభిమన్యుముఖ్యు లవికంపితవృత్తిఁ గడంగి యేసినం
దనువున నెల్ల రక్తజలధారలు గ్రమ్మఁగ వారణేంద్రుఁ డే
పున సెలయేఱు లొక్కమొగి బోరనఁ బెక్కడరంగ లీలఁ గై
కొని ఘనకేళి సల్పు నడగొండగతిన్ సముదగ్రమూర్తి యై. 240

ప్రతిపదార్థం: కని= చూచి (భగదత్తుడు - ఏనుగును భీముడిపైకి తోలటం చూచి); అభిమన్యు+ముఖ్యులు= అభిమన్యుడు మొదలైనవారు; న+వికంపిత వృత్తిన్= చలింపనట్టి నిలకడగల పరాక్రమంతో; కడంగి= పూని; ఏసినన్= బాణాలు ప్రయోగింపగా; వారణ+ఇంద్రుఁడు= ఏనుగులలో శ్రేష్ఠమైన సుప్రతీకం; తనువునన్+ఎల్లన్= శరీరము నందు అంతటా; రక్త జల ధారలు= నెత్తుటి ప్రవాహాలు; ఒక్క మొగిన్= ఒకే విధంగా, ఆగని ధారగా; క్రమ్మఁగన్= వ్యాపింపగా; ఏపునన్= మిక్కుటముగా; సెల+ఏఱులు= కొండవాగులు; బోరనన్= వేగంగా; పెక్కు+అడరంగన్ లీలన్= మిక్కుటముగా అతిశయించే రీతిగా; కైకొని= పూని; ఘన+కేళి+సల్పు= గొప్ప వినోద విహారం చేసే; నడ+కొండ+గతిన్= నడిచేటటుంటి పర్వతం వలె+ సమ్+ఉదగ్ర+మూర్తి+ఐ= మిక్కిలి భయంకరమైన ఆకృతిగలదియై.

తాత్పర్యం: అభిమన్యుడు మున్నగు వీరులు భగదత్తుడి ఏనుగుపై బాణాలు ప్రయోగించారు. భగదత్తుడి ఏనుగు శరీరంపై రక్త ధారలు ప్రవహించాయి. ఆ ఏనుగు - సెలయేళ్ళు స్రవించే నడకొండవలె మిక్కిలి భయంకరంగా భాసించింది.

విశేషం: అలం: ఉపమ.

క. కవిసి బలముఁ జంపఁగఁ బాం । డవ యోధులు నిల్వరించుటకుఁ జాలక తొ
చ్చ వడినఁ గని పెల్లుగఁ గౌ । రవ సైన్యము లడరె నుద్ధురస్ఫురణమెయిన్. 241

ప్రతిపదార్థం: కవిసి= మార్కొని; బలమున్+చంపఁగన్= సేనను సంహరింపగా; పాండవ యోధులు= పాండవుల పక్షములోని వీరులు; నిల్వరించుటకున్+చాలక= ఆపుటకు శక్యముగాక; తొచ్చు+పడినన్= భ్రాన్పడగా; కని= చూచి; పెల్లుగన్= మిక్కుటముగా; ఉద్ధుర స్ఫురణ మెయిన్= భయంకరత్వం భాసించునట్లుగా; కౌరవ+సైన్యములు= కౌరవుల సేనలు; అడరెన్= విజృంభించాయి.

తాత్పర్యం: భగదత్తుడి ఏనుగు మార్కొని పాండవసేనలను చంపివేసింది. దానిని ఆపుటకు శక్యం కాక పాండవసేనలు భ్రాన్పడగా చూచి భయంకరస్ఫురణ భాసించేటట్లు కౌరవసేనలు విజృంభించాయి.

తే. అప్ప డుబ్బి దుర్యోధనుఁ డతిరయమునఁ । దేరు వఱపించి మారుతిఁ దెగువతోడఁ
గదిసి బలునారసంబు వక్షమున నాట । నొల్లఁ బోవుచు సిడ మతఁ డూఁత గొనియె. 242

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో; దుర్యోధనుఁడు= దుర్యోధనుడు; అతి+రయమునన్= మిక్కిలి వేగంతో, తేరు= రథం; పఱపించి= త్రోలి; మారుతిన్= భీముడిని; తెగువతోడన్= సాహసంతో; కదిసి= మార్కొని; బలు+నారసంబు= పెద్దబాణం; వక్షమునన్= ఉరమున; నాటన్= గ్రుచ్చగా; ఒల్లన్+పోవుచు= వ్రాలి పడిపోతూ; సిడము= జెండా(కొయ్య); అతఁడు= భీముడు; ఊఁత+కొనియెన్= ఆధారంగా చేసికొన్నాడు.

తాత్పర్యం: ఆ సమయంలో దుర్యోధనుడు తన రథం తోలించి, భీముడిని మార్కొని, పెనుబాణాన్ని అతని ఉరమున నాటాడు. భీముడు ఆ ధాటికి తట్టుకోలేక జెండా కొయ్యను ఆధారంగా చేసికొనవలసి వచ్చింది.

విశేషం: 1.భీముడు దుర్యోధనుడి బాణఘాతానికి తట్టుకోలేక జెండా కొయ్యను ఆధారంగా చేసికొని రథంమీద కూలబడిపోయాడు. తండ్రి దెబ్బతినటం చూచి - కొడుకైన ఘటోత్కచుడు కౌరవసేనను మార్కొని విజృంభించాడు. కురుక్షేత్ర సంగ్రామంలో వీరుల అసాధారణ విజృంభణకు మానసిక హేతువులు తిక్కన చక్కగా నిరూపించాడు. తిక్కన - గొప్ప మనో ధర్మ పరిజ్ఞాత.

వ. అయ్యవసరంబున. **243**

ప్రతిపదార్థం: ఆ+అవసరంబునన్= ఆ సమయంలో.

తాత్పర్యం: ఆ సమయంలో.

ఘటోత్కచుండు మాయాబలంబునఁ గౌరవసేనపై విజృంభించుట (సం. 6-68-40)

క. మనసేన పేర్చి పెల్లా । ర్చినఁ జూచి ఘటోత్కచుండు సెలఁగి జనకుఁ జే
కొని 'యిది మాయ ఘటింపఁగ । ననురూపం బైన వేళ' యని తలఁచి వెసన్. **244**

ప్రతిపదార్థం: మన+సేన= కౌరవసైన్యం; పేర్చి= అతిశయించి; పెల్లు+ఆర్చినన్= పెద్దకేకలు వేయటం(సింహనాదాలు చేయటం); చూచి; ఘటోత్కచుండు; చెలఁగి+జనకున్+చేకొని= పూని,తండ్రిని చేరి; ఇది= ఈ సమయం; మాయ+ఘటింపఁగన్= విభ్రాంతిని కల్పించటానికి; అనురూపంబు+ఐన+వేళ= తగిన సమయం; అని తలఁచి; వెసన్= వేగంగా.

తాత్పర్యం: కౌరవసేన విజయగర్వంతో సింహనాదాలు చేసింది. ఘటోత్కచుడు వెంటనే తండ్రియైన భీముడిని చేరాడు. 'ఇది 'మాయ' చేసి - కౌరవసేనలను ఓడించటానికి తగిన సమయం' అని అతడు తలపోశాడు.

విశేషం: 1. ఘటోత్కచుడు - హిడింబ అనే రాక్షస వనితకు భీముడి వలన పుట్టిన కొడుకు. రాక్షసులు మాయాఘటన విశారదులు.

2. మాయ= లేనిది ఉన్నట్లుగా భ్రాంతిని కలుగజేయటం

వ. కైలాస శైలాకారంబును జతుర్దంతసారోదారంబును నుద్దామ గమన దుర్వారంబును నగు వారణంబు నెక్కి
వజ్రజ్వాలాభీల బాహుదండుం డగుచు నయనసహస్రం బొప్ప నప్పాండవులకుం దోడుపడ నైరావణారూఢుండై
యింద్రుండు చనుదెంచె ననుబుద్ధి వైరులకుం బుట్టునట్టుగా నంజనవామనాది దిగ్గజంబు లెట్టెట్టివి యని
వినంబడు నాభంగి మత్తేభంబుల నెక్కితక్కటి దిక్పాలురపోలికం దోడి దానవులు గెలంకుల నేతేరం గురుపతిపైఁ
దోఁతెంచి యతని కడ్డపడుభగదత్తుదంతిం బొదివి. **245**

ప్రతిపదార్థం: కైలాస+శైల+ఆకారంబును= కైలాసపర్వతము వంటి రూపం కలిగినట్టిదియు; చతుఃదంత, సార+ఉదారంబును= నాలుగు దంతాల బలంతో గొప్పది అయినట్టిదియు; ఉద్దామ గమన+దుస్+వారంబును= గొప్పదైన నడక చేత అడ్డగించుటకు వీలుకానట్టిదయును; అగు= అయిన; వారణంబున్+ఎక్కి= ఏనుగును అధిరోహించి; వజ్ర జ్వాలా+ఆభీల బాహు దండుండు+అగుచున్= వజ్రపు జ్వాలలవలె భయంకరమైన పెక్కుదండములు గలవాడు అవుతూ; నయన+సహస్రంబు+ఒప్పన్= వేయి కన్నులు విరాజిల్లగా; ఆ+పాండవులకున్; తోడుపడన్= సాయం చేయటానికి; ఐరావణ+ఆరూఢుండు+ఐ= ఐరావతము అను పేరుగల ఏనుగును ఎక్కినవాడై; ఇంద్రుండు; చనుదెంచెన్= వచ్చెను; అను+బుద్ధి= అను అభిప్రాయం; వైరులకున్= శత్రువులకు; పుట్టునట్లు; అంజన - వామన+ఆది+దిక్+గజంబులు= అంజనము- వామనము మున్నగు దిగ్గజాలు; ఎట్టు+ ఎట్టివి+ అని+వినన్+

పడున్+ఆ+భంగిన్= ఏ రీతిగా ఉంటాయని వింటామో ఆ రీతిగా ఉన్న; మత్త+ఇభంబులన్= మదపుటేనుగులను; ఎక్కి; తక్కటి= మిగిలిన; దిక్+పాలుర+పోలికన్= దిక్కులు పరిపాలించే వారి ఆకారముతో; దానవులు= రాక్షసులు; కెలంకులన్= పార్శ్వములందు; ఏతేరన్= రాగా; కురుపతిపైన్= కురురాజైన దుర్యోధనునిపై; తోఁతెంచి= వచ్చి మార్కొని; అతనికిన్+అడ్డుపడు= దుర్యోధనుడికి; తనకు మధ్యగా వచ్చే; భగదత్తు+ దంతిన్= భగదత్తుడి ఏనుగును; పొదివి= మార్కొని.

తాత్పర్యం: కైలాసపర్వతం వంటి ఆకారంతోనూ, నాలుగు దంతాలతోనూ, నిలువరించటానికి వీలుగాని గొప్పనడకతోనూ ఉన్న ఏనుగునెక్కి వజ్రజ్వాలలవలె భయంకరములైన భుజదండములు కలవాడై, వేయికండ్లతో విరాజిల్లుతూ, పాండవులకు సాయపడటానికి ఐరావతదిగ్గజాన్ని ఎక్కి ఇంద్రుడే వచ్చాడేమో అన్న అభిప్రాయం కౌరవులకు కలిగేటట్లు ఘటోత్కచుడు వచ్చాడు. అంజనము, వామనము మొదలైన దిగ్గజాలు ఎట్లా వుంటాయో అట్లాంటి మదగజాలనెక్కి ఇంద్రుని వెంట తక్కిన దిక్పాలకులలాగా తన తోటి రాక్షసులు ఇరువైపులరాగా అతడు దుర్యోధనుని పైకి వచ్చాడు. అతడు దుర్యోధనునికి అడ్డుపడే భగదత్తుడి ఏనుగును ఆక్రమించి (తరువాతి పద్యంతో అన్వయం)

విశేషం: అలం: ఉపమ. 1. ఐరావతం - ఇంద్రుడి తెల్ల ఏనుగు. 2. దిగ్గజములు: ఎనిమిది అవి: ఐరావతము, పుండరీకము, వామనము, కుముదము, అంజనము, పుష్పదంతము, సార్వభౌమము, సుప్రతీకము.

క. అమ్ముల నేనుఁగు కొమ్ముల ।, నమ్మత్తగజమ్ము నొంచి యతిముఱి మనపై
న్యమ్మెల్లఁ జదియఁ బఱచె భ ।, యమ్మున మొగతిరిగి దిక్కు లద్రువ నొఱలుచున్. 246

ప్రతిపదార్థం: అమ్ములన్= బాణాలతో; ఏనుఁగు+కొమ్ములన్= ఏనుగు దంతాలతో; ఆ+మత్త+గజమ్మున్+నొంచి= ఆ మదపు టేనుగును లొంగదీసికొని; అతిముఱిన్= వేగంగా; మన+సైన్యమ్ము+ఎల్లన్= మన(కౌరవ) సైన్యం అంతా; చదియన్= నలగగా; భయమ్మునన్= భీతితో; దిక్కులు; అద్రువన్= అదరగా; మొగతిరిగి= వెనుదీసి; ఒఱలుచున్= అరుస్తూ; పఱచెన్= పారిపోయినది.

తాత్పర్యం: ఘటోత్కచుడు బాణాలతో, తన ఏనుగు దంతాలతో, భగదత్తుడి మదపుటేన్గును నొప్పించాడు. మన సైన్యం నలిగిపోగా అది భయంతో దిక్కులు అదిరేటట్టు అరుస్తూ పారిపోయేటట్లు తరిమాడు.

విశేషం: ఈ కంద పద్యంలో 'అద్రువ' నగణమే. తెలుగు ఛందస్సులోని విశేషం ఇది. 'ద్రు' తేల్చి పలకాలి. దీనికి 'శిథిల ద్విత్వం' అని పేరు.

వ. ఇ ట్లాభీలంబుగా భగదత్తుశుండాలంబుఁ దోలి యురవడించి. 247

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; ఆభీలంబుగాన్= భయంకరముగా; భగదత్తు+ శుండాలంబున్= భగదత్తుని ఏనుగును; తోలి= పోవునట్లుచేసి; ఉరవడించి= విజృంభించి.

తాత్పర్యం: పై విధంగా భగదత్తుడి మత్తేభాన్ని ఘటోత్కచుడు పారద్రోలి, ఉత్సహించి. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. దనుజపతి యేచి దుర్యో ।, ధనుదెస కడరుటయుఁ దత్పితామహుఁ డాచా
ర్యున కిట్లనుఁ హైడింబుఁడు ।, దనమాయా గర్వమున నుదగ్రుం డయ్యెన్. 248

ప్రతిపదార్థం: దనుజపతి= రాక్షసరాజు(ఘటోత్కచుడు); ఏచి= విజృంభించి; దుర్యోధను+దెసకున్= దుర్యోధనుని వైపునకు; అడరుటయున్= ఉత్సహించుటతో; తద్+పితామహుఁడు= అతడి తాత(భీష్ముడు); ఆచార్యునకున్+ఇట్లు+అనున్= ద్రోణుడితో ఈ విధంగా అన్నాడు; హైడింబుఁడు= హిడింబ కొడుకు(ఘటోత్కచుడు); తన మాయా గర్వమునన్= ఇతరులకు భ్రాంతిని కొలిపే తన శక్తిచేత; ఉదగ్రుండు+అయ్యెన్= భయం కలిగించేవాడు అయ్యాడు.

తాత్పర్యం: ఘటోత్కచుడు విజృంభించి దుర్యోధనుడి వైపు తన దృష్టి ఉత్సాహంతో సారించాడు. భీష్ముడు ద్రోణుడితో ఈ విధంగా చెప్పాడు. "హిడింబ కొడుకు మాయా యుద్ధ విశారదుడు కావున గర్వించి ఇతరులకు భయోత్పాతం కలిగిస్తున్నాడు.'

విశేషం: 1. ఆచార్యుడు అనగా గురువు అని అర్థం. మహాభారతంలో ఆచార్యశబ్దం ద్రోణరూఢం అయింది. ద్రోణుడు కురుపాండవ రాజ పుత్రులకు ధనుర్విద్యాగురువు కాబట్టి.

క. భగదత్తు నెగిచి కౌరవ । జగతీశ్వరుమీఁదఁ గవిసె సరభసవృత్తిం
దగ నడ్డపడక తడయుట । మగఁటిమియే? పాదువవలయు మనుజాశనునిన్. 249

ప్రతిపదార్థం: భగదత్తున్+ఎగిచి= భగదత్తుని తరిమివేసి; కౌరవ+జగత్+ఈశ్వరుమీఁదన్= కౌరవ రాజుమీద(దుర్యోధనునిపై); సరభస+వృత్తిన్= ఆటోపముతో;(ఘటోత్కచుడు);కవిసెన్= మార్కొన్నాడు; తగన్= సరిగా(యథోచితముగా); అడ్డపడక+తడయుట= అడ్డుకోకుండా ఆలసించటం; మగఁటిమి+ఏ?= పౌరుషమా?; మనుజ+అశనునిన్= మనుష్యులను తినేవానిని, రాక్షసుని, ఘటోత్కచుని; పాదువన్ వలయున్= మార్కొనవలెను.

తాత్పర్యం: భగదత్తుని పారద్రోలి, ఈ ఘటోత్కచుడు - కౌరవరాజు అయిన దుర్యోధనుడిపైకి లంఘించాడు గర్వంతో. ఈ రాక్షసుడి విజృంభణ అరికట్టకపోవటం పౌరుషంకాదు. ఈ ఘటోత్కచుడి విజృంభణం ఆపివేయాలి.

చ. తలఁ కెడువాఁడు గాఁడు భగదత్తుఁడు భీమతనూజుతోడ ని
ట్టలముగఁ బోరఁ జాలు నకటా కరి యొరువదేమి సేయు? వి
చ్చలవిడి భూవిభుం గవిసె సామజమున్ వెసనేయుఁ' డంచు జో
దులకును జేయి వీచి మును దోలె నతండు రథంబు బల్విడిన్. 250

ప్రతిపదార్థం: భగదత్తుఁడు= భగదత్తుడు; తలఁకెడువాఁడు కాఁడు= వెనుతీసెడివాడు కాడు; భీమ+తనూజుతోడన్= భీముని యొక్క కొడుకుతో= ఘటోత్కచునితో; నిట్టలముగన్= అధికముగా; పోరన్+చాలున్= యుద్ధం చేయగలడు; అకటా!= అయ్యో!; కరి= ఏనుగు; ఓరువదు= ఓర్చుకోలేదు (తట్టుకోలేకపోయింది.); ఏమి+చేయున్?= భగదత్తుడు ఏమి చేయగలడు?(ఘటోత్కచుడు); భూవిభున్= దుర్యోధనుడిని; విచ్చలవిడిన్= ఎదురులేకుండగా; కవిసెన్= మార్కొన్నాడు; సామజమున్= ఏనుగును(ఘటోత్కచుని ఏనుగును); ఏయుఁడు+అంచున్= బాణాలతో కొట్టండి అని; జోదులకును= యోధులకు; మును= ముందు; చేయి+వీచి= హస్తము ఊపి; అతండు= భీష్ముడు; బల్విడిన్= గొప్ప పరాక్రమంతో - కోపంతో; రథంబు; ; తోలెన్= నడపించాడు.

తాత్పర్యం: భగదత్తుడు మహావీరుడు. ఆతడు ఘటోత్కచుడిని ఓడించగల సమర్థుడే కాని ఆతడి ఏనుగు వెనుకంజ వేసింది. అయ్యో! పాపం అతడేమి చేయగలడు? ఆ అదను చూచుకొని ఘటోత్కచుడు గర్వంతో రాజైన దుర్యోధనుడి మీదికే లంఘించాడు. 'ఆతడి ఏనుగును ఎదుర్కొనండి' అని భీష్ముడు తన వీరులను ఉత్సాహపరిచి రథాన్ని కోపంతో ముందుకు తోలాడు.

వ. ఆచార్యప్రభృతులగు రథికవరులునుం గూడికొని కురుభూపతి కడ్డపడి హిడింబానందనుపైఁ గ్రందుకొని వివిధాస్త్రంబులు పరఁగించి రంత నక్కడ నతనికిఁ దోడై యుధిష్ఠిరాది పాండవులును బాంచాలమాత్స్య ప్రముఖదండనాయకులును బ్రతివీరులపై ననేక విశిఖంబులు గురియ నప్పుడు పోరు ఘోరంబయ్యెనందు మందాకినీనందనుం డమంద పరాక్రమ క్రీడం గౌంతేయబలంబులం గనుపు గొట్టె నట్టియెడ నా ఘటోత్కచుం డుత్కటోద్దామవిక్రమాభిరాముం డగుచు సింహనాదంబు సేయ బృంహితోదాత్తంబు లైన తదీయ దంతావళంబులు నలిరేఁగి నీ సైన్యంబుల బడలువడం జేసినం గని గాంగేయుండు గుంభసంభవున కిట్లనియె. 251

ప్రతిపదార్థం: ఆచార్య+ప్రభృతులు+అగు= ద్రోణుడు మున్నగు; రథికవరులునున్= రథములపై నెక్కియుద్ధం చేసే శ్రేష్ఠులగు వీరులును; కూడికొని= కలిసికట్టుగా చేరి; కురు+భూపతికిన్= కురురాజుకు(దుర్యోధనునకు); అడ్డుపడి= అడ్డంగా నిలిచి(ఘటోత్కచుని బారినుండి కాపాడుటకై); హిడింబా+నందనుపైన్= హిడింబయొక్క కొడుకుపై(ఘటోత్కచుడిపై); క్రందుకొని= మూగి; వివిధ+అస్త్రంబులు= ఎన్నో విధములైన బాణాలు; పరఁగించిరి= ప్రయోగించారు; అంతన్; అక్కడన్= అక్కడ (అనగా పాండవపక్షంలో); అతనికిన్+తోడై= ఘటోత్కచుడికి బాసటగా నిలిచి; యుధిష్ఠిర+ఆది+పాండవులును= ధర్మరాజు మున్నగు పాండవులును; పాంచాల మాత్స్య ప్రముఖ దండనాయకులును= ద్రుపదరాజు-విరాటుడు మున్నగు సేనాపతులూ; ప్రతివీరులపైన్= శత్రుయోధులపై; అనేక+విశిఖంబులు= పెక్కుబాణాలు; కురియన్= వర్షింపగా; అప్పుడు= ఆ సమయంలో; పోరు= యుద్ధం; ఘోరంబు+అయ్యెన్= తీవ్రంగా భయంకరంగా సాగింది; అందున్= ఆ యుద్ధంలో; మందాకినీ+నందనుండు= గంగకొడుకు(భీష్ముడు); అమంద+పరాక్రమక్రీడన్= తక్కువకాని మిక్కుటమగు యుద్ధం అనే ఆటలో; కౌంతేయ+బలంబులన్= పాండవసేనలను; కనుపు+కొట్టెన్= ఖండించాడు; అట్టి+ఎడన్= ఆ సమయంలో; ఆ+ఘటోత్కచుండు= ఆ ఘటోత్కచుడు; ఉత్కట+ఉద్దామ+విక్రమ+అభిరాముండు+అగుచున్; మిక్కిలి ఎక్కువైన పరాక్రమంచే అందగించినవాడగుచు; సింహనాదంబు+ చేయన్= సింహము గర్జించునట్లు పెనుకేకవేయగా; బృంహిత+ఉదాత్తంబులు+ఐన ఘీంకార రావములచే గొప్పవైన; తదీయ+దంతావళంబులు= ఆతని(ఘటోత్కచుని) ఏనుగులు; నలిరేఁగి= విజృంభించి; నీ సైన్యంబులన్= నీ సేనలను; బడలుపడన్+చేసినన్= డస్సిపోవునట్లుగా చేయగా; కని= చూచి; గాంగేయుండు= భీష్ముడు; కుంభసంభవునకున్= ద్రోణుడికి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు:

తాత్పర్యం: భీష్ముడు ద్రోణాచార్యుడు మున్నగు రథికులను కలుపుకొని, దుర్యోధనుడికి ఘటోత్కచుడికి మధ్యగా చేరాడు. వారు అందరూ ఘటోత్కచుడిపై పెక్కు బాణాలు ప్రయోగించారు. ఇక, అటు పాండవపక్షంలో ధర్మరాజు మున్నగు పాండవులు, ద్రుపదుడు విరాటుడు మున్నగు సేనాపతులు శత్రువులైన కౌరవులపై బాణవర్షం కురిపించారు. ఆ విధంగా ఘోరయుద్ధం జరిగింది. కౌరవసేనాధిపతి భీష్ముడు పాండవసేనలను చీల్చి చెండాడాడు. అప్పుడు ఘటోత్కచుడు సింహనాదం చేసి విజృంభించాడు. ఆతడి కేకకు ఉప్పొంగిన అతడి ఏనుగులు ఘీంకారాలు చేసి కౌరవసేనలను చీకాకు పరిచాయి. అప్పుడు భీష్ముడు కౌరవసేనల దీనావస్థను గుర్తించి ద్రోణుడితో ఈ విధంగా చెప్పాడు.

విశేషం: 1. బృంహితము= ఏనుగులు చేసే ఘీంకారానికి బృంహితం అని పేరు. 2. కుంభసంభవుడు : కుంభమునందు జన్మించిన వాడు, ద్రోణుడు. శోధన నాళికలలో - శిశువుల ఉత్పత్తి కోసం ప్రయత్నం జరుగుతోంది. కాబట్టి భవిష్యత్ కాలంలో శాస్త్రజ్ఞుల పరిశోధన ఈ విషయంపై కొంత క్రొత్త వెలుగు వెలార్పవచ్చు. 3. తిక్కన పలుచోట్ల - యుద్ధాన్ని క్రీడగా కల్పించటం కద్దు. ఘోరయుద్ధం చేసే ఘటోత్కచుడు - వాస్తవ జగత్తులో రాక్షసస్వరూపుడే ఐనప్పటికి 'పరాక్రమాభిరాముడు' అని తిక్కన వర్ణించాడు. 'ఘోర' సంగ్రామంలో కూడా తిక్కనకు సౌందర్యస్ఫూర్తి కన్పించటం విశేషం. తిక్కన వర్ణననుబట్టి - ఆ మహాకవికి ప్రత్యక్ష రణరంగపరిచయం ఉన్నట్లు గుర్తింపవచ్చు.

క. ' ఈయనతో రణ మిప్పుడు । సేయఁగ మది గొల్ప దస్తశిఖరికిఁ జేరెం
దోయజమిత్రుఁడు నేఁటికిఁ । బోయి మనము వత్త మెల్లిప్రొద్దున ననికిన్.' 252

ప్రతిపదార్థం: ఈయనతోన్= ఘటోత్కచునితో; రణము= యుద్ధం; ఇప్పుడు; చేయఁగన్; మది+కొల్పదు= మనస్సు అంగీకరించటలేదు; తోయజ+మిత్రుఁడు= సూర్యుడు (పద్మములకు స్నేహితుడు); అస్తశిఖరికిన్+చేరెన్= అస్తాద్రికి చేరాడు - అస్తమించాడు; మనము; నేఁటికిన్+పోయి= ఈ దినమునకు వెళ్ళి (యుద్ధం విరమించి); ఎల్లి+ప్రొద్దునన్= రేపు ఉదయం; అనికిన్= యుద్ధానికి; వత్తము= తిరిగి వద్దాం.

తాత్పర్యం: 'ఈ ఘటోత్కచుడితో ఇప్పుడు యుద్ధం చేయటానికి మనస్సు అంగీకరించటంలేదు. సూర్యుడు అస్తమించాడు. నేటికి యుద్ధం విరమించి తిరిగి రేపు ఉదయం మనం యుద్ధం ప్రారంభిద్దాం.'

విశేషం: 1.భీష్ముడు యుద్ధం చాలించటంలో ఆంతర్యం ఉంది. మొదటిది తాత్కాలికంగా ఓటమి నుండి కౌరవసేనను తప్పించవచ్చును. సాయంసమయానికి యుద్ధవిరమణ చేయాలనే ఒప్పందం ఉభయపక్షాలు అంగీకరించినట్టిదే కదా! ఇక రెండవ ఆంతర్యం - సూర్యాస్తమయం తరువాత రాక్షసులకు బలం ఎక్కువౌతుంది. అందుకని వారికి నిశాచరులనే పేరు వచ్చింది.

ఆ. అనిన నట్లకాక యని ధనురాచార్యుఁ । డప్ప డాత్మపక్షమైన రథిక
కోటి కెఱుఁగఁ జెప్పికొని యని సేయుట । నిలిపి తివియఁ బంచె బలము నెల్ల. 253

ప్రతిపదార్థం: అనినన్= అని(భీష్ముడు) చెప్పగా; అట్లు+అ+కాక+అని= సరే అటులే జరుగుగాక అని; ధనుః+ఆచార్యుఁడు= ధనురాచార్యుడు(ద్రోణుడు); ఆత్మ+పక్షము+ఐన= తన పక్షమునకు చెందిన; రథిక+కోటికిన్= వీరులకు; ఎఱుఁగన్+చెప్పికొని= తెలియచేసి; అని+చేయుట= యుద్ధం చేయటం; నిలిపి; బలమున్+ఎల్లన్= సేనను అంతటినీ; తివియన్+పంచెన్= వెనుకకు మరలుటకు ఆజ్ఞాపించాడు.

తాత్పర్యం: భీష్ముని ప్రతిపాదనను ద్రోణుడు అంగీకరించి కౌరవపక్షంలోని వీరులను అందరినీ యుద్ధం నిలుపుదల చేయుమని ఆజ్ఞాపించాడు.

వ. ఇవ్విధంబున. 254

ప్రతిపదార్థం: ఇవ్విధంబునన్= ఈ రీతిగా (తరువాతి పద్యంతో అన్వయం).

క. కౌరవ బలములు దిరిగిన । భేరీ శంఖాది తూర్య భీషణరావో
దారపటు సింహనాద । స్ఫారవిలాసంబు లయ్యెఁ బాండవ బలముల్. 255

ప్రతిపదార్థం: కౌరవ+బలములు= కౌరవసేనలు; తిరిగినన్= తిరోగమించగా(వెనుకకు మరలగా); పాండవ+బలముల్= పాండవులసేనలు; భేరీ శంఖ+ఆది+తూర్య భీషణ+ఆరావ+ఉదార+పటు సింహనాద స్ఫార విలాసంబులు+అయ్యెన్= భేరులు శంఖములు మొదలైన జంత్రవాద్యనాదాలతో, భయంకర నాదాలతో, గొప్పవైన పెక్కు సింహనాదాలతో వ్యాపించిన ఉత్సాహంతో ఉప్పొంగినట్టివి అయ్యాయి.

తాత్పర్యం: కౌరవసేనలు యుద్ధం విరమించి వెనుకంజ వేయగా పాండవసేనలు సంతోష తన్మయత్వంలో మునిగి, భేరులు, శంఖాలు మొదలగు వాద్య నినాదాలలో చెలరేగిన సింహనాదాలతో ఉత్సాహం ప్రకటించాయి.

తే. చిన్నఁబోయి నీకొడుకులు సేయఁగలుగు । దొరలు విడిదల కరిగిరి పరఁగభీమ
సేనుకొడుకు నగ్గించుచుఁ జెలఁగి వారు । చెన్ను సొంపారఁ జని రాత్మశిబిరములకు.' 256

ప్రతిపదార్థం: నీ కొడుకులు= నీ పుత్రులు(దుర్యోధనుడు మున్నగువారు); చిన్నఁబోయి= దీనత్వం చెంది; చేయగలుగు+దొరలు= సమర్థులైన ప్రభువులు; విడిదలకున్= తమ నివాస స్థలాలకు; అరిగిరి= వెళ్ళారు; పరఁగన్= ఒప్పునట్లుగ; భీమసేను+కొడుకున్= భీముడి పుత్రుడగు ఘటోత్కచుడిని; అగ్గించుచున్= ప్రశంసిస్తూ; చెలఁగి= ఉత్సహించి; వారు= పాండవుల సేనలు; చెన్ను+సొంపారన్= అందం అతిశయించేటట్లు; ఆత్మ+శిబిరములకున్= తమ విడిదులకు; చనిరి= వెళ్ళారు;

తాత్పర్యం: నీ కొడుకులు చిన్నబోయి తమ విడిదులకు వీరులతో కలిసి వెళ్ళిపోయారు. ఘటోత్కచుడిని ప్రశంసిస్తూ పాండవ సేనలు తమ తమ శిబిరాలకు వెళ్ళాయి.

వ. అని యిట్లు నాలవనాఁడు ధార్తరాష్ట్రులు దూలపోవుట సెప్పిన విని సంజయునకు నాంబికేయుం డిట్లనియె. 257

ప్రతిపదార్థం: అని ఇట్లు= అని ఈ విధంగా; నాలవనాఁడు= నాలుగవరోజున; ధార్తరాష్ట్రులు= ధృతరాష్ట్రుని కొడుకులు; తూలపోవుట= చిన్నపోవటం; చెప్పినన్+విని; సంజయునకున్; ఆంబికేయుండు= ధృతరాష్ట్రుండు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: అని నాలుగవ దినం జరిగిన యుద్ధ వృత్తాంతం చెప్పిన సంజయుడితో ధృతరాష్ట్రుడు ఈ రీతిగా అన్నాడు.

చ. ' అనితల నీవు పాండుతనయావలి కెప్పుడు మేలుచేయు నా
తనయులకుం బరాక్రమము తక్కువయుం బ్రకటింప విందు; భీ
ష్ముని గురు శల్యుఁ దక్కుఁగల శూరుల నెల్లను వారు సీరికిం
గొన కిటు లింతవా రగుటకుం గత మెయ్యది? నాకుఁ జెప్పుమా.' 258

ప్రతిపదార్థం: అని+తలన్= రణరంగంలో; నీవు= ఓ సంజయా! నీవు; పాండు+తనయ+ఆవలికిన్= పాండురాజు కొడుకుల సముదాయానికి, ఎప్పుడున్; మేలు= ఆధిక్యం; చేయున్= కలిగించటం; నా తనయులకున్+పరాక్రమము+తక్కువయున్+ప్రకటింపన్= నా పుత్రులకు శౌర్యలోపమూ వెలువరించటం; విందున్= ఆలకిస్తున్నాను; భీష్మునిన్ గురున్ శల్యున్= భీష్ముని- ద్రోణుని-శల్యుని; తక్కున్+గల+శూరులను+ఎల్లను= మిగిలిన యోధులను అందరినీ; వారు= పాండవులు; మేలుచేయన్-మేలుచే(యి) యున్= ఆధిక్యమును; చీరికిన్ కొనక= లెక్కసేయక; ఇటులు= ఈ విధంగా; ఇంతవారు+అగుటకున్ = ఇంత గొప్ప వారు కావటానికి; కతము= హేతువు; ఎయ్యది?= ఏది?; నాకున్+చెప్పుమా= నాకు తెల్లము చేయుము.

తాత్పర్యం: 'యుద్ధరంగంలో నీవు ఎప్పుడూ పాండవుల ఆధిక్యాన్ని, పౌరుష పరాక్రమాలనూ ఎక్కువగా అభివర్ణించి చెప్పటం, నా కొడుకులను తక్కువ చేస్తూండటం వింటున్నాను. ఆ పాండవులు భీష్ముడిని, ద్రోణుడిని, శల్యుడిని తక్కుంగల శూరులను ఏ మాత్రం సరకు చేయకుండా విజృంభించటానికి గల కారణం నాకు తేటతెల్లంగా తెలియచేయుము.

క. అనుటయు నాతం డిట్లను । విను మౌషధగుణము మంత్రవీర్యము మాయా
జనితసమగ్రోద్ధతి గా । దనఘా! నీ కేను మున్న యది యెఱిఁగింతున్. 259

ప్రతిపదార్థం: అనుటయున్= అని ధృతరాష్ట్రుడు చెప్పగా; ఆతండు= సంజయుడు; ఇట్లు+అనున్= ఈ విధంగా చెప్పాడు; వినుము; ఔషధ+గుణము= మందుల ప్రభావం; మంత్ర+వీర్యము= మంత్రాల బలం; మాయా+జనిత+సమగ్ర+ఉద్ధతి= మాయవలన పుట్టిన గొప్ప ఆధిక్యం; కాదు; అనఘా!= పాపరహితుడవైన ఓ ధృతరాష్ట్ర మహారాజా!; నీకున్; ఏను= నేను; మున్ను+అ= ముందే; అది; ఎఱిఁగింతున్= చెప్పాను.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడు అడిగిన ప్రశ్నకు సంజయుడు సమాధానం చెప్పాడు. 'పాపరహితుడవైన ఓ ధృతరాష్ట్ర మహారాజా! పాండవుల ఆధిక్యం ఔషధాల మహిమ వలన, మంత్రాల బలం వలన ఉద్భవించింది కాదు ఈ విషయం నేను ముందుగానే నీకు చెప్పాను.

విశేషం: అనఘా!= అనేది మర్యాద తెలిపే సంబోధన. దానిని యథాక్షరంగా వాచ్యార్థంలో స్వీకరించనక్కరలేదు.

ఉ. పాడియు సత్యముం గలరు పాండుతనూజులు నీదుపు త్రు ల
ప్పాడికి నోడ; రత్తెఱఁగు పాపము సేయఁగఁ జూచితీవు; న
క్కీడిటు సేయ కే లుడుగు? గెల్వదె ధర్మువు? వారిగెల్పు మీ
యోడుటయున్ ధ్రువంబు విదురోక్తులు వింటిమి గాదె! యేర్పడన్. 260

ప్రతిపదార్థం: పాండు తనూజులు= పాండవులు; పాడియున్= న్యాయము; సత్యమున్+కలరు= సత్యము కలవారు; నీదు+పుత్రులు= నీ కొడుకులు; అ+పాడికిన్= ఆ న్యాయానికి; ఓడరు= లోబడరు; ఆ+తెఱఁగు= ఆ రీతిగా; పాపము చేయఁగన్ చూచితి+ఈవు= పాపం చేస్తుండగా నీవు చూస్తూ ఊరకున్నావు; ఆ+కీడు= ఆ పాపం; ఇటు+చేయక= ఈ విధంగా చేయక; ఏల+ఉడుగున్?= ఏ విధంగా ఊరుకుంటుంది?; ధర్మువు= ధర్మం; గెల్వదు+ఎ?= జయింపదా? (జయిస్తుంది); వారి+గెల్పు= వారి(పాండవుల) విజయం; మీ+ఓడుటయున్= మీరు ఓడిపోవటం; ధ్రువంబు= నిశ్చయం; ఏర్పడన్= స్పష్టముగా; విదుర+ఉక్తులు= విదురుని మాటలు; వింటిమి+కాదె!= విన్నాము గదా!

తాత్పర్యం: పాండవులు న్యాయమూ సత్యమూ కల్గినవారు. నీ పుత్రులు న్యాయమునకు లోబడరు. వారు అంతటి పాపం చేస్తుంటే నీవు చూస్తూ ఉండినావు. ఆ పాపం ఇట్లా చేయక ఎందుకుంటుంది? ధర్మంజయించదా? వారుగెలవడం, మీరు ఓడడం నిశ్చయం. విదురుడిమాటలు స్పష్టంగా విన్నాము గదా?

క. నీయడిగిన భంగిన గాం । గేయు నడిగె నట్లు వారు గెలిచి చనిన యా
రేయి కురునాథుఁ; డాతని । కాయన సెప్పినవిధంబు నభివర్ణింతున్. 261

ప్రతిపదార్థం: నీ+అడిగిన+భంగిన్+అ= నీవు ప్రశ్నించిన తీరుగనే; కురునాథుఁడు= దుర్యోధనుడు; గాంగేయున్= గంగకొడుకును(భీష్ముడిని); అట్లు= ఆ విధంగా; వారు= పాండవులు; గెలిచి; చనిన= వెళ్ళిన; ఆ రేయి= ఆ రాత్రి; అడిగెన్= ప్రశ్నించాడు; ఆతనికిన్= ఆ దుర్యోధనునకు; ఆయన= భీష్ముడు; చెప్పిన+విధంబు= చెప్పిన తీరును; అభివర్ణింతున్= వివరించి చెప్పగలను.

తాత్పర్యం: నీవు నన్ను అడిగిన ప్రశ్ననే దుర్యోధనుడు నాలుగవ నాటి యుద్ధం ముగిసిన పిదప, రాత్రి భీష్ముడిని అడిగాడు. భీష్ముడు చెప్పిన సమాధానాన్నే నేను తిరిగి నీకు వివరించి చెప్పుతాను.

వ. భీష్ముండు దుర్యోధనున కి ట్లనియెఁ దొల్లియుం బలుమాఱుంజెప్పుదుఁ బాండవులకు వాసుదేవుండు సహాయుండై యుండు నట్లగుట నెయ్యదియు నసాధ్యంబు లే దప్పరమేశ్వరు మహత్త్వం బున్నరూ పెఱింగెడు వారు పెక్కండ్రు లే రెఱింగినవారల కాపదలు లేవు కౌంతేయు లతని నెఱింగి యాశ్రయింతురు నీవు నరకుసేయవు వినుము చెప్పెద మానససరస్సు నుత్తరపర్వతంబు నగ్ర ప్రదేశంబున దేవతామునిగంధర్వాప్సరోగణంబులు గొలువం గొలువుండి కమలసంభవుండు. 262

ప్రతిపదార్థం: భీష్ముండు; దుర్యోధనునకున్; ఇట్లు+అనియెన్; తొల్లియున్= పూర్వమే; పలుమాఱున్= పెక్కుసారులు; చెప్పుదున్ = చెప్పి యున్నాను; పాండవులకున్; వాసుదేవుండు= శ్రీకృష్ణుడు; సహాయుండు+ఐ= బాసటయై; ఉండున్= ఉంటాడు; అట్లు+ అగుటన్= ఆ విధంగా ఉండటంచేత; ఏ+అదియున్= ఏదీ; అసాధ్యంబు+లేదు= సాధించలేనిది ఉండదు; ఆ+పరమ+ఈశ్వరు మహత్త్వంబు= ఆ దేవుడి గొప్పదనం; ఉన్నరూపు+ఎఱింగెడువారు= నిజము తెలిసికొనేవారు; పెక్కండ్రులేరు= ఎక్కువమంది లేరు; ఎఱింగినవారలకున్= తెలిసినవారికి; ఆపదలు= విపత్తులు; లేవు= ఉండవు; కౌంతేయులు= కుంతి కొడుకులు(పాండవులు); అతనిన్= శ్రీకృష్ణుని; ఎఱింగి; ఆశ్రయింతురు= శరణు పొందుతారు; నీవు= ఓ దుర్యోధనా! నీవు; సరకు+చేయవు= లెక్కపెట్టవు; వినుము; చెప్పెదన్= చెప్పగలను; మానస సరస్సు+ఉత్తర పర్వతంబు= మానస సరోవరం ఒడ్డున ఉత్తర దిక్కున ఉన్న కొండయొక్క; అగ్ర ప్రదేశంబునన్= శిఖరంపై; దేవతా, ముని, అప్సరస్+గణంబులు= దేవతలు, మునులు, అప్సరసల సమూహాలు; కొలువన్= అర్చింపగా; కొలువు+ఉండి= సభ తీర్చి; కమల+సంభవుండు= పద్మం నుండి పుట్టినవాడు= బ్రహ్మదేవుడు.

తాత్పర్యం: భీష్ముడు దుర్యోధనుడికి ఈ విధంగా చెప్పాడు. 'నీకు ఇదివరకే ఎన్నో సారులు చెప్పి ఉన్నాను. పాండవులకు బాసటగా శ్రీకృష్ణుడు ఉన్నాడు. అందుచే వారు సాధించలేనిది ఏదీ ఉండదు. శ్రీకృష్ణుడు పరమాత్మ అవతారం. ఆతడిని తెలుసుకోగలిగిన వారికి విపత్తులు రావు. పాండవులకు ఆతని మహత్తు తెలియును. వారు ఆతడిని శరణు పొందారు. నీవు శ్రీకృష్ణుడిని లెక్కపెట్టవు. నీకు ఒక రహస్యం చెప్పగలను. వినుము. మానస సరోవర తీరంలో ఉత్తర దిక్కున ఉన్న కొండ శిఖరంపై ఒకసారి దేవతలు, మునులు, అప్సరసలు మున్నగువారు కొలువగా బ్రహ్మదేవుడు సభ తీర్చాడు.

విశేషం: 1. మానస సరోవరం : భారతదేశానికి ఉత్తర దిక్కున హిమాలయ పర్వతశ్రేణుల మధ్య ఉన్న ఒక పెద్ద సరస్సు. ప్రస్తుతం - భారతదేశం - టిబెట్టు సరిహద్దులలో ఉంది. తిక్కన కాలంనాటికి అనగా 13వ శతాబ్దం నాటికే గాక సంస్కృత మహాభారత రచనా కాలం నాటికే క్రీస్తుపూర్వం పలు శతాబ్దులకు పూర్వమే మానససరోవరం సుప్రసిద్ధమైన క్షేత్రం. భారతీయుల ప్రాచీన భూగోళ పరిజ్ఞానానికి ఇది ఒక నిదర్శనం. మానససరోవర ప్రాంతం దేవతలకు ఆటపట్టు అని పురాణ కథనం. 2. ఉత్తరదిశ పవిత్రమైనదని ప్రాచీన భారతీయుల పరిగణన. నదులు ఉత్తర వాహినులు అయిన చోటులు పవిత్ర క్షేత్రాలుగా పరిగణింపబడినాయి. బ్రహ్మాండము ఉత్తరదిశగా పయనిస్తున్నట్లు నవీన ఖగోళజ్ఞుల అభిప్రాయం. మానస సరోవరం ఉత్తరాన్నే ఉంది. బ్రహ్మ కొలువుదీర్చిన కొండ మానససరోవరానికి ఉత్తర దిక్కున ఉంది.

**తే. మణిగణోజ్జ్వలమైన విమాన మొకటి । యంబరంబునఁ గాంచి సర్వాత్ముఁ డందు
సన్నిహితుఁ డగు టెఱిఁగి హర్షంబు సంభ్ర । మంబుఁ దలకొన లేచి నమస్కరించి. 263**

ప్రతిపదార్థం: మణి+గణ+ఉజ్జ్వలము+ఐన= మణుల సముదాయం చేత మిరుమిట్లు గొలిపే; విమానము+ ఒకటి= ఆకాశంలో సంచరించే వాహనము ఒకటి; అంబరంబునన్= ఆకాశమందు; కాంచి= చూచి; సర్వ+ఆత్ముడు= పరమాత్మ(విష్ణుదేవుడు); అందున్= ఆ విమానంలో; సన్నిహితుఁడు+అగుట= ఉండటం; ఎఱిఁగి= తెలిసికొని; హర్షంబు= సంతోషం; సంభ్రమంబున్= తొట్రుపాటును; తలకొనన్= కూడుకొనగా; లేచి= నిలబడి; నమస్కరించి.

తాత్పర్యం: మణులతో దేదీప్యమానంగా ప్రకాశించే విమానం బ్రహ్మదేవుడు ఆకాశంలో ఉండటాన్ని చూశాడు. ఆ విమానంలో పరమాత్మ ఉన్నట్లు తెలిసికొని సంతోషంతో తొట్రుపాటుతో లేచి నిలబడి వందనం సమర్పించి (తరువాతి పద్యంతో అన్వయం).

క. ' లోకోత్పత్తి స్థితి విల । యాకలనవినోద! మునిగణార్చిత! గుణర
త్నాకల్ప! నిర్గుణాత్మక! । శోకభయాపహపదాబ్జ! శుభకరమూర్తీ!' 264

ప్రతిపదార్థం: లోక+ఉత్పత్తి+స్థితి+విలయ+ఆకలన+వినోద!= జగత్తులను సృష్టించటం - రక్షించటం - నాశనం చేయటం అనే క్రియలయందు వినోదం కలవాడా! ముని+గణ+అర్చిత!= ఋషుల సముదాయాల చేత ఆరాధింపబడేవాడా!; గుణరత్న+ఆకల్ప!= గొప్ప గుణములు అనెడి రత్నాభరణములు కలవాడా!; నిర్గుణ+ఆత్మక!= గుణరహిత స్వరూపుడా!; శోక+భయ+అపహ+పద+అబ్జ!= దుఃఖము భయాల నుండి విముక్తి కల్గించే పద్మములవంటి పాదాలు గలవాడా!; శుభకరమూర్తీ!= మంగళకరమైన ఆకారము గలవాడా!

తాత్పర్యం: 'జగత్తులను సృష్టించడం-కాపాడటం- నాశనం చేయటం అనే క్రియలయందు వినోదించేవాడా! ఋషుల సముదాయం చేత ఆరాధింపబడేవాడా! గొప్ప గుణాభరణాలు కలవాడా! గుణరహితమూర్తీ! దుఃఖములను, భయాలను పోగొట్టే పాదపద్మాలు కలవాడా! శుభము కలుగ చేసే ఆకారము గలవాడా!'

విశేషం: 1. పరమాత్మ స్వరూపం గూర్చి వేదాంతులలో తెగని చర్చ - అతడు నిర్గుణుడా? సగుణుడా? తిక్కన పరమాత్మ స్వరూపం 'సగుణము' - 'నిర్గుణము' అని చెప్పి సమన్వయ సంధాతగానే నిలబడ్డాడు. తిక్కన దృష్టిలో సగుణోపాసన - నిర్గుణోపాసన - ఒకే నాణానికి బొమ్మ - బొరుసు వంటివి.

వ. అని మఱియు ననేక ప్రకారంబుల సంస్తుతించి యి ట్లని విన్నవించె. 265

ప్రతిపదార్థం: అని; మఱియున్; అనేక+ప్రకారంబులన్; సంస్తుతించి= పొగడి; ఇట్లు+అని= ఈ రీతిగా; విన్నవించెన్= విజ్ఞప్తి చేశాడు.

తాత్పర్యం: అని, ఇంకా పెక్కు రీతుల ఆ పరమాత్మను ప్రస్తుతించి - ఈ విధంగా విజ్ఞప్తి చేశాడు.

క. ' నారాయణ! నీకేఁ గడు । గారవమునఁ బుట్టి యిజ్జగము లన్నింటిన్
సారమతిం గావించితి । నీ రక్షణ వీని కెల్ల నిలుపై యుండున్. 266

ప్రతిపదార్థం: నారాయణ!= ఓ విష్ణుదేవా!; నీకున్+ఏన్= నీకు నేను; కడున్+గారవమునన్= మిక్కుటమగు గొప్పతనముతో; పుట్టి= ఉద్భవించి; ఈ+జగములు= ఈ ప్రపంచాలు; అన్నింటిన్= అన్నిటినీ; సారమతిన్= గొప్పదనముతో; కావించితి(న్)= ఏర్పాటు చేశాను; వీనికిన్+ఎల్లన్= వీటి కన్నింటికి; నీ రక్షణ= నీవు కాపాడుట; నిలుపు+ఐ+ఉండున్= ఆధారమై ఉంటుంది.

తాత్పర్యం: నారాయణా! నీకు నేను గౌరవంతో పుట్టి ఈ లోకాలనన్నింటినీ సారవంతమైన బుద్ధితో గావించాను. నీ రక్షణ వీటికాధారం, (బ్రహ్మ సృష్టికర్త, విష్ణువు పోషణకర్త కదా!)

క. ఇత్తఱి మనుష్య భువనం । బుత్తలపడుచున్నయది మహోగ్రాసురదు
ర్వృత్తముల నీవు కరుణా । యత్తమతిం బుట్టవయ్య! యదువంశమునన్. 267

ప్రతిపదార్థం: ఈ+తటిన్= ఈ అదనులో; మనుష్య+భువనంబు= మనుష్యులు ఉండే లోకము, భూమి(భూలోకం); మహా+ఉగ్ర+అసుర+దుస్ వృత్తములన్= మిక్కుటముగ భయంకరమైన రాక్షసుల చెడు పనుల చేత; ఉత్తల పడుచున్న+అది= చీకాకయి పోవుచున్నది; కరుణా+ఆయత్త+మతిన్= దయగలబుద్ధితో కూడినవాడవై; యదు+వంశమునన్= యాదవకులంలో; పుట్టవయ్య!= జన్మింపవయ్యా!

తాత్పర్యం: ఈ సమయంలో భూలోకం రాక్షసులు చేసే చెడ్డపనుల వలన మిక్కిలి కలత చెందినది. నీవు దయచేసి యదువంశంలో జన్మించవయ్యా.

విశేషం: లోకంలో ధర్మం నశించినపుడు - విష్ణుదేవుడు అవతరించి ధర్మ సంస్థాపన చేయగలడని భగవద్గీతా ప్రవచనం. 'ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే' - అని శ్రీకృష్ణుడు. (భగవద్గీతలో.)

క. నరసఖుఁడ! నీవు సఖుఁడును । నరలోకమునన్ జనించి నానాదైత్యే
శ్వరుల దెసఁ బీడ లుడుపుము । ధరణీభారంబు వాయఁ దాత్పర్యమునన్.' 268

ప్రతిపదార్థం: నర+సఖుఁడ!= 'నరుడు' అనే ఋషికి మిత్రుడా!; నీవున్; సఖుఁడును= మిత్రుడును; నర లోకమునన్= మనుష్యలోకంలో; జనించి; నానా దైత్య+ఈశ్వరుల+దెసన్= పెక్కుమంది గొప్ప రాక్షసుల యొక్క; పీడలు= బాధలు; ధరణీ భారంబు= భూభారము; పాయన్= తొలగునట్లుగా; తాత్పర్యమునన్= తదేకదీక్షతో(నిష్ఠతో); ఉడుపుము= పోగొట్టుము.

తాత్పర్యం: నరుడికి మిత్రుడవైన ఓ విష్ణుదేవా! నీవూ, నీ మిత్రుడితో పాటు భూలోకంలో పుట్టి గొప్ప రాక్షసుల వలని బాధలు పోగొట్టి, భూభారాన్ని తీసివేయవయ్యా.'

వ. అని వేఁడికొని వినతుండయి యద్దేవుని తోడినీడయుం బోని నరనామధేయుం డగు మహాపురుషుం బ్రార్థించిన ననన్నారాయణుండునుం గారుణ్యార్ద్రకటాక్షంబున వీక్షించి యట్ల యయ్యెడుం గాక! యని యానతిచ్చి యంతర్ధానంబు సేసిన నక్కొలువువా రెల్ల నచ్చెరువందిరి. 269

ప్రతిపదార్థం: అని+వేఁడికొని= అని ప్రార్థించి; వినతుండు+అయి= నమస్కరించినవాడై; ఆ+దేవుని తోడి నీడయున్+పోని= ఆ దేవుని వెంట నీడవలె ఉండే; నర నామధేయుండు+అగు= నరుడు అని పేరు గలిగినట్టి; మహా+పురుషున్= గొప్పవాడిని; ప్రార్థించినన్= వేడుకొనగా; ఆ+నారాయణుండునున్= ఆ విష్ణుదేవుడును; కారుణ్య+ఆర్ద్ర+కటాక్షంబునన్= దయతో తడిసిన క్రీగంటి చూపుతో; వీక్షించి= చూచి; అట్లు+అ= అదే రీతిగా (నీవు ప్రార్థించిన తీరుగనే); అయ్యెడున్+కాక!= జరుగుగాక!; అని+ఆనతిచ్చి= అని ఆజ్ఞాపించి; అంతర్ధానంబు+చేసినన్= మాయంకాగా; ఆ+కొలువువారు+ ఎల్లన్= ఆ సభలోని వారు అందరు; అచ్చెరువు+అందిరి= ఆశ్చర్యం పొందిరి.

తాత్పర్యం: ఆ విధంగా బ్రహ్మదేవుడు విష్ణుదేవుడిని, ఆతడికి తోడు నీడగా ఉన్న నరుడు అను పేరుగల మహాత్ముని ప్రార్థించాడు. ఆ నారాయణుడు దయతో కూడిన క్రీగంటి చూపులతో బ్రహ్మదేవుడిని చూచి 'సరే - నీ ప్రార్థన ప్రకారమే జరుగుగాక' అన ఆనతిచ్చి, మాయమయ్యాడు. ఆ బ్రహ్మదేవుడిని చూచి కొలువు కూటంలోని వారందరూ ఆశ్చర్యం పొందారు.

క. ' పరమేష్ఠి! నీవు గడుఁ ద । త్పరతను వినయంబు సేసి ప్రార్థించితి వె
వ్వరొకో వీరలు? నావుడు । సరసిరుహాసనుఁడు సెప్పె సంప్రీతిమెయిన్. 270

ప్రతిపదార్థం: పరమేష్ఠి!= ఓ బ్రహ్మదేవుడా!; నీవు; కడున్+తత్పరతను= మిక్కుటమగు నిష్ఠతో; వినయంబు+చేసి= గౌరవం చూపించి; ప్రార్థించితివి= వేడుకొన్నావు; ఎవ్వరు+ఒకో+వీరలు?= వీరు ఎవ్వరు?(ఈ ఇరువురు); నావుడున్= అని (కొలువు వారలు) అడుగగా; సంప్రీతిమెయిన్= మిక్కుటమగు తృప్తితో; సరసిరుహ+ఆసనుఁడు= పద్మం ఆసనంగా కలవాడు, బ్రహ్మదేవుడు; చెప్పెన్= చెప్పాడు.

తాత్పర్యం: 'ఓ బ్రహ్మదేవుడా! నీవు మిక్కిలి వినయం చూపించి భక్తితో ప్రార్థించిన వారు ఎవరు?' అని కొలువు కూటంలోనివారు ప్రశ్నించగా, మిక్కిలి సంతృప్తితో బ్రహ్మదేవుడు ఈ విధంగా సమాధానం చెప్పాడు.

క. ' పరమమును లాదిపురుషులు । నరనారాయణులు వీరు నా కారాధ్యుల్
నరహితముగఁ బ్రార్థించితి । ధరఁ బుట్టుం డనుచు దానిఁ దలకొనిరి దయన్. 271

ప్రతిపదార్థం: పరమ+మునులు= గొప్ప ఋషులు; ఆది+పురుషులు= మొదటినుండీ ఉన్నవారు; నర+నారాయణులు= నరుడును, నారాయణుడును అనువారలు; వీరు; నాకున్= నాకు(బ్రహ్మదేవునకు); ఆరాధ్యుల్= అర్చింప దగినవారు; నర+హితముగన్= ప్రజలమేలు కొరకు; ధరన్= భూమిపై; పుట్టుండు+అనుచున్= జన్మింపుడు అని; ప్రార్థించితిన్= వేడుకొన్నాను; దానిన్= ఆ ప్రార్థనకు; దయన్= కరుణతో; తలకొనిరి= అంగీకరించారు.

తాత్పర్యం: వీరు గొప్ప ఋషులు, వీరు ఆది పురుషులు. నరనారాయణులు. నాకు పూజనీయులు. ప్రజల మేలు కొరకై - వీరిని భూలోకంలో పుట్టుడని నేను ప్రార్థించాను. వారు దయతో నా ప్రార్థన అంగీకరించారు.

క. ఇలఁ గ్రీడగఁ బుట్టిన వీ । రలఁ గేవల మర్త్యులని సరకు సేయనివా
రలు సెడుదు రెఱిఁగి భక్తిం । గొలిచిన వారలకు శుభ మగును వినుఁ డెందున్.' 272

ప్రతిపదార్థం: ఇలన్= భూమిపై; క్రీడగన్= వినోదముగా(ఆటగ); పుట్టిన= జన్మించిన; వీరలన్= వీరిని(శ్రీకృష్ణుని - అర్జునుని); కేవల+మర్త్యులు+అని= పూర్తిగా మానవ మాత్రులు అని; సరకు+చేయనివారలు= లెక్కచేయకుండా ప్రవర్తించేవారు; చెడుదురు= పాడైపోతారు; ఎఱిఁగి= తెలిసి; భక్తిన్= పూజ్యభావంతో; కొలిచిన+వారలకున్= అర్చించిన వారలకు; ఎందున్= ఎచటనైనను; శుభము= మేలు; అగును= కలుగుతుంది; వినుఁడు= ఆలకింపుడు.

తాత్పర్యం: వినండి. భూమి మీద వినోదంగా పుట్టిన వీరిని కేవలం మానవులని లెక్కచేయనివారు చెడిపోతారు. తెలుసుకొని భక్తితో కొలిచిన వారికి ఎచ్చటకైనా శుభం కలుగుతుంది.

వ. అని యెఱింగించి బ్రహ్మ దనలోకంబున కరిగెఁ గొలువువారలు నిజస్థానంబులకుం జని రిక్కడ నీకథ నారదజామదగ్న్యవ్యాసాదులచేత వింటిం దొల్లియు మహామునులు నిన్ను నరనారాయణుతోడి వైరంబు వలవ దని వారించిర కాదే? నీవు మదాంధుండవై మానవైతి వింకనైనను గృష్ణ నాశ్రయించి పాండవులతోడి పాత్తున మెలంగి బ్రదుకుమని చెప్పి భీష్ముం డూరకుండెఁ గౌరవపతియు నప్పలుకులు పెడచెవులం బెట్టె మీరు దగువారు సేయు హితోపదేశంబు లాచరించెదరె?' యని పలికి సంజయుం డమ్మహీపతి కిట్లనియె. 273

ప్రతిపదార్థం: అని+ఎఱింగించి; బ్రహ్మ; తన+లోకంబునకున్= తన భువనమునకు(అనగా సత్యలోకానికి); అరిగెన్= వెళ్ళిపోయాడు; కొలువువారలు= సభలోనివారు; నిజ+స్థానంబులకున్= తాము నివసించే స్థలాలకు; చనిరి= వెళ్ళారు; ఈ+కడన్= ఇక్కడ; ఈ కథ= ఈ వృత్తాంతం; నారద+ జామదగ్న్య వ్యాసాదుల చేతన్= నారదుడు- పరశురాముడు-వ్యాసుడు మున్నగు

వారిచే; వింటిన్; తొల్లియున్+మహా+మునులు= పురాణకాలం నాటి గొప్ప ఋషులు; నిన్నున్; నర+నారాయణులతోడి+ వైరంబు= నరుడితో, నారాయణుడితో శత్రుత్వం; వలవదు+అని= వద్దు; అని వారించిరి+అ+కాదు+ఏ?= అడ్డుకున్నారు గదా; నీవు; మద+అంధుండవు+ఐ= గర్వంచే గ్రుడ్డివాడవై; మానవు+ఐతివి= ఆవైరం విడనాడలేదు; ఇంకన్+ఐనను= ఇకమీదట అయినప్పటికీ; కృష్ణున్+ఆశ్రయించి= శ్రీకృష్ణుని శరణువేడి; పాండవులతోడి+పొత్తునన్= పాండవులతోడి స్నేహంతో; మెలంగి= సంచరించి; బ్రదుకుము= జీవింపుము; అని+చెప్పి; భీష్ముఁడు; ఊరకుండెన్; కౌరవపతియున్= కౌరవుల రాజును(దుర్యోధనుడును); ఆ+పలుకులు= భీష్ముని మాటలు; పెడ+చెవులన్ పెట్టెన్= నిర్లక్ష్యం చేశాడు; మీరు= మీరు (నీవు, నీ కొడుకులు దుర్యోధనాదులు); తగువారు= తగినవారు; చేయు= చెప్పే; హిత+ ఉపదేశంబులు= మేలైన మాటలు; ఆచరించెదరె?= అనుష్ఠిస్తారా?; అని పలికి; సంజయుండు; ఆ+మహీపతికిన్= ఆ రాజునకు(ఆ ధృతరాష్ట్రునకు); ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: అని తెలియజేసి బ్రహ్మ తనలోకానికి పోయాడు. కొలువులోని వారందరూ వారివారిస్థానాలకు వెళ్లారు. ఇక్కడ ఈ వృత్తాంతము నారదుడు, పరశురాముడు, వేదవ్యాసుడు మొదలైన వారిచేత విన్నాను. ఇంతకుముందే నరనారాయణులతో శత్రుత్వం వద్దని నిన్ను మహా మునులు వారించలేదా? నీవు మదాంధుడవై శత్రుత్వాన్ని మానలేదు. ఇకనైనా కృష్ణుని ఆశ్రయించి పాండవులతోటి పొత్తుతో మెలగి బ్రతుకము అనిచెప్పి భీష్ముడు ఊరకున్నాడు. దుర్యోధనుడు ఆ మాటలను నిర్లక్ష్యంచేశాడు. నీవు, నీ కొడుకులు తగినవారు చేసే హితోపదేశాలు ఆచరిస్తారా? అని చెప్పి సంజయుడు ధృతరాష్ట్రుడితో మళ్ళీ ఇట్లన్నాడు.

భీష్ముని పంచమదివసయుద్ధక్రమము (సం. 6-65-1)

క. వేగినఁ గౌరవసేనలు । వేగమ కైసేసి యనికి వెడలెం దీవ్రో
ద్యోగత భీష్ముని మున్నిడి । సాగరములు మేరదప్పచందం బొందన్. 274

ప్రతిపదార్థం: వేగినన్= సూర్యోదయం కాగానే; కౌరవ+సేనలు= కౌరవుల సైన్యాలు; వేగమ= శీఘ్రంగా; కైసేసి= అలంకరించుకొని; తీవ్ర+ఉద్యోగతన్= పెద్ద ప్రయత్నంతో; భీష్ముని+మున్ను+ఇడి= భీష్ముని ముందు పెట్టుకొని; సాగరములు= సముద్రాలు; మేర+తప్పు+చందంబు+ఒందన్= చెలియలికట్టనుదాటి విజృంభించే విధంగా; అనికిన్= యుద్దరంగానికి; వెడలెన్= వెళ్ళాయి.

తాత్పర్యం: ప్రొద్దు పొడవగానే కౌరవసేనలు అలంకారాలు చేసికొని - భీష్ముడి నాయకత్వంలో సముద్రాలు చెలియలికట్టను దాటి ఉప్పొంగి పొరలేటట్లు యుద్ధానికి సన్నద్ధమై వెళ్ళాయి.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. యుద్దరంగానికి - భటులు - 'కైసేసి' వెళ్ళేవారని తిక్కన వర్ణిస్తాడు. భటులు యుద్ధానికి వెళ్ళేటప్పుడు 'పెండ్లి కొడుకుల ఆహార్యం' ధరించేవారట. బహుశ : ఇది తిక్కన - తాను ప్రత్యక్షంగా చూచిన సమకాలీన వృత్తం కావచ్చు.

వ. ఇట్లు వెడలి మకరవ్యూహం బమర్చుకొని నిలిచె నంతఁ బాండవులును శ్యేనవ్యూహంబుగా మోహరించి రందు ముఖంబున భీమసేనుండును నయనంబుల ధృష్టద్యుమ్న శిఖండులును శిరంబున సాత్యకియును గంఠంబునం గిరీటియు వామపక్షంబున విరాటద్రుపదులును దక్షిణపక్షంబునఁ గేకయులును వీఁపున నభిమన్యు ద్రౌపదేయులును బుచ్ఛంబున నకులసహదేవసహితుం డయి యుధిష్ఠిరుండును నిలిచి రివ్విధంబున సన్నద్ధంబు లయిన యుభయవ్యూహంబులు మేదురతూర్యనినాదంబులు రోదసీకుహరంబు నిండ నొండొంటిం గదిసిన. 275

ప్రతిపదార్థం: ఇట్లు+వెడలి= ఈ విధంగా వెళ్ళి; మకర+ వ్యూహంబు= మొసలి ఆకారంగా భటులను ఏర్పరచిన పన్నుగడ; అమర్చుకొని+నిలిచెన్= ఏర్పాటు చేసికొని నిలిచాయి; అంతన్= అటుపిమ్మట; పాండవులును= పాండవులుకూడ; శ్యేన+వ్యూహంబుగాన్= డేగ ఆకారంలో; మోహరించిరి= సేనను పన్నారు; అందున్= ఆ వ్యూహంలో; ముఖంబునన్= మొగమునందు; భీమసేనుండును= భీముడును; నయనంబులన్= కన్నుల దగ్గర; ధృష్టద్యుమ్న శిఖండులును= ధృష్టద్యుమ్నుడును; శిఖండియు; శిరంబునన్= తలవద్ద; సాత్యకియున్; గండంబునన్= చెక్కిలివద్ద; కిరీటియున్= అర్జునుడును; వామపక్షంబునన్= ఎడమప్రక్కగ (ఎడమరెక్కగా); విరాట+ద్రుపదులును= విరాటుడు, ద్రుపదుడును; దక్షిణ+పక్షంబునన్= కుడిప్రక్క(కుడిరెక్కగా); కేకయులును= కేకయ రాజ్యాధిపతులును; వీఁపునన్; అభిమన్యు+ ద్రౌపదేయులును= అభిమన్యుడును ద్రౌపది యొక్క కొడుకులును; పుచ్ఛంబునన్= తోక దగ్గర; నకులుడు+సహదేవ సహితుండు+అయి= నకులుడును, సహదేవుడును తోడుగా గలవాడయి; యుధిష్ఠిరుండును= ధర్మరాజును; నిలిచిరి= నిలబడ్డారు; ఈ+విధంబునన్= ఈ రీతిగా; సన్నద్ధంబులు+అయిన= యుద్ధ ప్రయత్నములు చేసికొన్న; ఉభయ+వ్యూహంబులున్= రెండు మోహరములును, (కురుపాండవసైన్య వ్యూహాలురెండూ); మేదుర+తూర్య నినాదంబులు= దట్టమైన బూరాల ధ్వనులు; రోదసీ+కుహరంబు= భూమి ఆకాశాల మధ్యస్థలం; నిండన్= పూర్తిగా వ్యాపింపగా; ఒండు+ఒంటిన్= ఒకదానిని ఒకటి; కదిసినన్= మార్మ్రోగగా.

తాత్పర్యం: కౌరవసేన మొసలి మోహరంగా ఏర్పడింది. పాండవసేన 'డేగ' ఆకారంగా ఏర్పడింది. పాండవవ్యూహంలో- డేగ ఆకృతి పన్నాగంలో భీముడు ముఖస్థానంలో ఉన్నాడు. ధృష్టద్యుమ్నుడు - శిఖండి రెండు కన్నులుగా ఏర్పడ్డారు. సాత్యకి తల అయ్యాడు. కంఠస్థానంలో అర్జునుడు నిలిచాడు. ఎడమరెక్కగా విరాట ద్రుపదులు, కుడి రెక్కగా కేకయులు ఉన్నారు. వీపున అభిమన్యుడు - ద్రౌపదీపుత్రులు నిలిచారు. తోకగా నకుల సహదేవులతో పాటు ధర్మరాజు నిలిచాడు. ఈ విధంగా కురు పాండవ బలాలు యుద్ధమునకు సన్నద్ధములై నిలిచాయి. భూమి ఆకాశం మధ్య భాగాన్ని, తూర్యరావాలు నిండుగా ఆవరించాయి. ఉభయసేనలూ ఒండొంటిని మార్మ్రోగాయి.

క. మకరవ్యూహం బనియెడు । మకరాలయ మపుడు దర్పమహిమోజ్జ్వలుఁడై
మకరక్రీడం జండత । మకరాభీలముగఁ జొచ్చె మారుతి యధిపా! 276

ప్రతిపదార్థం: అధిపా!= ఓ ధృతరాష్ట్రమహారాజా!; మారుతి= వాయుపుత్రుడు (భీముడు); మకర+వ్యూహంబు+అనియెడు= మొసలి మొగ్గరము అనే; మకరాలయము= సముద్రము; అపుడు= ఆ సమయంలో; దర్ప+మహిమ+ఉజ్జ్వలుఁడు+ఐ= గర్వాటోపంతో, ప్రకాశించే వాడై; మకర+క్రీడన్= మొసలి వలె ఆడుతూ; చండతన్= తీక్ష్ణతతో; మకర+ఆభీలముగన్= మొసలివలె భయంకరత్వం చూపిస్తూ; చొచ్చెన్= ప్రవేశించాడు.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! భీముడు మకరవ్యూహంలో ఆటోపంగా మిరుమిట్లు గొలిపే గర్వంతో ప్రవేశించి చేరాడు. ఆ మకరవ్యూహం సముద్రం వలె ఉన్నది. సముద్రంలో వినోదించే మొసలివలె భీముడు భయంకర స్వరూపంతో అందులో ప్రవేశించాడు.

ఉ. చొచ్చి పితామహుంగని యిషుప్రచయంబునఁ గప్పె నాతఁడుం
జిచ్చున నేయి వోసినవిశేషము దోఁపఁగ భీము నొంచి ము
చ్చిచ్చున నేర్చునట్టులుగఁ జేసెఁ దదూర్జితసేన నంత వి
వ్వచ్చుఁడు వచ్చి దివ్యశరవర్గనిరర్గళవిక్రమంబునన్. 277

ప్రతిపదార్థం: చొచ్చి= ప్రవేశించి; పితామహున్+కని= భీష్ముడిని చూచి; ఇషు+ప్రచయంబునన్= బాణాల సముదాయంతో; కప్పెన్= ముంచాడు; ఆతఁడున్= ఆ భీష్ముడూ; చిచ్చునన్= అగ్గిలో; నేయి+పోసిన, విశేషము+తోఁపఁగన్= ఆజ్యం పోసినట్టి గొప్పతనం కనిపించేటట్లుగా; భీమున్= భీముడిని; నొంచి= నొవ్వచేసి; తద్+ఊర్జిత+సేనన్= ఆతడి గొప్ప సైన్యాన్ని; ముచ్చిచ్చును+ ఏర్చునట్టులుగన్= మూడు అగ్నులతో దహించేటట్లుగా; చేసెన్; అంతన్= అటు పిమ్మట; విష్వచ్చుఁడు= అర్జునుడు; దివ్య శర వర్గ నిరర్గళ విక్రమంబునన్= దేవతలకు సంబంధించిన అమ్ముల సముదాయంతో అడ్డులేని పరాక్రమంతో.

తాత్పర్యం: భీముడు కౌరవులు పన్నిన మకర వ్యూహంలోనికి చొరబడి భీష్ముడిని అమ్ముల గుంపుతో కప్పివేశాడు. భీష్ముడు నేయి పోసిన అగ్గివలె ప్రజ్వలించి, పాండవసేనను ముచ్చిచ్చులో ముంచాడు. అప్పుడు అర్జునుడు వచ్చి, దేవతలు తనకు బహూకరించిన బాణాలు ప్రయోగించి, అడ్డులేని పరాక్రమంతో భీష్ముడిని మార్కొన్నాడు.

విశేషం: అలం: ఉపమ. 1. భీముడు - భీష్ముడిపై బాణాలు ప్రయోగిస్తే - అది అగ్నిలో ఆజ్యం పోసినట్లు అయింది. భీష్ముడు ప్రజ్వరిల్లాడు. 2. ముచ్చిచ్చు= మూడు అగ్నుల సమాహారం. త్రేతాగ్నులు. 1. ఆహవనీయం - గార్హపత్యం - దక్షిణాగ్ని.

క. భీష్ముని గర్వం బుడిపి మ । హోష్ములుఁడై కౌరవేంద్రుయోధుల కెల్లన్
గ్రీష్మాదిత్యుని క్రియ న । ర్చిష్మత్త్వము సూపి యడరె సేనలు దెరలన్. 278

ప్రతిపదార్థం: భీష్ముని+గర్వంబు+ఉడిపి= భీష్ముని మదము పోగొట్టి; మహా+ఉష్ములుఁడు+ఐ= గొప్ప వేడిమి గలవాడై; కౌరవ+ఇంద్రు యోధులకున్+ఎల్లన్= దుర్యోధనుడి వీరులందరకు; గ్రీష్మ+ఆదిత్యుని+క్రియన్= ఎండాకాలపు సూర్యునివలె; అర్చిష్మత్త్వము= మండుటెండ; చూపి=ప్రదర్శించి; సేనలు+తెరలన్= (కౌరవ) సేనలు వెనుకంజ వేయునట్లుగా; అడరెన్= విజృంభించాడు.

తాత్పర్యం: అర్జునుడు వచ్చి మార్కొని భీష్ముడిని అరికట్టాడు. మండుటెండవలె ప్రకాశించి, కౌరవవీరుల నందరను వేసవికాలంలో సూర్యుడివలె వేడిమి చూపి, కౌరవసేనలను వెనుకంజ వేసేటట్లు చేసి విజృంభించాడు.

వ. అట్టియెడ నీకొడుకు గురునిం గదిసి యతని కి ట్లనియె. 279

ప్రతిపదార్థం: అట్టి+ఎడన్= ఆ సమయంలో; నీ+కొడుకు= నీ పుత్రుడు(దుర్యోధనుడు); గురునిన్= ఆచార్యుడిని (ద్రోణుని); కదిసి= చేరి; అతనికిన్= ద్రోణునకు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఆ సమయంలో నీ కొడుకు దుర్యోధనుడు - గురువైన ద్రోణుడి దగ్గరకు చేరి ఈ విధంగా అన్నాడు.

తే. ‘ పట్టి పాలార్చెదరు మీరు పాండుసుతుల । నీవు భీష్ముండు నలిగిన దేవతలకు
నైన మార్కొనవచ్చునే? సేన నరుఁడు । నొంపఁగా నిట్టు లొప్పరికింపఁ దగునె?’ 280

ప్రతిపదార్థం: మీరు= మీరు పాండుసుతులన్= పాండవులను; పట్టి పాలార్చెదరు= ఉపేక్షిస్తున్నారు; నీవు= ఓ ద్రోణాచార్యా!; భీష్ముండు= భీష్ముడును; అలిగినన్= కోపిస్తే; దేవతలకున్+ఐనన్= వేల్పులకు అయినా; మార్కొనన్‌వచ్చునే?= ఎదిరించసాధ్యం అవుతుందా? సేనన్= సైన్యమును; నరుఁడు= అర్జునుడు; నొంపఁగాన్= చీకాకు పరచగా; ఇట్టులు= ఈ విధంగా; ఒప్పరికింపన్+ తగును+ఎ?= ఉపేక్షింపవచ్చునా?

తాత్పర్యం: ఓ ద్రోణాచార్యా! మీరు (నీవూ, భీష్ముడూ) పాండవులను ఉపేక్షిస్తున్నారు. నీవు భీష్ముడు, కోపిస్తే- మిమ్ము దేవతలు గూడ ఎదిరించలేరుకదా! అర్జునుడు మన కౌరవసేనను చీకాకు పరుస్తూ ఉంటే - మీరు చూస్తూ ఊరకుంటున్నారేమిటి?’

వ. అనిన విని కుంభసంభవుండు గటకటం బడి యతనితో ని ట్లనియె. 281

ప్రతిపదార్థం: అనినన్+విని; కుంభసంభవుండు= ద్రోణుడు; కటకటంబడి= నొచ్చుకొని; అతనితోన్= దుర్యోధనునితో; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని దుర్యోధనుడు పలుకగా మనస్సులో ఎంతో బాధపడి ద్రోణుడు ఈ విధంగా అన్నాడు.

తే. ' ఎన్నఁడును మున్నువారలయేపు నోపఁ ; గానమెట్లు సముద్రంబులోన బుట్ట
వైవఁ గొన్నంత గొనుఁగాక వారిగెల్వ ; మాకు శక్యంబె చవిగాని మాటలేల?' 282

ప్రతిపదార్థం: ఎన్నఁడును+మున్ను= మునుపెప్పుడూ; వారల= పాండవులయొక్క; ఏపు= ఆధిక్యం; ఎట్లున్= ఏ విధంగానూ; ఓపన్+కానము= తట్టుకొనటం చూడలేదు; సముద్రంబులోనన్; బుట్టవైవన్= సొరకాయబుర్రను వేయగా; కొన్నంత+కొను= అందులో పట్టేటంత నీటిని మాత్రమే అది తీసికొనగలదు; కాక; వారిన్+గెల్వన్+మాకున్= మాకు వారిని గెలవటానికి; శక్యంబె?= సాధ్యమా?; చవి+కానిమాటలు+ఏల?= రుచించని పలుకులు ఎందుకు?

తాత్పర్యం: మునుపెన్నడూ పాండవుల ఆధిక్యాన్ని తట్టుకోవడం చూడలేదుగదా! సముద్రంలో ఒకసొరకాయబుర్ర వేస్తే అదిగ్రహించగలిగినంత నీటినే గ్రహిస్తుంది. అంతేగాని సముద్రపు నీటినంతటనీ గ్రహించలేదు. మా శక్తి ఆ పాటిదే. ఈ రుచిలేని మాటలెందుకు?

విశేషం: 'మాకు' 'కానము' అను బహువచన ప్రయోగం ద్రోణుడి మాటలలోనిది - గమనింపదగును. అతడు భీష్ముడినికూడా తనతోపాటు కలిపికొని మాటాడాడు.

క. అనుచు మొన గడచి నడచినఁ ; గని పాండుతనూజు సైనికవ్రాతంబుల్
గనుకని విచ్చిన సాత్యకి ; యనిలజవం బెసఁగఁ దాఁకె నస్త్రాచార్యున్. 283

ప్రతిపదార్థం: అనుచున్= అని చెప్పుచు; మొన+కడచి+నడచినన్= కౌరవ సేననుదాటి ముందుకు సాగి రాగా; కని= ద్రోణుని చూచి; పాండు తనూజు సైనిక వ్రాతంబుల్= పాండవుల సేనా సమూహాలు; కనుకనిన్+విచ్చిన= చెల్లాచెదరై పోయిన; సాత్యకి అనిల+జవంబు+ఎసఁగన్= వాయు వేగం అతిశయించగా; అస్త్ర+ఆచార్యున్= ద్రోణుని; తాఁకెన్= మార్కొన్నాడు.

తాత్పర్యం: ఆ విధంగా ద్రోణుడు దుర్యోధనునితో పలికి, కౌరవసేనను దాటి ముందరకు రాగా, చూచి పాండవసేనలు తొట్రుపాటుతో చెల్లాచెదరైపోయాయి. అప్పుడు సాత్యకి వాయువేగంతో విజృంభించి ద్రోణాచార్యుడిని మార్కొన్నాడు.

ద్రోణుండు దుర్యోధన ప్రేరితుండై పాండవ సైన్యంబుపైఁ గవియుట (సం-6-65-21)

సీ. తాఁకి యుజ్జ్వల బాణతతి గవియించిన నవ్వుచు బెడిదంపు నారసములు
గురుఁడు శైనేయుపైఁ గురిసిన నొచ్చియుఁ దెరలక యాతండు తీవ్రభంగిఁ
బెనఁగంగఁ జూచి పావని యేచి గురునిపై నిశితాస్త్రసంతతి నించి నొంచె
నంత శల్యుండును శాంతనవుండును నతనికిఁ దోడ్పడి యడరి భీము

ఆ. నేయఁ దొడఁగుటయును నేడ్తెఱ ద్రౌపదే ; యులును దానుఁ గవిసి యుగ్రలీలఁ
బటురయంబుమై సుభద్రాసుతుండు దు ; ర్వార విశిఖతతుల వారిఁ బొదివె. 284

ప్రతిపదార్థం: తాఁకి= మార్కొని; ఉజ్జ్వల బాణ తతిన్= ప్రకాశించే అమ్ముల సముదాయం; కవియించినన్= ప్రయోగించగా; నవ్వుచున్; బెడిదంపు+నారసములు= గొప్ప బాణాలు; గురుఁడు= ద్రోణుడు; శైనేయుపైన్= సాత్యకిపై; కురిసినన్= అమ్ముల వాన వర్షింపగా; నొచ్చియున్= బాధపడి కూడ; తెరలక= వెనుకంజ వేయక; ఆతండు= సాత్యకి; తీవ్ర+భంగిన్= మిక్కుటముగా; పెనఁగంగన్+చూచి= పోరాడటం చూచి; పావని= భీముడు; ఏచి= విజృంభించి; గురునిపైన్= ద్రోణుడిపై; నిశిత+అస్త్ర+సంతతిన్= వాడియైన అమ్ముల సముదాయాన్ని; నించి+నొంచెన్= నిండించి నొప్పించాడు; అంతన్= అటుపిమ్మట; శల్యుండును శాంతనవుండునున్= శల్యుడును, భీష్ముడును; అతనికిన్= ద్రోణాచార్యునకు; తోడ్పడి= సాయం చేసి; అడరి= విజృంభించి; భీమున్= భీముని; ఏయన్+తొడఁగుటయును= బాణాలు వేయడానికి పూనుకొనగా; ఏడ్తెఱన్= పరాక్రమంతో; ద్రౌపదేయులును= ద్రౌపదీ పుత్రులును; తాను= తాను(అభిమన్యుడు); కవిసి= మార్కొని; ఉగ్ర+లీలన్= భయంకరంగా; పటు+రయంబుమైన్= గొప్ప వేగంతో; సుభద్రా+సుతుండు= అభిమన్యుడు; దుర్వార విశిఖ తతులన్= అడ్డగించటానికి వీలులేని అమ్ముల సముదాయంతో; వారిన్= వారిని(ద్రోణుడిని, భీష్ముడిని, శల్యుడిని); పొదివెన్= మార్కొన్నాడు.

తాత్పర్యం: సాత్యకి ద్రోణుడిని మార్కొని, వెలుగొందే అమ్ములు అతడిపై గుప్పించాడు. ద్రోణుడు సాత్యకి సాహసానికి నవ్వుకొంటూ గొప్ప బాణంతో అతడిని కొట్టాడు. సాత్యకి దెబ్బతిని కూడా జంకకుండా యుద్ధం చేయటం గమనించి - భీముడు అతడికి సాయం చేయటానికి వెళ్ళాడు. వెళ్ళి ద్రోణుడిపై వాడిబాణాలు కురిపించాడు. అంతట భీష్ముడు, శల్యుడు ద్రోణాచార్యుడికి బాసటగా నిలిచి, భీముడిని మార్కొన్నారు. అప్పుడు భీముడికి బాసటగా ద్రౌపదీసుతులూ అభిమన్యుడూ వచ్చి వాడిబాణాలు ద్రోణుడిపైనా - అతనికి బాసటగా నిల్చిన భీష్మునిపైనా, శల్యుడిపైనా ప్రయోగించారు.

విశేషం: తిక్కన మనఃఫలకంపై - కురుక్షేత్ర సంగ్రామ క్రమం హత్తుకొనినట్లుగా కన్పిస్తుంది - అతడు చేసిన యుద్ధవర్ణనను బట్టి. భీష్మ - ద్రోణ - కర్ణపర్వాలలో ఎచ్చట చూచినా - చెప్పినది చెప్పక - ఒక్కచోటగూడా తబ్బిబ్బు లేకుండగా తిక్కన - చదువరుల కన్నులకు కట్టినట్లుగా వర్ణించడం - గుర్తింప దగినట్టి విశేషం.

చ. కడువడితోడ నప్పుడు శిఖండి ధనుర్గుణ నిస్వనంబు పె
ల్లడరఁగ బాణజాలము వియత్తటిఁ గప్పఁగ నీదు సైన్యముల్
సుడివడ భీష్ముఁ దాఁకుటయుఁ జూచి మనంబున నాఁటదానితోఁ
బొడుతునె? యంచు మార్కొనక పోయెఁ దొలంగి యతండు భూవరా! 285

ప్రతిపదార్థం: భూవరా!= ఓ మహారాజా; కడువడితోడన్= మిక్కిలివేగంతో; అప్పుడు= ఆ సమయంలో; శిఖండి; ధనుస్+గుణ+నిస్వనంబు= విల్లుయొక్క అల్లెత్రాటి మ్రోత; పెల్లు+అడరఁగన్= ఎక్కువగా విజృంభింపగా; బాణ జాలము= అమ్ముల గుంపు; వియత్+తటిన్= ఆకాశ ప్రదేశాన్ని; కప్పఁగన్= కప్పగా; నీదు+సైన్యముల్= నీ సేనలు; సుడి+పడన్= గుండ్రముగా తిరుగగా; భీష్మున్= భీష్ముడిని; తాఁకుటయున్= మార్కొనుట; చూచి= పరికించి; మనంబునన్= మనస్సులో; ఆటదానితోన్= ఆడుదానితో(స్త్రీతో); పొడుతునె?= ఎదుర్కొంటానా?; అంచున్= అని అంటూ; అతండు= భీష్ముడు; తొలంగి పోయెన్= దూరంగా తొలగి వెళ్ళాడు.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! అప్పుడు శిఖండి మిక్కుటమగు వేగంతో, తన వింటినారితో పెద్ద రొద చేస్తూ, ఆకాశం అంతా తన బాణాలతో కప్పుతూ వచ్చి నీ సేనలు సుడిపడేటట్లు చేస్తూ భీష్ముడిని మార్కొన్నాడు. 'ఒక ఆడదానితో నేను యుద్ధం చేస్తానా?' అని తన మనస్సులో భావించి, భీష్ముడు తొలగిపోయాడు.

క. కనుఁగొని కురుపతి యాచా । ర్యునిఁ బురికొలుపుటయు నాతఁ డుద్దామగతిం
జని కడిమి మెఱయ నుజ్జ్వల । ఘనమార్గణపుంజముల శిఖండిఁ దెరల్చెన్. 286

ప్రతిపదార్థం: కనుఁగొని= చూచి; కురుపతి= కురురాజు(దుర్యోధనుడు); ఆచార్యునిన్= గురుని(ద్రోణుని); పురికొల్పుటయున్= ప్రోత్సహించగా; ఆతఁడు= ద్రోణుడు; ఉద్దామగతిన్+చని= భయంకరమైన రీతిగా వెళ్ళి; కడిమి+మెఱయన్= పరాక్రమము వెలుగొందగా; ఉజ్జ్వల ఘన మార్గణ పుంజములన్= ప్రకాశమానములైన గొప్పవైన బాణముల సముదాయంతో; శిఖండిన్= శిఖండిని; తెరల్చెన్= మరలునట్లు చేశాడు.

తాత్పర్యం: శిఖండితో యుద్ధం చేయటానికి ఇష్టంలేక - భీష్ముడు వెళ్ళిపోవటం చూచి, దుర్యోధనుడు ద్రోణాచార్యుడిని పురికొల్పాడు. ద్రోణుడు పరాక్రమం ప్రకాశించగా, భయంకరంగా వెళ్ళి, వెలుగొందే అమ్ముల సముదాయం ప్రయోగించి శిఖండిని మరలించాడు.

క. అమ్మెయిఁ గౌరవులును ద ర్ప మ్మలరఁగఁ జెలఁగుటయును బాండవబలముల్
సమ్ముఖమునఁ దలఁపడినను । సమ్మర్దం బుగ్ర మయ్యె సంగ్రామమునన్. 287

ప్రతిపదార్థం: ఆ+మెయిన్= ఆరీతిగా; కౌరవులును= కౌరవులు కూడా; దర్పమ్ము+అలరఁగన్= గర్వము విలసిల్లగా; చెలఁగుటయును= ఒప్పుటయును; పాండవ బలముల్= పాండవులసేనలు; సమ్ముఖమునన్+తలపడినను= ప్రత్యక్షంగా మార్కొనటం చేత; సంగ్రామమునన్= యుద్ధమందు; సమ్మర్దంబు= సంకులత్వం; ఉగ్రము+అయ్యెన్= భయకరం అయింది.

తాత్పర్యం: ఆ రీతిగా కౌరవులు కూడా దర్పంగా యుద్ధం చేశారు. పాండవ సేనలు వారిని ఎదిరించాయి. ఇక ఘోరమైన సంకుల సంగ్రామం చెలరేగింది.

క. ధూళుల మేఘుంబులుఁ గర । వాలాదినిశాతహేతివర్గాంశుతటి
న్మాలయు గుణరవగర్జలుఁ । గీలాలపువృష్టికిం దగియె నట్టియెడన్. 288

ప్రతిపదార్థం: ధూళుల మేఘుంబులు= దుమ్ములు అనే మబ్బులు; కరవాల+ఆది నిశాత హేతి వర్గ అంశు తటిత్+మాలయున్= కత్తులు మొదలైన వాడియైన కత్తుల సమూహాల కాంతులు అనే మెరుపు తీగల దండ; గుణ రవ గర్జలున్= విల్లుకు కట్టిన అల్లె త్రాటి మ్రోతలు అనే (మేఘ) గర్జలు; కీలాలపు+వృష్టికిన్= రక్తము అనే వర్షానికి; అట్టి+ఎడన్= ఆ సమయంలో; తగియెన్= తగినట్టిదిగా కన్పించింది.

తాత్పర్యం: రణరంగంలో చెలరేగిన దుమ్ములే మబ్బులు, కత్తులు మొదలయిన వాడియైన ఆయుధాల నుండి వెలువడే ధగద్ధగలే మెరుపు తీగల దండలు. అల్లెత్రాటి మ్రోతలే మేఘగర్జనలు. ఇక - నెత్తుటి వర్షం కురియటానికి అప్పుడు- అంతా తగినట్లుగా ఉంది.

విశేషం: అలం: రూపకం. కీలాలపు వృష్టి - శ్లిష్టరూపకం. 1. కీలాలము= అనగా నెత్తురు అని ఒక అర్థం. రెండవ అర్థం నీరు. నెత్తురు వాననీరు మాదిరిగా కురవటానికి ఈ సంగ్రామం రంగంగా ఏర్పడింది.

క. ప్రోవులు గట్టిన గుఱ్ఱపుఁ । బ్రేవులు నేనుఁగుల తఱచుఁబీనుంగులు ర
క్తావిలత వెల్లచీరలుఁ । గావులు నై భటనికాయకాయంబులునై. 289

ప్రతిపదార్థం: ప్రోవులు+కట్టిన= గుట్టలుగా ఏర్పడిన; గుఱ్ఱపు+ప్రేవులు= అశ్వాల రక్తనాళాలు; ఏనుఁగుల+తఱచు+పీనుంగులు= ఏనుగుల దట్టమైన మృతకళేబరాలు; రక్త+ఆవిలతన్= రక్తంతో కూడు కొనటంచేత; వెల్ల+చీరలున్= తెల్ల వస్త్రాలు; కావులును+ఐ= కాషాయపు రంగుతో కూడినవై; భట నికాయ కాయంబులును+ఐ= భటుల సముదాయాలయొక్కశరీరాలు అయి.

తాత్పర్యం: గుట్టలుగా పడిపోయాయి గుర్రాల ప్రేవులు. ఏనుగుల మృతకళేబరాలు దట్టంగా కూడుకున్నాయి. తెల్లని వస్త్రాలు నెత్తుటిలో తడిసి జేగురు రంగువిగా మారిపోయాయి. అట్లే భటసముదాయాల శరీరాలు కూడా పడి ఉన్నాయి.

క. సమరాంగణంబు కడుఘో । రముగా నిరువాఁగుఁ బోరురభసంబున ది
క్సమితి వడఁకాడెఁ బొగడెడు । నమరులయిలి వడరెఁ జదల నతినిబిడముగాన్. 290

ప్రతిపదార్థం: సమర+అంగణంబు= రణరంగం(పొలికలను); కడున్= మిక్కిలి; ఘోరముగాన్= భయంకరముగా; ఇరువాఁగున్= రెండు పక్షాలు(కౌరవ,పాండవసేనలు); పోరు+రభసంబునన్= యుద్ధంచేసే ఉద్రేకంలో; దిక్+సమితి= దిక్కుల సముదాయం; వడఁకు+ఆడెన్= కంపించింది; చదలన్= ఆకాశమునందు; అతి నిబిడముగాన్= మిక్కిలి దట్టముగా; పొగడెడు= ప్రశంసించే; అమరుల+ఉలివు= వేల్పుల మాటల సవ్వడి; అడరెన్= అతిశయించింది.

తాత్పర్యం: కురుపాండవులు ఇరుపక్షాలు పోరుతున్నప్పుడు రణరంగం మిక్కిలి భయంకరంగా మారింది. దిక్కులు కంపించాయి. చారణుల ప్రశంసాగీతాలతో ఆకాశం మారుమ్రోగింది.

విశేషం: అమరుల ఉలివు= దేవతల ప్రశంసా నినాదం, లోకోత్తరమైన ప్రతిభ-పరాక్రమం ప్రదర్శించినపుడు వేల్పులు - చారణులు ఉప్పొంగిపోయి ప్రశంసాగీతాలు పాడుతారట! ఇది హృదయంగమమైన కవి సమయంగా ప్రాచీన భారతీయ సాహిత్యంలో అవతరించి కన్పిస్తుంది.

క. అనిలజభీష్ములు దమతమ । మొనలకుఁ గన్నాకు లగుచు మునుకొని వడి న
ర్జునకుంభసంభవుల ప్రా । పునఁ జూపిరి విక్రమంబు భూరిబలంబున్. 291

ప్రతిపదార్థం: అనిలజ+భీష్ములు= భీముడు, భీష్ముడు; తమ+తమ+మొనలకున్= తమ తమ సేనలకు; కన్నాకులు+అగుచున్= నాయకులు అగుచు; మునుకొని= ముందున కేగుదెంచి; వడిన్= వేగముగా; అర్జున+కుంభసంభవుల+ప్రాపునన్= అర్జునుడు-ద్రోణుడు తోడ్పడగా; విక్రమంబు= పరాక్రమం; భూరి+బలంబున్= మిక్కుటమగు శక్తిని; చూపిరి= ప్రదర్శించారు.

తాత్పర్యం: భీముడు, భీష్ముడు తమ తమ సేనలకు నాయకత్వం వహించారు. భీముడికి, అర్జునుడు సాయం చేశాడు. భీష్ముడికి ద్రోణుడు తోడైనాడు. వారు ఇరువురూ తమ పరాక్రమం - గొప్పబలం చూపించి పోరాడారు.

విశేషం: అలం: యథాసంఖ్యం.

క. భీమునిదెసఁ గాళింగో । ద్దామగజానీక సంగతత్వస్ఫురణా
భీమగతిం దటిమెం గురు । భూమీశుఁడు భీష్మగురులు పోరెడు బలిమిన్. 292

ప్రతిపదార్థం: భీష్మగురులు= భీష్ముడును, ద్రోణుడును; పోరెడు+బలిమిన్= యుద్ధం చేసేటప్పుడు ఏర్పడిన బలముతో; భీమునిదెసన్= భీముడివైపునకు; కాళింగ+ఉద్దామ+గజ+అనీక+సంగతత్వ+స్ఫురణా+భీమ+గతిన్= కళింగదేశానికి సంబంధించిన భయంకరమైన ఏనుగుల గుంపు కలయికతో ఏర్పడే భయోత్పాతంతో; కురు+భూమీశుఁడు= కురురాజు(దుర్యోధనుడు); తటిమెన్= భీముని మార్కొన్నాడు.

తాత్పర్యం: భీముడు, అర్జునుడు ఒకవైపు, వారికి ఎదురుగా భీష్ముడు, ద్రోణుడు పోరాడుతున్నారు. ఆ సమయం చూచి, అది మంచి అదను అని ఎంచి దుర్యోధనుడు భీముడిని మార్కొన్నాడు. కళింగ మత్తేభ యూథాలు భీముడిపై

ఒక్కుమ్మడి పైబడి యుద్ధం చేయటం పరిపాటి. ఒక్క దుర్యోధనుడు ఆ మత్తేభయూథాల సంకుల శక్తిని మేళవించికొని భీముడిపై దాడి చేశాడు.

చ. అటిముటి నీ కుమారవరు ల । త్తటి నందఱు నాబకారిపై
నుఱక రథంబులం బఱప నుజ్జ్వలశైలము మేఘబృందముల్
గిటికొనఁ గప్పిన ట్లయినఁ గ్రీడి గుణస్వన ముల్లసిల్ల నే
డ్తెఱ విశిఖప్రతాప మనుతీవ్రసమీరము నేపు సూపినన్. 293

ప్రతిపదార్థం: అటిముటిన్= సంభ్రమంతో; నీ+కుమారవరులు= నీ పుత్రరత్నములు(నీ కొడుకులలో శ్రేష్ఠులు, గొప్పవారైన నీ పుత్రులు); అందఱున్= అందరునూ; ఆ+తటిన్= ఆ సమయమున; ఆ+బక+అరిపైన్= ఆ భీమునిపై; ఉఱక= లక్ష్యపెట్టక; రథంబులన్= రథాలను; పఱపన్= తోలగా; ఉజ్జ్వల శైలమున్= ప్రకాశించే కొండను; మేఘ+బృందముల్= మబ్బులగుంపులు; గిటికొనన్= కూడి; కప్పినట్లు+అయినన్= క్రమ్మినట్లుగా కాగా; క్రీడి= అర్జునుడు; గుణ+స్వనము+ఉల్లసిల్లన్= అల్లెత్రాటి మ్రోత విలసిల్లగా; ఏడ్తెఱన్= పరాక్రమంతో; విశిఖ+ప్రతాపము+అను= బాణాల పరాక్రమం అనే; తీవ్ర+సమీరము+ఏపు+చూపినన్= గొప్ప గాలి విజృంభణ ప్రదర్శించగా.

తాత్పర్యం: దుర్యోధనుడు భీముడిని తాకటం తోడనే నీ కుమారులు అందరూ రథాలను తోలి భీముడిని మార్కొన్నారు. కొండను మబ్బుల దొంతర ఆవరించినట్లయింది. అప్పుడు అల్లెత్రాటిని మ్రోగించి, అర్జునుడు వేగమైన గాలి ఏపు వంటి అమ్ముల సముదాయం ప్రయోగించాడు.

విశేషం: అలం: ఉపమ రూపకం. భీముడు కొండవలె నిలిచాడు. దుర్యోధనుడు, అతడి తమ్ములు మబ్బులవలె ఆ కొండను క్రమ్మారు. అర్జునుడు పెనుగాలి వంటి బాణాలు ప్రయోగించాడు. పెనుగాలి వీచేటప్పుడు చెలరేగే ధ్వనివలె - అర్జునుని వింటినారి మ్రోత (గుణధ్వని) వినిపించింది.

క. ఆరథనివహంబులు న । వ్వారణములుఁ దెరలి మరలి వడిఁ బఱచుటయుం
గౌరవబల మెల్లను రణ । శూరుఁడు గాంగేయుమఱువు సొచ్చె వికలమై. 294

ప్రతిపదార్థం: ఆ+రథ+నివహంబులు= ఆ తేరుల గుంపులు; ఆ+వారణములు= ఆ ఏనుగులు; తెరలి+మరలి= వెనుదిరిగి; వడిన్= వేగంగా; పఱచుటయున్= పారిపోవటంచేత; కౌరవ+బలము+ఎల్లను= కౌరవసేన అంతా; వికలము+ఐ= చీకాకు చెంది; రణ శూరుఁడు= యుద్ధం చేయుటలో వీరుడైన; గాంగేయు+మఱువు+చొచ్చెన్= భీష్ముడి వెనుకకు చేరింది.

తాత్పర్యం: కౌరవ సైన్యంలోని ఆ రథాలు, ఏనుగులు అన్నీ వెనుకంజ వేసి వేగంగా పారిపోయాయి. ఇక మిగిలిన కౌరవసేన అంతా చీకాకై చిట్టచివరకు రణశూరుడూ, సేనాపతీ అయిన భీష్ముడి వెనుకకు చేరి నిలిచింది.

వ. ఇట్లు సేన మొగతిరిగినం గని సుయోధనుండు బరవసంబునం బురికొల్పి చేయి వీచుచు నగ్గలిక నడచినం గాంభోజ గోపాల సింధుగాంధార సౌవీర త్రిగర్త కళింగ ప్రముఖ బలసంగతు లై శకుని సైంధవులు దుశ్శాసనుం బురస్కరించికొని యురవడించి భీమపార్థులం బొదివిన ధర్మనందనుండు వెన్నుదన్ని యదల్చినం జేది కాశకరూశపాంచాల సైన్యంబులతో ధృష్టద్యుమ్నపురోగములగు రథికముఖ్యులు గడంగి కవిసి రప్పుడు విందానువిందులు గాశిరాజును సైంధవుండు భీమసేనుని వికర్ణుండు సహదేవునిఁ జిత్రసేనుండు శిఖండిని

దుర్యోధనుండు విరటునిఁ ద్రిగర్తులు నకులుని ద్రోణుండు చేకితానసాత్యకులను గృపహార్దిక్యులు ధృష్టద్యుమ్నుని సౌభద్రుండు సాల్వకేకయులను ధృష్టకేతుఘటోత్కచులు నీకొడుకులం దలపడిరి యుధిష్ఠిరుండు దాను మద్రేశ్వరుందాఁకె నిట్లు సంకులసమరం బైన నస్త్రశస్త్ర సంఘట్టనంబున వెడలుమంటలు మింట నడరి మధ్యాహ్నప్రచండంబు లై యున్న చండకిరణుకిరణంబుల మగిడింప నరదంబులు దాఁకి పడి పారలు కరులును కరిహస్తాకర్షణవిధ్వస్తంబు లగు రథంబులును దురగఖురపుటవిఘట్టితగాత్రు లగు పదాతులును బదాతి వర్గానర్గళప్రహారధారాళ రక్తసిక్తంబు లగు ఘోటకంబులు నై చూచుఖేచరులకు వెక్కసం బయ్యె నట్టియెడ. 295

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; సేన= సైన్యం; మొగతిరిగినన్= వెనుకకు మరలటం చేత; సుయోధనుండు; బరవసంబుననన్+పురికొల్పి= ధైర్యంతో ప్రోత్సహించి; చేయి+వీచుచున్= హస్తం ఇటునటు త్రిప్పుతూ - ప్రోత్సహిస్తూ; అగ్గలికన్= శౌర్యంతో; నడచినన్; కాంభోజ గోపాల సింధు గాంధార సౌవీర త్రిగర్త కళింగ ప్రముఖ బలసంగతులై= కాంభోజము గోపాలము - సింధువు - గాంధారము; సౌవీరము- త్రిగర్తము కళింగము మున్నగు దేశాలకు సంబంధించిన సేనలతో కూడినవారై; శకుని సైంధవులు= శకుని సైంధవులు; దుశ్శాసనున్= దుశ్శాసనుని; పురస్కరించికొని= ముందు పెట్టుకొని; ఉరవడించి= విజృంభించి; భీమ, పార్థులన్= భీముడిని, అర్జునుడిని; పొదివినన్= మార్కొనగా; ధర్మనందనుండు; వెన్ను+తన్ని+అదల్చినన్= వెనుకనుండి ప్రోత్సహించగా; చేది, కాశ, కరూశ, పాంచాల+సైన్యంబులతోన్= చేది - కాశ - కరూశ - పాంచాల దేశాలకు సంబంధించిన సేనలతో; ధృష్టద్యుమ్న+పురస్+గములు+అగుచున్= ధృష్టద్యుమ్నుని ముందు పెట్టుకొని కదలిన వారగుచు; రథికముఖ్యులు= వీర శ్రేష్ఠులు; కడంగి= పూని; కవిసిరి= మార్కొన్నారు; అప్పుడు; విందఁ+అనువిందులు; కాశీరాజును సైంధవుండు; భీమసేనుని వికర్ణుండు, సహదేవుడిని చిత్ర సేనుండు; శిఖండిని దుర్యోధనుడు; విరటుని; త్రిగర్తులు; నకులుని ద్రోణుండు; చేకితాన సాత్యకులను= చేకితానుని మరియు సాత్యకిని; కృప, హార్దిక్యులు= కృపుడు, హార్దిక్యుడు(కృతవర్మ); ధృష్టద్యుమ్నుని సౌభద్రుండు= అభిమన్యుడు; సాల్వ, కేకయులను= సాల్వుని కేకయులను; ధృష్టకేతు ఘటోత్కచులు= ధృష్టకేతుడు, ఘటోత్కచుడును; నీ కొడుకులన్= నీ కుమారులను; తలపడిరి= మార్కొన్నారు; యుధిష్ఠిరుండు= ధర్మరాజు; తాను; మద్రేశ్వరున్= శల్యుని; తాఁకెన్= ఎదిరించాడు; ఇట్లు; సంకుల+సమరంబు+అయినన్= సందడి యుద్ధం జరుగగా; అస్త్ర+శస్త్ర+సంఘట్టనంబునన్= మంత్రబాణాలు బాణాల ఒరపిడి చేత; వెడలు+మంటలు= ఏర్పడిన అగ్నిజ్వాలలు; మింటన్= ఆకాశమందు; అడరి= విజృంభించి; మధ్యాహ్న+ప్రచండంబులై+ఉన్న= పట్టపగలు తీక్ష్ణంగా వెలుగొందే; చండకిరణు+కిరణంబులన్= సూర్యుడి కిరణాలను; మగిడింపన్= పారద్రోలగా; అరదంబులున్= రథాలును; తాఁకి= స్పృశించి; పడి+పారలు= నేలమీదపడి ఇటునటు కదలు; కరులును= ఏనుగులును; కరి హస్త+ఆకర్షణ+విధ్వస్తంబులు+అగు= ఏనుగుల తొండాలచే ఆకర్షింపబడి - చెడిపోయిన రథంబులును; తురగ ఖుర పుట విఘట్టిత గాత్రులు+అగు= గుర్రాల గిట్టలచే త్రొక్కబడిన కళేబరాలు గల; పదాతులును= కాలి భటులును; పదాతి వర్గ+అనర్గళ ప్రహార ధారాళ రక్త సిక్తంబులు అగు= కాలిభటుల సమూహాల యొక్క ఎడతెగని దెబ్బలచే బాగుగ కారిన నెత్తురుతోతడిసిన; ఘోటకంబులున్+ఐ= గుర్రాలును అయి; చూచు; ఖేచరులకున్= ఆకాశంలో సంచరించే వేల్పులకు; వెక్కసంబు+అయ్యెన్= మిక్కిలిదుస్సహమైంది; అట్టి+ఎడన్= ఆ సమయంలో.

తాత్పర్యం: కౌరవసైన్యం వెనుకకు మరలింది. దుర్యోధనుడు ధైర్యంతో ముందుకు వచ్చి, చేయి ఊపి - తన సేనకు ప్రోత్సాహం కల్పించాడు. శకుని - సైంధవుడు సింధు గాంధార సౌవీర త్రిగర్త కళింగాది దేశాల సేనలను తరలించుకొని వచ్చారు. వారు దుశ్శాసనుడి నాయకత్వంలో భీముడిని, అర్జునుడిని మార్కొన్నారు. ధర్మరాజు - చేది కాశ కరూశ పాంచాల సైన్యాలను ప్రోత్సహించగా, ధృష్టద్యుమ్నుడు ఆ సేనలకు నాయకత్వం వహించాడు. ఆ సంగ్రామంలో విందానువిందులు - కాశీరాజును సైంధవుడు - భీమసేనుడిని వికర్ణుడు, సహదేవుడిని,

చిత్రసేనుడు, శిఖండిని - దుర్యోధనుడు, విరాటుడిని - త్రిగర్తులు, నకులుడిని - ద్రోణుడు, చేకితాన సాత్యకులను - కృపుడు - కృతవర్మ, ధృష్టద్యుమ్నుడిని - అభిమన్యుడు, సాల్వుడిని, కేకయులను - ధృష్టకేతువు, ఘటోత్కచుడు - కౌరవరాజు పుత్రులను కృతవర్మ యుధిష్ఠిరుడు - శల్యుడిని ఎదిరించి యుద్ధం చేశారు. ఈ విధంగా సంకుల సమరం మధ్యాహ్నం వరకు సాగింది. అస్త్రశస్త్రాల తాకిడి వలన రేగిన మంటలు పట్టపగలు ప్రకాశించే సూర్యుని వేడి కిరణాలను మరపింప చేశాయి! ఇక - రథాలను తాకి, నేలకు ఒరిగిన ఏనుగుల పీనుగులు, ఏనుగుల తొండాల తాకిడికి నుగ్గునుగ్గు అయిన తేరులు - గుర్రాల గిట్టల సందుల నలిగి చచ్చిపోయిన కాలి భటులు - కాలిభటుల తాకిడికి ఆగకుండా కారిన నెత్తురు ధారలలో పొరలే గుర్రాలు - ఆకాశంలో చరిస్తూ చూచే వేల్పులకు దుస్సహంగా కనిపించాయి.

విశేషం: ఇంతటి సంకుల సమరంలో కూడా - ఉభయ పక్షాలలోని వీరులూ తమ ప్రతివీరులను ఎన్నుకోవటంలో గల నేర్పు గమనింపదగినట్టిది. ఉదాహరణకు ధర్మరాజు శల్యుడిని మార్కొన్నాడు.

క. భీముని పోరుట గడునం । ద్దామం బై మెఱయుటయుఁ బితామహుఁడు శర
స్తోమవిదారితుఁ జేసె మ । హామర్షోత్కర్షుఁ డగుచు నతనిం బెలుచన్. **296**

ప్రతిపదార్థం: భీముని పోరుట= భీముని యొక్క పోరాటం; కడున్= మిక్కిలి; ఉద్దామంబు+ఐ= భయంకరమై; మెఱయుటయున్= ప్రకాశించటంచేత; పితామహుఁడు= తాతగారు(భీష్ముడు); అతనిన్= భీముని; పెలుచన్= మిక్కుటముగా; మహా+అమర్ష+ఉత్కర్షుఁడు+అగుచున్= మిక్కుటమగు కోపముచే విజృంభించిన వాడు అగుచు; శర స్తోమ విదారితున్ చేసెన్= బాణముల చేత గాయములు పొందినవాడినిగా చేశాడు.

తాత్పర్యం: భీముడి పోరాటం మిక్కిలి భయంకరంగా సాగింది. భీష్ముడికి మిక్కుటమైన కోపం వచ్చి విజృంభించి- భీముడిపై పెక్కు బాణాలు ప్రయోగించి అతని శరీరం తూట్లు పడేటట్లు చేశాడు.

విశేషం: భీష్ముడికి పాండవులమీద ప్రేమ ఉంది. అయితే భీముడికి భీష్ముడిపై ఏమంత ప్రేమలేదు. అందుచే లోకువ చేసి భీముడు విజృంభించి భీష్ముడిని లెక్కచేయలేదు. ఇక - భీష్ముడికి కోపం వచ్చింది. అతడు ప్రేమాభిమానాలు ప్రక్కకు నెట్టి - భీముని గాయపరచాడు. భీష్ముడు అంతపని చేస్తాడని ఎవరూ ఊహించలేదు. సాత్యకికి పట్టరాని కోపం వచ్చింది.

క. కనుఁగొని సాత్యకి యేనుం । గునకు సిడులు సూపినట్లు కోపంబున భీ
ష్మునిమీఁదఁ గవిసి యుజ్జ్వల । సునిశిత భల్లంబు లేసె సురలు నుతింపన్. **297**

ప్రతిపదార్థం: కనుఁగొని= చూచి(భీష్ముడు భీముడిని గాయపరచటం చూచి); సాత్యకి; ఏనుంగునకున్= ఏనుగును; సిడులు+చూపినట్లు= బరికోలలు చూపినట్లు; కోపంబునన్= ఆగ్రహంతో; భీష్మునిమీఁదన్= భీష్ముడిమీద; కవిసి= మార్కొని; ఉజ్జ్వల సునిశిత భల్లంబులు= ప్రకాశమానమైన వాడియైన ఈటె బాణాలు; సురలు= దేవతలు; నుతింపన్= ప్రస్తుతింపగా; ఏసెన్= ప్రయోగించాడు.

తాత్పర్యం: తాతయైన భీష్ముడు - భీముడిపై - మనుమడు అనే అభిమానం ఏమాత్రం లేకుండా వాడి బాణాలు ప్రయోగించి అతని శరీరాన్ని తూటులు పడేటట్లు చేయటం చూచేసరికి సాత్యకి ఒళ్ళుమండిపోయింది. బరికోల చూసిన ఏనుగువలె ఆతడు భీష్ముడిపై - దేవతలు ప్రస్తుతింపగా, గొప్ప వాడి బాణాలు గుప్పించాడు.

విశేషం: అలం: ఉపమ. ఏనుగునకు సిళ్ళు చూపినట్లు . సిళ్ళు అనగా ఏనుగును పొడిచే బరిగోల. సిళ్లు చూస్తే - ఏనుగు రెచ్చిపోతుంది. ఈ ప్రయోగంలోని సారస్యం గమనింపదగినట్టిది.

ఆ. అలిగి యతఁడు సూతుతలఁ దెగనేసిన । నధిప! వృష్ణివీరునరద మిట్టు
నట్టఁ దిగిచె నప్ప డాకుల గతి ఘోట । కములుఁ దద్బలంబు గలఁగఁ బడఁగ. 298

ప్రతిపదార్థం: అధిప!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; అతఁడు= భీష్ముడు; అలిగి= కోపించి; సూతు+తలన్= సాత్యకి యొక్క సారథి తలను; తెగన్+ఏసినన్= తెగేటట్లు బాణం ప్రయోగింపగా; వృష్ణి+వీరు+అరదము= వృష్ణివంశానికి చెందిన వీరుని రథం- సాత్యకి తేరు; అప్పుడు; ఆకుల+గతిన్= కలత చెందిన రీతిగా; ఘోటకములు= గుర్రాలు; తద్+బలంబున్= సాత్యకి సేన; కలఁగన్+పడఁగన్= చీకాకు చెందగా; ఇట్టున్+అట్టున్= ఇటు అటు; తిగిచెన్= మరలిపోయింది;

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! భీష్ముడు కోపంతో సారథి తలను త్రుంచగా సైన్యం కలత చెందింది. భయంతో గుర్రాలు సాత్యకి రథాన్ని అటూ ఇటూ ఈడ్చాయి.

క. మరలుపుఁడు పట్టుఁ డిట తెం । డరదమునకు వేగవేగ యడ్డము సనుఁ డా
తురుఁ డయ్యెను సాత్యకి సె । చ్చెరఁ జొరుఁ డనునులివు వారిసేనఁ జెలంగెన్. 299

ప్రతిపదార్థం: మరలుపుఁడు= మరలించండి; పట్టుఁడు= పట్టుకోండి; ఇటు+తెండు= ఇక్కడకు తీసికొనిరండి; అరదమునకున్= తేరుకు; వేగవేగ= శీఘ్రంగా; అడ్డము+చనుఁడు= అడ్డంగా నిలవండి; సాత్యకి= సాత్యకి; ఆతురుఁడు+అయ్యెను= ఆపన్నుడు అయినాడు; చెచ్చెరన్= వేగంగా; చొరుఁడు= లోపలికి వెళ్ళండి; అను+ఉలివు= అనే ధ్వని; వారిసేనన్= పాండవసేనలో; చెలంగెన్= వ్యాపించింది.

తాత్పర్యం: 'సాత్యకి ఆపదలో చిక్కుకొన్నాడు. అతడిని ఆదుకోండి; రథాన్ని మరలించండి; పట్టుకోండి; ఇక్కడకు తీసికొనిరండి. అతడి రథానికి అడ్డం నిలవండి. వేగంగా లోపలికి చొరబడండి' అనే అరుపులు పాండవసేనలో వినిపించాయి.

తే. వికలరథుఁడగు నావృష్ణివీరు మీఁద । నేయ నొల్లక మీ తండ్రి యెసక మెసఁగ
బాహుబలమునఁ బాండవవ్యూహవిదళ । నంబు సేయఁ దొడంగె భూనాథముఖ్య! 300

ప్రతిపదార్థం: భూనాథముఖ్య!= ఓ రాజ శ్రేష్ఠుడా, ధృతరాష్ట్ర మహారాజా!; వికల+రథుఁడు+అగు= పాడైపోయిన తేరు గలవాడగు; ఆ+వృష్ణి+వీరుమీఁదన్= సాత్యకిమీద; ఏయన్+ఒల్లక= బాణాలు ప్రయోగించటానికి ఇష్టంలేక; మీ+తండ్రి= భీష్ముడు; ఎసకము+ఎసఁగన్= విజృంభించి; బాహు+బలమునన్= పరాక్రమ శక్తితో; పాండవ+వ్యూహ+విదళనంబు= పాండవులు పన్నిన మొగ్గరమును ఖండించటం; చేయన్+తొడంగెన్= సలుపసాగాడు.

తాత్పర్యం: రాజులలో శ్రేష్ఠుడైన ఓ ధృతరాష్ట్ర మహారాజా!, విరథుడైన సాత్యకి మీద బాణాలు వేయడం ఇష్టపడక, నీ తండ్రియైన భీష్ముడు విజృంభించి పాండవులు పన్నిన వ్యూహాన్ని భుజ బలంతో ఛేదింపసాగాడు.

విశేషం: విరథుడిపై ఆయుధ ప్రయోగం చేయటం వీరమర్యాద కాదు. జగదేకవీరుడు కౌరవ సేనాపతియైన భీష్ముడు- ఆ వీర మర్యాద పాటించటం చేత సాత్యకి సజీవుడై బయటపడ్డాడు.

క. అంత విరాటుఁడు లయకా । లాంతకుఁడుం బోలెఁ బేర్చి యతిరభసమునన్
శాంతనవుఁ గదిసి యేసెం । గుంతీసుతు లలర మూఁడు క్రూరాస్త్రములన్. 301

ప్రతిపదార్థం: అంతన్= పిదప; విరాటుఁడు= విరాటరాజు; లయకాల+అంతకుఁడున్+పోలెన్= ప్రళయకాలము నందలి యమునివలె; అతి+రభసమునన్= మిక్కుటమగు ఆటోపంతో; పేర్చి= అతిశయించి; శాంతనవున్= శంతనుకొడుకును(భీష్ముని);

కదిసి= మార్కొని; కుంతీసుతులు= కుంతీపుత్రులు(పాండవులు); అలరన్= సంతోషించగా; మూఁడు+క్రూర+అస్త్రములన్= మూడు క్రూరములైన మంత్రబాణాలను;ఏసెన్= ప్రయోగించాడు.

తాత్పర్యం: పిదప - విరాటరాజు ప్రళయ సమయంలో యముడివలె విజృంభించి - మిక్కుటమైన సంరంభంతో తాకి - పాండవులు సంతోషించేటట్లుగా మూడు ఘోర బాణాలు భీష్ముడిపై ప్రయోగించాడు.

క. ఏసి తురంగంబుల నో । నేసినఁ గోపించి భీష్ముఁ డిషుదశకమునం
జేసె నతని రక్తజలో । ద్భాసితగాత్రుఁడుగ రెండుబలములుఁ బొగడన్. 302

ప్రతిపదార్థం: ఏసి=వేసి; తురంగంబులన్= గుర్రాలను; నోన్+ఏసినన్ = నొచ్చునట్లుగా కొట్టగా; కోపించి= ఆగ్రహం చెంది; భీష్ముఁడు= భీష్ముడు; ఇషు+దశకమునన్= పది బాణాలతో; రక్తజల+ఉద్భాసిత+గాత్రుఁడుగన్= రక్తధారలతో మిక్కుటంగా ప్రకాశించే శరీరంగలవాడిగా; రెండు+బలములున్= ఉభయసేనలు (కౌరవుల సేనలు+పాండవుల సేనలు); పొగడన్= ప్రశంసించేటట్లుగా; అతనిన్= విరాటరాజును; చేసెన్= చేశాడు.

తాత్పర్యం: విరాటుడు భీష్ముడి గుర్రాలను నొప్పింపగా, ఆయనకు కోపం వచ్చింది. ఆయన విరాటుడిపై పది బాణాలు గుప్పించి, అతడి శరీరంపై రక్తధారలు ప్రకాశించేటట్లు బాణాలు ప్రయోగించాడు. భీష్ముడి శరప్రయోగ విన్యాసం చూచి, కౌరవ సేనలే గాక పాండవ సేనలు కూడా ప్రశంసించాయి.

వ. అట్టి యెడ. 303

ప్రతిపదార్థం: అట్టి+ఎడన్= ఆ సమయంలో.

తాత్పర్యం: అప్పుడు.

శా. గంగానందనుఁ దాఁక నర్జునుఁడు వోఁగా నడ్డమై రాజు మె
చ్చం గేలీగతి యుల్లసిల్లఁ జని యశ్వత్థామ షడ్బాణవి
ద్ధాంగుం జేసెఁ గిరీటి నవ్వుచుఁ దదీయంబైనచాపంబు ద్రుం
చెం గోదండము వే ఱొకండు గొని యేసెన్ ద్రౌణి పె క్కమ్ములన్. 304

ప్రతిపదార్థం: గంగా+నందనున్= గంగకొడుకును(భీష్ముని); తాఁకన్= మార్కొనుటకు; అర్జునుఁడు= అర్జునుడు; పోఁగాన్= వెళ్ళగా; అడ్డమై= అడ్డుపడుటకు; రాజు= దుర్యోధనుడు; మెచ్చన్= ప్రశంసించేటట్లుగా; కేలీ+గతి= ఆటరీతి; ఉల్లసిల్లన్= శోభిల్లగా; చని= వెడలి; అశ్వత్థామ= అశ్వత్థామ; షట్+బాణ విద్ధ+అంగున్+చేసెన్= ఆరు బాణాలు గ్రుచ్చుకొన్న దేహం గలవానినిగా; చేసెన్= చేశాడు; కిరీటి= అర్జునుడు; నవ్వుచున్; తదీయంబు+ఐన= ఆతని; చాపంబు= విల్లు; త్రుంచెన్= ఖండించాడు; ద్రౌణి= ద్రోణుని కొడుకు; వేఱు+ఒకండు= ఇంకొక; కోదండంబు= విల్లు; కొని= గ్రహించి; పెక్కు+అమ్ములన్= అనేక బాణాలను; ఏసెన్= ప్రయోగించాడు.

తాత్పర్యం: భీష్ముడిని మార్కొనేటందుకు అర్జునుడు వెళ్ళుతుండగా - ప్రభువైన దుర్యోధనుడు సంతోషించేటట్లుగా; మధ్యలో అశ్వత్థామ అతడిని మార్కొని, ఆరు బాణాలు ప్రయోగించాడు. ఆ ఆరుబాణాలూ అర్జునుడి శరీరంపై గ్రుచ్చుకొన్నాయి. అయితే నవ్వుతూ, అశ్వత్థామ యొక్క విల్లును ఖండించాడు అర్జునుడు. అశ్వత్థామ మరో విల్లు గ్రహించి అర్జునుడిపై ఎన్నో బాణాలు గుప్పించాడు.

క. గురుసుతు బెడిదపుటంపఱ । నరనారాయణులు నొచ్చినన్ నరుకడ క
న్నరుణం బగుటయుఁ దద్రుచి । పరంపరలతోన నిగిడె బాణచయంబుల్. 305

ప్రతిపదార్థం: గురు+సుతు+బెడిదపు+అంపఱన్= అశ్వత్థామ యొక్క కఠినములైన బాణాలసమూహం చేత; నర+నారాయణులు= అర్జునుడు, శ్రీకృష్ణుడు; నొచ్చినన్= దెబ్బతినగా, నరు+కడకన్ను= అర్జునుని కన్ను చివరిభాగం; అరుణంబు అగుటయున్= ఎఱ్ఱబడుటయు; తద్+రుచి+పరంపరలతోన= ఆ ఎఱ్ఱని కాంతుల వరుసలతోనే; బాణచయంబుల్= అమ్ములగుంపులు; నిగిడెన్= వ్యాపించాయి.

తాత్పర్యం: అశ్వత్థామ ప్రయోగించిన గట్టి బాణాలచేత అర్జునుడు, శ్రీకృష్ణుడు కలత చెందారు. అర్జునుడికి ఆగ్రహం వచ్చి అతని కన్నులు ఎఱ్ఱపడ్డాయి. ఆ ఎఱ్ఱని కన్నుల కాంతులతోనే అమ్ముల గుంపులు అశ్వత్థామపై ప్రసరించాయి.

క. ఉఱక నరుఁ డట్టు మైమఱు । వఱువుళ్ళుగఁ జేసి లీల నంగము లెల్లం
బఱియలుగఁ జేయ నాతం । డఱుమెడలక మఱియు నేసె నధికరయమునన్. 306

ప్రతిపదార్థం: ఉఱుక= లెక్కచేయక; నరుఁడు= అర్జునుడు; అట్టు= ఆవిధంగా; మైమఱువు= కవచము; అఱువుళ్ళుగన్= శిథిలముగా; చేసి= ఒనరించి; లీలన్= ఆటగా; అంగములు+ఎల్లన్= అవయవాలు అన్నీ; పఱియలుగన్+చేయన్= బ్రద్దలు కొట్టగా; ఆతండు= అశ్వత్థామ; అధిక+రయమునన్= మిక్కుటమగు వేగంతో; మఱియున్= మరల; అఱుము+ఎడలక= ప్రతిఘటనము వదలక; ఏసెన్= బాణాలు ప్రయోగించాడు.

తాత్పర్యం: నరుడు- లెక్కచేయక, ఆవిధంగా అశ్వత్థామ కవచాన్ని ఛేదించి, ఆటాడు మాదిరిగా, అవయవాలను బీటలువారేటట్లుగా చేశాడు. అశ్వత్థామ ప్రతిఘటన వీడక, మరల మిక్కిలి వేగంగా అమ్ములు అర్జునుడిపై ప్రయోగించాడు.

క. నొచ్చియుఁ బెనఁగినఁ గృపయును । మెచ్చు గదిరి విప్రుతోడ మెయికొని పో రి
ట్లచ్చపడ నేటి కని వి । వ్వచ్చుఁడు గ్రేడించి యొండువలనికి నడచెన్. 307

ప్రతిపదార్థం: నొచ్చియున్= నొప్పికలిగినప్పటికీ(విడువక); పెనఁగినన్= పోరాడగా; కృపయును= కరుణయు; మెచ్చు= గౌరవభావము; కదిరి= పెరిగి; విప్రుతోడన్= బ్రాహ్మణుడితో; మెయికొని= పూని; పోరు= పోరాటం; ఇట్లు= ఈ విధంగా; అచ్చపడన్+ఏటికిన్+అని= ఏర్పడనేటికి అని భావించి; వివ్వచ్చుఁడు= అర్జునుడు; క్రేడించి= ప్రక్కకుతొలగి; ఒండు+వలనికిన్= వేరుచోటికి; నడచెన్= వెళ్ళాడు;

తాత్పర్యం: తాను దెబ్బతిని బాధపడుతున్నప్పటికీ, పోరాటం విరమించకుండా కొనసాగించిన అశ్వత్థామపై దయ, గౌరవం కలిగి, అర్జునుడు బ్రాహ్మణుడితో తీవ్రంగా యుద్ధం చేయటం ఎందు కని, లీలగా మరొకచోటికి వెళ్ళిపోయాడు.

వ. తదనంతరంబ. 308

ప్రతిపదార్థం: తద్+అనంతరంబు+అ= అటు పిమ్మట.

తాత్పర్యం: ఆ తరువాత.

ఉ. భీముఁ డుదగ్రదర్పమున భీష్మునిపైఁ జన నడ్డమై కురు
గ్రామణి భల్లపంచకయుగంబున నాతని మేను సించుడున్
భీమదృఢక్షురప్రచయభిన్నతనుండుగఁ జేసె నాతఁ డా
భూమిపు నిట్లు నీదు ప్రియపుత్రకు లొండొరుతోడఁ బోరఁగన్. 309

ప్రతిపదార్థం: భీముఁడు= భీముడు; ఉదగ్ర+దర్పమునన్= భయంకర గర్వంతో; భీష్మునిపైన్+చనన్= భీష్మునిమీదికి వెళ్ళగా; అడ్డము+ఐ= మధ్య నిలిచి; కురు+గ్రామణి= కురుపతి(దుర్యోధనుడు); భల్ల+పంచక+యుగంబునన్= పది బాణాలతో; ఆతని+మేను= భీముని శరీరం; చించుడున్= ఛేదింపగా; ఆఁతడు= భీముడు; ఆ భూమిపున్= ఆ రాజును(ఆ దుర్యోధనుడిని); భీమ+దృఢ+క్షుర+ప్రచయ+ భిన్న+తనుండుగన్= భయంకరములు, గట్టివియైన చుర కత్తి బాణాల సముదాయంతో గాయములు పడిన శరీరం గలవాడినిగా; చేసెన్= చేశాడు; ఇట్లు; నీ ప్రియ+పుత్రకులు= నీకు ప్రేమపాత్రులైన భీమదుర్యోధనులు; ఒండు+ఒరుతోడన్= ఒకరితో ఒకరు; పోరఁగన్= యుద్ధం చేయగా.

తాత్పర్యం: భీముడు భయంకరమైన గర్వంతో భీష్ముడిని మార్కొన్నాడు. దుర్యోధనుడు అడ్డం వచ్చి, పది బాణాలతో భీముడి శరీరం తూట్లు పడేటట్లు చేశాడు. భీముడు దుర్యోధనుడి శరరీం తూట్లు పడేటట్లు భయంకరమైన చురకత్తి బాణాలతో కొట్టాడు. ఈ విధంగా భీముడు - దుర్యోధనుడు భీకరమైన పోరాటం కొనసాగించుచుండగా.

వ. కనుంగొను జనంబులు. 310

ప్రతిపదార్థం: కనుంగొను= చూస్తున్న; జనంబులు= జనులు;

తాత్పర్యం: చూస్తున్న జనులు (ఇట్లా అనుకొన్నారు.)

క. ' చండవిరోధితిమిరమా । ర్తాండు లనఁగఁదగినవీరు దమలో ని ట్లు
ద్దండతఁ బెనఁగుట ధృతరా । ష్ట్రుండవినయలోభముష్కరుం డగుటఁ జుమీ!' 311

ప్రతిపదార్థం: చండ+విరోధి+తిమిర+మార్తాండులు= కోపంతో విజృంభించే శత్రువులు అనే చీకటిని పోగొట్టే సూర్యులు; అనఁగన్+తగిన= అని చెప్పదగిన; వీరు= వీరలు; తమలోన్= ఒకరితో ఒకరు; ఇట్లు; ఉద్దండతన్= ఘోరంగా; పెనఁగుట= విడువకుండా పోరాటం కొనసాగించటం; ధృతరాష్ట్రుండు; అవినయ లోభ ముష్కరుండు+అగుటన్ చుమీ!= గర్వంతో, దురాశతో కూడిన మూఢుడు, చెడ్డవాడు కావటంచేత సుమా!

తాత్పర్యం: విజృంభించే విరోధులనే చీకటిని పారద్రోలే సూర్యులనదగిన వీరిద్దరూ ఈ విధంగా ఘోరంగా పోరాడటం ధృతరాష్ట్రుడు గర్వంతో దురాశతో కూడిన మూఢుడు కావడం చేతనే సుమా!

వ. అని రట్టియెడ. 312

ప్రతిపదార్థం: అనిరి= అన్నారు; అట్టి+ఎడన్= ఆ సమయంలో.

తాత్పర్యం: ఆ సమయంలో.

క. కురుపతికిఁ జిత్రసేనుఁడుఁ । బురుమిత్రుఁడు వేల్పుటేటి పుత్రుఁడుఁ బ్రా పై
యురవడిఁ దఱిమిన వారికి । నరనందనుఁ డెదురుపడె గుణధ్వని సెలఁగన్. 313

ప్రతిపదార్థం: కురుపతికిన్= దుర్యోధనునకు; చిత్రసేనుఁడున్+పురుమిత్రుఁడున్= చిత్రసేనుడు మరియు పురుమిత్రుడు; వేల్పు+ఏటి+పుత్రుఁడున్= మందాకినీ సుతుడు(భీష్ముడు); ప్రాపు+ఐ= తోడై; ఉరవడిన్= మిక్కుటమగు వేగంతో; తఱిమినన్= తోలగా; వారికిన్= వారికి; నర+నందనుఁడు= అర్జునుడి కొడుకు(అభిమన్యుడు); గుణ+ధ్వని= అల్లెత్రాటి మ్రోత; చెలఁగన్= ఒప్పగా; ఎదురుపడెన్= మార్కొన్నాడు.

తాత్పర్యం: దుర్యోధనుడికి చిత్రసేనుడు - పురుమిత్రుడు భీష్ముడు తోడుపడ్డాడు. వారు మిక్కిలి వేగంతో, సేనలను తరిమికొట్టగా, వారిని అర్జునకుమారుఁడు అభిమన్యుడు తన వింటి నారిని మ్రోగిస్తూ ఎదుర్కొన్నాడు.

క. పురుమిత్రుని నే డుజ్జ్వల । శరముల గంగాతనూజు సప్తతి బాణ
స్ఫురణమునఁ జిత్రసేనునిఁ । బరమాంబకదశకమున విపాటితుఁ జేసెన్. **314**

ప్రతిపదార్థం: పురుమిత్రునిన్; ఏడు+ఉజ్జ్వల+శరములన్= ఏడు వాడిబాణాలతో; గంగాతనూజున్= భీష్ముడిని; సప్తతి,బాణ,స్ఫురణమునన్= డెబ్బది బాణాల తాకిడితో; చిత్రసేనునిన్; పరమ+అంబక+దశకమునన్= పదిగొప్ప బాణాలతో; విపాటితున్+చేసెన్= నొవ్వ చేశాడు.

తాత్పర్యం: ఏడు బాణాలతో పురుమిత్రుడిని, డెబ్భై అమ్ములతో భీష్ముడిని, పది వాడి బాణాలతో చిత్రసేనుడిని అభిమన్యుడు బాధించాడు.

తే. ఎన్ని శరముల నభిమన్యుఁ డేసెఁ దమ్ముఁ । దారు నన్నియు శరములఁ దఱిమి చిత్ర
సేనపురుమిత్రు లతని నేసిరి నవోగ్ర । విశిఖములు నాటె భీష్ము డవ్వీరు మేన. **315**

ప్రతిపదార్థం: తమ్మున్= తమను; అభిమన్యుఁడు= అభిమన్యుడు; ఎన్ని+శరములన్= ఎన్నిబాణాలతో; ఏసెన్= కొట్టాడో; తారున్= తాముకూడ; అన్నియు+శరములన్= అన్ని అమ్ములతో; చిత్రసేన, పురుమిత్రులు= చిత్రసేనుడు, పురుమిత్రుడును, అతనిన్= అతనిని, అభిమన్యుని; తఱిమి= ఎదుర్కొని; ఏసిరి= కొట్టారు; భీష్ముఁడు; ఆ+వీరు+మేనన్= ఆ వీరుని శరీరంపై; నవ+ఉగ్ర+విశిఖములు= భయంకరమైన తొమ్మిది బాణాలు; నాటెన్= గ్రుచ్చుకొనేటట్లు ప్రయోగించాడు.

తాత్పర్యం: తమను ఎన్ని బాణాలతో కొట్టాడో, అన్ని బాణాలతో చిత్రసేనుడు, పురుమిత్రుడు అభిమన్యుడిని ఎదుర్కొన్నారు. భయంకరములైన తొమ్మిది అమ్ములు బీష్ముడు అభిమన్యుడిపై ప్రయోగించాడు.

ఉ. ఆతఁడు చిత్రసేనుని శరాసన మేడ్తెఱఁ ద్రుంచి ఘోటక
వ్రాతము నొంచి మైమఱువు వ్రచ్చి శరంబులు మేనఁ గ్రుచ్చి యు
ద్యోతితుఁ డైనఁ జూచి కర ముద్ధతి రాజతనూజవర్గముల్
వే తఱియంగఁ జొచ్చి పొదివెం బటుమార్గణవృష్టి నాతనిన్. **316**

ప్రతిపదార్థం: ఆతఁడు= అభిమన్యుడు; చిత్రసేనుని+శరాసనము= చిత్రసేనుని విల్లు; ఏడ్తెఱన్= పరాక్రమంతో; త్రుంచి= ఖండించి; ఘోటక+వ్రాతమున్= గుర్రాల సముదాయాన్ని; నొంచి= నొవ్వచేసి; మైమఱువు= కవచం; వ్రచ్చి= తూట్లుపడునట్లుగా చేసి; శరంబులు= బాణాలు; మేనన్= శరీరంలో; గ్రుచ్చి= నాటి; ఉద్యోతితుఁడు+ఐనన్= ప్రకాశించుచుండగా; చూచి; కరము= మిక్కిలి; ఉద్ధతిన్= ఉరవడితో; రాజ తనూజ వర్గముల్= రాజపుత్రుల సముదాయం (చిత్రసేనుడు మున్నగు వారు); వే+తఱియంగన్+చొచ్చి= వేగంగా సమీపించి; ఆతనిన్= అభిమన్యుడిని; పటుమార్గణ+వృష్టిన్= గొప్ప అమ్ముల వానతో; పొదివెన్= ముట్టడించాయి.

తాత్పర్యం: అభిమన్యుడు - చిత్రసేనుడి ధనుస్సు వేగంగా ఖండించి, తేరు గుర్రాలను నొప్పించి, అతడి కవచాన్ని తూట్లు పడేటట్లుగా చేసి, శరీరాన్ని గాయపరచి ప్రకాశించటం చూచి, మిక్కిలి భయంకరంగా ఇతర రాజపుత్రులు వేగంగా సమీపించి, గొప్ప అమ్ముల వాన అతడిపై కురిపించారు.

క. ఆ సౌభద్రుం డుగ్రపు । వేసవి దావాగ్ని శుష్కవిపినమ్ము నిరా
యాసంబుగ దరికొనుగతి । భాసితశరశిఖలు వారిపైఁ బరగించెన్. 317

ప్రతిపదార్థం: ఆ+సౌభద్రుండు= ఆ అభిమన్యుడు(సుభద్రకొడుకు); ఉగ్రపు+వేసవి+దావాగ్ని= మండువేసవిలోని కార్చిచ్చు; శుష్క+విపినమ్మున్= ఎండిపోయిన అడవిని; నిస్+ఆయాసంబుగన్= ఆయాసం లేకుండా (సులువుగా); దరికొను గతిన్= కాల్చేటట్లుగా; భాసిత శర శిఖలు= ప్రకాశించే అమ్ములు అనే అగ్నిజ్వాలలు; వారిపై= చిత్రసేనుడు మున్నగు రాజకుమారులపై; పరగించెన్= వ్యాపింప జేశాడు.

తాత్పర్యం: ఆ అభిమన్యుడు మండు వేసవి కార్చిచ్చు ఎండిపోయిన అడవిని సులువుగా క్రమ్ముకొని కాల్చేటట్లుగా, ప్రకాశమానములు అయిన బాణాగ్ని జ్వాలలు ఆ కౌరవరాజ పుత్రులపై వ్యాపింప జేశాడు.

క. రంగత్ప్రథనస్తుత్య తు । రంగముఁ దై తాండవాభిరతుఁ డగు హరులీ
లం గడఁగి వీరనృత్యము । సంగరరంగమునఁ జేసె శత్రులు మెచ్చన్. 318

ప్రతిపదార్థం: రంగత్+ప్రథన+స్తుత్య+తురంగముఁడు+ఐ= ప్రకాశించే యుద్ధంలో పొగడదగిన గుర్రాలు కలవాడై; తాండవ+అభిరతుఁడు+అగు= నృత్యమందు ఇష్టం గలవాడైన; హరులీలన్= శివునివలె; కడఁగి= పూని; వీర+నృత్యము= పరాక్రమంతో కూడిన నాట్యం; శత్రులు+మెచ్చన్= శత్రువులు మెచ్చేటట్లుగా; చేసెన్= చేశాడు.

తాత్పర్యం: యుద్ధభూమిలో అందరూ పొగడే ప్రకాశమానములు అయిన గుర్రాలు గల అభిమన్యుడు నాట్యకేళీలోలుడు అయిన శివుడి వలె విజృంభించి శత్రువులు మెచ్చునట్టుగా సంగరరంగంలో పరాక్రమంతో కూడిన నృత్యం చేశాడు.

వ. ఇట్లు పేర్చి కురుబలంబు నేర్చు నభిమన్యుఁ జూచి జనితమన్యుండై శుభలక్షణుండగు లక్ష్మణుండు. 319

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; పేర్చి= విజృంభించి; కురు+బలంబున్= కౌరవసేనను; ఏర్చు= దహించే; అభిమన్యున్+చూచి= అభిమన్యుని చూచి; జనిత+మన్యుండు+ఐ= పుట్టిన రోషం కలవాడై; శుభ+లక్షణుండు= మంగళప్రదమైన లక్షణాలు కలవాడగు; లక్ష్మణుండు= లక్ష్మణకుమారుడు.

తాత్పర్యం: ఈ విధంగా విజృంభిస్తూ, కౌరవసేనను బాధిస్తున్న అభిమన్యుడిని చూచి, రోషంతో శుభలక్షణములు గల లక్ష్మణకుమారుడు (తరువాతి పద్యంతో అన్వయం).

అభిమన్యు లక్ష్మణకుమారుల యుద్ధము (సం. 6-69-30)

క. తలపడి నానాస్త్రము ల । గ్గలికం గురియుటయు నతఁడు కాండము లా టి
ట్టలమైన యలుక నాతని । లలితోరస్ స్థలమునం గలయ నాటించెన్. 320

ప్రతిపదార్థం: తలపడి= మార్కొని; నానా+అస్త్రములు= పెక్కు మంత్రబాణాలు; అగ్గలికన్= ఉత్సాహంతో; కురియుటయున్= వర్షించగా; అతఁడు= అభిమన్యుడు; కాండములు+ఆఱు= ఆరు బాణాలు; ఇట్టలము+అయిన= గొప్పదైన; అలుకన్= కోపంతో; ఆతని= లక్ష్మణ కుమారుని యొక్క; లలిత+ ఉరస్+స్థలమునన్= కోమలమైన వక్షమునందు; కలయన్= వ్యాపించేటట్లుగా; నాటించెన్= గ్రుచ్చుకొనేటట్లు చేశాడు.

తాత్పర్యం: లక్ష్మణకుమారుడు అభిమన్యుని మార్మ్కొని పెక్కు మంత్ర బాణాలను ఉత్సాహంతో వర్షించాడు. అభిమన్యుడు - ఆరుబాణాలను అతిశయించిన కోపంతో లక్ష్మణకుమారుని కోమలమైన ఉరమును నాటునట్లుగా ప్రయోగించాడు.

చ. తెరలక లక్ష్మణుండు దృఢదీప్తశరావలి పార్థుపట్టిపైఁ
దొరఁగఁగఁజేసినం గినిసి తొల్త హయంబులఁ జంపి సారథిన్
ధరఁ బడ నాతఁ డేసె విరథత్వము నొందియు నీదు మన్మ డు
ద్ధురగతి శక్తి వైవ నది ద్రుంచె మహేంద్రునిమన్మ డమ్ములన్. 321

ప్రతిపదార్థం: తెరలక= మరలక; లక్ష్మణుండు= లక్ష్మణకుమారుడు; పార్థ+పట్టిపైన్= అర్జునుడి పుత్రుడిపై(అభిమన్యుడిపై); దృఢ+దీప్త+శర+ఆవలి= గట్టివి ప్రకాశించునట్టివి అయిన అమ్ముల గుంపులు; తొరఁగఁగన్+ చేసినన్= తాకునట్లు చేయగా; కినిసి= కోపగించి; తొల్తన్= ముందుగ; హయంబులన్+చంపి= గుర్రాలను సంహరించి; సారథిన్; ధరన్+పడన్= భూమిమీద పడునట్లు; ఆతఁడు= అభిమన్యుడు; ఏసెన్= బాణాలు ప్రయోగించాడు; విరథత్వమున్+ఒందియున్= రథము లేకపోయినప్పటికీ; నీదు+మన్మఁడు= నీ పౌత్రుడు(లక్ష్మణకుమారుడు); ఉద్ధురగతిన్= వేగముగా; శక్తి= శక్తి అనే ఆయుధాన్ని; వైవన్= వేయగా; అది= ఆ శక్తిని; మహేంద్రుని+మన్మఁడు= దేవేంద్రుని పౌత్రుడు(అభిమన్యుడు); అమ్ములన్= బాణాలతో; త్రుంచెన్= ఖండించాడు.

తాత్పర్యం: లక్ష్మణకుమారుడు - వెనుకంజ వేయక, అర్జునకుమారుడైన అభిమన్యుడిపై గట్టివాడిబాణాలు వేశాడు. అభిమన్యుడు ఆగ్రహంతో లక్ష్మణకుమారుడి గుర్రాలను మొదట సంహరించి తదుపరి సారథిని కూల్చివేశాడు. నీ మనుమడు లక్ష్మణకుమారుడు విరథుడైకూడా జంకక, 'శక్తి' ని అభిమన్యుడిపై విసిరాడు. ఆ శక్తిని దేవేంద్రపౌత్రుడైన అభిమన్యుడు తన బాణాలతో ఖండించాడు.

ఆ. శక్తిఁ ద్రుంచి తీవ్రసాయక హతదేహుఁ । జేయఁ దొడఁగు నతని చేతి బలుపు
సూచి కృపుఁడు రాజసుతుఁ దన తేరిపై । నిడి తొలంగఁ దెచ్చె నెల్లఁ జూడ. 322

ప్రతిపదార్థం: శక్తిన్+త్రుంచి= శక్తి అనే ఆయుధాన్ని ఖండించి; (లక్ష్మణకుమారుడిని-అభిమన్యుడు); తీవ్ర+సాయకహత+దేహున్+చేయన్+తొడంగు= తీవ్రమైన శరాలతో కొట్టబడిన శరీరం గలవానిగా చేయటం మొదలు పెట్టిన; అతని చేతి బలుపు+చూచి= ఆ అభిమన్యుడి చేతిబలం చూచి; కృపుఁడు= కృపాచార్యుడు; రాజసుతున్= రాజపుత్రుని (లక్ష్మణ కుమారుని); ఎల్లన్+చూడన్= అందరూ చూస్తూ ఉండగా; తొలంగన్+తెచ్చెన్= అక్కడనుండి తప్పించి తెచ్చాడు.

తాత్పర్యం: శక్తిని ఖండించి, లక్ష్మణకుమారుని దేహం తూట్లు పడేటట్లుగా అభిమన్యుడు అమ్ములు గుప్పాడు. అభిమన్యుడి చేతి బలం కౌశలం చూచి, కృపుడు రాజకుమారుడైన లక్ష్మణకుమారుని తన రథం మీదికి ఎక్కించుకొని, ఆ స్థలం నుండి తప్పించి తెచ్చాడు.

విశేషం: ఎల్లఁజూడ - ఎల్ల అనునది సర్వశబ్ద అమహద్రూపము. ఇక్కడ అందఱు అనే అర్థంలో మహద్బహువచనరూపం సముచితం. ఎల్లరు - అని. ఇక్కడ 'నృపుఁడు చూడ' అనే పాఠాంతరం ఉన్నది. అది లెస్స.

క. కురురాజు యోధవీరులఁ । బురికొలుపుచు భీష్ముఁ డపుడు పోరికి నడరం
గరిహయనరశరనిబిడత । ధరణి జలదనిబిడగగనతలముం బోలెన్. 323

ప్రతిపదార్థం: కురురాజు యోధ వీరులన్= కౌరవరాజు యొక్క సేనలో యుద్ధం చేసే శూరులను; పురికొలుపుచున్= ప్రోత్సహిస్తూ; భీష్ముఁడు= భీష్ముడు; పోరికిన్= యుద్ధానికి; అడరన్= విజృంభింపగా; కరి, హయ, నర, శవ నిబిడతన్= ఏనుగులయొక్క, గుర్రాలయొక్క, మనుష్యులయొక్క కళేబరాల సాంద్రతచేత; ధరణి= (యుద్ధ) భూమి; జలదనిబిడ గగనతలమున్= మబ్బులతో దట్టంగా నిండిన ఆకాశ ప్రదేశమును; పోలెన్= అనుకరించింది.

తాత్పర్యం: కౌరవసేనలోని యోధవీరులను ప్రోత్సహిస్తూ భీష్ముడు అపుడు పోరాటంలో విజృంభింపగా, ఏనుగుల గుర్రాల, మనుష్యుల పీనుగులతో దట్టమైన నేల మబ్బులతో దట్టంగా కన్పించే ఆకాశంవలె అగుపడింది.

విశేషం: అలం: ఉపమ.

ఉ. సాత్యకి యప్పు డేచి శరజాలము చిత్రలఘుస్ఫుటత్వ సాం
గత్య విరాజమానముగఁ గౌరవసేనఁ గలంగఁ జేసి యౌ
ద్ధత్యమునం దనర్చిన నుదాత్తమనస్కుఁడు సౌమదత్తి యా
హుత్యభిరామవహ్ని క్రియ నుజ్జ్వలుఁ డై వెసఁ దాఁకె నాతనిన్. 324

ప్రతిపదార్థం: అప్పుడు; సాత్యకి; ఏచి= విజృంభించి; శర+జాలము= అమ్ముల సముదాయం; చిత్ర లఘు స్ఫుటత్వ సాంగత్య విరాజమానముగన్= అచ్చెరువుగ, తేలికగా, లక్ష్యశుద్ధితో వెలుగొందునట్లుగా; కౌరవ+సేనన్= కౌరవసేనను; కలంగన్+చేసి= కలతనొందునట్లు చేసి; ఔద్ధత్యమునన్+తనర్చినన్= గర్వముతో విజృంభించగా; ఉదాత్త+మనస్కుఁడు= గొప్ప మనస్సు కలవాడు; సౌమదత్తి= భూరిశ్రవసుడు; ఆహుతి+అభిరామ వహ్నిక్రియన్= హోమంలో ఆహుతి వేయగా అందగించిన అగ్నివలె; ఉజ్జ్వలుఁడు+ఐ= ఎక్కువగా మండినవాడై= మిక్కుటముగా ప్రకాశించినవాడై; ఆతనిన్= సాత్యకిని; వెసన్= వేగంగా; తాఁకెన్= మార్కొన్నాడు.

తాత్పర్యం: అప్పుడు సాత్యకి విజృంభించి బాణసముదాయాన్ని కౌరవసేనపై గుప్పించాడు. అతని బాణప్రయోగ విన్యాసం - ఆశ్చర్యకరం. లక్ష్యములను సులువుగా స్ఫుటంగా తాకి, కౌరవసేనను కలచివేశాయి. గొప్ప మనస్సుగల భూరిశ్రవసుడు కూడా ఆహుతి వేల్చబడిన అగ్నివలె మిక్కుటంగా జ్వలించి, సాత్యకిని మార్కొన్నాడు.

విశేషం: 1. ఆహుతి లేసినపుడు అగ్ని ప్రజ్వలిస్తుంది. అదే విధంగా సాత్యకి వేసిన బాణాలు - భూరిశ్రవసుడిని ప్రజ్వలింపచేశాయి. ఇక్కడ 'క్రియ' ఉపమావాచకం. ఆ అర్థం తెలుగులోనే ఉన్నది. అందుచే 'హ్ని' గురువు కాదు.

చ. తలపడి యంత్య కాల శిఖిదారుణభంగి నమేయమార్గణా
ర్చులు వరగించుడున్ భయము సొచ్చి జనార్దనుతమ్ముతోడి యో
ధులు పిఱుసన్నఁ దత్సుతులు దోర్బలదుర్దములై పదుంద్రు న
గ్గలి నెదిర్చి యి ట్లనిరి కౌరవసత్తముతో నుదగ్రతన్. 325

ప్రతిపదార్థం: తలపడి= ఎదుర్కొని; అంత్య కాల శిఖి దారుణ భంగిన్= ప్రళయకాలమునందలి అగ్నివలె భయంకరంగా; అమేయ+మార్గణ+అర్చులు= అపరిమిత బాణాల జ్వాలలు; పరగించుడున్= వ్యాపింప చేయగా; జనార్దనుతమ్ముతోడి యోధులు= సాత్యకి సహచరులైన వీరులు; భయము+చొచ్చి= వెరచి; పిఱు+సన్నన్; వెనుకకు మరలిపోగా; తద్+సుతులు= ఆతని కొడుకులు; దోర్బల+దుర్దములు+ఐ= అడ్డగింప లేని పరాక్రమం కలవారలై; పదుంద్రు= పదిమంది; అగ్గలికన్+ఎదిర్చి= ఉత్సాహంతో మార్కొని; కౌరవ+సత్తముతోన్= కురు వీరులలోని శ్రేష్ఠుడితో- భూరిశ్రవుడితో; ఉదగ్రతన్= గర్వంతో; ఇట్లు+అనిరి= ఈ విధంగా చెప్పారు.

తాత్పర్యం: భూరిశ్రవసుడు - ప్రళయకాలమందలి అగ్నివలె విజృంభించి, అమ్ములనే అగ్నిజ్వాలలు ప్రవర్తిల్లచేయగా భయపడి, సాత్యకితో పాటు యుద్ధం చేస్తున్న యోధులు వెనుకకు మరలారు. అప్పుడు సాత్యకి కొడుకులు పదిమంది - వారింపరాని పరాక్రమంతో ఉత్సహించి, కౌరవశ్రేష్ముడైన భూరిశ్రవసుడితో గర్వంగా ఇట్లు అన్నారు:

క. ' భూరిశ్రవసుఁడ! యెక్కటి వీర । వినోదంబు సలుపు వేడుకమెయి దు
ర్వారత వచ్చితి మొక్కరుఁ గోరి । కొనుము సంగరమునకున్ మాలోనన్.' 326

ప్రతిపదార్థం: భూరిశ్రవసుఁడ!= ఓ భూరి శ్రవసుడా!; ఎక్కటి+వీర+వినోదంబు= ఏకాంతయుద్ధమును ప్రీతితో; సలుపు+వేడుక+మెయిన్= చేయాలనే ఉత్సాహంతో; దుర్వారతన్= అడ్డగించటానికి వీలులేని విధంగా; వచ్చితిమి= అరుదెంచాము; మాలోనన్= మా పదిమందిలో; ఒక్కరున్= ఒకడిని; సంగరమునకున్= యుద్ధానికి; కోరుకొనుము= ఎన్నుకో.

తాత్పర్యం: 'ఓ భూరిశ్రవసుడా! మేము 'ఎక్కటికయ్యం' చేయాలనే సరదాతో వచ్చాము. ఎవరూ మమ్ము అడ్డగించలేరు. మాలో ఎవరో ఒకరిని నీవు ఎన్నుకొని యుద్ధం చేయవచ్చు.'

విశేషం: ఎక్కటి కయ్యము= ద్వంద్వ యుద్ధం. ఒక వీరుడు - మరొక వీరుడితో చేసే ఏకాంత యుద్ధం. వారిరువురి మధ్య జరిగే పోరాటంలో ఇతరులు పాల్గొనరు. ఇది మహాభారత కాలంనాటి వీరమర్యాద.

చ. ' అన విని నవ్వి యొక్కఁడు మదస్త్రబలంబున కోర్వఁ డోపినన్
సునిశిత బాణముల్ వఱపి సూరెల నందఱు నొక్కపెట్ట యే
పు నెఱపుఁడన్న నా రథికపుంగవు లేయ నతండు నమ్ము లె
ల్లను దునుమాడి వారిఁ జటులస్ఫురితాంబక వృష్టి ముంచినన్. 327

ప్రతిపదార్థం: అనన్+విని+నవ్వి= అని చెప్పగా ఆలకించి, నవ్వి; ఒక్కఁడు= ఒకడు; మత్+అస్త్ర+బలంబునకున్= నాయొక్క మంత్రబాణశక్తికి; ఓర్వఁడు= సరిపోడు; ఓపినన్= మీకు చేతనైతే; సునిశిత+బాణముల్= మిక్కిలి వాడిఅమ్ములు; పఱపి= ప్రయోగించి; సూరెలన్= ప్రక్కల; అందఱున్= అందరును; ఒక్క+పెట్టన్= ఒకేసారి; ఏపు నెఱపుఁడు+అన్నన్= మీ విజృంభణ చూపుడు అని చెప్పగా; ఆ రథిక పుంగవులు= ఆ వీరవరులు; ఏయన్= బాణాలతో కొట్టగా; అతండు= ఆ భూరిశ్రవసుడు; అమ్ములు+ఎల్లను= ఆ బాణాలను అన్నింటినీ; తునుమాడి= త్రుంచి; వారిన్= వారిని; చటుల+స్ఫురిత+అంబక వృష్టిన్= గాఢత ప్రకటించే అమ్ముల వానలో; ముంచినన్= ముంచగా.

తాత్పర్యం: అని చెప్పగా విని భూరిశ్రవసుడు నవ్వి ఈ రీతిగా అన్నాడు. 'మీలో ఏ ఒక్కరుగాని నా బాణధాటికి ఆగలేరు. మీకు చేతనైతే - మీరందరూ నా చుట్టుప్రక్కల చేరి - నా మీద వాడి బాణాలు ప్రయోగించి పోరాడండి.' అనగా వారు కౌరవ శ్రేష్ముడైన భూరిశ్రవసుడిపై బాణాలు ప్రయోగించారు. భూరిశ్రవసుడు వారి బాణాలను ఖండించి వారినందరిని అమ్ముల వానలో ముంచాడు.

క. పాలి వోని శౌర్య రేఖం । జెలఁగుచు వార్ష్ణేయు లతనిఁ జేడ్పడఁ బెక్క
మ్ముల నొవ్వ వేసినం గడు । నలిగి శరాసనము లెల్ల నాతఁడు ద్రుంచెన్. 328

ప్రతిపదార్థం: పాలివోని= మొక్కవోవని (పాలి+పోని); శౌర్య+రేఖన్+చెలఁగుచున్= పరాక్రమ స్ఫూర్తితో ఒప్పుతూ; వార్ష్ణేయులు= వృష్ణివంశానికి చెందిన వారు(సాత్యకి కొడుకులు); అతనిన్= భూరిశ్రవుని; చేడ్పడన్= నొచ్చునట్లుగా; పెక్కు+అమ్ములన్=

బహుబాణాలతో; నొవ్వన్+ఏసినన్= కలత చెందింపగా; ఆతఁడు= భూరి శ్రవసుడు; కడున్+అలిగి= మిక్కిలి కోపించి; శరాసనములు+ఎల్లన్= (వారి); ధనుస్సులను అన్నింటినీ; త్రుంచెన్= ఖండించాడు.

తాత్పర్యం: వృష్ణి వంశీయులు - సాత్యకి కొడుకులు మొక్కవోని పరాక్రమంతో శోభిల్లుతూ, కురువీరుడు భూరిశ్రవసుడిపై పెక్కు బాణాలు వర్షించారు. భూరిశ్రవుడు మిక్కుటమైన కోపంతో వారి ధనువులు అన్నింటినీ ఖండించాడు.

క. కోదండదశకశీఘ్రు । చ్ఛేదం బొనరించి యపుడ శిరములు పదియున్
భూదేవికి బలిగా ని । ష్పాదించెన్ గౌరవేంద్రుబలములు సెలఁగన్. 329

ప్రతిపదార్థం: కోదండ దశక శీఘ్ర+ఛేదంబు+ఒనరించి= వేగంగా పది ధనుస్సులు ఖండించి; అపుడు+అ= అప్పుడే; శిరములు+పదియున్= పది తలకాయలు; భూదేవికిన్= నేలతల్లికి; బలిగాన్= పూజార్పణంగా; కౌరవ+ఇంద్రు+బలములు= కురురాజుసేనలు; చెలఁగన్= శోభిల్లగా; నిష్పాదించెన్= సిద్ధింపజేశాడు.

తాత్పర్యం: పది ధనుస్సులను ఖండించి వెనువెంటనే పదితలకాయలు ఖండించి భూరి శ్రవసుడు - భూదేవికి 'బలి'గా సమర్పించాడు. కౌరవ సేనలు ఉప్పొంగిపోయాయి.

విశేషం: 'బలి' దేవతల ప్రీతి కోసం - సమర్పించే కానుక. మొదట పూజా విశేషంగా ఆరంభించిన 'బలి' ప్రదానం 'జంతుబలిగా' 'నరబలి'గా కూడా యుగయుగాంతరాలలో పరిణమించింది.

వ. ఇట్లు వడిన కొడుకులం గని వృష్ణివీరుండు. 330

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; పడిన= కూలినట్టి; కొడుకులన్= పుత్రులను; కని= చూచి; వృష్ణి+వీరుండు= వృష్ణిజాతికి చెందిన వీరుడు= సాత్యకి.

తాత్పర్యం: ఈ విధంగా నేలకూలిన కొడుకులను సాత్యకి చూచి. (తరువాతి పద్యంతో అన్వయం.)

చ. వగపును గోపముం గదుర వైరిబలంబు దలంకఁ దేరు పై
నొగనొగ దాఁకఁగాఁ బఱపి నుగ్గుగఁ గౌరవసూతు నేసి బె
ట్టుగఁ దురగంబులం దునుముడున్ వెస నాతఁడు నట్ల చేసెఁ బా
టిగఁ గరవాలముల్ గొని వడిన్ దిగి నేలకు దాఁటి రిద్దఱున్. 331

ప్రతిపదార్థం: వగపును= దుఃఖమూ, కోపమున్= ఆగ్రహమూ; కదురన్= కూడగా; వైరి బలంబు= శత్రుసేన; తలంకన్= కలత చెందగా; తేరుపైన్= రథంపై; నొగ+నొగ+తాఁకగాన్= కూబరములు ఒకదానితోనొకటి రాపిడి చెందగా(తన రథమును శత్రు రథముతో ఒరయునట్లుగా); పైన్= మీదికి; పఱపి= తోలి; కౌరవ+సూతున్= కౌరవుని సూతుని (భూరిశ్రవసుడి సారథిని); నుగ్గుగన్+ఏసి= చిన్ని ఖండాలుగా చేసి - సంహరించి; బెట్టుగన్= అధికముగా; తురగంబులన్= గుర్రాలను; తునుముడున్= సంహరించగానే; వెసన్= వేగంగా; ఆతఁడున్= భూరిశ్రవుడుగూడ; అట్ల+అ= అదే విధంగా; పాటిగన్= సరిగా; చేసెన్= చేశాడు; కరవాలముల్+కొని= కత్తులు పట్టి; వడిన్= వేగంగా; నేలకున్ దిగి= భూమిపైకి దిగి; ఇద్దఱున్= ఇరువురును; దాఁటిరి= లంఘించారు.

తాత్పర్యం: కోపమూ, దుఃఖమూ పిరిగొనగా, శత్రుసేన కలత చెందగా, భూరిశ్రవసుడి పైకి రథం తోలించాడు సాత్యకి. రెండు రథాలూ ఒక దానితో మరొకటి ఢీకొన్నాయి. సాత్యకి భూరిశ్రవసుడి సారథిని, గుర్రాలను

సంహరించాడు. భూరిశ్రవుడుగూడా అట్లాగే చేశాడు. ఇద్దరూ విరథులై నేలకు లంఘించి కత్తులు దూసి ఒకరినొకరు మార్కొన్నారు.

వ. అట్టి సమయంబున. 332

ప్రతిపదార్థం: అట్టి+సమయంబునన్= అట్టి తరుణంలో.

తాత్పర్యం: ఆ సమయంలో.

ఆ. వేగ మెయిది వృష్ణివీరు భీముఁడు గురు । వీరుఁ గురువిభుండు గారవమున
వెనుకఁ జనఁగఁ దివిచి తనతన రథముపైఁ । బెట్టికొనుచుఁ దొలఁగఁ బ్రీతిఁ జనిరి. 333

ప్రతిపదార్థం: వేగము+ఎయిది= వేగం పుంజుకొని; వృష్ణి+వీరున్= సాత్యకిని; భీముఁడు; కురు+వీరున్= భూరిశ్రవసుని; కురు+విభుండు= దుర్యోధనుడు; గారవమునన్= గౌరవంగా; వెనుకన్+చనఁగన్+తివిచి= వెనుకకు చేర్చి మరలించి; తన+తన+ రథముపైన్+పెట్టికొనుచున్= తమ తమ రథాలపైకి ఎక్కించుకొని; తొలఁగన్= ఆచోటు తప్పించి; ప్రీతిన్= సంతోషంతో; చనిరి= వెళ్ళారు.

తాత్పర్యం: సాత్యకి, భూరిశ్రవసుడు - ఇరువురును విరథులై కత్తులతో నిలబడగా, భీముడు వచ్చి సాత్యకిని తన రథం మీదికి ఎక్కించుకొని పోయాడు. అట్లే భూరిశ్రవసుడిని కురురాజైన దుర్యోధనుడు గౌరవంగా తనరథం మీదికి ఎక్కించుకొన్నాడు. అందరూ సంతోషంగా వెళ్ళారు.

వ. అంత. 334

ప్రతిపదార్థం: అంతన్= అప్పుడు.

తాత్పర్యం: అప్పుడు.

క. ' అపరాహ్ణసంగతుండగు । తపనుంగని పొద్దు గ్రుంకెఁ దడ వేఁగుదు రీ
రిపు లని కడంగి నరుఁ డ । స్త్ర పరంపర వఱపి నీదు రథికుల నెల్లన్. 335

ప్రతిపదార్థం: అపర+అహ్ణ+సంగతుండు+అగు= సాయం సంధ్యతో కూడినవాడగు; తపనున్+కని= సూర్యుడిని చూచి; ప్రొద్దు+క్రుంకెన్= సూర్యుడు అస్తమించుతున్నాడు; రిపులు= ఈ శత్రువులు; తడవు+ఏఁగుదురు= వ్యవధి చూచుకొని వెళ్ళిపోతారు; అని= అని యోచించి; కడఁగి= పూని; నరుఁడు= అర్జునుడు; అస్త్ర+పరంపర+పఱపి= మంత్రబాణాలను ప్రయోగించి; నీదు+రథికులను+ఎల్లన్= తేరెక్కి పోరాడే నీ వీరులను అందరనూ.

తాత్పర్యం: 'మలిసంజలో కలిసే సూర్యుణ్ణి చూచి ప్రొద్దు గ్రుంకుతున్నది. ఈ శత్రువులు యుద్ధం విడిచి శిబిరాలకు వెళ్ళి పోతారు- అనుకొని పూని అర్జునుడు నీ రథికులందరిపై మంత్ర బాణాలు ప్రయోగించి. (తరువాతి గద్యంతో అన్వయం.)

వ. నిహతులం జేయుచు విహరించుచున్నం గనుంగొని. 336

ప్రతిపదార్థం: నిహతులన్+చేయుచున్= చంపుతూ; విహరించుచున్నన్+కనుంగొని= వినోదంగా తిరుగుచుండటం చూచి.

తాత్పర్యం: అర్జునుడు కౌరవ సైనికులను సంహరించటం చూచి.

క. సైరింపక యేడ్తెఱఁ గురు । వీరాగ్రణి యిరువదేనువేల రథంబుల్
పోరికిఁ బురికొలిపిన వి । స్ఫారగతిం గూడి కవిసెఁ బార్థునిమీఁదన్. 337

ప్రతిపదార్థం: సైరింపక=తాళజాలక; ఏడ్తెఱన్= పరాక్రమంతో; కురు+వీర+అగ్రణి= కౌరవవీరులలో మొదటివాడు (భీష్ముడు);ఇరువది+ఏను+వేల+ రథంబుల్= ఇరవై ఐదువేల రథాలను, రథికులగు వీరులను; పోరికిన్= యుద్ధానికి; పురికొల్పినన్= ప్రోత్సహించగా; విస్ఫారగతిన్= ఎక్కువగ విస్తరించి; కూడి= కలిసి; పార్థునిమీఁదన్= అర్జునునిపైన; కవిసెన్= మార్కొన్నాయి.

తాత్పర్యం: అర్జునుడు కౌరవసైనికులను సంహరించటం చూచి, సహింపలేక సేనాపతి భీష్ముడు - ఇరవై అయిదువేల రథాలను పోరాటానికి ప్రోత్సహించాడు. ఆ రథికులు కలిసి, విస్తారంగా వ్యాపించి అర్జునుడిని మార్కొన్నారు.

క. కడు వెసఁ గవిసినయవి గ । వ్వడి బాణజ్వాల లడర వడి దావాగ్నిన్
మిడుతలు వొలిసిన క్రియఁ బొడి । పొడి యయ్యెం గురుబలంబు పాం గడఁగంగన్. 338

ప్రతిపదార్థం: కడు+వెసన్= మిక్కుటము అగు వేగంతో; కవిసినయవి= మార్కొనినట్టివి (ఇరవై వేల రథాలు); కవ్వడి+బాణజ్వాలలు= అర్జునుడి అమ్ముల అగ్ని జ్వాలలు; అడరన్= విజృంభింపగా; వడిన్= వేగంగా; దావాగ్నిన్= కార్చిచ్చులో; మిడుతలు= శలభాలు; పొలిసిన+క్రియన్= చచ్చిపోయే రీతిగా; కురు బలంబు పొంగు+అడఁగంగన్= కౌరవ సేనయొక్క అతిశయం అణగారిపోయేటట్లుగా; పొడి+పొడి+అయ్యెన్= చూర్ణం చూర్ణం అయిపోయాయి.

తాత్పర్యం: వేగంగా ఆ ఇరువది అయిదువేల రథాలు మార్కొన్నాయి. కాని అవి అర్జునుని అమ్ములనే అగ్నిలో కార్చిచ్చులో బడి మరణించే శలభాలవలె మాడి పొడిపొడి అయ్యాయి. కౌరవసేన అతిశయం అణగారిపోయింది.

విశేషం: అలం: ఉపమ.

క. కిరణంబు లడఁగి యంతకు । నరుణత్వము మెఱయఁ దరణి యపరాద్రిశిర
స్స్ఫురణను నధికరణాలం । కరణం బొనరించుటయును గాంగేయుఁ డెదన్. 339

ప్రతిపదార్థం: కిరణంబులు+అడఁగి= వెలుగురేకలు తగ్గి; అంతకున్= అప్పటికీ; అరుణత్వము= ఎఱ్ఱదనం; మెఱయన్= ప్రకాశించటంచేత; తరణి= సూర్యుడు; అపర+అద్రిశిరస్+స్ఫురణను= పడమటి కొండనెత్తిపై ప్రకాశించటంచేత; అధికరణ+అలంకరణంబు+ ఒనరించుటయును= మిక్కుటమైన యుద్ధాలంకరణం చేకూర్చినట్లుండగా; గాంగేయుఁడు= భీష్ముడు; ఎదన్= తన హృదయంలో.

తాత్పర్యం: రశ్మి తగ్గి, అంతకుముందే ఎఱ్ఱదనం శోభిల్లగా, సూర్యుడు పడమట కొండ శిరస్సున మెరుస్తూ రక్తసిక్తమైన యుద్ధభూమికి మిక్కిలి అలంకారం చేకూర్చాడు. అది సాయంకాల సమయసూచకం. దానితో భీష్ముడు తన హృదయంలో ఈ విధంగా అనుకొన్నాడు.

విశేషం: అపరాద్రి శిరస్సును (ఎఱ్ఱనిపూలతో) శృంగారనాయకుడు అయిన సూర్యుడు అలంకరించినట్లుగా ఉందట.

క. 'శ్రాంతం బయ్యెను వాహన । సంతానం బెల్ల నిపుడు సంధ్యాసమయం
బింతట నేఁటికి నని సా । లింతము గా కింకఁ బోర లెస్సై యున్నే?' 340

ప్రతిపదార్థం: వాహన+సంతానంబు+ఎల్లన్= గుర్రాల సముదాయం అంతా; శ్రాంతంబు+అయ్యెను= బడలిపోయింది; ఇపుడు; సంధ్యాసమయంబు= సంజప్రొద్దు, సాయం సమయం; ఇంతటన్= ఈ మేరకు; నేఁటికిన్= ఈ దినమునకు;

అని= పోరాటం; చాలింతముగాక!= విరమించటం మంచిది; ఇంకన్= ఇకమీద; పోరన్= యుద్ధం చేయటం; లెస్స+ఐ+ఉన్నే?= మంచిది అవుతుందా?

తాత్పర్యం: 'వాహనాలు అన్నీ బడలిపోయాయి. సాయంకాలం అవుతోంది. ఇక యుద్ధం చేయటం ఎందుకు? విరమించటం మంచిది.'

విశేషం: వాహన సంతానంబు - గుర్రాల గుంపు - వాహనములు అంటే వహించేవి - మోసేవి. గుర్రములు.

వ. అని తలంచి కుంభసంభవాది యోధముఖ్యుల కెఱింగించి బలంబులఁ దివియ నియమించి. 341

ప్రతిపదార్థం: అని తలంచి= అని యోచించి; కుంభసంభవ+ఆది+యోధముఖ్యులకున్= ద్రోణుడు మున్నగు వీరులకు; ఎఱింగించి= తెలిపి; బలంబులన్= సేనలను; తివియన్+నియమించి= మరలింప ఆజ్ఞాపించి.

తాత్పర్యం: అని ఆలోచించి, ఆ విషయాన్ని ద్రోణాదులకు తెలిపి, సేనలను పోరు చాలింపజేయుటకు

క. సమరక్రీడన లీలం । దమక తమక తనిసి మరలి తమతమ యావా
సములకు నరిగి రుభయసై । న్యములజనంబులును దీవియలు వెలుఁగంగన్. 342

ప్రతిపదార్థం: సమర+క్రీడన్+అ= యుద్ధక్రీడయందే; లీలన్= విలాసంగా; తమక తమక= తమకుతామే; తనిసి= తృప్తిపొంది; మరలి= వెనుదిరిగి; తమ+తమ= ఆవాసములకున్= తమ తమ విడిదులకు; ఉభయసైన్యముల+జనంబులును= రెండు సేనలలోని భటులూ; దీవియలు= దివిటీలు(కాగడాలు); వెలుఁగంగన్= ప్రకాశింపగా; అరిగిరి= వెళ్ళారు.

తాత్పర్యం: యుద్ధక్రీడయందే తమకు తామే తహతహ తృప్తి చెంది వెనుకకు తిరిగి రెండు సేనలలోని భటులు కాగడాల కాంతులలో తమ తమ విడుదులకు చేరారు.

తే. రెండు వీళ్ళ జనంబులు రేలు వివిధ । హృద్యసంగీతములను సాహిత్యమధుర
లలితగోష్ఠీ వినోదంబులను బ్రమోద । భరితు లై ప్రొద్దు వుత్తురు భరతముఖ్య! 343

ప్రతిపదార్థం: భరత ముఖ్య!= భరతవంశంలో ముఖ్యమైనవాడా! ఓ ధృతరాష్ట్ర మహారాజా!; రెండు+వీళ్ళ+జనంబులున్= రెండు శిబిరాల మనుష్యులూ; రేలు= రాత్రులయందు; వివిధ హృద్య సంగీతములను= హృదయమును అలరించే పెక్కు గానములచేతను, సాహిత్య మధుర లలిత గోష్ఠీ వినోదంబులను= వాఙ్మయమునకు సంబంధించిన కోమలమైన, మృదువైన, సంతోషదాయకములగు చర్చలచేతను; ప్రమోద, భరితులు+ఐ= సంతోషంతో నిండినవారై; ప్రొద్దు+పుత్తురు= కాలం గడపుతారు.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! రాత్రులందు కురు పాండవ పక్షాలు రెండింటికీ సంబంధించిన భటులు హృదయానికి ఆనందం కలిగించే సంగీత సభలలో సాహిత్య గోష్ఠులలో కాలక్షేపం చేస్తూ ఉంటారు.

భీష్ముని షష్ఠదివస యుద్ధక్రమము (సం. 6-71-1)

వ. ఏనవనాఁటి రాత్రి సనుటయుఁ దెలతెల వేగునప్పుడు ధనంజయుండు సేనాపతి రావించి మకరవ్యూహంబు సంఘటింపు మని నియమించిన నఖిలజనంబులకుఁ బ్రీతి నెక్కొన నతం డమ్మోహరంబు దీర్చునెడ దానికిఁ బార్థపాంచాలపతులు శిరంబును గవలు గన్నులును భీమసేనుండు దుండంబును సౌభద్రద్రౌపదేయ

ఘటోత్కచులు గండస్థలంబులును సాత్యకిసహితుండై యుధిష్ఠిరుండు గంఠంబును ధృష్టద్యుమ్న పురస్సరంబుగా విరాటుండు వెన్నును గేకయులు వామపార్శ్వంబును ధృష్టకేతుండును గరూశపతియును దక్షిణపార్శ్వంబును గుంతిభోజశతానీకులు జఘనంబును శిఖండియు నిరావంతుండును బుచ్ఛంబును నై పన్నిరి; భీష్ముండు దానికిఁ బ్రతివ్యూహం బూహించి క్రౌంచవ్యూహం బమర్చి యందుఁ జంచువునం దాను గురు సహాయుం డైనిలిచి నేత్రంబులఁ గృపగురుపుత్త్రులును మస్తకంబునఁ గృతవర్మయుఁ గాంభోజ బాహ్లికులును గళంబున శూరసేనపరివృతుండై సుయోధనుండును నురంబున సౌవీర సమేతుండై భగదత్తుండును వీఁపున విందానువిందులును వామపక్షంబున సుశర్మయు దక్షిణపక్షంబున యవనపతియు నపరభాగంబున శ్రుతాయురుపేతుండై భూరిశ్రవసుండును నిలిచి రిట్లుభయసైన్యంబులు సన్నద్ధంబు లై నడచి శంఖభేరీ ప్రముఖ తూర్యనాదంబులు సెలంగం దలపడియె నట్టిసమయంబున. 344

ప్రతిపదార్థం: ఏనవ+నాఁటి+రాత్రి= అయిదవరోజు యొక్క రాత్రి; చనుటయున్= వెళ్ళుటయు; తెల+తెల+వేగునప్పుడు= తెల్లవారునప్పుడు; ధనంజయుండు= అర్జునుడు; సేనాపతిన్+రావించి= సేనాపతి ధృష్టద్యుమ్నుని రప్పించి; మకర+వ్యూహంబు= మొసలి మొగ్గరము; సంఘటింపుము+అని+నియమించినన్= ఏర్పరచుము అని ఆజ్ఞాపించగా; అఖిల+జనంబులకున్= అందరు ప్రజలకూ; ప్రీతి= సంతోషము; నెక్కొనన్= ఏర్పడగా; అతండు= ఆ ధృష్టద్యుమ్నుడు; ఆ+మోహరంబున్= ఆ వ్యూహమును; తీర్చు+ఎడన్= ఏర్పాటు చేసేటప్పుడు; దానికిన్= ఆ మొగ్గరమునకు; పార్థ+పాంచాల పతులు= అర్జునుడు, ద్రుపదరాజు; శిరంబును= తలగా; కవలు= జంటలు(నకులసహదేవులు); కన్నులును= నేత్రాలుగా; భీమసేనుండు; తుండంబును= నోరు మొదటి భాగముగా; సౌభద్ర ద్రౌపదేయ+ఘటోత్కచులు= అభిమన్యుడు, ఉపపాండవులు, ఘటోత్కచుడు; గండ+స్థలంబులును= కపోల భాగములుగా; సాత్యకి+సహితుండు+ఐ= సాత్యకితో కూడిన వాడై; యుధిష్ఠిరుండు= ధర్మరాజు; కంఠంబును= కుత్తుకగా; ధృష్టద్యుమ్న+ పురస్సరంబుగాన్= ధృష్టద్యుమ్నుడు ముందుగా గలవాడుగ; విరాటుండు= విరాటరాజు; వెన్నును= వీపుగా; కేకయులు= కేకయ రాజులు; వామపార్శ్వంబును= ఎడమ ప్రక్కయు; కుంతి భోజ,శతానీకులు= కుంతి భోజుడు, శతానీకుడు; జఘనంబును= మొలగా; శిఖండియున్+ఇరావంతుండును= శిఖండి మరియు ఇరావంతుడును; పుచ్ఛంబును= తోకయు; ధృష్టకేతుఁడు+ కరూశ+పతియును= ధృష్టకేతుడు, కరూశరాజు; దక్షిణ+పార్శ్వంబును= కుడి ప్రక్కయు; పన్నిరి= వ్యూహం ఏర్పాటు చేశారు; భీష్ముండున్= భీష్ముడుకూడా; దానికిన్= ఆ మకర వ్యూహానికి; ప్రతి వ్యూహంబు= దీటగు మొగ్గరము; ఊహించి= ఆలోచించి; క్రౌంచ+వ్యూహంబు= క్రౌంచ పక్షిని పోలు మొగ్గరము; అమర్చి= ఏర్పాటు చేసి; అందున్= ఆ క్రౌంచ వ్యూహమునందు; చంచువునన్= ముక్కు దగ్గర; తాను= తాను(భీష్ముడు); గురు+సహాయుండు+ఐ= ద్రోణుడు తోడుగా; నిలిచి= నిలబడి; నేత్రంబులన్= కనులందు; కృప+గురుపుత్త్రులును= కృపుడును, అశ్వత్థామయు; మస్తకంబునన్= శిరస్సుదగ్గర; కృతవర్మయున్= కృతవర్మయు; కాంభోజ, బాహ్లికులును= కాంభోజరాజు, బాహ్లికుడును; గళంబునన్= కుత్తుక దగ్గర; శూరసేన+పరివృతుండు+ఐ= శూరసేనునిచే చుట్టబడినవాడై; సుయోధనుండును= దుర్యోధనుడును; ఉరంబునన్= వక్షమునందు; సౌవీర+సమేతుండు+ఐ= సౌవీర రాజుతో కూడి; భగదత్తుండును= భగదత్తుడును; వీఁపునన్= వెన్ననందును; వింద+అనువిందులు= విందుడు మరియు అనువిందుడును; వామపక్షంబునన్= ఎడమరెక్కగా; సుశర్మయున్; దక్షిణ+పక్షంబునన్= కుడిరెక్క దగ్గర; యవనపతియున్= యవనరాజును; అపరభాగంబునన్= వెనుక భాగమున; శ్రుతాయుఃఉపేతుండు+ఐ= శ్రుతాయువుతో కూడినవాడై; భూరిశ్రవసుండును; నిలిచిరి= నిలబడ్డారు; ఇట్లు+ఈరీతిగా; ఉభయ సైన్యంబులున్= రెండు సేనలు(కురు పాండవ సైన్యాలు); సన్నద్ధంబులు+ఐ= యుద్ధానికి సంసిద్ధములై; నడచి= వెడలి; శంఖ, భేరీ, ప్రముఖ, తూర్యనాదంబులు= శంఖములు, భేరులు మొదలగు జంత్ర వాద్యాలు; చెలంగన్= మ్రోయగా; తలపడియెన్= మార్మ్రోగాయి; అట్టి సమయంబునన్.

తాత్పర్యం: కురుక్షేత్రంలో ఏడవనాటి రాత్రి జరిగిపోయింది. తెల్లవారేటప్పుడు, అర్జునుడు ధృష్టద్యుమ్నుడిని, రావించి 'మొసలి మొగ్గరం' ఏర్పాటు చేయుమన్నాడు. ధృష్టద్యుమ్నుడు అందరూ సంతోషించేటట్లుగా మకరవ్యూహం

తీర్చిదిద్దాడు. అర్జునుడు, ద్రుపదరాజు తలగా ఏర్పడ్డారు. నకుల సహదేవులు నేత్రములు అయ్యారు. భీముడు నోరు చివర నిలబడ్డాడు. అభిమన్యుడు, ద్రౌపది కొడుకులు, ఘటోత్కచుడు - కపోలములు అయ్యారు. సాత్యకితోపాటుగా ధర్మరాజు కంఠం దగ్గర నిలిచాడు. ధృష్టద్యుమ్నుడితోపాటు విరాటరాజు వెన్నుదగ్గర ఉన్నాడు. కేకయరాజులు ఎడమ ప్రక్కగా, ధృష్టకేతుడు కరూశరాజును కుడిప్రక్కగా నిలబడ్డారు. కుంతిభోజుడు, శతానీకుడు మొల దగ్గర ఉన్నారు. శిఖండి, ఇరావంతుడు - తోకగా అయ్యారు.

భీష్ముడు మొసలిమొగ్గరానికి సాటిగా 'క్రౌంచవ్యూహం' ఏర్పాటు చేశాడు. తాను ద్రోణుడితోపాటు ముక్కు దగ్గర నిలిచాడు. కృపుడు, అశ్వత్థామ, కన్నులు అయ్యారు. శిరస్సు దగ్గర కృతవర్మ, కాంభోజుడు, బాహ్లికుడు నిలిచారు. కుత్తుక దగ్గర శూరసేన రాజుతోపాటుగా దుర్యోధనుడు నిలబడ్డాడు. వక్షం దగ్గర సౌవీరరాజుతోపాటు, భగదత్తుడు ఉన్నాడు. వీపున విందుడు, అనువిందుడు నిలబడ్డారు. ఎడమప్రక్క సుశర్మ, కుడిప్రక్క యవనరాజు నిలిచారు. వెనుకగా శ్రుతాయువుతో కలిసి భూరిశ్రవసుడు నిలిచాడు.

ఈ విధంగా కురుసేన పాండవసేన యుద్ధానికి సమాయత్తమై వెళ్ళారు. శంఖాలు - భేరులు మొదలగు జంత్రవాద్యాల ధ్వనులు మిన్నుముట్టాయి. ఆ సమయంలో.

విశేషం: 1. క్రౌంచము= ఒక పౌరాణిక పక్షి. కొంగవంటి ఆకారం కలది.

క. తలకడచి నడచు ద్రోణుని । యలవుఁ బలంబును సహింప కనిలతనయుఁ డి
ట్టలమగు రోషంబునఁ ద । ద్బలముపయిం బఱపె రథముఁ బటువేగమునన్. **345**

ప్రతిపదార్థం: తలకడచి+నడచు= పైకి ఉప్పొంగి విజృంభించే; ద్రోణుని= ద్రోణాచార్యుడి; అలవున్+బలంబును= శక్తిని, సామ్ర్థ్యమును; సహింపన్= ఓర్వలేక; అనిల+తనయుఁడు= వాయుసుతుడు(భీమసేనుడు); ఇట్టలము+అగు= అతిశయించిన; రోషమ్మునన్= కోపంతో; తద్+బలముపయిన్= ఆతనియొక్క సేనపై; పటువేగమునన్= మిక్కిలి శీఘ్రముగా; రథమున్= తేరును; పఱపెన్= తోలించాడు.

తాత్పర్యం: పైకి ఎగిరి వెల్లి విరిసే ద్రోణుడి శక్తిసామర్థ్యాలకు ఓర్వలేక, భీముడు మిక్కుటమైన కోపంతో ద్రోణుడి సేన వైపునకు తన రథం వేగంగా నడపించాడు.

విశేషం: కౌరవులు పన్నింది క్రౌంచవ్యూహం. ముక్కుదగ్గర ఉన్నది ద్రోణుడు. ముక్కుకు పొడిచే స్వభావం సహజసిద్ధం. ఇక పాండవులు పన్నింది మొసలిమొగ్గరం. తుండం అంటే నోరు మొదటి భాగం. దానిదగ్గర ఉన్నది భీముడు. ఆ విధంగా భీముడికీ ద్రోణుడికీ సంఘర్షణ తప్పనిసరి అయింది.

వ. ఇట్లు పఱపిన నతనికోల్తలకుం గాక. **346**

ప్రతిపదార్థం: ఇట్లు+పఱపినన్= ఈ విధంగా రథాన్ని నడుపగా; అతని కోల్తలకున్+కాక= అతడి ఎదుట నిలిచి యుద్ధం చేయలేక.

తాత్పర్యం: భీముడు ఈ విధంగా రథాన్ని నడిపించగా, అతడికి ఎదురు నిలువలేక. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. తనముందటి యోధులు పిఱు । సనుటయుఁ గుంభజుఁడు గినిసి శరనవకము భీ
మునిమేన నాట నాతఁడు । సునిశితభల్లమున నతని సూతుం దునిమెన్. **347**

ప్రతిపదార్థం: తన ముందటి యోధులు= తనకు ముందుగా నిలిచిన వీరులు; పిఱు+చనుటయున్= వెనుకంజ వేయటం చేత; కుంభ+జుఁడు= కుండలో పుట్టినవాడు(ద్రోణుడు); కినిసి= కోపించి; శర+నవకము= తొమ్మిది అమ్ములు; భీముని+మేనన్+నాటన్= భీముని శరీరంపై గ్రుచ్చుకొనేటట్లు వేయగా; ఆతఁడు= ఆ భీముడు; సునిశిత+భల్లమునన్= మిక్కిలివాడియైన ఈటె బాణంతో అతని+సూతున్= ద్రోణుని సారథిని; తునిమెన్= సంహరించాడు.

తాత్పర్యం: తన ముందుగా నిలిచిన వీరులు వెనుకకు తిరిగి పారిపోగా, ద్రోణుడు ఆగ్రహంతో భీముడి శరీరంపై తొమ్మిది అమ్ములు నాటవేశాడు. భీముడు మిక్కిలి వాడియైన ఈటెబాణంతో ద్రోణాచార్యుడి సారథిని సంహరించాడు.

విశేషం: మహాభారత యుద్ధంలో పలుచోట్ల- వీరులు ప్రతివీరుల సారథులను సంహరించటం వర్ణింపబడింది. సారథులు నిరాయుధులే కదా! వారిని సంహరించటం ఏమి న్యాయం? అనిపిస్తుంది. సారథిని సంరక్షించటం - వీరుడి అవశ్యకర్తవ్యం. సారథి సంహరింపబడటం - రథికునకు -పరాభవం. ఇంచుమించు ఓటమితో సమానం. అప్పుడు రథికుడు - సారథ్యం కూడా నడపటం ద్విపాత్రాభినయం నెరపటమే., ద్రోణుడు అప్పుడు అట్లా లోకోత్తర శక్తి ప్రదర్శించాడు..

క. వాహనముఁ దాన నడపుచు । సాహసికత్వమున గురుఁడు సమరక్రీడో
త్సాహము వదలక వైరి । వ్యూహము దలఁకంగ భుజసముద్ధతి గవిసెన్. **348**

ప్రతిపదార్థం: వాహనమున్= రథమును; తాను+అ= తానే; నడపుచున్= నడిపిస్తూ; గురుఁడు= ద్రోణుడు; సాహసికత్వమునన్= ప్రమాదంతో కూడిన ధైర్యంతో; సమర+క్రీడా+ఉత్సాహము= యుద్ధం అనే ఆటలోని ఉల్లాసము; వదలక= విడిచి పెట్టకుండా; వైరి వ్యూహము= శత్రువుల సమూహము; తలఁకంగన్= కలత చెందునట్లుగా; భుజ+సముద్ధతిన్= బాహు పరాక్రమంతో (భుజముల+గర్వంతో); కవిసెన్= మార్కొన్నాడు.

తాత్పర్యం: సారథి సంహరింపబడగా తానే తన రథాన్ని నడపుతూ అనగా గుర్రాలను తోలుకొంటూ, యుద్ధ క్రీడ యందలి ఉత్సాహం విడిచిపెట్టకుండా పరాక్రమం చూపిస్తూ, శత్రువుల వ్యూహాన్ని చెదరగొట్టుతూ యుద్ధం కొనసాగించాడు.

క. మీ తండ్రి ద్రోణునకుఁ దో । డై తటిమినఁ గేకయులు భయాకులత మరు
ద్ధూతాంబుదగతిఁ దెరలఁగ । నాతత సృంజయబలంబు లటిముటి విరిగెన్. **349**

ప్రతిపదార్థం: మీ తండ్రి= భీష్ముడు; ద్రోణునకున్= ద్రోణునకు; తోడు+ఐ= బాసటగా నిలిచినవాడై; తటిమినన్= తరిమివేయగా; కేకయులు= కేకయరాజు సేనలు; భయ+ఆకులతన్= భయంతో ఆందోళనతో; మరుత్+ధూత+అంబుద+గతిన్= గాలిచే చెదరగొట్టబడిన మబ్బులవలె; తెరలఁగన్= మరలగా; ఆతత+సృంజయ బలంబులు= విస్తీర్ణమైన సృంజయసేనలు; అటిముటిన్= శీఘ్రంగా; విరిగెన్= ఓడిపోయాయి.

తాత్పర్యం: నీ తండ్రి అయిన భీష్ముడు ద్రోణుడికి తోడుగా నిలిచి తరుమగా కేకయులు భయంతో, ఆందోళనతో, గాలిచేత చెదరగొట్టబడిన మబ్బులవలె - వెనుకకు తరలారు. విస్తీర్ణాలయిన సృంజయసేనలు వెనువెంటనే ఓడిపోయాయి.

విశేషం: అలం: ఉపమ.

ఆ. అధిప! భీమసేనుఁ డడరినఁ గౌరవ । సైన్య మతనిచేతఁ జాపకట్టు
వడియెనపుడు ధరణిపతు లిద్దఱును జేయి । వీచి తటిమి రథిక విక్రమమున. 350

ప్రతిపదార్థం: అధిప!= ఓ రాజా(ఓ ధృతరాష్ట్ర మహారాజా)!; భీమసేనుఁడు= భీముడు; అడరినన్= విజృంభింపగా; కౌరవ+సేన= కౌరవులసైన్యం; అతనిచేతన్= ఆ భీమునిచేత; చాపకట్టు+పడియెన్= నేలమట్టమయింది; అపుడు; ధరణిపతులు+ఇద్దరును= ఇద్దరు రాజులు(అటు కౌరవపతి దుర్యోధనుడును, ఇటు పాండవనేత ధర్మరాజును); చేయి+వీచి= హస్తమును ఊపి; అధిక+విక్రమమునన్= గొప్ప పరాక్రమంతో; తటిమిరి= ప్రోత్సహించారు.

తాత్పర్యం: రాజా! భీముడు విజృంభించిన కారణంగా కౌరవసేనకు విపరీతంగా నష్టం కలిగింది. ఇటు దుర్యోధనుడు, అటు ధర్మరాజు - తమసేనలను ప్రోత్సహించసాగారు.

వ. ఇవ్విధంబున ధర్మనందన దుర్యోధను లగ్గలికం బురికొలుప మొగ్గరంబులు రెండును గండు మిగిలి తలపడియె' ననిన విని ధృతరాష్ట్రుండు సంజయున కిట్లనియె. 351

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ రీతిగా; ధర్మనందన, దుర్యోధనులు; అగ్గలికన్= పూనికతో; పురికొలుపన్= ప్రోత్సహింపగా; మొగ్గరంబులు+రెండును= ఉభయవ్యూహాలును; గండు+మిగిలి= పరాక్రమించి; తలపడియెన్= మార్కొన్నాయి; అనినన్+విని= అని సంజయుడు చెప్పగా ఆకర్ణించి; ధృతరాష్ట్రుడు; సంజయునకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఈ రీతిగా ధర్మరాజును దుర్యోధనుడు పూనికతో ప్రోత్సహించగా, మకరవ్యూహంగా క్రౌంచ వ్యూహంగా- ఏర్పడిన పాండవ - కౌరవ సేనలు రెండూ, పరాక్రమంతో మార్కొన్నాయి' అని చెప్పగా విని, ధృతరాష్ట్రుడు సంజయుడితో ఈ విధంగా అన్నాడు:

ఆ. ' మనబలంబునందు మంచి మగల్ సాల । గలిగి యా బలంబు గెలువలేమి
దైవకృతము గాదె! తలఁపఁ జోద్యము మున్న! యెఱుఁగఁ జెప్పె విదురుఁ డిట్టు లగుట. 352

ప్రతిపదార్థం: మన+బలంబునందున్= మనసేనలో; మంచి+మగల్= గొప్పవీరులు; చాలన్+కలిగి= ఎందరో ఉండి; ఆ బలమ్మున్= ఆ పాండవసేనను; గెలువన్+లేమి= జయించలేకపోవటం; దైవ+కృతము+కాదె!= దైవము చేసిన పనియే కదా!; తలఁపన్= యోచింపగా; చోద్యము= ఆశ్చర్యం; మున్ను+అ= ముందుగానే; విదురుఁడు; ఇట్టులు+అగుట= ఈ విధంగా జరుగగలదని; ఎఱుఁగన్= తెలిసేటట్లు; చెప్పెన్= వచించాడు.

తాత్పర్యం: 'మన సేనలో గొప్ప యోధులు ఎక్కువగా ఉన్నారుగదా! అయినా ఆ పాండవ సేనను జయింపలేకుండా ఉన్నారు. ఇది దైవకృతమే కదా! పైగా ఆశ్చర్యకరమైనది గదా! ఈ విధంగా జరుగగలదని విదురుడు ముందే చెప్పాడు.

క. అతఁ డెంత సాటి చెప్పిన । మతి హితముగఁ గొనఁడు కీడు మానఁడు కడు దు
ర్మతి యైన నా తనూజుఁడు । మతి కర్మము వెనుకఁ జనక మానునె? యెందున్. 353

ప్రతిపదార్థం: అతఁడు= దుర్యోధనుడు; ఎంత+చాటి+చెప్పినన్= ఎంతగా బహిరంగంగా చెప్పినప్పటికీ; మతి+హితముగన్= బుద్ధికి మంచిదిగా; కొనఁడు= స్వీకరింపడు; కడున్= మిక్కిలి; దుర్మతి+ఐన= చెడ్డబుద్ధి కలవాడైన; నా+తనూజుఁడు= నా కొడుకు; కీడు+మానఁడు= అపాయం తొలగించుకోడు; మతి= బుద్ధి; 'కర్మము' వెనుకన్= కర్మము వెనువెంట; చనన్+మానునె?+ఎందున్= ఎందైనా వెళ్ళక మానుతుందా?

తాత్పర్యం: ఎంతగా నొక్కి వక్కాణించినప్పటికీ దుర్యోధనుడు వినలేదు. కీడు తెచ్చుకున్నాడు. నా కొడుకు చెడ్డవాడు. అయితే - అది వాడి కర్మ. దైవకృతం ఎవరు తప్పించగలరు?

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. 'బుద్ధిః కర్మానుసారిణీ' అనుదానికి తెలుగు: 'మతి కర్మము వెనుకఁ జనక మానునె?'

వ. విధికృతం బెవ్వరికి నుడుప వచ్చు నెట్లు గా నున్నది యట్లయ్యెడుం గాక ' యనిన సంజయుం డతని కి ట్లనియె. 354

ప్రతిపదార్థం: విధి+కృతంబు= దైవము చేసినది; ఎవ్వరికిన్= ఎవరికి; ఉడుపవచ్చున్= తప్పించటానికి వీలు అవుతుంది?; ఎట్లు+కాన్+ఉన్నది= ఏ విధంగా జరగాలో; అట్లు+అ= అట్ల= ఆ విధంగానే; అయ్యెడున్+కాక= జరుగుగాక; అనిన; సంజయుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఎంతగా నొక్కి వక్కాణించినప్పటికి దుర్యోధనుడు వినలేదు. కీడు తెచ్చుకొన్నాడు. నా కొడుకు చెడ్డవాడు. అయితే, అది వాడి కర్మ. దైవకృతం ఎవరు తప్పించగలరు? బుద్ధి కర్మను అనుసరిస్తుంది. అంతే. ఏ విధంగా జరుగగలదో ఇక ఆ విధంగానే జరుగుగాక! ' - అని ధృతరాష్ట్రుడు బాధపడుతూ అనగా, సంజయు డిట్లా అన్నాడు:

ఆ. ' నీ తనూభవుండు నెఱిగుఱి యెఱుఁగమి । యెఱిఁగియెఱిఁగి యతని నేలచెప్ప ?
మన యుపేక్షవలన విను నాఁటి జూదంబ । నేఁడు గయ్య మయ్యె నృపవరేణ్య! 355

ప్రతిపదార్థం: నీ+తనూభవుండు= నీ కొడుకు దుర్యోధనుడు; నెఱి గుఱి= మంచినిండులక్ష్యం; ఎఱుఁగమి= తెలియకపోవటం; ఎఱిఁగి+ఎఱిఁగి= తెలిసి తెలిసి; అతనిన్= ఆతనిని; ఏల చెప్పన్?= చెప్పనేల(ఎందుకు నిందించాలి)?; మన+ఉపేక్ష+వలనన్= మన ఔదాసీన్యం వల్ల; నృప+వరేణ్య!= రాజశ్రేష్ఠుడా! (ఓ ధృతరాష్ట్ర మహారాజా); నాఁటి+జూదంబు+అ= అలనాటి జూదమే; నేఁడు= ఈ దినమునకు; కయ్యము= యుద్ధము; అయ్యెన్.

తాత్పర్యం: 'ఓ ధృతరాష్ట్ర మహారాజా! నీవు దుర్యోధనుడిని నిందిస్తున్నావు. ఆ నింద వలన ప్రయోజనం ఏముంది? ఈనాడు జరుగుతున్న యుద్ధానికి నీ ఉపేక్షయే కారణం. ఆనాటి జూదమే ఈనాటి యుద్ధంగా పరిణమించింది.

విశేషం: కుహనాకర్మ సిద్ధాంతవాదులకు ఇది చక్కని సమాధానం. అంతా దైవంమీద బాధ్యత నెట్టివేయడం సమంజసం కాదు. ఆనాడు జూదమే జరగకపోతే ఈనాడు కురుక్షేత్ర సంగ్రామమే లేదు. ఆ నాడు జూదం ఆపకపోయిన బాధ్యత ఎవరిది? ధృతరాష్ట్రునిదే కదా! ధృతరాష్ట్రుడు చెప్పింది పరాజయవేదాంతం. పశ్చాత్తాపం కూడా కాదు. సంజయుడు దానికి చక్కని సమాధానం చెప్పాడు.

వ. ఇంకఁ బశ్చాత్తాపం బుడిగి ధీరుండ వై సమర ప్రకారంబు విను మట్టియెడ భీమసేనుండు భవత్సేనాసాగరంబు పాయ వడం దటిమి చొచ్చి దుశ్శాసనుండును దుర్విషహుండును దుర్మదుండును దుస్సహుండును జయుండును జయత్సేనుండును వికర్ణుండును జిత్రసేనుండును సుదర్శనుండును జారుచిత్రుండును సువర్ముండును దుష్కర్ణుండును నొక్కచో నున్నం గనుంగొని యక్కుమారులం దాఁకిన. 356

ప్రతిపదార్థం: ఇంకన్= ఇకమీద; పశ్చాత్తాపంబు= తరువాత పడే ఆవేదన, చేసిన తప్పునకు చింతించి పడే వేదన; ఉడిగి= మాని; ధీరుండవు+ఐ= ధైర్యం కలిగిన వాడవు అయి (ఓర్పు కలిగినవాడివై); వినుము; అట్టి+ఎడన్= ఆ సమయంలో; భీమసేనుండు; భవత్+సేనా+సాగరంబు= నీ సేన అనే సముద్రం; పాయ+పడన్= చీలికకాగా; తటిమి= తోలి; చొచ్చి= లోపల ప్రవేశించి; దుశ్శాసనుండును; దుర్విషహుండును; దుర్మదుండును; దుస్సహుండును; జయుండును; జయత్సేనుండును; వికర్ణుండును; చిత్రసేనుండును; సుదర్శనుండును; చారుచిత్రుండును; సువర్ముండును; దుష్కర్ణుండును (వీరందరూ ధృతరాష్ట్రుని కొడుకులు);

ఒక్కచోన్= ఒక స్థలంలోనే; ఉన్నన్+కనుంగొని= ఉండటం చూచి; ఆ+కుమారులన్= ఆ రాచ కొడుకులను, తాఁకినన్= మార్కొనగా.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! ఇక నీవు పశ్చాత్తాపం విడిచిపెట్టి ఆకర్ణించుము. ఆ సమయంలో భీముడు నీ సేనాసాగరాన్ని పాయలు చేసి ఒక్కచోట పలువురు నీ కుమారులు - దుశ్శాసనుడు, దుర్విషహుడు, దుర్మదుడు, దుస్సహుడు, జయుడు, జయత్సేనుడు, వికర్ణుడు, చిత్రసేనుడు, సుదర్శనుడు, చారుచిత్రుడు, సువర్ముడు, దుష్కర్ణుడు - ఒక్కచోట కన్పించగా, మంచి అవకాశం దొరికినట్లు సంతోషించి వారిని మార్కొన్నాడు.

తే. వారలందఱు నొండొరుఁ బేరువేరఁ । బిలిచికొని వీఁడె సనుదెంచె భీముఁ డీతఁ
డొంటి యగపడ్డ చోటన యుక్కడంగఁ । బొదివి చంపుద మని యతిస్ఫురణ సేసి. 357

ప్రతిపదార్థం: వారలు+అందఱున్= కౌరవరాజకుమారులు అందరూ; ఒండొరున్= ఒకరినొకరిని; పేరు పేరునన్+పిలిచి+కొని= పేరులు పెట్టి ఆహ్వానించికొని; వీఁడు+ఎ= వీడె(ఇతడే); భీముఁడు; చనుదెంచెన్= వచ్చాడు; ఒంటి= ఒంటరిగా; అగపడ్డ+చోటన్= కనుపించిన స్థలమునందే; ఉక్కు+అడఁగన్= పరాక్రమం అణగారిపోగా; పొదివి= చుట్టుముట్టి; చంపుదము= సంహరిద్దాము; అని= అని చాటుతూ; అతి+స్ఫురణ+చేసి= ఎక్కువగా ఆలోచించి.

తాత్పర్యం: కౌరవ రాజ కుమారులు అందరు 'భీముడు ఒక్కడు ఏకాంతంగా ఒకచోట కనుపించాడు కదా! ఇప్పుడు ఇతడిని వదలరాదు. ఇది మంచి అవకాశం. మనమందరం ఇతడిని ఇప్పుడు చుట్టుముట్టి చంపుదాము' అని ప్రత్యక్షంగా దొరకిన సన్నివేశాన్ని సంగ్రహించి, పేరు పేరున ఒకరినొకరు హెచ్చరించుకొన్నారు.

క. ఉగ్రగ్రహములు లయకా । లగ్రహపతిఁ బొదువు క్రియ నలఘువిక్రమగ
ర్వాగ్రహమున ముట్టిరి రిపు । నిగ్రహలంపటుని భీమునిం జటులగతిన్. 358

ప్రతిపదార్థం: ఉగ్ర గ్రహములు= భయంకరమైన గ్రహాలు(ఆకాశంలో తిరిగే గోళాలు); లయకాల+గ్రహపతిన్= ప్రళయకాలంలో సూర్యుడిని; పొదువు+క్రియన్= చుట్టుముట్టేటట్లుగా; అలఘు విక్రమ గర్వ+ఆగ్రహమునన్= తక్కువగాని అనగా గొప్పదైన పరాక్రమంతో కూడిన మదముతో(కోపంతో); రిపు+ నిగ్రహ+లంపటునిన్= శత్రువులను జయించాలనే కోరిక గలవాడైన; భీమును; చటుల+గతిన్= వేగంగా; ముట్టిరి= మార్కొన్నారు.

తాత్పర్యం: భయంకరమైన ఆకాశ గోళాలు, ప్రళయకాలంలో సూర్యుని ముట్టడించేటట్లుగా, కౌరవ రాజకుమారులు గొప్ప పరాక్రమంతో, గర్వంతో, ఆటోపంతో, శత్రువులను జయించాలనే కోరికతోనే మెలగే భీముడిని వేగంగా మార్కొన్నారు.

విశేషం: అలం: ఉపమ. గ్రహాలు సూర్యుని చుట్టూ తిరుగుతాయి. అందుకని సూర్యుడికి గ్రహరాజు అని పేరు. అయితే ప్రళయకాలంలో - గ్రహాలు - గతులు తప్పుతాయని అంటారు.

వ. ఇట్లు నీ కొడుకులు చతురంగబలంబుతోడం జుట్టుముట్టిన వృకోదరుండు సంతసంబునం బొదలి సారథిం గనుంగొని 'నీ వీరథం బిచ్చట నిలిపికొని యుండు' మని నియోగించి గద వుచ్చికొని ధరణికి లంఘించి. 359

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; నీ కొడుకులు; చతుఃఅంగ+బలంబులతోడన్= నాలుగు సేనాంగాలతో; చుట్టుముట్టినన్; వృకోదరుండు= భీముడు (తోడేలు పొట్టవంటి పొట్టగలవాడు); సంతసంబునన్+పొదలి= సంతోషంతో ఒప్పి; సారథిన్+కనుంగొని=

సూతుని చూచి; నీవు; ఈ +రథంబు; ఇచ్చటన్= ఈ స్థలంలో; నిలిపికొని యుండుము= ఆపి ఉంచుము; అని+నియోగించి= అని ఆజ్ఞాపించి; గద+పుచ్చికొని= గద చేతపట్టు కొని; ధరణికిన్+లంఘించి= నేల మీదికి ఉరికి.

తాత్పర్యం: ఈ విధంగా నీ కొడుకులు తమ చతురంగ బలాలతో భీముడిని చుట్టుముట్టారు. భీముడికి - మంచి అవకాశం వచ్చినందుకు సంతోషం కలిగింది. అతడు సారథిని 'నీవు ఈ రథాన్ని ఇక్కడే భద్రంగా పెట్టుకొని ఉండుము' అని ఆజ్ఞాపించి, నేలమీదికి ఉరికాడు. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: 1. భీముడు ఒంటరిగా రథంమీద ఉంటే ఏం జరుగుతుంది? కౌరవరాజ కుమారులు పదిమంది చుట్టుముట్టారు. ఒక్కడు అందరితో - వారి చతురంగ బలాలతో యుద్ధం చేయాలి. అప్పుడు రథం భీముడికి మిక్కిలి ప్రమాదకరమైన చెరసాల అవుతుంది. రథంమీద విల్లుపట్టుకున్న భీమునికంటె - నేలమీద గద పుచ్చుకున్న భీముడే బలవంతుడు. స్వేచ్ఛాజీవి. రథంమీద ఉన్న భీముడిని గురిపెట్టి కొట్టవచ్చు. కానీ, నేలమీద ఉన్న భీముడు ఎక్కడ ఉన్నదీ ఎవరికీ తెలియదు. నేలమీద - భీముడు తన గొప్ప శారీరక బలాన్ని - అత్యద్భుతంగా వినియోగించుకోవచ్చు. అందుచేతనే అతడు రథం మీద నుండి నేలమీదకు దూకాడు.

చ. కవిసి యుగాంతదండధరుకైవడిఁ గోలుమసంగి కుంభముల్
పవులఁగఁ దుండముల్ దునియఁ బ్రక్కలు వ్రక్కలు గాఁగ దర్పముం
జవము బలంబు నొప్పఁగ గజంబుల వ్రేసిన నెత్తురొల్కఁగా
నవి వడె ధాతునిర్ఝు రమయాచలపంక్తులఁ బోలి మేదినిన్. 360

ప్రతిపదార్థం: కవిసి= మార్కొని; యుగ+అంత+దండధరుకైవడిన్= ప్రళయకాలంలోని యమునివలె; కోలుమసంగి= అతిశయించి; కుంభముల్= ఏనుగుల తలకాయలు; పవులఁగన్= బ్రద్దలైపోవునట్లుగా; తుండముల్=హస్తములు; తునియన్= ముక్కలుకాగా, ప్రక్కలు= కడుపు పార్శ్వములు; వ్రక్కలు+కాఁగన్= బీటలువారగా; దర్పమున్= ఆటోపము; జవమున్= శక్తి; బలంబున్= బలిమి; ఒప్పఁగన్= శోభిల్లగా; గజంబులన్= ఏనుగులను; వ్రేసినన్= కొట్టగా; నెత్తురు+ఒల్కఁగాన్= రక్తము కారగా; అవి= ఆ ఏనుగులు; ధాతు+నిర్ఝుర+మయ+అచల+పంక్తులన్+పోలి= గైరికాది ధాతువులతో కూడిన సెలయేళ్ళతో కూడిన పర్వతాల వరుసల వలె కన్పించి; మేదినిన్= భూమిమీద; పడెన్= కూలాయి.

తాత్పర్యం: భీముడు ప్రళయకాలంలోని యముడి వలె విజృంభించి, ఏనుగుల కుంభస్థలాలు పగులగొట్టాడు. తుండాలు నరికివేశాడు. కడుపులు వ్రక్కలు వ్రక్కలు చేశాడు. తన జవసత్త్వాలు చూపాడు. రక్తం స్రవించి అవి గైరికాది ధాతువులతో సెలయేరులతో కూడిన పర్వతాలుగా భాసించాయి. ఆ ఏనుగులు నేలమీద కూలిపడి పోయాయి.

విశేషం: అలం: ఉపమ. ఏనుగులు నేలమీద నెత్తురులు కారుతూ కొండలవలె పడి ఉన్నాయి. కొండలలో ధాతువులు ఉంటాయి. కొండలనుండి సెలయేరులు - ఎర్రని గైరికాది ధాతువులు కలిసి ప్రవహిస్తాయి. ఆ సెలయేళ్ళ వలె ఉన్నాయి ఏనుగుల శరీరాల నుండి కారే నెత్తురు ప్రవాహాలు.

క. అరదంబులు పొడిపొడి యై । హరుల గములు నుగ్గునూచ యై మొత్తపుఁగా
ల్వురు సిదురుప లై పడ ని । ష్ఠురగతి విహరించె వాయుసూనుఁడు గదతోన్. 361

ప్రతిపదార్థం: అరదంబులు= రథాలు; పొడి+పొడి+ఐ= చూర్ణమై; హరుల+గమి+లు= గుర్రాల గుంపులు; నుగ్గునూచము+ఐ= ముక్కలు చెక్కలై; మొత్తము+కాల్వురు= కాలుబలము అంతయు; చిదురుపలు+ఐ= చిన్న చిన్న ముక్కలై; పడన్= నేలమీద పడిపోగా; వాయు+సూనుఁడు= భీముడు; గదతోన్= గద చేతపట్టుకొని; నిష్ఠుర+గతిన్= మిక్కిలి కఠినంగా; విహరించెన్= ఇష్టానుసారం తిరిగాడు.

తాత్పర్యం: రణరంగంలో భీముడు వీరవిహారం చేశాడు. గదాయుధం ధరించి రథం రణరంగంలో వెళ్ళలేని చోట్లకు భీముడు వెళ్ళగలిగాడు. రథాలను చూర్ణం చేశాడు. గుర్రాలను సూక్ష్మఖండాలుగా చేశాడు. కాల్బలం ముక్క చెక్కలైపోయింది. పాదచారియైన భీముడి ధాటికి ఎదురులేకపోయింది.

క. పెక్కండ్రతోడ నిమ్మెయి । నొక్కరుఁడ రథమ్ము డిగ్గి యురవడిఁ జని పే
రుక్కునఁ బోరుట సూడఁగ । నక్కజమై యుండెఁ గౌరవాన్వయముఖ్యా! 362

ప్రతిపదార్థం: కౌరవ+అన్వయ+ముఖ్యా!= కౌరవవంశంలో శ్రేష్ఠుడవైన వాడా!; ఓ ధృతరాష్ట్ర మహారాజా!; పెక్కండ్రతోడన్= పలువురితో; ఈ+మెయిన్= ఈ విధంగా; ఒక్కరుఁడు+అ= ఒక్కడే; రథమ్ము+డిగ్గి= తేరును దిగి; ఉరవడిన్+చని= వేగముగా వెళ్ళి; పేరు+ఉక్కునన్= గొప్ప పరాక్రమంతో; పోరుట= యుద్ధం చేయటం; చూడఁగన్= వీక్షింపగా; అక్కజము+ఐ+ఉండెన్= ఆశ్చర్యంగా ఉంది.

తాత్పర్యం: భీముడు - రథందిగి - ఒక్కడే పలువురితో పోరాడాడు. ధృతరాష్ట్ర మహారాజా! అతడి గొప్ప పరాక్రమం - చూచేవారికి మిక్కిలి ఆశ్చర్యం కలిగించింది.

ఆ. భీమసేను నపుడు పెక్కుబలంబులు । పాదువు టెఱిఁగి ద్రుపదపుత్త్రకుండు
శస్త్రగురునితోడ సరభసవృత్తి మైఁ । బోరిపోరి యుడిగి బుద్ధి గలఁగఁ. 363

ప్రతిపదార్థం: భీమసేనున్= భీముని; అపుడు; పెక్కు+బలంబులు= పెక్కుసేనలు; పాదువుట= చుట్టుముట్టటం; ఎఱిఁగి= తెలుసుకొని; ద్రుపద+పుత్త్రకుండు= ద్రుపదరాజు కొడుకు(ధృష్టద్యుమ్నుడు); శస్త్రగురునితోడన్= ద్రోణునితో; పోరి+పోరి= పోరాడి పోరాడి; ఉడిగి= విరమించి; బుద్ధి+కలఁగన్= మతి కలత చెందగా.

తాత్పర్యం: భీముడిని పలువురు కౌరవరాజసుతులు తమ సేనలతో పాటు మార్కొనటం విని, అంతవరకూ ద్రోణుడితో ఎడతెగని పోరాటం కొనసాగించిన ధృష్టద్యుమ్నుడు - ఆ పోరాటం విరమించి, కలత చెందిన బుద్ధితో (తరువాతి పద్యంతో అన్వయం.)

క. భూరిరయంబున నద్దిసఁ । దేరు వఱపఁ బనిచి యతని తేరిపయిం ద
త్సారథిన కాంచి శోకము । కూరన్ గద్గదిక నెలుఁగు గుత్తుకఁ దగులన్. 364

ప్రతిపదార్థం: భూరి+రయంబునన్= గొప్పవేగంతో; ఆ+దెసన్= ఆవైపు(భీముడు ఉన్న దిక్కుగా); తేరు= రథము; పఱపన్+పనిచి= నడుప నియమించి; అతని+తేరిపయిన్= భీముని రథంపై; తద్+సారథిన్+అ= భీముడి సూతుడిని మాత్రమే; కాంచి= చూచి; శోకము+కూరన్= దుఃఖం నిండగా; గద్గదికన్= డగ్గుత్తికతో; ఎలుఁగు= స్వరం; కుత్తుకన్+తగులన్= గొంతుకలో పారాడగా.

తాత్పర్యం: గొప్పవేగంతో రథం భీముడు ఉన్న దిక్కుగా తోలుమని ధృష్టద్యుమ్నుడు ఆజ్ఞాపించాడు. తేరు ఆ దిక్కుగా తరలింది. అయితే భీముడి రథంమీద భీముడు లేడు - అంతేగాక భీముడి సారథి మాత్రమే ఆ రథం మీద కన్పించాడు. ధృష్టద్యుమ్నుడు దుఃఖంతో డగ్గుత్తిక పడిన కంఠస్వరంతో (తరువాతి పద్యంతో అన్వయం.)

తే. ‘ ఆర్తుఁ డై యవ్విశోకుని నడిగె భీముఁ । డెచట నున్నాఁడు? నాయొడ లెట్లు ప్రాణ
సహిత మై యుండు? నతఁడొకచందమైన । నేమిగతిఁ బోదు? నక్కట! యెఱుఁగఁ జెపుమ.’ 365

ప్రతిపదార్థం: ఆర్తుఁడు+ఐ= దుఃఖపరవశుడై; ఆ+విశోకుని= ఆ విశోకుడు అను పేరుగల భీముని సారథిని; అడిగెన్= ప్రశ్నించాడు; భీముఁడు; ఎచటన్= ఎక్కడ; ఉన్నాడు; నా+ఒడలు= నా శరీరం; ఏ విధంగా; ప్రాణ+సహితము+ఐ+ఉండున్?= ప్రాణంతో కూడి ఉంటుంది?; అతఁడు= భీముడు; ఒక+చందము= ఒక విధం; ఐనన్= అయితే (ఒకవేళ భీముడు మరణించి ఉంటే - నా శరీరంలో ప్రాణం ఉంటుందా?); ఏమిగతిన్+పోదున్?= ఏ విధంగా నేను ఎక్కడకు వెళ్ళగలను?; అక్కట!= అయ్యో!; ఎఱుఁగన్+చెపుమ= తెలిసేటట్లు చెప్పవయ్యా.

తాత్పర్యం: ధృష్టద్యుమ్నుడు దుఃఖపరవశుడై విశోకుని ఇట్లా ప్రశ్నించాడు. 'భీముడు ఎక్కడ ఉన్నాడు? అతడు ఏమయినా అయితే నా శరీరంలో ప్రాణాలు నిలుస్తాయా? అకటా! నేనేమి కావాలి? ఏమి జరిగింది చెప్పవయ్యా?'

విశేషం: ఈ సన్నివేశం నాటకీయంగా ఉంది. తిక్కనది నాటకీయ శైలి అని విమర్శకులు అంటున్నారు. కథను సంభాషణ పూర్వకంగా నడపటం మాత్రమే గాక నాటకీయ సన్నివేశాలు సమకూర్చి, సహృదయుల ఉత్కంఠను పెంచటంలో తిక్కన సిద్ధహస్తుడు.

వ. అనిన విశోకుండు ధృష్టద్యుమ్నున కి ట్లనియె. 366

ప్రతిపదార్థం: అనినన్; విశోకుండు; ధృష్టద్యుమ్ననకున్; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు

తాత్పర్యం: ధృష్టద్యుమ్ను డీవిధంగా విశోకుడిని ప్రశ్నించగా - విశోకు డీవిధంగా సమాధానమిచ్చాడు. (తరువాతి పద్యంతో అన్వయం.)

చ. గొదగొని ధార్తరాష్ట్ర లతిఘోరవిధంబునఁ జుట్టుముట్టినన్
మదమునఁ దేరు డిగ్గి హరిణంబులపైఁ జను సింహమో యనన్
గదఁ గొని నన్ను నియ్యెడ నకంపితసుస్థితి నిల్వఁ బంచి బె
ట్టిదముగఁ జొచ్చె నాహవ పటిష్ఠుఁడు భీముఁడు వారి సైన్యమున్. 367

ప్రతిపదార్థం: గొద+కొని= గుమిగూడి; ధార్తరాష్ట్రులు; అతి ఘోర విధంబునన్= మిక్కిలి భయంకరంగా; చుట్టు+ముట్టినన్ ; మదమునన్= గర్వంతో; తేరు+డిగ్గి= రథందిగి; హరిణంబులపైన్ చను సింహమో+అనన్= లేళ్ళమీదకు ఉరికే సింహమా? అనేటట్లుగా; గదన్+కొని= గద తీసికొని; నన్నున్; ఈ+ఎడన్= ఈ స్థలంలో; అకంపితసుస్థితిన్= కదలకుండగా; నిల్వన్+పంచి= నిలుపుమని ఆజ్ఞాపించి; బెట్టిదముగన్= గొప్పగా; ఆహవ+పటిష్ఠుఁడు= యుద్ధ విశారదుడు(యుద్ధం చేయుటలో గొప్ప సామర్థ్యం కలవాడు; భీముఁడు= భీమసేనుడు; వారి+సైన్యమున్= కౌరవసేనను; చొచ్చెన్= ప్రవేశించాడు.

తాత్పర్యం: 'ధృతరాష్ట్ర రాజకుమారులు గుమిగూడి మిక్కిలి భయంకర రీతిలో భీముడిని చుట్టుముట్టారు. భీముడు గర్వంతో గద చేత పట్టుకొని - లేడి గుంపుపై దూకే సింహమో అనునట్లుగా రథం దిగి నన్ను ఇక్కడే కదలకుండా ఉండుమని ఆజ్ఞాపించి - యుద్ధం చేయటంలో శక్తి సామర్థ్యాలు కల భీముడు వారి సైన్యంలో దారుణంగా ప్రవేశించాడు.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష.

వ. అని యవ్వల నెఱింగించిన నతండు. 368

ప్రతిపదార్థం: అని; అవ్వలను= భీముడుండే ఆ వైపు; ఎఱింగించినన్= తెలుపగా; అతండు= ధృష్టద్యుమ్నుడు.

తాత్పర్యం: విశోకుడు భీముడున్న వైపు తెలుపగా, ధృష్టద్యుమ్నుడు (తరువాతి పద్యంతో అన్వయం.)

ధృష్టద్యుమ్నుఁడు భీమసేనునకుఁ దోడ్పడుట (6-73-31)

క. కడువడిఁ జని యంతంతం । బుడమిఁ బడిన కరులగములు వొరలుటకతనన్
వడముడి యరిగిన తెరు వే । ర్పడఁ గని వేవేగ రథము వఱపెం గదియన్. 369

ప్రతిపదార్థం: కడు+వడిన్+చని= మిక్కిలి వేగంగా వెళ్ళి; అంత+అంతన్= అక్కడక్కడ; పుడమిన్= నేలమీద; పడిన= కూలిన; కరుల+గములు= ఏనుగుల గుంపులు; పొరలుటకతనన్= పడి దొర్లటం చేత; వడముడి= భీముడు; అరిగిన+ తెరువు+ ఏర్పడన్= వెళ్ళిన మార్గం స్పష్టంగా; కని= అరసి; వే+వేగన్= మిక్కిలి శీఘ్రంగా; కదియన్= సమీపించుటకై (భీముని దరి చేరుటకై); రథము+ పఱపెన్= రథం నడిపాడు.

తాత్పర్యం: విశోకుడు చూపిన వైపు మిక్కిలి వేగంగా వెళ్ళి అంతంత నేలమీదపడిన యేనుగుల గుంపులు దొర్లుతూ ఉండడంవల్ల భీముడు పోయిన దారి తెలుసుకొని అతడిని సమీపించడానికి శీఘ్రంగా రథాన్ని నడిపాడు.

వ. ఇట్లు భీమసేనుఁ జేరం బోయి. 370

ప్రతిపదార్థం: ఇట్లు+ఈ విధంగా; భీమసేనున్= భీముని; చేరన్+పోయి= సమీపించి.

తాత్పర్యం: ఈ విధంగా భీముని సమీపించి (తరువాతి పద్యంతో అన్వయం.)

క. ‘ ఇదె యేనుఁ గూడ వచ్చితిఁ । బదిలుఁడ వై పోరు మింక బకమర్దన! యీ
కదిసిన వీరులనెల్లం । గుదియించెద’ ననుచుఁ గవిసెఁ గురువితతిపయిన్. 371

ప్రతిపదార్థం: బక+మర్దన!= బకుడు అనే రాక్షసుని సంహరించినవాడా! ఓ భీమా!; ఇదె= ఇదిగో; ఏను= నేను (నిను); కూడన్, వచ్చితిన్= కలిసికొని తోడు పడాలని వచ్చాను; పదిలుడవు+ఐ= క్షేమంగా ఉన్న వాడవు అయి; ఇంకన్+పోరుము= ఇంక యుద్ధం చేయుము; ఈ+కదిసిన+వీరులను+ఎల్లన్= నిన్ను మార్కొనిన ఈ యోధులను అందరనూ; కుదియించెదన్= అణచగలను; అనుచున్= అని చెప్పుచు; కురు+వితతిపైన్= కౌరవుల సమూహంపై; కవిసెన్= మార్కొన్నాడు.

తాత్పర్యం: ‘బకాసురుడిని సంహరించిన ఓ భీమా! నిన్ను కలుసుకొని నీకు తోడు పడవలెనని నేను వచ్చాను. ఇంక నీవు క్షేమంగా యుద్ధం చేయవచ్చు. నిన్ను మార్కొనిన ఈ యోధులను అందరినీ నేను అణగగొట్టగలను.’ అంటూ కౌరవుల సమూహాన్ని ఎదుర్కొన్నాడు.

క. అత్తఱి నీ తనయుం డెలుఁ । గెత్తి రథికవరులతోడ నిట్లను నీదు
ర్వృత్తునిఁ బొదువుఁడు భీముని । యుత్తలపా టుడుపుకడఁక నుడుపుఁడు గడిమిన్.’ 372

ప్రతిపదార్థం: ఆ+తఱిన్= ఆ తరుణమునందు; నీ+తనయుండు= నీ కొడుకు దుశ్శాసనుడు; ఎలుఁగు+ఎత్తి= కంఠస్వరం పెద్దదిగా చేసి; రథిక+వరులతోడన్= యోధ శ్రేష్ఠులతో; ఇట్లు+అనున్= ఈ విధంగా చెప్పాడు; ఈ దుఃవృత్తునిన్= ఈ దుర్మార్గుని- ధృష్టద్యుమ్నుని; పొదువుఁడు= చుట్టుముట్టండి; భీముని+ఉత్తలపాటు= భీముని ఆవేదన; ఉడుపు+కడఁకన్= పోగొట్టే పూనికను; కడిమిన్= పరాక్రమంతో; ఉడుపుఁడు= పోగొట్టండి.

తాత్పర్యం: ఆ తరుణంలో, నీ కొడుకు దుశ్శాసనుడు, కంఠస్వరం పెద్దదిగా చేసి, యోధ వీరులతో ఈ విధంగా అన్నాడు. ‘ఈ దుర్మార్గుని చుట్టుముట్టండి. భీముడి ఉత్తలపాటు పోగొట్టే పూనికను మీరు పరాక్రమంతోమాన్పించండి.

వ. అనిన విని యోధవీరులగు కుమారులు నొకపెట్ట ధృష్టద్యుమ్నుం బొదివిన నతండుఁ ద్రోణదత్తప్రమోహన బాణంబున వారి నందఱ నిశ్చేష్టితులం జేసిన నప్పుడు దప్పి దీర్చుకొన నెడగని యనిలనందనుం డొక్క మడువున మధురశిశిర జలంబులఁ బానంబు సేసి యుల్లసిల్లి యా ద్రుపదపుత్త్రుం గూడికొనియె నట్టియెడ నాచార్యుండు గయ్యంబు సేయుమునుమున ధృష్టద్యుమ్నుండు దొలంగిన తెఱపిం గదియఁ బాంచాలపతిఁ దఱిమిన నప్ప డగ్గురుండు నవ్వుచు. 373

ప్రతిపదార్థం: అనినన్+విని= అని చెప్పిన ఆకర్ణించి; యోధ+వీరులు+అగు= యుద్ధం చేసే శూరులలో శ్రేష్ఠులైన; కుమారులు= రాజపుత్రులు; ఒక్క+పెట్టన్= ఒకేసారిగా; ధృష్టద్యుమ్నున్= ధృష్టద్యుమ్నుడిని; పొదివినన్= చుట్టుముట్టగా; అతండు= ధృష్టద్యుమ్నుడు; ద్రోణ దత్త+ప్రమోహన బాణంబునన్= ద్రోణునిచే ఇవ్వబడిన 'ప్రమోహన' బాణంతో; (మూర్ఛ కలిగించే అమ్ముచే); వారిన్+అందఱన్= వారిని అందరినీ; నిస్+చేష్టితులన్+చేసినన్= చేష్టలు లేనివారిగ(మూర్ఛితులుగా) ఒనరించగా; అప్పుడు; ఒక్క మడువునన్= ఒక చెరువులో; దప్పి తీర్చుకొనన్= దాహం తీర్చుకొనటానికి; మధుర+శిశిర+జలంబులన్= తియ్యని చల్లని మంచినీళ్ళను; పానంబు+చేసి= త్రాగి; ఉల్లసిల్లన్= శోభిల్లగా; ఎడన్+కని= వ్యవధి ఏర్పరచుకొని; అనిలనందనుండు= భీముడు; ఆ ద్రుపద+రాజ+పుత్త్రున్= ఆ ధృష్టద్యుమ్నుని (ద్రుపదరాజపుత్రుని);కూడికొనియెన్= కలిశాడు; అట్టి+ఎడన్= ఆసమయంలో; ఆచార్యుండు=ద్రోణుడు; కయ్యంబు+చేయు+మునుమునన్= యుద్ధం చేసే సేనా ముఖమున; ధృష్టద్యుమ్నుండు; తొలఁగిన; తెఱపిన్+కదియన్= వ్యవధి ఏర్పరచికొని; పాంచాల+పతిన్= పాంచాల రాజును (ద్రుపదుని); తఱిమినన్= తోలగా; అప్పుడు; ఆ+గురుండు= ఆ ద్రోణుడు; నవ్వుచు.

తాత్పర్యం: అని దుశ్శాసనుడు చెప్పగా విని, యోధులలో శ్రేష్ఠులు అయిన ఆ కౌరవ రాజకుమారులు ఒకేసారిగా అందరూ కలిసి ధృష్టద్యుమ్నుడిని చుట్టుముట్టారు. ధృష్టద్యుమ్నుడు ద్రోణుడిచే తనకు ఇవ్వబడిన 'ప్రమోహన బాణము' ప్రయోగించి రాజపుత్రులను మూర్ఛలో మునిగేటట్లు చేశాడు. భీముడు ఆ వ్యవధిని పురస్కరించుకొని - ఒక మడువులో చల్లని తియ్యని మంచినీరు త్రాగి, సేదతీరి, ధృష్టద్యుమ్నుని కలుసుకున్నాడు. అప్పుడు - ద్రోణుడు సేనాముఖంలో ధృష్టద్యుమ్నుడు కనిపించక, లభించిన వ్యవధిలో ద్రుపద రాజుపై విజృంభించి అతనిని తరిమికొట్టగా - అలవోకగా నవ్వుతూ.

విశేషం: 1. ధృష్టద్యుమ్నుడు ద్రోణుని శిష్యుడే. గురువుగారు ప్రసాదించిన 'ప్రమోహన' బాణమునే అతడు కౌరవులపై ప్రయోగించాడు. 2. అవకాశం దొరికితే చాలు - తన్ను అవమానించిన ద్రుపదుడిపైకి ఉరుకుతాడు ద్రోణుడు. 3. ఒంటరిగా చాలాసేపు యుద్ధం చేయటం చేత భీముడికి దాహం అయింది. ప్రమోహన బాణం ప్రసాదించిన తెరపిలో ఆతడు దాహం తీర్చుకున్నాడు. అనగా భీముడు ఆకలి దప్పులు మరచి యుద్ధం చేసే వీరుడు అన్నమాట.

తే. అస్త్రవర్షంబుఁ గురియంగ నతఁడు పూర్వ । వైరబంధంబుకతన దుర్వార మైన
యతని రోషంబు సైరింప నలవిగాక । జడిసి పోయిన నాతండు శంఖమొత్తె. 374

ప్రతిపదార్థం: అస్త్ర+వర్షంబున్+కురియంగన్= మంత్ర బాణముల వాన వర్షింపచేయగా; అతఁడు= ద్రుపదరాజు; పూర్వ వైర బంధంబు కతనన్= లోగడ ఏర్పడిన శత్రుత్వం అనే బంధం వలన; అతని+రోషంబు= ద్రోణుడి కోపం; సైరింపన్= ఓర్చి కొనుటకు; అలవి కాక= శక్యంగాక; జడిసి= భయపడి; పోయినన్= వెడలిపోగా; ఆతండు= ద్రోణుడు; శంఖము+ఒత్తెన్= శంఖాన్ని పూరించాడు.

తాత్పర్యం: ద్రోణుడు ద్రుపదుడిపై బాణవర్షం కురిపించాడు. ద్రుపదుడు - లోగడ తనకు ద్రోణుడికి ఏర్పడిన శత్రుత్వం వలన ఆతని కోపం భరించలేక భయపడి అక్కడ నుండి వెళ్ళిపోయాడు. విజయగర్వంతో ద్రోణుడు తన శంఖం పూరించాడు.

విశేషం: ద్రుపద మహారాజు, ద్రోణుడు బాల్య మిత్రులు. సతీర్థ్యులు. ఒకే గురువు దగ్గర విలువిద్య నేర్చుకున్నారు. తదుపరి ద్రుపదుడు సింహాసనం ఎక్కి పాంచాలరాజు అయ్యాడు. ద్రోణుడు బీద బ్రాహ్మణుడిగా మిగిలిపోయాడు. తదుపరి తన కొడుకు అశ్వత్థామ పాలకోసం గోదానం అభ్యర్థిస్తూ ద్రోణుడు పాంచాలరాజు దగ్గరకు వెళ్ళి, బాల్య స్నేహం ఉదాహరిస్తాడు. ద్రుపదుడు తన్ను యాచన చేయటానికి వచ్చిన నిర్భాగ్యుడు బాల్య సఖుడుగా తన్ను సంబోధించటం ఇష్టంలేక అతడిని అవమానించి పొమ్మన్నాడు. ఆనాటి నుండి ద్రోణుడు ద్రుపదుడిపై పగబట్టాడు. తదుపరి, అర్జునుడిచేత గురుదక్షిణగా ద్రుపదుడిని తన వద్దకు బందీకృతుడిగా తెప్పించుకొన్నాడు. అంతేగాక, కురురాజులకు పాంచాల ప్రభువులకు తరతరాల నుండీ శత్రుత్వం ఉన్నది. దుర్యోధనుడికి - పాంచాల రాజుపై ఏర్పడిన శత్రుత్వం కలిసివచ్చింది - (చిట్టచివరకు ద్రోణుడి కంఠం ఉత్తరించినది.. ధృష్టద్యుమ్నుడు. ద్రోణుని చంపగల పుత్రుడు కావాలని వరం కోరుకొన్నాడు. ద్రుపదుడి తపఃఫలంగా. కారణజన్ముడైన ధృష్టద్యుమ్నుడు కలిగాడు.)

వ. ఇట్లు ద్రోణుండు ద్రుపదుం దెరల్చి ధృష్టద్యుమ్ను చనినవల నరసి తదీయ ప్రమోహనమార్గణమూర్ఛితం బయిన శూరలోకంబు నాలోకించి కరంబు రయంబునఁ బోయి. 375

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; ద్రోణుండు; ద్రుపదున్= ద్రుపదరాజును; తెరల్చి= ఓడించి (మరలించి); ధృష్టద్యుమ్ను+చనిన+వలను+అరసి= ధృష్టద్యుమ్నుడు పోయిన దిక్కు చూచి; తదీయ ప్రమోహన బాణ మూర్ఛితంబు+అయిన= ఆతనియొక్క ప్రమోహన బాణంచే మూర్ఛపోయిన; శూర లోకంబున్= వీరుల సముదాయాన్ని; ఆలోకించి= చూచి; కరంబు+రయంబునన్= మిక్కుటమగు వేగంతో; పోయి.

తాత్పర్యం: ఈ విధంగా ద్రోణుడు ద్రుపదుడిని మరల్చి, ధృష్టద్యుమ్నుడు వెళ్ళిన తెరువుచాలు అరసి, ఆతడి ప్రమోహన బాణంచేత మూర్ఛితులైన యోధులను చూచి, వేగంగా అక్కడకు వెళ్ళి. (తరువాతి పద్యంతో అన్వయం).

క. వినుతప్రజ్ఞాబాణం। బున మోహనబాణశక్తి వోఁ జేసిన సం
జనిత ప్రాణోజ్జ్వలు లై। యనికిం గ్రమ్మఱ గడంగి రయ్యోధవరుల్. 376

ప్రతిపదార్థం: వినుత ప్రజ్ఞా బాణంబునన్= పొగడబడిన ప్రజ్ఞాబాణంతో; మోహన బాణ శక్తి= మోహన బాణము యొక్క శక్తిని; పోన్+చేసినన్= పోగొట్టగా; సంజనిత+ప్రాణ+ఉజ్జ్వలులు+ఐ= తిరిగి అవతరించిన ప్రాణాలచేత ప్రకాశించునట్టివారై; ఆ+యోధవరుల్= ఆ వీరశ్రేష్ఠులు; అనికిన్= యుద్ధానికి; క్రమ్మఱన్= తిరిగి; కడంగిరి= పూనిక వహించారు.

తాత్పర్యం: ద్రోణుడు ప్రజ్ఞాబాణం ప్రయోగించి, మోహనబాణ శక్తిని పోగొట్టారు. అప్పుడు తిరిగి కోలుకొన్న ప్రాణాలతో ఆ కౌరవరాజపుత్రులు మళ్ళీ యుద్ధం ప్రారంభించారు.

విశేషం: మోహన బాణానికి విరుగుడు ప్రజ్ఞాబాణం.

వ. ఇవ్విధంబున నాచార్యు ప్రాపునం జేసి యేచి నీ కొడుకులు పవనద్రుపదుల కొడుకులపై నడరినం గని యుధిష్ఠిరుండు గేకయు లేవురను ద్రౌపదేయులను ధృష్టకేతునిం జూచి మీ రభిమన్యుండు ముంగలిగా రథంబులు వఱపి భీమసేన ధృష్టద్యుమ్నులకుఁ దోడుపడుం డని పంచిన. 377

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ రీతిగా; ఆచార్యు+ప్రాపునన్+చేసి= ద్రోణుని సాయం వలన; ఏచి= విజృంభించి; నీ కొడుకులు= నీ పుత్రులు; పవన ద్రుపదుల కొడుకులపైన్= వాయు పుత్రుడైన భీముడిపై, ద్రుపదపుత్రుడైన ధృష్టద్యుమ్నుడిపై; అడరినన్= విజృంభింపగా, కని; యుధిష్ఠిరుండు= ధర్మరాజు; కేకయులు+ఏవురను= కేకయ ప్రభువులు అయిదుగురును; ద్రౌపదేయులను= ఉపపాండవులను ఐదుగురిని; ధృష్టకేతునిన్+చూచి= ధృష్టకేతుని వీక్షించి; మీరు; అభిమన్యుండు; ముంగలిగాన్=

ముందుండువాడుగా; రథంబులు+పఱపి= ఆ రథాలు తోలించి; భీమసేన+ధృష్టద్యుమ్నులకున్= భీముడికీ, ధృష్టద్యుమ్ననకు; తోడుపడుండు= సాయము చేయండి; అని పంచినన్= అని నియమించగా.

తాత్పర్యం: ఈ విధంగా ద్రోణుని సాయం వలన, నీ కొడుకులు భీముడిపై ధృష్టద్యుమ్నుడిపై విజృంభించారు. దానిని చూచి - ధర్మరాజు కేకయులను అయిదుగురిని - ద్రౌపది కొడుకులు అయిదుగురిని - అభిమన్యుడి ముందు పెట్టుకొని వెళ్ళి భీముడికీ ధృష్టద్యుమ్నుడికీ సాయం చేయండి అని ఆదేశించాడు.

క. ఆ పన్నిద్దఱు సైన్యా। టోపసమేతముగఁ గవియుడును బాంచాల
క్ష్మా పాలసుతుఁడు భీముఁడు। నేపారిరి నీదుసేన యెసకం బడఁగన్. 378

ప్రతిపదార్థం: ఆ+పన్నిద్దఱు= ఆ పన్నెండుమంది; సైన్య+ఆటోప+సమేతముగాన్= తమ సైన్యాలతోపాటు గర్వంగా; కవియుడును= మార్కొనగా; పాంచాల క్ష్మాపాల సుతుఁడు= పాంచాల రాజపుత్రుడు (ధృష్టద్యుమ్నుడు); భీముఁడు; నీదు+సేన+ఎసకంబు= నీ సేన అతిశయం; అడఁగన్= అణగారునట్లుగా; ఏపారిరి= విజృంభించారు.

తాత్పర్యం: ఆ పండ్రెండుగురు అనగా ఐదుమందికేకయులూ, అయిదుగురు ఉపపాండవులు, అభిమన్యుడూ, ధృష్టకేతుడూ తమ సైన్యాలతో సహా గర్వంగా మార్కొనగా, ద్రుపదరాజ పుత్రుడు ధృష్టద్యుమ్నుడు, మరియు భీముడు నీ సేన యొక్క అతిశయం అణగారి పోయేటట్లుగా విజృంభించారు.

వ. తదవసరంబున. 379

ప్రతిపదార్థం: తద్+అవసరంబునన్= ఆ సమయంలో.

తాత్పర్యం: ఆ సమయంలో.

తే. ‘ క్రందుఁ గయ్యంబులోన నరాతిభయద। బాహువిక్రమ! నీ విట్లు పాదచారి
వగుట వల దని కేకయునరద మెక్కఁ’ బనిచె భీమునిఁ బాంచాలపతిసుతుండు. 380

ప్రతిపదార్థం: క్రందు+కయ్యంబులోనన్= అతిశయించుతున్న యుద్ధంలో(సందడి యుద్ధంలో); అరాతి+భయద+బాహు+విక్రమ!= శత్రువులకు భయం కలిగించే బాహు పరాక్రమం గలవాడా - భీమసేనా!; నీవు; ఇట్లు; పాదచారివి+అగుట= కాలినడక చేసే వాడివి అగుట; వలదు= కూడదు; అని= అని చెప్పి; పాంచాల పతి సుతుండు= పాంచాల రాజు కొడుకు ధృష్టద్యుమ్నుడు; కేకయు= కేకయ రాజు యొక్క; అరదము= రథం; భీమునిన్ ఎక్కన్+పనిచెన్= ఎక్కుమన్నాడు.

తాత్పర్యం: ‘శత్రువులకు భయం కలిగించే భుజ పరాక్రమం కల ఓ భీమసేనా! ఇది దొమ్మియుద్ధం. నీవు ఈ రీతిగా పాదచారివి కాకూడదు’ అని చెప్పి, ధృష్టద్యుమ్నుడు భీముడిని కేకయుని రథంమీదికి ఎక్కుమన్నాడు.

క. అప్పుడు మధ్యందినమున। నొప్పినయినుతోడఁ జాల నొర వచ్చి గురుం
డప్పాండవబలములపైఁ। దెప్పదెరలఁ గురిసె శరతతిం దీవ్రముగన్. 381

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో; మధ్యందినమునన్= మట్టమధ్యాహ్నకాలమున; ఒప్పిన= శోభిల్లిన; ఇనుతోడన్= సూర్యుడితో; చాలన్; ఒర+వచ్చి= సామ్యం గలవాడై, సమానుడై; గురుండు= ద్రోణుడు; ఆ+పాండవ+బలములపైన్= ఆ పాండవు ల సేనలపై; శర తతిన్= బాణాల సముదాయమును; తీవ్రముగాన్= ఉగ్రముగా; తెప్పతెరలన్= అతివేగంగా; కురిసెన్= వర్షించాడు.

తాత్పర్యం: ఆ సమయంలో ద్రోణుడు - మధ్యాహ్న కాలంలోని సూర్యుని పోలుతూ, ఆ పాండవసేనలపై తీవ్రమైన బాణాల సముదాయాన్ని అతివేగంగా ప్రయోగించాడు.

చ. కనుఁగొని పార్షతుం డపుడు గట్టుపకాసయి వీఁకఁ దాఁకినం
దునిమె నతండు తద్ధనువుఁ దోడన పెక్కు శరంబు లేసె నా
తని మెయి నొండువిల్లు ద్రుపదక్షితిపాలసుతుండు గ్రక్కునం
గొని శరసప్తతిం గురిసి కోపముఁ బెంచిన నాతఁ డుగ్రతన్. **382**

ప్రతిపదార్థం: కనుఁగొని= చూచి; పార్షతుండు= పృషతుని వంశీయుడు - ధృష్టద్యుమ్నుడు; అపుడు; కట్టుపకాసి+అయి= ధీరుడు అయి; వీఁక+తాఁకినన్= ఉత్సాహంతో మార్కొనగా; అతండు= ద్రోణుడు; తద్+ధనువు= అతడి విల్లు (ధృష్టద్యుమ్నుడి విల్లు); తునిమెన్= విరుగగొట్టాడు; తోడన= వెనువెంటనే; పెక్కు+శరంబులు= అనేక బాణాలు; ఏసెన్= ప్రయోగించాడు; ఆతని+మెయిన్= ధృష్టద్యుమ్నుని శరీరంపై; ద్రుపదక్షితిపాల సుతుండు= ద్రుపదరాజపుత్రుడు; ఒండు+విల్లు= ఇంకో ధనుస్సు; గ్రక్కునన్= వేగంగా; కొని= స్వీకరించి; శర+సప్తతిన్+కురిసి= డెబ్భై బాణాలు ప్రయోగించి; కోపమున్= ఆగ్రహం; పెంచినన్= అతిశయింపజేయగా; ఆతఁడు= ద్రోణుడు; ఉగ్రతన్= భయంకరంగా.

తాత్పర్యం: ద్రోణుడి విజృంభణ చూచి ధృష్టద్యుమ్నుడు - ఆ సమయంలో ధీరుడై ఉత్సాహంతో అతడిని మార్కొన్నాడు. ద్రోణుడు ధృష్టద్యుమ్నుడి విల్లు ఖండించి, వెనువెంటనే ఆతని శరీరంపై అమ్ములు గుప్పాడు. ధృష్టద్యుమ్నుడు వేరొక విల్లు పట్టుకొని ద్రోణుడిపై డెబ్భై బాణాలు వేశాడు. ద్రోణుడు ఆగ్రహించి, భయంకరుడై (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: 'గట్టుపకాసి' (లేదా) 'కట్టుపకాసు' ఈ మాటకు అర్థం - 'వీరుడు (శూరుడు)'. శబ్దరత్నాకరంలో ఈ శబ్దం 'క'తో మొదలై ఉన్నది. అచలుడు అని అర్థం ఇవ్వబడింది. బ్రౌను నిఘంటువులో 'గ' తో మొదలై - గట్టుపకాసి అని గట్టుపకాసి = గట్టువలె ప్రకాశించువాడు - పర్వత ధీరుడు అని ఉంది. బ్రౌను స్వీకరించిన శబ్దమే సమంజసంగా తోచుతున్నది. సూర్యరాయాంధ్ర నిఘంటువులో 'ఇది ఇంకను ఆలోచింపదగినది' అని ఉన్నది.

క. ఆ విల్లు ద్రుంచి రౌద్రర । సావేశంబొప్ప నాలుగమ్ముల రథవా
హావలిని సూతు నొక్కట । దేవగణము వొగడ వసుమతిం బడ నేసెన్. **383**

ప్రతిపదార్థం: ఆ విల్లున్ త్రుంచి= ఆ ధనుస్సును ఖండించి; రౌద్ర రస+ఆవేశంబు+ఒప్పన్= క్రోధరసం యొక్క సంరంభం శోభిల్లగా; నాలుగు+ అమ్ములన్= నాలుగు బాణాలతో; రథ వాహ+ఆవలిని= తేరుకు పూన్చిన గుర్రాల సముదాయాన్ని; ఒక్కటన్= ఒక బాణంతో; సూతున్= సారథిని; దేవ+గణము= దేవతల గుంపు; పొగడన్= ప్రశంసింపగా; వసుమతిన్+పడన్+ఏసెన్= నేలపై కూల్చాడు.

తాత్పర్యం: ద్రోణుడు ధృష్టద్యుమ్నుడి ధనువు ఖండించి, మిక్కుటమగు కోపంతో - నాలుగు బాణాలతో అతడి గుర్రాలను, ఒక బాణంతో అతడి సారథిని - దేవతలు కీర్తించేటట్లుగా నేలపై కూల్చాడు.

విశేషం: 'రౌద్ర రస+ఆవేశంబు' - తిక్కన 'రస' శబ్దాన్ని ఎన్నో సారులు ప్రయోగించాడు. 'రసము' అని వాచ్యంగా చెప్పటం కావ్య శిల్పమునకు అపకర్ష అని వాదించే విమర్శకులు ఉన్నారు. 'రస' శబ్దం నవరసపరంగా ఆలంకారికముగానే తిక్కన వాడలేదు. రసమును ఆర్థభావంగా స్వీకరించవచ్చును. రసములు ఎన్ని? 'అనంతో వై రసాఃా' - 'రసములు అనంతములు' అనే సుప్రసిద్ధ వాదం ఉన్నది.

మ. విరథుండై యభిమన్యు తేరిపయికిన్ వేగంబ పాంచాలభూ
వరసూనుం డరుగం దదీయబల మోర్వం జాల కొక్కుమ్మడిన్
మరలంబాఱె నతండు వాయుసుతుఁడున్ మానింప మానింప న
ప్పు డథానీకముతోడ భీముఁ బొదివెన్ భూమీశ్వరుం డుద్ధతిన్. 384

ప్రతిపదార్థం: విరథుండు+ఐ= రథం లేనివాడై; వేగంబు+అ= వేగంబ= మిక్కిలి శీఘ్రంగా; పాంచాల భూవర సూనుండు= పాంచాల రాజపుత్రుడు(ధృష్టద్యుమ్నుడు); అభిమన్యు+తేరి+పయికిన్= అభిమన్యుని రథంమీదికి; అరుగన్= వెళ్ళగా; తదీయ+బలము= అతని సేన; ఓర్వన్+జాలక= ద్రోణుని ధాటికి సహింపలేక; ఒక్కుమ్మడిన్= కలిసికట్టుగా(అందరూ ఏకంగా); మరలన్+పాఱెన్= మరలిపారిపోయింది; అతండు= ధృష్టద్యుమ్నుడు; వాయుసుతుఁడున్= భీముడును; మానింపన్+మానింపన్= ఆపగా, ఆపగా; అప్డు= ఆ సమయంలో; రథ+అనీకముతోడన్= రథసేనతో; భూమీశ్వరుండు= రాజు(దుర్యోధనుడు); భీమున్; ఉద్ధతిన్= గర్వంతో; పొదివెన్= చుట్టుముట్టాడు.

తాత్పర్యం: ధృష్టద్యుమ్నుడు - విరథుడై అభిమన్యుడి రథం మీదికి పోయాడు. ఆతడి సేన ద్రోణుడి ధాటికి తట్టుకోలేక పారిపోయింది. అప్పుడు అతడు, భీముడు - పారిపోయే సేనను ఆపారు. ఆ సమయంలో దుర్యోధనుడు తన రథ సేనతో వచ్చి సగర్వంగా భీముడిని చుట్టుముట్టాడు.

ధృష్టద్యుమ్నుఁడు ద్రోణునితో యుద్ధము సేయుట (సం. 6-73-67)

తే. అంత నొం డొకసారథి యతిరయమునఁ। జటులహయములఁ బూన్పఁ బాంచాలసుతుఁడు
దన రథమునకు గ్రక్కునఁ జని పరాక్ర। మాభిరాముఁడై గురునిపై నడరెఁ బెలుచ. 385

ప్రతిపదార్థం: అంతన్= పిదప; ఒండు+ఒక+సారథి= ఇంకొక సూతుడు; అతి రయమునన్= మిక్కిలి వేగంగా; చటుల హయములన్= వేగంగా పోయే గుర్రాలను; పూన్పన్= తన రథానికి కట్టగా; పాంచాల సుతుఁడు= ధృష్టద్యుమ్నుడు; గ్రక్కునన్+చని= వేగంగా వెళ్ళి; పరాక్రమ+అభిరాముడు+ఐ= పరాక్రమము చేత అందగించినవాడై; పెలుచన్= ఆటోపంతో; గురునిపైన్= ద్రోణుడిపై; అడరెన్= విజృంభించాడు.

తాత్పర్యం: అంతట, మరియొక సారథి, మిక్కిలి వేగంతో శీఘ్రంగా పరుగెత్తే గుర్రాలను తన రథానికి పూన్పగా, ధృష్టద్యుమ్నుడు తన రథం ఎక్కి, పరాక్రమంతో శోభిల్లి తిరిగి ద్రోణుడిపై విజృంభించాడు.

వ. ఇట్లు ధృష్టద్యుమ్నుండు గడంగి యెప్పటియట్ల కుంభసంభవుతోడం బెనంగుచుండ భీమసేనుండును.386

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; ధృష్టద్యుమ్నుండు= ధృష్టద్యుమ్నుడు; కడంగి= పూని; ఎప్పటి+అట్లు+అ= యథాప్రకారం; కుంభ+సంభవుతోడన్= ద్రోణునితో; పెనంగుచుండన్= విరమించని పోరాటం సలుపుచుండగా; భీమసేనుండును= భీముడు గూడ;

తాత్పర్యం: 'ఈ విధంగా ధృష్టద్యుమ్నుడు తిరిగి వెనుకటి మాదిరిగా ద్రోణునితో పోరాటం ప్రారంభించగా, భీముడు కూడ.

క. తనయరదంబు విశోకుఁడు। గొనివచ్చిన నెలమి నెక్కి క్రూరోత్సాహం
బునఁ దనుఁ బొదివిన దుర్యో। ధనుమీఁద నిశాతవిశిఖతతి నిగిడించెన్. 387

ప్రతిపదార్థం: తన+అరదంబున్= తన రథాన్ని; విశోకుఁడు= భీముని సారథి; కొనివచ్చినన్= తీసికొని రాగా; ఎలమిన్+ఎక్కి= సంతోషంతో ఆరోహించి; క్రూర+ఉత్సాహంబునన్= కఠినమైనట్టి ఉద్వేగముతో కూడిన పూనికతో; తనున్= తన్ను; పొదివిన= చుట్టుముట్టిన; దుర్యోధనుమీఁదన్= దుర్యోధనుడిపై; నిశాత+విశిఖ+తతిన్= వాడియైన అమ్ముల గుంపులు; నిగిడించెన్= ప్రయోగించాడు.

తాత్పర్యం: అంతలో విశోకుడు తన రథాన్ని తోలుకొని తెచ్చాడు. భీముడు సగర్వంగా ఆ రథాన్ని ఎక్కి, కరకుదనం ఉప్పొంగే పూనికతో తన్ను చుట్టుముట్టిన దుర్యోధనుడిపై అమ్ములవాన కురిపించాడు.

క. కురుపతి యొక నారాచం । బురమున నాటింప భీముఁ డుగ్రత నేసెన్
గురుతరశరత్రయంబున । గరములు వక్షమును నాటఁ గౌరవనాథున్. 388

ప్రతిపదార్థం: కురుపతి= కురురాజు(దుర్యోధనుడు); ఒక+నారాచంబు= ఒక బాణం; ఉరమునన్= వక్షమునందు; నాటింపన్= గ్రుచ్చుకొనేటట్లు వేయగా; గురుతర+శర+త్రయంబునన్= గొప్పవైన మూడు బాణాలతో; కౌరవనాథున్= దుర్యోధనుడిని; కరములు= చేతులు; వక్షమును= ఉరమును; నాటన్= గ్రుచ్చికొనునట్లుగా; భీముఁడు= భీమసేనుడు; ఉగ్రతన్+ఏసెన్= భయంకరముగా ప్రయోగించాడు.

తాత్పర్యం: ఒక బాణంతో దుర్యోధనుడు భీముడి వక్షమును తాకేటట్లు కొట్టాడు. భీముడు - మూడు బాణాలను, దుర్యోధనుడి రెండు చేతులందు - రొమ్ముపైన గ్రుచ్చుకొనేటట్లుగా, భయంకరంగా ప్రయోగించాడు.

వ. దాని కతండు చలింపక వృకోదరుపై వివిధశరంబులేసె నతనితమ్ములు దలకడచి యాభీమసేనుం బట్టికొన నుత్సహించి యెప్పటియట్ల బెట్టిదంబుగాఁ గవిసినం గని యక్కుమారుల నభిమన్యు ద్రౌపదేయులును ధృష్టకేతు కేకయులునుం దాఁకి రట్లు వారును నమ్మారుతియుం గూడి దారుణభంగిం దఱుముట సైరింపం జాలక. 389

ప్రతిపదార్థం: దానికిన్+అతండు చలింపక= భీముడు వేసిన మూడు బాణాలకు దుర్యోధనుడు కదలక; వృకోదరుపైన్= భీముడిపై; వివిధ శరంబులు= పెక్కు అమ్ములు; ఏసెన్= ప్రయోగించాడు; అతని తమ్ములు= దుర్యోధనుడి సోదరులు; తలకడచి= విజృంభించి; ఆ భీమసేనున్= ఆ భీమును; పట్టికొనన్+ఉత్సహించి= పట్టుకోవాలని ఉత్సాహంతో ప్రయత్నించి; ఎప్పటి+అట్ల+అ= ఎప్పటి మాదిరిగానే(యథాప్రకారంగా); బెట్టిదముగాన్= ఎక్కువగా; కవిసినన్= మార్కొనగా; కని; ఆ+కుమారులన్= ఆ కౌరవరాజపుత్రులను; అభిమన్యు, ద్రౌపదేయులును= అభిమన్యుడు - ద్రౌపది కొడుకులును; ధృష్టకేతు+కేకయులున్; తాఁకిరి= మార్కొన్నారు; అట్లు; వారును= అభిమన్యుడు మున్నగువారును; మారుతియున్= భీముడును; కూడి= కలిసికొని; దారుణ+భంగిన్= భయంకరముగా; తఱుముట= మార్కొనటం; సైరింపన్+చాలక= ఓర్వక.

తాత్పర్యం: దుర్యోధనుడు భీముడి బాణాలకు చలింపక - అతడిపై పెక్కు అమ్ములు ప్రయోగించాడు. దుర్యోధనుడి తమ్ములు పైకి విజృంభించి, ఆ భీమసేనుడిని పట్టుకోవాలని, ఉత్సాహంతో అతడిని యథాప్రకారం మార్కొన్నారు. అప్పుడు అభిమన్యుడు, ద్రౌపది తనయులు ధృష్టకేతుడు, కేకయులు - భీముడికి బాసటగా నిలిచారు. భీముడు, వారందరు కలిసి భయంకరంగా కౌరవరాజకుమారులపై విజృంభించారు. వారి ధాటికి కౌరవరాజకుమారులు తట్టుకోలేకపోయారు.

క. విఱిగి భవత్సుత నివహం । బఱిముఱిఁ గనుకనిఁ జనంగ ననిలసుతుం డే
డ్తెఱ నెగచి వగచె వారం । దఱుఁ దనచేఁ జచ్చుటపుడు దప్పుటకుఁ గడున్. 390

ప్రతిపదార్థం: విఱిగి= ఓడిపోయి; భవత్+సుత+ నివహంబు= నీకొడుకుల సముదాయం; అటిముటిన్= వేగంగా; కనుకనిన్+చనంగన్= భయపడి వెడలిపారిపోగా; అనిల+సుతుండు= వాయుపుత్రుడు(భీముడు); ఏడ్తెఱన్= పరాక్రమంతో; ఎగచి= విజృంభించి; వారు+అందఱున్= ఆ కౌరవరాజపుత్రులు అందరూ; తనచేన్+చచ్చుట+అపుడు+తప్పుటకున్= అపుడు తనచే చావకుండా తప్పించికొనిపోవటానికి; కడున్= మిక్కుటముగా; వగచెన్= విచారించాడు.

తాత్పర్యం: ఓడిపోయి నీ కుమారవర్గం భయంతో వేగంగా పారిపోయారు. భీముడు తనకు లభించిన అవకాశం తప్పిపోయింది అనీ, వారు అందరు తన చేత చావకుండా తప్పించుకున్నారనీ మిక్కిలి విచారించాడు.

క. తమ్ములఁ దోలిన నతిరౌ । द्रమ్ముగఁ గోపించి యన్నదలపడియెను సై
న్యమ్ముఁ బురికొలిపికొని రభ । సమ్మున భీమాదియోధసంఘముతోడన్. 391

ప్రతిపదార్థం: తమ్ములన్= సోదరులను(అవరజులను); తోలినన్= పారిపోవునట్లు చేయగా; అతి+రౌద్రమ్ముగన్= మిక్కిలి రోషంతో; కోపించి= ఆగ్రహం చెంది; అన్న= అగ్రసోదరుడు(దుర్యోధనుడు); సైన్యమ్మున్= సేనను; పురికొలిపికొని= ప్రోత్సహించి; రభసమ్మునన్= సంరంభంతో; భీమ+ఆది యోధ సంఘముతోడన్= భీముడు మున్నగు యోధుల గుంపుతో; తలపడియెను= మార్కొన్నాడు.

తాత్పర్యం: తమ్ములను ఓడించి తరిమినందుకు దుర్యోధనుడికి కోపం వచ్చింది. అతడు సేనను ప్రోత్సహించి, సంరంభంతో భీముడు మున్నగు వీరులపై విజృంభించాడు.

క. అపరాహ్ణ సమయమున న । ట్లుపమాతీతాతిఘోరయుద్ధం బయ్యెన్
రిపుభయదభుజుఁడు భీమున । కపరిమితబలుండు గురుధరాధీశునకున్. 392

ప్రతిపదార్థం: అపర+అహ్ణ+సమయమునన్= మధ్యాహ్నము తదుపరి వేళయందు; అట్లు; ఉపమా+అతీత+అతి ఘోర యుద్ధంబు= సాదృశ్యం చెప్పటానికి వీలులేని భయంకర సంగ్రామం; రిపు భయద భుజుఁడు= శత్రువులకు వెఱపుగొలిపే భుజములు కలవాడు (భీముడు)భీమునకును; కురు+ధరా+అధీశునకున్= కురురాజుకు(దుర్యోధనుడికి); అయ్యెన్= జరిగింది.

తాత్పర్యం: మధ్యాహ్నం దాటిన వేళలో, శత్రువులకు భయంకరుడైన భీముడికీ, కౌరవరాజు అయిన దుర్యోధనుడికీ మధ్య ఉపమించటానికి వీలులేని భయంకర సంగ్రామం జరిగింది.

సీ. తదవసరంబునఁ బొదివి వికర్ణుండుఁ జిత్రసేనుఁడుఁ బార్థపుత్రుమీఁదఁ
గవిసిన నతఁడు వికర్ణరథ్యంబులఁ గూల్చి యాతనిపయిఁ గుప్పికోల
లిరువది నాటింప నరదంబు డిగి భీతి యూన నాతఁడు చిత్రసేనురథము
పై కేఁగె ద్రౌపదిపట్టు లేవురు భీమునకు నడ్డపడి కురునాథుఁ దాఁకి

తే. మేనునెత్తురు వఱ్ఱుగా మెఱుఁగుటమ్ము । లేయ వారలఁ దలపడి యేనునార
సముల రారాజు నో నేసి సరభసముగఁ । దఱిమె గాంగేయుఁ డరిసేనఁ దఱియఁ జొచ్చె. 393

ప్రతిపదార్థం: తద్+అవసరంబునన్= ఆ సమయంలో; పొదివి= చుట్టుముట్టి; వికర్ణుఁడు; చిత్రసేనుఁడు; పార్థ+పుత్రుమీఁదన్= అర్జునుడి కొడుకైన అభిమన్యుడిపై; కవిసినన్= మార్కొనగా, అతఁడు= అభిమన్యుడు; వికర్ణ+రథ్యంబులన్= వికర్ణుడి తేరు గుఱ్ఱాలను; కూల్చి= సంహరించి; ఆతని+పయిన్= వికర్ణుడిపై; కోలలు+ఇరువది= ఇరవై బాణాలు; నాటింపన్= గ్రుచ్చగా; అరదంబు+డిగి= రథం దిగి; భీతి+ఊనన్= భయం పొందగా; ఆతఁడు= వికర్ణుడు; చిత్రసేను+రథముపైకిన్; ఏగెన్= వెళ్ళాడు; ద్రౌపది+పట్టులు+ఏవురున్= ద్రౌపది కొడుకులు అయిదుగురును; భీమునకున్; అడ్డుపడి= అడ్డంగా నిలిచి; కురునాథున్+తాఁకి=

కురుపతి (దుర్యోధనుని); మార్కొని; మేను+నెత్తురు= శరీరంపై రక్తం; వఱ్ఱుగాన్= ప్రవాహంగా; మెఱుఁగు+అమ్ములు= మెరిసే బాణాలు; వేయఁగాన్= ప్రయోగించగా; వారలన్+తలపడి= వారిని తాకి; ఏను+నారసములన్= అయిదు బాణాలతో; రారాజున్= దుర్యోధనుని; నోన్+ఏసి= బాధపడేటట్లు ప్రయోగించి; సరసభసముగన్= సంరంభముతో; తఱిమెన్= కవిశాడు; గాంగేయుఁడు= గంగకొడుకు(భీష్ముడు); అరిసేనన్= శత్రుసేనను; తఱియన్+చొచ్చెన్= ప్రవేశించాడు.

తాత్పర్యం: ఆ సమయంలో వికర్ణుడు, చిత్రసేనుడు అర్జునసుతుడైన అభిమన్యుడిని మార్కొన్నారు. అభిమన్యుడు - ఆ వికర్ణుని గుర్రాలను సంహరించి, విరథుడైన అతడిపై ఇరవై బాణాలు ప్రయోగించి అతనిని నొప్పించగా అతడు భయపడి చిత్రసేనుడి రథంమీదికి వెళ్ళాడు. ద్రౌపది కొడుకులు అయిదుగురూ భీముడికి సాయంగా వచ్చి - కురుపతి దుర్యోధనుడిపై ప్రకాశించే బాణాలను ప్రయోగించి, ఐదు బాణాలతో అతడిని నొప్పించి తరిమివేశారు. అంతలో భీష్ముడు శత్రుసేనలో ప్రవేశించాడు.

క. చొచ్చి చతురంగ వితతులు। విచ్చునటులు సేయుటయును వివ్వచ్చుఁడు వే
వచ్చి తలపడినఁ బురికొని। యచ్చట నిరువాఁగు నట్టలాడం బోరెన్. 394

ప్రతిపదార్థం: చొచ్చి= ప్రవేశించి; చతుఃఅంగ+వితతులు= నాలుగు సేనాంగముల సమూహాలు; విచ్చు+అటులు= బ్రద్దలై విచ్చిపోయేటట్లుగా; చేయుటయును= చేయటంచేత; వివ్వచ్చుఁడు= అర్జునుడు; వే+వచ్చి= వేగంగాఅరుదెంచి; తలపడినన్= మార్కొనగా; పురికొని= ఉత్సహించి; ఇరువాఁగున్= రెండుపక్షాలూ; అట్టలాడన్= అల్లాడగా (మొండెములాడేటట్లు); పోరెన్= యుద్ధం చేశాయి.

తాత్పర్యం: సేనాపతియైన భీష్ముడు ప్రవేశించి - పాండవ సేన చెదరిపోయేటట్లు చేశాడు. అంతలో అర్జునుడు అరుగుదెంచి భీష్ముడిని మార్కొనగా, ఇరుపక్షాలూ ఉత్సాహంతో (మొండెము లాడగా) పోరాటం కొనసాగించాయి.

ఆ. రక్తనదులలోన రథయానపాత్రముల్। వఱపి యోధవరులు బాహుబలము
వెలయ సమరకేళి సలిపిరి శూరత। నేచి కడఁగి యోల రాచి రాచి. 395

ప్రతిపదార్థం: రక్త నదులలోనన్= నెత్తురు ప్రవాహాలలో; రథయానపాత్రముల్= రథములు అనే పడవలు; వఱపి= నడపి; యోధవరులు= వీరశ్రేష్ఠులు; బాహు బలము వెలయన్= భుజ పరాక్రమం శోభిల్లగా; శూరతన్= శౌర్యంతో; ఏచి= విజృంభించి; కడఁగి= పూని; ఓల= (రక్త) జల క్రీడలో; రాచి+రాచి= సంఘర్షణ ఘటించి ఘటించి; సమర కేళి సలిపిరి= యుద్ధం అనే ఆట ఆడారు.

తాత్పర్యం: రక్త నదులలో రథాలను పడవలుగా ఉపయోగించి, వీరవరులు భుజబలం శోభిల్లగా పరాక్రమంతో విజృంభించి ఒకరినొకరు ఒరుసు కొంటూ రక్తజలక్రీడగా యుద్ధమనే ఆట ఆడారు.

విశేషం: అలం: రూపకం.

వ. అంత నరుణకిరణుం డన్వర్థాభిధానుం డగుచు వచ్చిన వేగిరపడి వాయునందనుండు సుయోధను నేఁడ
సమయింతు ననుసంరంభంబున నతనికి సమ్ముఖంబుగాఁ దేరు వఱపించి కదిసి క్రోధమోదంబులు
మనంబునం పెనంగొన నతనిం గనుంగొని. 396

ప్రతిపదార్థం: అంతన్= అటుపిమ్మట; అరుణ+కిరణుఁడు= ఎఱ్ఱని కిరణాలు కలవాడు(సాయం సూర్యుడు); అను+అర్థ+అభిధానుండు+అగుచున్= సార్థక నామధేయుడు అగుచు; వచ్చినన్= అరుదెంచగా; వేగిరపడి= తొందరపడి; వాయునందనుండు= మారుతి(భీముడు); సుయోధనున్= దుర్యోధనుడిని; నేఁడు+అ=నేడే, ఈ దినమునందే; సమయింతున్= సంహరింపగలను; అను+సంరంభంబునన్= అనే ఆటోపంతో; అతనికిన్= ఆ దుర్యోధనుడికి; సమ్ముఖంబుగాన్= ఎదురుగా(దగ్గరగా);

తేరు= రథము; పఱపించి= నడపి; కదిసి= కూడి; క్రోధ+మోహంబులు= కోపం, మోహం; మనంబునన్= మనస్సులో; పెనంగొనన్= పెనగొనగా; అతనిన్+కనుంగొని= ఆ దుర్యోధనుడిని చూచి.

తాత్పర్యం: అంత అరుణ కిరణుడు - ఎర్రని కిరణాలతో తన పేరుకు తగినట్లుగా అరుగుదెంచగా, భీముడు వేగిరపడి - 'నేడే దుర్యోధనుడిని సంహరింపగలను' అనే సరభస వృత్తితో అతడికి చేరువగా తన రథం తోలించాడు. అతడి మనస్సులో కోపం - మోహం పిరిగొన్నాయి.

విశేషం: భీముని వేగిరపాటుకు కారణం - సూర్యుడు అరుణ కిరణుడు కావటం. సూర్యుడు అస్తమించేటప్పుడు ఉభయ పక్షాలు యుద్ధవిరమణ చేయాలి గదా! ఈలోపుగా - 'నేడే' దుర్యోధనుడిని వధించాలని భీముని ఆరాటం.

సీ. కడుఁ బెద్ద కాలంబు గాంక్షించి యున్నయుత్సవ మిప్డు సమకూర దైవ మిచ్చె
గొంతిసంకటపాటుఁ గోడలిబన్నంబుఁ దీర్చెదఁ గృష్ణుండు దెలుప నీవు
సరకు సేయమియును సభలో నులూకునిఁ బంచి యాడించిన పరుసములును
గక్కించి బీరంబు దక్కించుకొననీక తెగఁ జూడఁగాంచితి మగతనంబు

తే. గలిగి మగుడక నిలు మని పలికి యుగ్ర గతి నెదుర్కొని రథతురంగముల సూతుఁ
జంపి చాపంబు ద్రుంచి విస్ఫారకేతు । దండ మేడ్తెఱ నఱకె భీముండు సెలఁగి. 397

ప్రతిపదార్థం: కడున్+పెద్ద+కాలంబు= చాలా నాళ్ళుగా; కాంక్షించి+ఉన్న= కోరుకొనినట్టి; ఉత్సవము= పండుగ; ఇప్డు= ఇపుడు; దైవము= అదృష్టము; సమకూరన్+ఇచ్చెన్= సమకూరేటట్లు చేసింది; గొంతి+సంకటపాటు= కుంతీదేవి పడిన కష్టాలు; కోడలి+బన్నంబు= ద్రౌపది అవమానం; తీర్చెదన్= పోగొట్టగలను; కృష్ణుండు; తెలుపన్= చెప్పగా; నీవు; సరకు చేయుమియును= లెక్కచేయకపోవటం; సభలోన్= కొలువుకూటంలో; ఉలూకునిన్+పంచి= ఉలూకుని నియమించి; ఆడించిన= పలికించిన; పరుసములును= కఠిన వాక్యాలు; కక్కించి= కక్కేటట్లుచేసి,వెనుకకు తీసికొనేటట్లుచేసి; బీరంబు= దర్పం; దక్కించుకొననీక= చెల్లటానికి వీలు కలుగనీకుండా; తెగన్+చూడన్+కాంచితిన్= ముక్కలు చేయటం చూడగలిగాను; మగతనము+కలిగి= పౌరుషం కలిగి; మగుడక= వెనుకకు మరలిపోకుండా; నిలుము= నిలిచిఉండుము; అని+పలికి= అని చెప్పి; ఉగ్రగతిన్= భయంకరంగా; ఎదుర్కొని= మార్కొని; రథ+తురంగములన్= అరదమునకు పూన్చిన గుర్రాలను; సూతునిన్= సారథిని; చంపి= సంహరించి; చాపంబున్= విల్లును; త్రుంచి= ఖండించి; భీముండు; చెలఁగి= శోభిల్లి, విస్ఫార కేతు దండము= వెలుగులతో విస్తరించిన పతాకం యొక్క కొయ్యను; ఏడ్తెఱన్= పరాక్రమంతో; నఱకెన్= ఖండించాడు.

తాత్పర్యం: చాలకాలం నుంచి కోరుకుంటున్న పండుగ నేడు భాగ్యవశాన సమకూడింది. కుంతీదేవి పడిన కష్టపాటునూ, ఆమె కోడలు ద్రౌపది యొక్క భంగపాటునూ తీరుస్తాను. కృష్ణుడు రాయబారిగ వెళ్లి చేసిన బోధను నీవు లెక్క చేయకుండా ఉండటం, ఉలూకుని పంపించి సభలో పల్కించిన పరుషవాక్యాలనూ నీచే క్రక్కించి నీవు పౌరుషం దక్కించుకోకుండా నిన్ను చంపే అవకాశం నాకు లభించింది. మగతనం కలిగి పారిపోకనిలువుమని, భీముడు భయంకరంగా దుర్యోధనుణ్ణి ఎదుర్కొని అతని రథానికి పూన్చిన గుర్రాలను, సారథినీ చంపి, దుర్యోధనుడి విల్లు విరిచి వెలిగే జెండా కర్రను పరాక్రమంతో నరికి ప్రకాశించాడు.

ఉ. వేఱొక విల్లు పుచ్చికొను వేగములోనన కౌరవేంద్రు మైఁ
దూఱు వృకోదరుండు పదితూపులు పాములు పుట్టలోనికిం
దూఱినయట్లుగాఁ బ్రబలదోర్బల మేర్పడ నేయ నెమ్ములన్
గీఱిన మూర్ఛ వచ్చి యొఱగెం దఱచై రుధిరంబు గ్రమ్మఁగన్. 398

ప్రతిపదార్థం: వేఱు+ఒక+విల్లు= మరియొక ధనుస్సు; పుచ్చికొను+వేగము+లోనన్= పరిగ్రహించే వేగం మధ్యనే; కౌరవ+ఇంద్రు+మైన్+దూఱన్= కౌరవ రాజు అయిన దుర్యోధనుని శరీరంలోకి చొచ్చుకొనేటట్లుగా; వృకోదరుండు= భీముడు; పది+తూపులన్= పది బాణాలను; పాములు= సర్పములు; పుట్టలోనికిన్; తూటిన+అట్లుగాన్; ప్రబల+దోః+బలము+ఏర్పడన్= గొప్ప భుజశక్తి, పరాక్రమం కలుగగా; ఏయన్= ప్రయోగింపగా; ఎమ్ములన్= ఎముకలతో; గీటిన= రక్కగా; తఱచు+ఐ= దట్టమై; రుధిరమ్ము= నెత్తురు; క్రమ్మఁగన్= స్రవింపగా; మూర్ఛవచ్చి= స్పృహతప్పి(దుర్యోధనుడు); ఒఱగెన్= వ్రాలాడు.

తాత్పర్యం: దుర్యోధనుడు వేగంగా మరియొక ధనువు గ్రహించేలోపుగానే, భీముడు పదితూపులతో కొట్టాడు - భుజబలంతో. ఆ బాణాలు-పాములు పుట్టలో చేరినట్లుగా దుర్యోధనుని శరీరంలో ఎముకలను తాకి, గాయాలు చేశాయి. నెత్తురు కారిపోతూ ఉండగా, దుర్యోధనుడు మూర్ఛ చెంది, స్పృహతప్పి పడిపోయాడు.

వ. అట్టియెడ జయద్రథుండు రథికవరులతోడం గడంగి వడముడిపై నడరె నప్పుడు కృపాచార్యుండు దుర్యోధనుఁ దనరథంబుమీఁదం బెట్టికొని తొలంగం గొనిపోయె నభిమన్యుండును ద్రౌపదేయులును గేకయులును మారుతిని మీఱి సైంధవుం దలపడినఁ జిత్రసేనుండును జిత్రుండును జిత్రాక్షుండును జారుచిత్రుండును సులోచనుండును నందుండును నుపనందుండును రౌద్రంబుగా సౌభద్రుం బొదివిన. 399

ప్రతిపదార్థం: అట్టి+ఎడన్= ఆ సమయంలో; జయద్రథుండు= సింధురాజు; రథికవరులతోడన్+కడంగి= వీర శ్రేష్ఠులతో కలసిపూని; వడముడిపైన్= భీమునిపై; అడరెన్= విజృంభించాడు; అప్పుడు; కృపాచార్యుండు; దుర్యోధనున్= దుర్యోధనుని; తన+రథంబుమీఁదన్= తన తేరుమీద; పెట్టికొని; తొలఁగన్+కొనిపోయెన్= తప్పించి తీసికొని పోయాడు; అభిమన్యుండును; ద్రౌపదేయులును= ద్రౌపది కొడుకులును; కేకయులును; మారుతిని+మీఱి= భీముడిని దాటి; సైంధవున్= జయద్రథుడిని; తలపడినన్= మార్కొనగా; చిత్రసేనుండును; చిత్రుండును; చిత్రాక్షుండును; చారుచిత్రుండును; సులోచనుండును; నందుండును; ఉపనందుండును; రౌద్రంబుగాన్= భయంకరముగా; సౌభద్రున్= అభిమన్యుడిని; పొదివినన్= చుట్టుముట్టగా.

తాత్పర్యం: ఆ సమయంలో జయద్రథుడు వీరవరులతోపాటు భీముడిపై విజృంభించాడు. అప్పుడు మూర్ఛిల్లిన దుర్యోధనుడిని కృపాచార్యుడు తన తేరుపైకి ఎక్కించుకొని వెళ్ళాడు. అభిమన్యుడు, ద్రౌపదేయులు, కేకయులు, భీముడిని దాటివెళ్ళి, సైంధవుడిని మార్కొన్నారు. చిత్రసేనుడు, చిత్రుడు, చిత్రాక్షుడు, చారుచిత్రుడు, సులోచనుడు, నందుడు, ఉపనందుడు భయంకరంగా అభిమన్యుడిని చుట్టుముట్టారు.

క. బలియుఁ డగు పార్థపుత్త్రుఁడు । వలనేర్పడ నొకనినొకని వడి నైదైద
మ్ముల నేసి నొంప వారలు । దలఁకక వెస ముంచి రస్త్రధారల నతనిన్. 400

ప్రతిపదార్థం: బలియుఁడు+అగు= బలవంతుడగు; పార్థ+పుత్త్రుఁడు= అభిమన్యుడు; వలను+ఏర్పడన్= అవకాశం చూచికొని; ఒకనిన్+ఒకనిన్= ఒక్కొక్కడిని; వడిన్= వేగంగా; ఐదు+ఐదు+అమ్ములన్= ఐదేసి బాణాలతో; ఏసి= ప్రయోగించి; నొంపన్= నొప్పింపగా; వారలు; తలఁకక= వెనుకాడక; అతనిన్= ఆ అభిమన్యుడిని; అస్త్రధారలన్= అమ్ముల జల్లులో; ముంచిరి= తడిపివేశారు.

తాత్పర్యం: బలశాలి అయిన అభిమన్యుడు అవకాశం చూచుకొని ఒక్కొక్కరిని అయిదయిదు బాణాలతో నొప్పించగా వారు భయపడకుండా వేగంగా అతడిని అస్త్ర ధారలలో ముంచారు.

విశేషం: దీనికి 393వ పద్యంతో సరిచూచుకోవాలి. అప్పుడు 'వికర్ణుడు' విరథుడై చిత్రసేనుడి రథంపైకి వెళ్ళాడు. ఇప్పుడు తిరిగి యుద్ధంలో ప్రవేశించాడు. ఇది చదువరులు గ్రహించి జ్ఞాపకం చేసుకోవాలి.

వ. సహోదరులకు సహాయత్వంబు సేయంబూని మున్ను విరథుండై పోయినవాఁడగుటం జేసి. 401

ప్రతిపదార్థం: సహోదరులకున్= తమ్ములకు; సహాయత్వంబు= సాయం; చేయన్+పూని= చేయటానికి ఆయత్తుడై; మున్ను= ఇంతకు ముందు; విరథుండు+ఐ= రథమును కోలుపోయినవాడై; పోయినవాఁడు+అగుటన్+చేసి= యుద్ధరంగము నుండి వెడలినవాడు కావటం చేత.

తాత్పర్యం: సోదరులకు తోడ్పాటు నందించుటకు పూని రథాన్ని కోలుపోవటం చేత వికర్ణుడు యుద్ధరంగము నుండి తొలగిపోయినవాడు కావటంచేత (తరువాతి పద్యంతో అన్వయం.)

చ. తటిమి వికర్ణుఁ డప్డు తనుఁ దాఁకిన నా యభిమన్యుఁ డల్గి బి
ట్టఱ విలుద్రుంచి సారథి వడం దురగంబులఁ జావ నేసి క్రొ
మ్మెఱుఁగులతోడఁ దద్ధ్వజము మేదినిఁ గూలఁగఁ జేసి యంగముల్
గిటికొన బాణముల్ నినిచెఁ గేలిమెయిం బటు దర్ప మేర్పడన్. 402

ప్రతిపదార్థం: తటిమి= కవిసి; వికర్ణుఁడు= వికర్ణుడు; అప్డు= అప్పుడు; తనున్= తన్ను; తాఁకినన్= మార్కొనగా; ఆ+అభిమన్యుఁడు; అల్గి= కోపించి; బిట్టు+అఱన్= అతిశయము అణగారునట్లుగా; విలు+త్రుంచి= ధనుస్సు ఖండించి; సారథి; పడన్= కూలగా; తురగంబులన్= గుర్రాలను; చావన్+ఏసి= సంహరించి; క్రొత్త+మెఱుగులతోడన్= క్రొత్త వెలుగులతో; తద్+ధ్వజము= ఆ జెండా; మేదినిన్= భూమిపై; కూలఁగన్+చేసి= పడునట్లుగా చేసి; అంగముల్= అవయవాలు; గిటికొనన్= చుట్టుకొనగా; కేలి+మెయిన్= లీలగా; పటు+దర్పము+ఏర్పడన్= మిక్కుటమగు గర్వము తెల్లమగునట్లుగా; బాణముల్= అమ్ములు; నినిచెన్= నిండించాడు.

తాత్పర్యం: అంతకుముందు విరథుడై వెడలిన వికర్ణుడు మరల వచ్చి తన్ను మార్కొనగా, అభిమన్యుడు కోపించి అతని అతిశయం అణగారిపోయేటట్లు వింటిని త్రుంచి, సారథిని సంహరించి, గుర్రాలను కూల్చి, కొత్తవెలుగులతో పాటు అతని జెండాను భూమిపై పడగొట్టాడు. అతడి అవయవాలు నొచ్చునట్లు అవలీలగా తన గర్వం వెల్లడి అగునట్లు బాణాలు వేగంగా ప్రయోగించాడు.

వ. ఇట్లు నొచ్చినవికర్ణుం గనుంగొని కురుకుమారు లొక్కపెట్ట కవ్వడి కొడుకుపై నురవడించిన. 403

ప్రతిపదార్థం: ఇట్లు=ఈ విధంగా; నొచ్చిన= కలతచెందిన; వికర్ణున్+కనుఁగొని= వికర్ణుని చూచి; కురు+కుమారులు= కౌరవరాజు కుమారులు; ఒక్క+పెట్టన్= ఏకంగా ఒకేసారి; కవ్వడి+కొడుకుపైన్= సవ్యసాచియైన అర్జునుడి కొడుకు అభిమన్యుడిపై; ఉరవడించినన్= వేగంగా మార్కొనగా.

ఉ. ఏవురు ద్రౌపదేయులును నేడ్తెఱ నాతని కడ్డమై తురం
గావళి నొంచియుం బడగ లన్నియుఁ ద్రుంచియు నంపవానలం
జేవ సెడంగ ముంచియునుఁ జేడ్పడఁ జేయఁగ నీతనూభవుల్
వోవక వారితో మఱియుఁ బోరిరి సిగ్గున బీర మెక్కఁగన్. 404

ప్రతిపదార్థం: ఏవురు+ద్రౌపదేయులును= ద్రౌపదీపుత్రులు అయిదుగురును; ఏడ్తెఱన్= పరాక్రమంతో; ఆతనికిన్+అడ్డమై= అభిమన్యుడికి అడ్డంగా, కురురాజకుమారులకు మధ్య నిలిచి; తురంగ+ఆవళి+నొంచియున్= గుర్రాల గుంపులను నొప్పించి; పడగలు+అన్నియున్+ త్రుంచియున్= జెండాలు అన్నింటినీ ఖండించియూ; అంప+వానలన్= బాణవర్షంచే; చేవ+చెడంగన్= శక్తి అణగారునట్లుగా; ముంచియున్= ముంచియును; చేడ్పడన్+చేయఁగన్= బాధనొందునట్లు చేయగా; నీ+తనూభవులు= నీ కొడుకులు(కౌరవరాజు కుమారులు); పోవక= మరలి వెళ్ళకుండా; వారితోన్= ద్రౌపదీసుతులతో; సిగ్గునన్= లజ్జచేత; బీరము+ ఎక్కఁగన్= అహంకారం అతిశయింపగా; మఱియున్= ఇంకనూ; పోరిరి= యుద్ధం చేశారు.

తాత్పర్యం: ద్రౌపదీ సుతులు అయిదుమంది పరాక్రమంతో అభిమన్యుడిని దాటి కౌరవ రాజకుమారుల గుర్రాలను నొప్పించారు. జెండాలను త్రుంచారు. వారిచేవ చెడి పోగా అమ్ములవానలో ముంచి నొప్పించారు. అయితే నీ కుమారులు లజ్జ అహంకారాన్ని పెంచగా వెనుదిరిగిపోకుండా నిలిచి ద్రౌపదేయులతో పోరాడారు.

వ. అట్టియెడ నకులనందనుం డగుశతానీకుండు బహుప్రకారబాణంబుల వివిధ విక్రమక్రీడ సలుపు బలుపుఁ గనుంగొని కేకయపాంచాలపతులు బాసటయై చటులతరతురంగమాతంగస్యందనసందోహంబులం బఱపి కడిమి నెఱపి రిప్పరుసునం బ్రతివీరుల నఱుముటయు నప్పుడు పతంగుండు పశ్చిమాచలశృంగంబు మఱుంగుపడుటయుం జూచి గాంగేయుం డంత్యకాలకాలాకృతిం గడంగి పటు విశిఖవితానంబుల వేఁడిమి సూపి యమ్మోహరంబు దెరల్చి తనమొనల మరల్చికొని సమరంబు సాలించి శిబిరంబున కరిగెఁ బాండుసూనులును మేనులు వెడవెడ చెమర్ప విడిదలకుం జని రని సంజయుం డాఱవ దివసంబు నాహవంబు తెఱం గెఱింగించె నప్పుడు. 405

ప్రతిపదార్థం: అట్టి+ఎడన్= ఆసమయంలో; నకుల+నందనుండు+అగు= నకులుని కొడుకు అయిన; శతానీకుండు; బహు+ప్రకారబాణంబులన్= పెక్కు విధములైన బాణాలతో; వివిధ+విక్రమ+క్రీడ= నానా పరాక్రమలీల; సలుపు బలుపున్+కనుంగొని= చేసే అతిశయం చూచి; కేకయ, పాంచాలపతులు= కేకయ దేశాధిపతులు, ద్రుపదుడు; బాసటయై= సాయమై; చటుల తర, తురంగ, మాతంగ స్యందన సందోహంబులన్+పఱపి= వేగంగా కదలే గుర్రాలు, ఏనుగులు, రథాల సమూహములను తరలించి; కడిమి+నెఱపిరి= పరాక్రమం ప్రదర్శించారు; ఈ+పరుసునన్= ఈ విధంగా; ప్రతి వీరులన్= శత్రువులను; అఱుముటయున్= మార్కొనగా; అప్పుడు; పతంగుండు= సూర్యుడు; పశ్చిమ+అచల శృంగంబు మఱుంగు పడుటయున్= పడమటి కొండ కొమ్ములాటున అదృశ్యుడు కావటం; చూచి; గాంగేయుండు= భీష్ముడు; అంత్యకాల+కాల+ కాల+ఆకృతిన్= ప్రళయ సమయంలోని యముని ఆకృతిని పోలి; కడంగి= పూని; పటు విశిఖ వితానంబులన్= గొప్ప బాణాల సముదాయంతో; వేఁడిమి+చూపి= ఉష్ణత వెలయించి; ఆ+మోహరంబున్= ఆ మొగ్గరమును; తెరల్చి= చెదరగొట్టి; తన మొనలన్= తన సేనలను (కౌరవసేనలను); మరల్చికొని= వెనుకకు తరలించి; సమరంబు+చాలించి= యుద్ధం విరమించి; శిబిరంబునకున్+అరిగెన్= స్కంధావారమునకు, విడిదికి వెళ్ళాడు; పాండుసూనులును= పాండవులుకూడా; మేనులు= శరీరాలు; వెడవెడ చెమర్పన్= ఎక్కువగా చెమటలుకారగా; విడిదలకున్+చనిరి= తమ ఆవాసాలకు వెళ్ళారు; అని, సంజయుండు; ఆఱవ దివసంబు+ఆవహంబు+తెఱంగు= ఆరవదినమున జరిగిన యుద్ధం తీరుతెన్నులు; ఎఱింగించెన్= తెలిపాడు; అప్పుడు.

తాత్పర్యం: ఆ సమయంలో నకులుడి కొడుకైన శతానీకుడు పరాక్రమం ప్రదర్శించి, విజృంభించాడు. కేకయ దేశాధిపతులు, ద్రుపదుడు అతడికి బాసటగా చేరి నిలిచారు. వారు రథతురగగజ సమూహాలతో శత్రువులను

ఎదుర్కొన్నారు. అప్పుడు సూర్యుడు పడమటికొండ మాటునకు చేరి అదృశ్యమయ్యాడు. భీష్ముడు ప్రళయకాలంలోని యమునివలె విజృంభించి పాండవుల మొగ్గరాన్ని చీల్చి, తన సేనలను ఉపసంహరించి, విడిదులకు పొమ్మన్నాడు. తాను తన శిబిరానికి వెళ్ళాడు. ఆనాటికి యుద్ధ విరమణ జరిగింది. పాండవులు డస్సిపోయి, చెమట కారే దేహాలతో తమ విడిదులకు వెళ్ళిపోయారు.' అని సంజయుడు ఆ విధంగా కురుక్షేత్ర సంగ్రామంలోని ఆరవరోజు తీరుతెన్నులు తెలిపాడు. ఆ సమయంలో.

క. ' కిమ్మీరమర్దనునిచే । నిమ్మెయి నోటాఁ బెక్కు లేటులు వడి ద
ర్ప మ్మెడలి మూర్ఛ మునిఁగియుఁ । గ్రమ్మఱఁ గురునాథుఁ డెట్లు గడఁగెనొ యనికిన్?' **406**

ప్రతిపదార్థం: కిమ్మీర+మర్దనునిచేన్= కిమ్మీరుడు అనే రాక్షసుని సంహరించిన భీమునిచే; ఈ+మెయిన్= ఈ రీతిగా; ఓటారన్= నిస్సత్తువుడుగా; పెక్కులు+ఏటులు+పడి= ఎన్నో దెబ్బలు తిని; దర్పమ్ము+ఎడలి= గర్వము అణగారి; మూర్ఛ+మునిఁగియున్= స్పృహతప్పి కూడా; క్రమ్మఱన్= తిరిగి; అనికిన్= యుద్ధానికి; కురు+నాథుఁడు= కురురాజు(దుర్యోధనుడు); ఎట్లు; కడఁగెన్+ఒ?= పూనినాడో?

తాత్పర్యం: ధృతరాష్ట్రుడు ఈ విధంగా సంజయుని ప్రశ్నించాడు 'ఓ సంజయా, దుర్యోధనుడు ఆ విధంగా నిస్సత్తువై భీమునిచే అన్ని దెబ్బలు తిని, యుద్ధంలో ఓడిపోయి స్పృహతప్పి పడిపోయాడు గదా! మరల ఏ విధంగా యుద్ధానికి వచ్చాడు? ఏం జరిగింది?'

విశేషం: యుద్ధంలో ప్రతి విషయాన్ని - సూక్ష్మాతిసూక్ష్మంగా ఏ విశేషం విడిచి పెట్టకుండా తిక్కన అభివర్ణించగలిగాడు. 397, 398 పద్యాలలో, 399 గద్యంలో భీమసేనుడికీ, దుర్యోధనుడికీ మధ్య జరిగిన పోరాటం వర్ణింపబడింది. అప్పుడు మూర్ఛితుడైన దుర్యోధనుడిని కృపాచార్యుడు తన రథంమీద పెట్టుకొని తొలగిపోయాడు. ఆ తరువాత దుర్యోధనుడు ఏమైనట్లు? ఆ ప్రశ్న ధృతరాష్ట్రుడు అడగటం సమంజసం. అయితే సమాధానం - సంజయుడు చెప్పకుండా ద్వితీయాశ్వాసం ముగిసింది. చదువరుల ఉత్కంఠ అట్లానే ఉండిపోయింది.

వ. అని సకౌతుకంబుగాఁ బలికిన. **407**

ప్రతిపదార్థం: అని= అని; స+కౌతుకంబుగాన్= కుతూహలముతో; తెలుసుకోవాలనే ఉబలాటంతో; పలికినన్= అడుగగా.

తాత్పర్యం: అని ధృతరాష్ట్రుడు అడుగగా.

ఆశ్వాసాంతము

ఉ. భూరి తపోవిశేష! పరిపూర్ణమృదుస్థిరహృత్కరండవి
స్తారనివాస! తంత్ర ఘనసారవిధాపరమాభిరామ రే
ఖారమణీయ! లోకహితకారి మహాకరణీయ! ఘోరసం
సారదురామయాపదవసాయక! నిత్యఫలప్రదాయకా! **408**

ప్రతిపదార్థం: భూరితపస్+విశేష!= గొప్పదైన తపో విశేషము కలవాడా!; పరిపూర్ణ+మృదు+స్థిర+హృద్+కరండ+విస్తార+నివాస!= మృదుత్వముగా స్థైర్యముతో నిండిన హృదయమనే బరిణలు, విస్తరించి, నివసించేవాడా!; తంత్ర= శైవాగమములనే; ఘనసార, విధా, పరమాభిరామ, రేఖా+రమణీయ!= కప్పురపు పూతచే గొప్పగా అందంగా శోభిల్లేవాడా!; లోక+హితకారి+మహాకరణీయ!=

జగత్తునకు మేలు చేసే కర్తవ్యములు నెరవేర్చువాడా!; ఘోర+సంసార+దుస్+ఆమయ+ఆపద్+అవసాయక!= భయంకరమైన సంసారములోని పీడలను, భ్రమలను, పీడలను నశింపచేయువాడా!; నిత్య+ఫల+ప్రదాయకా!= నిత్యము మేలు చేయునట్టివాటిని ఇచ్చేవాడా!

తాత్పర్యం: ఓ హరిహరనాథా! విస్తారమైన గొప్ప తపస్సుతో కూడినవాడా, మెత్తనిది, పండినది, నిండైనది అయిన గుండెలో నివసించునట్టివాడా, కప్పురము, కప్పురపు పూతచే శోభిల్లి, అందముగా కనిపించేవాడా, లోకమునకు మేలు చేసెడి కర్తవ్యాలను నిర్వహించేవాడా సంసార తాపములను, భ్రమలను, నాశనము చేసేవాడా.

విశేషం: ఇది భీష్మపర్వం - ద్వితీయాశ్వాసాంత పద్యాలలో మొదటిది 1. ఆశ్వాసాంత పద్యాలు అన్నీ సంస్కృతసమాస భూయిష్ఠములే. 2. ఇది హరిహరనాథతత్త్వ ప్రతిపాదకం.

క. పారాశర్యప్రముఖో। దారమునీంద్రాంతరంగధామాంతర్వి
స్ఫారప్రభాపటలవి। స్తారోజ్జ్వలదీపరూపతా స్తవనీయా! 409

ప్రతిపదార్థం: పారాశర్య+ప్రముఖ+ఉదార+ముని+ఇంద్ర+అంతరంగ+ధామ+అంతర్+విస్ఫార+ ప్రభా+పటల+విస్తార+ఉజ్జ్వల+దీప+రూపతా+స్తవనీయా!= వ్యాసుడు మున్నగు గొప్ప మునివరేణ్యుల మనస్సులు అనే చోటులలో చక్కగా విస్తరించిన వెలుగుల సముదాయంతో ప్రకాశించే దీపమువలె స్తుతింపదగినవాడా!

తాత్పర్యం: వ్యాసుడు మున్నగు గొప్ప ఋషుల మానససీమలలో వెలుగులు వెలార్చు దీపమువలె ఆరాధించి కీర్తించదగినవాడా! ఓ హరిహరనాథా!

విశేషం: 1. ఆశ్వాసాంత పద్యాలు - సంస్కృత సమాసాలతో నింపటం ప్రారంభించింది నన్నయ మహాకవి. ఆ ఒరవడినే తిక్కన, తదుపరి కవులు బహుళంగా పాటించారు.

మాలిని.

అసురదళనలీలావ్యాప్తిదీప్తాభిశోచి
ర్లసితపరశుగాఢాలంకృతప్రౌఢముద్రా
భ్యసనమహితబాహాప్రస్ఫురత్కాంతిహృద్యా!
హసనసురభివిద్యా! హంసనాదైకవేద్యా ! 410

ప్రతిపదార్థం: అసుర+దళన+లీలా+వ్యాప్తి+దీప్త+అభిశోచిస్+లసిత+పరశు+గాఢా+ అలంకృత+ప్రౌఢ+ముద్రా+అభ్యసనమహిత+బాహా+ప్రస్ఫురత్+కాంతిహృద్యా!= రాక్షసులను చీల్చి చెండాడే ఆటయందు విస్తరించి ప్రకాశించే, రశ్మిచేత శోభిల్లే గండ్రగొడ్డలి చేత ఎక్కువగా అలంకరింపబడిన, గొప్ప తెలివితో భాసించే భంగిమను అభ్యసించే గొప్ప చేతులలో ప్రకాశించే కాంతి చేత మనోజ్ఞమైన వాడా!; హసన+సురభి+విద్యా!= నవ్వుచే మనోజ్ఞమైన విద్య కలవాడా!; హంస+నాద+ఏక+వేద్యా!= యోగుల నాదబిందుకళోపాసనచేత మాత్రమే తెలియబడగలవాడా!

తాత్పర్యం: రాక్షసులను సంహరించే పరశువును పట్టుకొని విజృంభించే భంగిమతో కూడుకొన్న బాహు పరాక్రమం గలవాడా! ఓ హరిహరనాథా! నవ్వుతో శోభిల్లే విద్యకలవాడా! యోగుల నాదోపాసనచే మాత్రమే తెలియబడగలవాడా!

విశేషం: 1. ఈ పద్యంలోని ఆంతర్యం 'దుష్టశిక్షణ - శిష్టరక్షణ'. లయకారుడు హరుడు. దుష్టశిక్షణ చేయగలవాడు. స్థితికారుడు - శిష్టరక్షకుడు హరి. 'హంస' శబ్ద ప్రయోగం - అర్థవంతమైనది. 'హంస' జీవన్ముక్తుడైన మహర్షికి పర్యాయపదం.

2. 'దీప్తారశోచిర్లసిత', పాఠముకంటె, పాఠాంతరమైన 'దీప్తాభిశోచిర్లసిత' పాఠమే గ్రహింపబడింది. అరము అనగా వేగము. 'అరశోచిస్' కంటె 'అభిశోచిస్' అని గ్రహించటమే మంచిది అనిపించింది.

గద్యము.

ఇది శ్రీమదుభయకవిమిత్ర కొమ్మనామాత్యపుత్ర బుధారాధన విరాజి తిక్కన సోమయాజి ప్రణీతంబయిన

శ్రీ మహాభారతంబున భీష్మపర్వంబునందు ద్వితీయాశ్వాసము.

ప్రతిపదార్థం: ఇది= ఇది; శ్రీమత్+ఉభయ+కవి+మిత్ర= శ్రీమంతులైన సంస్కృతం, తెలుగులో కవిత చెప్పే వారికి స్నేహితుడు; - కొమ్మన+అమాత్యపుత్ర= కొమ్మన మంత్రి కొడుకు; బుధ+ఆరాధన+విరాజి= బుద్ధిమంతులను పూజించుటచే, శోభిల్లేవాడు; తిక్కన సోమయాజి; ప్రణీతంబు+అయిన= వ్రాయబడినది అయిన, శ్రీమహా+భారతంబునన్= శ్రీమహాభారతంలో; భీష్మ+పర్వంబునందు= భీష్మపర్వంలో; ద్వితీయ+ఆశ్వాసము= రెండవ ఆశ్వాసము.

తాత్పర్యం: శ్రీమంతులైన సంస్కృతాంధ్ర కవీశ్వరులకు హితుడును, కొమ్మన మంత్రికి కుమారుడును, పండితులను పూజించుటచేత ప్రకాశించేవాడును అయిన తిక్కన సోమయాజిచేత రచించబడిన శుభకరమైన మహాభారతంలోని భీష్మపర్వంలో రెండవ ఆశ్వాసం ముగిసింది.

విశేషం: 1. 'ఉభయ కవిమిత్రుడు'(తిక్కనకు కల బిరుదు) కేతన ఈ విషయం దశకుమార చరిత్ర తిక్కనకు అంకితం చేస్తూ అవతారికలో ఈ విషయం చెప్పాడు. 2. సోమయాజి= యజ్ఞం చేసినవాడు. భారతం వ్రాసేముందు తిక్కన యజ్ఞంచేసి పవిత్ర భావన చేకూర్చుకున్నట్లు విమర్శకుల అభిప్రాయం. యజ్ఞం లోక సంగ్రహదీక్ష. 3. బుధారాధన - విరాజి ఈ ప్రయోగం మహాభారతకర్తయైన తన వ్యక్తిత్వం 'బుధుల పూజచే', ఆరాధన వలన - ప్రకాశమానమైనదని వినయంతో, వివేకంతో తిక్కన చేసిన విజ్ఞప్తి.

భీష్మపర్వంలో ద్వితీయాశ్వాసం సమాప్తం.

శ్రీరస్తు

శ్రీమదాంధ్ర మహాభారతము

భీష్మపర్వము - తృతీయాశ్వాసము

శ్రీ విలసనత్వగురు గౌ । రీ విభ్రమ రమ్య చాతురీ స్వీకృత స
ద్భావ! నిరుపాధికానం । దావహ! కరుణానుభావ! హరిహరనాథా! 1

ప్రతిపదార్థం: శ్రీ= లక్ష్మి యొక్క; విలసనత్వ= విలాసం చేత; గురు= గొప్పదైనదీ; గౌరీ= పార్వతి యొక్క; విభ్రమ= శృంగార చేష్టలయొక్క; రమ్య= అందమైన; చాతురీ= నేర్పుచేత; స్వీకృత= గ్రహించబడిన; సత్+భావ!= ఉనికి కలవాడా!; సాధుభావం కలవాడా!; నిరుపాధిక+ఆనంద+ఆవహ!= ఉపాధిరహితమైన (అపరిమితమైన) ఆనందాన్ని వహించేవాడా!; కరుణా+అనుభావ!= (భక్తులయందు) దయ చూపించే స్వభావం కలవాడా!; హరిహరనాథా!= హరిహరనాథుడా!

తాత్పర్యం: ఓ హరిహరనాథా! లక్ష్మీదేవి విలాస చేష్టలనూ, గౌరీదేవి శృంగార చేష్టలనూ అందంగా స్వీకరించే నేర్పుగల సాధుభావం కలవాడా! అనంతమైన ఆనంద స్వరూపం కలవాడా! భక్తుల పట్ల దయచూపే ప్రవర్తన కలవాడా!

విశేషాలు: పరతత్వమైన హరిహరనాథుడు నిర్గుణుడైనా, సగుణభావంలో శ్రీ గౌరీ రూపిణి అయిన మహాశక్తి యొక్క విలాస చేష్టలను ఆమోదించి సృష్ట్యాది కార్యాలను నిర్వహిస్తాడని భావం. "ఆనందో బ్రహ్మేతి వ్యజానాత్" అని తైత్తిరీయోపనిషత్తు. సర్వజీవులు అనుభవించే ఆనందం బ్రహ్మానందంలో లేశమే కావటం చేత పరబ్రహ్మమైన హరిహరనాథుడు అనంతానందరూపుడని తాత్పర్యం. హరిహరనాథుడి చేష్టలన్నీ భక్తులను కరుణించటానికి ప్రదర్శించేవే కాబట్టి అతడు కరుణానుభావుడు.

భీష్మగాంధారేయుల సంవాదము (సం. 6-76-3)

వ. దేవా! వైశంపాయనుండు జనమేజయున కి ట్లనియె. 2

ప్రతిపదార్థం: దేవా= ఓ ప్రభూ!; వైశంపాయనుండు= వైశంపాయనుడనే ఋషి; జనమేజయునకున్; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: హరిహరనాథా! వైశంపాయనుడు జనమేజయుడితో ఇట్లా అన్నాడు.

తే. భండనంబునఁ దనయుండు గం డడంగి । పోక విని తీవ్రఖేదంబుఁ బొంది యంబి
కాతనూభవుఁ డప్పు డాసూతపుత్త్రు । నడిగె నుత్తరవర్తన మాదరమున. 3

ప్రతిపదార్థం: అంబికా తనూభవుఁడు= అంబిక అను నామె కుమారుడైన ధృతరాష్ట్రుడు; అప్పుడు= దుర్యోధనుడు బలం తగ్గి వెనుకకు తిరిగిన సమయాన; భండనంబునన్= యుద్ధమందు; తనయుండు= తన కుమారుడైన దుర్యోధనుడు; గండు+అడంగి= పౌరుషం దక్కి; పోక= వెళ్ళుటను; విని; తీవ్రఖేదంబున్= అధికమైన దుఃఖమును; పొంది= పొందినవాడై; ఆదరమునన్= మన్ననతో; ఉత్తర వర్తనము= దుర్యోధనుని తరువాతి నడవడిని గూర్చి; ఆ సూతపుత్త్రున్= సూతుని కుమారుడైన సంజయుడిని; అడిగెన్= అడిగాడు.

తాత్పర్యం: యుద్ధంలో దుర్యోధనుడు పౌరుషం కోల్పోయి, వెనుకకు మళ్ళాడని విని, ధృతరాష్ట్రుడు మిక్కిలి శోకం చెందినవాడై, తరువాత ఆ దుర్యోధను డేమిచేశాడని సూతపుత్రుడిని అడిగాడు.

వ. అడుగుటయు నతం డతని కి ట్లను 'నాఁటిరేయి గాంగేయుతోడ గాంధారేయుండు. 4

ప్రతిపదార్థం: అడుగుటయున్= ధృతరాష్ట్ర డిట్లడుగగా; అతండు= సంజయుడు; అతనికిన్= ఆ ధృతరాష్ట్రుడికి; నాఁటిరేయి= ఆ నాటి రాత్రి; గాంధారేయుండు= గాంధారీ కుమారుడు దుర్యోధనుడు; గాంగేయుతోడన్= గంగాపుత్రుడైన భీష్ముడితో చెప్పిన విషయమును; ఇట్లు+అనున్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడు, భంగపాటు పొందిన దుర్యోధనుడి తరువాతి వృత్తాంతాన్ని గూర్చి సంజయుడిని అడుగగా, ఆతడు ఇట్లా చెప్పాడు: ఆనాటి రాత్రి భీష్ముడితో దుర్యోధనుడు ఇట్లా అన్నాడు.

ఆ. ' మనము పూఁచి పట్టి మొన లేర్చికొని పోవఁ। బాండురాజసుతులబలము గవిసి
గాసి చేయునదియుఁ గాక నీ ముందటఁ। బవనతనయుచేత భంగపడితి. 5

ప్రతిపదార్థం: మనము= కౌరవులైన మనం; పూఁచిపట్టి= ప్రయత్నంతో; మొనలు= వ్యూహములు; ఏర్చికొని= ఏర్పాటు చేసికొని; పోవన్=, ముందుకు సాగుతూంటే; పాండురాజ సుతులబలము= పాండవుల సైన్యము; కవిసి= మార్కొని; గాసిచేయున్= నాశం చేస్తున్నది; అదియున్+కాక= అంతమాత్రమేకాకుండా; నీ ముందటన్= (భీష్ముడవైన) నీ ఎదుటనే; పవన తనయుచేతన్= గాలికొమరుడైన భీమునిచేత; భంగపడితిన్= భంగపాటుపొందాను.

తాత్పర్యం: 'మనమెంతో పూనికతో వ్యూహం చక్కపఱచుకొంటూ ముందుకుసాగుతున్నా, పాండవ సేన దానిని నాశనం చేస్తున్నది. అందుకు తోడుగా, నీవు చూస్తూండగానే భీముడిచేత భంగపడినాను గదా!

విశేషం: 'నీముందటన్' అనటంలో, 'నీ సాయంతో పాండవులను గెలవగలననే నమ్మకం గలవాడను. నీ ధాటికి దేవతలు కూడా ఎదురు నిలువజాలరు. అట్టి నీవు ఉపేక్ష చేశా'వని, దుర్యోధనుడు భీష్ముడిని ఎత్తిపొడుచుతున్నాడు.

క. నినుఁ గొని గెలిచెదఁ గుంతీ। తనయుల నని యున్న తలఁపు దప్పించెదు నీ
వనిమిషులనైనఁ జేకొన। వనిమొన వా రింత బలియు రగు టేమి యొకో?' 6

ప్రతిపదార్థం: నినున్+కొని= నిన్ను ఆధారంగా చేసికొని; కుంతీ తనయులన్= కుంతి కొడుకులగు పాండవులను; గెలిచెదన్+అనియున్న తలఁపున్= అనియున్నట్టి నా కోరికను; తప్పించెదు= తప్పగొట్టుతున్నావు; నీవు; అనిమిషులనైనన్= దేవతలనైనను; చేకొనవు= లెక్కచేయవు; అనిమొనన్= యుద్ధపు వ్యూహంలో; వారు= ఆ పాండవులు; ఇంత బలియురు+అగుట= ఇంతగా బలవంతులు కావడం; ఏమి+ఒకో?= ఏమిటో?.

తాత్పర్యం: కొండంత అండగా నీవు ఉండడంచేత పాండవులను గెలుస్తాననే ఆశ నాకుండినది. దానిని నీవు తప్పగొట్టుతున్నావు. నీవు దేవతలను కూడ జయింపగల పరాక్రమంగలవాడవు. యుద్ధరంగంలో ఆ పాండవు లంత పరాక్రమవంతులవటానికి కారణం ఏమిటి?'

విశేషం: దుర్యోధనుని ఈ మాటవలన భీష్ముడి యుద్ధ వైఖరిలో అతడికి కొంత సంశయం కలిగినట్టు తోస్తున్నది.

అనిమిషులు= రెప్పపాటులేనివారు (దేవతలు).

అవతారిక: దుర్యోధనుడి అమాయికత్వానికి, మూర్ఖత్వానికి భీష్ముడు నవ్వి ఇట్లంటున్నాడు-

క. అనిన విని నవ్వి యతఁ డి । ట్లను 'నిం తన నేల? నన్ను నని నా యొడ లో
మినచోటుఁగలదె? పెఱయో । ధనికాయం బైన నకట! తలఁకదె చెపుమా! 7

ప్రతిపదార్థం: అనినన్= దుర్యోధనుడు పై విధముగా చెప్పగా; విని; నవ్వి; అతఁడు= ఆ భీష్ముడు; ఇట్లు+అనున్= ఈ విధంగా అంటున్నాడు; నన్నున్= నన్ను; ఇంత+అనన్+ఏల?= నీవు ఇంతగా తూలనాడడం ఎందుకు?; అనిన్= యుద్ధమందు; నా+ఒడలు= నా శరీరము; ఓమిన= రక్షించుకొన్న; చోటు+కలదె?= తావున్నదా?; అకట!= అయ్యో!; పెఱ యోధనికాయంబు+ఐనన్= శత్రువుల యోధుల సమూహమైనను; తలఁకదె?= భయపడదా? చెపుమా!

తాత్పర్యం: దుర్యోధనుడి మాటలు విన్న భీష్ముడు నవ్వి ఇట్లా అంటున్నాడు. 'నీవు ఈ విధంగా న న్ననటందేనికి? యుద్ధంలో నా శరీరం ఎక్కడైనా దాచుకొన్నానా? పాండవులు కాకుండా ఇతర యోధసమూహమై ఉండి వుంటే భయపడదా? చెప్పు.

వ. పాండవుల గెలువ నలవి గా దని యెప్పుడుం జెప్పుదు నైన నఱలేక నీకు జయంబు గోరి పోరెద వగవ కుండుము.' 8

ప్రతిపదార్థం: పాండవులన్; గెలువన్+అలవి కాదు+అని= గెలవటం సాధ్యం కాదని; ఎప్పుడున్+చెప్పుదున్= ఎల్లవేళలా అంటూనే ఉంటాను; ఐనన్= ఐనా; అఱలేక= కపటంలేకుండ; నీకున్; జయంబు; కోరి; పోరెదన్= యుద్ధం చేస్తాను; వగవక+ఉండుము= దుఃఖపడవద్దు.

తాత్పర్యం: పాండవు లెప్పటికిని జయింపరానివారే అని పలుమారు చెప్పుతుంటాను గదా! అయినప్పటికి నీవు జయించాలనే ఉద్దేశంతో ఒళ్ళు దాచుకోకుండా యుద్ధం చేస్తాను. నీవు దుఃఖపడవద్దు.'

భీష్ముని సప్తమ దివస యుద్ధక్రమము (సం. 6-77-11)

క. అన విని యూఱడి నిద్రా । జనితసుఖంబంది రేపు జనపతి యనికిం
జనుటయు భీష్ముఁడు బల మె । ల్లను నెఱయఁగ దీర్చె మండలవ్యూహముగన్. 9

ప్రతిపదార్థం: జనపతి= రాజైన దుర్యోధనుడు; అనన్ విని= భీష్ముడు చెప్పగా విని; ఊఱడి= ఊరటచెంది; నిద్రాజనిత సుఖంబు+అంది= నిద్రచేత కలిగిన సుఖమును పొందినవాడై; రేపు+అ= ఉదయమున; అనికిన్= యుద్ధమునకు; చనుటయున్= పోగా; భీష్ముఁడు; బలము+ఎల్లను= తమ సేననంతటిని; మండల వ్యూహముగన్= మండలాకారంలో తీర్చిన వ్యూహాన్ని; నెఱయఁగన్= యుద్ధభూమినంతా వ్యాపించేటట్లుగా; తీర్చెన్= తీర్చిదిద్దాడు.

తాత్పర్యం: దుర్యోధనుడు భీష్ముడి మాటలు విని ఊరటజెంది, రాత్రి సుఖంగా నిద్రించి, ఉదయాన లేచి, యుద్ధానికి వెళ్ళాడు. భీష్ముడు కూడా తన సైన్యాన్ని తేరిపారజూచి, యుద్ధరంగాన్నంతా వ్యాపించే విధంగా మండల వ్యూహాన్ని ఏర్పాటు చేశాడు.

విశేషం: వ్యూహభేదములు నాలుగు. 1. దండము; 2.భోగము; 3. మండలము; 4. అసంహతము. చక్రగోమూత్రికాదులు వీటి అంతర్గత భేదాలు వ్యూహమంటే, యుద్ధం కొరకు సైన్యమును ఒక ప్రత్యేక ప్రదేశములో శత్రువులకు చొరటానికి వీలులేకుండా విభజించి నిలుపుట.

వ. అందు నడుమ నరనాథుం డొప్పియుండెఁ దమ్ములుఁ జేయంగలదొరలును సూరెల నిలిచి రంతం బాండవులును భండనంబునకు వెడలి రయ్యుధిష్ఠిరుండు మనమొనలం గనుంగొని వజ్రవ్యూహంబు

గల్పింపుమని సేనాపతిం బనుప నతండును దత్ప్రకారంబున సైన్యంబు సన్నద్ధంబు సేసిన నది పరబలంబు మెచ్చక తఱిమి తూర్యధ్వను లెసఁగం దాఁకె, నప్పుడు ద్రోణుండు విరాటుని, ద్రౌణి శిఖండిని, దుర్యోధనుండు ధృష్టద్యుమ్నుని, మద్రపతి గవలను, విందానువిందులు యుధామన్యునిఁ బెక్కండ్రురాజులు బీభత్సుని మార్కొనిరి. భీమసేనుండు కృతవర్మను, సౌభద్రుండు చిత్రసేన దుశ్శాసన వికర్ణులను, ఘటోత్కచుండు భగదత్తుని, సాత్యకి యలంబుసుని, ధృష్టకేతుండు భూరిశ్రవసునిఁ, జేకితానుండు కృపాచార్యుని, ధర్మసూనుండు శ్రుతాయువును, బలువురు భూపతులు భీష్మునిం దలపడి రట్టియెడఁ గృష్ణునితో జిష్ణుం డిట్లనియె. 10

ప్రతిపదార్థం: అందున్= ఆ మండలవ్యూహమునందు; నడుమన్= మధ్యభాగాన; నరనాథుండు= దుర్యోధనుడు; ఒప్పి+ఉండెన్= తగినట్లుగా ఉన్నాడు; తమ్ములున్; చేయంగల దొరలును= యుద్ధములో తనకు సాయపడునట్టి రాజులు; సూరెలన్= రాజునకు ఇరు ప్రక్కలందును; నిలిచిరి= నిలిచారు; అంతన్= అంతట; పాండవులును= పాండవులు కూడా; భండనంబునకున్= యుద్ధమునకు; ఆ+యుధిష్ఠిరుండు= (యుద్ధమందు స్థిరంగా ఉండే) ఆ ధర్మరాజు; మన మొనలన్= మన (కౌరవుల) సేనలను; కనుంగొని= చూచి; వజ్రవ్యూహంబున్= వజ్రమనే పేరుగల ఒక వ్యూహమును; కల్పింపుము= చేయుము; అని పనుపన్= ఆజ్ఞాపింపగా; అతండును= ఆ సేనాపతియును; తద్+ప్రకారంబునన్= ఆ విధంగా; సైన్యంబున్= సైన్యమును; సన్నద్ధంబు= యుద్ధమునకు సిద్ధము; చేసినన్= చేయగా; అది= ఆ పాండవులసేన; పరబలంబున్= శత్రువు (కౌరవు)ల సైన్యమును; మెచ్చక= లక్ష్యపెట్టక; తఱిమి= వెంబడించి పరుగెత్తించి; తూర్యధ్వనులు= వాద్యముల శబ్దములు; ఎసఁగన్= అతిశయించగా; తాఁకెన్= ఎదిరించెను; ద్రౌణి= ద్రోణుని కుమారుడు అశ్వత్థామ; శిఖండిని; ద్రోణుండు; విరాటుని; దుర్యోధనుండు; ధృష్టద్యుమ్నుని; మద్రపతి= శల్యుడు; కవలను= నకుల సహదేవులను; విందఅనువిందులు; యుధామన్యుని; పెక్కండ్రు రాజులు= ఎందరో రాజులు; బీభత్సునిన్= అర్జునుడిని; మార్కొనిరి= ఎదిరించారు; భీమసేనుండు; కృతవర్మను; సౌభద్రుండు= సుభద్ర కొడుకైన అభిమన్యుడు; చిత్రసేన, దుశ్శాసన, వికర్ణులను; ఘటోత్కచుండు- భగదత్తుని; సాత్యకి-అలంబుసుని; ధృష్టకేతుండు-భూరిశ్రవసుని; చేకితానుండు-కృపాచార్యుని; ధర్మసూనుండు-శ్రుతాయువును; పలువురు భూపతులు= చాలామంది రాజులు; భీష్మునిన్= భీష్మునితో; తలపడిరి; అట్టి+ఎడన్= అట్టి సమయంలో; కృష్ణునితో; జిష్ణుండు+ఇట్లు+అనియెన్= అర్జునుడు ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఆ మండలవ్యూహంలో మధ్యభాగాన దుర్యోధనుడున్నాడు. తమ్ములు, అతడికిసాయపడే రాజులూ ఇరు ప్రక్కలా నిలిచారు. అపుడు పాండవులు కూడా యుద్ధానికి వెళ్ళారు. ధర్మరాజు మన మొనలను చూచి తన సేనాపతియైన ధృష్టద్యుమ్నుడిని వజ్రవ్యూహాన్ని ఏర్పరచవలసిందిగా ఆదేశించాడు. ధృష్టద్యుమ్నుడు ఆ వ్యూహాన్ని ఏర్పరిచాడు. పాండవసేన శత్రుబలాన్ని లెక్కచేయకుండా తూర్య ధ్వనులు అతిశయించగా తరిమి మార్కొన్నది.

ద్రోణుడు విరాటుడినీ, అశ్వత్థామ శిఖండినీ, దుర్యోధనుడు ధృష్టద్యుమ్నుడినీ, శల్యుడు నకుల సహదేవులనూ, విందానువిందులు యుధామన్యుడినీ, చాలమంది రాజులు అర్జునుడినీ మార్కొన్నారు. ఇంకా, పాండవసేనలోని భీమసేనుడు కృతవర్మనూ, అభిమన్యుడు చిత్రసేనుడినీ, దుశ్శాసనుడినీ, వికర్ణుడినీ, ఘటోత్కచుడు భగదత్తుడినీ, సాత్యకి అలంబుసుడినీ, ధృష్టకేతుడు భూరిశ్రవసుడినీ, చేకితానుడు కృపాచార్యుడినీ, ధర్మరాజు శ్రుతాయువునూ, చాలా మంది రాజులు - భీష్ముడిని ఎదిరించారు. అప్పుడు శ్రీకృష్ణుడితో అర్జునుడు ఇట్లా అన్నాడు.

విశేషం: 'పెక్కండ్రు రాజులు బీభత్సుని మార్కొనిరి' అని, 'పలువురు భూపతులు భీష్మునిఁ దలపడిరి' అనటంలో విశేషం ఏమిటంటే- మిగతా వీరుల విషయంలో ఒక్కడిని ఒక్కడుగాని, ముగ్గురిని మించకుండా ఎదుర్కొనగా, కౌరవ పక్షంలోని భీష్ముడి విషయంలోను,

పాండవ పక్షంలోని అర్జునుడి విషయంలోను ఆ విధంగా కాక- ఎక్కువ మంది ఎదుర్కొనటం జరిగింది. అనగా వీరిద్దరు వారి వారి పక్షాలలో అజేయులైన ప్రధాన వీరులని తెలుస్తున్నది.

తే. ' భీష్ముఁ డొడ్డన మేర్చిన బెడఁగు సాల । నొప్పెఁ, గౌరవయోధుల యుబ్బు మెఱసె
నృపు లనేకులు నా మీఁద నిగిడి రేను । జిక్కువఱిచెదఁ జూడుమీ యుక్కు మెఱసి.' 11

ప్రతిపదార్థం: భీష్ముఁడు= భీష్మాచార్యుడు; ఒడ్డనము= వ్యూహము; ఏర్చిన బెడఁగు= ఏర్పరచటంలోని అందం; చాలన్+ఒప్పెన్= మిక్కిలి తగియున్నది; కౌరవయోధుల ఉబ్బు= కౌరవ సైన్యములోని వీరులయొక్క పొంగు; మెఱసెన్= ప్రకాశించింది; అనేకులు నృపులు= పలువురు రాజులు; నా మీఁదన్= నా పైకి; నిగిడిరి= విజృంభించారు; ఏను= నేను; ఉక్కు మెఱసి= బలం అతిశయించగా; చిక్కు+పఱిచెదన్= సంకట పరుస్తాను; చూడుమీ= (ఓ కృష్ణా) చూడుము.

తాత్పర్యం: 'భీష్ముడు మండల వ్యూహాన్ని సంఘటించి, అందంగా ఒప్పిదంగా నిలిపాడు. అందుచేతనే కౌరవ సైనికులకు ఉత్సాహం అతిశయించింది. ఆ కారణంచేతనే పలువురు కౌరవ సైనికులు నా మీదకు ఉరుకుతున్నారు. నేను వారి బలానికి భంగం కలిగించి, కష్టం కలిగిస్తాను. ఓ కృష్ణా! చూడుము.'

వ. అని పలికి గొనయంబు సారించి. 12

ప్రతిపదార్థం: అని పలికి; గొనయంబున్= వింటినారిని, సారించి= సరిదీసి.

తాత్పర్యం: అర్జునుడు ఆ విధంగా పలికి, వింటి నారిని సారించి (తరువాతి పద్యంతో అన్వయం).

క. జననాథులపైఁ బె ల్లే । సిన వారలు నొక్కపెట్ట చెలఁగి ముకుందా
ర్జునులఁ బటుబాణవర్షం । బున ముంచిన నార్చె నీదుపుత్రబలంబుల్. 13

ప్రతిపదార్థం: జననాథులపైన్= కౌరవసేనలోని రాజులపైన; పెల్లు+ఏసినన్= అధికముగా ప్రయోగింపఁగా; వారలున్= ఆ రాజులుకూడ; ఒక్కపెట్ట= ఒక్కసారిగా; చెలఁగి= ఉత్సాహం చెంది; ముకుంద+అర్జునులన్= శ్రీకృష్ణుడిని, అర్జునుడిని; పటు బాణ వర్షంబునన్= చురుకైన బాణములనెడి వర్షంలో; ముంచినన్= ముంచివేయగా; నీదు పుత్రబలంబుల్= నీ కుమారుడి సేనలు; ఆర్చెన్= బొబ్బలు పెట్టాయి.

తాత్పర్యం: అర్జునుడు రాజులపై అధికంగా బాణాలు ప్రయోగించగా, వారు ఒక్కసారిగా విజృంభించి, పదునైన బాణవర్షంలో ఆ కృష్ణార్జునులను ముంచివేశారు. అప్పుడు నీ కుమారుడి సేనలు పెను బొబ్బలు పెట్టాయి.

వ. అప్పు డింద్రనందనుండు గోపించి యైంద్రాస్త్రంబు ప్రయోగించిన. 14

ప్రతిపదార్థం: అప్పుడు= కౌరవసేనలోని రాజులు కృష్ణార్జునులను బాణవర్షంలో ముంచినప్పుడు; ఇంద్రనందనుండు= ఇంద్రుడి కుమారుడైన అర్జునుడు; కోపించి; ఐంద్ర+అస్త్రంబు= ఇంద్రుడు దేవతగా గల బాణాన్ని; ప్రయోగించినన్= ప్రయోగించగా.

తాత్పర్యం: కౌరవరాజుల విజృంభణాన్ని చూచి కోపించి, అర్జునుడు ఐంద్రాస్త్రాన్ని ప్రయోగించాడు.

మ. అది యా బాణములెల్ల మాన్చి నరనా । థాంగంబులన్ గీఱి యు
న్మదశుండాలహయాళిఁ గూల్చి రభసో । న్మాదక్రియన్ సంభ్రమ
ప్రద మై మందర మంబుధిం గలఁచు ద । ర్పం బొప్ప నొప్పించుడుం
దదనీకంబులు వాఱి భీష్మరథ మా । ధారంబుగా నిల్చినన్. 15

ప్రతిపదార్థం: అది= అర్జునుడు ప్రయోగించిన ఐంద్రాస్త్రము; ఆ+బాణములు+ఎల్లన్= కురుసేనలోని రాజులు ప్రయోగించిన అన్ని బాణములను; మాన్చి= నశింపజేసి; నరనాథ+అంగంబులన్= రాజుల శరీరములను; గీటి= భేదించి; ఉన్మద శుండాల హయ+ఆళిన్= మదముచెందిన ఏనుగుల, గుర్రాల సమూహమును; కూల్చి= కూలద్రోసి; రభస+ఉన్మాదక్రియన్= చెలరేగిన వెర్రివలె; సంభ్రమప్రదము+ఐ= మిక్కిలి భ్రాంతి గొల్పుచున్నదై; మందరము= మందర పర్వతము; అంబుధిన్= సముద్రమును; కలఁచు దర్పంబు+ఒప్పన్= కలతనొందించునట్టి గర్వము ఒప్పగా; నొప్పించుడున్= బాధను కలిగించగా; తద్+అనీకంబులు= ఆ కౌరవులసేనలు; పాఱి= పరుగెత్తి; భీష్మరథము= భీష్మునియొక్కతేరు; ఆధారంబు+కాన్= అండకాగా; నిల్చినన్= నిలువగా.

తాత్పర్యం: అర్జునుడు వేసిన బాణం శత్రువులు వేసిన బాణాల ప్రభావాన్ని పోగొట్టింది. శత్రురాజుల శరీరాలను గాయపరచింది. మత్తిల్లిన ఏనుగుల గుంపునూ, గుర్రాల పొజునూ కూల్చివేసింది. వెర్రెత్తినదానివలె శత్రువులకు భయం కలిగిస్తూ మందరమనే పర్వతం సముద్రాన్ని కలచివైచినట్లుగా శత్రుసైన్యాన్ని కలత నొందించగా, కౌరవసేనలు భయపడి పరుగెత్తి, భీష్ముడి రథం మరుగుజొచ్చాయి.

విశేషం: అలం: ఉపమ.

వ. త్రిగర్తపతి మొదలయిన యమ్మహీపతులుం దెరలి తమతమ సైన్యంబులు సన్న నెలవులకుం జని యొదుంగుటయు గాంగేయుండు గడంగుటయుం గని రాజులతో రారా జిట్లనియె. 16

ప్రతిపదార్థం: త్రిగర్తపతి= త్రిగర్త దేశపురాజు సుశర్మ; మొదలు+అయిన; ఆ+మహీపతులున్= ఆ రాజులు కూడా; తెరలి= కలత చెంది; తమ తమ సైన్యంబులు= వారి వారి సేనలు; చన్న= వెళ్ళిన; నెలవులకున్= చోటులకు; చని= వెళ్ళి; ఒదుంగుటయున్= తల దాచుకొనగా; గాంగేయుండున్= గంగాపుత్రుడగు భీష్ముడు; కడంగుటయున్= శత్రుసంహారానికి యత్నించగా; కని; రాజులతో; రారాజు= చక్రవర్తియగు దుర్యోధనుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: త్రిగర్తాధిపతి ముఖ్యుడుగా గల పలువురు రాజులు కలతజెంది, తమసైన్యాలు వెళ్ళినచోటులకే వెళ్ళి దాగటాన్ని, భీష్ముడు యుద్ధంలో ప్రయత్నపరుడై ఉండటాన్ని చూచిన దుర్యోధనుడు ఆ రాజులతో ఇట్లా అన్నాడు.

విశేషం: త్రిగర్తము- మూడు అగర్తల దేశం. లాహోరమనే దేశంలోని ఒక భాగం జాలంధరమని కూడా దీనికిపేరు.

అవతారిక: వెనుకంజవేస్తున్న రాజులను రారాజు ఈ విధంగా ప్రోత్సాహపరుస్తున్నాడు.

క. ‘ సేనాసమేతుఁడగు నరు ।పై నొక్కఁడ భీష్ముఁ డడర బలువిడిమైఁ దో
డై నడవ వలదె? యింతటి ।మానుసులకు నేను జూడ మరలం దగునే?’ 17

ప్రతిపదార్థం: భీష్ముఁడు ఒక్కఁడు+అ= భీష్ముడొక్కడే; సేనాసమేతుఁడు+అగు= సైన్యముతో కూడినవాడైన; నరుపైన్= అర్జునుని మీదికి; అడరన్= విజృంభించుచుండగా; బలువిడిమైన్= ప్రతాపముతో; ఇంతటి మానుసులకున్= ఇంత గొప్ప పరాక్రమవంతులగు మనుష్య (భటు)లకు; తోడు+ఐ= సహాయులై; నడవన్‌వలదె= వెళ్లనక్కరలేదా?; నేను చూడన్= మీ ఏలికయగు నేను చూచుచుండగనే; మరలన్+తగునే?= వెనుదిరుగుట తగునా?

తాత్పర్యం: ‘సైన్యంతో కూడియున్న అర్జునుడిపైకి భీష్ముడు ఒంటరివాడై తలపడుతుండగా, రారాజునైన నా సమక్షంలోనే, వీరులైన మీరు (రాజులు) శౌర్యంతో భీష్ముడికి అండగా ఉండకుండా పెడదారి పట్టటం న్యాయమా?’ అని దుర్యోధనుడు రాజులను యుద్ధానికి పురికొల్పుతున్నాడు.

వ. అనిన విని యా భూపాలనికరం బాలంబునకు నూలుకొని సురనదీసూను నిరుగెలంకులం గూడుకొనియె నప్పుడు. 18

ప్రతిపదార్థం: అనినన్= దుర్యోధనుడు పై విధంగా అనగా; విని; ఆ భూపాలనికరంబు= ఆ రాజుల సమూహము; ఆలంబునకున్= యుద్ధమునకు; నూలుకొని= మనసు చక్కపరచుకొని; సురనదీసూనున్= దేవనదియగు గంగపుత్రుడైన భీష్ముని; ఇరు+కెలంకులన్= రెండు ప్రక్కలందు; కూడికొనియెన్= చేరెను; అప్పుడు.

తాత్పర్యం: రాజులందరూ రారాజు మాటవిని, యుద్ధానికి సన్నద్ధులై, భీష్మునికి ఇరుప్రక్కలందు నిలిచారు. ఆ సమయంలో-

సీ. గురుఁడు విరాటుని కోదండకేతుదం । డంబులఁ ద్రుంచె రెండంబకముల
నతఁడు వేఱొకవింట నాచార్యుమేనును । సూతుని మూఁడేసిసునిశితాస్త్ర
ముల నొంచి ఘోటకమ్ములనాలుగింట నో । నేసి చాపము సిడ మెడల రెంట
నేసిన నతఁడు ద న్నెనిమిదియమ్ముల । విరథుఁ జేసిన సుతునరద మెక్కి

తే. యతఁడు దానును గూడి వాలంపవెల్లి । ముంచుటయుఁ గుంభజుండు గోపించి దొడ్డ
నారసం బేయ నమ్మత్స్యనాథతనయు । నురము వడిఁ గాఁడి వీఁపున నుచ్చిపోయె. 19

ప్రతిపదార్థం: గురుఁడు= కౌరవ పాండవులకు విలు విద్య నేర్పిన ఆచార్యుడు- ద్రోణుడు; విరాటుని కోదండకేతుదండంబులన్= విరాట మహారాజుయొక్క వింటిని; టెక్కెము యొక్క కర్రను; రెండు+అంబకములన్= రెండు బాణాలతో; త్రుంచెన్= తునుకలు చేసినాడు; అతఁడు= ఆ విరాటమహారాజు; వేఱు+ఒక వింటన్= మరియొక విల్లుతో; మూఁడు+ఏసి= మూడు మూడు; సునిశిత+అస్త్రములన్= చాల పదునైన బాణములతో; ఆచార్యు మేనును= ద్రోణాచార్యుని యొక్క శరీరమును; సూతునిన్= సారథిని; నొంచి= గాయపరచి; నాలుగింటన్= నాలుగు బాణాలతో; ఘోటకమ్ములన్= గుర్రములను; నోన్+ఏసి= నొవ్వజేసి; రెంటన్= రెండు బాణాలతో; చాపము= విల్లు; సిడము= టెక్కెము; ఎడలన్= విరిగేటట్లుగా; ఏసినన్= వేయగా; అతఁడున్= ఆ ద్రోణాచార్యుడును; తన్నున్= తనను (విరాటుని); ఎనిమిది+అమ్ములన్= ఎనిమిది బాణాలతో; విరథున్= రథములేని వాడినిగా; చేసినన్= చేయగా; సుతు+అరదము+ఎక్కి= కుమారుడి రథమును ఎక్కి; అతఁడున్= కుమారుడును; తానునున్= విరాటమహారాజును; కూడి= కలిసి; వాలు+అంపవెల్లిన్= పదునైన బాణాల వెల్లువలో, ముంచుటయున్= ముంచివేయగా; కుంభజుండు= కడవనుండిపుట్టినవాడు- ద్రోణుడు; కోపించి= కోపంచెంది; దొడ్డనారసంబు= పెద్దదయిన ఇనుముతో చేయబడిన బాణాన్ని; ఏయన్= ప్రయోగింపగా; ఆ+మత్స్యనాథ తనయున్= ఆ మత్స్యదేశానికి రాజైన విరాటుని కుమారుని యొక్క; ఉరమున్= రొమ్మును; వడిన్= వేగముతో; కాఁడి= త్రవ్వి; వీఁపునన్= వీపునందు; ఉచ్చిపోయెన్= నాటుకొని బయటకు వచ్చినది.

తాత్పర్యం: ద్రోణుడు రెండు బాణాలువేసి, విరాటరాజు యొక్క వింటిని, పతాకము యొక్క కర్రను, త్రుంచివేశాడు. ఆ విరాటుడు మరొక వింటిని అందుకొని, మూడు మూడు మిక్కిలి పదునైన బాణాలతో ద్రోణాచార్యుడి శరీరాన్ని, సారథిని నొప్పించాడు. నాలుగు బాణాలతో గుర్రాలను కొట్టాడు. రెండు బాణాలతో ద్రోణుని ధనుస్సును, టెక్కెమునూ విరిచివేశాడు. ఆ ద్రోణుడు ఎనిమిది బాణాలువేసి, విరాటుని రథాన్ని కూల్చాడు. అప్పు డా విరాటుడు తన కొడుకు రథమెక్కి, తనకొడుకుతో కలిసి, పదునైన బాణాల ప్రవాహంలో ఆ ద్రోణుడిని ముంచాడు. అప్పుడు ద్రోణుడు కోపం చెంది, చాలా పొడవైన ఒక బాణాన్ని వేయగా, అది మత్స్యరాజు కుమారుని రొమ్మును గాయపరచి, వీపును తొలుచుకొని వెలుపలకి వచ్చినది.

వ. ఇట్లు క్రూరనారాచంబు బెట్టు దాఁకిన. 20

ప్రతిపదార్థం: ఇట్లు; క్రూరనారాచంబు= కఠినమైన ఆ బాణం; బెట్టు= గట్టిగా; తాఁకినన్= తగులగా.

తాత్పర్యం: ఈ విధంగా ఆ మత్స్యరాజు ప్రయోగించిన బాణం గట్టిగా తగులగా. (తరువాతి పద్యంతో అన్వయం)

క. విల్లును నమ్ములు విడుచుచుఁ ద్రెళ్లుటయును శంఖుఁజూచి ధృతిగలఁగి జనం
బెల్లను జూడ విరాటుఁడు దల్లడమునఁ బాఱి విచ్చెఁ దత్సైన్యంబుల్. 21

ప్రతిపదార్థం: విల్లును(న్)= ధనుస్సును; అమ్ములున్= బాణములను; విడుచుచున్= వదలిపెట్టుచు; త్రెళ్లుటయున్= పడిపోగా; శంఖున్= ఆ శంఖుని; చూచి; ధృతి= ధైర్యము; కలఁగి= కలతపడి; విరాటుడు; జనంబు+ఎల్లను= జనులందరును; చూడన్= చూచుచుండగా; తల్లడమునన్= భయంతో; పాఱన్= పరుగెత్తగా; తద్+సైన్యంబుల్= ఆ విరాటుని సేనలు; విచ్చెన్= చెదరిపోయాయి.

తాత్పర్యం: ఆ ద్రోణుడు ప్రయోగించిన పెద్ద బాణపు దెబ్బకు శంఖుడు ధనుర్బాణాలను జారవిడిచి నేలపడ్డాడు. ఆ దృశ్యం చూడటంచేత ధైర్యం కోల్పోయి, విరాటుడు జనమంతా చూస్తుండగా, భయంతో పరుగెత్తాడు. ఆతడి సేనలు గూడ చెల్లాచెదరైపోయాయి.

అవతారిక: శిఖండి అశ్వత్థామల పోరు వర్ణిస్తున్నాడు.

వ. అట్టిసమయంబున శిఖండి గురుపుత్ర ఫాలంబునఁ బటునారాచత్రయంబు నాటించిన నతం డలిగి యొక్క పెట్ట పెక్కమ్ములఁ దురంగ సూతకేతు చాపంబుల నుగ్గుసేసినం బలకయు వాలునుం గొని నేల కుఱికి పాంచాలనందనుండు సాళువంబు చందంబునం గవిసి యశ్వత్థామ యేయు బాణంబులు కృపాణంబునఁ ద్రుంచుచుం గదిసిన నతండు కోపించి. 22

ప్రతిపదార్థం: అట్టి సమయంబునన్= విరాటుడు పారిపోయినట్టి తరుణంలో (ఆతడి సైన్యం ఓడిపోయినట్టి ఆ సమయంలో); శిఖండి; గురుపుత్రుఫాలంబునన్= ద్రోణుడి కుమారుడైన అశ్వత్థామ యొక్క నుదుట; పటునారాచత్రయంబున్= మంచి శక్తిగల మూడు బాణాలను; నాటించినన్= గ్రుచ్చుకొనునట్లుచేయగా; అతండు= ఆ అశ్వత్థామ; అలిగి= కోపగించి; ఒక్క పెట్టన్= ఒకేసారిగా; పెక్కు+అమ్ములన్= ఎన్నో బాణాలతో; తురంగ= గుర్రాలు; సూత= సారథి; కేతు= ధ్వజము; చాపంబులన్= ధనుస్సు- వీటిని; నుగ్గు+చేసినన్= పొడిచేయగా; పలకయున్= కేడెమును (ఆయుధ విశేషము); వాలునున్= కత్తియును; కొని= తీసికొని; నేలకున్= భూమి మీదికి; ఉఱికి= దుమికి; పాంచాల నందనుండు= పాంచాలరాజుకుమారుడు శిఖండి; సాళువంబు చందంబునన్= డేగవలె; కవిసి= వ్యాపించి; అశ్వత్థామ= గురుపుత్రుడు; ఏయు= ప్రయోగించునట్టి; బాణంబులన్= బాణాలను; కృపాణంబునన్= కత్తితో; త్రుంచుచున్= తునియలుచేస్తూ; కదిసినన్= దగ్గరకురాగా; అతండు= ఆ అశ్వత్థామ; కోపించి.

తాత్పర్యం: ఆ సమయంలో శిఖండి మూడు పదునైన బాణాలను అశ్వత్థామ నొసట గ్రుచ్చుకొనేటట్లు ప్రయోగించాడు. అశ్వత్థామ కోపం చెంది ఒక్క తడవగా చాలా బాణాలు ప్రయోగించి అతని గుర్రాలను, సారథిని, టెక్కాన్ని, ధనుస్సును నుగ్గుచేశాడు. దానితో శిఖండి డాలు కత్తి తీసికొని, నేలపైకి ఉరికి, డేగమాదిరిగా ఎగబడుతూ, అశ్వత్థామ వేసే బాణాల నన్నింటినీ తన కత్తితో త్రుంచివేస్తూ మీదికి వచ్చాడు. అప్పుడు అశ్వత్థామ కోపంతో. (తరువాతి పద్యంతో అన్వయం)

తే. పలక పటియలుగాఁ జేసి యలుఁగుఁ దునిమి । యొడల వాలంపపాది నింప నొల్లఁబోక
ద్రుపదపుత్రుండు గరవాలు దునియ వైవ । నడుమఁ బొడి సేసె నాచార్యనందనుండు. 23

ప్రతిపదార్థం: పలక(న్)= కేడెమును; పటియలు+కాన్+చేసి= బద్దలయ్యేటట్లుచేసి; అలుఁగున్= ఖడ్గమును; తునిమి= తునకలుచేసి; ఒడల(న్)= శరీరమందు; వాలు+అంపపొదిన్= పదునైన బాణాల సమూహాన్ని; నింపన్= నింపివేయగా; ఒల్లఁబోక= లెక్కచేయక; ద్రుపదపుత్రుండు= ద్రుపదునియొక్క కుమారుడు- శిఖండి; కరవాలు= కత్తియొక్క; తునియన్ వైవన్= ముక్కను వేయగా; ఆచార్యనందనుండు= ద్రోణపుత్రుడు- అశ్వత్థామ; నడుమన్= మధ్యలోనే; పొడి+చేసెన్= (శిఖండి వేసిన కత్తితుంటను) పొడి పొడి చేశాడు.

తాత్పర్యం: అశ్వత్థామ శిఖండి యొక్క డాలును బద్దలుకొట్టాడు. ఖడ్గాన్ని నరికి పదునైన బాణ సమూహాన్ని అతడి ఒంటినిండా నింపాడు. శిఖండి వెనుదీయకుండా అశ్వత్థామ నరకగా మిగిలిన కత్తి ముక్కను విసరగా అశ్వత్థామ దానిని తన వద్దకు రానీయకుండా మధ్యలోనే పొడిచేసేశాడు.

వ. శిఖండియు సాత్యకిరథం బెక్కఁ దదవసరంబున ధృష్టద్యుమ్నుండు. 24

ప్రతిపదార్థం: శిఖండియున్= శిఖండికూడ; సాత్యకిరథంబున్= సాత్యకి రథాన్ని; ఎక్కెన్; తద్+అవసరంబునన్= ఆ సమయంలో; ధృష్టద్యుమ్నుండు.

తాత్పర్యం: తన ఆయుధాలను అశ్వత్థామ మధ్యలోనే పొడిచేయగా, శిఖండి సాత్యకియొక్క రథంలోకి వెళ్ళాడు. ఆ సమయంలో.

ధృష్టద్యుమ్ననిచే దుర్యోధనుండు విరథుఁ డై పోవుట (సం. 6-78-44)

క. శరములు గురుపతిమీఁదం । గురిసిన నతఁ డతని మేనఁ గ్రూరాస్త్రంబుల్
సరభసమున నింపఁగ స । త్వరముగ నాద్రుపదసుతుఁడు దచ్చాపంబున్. 25

ప్రతిపదార్థం: శరములు= (ధృష్టద్యుమ్నుడు) బాణాలను; కురుపతిమీఁదన్= కురురాజైన దుర్యోధనుడిపై; కురిసినన్= వర్షింపగా; అతఁడు= ఆ దుర్యోధనుడు; అతనిమేనన్= ఆ ధృష్టద్యుమ్నుడి శరీరంమీద; క్రూర+అస్త్రంబుల్= కఠినమైన బాణాలను సరభసమునన్= మిక్కిలి వేగంతో; నింపఁగన్= నిండింపగా; ఆ ద్రుపదసుతుఁడు= ద్రుపదుని కుమారుడగు ఆ ధృష్టద్యుమ్నుడు; సత్వరముగన్= త్వరతో; తద్+చాపంబున్= ఆ దుర్యోధనునియొక్క విల్లును.

తాత్పర్యం: ధృష్టద్యుమ్నుడు దుర్యోధనుడిపై బాణాలు గుప్పించాడు. దుర్యోధనుడు కూడా వెంటనే ధృష్టద్యుమ్నుడి శరీరంమీద కఠినమైన బాణాలను నింపాడు. వెంటనే ధృష్టద్యుమ్నుడు దుర్యోధనుడి విల్లును (విరిచాడు).

వ. తుండంబులు గావించి. 26

ప్రతిపదార్థం: తుండంబులు= తునకలు; కావించి= చేసి.

తాత్పర్యం: ధృష్టద్యుమ్నుడు దుర్యోధనుని విల్లును తునకలు చేశాడు.

క. మఱియు నొక విల్లు గొను న । త్తఱిపిన విరథుఁడుగఁ జేయ ధృతిఁ గరవాలం
బుఱక గొని విభుఁడు నేలకు । నుఱికి యతనిమీఁద నడరె నుగ్రాకృతియై. 27

ప్రతిపదార్థం: మఱియున్+ఒక+విల్లున్= వేరొక వింటిని; కొను+ఆ+తెఱపినన్= తీసికొనే లోపల; విరథుడుగన్+చేయన్= రథంలేని వాడిగా చేయగా; విభుఁడు= రాజైన దుర్యోధనుడు; ధృతిన్= ధైర్యముతో; కరవాలంబున్= కత్తిని; ఉఱక+కొని= అలవోకగా పట్టుకొని; నేలకున్= నేలమీదికి; ఉఱికి= దూకి; ఉగ్ర+ఆకృతి+ఐ= భయంకరమైన ఆకారంకలవాడై; అతనిమీఁదన్= ఆ ధృష్టద్యుమ్నుడి మీదికి; అడరెన్= విజృంభించెను.

తాత్పర్యం: దుర్యోధనుడు వేరే విల్లు తీసికొనే లోపలనే ధృష్టద్యుమ్నుడు దుర్యోధనుని రథాన్ని నుగ్గుచేశాడు. అప్పుడు దుర్యోధనుడు తన ఖడ్గాన్ని తీసికొని మహాధైర్యంతో, భయంకరాకారంతో నేలమీదికి దూకి శత్రువుపైకి విజృంభించాడు.

వ. అట్టియెడ సౌబలుండు రయంబున నెయిది యన్నరపతిం దనరథంబు మీఁదికిఁ దిగిచికొని పోయె. సాత్యకి యలంబుసుని నలఘు విశిఖ వృష్టిం బొదివిన నద్దనుజుం డర్ధచంద్రబాణంబున దద్బాణాసనంబు దుండంబులు సేసి యంగమ్ముల వాలమ్ములు గీలించి మాయ లొనర్చి యతిఘోరంబుగాఁ బేర్చిన నా శినివంశవరుం డచలుం డై యైంద్రాస్త్రప్రయోగంబున నమ్మాయ మాయించి యతని వెగడుపఱచిన నతఁడు వెఱచఱచి పఱచిన నయ్యాదవసింహుండు సింహనాదంబు సేసి కురుబలంబులపయిం గవిసెనప్పుడు. 28

ప్రతిపదార్థం: అట్టి+ఎడన్= ఆ సమయంలో; సౌబలుండు= సుబలుని కుమారుడు-శకుని; రయంబునన్= వేగంగా; ఎయిది= అనుసరించి వెళ్ళి; ఆ+నరపతిన్= ఆ దుర్యోధనుడిని; తన; రథంబుమీఁదికిన్; తిగిచికొని+పోయెన్= లాగుకొని పోయాడు; సాత్యకి= కృష్ణుని సోదరుడు; అలంబుసునిన్= అలంబుసుడను కౌరవపక్షంలోని రాక్షసుణ్ణి; అలఘు విశిఖవృష్టిన్= అధికములగు బాణాల వర్షంతో; పొదివినన్= కప్పివేయగా; ఆ+దనుజుండు= రాక్షసుడైన ఆ అలంబుసుడు; అర్ధచంద్రబాణంబునన్= అర్ధచంద్రుని ఆకారంతో ఉండే బాణంతో; తద్+బాణాసనంబున్= వాని వింటిని; తుండంబులు+చేసి= తునుకలుగా చేసి; అంగమ్ములన్= వాని అవయవాలయందు; వాలు+అమ్ములన్= పదునుగల బాణాలను; కీలించి= నాటి; మాయలు= రాక్షసమాయలు; ఒనర్చి= చేసి; అతి ఘోరంబు+గాన్= మిక్కిలి భయంకరంగా; పేర్చినన్= అతిశయించగా; ఆ శినివంశవరుండు= ప్రసిద్ధమైన శినివంశంలో ముఖ్యుడైనవాడు- సాత్యకి; అచలుండు+ఐ= చలనంలేనివాడై; ఐంద్రాస్త్ర ప్రయోగంబునన్= ఇంద్రుడు దేవతగాగల బాణాన్ని ప్రయోగించడంచేత; ఆ+మాయన్= అలంబుసుడు ప్రయోగించిన మాయను; మాయించి= పోగొట్టి; అతనిన్= అలంబుసుడిని; వెగడుపఱిచినన్= తల్లడిల్లజేయగా; అతఁడు= అలంబుసుడు; వెఱచఱచి= భయపడి; పఱచినన్= పారిపోగా; ఆ+యాదవసింహుడు= యదువంశంలోని వాళ్ళలో శ్రేష్ఠుడు- సాత్యకి; సింహనాదంబుచేసి= సింహం మాదిరి గర్జించి; కురుబలంబులపయిన్= కౌరవ బలాల మీదికి; కవిసెన్= విజృంభించాడు; అప్పుడు.

తాత్పర్యం: అప్పుడు శకుని ఆ దుర్యోధనుడిని తన రథంలోనికి ఎక్కించుకొని పోయాడు. పాండవ పక్షంలోని సాత్యకి అలంబుసుడనే రాక్షసుడిని బాణాలవర్షంలో ముంచి వేశాడు. ఆ రాక్షసుడు అర్ధచంద్రాకారంగా ఉండే బాణంతో సాత్యకి వింటిని ముక్కలు చేశాడు. అవయవాలనిండా బాణాలను గ్రుచ్చివేశాడు. రాక్షసమాయలు చేశాడు. చాలా భయంకరంగా మాయాపరంపరలను ఆతనిపైకి ప్రయోగించాడు. వాడింతచేసినా, శినివంశశ్రేష్ఠుడు సాత్యకి స్థిరంగా నిలబడి, ఐంద్రాస్త్రాన్ని ప్రయోగించి, ఆ రాక్షసుడి మాయను మటుమాయంచేసి అతడిని తల్లడిల్లేటట్లు చేశాడు. ఆ దెబ్బతో అతడు భయపడి పారిపోయాడు. సాత్యకి కురుసైన్యంపైకి ఉరికాడు. అప్పుడు-

అవ. భీముడికి, కృతవర్మకు, యుద్ధం ఇక్కడ చెప్పబడుతోంది.

క. కృతవర్మ యేచి మారుత । సుతుపయిఁ దఱుముటయుఁ నతఁడు సూతునిఁ దురగ
ప్రతతిం బడనేసి మహో । ద్ధతి మార్గణమయముసేసెఁ దద్గాత్రంబున్. 29

ప్రతిపదార్థం: కృతవర్మ= కౌరవపక్షపాతియగు కృతవర్మయనువాడు; ఏచి= విజృంభించి; మారుతసుతుపయిన్= వాయుదేవుని కుమారుడు భీముడి మీదికి; తఱుముటయున్= కవియగా; అతఁడు= ఆ భీముడు; సూతునిన్= సారథిని; తురగ ప్రతతిన్= గుర్రాల గుంపును; పడన్+ఏసి= పడేటట్లుకొట్టి; మహా+ఉద్ధతిన్= చాలా గర్వంతో; తద్+గాత్రంబున్= ఆ కృతవర్మశరీరాన్ని; మార్గణమయము= బాణాలమయంగా; చేసెన్= చేసినాడు.

తాత్పర్యం: కృతవర్మ ఆటోపంగా భీముడిపైకి విజృంభించాడు. భీముడు ఆ కృతవర్మ సారథిని, గుర్రాల గుంపును కూల్చివేశాడు. గర్వంతో పలు బాణాలు ప్రయోగించి, శత్రువు శరీరాన్ని శరమయం చేశాడు.

వ. ఇట్లు విరథుండును విశిఖక్షతదేహుండు నై యతం డేదు వెరిఁగి నట్లు నీదు మఱందియగు వృషకు
నరదంబుమీఁది కరిగె, ననిలతనయుండును మనగజఘటలపైఁ బటురయంబునం దనరథంబుఁ బఱపె'
ననిన విని ధృతరాష్ట్రుండు సంజయున కి ట్లనియె. 30

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; అతండు= ఆ కృతవర్మ; విరథుండును= రథంలేనివాడుగాను; విశిఖక్షత దేహుండున్+ఐ= బాణాలచే గాయపరచబడ్డ దేహం కలవాడుగానూ అయి; ఏదు+వెరిఁగినట్లు= ముండ్లపంది పెరిగినట్లు; నీదు మఱంది= నీ (ధృతరాష్ట్రుని) బావమరది; అగు= అయిన; వృషకు= వృషకునియొక్క; అరదంబుమీఁదికిన్= రథంపైకి; అరిగెన్= వెళ్ళాడు; అనిలతనయుండును= వాయుపుత్రుడు- భీముడు; మన= (కౌరవులైన) మనయొక్క; గజఘటలపైన్= ఏనుగుల గుంపులమీదికి; పటురయంబునన్= మిక్కిలి వేగంతో; తన= తనయొక్క; రథంబున్= తేరును; పఱపెన్= సాగదోలాడు; అనినన్= అని చెప్పగా; విని; ధృతరాష్ట్రుండు; సంజయునకున్; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఈవిధంగా విరథుడూ, బాణాలతో గాయపడ్డ శరీరం కలవాడూ అయిన కృతవర్మ నిక్కపొడుచుకున్న ముళ్లు గల ముండ్లపందివలె నీమరదియైన వృషకుడి రథంమీదికి వెళ్లాడు. వాయుపుత్రుడైన భీమసేనుడు మన ఏనుగుల గుంపుమీదికి మిక్కిలి వేగంతో తన రథాన్ని నడిపాడు. అని చెప్పగా విని ధృతరాష్ట్రుడు సంజయుడితో ఇట్లన్నాడు.

విశేషం: ఘట= యుద్ధంకోసం ఒక నిర్ణీతస్థలంలో చేర్చబడిన ఏనుగుల గుంపు.

అవతారిక: పాండవసేనలు విజృంభించటాన్ని, కౌరవసేనలు తగ్గుముఖం పట్టడాన్ని విని ధృతరాష్ట్రుడు చింతతో సంజయుణ్ణి అడుగుతాడు.

క. ' విఱుగుట నొచ్చుట మనదెసఁ । దఱచుగ నాడెదవు పాండుతనయులబల మే
డ్తెఱ దఱుఁగక పెనఁగుట పలు । మఱుఁ జెప్పెద వకట! యేమి మాయయొ తలఁపన్. 31

ప్రతిపదార్థం: విఱుగుట= ఓడిపోవుట; నొచ్చుట= నొప్పిచెందుట; మనదెసన్= మనదైన కౌరవపక్షంలో; తఱచుగన్= అధికంగా; ఆడెదవు= చెప్పుతున్నావు; పాండు తనయుల బలము= పాండు రాజకుమారుల సైన్యము; తఱుగక= నశించిపోక; ఏడ్తెఱన్= పరాక్రమంతో; పెనఁగుట= యుద్ధముచేయుట; పలుమఱున్= మాటి మాటికి; చెప్పెదవు= పలుకుతున్నావు; అకట!= అయ్యో!; తలఁపన్= ఆలోచింపగా; ఏమి మాయయొ?= ఇది ఏమి మాయో?

తాత్పర్యం: 'ఓ సంజయా! మన పక్షంలో చావడం, బాధపడడం గూర్చి ఎక్కువగా చెప్పుతున్నావు. మరి పాండవ బలమెతే నాశనం లేకుండా గొప్పగా యుద్ధంచేయటాన్ని పదేపదే పలుకుతున్నావు. అయ్యో! ఇది ఏమి మాయో అర్థం కావటంలేదు?'

వ. అనిన విని సంజయుం డతని కిట్లను 'మనవారు దా మోపినభంగిఁ బెనంగుదురు. సముద్రంబుసొచ్చిన యేఱులుంబోలెఁ బాండవసేనం జొచ్చి తమ దర్పంబులు మెఱయలే రది తప్పుగాఁ గొనరాదు. నీ తప్పునఁ బాటిల్లిన చేటునకు శోకింపం బని లేదు. సమరప్రకారం బవధరింపు మవంతిదేశాధీశులగు విందాను విందులం బటుబాణపరంపరలం గప్పి యుధామన్యుం డేచి యనువిందు విరథుం జేసిన నతండు విందు స్యందనం బెక్కుటయు, నప్పాంచాలవంశవరుండు. 32

ప్రతిపదార్థం: అనినన్= అని ధృతరాష్ట్రుడు చెప్పగా; సంజయుండు; విని; అతనికిన్= ఆ ధృతరాష్ట్రుడికి; ఇట్లు; అనున్= అంటాడు; మనవారు= కౌరవులు; తాము; ఓపిన భంగిన్= శక్తికొలది; పెనంగుదురు= యుద్ధంచేస్తారు; సముద్రంబు= సముద్రంలోకి; చొచ్చిన= ప్రవేశించిన; ఏఱులున్+పోలెన్= నదులమాదిరి; పాండవసేనన్= పాండవుల సైన్యమును; చొచ్చి= ప్రవేశించి; తమ; దర్పంబులు= గర్వాలను; మెఱయలేరు= ప్రకాశింపచేయలేరు; అది= తమ పౌరుషాన్ని ప్రకాశింపచేయలేకపోవుట; తప్పు+కాన్= అపరాధముగా; కొనరాదు= అనుకోకూడదు; నీ తప్పునన్= నీ అపరాధంవల్ల; పాటిల్లిన= కలిగిన; చేటునకున్= నాశనానికి; శోకింపన్= దుఃఖింపగా; పనిలేదు; సమర ప్రకారంబు= యుద్ధ విధానాన్ని; అవధరింపుము; అవంతి దేశాధీశులు+అగు= అవంతిదేశానికి రాజులైన; విందానువిందులన్= విందుడు, అనువిందుడు అనువారిని; పటుబాణ పరంపరలన్= బటువులైన బాణాల వరుసలతో; కప్పి= కప్పివేసి; యుధామన్యుండు= ఆ పేరుగలరాజు; ఏచి= విజృంభించి; అనువిందున్= అనువిందుడనువాడిని; విరథున్= రథంలేనివాడిగా; చేసినన్= చేయగా; అతండు= ఆ అనువిందుడు; విందు స్యందనంబు= విందునియొక్క రథాన్ని; ఎక్కుటయున్= ఎక్కటంతో; ఆ+పాంచాలవంశవరుండు= పాంచాల వంశంలో శ్రేష్ఠుడైన ఆ యుధామన్యుడు.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడు అడిగినదానికి సంజయు డీ విధంగా బదులుచెప్పాడు. 'మనకౌరవ సైన్యమేమో తన శక్తికొద్దీ పోరాడుతున్నది. సముద్రాన్ని చేరిన ఏళ్ళు అందులో కలిసిపోయి తమ స్వరూపాన్ని చూపలేని విధంగా, తమ ప్రతాపాన్ని వీరు చూపలేకపోతున్నారు. అది వారి తప్పుకాదు. నీ తప్పిదంవల్లనే ఈ ముప్పు ముంచుకు వచ్చింది. దానికీ దుఃఖపడనక్కరలేదు. యుద్ధమెఖరిని ఆలకించు. యుధామన్యుడు బాగా విజృంభించి అవంతిదేశపురాజులు విందానువిందులనే వాళ్ళను పుంఖానుపుంఖంగా పదునైన బాణాలతో కప్పివేసి, అనువిందుడనేవాడి రథాన్ని నుగ్గుచేశాడు. వాడు విందుడి రథమెక్కాడు. అప్పుడు పాంచాల రాజు యుధామన్యుడు. (తరువాతి పద్యంతో అన్వయం)

క. విందుని సారథి నొక కో । లం దునిమిన వాహములు గలంగంబడి పా
ఱెం దేరు దిగిచికొని మగు । డం దద్బలమెల్లఁ దల్లడముఁ బొందె వడిన్. 33

ప్రతిపదార్థం: ఒక కోలన్= ఒక బాణముతో; విందుని సారథిన్= విందునియొక్క సారథిని; తునిమినన్= చంపివేయగా; వాహములు= గుర్రాలు; కలంగన్+పడి= కలతచెంది; తేరున్= రథమును; తిగిచికొని= లాగికొని; మగుడన్= వెనుదిరిగి; పాఱెన్= పరుగెత్తాయి; తద్+బలము= వాని సైన్యము; ఎల్లన్= అంతయు; వడిన్= వేగంగా; తల్లడమున్= చంచలత్వమును; పొందెన్.

తాత్పర్యం: యుధామన్యుడు విందుడి సారథిని ఒక బాణంతో చంపివేశాడు. అప్పుడు రథానికి పూన్చిన గుర్రాలు కలతచెంది, తేరును లాగికొని వెనుకకు మళ్ళాయి. దానితో విందునిసేన తల్లడిల్లిపోయినది.

వ. అట్టి సంకులసమరంబున. 34

ప్రతిపదార్థం: అట్టి= ఆ విధమైన; సంకులసమరంబునన్= దొమ్మి యుద్ధంలో.

తాత్పర్యం: పద్ధతిని అతిక్రమించి జరిగిన ఆ దొమ్మియుద్ధంలో. (తరువాతి పద్యంతో అన్వయం).

క. భగదత్తు నేనుఁ గడరిన । వెగడునఁ బాండవులమొనలు విఱుగుటయు మహా
నగ మేటివేగ మాఁగిన । పగిది ఘటోత్కచుఁడు దాని పరు వుడిగించెన్. 35

ప్రతిపదార్థం: భగదత్తు= భగదత్తుని యొక్క; ఏనుఁగు= గజము; అడరినన్= విజృంభించగా; పాండవులమొనలు= పాండవుల యొక్క సైన్యము; వెగడునన్= తడబాటుతో; విఱుగుటయున్= ఓడిపోవుటమూ; నగము= పర్వతం; ఏటి వేగము= నదీ ప్రవాహాన్ని; ఆఁగిన పగిదిన్= ఆపుచేసిన విధంగా; ఘటోత్కచుఁడు; దాని పరువు= ఆ ఏనుగు యొక్క పరుగెత్తటాన్ని; ఉడిగించెన్= మాన్పించేసినాడు.

తాత్పర్యం: భగదత్తుడి ఏనుగు విజృంభించి పరుగెత్తింది. దానివలన పాండవుల సేన తడబడి చిందరవందరైపోసాగింది. అప్పుడు ఘటోత్కచుడు నదీవేగాన్ని గొప్పపర్వతం ఆపినట్టుగా ఆ ఏనుగు పరుగును ఆపాడు.

సీ. దనుజేంద్రు నిలుచుట గని సైన్య మెప్పటి । యట్టుల పురికొని యనికిఁ జొచ్చె
నాఘటోత్కచుఁడు బాణావళి వఱపిన । భగదత్తుఁ డదియెల్ల మగుడఁ జేసి
పటుతోమరంబులు పదునాలు గడరింప । నవి ద్రుంచి డెబ్బది యమ్ములేసి
యసుర యార్చినఁ బేర్చి యాతఁడు విరథుఁ జే । సిన వాఁడు శక్తి వైచిన నతండు

తే. నడుమఁ దునుమాడి వడిఁ బెక్కునారసముల । నొంప దైత్యుండు నముచి నిలింపపతికిఁ
బాఱిన ట్లోడి పాఱె నబ్బలము గడిమి । నెగచెఁ బ్రాగ్జ్యోతిషాధీశుఁ డిభముఁ బఱపి. 36

ప్రతిపదార్థం: దనుజేంద్రు నిలుచుటన్= ఘటోత్కచుడు నిలబడటాన్ని; కని= చూచి; సైన్యము= కౌరవసేన; ఎప్పటి+అట్టులన్= మరల; పురికొని= కమ్ముకొని; అనికిన్= యుద్ధమునకు; చొచ్చెన్= చొరబడినది; ఆ ఘటోత్కచుఁడు; బాణావళిన్= బాణాల సమూహాలను; వఱపినన్= ప్రయోగించగా; భగదత్తుఁడు; అది+ఎల్లన్= దానినంతటినీ; మగుడన్+చేసి= తిప్పికొట్టి; పదునాలుగు; పటు తోమరంబులు= సమర్థములగు చిల్లకోలలను; అడరింపన్= ప్రయోగించగా; అవి= వాటిని; త్రుంచి= తునుకలుచేసి; అసుర= రాక్షసుడు; డెబ్బది+అమ్ములు+ఏసి= డెబ్భై బాణాలువేసి; ఆర్చినన్= పొలికేక పెట్టగా; ఆతఁడు= ఆ భగదత్తుడు; పేర్చి= విజృంభించి; విరథున్+చేసినన్= రథములేనివాడిని చేయగా; వాఁడు= ఆ ఘటోత్కచుడు; శక్తి వైచినన్= శక్త్యాయుధాన్ని ప్రయోగించగా; అతండు= ఆ భగదత్తుడు; నడుమన్= మధ్యలోనే; తునుము+ఆడి= తునుకలుచేసి; వడిన్= వేగంతో; పెక్కు నారసములన్= పలుబాణాలతో; నొంపన్= బాధించగా; నముచి= నముచి అనే రాక్షసుడు; నిలింప పతికిన్= దేవతల రాజగు ఇంద్రుడికి; పాఱినట్లు= పరుగెత్తిన మాదిరిగా; దైత్యుండు= ఘటోత్కచుడు; ఓడి= ఓడిపోయి; పాఱెన్= పరుగెత్తాడు; ప్రాగ్జ్యోతిష+అధీశుఁడు= ప్రాగ్జ్యోతిషమునకు రాజైన భగదత్తుడు; ఇభమున్= తన ఏనుగును; పఱపి= తోలి; ఆ+బలమున్= ఆ రాక్షసుడి సైన్యాన్ని; కడిమిన్= పరాక్రమంతో; ఎగచెన్= తరిమాడు.

తాత్పర్యం: భగదత్తుని ఏనుగు ముందు ఘటోత్కచుడు నిలవడంచూచి, ఆ ఏనుగు యొక్క విజృంభణానికి భయపడిపారిపోయిన పాండవసేన ఎప్పటిలాగానే పూనుకొని యుద్ధం చేసింది. ఆ ఘటోత్కచుడు అతడిపై బాణాలు కురిపించాడు. ఆ బాణాలను భగదత్తుడు తిప్పికొట్టాడు. బలంగల పద్నాలుగు చిల్లకోలలను కూడా వాడిపై ప్రయోగించాడు. ఘటోత్కచుడు, వాటిని త్రుంచి డెబ్భై బాణాలు వేసి, సింహనాదం చేయగా భగదత్తుడు విజృంభించి, ఆ రాక్షసుడి రథాన్ని కూల్చాడు. వాడు భగదత్తుడి మీద 'శక్తి' అనే ఆయుధాన్ని ప్రయోగించాడు. భగదత్తుడు ఆ 'శక్తి' ఆయుధాన్ని మధ్యలోనే త్రుంచివేసి వేగంగా పెక్కు బాణాలతో నొప్పించాడు. అప్పుడు ఘటోత్కచుడు ఇంద్రుడి దెబ్బకు తట్టుకోలేక పారిపోయిన నముచి విధంగా, భయపడి పారిపోయాడు. ఆ సమయంలో భగదత్తుడు ఘటోత్కచుడి సైన్యంమీదికి తన ఏనుగును పురికొలిపి, చిందరవందర చేశాడు.

అవతారిక: శల్యునికి, నకులసహదేవులకు జరిగిన యుద్ధం వర్ణించబడుతోంది.

ఆ. శల్యుమీఁద గవలు శరవృష్టి గురిసిన । నగుచు, విరథుఁ జేసె నకులు నతఁడు
వార లప్పు డొక్క తే రెక్కి యడరిన । రౌద్ర మెసఁగ నొంచె మద్రవిభుఁడు. 37

ప్రతిపదార్థం: కవలు= నకుల సహదేవులు; శల్యుమీఁదన్; శరవృష్టిన్= బాణవర్షాన్ని; కురిసినన్= కురిపింపగా; అతఁడు= ఆ శల్యుడు; నగుచున్= నవ్వుతూ; నకులున్= నకులుడిని; విరథున్= రథంలేనివాడినిగా; చేసెన్= చేశాడు; అప్పుడు= ఆ రథం భగ్నమైన సమయంలో; వారలు= ఆ నకుల సహదేవులు; ఒక్కతేరు= ఒకేరథాన్ని; ఎక్కి; అడరినన్= అతిశయించగా; మద్రవిభుఁడు= శల్యుడు; రౌద్రము= రౌద్రరసము; ఎసఁగన్= అతిశయించగా; నొంచెన్= వారిని బాధించాడు.

తాత్పర్యం: నకులుడు, సహదేవుడు- వీరిద్దరూ శల్యుడిమీద బాణాల వర్షాన్ని కురిపించారు. శల్యుడు నవ్వుతూ సునాయాసంగా నకులుడి రథాన్ని విరిచాడు. తరువాత, నకుల సహదేవులిద్దరూ ఒకే రథాన్నెక్కి విజృంభించారు. శల్యుడు మహారౌద్రంతో వారిని బాధించాడు.

విశేషం: రౌద్రము= శృంగారాది రసాల్లో ఒకటి. నవరసాలు- 1. శృంగారము; 2. హాస్యము; 3.కరుణము; 4.వీరము; 5.రౌద్రము; 6.భయానకము; 7. బీభత్సము; 8.అద్భుతము; 9. శాంతము.

చ. ధృతి బలుపొప్ప నిల్చి సహ । దేవుఁడు వ్రేఁకని నారసంబు గ్రూ
రత నుర మాడనేయ నది । రక్తము సోఁకక యుచ్చిపోవుడున్
మృతుఁడునుబోలెఁ దేరిపయి । మేటిమగండగు మద్రమేదినీ
పతి వడినం గలంగె నర । పాలక! కౌరవరాజ సైన్యముల్. 38

ప్రతిపదార్థం: నరపాలక!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; సహదేవుఁడు; ధృతి= ధైర్యముయొక్క; బలుపు= ఆధిక్యము; ఒప్పన్= ఒప్పియుండగా; నిల్చి= నిలబడి; వ్రేఁకని= బరువైన; నారసంబు= బాణం; క్రూరతన్= కఠినముగా; ఉరము= రొమ్మును; ఆడన్= నాటేటట్లుగా; ఏయన్= వేయగా; అది= ఆ బాణం; రక్తము= నెత్తుటిని; సోఁకక= తాకక; ఉచ్చిపోవుడున్= గ్రుచ్చికొని వెలుపలికి రాగా; మేటిమగండు+అగు= గొప్పవీరుడు అయిన; మద్రమేదినీపతి= మద్రదేశపురాజు- శల్యుడు; తేరిపయిన్= రథంమీద; మృతుఁడునున్+పోలెన్= చచ్చినవాడి మాదిరి; పడినన్= పడిపోగా; కౌరవరాజసైన్యముల్= కౌరవులకు రాజైన దుర్యోధనుడి సైన్యాలు; కలంగెన్= కలతపడినాయి.

తాత్పర్యం: 'ఓ ధృతరాష్ట్ర మహారాజా! సహదేవుడు ధైర్యాతిశయంతో, కాలునిలదొక్కుకొని, బాగా చూచి ఒక్కబాణాన్ని శల్యుడిమీదికి వేశాడు. రొమ్ము తాకేటట్లు వేయబడ్డ ఆ బాణం రక్తం అంటుకోకుండా గుచ్చుకొని, వెలుపలికి వెళ్ళిపోయింది. ఆ దెబ్బకు శల్యుడు చచ్చినవాడి మాదిరి, రథంలో పడ్డాడు. ఆ దృశ్యం చూచి, కౌరవసేనలు చాలా కలతచెందాయి.

వ. ఇట్లు మూర్ఛితుం డయినశల్యుం జూచి సారథి రథంబు దొలంగందోలికొనిపోయినం గనుంగొని కవలు సింహనాదంబు సేసి, శంఖంబులఁ బూరించి రంతం గమలబాంధవుండు దివసమధ్యోపేతుం డయ్యె నట్టి సమయంబున యమసూనుండు శ్రుతాయువుపైఁ దొమ్మిదియమ్ములు నిగిడించిన నతండు వాని మగిడించి నిశాతసాయకసప్తకంబు శరీరంబున గ్రుచ్చినం గోపించి యుధిష్ఠిరుండు వరాహకర్ణశరాసారంబున వాని వక్షస్ స్థలంబు వ్రచ్చి వెడందవాతియమ్మునం గేతువుం దునిమిన నతండు. 39

ప్రతిపదార్థం: సారథి= శల్యుడి రథసారథి; ఇట్లు= ఈ విధంగా; మూర్ఛితుండు+ఐన= మూర్ఛచెందినవాడైన; శల్యున్= శల్యుడిని; చూచి= గమనించి; రథంబున్= తేరును; తొలంగన్= యుద్ధభూమినుండి తొలగిపోయేటట్లు; తోలికొనిపోయినన్; కవలు= నకుల సహదేవులు; కనుంగొని= చూచి; సింహనాదంబు= సింహగర్జన; చేసి; శంఖంబులన్= తమ తమ శంఖాలను; పూరించిరి= ఊదినారు; అంతన్= అంతలో (ఆ సమయంలో); కమల బాంధవుండు= తామరపూలకు చుట్టమైన సూర్యుడు; దివసమధ్య+ఉపేతుండు+అయ్యెన్= పగటి మధ్యభాగాన్ని పొందినవాడైనాడు; అట్టి సమయంబునన్= ఆ సమయంలో; యమసూనుండు= యమధర్మరాజు కొడుకు- ధర్మరాజు; శ్రుతాయువు+పైన్= శ్రుతాయువు మీద; తొమ్మిది+అమ్ములు= తొమ్మిది బాణాలు; నిగిడించినన్= వ్యాపింపచేయగా; అతండు= ఆ శ్రుతాయువు; వానిన్= ఆ బాణాలను; మగిడించి= మరలింపజేసి; నిశాతసాయక సప్తకంబు= వాడియైన బాణాలు ఏడింటిని; శరీరంబునన్= ధర్మరాజు శరీరంలో; గ్రుచ్చినన్= నాటగా; కోపించి= కోపపడి; యుధిష్ఠిరుండు= ధర్మరాజు; వరాహకర్ణశర+ఆసారంబునన్= పందిచెవివలె ఉండే బాణాల జడివానతో; వాని= ఆ శ్రుతాయువు యొక్క; వక్షన్ స్థలంబున్= రొమ్మును; వ్రచ్చి= చీల్చి; వెడంద+వాతి+అమ్మునన్= వెడల్పుగల నోరు ఉన్న బాణంతో; కేతువున్= టెక్కమును; తునిమినన్= త్రుంచివేయగా; అతండు= ఆ శ్రుతాయువు.

తాత్పర్యం: శల్యుడు రథంమీద మూర్ఛచెందాడు. దానితో అతడి సారథి రథాన్ని వెంటనే యుద్ధభూమి నుండి అవతలకు తోలుకొనిపోయాడు. కవలు అది చూచి విజయోత్సాహంతో పెనుబొబ్బలు పెట్టుతూ తమ శంఖాలను ఊదారు. ఇంతలో సూర్యుడు ఆకాశం మధ్యభాగానికి చేరుకొన్నాడు. అప్పుడు ధర్మరాజు శ్రుతాయువు మీద తొమ్మిది బాణాలు వేశాడు. వాడు వాటిని తిప్పికొట్టి, పదునుగల ఏడు బాణాలను ఆ ధర్మరాజు శరీరంలో గుచ్చుకొనేటట్లు వేశాడు. అతడు కోపంతో పందిచెవివంటి బాణాలు వేసి, శ్రుతాయువు రొమ్మును చీల్చి, ఒకానొక ప్రత్యేక బాణంతో ఆతడి ధ్వజాన్ని తుంచివేశాడు. అప్పుడు ఆ శ్రుతాయువు. (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: సింహనాదము= యుద్ధంలో ఏనుగులు మొదలైనవాటిని భయపెట్టేటందుకు వీరులుచేసే ధ్వని (బొబ్బ) వెడ దవాతియమ్ము= వెడల్పయిన అగ్రభాగం ఉన్న బాణము; యుధిష్ఠిరుడు= యుద్ధంలో స్థిరంగా నిలబడేవాడు (ధర్మరాజు)

ఉ. వెండియు నేడు బాణములు వే తొడి ధర్మజు నొవ్వ నేయ నా
తండు మహోగ్రకోపమునఁ దత్తురగంబులఁ జంపి తద్ధను
ర్దండముఁ ద్రుంచి తత్తనువు రక్తమయంబుగఁ జేయ వాఁడు భీ
తుండయి పాఱె నీబలము దూలఁగ నబ్బల ముబ్బి క్రాలఁగన్. 40

ప్రతిపదార్థం: వెండియున్= మరియు; ఏడు బాణములు= ఏడు బాణాలను; వే తొడి= వేగంగా వింటిలో సంధించి; ధర్మజున్= ధర్మరాజును; నొవ్వన్= బాధపడునట్లు; ఏయన్= వేయగా; ఆతండు= ధర్మరాజు; మహా+ఉగ్రకోపమునన్= చాలా భయంకరమైన కోపంతో; తద్+తురగంబులన్= వాడి గుర్రాలను; చంపి; తద్+ధనుస్+దండమున్= ఆతని వింటి కర్రను; త్రుంచి= తునుగచేసి; తద్+తనువున్= వాడి శరీరాన్ని; రక్తమయంబు+కన్= నెత్తురు మయంగా; చేయన్= చేయగా; వాఁడు= ఆ శ్రుతాయువు; భీతుండు+అయి= భయంచెందినవాడై; నీ బలము= (ధృతరాష్ట్రుడవైన) నీ సైన్యము; తూలఁగన్= తొలగిపోగా; ఆ+బలము= ఆ పాండవులయొక్క సైన్యం; ఉబ్బి= సంతోషపడి; క్రాలఁగాన్= ప్రకాశించగా; పాఱెన్= పరుగెత్తిపోయినాడు.

తాత్పర్యం: శ్రుతాయువు ఏడు బాణాలతో ధర్మరాజును బాధ కలిగేటట్లు కొట్టాడు. ధర్మరాజుకు చాలా కోపం వచ్చి, వాడి గుర్రాలను చంపాడు. వింటి బద్దను తుంచాడు. అతడి శరీరాన్నంతటినీ రక్తంలో ముంచెత్తాడు. దానికి వాడు భయపడి పారిపోయాడు. అప్పుడు కౌరవసైన్యమంతా చిందరవందరైంది. పాండవుల సైన్యం ఎంతో సంతోషపడింది.

చేకితానకృపాచార్యుల ద్వంద్వయుద్ధము (సం 6-80-20)

తే. చేకితానుండు గృపునిపై శితశరములు । గురిసె నాతండు విల్లును గుట్టములను
వ్రయ్యలుగఁ జేయ గద గొని రథము డిగ్గి । సరభసంబుగఁ జని కృపు విరథుఁ జేసి. 41

ప్రతిపదార్థం: చేకితానుండు= చేకితానుడనే యాదవుడు; కృపునిపైన్= కృపాచార్యుడిమీద; శితశరములు= వాడియైన బాణాలు; కురిసెన్= కురిపించాడు; ఆతండు= కృపాచార్యుడు; విల్లును= చేకితానుడి విల్లును; గుట్టములను; వ్రయ్యలు+కన్= తునుకలుగా; చేయన్= చేయగా; గదన్+కొని= ఆ చేకితానుడు గదను తీసికొని; రథము డిగ్గి= తన రథాన్నుండి దిగి; సరభసంబుగన్= తొందరగా; చని= వెళ్ళి; కృపున్= కృపాచార్యుని; విరథున్= రథములేనివానిగా; చేసి.

తాత్పర్యం: చేకితానుడు కృపాచార్యుడిమీద పదునైన బాణాలను వర్షంగా కురిపించాడు. అప్పు డాతడు చేకితానుడి, విల్లును, గుర్రాలను తునుకలుగా చేశాడు. అప్పు డా చేకితానుడు గద తీసికొని, రథం దిగి తొందరగా నడిచి, గదతో కృపాచార్యుడి రథాన్ని తునుకలు చేసి. (తరువాతి వచనంతో అన్వయం).

వ. అయ్యాదవ సింహుండు వెనుకకు లంఘించిపోయినం గృపాచార్యుండు పదాఱమ్ము లెమ్ములం గీలించు టయు, నతండు గదాదండంబు వైవ నగ్గౌతముండు తుండంబులు సేసినఁ జేకితానుండు రయంబున రథంబుమీఁది కరవాలంబుగొని మెఱుంగు మెఱసినట్లు పఱతెంచిన శారద్వతుండు నిశాత కృపాణపాణియై ధరణి కెఱఁగి యేడ్తెఱ నతనిం గవిసి నొప్పించి, యతనిచేత నొచ్చె న ట్లిరువురును మూర్ఛిల్లి మేదిని వ్రాలిన. 42

ప్రతిపదార్థం: ఆ+యాదవసింహుండు= యాదవులలో శ్రేష్ఠుడైన ఆ చేకితానుడు; వెనుకకున్= వెనుక భాగానికి; లంఘించి= దూకి; పోయినన్= పోగా; కృపాచార్యుండు; పదాఱు= పదహారు; అమ్ములు= బాణాలు; ఎమ్ములన్= ఎముకలలో; కీలించుటయున్= తగులుకొనేటట్లు చేయగా; అతండు= ఆ చేకితానుడు; గదా దండంబు+వైవన్= గదాయుధాన్ని ప్రయోగింపగా; ఆ+గౌతముండు= గౌతమవంశంలోనివాడైన కృపాచార్యుడు; తుండంబులు= (ఆ గదను); తునుకలుగా; చేసినన్= చేయగా; చేకితానుండు; రయంబునన్= వేగంతో; రథంబు మీది; కరవాలంబున్= కత్తిని; కొని= తీసికొని; మెఱుంగు మెఱసిన+అట్లు= మెరుపు మెరిసిన మాదిరి; శారద్వతుండు= కృపాచార్యుడు; నిశాత కృపాణపాణి+ఐ= పదునైన ఖడ్గం చేతపట్టుకొనినవాడై; ధరణికిన్= భూమికి; ఎఱఁగి= వాలి; ఏడ్తెఱన్= అతిశయంతో; అతనిన్+కవిసి= అతడిని ఆక్రమించి; నొప్పించి= బాధకలుగునట్లుచేసి; అతనిచేతన్= ఆ చేకితానుడిచేత; నొచ్చెన్= బాధింపబడ్డాడు; అట్లు= ఆ విధంగా; ఇరువురును= ఆ ఇద్దరు వీరులు; మూర్ఛిల్లి= మూర్ఛచెంది; మేదినిన్= భూమిమీద; వ్రాలినన్= వాలిపోగా.

తాత్పర్యం: చేకితానుడు వెనుకకు దూకిపోగా, కృపాచార్యుడు పదహారు బాణాలు అతడి ఎముకలలో గుచ్చుకొనేటట్లు వేశాడు. ఆ చేకితానుడు గదాదండాన్ని విసిరాడు. కృపుడు గదను తునకలు చేశాడు. చేకితానుడు తొందరగా తన రథంలో ఉండిన ఖడ్గాన్ని చేతపట్టుకొని, మెరుపు మెరిసిన చందంగా ఒక క్షణంలో మీదపడి. కృపుడిని నొవ్వజేసి, అతడి చేత తాను కూడా నొప్పించబడ్డాడు. ఇద్దరు మూర్ఛచెంది, నేలపైకి ఒరిగారు.

విశేషం: గౌతముడు= గౌతమ ఋషి యొక్క గోత్రంలో పుట్టినవాడు. కురుకులంలోని కౌరవపాండవ కుమారులకు ఆచార్యుడు కృపుడు. కృపుని పుట్టుకను గూర్చి

అవస్కన్నం శరస్తంబే మిథునం సమపద్యత । కృపయా తచ్చ జగ్రాహ శాన్తను ర్మృగయాగతః॥
కృపః స్మృతః సవై తస్మాత్, గౌతమీ చ కృపీ తథా । ఏతే శారద్వతాః ప్రోక్తాఏతే తే గౌతమాః స్మృతాః॥

(హరివంశే. 32-75-76) శారద్వతుడని కూడా కృపుడికి పేరు.

క. ఇద్దెస సుబలతనూజుఁడు । నద్దెసఁ గరకర్షణుఁడు రయం బెసఁగఁగ న
య్యిద్దఱఁ దమ రథములపై । గ్రద్దన నిడికొని తొలంగఁగాఁ జని రధిపా! 43

ప్రతిపదార్థం: అధిపా!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; ఈ+దెసన్= మన ఈవైపున; సుబల తనూజుఁడు= సుబలుని కుమారుడు శకుని; ఆ+దెసన్= ఆ పాండవులవైపున; కరకర్షణుండు= ఆ పేరుగలవాడు; రయంబు= త్వర; ఎసఁగఁగన్= అతిశయింపగా; ఆ+ఇద్దఱన్= ఆ కృప చేకితానులను; తమ= తమ యొక్క; రథములపైన్= తేరులలో; గ్రద్దనన్= త్వరితంగా; ఇడుకొని= ఉంచుకొని; తొలంగఁగాన్= యుద్ధభూమినుండి తొలగేటట్లుగా; చనిరి= వెళ్ళారు.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్రా! మనవైపున సుబలుడి కొడుకు, ఆ వైపున కరకర్షణుడు మూర్ఛచెంది నేలవ్రాలిన ఆ ఇద్దరినీ (కృపాచార్య చేకితానులను) వారి వారి రథాలలోఉంచుకొని తొలగిపోయారు.

వ. చేదిపతి యగు ధృష్టకేతుండు భూరిశ్రవసునిం దొంబదితూపుల నేపారి యేసిన నొచ్చి కోపించి యా సోమదత్తతనయుండు. 44

ప్రతిపదార్థం: చేదిపతి+అగు= చేది దేశానికి రాజైన; ధృష్టకేతుండు= ధృష్టకేతుడనేవాడు; భూరిశ్రవసునిన్= భూరిశ్రవసుడిని; తొంబది తూపులన్= తొంభై బాణాలతో; ఏపారి= విజృంభించి; ఏసినన్= కొట్టగా; నొచ్చి= బాధపడి; కోపించి; ఆ+సోమదత్త తనయుండు= సోమదత్తుని కొడుకు- ఆ భూరిశ్రవుడు.

తాత్పర్యం: చేది దేశరాజు ధృష్టకేతుడు, విజృంభించి తొంభై బాణాలతో కొట్టాడు. ఆ దెబ్బలకు ఆ భూరిశ్రవసుడు బాధపడి కోపంతో-

క. నానాస్త్రంబుల హయముల । మేనులు దునియలుగఁ జేసి మెయి నారసముల్
వే నాటించిన నతఁడు శ । తానీకుని రథముపైకి నరిగెం బెలుచన్ 45

ప్రతిపదార్థం: నానా+అస్త్రంబులన్= పలు విధాలైన బాణాలతో; హయముల= గుర్రాలయొక్క; మేనులు= శరీరాలు; తునియలు+కన్= తునుకలుగా; చేసి; మెయిన్= చేదిరాజు శరీరంపైన; నారసముల్= బాణాలను; వే నాటించినన్= వేగంగా గ్రుచ్చుకొనేటట్లు చేయగా; అతఁడు= ఆ ధృష్టకేతువు; శతానీకుని; రథముపైకిన్; పెలుచన్= శీఘ్రంగా; అరిగెన్= పోయాడు.

తాత్పర్యం: ఆ భూరిశ్రవసుడు పలు బాణాలు ప్రయోగించి ధృష్టకేతుడి గుర్రాలను తునుకలు చేశాడు. అతడి శరీరంలో బాగా గుచ్చుకొనేటట్లుగా బాణాలు వేశాడు. అతడు తట్టుకోలేక శీఘ్రంగా శతానీకుడి రథం మీదికి పోయాడు.

వ. దుశ్శాసనవికర్ణచిత్రసేనులతో సుభద్రాసూనునకు మహాయుద్ధం బయ్యె నందు వారలనందఱ నా సంక్రందన పౌత్రుండు విరథులం జేసి వృకోదరువచనంబులు దలంచి యలంచుచుండెం గాని సమయింపఁ డయ్యె నట్టి సమయంబున శాంతనవుండు వారిం గైకొని యనేకరాజరథికులతోడం గూడ నన్నరనంద నుపైనురవడించిన నాభూపతులు పలువురు ప్రౌఢులగుటయు నయ్యభిమన్యుం డొక్కరుండు బాలుండు నగుటయుం జూచి సవ్యసాచి శౌరితో ని ట్లనియె. 46

ప్రతిపదార్థం: దుశ్శాసన వికర్ణ చిత్రసేనులతోన్; సుభద్రాసుతునకున్= సుభద్రకొడుకు అభిమన్యుడికి; మహాయుద్ధంబు= గొప్ప యుద్ధము; అయ్యెన్= జరిగింది; అందున్= ఆ యుద్ధంలో; వారలన్+అందఱన్= ఆ ముగ్గురిని; ఆ సంక్రందన పౌత్రుండు=

ఇంద్రునికి మనుమడైన అభిమన్యుడు; విరథులన్= రథాలులేనివారిగా; చేసి; వృకోదరు వచనంబులు= భీముడి మాటలు; తలంచి= స్మరించి; అలంచుచుండెన్+కాని= కష్టపెట్టాడే కాని; సమయింపండు+అయ్యెన్= చంపలేదు; అట్టి సమయంబునన్= ఆ సమయంలో; శాంతనవుండు= భీష్ముడు; వారిన్= ఆ దుశ్శాసనాదులను; కైకొని= గ్రహించి (చూచి); అనేక రాజరథికుల తోడన్+కూడన్= ఎంతో మంది రాజులతోను; రథికులతోను కూడా; ఆ+నరనందనుపైన్= అర్జునుని కొడుకైన ఆ అభిమన్యుడి మీదికి; ఉరవడించినన్= యుద్ధానికి తొందరపడగా; ఆ భూపతులు= కౌరవసేనలోని ఆ రాజులు; పలువురు= చాలమంది; ప్రౌఢులు= నిపుణులు; అగుటయున్; ఆ+అభిమన్యుఁడు= ఆ అభిమన్యుడు; ఒక్కరుండు= ఒంటరివాడు; బాలుండున్= పిల్లవాడు; అగుటయున్; చూచి; సవ్యసాచి= అర్జునుడు; శౌరితోన్= కృష్ణునితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: దుశ్శాసనుడు, చిత్రసేనుడు, వికర్ణుడు- వీరికి, అభిమన్యుడికి ఘోరంగా యుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో అభిమన్యుడు ఆ ముగ్గురి రథాలను ధ్వంసం చేశాడు. భీముడు దుశ్శాసనుడి రొమ్ముచీల్చి రక్తాన్ని తాగుతానని శపథంచేశాడు గదా! అది జ్ఞాపకానికి రాగా నే అతడు వాళ్ళను బాధపెట్టాడేగానీ చంపలేదు. లేకుంటే చంపేవాడే. అప్పుడు భీష్ముడు దుశ్శాసనాదుల దుఃస్థితిని గమనించి పలువురు రథికులైన రాజులు, వెంటరాగా అభిమన్యుడిని ఎదుర్కొన్నాడు. కౌరవసైన్యంలోని పలువురు రాజులు యుద్ధంలో ఆరితేరినవారు కావటాన్నీ, అభిమన్యుడు ఒంటరివాడు, అర్భకుడు కావటాన్నీ చూచి, అర్జునుడు కృష్ణుడితో ఇట్లా అంటున్నాడు.

విశేషం: వృకోదరుడు= తోడేలుపొట్టవంటి పొట్టగలవాడు (భీముడు); సవ్యసాచి= రెండుచేతులతో బాణాలు వేసేవాడు (అర్జునుడు).

క. ఉక్కు మిగిలి జగతీశులు । పెక్కండ్రు రయంబు మెఱయ భీష్మసహితులై
యొక్కటఁ దోతెంచెద రా । దిక్కునఁ బోనిమ్ము రథముఁ దీవ్రస్ఫురణన్. 47

ప్రతిపదార్థం: పెక్కండ్రు= పలువురు; జగతీ+ఈశులు; భూభర్తలు= రాజులు; రయంబు= వేగము; మెఱయన్= అతిశయింపగా; ఉక్కు= శౌర్యము; మిగిలి= అతిశయించి; భీష్మ సహితులు+ఐ= భీష్ముడితో కూడినవారై; ఒక్కటన్= ఒకే సమయంలో; తోతెంచెదరు= వస్తున్నారు; తీవ్రస్ఫురణన్= అధికమైన కదలికతో; ఆ దిక్కునకున్= ఆ వైపునకు; రథమున్; పోనిమ్ము= తోలుము.

తాత్పర్యం: 'ఓ కృష్ణా! చాలా మంది కౌరవరాజులు శౌర్యాతిశయంతో, వేగంగా, భీష్ముడితో కలిసి ఒక్కుమ్మడిగా వస్తున్నారు. ఆ గుంపున్నచోటికి మన రథాన్ని శీఘ్రంగా పోనిమ్ము' అని.

వ. అని వారలవలను సూప నచ్యుతుండట్ల చేయం బ్రిగర్తపతి దనమొనలకుం దలకడచి కవ్వడి మార్కొనుటయు నతండు. 48

ప్రతిపదార్థం: అని; వారలవలను= ఆ కౌరవసైన్యముండే దిక్కును; చూపన్= చూపగా; అచ్యుతుండు= కృష్ణుడు; అట్లు+అ= అర్జునుడు చెప్పిన విధంగా; చేయన్= తేరును పోనివ్వగా; కవ్వడిన్= అర్జునుడిని; త్రిగర్తపతి= త్రిగర్త దేశంరాజు; తన మొనలకున్= తనయొక్క సైన్యాలకు; తలకడచి= ముందు భాగమును చేరుకొని; మార్కొనుటయున్= ఎదుర్కొనటంతో; అతండు= ఆ అర్జునుడు.

తాత్పర్యం: కృష్ణుడు అర్జునుడు చెప్పిన విధంగా అభిమన్యుడిమీదికి ఉరుకుతున్న కౌరవసైన్యంవైపు రథాన్ని పోనిచ్చాడు. అప్పుడు త్రిగర్తపతి తన సైన్యానికి ముందుగా నిలిచి, అర్జునుడిని ఎదుర్కొన్నాడు. అప్పుడు అర్జునుడు

క. మీవీటికెల్ల మేటివి । నీ విట్లు గడంగి తిచట నిక్కము పోరం
గావలయుఁ జుమీ యనుచు శ । రావృతుఁ గావించె సూతహయసహితముగాన్. 49

ప్రతిపదార్థం: మీ వీటికిన్= మీదండునకు; ఎల్లన్= అంతటికి; నీవు= సుశర్మవను నీవు; మేటివి= మొనగాడవు; ఇట్లు= ఈ విధంగా; ఇచ్చటన్= ఈ చోటులో; కడంగితి(వి)= యుద్ధానికి దిగావు; నిక్కము+అ= నిజంగా; పోరంగావలయున్+చుమీ!= యుద్ధం చేయవలెను సుమా!; అనుచున్= అని చెప్పుచూ; సూతహయసహితము+కాన్= సారథి, గుర్రాలతో కూడునట్లుగా; శర+ఆవృతున్= బాణాలతో కప్పబడ్డవాణ్ణిగా; కావించెన్= చేశాడు.

తాత్పర్యం: 'ఓ సుశర్మా! నీవు మీ దండులోకెల్లా చాలా మొనగాడివి. ఇక్కడ ఇప్పుడు నాతో యుద్ధానికి దిగావు. నిజంగా, యుద్ధం చేయవలసిందే సుమా!' అంటూ సుశర్మను, ఆయన సారథిని, గుర్రాలను అర్జునుడు బాణాలతో కప్పివేశాడు.

వ. అట్టియెడం గౌరవసైన్యంబు గాండీవిపై నొక్క పెట్ట యడరినం బాండవబలంబు లతనికిం దలకడచి తలపడిన సందండికయ్యం బయ్యె నా సంక్రందననందనుండు రాజులగములకుంగవిసి కేతనంబులు నటికియు, సారథిరథికరథ్యంబులప్రాణంబులు వెటికియు నాతపత్రచామరంబులు పాడిసేసియుఁ జాపంబులు రూపఱఁజేసియుఁ, వర్మంబులు వ్రచ్చియు, మర్మంబుల మార్గణంబులు గ్రుచ్చియు, సర్వాంగంబులు నొంచియుఁ దలలు ద్రుంచియు, విహరించుచుండ నపరాహ్ణంబయ్యెఁ బ్రిగర్తనాథుండు వెండియుం బేర్చి యెదిర్చిన. 50

ప్రతిపదార్థం: అట్టియెడన్= ఆ సమయంలో; కౌరవసైన్యంబు= దుర్యోధనునిసేన; గాండీవిపైన్= అర్జునుడిపైన; ఒక్కపెట్ట= ఒక్కసారిగా; అడరినన్= విజృంభించగా; పాండవ బలంబులు= పాండవుల సేనలు; అతనికిన్= ఆ అర్జునుడికి; తలకడచి= ముందు భాగంలోచేరి; తలపడినన్= ఎదుర్కొనగా; సందడికయ్యంబు= సంకులసమరము; అయ్యెన్= జరిగింది; ఆ సంక్రందననందనుండు= ఇంద్రుడి కొడుకు- అర్జునుడు; రాజులగములకున్= దొరలగుంపును; కవిసి= ఎదుర్కొని; కేతనంబులు= టెక్కాలు; నటికియున్= తెగగొట్టి; సారథి రథిక రథ్యంబుల= రథంతోలేవాడియొక్క, రథంలోనుండి యుద్ధం చేసేవారియొక్క, రథానికి కట్టి ఉండే గుర్రాలయొక్క; ప్రాణంబులన్= ప్రాణాలను; పెటికియున్= పోగొట్టి; ఆతపత్ర చామరంబులు= గొడుగులను, చామరాలను; పాడి+చేసియున్= నుగ్గుచేసి; చాపంబులు= విండ్లను; రూపు+అఱన్+చేసియున్= రూపుమాపి; వర్మంబులు= కవచాలు; వ్రచ్చియున్= చీల్చి; మర్మంబులన్= ఆయువుపట్టులందు; మార్గణంబులు= బాణాలు; గ్రుచ్చియున్= పొడిచి; సర్వ+అంగంబులు= అన్ని అవయవాలను; నొంచియున్= పీడించి; తలలు= తలలను; త్రుంచియున్= తుంచివేసి; విహరించుచుండన్= వీరవిహారం చేస్తూండగా; అపరాహ్ణంబు+అయ్యెన్= అపరాహ్ణకాలము అయింది; త్రిగర్తనాథుండు= త్రిగర్తదేశపురాజు; వెండియున్= మరల; పేర్చి= విజృంభించి; ఎదిర్చినన్= ఎదుర్కొనగా.

తాత్పర్యం: అప్పుడు కౌరవ సైన్యం ఒక్కుమ్మడిగా అర్జునుడిమీదికి వచ్చింది. పాండవుల సేనకూడా అర్జునుడికి ముందుగా నిలబడి యుద్ధానికి సన్నద్ధం అయింది. అప్పుడు ఆ రెండుసేనలకు దొమ్మి యుద్ధం జరిగింది. అప్పుడు అర్జునుడు ఎదిరిపక్షంలోని వారి కేతనాలను తెగగొట్టి, రథికుల సారథుల, గుర్రాల ప్రాణాలను తీశాడు. గొడుగులను, చామరాలను నుగ్గుచేశాడు. చాపాలను రూపం లేకుండా చేశాడు. కవచాలను బ్రద్దలుకొట్టాడు. ఆయువుపట్టులలో బాణాలు గ్రుచ్చాడు. శత్రువుల అవయవా లన్నింటికీ బాధ కలిగించాడు. శత్రువుల తలలు త్రుంచాడు. ఈ విధంగా అర్జునుడు స్వైరవిహారం చేస్తూండగా మధ్యాహ్నకాలమైనది. అయినా త్రిగర్తాధిపతి కవిసి ఎదుర్కొన్నాడు.

విశేషం: గాండీవి= గాండీవమనే విల్లు ముఖ్యమైన ఆయుధంగా గలవాడు (అర్జునుడు)

సందడి కయ్యంబు= సంకుల సమరం. ఇరుపక్షాలవారు కలసిపోయి, ఒకరునొకరు భుజాలు ఒరిసికొంటూ ఎవ డే పక్షంవాడో తెలియకుండా యుద్ధంచేయటం.

అపరాహ్ణంబు= ప్రాత, స్సంగమ, మధ్యాహ్న, అపరాహ్ణ, సాయాహ్నములని పగటిని అయిదు భాగాలు చేస్తే అందులో నాలుగవ భాగం అపరాహ్ణం.

తే. అతని రథరక్షకులు శక్రసుతుని మీఁదఁ । గడఁగి ముప్పదియిద్దఱు గవియుటయును
నవ్వి యఱువదినాలుగు నారసముల । నక్కిరీటి యా రథికుల నవనిఁ గూల్చె. 51

ప్రతిపదార్థం: అతనిన్= ఆ త్రిగర్తరాజు సుశర్మయొక్క; రథరక్షకులు= తేరును రక్షించే వీరులు; ముప్పది+ఇద్దఱున్= ముప్పై రెండుమంది; కడఁగి= పూనుకొని; శక్రసుతుని మీఁదన్= ఇంద్రపుత్రుడైన అర్జునుడి మీద; కవియుటయును= ఎగబడగా; ఆ+కిరీటి= ఆ అర్జునుడు; నవ్వి= ఎగతాళిచేసి; అఱువదినాలుగు= అరవైనాలుగు; నారసములన్= బాణాలతో; ఆ రథికులన్= తనపై కవిసిన ఆ రథికులను; అవనిన్= నేలమీద; కూల్చెన్= పడద్రోశాడు.

తాత్పర్యం: త్రిగర్తాధీశుడు సుశర్మయొక్క రథ రక్షకులు ముప్పై ఇద్దరు ప్రయత్నంతో అర్జునుడిమీదికి ఎగబడ్డారు. అర్జునుడు ఎగతాళిగా నవ్వి, వారినందరిని, అరవైనాల్గు బాణాలతో కొట్టి నేలపడద్రోశాడు.

క. ఇలఁబడిన సహచరులఁ గని । యలిగి సుశర్ముండు దాఁకె నర్జును నతనిం
దలకడచి శిఖండిప్రభృ । తులు నిగిడిరి వారిమీఁద ద్రుపదజ్ఞాతుల్. 52

ప్రతిపదార్థం: సుశర్ముండు= త్రిగర్తాధిపతి సుశర్మ; ఇలన్= నేలమీద; పడిన= పడినట్టి; సహచరులన్= తనతో కలిసి యుద్ధంచేసే రథికులను; కని= చూచి; అలిగి= కోపించి; అర్జునున్= అర్జునుడిని; తాఁకెన్= ఎదుర్కొన్నాడు; అతనిన్= ఆ అర్జునుడిని; తలకడచి= ముందుభాగానికి వచ్చి; ద్రుపదజ్ఞాతుల్= ద్రుపదుడి దాయాదులు; శిఖండి ప్రభృతులు= ధృష్టద్యుమ్నుడి అన్న శిఖండి మున్నగువారు; వారిమీఁదన్= సుశర్మ మొదలైనవారిమీద; నిగిడిరి= కమ్ముకొన్నారు.

తాత్పర్యం: సుశర్మ నేలవాలిన తనతోడి విలుకాండ్రను చూచాడు. చాలా కోపంవచ్చి, అర్జునుడి మీదికి ఎగబడ్డాడు. అర్జునుడి సేనకు ముందుగా శిఖండి మొదలుగా గల ద్రుపద మహారాజు జ్ఞాతులు సుశర్మ మొదలైన వారిని క్రమ్ముకొన్నారు.

వ. ధనంజయుండును దనకు దుర్యోధన సైంధవు లగ్గంబై యున్నను గ్రేఁగంటం జూచుచు గాంగేయుపై నడరె
నప్పుడు దన్నుఁ దొడరవచ్చు శల్యునాదరింపక ధర్మతనయుం డనిలతనయమాద్రీతనయసహితుం డై
పార్థునకు బాసట యై భీష్మునిదెసకు నడరె నిట్లు పాండవ పంచకంబుతోఁ బెనంగు శాంతనవుం
గనుంగొని కురుపతియును సింధురాజును బరవసంబు సేసి యప్పాండవేయులం దాఁకిన. 53

ప్రతిపదార్థం: ధనంజయుండునున్= అర్జునుడుకూడా; తనకున్= అర్జునుడికి; దుర్యోధన సైంధవులు= దుర్యోధనుడు, సైంధవుడును; అగ్గంబు+ఐ+ఉన్నన్= అధీనమై ఉన్నా; క్రేఁగంటన్= కోరచూపుతో; చూచుచున్= చూస్తూ; గాంగేయుపైన్= భీష్ముడిపైన; అడరెన్= విజృంభించాడు; అప్పుడు= ఆ సమయంలో; ధర్మతనయుండు= ధర్మరాజు; తన్నున్= తనను; తొడరన్ వచ్చు= ఢీకొనడానికి వచ్చే; శల్యున్= శల్యుడిని; ఆదరింపక= లెక్కజేయక; అనిలతనయ మాద్రీతనయ సహితుండు+ఐ= భీముడు, నకుల సహదేవులు- వీరితోకూడినవాడై; పార్థునకున్= అర్జునుడికి; బాసట+ఐ= సహాయుడై; భీష్ముని దెసకున్= భీష్ముడుండే వైపునకు; అడరెన్= కదిలాడు; ఇట్లు= ఈ మాదిరి; పాండవ పంచకంబుతోన్= పంచపాండవులతో; పెనంగు= యుద్ధంచేసే;

శాంతనవున్= శంతను మహారాజు కొడుకు భీష్మున్ని; కనుంగొని= చూచి; కురుపతియును= దుర్యోధనుడున్నూ; సింధురాజును= సైంధవుడున్నూ; బరవసంబు+చేసి= ధైర్యం వహించి; ఆ+పాండవేయులన్= ఆ పాండవులను; తాఁకినన్= మార్కొనగా.

తాత్పర్యం: అర్జునుడు తనకు దుర్యోధనసైంధవులు అధీనులైనప్పటికీ క్రీగంటితో చూస్తూ, భీష్ముడిపైకి యుద్ధానికి వెళ్ళాడు. అప్పుడు ధర్మరాజు శల్యుడు తనమీదికి వస్తున్నప్పటికి లెక్కచేయకుండా, భీముడు, నకులుడు, సహదేవుడు వీరితో కలిసి అర్జునుడికి అండగా ఉండటానికి భీష్ముడున్నచోటికి వెళ్ళాడు. ఇంతలో దుర్యోధనుడు, సైంధవుడు పాండవులతో భీష్ముడు యుద్ధంచేస్తూండడం చూచి ఆ పాండవులను ధైర్యంతో ఎదుర్కొన్నారు.

క. శలశల్యచిత్రసేనులు। బలియుండగు కృపునిఁ గూడి పాండుకుమారా
వలిమీఁదఁ గవిసి వాల। మ్ములు గురిసి రతండు సూచి మోదం బందన్. 54

ప్రతిపదార్థం: అతండు= ఆ భీష్ముడు; చూచి= చూచి; మోదంబు+అందన్= సంతోషపడగా; శలశల్యచిత్రసేనులు= శలుడు, శల్యుడు, చిత్రసేనుడు అనేవారు; బలియుండు+అగు= బలవంతుడైన; కృపునిన్+కూడి= కృపాచార్యుడితో కలిసి; వాలు+అమ్ములు= పదునుగల బాణాలను; పాండుకుమార+ఆవలిమీఁదన్= పాండవుల సమూహంమీద; కురిసిరి= కురిపించారు.

తాత్పర్యం: భీష్ముడు సంతోషం చెందేటట్లుగా శలశల్యచిత్రసేనులు బలవంతుడైన కృపుడితోకూడి, పాండవులమీద పదునైన బాణాలు కురిపించారు.

వ. తదవసరంబున శిఖండి దేవవ్రతున కెదిర్చిన నొండు సేయ నొల్లమి నాతండు కోదండంబు దుండంబులు సేసి పిఱుసనఁజేయుటయుఁ బాండవాగ్రజుండు వాని ప్రతిజ్ఞావచనంబులెత్తి చెప్పి మొగమోడక యదల్చినం బురికొని యప్పాంచాలపతిసూనుండు సురనదీసూను మార్కొనుటయు మద్రనాథుం డెడసొచ్చి మహానలాస్త్రంబు ప్రయోగించిన దానికిం దలంకక వారించి వాఁడును వారుణాస్త్రం బేసిన నతండు తత్ప్రతిహతి గావించె; గాంగేయుండును ధర్మతనయు కేతుచాపదండంబులు ద్రుంచి యార్చినం బేర్చి భీముండు గదగొని రథంబు డిగ్గి రారాజుపయిం గవియుటయుఁ దత్సమయంబునం దలమిగిలి జయద్రథుండు రౌద్రం బెసంగ వేగంబు మెఱసి మెఱుంగుటమ్ము లేనూ అతనిపై నడరింప నతండు సరకుసేయక శరంబులు గదజడియుచుం గదిసి యమ్మారుతి సింధురాజ హయంబులం జదియ మోఁదిన నా సైంధవుండు. 55

ప్రతిపదార్థం: తద్+అవసరంబునన్= ఆ సమయంలో; శిఖండి; దేవవ్రతునకున్= భీష్ముడిని; ఎదిర్చినన్= ఎదుర్కొగా; ఆతండు= ఆ భీష్ముడు; ఒండు+చేయన్+ఒల్లక= ఏదీ చేయడానికి ఇష్టపడక (చంపడానికి ఇష్టంలేక); కోదండంబు= వాని వింటిని; తుండంబులు= ముక్కలుగా; చేసి= కావించి; పిఱు+చనన్= వెనక్కు మళ్ళి వెళ్ళేటట్లుగా; చేయుటయున్= చేయగా; పాండవ+అగ్రజుండు= ధర్మరాజు; వాని= ఆ శిఖండియొక్క; ప్రతిజ్ఞావచనంబులు= బాసలను; ఎత్తిచెప్పి= జ్ఞాపకంచేసి; మొగమోడక= దాక్షిణ్యంలేకుండా; అదల్చినన్= గద్దించగా; పురికొని= ఉత్సహించి; ఆ+పాంచాలపతిసుతుండు= ఆ పాంచాల మహారాజు యొక్క కుమారుడు- శిఖండి; సురనదీసూతున్= గంగానదికొడుకు భీష్ముడిని; మార్కొనుటయున్= ఎదిరించగా; మద్రనాథుండు= మద్రదేశానికి రాజు- శల్యుడు; ఎడ+చొచ్చి= సందులో చేరి; మహానల+అస్త్రంబున్= గొప్పదైన ఆగ్నేయాస్త్రాన్ని; ప్రయోగించినన్= వేయగా; దానికిన్= ఆ ఆగ్నేయాస్త్రానికి; తలంకక= జంకక; వాఁడును= ఆ శిఖండి; వారుణాస్త్రంబు+ఏసినన్= వారుణాస్త్రాన్ని ప్రయోగించగా; అతండు= ఆ శల్యుడు; తద్+ప్రతిహతిన్= దాని నాశమును; కావించెన్= చేశాడు; గాంగేయుండును= భీష్ముడు కూడా; ధర్మతనయు= ధర్మరాజుయొక్క; కేతుచాపదండంబులు= పతాకంయొక్క, వింటియొక్క, కర్రలను; త్రుంచి= తునకలుచేసి; ఆర్చినన్= గర్జించగా; భీముండు; పేర్చి= అతిశయించి; గదన్=+కొని= గదాయుధాన్ని తీసికొని; రథంబున్+డిగ్గి=

తేరునుండి దిగి; రారాజుపయిన్= దుర్యోధనుడి మీదికి; కవియుటయున్= ఎగబడగా; తద్+సమయంబునన్= ఆ సమయంలో; తలమిగిలి= సేనకు ముందువైపు వచ్చి; జయద్రథుండు= సైంధవుడు; రౌద్రంబు+ఎసంగన్= రౌద్రరసం ఎక్కువకాగా; వేగంబు= త్వర; మెఱసి= ప్రకాశింపజేసి; మెఱుంగు+అమ్ములు= తళతళలాడే బాణాలను; ఏనూఱు= అయిదు వందలను; అతనిపైన్= ఆ భీముడి మీద; అడరింపన్= వేయగా; అతండు= ఆ భీముడు; శరంబులు= బాణాలను; సరకు+చేయక= లెక్కపెట్టక; గద= గదను; జడియించుచున్= ఆడించుతూ; కదిసి= దగ్గరకువచ్చి; ఆ+మారుతి= ఆ భీముడు; సింధురాజ హయంబులన్= సైంధవుడి గుర్రాలను; చదియన్+మోఁదినన్= నలిగేటట్లు కొట్టగా; ఆ సైంధవుండు= ఆ సింధుదేశపురాజు.

తాత్పర్యం: ఆ సమయాన శిఖండి భీష్మున్ణి ఎదుర్కొన్నాడు. అతడు వాడిని ఏమీచేయక, అతడి వింటిని తునాతునకలుచేసి వాడు తిరిగిపోయేటట్లు చేశాడు. అప్పుడు ధర్మరాజు అతడు చేసిన ప్రతిజ్ఞను జ్ఞాపకంచేస్తూ శిఖండిని మొగమాటపడకుండా చీవాట్లు పెట్టాడు. శిఖండి ఉత్సాహం తెచ్చుకొని మళ్లా భీష్ముడితో తలపడ్డాడు. ఈ సందడిలో మద్రదేశాధిపతి శల్యుడు దూరి గొప్ప ఆగ్నేయాస్త్రాన్ని శిఖండిమీద ప్రయోగించాడు. దానికి కదలకుండా నిలబడి, శిఖండి వారుణాస్త్రాన్ని వేశాడు. శల్యుడు దానిని పాడుచేశాడు, భీష్ముడు ధర్మరాజు పతాకదండాన్ని వింటి బద్దను ఒక దెబ్బతో విరిచేశాడు, పెనుబొబ్బలు పెట్టాడు. భీముడు ఆవేశంతో గదను పట్టుకొని, రథాన్నుండి దిగి, దుర్యోధనుడికి మీదికి ఉరికాడు. అప్పుడు జయద్రథుడు సేనకు ముందుభాగానికి వచ్చి, ఐదువందలు వాడిబాణాలను భీముడి మీద గుప్పించాడు. భీముడు ఆ బాణాలను లెక్కచేయకుండా గదను ఆడిస్తూ, దగ్గరకు వచ్చి సైంధవుడి గుర్రాలను ఎముకలు నలిగేటట్లు బాదాడు. ఆ సైంధవుడు- (తరువాతి పద్యంతో అన్వయం).

విశేషం: దేవవ్రతుడు= దేవుడివలె వ్రతము, స్థిరత్వమైన ప్రతిజ్ఞ కలవాడు. భీష్ముడు,

> **శ్లో॥ చిత్రాంగదం తతో రాజ్యే స్థాపయామాస వీర్యవాన్ ।**
> **స్వయం నకృతవాన్‌రాజ్యం, తస్మాద్దేవవ్రతోఽభవత్॥** (దేవీ భాగవతే 1-20-16)

చిత్రాంగదుడిని పట్టాభిషిక్తుడిగా చేసి ఈ వీరుడు రాజ్యాన్ని పాలించలేదు. అందుచేత దేవవ్రతుడైనాడు.

క. ఉక్కఱి యొండొకని రథం । బెక్కుటయున్ దొరలు దెరలి యేడ్తెఱ సెడి రా
దిక్కు ప్రజ విచ్చెనప్పుడు । గ్రక్కునఁ బతి భీము మీఁదఁ గవిసెం బెలుచన్. 56

ప్రతిపదార్థం: ఉక్కు+అఱి= శౌర్యాన్ని కోలుపోయి (సైంధవుడు); ఒండు+ఒకని= మరియొకని యొక్క; రథంబు= తేరును; ఎక్కుటయున్= ఎక్కగా; దొరలున్= రాజులు; తెరలి= తొలగిపోయి; ఏడ్తెఱ= పరాక్రమమును; చెడిరి= కోల్పోయిరి; ఆ దిక్కు ప్రజ= ఆ వైపున ఉండే జనము; విచ్చెన్= చీలిపోయింది; అప్పుడు= ఆ సమయంలో; పతి= కౌరవ భర్తఅయిన దుర్యోధనుడు; భీముమీఁదన్= భీముడి మీదికి; పెలుచన్= కోపంతో; కవిసెన్= దుమికాడు.

తాత్పర్యం: సైంధవుడు తన రథం కూలిపోగా, మరొకడి రథం ఎక్కాడు. యుద్ధమాడే రాజులందరూ తోడుగా శౌర్యం కోల్పోయారు. వారి వైపున ఉండే సైనికులంతా చెల్లాచెదరైపోయారు. అప్పుడు దుర్యోధనుడు భీముడి మీద దాడి చేశాడు.

క. ఎడఁ జొచ్చి చిత్రసేనుఁడు । వడముడిపై నేయ నతఁడు వైచెం గోపం
బడరఁగ గద నది యుగ్రపుఁ । బిడుగు క్రియన్ మెఱసి పఱచె బిట్టుగఁ జదలన్. 57

ప్రతిపదార్థం: చిత్రసేనుఁడు= ఆ పేరుగల కౌరవపక్షంయోధుడు; ఎడన్= మధ్యలో; చొచ్చి= ప్రవేశించి; వడముడిపైన్= (విరోధులకు పరితాపం కలిగించే) భీముడిని; ఏయన్= బాణాలతో కొట్టగా; అతఁడు= ఆ భీముడు; కోపంబు= క్రోధం; అడరఁగన్= అధికంకాగా; గదన్= తన గదాయుధాన్ని; వైచెన్= విసిరివేశాడు; అది= ఆ గదాయుధం; ఉగ్రపున్= భయంకరమైన; పిడుగు క్రియన్= పిడుగు మాదిరి; చదలన్= ఆకాశంలో; మెఱసి= వెలుగుతూ; బిట్టుగన్= వేగంగా; పఱచెన్= పరుగెత్తి వచ్చింది.

తాత్పర్యం: చిత్రసేనుడు మధ్యలో వచ్చి భీముడిని బాణాలతో కొట్టాడు. భీముడు ఉగ్రుడై తన గదను విసరివేశాడు. అది పిడుగు చందంగా జాజ్వల్యమానంగా ఆకాశంలో వెలుగుతూ, గొప్ప వేగంతో వచ్చింది.

తే. అట్లు వచ్చునాగదఁ గని యచటి యోధు । లలికి తమతమమీఁదన యడరు ననియుఁ
దలఁచి యొదిఁగిరి రారాజుఁ దలఁప రైరి; । ప్రాణభయ మెట్టివారిఁ గీడ్పఱుపకున్నె? 58

ప్రతిపదార్థం: అచటి యోధులు= ఆ యుద్ధభూమిలో ఉండే వీరులు; అట్లు వచ్చు= ఆ విధంగా వెలుగుతూ వచ్చుచున్న; ఆ గదన్= భీముని ఆ గదాయుధాన్ని; కని= చూచి; అలికి= భయపడి; తమ తమ మీదన్= తమ తమ మీదనే; అడరున్+అనియున్= పడును అని కూడా; తలంచి= ఎంచి; ఒదిఁగిరి= దాగికొన్నారు; రారాజున్= దుర్యోధనుడిని గురించి; తలఁపరు+ఐరి= తలచనైనా తలచలేదు; ఎట్టివారిన్= ఎంతటి ధీరులనైనప్పటికీ; ప్రాణభయము= ప్రాణాలు పోతాయేమో అనే భయం; కీడ్పఱుపక+ఉన్నె?= తక్కువ వారిగా చేయకుండా ఉంటుందా?

తాత్పర్యం: యుద్ధరంగంలో ఉండే వీరులంతా సెగలు పొగలతో వస్తూన్న భీముడు విసరివేసిన గదను చూచారు. ఎవరికివారు ఆ గద తమ మీదపడుతుందనే. తమ తమ ప్రాణాలు కాపాడుకొనే ప్రయత్నం చేశారేగాని, దుర్యోధనుడి సంగతి ఎవడూ పట్టించుకోలేదు. ప్రాణభయం ఎంత గొప్పవారికి కూడా తక్కువతనాన్ని కలిగిస్తుంది కదా!

విశేషం: అలం: అర్థాంతరన్యాసం.

క. అడిదముఁ బలుకయునుం గొని । చిడిముడి వడ కపుడు చిత్రసేనుం డుఱికెం
బుడమికి రథహయసూతులఁ । బొడిపొడి గావించెఁ బవనపుత్త్రునిగదయున్. 59

ప్రతిపదార్థం: చిత్రసేనుండు= ఆ చిత్రసేనుడనే రాజు; అపుడు= ఆ సమయంలో; చిడిముడి+పడక= తొట్రుపాటు లేకుండా; అడిదమున్= కత్తిని; పలుకయునున్= కేడెమును; కొని= పట్టుకొని; పుడమికిన్= నేలపైకి; ఉరికెన్= దూకాడు; పవన పుత్రుని గదయున్= వాయుదేవుని కొడుకైన భీమునియొక్క గదాయుధము; రథహయసూతులన్= రథాన్నీ, గుర్రాలను, సారథిని; పొడిపొడి= నుగ్గు నుగ్గుగా; కావించెన్= చేసింది.

తాత్పర్యం: ఆ సమయంలో చిత్రసేనుడు తొట్రుపాటులేకుండా కత్తిని, కేదాన్ని పట్టుకొని నేలకు ఉరికాడు. అప్పుడు భీముడిగద చిత్రసేనుడి రథాన్ని, గుర్రాలను, సారథిని పిండిపిండిచేసింది.

వ. ఇట్లు చిత్రసేనుండు విరథుం డైన వికర్ణుం డతనిం దనరథం బెక్కించుకొనిపోయె నట్టియెడ. 60

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; చిత్రసేనుండు= చిత్రసేనుడనేవాడు; విరథుండు+ఐనన్= రథంలేనివాడుకాగా; వికర్ణుండు= కౌరవులలో ఒకడు; అతనిన్= ఆ చిత్రసేనుడిని; తన రథంబున్= తనయొక్క తేరులోనికి; ఎక్కించుకొనిపోయెన్= కూర్చోపెట్టుకొనిపోయాడు; అట్టి+ఎడన్= అట్టి సమయంలో.

తాత్పర్యం: చిత్రసేనుడీవిధంగా రథంలేనివాడయ్యాడు. అప్పుడు వికర్ణుడు అతడిని తన రథంలోనికి ఎక్కించు కొనిపోయాడు. ఆ సమయంలో- (తరువాతి పద్యంతో అన్వయం)

శా. గంగాపుత్రుఁడు పాండవాగ్రజుని యు । గ్యంబుల్ మహిం గూల్చి స
ర్వాంగంబుల్ వెస నొంప నాతఁడు సము । ద్యత్క్రోధుఁడై శక్తి వై
చెం గంపింపక త్రుంచెఁ దాత విభుఁడున్ । శీఘ్రంబ మాద్రీసుతో
త్తుంగస్యందనమెక్క నొంచెను సరి । త్సూనుండు మాద్రేయులన్. 61

ప్రతిపదార్థం: గంగాపుత్రుఁడు= గంగాదేవి యొక్క కుమారుడు- భీష్ముడు; పాండవ+అగ్రజుని= పాండవులలో పెద్దవాడైన ధర్మరాజుయొక్క; యుగ్యంబుల్= తేరి గుర్రాలను; మహిన్= నేలమీద; కూల్చి= పడవేసి; సర్వ+అంగంబుల్= ఆ ధర్మరాజుయొక్క అన్ని అవయవాలను; వెసన్= వేగంతో; నొంపన్= బాధింపగా; ఆతఁడు= ఆ ధర్మరాజు; సముద్యత్+క్రోధుఁడు+ఐ= పుట్టుతున్న కోపం కలవాడై; శక్తిన్= శక్తి అనే ఆయుధాన్ని; వైచెన్= విసరినాడు; తాత= తాతయైన భీష్ముడు; కంపింపక= చలనంలేకుండా; త్రుంచెన్= ఆ శక్తి ఆయుధాన్ని తుంచివేసినాడు; విభుఁడున్= ప్రభువైన ధర్మరాజు; శీఘ్రంబ= వేగంగా; మాద్రీసుత+ఉత్తుంగ స్యందనము= మాద్రికొడుకులైన నకుల సహదేవులయొక్క ఎత్తైన రథాన్ని; ఎక్కన్= ఎక్కగా; సరిత్+సూనుండు= గంగానది కుమారుడు- భీష్ముడు; మాద్రేయులన్= నకుల సహదేవులను; నొంచెను= బాధించాడు.

తాత్పర్యం: భీష్ముడు, ధర్మరాజు గుర్రాలను నేలకూల్చాడు. అతని కరచరణాదులైన అవయవాలన్నింటికీ నొప్పికలిగించాడు. ధర్మరాజు కోపం రెచ్చిపోవగా భీష్ముడి మీదికి శక్తిని ప్రయోగించాడు. భీష్ముడు నిబ్బరంగా నిలబడి దాన్ని కూల్చివేశాడు. దానితో ధర్మరాజు గబగబా వెళ్ళి నకుల సహదేవులున్న రథంలోకి ఎక్కాడు. ఆ మాద్రీపుత్రులను కూడా భీష్ముడు బాణప్రయోగంతో బాగా లొంగదీశాడు.

క. తమ్ముల నొంచిన నగ్రజుఁ । డుమ్మలికముతోడ బెరయునుత్సాహమునం
ద మ్మందఱఁ బురికొలుపఁగ । నమ్మున నృపు లెల్లఁ దాఁకి రప్పుడు భీష్మున్. 62

ప్రతిపదార్థం: తమ్ములన్= తమ్ములైన నకుల సహదేవులను; నొంచినన్= బాధించగా; అగ్రజుఁడు= అన్న అగు ధర్మజుడు; ఉమ్మలికముతోడన్= బాధతో; బెరయు= కలుగు; ఉత్సాహమునన్= ఉత్సాహంతో; అప్పుడు= ఆ సమయంలో; ఆ+మొనన్= ఆ సైన్యంలో; నృపులు+ఎల్లన్= రాజులందరు; తమ్ము+అందఱన్= తమర్నందరిని; పురి కొలుపఁగన్= కవ్వించగా; భీష్మున్= భీష్ముడిని; తాఁకిరి= మార్కొనిరి.

తాత్పర్యం: ధర్మరాజు తన సోదరులు నకుల సహదేవులను భీష్ముడు లొంగదీయడం చూచాడు. చాలా దుఃఖంతోను, కలిగిన ఉత్సాహంతోనూ, సైన్యంలోని రాజులందరినీ పురికొలుపగా వారందరూ భీష్ముడిని ఎదిరించారు.

వ. ఇట్లు పలువురు ధరణీశు లురవడించినం బెక్కు మృగంబులు మార్కొనినం జెలంగు సింగంబుచందంబున నలిరేఁగి సురనదీసూనుండు వెరవు గలవనపాలకుండు తాళఫలంబులు దిగఁ ద్రోచు చందంబున మెఱుంగు లడరు వెడంద వాతియమ్ముల నమ్మహీశుల తలలు డొల్ల నేయుచు మండలచారి యై విహరించుచున్న వెఱఁగుపడి పాండవులు సూచుచుండ శిఖండి కోదండపాండిత్యంబు మెఱయుచుం గదిసినఁ గ్రేడించి యతండు సృంజయసైన్యంబుపయిం దఱిమి ధైన్యంబు నొందించె నట్టిసమయంబున. 63

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; పలువురు= చాలామంది; ధరణీ+ఈశులు= రాజులు; ఉరవడించినన్= వేగిరపడగా; పెక్కు; మృగంబులు= జంతువులు; మార్కొనినన్= ఎదిరించగా; చెలంగు= విజృంభించు; సింగంబు చందంబునన్= సింహం మాదిరి; నలిరేఁగి= ఎక్కువగా విజృంభించి; సురనదీసూనుండు= గంగాదేవియొక్క కుమారుడు- భీష్ముడు; వెరవుగల= ఉపాయము కలిగినట్టి; వనపాలకుండు= వనాన్ని రక్షించేవాడు; తాళఫలంబులు= తాటి పండ్లను; దిగన్= క్రిందికి; త్రోచుచందబునన్= తోసే

మాదిరి; మెఱుంగులు= తళ తళమనే కాంతులు; అడరు= అతిశయించ; వెడందవాతియమ్ములన్= వెడల్పయిన మొనలు గల బాణాలతో; ఆ+మహీ+ఈశుల తలలు= ఆ రాజులయొక్కతలలు; డొల్లన్+ఏయుచున్= పడవేయుచు; మండలచారి+ఐ= రెండుకాళ్ళతో మండలాకారముగా చరించుచున్నవాడై; విహరించుచున్+ఉన్నన్= క్రీడిస్తూ ఉండగా; పాండవులు= పాండురాజు కొడుకులు; వెఱఁగుపడి= ఆశ్చర్యపడి; చూచుచున్+ఉండన్= చూస్తుండగా; కోదండపాండిత్యంబు= ధనుర్విద్యా నైపుణ్యం; మెఱయుచున్= ప్రకాశింపచేస్తూ; శిఖండి= శిఖండి; కదిసినన్= దగ్గరకు రాగా; క్రేడించి= అలక్ష్యంచేసి; అతండు= ఆ భీష్ముడు; సృంజయ సైన్యంబు పయిన్= సృంజయుడి సైన్యంమీదకు; తఱిమి= వెంటబడి పరుగెత్తించి; దైన్యంబున్+ఒందించెన్= దురవస్థపాలుచేశాడు; అట్టి సమయంబునన్.

తాత్పర్యం: పలురకాలైన మృగాలు ఎదిరించగా విజృంభించి నిశ్చలంగా నిలిచే సింహం మాదిరి, పలువురు రాజులు వేగిరపాటుతో ఎదిరించగా, భీష్ముడు యుక్తిగల తోపుకాపరి తాటిపండ్లను రాల్చినట్లు మిరుమిట్లుగొలిపే బాణాలతో చాలామంది రాజుల తలలు నేలకు రాల్చాడు. మండలచారిగా విహరించాడు. పాండవులు చేష్టలు మాని ఆశ్చర్యంతో చూస్తూండగా, శిఖండి తన విలువిద్యా నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ ఆయన దగ్గరకు వచ్చాడు. వాడిని లెక్కచేయకుండా భీష్ముడు సృంజయుడి సేనమీద పడి దానిని బాధించాడు. ఆ సమయంలో. (తరువాతి పద్యంతో అన్వయం)

విశేషం: 'మండలచారి' అంటే రెండుకాళ్ళతో మండలాకారంగా నిలుచున్నవాడు (భీష్ముడు) విలుకాడు యుద్ధంలో భేదాలు 1.ప్రత్యాలీఢము; 2. ఆలీఢము; 3. సమపదము; 4. విశాఖము; 5. మండలము.

సీ. సాత్యకి యేచి ధృష్టద్యుమ్నుఁడును దాను । గురుసైన్యములఁ గలగుండువెట్ట
విందానువిందులు వెసఁ దాఁకి ద్రుపదుని । కొడుకుగుఱ్ఱంబులఁ గూల్చుటయును
విరథుఁ డై హరితమ్మునరదంబుపై కతఁ । డేఁగిన ధర్మజుఁ డెల్ల బలముఁ
గవియించి యిరువురఁ గైకొని తఱిమినఁ । బ్రజకుఁ జేవీచి రారాజు గడఁగఁ

తే. దమ్ములును భీష్ముఁడును ధర్మతనయుసమద । సేనఁ బొదివిన వాసవసూనుఁ డడర
ద్రోణుఁ డాతని మార్కొని బాణజాల । పిహితముగఁ జేసె రోదసీకుహర మెల్ల. 64

ప్రతిపదార్థం: సాత్యకి= శ్రీకృష్ణుడి తమ్ముడు; తాను, ధృష్టద్యుమ్నుఁడునున్= ధృష్టద్యుమ్నుడు; ఏచి= విజృంభించి; కురుసైన్యములన్= కౌరవుల సైన్యాన్ని; కలగుండు+పెట్టన్= కలచివేయగా; విందఁ+అనువిందులు= విందుడు, అనువిందుడు అనేవాళ్ళు; వెసన్= వేగంగా; తాఁకి= ఎదుర్కొని; ద్రుపదుని కొడుకు= ద్రుపద మహారాజు కొడుకు ధృష్టద్యుమ్నుని యొక్క; గుఱ్ఱంబులన్; కూల్చుటయున్= పడగొట్టగా; విరథుఁడై= రథంలేనివాడై; అతఁడు= ఆ ధృష్టద్యుమ్నుడు; హరితమ్మున్= కృష్ణుడి తమ్ముడైన సాత్యకి యొక్క; అరదంబుపైకిన్= తేరుమీదికి; ఏఁగినన్= పోగా; ధర్మజుఁడు= ధర్మరాజు; ఎల్లబలమున్= సైన్యాన్నంతయు; కవియించి= కవ్వించి; ఇరువురన్= ఆ విందానువిందులను; కైకొని= గురిగాచేసుకొని; తఱిమినన్= వెంబడించి తరుమగా; రారాజు= రాజులకు రాజు దుర్యోధనుడు; ప్రజకున్= జనానికి (సైన్యానికి); చేవీచి= చేతితో సంజ్ఞచేసి (ప్రోత్సాహపరచి); కడఁగన్= యుద్ధానికి దిగగా; తమ్ములును= దుర్యోధనుడి తమ్ములు; భీష్ముఁడును= భీష్ముడున్నూ; ధర్మతనయు= ధర్మరాజుయొక్క; సమదసేనన్= మదంతో కూడిన సైన్యాన్ని; పొదివినన్= కమ్ముకోగా; వాసవసూనుఁడు= ఇంద్రుని కొడుకు అర్జునుడు; అడరన్= సిద్ధంకాగా; ద్రోణుఁడు= ద్రోణాచార్యుడు; ఆతనిన్= ఆ అర్జునుడిని; మార్కొని= ఎదిరించి; రోదసీకుహరము+ఎల్లన్= భూమి ఆకాశాలమధ్యభాగాన్ని పూర్తిగా; బాణజాలపిహితముగన్= బాణాల సమూహంతో కప్పబడినదానిగా; చేసెన్= కావించెను.

తాత్పర్యం: సాత్యకి, ధృష్టద్యుమ్నుడు బాగా విజృంభించి కురుసైన్యాన్ని కలతపెట్టారు. విందానువిందులు వేగంతో ఎదుర్కొని ధృష్టద్యుమ్నుడి గుర్రాలను కూల్చివేశారు. అతడు తన రథం చెడిపోగా సాత్యకి రథమెక్కాడు. ధర్మరాజు తన బలాన్నంతా బాగా పురికొల్పి విందానువిందులను చూచి తరిమాడు. అప్పుడు దుర్యోధనుడు చేయి విసరి తన సైన్యాన్నంతా కవ్వించి తానూ యుద్ధానికి దిగాడు. తాను, తనతమ్ములు భీష్ముడు అందరు ధర్మరాజు సైన్యాన్ని కమ్మివేశాడు. అప్పుడు అక్కడ అర్జునుడు కూడా ప్రత్యక్షమైనాడు. అంతలో ద్రోణాచార్యుడు అర్జునుడిని ఎదిరించి, భూమి ఆకాశం మధ్యభాగాన్ని బాణాలు బాగా గుప్పించి కప్పివేశాడు.

విశేషం: సాత్యకి వృష్ణివంశీయుడు, శినికి మనుమడు, అర్జునుడి శిష్యుడు, యుద్ధంలో పాండవ పక్షాన్ని ఆశ్రయించాడు.

వ. ఇవ్విధంబున నాచార్యుం డేచిన నతనిప్రాపున భవత్సేనలు సెలంగి పైకొనియె, నయ్యవసరంబున ధర్మతనయుండు దనయెలుంగు సూపిన నగ్గలిక నాతనిమొగ్గరంబున మొనలు బెరసి పరుసఁదనంబు సూపి యేపునం బెనంగుచుండ నినుండు దర్శనీయమండలుం డగుచు నపరశైలశిఖరగతుండయ్యె, నయ్యెడ సంజకెంజాయ నెఱయ నెత్తుటేఱులపయి వడిందేలిపోవుపీనుంగులం దివిచికొని చను భూతబేతాళ సమ్మర్దంబులను, సమరతలప్రాంతపతితంబులైన శవంబులం గైకొని చెలంగు సృగాలంబు రవంబులను దత్సమయం బతిఘోరం బగుటయుఁ, ద్రిగర్తపతిప్రముఖులగు జగతీశులవెగడు పఱచి మెఱచిన సవ్యసాచియు, సైంధవాదివసుంధరాపతులం జిక్కువడం జేసి యుక్కుమీఱిన మారుతియుం దమ యన్నకుం బొడసూపి నిలిచిన నతండు సైన్యంబుల నివర్తింప నియమించి సమస్తపరిజన పరివృతుం డై. 65

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ రీతిగా; ఆచార్యుండు= ద్రోణాచార్యుడు; ఏచినన్= విజృంభించగా; అతనిప్రాపునన్= అండగా; భవత్+సేనలున్= నీ యొక్క సేనలు; చెలంగి= విజృంభించి; పైకొనియెన్= ఎదుర్కొన్నవి; ఆ+అవసరంబునన్= ఆ సమయమందు; ధర్మతనయుండు= ధర్మరాజు; తన= తనయొక్క; ఎలుంగున్= గొంతును (కంఠధ్వనిని); చూపినన్= చూపించగా (వినిపించగా); ఆతని మొగ్గరంబునన్= అతడి వ్యూహములోనుండు; మొనలున్= సేనలు; అగ్గలికన్= ఉత్సాహముతో; బెరసి= క్రమ్ముకొని; పరుసఁ దనంబున్= కాఠిన్యాన్ని; చూపి= ప్రదర్శించి (చూపి); ఏపునన్= అధికంగా; పెనంగుచుండన్= పెనగులాడుచుండగా; ఇనుండు= సూర్యుడు; దర్శనీయమండలుండు+అగుచున్= చూడ శక్యమైనబింబముకలవాడౌతూ; అపరశైల శిఖరగతుండు+అయ్యెన్= పడమటి దిక్కునందలి పర్వతముయొక్క కొనను పొందినవాడయ్యాడు; ఆ+ఎడన్= ఆ సమయంలో; సంజ+కెంపు+చాయ= సాయంకాలపు మెరుపురంగు; నెఱయన్= వ్యాపించగా; నెత్తురు+ఏఱులపయిన్= నెత్తురు ప్రవాహాలమీద, వడిన్= వేగంతో; తేలిపోవు; పీనుంగులన్= శవాలను; తివిచికొని= లాగికొని; చను= పోతూండే; భూతబేతాళ సమ్మర్దంబులను= భూతాలు, బేతాళులు- వీటి ఒరపిళ్ళతో; సమర తలప్రాంతపతితంబులు+ఐన= యుద్ధభూమి అంచుల్లో పడి ఉండే; శవంబులన్= పీనుగులను; కైకొని= తీసికొని; చెలంగు= మ్రోసే; సృగాలంబుల రవంబులను= నక్కల ఊళలచేతను; తద్+సమయంబు= ఆ కాలము; అతిఘోరంబు+అగుటయున్= చాలా భయంకరమైనదికాగా; త్రిగర్తపతి ప్రముఖులు+అగు= త్రిగర్త దేశపురాజు మున్నగు; జగతీ+ఈశులన్= భూభర్తల (రాజుల)ను; వెగడుపఱిచి= బాధపెట్టి; మెఱసినన్= ప్రకాశించగా; సవ్యసాచియున్= అర్జునుడున్నూ; సైంధవ+ఆది+వసుంధరాపతులన్+ సైంధవుడు మొదలైన రాజులను; చిక్కు+పడన్+చేసి= కష్టపడేటట్లుగాచేసి; ఉక్కుమీఱినన్= శౌర్యంచే అతిశయించిన; మారుతియున్= భీముడున్నూ; తమ+అన్నకున్= తమ అన్నయైన ధర్మరాజుకు; పొడసూపి= కనుపించి; నిలిచినన్= నిలబడగా; అతండు= ఆ ధర్మరాజు; సైన్యంబులన్= తమసేనలను; నివర్తింపన్= వెనుకకు మళ్ళించుటకు- యుద్ధాన్ని చాలించడానికి; నియమించి= ఆజ్ఞ ఇచ్చి; సమస్త పరిజన పరివృతుండు+ఐ= సకలమైన పరివారంతో కూడినవాడై.

తాత్పర్యం: ఈ విధంగా ద్రోణాచార్యుడు విజృంభించాడు. నీ సేనలన్నీ ఆయన అండనుచేరి ఉత్సాహంతో శత్రువులపైకి ఎగబడ్డాయి. అప్పుడు ధర్మరాజు బిగ్గరగా అరవగా ఆయన వ్యూహంలోని సైనికులు ఉత్సాహంతో యుద్ధం చేస్తూ ఉండగా సూర్యుడు అస్తపర్వతంపైకెక్కాడు. ఆ సాయంకాలపు ఎర్రని కాంతులు అంతటా వ్యాపించాయి. యుద్ధరంగంలో నెత్తురు ఏరులై పారింది. ఆ ప్రవాహంలో కొట్టుకొని పోతున్న శవాలను లాగుకొనిపోయే భూతబేతాళాల రాపిళ్ళతోనూ, యుద్ధభూమిలో కూలిన పీనుగులను పీక్కొని తింటూ చెలరేగే నక్కల ఊళలతోనూ ఆ సమయం భయంకరంగా ఉండింది. అప్పుడు ఆ త్రిగర్తదేశపురాజు ముఖ్యుడుగా ఉండే రాజులనందరినీ తల్లడిల్లేటట్లు చేసిన అర్జునుడు, సైంధవుడాదిగాగల రాజులనందరినీ అగచాట్లపాలుచేసి శౌర్యాతిశయంతో ఒప్పివున్న భీముడు, అన్నగారైన ధర్మరాజు ఎదుట నిలిచాడు. అప్పుడా ధర్మరాజు, యుద్ధం చాలించుమని అనుజ్ఞ ఇచ్చి, తనదైన సమస్త పరివారంతో కూడా. (తరువాతి పద్యంతో అన్వయం)

విశేషం: సవ్యసాచి= రెండుచేతులతో బాణాలు వదిలేవాడు.

శ్లో॥ ఉభే మే దక్షిణే పాణీ గాండీవస్య వికర్షణే।
తేన దేవమనుష్యేషు సవ్యసాచీతి మాం విదుఃఁ॥(మహాభారతే - 4-12-16)

తే. విడిదలకుఁ బోయె నపుడు నీ కొడుకులెల్ల । నాపగానందనునికడ కరుగుదెంచి
బలము లన్నింటిఁ దివియంగఁబనిచి మరలి । రాత్మసన్నివేశంబుల కతఁడుఁ దారు. 66

ప్రతిపదార్థం: విడిదలకున్= తన చోటికి; పోయెన్= వెళ్ళాడు; అపుడు= ధర్మజుడు సపరివారంగా వెళ్ళినప్పుడు; నీ కొడుకులు+ఎల్లన్= నీ కుమారులు దుర్యోధనాదులందరున్నూ; ఆపగానందనుని= గంగానదీ కొడుకైన భీష్ముడి; కడకున్= సమీపానికి; అరుగుదెంచి= వచ్చి; బలములు+అన్నిటిన్= సేనలనన్నిటినీ; తివియంగన్+పనిచి= వెనుకకు తిప్పిపంపి (ఉపసంహరించి); అతఁడున్= ఆ భీష్ముడు; తారు= తాము (దుర్యోధనాదులు); ఆత్మసన్నివేశంబులకున్= తమదండు విడిసిన చోటులకు; మరలిరి= తిరిగివెళ్ళారు.

తాత్పర్యం: ధర్మరాజు పరివారంతో తమదండు విడిసియున్న చోటికి వెళ్లాడు. దుర్యోధనాదులుకూడా భీష్ముడివద్దకు పోయి, తమసైన్యాన్నంతా యుద్ధంనుండి విరమింపచేసి, తమ తమ గుడారాలకు వెళ్ళిపోయారు.

వ. సప్తమదివస రజనీసమయావసానం బగుటయు 67

ప్రతిపదార్థం: సప్తమ= ఏడవదైన; దివస= దినముయొక్క; రజనీ= రాత్రియొక్క; అవసానంబు= ముగింపు; అగుటయున్= కావటంతో.

తాత్పర్యం: భీష్ముడు సేనాధిపతిగా జరిగిన యుద్ధంలో ఏడవ దినపు రాత్రి తెల్లవారగా.

భీష్ముని యష్టమదివస యుద్ధక్రమము (సం. 6-83-1)

క. భూపోత్తమ! వినుఁ పాండు । క్ష్మాపాలతనూభవులును గౌరవులును నా
టోపంబున సంగరకే । ళీపరులై వెడలి రుగ్రలీలలు మెఱయన్. 68

ప్రతిపదార్థం: భూప+ఉత్తమ= భూమిని పాలించువాళ్ళలో శ్రేష్ఠుడవైన ధృతరాష్ట్రా!; వినుఁ; పాండుక్ష్మాపాల= పాండురాజుయొక్క; తనూభవులునున్= పుత్రులూ; కౌరవులునున్= దుర్యోధనాదులూ; ఆటోపంబునన్= సంభ్రమంతో; ఉగ్రలీలలు= భయంకరమైన చేష్టలు; మెఱయన్= అతిశయించగా; సంగరకేళీపరులు+ఐ= యుద్ధమనే క్రీడయందు ఆశకలవారై; వెడలిరి= బయలుదేరారు.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! వినుము. పాండురాజు కొడుకులున్నూ, నీ కొడుకులు దుర్యోధనాదులున్నూ వేగిరపాటుతో భయం కలిగించే చేష్టలు చేస్తూ, యుద్ధక్రీడలో ఆశగలవారై యుద్ధానికి పోయారు.

వ. అట్టియెడం గురుపితామహుండు గూర్మవ్యూహంబు దీర్చినం గనుంగొని ధర్మతనయుండు ధృష్టద్యుమ్ను నాలోకించి 'కౌరవవ్యూహంబు సూచితే? దీనికిఁ బ్రతివ్యూహం బెయ్యది దాని సంఘటింపు'మనిన నతండు శృంగాటకవ్యూహంబు వన్నె నిట్లు రెండుసైన్యంబులు మోహరించి యుత్సాహంబులు మెఱయ భేరీ మృదంగాదితూర్యంబులు మొరయం దలపడినఁ బటుహేతివ్రాతపరస్పరసంఘట్టనంబులం బొగ లేని మంట లెగయం జటులస్యందనమాతంగతురంగభటకదంబకంబుల గమనవేగంబున నెగయుపరాగపటలంబు లంబరంబునం బరఁగనీక తత్తదనీకానేకరక్తధారాసారంబు లడరి యడంగించిన నతిరౌద్రంబునఁ బెనంగు నాసమయంబున. 69

ప్రతిపదార్థం: అట్టియెడన్= ఆ సమయంలో; కురుపితామహుండు= కురుకులానికి తాత భీష్ముడు; కూర్మవ్యూహంబున్= తాబేలు వ్యూహాన్ని; తీర్చినన్= ఏర్పాటుచేయగా; ధర్మతనయుండు= ధర్మరాజు; కనుంగొని= ఆ కూర్మవ్యూహాన్నిచూచి; ధృష్టద్యుమ్నున్= ఆపేరుగల తమసేనా నాయకుణ్ణి; ఆలోకించి= చూచి; కౌరవవ్యూహంబున్= కౌరవులయొక్క సేనా సన్నివేశాన్ని; చూచితే= చూచావా?; దీనికిన్= ఈ కూర్మవ్యూహానికి; ప్రతివ్యూహంబు= ఈ కూర్మవ్యూహాన్ని ఎదిరించగల వ్యూహం; ఏ+అది= ఏదో; దానిన్= అట్టి వ్యూహాన్ని; సంఘటింపుము= ఏర్పాటుచేయి; అనినన్= అని చెప్పగా; అతండు= ఆ ధృష్టద్యుమ్నుడు; శృంగాటక వ్యూహంబున్= శృంగాటకమనే ప్రతివ్యూహాన్ని; పన్నెన్= ఏర్పాటుచేశాడు. ఇట్లు= ఈ విధంగా; రెండు సైన్యంబులు= కౌరవపాండవుల సేనలు; మోహరించి= ఎదుర్కొని; ఉత్సాహంబులు మెఱయన్= ఉత్సాహాలు అతిశయించగా; భేరీ మృదంగ+ఆది తూర్యంబులు= నగారాలు, మద్దెలలు మున్నుగాగల వాద్యాలు; మొరయన్= శబ్దించగా; తలపడినన్= ఒకర్నొకరు ఎదిరించగా; సంఘట్టనంబులు= సంఘర్షణలు; పటు= సమర్థతగల; హేతి= ఆయుధాలయొక్క; వ్రాత= సమూహముయొక్క; పరస్పర= ఒండొంటియొక్క; సంఘట్టనంబులన్= ఒరసికొనుటచేత; పొగలేని= పొగలేకయే; మంటలు= జ్వాలలు; ఎగయన్= పైకి వ్యాపించగా; చటుల= కదలుతున్న; స్యందన= రథములు; మాతంగ= ఏనుగులు; తురంగ= గుర్రాలు; భట= భటులు వీటియొక్క; కదంబకంబులన్= గుంపులయొక్క; గమనవేగంబునన్= నడకయొక్క వేగంచేత; ఎగయు= పైకిలేచు; పరాగపటలంబులు= దుమ్ముల గుంపులు; అంబరతలంబునన్= ఆకాశభాగంలో; పరఁగన్+ఈక= వ్యాపింపనీయకుండా; తద్+తద్+అనేక+అనేక= వారి వారి సేనల బాహుళ్యము యొక్క; రక్తధారా= నెత్తురు ధారలనే; ఆసారంబులు= జడివానలు; అడరి= అధికమై; అడంగించినన్= అణగిపోవునట్లుచేయగా; అతిరౌద్రంబునన్= మిక్కిలి కోపముతో; పెనంగు= యుద్ధంచేసే; ఆ సమయంబునన్= ఆ వేళలో

తాత్పర్యం: కౌరవపాండవులు యుద్ధానికి మోహరించినప్పుడు భీష్ముడు కూర్మవ్యూహాన్ని ఏర్పరచాడు. ధర్మరాజు దాన్నిచూచి, ధృష్టద్యుమ్నుడితో 'కౌరవులు పన్నిన కూర్మవ్యూహాన్ని చూచావుకదా! దీనికి ఈడైన వ్యూహం ఏదో దాన్ని నీవు ఏర్పాటుచేయుము' అన్నాడు. ధృష్టద్యుమ్నుడు దానికి ఈడైన శృంగాటకవ్యూహాన్ని పన్నాడు. ఈ విధంగా రెండు సైన్యాలూ వ్యూహాలు తీర్చుకొని ఉత్సాహంతో యుద్ధానికి సిద్ధంకాగా, నగారాల, మృదంగాది వాద్యాల శబ్దాలు మిన్నుముట్టగా- కౌరవపాండవులు తలపడ్డారు. ఆయుధాల సమూహాలు ఒండొంటి ఒరపిడిచేత పొగలేని మంటలు ఎగబాకాయి. తొందరపాటుతో కదలే రథాలు, ఏనుగులు, గుర్రాలు, భటులు. వీటి ఘట్టనలతో లేచిన ధూళి ఆకాశాన్ని ఆవరింపకుండా ఆయా పెక్కు సేనలయొక్క నెత్తురు ధారల వర్షంతో అణగిపోయింది. ఇంతటి పెనగులాట జరిగే సమయంలో- (తరువాతి పద్యంతో అన్వయం)

క. మీ తండ్రి సింహనాద । స్వీతముఖుం డగుచు నాత్మసేన గడచినన్
భీతిం బాండవయోధ । వ్రాతము మార్కొనక యొదిఁగె వసుధాధీశా! 70

ప్రతిపదార్థం: వసుధా+అధీశా!= భూమికి భర్తవగు ఓ ధృతరాష్ట్ర మహారాజా! మీ తండ్రి= నీయొక్క తండ్రియైన భీష్ముడు; సింహనాద స్వీతముఖుండు+అగుచున్= సింహనాదం చేయటంలో ప్రకాశించే ముఖం కలవాడు అయి; ఆత్మసేనన్= తనయొక్క సేనను; కడచినన్= దాటిరాగా; పాండవయోధవ్రాతము= పాండవసైన్యంలోని వీరులయొక్క సమూహము; భీతిన్= భయముతో; మార్కొనన్= ఎదిరించగా; ఒదిఁగెన్= తొలగినది.

తాత్పర్యం: 'ఓ ధృతరాష్ట్ర మహారాజా! భీష్ముడు బాగా బొబ్బలు పెట్టుతూ తన సైన్యానికి ముందుభాగాన్ని చేరగా పాండవసేనలోని మహావీరులందరూ ఆ భీష్మున్ని ఎదిరించలేక మారుమూలలకు తొలగారు.

చ. అనిలతనూజుఁ డొక్కరుఁడు । నార్చుచు భీష్మునెదిర్చి సూతుఁ జం
పిన రథ మీడ్చికొంచుఁ గురు । బృందము గొందల మంద నశ్వముల్
వెనుకకుఁ బాఱె నప్డు పృథి । వీవర! పాండవ సేన యుబ్బె నీ
తనయుఁడు భీముఁ గట్టెదురఁ । దాఁకె సునాభుఁడు విక్రమోద్ధతిన్. 71

ప్రతిపదార్థం: పృథివీవర!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; అనిలతనూజుఁడు= వాయుదేవునికొడుకు- భీముడు; ఒక్కరుఁడున్= ఒక్కడే; ఆర్చుచున్= బొబ్బలు పెడుతూ; భీష్మున్; ఎదిర్చి= ఢీకొని; సూతున్= సారథిని; చంపినన్= చంపగా; కురుబృందము= కౌరవుల గుంపు; కొందలము+అందన్= కలతచెందగా; అశ్వముల్= గుర్రాలు; రథమున్= తేరును; ఈడ్చికొంచున్= లాగికొంటూ; వెనుకకున్= వెనుకకు; పాఱెన్= పరుగెత్తాయి; అప్డు= ఆ సమయంలో; పాండవసేన= పాండవులయొక్క సైన్యం; ఉబ్బెన్= సంతోష పడినది; నీ తనయుఁడు= నీ కొడుకు; సునాభుఁడు= సునాభుడనేవాడు; విక్రమ+ఉద్ధతిన్= పరాక్రమం యొక్క అతిశయం తో; భీము కడు+ఎదురన్= భీముడికి చాలా దగ్గరగా; తాఁకెన్= ఎదుర్కొన్నాడు.

తాత్పర్యం: భీము డొక్కడే పెనుబొబ్బలుపెట్టుతూ భీష్ముడిని ఎదిరించాడు. ఆతడి సారథిని హతమార్చాడు. కౌరవ సైనికులందరూ కంగారుపడుతూంటే గుర్రాలు రథాన్ని లాక్కొని వెనక్కి పరుగెత్తి వెళ్ళాయి. ఆ పట్టులో పాండవసేన చాల ఉత్సాహంచెందింది. నీ కొడుకు సునాభుడనేవాడు పరాక్రమంతో చాలా దగ్గరకువచ్చి భీముడిని ఎదుర్కొన్నాడు.

సునాభుడు మొదలగు కురుకుమారులు భీమునిచేఁ జచ్చుట (సం. 6-84-12)

ఆ. అట్లు దాఁ కుటయు బకాంతకుఁ డంత్యకా । లాంతకుండు వోలె నలిగి బొమలు
ముడివడంగ నొక్క వెడఁ దయమ్మునఁ దల । నటికి వైచి పెలుచ నవ్వె నధిప! 72

ప్రతిపదార్థం: అధిప!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; అట్లు= ఆ విధంగా; తాఁకుటయున్= ఎదుర్కోగా; బక+అంతకుఁడు= బకుడనే రాక్షసుణ్ణి చంపిన భీముడు; అంత్యకాల+అంతకుండున్+పోలెన్= ప్రళయకాలంలోని యముడి మాదిరి; అలిగి= కోపించి; బొమలు ముడి+పడంగన్= కనుబొమ్మలు ముడిపీర్చడగా (కోపసూచకం); ఒక్క= ఒక్కటైన; వెడఁద= విశాలమైన; అమ్మునన్= బాణంతో; తలన్= తలను; నటికివైచి= నరికివేసి; పెలుచన్= బిగ్గరగా; నవ్వెన్= నవ్వాడు.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్రా! ఆ విధంగా సునాభుడు, బకాసురుణ్ణికూడా చంపిన మహావీరుడైన భీమున్ని ఎదుర్కొన్నాడు. ఆ భీముడు యమధర్మరాజు మాదిరిగా నిండా అలిగిన లక్షణాన్ని సూచించే కనుబొమలముడి పీర్చడగా, ఒక్క పదునైన బాణంతో ఆ సునాభుడి తల నరికి విరగబడి నవ్వాడు.

అవతారిక: సునాభుడి సోదరులు ఏడుగుర్ని భీముడు చంపుతాడు.

వ. ఇట్లు సునాభుండు వడుట గనుంగొని కోపాటోపంబునఁ దత్సోదరులగు నాదిత్యకేతుండును, నపరాజితుండును, బహ్వాశియుఁ, బండితుండును, గుండధారుండును, విశాలాక్షుండును, మహోదరుండును వృకోదరుపై నొక్కపెట్ట కదిసి పెక్కు విధమ్ములగునమ్ములం బెక్కింట నొప్పించిన నప్పాండవ వీరుండు రోషాతిభీషణుండై యేరికిం దేఱి చూడ రాక పటుభల్లంబున, నతినిశితక్షురప్రముఖంబున, శితప్రదరంబున, శాతక్షురికాముఖంబున, దీప్తార్ధ చంద్రాంబకంబున, ఖరనారాచంబునఁ గ్రూరబాణంబునఁ నక్కుమారసప్తకంబు సమవర్తి సమీపంబున కనిచినం దక్కటికుమారు లుక్కుదక్కి వెఱఁగుపడి యంతంత నొదిఁగిన. 73

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; సునాభుండు= సునాభుడనేవాడు; పడుటన్= చచ్చుటను; కనుంగొని= చూచి; కోప+ఆటోపంబునన్= కోపంతోనైన వేగిరపాటుతో; తద్+సోదరులు+అగు= ఆ సునాభుడికి తోడబుట్టువులైనట్టి 1.ఆదిత్యకేతుండును; 2.అపరాజితుండును; 3.బహ్వాశియు; 4.పండితుండును; 5.కుండధారుండును; 6.విశాలాక్షుండును; 7.మహోదరుండును; వృక+ఉదరుపైన్= భీముడిమీదికి; ఒక్కపెట్ట= ఒక్కసారిగా; కదిసి= సమీపానికి వెళ్ళి; పెక్కువిధమ్ములు+అగు= నానా ప్రకారాలైన; అమ్ములన్+పెక్కింటన్= అనేకబాణాలతో; నొప్పించినన్= బాధకలిగించగా; ఆ+పాండవవీరుండు= వీరుడైన ఆ భీముడు; రోష+అతి భీషణుండు+ఐ= కోపంచే మిక్కిలి భయంకరుడై; ఏరికిన్= ఎవరికిగాని; తేఱి చూడరాక= ఎగాదిగా చూట్టానికి సాధ్యంకాక; పటుభల్లంబునన్= గట్టి బల్లెంతో; అతి నిశిత క్షుర ప్రముఖంబునన్= అతి పదునైన అర్ధచంద్రబాణపుకొనతో; శితప్రదరంబున(న్)= వాడియైన బాణంతో; శాతక్షురికా ముఖంబునన్= మంగలి కత్తివంటి వాడిఅయిన ఆయుధంతో; దీప్త+అర్ధచంద్ర+అంబకమునన్= బాగా వెలిగే అర్ధచంద్రాకారపు; బాణంతో; ఖరనారాచంబునన్= వాడిబాణంతో; క్రూరబాణంబునన్= కఠినమైన బాణంతో; ఆ+కుమార సప్తకంబున్= ఆ నీ కుమారులు ఏడుగురిని; సమవర్తి సమీపంబునకున్= యమధర్మరాజు దగ్గరకు; అనిచినన్= పంపగా; తక్కటి కుమారులు= మిగిలిన నీ కొడుకులు; ఉక్కు= బలం; తక్కి= వదలిపెట్టి; వెఱఁగుపడి= భయపడి; అంతన్+అంతన్= అక్కడక్కడ; ఒదిఁగినన్= నక్కినవారు కాగా.

తాత్పర్యం: సునాభుడు భీముడిచేత చావటాన్ని అతడి సోదరులు ఏడుగురూ చూచారు. వారందరూ దొమ్మిగా ఒక్కసారిగా ఆ భీముడిమీదపడి, నానావిధాలైన బాణాల వర్షాలు కురిపించి ఆతడికి చాలా బాధకలిగేట్టు చేశారు. దానితో ఆ కుంతీకుమారుడికి అంతా ఇంతా అనరాని రోషం కలిగింది. ఎవరికీ తేరిపారచూడటానికి కూడా సాధ్యంకానివాడై, ఆ సోదరులను క్రమంగా ఉక్కుబల్లెంతో ఆదిత్యకేతుడిని, పదునుగల క్షురప్రముఖమనే ఆయుధంతో అపరాజితుడిని, చురుకుగల బాణంతో బహ్వాశి అనేవాడిని, మంగలికత్తివంటి ఆయుధంతో పండితుడిని, జ్వలించే అర్ధచంద్రాకారపు బాణంతో కుండధారుడిని, కరుకైన బాణంతో విశాలాక్షుడిని, కటువైన బాణంతో మహోదరుడిని, - ఇట్లా ఆ ఏడుగురినీ చంపాడు. దీన్ని చూచి తక్కిన నీ కుమారులందరూ ధైర్యాన్ని వదలి భయంతో తొలగిపోయారు.

తే. ‘ నాఁడు సభ నాడినంతయు నేఁడ చేయు । నట్టు లున్నాఁడు మొనతల ననిలసుతుఁడు
విదురుపలుకులు దలకూడె వేయు నేల? । యనుచు వెఱఁ జూచుచుండిరి మనుజపతులు. 74

ప్రతిపదార్థం: అనిల సుతుఁడు= భీముడు; నాఁడు= ఆ దినం; సభన్= కౌరవుల సభలో; ఆడిన= పలికినదానిని; అంతయున్= పూర్తిగా; నేఁడు+అ= ఈనాడే; మొనతలన్= యుద్ధంలో; చేయు+అట్టులున్= చేసే మాదిరిగా; ఉన్నాఁడు; విదురుపలుకులు=

విరుదునియొక్క మాటలు; తలకూడెన్= సిద్ధించాయి (కార్యరూపం తాల్చాయి); వేయున్+ఏల?= ఇక వేయి మాటలెందుకు?; అనుచున్= అని అంటూ; మనుజపతులు= రాజులు; వెఱన్= ఆశ్చర్యంతో; చూచుచుండిరి= చూస్తూ ఉండిపోయారు.

తాత్పర్యం: 'భీముడానాడు సభలో చేసిన ప్రతిజ్ఞలన్నీ ఈనాడు యుద్ధంలో నెరవేర్చేటట్లున్నాడు. విదురుడు చెప్పిన నీతి మాటలు ఈ దినం సార్థకం కాబోతున్నాయి. ఇక వెయ్యి మాట లెందుకు?' అని రాజులందరూ ఆశ్చర్యంతో చూస్తూ ఉండిపోయారు.

క. ' నీవు తనూజుల దుర్వినఁ । యావేశం బుడుపవైతి వది దుర్దశలం
గావింప నింకఁ జావక । పోవచ్చునె వారి కనిలపుత్రుని చేతన్. 75

ప్రతిపదార్థం: నీవు= (ధృతరాష్ట్రుడవైన) నీవు; తనూజుల= కొడుకులైన దుర్యోధనాదులయొక్క; దుర్వినయ+ఆవేశంబున్= అవినీతిచే ఒడలు తెలియకపోవటాన్ని; ఉడుపవు+ఐతివి= పోగొట్టకపోయావు; అది= ఆ అవినీతిని పోగొట్టకపోవడం; దున్+దశలన్= చెడ్డ అవస్థలను; కావింపన్= కలిగించగా; ఇంకన్= ఇక మీద; వారికిన్= ఆ దుర్యోధనుడు మున్నగువారికి; అనిలపుత్రునిచేతన్= భీముడిచేత; చావన్= చనిపోక; పోవచ్చునె?= తప్పించుకొనవచ్చునా?.

తాత్పర్యం: 'ధృతరాష్ట్ర మహారాజా! నీ కొడుకులయొక్క అవినీతిచేనైన దుష్టచేష్టలను అరికట్టకపోయావు. ఆ నీ చేతగాని తనం ఇప్పుడిన్ని కష్టాలకు కారణమైంది. ఇక ఆ దుర్యోధనాదులకు, ఆ భీముడివల్ల చావు తప్పుతుందా? తప్పదు.

వ. అది యట్లుండె నప్పుడు సుయోధనుండు దనచుట్టు నున్న యోధవీరులం గలయం గనుంగొని భీమసేను
మార్కొనం బంచి భీష్ము కడకుం జని శోకగద్గదకంఠుం డగుచు నతనితో ని ట్లనియె. 76

ప్రతిపదార్థం: అది= ఆ సంగతి; అట్లు+ఉండెన్= అట్లా ఉంది; అప్పుడు= ఆ సమయంలో; సుయోధనుండు; తన= తనయొక్క; చుట్టున్= తనచుట్టూ; ఉన్న= ఉన్నటువంటి; యోధవీరులన్= భటులను, శూరులను; కలయన్+కనుంగొని= కలయజూచి; భీమసేనున్; మార్కొనన్= ఎదిరించుటకు; పంచి= పంపించి; భీష్ము కడకున్= భీష్ముడివద్దకు; చని= వెళ్ళి; శోక గద్గద కంఠుండు+అగుచున్= దుఃఖంచేత బొంగురుపోయిన కంఠస్వరంగలవాడై; అతనితోన్= ఆ భీష్మాచార్యునితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఆ సంగతి అట్లా ఉండినది. అప్పుడు దుర్యోధనుడు తనచుట్టూ ఉన్నట్టి భటులనూ, శూరులనూ చూచి భీముడితో యుద్ధం చేయడానికి వెళ్ళుమన్నాడు. తానేమో భీష్ముడివద్దకు వెళ్ళాడు. దుఃఖంచే బొంగురుపోయిన కంఠస్వరంతో ఆయనతో ఇట్లా అన్నాడు.

అవతారిక: భీముడిచేత తన తమ్ములు చావడం చూచాడు. దుఃఖంతో దుర్యోధనుడు భీష్ముడి దగ్గరకు వెళ్ళి, ఆయన వారిని కాపాడలేదని బాగా యుద్ధంచేయలేదని ఎత్తి పొడుపు మాటలంటాడు.

ఉ. ' ఇమ్మెయిఁ గిట్టి వాయుసుతుఁ । డేపునఁ గోలుమసంగి పొంగి నా
తమ్ములఁ జంపఁగా నకట! । తప్పక చూచెదు గాని రోషశో
కమ్ములు లేవు తోడుపడఁ । గా దని నిచ్చితొ యున్నవారు నొ
క్కుమ్మడిఁ జావఁ గోరి యిటు । లూరక యుండితొ కౌరవోత్తమా!' 77

ప్రతిపదార్థం: కౌరవ+ఉత్తమా!= కురువంశపు రాజులలో గొప్పవాడైన ఓ భీష్మా!; వాయుసుతుండు= వాయుదేవుడి కుమారుడు భీముడు; ఈ+మెయిన్= ఈ విధంగా; కిట్టి= దగ్గరకువచ్చి; ఏపునన్= అతిశయంతో; కోలుమసంగి= మిక్కిలి విజృంభించి; పొంగి=

గర్వించి; నా తమ్ములన్= నా యొక్క తోబుట్టువులను; చంపఁగాన్= చంపుతుండగా!; అకట!= అయ్యో!; తప్పక= చేసేదిలేక; చూచెదు= చూస్తున్నావు; కాని= అంతేగాని; రోషశోకమ్ములు= రోషంగాని దుఃఖంగాని; లేవు= (నీలో) అగుపించవు; తోడుపడన్ కాదు+అని= సహాయపడుట తగదని; నిల్చితి+ఒ= ఊరకున్నావో; ఉన్నవారున్= మిగిలి ఉండేవారు కూడా; ఒక్క+ఉమ్మడిన్= ఒకేసారిగా; చావన్+కోరి= చావాలి అని వాంఛించి; ఇటులు= ఈ విధంగా; ఊరక ఉండితి+ఒ= మిన్నకున్నావో!

తాత్పర్యం: ఓ కౌరవోత్తమా! ఈ విధంగా మీదికి వచ్చి భీముడు అతిశయంతో మిక్కిలి విజృంభించి ఉప్పొంగి నా తమ్ములను చంపగా అయ్యో! తప్పకుండా చూస్తున్నావు గాని నీకు కోపం కానీ, దుఃఖం కానీ రాలేదు. తోడ్పడకూడదని నిలబడి పోయావో? లేక ఉన్నవారందరూ ఒక్కసారిగా చావనీయమని ఇట్లా ఊరకున్నావో?

వ. అనిన విని నదీసూనుండు దాను నెదురు శోకించి యతని కి ట్లనియె. 78

ప్రతిపదార్థం: అనినన్= దుర్యోధనుడిట్లా అనగా; విని; నదీసూనుండు= గంగాపుత్రుడు- భీష్ముడు; తానున్= తానుకూడ; ఎదురు= శోకించి; దుర్యోధనుడితోపాటు దుఃఖపడి; అతనికిన్= ఆ దుర్యోధనుడికి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: దుర్యోధను డాడిన పలుకులు విని, భీష్ముడు అతనితోపాటు తానూ దుఃఖం చెంది, దుర్యోధనుడితో ఇట్లా అన్నాడు.

క. 'ఇది మున్న యేను ద్రోణుఁడు । విదురుండును జెప్పినదియ విన వప్పుడు బె
ట్టిదు లగుపాండుతనూజుల । కెదు రై నిర్జింప వశమె? యీశున కైనన్. 79

ప్రతిపదార్థం: ఇది= పాండవులచే మీరు (దుర్యోధనాదులు) భంగపడుతారనేది; మున్న+అ= ముందుగానే; ఏను= భీష్ముడనైన నేను; ద్రోణుఁడు= ధనురాచార్యుడైనట్టి ద్రోణుడు; విదురుండునున్= నీతిమంతుడైన విదురుడున్నూ; చెప్పినది+అ= చెప్పినట్టిదే; అప్పుడు= ఆ సమయంలో; వినవు= నీవు వినకపోతివి; బెట్టిదులు+అగు= ఉద్ధతులైన; పాండుతనూజులకున్= పాండురాజు కొడుకులకు; ఎదురు+ఐ= ఎదురుగా నిలబడి; ఈశునకున్+ఐనన్= పరమేశ్వరుడికైనా; నిర్జింపన్= జయించడానికి; వశమె?= సాధ్యమా? కాదని భావం.

తాత్పర్యం: 'ఓ దుర్యోధనా! ఇప్పటి ఈ ఆపత్తు ఉప్పతిల్లుతుందని ఏనాడో నేను, ద్రోణాచార్యుడు, విదురుడు నీకు చెప్పాము. కాని మా మాటలప్పుడు లెక్కచేయకుంటివి. మహాపరాక్రమవంతులైన పాండవులకు ఎదురుగా నిలిచి జయించటానికి ఈశ్వరుడికికూడా సాధ్యం కాదు. ఇక మనబోటి వాళ్ళు ఎంతమాత్రం?

తే. మనకుమారులలోన నయ్యనిలతనయు । బారి కగపడువాని నెవ్వారి కైనఁ
గావఁ దలకొన శక్యంబు గాదు మనకు । నడలఁ బనిలేదు దీనికి నధిపతనయ! 80

ప్రతిపదార్థం: అధిప తనయ!= రాజకుమారా దుర్యోధనా!; మన కుమారులలోనన్= మన ధృతరాష్ట్రుడి కొడుకులలో; ఆ+అనిల తనయు బారికిన్= ఆ భీముడికి యుద్ధపు మార్గంలో; అగపడువానిన్= కనిపించేవాడిని; కావన్= కాపాడ్డానికి; ఎవ్వారికిన్+ఐనన్= ఎలాంటి శూరుడికైనా; తలకొనన్= ప్రయత్నించుటకు; శక్యంబు+కాదు= సాధ్యంకాదు; దీనికిన్= సాధ్యంకాదనే ఈ విషయానికి; మనకున్= కౌరవులైన మనకు; అడలన్= చింతించవలసిన; పనిలేదు= అవసరం లేదు.

తాత్పర్యం: దుర్యోధనా! కౌరవ కుమారులలో ఎవడైనా ఆ భీముడికెదురైతే, అట్టివాడిని కాపాడటానికి ప్రయత్నించడానికి కూడా ఎట్టి శూరుడికైనా సాధ్యం కాదు. ఈ దుస్థితిని గూర్చి మనం ఏడవవలసినపని లేదు.

క. వీరస్వర్గము ధనముగఁ । బోరుము నీ వింక నొండుబుద్ధు లుడుగు మేఁ
బోరెద నోపినమెయిఁ దెగి । పోరఁగ జయమైన దానిఁ బోఁ ద్రోచెదమే! 81

ప్రతిపదార్థం: నీవు= దుర్యోధనుడవైన నీవు; ఇంకన్= ఇక మీదట; వీరస్వర్గము= వీరస్వర్గమే; ధనముగన్= ధనంగా; పోరుము= యుద్ధంచెయ్యి; ఒండు బుద్ధులు= వేరే బుద్ధులు (ఆలోచనలు); ఉడుగుము= వదిలిపెట్టుము; ఏన్= నేను (భీష్ముడు); ఓపినమెయిన్= శక్యమయినంత; తెగి= సాహసించి; పోరెదన్= యుద్ధంచేస్తాను; పోరఁగన్= యుద్ధంచేస్తే; జయము+ఐనన్= మనకు జయం కలిగితే; దానిన్= ఆ జయాన్ని; పోన్+త్రోచెదము+ఏ?= అవతలకు నెట్టివేస్తామా?

తాత్పర్యం: దుర్యోధనా! నీ వింక వీరస్వర్గాన్నే ధనంగా కోరి యుద్ధంచేయుము. అంతేగాని వేరే ఆలోచనలు అనగా రాజ్యంమీద ఆశను విడిచిపెట్టుము. నేనేమో చేతనయినంతగా తెగించి యుద్ధంచేస్తాను. ఒక వేళ జయం మనదైతే ఆ జయాన్ని కాదంటామా!'

వ. అనియె నని చెప్పిన విని వైచిత్రవీర్యుండు. 82

ప్రతిపదార్థం: అనియెన్= భీష్ముడన్నాడు; అని చెప్పినన్= అని సంజయుడు చెప్పగా; విని= ఆలకించి; వైచిత్రవీర్యుండు= విచిత్రవీర్యుని కొడుకు- ధృతరాష్ట్రుడు.

తాత్పర్యం: భీష్ముడు దుర్యోధనుడితో చెప్పిన మాటలను సంజయుడు ధృతరాష్ట్రుడికి చెప్పాడు. అప్పుడు ధృతరాష్ట్రుడు.

తే. ' గురుఁడు భీష్ముడుఁ గలుగంగఁ గురుకుమారు । లిట్టు వొలిసెదరే మున్నయింతవట్టు!
దల్లియును నేనుఁ జెప్పినఁ బొల్ల సేసి । దాని ఫల మిప్పు డా సుయోధనుఁడు గనియె. 83

ప్రతిపదార్థం: గురుఁడు= ద్రోణాచార్యుడు; భీష్ముండున్= భీష్ముడున్నూ; కలుగంగన్= మనపక్షంలో ఉండగా; కురుకుమారులు= కౌరవపుత్రులు; ఇట్టు= ఈ మాదిరి; పొలిసెదరే!= చస్తారా!; మున్ను+అ= మునుపే; ఇంత+పట్టు= ఇదంతా; తల్లియునున్= తల్లియైన గాంధారి; ఏనున్= నేను (ధృతరాష్ట్రుడు); చెప్పినన్= చెప్పగా; పొల్ల+చేసి= వ్యర్థంచేసి; దాని ఫలము= ఆ మాటలు విననిదానియొక్క ఫలాన్ని; ఇప్పుడు= ఈనాడు; సుయోధనుండు= దుర్యోధనుడు; కనియెన్= చూచాడు.

తాత్పర్యం: 'అస్త్ర గురువు ద్రోణాచార్యుడు, దేవతలకు కూడా అజేయుడైన భీష్మాచార్యుడు ఈ యిద్దరున్నూ మన పక్షాన ఉండి యుద్ధంచేస్తూంటే ఇందరు కుమారులు చావడమా? భవిష్యత్తులో కలిగే ఈ విపత్తునంతా ముందుగానే గాంధారి, నేనూ ఎంతగానో చెప్పినప్పటికి ఆ దుర్యోధనుడు దాన్ని పెడచెవిని పెట్టాడు- దాని ఫలం ఇప్పుడు అనుభవిస్తున్నాడు.

వ. ఇంక నమ్మాటలాడుట గతజలసేతుబంధనంబు దానిం జాలింపు మట్లు కురుకుమారులచావు గనుంగొని గాంగేయకుంభసంభవులు పదంపడి యేమి సేసి రని యడుగుటయు, సూతనందనుం డంబికానందనున కిట్లను, భీష్ముండు భయంకరాకారుం డై మారుతిపయిం దేరు వఱపె, నతనిం గని ధర్మనందనుండు సేయివీచిన ధృష్టద్యుమ్నశిఖండిసాత్యకులు దలకడచి యతనితోఁ దలపడి రంతకు మున్న

దుర్యోధనుపనుపునఁ గవిసిన రథికులమీఁదం జేకితాన ద్రౌపదేయసహితంబుగా సవ్యసాచి యడరె. నభిమన్యుండును హైడింబుండును ధార్తరాష్ట్రులదెసం దఱిమి రిత్తెఱంగున మూఁడు గట్టిమొత్తమ్ములు బెట్టిదంబు సేయ మన బలంబులుం బోక పెనంగుచుండె; నట్టియెడ. 84

ప్రతిపదార్థం: ఇంకన్= ఇకమీదట; ఆ+మాటలు= ఆ పలుకులు; ఆడుట= చెప్పుకోవడం; గతజలసేతు బంధనంబు= ప్రవాహంపోయిన తరువాత కట్టకట్టడంవంటిది (వ్యర్థము); దానిన్= ఆ సమాచారాన్ని; చాలింపుము= వదలిపెట్టుము; అట్లు= ఆ విధంగా; కురు కుమారుల చావున్= కురు కుమారుల మరణాన్ని; కనుంగొని= చూచి; గాంగేయ కుంభసంభవులు= గంగాదేవి కొడుకు- భీష్ముడు, కడవనుండి పుట్టిన ద్రోణుడు- వీరిద్దరు; ఏమిసేసిరి= ఏం చేశారు; అని అడుగుటయున్= అని అడగ్గా; సూత నందనుండు= సూతుని కొడుకు సంజయుడు; అంబికానందననకున్= అంబికయొక్క కొడుకైన ధృతరాష్ట్రుడికి; ఇట్లు+అనున్= ఈ విధంగా అంటాడు; భీష్ముండు; భయంకర+ఆకారుండు+ఐ= భయంకలిగించే రూపంకలవాడై; మారుతిపయిన్= భీముడిమీదికి; తేరున్= రథాన్ని; పఱపెన్= తోలాడు; అతనిన్= ఆ భీష్ముడిని; కని= చూచి; ధర్మనందనుండు; చేయివీచినన్= చేతితో సైగచేయగా; ధృష్టద్యుమ్న శిఖండి సాత్యకులు= ధృష్టద్యుమ్నుడు, శిఖండి, సాత్యకి; తలకడచి= అతిక్రమించి; అతనితోన్= ఆ భీష్ముడితో; తలపడిరి= ఎదిరించారు; అంతకుమున్ను+అ= అంతకుముందుగానే; దుర్యోధను పనుపునన్= దుర్యోధనుడి ఆజ్ఞచేత; కవిసిన= పర్విన; రథికులమీఁదన్= రథంలో కూర్చొని యుద్ధంచేసేవారి మీదికి; చేకితాన ద్రౌపదేయ సహితంబుగాన్= చేకితానుడు, ద్రౌపది కొడుకులు- వీరితో కూడికొని; సవ్యసాచి= అర్జునుడు; అడరెన్= విజృంభించాడు; అభిమన్యుండును= సుభద్రకొడుకు అభిమన్యుడు; హైడింబుండును= హిడింబ అనే రాక్షసికొడుకున్నూ; ధార్తరాష్ట్రునిదెసన్= దుర్యోధనుడున్న దిక్కునకు; తఱిమిరి= కవిశారు; ఈ+తెఱంగునన్= ఈ మాదిరిగా; మూఁడు; గట్టి= దిట్టవైన; మొత్తమ్ములు= గుంపులు; బెట్టిదంబు= క్రూరత్వాన్ని; చేయన్= చేయగా; మనబలంబులున్= మన కౌరవులయొక్క సైన్యంకూడా; పోక= వెనుకకు తిరగకుండా; పెనంగుచున్+ఉండెన్= యుద్ధం చేస్తున్నాయి; అట్టియెడన్= ఆ సమయంలో.

తాత్పర్యం: ఇక ఆ మాటలు చాలించు. ఇక అది గతజలసేతుబంధనంవలె ఉపయోగంలేనిది. ఆ కురుకుమారులు చావటాన్ని చూచి భీష్మద్రోణులు ఆపైన 'ఏంచేశారు?' అని ధృతరాష్ట్రుడు అడిగాడు. దానికి బదులు సంజయుడిట్లా చెప్పాడు. 'భీష్ముడు భయంకరమైన ఆకారంతో భీముడున్న వైపునకు రథం పోనిచ్చాడు. దాన్ని చూచి ధర్మరాజు చేసన్నచేయగా ధృష్టద్యుమ్న శిఖండి సాత్యకులు ముందుకువచ్చి ఆ భీష్ముడితో తలపడ్డారు. అంతకుముందే దుర్యోధనుడి ఆజ్ఞతో ఎగబడిన రథికులపైకి అర్జునుడు, చేకితానుడు ద్రౌపదీ పుత్రులతో కూడి ఎగబడ్డారు. అభిమన్యుడు, ఘటోత్కచుడు దుర్యోధనుడిపైకి ఉరికారు. ఈ విధంగా మూడు గట్టి సైన్యాలు చాలా కఠోరంగా యుద్ధం సాగించాయి. కౌరవబలాలు వెనుకంజ వేయకుండా బాగా పోరుతూ వచ్చాయి. అప్పుడు-

విశేషం: భీష్ముడు- అష్టవసువులలో ఒకడు. వసిష్ఠుడి శాపంవల్ల భీష్ముడుగా పుట్టాడు. శంతనురాజు తండ్రి, గంగాదేవి తల్లి. ఇతడు పరమ ధర్మాత్ముడు, మహావీరుడు. తండ్రి శంతనుడు దాసకన్యను వివాహం చేసికొనే సందర్భంలో తాను తండ్రి రాజ్యాన్ని కోరక, వివాహం చేసికొనక, ఊర్ధ్వరేతుడయ్యాడు.

క. ద్రోణాచార్యుఁడు ద్రుపద । క్షోణీశ్వరుమోహరంబు సుడివడ దివి గీ
ర్వాణులు గీర్తింపఁగఁ బటు । బాణపరంపర లనేకభంగులఁ బఱపెన్. 85

ప్రతిపదార్థం: దివిన్= ఆకాశంలో; గీర్వాణులున్= దేవతలు; కీర్తింపఁగన్= పొగడగా; ద్రోణాచార్యుఁడు= విలువిద్యలో గురువు ద్రోణుడు; ద్రుపదక్షోణీశ్వరు= ద్రుపద మహారాజుయొక్క; మోహరంబు= పన్నినవ్యూహాన్ని; సుడివడన్= చలించునట్లుగా; బాణపరంపరలు= బాణాల వరుసలను; అనేక భంగులన్= పెక్కు విధాలుగా; పఱపెన్= ప్రయోగించాడు.

తాత్పర్యం: ద్రోణాచార్యుడు బలమైన పలురకాలైన బాణాలు ప్రయోగించి, ద్రుపద మహారాజు పన్నిన వ్యూహాన్ని చిందరవందర చేశాడు. అప్పుడు ఆకాశంలో విమానాల నుండి చూస్తున్న దేవతలు ఆయన శౌర్యాన్ని ఎంతో పొగిడారు.

క. కరిఘటలు మీఁద భీముఁడు । సరభసముగ నేయునారసంబుల మ్రో డై
ధరఁ బడి రూపఱినను దిన । కరుకరములఁ దమము విరియుగతిఁ దోఁచె నృపా! 86

ప్రతిపదార్థం: నృపా!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; భీముఁడు= భీముడు; కరిఘటలు= ఏనుగు గుంపులు; మీఁదన్= మీద; సరభసంబుగన్= వేగంతో; ఏయు= ప్రయోగించునట్టి; నారసంబులన్= బాణాలచేత; మ్రోడు+ఐ= మొద్దుబారి; ధరన్= నేలమీద; పడి= పడి; రూపు+అఱినను= అవయవాలు తెగిపోగా; దినకరు కరములన్= సూర్యుని యొక్క కిరణాలచేత; తమము= చీకటి; విరియుగతిన్= చెదిరిపోయే మాదిరిగా; తోఁచెన్= అనిపించింది.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! భీముడు బలంగా వేసిన బాణాల దెబ్బకు ఏనుగుల గుంపులు మొద్దుబారి, అవయవాలు తెగిపోగా, నేలమీద పడ్డాయి. అది సూర్యకిరణాలు సోకగా చీకటి చెదరిపోయే విధంగా ఉండింది.

విశేషం: అలంకారం: ఉపమ.

క. అటిముటి గుట్టపుదడముల । కుటికి కవలు రౌద్రరసమహోగ్రాకృతు లై
నటికిన నచ్చట రథములు । వఱపఁగరాదయ్యె నుభయబలయోధులకున్. 87

ప్రతిపదార్థం: కవలు= నకుల సహదేవులు; అటిముటి= సంభ్రమంతో; గుట్టపుదడములకున్= గుట్టాల దండుపైకి; ఉటికి= దూకి; రౌద్రరస= రౌద్రరసంచేత;మహా= అధికమైన; ఉగ్ర= భయంకరమైన; ఆకృతులు+ఐ= ఆకారంగలవారై; నఱికినన్= నటికివేయగా; అచ్చటన్= ఆ యుద్ధరంగంలో; ఉభయబలయోధులకున్= రెండు సేనలలోని భటులకు కూడా; రథములున్= రథాలను; పఱపఁగన్= తోలుటకు; రాదు+అయ్యెన్= సాధ్యంకాలేదు.

తాత్పర్యం: నకులుడు, సహదేవుడు శత్రువుల గుర్రపు దళాల మీదికి సంభ్రమంగా దూకి, రౌద్రరసంతో చూచేవారికి చాల భయంకరులై, చాలా గుర్రాలను నరికివేశారు. యుద్ధభూమి అంతా చచ్చిన గుర్రాలతో నిండిపోయింది. అప్పుడు కురుపాండవసేనలలోని భటులు తమ రథాలను తోలడానికి కూడా దారి లేకపోయింది.

తే. నరుఁడు రథికజనంబుపై సరభసముగ । నేయఁ గేయూరహారతత్కాయశకల
వితతి నిల యొప్పె రాలినవివిధ పుష్ప । పుంజమునఁ బొల్చు నుద్యానభూమి వోలె. 88

ప్రతిపదార్థం: నరుఁడు= అర్జునుడు; సరభసముగన్= తొందరపాటుతో; రథికజనంబుపైన్= రథంలో కూర్చుని యుద్ధంచేసేవారిమీదికి; ఏయన్= బాణాలువేయగా; రాలిన= నేలపడినట్టి; వివిధ పుష్పపుంజమునన్= రకరకాల పూల కుప్పలతో; పొల్చు= ఒప్పునట్టి; ఉద్యానభూమిన్+పోలెన్= ఉద్యానవనం మాదిరి; కేయూర= బాహుపురులయొక్క; హార= దండలయొక్క; తద్+కాయ= ఆ చంపబడ్డ రథికుల శరీరాలయొక్క; శకల= తునుకలయొక్క; వితతిన్= సముదాయంచేత; ఇల= భూమి; ఒప్పెన్= ప్రకాశించింది.

తాత్పర్యం: అర్జునుడు త్వరతో బాణాలువేసి రథికులను హతమార్చాడు. అప్పుడా యుద్ధభూమి చచ్చిన రథికులయొక్క బాహుపురులతో, రత్నాలు చెక్కిన హారాలతో, శరీరాల అవయవాల తునుకలతో నేలపై రాలిన పలురంగుల పూల కుప్పలతో ప్రకాశించే ఉద్యానవనంలా ఉన్నది.

విశేషం: అలం: ఉపమ.

వ. అప్పు డిరావంతుండు. 89

ప్రతిపదార్థం: అప్పుడు= అర్జునుడు చాలామంది రథికుల్ని చంపిన సమయంలో; ఇరావంతుండు= అర్జునుడికి నాగకన్యకు పుట్టినవాడు.

తాత్పర్యం: అట్టి సమయంలో ఇరావంతుడనేవాడు.

క. తురగనికరంబుతోడం । గురుసైన్యము దఱియఁ జొచ్చుకోల్తల సూడం
గర మొప్పె ఘనవిహంగో । త్కరముపయిం గవియు డేగతండంబుగతిన్. 90

ప్రతిపదార్థం: తురగ నికరంబుతోడన్= గుర్రాల గుంపుతో; కురుసైన్యమున్= కౌరవులసేనను; తఱియన్= దగ్గఱకువచ్చి; చొచ్చు= దూరునట్టి; కోల్తలన్= యుద్ధసన్నాహాన్ని; చూడన్= చూడగా; ఘన= దట్టంగావున్న; విహంగ= పక్షులయొక్క; ఉత్కరము పయిన్= గుంపుమీదికి; కవియు= ఆక్రమించే; డేగతండంబుగతిన్= డేగలగుంపులాగా; కరము= మిక్కిలి; ఒప్పెన్= అమరింది.

తాత్పర్యం: గుర్రాల గుంపుతో ఇరావంతుడు కురుసేన దగ్గరకు వెళ్ళి చొరబడటం చూస్తే దట్టంగా ఉండే పక్షులగుంపుమీదికి ఉరికే డేగ గుంపువలె ఉండింది. కౌరవుల సేన పక్షుల గుంపువలె, ఇరావంతుడి సైన్యం డేగ గుంపువలె అగుపించింది.

విశేషం: అలం: ఉపమ.

వ. ఇ ట్లుక్కు మిగిలి యెక్కినయర్జుననందనుం గనుంగొని శకునితమ్ములు శుకుండును, శర్మవంతుండును, వృషకుండును, నార్జవుండును, గజుండును, గవాక్షుండును, గుట్టపు మొత్తంబులతో నగ్గలిక నతనిపై వాహనంబులం బఱపి పిఱుదివియక రాయిరాయి దాఁకినట్లు దాఁకి రయ్యిరువాఁగును విచిత్రంబుగాఁ బోర నయ్యార్వురు గాంధారకుమారులు నయ్యిరావంతుం బొదివి సెలకట్టెలవాట్ల డొంకెనపోట్ల నొప్పించిన బరిగోలలపోటులు దాఁకినం గినిసిన గంధగజంబు చందం బై. 91

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; ఉక్కుమిగిలి+ఎక్కిన= మిక్కిలి పరాక్రమంతో అతిశయించిన; అర్జుననందనున్= అర్జునుడికొడుకైన ఇరావంతుణ్ణి; కనుంగొని= చూచి; శకుని తమ్ములు; శకుండును; శర్మవంతుడును; వృషకుండును; ఆర్జవుండును; గజుండును; గవాక్షుండును; గుట్టపు మొత్తంబులతోన్= గుర్రపు సమూహంతో; అగ్గలికన్= పూనికతో; అతనిపైన్= ఆ ఇరావంతుడి మీదికి; వాహనంబులన్= గుర్రాలను; పఱపి= తోలి; పిఱు+తివియక= వెనక్కిమళ్లకుండా; రాయి= శిల; రాయిన్= శిలను; తాఁకినట్లు= ఢీకొన్నవిధంగా; తాఁకిరి= ఎదుర్కొనిరి; ఆ+ఇరువాఁగును= ఆ రెండు సేనలున్నూ; విచిత్రంబుగాన్= ఆశ్చర్యంగా; పోరన్= యుద్ధంచేయగా; ఆ+ఆర్వురు= ఆ ఆర్వురు; గాంధారకుమారులు= గాంధార రాజుయొక్క కొడుకులు; ఆ+ఇరావంతున్= ఆ ఇరావంతుడిని; పొదివి= కమ్ముకొని; సెలకట్టెల= బాణాల; వాట్లన్= దెబ్బలతో; డొంకెన= ఈటెలయొక్క; పోట్లన్= పొడుచుటచేత; నొప్పించినన్= బాధపెట్టగా; బరిగోలల= అంకుశాలయొక్క; పోట్లన్= పొడుపులతో; తాఁకినన్= గ్రుచ్చుకోగా; కినిసిన= కోపంచెందిన; గంధ= మదించిన; గజంబు= ఏనుగుయొక్క చందంబు+ఐ= విధమై.

తాత్పర్యం: ఎక్కువయిన పరాక్రమంతో అతిశయించిన ఇరావంతుడిని చూచారు. శకుని తమ్ముళ్ళు ఆరుగురూ చాలా పూనికతో తమ గుర్రాల గుంపును వాడిమీదికి తోలారు. వెనక్కి తగ్గకుండా, రాయి రాతితో ఢీకొన్నట్లుగా రెండుపక్షాల వారూ చాలా ఆశ్చర్యంగా యుద్ధం చేశారు. ఆరుగురూ ఆ ఇరావంతుడిని చుట్టుముట్టి బాణాలతో బాదారు, వంకర కొనలుగల ఈటెలతో పొడిచారు. అంకుశపు పొడుపు తినిన మదపుటేనుగు విధంగా కోపగించి.

విశేషం: అలం: ఉపమ.

ఆ. అతఁడు ధన్వి యగుట నశ్వంబుఁ దొలఁగ దాఁ । టించి తిరిగి యా కడిందిమగల
నారసములు పెక్కు నాటించి నొప్పించి । వెగడుపఱిచె సురలు వొగడుచుండ. 92

ప్రతిపదార్థం: సురలు= దేవతలు; పొగడుచుండన్= పొగడుచుండగా; అతఁడు= ఆ ఇరావంతుడు; ధన్వి= విలుకాడు; అగుటన్= కావడంచేత; అశ్వంబున్= గుర్రాన్ని; తొలఁగన్= పక్కకు పొయేటట్లుగా; దాఁటించి= తప్పించి; తిరిగి= ప్రక్కకుమళ్ళి; ఆ కడింది= ఆ అసాధ్యులైన; మగలన్= శూరులను; నారసములు= బాణాలు; పెక్కు= అనేకములు; నాటించి= గ్రుచ్చుకొనేటట్లుచేసి; నొప్పించి= బాధకలిగించి; వెగడుపఱిచెన్= తల్లడిల్లజేశాడు.

తాత్పర్యం: ఆ ఇరావంతుడు విలుకాడు కాబట్టి తన గుర్రాలను ప్రక్కకు తప్పించి మరల తిరిగివచ్చి ఆ వీరులపై పలుబాణాలు ప్రయోగించి నొప్పించాడు. అప్పుడు దేవతలందరూ ఆ ఇరావంతుడి శౌర్యాన్ని మెచ్చుకొన్నారు.

వ. అట్టియెడ. 93

ప్రతిపదార్థం: అట్టియెడన్= ఆ సమయంలో.

తాత్పర్యం: ఆ ఇరావంతుడు, పెక్కుబాణాలువేసి, శత్రువులకు అడలు పుట్టించే సమయంలో.

క. మునుపోటులఁ బడినొచ్చుటఁ । దనగుఱ్ఱము వడినఁ బడక ధరణికి లంఘిం
చెను వెఱపు లేక పే రు । క్కునఁ బటుఖడ్గంబు వెఱికికొనుచు రయమునన్. 94

ప్రతిపదార్థం: మును= ముందే; పోటులన్+పడి= పొడుపులుతిని; నొచ్చుటన్= బాధపడటంచేత; తనగుఱ్ఱము= ఇరావంతునియొక్క గుర్రము; పడినన్= పడిపోగా; పడక= తాను (ఇరావంతుడు) క్రిందపడకుండా; వెఱపులేక= భయపడకుండా; పేరు+ఉక్కునన్= మిక్కిలి స్థైర్యంతో; పటుఖడ్గంబున్= దిట్టమైనకత్తిని; రయమునన్= వేగంతో; పెఱికికొనుచున్= ఒరనుండిపైకి దూస్తూ; ధరణికిన్= భూమిమీదికి; లంఘించెన్= దూకాడు.

తాత్పర్యం: అంతకుముందే ఇరావంతుడి గుర్రం బాగా దెబ్బలుతిని ఉండడంచేత నేలకు ఒరిగిపోయింది. ఇరావంతుడు కిందపడకుండా చాలా జాగ్రత్తగా ధైర్యంతో ఒక గట్టి కత్తిని తీసికొని వేగంగా నేలమీదికి దూకాడు.

వ. ఇట్లు భూచారి యయిన భుజగరాజదౌహిత్రుం జూచి యేచి యా సుబలసూనులు సుట్టుముట్టి. 95

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; ఆ సుబలసూనులు= గాంధార రాజు సుబలుడి కుమారులు; భూచారి+అయిన= (పదాతి) భూమి మీద ఉండి యుద్ధంచేసే వాడైన; భుజగరాజ దౌహిత్రున్= సర్పాలరాజు కూతురి కొడుకైన ఇరావంతుణ్ణి; చూచి= దర్శించి; ఏచి= విజృంభించి; చుట్టుముట్టి= నాలుగు పక్కల క్రమ్ముకొని;

తాత్పర్యం: భూమిమీద నిలబడి యుద్ధంచేసే ఆ ఇరావంతుడిని చూచి, ఆ ఆరుగురు అన్నదమ్ములు విజృంభించి చుట్టుముట్టారు.

విశేషం: ఇరావంతుడు కౌరవ్యుడనే సర్పరాజుకూతురు కొడుకు.

క. పాడువఁగ వ్రేయఁగ నతఁడుం । గడునుఱు వగు నేర్పు కడిమికలిమిం దనపైఁ
బడకుండఁ గృపాణమ్మునఁ । గడుఁజిత్రపుగతుల జడిసెఁ గైదువు లెల్లన్. 96

ప్రతిపదార్థం: పొడువఁగన్= ఆ సుబల సూనులు(తనను) బల్లాలతో గ్రుచ్చగా; వ్రేయఁగన్= కొట్టగా; అతఁడున్= ఆ ఇరావంతుడు; కడున్= మిక్కిలి; ఉఱవు+అగు= ఎక్కువైన; నేర్పు= సామర్థ్యము; కడిమి= పరాక్రమము వీనిని; కలిమిన్= కలిగియుండుటచేత; తనపైన్= తనమీద; పడక+ఉండన్= తనమీదపడకుండునట్లుగా; కృపాణమ్ముననన్= ఖడ్గంతో; కైదువులు+ఎల్లన్= అన్ని ఆయుధాలను; కడున్= మిక్కిలి; చిత్రపుగతులన్= విచిత్రాలైన పోకడలతో; జడిసెన్= నివారించాడు.

తాత్పర్యం: ఆ శకుని తమ్ములు ఆరుగురూ, ఇరావంతుడిని బల్లాలతో పొడిచారు. ఆయుధాలతో కొట్టారు. ఇరావంతుడు ఎక్కువ నేర్పు, సామర్థ్యం, పరాక్రమం కలిగినవాడు కావటంచేత, ఆ శత్రువులు ప్రయోగించిన అన్ని ఆయుధాలనూ, తన ఖడ్గంతో చిత్రవిచిత్రాలైన విధానాలతో అవి తనమీద పడకుండా చేసికొంటూ వాటి నన్నింటినీ ఖండించివేశాడు.

వ. ఆ రౌతులు వీఁడు గాలుమానిసి యగుటం జేసి మనకు నొప్పింప వెరవుగాదయ్యెడు' నను దుర్విచారంబున. 97

ప్రతిపదార్థం: ఆ రౌతులు= గుర్రాలనెక్కి యుద్ధంచేసే ఆ ఆరుగురు; వీఁడు= ఈ ఇరావంతుడు; కాలుమానిసి= నేలపై నిల్చి యుద్ధంచేసేవాడు (పదాతి) అగుటన్+చేసి= కావడంవల్ల; మనకున్= గాంధారరాజు కొడుకులైన మనకు; నొప్పింపన్= బాధపెట్టడానికి; వెరవు= సాధ్యము; కాదు+అయ్యెడున్= కాకుండా ఉన్నది; అను= అనునట్టి; దుర్+విచారంబునన్= చెడ్డ ఆలోచనతో.

తాత్పర్యం: 'ఈ ఇరావంతుడు నేలపై నిలిచి యుద్ధం చేస్తున్నాడు. మనమేమో గుర్రాలపై కూర్చొని యుద్ధం చేస్తున్నాము కాబట్టి మనకు వీడిని హింసించడం సాధ్యంకాదు. అనే చెడ్డ ఊహలో పడినవారై.

ఆ. ఆర్వురును గడంగి హయముల డిగి పటు । ఖడ్గదీప్తు లడరఁ గదియుటయును
బ్రమరి తిరిగి వారిఁ బండ్రెండుదునియలు । సేసి క్రీడికొడుకు సెలఁగి యార్చె. 98

ప్రతిపదార్థం: ఆర్వురునున్= ఆ ఆరుగురు సోదరులున్నూ; కడంగి= ప్రయత్నపడి; హయములన్= గుర్రాల నుండి; దిగి= క్రిందికిదిగి; పటుఖడ్గదీప్తులు= దృఢమైనకత్తుల కాంతులు; అడరన్= వ్యాపించగా; కదియుటయును= దగ్గరకురాగా; క్రీడికొడుకు= అర్జునుడి కుమారుడు; బ్రమరితిరిగి= చుట్టివచ్చి; వారిన్= ఆ శకుని సోదరులు ఆరుమందిని; పండ్రెండు= పన్నెండు; తునియలు= తునుకలుగా; చేసి= సలిపి; చెలఁగి= చెలరేగి; ఆర్చెన్= బొబ్బరించాడు.

తాత్పర్యం: ఆ ఆరుగురు సోదరులు గుర్రాలమీదినుండి నేలపైకి దిగారు. పదునైన దిట్టములైన ఖడ్గాల చేతబట్టుకొని ఆ ఇరావంతుడి దగ్గరకు వచ్చారు. ఆ ఇరావంతుడు, చుట్టివచ్చి ఒక్కొక్కడిని, రెండుతుంటలచొప్పున ఆ ఆరుగుర్ని మొత్తం పన్నెండు తుంటలుగా నరికివేశాడు. వీరావేశంతో పెనుబొబ్బలు పెట్టాడు.

అవతారిక: ఈ దృశ్యాన్ని చూచిన దుర్యోధనుడు ఇరావంతుడి మీదకి యుద్ధానికి అలంబుసుడనే రాక్షసుడిని ఉసిగొల్పుతాడు.

క. వెక్కస మందుచుఁ గురుపతి । రక్కసుతో ననియె 'నియ్యురగ దౌహిత్రుం
డొక్కఁడ మన సైన్యంబు । ల్సక్కడఁచుచు నున్నవాఁ డలంబుస! కంటే.' 99

ప్రతిపదార్థం: కురుపతి= కురురాజు దుర్యోధనుడు; వెక్కసము= అసహనము; అందుచున్= పొందుచున్నవాడగుతూ; రక్కసుతోన్= రాక్షసుడితో; అలంబుస!= ఓ అలంబుసుడా!; ఈ+ఉరగదౌహిత్రుండు= ఈ నాగరాజు కూతురి కొడుకు

(ఇరావంతుడు); ఒక్కడు+అ; మన సైన్యంబుల్= మనయొక్క సేనలను; చక్కడఁచుచున్+ఉన్నవాఁడు; సంహరిస్తూ ఉన్నాడు; కంటే?= చూచావా?; అనియెన్= అని అన్నాడు.

తాత్పర్యం: ఆ ఆరుగురు గాంధారరాజు కుమారులను ఇరావంతుడొక్కడే చంపటాన్ని దుర్యోధనుడు చూచాడు. అతడికి వెక్కసపాటు ఎక్కువైంది. తన సమీపానవుండే రాక్షసుడితో "ఓ అలంబుసుడా! చూచావుగదా! అర్జునుడి కొడుకు ఇరావంతుడు ఒక్కడే మనసైన్యం మీద విరుచుకపడి అడగారిపోయ్యేట్టు చేస్తున్నాడు.

అలంబుసునిచేత నిరావంతుఁడు మృతుం డగుట (సం. 6-86-48)

వ. అని యాతని వలను సూపినం గనుంగొని దైతేయనాథుండు. 100

ప్రతిపదార్థం: అని= అనిచెప్పి; ఆతని= ఆ ఇరావంతునియొక్క; వలనున్= ఉన్నవైపును; చూపినన్= చూపించగా; ఆ దైతేయనాథుండు= రాక్షసప్రభువైన ఆ అలంబుసుడు; కనుంగొని.

తాత్పర్యం: దుర్యోధనుడు ఇరావంతుడున్న దిక్కుచూపగా, ఆ అలంబుసుడు చూచి- (తరువాతి పద్యంతో అన్వయం).

ఆ. కడఁగి నడచి మాయ గావింప నయ్యురా । వంతు నశ్వసేనయంతసేన
వుట్టి వారిమీఁదఁ బురికొని తలపడి । సమయఁ జేసె నదియు సమసె నధిప! 101

ప్రతిపదార్థం: అధిప!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; కడఁగి= ప్రయత్నించి; నడచి= ఆ ఇరావంతుడి సమీపానికిపోయి; మాయన్= రాక్షస మాయను; కావింపన్= చేయగా; ఆ+ఇరావంతున్= ఆ ఇరావంతుడియొక్క; అశ్వసేన+అంత= గుర్రాల సైన్యం ఎంత ఉన్నదో; అంత= ఆ పాటి; సేన= సైన్యం; పుట్టి= ఉప్పతిల్లి; వారిమీఁదన్= ఆ ఇరావంతుడి సైన్యాలమీద; పురికొని= క్రమ్ముకొని; తలపడి= ఎదిరించి; సమయన్+చేసెన్= చంపివేసింది; అదియున్= మాయచేపుట్టిన ఆ సేనకూడా; సమసెన్= నశించింది;

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్రా! ఆ అలంబుసుడు వేగంగా ఆ ఇరావంతుడున్న దిక్కుకు వెళ్ళాడు. తన మాయాబలంతో ఆ ఇరావంతుడి అశ్వసేన ఎంత ఉన్నదో అంత అశ్వసేనను తానూ పుట్టించాడు. మాయతో పుట్టిన ఆ అశ్వసేన ఇరావంతుడి అశ్వసైన్యాన్ని క్రమ్ముకొని, ఎదిరించి చంపివేసింది. తర్వాత ఆ మాయ గుర్రాల దండు కూడా నశించింది.

వ. అయ్యిరావంతుం డొక్కరుండును బొలివోని విక్రమంబున నలంబుసుని మార్కొని రయంబు మెఱయ మెఱుంగు మెఱసినట్లు గవిసి కరవాలంబున విల్లు దునిమిన దనుజుండు వినువీథి కెగసి మాయాశరంబుల నతని నొప్పించినం గోపించి గగనంబునకు లంఘించి. 102

ప్రతిపదార్థం: ఆ+ఇరావంతుండు= ఆ ఇరావంతుడు; ఒక్కరుండునున్= ఒంటరివాడైనప్పటికి; పొలిపోని= వ్యర్థముకాని; విక్రమంబునన్= పరాక్రమంతో; అలంబుసునిన్; మార్కొని= ఎదిరించి; రయంబు= వేగము; మెఱయన్= ప్రకాశింపగా; మెఱుంగు= మెరుపు; మెఱసిన+అట్లు= మెరిసిన విధంగా; కవిసి; కరవాలంబునన్= కత్తితో; విల్లున్= ధనుస్సును; తునిమినన్= తుంచివేయగా; దనుజుండు= రాక్షసుడు; వినువీథికి= ఆకాశమార్గానికి; ఎగసి= ఎగిరి; మాయాశరంబులన్= మాయచే పుట్టిన బాణాలతో; అతనిన్:= ఆ ఇరావంతుణ్ణి; నొప్పించినన్= నొప్పికలిగేటట్లు చేయగా; కోపించి; గగనంబునకున్= ఆకాశానికి; లంఘించి= ఎగిరి.

తాత్పర్యం: ఆ ఇరావంతుడు ఒంటరివాడై పరాక్రమంతో ఆ అలంబుసుడిని ఎదిరించాడు. వేగంగా మెరుపు మెరిసినట్లు ఆ రాక్షసుడిమీద పడ్డాడు. కత్తితో వాడి వింటిని తుంటులు చేశాడు. అప్పుడు అలంబుసుడు ఆకాశానికి ఎగిరిపోయి, మాయాబాణాలు అతడిపై గుప్పించి, నొప్పించాడు. ఇరావంతుడు కూడా కోపంతో ఆకాశానికి ఎగిరి.

క. ఘనఖడ్గంబున వానిం । దునుమ నలంబుసుఁడు దోడుతో నుజ్జ్వల యౌ
వనరూపము గ్రొత్తగఁ గై । కొని పెనఁగంబెనఁగఁ బార్థకొడు కచలుం డై. 103

ప్రతిపదార్థం: పార్థకొడుకు= అర్జునుడి కొడుకు ఇరావంతుడు; ఘనఖడ్గంబునన్= గొప్ప కత్తితో; వానిన్= ఆ అలంబుసుడిని; తునుమన్= నరికివేయగా; అలంబుసుఁడున్= రాక్షసుడు; తోడుతోన్= వెనువెంటనే; ఉజ్జ్వలయౌవన రూపమున్= ప్రకాశిస్తున్న యౌవనంతో కూడిన రూపాన్ని; క్రొత్తగన్= నూతనంగా; కైకొని= తీసికొని (గ్రహించి); పెనఁగన్= చుట్టుకొని యుద్ధంచేయగా; అచలుండు+ఐ= (ఇరావంతుడు) కదలికలేనివాడై; పెనఁగన్+పెనఁగన్= యుద్ధంచేయగా.

తాత్పర్యం: ఇరావంతుడు బలమైన కత్తితో అలంబుసుడిని నరికివేశాడు. వాడు వెంబడివెంబడిగానే ప్రకాశిస్తుండే యౌవనరూపాన్ని అప్పటికప్పుడు కొత్తగా పొంది, యుద్ధం చేశాడు. ఇరావంతుడుకూడా స్థిరంగా నిలబడి యుద్ధంచేస్తుండగా.

క. జననీవంశంబునఁగల । యనుపమమాయానుభావ మాత్మఁ దలఁచి శే
షునిచందంబగు రూపం । బునఁ బేర్చి యనేక నాగపుంజముతోడన్. 104

ప్రతిపదార్థం: జననీవంశంబునన్= తల్లియొక్కవంశంలో; కల= ఉన్నటువంటి; అనుపమ= సాటిలేని; మాయా= ఇంద్రజాలవిద్యలయొక్క; అనుభావము= ప్రభావాన్ని; ఆత్మన్= మనస్సులో; తలఁచి= తలచుకొని; అనేకనాగపుంజముతోడన్= అనేకములైన నాగులయొక్క సమూహముతోకూడా; శేషుని= ఆదిశేషునియొక్క; చందంబు+అగు= విధమైన; రూపంబునన్= ఆకారంతో; పేర్చి= అతిశయించి.

తాత్పర్యం: ఆ ఇరావంతుడు తనతల్లియొక్క నాగవంశంలో ఉండే సాటిలేని ఇంద్రజాల విద్యల ప్రభావాన్ని మనసులో తలచుకొన్నాడు. వెంటనే చాలా నాగుల సమూహంతో ఆదిశేషుడి మాదిరి రూపాన్ని ధరించి.

చ. అడరిన దానవుండు గరు డాకృతిఁ గైకొని మాయతోడ లోఁ
బడ భుజగంబులం బొదివి పట్టి రయంబున మ్రింగి యప్డు చే
డ్పడు నరుపట్టి కంఠముఁ గృ పాణమునం దెగవ్రేయ మేదినిం
బడి మొగ మొప్పెఁ బూర్ణశశి భాతి వికారము లేని చెన్మునన్. 105

ప్రతిపదార్థం: అడరినన్= (ఇరావంతుడు) విజృంభించగా; దానవుండు= అలంబుసుడు; గరుడ+ఆకృతిన్= గరుత్మంతునియొక్క ఆకారంవంటి ఆకారాన్ని; కైకొని= గ్రహించి; మాయతోడన్= ఇంద్రజాలంచేత; లోన్+పడన్= అధీనంకాగా; భుజగంబులన్= సర్పాలను; పొదివి= క్రమ్ముకొని; పట్టి= పట్టుకొని; రయంబునన్= వేగంగా; మ్రింగి= తిని; అప్డు= ఆ సమయంలో; చేడ్పడు= బాధపడుతున్న; నరుపట్టి కంఠము= ఇరావంతునియొక్క మెడను; కృపాణమునన్= కత్తితో; తెగన్+వ్రేయన్= నరికివేయగా; మేదినిన్= నేలమీద; పడి; వికారములేని= రూపముయొక్క మారుపాటులేనట్టి; చెన్మునన్= అందంతో; పూర్ణశశిభాతిన్= పున్నమినాటి చంద్రుడువలె; ఒప్పెన్= (అతడి ముఖం) ఒప్పింది.

తాత్పర్యం: ఆ ఇరావంతుడు నాగులగుంపుతో అలంబుసుడిమీదికి ఉరికాడు. అప్పుడు ఆ రాక్షసుడు గరుత్మంతుడి ఆకారం ధరించి, ఇంద్రజాలంతో వాటిని అధీనంలోనికి తెచ్చుకొని, పట్టుకొని, అన్ని పాములనూ తిన్నాడు. అప్పుడు ఇరావంతుడు కొంచెం ఇరుకున పడ్డాడు. ఆ సమయం కనిపెట్టి రాక్షసుడు ఇరావంతునిమెడ నరికివేశాడు. అతడి తల నేలపైబడింది. అయినా ఆ ఇరావంతుడి ముఖానికి చావు కళపట్టకుండా కళకళలాడుతూ పున్నమిచంద్రుడివలె ప్రకాశిస్తూనే ఉన్నది.

విశేషం: అలం: ఉపమ.

వ. అంత వియత్తలం బుదాత్తమిహిరమండలమండితమధ్యం బయ్యె నని చెప్పిన విని ధృతరాష్ట్రుం డయ్యిరావంతుండు వడినం బాండవులును వారి యోధవీరులును జేసిన తెఱంగు సెప్పు మనవుడు సంజయుఁ డతని కిట్లనియె. 106

ప్రతిపదార్థం: అంతన్= ఆ సమయంలో; వియత్+తలంబు= ఆకాశము; ఉదాత్త= గొప్పదైన; మిహిర= సూర్యునియొక్క; మండల= మండలంచేత; మండిత= అలంకరింపబడిన; మధ్యంబు+అయ్యెన్= మధ్యభాగం కలిగినదైనది; అని చెప్పినన్= అని చెప్పగా; ధృతరాష్ట్రుండు; ఆ+ఇరావంతుండు= ఆ అర్జునుడి కొడుకు; పడినన్= చావగా; పాండవులును= పాండురాజు కొడుకులున్నూ; వారి= ఆ పాండవ పక్షానికి చెందిన; యోధవీరులును= భటులు, శూరులు; చేసిన= నిర్వహించిన; తెఱంగు= విధానమును; చెప్పుము= తెలియ చెప్పుము; అనవుడున్= అనగా; సంజయుఁడు; అతనికిన్= ఆ ధృతరాష్ట్రుడికి; ఇట్లు అనియెన్.

తాత్పర్యం: 'ఆ ఇరావంతుడు చచ్చిన సమయంలో మిట్టమధ్యాహ్నమైంది' అని సంజయుడన్నాడు. ధృతరాష్ట్రుడు 'ఇరావంతుడు చచ్చిన పిదప ఆ పాండవులు, వారి భటులు వీరులు అంతా ఏమి చేశారో చెప్పు' అని అడిగాడు సంజయుడు ధృతరాష్ట్రుడితో ఇట్లా చెప్పాడు.

శా. తోడంబుట్టువుపాటు సూచి యలుకన్ దుర్వారశుం భద్గతిన్
హైడింబుండు, మహాసురేంద్రులు గజేం ద్రారూఢు లై సంగర
క్రీడాలోలతఁ దన్ను మీఱి విలయా గ్నింబోల దిక్చక్ర మ
ల్లాడన్ బెట్టుగ నార్చి చొచ్చెఁ గురు సై న్యంబున్ మహోగ్రంబుగన్. 107

ప్రతిపదార్థం: తోడన్+పుట్టువు= తోడపుట్టిన వాడైన ఇరావంతుడి యొక్క; పాటు= చావు; చూచి; అలుకన్= కోపంతో దుర్వార శుంభత్+గతిన్= అడ్డగించలేని చాకచక్యంతో కూడిన పోకడతో; హైడింబుండు= హిడింబ కొడుకైన ఘటోత్కచుడు; గజ+ఇంద్ర+ఆరూఢులు+ఐ= గొప్ప ఏనుగులను ఎక్కినవారై; మహా+అసుర+ఇంద్రులు= గొప్ప రాక్షస శ్రేష్ఠులూ; సంగర క్రీడాలోలతన్= యుద్ధమనే ఆటలోని ఆసక్తిచేత; తన్నున్+మీఱి= ఆ ఘటోత్కచుడిని కూడా అతిక్రమించి; దిక్+చక్రము= దిక్కులయొక్క మధ్యభాగము; అల్లాడన్= కదలిపోవునట్లుగా; బెట్టుగన్= (వారి అండతో) బిగ్గరగా; ఆర్చి= బొబ్బలుపెట్టి; విలయ+అగ్ని+పోలన్= ప్రళయాగ్నిని పోలి; మహా+ఉగ్రంబుగన్= చాలా భయంకరంగా; కురుసైన్యంబున్= కౌరవుల సైన్యంలోకి; చొచ్చెన్= ప్రవేశించాడు.

తాత్పర్యం: సోదరుడు మరణించటం చూచి ఘటోత్కచుడు కోపించి అనివార్యమైన వేగంతో ముందుకు వచ్చాడు. అతడి అనుయాయులైన రక్కసులు ఏనుగుల నెక్కి యుద్ధ క్రీడోత్సాహంతో అతడిని తలకడచి ప్రళయాగ్నివలె భాసించాడు. దిక్కులల్లాడగా పెడబొబ్బలు పెట్టుతూ కురుసైన్యంలోకి ఘటోత్కచుడు చొరబడ్డాడు.

చ. కరమున నున్న శూలమునఁ గ్రమ్ముమెఱుంగులు శత్రు సైన్య భీ
కరములుగా గజాశ్వభట కాయములన్ గుదిగ్రుచ్చినట్లుగాఁ
జెరువుచు వచ్చువానిఁ గురు సింహుఁడు సూచి మదాంధసింధురో
త్కరరభసాతిభీషణముగాఁ గవిసెం బటువిక్రమోద్ధతిన్. 108

ప్రతిపదార్థం: కురుసింహుఁడు= దుర్యోధనుడు; కరమునన్= చేతియందు; ఉన్న= పట్టుకొని ఉన్నట్టి; శూలమునన్; క్రమ్ము= పైకి ఉబుకుచున్న; మెఱుంగులు= కాంతులు (తళతళలు); శత్రుసైన్య భీకరములు+కాన్= విరోధుల సైనికులకు భయంకలిగించేవికాగా;

గజ= ఏనుగుల యొక్కయు; అశ్వ= గుర్రాల యొక్కయు; భట= భటులయొక్కయు; కాయములన్= దేహాలను; గుదిగ్రుచ్చిన+అట్లుగాన్= వరుసగా పూలుగ్రుచ్చిన దండవలె; చెరువుచున్= (శూలానికి) గ్రుచ్చుకొంటూ; వచ్చువానిన్= వస్తున్న ఘటోత్కచుణ్ణి; చూచి= తిలకించి; మద= మదంచేత; అంధ= గుడ్డిదైన; సింధుర= ఏనుగుల యొక్క; ఉత్కర= సమూహముయొక్క; రభస= వేగంవంటి వేగంతో; అతిభీషణముగాన్= చాలా భయంకరంగా; పటువిక్రమ+ఉద్ధతిన్= నేర్పుగల పరాక్రమంవల్ల కలిగిన గర్వంతో; కవిసెన్= ఎదుర్కొన్నాడు.

తాత్పర్యం: ఘటోత్కచుడు చేత శూలంపట్టుకొని యుద్ధంలోకి ఉరికాడు. ఆ శూలము నుండి పైకి వచ్చిన తళతళకాంతులు శత్రుసైనికులకు చాలా భయం కలిగించాయి. ఆ ఘటోత్కచుడు తన శూలానికి ఏనుగుల, గుర్రాల, భటుల దేహాలను వరుసగా ఒకదారంలోనికి రకరకాల పూలను గ్రుచ్చినట్లుగా గ్రుచ్చుకొంటూ వచ్చాడు. దుర్యోధనుడు ఈ రాక్షసుణ్ణి చూశాడు. మదం పట్టడంవల్ల ముందు వెనుకలు తెలియని ఏనుగుల గుంపువలె మిక్కిలి వేగంతో నేర్పుగల పరాక్రమంచేత చాలా ఉద్ధతితో దుర్యోధనుడు వాని నెదుర్కొన్నాడు.

క. వంగాధిపతియు శౌర్యో । త్తుంగతనుండగుచు నీసుతుం డలరఁగ దై
త్యుం గదిసె గాఢమద మా । తంగ ఘటలతోడ నపుడు దారుణభంగిన్. 109

ప్రతిపదార్థం: నీ సుతుండు= నీ కొడుకు దుర్యోధనుడు; అలరఁగన్= సంతోషపడగా; అపుడు= ఆ సమయంలో; వంగ+అధిపతియున్= వంగదేశపురాజు; శౌర్య+ఉత్తుంగ తనుండు= పరాక్రమంచేత పొడుగుసాగిన శరీరంగలవాడు; అగుచున్= అయి; గాఢ= దట్టమైన; మద= మదంకలిగినట్టి; మాతంగ= ఏనుగులయొక్క; ఘటలతోడన్= గుంపులతో; దారుణభంగిన్= భయంకరమైన విధంగా; దైత్యున్= ఘటోత్కచుడిని; కదిసెన్= సమీపించాడు - ఎదురుకొన్నాడు.

తాత్పర్యం: నీ కొడుకు సంతోషపడుతూండగా వంగదేశరాజు శౌర్యంచేత ఒళ్ళుపెంచుకొని, బాగా మదించినట్టి ఏనుగుల గుంపుల సహాయంతో, శత్రువులకు చాల భయం కలిగే విధంగా- ఆ రాక్షసుడైన ఘటోత్కచుడి సమీపానికి చేరాడు.

వ. ఇట్లు దన్ను బెట్టు గిట్టిన కరినికరంబులం గని పొంగి కరవాలంబు గొని యడరి ఘటోత్కచుండు. 110

ప్రతిపదార్థం: ఘటోత్కచుండు= రాక్షసుడైన ఘటోత్కచుడు; ఇట్లు= ఈ విధంగా; తన్నున్= తనను (ఘటోత్కచుడిని); బెట్టు= అధికంగా; కిట్టిన= సమీపించిన; కరినికరంబులన్= ఏనుగుల గుంపులను; కని; పొంగి= గర్వపడి; కరవాలంబున్= కత్తిని; కొని; అడరి= విజృంభించి.

తాత్పర్యం: ఆ ఘటోత్కచుడు తనను సమీపించిన ఏనుగుల గుంపును చూశాడు. గర్వంతో కత్తి చేతపట్టుకొని, చెలరేగి వాటిపైకి దూకి. (తరువాతి పద్యంతో అన్వయం)

విశేషం: ఘట+ఉత్+కచుడు- ఘటోత్కచుడు (కుండమాదిరిగా పైకి లేచిన వెండ్రుకలు కలవాడు) భీముడి వలన హిడింబ అనే రాక్షసి గర్భంలో జనించినవాడు.

క. కరదంతకర్ణమస్తక । చరణములవి తోఁపకుండుచందముగా ని
ష్ఠురవిక్రమకేళీ వి । స్ఫురణంబున రూపుమాపె సురలు నుతింపన్. 111

ప్రతిపదార్థం: సురలు= దేవతలు; నుతింపన్= కీర్తింపగా; కర= తొండాలు; దంత= దంతాలు; కర్ణ= చెవులు; మస్తక= తలలు; చరణములు= కాళ్ళు; అవి; తోపకుండు చందముగాన్= తెలియకుండా ఉన్న విధంగా; నిష్ఠుర= కఠినమైన; విక్రమ= పరాక్రమమనెడు; కేళీ= ఆటయొక్క; విస్ఫురణంబునన్= స్ఫూర్తితో; రూపుమాపెన్= చంపాడు.

తాత్పర్యం: ఆ ఘటోత్కచుడు కఠోరమైన పరాక్రమంతో అవలీలగా ఆ ఏనుగుల తొండాలు, దంతాలు, చెవులు, తలలు, కాళ్ళు వాటి రూపం తెలియకుండా పోయే విధంగా తునాతునకలుచేశాడు. దేవతలు కూడా ఇతని శౌర్యాన్ని ఎంతో మెచ్చుకొన్నారు.

వ. ఇవ్విధంబున గజంబులు వొలిసిన గజపురనాథుండు రోషంబున నురవడించి నారాచవృష్టి ముంచి వేగవంతుండును, విద్యుజ్జిహ్వుండును, బహ్వాశియు, ననుదనుజప్రధాననాయకులం బ్రేతపతిపురంబున కనిచి యా భీమసేన తనయుతనువుననిశాతశరములు నించినం గోదండపాణియై క్రోధాగ్నిజ్వాలలు నిగుడువడువునఁ బటుబాణజ్వాలలు నిగిడించి కదిసి కురుపతి నవలోకించి యా ఘటోత్కచుం డిట్లనియె. 112

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ పైన చెప్పిన రీతిగా; గజంబులు= ఏనుగులు; పొలిసినన్= చావగా; గజపురనాథుండు= హస్తినాపురమునకు రాజైన దుర్యోధనుడు; రోషంబునన్= కోపంతో; ఉరవడించి= వేగిరపడి; నారాచవృష్టిన్= బాణాలవానలో; ముంచి= ముంచివేసి; వేగవంతుండు, విద్యుజ్జిహ్వుండు, బహ్వాశియున్; అను= అనునట్టి; దనుజ ప్రధాన నాయకులన్= రాక్షసులలో ముఖ్యులైన నాయకులను; ప్రేతపతి పురంబునకున్= యమధర్మరాజు నగరానికి; అనిచి= పంపి; ఆ భీమసేనతనయు తనువునన్= ఆ భీముడి కొడుకైన ఘటోత్కచు శరీరంలో; నిశాతశరంబులున్= పదునుగల బాణాలను, నించినన్= నిండచేయగా; అతండు= ఆ ఘటోత్కచుడు; కోదండపాణి+ఐ= విల్లుచేతగలవాడై; క్రోధ+అగ్నిజ్వాలలు= కోపమనే అగ్గియొక్క సెగలు; నిగుడువడువునన్= వ్యాపించే విధంగా; పటు బాణజ్వాలలు= శక్తిగల బాణాల సెగలు; నిగిడించి= వ్యాపించేటట్లుచేసి; కదిసి= దగ్గరకు వచ్చి; కురుపతిన్= దుర్యోధనుడిని; అవలోకించి= చూచి.

తాత్పర్యం: ఈ విధంగా ఘటోత్కచుడు కౌరవసేనలోని ఏనుగులనన్నింటినీ తునుకలు చేశాడు. దీనిని చూచి దుర్యోధనుడు త్వరత్వరగా బాణాలవర్షంలో ముంచి కోపించి, అంతటితో ఊరుకోక వేగవంతుడు, విద్యుజ్జిహ్వుడు, బహ్వాశి అనే ముగ్గురు ప్రముఖులైన రాక్షసులను చంపాడు. ఘటోత్కచుడి శరీరాన్నంతా బాణాలతో నింపేశాడు. అప్పు డా రాక్షసుడు విల్లుచేతపట్టుకొని కోపమనే అగ్నిజ్వాలలు వ్యాపించునట్లు బాణాల కాంతులు ప్రసరింపజేస్తూ దుర్యోధనుడి వద్దకువచ్చి, ఆతడిని చూచి ఇట్లా అన్నాడు.

ఉ. ‘ పాడియు సత్యముం గలుగు పాండుతనూజుల కీవు దొల్లి యె
ప్పాడిమెయిన్ సభం గరము భంగ మొనర్చితి నాఁటియందఱుం
జూడఁగ నేఁడు తత్ఫలము సూపెద నీ కని మూదలించి మై
నాడఁగ నేసెఁ గృష్ణభుజ గావలిఁ బోలిన నారసంబులన్. 113

ప్రతిపదార్థం: ఈవు= దుర్యోధనుడవైన నీవు; తొల్లి= మునుపు (సభలో); పాడియున్= ధర్మము; సత్యమున్= నిజము చెప్పుటయు; కలుగు; పాండుతనూజులకున్= పాండవులకు; సభన్= కౌరవసభలో; ఏ+పాడిమెయిన్= ఏ మాత్రం న్యాయంతో; కరమున్= మిక్కిలి; భంగము= అవమానము; ఒనర్చితి(వి)= చేశావో; నాఁటి= ఆనాడు సభలోనున్నట్టి; అందఱున్; చూడఁగన్= చూస్తుండగా; నేఁడు= ఈదినం; నీకున్= నీకు; తద్+ఫలమున్= దానియొక్క ఫలాన్ని; చూపెదన్= చూపిస్తాను; అని= అంటూ; మూదలించి= హెచ్చరించి; కృష్ణభుజగ+ఆవలిన్= నల్ల త్రాచులవరుసను; పోలిన= సరిపోలిన; నారసంబులన్= బాణాలను; మైన్= దేహంలో; ఆడఁగన్+ఏసెన్= నాటుకొనేటట్లు వేశాడు.

తాత్పర్యం: ‘ఓ దుర్యోధనా! న్యాయం సత్యం కలిగినట్టి పాండవులకు నీవు అనాడు సభలో ఏ న్యాయంతో ఎంతగా అవమానం కలిగించావో, ఆనాడు సభలో ఉండినవారంతా ఈనాడు ఇక్కడ చూస్తూ ఉండగా దానిఫలాన్ని నీకు

చూపిస్తాను' అని హెచ్చరిస్తూ నల్లత్రాచుపాముల వరుసతో సమానాలైన బాణాలతో ఆ దుర్యోధనుడి శరీరాన్నంతా నింపివేశాడు.

క. 'దానికిఁ జల మెడలక నీ । సూనుం డా పవనసూనుసూనునిమేనం
దా నుగ్రశరము లిరువది । యేను వెసం గీలుకొలిపె నిభపురనాథా! 114

ప్రతిపదార్థం: ఇభపురనాథా!= హస్తినాపురానికి రాజైన ధృతరాష్ట్రా!; నీ సూనుండు= నీ కొడుకు దుర్యోధనుడు; దానికిన్= ఆ ఘటోత్కచుడు వేసిన బాణాలకు; చలము= మత్సరము; ఎడలక= వదలిపెట్టకుండా; ఆ పవనసూను సూనునిమేనన్= ఆ భీముడి కొడుకైన ఘటోత్కచుడి శరీరంమీద; తాన్= తాను (దుర్యోధనుడు); ఇరువది+ఏను= ఇరవై అయిదు; ఉగ్రశరములు= భయంకలిగించే బాణాలు; వెసన్= వేగంతో; కీలుకొలుపెన్= నాటినాడు.

తాత్పర్యం: 'ఓ ధృతరాష్ట్ర మహారాజా! నీ కొడుకు దుర్యోధనుడు- ఆ ఘటోత్కచుడు వేసిన కరుకైన బాణాలకు జంకిపోకుండా, మాత్సర్యాన్ని వదలకుండా, అతడి దేహంలో నాటుకొనేటట్లుగా ఇరవై అయిదు బాణాలు వెంటనే ప్రయోగించాడు.

తే. అసుర కినిసి కృతాంతజిహ్వాయునుబోని । శక్తి యెత్తిన న మ్మహీశ్వరున కపుడు
వంగపతి యడ్డపడుటయు వానిగజముఁ । గూల వైచిన నాతండు నేల కుఱికె. 115

ప్రతిపదార్థం: అసుర= రాక్షసుడు- ఘటోత్కచుడు; కినిసి= అలిగి; కృతాంతజిహ్వాయునున్ పోని= యమధర్మరాజు నాలుకను పోలిన; శక్తి= శక్తి అనే ఆయుధాన్ని; ఎత్తినన్= ఎత్తుకోగా; అపుడు; ఆ+మహీశ్వరునకున్= ఆ దుర్యోధనుడికి; వంగపతి= వంగదేశపురాజు; అడ్డుపడుటయున్= అడ్డం తగలగా; వానిగజమున్= ఆ వంగదేశపురాజు ఏనుగును; కూలవైచినన్= పడిపోయేట్టుకొట్టగా; ఆతండు= ఆ వంగదేశరాజు; నేలకున్= భూమిమీదికి; ఉఱికెన్= దూకాడు.

తాత్పర్యం: ఘటోత్కచుడు మహాకోపంతో దుర్యోధనుడిమీద పడవేయటానికి యముడి నాలుకమాదిరి భయంకరమైన శక్త్యాయుధాన్ని ఎత్తాడు. ఇంతలో దుర్యోధనుడికి అడ్డంగా వంగదేశరాజు రాగా, అతడి ఏనుగును రాక్షసుడు దానితో కూల్చాడు. వంగదేశరాజు నేలకు దూకాడు.

విశేషం: అలం: ఉపమ.

క. ఏనుంగు వడిన నచ్చటి । సేనలు దెరలుటయు రాజసింహుఁడు దన్నుం
దాన పురికొల్పికొని వెఱ । పూనక దానవునియెదుర నొక్కడ నిలిచెన్. 116

ప్రతిపదార్థం: ఏనుంగు= ఏనుగు; పడినన్= పడిపోగా; అచ్చటిసేనలు= అక్కడపుండే సైన్యాలు; తెరలుటయున్= తొలగిపోగా; రాజసింహుఁడున్= రాజుల్లో గొప్పవాడు దుర్యోధనుడు; తన్నున్= తనను; తాను+అ= తానే; పురికొల్పికొని= ప్రోత్సాహపరచికొని; వెఱపున్= భయాన్ని; ఊనక= పొందక; దానవుని= ఘటోత్కచుడియొక్క; ఎదురన్= సమక్షంలో; ఒక్కఁడు+అ= ఒంటరివాడుగానే; నిలిచెన్= నిలబడ్డాడు.

తాత్పర్యం: వంగపతి ఏనుగు నేలకూలటంతో కౌరవసేనలు భయంతో పెద్దపెట్టున అరిచాయి. దుర్యోధనుడు తన్నుతానే ప్రోత్సాహపరచికొన్నాడు. (అక్కడ వేరేవీరులు) ప్రోత్సాహపరచే వారులేరన్నమాట- అతడు భయంలేకుండా తాను ఒక్కడే వాడియెదుట నిల్చి ఎదుర్కొన్నాడు.

క. నిలిచి మహాస్త్రం బెఱ మం । టలు గ్రమ్మఁగఁ బెలుచ నేయుటయు నడుమన చె
క్కలు గాఁగ నేసి దిక్కులు । నలిగులిగా నతఁడు సింహనాదము సేసెన్. 117

ప్రతిపదార్థం: నిలిచి= నిలబడి; ఎఱమంటలు= ఎర్రటి జ్వాలలు; క్రమ్మఁగన్= వ్యాపించగా; పెలుచన్= కోపంతో; మహా+అస్త్రంబు= గొప్ప ఆయుధాన్ని; ఏయుటయున్= ప్రయోగించగా; అతఁడు= ఆ ఘటోత్కచుడు; నడుమన= మధ్యలోనే; చెక్కలు+కాఁగన్= చెక్కలయ్యేటట్లుగా; ఏసి= కొట్టి; దిక్కులు= అన్ని దిక్కులు; నలిగులిగాన్= పిక్కటిల్లేట్టుగా; సింహనాదము= సింహగర్జనాన్ని; చేసెన్= చేసినాడు.

తాత్పర్యం: దుర్యోధనుడు ఘటోత్కచుడికి ఎదురుగా నిలబడి, ఎర్రటి జ్వాలలు అంతటా వ్యాపించే ఒక గొప్ప ఆయుధాన్ని మహాకోపంతో వాడిమీదకు విసిరాడు. వాడు ఆ ఆయుధాన్ని మధ్యలోనే ముక్కలుచెక్కలుచేసి, దిక్కులు పిక్కటిల్లేటట్లుగా సింహంవలె గర్జించాడు.

వ. ఇట్లు సేసిన విని గాంగేయుండు గురుపక్షయోధవీరులం గలయం గనుంగొని. 118

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; సేసినన్= సింహనాదం చేయగా; గాంగేయుండు= గంగాపుత్రుడైన భీష్ముడు; కురుపక్షయోధవీరులన్= కౌరవుల పక్షంలో ఉండేభటులను, శూరులను; కలయన్= అంతటను; కనుంగొని.

తాత్పర్యం: భీష్ముడు ఘటోత్కచుడు చేసిన సింహనాదాన్ని విని, కౌరవపక్షంలోని భటులను, శూరులను తేరిపారచూచి (ఇట్లా అన్నాడు).

క. ' భీముని తనయుం డత్యు । ద్దామగతిన్ రాజుఁ దొడరి తత్కరటిఘటా
స్తోమంబు గూల్చి యాతని । పై మారిమసంగినట్లు బలువిడిఁ గవిసెన్. 119

ప్రతిపదార్థం: భీముని తనయుండు= భీమునియొక్క కొడుకు- ఘటోత్కచుడు; అతి+ఉద్దామగతిన్= హద్దులేని విధంగా; రాజున్= దుర్యోధనుడిని; తొడరి= వెంబడించి; తద్+కరటి ఘటాస్తోమంబున్= ఆ దుర్యోధనుడియొక్క గున్నఏనుగుల గుంపును;కూల్చి= చంపి; ఆతనిపైన్= ఆ దుర్యోధనుడి మీదికి; మారిమసంగినట్లు= మరణదేవత విజృంభించినట్లుగా; బలువిడిన్= అధికంగా; కవిసెన్= ఎదుర్కొన్నాడు.

తాత్పర్యం: 'ఘటోత్కచుడు చాలా ఉద్ధతుడై, దుర్యోధనుడిని ఎదుర్కొని అతడి ఏనుగుగున్నల గుంపును చంపి, మహామారి మాదిరి రాజుపైకి ఎగబడ్డాడు

వ. 'ఆ ఘటోత్కచుండు దివిజులకు దుర్జయుండు' మీరు వేవేగ రారాజుం గూడికొనుం డనిన, సేనాపతి పలుకులకు గురుకృపాశ్వత్థామచిత్రసేనులు, బృహద్బల బాహ్లికావంతీనాథభూరిశ్రవసులును, సైంధవసోమదత్త వివింశతివికర్ణులు నేకోద్యోగంబునం దమతమ యనుచరు లైన యోధవీర సహస్రంబులతో రథంబులు దోలికొని చని భవత్తనయుం బరివేష్టించి హిడింబాతనయుం దాకిన నతండును దైతేయ బలంబులంగొని బలిమి మెఱసి నిలిచి మార్కొనియె, నారెండు సైన్యంబులు నొండొంటి కెదిర్చి పేర్చి పెనంగుచుండ నా భీమసేన నందనుం డాచార్య ప్రభృతులగు నా పన్నిద్దఱపై బహుప్రకార క్రూరబాణంబులు వరఁగింప నందు. 120

ప్రతిపదార్థం: ఆ ఘటోత్కచుండు; దివిజులకున్= దేవతలకు కూడా; అజయ్యుండు= జయింపరానివాడు; మీరు; వేవేగన్= మిక్కిలి వేగంగా; రారాజున్= దుర్యోధనుడిని; కూడికొనుండు= చేరుకొనండి; అనినన్= అని చెప్పిన; సేనాపతిపలుకులకున్=

సేనాధిపతియైన భీష్ముడి మాటలకు; గురు కృప+అశ్వత్థామ, చిత్రసేనులు; బృహద్బల బాహ్లిక; అవంతీనాథ; భూరిశ్రవసులును, సైంధవ; సోమదత్త; వివింశతి; వికర్ణులు; ఏక+ఉద్యోగంబునన్= ఒకేవిధమైన ప్రయత్నంతో; తమ తమ= వారి వారికి; అనుచరులు+ఐన= సహాయపడేవారైన; యోధవీర సహస్రంబులతోన్= వేలకొలది భటులయొక్క; వీరులయొక్క; రథంబులు= రథాలను; తోలికొని; చని= వెళ్లి; భవత్+తనయున్= నీ కుమారుడు దుర్యోధనుణ్ణి; పరివేష్టించి= చుట్టుకొని; హిడింబా తనయున్= హిడింబ కొడుకు ఘటోత్కచుణ్ణి; తాఁకినన్= ఎదుర్కొనగా; అతండును= ఆ ఘటోత్కచుడున్నూ; దైతేయబలంబులన్= రాక్షస బలగాన్ని; కొని= తీసుకొని; బలిమిన్= దేహబలంతో; మెఱసి= ప్రకాశించి; నిలిచి= నిలబడి; మార్కొనియెన్= ఎదిరించాడు; ఆ రెండు సైన్యంబులున్= ఆ రెండు సేనలున్నూ; ఒండొంటికిన్= ఒకదానినొకటి; ఎదిర్చి= ఎదిరించి; పేర్చి= అతిశయించి; పెనంగుచుండన్= యుద్ధంచేస్తుండగా; ఆ భీమసేననందనుండు= ఆ భీముడి కొడుకు; ఆచార్య ప్రభృతులు+అగు= ద్రోణాచార్యుడు మున్నుగాగల; ఆ పన్నిద్దఱపైన్= ఆ పన్నెండుమందిమీద; బహు ప్రకార= నానా విధాలైన; క్రూర= కఠోరాలైన; బాణంబులు= బాణాలను; పరఁగింపన్= ప్రయోగింపగా; అందున్= ఆ యుద్ధంలో.

తాత్పర్యం: 'ఘటోత్కచుడు దేవతలకుకూడా జయింపరానివాడు, మీరందరూ అతిత్వరగా వెళ్ళి, దుర్యోధనుడికి సాయపడండి' అని సేనాపతి భీష్ముడన్నాడు. ఆ మాటలు విని ద్రోణాచార్యుడు, కృపాచార్యుడు, అశ్వత్థామ, చిత్రసేనుడు, బృహద్బలుడు, బాహ్లికుడు, అవంతీనాథుడు, భూరిశ్రవసుడు, సైంధవుడు, సోమదత్తుడు, వివింశతి, వికర్ణుడు- వీరందరూ ఒకే ఎత్తున తమకు సహాయులైన అనేక వీరులతో, భటులతో, రథాలు కదిలించికొనిపోయి , దుర్యోధనుడిని గుండ్రంగా చుట్టుకొని, ఆ రాక్షసుడిని ఎదిరించారు. వాడు కూడా తన రాక్షసబలాన్ని వెంట వేసికొని బలంతో దేదీప్యమానుడై ఎదురొడ్డి నిలిచి యుద్ధంచేశాడు. అప్పు డారెండు సైన్యాలు ఒకదాన్నిమించి మరొకటి పోటీపడి ఎదిరిస్తూ విజృంభించుతూ యుద్ధం చేస్తూ ఉండగా, ఆ ఘటోత్కచుడు ద్రోణుడు ప్రధానుడుగా ఉండే ఆ పన్నెండుమంది వీరులపైన పలురకాల క్రూరములైన బాణాలను ప్రయోగించాడు. ఆ యుద్ధంలో.

విశేషం: సేనాపతి-భీష్ముడు- సేనాపతి లక్షణాలు-

శ్లో॥ కులీనః శీలసంపన్నో ధనుర్వేద విశారదః।
హస్తి శిక్షాశ్వశిక్షాసు కుశలః శ్లక్ష్ణ భాషణః॥
నిమిత్తే శకునజ్ఞానే, వేత్తాచైవ చికిత్సితే।
కృతజ్ఞః కర్మణాం శూరః తథాక్లేశ సహోఋజుః॥
వ్యూహతత్త్వ విధానజ్ఞః ఫల్గుసారవిశేషవిత్।
రాజ్ఞాసేనాపతిః కార్యోబ్రాహ్మణః క్షత్రియోథవా॥ మాత్స్యే రాజ ధర్మే.

శ్లో॥ గౌతమాన్మధునం జజ్ఞే శరస్తంబాచ్ఛరద్వతః।
అశ్వత్థామ్నశ్చ జననీ కృపశ్చైవ మహాబలః"॥ (మహాభారతం)

కృపుడు గౌతమవంశానికి చెందిన శరద్వంతుడి కొడుకు. శంతనునిచే కృపతో కాపాడబడ్డాడు కాబట్టి కృపాచార్యుడనే పేరు వచ్చింది. ఇతడు జీవితపర్యంతం బ్రహ్మచారిగా ఉండిపోయాడు. కురుబాలకులకు ఆచార్యుడుగా భీష్మాదులచేత నియోగింపబడ్డాడు. పాండవులను బాగా ఎదుర్కొన్నాడు. కాని అమరత్వం కలిగిన, కారణంచేత యుద్ధంలో ఇతడు చనిపోలేదు.

అశ్వత్థామ= ద్రోణుడి కొడుకు. చిరంజీవి- మహారథుడు. ఇతడు పుట్టగానే గుఱ్ఱం మాదిరి శబ్దించాడు. కనుకనే అశ్వత్థామ అనే పేరు వచ్చింది.

శ్లో. అలభత్ గౌతమీ పుత్రం అశ్వత్థామానమేవచ ।
స జాతమాత్రో వ్యనదత్, యథైవోచ్చైఃశ్రవాహయః॥
"తత్ శ్రుత్వాంతర్హితంభూతం అంతరిక్షస్థ మబ్రవీత్।
అశ్వస్యేవాస్యయత్ స్థామ నదతః ప్రదిశో గతమ్॥
అశ్వత్థామైవబాలోzయం, తస్మాన్నామ్నా భవిష్యతి॥ (భారతం)

చిత్రసేనుడు= ధృతరాష్ట్రుడి కొడుకు- అతడి కొడుకులలో నలుగురు- దుర్యోధనుడు, దుశ్శాసనుడు, వికర్ణుడు, చిత్రసేనుడు ప్రధానులైనవారు.

ఘటోత్కచుండు ద్రోణాచార్యప్రభృతులతో యుద్ధంబు సేయుట (సం. 6-88-25)

క. కొందఱసూతులు వొలిసిరి । కొందఱిచాపములు దునిసెఁ గొందఱ చటుల
స్యందనహయాలి వడియెను । గొందఱ యంగములు వ్రస్సెఁ గురుకులముఖ్యా! 121

ప్రతిపదార్థం: కురుకులముఖ్యా!= కురు వంశంలో ప్రధానుడవైన ఓ ధృతరాష్ట్ర మహారాజా!; కొందఱ సూతులు= కొంతమంది రథికుల సారథులు; పొలిసిరి= చచ్చారు; కొందఱ చాపములు= కొంతమంది విలుకాండ్ర ధనుస్సులు; తునిసెన్= విరిగిపోయాయి; కొందఱ= మరికొందరియొక్క; చటుల+స్యందన+హయ+ఆలి= చంచలమైన రథాలు, గుర్రాలు- వీటియొక్క వరుస; పడియెన్= కింద పడిపోయాయి; కొందఱ అంగములు= ఇంకా కొందరి శరీరాలు; వ్రస్సెన్= బద్దలయ్యాయి.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! ఆ ఘటోత్కచుడు ద్రోణుడాదిగాగల పన్నెండుగురితో యుద్ధం చేసేటప్పుడు, కొందరి సారథులు చచ్చారు. మరికొందరి ధనుస్సులు విరిగిపోయాయి. ఇంకా కొందరి రథాలు, గుర్రాలు కూలిపోయాయి. కొందరి శరీరాలే బద్దలైపోయాయి.

వ. ఇ ట్లతిరథమహారథులం జిక్కువఱిచినరక్కసున కలిగి రయంబున సాధనంబులు నమకట్టికొని రభసంబున నాకుంభసంభవాది ద్వాదశ రథికవరులు నొక్కపెట్ట చుట్టుముట్టి మహాస్త్రజ్వాలా జాలంబులం బొదివిన. 122

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; అతిరథమహారథులన్= అతిరథులను, మహారథులను; చిక్కు+పఱిచిన= తంటాలుపెట్టిన; రక్కసునకున్= రాక్షసుడికి; ఆ కుంభసంభవ+ఆది ద్వాదశరథికవరులున్= ద్రోణుడు మొదలుగాగల పన్నెండుమంది రథిక శ్రేష్ఠులు; అలిగి= కోపగించి; రయంబునన్= తొందరగా; సాధనంబులున్= పనిముట్లను; సమకట్టికొని= సమకూర్చుకొని; రభసంబునన్= వేగంతో; ఒక్కపెట్ట= ఒకేసారిగా; చుట్టుముట్టి; మహా+అస్త్రజ్వాలాజాలంబులన్= గొప్పవగు ఆయుధాలనే మంటల సమూహంతో; పొదివినన్= కవియగా.

తాత్పర్యం: ఘటోత్కచుడు కౌరవసైన్యాన్ని చీల్చి చెండాడుతూ, అతిరథమహారథులను కూడా చిక్కుపరిచాడు. అప్పుడు ద్రోణుడు మొదలుగాగల పన్నెండుగురు చాలా కోపపడి, వెంటనే యుద్ధసామగ్రినంతా బాగా సమకూర్చికొని ఒక్కుమ్మడిగా అతడి చుట్టూచేరి, గొప్ప అస్త్రాలనే అగ్నిజ్వాలలను అతడిపై కురిపించుతూ ఎదిరించారు.

విశేషం: మహారథుడు- "ఆత్మానం, సారథించాశ్వాన్ రక్షన్ యుధ్యేత యో నరః। సమహారథ సంజ్ఞః స్యాత్"

ఆ. ఓర్వరాక దానవోత్తముఁ డంబర । వీథి కెగసి పోయి విపులరవము
సెలఁగఁ బెలుచ నడరి జీమూత భంగి దు । ర్దాంతుఁడైనఁ జూచి ధర్మసుతుఁడు. 123

ప్రతిపదార్థం: దానవ+ఉత్తముఁడు= రాక్షసుల్లో శ్రేష్ఠుడు ఘటోత్కచుడు; ఓర్వరాక= తట్టుకోలేక; అంబరవీథికిన్= ఆకాశమార్గానికి; ఎగసిపోయి= ఎగిరిపోయి; విపులరవము= అధికమైనశబ్దము; చెలఁగన్= మ్రోయగా; పెలుచన్= ఆగ్రహంతో; జీమూతభంగిన్= మేఘంమాదిరి; అడరి= వ్యాపించి; దుర్+దాంతుఁడు+ఐనన్= అడచరానివాడు కాగా; ధర్మసుతుఁడు= ధర్మరాజు; చూచి.

తాత్పర్యం: ద్రోణాది మహావీరులు ప్రయోగించిన బాణాల దెబ్బకు తట్టుకోలేక ఘటోత్కచుడు ఆకాశంలోకి ఎగిరాడు. చాల కఠోరంగా పెనుబొబ్బలు పెట్టుతూ, మేఘంమాదిరి ఆకాశాన్ని ఆవరించి అణచరానివా డయ్యాడు. అప్పుడు ధర్మరాజు చూచి (భీముడితో ఇట్లా అంటున్నాడు).

వ. భీమసేనుతో నిట్లనియె నిక్కడ భీష్మబారిం బడిన పాంచాల బలంబులఁ బరిపాలింపను, నక్కడ నాచార్యాదుల కగపడ్డ ఘటోత్కచుం గావను వలసియున్నయది యివ్వలనికిం గవ్వడి గలం డవ్వలనికి వేగంబ యరుగు మనిన సింహనాదంబు సేయుచు. 124

ప్రతిపదార్థం: భీమసేనుతోన్= భీముడితో; ఇట్లు; అనియెన్= అన్నాడు; ఈ+కడన్= ఈ చోటున; భీష్మబారిన్= భీష్ముడి నిర్బంధంలో; పడిన= కంటబడిన పాంచాలబలంబులన్= పాంచాలరాజు సేనలను;పరిపాలింపనున్= కాపాడడానికి; ఆ+కడన్= ఆచోట; ఆచార్య+ఆదులకున్= ద్రోణుడు మొదలైన వారికి; అగపడ్డ= కనుపించిన; ఘటోత్కచున్; కావను= రక్షించును; వలసియున్నది= అవసరమైయున్నది; ఈ+వలనికిన్= ఈ వైపునకు; కవ్వడి= అర్జునుడు; కలండు= ఉన్నాడు; ఆ+వలనికిన్= ఆ పక్కకు; వేగంబు+అ= తొందరగా; అరుగుము= వెళ్లుము; అనినన్= అని చెప్పగానే; సింహనాదంబున్= సింహగర్జన; చేయుచున్.

తాత్పర్యం: ధర్మరాజు భీముడితో ఇట్లా అన్నాడు 'ఇక్కడ భీష్ముడి బారినపడ్డ పాంచాల బలాన్ని కాపాడుకొనాలి. అక్కడ ద్రోణుడు ముఖ్యుడుగా ఉండే వారినుండి ఘటోత్కచుడిని రక్షించుకొనాలి. ఈ రెండు పనులూ మనకు ముఖ్యం. ఇక్కడ పాంచాలబలానికేమో రక్షకుడుగా అర్జునుడున్నాడు. ఆ ఘటోత్కచుడున్నచోటికి నీవు వేగంగా వెళ్ళుము' దానితో భీముడు వెంటనే సింహనాదంచేస్తూ. (తరువాతి పద్యంతో అన్వయం)

క. కౌరవబలములు సుడివడ । మారుతి గవియుటయు మెఱసి మార్కొని కురుధా
త్రీరమణుఁ డర్ధచంద్రా । కారశరము దొడిగి ధనువు గ్రక్కునఁ దునిమెన్. 125

ప్రతిపదార్థం: కౌరవబలములు= కౌరవులసేనలు; సుడి+పడన్= సుడులు తిరిగేలాగా; మారుతి= భీముడు; కవియుటయున్= ఎదుర్కొనగా; కురుధాత్రీరమణుఁడు= కురుదేశానికి రాజైన దుర్యోధనుడు; మెఱసి= బయటకు వచ్చి; మార్కొని= ఎదిరించి; అర్ధచంద్ర+ఆకారశరమున్= సగం చంద్రుడి ఆకారంలోవుండే బాణాన్ని; తొడిగి= సంధించి; ధనువు= భీముడి విల్లును; గ్రక్కునన్= త్వరితంగా; తునిమెన్= త్రుంచివేశాడు.

తాత్పర్యం: భీముడు ఉరకగానే, కౌరవులసేన సుడులు తిరుగసాగినది. అప్పటికప్పుడే దుర్యోధనుడువచ్చి అర్ధచంద్రుడి ఆకారంలోవుండే బాణాన్ని సంధించి భీముడి ధనుస్సును విరుగగొట్టాడు.

తే. తునిమి తోడన క్రొవ్వాడి దొడ్డనార । సంబు భీముని వక్షస్స్థలంబు దూఱ
నేయుటయు సోలఁ గని ద్రౌపదేయు లడరఁ । గడఁగె సౌభద్రుఁడును ఘటోత్కచుఁడుఁ గలసి. 126

ప్రతిపదార్థం: తునిమి= త్రుంచివేసి; తోడన= వెంటనే; దొడ్డనారసంబున్= బలమైన బాణాన్ని; భీముని వక్షస్+స్థలంబు= భీముడి రొమ్ముభాగాన్ని; దూఱన్= దూరిపోయేటట్లుగా; ఏయుటయున్= ప్రయోగింపగా; సోలన్= ఆ భీముడు స్వాధీనం తప్పివాలిపోగా;

కని; ద్రౌపదేయులు= ద్రౌపది కొడుకులు; అడరన్= విజృంభించగా; సౌభద్రుఁడును= అభిమన్యుడు; కడఁగెన్= ప్రయత్నపరుడైనాడు; ఘటోత్కచుండున్= ఘటోత్కచుడు కూడా; కలసెన్= వారితో కలుసుకొన్నాడు.

తాత్పర్యం: దుర్యోధనుడు, భీముడి విల్లును విరుగగొట్టి, బలమైన బాణాన్ని ప్రయోగించాడు. అది ఆతడి రొమ్ములో దూసికొనిపోయింది. ఆ దెబ్బకు భీముడు ఒడలుమరచి ఒరిగిపోయాడు. భీముడి దీనస్థితిని చూచి, ద్రౌపది పుత్రులు (ఉపపాండవులు) విజృంభించారు. అభిమన్యుడు ఘటోత్కచుడుకూడా వారిని చేరుకొన్నారు.

వ. ఇట్లు దండ్రి నొచ్చినఁ బాండుపౌత్త్రులు నీపుత్త్రునిపై నొక్కపెట్ట మిక్కుటం బగుకోపంబునం గవిసిన. 127

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; తండ్రి= తండ్రియగు భీముడు; నొచ్చినన్= నొప్పిచెందగా; పాండుపౌత్త్రులు= పాండురాజుయొక్క కొడుకుల కొడుకులు; నీ పుత్త్రునిపైన్= నీకొడుకుమీద; ఒక్కపెట్ట= ఒక్కసారిగా; మిక్కుటంబు+అగు= అధికమైన; కోపంబునన్= కోపంతో; కవిసినన్.

తాత్పర్యం: తండ్రి భీముడు నొప్పిచెంది, నేలకు ఒరిగిపోగా, పాండురాజు మనుమలు అందరూ చాలా కోపంతో ఒక్కసారిగా మనసేనపైకి విజృంభించారు.

చ. కని కృపబాహ్లికాది రథి । క ప్రకరంబు గడంగి వారి మా
ర్కొని పెనఁగంగఁ దేఱి కడుఁ । గ్రూరత నేచిన మారుతాత్మజుం
జెనసి గురుండు రక్తపరి । షిక్తునిఁ జేసిన నాతఁ డల్గి యా
తని నొక నారసంబున ను । దగ్రత మూర్ఛ మునుంగ నేసినన్. 128

ప్రతిపదార్థం: కని= చూచి; కృపబాహ్లిక+ఆది రథిక ప్రకరంబున్= కృపుడు, బాహ్లికుడుమున్నుగా గల రథికుల సమూహం; కడంగి= ప్రయత్నపడి; వారిన్= ఆ పాండుపౌత్రులను; మార్కొని= ఎదిరించి; పెనఁగంగన్= పెనగులాడుతూంటే; తేఱి= తెప్పరిల్లుకొని; కడున్= మిక్కిలి; క్రూరతన్= కఠోరంగా; ఏచినన్= విజృంభించినట్టి; మారుతాత్మజున్= భీముడిని; చెనసి= ఎదిరించి; గురుండు= ద్రోణుడు; రక్తపరిషిక్తునిన్= నెత్తుటితో తడిసిన వాడినిగా; చేసినన్= చేయగా; ఆతఁడు= ఆ భీముడు; అల్గి= కోపించి; ఆతనిన్= ఆ ద్రోణుడిని; ఒకనారసంబునన్= ఒకే బాణంతో; ఉదగ్రతన్= చాలా అధికంగా; మూర్ఛన్= మూర్ఛలో; మునుంగన్= మునిగేట్టుగా; ఏసినన్= కొట్టగా.

తాత్పర్యం: పాండవ పుత్రులంతా ఏకమై మీదపడటాన్ని చూచి, కృపుడు, బాహ్లికుడు మున్నగు రాజులు ఎదిరించి యుద్ధం చేస్తూ ఉండగా, ఇంతలో భీముడు తెప్పరిల్లుకొని చాలా కఠోరంగా విజృంభించాడు. అతడిని ద్రోణుడు ఎదిరించి, అతడిని నెత్తురుమయం చేశాడు. దానికి భీముడు కోపంతో ఒకే బాణంతో ద్రోణుడిని కొట్టి మూర్ఛ పోయేలా చేశాడు.

మ. ధనురాచార్యునిఁ జూచి తత్తనయుఁడున్ ధాత్రీశుఁడున్ భీము మా
ర్కొని రాతం డెలనవ్వు చెన్నుగ గదా ఘోరాకృతిం దేరు డి
గ్గిన యాలోనన తేఱి ద్రోణుఁడు గడంగెం జూచి తోడై కృపా
ది నికాయంబు గడంగి వాయు సుతుపైఁ దీవ్రాస్త్రముల్ నింపఁగన్. 129

ప్రతిపదార్థం: ధనుః+ఆచార్యునిన్= అస్త్రవిద్యలో గురువైన ద్రోణుడిని; చూచి= గమనించి; తద్+తనయుడున్= ఆ ద్రోణుడి కొడుకు అశ్వత్థామ; ధాత్రీ+ఈశుఁడున్= భూమికి ప్రభువైన దుర్యోధనుడున్నూ; భీమున్= భీముడిని; మార్కొనిరి= ఎదిరించారు;

ఆతండు= ఆ భీముడు; ఎలనవ్వు= చిరునవ్వు; చెన్నుగన్= అందంగా; గదాఘోర+ఆకృతిన్= గదపట్టుకోవటంచేత భయంగొలిపే ఆకారంతో; తేరు డిగ్గినన్= తేరునుండి దిగగా; ఆలోనన= అంతలోనే; ద్రోణుఁడు= ద్రోణాచార్యుడు; తేఱి= తెప్పరిల్లుకొని; కడంగన్= యుద్ధానికి సిద్ధమయ్యాడు; కృప+ఆది నికాయంబున్= కృపాచార్యుడు ముఖ్యుడుగాగల సమూహం; చూచి= ద్రోణుడు యుద్ధానికి దిగటాన్నిచూచి; తోడు+ఐ= సహాయులై; కడంగి= ప్రయత్నపడి; తీవ్ర+అస్త్రములన్= చురుకైన ఆయుధాలను; వాయుసుతుపైన్= భీముడి మీద; నింపఁగన్= నిండింపచేయగా.

తాత్పర్యం: అశ్వత్థామ, దుర్యోధనుడు- ద్రోణుడు మూర్ఛపడటాన్ని చూశారు. భీముడిని బాగా ఎదుర్కొన్నారు. భీముడేమో వారిని లెక్కచేయకుండా అందంగా చిరునవ్వునవ్వి, గదనుపట్టుకొని భయంకరంగా తేరును దిగాడు. ఆతడు తేరు దిగే లోపలనే ద్రోణుడు తెలివిపొంది, యుద్ధంచేయడానికి ప్రయత్నపడ్డాడు. కృపుడు ముఖ్యుడుగాగల సైన్యం ద్రోణుడు యుద్ధానికి దిగటాన్ని చూచి, భీముడిని చురుకైన ఆయుధాలతో నింపివేశారు.

క. ఏపున హిడింబసుతుఁడును । ద్రౌపదిపుత్త్రులు సుభద్రతనయుఁడుఁ గోపో
ద్దీపితు లై వారల యా । టోపముఁ గుదియించి రతిపటుప్రదరములన్. **130**

ప్రతిపదార్థం: ఏపునన్= ఆటోపంతో; హిడింబసుతుఁడును= ఘటోత్కచుడు; ద్రౌపదిపుత్రులు= ద్రౌపదియొక్క కొడుకులు; సుభద్రతనయుఁడున్= అభిమన్యుడు; కోప+ఉద్దీపితులు+ఐ= కోపంతో మండిపడినవారై; వారల+ఆటోపమున్= ఆ అశ్వత్థామ దుర్యోధనుల విజృంభణాన్ని; అతిపటు ప్రదరములన్= చాల చురుకైన బాణాలతో; కుదియించిరి= తగ్గించారు.

తాత్పర్యం: ఇంతలో- ఘటోత్కచుడు, ఉపపాండవులు, అభిమన్యుడు- వీరందరూ, కోపంతో మండిపడుతూ, మిక్కిలి పదునుగా వుండే బాణాలు అశ్వత్థామ మీద, దుర్యోధనుడి మీద ప్రయోగించి వారి సంబరాన్ని చాలావరకు తగ్గించారు.

వ. అప్పుడనూపభూపాలుండును భీమసేన సఖిత్వలోలుండు నగు నీలుండు నశ్వత్థామం దొడరి నొచ్చినం గని ఘటోత్కచుండు. **131**

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో; అనూపభూపాలుండును= అనూపదేశపు రాజు; భీమసేన సఖిత్వలోలుండున్= భీముడి స్నేహంలో ఆశగలవాడున్నూ; అగు= అయినట్టి; నీలుండు= నీలుడనేవాడు; అశ్వత్థామన్= అశ్వత్థామను; తొడరి= ప్రయత్నంతో ఎదిరించి; నొచ్చినన్= నొప్పిచెందగా; ఘటోత్కచుండు= రాక్షసుడు ఘటోత్కచుడు; కని= చూచి.

తాత్పర్యం: పాండురాజు మనుమలు ఆ అశ్వత్థామమీద, దుర్యోధనుడిమీద మంచి మంచి బాణాలు ప్రయోగించిన సమయంలో భీముడి నేస్తాన్ని కోరుకొనే అనూపదేశ రాజు నీలుడనేవాడు, అశ్వత్థామను ఎదుర్కొని, చాలా నొచ్చిపోయాడు. అప్పుడు ఘటోత్కచుడు. (తరువాతి పద్యంతో అన్వయం)

క. తలపడి యగ్గురునందనుఁ । జలమున నొప్పింప గురుఁడు సరభసముగ ను
జ్జ్వలబాణావృతుఁ జేసిన । బలమఱి దనుజుండు మాయఁ బన్నెఁ గుపితుఁడై. **132**

ప్రతిపదార్థం: తలపడి= ఎదిరించి; ఆ+గురునందనున్= ద్రోణుడి కొడుకైన ఆ అశ్వత్థామను; చలమునన్= కసితో; నొప్పింపన్= బంధించగా; గురుఁడు= ద్రోణాచార్యుడు; సరభసముగన్= తొందరతో; ఉజ్జ్వలబాణ+ఆవృతున్= (ఆ ఘటోత్కచుడిని) వెలుగుతూ ఉండే బాణాలతో కప్పబడ్డవాడినిగా; చేసినన్= చేయగా; దనుజుండు= ఆ ఘటోత్కచుడు; బలము+అఱి= బలం కోల్పోయి; కుపితుఁడు+ఐ= కోపం పొందినవాడై; మాయన్= మాయను (ఇంద్రజాలాన్ని); పన్నెన్.

తాత్పర్యం: అశ్వత్థామ యొక్క గొప్పతనాన్ని చూచి ఓర్వలేక ఆ రాక్షసుడు అతడిని బాగా నొప్పించాడు. అంతలో ద్రోణాచార్యుడు తొందరగావచ్చి, మండుతూ ఉన్న బాణాలతో వాడిని బాగా కప్పివేశాడు. అప్పుడు ఘటోత్కచుడు బలం తగ్గిపోవటంచేత కోపంతో మాయలు చేయడానికి పూనాడు.

వ. ఇవ్విధంబున హిడింబాసూనుండు సేసిన మాయం జేసి. 133

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ మాదిరి; హిడింబాసూనుండు= హిడింబయొక్క కుమారుడు; చేసిన= చేసినట్టి; మాయన్+చేసి= మాయవలన.

తాత్పర్యం: ఆ రాక్షసుడు ఈ మాదిరి మాయాజాలాలను చేశాడు. దాని ఫలితంగా.

క. గురుఁడు మొదలైన యా ప । న్నిరువురుఁ గురుపతియు నొవ్వ నేటులఁ బడి నె
త్తురు దొరఁగ సోలి సంగర । ధరణిం బడినట్లు దోఁచెఁ దత్సేనలకున్. 134

ప్రతిపదార్థం: తద్+సేనలకున్= ఆ కౌరవసేనలకు; గురుఁడు= ద్రోణుడు; మొదలు+ఐన; ఆ+పన్నిరువురున్= ఆ పన్నెండుగురు వీరులు; కురుపతియున్= దుర్యోధనుడున్నూ; నొవ్వన్= నొచ్చిపోయ్యేటుగా; ఏటులన్+పడి= దెబ్బలుతిని; నెత్తురు= రక్తము; తొరఁగన్= కారుచుండగా; సోలి= స్వాధీనంతప్పి; సంగరధరణిన్= యుద్ధభూమి మీద; పడినట్లు= పడిన విధంగా; తోఁచెన్= అనిపించింది.

తాత్పర్యం: ఘటోత్కచుడు ద్రోణుడు ముఖ్యుడుగాగల ఆ అతిరథమహారథులు, కృపాశ్వత్థామ, చిత్రసేన, బృహద్బలబాహ్లికావంతీనాథ భూరిశ్రవసులను, సైంధవ సోమదత్త వివింశతి వికర్ణులను, దుర్యోధనుడిని, బాగా ఒళ్ళుబద్ధ లయ్యేట్లు చావబాది, అంతటితో వదలక, తన మాయాబలంతో వీళ్ళందరూ నెత్తురు కార్చుకొంటూ చచ్చినేలపై పడ్డట్టుగా కౌరవుల సేనకు కనిపించేటట్లు చేశాడు.

చ. కనుఁగొని సైన్యముల్ విఱిగి క్రందుకొనన్ వెసఁబాఱ నాపగా
తనయుఁడు సేన నాఁగి యివి దైత్యులమాయలు గాని బొంకుబొం
కని యెలుఁగెత్తి చెప్పఁగ భయంబున నమ్మక పోయె నట్లు వో
యినఁ జనుదెంచెఁ గౌరవ మహీశుఁడు దీనత భీష్మపాలికిన్. 135

ప్రతిదార్థం: సైన్యముల్= కౌరవసేనలు; కనుఁగొని= ఆ దృశ్యాన్నిచూచి; విఱిగి= వేరువేరుగా అయి; క్రందుకొనన్= సందడిఏర్పడగా; వెసన్= వేగంగా; పాఱన్= పరుగులు తీయగా; ఆపగాతనయుఁడు= గంగకొడుకు- భీష్ముడు; సేనన్= తన సేనను; ఆఁగి= అడ్డగించి; ఇవి= ఇప్పుడు మీకు భయం కలిగించినట్టివి; దైత్యులమాయలు= రాక్షసుల ఇంద్రజాలాలు; కాని= అంతేకాని; బొంకు బొంకు+అని= అబద్ధము అబద్ధము అని; ఎలుఁగు+ఎత్తి= గొంతెత్తి; చెప్పినన్= చెప్పినప్పటికి; భయంబునన్= భయంచేత; నమ్మక= విశ్వసింపక; పోయెన్= పారిపోయెను; అట్లు= ఆ విధంగా; పోయినన్= సైన్యం వెళ్ళిపోగా; కౌరవమహీ+ఈశుఁడు= కురురాజు దుర్యోధనుడు; దీనతన్= దైన్యంతో; భీష్మపాలికిన్= భీష్ముడి దగ్గరకు; చనుదెంచెన్= వచ్చాడు.

తాత్పర్యం: కౌరవసేనలోని తమయోధులందరు చచ్చినట్లు పడివుండటాన్ని చూచి గాబరాపడి ఎక్కడివారక్కడ విడివిడిగా పారిపోతూండడాన్ని చూచి, భీష్ముడు వారికి అడ్డుపడి ఇదంతా రాక్షసమాయలు అబద్ధాలు, నమ్మకండి అని గొంతు చినిగేటట్లు అరచి చెప్పినా వాళ్ళు పెడచెవినిబెట్టారు. అప్పుడు దుర్యోధనుడు బెంగగా ముఖం చిన్నపుచ్చుకొని భీష్ముడి దగ్గరకు వచ్చాడు.

వ. వచ్చి యి ట్లనియె. **136**

ప్రతిపదార్థం: వచ్చి= సమీపించి; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: దుర్యోధనుడు భీష్ముడి దగ్గరకు వచ్చి చెప్పబోయే విధంగా అంటున్నాడు.

క. నీవును ద్రోణుఁడు గలుగం । గా వైరులచేత నేను గష్టపడితిఁ గా
దే వారితోడఁ దలపడి । చా వొండెను విజయ మొండె సంపాదింతున్. **137**

ప్రతిపదార్థం: నీవును= భీష్ముడైన నీవున్నూ; ద్రోణుఁడు= ద్రోణాచార్యుడున్నూ; కలుగంగాన్= నా పక్షంలో ఉండగా; వైరులచేతన్= శత్రువులచేత; ఏను= నేను (దుర్యోధనుడు); కష్టపడితిన్=+కాదే!= కష్టపడ్డాను కదా!; వారితోడన్= ఆ శత్రువులతో; తలపడి= యుద్ధంచేసి; చావు+ఒండెన్= మరణంగానీ; విజయము+ఒండెన్= జయంగానీ; సంపాదింతున్= పొందుతాను.

తాత్పర్యం: దేవతలకూ కూడా అజేయుడవైన నీవు, అస్త్రగురువు ద్రోణుడు కూడా మా పక్షాన ఉండి యుద్ధం సాగిస్తుంటే, శత్రువులచేత ఎంతో కష్టపడ్డాను కదా! ఇక నేనే వాళ్ళతో పోరి, చావనైనా చస్తాను, లేక జయాన్నైనా పొందుతాను. (అన్నాడు).

చ. అన విని నవ్వి పాండవుల యంతటివారికిఁ గాక నీకు మా
ర్కొన నగు నయ్య! యిప్పరుసు కుత్సితవర్తన మిట్టి దుస్తరం
బునఁ దగులావుసేయ మము బోఁటులు లేరె? చలంబు డింపు మీ
వనిపతితోడఁ జెప్పి సరిదాత్మజుఁ డప్పుడు ప్రాభవంబునన్. **138**

ప్రతిపదార్థం: సరిత్+ఆత్మజుఁడు= గంగానది పుత్రుడు భీష్ముడు; అనన్= దుర్యోధనుడు అట్లా అనగా; విని= ఆలకించి; నవ్వి; పాండవుల+అంతటివారికిన్+కాక= (పాండవులను గెలవడానికి) పాండవులంతటివారికేతప్ప; నీకు; మార్కొనన్= ఎదిరించటానికి; అగున్+ అయ్య= సాధ్యమగునా అయ్యా!; ఈ+పరుసు= ఈ విధమైన; కుత్సితవర్తనము= హీనమైన నడవడి; ఇట్టి= ఈ విధమైన; దుస్తరంబునన్= తరింపరాని యుద్ధంలో; తగు= తగినట్టి; లావు= బలం; చేయన్= చేయడానికి; మము+బోఁటులు= మాలాంటి వాళ్ళు; లేరే= లేరె? (ఉన్నారనుట); ఈవు= నీవు; చలంబు= మాత్సర్యాన్ని; డింపుము= వదిలెయ్యి; అని= ఈ విధంగా; పతితోడన్= దుర్యోధనుడితో; చెప్పి= పలికి; ప్రాభవంబునన్= హుందాతనంతో.

తాత్పర్యం: భీష్ముడు దుర్యోధనుడన్నమాటలంతా విన్నాడు, నవ్వాడు. ఇట్లా అన్నాడు "పాండవులను ఎదిరించటానికి పాండవులంతటివారై ఉండాలికాని, నీలాంటివాడికి సాధ్యమా! (కాదు). ఈ రకం హీనమైన నడవడి నీకు తగదు. అసాధ్యమైన ఈ యుద్ధంలో తగురీతిగా చేయడానికి మావంటివారులేరా? (ఉన్నారనుట) నీవు మాత్సర్యాన్ని వదిలిపెట్టుము" అని దుర్యోధనుడితో అంటూ (హుందాగా).

వ. భగదత్తు నాలోకించి. **139**

ప్రతిపదార్థం: భగదత్తున్= భగదత్తుణ్ణి; ఆలోకించి= చూచి.

తాత్పర్యం: భీష్ముడు భగదత్తుణ్ణి చూచి (ఇట్లా అంటున్నాడు).

క. దనుజు లొనరించు మాయలు । నినుఁ జేరవు వారి గెలుతు వీ విప్పుడ యీ
జనపతి మెచ్చఁగఁ నా దై । త్యుని గెలువుము నీదు సేనతో నడరి వడిన్. **140**

ప్రతిపదార్థం: దనుజులు= రాక్షసులు; ఒనరించు= చేయునట్టి; మాయలు= ఇంద్రజాలాలు; నినున్= నిన్ను (భగదత్తుణ్ణి); చేరవు= అంటవు; నీవు= (భగదత్తుడు); వారిన్= ఆ రాక్షసులను; గెలుతు(వు)= గెలుస్తావు; ఇప్పుడు+అ= ఇప్పుడే; ఈ జనపతి= ఈ దుర్యోధనుడు; మెచ్చఁగన్= మెచ్చుకొనేట్టుగా; నీదు సేనతోన్= నీ యొక్క సైన్యంతో; అడరి= విజృంభించి; వడిన్= వేగంగా; ఆ దైత్యునిన్= ఆ రాక్షసుడిని (ఘటోత్కచుడిని); గెలువుము= జయించుము.

తాత్పర్యం: 'ఓయీ భగదత్తా! రాక్షసులు పన్నే మాయలు నీ దగ్గరకు కూడా రావు. నీవు వాళ్లని గెలుస్తావు. మన రారాజుమెచ్చుకొనేటట్టు ఇప్పుడే నీ సేనతో కూడి త్వరగా బాగా విజృంభించి వాడిని గెలువుము.

వ. అని భీష్ముండు పలికినం బ్రాగ్జ్యోతిషపతి మేటి మగండుగావున అమ్మాటకుం బొంగి సింగం బడరిన చందంబున నార్చి సుప్రతీకంబు నెక్కి సేనా సమేతుండై. 141

ప్రతిపదార్థం: అని= పై విధంగా; భీష్ముండు= భీష్ముడు; పలికినన్= చెప్పగా; ప్రాగ్జ్యోతిషపతి= ప్రాగ్జ్యోతిషమనే దేశానికి రాజు భగదత్తుడు; మేటి మగండున్= శూరుల్లో గొప్పవాడు; కావునన్= కావటంచేత; ఆ+మాటకున్= ఆ భీష్ముడి మాటకు; పొంగి= ఉప్పొంగిపోయి; సింగంబు= సింహము; అడరిన= విజృంభించిన; చందంబునన్= మాదిరి; ఆర్చి= బొబ్బపెట్టి; సుప్రతీకంబున్= సుప్రతీకమనే తన ఏనుగును; ఎక్కి= ఎక్కి; సేనాసమేతుండు+ఐ= సేనతో కూడుకొనినవాడై.

తాత్పర్యం: భీష్ముడి మాటలు విన్నాడు భగదత్తుడు. ఇతడు వీరులలో వీరుడు కావటంచేత ఉబ్బిపోయి సింహంమాదిరి విజృంభించాడు. బొబ్బలు పెట్టాడు. సేనలతో కూడినవాడై, తన ఏనుగును ఎక్కాడు.

తే. పరఁగి తోఁతెంచుపాండవబలముమీఁదఁ । గవియుటయుఁ నంతనంతఁ గౌరవుల మూఁక
మరలి యేర్పడఁ జూచి యమ్మాట యపుడు । నిజముగాఁ గొని యాజికి నిగిడె మగుడ. 142

ప్రతిపదార్థం: పరఁగి= ఒప్పి; తో+తెంచు= వస్తున్న; పాండవ బలము మీఁదన్= పాండవ సైన్యంమీద; కవియుటయున్= భగదత్తుడు ఎదుర్కొనగా; కౌరవులమూఁక= కౌరవులసైన్యం; అంతన్+అంతన్= కొంత కొంతదూరంలో; మరలి; ఏర్పడన్= బాగాతెలిసేటట్టుగా; చూచి= పరికించి; ఆ+మాట= భీష్ముడు చెప్పిన పలుకులు; నిజము+కాన్= యథార్థమని; కొని= గ్రహించి; మగుడన్= మరల; ఆజికిన్= యుద్ధానికి; నిగిడెన్= విజృంభించింది.

తాత్పర్యం: భగదత్తుడు ఎదురువచ్చే పాండవసేనతో యుద్ధంచేయసాగాడు. అది చూచి కౌరవులమూక, భీష్ముడన్న మాటలు నిజమని నమ్మి పాండవసేనకు అభిముఖపై మార్కొనింది

వ. ఇ ట్లుభయసైన్యంబులుం దలపడిన సందడికయ్యంబున నపరాహ్ణం బగుచు నుండ. 143

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ మాదిరి; ఉభయసైన్యంబులున్= రెండు సేనలున్నూ; తలపడిన= ఎదురుకొన్న; సందడికయ్యంబున్= సంకుల సమరంలో; అపర+అహ్ణంబు= పగటిలో నాలుగో భాగం; అగుచున్+ఉండన్.

తాత్పర్యం: ఈ మాదిరి కౌరవపాండవసేనలు తలపడి యుద్ధం సాగించాయి. తన పక్షంవాడు, శత్రుపక్షంవాడు అనేదే తెలియకుండా ఆ యుద్ధం జరిగింది. ఇంతలో అపరాహ్ణకాలం కావడం ఆరంభించింది.

క. నగపతియుఁ బోనిగజపతిఁ । దగ నేడ్తెఱ నెక్కి ప్రబలదైత్యబలముతో
నిగుడఁగ ఘటోత్కచుం డా । భగదత్తునిమీఁదఁ గవిసెఁ బార్థివముఖ్యా! 144

ప్రతిపదార్థం: పార్థివముఖ్యా!= రాజులలో ప్రధానుడవైన ధృతరాష్ట్ర మహారాజా!; ఘటోత్కచుండు; నగపతియున్+పోని= మహాపర్వతంలాంటి; గజపతిన్= గొప్ప ఏనుగును; తగన్= ఒప్పిదంగా; ఎక్కి= అధిష్ఠించి; ఏడ్తెఱన్= పరాక్రమంతో; ప్రబలదైత్య బలముతోన్= మిక్కుటమైన రక్కసిమూకతో; నిగుడఁగన్= విజృంభించగా; ఘటోత్కచుడు; ఆ భగదత్తుని మీఁదన్= భగదత్తుడిపైన; కవిసెన్= ఎత్తివచ్చాడు.

తాత్పర్యం: 'ఓ ధృతరాష్ట్ర మహారాజా! ఆ ఘటోత్కచుడు కొండంత పెద్ద ఏనుగునెక్కి, పరాక్రమంతో తన రాక్షససైన్యాన్ని కూడా తీసికొని యుద్ధరంగాన్నంతా కమ్ముకుంటూ భగదత్తుడిమీదికి ఎత్తివచ్చాడు.

వ. తదవసరంబున వృకోదరుండరదంబు రయంబు మెఱయ నయ్యభిమన్యుద్రౌపదేయ ప్రముఖులుం దానును హైడింబునకుం దో డై కడంగె నట్టియెడ. 145

ప్రతిపదార్థం: తద్+అవసరంబునన్= ఆ సమయంలో; వృక+ఉదరుండు= తోడేలు కడుపువంటి కడుపుకలవాడు (భీముడు); అరదంబు రయంబు= (తన) రథంయొక్క వేగం; మెఱయన్= బయలుపడగా; ఆ+అభిమన్యు ద్రౌపదేయ ప్రముఖులున్= ఆ అభిమన్యుడు, ద్రౌపది కొడుకులు మొదలైనవారు; తానును= భీముడున్నూ; హైడింబునకున్= ఘటోత్కచుడికి; తోడు+ఐ= తోడుపడి; కడంగెన్= యుద్ధానికి దిగాడు; అట్టి ఎడన్= ఆ సమయంలో.

తాత్పర్యం: ఆ సమయంలో భీముడు తన రథవేగం అధికం కాగా, అభిమన్యుడు, ద్రౌపదికొడుకులు ప్రధానులుగాగల కొందరితో ఘటోత్కచుడికి అండగా నిలబడి, కయ్యానికి సిద్ధపడ్డాడు. ఆ సమయంలో.

ఆ. పాదివి పలువు రేయఁ బొడువ వ్రేయఁగ భగ । దత్తుదంతిరక్తధార లొప్పెఁ
జెలువు రెట్టిగాఁగ జేవుఱుసెలయేఱు । లున్నతాచలమున నురలునట్లు. 146

ప్రతిపదార్థం: పాదివి= చుట్టుముట్టి; పలువురు= చాలామంది; ఏయన్= బాణాలు ప్రయోగించగా; పొడువన్= బల్లాలతో పొడవగా; వ్రేయన్= గుదియలతో కొట్టగా; భగదత్తు= భగదత్తుడియొక్క; దంతి= ఏనుగుయొక్క; రక్త= నెత్తటియొక్క; ధారలు= ప్రవాహాలు; చెలువు= అందము; రెట్టిగాఁగన్= రెండింతలు కాగా; జేవుఱుసెలయేఱులు= జేవురురంగుసెలయేళ్ళు; ఉన్నత+అచలమునన్= ఎత్తైన పర్వతాన్నుండి; ఉరలునట్లు= కారేటట్టుగా; ఒప్పెన్= ప్రకాశించింది.

తాత్పర్యం: పాండవ పక్షంవారంతా భగదత్తుడి ఏనుగును చుట్టుముట్టి- కొందరు బాణాలతోకొట్టారు, మరికొందరు బల్లెములతో పొడిచారు. మరికొందరు గుదియలతో బాదారు. అతడి ఏనుగు శరీరంనుండి రక్తంకారుతూవుంది. అప్పుడది అదంతా రెట్టింపైన అందంతో జేవురురంగు పిల్లకాల్వలు కొండపైనుండి దిగువకు కార్తున్నట్టుంది.

విశేషం: అలం: ఉపమ.

క. శూలంబున హైడింబుఁడు । గాలాకృతితోడ వైవఁగా నది పొడి యై
రాలెడునట్లుగ మగఁటిమి । వ్రాలినభగదత్తుఁ డేసె వడి భల్లమునన్. 147

ప్రతిపదార్థం: కాల+ఆకృతితోడన్= యముడి ఆకారంవంటి ఆకారంతో; హైడింబుఁడు= ఘటోత్కచుడు; శూలంబున(న్)= శూలాయుధంతో; వైవఁగాన్= గుచ్చగా; మగఁటిమి= పౌరుషము; వ్రాలిన= మీరిన; భగదత్తుఁడు; అది= ఆ శూలం; పొడి+ఐ= చూర్ణమై; రాలెడు+అట్లు+కన్= రాలిపొయ్యే విధంగా; వడిన్= వేగంగా; భల్లమునన్= బల్లెంతో; ఏసెన్= కొట్టాడు.

తాత్పర్యం: ఘటోత్కచుడు యమధర్మరాజుమాదిరి శూలాన్ని విసిరాడు. భగదత్తుడు పౌరుషం అతిశయంకాగా, వేగంగా ఒక బల్లెమును ప్రతిగావేసి వాడి బల్లెమును నుగ్గునుగ్గు చేశాడు.

వ. ఇ ట్లేసి యార్చి వెండియు. 148

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ మాదిరి; ఏసి= ప్రయోగించి; ఆర్చి= బొబ్బపెట్టి; వెండియున్= మరియు.

తాత్పర్యం: భగదత్తుడీవిధంగా శూలంతో ఘటోత్కచుడి శూలాన్ని నుగ్గుచేసి బొబ్బలుపెట్టి.

ఆ. భీముహరులఁ గూల్చి పేర్చి సౌభద్రాది । యోధవరుల నెల్ల నుఱక తఱచు
టంపవానఁ దడిపి హయరథభట సమూ । హంబుఁ జదిపె సమదహస్తిఁ బఱపి. 149

ప్రతిపదార్థం: భీముహరులన్= భీముడి గుర్రాలను; కూల్చి= కూలద్రోసి; పేర్చి= అతిశయించి; సౌభద్ర+ఆది+యోధవరులన్= అభిమన్యుడు మొదలైన గొప్పవీరులను; ఎల్లన్= అందరినీ; ఉఱక= ఊరకయే; తఱచు= అధికమైన; అంపవానన్= బాణాలతో; తడిపి= ముంచి; సమదహస్తిన్= మదంతో కూడిన ఏనుగును; పఱపి= తోలి; హయరథభటసమూహంబున్= గుర్రాలు, రథాలు; భటులు= సైనికులు; వీరి గుంపును; చదిపెన్= నలిచివేశాడు.

తాత్పర్యం: ఆ భగదత్తుడు భీముడి రథం గుర్రాలను కుప్పకూల్చాడు. చాలా బాగా విజృంభించాడు. అభిమన్యుడు మొదలైన పలువురు యోధులందరినీ గొప్ప బాణాలవానతో తడిపివేశాడు. తన ఏనుగును ఉసికొల్పి గుర్రాలను; భటులను రథాలను నుగ్గు చేశాడు.

క. మందరము మహాంభోనిధి । యందుఁ దిరుగునట్లు పాండవానీకములో
నం దిరిగి సుప్రతీక మ । మందగతిం జంపెఁ బెక్కు మాతంగములన్. 150

ప్రతిపదార్థం: సుప్రతీకము= భగదత్తుడి ఏనుగు; మందరము= మందరమనే పర్వతం; మహా+అంభోనిధి+అందున్= మహాసాగరంలో; తిరుగు+అట్లు= తిరిగేమాదిరి; పాండవ+అనీకములోనన్= పాండవుల సేనలో; తిరిగి= భ్రమించి; అమందగతిన్= వేగవంతమైన నడకతో; పెక్కుమాతంగములన్= చాలా ఏనుగులను; చంపెన్= చంపింది.

తాత్పర్యం: సుప్రతీకం అనే ఏనుగు మహాసముద్రంలో మందరపర్వతం తిరిగేమాదిరిగా పాండవులసేనలోనికి చొచ్చుకొనిపోయి, వేగంతో ఇటూ అటూ తిరుగుతూ శత్రువుల ఏనుగులను ఎన్నింటినో కాలరాచినది.

విశేషం: అలం: ఉపమ. చంపె అనుటకు మారుగా చదిపె అను పాఠాంతరము మేలైనది.

క. అలిగి దశార్ణాధీశుఁడు । గొలిపెను భగదత్తుమీఁదఁ గ్రూరగజము ను
జ్జ్వలము లగునతనితోమర ములతాఁకున నది చలించి మొగతిరిగె వెసన్. 151

ప్రతిపదార్థం: దశార్ణ+అధీశుఁడున్= దశార్ణదేశపురాజు; అలిగి= కోపించి; భగదత్తు మీఁదన్; భగదత్తుడిమీదికి; క్రూరగజమున్= భయంకరమైన (తన) ఏనుగును; కొలిపెన్= ప్రేరేపించాడు; అది= ఆ ఏనుగు; ఉజ్జ్వలములు+అగు= పదునుచేత ప్రకాశిస్తూ ఉన్న; అతని= ఆ భగదత్తుడియొక్క; తోమరముల తాఁకునన్= తోమరాలనే ఆయుధాల దెబ్బతో; చలించి= కదలిపోయి; వెసన్= వెంటనే; మొగతిరిగెన్= వెనక్కితిరిగింది.

తాత్పర్యం: దశార్ణరాజు కోపంచెంది, భగదత్తుడిమీదికి తన ఏనుగును పురికొల్పాడు. అది భగదత్తుడి క్రూరపు తోమరాలతాకిడికి తట్టుకోలేక వెనక్కి మళ్లినది.

వ. ఇవ్విధంబునం బోరు భగదత్తుం గనుంగొని గండుమిగిలి కురువిభుండు గురుకృపాది యోధవీర సమేతంబుగాఁ దఱిమినం దమ బలంబులు గోలాహలబహుళంబు లగుటయుఁ బాండవాగ్రజుండు పార్థపాంచాల పురస్సరుండై యవ్వలనికిం గ్రొ వ్వలరం గోల్తల సేసె నట్టి సమయంబున. 152

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ విధంగా; పోరు= యుద్ధంచేస్తున్న; భగదత్తున్= భగదత్తుణ్ణి; కనుంగొని= చూచి; కురువిభుండు= కురురాజు, దుర్యోధనుడు; గండుమిగిలి= పౌరుషం అధికంకాగా; గురు= ద్రోణాచార్యుడు; కృప= కృపాచార్యుడు; ఆది= మొదలుగాగల; యోధ= భటులు; వీర= వీరులు; (వీరితో) సమేతంబుగాన్= కూడుకొని; తఱిమినన్= వెంబడిపడి తరుమగా; పాండవ+అగ్రజుండు= ధర్మరాజు; తమబలంబులున్= తమ (కౌరవుల); బలంబులున్= సైన్యాలు; కోలాహల బహుళంబులున్= కలకలశబ్దాలతో నిండినవిగా; అగుటయున్= కావడమున్నూ; పాండవ+అగ్రజుండు= ధర్మరాజు; పార్థపాంచాల పురస్సరుండు+ఐ= అర్జునుడు; ద్రుపదుడుముందున్నవారుకాగా; ఆ+వలనికిన్= ఆవైపునకు; క్రొవ్వు+అలరన్= మదం అధికంకాగా; కోల్తల+చేసెన్= ఎదురుగా నిల్చి యుద్ధంచేశాడు; అట్టి సమయంబునన్= అలాంటి సమయంలో.

తాత్పర్యం: ఈ విధంగా యుద్ధం చేస్తూన్న భగదత్తుణ్ణి చూశాడు దుర్యోధనుడు. మహాపౌరుషంతో ద్రోణాచార్య కృపాచార్యులు ముఖ్యులుగా ఉండే యోధవీరులతో కూడి పాండవసేనను వెంబడించి తరిమాడు. అప్పుడు కౌరవసేనలో కోలాహలం పుట్టింది. దానిని గమనించి, ధర్మరాజు - అర్జునుడు, ద్రుపదుడు ముందు నిలువగా ఆ యుద్ధం జరిగే దిక్కుకు వెళ్ళి మదాతిశయంతో యుద్ధం చేశాడు.

అర్జునుఁ డిరావంతునిచచ్చుట భీమునిచే విని దుఃఖించుట (సం. 6-92-1)

క. నరుఁడు ధనుర్గుణరావ । స్ఫురణంబును దేవదత్తభూరిరవము నం
బరము వగిలింప నానా । శరములఁ గురుసైన్యసరభసత్వం బుడిపెన్. 153

ప్రతిపదార్థం: నరుఁడు= అర్జునుడు; ధనుస్= విల్లుయొక్క; గుణ= అల్లెత్రాటియొక్క; రావ= ధ్వనియొక్క; స్ఫురణంబును= కదలికయు; దేవదత్తభూరిరవమున్= దేవదత్తమనే తన శంఖంయొక్క పెద్దశబ్దమున్నూ; అంబరము= ఆకాశాన్ని; పగిలింపన్= బ్రద్దలుకొట్టగా; నానాశరములన్= పలురకాల బాణాలతో; కురుసైన్య సరభసత్వంబున్= కౌరవసైన్యాలవేగిరపాటును; ఉడిపెన్= మాన్పించాడు.

తాత్పర్యం: అర్జునుడు ధనుష్టంకారం చేశాడు. తన శంఖాన్ని ఊదాడు. ఈ రెంటి చప్పుడు ఆకాశాన్ని బ్రద్దలు కొట్టింది. వెంటనే అర్జునుడు పలురకాల బాణాలు వేసి, కౌరవసేనల ఉద్ధతిని తగ్గించాడు.

ఆ. అపుడు సేరి భీముఁ డతనికి భుజగేంద్ర । కన్యకాసుతుండు గలనఁ బడుట
నల్లఁ జెప్పుటయును నడలి యెచ్చట నని । యడిగి యతఁడు సూప నచటి కరిగి. 154

ప్రతిపదార్థం: అపుడు= ఆ సమయంలో; భీముఁడు; చేరి= అర్జునుడి దగ్గరకువచ్చి; అతనికిన్= ఆ అర్జునుడికి; కలనన్= యుద్ధంలో; భుజగ+ఇంద్రకన్యకాసుతుండున్= సర్పరాజు కుమార్తెయొక్క కొడుకు ఇరావంతుడు; పడుటన్= చనిపోవటాన్ని; అల్లన్= మెల్లగా; చెప్పుటయున్= తెలియచేయగా; అడలి= శోకించి; ఎచ్చటన్= ఎక్కడ?; అని+అడిగి= అని ప్రశ్నించి; అతఁడున్= ఆ భీముడు; చూపన్= చూపించగా; అచటికిన్= ఆ చోటికి; అరిగి= వెళ్లి.

తాత్పర్యం: అర్జునుడు ఇట్లా యుద్ధం చేస్తున్న సమయంలో, భీముడు అతడి దగ్గరకు వెళ్ళి మెల్లగా ఇరావంతుడు యుద్ధంలో చావటాన్ని చెప్పాడు. అర్జునుడు విలపించి 'ఎక్కడ' అని అడిగాడు. భీముడు చూపించిన చోటికి తాను వెళ్ళి.

వ. దనుజఖండితుం డయి పడియున్న యయ్యిరావంతు శరీరంబు గనుంగొని యా ధనంజయుండు.155

ప్రతిపదార్థం: ఆ ధనంజయుండు= ఆ అర్జునుడు; దనుజ ఖండితుండు+అయి= రాక్షసుడిచే చంపబడ్డవాడై; పడియున్న= నేలపైపడివున్నట్టి; ఆ+ఇరావంతు శరీరంబున్= ఆ ఇరావంతుడి దేహాన్ని; కనుంగొని= చూచి.

తాత్పర్యం: అలంబుసుడిచే చంపబడి నేలబడి ఉన్న ఇరావంతుడి దేహాన్ని చూచి అర్జునుడు.

చ. ఘనతరశోకవేగమునఁ గన్నుల నీళులు నించి యా సుయో
ధనునవినీతియుం బిదప ధర్మతనూజుఁడు సంధి గోరి ప
ల్కిన తగవుం గడంగి యనికిం దలకొన్ననిజోద్యమంబుఁ దోఁ
చిన విధిఁ బిట్టుచున్ వినుతి సేయుచు రోయుచునుండె నయ్యెడన్. 156

ప్రతిపదార్థం: ఆ+ఎడన్= ఆ సమయాన; ఘనతరశోకవేగమునన్= మిక్కిలి ఎక్కువైన దుఃఖవేగంతో; కన్నులన్= కండ్లలో; నీళులు= నీరు; నించి= నిండించుకొని; ఆ సుయోధను+అవినీతియున్= ఆ దుర్యోధనుడి అవినీతిని; పిదపన్= అటు తర్వాత; ధర్మతనూజుఁడు= ధర్మరాజు; సంధిన్+కోరి= సంధిని ఇష్టపడి; పల్కిన తగవున్= చెప్పిన న్యాయం; అనికిన్= యుద్ధానికి; కడంగి= ప్రయత్నపడి; తలకొన్న= పూనుకొన్న; నిజ+ఉద్యమంబున్= తనకార్యక్రమం; తోఁచినన్= జ్ఞాపకానికి రాగా; విధిన్= దైవాన్ని; తిట్టుచున్= తిట్టుతూ; వినుతి+చేయుచున్= ధర్మరాజు గొప్పదనాన్ని పొగడుతూ; రోయుచున్= తన యుద్ధచర్యను ఏవగించుకొంటూ; ఉండెన్= ఉండినాడు.

తాత్పర్యం: అర్జునుడు అధిక దుఃఖంతో కన్నులలో నీళ్ళు నింపుకొని, మొదట దుర్యోధనుడు చేసిన జూదంవగైరా అన్యాయాన్ని, తరువాత అన్న ధర్మరాజు ఉదారంగా ఐదూళ్లైనా ఇవ్వమని కోరటాన్ని సంధి కుదరకపోగా తాను చేసే అసహ్యమైన యుద్ధాన్ని ఒకసారి జ్ఞాపకానికి తెచ్చుకొన్నాడు. విధిని తిట్టాడు. పిదప ధర్మరాజు న్యాయాన్ని మెచ్చుకొన్నాడు. తను యుద్ధంలో దిగడంచేత పలువురు చావటాన్ని చూచి తన్ను ఏవగించుకొన్నాడు.

వ. ఇట్లు పుత్రశోకానలసంతప్తచిత్తుం డగు సవ్యసాచిం జూచి గోవిందుండు మందస్మితంబు సేసిన. 157

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; పుత్ర= కొడుకైన ఇరావంతుడి సంబంధమైన; శోక= దుఃఖమనే; అనల= అగ్నిచేత; సంతప్త= తపించిపోయిన; చిత్తుండు+అగు= మనస్సుకలవాడైనట్టి; సవ్యసాచిన్= అర్జునుణ్ణి; చూచి; గోవిందుండు= శ్రీకృష్ణుడు; మందస్మితంబు= చిరునవ్వు; చేసినన్= చేయగా (నవ్వగా).

తాత్పర్యం: అర్జునుడికి కొడుకు చావటంచేత కలిగిన దుఃఖంఅనే అగ్నిచేత ఆతడి మనస్సు బాగా తపించిపోయింది. అట్టి అర్జునుడిని చూచి కృష్ణుడు చిరునవ్వు నవ్వగా.

క. ‘ కని యతఁడు దెలిసి నీచే । వినినది యిది మున్ను దీని విడిచితి నహిభం
జన! తేరు నడపు కురుబల । వినిపాతనపాటవమున విహరించుటకున్.’ 158

ప్రతిపదార్థం: అతఁడు= ఆ అర్జునుడు; కని= కృష్ణుడు నవ్వటాన్ని చూచి; తెలిసి= ఆ నవ్వులోని అర్థాన్ని గ్రహించి; అహిభంజన!= కాళియుడనే సర్పరాజును మర్దించిన ఓ కృష్ణా!; ఇది= ఈ ఆత్మానాత్మ విచారం; మున్ను= ఇంతకు మునుపే; నీచేన్; విన+అది= విన్నట్టిదేను; దీనిన్= ఈ కొడుకు చావువల్ల కలిగిన దుఃఖాన్ని; విడిచితిన్= వదలిపెట్టాను; కురు= కౌరవులయొక్క; బల= సేనలయొక్క; వినిపాతన= బాగాపడగొట్టడంలో; పాటవమునన్= నైపుణ్యంతో; విహరించుటకున్= వేడుకగా తిరగడానికి; తేరునడపు(ము)= రథాన్ని ముందుకు పోనిమ్ము.

తాత్పర్యం: కృష్ణుడి నవ్వులోని మర్మాన్ని అర్జునుడు తెలిసికొన్నాడు. 'ఓ కృష్ణా చావు బ్రతుకుల తత్త్వాన్ని నీవు ముందే చెప్పావు, నేను విన్నాను. ఇక వీడి మరణంవల్ల ఏర్పడ్డ దుఃఖాన్ని వదిలివేశాను. ఆ కౌరవసైన్యాన్ని కుప్పకూల్చే సామర్థ్యంతో విహరించటానికి అనువుగా రథాన్ని పోనిమ్ము.

వ. అని పలికినం బద్మనాభుండు రథంబు రయంబున మనమొనపయిం బఱపం బార్థుండు పటుబాణపరంపరలు వరగింప భగదత్తుండును, గృపాచార్యుండును, త్రిగర్తపతియు భీష్ముం గూడుకొని యాక్రీడి నెదిర్చిరి. సాత్యకి యడరినం గృతవర్మ బాహ్లికులు మార్కొనిరి మారుతి గవిసినం గుంభసంభవుండు దలపడియె. నతని ప్రాపున నేపు మిగిలి నీపుత్రకు లా బకమర్దను మర్దింపం గడంగి కవిసిన. 159

ప్రతిపదార్థం: అని= పై విధంగా; పలికినన్= అర్జునుడు చెప్పగా; పద్మనాభుండు= కృష్ణుడు; రథంబున్; రయంబునన్= వేగంతో; మనమొనపయిన్= మన (కౌరవుల)సేన మీదికి; పఱపన్= తోలగా; పార్థుండు= అర్జునుడు; పటుబాణపరంపరలు= గట్టి బాణాల వరుసలను; పరఁగింపన్= ప్రయోగింపగా; భగదత్తుండును; కృపాచార్యుండును, త్రిగర్తపతియున్; భీష్మున్; కూడుకొని= కలిసికొని; ఆ క్రీడిన్= ఆ అర్జునుడిని; ఎదిర్చిరి= ఎదిరించారు; సాత్యకి; అడరినన్= అతిశయించగా; కృతవర్మబాహ్లికులు= కృతవర్మయు, బాహ్లికుడున్నూ; మార్కొనిరి= ఎదిరించారు; మారుతి= భీముడు; కవిసినన్= ఢీకొనగా; కుంభసంభవుండు= ద్రోణాచార్యుడు; తలపడియెన్= తాకాడు; అతని ప్రాపునన్= ఆ ద్రోణుడి అండన; ఏపు మిగిలి= విజృంభణంచేత అతిశయించి; నీ పుత్రకులు= నీ కొడుకులు (కౌరవులు); ఆ బకమర్దనున్= బకుడనే రాక్షసుణ్ణి చంపిన భీముడిని; మర్దింపన్= అణచటానికి; కడంగి= ప్రయత్నపడి; కవిసినన్= ఎదుర్కొనగా.

తాత్పర్యం: అర్జునుడి మాటలు విని కృష్ణుడు వేగంగా రథాన్ని కౌరవసైన్యంపుండే ప్రక్కకు తోలాడు. పార్థుడు గొప్పవైన బాణాలను వరుసగా వేశాడు. అప్పుడు భగదత్తుడు, త్రిగర్తదేశపురాజు, కృపుడు భీష్ముడితో కూడుకొని ఆ అర్జునుడిని ఎదిరించాడు. సాత్యకి తలపడగా కృతవర్మ, బాహ్లికుడు అతడిని ఎదిరించారు. భీముడు మీదపడగా ద్రోణుడతనిని ఎదిరించాడు. ఆ ద్రోణుడి అండన ఉన్న నీ కొడుకులు ఆ భీముడిని కొట్టటానికి పెద్ద ప్రయత్నంతో ఎగబడ్డారు.

క. గురునంపవెల్లి నాఁగుచు । సరభసముగ వారిమీఁద శరవర్షంబుల్
గురియుచు వారలయమ్ములఁ । దెరలక భీముండు పటుగతిస్యందనుఁడై. 160

ప్రతిపదార్థం: భీముఁడు= భీముడు; పటుగతి స్యందనుఁడు+ఐ= దిట్టమైన పోకడగల రథంకలవాడై; గురున్= గురువైన ద్రోణాచార్యునియొక్క; అంపవెల్లిన్= బాణాలవెల్లువను; ఆఁగుచున్= అడ్డగిస్తూ; సరభసముగన్= తొందరపాటుతో; వారిమీఁదన్= ఆ కౌరవులమీద; శరవర్షంబుల్= బాణాలవానలను; కురియుచున్= కురిపిస్తూ; వారల= ఆ శత్రువుల; అమ్ములన్= బాణాలను; తెరలక= (దగ్గరకు రానీకుండా) తొలిగించుతూ.

తాత్పర్యం: భీముడు మంచివేగంగల రథాన్నెక్కి, ద్రోణుడు ప్రయోగించే బాణాల ప్రవాహాన్ని ఆపాడు. వాళ్ళమీద బాణాలవానలు కురిపించాడు. శత్రువులు వేసే బాణాలను తొలగించుకుంటూ (తరువాతి వచనంతో అన్వయం).

వ. సమరక్రీడ సలిపి గురుకుమారులు దొరఁగించు నారాచధారల నొచ్చి యాజ్యధారాక్రాంతుం డైన యర్చిష్మంతుండునుంబోలె మండి యుద్దండకోదండనైపుణ్యంబు సూపినం గుండభేదియు, ననాధృష్యుండును, గనకధ్వజుండును, విరావియు, సుబాహుండును, దీర్ఘబాహుండును, దీర్ఘలోచనుండును దీర్ఘనిద్రం బొందిరి; పెఱవారు వెఱచఱచి విఱిగి పఱచిన నజంబుల వెనుకొనువృకంబు విధంబున వృకోదరుండు దోర్విలాసంబు

మెఱసె నప్పుడు బ్రొద్దుగ్రుంకుచుండ నీ పెద్దకొడుకు బలుమొనలం బురికొల్పికొని చలంబునం గోల్తల సేసిన గౌంతేయవ్యూహంబులు నభినవోత్సా హంబునం బోక పెనంగిన. 161

ప్రతిపదార్థం: సమరక్రీడ సలిపి= యుద్ధంలో క్రీడించి; కురుకుమారులు= దుర్యోధనుడి తమ్ముళ్ళు; తొరఁగించు= పడవేస్తున్నట్టి; నారాచధారలన్= బాణాలచేత; నొచ్చి= బాధపడి; ఆజ్యధారా+ఆక్రాంతుండు+ఐన= నేతిధారలచే కప్పబడిన; అర్చిష్మంతుండునున్+పోలెన్= అగ్నిమాదిరి; మండి= వెలిగి; ఉద్దండకోదండ నైపుణ్యంబు= మితిమీరిన విలువిద్యలోని చాకచక్యాన్ని; చూపినన్= ప్రదర్శించగా; కుండభేదియున్; అనాధృష్యుండునున్; కనక ధ్వజుండును; విరాటియున్; సుబాహుండును; దీర్ఘబాహుండునున్; దీర్ఘలోచనుండును; దీర్ఘనిద్రన్= చావును; పొందిరి; పెఱవారు= తక్కినవారు; వెఱచఱచి= భయంచెంది; విటిగి= ఓడిపోయి; పఱచినన్= పారిపోగా; అజంబులన్= మేకలను; వెనుకొను= అనుసరించితరుము; వృకంబు విధంబునన్= తోడేలుమాదిరి; వృకోదరుండు= భీముడు; దోస్+విలాసంబు= భుజాల క్రీడలో; మెఱసెన్= ప్రకాశించాడు; అప్పుడు= ఆ సమయంలో; ప్రొద్దు= సూర్యుడు; క్రుంకుచున్+ఉండన్= మరుగైపోతూండగా; నీ పెద్దకొడుకు= దుర్యోధనుడు; బలుమొనలన్= బలంగల సైన్యాలను; పురికొల్పికొని= ప్రోత్సాహపరచికొని; చలంబునన్= మాత్సర్యంతో; కోల్తల+చేసినన్= ఎదుట నిల్చి యుద్ధంచేయగా; కౌంతేయ వ్యూహంబులున్= కుంతికొడుకుల బలాలు; అభినవ+ఉత్సాహంబునన్= కొంగ్రొత్త ఉత్సాహంతో; పోక= వెనుకంజవేయక; పెనంగినన్= యుద్ధంచేయగా.

తాత్పర్యం: భీముడు యుద్ధంలో విచ్చలవిడిగా విహరిస్తూ, కౌరవులువేసే బాణాల దెబ్బకు చాలా బాధపడి నెయ్యిపోస్తే గుప్పుమని మండే అగ్గిలాగా మండిపడుతూ, విలువిద్యలో తనకుండే గొప్పనేర్పును కనపరుచుతూ కౌరవులను ఏడుమందిని చంపివేశాడు. మిగిలినవారందరూ ఓడి, భయపడి పారిపోసాగారు. మేకలను తోడేలు మాదిరిగా వాళ్ళను వెంబడించి తరిమాడు. తన భుజబలాన్ని ప్రకాశింపజేశాడు. అప్పుడే సూర్యుడు అస్తమిస్తున్నాడు. అప్పుడు దుర్యోధనుడు తన బలగంలో బలవంతుల్ని పురికొల్పికొంటూ మాత్సర్యంతో ఎదిరించి యుద్ధంచేయుటకు పూనాడు. పాండవుల దండుకూడా వెనుకకు మళ్ళక అప్పటికప్పుడే ఏర్పడ్డ ఉత్సాహంతో పోరు సాగించగా.

విశేషం: అలం: ఉపమ.

తే. ధరణి నెత్తుటఁ దోఁగి యాభరణ కాయ । శస్త్రఖండజాలంబులఁ జాలఁ బొలిచెఁ
బలుచ గాకుండఁ గుంకుమ మలఁది పెక్కు । తెఱఁగుతొడవులు దొడిగినతెఱవవోలె. 162

ప్రతిపదార్థం: ధరణి= భూమి; నెత్తుటన్= నెత్తురులో; తోఁగి= మునిగి; ఆభరణ= నగలు; కాయ= శరీరాలు; శస్త్ర= ఆయుధాలు- వీటియొక్క; ఖండ= ముక్కల; జాలంబులన్= గుంపులతో; పలుచ+కాకుండన్= పలచగాకాక (దట్టంగా); కుంకుమము= కుంకుమపువ్వును; అలఁది= పూసుకొని; పెక్కు+తెఱఁగు తొడవులన్= పలురకాలైన నగలను; తొడిగిన= ధరించిన; తెఱవ+పోలెన్= ఆడదానిమాదిరి; చాలన్= అధికంగా; పొలిచెన్= ప్రకాశించింది.

తాత్పర్యం: నెత్తుటితో బాగా తడిసి, నగలు, శరీరాలు, ఆయుధాలు- వీటి తునుకలతో నిండిన భూమి, ఎర్రని కుంకుమలేపనాన్ని దట్టంగా పూసికొని, నానావిధాల నగలు ధరించిన అందగత్తెవలె వెలుగుతూ ఉండినది.

విశేషం: అలం: ఉపమ.

వ. అంత. 163

తాత్పర్యం: ఆ సమయంలో- (తరువాతి పద్యంతో అన్వయం).

క. తిమిరము గవిసినఁ బాండవ । సమితియుఁ గౌరవులు రణము సాలించి నివా
సములకుఁ దగఁ జని రయ్య । ష్టమయామిని నుదితపటువిషాదుం డగుచున్. 164

ప్రతిపదార్థం: తిమిరము= చీకటి; కవిసినన్= క్రమ్ముకోగా; పాండవసమితియున్= పాండవుల సమూహమూ; కౌరవులు= దుర్యోధనాదులు; రణము= యుద్ధం; చాలించి= ముగించి; నివాసములకున్= తమ తమ తావులకు; తగన్= ఒప్పిదంగా; చనిరి= వెళ్ళారు; ఆ+అష్టమ యామినిన్= ఆ ఎనిమిదవనాటి రాత్రిపూట; ఉదిత= పుట్టిన; పటు= గట్టిదైన; విషాదుండు+అగుచున్= ఖేదంకలవాడై.

తాత్పర్యం: చీకటి అంతటా వ్యాపించింది. పాండవులు, కౌరవులు యుద్ధం చాలించి తమ తమ నివాసాలకు వెళ్ళిపోయారు. ఆ ఎనిమిదో నాటిరాత్రి తనసైన్యం చాలా నష్టంకావడంచేత ధుర్యోధనుడి మనస్సు కలతచెందగా (తరువాతి పద్యంతో అన్వయం).

క. కురువిభుఁడు నగరు సొచ్చియుఁ । జొరమిన గాంధారవిభుని సూతతనూజుం
ద్వరితముగఁ బిలువు మని యా । తురతం బలుమాఱుఁ జెప్పె దుశ్శాసనుతోన్. 165

ప్రతిపదార్థం: కురువిభుఁడు= దుర్యోధనుడు; నగరు= తన రాజభవనాన్ని; చొచ్చియున్= ప్రవేశించియు; చొరమిన్+అ= ప్రవేశింపకయే; దుశ్శాసనుతోన్= తన తమ్ముడు దుశ్శాసనుడితో; త్వరితముగన్= వేగంగా; గాంధారవిభునిన్= గాంధారదేశపురాజు శకునిని; సూతతనూజున్= సూతపుత్రుడు కర్ణుడిని; పిలువుము+అని= పిలుచుకొనిరమ్మని; ఆతురతన్= ఆత్రంతో; పలుమాఱున్= చాలాసార్లు; చెప్పెన్= చెప్పాడు.

తాత్పర్యం: దుర్యోధనుడు తన భవనంలోకి అడుగుపెట్టీపెట్టకముందే 'శకునిని, కర్ణుడిని ఇప్పుడే వేగంగా పిలుచుకొనిరమ్ము' అని ఆత్రంతో ఆ దుశ్శాసనుడితో మరీ మరీ చెప్పాడు.

వ. చెప్పిన నతండు వారిం గూర్చికొని వచ్చుటయు నేకాంతంబున నమ్మహీకాంతుండు వారలతో ని ట్లనియె
'గాంగేయ గురుకృపాశ్వత్థామలు మధ్యస్థ లై పాండవబలంబులం జెఱుచునట్టి సంరంభంబునకుం జొరరు.
మనసేనలు నానాటికి సన్నంబు లై సమయుచువచ్చె నేమి సేయంగలవార?' మనిన విని రాధేయుండు
రణక్రీడాలంపటుం డై. 166

ప్రతిపదార్థం: చెప్పినన్= చెప్పగానే; అతండు= ఆ దుశ్శాసనుడు; వారిన్= ఆ శకుని కర్ణులను; కూర్చికొని= చేర్చుకొని; వచ్చుటయున్= రాగానే; ఏకాంతమ్మునన్= రహస్యంగా; వారలతోన్= ఆ వచ్చినవారితో; ఆ+మహీకాంతుండు= ఆ రాజు-దుర్యోధనుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు; గాంగేయ, గురుకృప+అశ్వత్థామలు= భీష్ముడు, ద్రోణుడు, కృపుడు, అశ్వత్థామలు; వీరు; మధ్యస్థులు+ఐ= ఉదాసీనులయి; పాండవబలంబులన్= పాండవులసేనలను; చెఱచు+అట్టి= చంపేటటువంటి; సంరంభంబునకున్= ఆటోపమునకు; చొరరు= పూనరు; మనసేనలు= మన (కౌరవుల) సైన్యాలు; నాఁడు+నాఁటికిన్= దినదినానికి; సన్నంబులు+ఐ= కృశించినవై; సమయుచున్ వచ్చెన్= చచ్చిపోతున్నాయి; ఏమిసేయన్+కలవారము?= మన మేమి చేయగలము?; అనినన్; రాధేయుండు= రాధకొడుకు - కర్ణుడు; విని= ఆలకించి; రణక్రియాలంపటుండు+ఐ= యుద్ధమాడటంలో ఆశ కలవాడై.

తాత్పర్యం: దుర్యోధనుడు అట్లు చెప్పగానే దుశ్శాసనుడు వెళ్ళి శకుని కర్ణులను వెంటబెట్టుకొని వచ్చాడు. వాళ్లతో దుర్యోధనుడు రహస్యంగా 'భీష్ముడు, ద్రోణుడు, కృపుడు, అశ్వత్థామ వీళ్ళు నలుగురును మధ్యస్థంగా ఉంటూ పాండవులసైన్యాలను చంపే సంరంభం కూడా చేయటం లేదు. మనసేనలేమో దినదినానికీ తరిగిపోతున్నాయి. కనుక ఇప్పుడు మనం ఏం చెయ్యాలి?' అని అన్నాడు. ఆ మాటలు విని కర్ణుడు యుద్ధమాడటం అంటే చాలా ఇష్టం కలవాడై

క. నరనాథ! యింక భీష్ముని । దురమునకుం దేకు మేను దోర్బలవిభవో
ద్ధురతం బాండుకుమారో । త్కరముం దత్సేనలన్ మదం బడఁగింతున్.' 167

ప్రతిపదార్థం: నరనాథ!= ఓ ప్రభూ! దుర్యోధనా! ఇంకన్= ఇకమీద; భీష్మునిన్= భీష్మాచార్యుడిని; దురమునకున్= యుద్ధానికి; తేకుము= తేవద్దు; ఏను= నేను (కర్ణుడు); దోః+బలవిభవ+ఉద్ధురతన్= భుజబల సంపత్తి యొక్క ఆధిక్యంతో; పాండుకుమార+ఉత్కరమున్= పాండురాజు కొడుకులగుంపును; తద్+సేనలన్= ఆపాండవుల సేనలను; మదంబు= పొగరును; అడఁగింతున్= అణచివేస్తాను.

తాత్పర్యం: 'ఓ దుర్యోధనా! ఇకమీద ఆ భీష్ముడిని యుద్ధానికి తీసికొని పోవలదు. నేను నా భుజబలసంపత్తి పెంపుతో, ఆ పాండవులు ఐదుగురినీ వారి సేనలను మార్కొని - మదమణిగే విధంగా యుద్ధం చేస్తాను.'

క. అని పలికిన విని దుశ్శా । సనుఁ గనుఁగొని మనము పోయి శాంతనవుని భం
డన ముడిపి వత్త మని చె । ప్పి నరేంద్రుఁడు వీడుకొల్పెఁ బెఱవారిఁ దగన్. 168

ప్రతిపదార్థం: అని= ఈ విధంగా; పలికినన్= (కర్ణుడు) చెప్పగా; విని= ఆలకించి; నర+ఇంద్రుఁడు= రాజైన దుర్యోధనుడు; దుశ్శాసనున్= తమ్ముడు దుశ్శాసనుణ్ణి; కనుఁగొని= చూచి; మనము= మన మిద్దరం; పోయి= వెళ్ళి; శాంతనవుని భండనము= భీష్ముడి యుద్ధాన్ని; ఉడిపి= చాలింపచేసి; వత్తము= వద్దాము; అని చెప్పి= అని పలికి; పెఱవారిన్= ఇతరులను; తగన్= తగినట్లుగా; వీడుకొల్పెన్= పంపివేశాడు.

తాత్పర్యం: దుర్యోధనుడు కర్ణుడి మాటలు విన్నాడు. దుశ్శాసనుడివైపు తిరిగి, 'మనం భీష్ముడి యుద్ధాన్ని నిలిపివద్దాము' అని చెప్పి, మిగిలినవాళ్ళను అక్కడి నుండి బయటకు పంపాడు.

వ. ఇట్లు కర్ణసౌబలుల నిజనివాసంబులకుం బోవం బనిచి బహుప్రకార సౌరభసంవాసితంబులగు జలంబుల జలకం బాడి పరమసురభిచందనానులేపనంబులను జీనిచీనాంబరపరిధానంబులను మహనీయ మాల్యాభరణంబులను బ్రస్ఫీతమణిమయ భూషణధారణంబులను దగ నలంకృతుం డై తమ్ములుం దగువారలుం బరివేష్టింపఁ బరిమళపరంపరాభాసితనూతనతైలధారాభిషేక ప్రదీపితంబులయిన కరదీపికాసహస్రంబులు వెలుంగ వేత్రహస్తులు దొలంగుఁడు తొలంగుండని సందడి నెడ గలుగ జడియ వందిసందోహంబులు సంకీర్తనంబులు సేయ మాగధమంజులగానంబులు వీనులం బొరయఁ బాఠక పఠనరవంబుల మనంబు రంజిల్ల రమణీయరత్నఖచితం బగు రథం బెక్కి మందగమనంబున మందాకినీనందనుమందిరంబు సేరం జని తదీయద్వారంబునం దేరు డిగ్గి దుశ్శాసను ముంజేయి కరతలంబున నవలంబించి యల్లన నడచి యుచితప్రకారంబునం బ్రవేశించి యప్పితామహు పాదంబులకుం బ్రణామంబులు సేసి తత్పీఠ సమీపంబున సమంచిత కనకాసనంబున నతం డనుప నాసీనుం డై చేతులు మొగిచి యమ్మనుజపతి యతనితో నిట్లనియె. 169

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; కర్ణసౌబలులన్= కర్ణుడిని, శకునిని; నిజనివాసంబులకున్= తమ భవనాలకు; పోవన్= పోవడానికి; పనిచి= పంపి; బహుప్రకార= నానావిధాలైన; సౌరభ= వాసనలచేత; సంవాసితంబులు+అగు= వాసనగలవిగా చేయబడిన, జలంబులన్= నీళ్ళతో; జలకంబు+ఆడి= స్నానంచేసి; పరమ= మేలైన; సురభి= వాసనతో కూడిన; చందన= గంధము యొక్క; అనులేపనంబులను= మైపూతల చేతను; చీనిచీనాంబర పరిధానంబులను= పట్టు ధోవతి, పైకండువాలతో; మహనీయమాల్య+

ఆభరణంబులను= జిగేలుమనిపించే పూలదండలతో, ప్రస్ఫీత= మిక్కిలి అధికమైన; మణిమయ= రత్నాలు చెక్కిన; భూషణ= అలంకారాల; ధారణంబులను= ధరించటం చేత; తగన్= ఒప్పిదంగా; అలంకృతుండు+ఐ= అలంకరించుకొన్నవాడై; తమ్ములున్= తన తమ్ములు దుశ్శాసనాదులు; తగువారలున్= ఉండతగ్గవారును; పరివేష్టింపన్= తన్ను చుట్టి ఉండగా; పరిమళ= వాసనలయొక్క; పరంపరా= వరుసలచేత; ఆభాసిత= అంతటను వెలుగునిచ్చే; నూతన= అప్పుడే గానుగ నుండి తెచ్చిన; తైల= నూనెయొక్క; ధారా= ధారల యొక్క; అభిషేక= స్నానంచేత; ప్రదీపితంబులు+అయిన= వెలుగిచ్చేటివైన; కరదీపికా సహస్రంబులు= చేదివిటీలవేలు; వెలుంగన్= వెలుగుతుండగా; వేత్రహస్తులు= బెత్తాలు చేతపట్టుకొన్న సేవకులు; తొలంగుఁడు+తొలంగుఁడు+అని= దూరంగా జరిగి ఉండండి అని; సందడిన్= జనాన్ని తొలగించడంచేత; ఎడన్= అవకాశము; కలుగన్= ఏర్పడునట్లు; జడియన్= తొలగించగా; వందిసందోహంబులు= బట్టువారి గుంపు; సంకీర్తనంబులు+చేయన్= పొగడ్తలు చేయగా; మాగధమంజుల గానంబులు= ప్రభువు వంశాన్ని, వీరత్వాన్ని పొగిడేవారి ఇంపైన పాటలు; వీనులన్= చెవులకు, పొరయన్= సోకగా; పాఠక పఠన రవంబులన్= చదివేవారి చదువుల శబ్దాలచేత; మనంబు= మనస్సు; రంజిల్లన్= రసాన్ని అనుభవించగా; రమణీయ రత్న+ఖచితంబు+అగు= మనోహరాలైన మణులు తాపినట్టి; రథంబున్+ఎక్కి; మందగమనంబునన్= మెల్లగా ప్రయాణిస్తూ మందాకినీ నందను మందిరంబు= భీష్ముడి భవనాన్ని; చేరన్+చని= చేరునట్లు వెళ్ళి, తదీయద్వారంబునన్= ఆ భవనం గడప వద్ద; తేరుడిగ్గి= రథాన్నుండి దిగి; దుశ్శాసనుముందు+చేయి= దుశ్శాసనుడి చేతిని; కరతలంబునన్= తన చేతితో, అవలంబించి= పట్టుకొని; అల్లన= మెల్లగా; నడచి= అడుగులు వేసి; ఉచిత ప్రకారంబునన్= తగినరీతిగా; ప్రవేశించి= లోనికిపోయి; ఆ+పితామహుపాదంబులకున్= ఆ భీష్ముడి పాదాలకు; ప్రణామంబులు= దండాలు; చేసి= పెట్టి; తద్+పీఠసమీపంబునన్= ఆ భీష్ముడి ఆసనానికి దగ్గరగా; సమంచిత కనక+ఆసనంబునన్= మేలైన బంగారు పీఠంమీద; అతండు= ఆ భీష్ముడు; అనుపన్= ఆజ్ఞాపించగా; ఆసీనుండు+ఐ= కూరుచున్న వాడై; చేతులు మొగిచి= చేతులు జోడించి; ఆ+మనుజపతి= ఆ దుర్యోధనుడు; అతనితోన్= ఆ భీష్ముడితో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: దుర్యోధనుడు ఈ విధంగా కర్ణుడిని, శకునిని, వారి నివాసాలకు పంపించి వేశాడు. పన్నీరు, అత్తరు వంటి సువాసన ద్రవ్యాలతో గుబాళించే నీటితో స్నానం చేశాడు. మంచి వాసనగల మేలుగంధం, ఒంటికి దట్టంగా పూసుకొన్నాడు. పట్టుబట్టలు కట్టుకొన్నాడు. పట్టుకండువాలుపైన వేసుకొన్నాడు. వాసనగల పూలదండలు తగిలించుకొన్నాడు. వ్యాపించే కాంతిగల రత్నాలు పొదిగిన బాహుపురులు, మెరపుగల నగలు, పెట్టుకొన్నాడు. ఉచితమైన పరివారం అనుసరించగా, వాసనలు విరజిమ్మే కొత్త నూనెలు పోయటంచే జగజ్జేగీయమానంగా వెలిగే చాలా చేదివిటీలు వెలుగుతూండగా, భటులు బెత్తాలు చేత పట్టుకొని, 'తొలగండి తొలగండి' అని జనాన్ని అదలిస్తుండగా, ఏర్పడ్డ అవకాశంలో(సందు) భట్రాజులు పొగడుతు ఉండగా, మాగధులు ప్రభువు యొక్క ప్రాభవాన్ని పాడుతూ ఉంటే ఆలకిస్తూ, చదివే వాళ్ళ చదువులు మనస్సుకు ఇంపుగొల్పుతూ ఉంటే, మేలి రత్నాలు తాపిన తేరెక్కి, మందగమనంతో భీష్ముడి నివాసానికి చేరుకొని, ఆ భవన ద్వారం వద్ద తేరుదిగి, దుశ్శాసనుడి చేతిని ఆధారంగా పట్టుకొని, మెల్లగా అడుగులుపెడుతూ, తగిన విధంగా వినయంగా లోపలికి పోయి, భీష్ముడి అడుగులకు దండాలు పెట్టి, ఆయన పీఠానికి దగ్గరలో, ఒప్పిదమైన బంగారుపీటమీద ఆయన అనుమతితో కూర్చొని చేతులు జోడించి, దుర్యోధనుడు భీష్ముడితో ఇట్లా అన్నాడు.

మ. నిను మున్నెంతయు నమ్మి పాండవుల యున్మేషంబు నేఁ జీరికిం
గొన నీపోరెడు చందముల్ దెలియఁ బెక్కుల్ సూచితిం జేరి చే
రి నయం బిచ్చుచు నొంప నూల్కొనక వారిం బట్టి పాలార్చె దొం
డన నేరం గురుముఖ్య! యింక నిట నీ వాలంబు సాలింపవే! 170

ప్రతిపదార్థం: కురుముఖ్య!= కురువంశంలో ప్రధానుడవైన భీష్మా!; నినున్; మున్ను= మొదట, ఎంతయున్= ఎంతగానో; నమ్మి= విశ్వసించి; పాండవుల యున్మేషంబున్= పాండురాజు కొడుకుల వికాసాన్ని; ఏన్= నేను; చీరికిన్+కొనన్= లెక్కపెట్టను; నీ పోరెడుచందముల్= నీవు యుద్ధం చేసేవిధానాలను; తెలియన్= విశదం కావడానికి; పెక్కుల్= చాలా; చూచితిన్= చూచాను, వారిన్= ఆ పాండవులను; చేరి చేరి= దగ్గరకు చేరికూడా; నయంబు+ఇచ్చుచున్= మెత్తదనాన్ని చూపిస్తూ; నొంపన్= బాధపెట్టడానికి; నూల్కొనక= ఒప్పుకోకుండా; పట్టి పాలార్చెదు= చేత చిక్కించుకొని కూడా ఊరకుంటున్నావు; ఒండు అనన్+నేరన్= ఒక్కటీ నిన్ను అనలేను; ఇంకన్= ఇకమీద; ఇటన్= ఇక్కడ; నీవు; ఆలంబు= యుద్ధం చేయటాన్ని; చాలింపవే!= వదలిపెట్టుము!

తాత్పర్యం: 'ఓ భీష్మా! మొదటి నుండి నిన్ను నమ్మి, పాండవుల వికాసాన్ని లక్ష్యం చేయకుండా ఉంటూ వచ్చాను. అయితే, నీవు చాలా సందర్భాలలో యుద్ధం చేస్తున్న తీరు గమనిస్తే నాకు అర్థమవుతున్నది ఏమిటంటే- నీవు పాండవులపట్ల మెత్తదనాన్నే చూపిస్తున్నావు. వాళ్ళకు నొప్పి కలిగించకుండా ఉంటున్నావు. వాళ్ళు చేత చిక్కినా ఏమీ చేయటం లేదు. కాబట్టి నీవు ఇంక యుద్ధం చేయకుము.

చ. అనిమొన దేవదానవుల కైనను మార్కొనరాదు నిన్ను నేఁ
డెనిమిది నాళ్కు లయ్యె సమయింపవు నొంపవు సవ్యసాచి న
ప్పని యటులుండనిమ్ము నినుఁ బ్రార్థన సేసెద నింతవట్టు నా
చనవునఁ బోవ నిచ్చి నృపసత్తమ పోరికిఁ గర్ణుఁ బంపవే! 171

ప్రతిపదార్థం: నృపసత్తమ!= రాజుల్లో గొప్పవాడవైన భీష్మా!; అనిమొనన్= యుద్ధరంగంలో; దేవదానవులకున్+ఐనను= దేవతలకుగానీ, రాక్షసులకుగానీ; నిన్ను; మార్కొనన్+రాదు= ఎదిరించడానికి సాధ్యంకాదు; నేఁడు= నేటికి; ఎనిమిదినాళులు+అయ్యెన్= యుద్ధం మొదలుపెట్టి నేటికి, ఎనిమిది దినాలు గడిచినాయి; సవ్యసాచిన్= అర్జునుడిని; సమయింపవు= చంపవు; నొంపవు= బాధకూడా పెట్టలేదు; ఆ+పని= అర్జునుణ్ణి హింసించే ఆ పని; అటులు ఉండనిమ్ము; అట్లా ఉండనీ; నినున్= నిన్ను; ఇంత+పట్టు= ఇంతమాత్రం; ప్రార్థన+చేసెదన్= వేడుకొంటున్నాను; నా చనవునన్= నా కోరిక ప్రకారం; పోవన్+ఇచ్చి= నన్ను నడుచుకునేటట్లు చేసి; కర్ణున్= కర్ణుడిని; పోరికిన్= యుద్ధానికి; పంపవే?= పంపవా?.

తాత్పర్యం: తాతా! భీష్మా! నిన్ను యుద్ధంలో దేవతలుగాని, రాక్షసులుగాని ఎవ్వరూ ఎదుర్కొనలేరు. యుద్ధంమొదలుపెట్టి ఈనాటికి ఎనిమిది రోజులు గడిచాయి. నీవేమో ఈ నాటిదాకా అర్జునుడిని చంపలేదు. చివరకు బాధించనుకూడా లేదు. సరే ఆ పని అట్లా ఉండనిమ్ము. నిన్ను మాత్రం వేడుకొంటున్నాను, అదేమంటే నన్ను నా కోరిక ప్రకారం నడుచుకోనిమ్ము, ఇక యుద్ధానికి కర్ణుడిని పంపించుము.

వ. అనవుడు. 172

తాత్పర్యం: దుర్యోధనుడు ఇట్లా అనగా (తరువాతి పద్యంతో అన్వయం)

క. అమ్మాట మనమునకు వా । లమ్మై తాఁకుటయు భీష్ముఁ డత్యంతవిషా
దమ్మున నించుకవడి మౌ । నమ్మున్ దగం దాల్చియుండె నతవదనుం డై. 173

ప్రతిపదార్థం: భీష్ముఁడు= భీష్మాచార్యుడు; ఆ+మాట= దుర్యోధనుడన్న ఆపలుకు; మనమునకున్= మనస్సుకు; వాలు+అమ్ము+ఐ= వాడి బాణంగా; తాఁకుటయున్= గ్రుచ్చుకోగా; అత్యంత విషాదమ్మునన్= చాల దుఃఖంతో; ఇంచుక+వడి= కొంచెంసేపు; తగన్= ఆ దుఖానికి తగినట్లుగా; మౌనమ్మున్= మౌనాన్ని; తాల్చి= వహించి; నతవదనుండు+ఐ= వంచబడ్డ ముఖం కలవాడై; ఉండెన్= ఉండినాడు.

తాత్పర్యం: ఆ దుర్యోధనుడు పలికిన పలుకులు ములుకులుగా భీష్ముడి మనస్సున గ్రుచ్చుకొన్నాయి. భీష్ముడు చాలా బాధతో, తలవంచుకొని ఏమీ మాట్లాడకుండా కొంచెంసేపు మౌనంగా ఉండి పోయాడు.

వ. పదంపడి నిట్టూర్పు నిగిడించి మొగం బెగయించి భూపాలు నాలోకించి. 174

ప్రతిపదార్థం: పదంపడి= అటు తర్వాత; నిడు+ఊర్పు= దీర్ఘమైన నిశ్వాసం; నిగిడించి= వదలిపెట్టి; మొగంబు= ముఖాన్ని; ఎగయించి= పైకెత్తి; భూపాలున్= రాజైన దుర్యోధనుడిని; ఆలోకించి.

తాత్పర్యం: భీష్ముడు అంతట పెద్ద నిట్టూర్పు వదలి, ముఖం పైకెత్తాడు. రారాజును చూచి.

క. ‘తలకొని నీకుం బ్రాణంబులు డాఁ। పక యోపినట్లు పోరఁగ నిమ్మెఁ
బలుకఁదగునె? యక్కట! నా। వలనం గలభక్తి యెల్ల వమ్మునఁ గలయన్? 175

ప్రతిపదార్థం: అక్కట!= అయ్యో! తలకొని= ప్రయత్నపడి; నీకున్= దుర్యోధనుడవైననీకు; ప్రాణంబులు= ప్రాణాలను; డాఁపక= దాచుకోక; ఓపిన అట్లు= చేతనైనంతవరకు; పోరఁగన్= (నేను) యుద్ధం చేస్తే; నావలనన్= నాపట్ల; కల= ఉన్నట్టి; భక్తి+ఎల్లన్= ప్రభుభక్తి అంతాకూడా; వమ్మునన్+కలయన్= వ్యర్థమైపోగా; ఈ+ మెయిన్= ఈ విధంగా; పలుకన్= మాట్లాడటం; తగునె?= తగునా? (తగదు).

తాత్పర్యం: ‘దుర్యోధనా! నీకు జయం కలగాలని నా ప్రాణాలను కూడా దాచుకోకుండా శక్తి వంచన లేకుండా నేను యుద్ధం చేస్తూ ఉంటే నాకుగల ప్రభుభక్తి అంతా బుగ్గిపాలయ్యేట్లు నీవు ఈ విధంగా కఠినంగా మాట్లాడడం ఏమి న్యాయం?’ అన్నాడు భీష్ముడు.

వ. అని పలికి యలుక వొడమి వెండియు. 176

ప్రతిపదార్థం: అని పలికి= అని చెప్పి; అలుక= కోపము; పొడమి= పుట్టి; వెండియున్= మరల

తాత్పర్యం: అని, కోపంతో మండిపడుతూ. (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. ‘కాల్పడే మహనీయ ఖాండవం బింద్రుని। నమరగణంబుతో విముఖుఁ జేసి?
బహుదివ్యశరములు వడయఁడే? యెక్కటి। బవరాన మెప్పించి శివునిచేత?
గంధర్వులకు నోడి కర్ణుండు నీ తమ్ము। లును బాఱ విడిపించికొనఁడె నిన్ను?
నిను ననుఁ ద్రోణు నాతని పుత్త్రుఁ గృపుఁ గర్ణు। గెలిచి విరాటుగోవులఁ గొనండె?

ఆ. తక్కు పెక్కులెడలఁ బెక్కండ్ర నేమేమి। సేసె వినమె? యట్టి జెట్టి నిన్ని
దినము లిట్లు దొడరి పెనఁగియు నీ చేత। నేఁడు వినఁగ వలసె వేఁడిపలుకు. 177

ప్రతిపదార్థం: అమరగణంబుతోన్= దేవతల సమూహంతోపాటు; ఇంద్రునిన్= దేవేంద్రుణ్ణి; విముఖున్+చేసి= యుద్ధానికి పెడమొగం పెట్టేవాడిగా చేసి; మహనీయఖాండవంబున్= మాననీయమైన ఖాండవం అనే అరణ్యాన్ని; కాల్పఁడు+ఏ?= కాల్చలేదా?; ఎక్కటి= తనకు సహాయుడు లేనట్టి; బవరానన్= యుద్ధంలో; మెప్పించి; శివునిచేతన్= ఈశ్వరుడి చేత; బహుదివ్య శరములు= నానావిధాలైన దివ్యములైన బాణాలను; పడయఁడు+ఏ?= పొందలేదా?; కర్ణుండు= సూతపుత్రుడు; నీ తమ్ములునున్= నీ తమ్ముళ్ళు దుశ్శాసనాదులు; గంధర్వులకున్= గంధర్వుల దెబ్బకు; పాఱన్= పరుగుతీయగా; నిన్నున్; విడిపించికొనఁడు+ఎ?= విడిపించుకోలేదా?; నిను(న్)= నిన్ను (దుర్యోధనుడిని); ననున్= నన్ను; ద్రోణున్= ద్రోణాచార్యుడిని; ఆతనిపుత్త్రున్= ద్రోణుడి

కుమారుడు అశ్వత్థామను; కృపున్= కృపాచార్యుడిని; కర్ణున్= కర్ణుడిని; గెలిచి= జయించి; విరాటు గోవులన్= విరాటరాజు ఆవులను; కొనండు+ఎ?= మళ్ళించుకోలేదా?; తక్కు= తక్కిన; పెక్కులు+ఎడలన్= పలు తావులలో; పెక్కండ్రన్= చాలామంది వీరులను; ఏమి+ఏమి+చేసెన్= ఏమేమి చేశాడో; వినము+ఎ?= మనం వినలేదా?; అట్టిజెట్టిన్= అట్టి మహా శూరుడైన అర్జునుడిని; ఇన్ని దినములు= ఈ ఎనిమిది రోజులు; ఇట్లు= ఇంతఘోరంగా; తొడరి= ఎదిరించి; పెనఁగియున్= యుద్ధం చేసికూడా; నేఁడు= ఈ దినం; నీ చేతన్= నీచేత; వేఁడి పలుకు= తీక్ష్ణమైన మాట; వినఁగ+వలసెన్= వినవలసి వచ్చింది.

తాత్పర్యం: 'దేవతలతో పాటు, దేవేంద్రుడంతటి వాడిని కూడా యుద్ధానికి పెడమొగం పెట్టే వాడినిగా చేసి ఖాండవ వనాన్ని కాల్చివేశాడు కదా! తాను ఏకాకిగా యుద్ధం చేసి శివుడంతటి వాడిని మెప్పించి, పాశుపతం మొదలైన దివ్యాస్త్రాలు సంపాదించుకొన్నాడు కదా! నీవు, నీ తమ్ముళ్ళు, కర్ణుడు అందరూ గంధర్వుల దెబ్బకు నిలువలేకపారిపోగా, వారి బారినుండి ఆ అర్జునుడు నిన్ను విడిపించుకొన్నాడు గదా! ఉత్తర గోగ్రహణంలో, నిన్ను, నన్ను, ద్రోణుడిని, ఆయన కొడుకును, కృపుడిని, కర్ణుడిని ఒక్కడే గెలిచాడు కదా! ఇంకా ఎన్నెన్నో చోట్ల ఎందరెందరినో ఏమేమి చేశాడో మనం విన్నాం కదా! అలాంటి వీరుడితో ఈ ఎనిమిది దినాలు ఎదిరించి యుద్ధం చేసినట్టి నేను ఈనాడు, నీచేత చుఱుకుమనిపించే మాటలు వినవలసి వచ్చింది. (అని భీష్ముడు వాపోతున్నాడు.)

క. తగనిపని యని తలంపక । పగ గొంటి వజేయులైన పాండుసుతులతోఁ
దెగి యింక నీవు రణమున । మగఁటిమి వాటింపు రిత్తమాటల నగునే? 178

ప్రతిపదార్థం: తగనిపని+అని= చేయరాని పని అని; తలంపక= ఆలోచించకుండా; అజేయులు+ఐన= జయింపరానివారైన; పాండుసుతులతోన్= పాండురాజు కొడుకులతో; పగ+కొంటివి= విరోధాన్ని పూనావు; ఇంకన్; నీవు; తెగి= సాహసించి; రణమునన్= యుద్ధంలో; మగటిమిన్= పౌరుషాన్ని; పాటింపు(ము)= ప్రకటించుము; రిత్తమాటలన్= ఉత్త ఉత్తమాటలతో; అగునే?= సమకూడునా?

తాత్పర్యం: కాని పని అనే ఆలోచన లేకుండా, జయింపరాని పాండవులతో విరోధాన్ని కొని తెచ్చుకొన్నావు. ఇంక నీవు యుద్ధంలో సాహసంతో పౌరుషాన్ని బాగా చూపుము. అంతేగాని, కల్లబొల్లి మాటలతో ఏమి ప్రయోజనం?

వ. అని మఱియును. 179

తాత్పర్యం: ఇంకను,

క. 'గాండీవి గెలువ రాదు శి । ఖండిని జంపంగ నాకుఁ గాదు వినుము న
న్నొండుమగలు మార్కొనినం । జెండుదు నుగ్రముగ మున్న చెప్పితి నీకున్. 180

ప్రతిపదార్థం: నాకున్= భీష్ముడనైన నాకు; గాండీవిన్= అర్జునుడిని; గెలువన్‌రాదు= జయించ వీలుకాదు; శిఖండిని= ద్రుపదుని కొడుకు శిఖండిని; చంపఁగన్= చంపడానికి; కాదు= నావల్ల కాదు; వినుము; ఒండు+మగలు= వేరే వీరులు, నన్నున్; మార్కొనినన్= ఎదిరిస్తే; ఉగ్రముగన్= భయంకరంగా; చెండుదున్= నరుకుతాను; నీకున్; మున్ను+అ= ముందుగానే; చెప్పితిన్= ఈ మాట చెప్పాను.

తాత్పర్యం: దుర్యోధనా! నేనేమో అర్జునుడిని జయించలేను, శిఖండిని కూడా చంపలేను, బాగా వినుము. తక్కినవారు ఎంతటి వీరులైనా సరే, నన్నెదిరించారంటే చీల్చిచెండాడుతాను. ఈ సంగతి నీకు ఇంతకు ముందే చెప్పాను.

క. ఏనును నాదళమున ద్రుప । దానీకవిరాటసైన్యయాదవబలసం
తానములతోడఁ బెనఁగెదఁ । బూనుఁడు మీ రెల్లఁ బాండుపుత్త్రుల గెలువన్. 181

ప్రతిపదార్థం: ఏనును= నేను; నా దళమునన్= నా సైన్యంలో; ద్రుపద= ద్రుపదమహారాజుయొక్క; అనీక= సైన్యంతో; విరాట= విరాటరాజుయొక్క; సైన్య= దండుతో; యాదవ= యదువంశంలో పుట్టినవారియొక్క; బల= సేనయొక్క; సంతానములతోడన్= సమూహాలతో; పెనఁగెదన్= యుద్ధం చేస్తాను; మీరు+ఎల్లన్= మీరందరుకలిసి; పాండుపుత్త్రులన్= పంచపాండవుల్ని; గెలువన్= జయించటానికి; పూనుఁడు= ప్రయత్నపడండి.

తాత్పర్యం: నేనూ, నా సైన్యం కలిసి ద్రుపద విరాట యాదవ సేనా సమూహాన్ని ఎదుర్కొని యుద్ధం చేస్తాము. తక్కిన మీరందరూ ఏకమై పాండవులను గెలవటానికి ప్రయత్నించండి.

ఆ. నడికిరేయి వచ్చి ననుఁ నొవ్వ బలికినఁ । కలుగునయ్య జయము? గడఁగి నీవు
నడవు మనికి నెల్లి నా చేతి బలుపు సూ । చెదవుగాక వేయి సెప్పనేల?' 182

ప్రతిపదార్థం: నడికిరేయి= అర్ధరాత్రివేళలో; వచ్చి= నా సమీపానికి వచ్చి; ననున్= నన్ను; నొవ్వన్= నొప్పి కలిగేట్లుగా; పలికినన్= మాటాడితే; జయము= గెలుపు; కలుగున్+అయ్య?= లభిస్తుందా?; నీవు; కడఁగి= ప్రయత్నించి; అనికిన్= యుద్ధానికి; నడవుము= బయలుదేరుము; వేయి= వెయ్యిమాటలు; చెప్పన్+ఏల?= చెప్పడం ఎందుకు?; ఎల్లి= రేపు; నా చేతి బలుపు= నా బాహుబలాన్ని; చూచెదవుగాక= చూస్తావులే.

తాత్పర్యం: 'దుర్యోధనా! అర్ధరాత్రి సమయంలో వచ్చి నీవు నన్ను బాధకలిగేట్లుగా సూటిపోటి మాటలు మాట్లాడినావుకదా! దీని చేత గెలుపు కలుగుతుందా? నీవు రేపు యుద్ధానికి సన్నద్ధుడవై వెళ్ళుము. వేయి మాటలు పలకటం ఎందుకు? నా బాహుబలాన్ని రేపు నీవు చూస్తావులే!'

క. అనినఁ బ్రియమంది నగరికిఁ । జని పతి సుఖనిద్ర సేసి సముచితసమయం
బున మేలు కాంచి కయ్యం । బున కాయిత మయ్యె మేను పొంగారంగాన్. 183

ప్రతిపదార్థం: అనినన్= భీష్ముడు చెప్పగా; పతి= రాజు; ప్రియము+అంది= సంతోషపడి; నగరికిన్= తన రాజ భవనానికి; చని= వెళ్ళి; సుఖనిద్ర+చేసి= సుఖంగా నిద్రించి; సముచిత సమయంబునన్= తగిన వేళలో; మేలుకాంచి= నిద్రనుండి మేల్కొని; మేను= శరీరం; పొంగు+ఆరంగాన్= ఉబ్బగా; కయ్యంబునకున్= యుద్ధానికి; ఆయితము+అయ్యెన్= సిద్ధపడ్డాడు.

తాత్పర్యం: భీష్ముడన్న మాటలకు దుర్యోధనుడు సంతోషించి, నగరులోనికి వెళ్ళి, బాగా నిద్రపోయి, సకాలంలో లేచి, తన శరీరం ఉప్పొంగిపోతూండగా యుద్ధానికి తయారయ్యాడు.

వ. ఇట్లు సన్నద్ధుం డయి బలంబుతో వెడలి నీ పుత్త్రుండు భీష్ము నుపలక్షించి భూపతిప్రకరంబులతో ని
ట్లనియె. 184

ప్రతిపదార్థం: నీ పుత్త్రుండు= నీ కొడుకు దుర్యోధనుడు; ఇట్లు చెప్పిన విధంగా; సన్నద్ధుండు+అయి= సిద్ధపడినవాడై; బలంబుతోన్= సైన్యంతో; వెడలి= బయలుదేరి; భీష్మున్= భీష్ముడిని; ఉపలక్షించి= చూచి; భూపతిప్రకరంబులతోన్= రాజుల సమూహముతో; ఇట్లు+అనియెన్= ఈ చెప్పబోయే విధంగా అన్నాడు.

తాత్పర్యం: దుర్యోధనుడు యుద్ధానికి సిద్ధపడి, కవచం తొడుగుకొని తన సేనతో వెళ్ళి, భీష్ముడిని చూస్తూ అక్కడ ఉండే రాజులందరితో ఈ విధంగా చెప్పాడు.

భీష్ముని నవమదివస యుద్ధము (సం. 6-95-1)

తే. ' ఇతఁడు పాంచాలు రాదిగ నెల్ల బలముఁ । జంపి పాండుతనూజుల సమరభూమి
గెలువఁ గలవాఁడ నని రాత్రి వలికె నేఁడు । దఱిమి మనలావుఁ జేవయు మెఱయ వలయు.' 185

ప్రతిపదార్థం: ఇతఁడు= ఈ భీష్ముడు; పాంచాలురు+ఆదిగన్= ద్రుపద మహారాజు మొదలుగాగల; ఎల్లబలమున్= సకల సైన్యాన్ని; చంపి; సమరభూమిన్= యుద్ధరంగంలో; పాండుతనూజులన్= పాండవులను; గెలువన్+కలవాఁడన్+అని= గెలుస్తానని, రాత్రి= కడచిన రేయి; పలికెన్= చెప్పాడు; నేఁడు= ఈ దినం; తఱిమి; మనలావున్= మనసామర్థ్యం; చేవయున్= బలంకూడా; మెఱయవలయున్= ప్రకటించవలె.

తాత్పర్యం: 'ఈ భీష్ముడు రాత్రి నాతో ద్రుపద విరాట యాదవుల సైన్యాలను చంపి, యుద్ధరంగంలో అటుపైన పాండవుల గెలిచెదనని అన్నాడు. కాబట్టి మనందరి సామర్థ్యం, బలం ఈ దినమే వెల్లడి కావాలి' అన్నాడు.

క. అని యాడు తులువమాటలు విని । బీభత్సంబు సిగ్గు విపులవిషాదం
బును నొక్కపెట్ట పుట్టఁగ । ననిమిషతటినీతనూజుఁ డతిదుఃఖితుఁడై. 186

ప్రతిపదార్థం: అని; ఆడు= అని పలికే దుర్యోధనుడి యొక్క; తులువమాటలు= కుత్సితపు మాటలు; విని= ఆలకించి; అనిమిషతటినీతనూజుఁడు= ఆకాశగంగానది కొడుకు- భీష్ముడు; బీభత్సంబు= రోత, సిగ్గు, లజ్జ; విపుల విషాదంబును= అధికమైన దుఃఖము; ఒక్కపెట్ట= ఒక్క సారిగా; పుట్టఁగన్= తనలో పుట్టగా; అతి దుఃఖితుఁడు+ఐ= చాలా దుఃఖం చెందినవాడై.

తాత్పర్యం: దుర్యోధనుడు పలికిన అబద్ధపు మాటలు విన్నాడు భీష్ముడు. ఆయనలో ఒక్కుమ్మడిగా ఏవగింపు, లజ్జ, మనోదుఃఖం అధికంగా కలిగాయి.

వ. తన్నుం దానయుపశమించుకొనియున్నంగనుంగొని కౌరవేశ్వరుండతని కన్నెఱింగినవాఁడై దుశ్శాసనునితో నిట్లనియె. 187

ప్రతిపదార్థం: తన్నున్= తనను(భీష్ముని); తాను+అ= తానే (భీష్ముడు); ఉపశమించుకొని= ఊరడింపచేసికొని; ఉన్నన్= ఉండగా; కనుంగొని= చూచి; కౌరవ+ఈశ్వరుండు= దుర్యోధనుడు; అతని= ఆ భీష్ముడి; కన్ను+ఎఱింగినవాఁడు+ఐ= జాడను తెలిసికొన్నవాడై; దుశ్శాసనునితోన్= తన తమ్ముడితో, ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: భీష్ముడు తనను తానే ఓదార్చుకొన్నాడు. దుర్యోధనుడు భీష్ముడి తీరును తెలిసికొని, దుశ్శాసనుడితో ఇట్లా అన్నాడు.

క. ' మనమెల్లఁ బితామహునొ । ద్ధన యుండుద మదియుఁ గా కితనిముందటఁ బె
ట్టన వలయు శత్రుబలమ । ర్దను లిరువదిరెండువేలరథములవారిన్. 188

ప్రతిపదార్థం: మనము+ఎల్లన్= మనమందరం (దుర్యోధనాదులు); పితామహు+ఒద్దన్+అ= తాత భీష్ముడి దగ్గరే; ఉండుదము= ఉందాము; అదియున్+కాక= అంత మాత్రమే కాకుండా; ఇతని ముందటన్= ఈ భీష్ముడికి ముందుగా; శత్రుబల మర్దనులు= విరోధుల సైన్యాలను కొట్టగలిగినట్టి; ఇరువది రెండువేల రథములవారిన్= ఇరవై రెండువేలు రథికులను; పెట్టన వలయున్= ఉంచాలి.

తాత్పర్యం: 'మనమందరం భీష్ముడి దగ్గరే ఉందాము. అంతేకాదు, శత్రుసైన్యాలను బాగా కొట్టగలిగినట్టి ఇరవై రెండువేల రథికులను కూడ ఇతని ముందరే ఉంచాలి.

వ. అని నియోగించిన నతండట్లు చేసె. నద్ధరణీశుండు గురుకృపాశ్వత్థామల నాలోకించి గాంగేయుం జూపి "సత్యవ్రతుండగునీతండు శిఖండిపై నేయనని మన మెత్తి విడియునాఁడ చెప్పుట మీ రెఱుంగుదుర కాదె! యన్నీచునకు గోచరంబు గాకుండ నిమ్మహానుభావుం బొదివికొని రావలయు" ననిన వారలు నట్లకాకయని రయ్యమరనదీసూనుండు సర్వతోభద్రవ్యూహం బొనర్చె నందుఁ గృపాచార్యకృతవర్మ శల్యశకునిసుదక్షిణ సైంధవులును గురుకుమారులుం దానును ముందట నిలిచెఁ దదనుమతిం గుంభసంభవభూరిశ్రవో భగదత్తులు వలపటను, సోమదత్తద్రోణపుత్రవిందానువిందులు దాపటను హలాయుధాలంబుసశ్రుతాయువులు వెనుకను బ్రిగర్త ప్రకరపరివృతుం డై జననాథుండు నడుమను నిలిచి రంతకు మున్న కౌంతేయులు సైన్యసమేతంబుగా వెడలి రట్టియెడ నర్జునుండు మన మొగ్గరంబు సూచి ధృష్టద్యుమ్నున కి ట్లనియె. 189

ప్రతిపదార్థం: అని= పైన చెప్పిన రీతిగా; నియోగించినన్= ఏర్పాటు చేయగా; అతండు= దుశ్శాసనుండు; అట్లు+అ= దుర్యోధనుడు చెప్పిన మాదిరిగానే; చేసెన్= ఏర్పాటు చేశాడు; ఆ+ధరణీశుండు= ఆ దుర్యోధనుడు; కృప+అశ్వత్థామలన్= కృపుడినీ, అశ్వత్థామను; ఆలోకించి= చూచి; గాంగేయున్= భీష్మున్ని; చూపి= చూపించి; సత్యవ్రతుండు+అగు= సత్యమే వ్రతంగాగల; ఈతండు= ఈ భీష్ముడు; శిఖండి= శిఖండిమీద; ఏయన్+అని= బాణాలు వేయనని; మనము= మనము; ఎత్తి విడియునాఁడు+అ= దండెత్తి వచ్చిననాడే; చెప్పుట= చెప్పటాన్ని; మీరు= కృపాశ్వత్థామలు; ఎఱుంగుదురు+అ+కాదె!= మీరు తెలిసికొన్నదే కదా!; ఆ+నీచునకున్= హీనుడైన ఆ శిఖండికి; గోచరంబు కాకుండన్= కంటపడకుండా; ఈ+మహానుభావున్= గొప్ప ప్రభావం కలిగినట్టి భీష్ముడిని; పొదివికొని రావలయున్= క్రమ్ముకొని ఉండాలి; అనినన్= అనిచెప్పగా; వారలున్= ఆ కృపాశ్వత్థామలు కూడ; అట్లు+అ+కాక= అట్లే కానిమ్ము; అనిరి= అన్నారు; ఆ+అమరనదీసూనుండు= ఆకాశ గంగానది కొడుకు- భీష్ముడు; సర్వతోభద్ర వ్యూహంబున్= సర్వతోభద్రమనే మొగ్గరాన్ని; ఒనర్చెన్= చేశాడు; అందున్= ఆ మొగ్గరంలో; కృపాచార్య, కృతవర్మ, శల్య, శకుని, సుదక్షిణ; సైంధవులును, కురుకుమారులున్= కౌరవులున్నూ; తానును= భీష్ముడున్నూ; ముందటన్= మొగ్గరానికి ముందువైపు; నిలిచెన్= నిలిచాడు; తద్+అనుమతిన్= ఆ దుర్యోధనుడి ఆజ్ఞచొప్పున; కుంభసంభవ= ద్రోణుడు; భూరిశ్రవస్, భగదత్తులు-వీరు; వలపటను= కుడిభాగంలో; సోమదత్త= సోమదత్తుడు; ద్రోణపుత్ర= అశ్వత్థామ; వింద+అనువిందులు; దాపటను= ఎడమవైపునందు; హలాయుధ, అలంబుస, శ్రుతాయువులు; వెనుకను= వెనుకభాగంలోను; త్రిగర్త ప్రకరపరివృతుండు+ఐ= త్రిగర్త దేశపు గుంపుతో చుట్టబడి; జననాథుండు= రాజు దుర్యోధనుడు; నడుమను= మధ్యభాగంలోను; నిలిచిరి= నిల్చారు; అంతకు మున్న= అంతకుముందే; కౌంతేయులు= పాండవులు; సైన్య సమేతంబుగాన్= సేనతోకూడ; వెడలిరి= వచ్చారు; అట్టి ఎడన్= ఆ సమయంలో; అర్జునుఁడు= అర్జునుడు; మన= కౌరవులైన మనయొక్క; మొగ్గరంబున్= వ్యూహాన్ని; చూచి; ధృష్టద్యుమ్ననకున్= తమ సేనాని ధృష్టద్యుమ్నుడితో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: దుర్యోధనుడు పైవిధంగా చెప్పి, భీష్ముడిని చూపిస్తూ , కృపాశ్వత్థామలతో ఇట్లా అన్నాడు. 'ఈ సత్యవ్రతుడు శిఖండిమీద బాణప్రయోగం చేయనని మనం - దండెత్తి వచ్చిననాడే చెప్పాడు. ఆ సంగతి మీకు తెలుసుకదా! ఆ నీచుడు శిఖండి ఈయన కంటబడకుండా మనం ఈయనను కమ్ముకొని ఉండాలి'. వారు ఆ మాటకు సమ్మతించారు. భీష్ముడు సర్వతోభద్రవ్యూహాన్ని ఏర్పాటు చేశాడు. ఆ వ్యూహంలో కృపాచార్యుడు, కృతవర్మ, శల్యుడు, శకుని, సుదక్షిణుడు, సైంధవుడు, కౌరవులు, భీష్ముడు ముందుభాగంలో నిలిచారు. భీష్ముడి ఆజ్ఞ చొప్పున ద్రోణుడు, భూరిశ్రవుడు, భగదత్తుడు- కుడి భాగంలోను, సోమదత్తుడు, అశ్వత్థామ, విందుడు, అనువిందుడు- ఎడమవైపున నిలుచున్నారు. హలాయుధుడు, అలంబుసుడు, శ్రుతాయువు- వీరు వెనుక వైపున ఉన్నారు. త్రిగర్త సైన్యంతో చుట్టబడి, దుర్యోధనుడు మధ్యభాగంలో నిలిచాడు. అంతకుమునుపే పాండవులు సేనలతో గూడ బయలుదేరారు. అప్పుడు అర్జునుడు మన సర్వతోభద్రవ్యూహాన్ని చూచి ధృష్టద్యుమ్నుడితో ఇలా అన్నాడు.

విశేషం : సర్వతోభద్రవ్యూహం నాలుగువైపుల నుండి శత్రువులను చొరనీక ఎదిరించడానికి అనువైనది.

తే. ' కంటె గాంగేయు? నతనిచక్కటి శిఖండిఁ । బెట్టు మీతని మనమెల్లఁ బిండుగట్టి
పాదివికొనివత్త మివ్విధంబునకుఁ దగ ద । ళంబుగా మోహరింపు బలంబు నెల్ల.' 190

ప్రతిపదార్థం: గాంగేయున్= భీష్ముణ్ణి; కంటె?= చూచావా?; అతని చక్కటిన్= ఆ భీష్ముడుండే దిక్కున; శిఖండిన్= శిఖండిని; పెట్టుము= నిలబెట్టుము; మనము+ఎల్లన్= మనమందరం; ఈతనిన్= ఈ శిఖండిని; పిండుగట్టి= గుంపుగా; పాదివికొని= క్రమ్ముకొని; వత్తము= వద్దాము; ఈ+విధంబునకున్= ఈ విధానానికి; తగన్= తగినట్టుగా; బలంబు+ఎల్లన్= మన సైన్యాన్నంతా; దళంబు+కాన్= దట్టంగా; మోహరింపు(ము)= సిద్ధంచేయుము.

తాత్పర్యం: 'ధృష్టద్యుమ్నా! భీష్ముడిని చూచావా? అతడికి ఎదురుగా ఈ శిఖండిని నిలబెట్టుము. ఇతడిచుట్టూ మనమంతా కమ్ముకొని గుంపుగానిలుద్దాము. దీనికి తగినట్టుగా నీవు మన సైన్యాన్ని దట్టంగా మోహరింపచేయుము'.

వ. అనిన విని యతం డట్ల చేయుదు నని సాత్యకి విరాటులు వలపటను, అభిమన్యు పాంచాల కేకయులు దాపటను, నకులసహదేవ ద్రౌపదేయపురస్సరుండైన యుధిష్ఠిరుండు నడుమను, జేకితానకుంతి భోజులు వెనుకంగా నొనర్చి యగ్రభాగంబున శిఖండి నునిచి యతనికెలంకుల డాసి భీమసేన ఘటోత్కచు లొక్కవలనను, బార్థుండుఁ దాను నొక్కదిక్కున నిలిచి తక్కినయోధవీరులం గలయం జేర్చి గట్టిమొనగా నమర్చె ని ట్లుభయ సైన్యంబులుం బన్ని భేరీభాంకారశంఖాదినిస్వనగర్జాస్ఫూర్జిత బహుళంబుగా నొండొంటిం దాఁకె నట్టి సమయంబున. 191

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; విని= ఆలకించి; అతండు= ఆ ధృష్టద్యుమ్నుడు; అట్లు+అ+చేయుదున్+అని= అర్జునుడు చెప్పిన విధంగానే వ్యూహం పన్నుతానని చెప్పి; సాత్యకి విరాటులు= సాత్యకి, విరాటుడు; వలపటను= కుడివైపునందు; అభిమన్యు; పాంచాల, కేకయులు; దాపటను= ఎడమప్రక్కన; నకుల= నకులుడు; సహదేవ= సహదేవుడు; ద్రౌపదేయ పురస్సరుండు+ఐ= ద్రౌపది కొడుకులు ముందు నిలిచినవారుగా; యుధిష్ఠిరుండు= ధర్మరాజు; నడుమను= మధ్యభాగంలోను; చేకితాన కుంతిభోజులు; వెనుకను+కాన్= వెనుకవైపు ఉండేటట్లుగా; ఒనర్చి= చేసి; అగ్రభాగంబునన్= ముందుభాగంలో; శిఖండిన్= శిఖండిని; ఉనిచి= పెట్టి; అతని= ఆ శిఖండియొక్క; కెలంకులన్= రెండు ప్రక్క భాగాలలో; డాసి= సమీపించి; భీమసేన ఘటోత్కచులు= భీముడు, ఘటోత్కచుడున్నూ; ఒక్కవలనను= ఒక ప్రక్కను; పార్థుండున్= అర్జునుడున్నూ; తాను= ధృష్టద్యుమ్నుడున్నూ; ఒక దిక్కునన్= ఒక ప్రక్క; నిలిచి= నిలబడి; తక్కిన= మిగిలిన; యోధవీరులన్= యోధులను, శూరులను; కలయన్= గుంపుగా; చేర్చి= చేసి; గట్టిమొనగాన్= అసాధ్యమైన వ్యూహంగా; ఒనర్చెన్= చేశాడు; ఇట్లు= ఈ విధంగా; ఉభయ సైన్యంబులున్= రెండు సేనలున్నూ; పన్ని= యుద్ధానికి, సిద్ధపడి; భేరీ= దుందుభులనే వాద్యముల యొక్క;భాంకార= భాం భాం- అనే శబ్దాలతోను; శంఖ+ఆది= శంఖములోనుగా గలవాని యొక్క; నిస్వన= ధ్వనులతోను; గర్జా= సింహనాదాలయొక్క; స్ఫూర్జిత= అదరుటచేత; బహుళంబుగాన్= అధికంగా; ఒండొంటిన్= ఒక సైన్యాన్ని మరోసైన్యం; తాఁకెన్= ఎదిరించినవి; అట్టి సమయంబున.

తాత్పర్యం: ధృష్టద్యుమ్నుడు అర్జునుడు అడిగిన ప్రకారం కౌరవుల వ్యూహానికి ప్రతిగా ఒక వ్యూహాన్ని ఏర్పరచాడు. దానిలో కుడివైపున సాత్యకి, విరాటుడు; ఎడమవైపున అభిమన్యుడు, ద్రుపదుడు, కేకయులు, నకులుడు, సహదేవుడు, ఉపపాండవులు. వీరి వెనుక ధర్మరాజు, ధర్మరాజుకు వెనుకగా చేకితానుడు, కుంతిభోజుడు, ముందు భాగంలో శిఖండి, శిఖండికి ఒక ప్రక్కన భీముడు, ఘటోత్కచుడు, శిఖండికి మరొక ప్రక్కన అర్జునుడు, ధృష్టద్యుమ్నుడు,

మిగిలిన యోధులు వేరే వేరే చోట్లలో గుంపులుగా- ఈ విధంగా ఆ వ్యూహరచన జరిగింది. ఆ రెండు సేనలూ యుద్ధానికి సిద్ధమై సింహనాదాలతో, దుందుభుల, శంఖాల ధ్వనులతో కూడినవై, పరస్పరం ఎదుర్కొన్నాయి.

క. చెంగట నభిమన్యుండు । పిశంగతురంగప్రచారచంచద్రథుఁడై
పొంగి మనదిక్కు ప్రజమీఁ । దం గవిసెం జిచ్చు దూది దరికొనుమాడ్కిన్. 192

ప్రతిపదార్థం: అభిమన్యుఁడు= సుభద్రకొడుకు; చెంగటన్= దగ్గరలో; పిశంగ= కపిల వర్ణపు; తురంగ= గుర్రాలయొక్క; ప్రచార= సంచారాలచేత; చంచత్= కదులుతున్న; రథుఁడు+ఐ= రథంకలవాడై; పొంగి= గర్వించి; మనదిక్కు= మనపక్షంలో గల; ప్రజమీఁదన్= జనాలమీద; చిచ్చు= అగ్ని; దూదిన్= పత్తిని; దరికొనుమాడ్కిన్= కాల్చే మాదిరి; కవిసెన్= పర్వినాడు.

తాత్పర్యం: అభిమన్యుడు, కపిల వర్ణపు గుర్రాలను పూన్చిన రథాన్నెక్కి మన సైన్యం సమీపంలో చిత్రంగా తిరుగుతూ ఉప్పొంగి, అగ్ని దూదిని కాల్చే మాదిరిగా మన సేనలను మార్కొన్నాడు.

విశేషం: అలం: ఉపమ.

వ. ఇట్లు గవిసి. 193

తాత్పర్యం: ఈ విధంగా ఎదిరించి.

తే. మెఱసి మండలచారి యై కొఱవి ద్రిప్పి । నట్లు గురుకృపసింధురాజాదు లైన
యోధవీరులు వెగడంద నులివు మిగిలి । తరువఁబడు నబ్ధిక్రియ సేన దిరుగఁబడఁగ. 194

ప్రతిపదార్థం: మండలచారి+ఐ= అభిమన్యుడు మండలాకారంలో నిలబడి; మెఱసి= ప్రకాశించి; కొఱవిన్= కొరవికట్టెను; త్రిప్పిన+అట్లు= త్రిప్పిన విధంగా; గురు= ద్రోణుడు; కృప= కృపాచార్యుడు; సింధురాజు= సైంధవుడు; ఆదులు+ఐన= ప్రధానులుగాగల; యోధవీరులు= యోధులైన శూరులు; వెగడు+అందన్= తల్లడపాటు చెందగా; ఉలివుమిగిలి= హెచ్చైన శబ్దంతో; తరువన్+పడు= చిలుకబడేటువంటి; అబ్ధిక్రియన్= సముద్రం వలె; సేన= మన కౌరవసైన్యం; తిరుగన్+పడఁగన్= తల్లడిల్లి పోగా యుద్ధం చేశాడు.

తాత్పర్యం: అభిమన్యుడు వెలుగొందుతూ మండలాకారంలో చరిస్తూ కొరవి త్రిప్పినట్లుగా ద్రోణుడు, కృపుడు, సైంధవుడు మొదలైన యుద్ధ వీరులు తల్లడిల్లగా హెచ్చైన శబ్దంతో చిలుకబడుతున్న సముద్రంచందంగా కౌరవసేన కలత నొందగా (మిగి వచనంతో అన్వయం)

వ. ఇట్లు మాఱు లేక తఱుముచున్న సౌభద్రుం గనుంగొని కౌరవపతి యలంబుసుతో నిట్లనియె 'వీఁడు రెండవ యర్జునుం డై మనబలంబులఁ గలంచుచున్నవాఁ డర్జుననందను నెదుర్కొన నీవకాని మాఱు లే దేము పాండవుల కడ్డపడియెదము నీవు వీనిం బొదివి భంజింపుము.' 195

ప్రతిపదార్థం: కౌరవపతి= కురురాజు దుర్యోధనుడు; ఇట్లు= చెప్పిన విధంగా; మాఱులేక= ఎదురులేకుండా; తఱుముచున్+ఉన్న= కవియుచున్న; సౌభద్రున్= సుభద్రకొడుకు అభిమన్యుడిని; కనుంగొని= చూచి; అలంబుసుతోన్; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు; వీఁడు= ఈ అభిమన్యుడు; రెండవ అర్జునుఁడు+ఐ= రెండో అర్జునుడుగా; మనబలంబులన్= మన కౌరవులయొక్క సైన్యాలను; కలంచుచున్+ఉన్నవాఁడు= కలత పెడ్తున్నాడు; అర్జుననందనున్= అర్జునుడి కొడుకుఅభిమన్యుడిని; ఎదుర్కొనన్= ఎదిరించడానికి; నీవు+అ+కాని= నీవే తప్ప; మాఱులేదు= ఎదురులేరు; ఏము= మేము; పాండవులకున్= పాండురాజు కుమారులకు; అడ్డపడియెదము= అడ్డు తగుల్తాము; నీవు= నీవు (అలంబుసుడు); వీనిన్= ఈ అభిమన్యుడిని; పొదివి= కవిసి; భంజింపుము= ఓడించుము.

తాత్పర్యం: దుర్యోధనుడు తన సైన్యాన్ని అభిమన్యుడు తరమటాన్ని చూచి, అలంబుసుడితో 'వీడు రెండో అర్జునుడివలె తయారై మన సైన్యాన్ని కలత పెడుతున్నాడు. వీడిని ఎదిరించటానికి నీవు తప్ప వేరే ఎవరూ లేరు. మేము పాండవులను అడ్డగిస్తాం. నీవు వీడిని ఓడించుము.'

అలంబసుఁడు దుర్యోధన ప్రేరితుండై యభిమన్యునిపైఁ గవియుట (సం. 6-96-24)

క. అనవుడు నతండు దుర్దమ । దనుజావలి మున్ను గాఁగఁ దఱిమెం గుంతీ
తనయబలము గారాకులు । పెనుగాలిం దూలునట్లు భీతిం జెదరన్. 196

ప్రతిపదార్థం: అనవుడున్= దుర్యోధనుడు పై విధంగా చెప్పగా; అతండు= ఆ అలంబసుడు; కారు+ఆకులు= పండిపోయిన ఆకులు; పెనుగాలిన్= పెద్దగాలికి; తూలు+అట్లు= కొట్టుకుపోయే మాదిరి; దుర్దమదనుజావలి= జయింపరాని రాక్షసుల గుంపు; మున్ను+కాఁగన్= తన ముందుండునట్లుగా; కుంతీ తనయుల బలమున్= పాండవుల సైన్యాన్ని; భీతిన్= భయంతో; చెదరన్= చెదిరిపోయేటట్లుగా; తఱిమెన్= వెంబడిబడి పరుగులెత్తించాడు.

తాత్పర్యం: దుర్యోధను డా విధంగా చెప్పగానే, అలంబుసుడు అజేయులైన రాక్షసుల మూకను తన ముందు పెట్టుకొని పాండవ సేనను తరిమాడు. తుఫానుగాలికి పండుటాకులు ఎక్కడికో కొట్టుకుపోయేట్టు పాండవ సైన్యం మూలమూలకు పారిపోయింది.

విశేషం: అలం: ఉపమ.

ఉ. అప్పుడు ద్రౌపదేయులు రయంబున నడ్డము సొచ్చి దైత్యులం
గుప్పలుగా మహిం బెలుచఁ గూల్చిన దానవనాథుఁ డమ్ములం
గప్పెఁ గడంగి వారల నఖండపరాక్రములీల వారు వాఁ
డొప్పఱి తేరి కూబరమయూఁతగ వ్రాలఁగనేసి యార్చినన్. 197

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో; ద్రౌపదేయులు= ద్రౌపది కొడుకులు, రయంబునన్= వేగంతో; అడ్డము+చొచ్చి= అడ్డంగా చొరబడి; దైత్యులన్= రాక్షసులను; కుప్పలు+కాన్= కుప్పలుగా; పెలుచన్= సులువుగా; మహిన్= నేలమీద; కూల్చినన్= పడద్రోయగా; దానవనాథుఁడు= రాక్షసరాజు అలంబుసుడు; కడంగి= ప్రయత్నించి; వారలన్= ద్రౌపది కొడుకులను; అమ్ములన్= బాణాలతో, కప్పెన్= కప్పివేశాడు; వారు= ఆ ద్రౌపది కొడుకులు; అఖండ పరాక్రమలీలన్= అంతులేని పరాక్రమం యొక్క విలాసంతో; వాఁడు= ఆ అలంబుసుడు; ఒప్పు+అఱి= సౌందర్యం పోగొట్టుకొని; తేరి కూబరము+అ= రథంయొక్కనొగ; ఊఁతగన్= ఆధారంగా; వ్రాలఁగన్= వాలిపోయేట్టుగా; ఏసి= బాణాలు ప్రయోగించి; ఆర్చినన్= బొబ్బలు పెట్టగా.

తాత్పర్యం: అలంబుసుడి దెబ్బకు పాండవసేన చెల్లాచెదరైపోయినప్పుడు ద్రౌపది కొడుకులు వేగంగా అడ్డంగా చొరబడి, ఆ రాక్షసుల మూకను సునాయాసంగా కుప్పతిప్పలుగా నేలకూల్చారు. అప్పుడు అలంబుసుడు ఆ ద్రౌపదేయులను బాణాలతో కప్పివేశాడు. అప్పు డా ద్రౌపది కొడుకులు, ఆ రాక్షసుడు అందం చెడి, రథపు నొగను ఆధారం చేసికొని, ఒరిగిపోయేటట్లుగా బాణాలతో కొట్టి, బొబ్బలు పెట్టగా.

క. ఆలోనన తెప్పిఱి లయ కాలుండును । బోలె నసుర గన్నుల నిప్పల్
రాలఁగ వారలసిడములు । నేలం బడనేసి చాపనికరము ద్రుంచెన్. 198

ప్రతిపదార్థం: ఆలోనన్+అ= అంతలోనే; అసుర= రాక్షసుడు- అలంబుసుడు; తెప్పిఱి= తేరుకొని; లయకాలుండునున్+పోలెన్= ప్రళయకాలంలోని యమధర్మరాజువలె; కన్నులన్= కన్నులనుండి; నిప్పుల్= అగ్నులు; రాలఁగన్= రాలుచుండగా; వారల= ఆ ఉపపాండవుల యొక్క; సిడములు= ధ్వజాలు; నేలన్+పడన్+ఏసి= నేలమీద పడేటట్లుగా; ఎన్నో బాణాలు ప్రయోగించి; చాపనికరమున్= ధనుస్సుల సముదాయాన్ని; త్రుంచెన్= విరుగగొట్టాడు.

తాత్పర్యం: అంతలోనే అలంబుసుడు తేరుకొని ప్రళయకాలంలోని యముడి మాదిరి కండ్ల నుండి నిప్పులు కక్కుతూ, బాణాలతో కొట్టి వారి ధ్వజాలను నేలకూల్చాడు. వారి ధనుస్సులను కూడా తునుకలు చేశాడు.

వ. త్రుంచి నవ్వుచు. **199**

ప్రతిపదార్థం: త్రుంచి= తునకలు చేసి; నవ్వుచు(న్)= ఎగతాళి చేస్తూ.

తాత్పర్యం: అలంబుసుడు ద్రౌపది కొడుకుల విండ్లను త్రుంచివేసి ఎగతాళిగా నవ్వుతూ. (తరువాతి పద్యంతో అన్వయం)

తే. ఒకని నొకని నైదైదు మహోగ్ర భాసు । రాస్త్రముల నేసి నొంచిన నతనిమదము
సొంపు సోదరవ్యథయును జూచి । యడరె నప్పు డాతనిపై సుభద్రాత్మజుండు. **200**

ప్రతిపదార్థం: ఏచి= విజృంభించి; ఒకనిన్+ఒకనిన్= ఒక్కొక్కడినీ; ఐదు+ఐదు= ఐదేసి చొప్పున; మహా+ఉగ్రభాసుర+అస్త్రములన్= గొప్పవైన, భయం గొలుపుతూ ప్రకాశిస్తూండే ఆయుధాలతో; నొంచినన్= బాధకలిగేటట్లు చేయగా; అప్పుడు; సుభద్రా+ఆత్మజుండు= సుభద్ర కొడుకు అభిమన్యుడు; అతని మదమున్= ఆ రాక్షసుడి మదాన్ని; సొంపు= అందాన్ని; సోదర వ్యథయున్= అన్నదమ్ముల-కుంతీపుత్రుల కష్టాన్ని; చూచి; ఆతనిపైన్= ఆ రాక్షసుడి మీదికి; అడరెన్= ఉరికాడు.

తాత్పర్యం: అలంబుసుడు ఒక్కొక్కడి మీద అయిదేసి చొప్పున కఠినమైన, మండుతున్న బాణాలను వేసి, ఆ ద్రౌపదేయులను చాలా నొప్పించాడు. అభిమన్యుడు ఆ రాక్షసుడి మదాన్ని, అందాన్ని చూశాడు. తన అన్నదమ్ముల కష్టాన్ని కనిపెట్టి, ఆ రాక్షసుడి మీదికి దూకాడు.

వ. అప్పు డుభయ సైన్యంబులవారును వెఱఁగంది. **201**

ప్రతిపదార్థం: అప్పుడు ఉభయ సైన్యంబులవారును= కౌరవ పాండవ సేనలలో ఉండే సైనికులు; వెఱఁగు+అంది= ఆశ్చర్యంచెంది.

తాత్పర్యం: ఆ సమయంలో కౌరవ, పాండవసేనలలోని సైనికులు ఆశ్చర్యం చెంది. (తరువాతి పద్యంతో అన్వయం)

క. ‘ దనుజుఁడు మాయాధికుఁ డ । ర్జునతనయుండు దివ్యశరధరుం డెట్లగునో?
యనుచుండఁగ నయ్యిరువురు । ననిసేసిరి వృత్రవాసవాకృతి దోఁపన్. **202**

ప్రతిపదార్థం: దనుజుఁడు= రాక్షసుడు- అలంబుసుడు; మాయా+అధికుఁడు= మాయచేత గొప్పవాడు; అర్జున తనయుఁడు= అర్జునుడి కొడుకు అభిమన్యుడు; దివ్యశరధరుండు= అమోఘములైన బాణాలు కలవాడు; ఎట్లు+అగును+ఓ?= ఫలితం ఎట్లా ఉంటుందో?; అనుచుండఁగన్= అనుకొంటూండగా; ఆ+ఇరువురు= ఆ ఇద్దరు (అలంబుసుడు, అభిమన్యుడు); వృత్రవాసవ+ఆకృతిన్= వృత్రాసురుడు, ఇంద్రుడు- వీరి రూపాలు ; తోఁపన్= తోచేటట్లుగా; అని= యుద్ధాన్ని; చేసిరి= చేశారు.

తాత్పర్యం: ‘మాయలమారివాడు అలంబుసుడు- మంచి మంచి బాణాలు కలవాడు అభిమన్యుడు. మరి వీరిద్దరిలో ఎవడిని, విజయలక్ష్మి వరిస్తుందో?’ అని కౌరవపాండవసేనలలోని వారంతా ఆశ్చర్యంగా అనుకొంటూండగా

వారిద్దరూ యుద్ధానికి తలపడ్డారు. అలంబుసుడు వృత్రుడనే రాక్షసుడి మాదిరి అనిపించాడు. అభిమన్యుడు ఇంద్రుడు మాదిరి అగుపించాడు.

క. ఇతరేతరశరకృతశో । ణిత ధారలు నిగుడ నపుడు నిర్భరదావ
ద్యుతు లడరఁ బొలుచునగముల । గతిఁ బొలిచిరి వార లప్రకంపోన్నతు లై. 203

ప్రతిపదార్థం: అపుడు= ఆ యుద్ధ సమయంలో; ఇతర+ఇతర= ఒండొరులయొక్క; శర= బాణాలచేత; కృత= చేయబడ్డ; శోణిత ధారలు= నెత్తుటి యొక్క ధారలు= పైనుండి కిందికి జారే చాళ్ళు; నిగుడన్= అధికంకాగా; నిర్భర= ఓర్చుకోడానికి సాధ్యంకాని; దావ= కార్చిచ్చు యొక్క; ద్యుతులు= మంటలు; అడరన్= వ్యాపించగా; పొలుచు= ఒప్పునట్టి; నగములగతిన్= పర్వతాల మాదిరి; వారలు= అలంబసుడు, అభిమన్యుడున్నూ; అప్రకంప+ఉన్నతులు+ఐ= అచలులై; పొలిచిరి= ఒప్పినారు.

తాత్పర్యం: ఆ అలంబసుడు, అభిమన్యుడు ఒకరిపై ఒకరు బాణాలు వేసికోవటం వల్ల, నెత్తుటి కాల్వలు వారి శరీరాలపై నుండి కిందికి కారటంవల్ల, నిక్కి నిశ్చలంగా నిలబడ్డ ఆ వీరులిద్దరు కార్చిచ్చు అలముకొన్న పర్వతాలను పోలి ఉన్నారు.

విశేషం: అలం: ఉపమ.

క. దనుజేశ్వరుండు మాయం । బొనరించినఁ దమము గవిసె భూనాయక ! ఫ
ల్గున సుతుఁడు భాస్కరాంబక । మున వెలుఁ గొనరించె సురసమూహము పొగడన్. 204

ప్రతిపదార్థం: భూనాయక!= భూమికి ప్రభువైన ధృతరాష్ట్ర మహారాజా!; దనుజ+ ఈశ్వరుండు= రాక్షసులకు రాజైన అలంబుసుడు; మాయన్= మాయను (ఇంద్రజాలాన్ని); పొనరించిన= చేయగా; తమము= చీకటి; కవిసెన్= కమ్ముకొన్నది; ఫల్గున సుతుఁడు= అర్జునుడి కొడుకు; సురసమూహము= దేవతల గుంపు; పొగడన్= పొగడగా; భాస్కర+అంబకమునన్= సూర్యుడు దేవతగా ఉన్నట్టి బాణంతో; వెలుఁగున్+ఒనరించెన్= వెలుతురు వచ్చేటట్లు చేశాడు.

తాత్పర్యం: ఆ రాక్షసుడు పన్నిన మాయచేత ఆ యుద్ధభూమినంతా చీకటి దట్టంగా కమ్ముకొన్నది. అప్పుడు అభిమన్యుడు సూర్యసంబంధమైన అస్త్రాన్ని ప్రయోగించి ఆ చీకటినంతా పటాపంచలు చేశాడు. ఆకాశాన్నుండి యుద్ధాన్ని చూస్తున్న దేవతలందరూ అభిమన్యుడి శౌర్యాన్ని ఎంతో మెచ్చుకొన్నారు.

తే. అసుర వెండియుఁ బెక్కు మాయలు ఘటింప । శక్ర పౌత్రుండు దివ్యాస్త్రజాల మడరఁ
జేసి యన్నింటి నడఁగించి చెలఁగి నొంప । రథము డిగి పాఱెఁ బెలుచ నా రాక్షసుండు. 205

ప్రతిపదార్థం: అసుర= రాక్షసుడు అలంబుసుడు; వెండియున్= ఇంకా కూడా; పెక్కు మాయలు= పలు రకాలైన మాయలను; ఘటింపన్= చేయగా; శక్రపౌత్రుండు= ఇంద్రుడి మనుమడు- అభిమన్యుడు; దివ్య+అస్త్రజాలము= దేవ సంబంధాలైన ఆయుధాల సమూహాన్ని; అడరన్+చేసి= వ్యాపింపచేసి; అన్నింటిన్= రాక్షసుడు చేసిన మాయలన్నిటిని; అడఁగించి= రూపుమాపి; చెలఁగి= విజృంభించి; నొంపన్= ఆ రాక్షసుడిని బాధించగా; ఆ రాక్షసుండు= ఆ అలంబుసుడు; పెలుచన్= శీఘ్రంగా; రథము డిగి= తేరునుండి కిందికి దిగి; పాఱెన్= పరుగెత్తాడు.

తాత్పర్యం: అలంబుసుడు ఇంకా ఎన్నో మాయలు చేశాడు. అభిమన్యుడు వాటినన్నిటినీ దివ్యాస్త్రాలు ప్రయోగించి మటుమాయం చేశాడు. వాడికి బాగా నొప్పి కల్గించాడు. అలంబుసుడు ఏమీ చేయలేక శీఘ్రంగా రథాన్నుండి క్రిందికి దిగి, పారిపోయాడు.

క. రక్కసుఁడు విఱిగినం గడు । నుక్కున సౌభద్రుఁ డడరునురవడి గని న
ల్దిక్కులఁ బఱచెం దమలోఁ । జిక్కువడుచుఁ గౌరవేంద్రసేనలు భీతిన్. 206

ప్రతిపదార్థం: రక్కసుఁడు= రాక్షసుడు అలంబుసుడు; విఱిగినన్= ఓడిపోగా; కడున్= అధికమైన; ఉక్కునన్= శౌర్యంతో; సౌభద్రుఁడు= అభిమన్యుడు; అడరు= అతిశయించే; ఉరవడిన్= అతివేగాన్ని; కని= చూచి; కౌరవ+ఇంద్రుసేనలు= దుర్యోధనుడి సైన్యాలు; భీతిన్= భయంతో; తమలోన్= తమలోతాము; చిక్కు+పడుచున్= కష్టపడుతూ; నలు+దిక్కులన్= నాలుగు దిక్కులకు; పఱచెన్= పరుగెత్తాయి.

తాత్పర్యం: అలంబుసుడు అభిమన్యుడి ధాటికి ఓడిపోయాడు. అంతటా అతిశయించిన అభిమన్యుడి వేగానికి తట్టుకోలేక, కౌరవ సైన్యమంతా తమ తమ మనస్సుల్లో చాలా సంకటపడుతూ, దిక్కులకు పరుగెత్తి వెళ్ళారు.

వ. అప్పుడు పెక్కండ్రు రథికులతోడం గూడి గాంగేయుం డభిమన్యు పయిం గవిసిన. 207

ప్రతిపదార్థం: అప్పుడు= కౌరవసేన పారిపోయినప్పుడు; గాంగేయుండు= భీష్ముడు; పెక్కండ్రు= పలువురు, రథికులతోడన్= రథంలో కూర్చుని యుద్ధం చేసేవారితో; కూడి= చేరి; అభిమన్యుపయిన్= అభిమన్యుడి మీదికి; కవిసినన్= పర్వగా.

తాత్పర్యం: అభిమన్యుడి ధాటికి తట్టుకోలేక కౌరవసేన చెల్లాచెదరుకాగా, భీష్ముడు చాలామంది రథికులను వెంటవేసికొని అభిమన్యుడి మీదికి ఎగబడ్డాడు.

తే. అతఁడు దానికిఁ దలఁకక యందఱకును । నన్నిరూపు లై పోరంగ నర్జునుండు
సరభసంబుగ భీష్ముపై నురవడింపఁ । బొంగి యిరువాఁగు నిరువురఁ బొదివె బెరసి. 208

ప్రతిపదార్థం: అతఁడు= ఆ అభిమన్యుడు; దానికిన్= ఆ భీష్ముడి దెబ్బకు; తలఁకక= చలించక(భయపడక); అందఱకును= భీష్ముడు మొదలైన రథికులకందరికిని; అన్ని+రూపులు+ఐ= ప్రతివాడికి ఒక్కొక్క అభిమన్యుడుగా తోపచేసి; పోరంగన్= యుద్ధం చేస్తూ ఉండగా; అర్జునుండు= అర్జునుడు; భీష్ముపైన్= భీష్ముడు మీదికి; సరభసంబుగన్= వేగంతో; ఉరవడింపన్= తొందరపడగా; ఇరువాఁగున్= రెండు సైన్యాలు; పొంగి= గర్వంపొంది; ఇరువురన్= భీష్ముడిని; అర్జునుడిని; బెరసి= దగ్గరగా చేరి; పొదివెన్= క్రమ్ముకొన్నవి.

తాత్పర్యం: ఆ అభిమన్యుడు భీష్ముడి ధాటికి ఏ మాత్రం చలించకుండా నిలబడి, తనమీదికి కవిసే వారికందరికీ అదే సంఖ్యగల అభిమన్యులుగా కనబడి చాకచక్యంగా యుద్ధం చేస్తూ వచ్చాడు. తన కొడుకు పాటు చూచి, అర్జునుడు వేగంగా భీష్ముడిపైకి ఎత్తివచ్చాడు. అప్పుడు కౌరవుల పాండవుల సైన్యాలు గర్వించి, కౌరవసైన్యాలు భీష్ముడి దగ్గరకు, పాండవ సైన్యాలు అర్జునుడి దగ్గరకు చేరుకొని, క్రమ్ముకొన్నాయి.

వ. అట్టి సంకులసమరంబున నభిమన్యుపై నడరు కృపాచార్యుం దాఁకి సాత్యకి బెడిదంపునారసంబు లేసిన వాని
నన్నింటిని నశ్వత్థామ తునిమి యతని విల్లు ద్రుంచినం గోపించి. 209

ప్రతిపదార్థం: అట్టి= ఆ విధమైన; సంకుల సమరంబునన్; అభిమన్యుపైన్= అభిమన్యుడి మీదికి; అడరు= విజృంభిస్తున్న; కృపాచార్యున్= కృపుని; సాత్యకి= సాత్యకి; తాఁకి= మార్కొని; బెడిదంపు నారసంబులు= భయంకరాలైన బాణాలు; ఏసినన్= వేయగా; వానిన్=ఆ బాణాలను; అన్నింటిన్= అన్నిటిని; అశ్వత్థామ= ద్రోణుడి కొడుకు; తునిమి= తునుకలు చేసి; అతనివిల్లున్= ఆ సాత్యకి యొక్క విల్లును; త్రుంచినన్= విరిచివేయగా; కోపించి= (సాత్యకి) కోపపడి.

తాత్పర్యం: రెండు సైన్యాల వారూ కలగా పులగంగా కలిసిపోయి యుద్ధంచేసే సమయంలో సాత్యకి, అభిమన్యుడిపైకి దూకే కృపాచార్యుడిని ఎదిరించి, కఠోరాలైన బాణాలు ప్రయోగించాడు. వాటిని అన్నిటినీ అశ్వత్థామ తుంటలు చేసి, సాత్యకి విల్లును కూడా విరిచివేశాడు. దానికి సాత్యకి ఆగ్రహించి.

క. ఆ సాత్యకి వేఱొక వి । ల్లాసురగతి నెత్తి యుగ్రమగు నారాచం
బేసిన నాతఁడు కేతు । వ్యాసక్తుండయ్యె మూర్ఛవచ్చి నరేంద్రా! 210

ప్రతిపదార్థం: నరేంద్రా!= ధృతరాష్ట్ర మహారాజా! ఆ సాత్యకి; వేఱు+ఒక= మరియొక ; విల్లు= ధనువును; ఆసురగతిన్= రాక్షసంగా; ఎత్తి= తీసికొని; ఉగ్రము+అగు= భయంకరమైన; నారాచంబు= బాణాన్ని; ఏసినన్= వేయగా; ఆతఁడు= ఆ అశ్వత్థామ; మూర్ఛవచ్చి= మూర్ఛతగిలి; కేతువ్యాసక్తుండు+అయ్యెన్= ధ్వజానికి ఆనుకొన్నాడు.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! సాత్యకి మరొక విల్లు తీసికొని, రక్కసితనంగా కర్కశమైన ఒక బాణాన్ని అశ్వత్థామ మీదికి ప్రయోగించారు. వెంటనే అశ్వత్థామ మూర్ఛపోయి, తనతేరు ధ్వజానికి అంటుకుపోయాడు.

క. ఆలోనన తెలిసి మెఱుఁగు । వాలిక తూ పాతఁ డతని వక్షమునడుమం
గీలించి సిడము గ్రక్కున । నేలం బడనేసి యార్చె నింగి వడంకన్. 211

ప్రతిపదార్థం: ఆలోనన్+అ= అంతలోపలనే; ఆతఁడు= ఆ అశ్వత్థామ; తెలిసి= తెలివినిపొంది; మెఱుఁగు= తళతళలాడే; వాలిక= పదునైన; తూపు= బాణాన్ని; అతని= ఆ సాత్యకియొక్క; వక్షము= రొమ్ముయొక్క; నడుమన్= మధ్యభాగంలో; కీలించి= గ్రుచ్చి సిడము= ధ్వజము; గ్రక్కునన్= వెంటనే; నేలన్+పడన్+ఏసి= నేలకూల్చి; నింగి= ఆకాశము; వడంకన్= వడకేటట్లుగా; ఆర్చెన్= బొబ్బరించాడు.

తాత్పర్యం: ఆ అశ్వత్థామ అంతలోనే తెప్పిరిల్లికొని, నిగనిగలాడే పదును గల బాణాన్ని ఆ సాత్యకి రొమ్మున గ్రుచ్చాడు. అతడి టెక్కాన్ని నేలకూల్చాడు. ఆకాశం అదిరేటట్లుగా బొబ్బలు పెట్టాడు.

వ. దానికిం గినిసి శినిమనుమండు పొగరు మిగులునారాచనిచయంబులం బొదివిన నశ్వత్థామ రాహుగ్రస్తుం
డగు నుగ్రగభస్తియుంబోలె నైనం గనుంగొని. 212

ప్రతిపదార్థం: దానికిన్= అశ్వత్థామచేసిన దానికి; శినిమనుమండు= సాత్యకి; కినిసి= కోపించి; పొగరుమిగులు= మిక్కిలి దారుణములైన; నారాచ నిచయంబులన్= బాణాల సమూహాలతో; పొదివినన్= కప్పివేయగా; అశ్వత్థామ; రాహుగ్రస్తుండు+అగు= రాహువుచే మ్రింగబడినట్టివాడగు; ఉగ్రగభస్తియున్+పోలెన్= కరకు కిరణాలు గల సూర్యుడి చందంగా; ఐనన్= కాగా; కనుంగొని.

తాత్పర్యం: అశ్వత్థామచే చాలా దెబ్బలు తిన్నాడు సాత్యకి. కనుకనే చాలా కోపగించాడు. మెరుస్తున్న వాడి, వేడి బాణాలతో ఆ అశ్వత్థామను బాగా కప్పివేసినపుడు అతడు రాహువుచే కబళింపబడ్డ సూర్యుడిలాగా అనిపించాడు. దీన్ని చూచి. (ద్రోణాచార్యుడు సాత్యకిపైకి కవిశాడు.)

విశేషం: అలం: ఉపమ.

క. ద్రోణాచార్యుండు సుత । త్రాణపరత్వమునఁ గృష్ణతమ్ముని పై న
క్షీణోద్ధతిఁ గవియుడు గీ । ర్వాణాధిపసుతుఁడు వచ్చి వడి నెడఁ జొచ్చెన్. 213

ప్రతిపదార్థం: ద్రోణాచార్యుండు= ద్రోణుడు; సుతత్రాణ పరత్వమునన్= కొడుకును కాపాడుకోవడంలో ఆశకలవాడు కావటంచేత; కృష్ణతమ్మునిపైన్= కృష్ణుడి తమ్ముడైన సాత్యకిమీద; అక్షీణ+ఉద్ధతిన్= తక్కువకాని ఆటోపంతో(గర్వంతో); కవియుడున్; గీర్వాణ+అధిపసుతుఁడు= దేవతలకు ప్రభువైన ఇంద్రుడి కొడుకు(అర్జునుడు); వడిన్= వేగంగా; వచ్చి= చేరి; ఎడన్= మధ్యలో; చొచ్చెన్= చొరబడ్డాడు.

తాత్పర్యం: ద్రోణాచార్యుడు - తన కొడుకు అశ్వత్థామ ప్రాణాలు కాపాడాలనే ఆత్రంతో, గర్వంతో సాత్యకి మీదికి దూకాడు. అప్పుడు అర్జునుడు వేగంగా వచ్చి, సందు చేసికొని చొరబడ్డాడు.

చ. అనవుడు నాంబికేయవసుధాధిపుఁ డిట్లనుఁ 'ద్రోణుఁ డాత్మ న
ర్జునునకుఁ గూర్చునాతఁడు గురుంగని యెంతయు భక్తి సేయు వా
రనిఁ దమలోన నట్లు వెస నప్పుడు దార్కొని యెట్లు పోరిరో
వినఁగల దేర్పడం జెపుమ విశ్రుతభంగిగ నాకు సంజయా!' 214

ప్రతిపదార్థం: అనవుడున్= అని జెప్పగా; ఆంబికేయవసుధా+అధిపుఁడు= అంబిక కొడుకు ధృతరాష్ట్రుడు; ఇట్లు+అనున్= ఈ విధంగా అంటున్నాడు; సంజయా!= ఓ సంజయుడా!; ద్రోణుఁడు= ద్రోణాచార్యుడు, ఆత్మన్= మనసునందు; అర్జునునకున్= అర్జునుడికి; కూర్చున్= ఇష్టం కోరుతాడు; ఆతఁడున్= ఆ అర్జునుడుకూడా; గురున్= గురువైన ద్రోణుడిని; కని= చూచి; ఎంతయున్= ఎంతో అధికంగా; భక్తి+చేయున్= సేవిస్తూ ఉంటాడు; వారు= అట్టివారిద్దరు; అనిన్= యుద్ధంలో; తమలోనన్= తమలో తాము; అట్లు= ఆ విధంగా; అప్పుడు; వెసన్=వేగంతో; తార్కొని= దగ్గరకు చేరుకొని; ఎట్లు= ఏ విధంగా; పోరిరో= యుద్ధం చేశారో; నాకున్; వినన్+కలది= వినవలసి ఉన్నది; విశ్రుతభంగిన్= చక్కగా ప్రఖ్యాతి కెక్కేటట్లుగా; ఏర్పడన్= బాగా తెలిసేటట్లుగా; చెపుము+అ!= పలుకుము.

తాత్పర్యం: ద్రోణుడు, అర్జునుడు - ఇద్దరూ యుద్ధానికి పూనుకొన్నారని సంజయుడు చెప్పగా ధృతరాష్ట్రుడు సంజయుడితో ఇట్లా అన్నాడు. 'ఓ సంజయా! ద్రోణుడికి అర్జునుడంటే చాలా ఇష్టం. అర్జునుడికీ ద్రోణుడంటే చాలా భక్తి. అట్టి ఆ గురుశిష్యులిద్దరూ యుద్ధంలో ఒకరినొకరు మార్కొని ఎట్లా యుద్ధం చేశారు? వీరి యుద్ధం ప్రసిద్ధి కెక్కే విధంగా ఉంటుంది, వినతగ్గది కాబట్టి, విపులంగా నాకు తెలుపుము.'

వ. అనిన నా సూతనందనుం డతని కి ట్లనియె. 215

ప్రతిపదార్థం: అనినన్= అని అడగ్గా; ఆ సూతనందనుండు; సంజయుడు; అతనికిన్= ఆ ధృతరాష్ట్రుడికి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడు భీష్మార్జునుల యుద్ధాన్ని గూర్చి విమర్శగా చెప్పుమని కోరగా, సంజయుడు ఇలా చెప్పసాగాడు.

క. క్షాత్రము దలకొని సంగర । ధాత్రికి నేతెంచి గురులు దండ్రులు దమ్ముల్
పౌత్రులు శిష్యులు మామలు । పుత్రులనం గలదె? తాడరి పోరన వలయున్. 216

ప్రతిపదార్థం: క్షాత్రమున్= క్షత్రియ ధర్మాన్ని; తలకొని= పూని; సంగరధాత్రికిన్= యుద్ధభూమికి; ఏతెంచి= వచ్చి; గురులు= ఉపాధ్యాయులు; తండ్రులు= తండ్రులు; తమ్ముల్= తమ్ముళ్ళు, పౌత్రులు= మనుమలు; శిష్యులు= తమ దగ్గర విద్య

నేర్చుకొన్నవారు; మామలు= కూతులను ఇచ్చినవారు; పుత్రులు= కొడుకులు; అనన్= అనడం; కలదు+ఎ?= సాధ్యమా?; తొడరి= ప్రయత్నించి; పోరనవలయున్= యుద్ధం చేయవలసి ఉంటుంది.

తాత్పర్యం: క్షత్రియధర్మం కలిగి యుద్ధరంగంలోకి దిగినప్పుడు, గురువులు, తండ్రి వరుసవారు, తమ్ముళ్ళు, మనుమలు, శిష్యులు, మామలు, మేనమామలు, కొడుకులు, అనే చుట్టరికం లెక్కించకుండా తెగించి యుద్ధం చేయవలసిందే కదా!

అర్జునుఁడు ద్రోణాచార్యులతో యుద్ధముసేయుట (సం. 6-98-4)

వ. వినుము. 217

ప్రతిపదార్థం: వినుము - ఆలకించుము

తాత్పర్యం: వారి యుద్ధం ఎలా జరిగిందో చెపుతాను వినుము.

సీ. అర్జునుం డడరి ద్రోణాచార్యు మూఁడు నారసముల నేసి యుగ్రంపుటంప
వెల్లువ వఱపిన వెగడొంద కాతఁ డాతనిమేనఁ దూపులు దఱుచు గాఁగ
నాటించె నంత భూనాథుండు పురికొల్పఁ గాఁ బ్రిగర్తులు గురుఁ గడచి కవియ
నరుఁడేచి వాయుబాణమ్మున నమ్మొనఁ దూలింపఁ గుంభజుశైలశరము

ఆ. వచ్చి యుడుప నలిగి వాసవినారాచ । వర్షమునఁ బ్రిగర్తవరునిపుత్ర
చయముఁ దెరలుచుటయు జనపతి కృపశల్య । బాహ్లికులునుఁ దానుఁ బార్థుఁ దాఁకె. 218

ప్రతిపదార్థం: అర్జునుండు; అడరి= పూని; ద్రోణ+ఆచార్యున్= ద్రోణుడిని; మూఁడు నారసములన్= మూడు బాణాలతో; ఏసి= కొట్టి; ఉగ్రము+అంపవెల్లువ= భయంకరములైన బాణాల ప్రవాహాన్ని; పఱపినన్= ప్రయోగించగా; ఆతఁడు= ఆ ద్రోణుడు; వెగడు+ఒందక= తడబాటు చెందకుండా; ఆతనిమేనన్= అర్జునుడి దేహంమీద; తఱుచుగాఁగన్= మిక్కుటముగా; తూపులు=బాణాలను; నాటించెన్= గ్రుచ్చాడు; అంతన్= అటుమీద; భూనాథుండు= భూమికి రాజు-దుర్యోధనుడు; పురికొల్పఁగాన్= ప్రోత్సాహపరచగా; త్రిగర్తులు= త్రిగర్త దేశపు రాజు కొడుకులు; గురున్= ద్రోణుడిని; కడచి= దాటి; కవియన్; నరుఁడు= అర్జునుడు; ఏచి= విజృంభించి; వాయుబాణమ్మునన్= వాయువు దైవంగా గల బాణంచేత; ఆ+మొనన్= ఆ సైన్యాన్ని; తూలింపన్= చలింపచేయగా; కుంభజు= ద్రోణునియొక్క; శైలశరము= పర్వతబాణము; ఉడుపన్= వచ్చి, నశింపచేయగా; వాసవి= ఇంద్రుడి కొడుకు - అర్జునుడు; అలిగి= కోపం చెంది; నారాచవర్షమునన్= బాణాల వానతో; త్రిగర్తవరుని= త్రిగర్తరాజు యొక్క; పుత్రచయమున్= కొడుకుల గుంపును; తెరలుచుటయున్= తొలగింపచేయగా; జనపతి= ప్రభువైన; తానున్= దుర్యోధనుడు; కృపశల్య బాహ్లికులును= కృపుడు, శల్యుడు, బాహ్లికుడున్నూ; పార్థున్= అర్జునుడిని; తాఁకెన్= ఎదుర్కొన్నాడు.

తాత్పర్యం: అర్జునుడు ప్రయత్నంతో ద్రోణాచార్యుడిని మూడు బాణాలతో కొట్టి, పదునైన బాణాల ప్రవాహాన్ని అతడిపైకి ప్రయోగించాడు. భీష్ముడు జంకకుండా చాలా బాణాలను ఆ అర్జునుడి ఒంటిలో గుచ్చుకొనేటట్లుగా వేశాడు. అప్పుడు దుర్యోధనుడు ప్రోత్సాహపరచగా, త్రిగర్తరాజు కొడుకులు ద్రోణుడికి ముందుగా నిలిచి అర్జునుడిని ఎదుర్కొన్నారు. అప్పుడు అర్జునుడు వాయుబాణాన్ని వేసి. దానివల్ల వారంతా కొట్టుకపోయేటట్లు చేశాడు. ద్రోణుడు ఆ వాయుబాణానికి ప్రతిగా శైలాస్త్రం ప్రయోగించాడు. అర్జునుడికి కోపంవచ్చి, బాణవర్షం కురిపించాడు. ఆ

దెబ్బకు త్రిగర్తపతిపుత్రులంతా చెల్లాచెదరై పోయారు. అది చూచి దుర్యోధనుడు, కృపుడు, శల్యుడు, బాహ్లికుడు- వీరంతా అర్జునుడి మీదికి ఎగబడ్డారు.

వ. అట్లు దాఁకుటయు వారల నతండు గన్నెరా కమ్ములం జీకాకు పఱిచె నట్లు గురుండు మొదలైనయందఱకును నా ధనంజయుపోరు దలమునుకలయ్యెఁ గురుపితామహుండు ధర్మసూతి యున్న తిట్ట కుఱికి తలలు చెండాడె శకునిభూరిశ్రవసులు గవలం దలపడిరి కళింగపతియును భగదత్తుండును నిభసేనలతోడం దొడరి భీమసేనుం బొదివిన. 219

ప్రతిపదార్థం: అట్లు= ఆవిధంగా; తాఁకుటయున్= దుర్యోధనాదులు ఎదుర్కొనగా; వారలన్= ఆ వీరులను; అతండు= ఆ అర్జునుడు; కన్నెరాకు+అమ్ములన్= ఒక విధమైన బాణాలతో; చీకాకు పఱిచెన్= శ్రమకలిగించాడు; అట్లు; గురుండు= ద్రోణుడు; మొదలు+ఐన= ముఖ్యుడుగాగల; అందఱకున్= రథికులందరికీ; ధనంజయుపోరు= అర్జునుడితో యుద్ధం; తలమునుకలు+అయ్యెన్= తలకుమించిన(అసాధ్యమైన) దైనది; కురుపితామహుండు= భీష్ముడు; ధర్మసూతి= ధర్మరాజు; ఉన్న; తిట్టకున్= సైన్యం ఉన్నచోటికి; ఉఱికి; తలలు చెండు+ఆడెన్= సైనికుల తలలు నరికివేశాడు; శకుని భూరిశ్రవసులు= శకుని, భూరిశ్రవసుడు; కవలన్= నకుల సహదేవులను; తలపడిరి= ఎదుర్కొన్నారు; కళింగపతియును= కళింగ దేశపు రాజు; భగదత్తుండును; ఇభసేనలతోడన్= ఏనుగుల సైన్యంతో; తొడరి= వెంటపెట్టుకొని; భీమసేనున్= భీముని; పొదివినన్.

తాత్పర్యం: దుర్యోధనాది రథికులు అర్జునుడిని తాకారు. అతడు క్రొత్త క్రొత్త బాణాలు వేసి వారికి చిరాకు పుట్టించాడు. ద్రోణుడు మొదలైన యోధులకందరికి అర్జునుడితో యుద్ధం తలమునకలైంది. భీష్ముడు ధర్మరాజు సైన్యం ఉన్న చోటును దాటిపోయి, సైనికుల తలలు తెగనరికాడు. శకుని భూరిశ్రవసులు కవలలతో మార్కొన్నారు. కళింగదేశపురాజు, భగదత్తుడు- వీరిద్దరూ ఏనుగుల సైన్యంతో భీముడిమీదికి మళ్ళగా.

విశేషం : కళింగపతి: కళింగుడనే రాజు ఏలే దేశానికి కళింగదేశం అని పేరు. ఇతడు కౌరవ పక్షాన చేరి యుద్ధం చేశాడు. **'అంగోవంగః కళింగశ్చ పుండ్రః సుహ్మశ్చతే సుతాః తేషాం దేశాః సమాఖ్యాతాః స్వనామప్రథితా భువి॥ అంగస్యాంగో భవద్దేశో, వంగో వంగస్య చ స్మృతః। కళింగ విషయశ్చైవ కళింగస్య చ స స్మృతః ॥** (మహాభారతే 1 - 104 - 49, 50).

క. గిరి డిగు కేసరి చాడ్పున । నరదము డిగి భ్రమితపటుగదాభీలత నా
కరువలిపట్టియుఁ గవిసినఁ । గరులుఁ దెరలెఁ బవనధూతఘనపంక్తి గతిన్. 220

ప్రతిపదార్థం: గిరిన్= కొండపై నుండి; డిగు= దిగునట్టి; కేసరి చాడ్పునన్= సింహం మాదిరి; ఆ కరువలి పట్టియున్= వాయుదేవుని కొడుకు భీముడు; అరదము డిగి= రథంనుండి దిగి; భ్రమిత= త్రిప్పబడిన; పటు= దృఢమైన; గదా= గదాయుధంచేత; ఆభీలతన్= భయంకరంగా; కవిసినన్=మార్కొనగా; కరులు= ఏనుగులు; పవన= గాలిచేత; ధూత= ఎగురకొట్టబడ్డ; ఘన= మేఘాల యొక్క; పంక్తిగతిన్= వరుసవలె; తెరలెన్= తొలగిపోయాయి.

తాత్పర్యం: భీముడు కొండపైనుండి దిగి వచ్చే సింహం మాదిరిగా రథం నుండి దిగి, తన గదను గిరగిర తిప్పుతూ భయంకరంగా ఆ ఏనుగుల గుంపుమీదికి దూకాడు. గాలికి చెల్లా చెదరై పోయే మేఘాల వరుస మాదిరి అవి(ఏనుగులు) దూరంగా వెళ్ళిపోయాయి.

విశేషం: అలం: ఉపమ.

తే. క్రందుకొని యిట్లు మాతంగ ఘటలు విఱుగ । నా శ్రుతాయువుఁ బ్రాగ్జ్యోతిషాధిపతియుఁ
బోక నిలిచి యమ్మారుతపు త్రుళ్ళుజోడుఁ । దనువుఁ జించిరి వివిధాస్త్రతతులు వఱపి. 221

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా, మాతంగ ఘటలు= ఏనుగుల గుంపులు; క్రందుకొని= అధికంగా; విఱుగన్= బెదిరిపోగా; శ్రుతాయువున్= శ్రుతాయువనేవాడు; ప్రాగ్జ్యోతిషాధిపతియున్= భగదత్తుడు; ఈ ఇద్దరు; పోక= పారిపోకుండా; నిలిచి; ఆ+మారుత పుత్రుల= ఆ భీముడియొక్క; జోడున్= కవచాన్ని; తనువున్= శరీరాన్ని; వివిధ+అస్త్రతతులు= నానా విధాలైన అస్త్రాలను; పఱపి= ప్రయోగించి; చించిరి= చినిగేట్టు చేశారు.

తాత్పర్యం: భీముడి గద దెబ్బలకు ఏనుగుల గుంపు బెదిరిపోగా శ్రుతాయువు, భగదత్తుడు గట్టిగా నిలబడి, భీముడి మీదికి చాలా ఆయుధాలు ప్రయోగించి అతడి కవచాన్ని, శరీరాన్ని చీలికలు చేశారు.

విశేషం: శ్రుతాయువు-సూర్యవంశపురాజు. ఇతడు కుశుడికి పదునాలుగవ తరంవాడు. **'నాభాగస్యాంబరీషోఽభూత్, సింధుద్వీప స్తతోఽభవత్ । తతః శ్రుతాయు రభవత్ ఋతుపాల స్తతోఽభవత్॥** (మార్క్యే 13 వ అధ్యాయః)

వ. అప్పుడు గాంగేయుండు సేయు దారుణరణంబు ధర్మపుత్రునకు భరం బైన నతం డెలుంగెత్తి పేరువేరం బిలిచి
చేయి వీచిన నా కళింగనాథ భగదత్తుల విడిచి యవుడు గఱచుచు. 222

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో; గాంగేయుండు= భీష్మాచార్యుడు; చేయు= చేస్తున్న; దారుణరణంబు= భయంకరమైనయుద్ధం; ధర్మపుత్రునకున్= ధర్మరాజుకు; భరంబు+ఐనన్= బరువైనదికాగా; అతండు= ఆ ధర్మరాజు; ఎలుఁగు+ఎత్తి= గొంతెత్తి; పేరు+పేరన్+పిలిచి= తనవారిని పేరు పేరునా పిలుస్తూ; చేయివీచినన్= చేయి విసరగా; ఆ కళింగనాథభగదత్తులన్= కళింగరాజు; భగదత్తుడు-వీరిద్దరిని; విడిచి= వదలిపెట్టి; అవుడు+కఱచుచున్= పెదవి కొరుక్కుంటూ.

తాత్పర్యం: అప్పుడు భీష్ముడు చేస్తున్న యుద్ధానికి ధర్మరాజు తట్టుకోలేకపోయాడు. వెంటనే, గొంతెత్తి, తమ వారిని పిలిచాడు. రమ్మని చేయి విసిరాడు. వెంటనే భీముడు శ్రుతాయువును, భగదత్తుడిని వదలిపెట్టి, పెదవి కొరుక్కుంటూ. (తరువాతి పద్యంతో అన్వయం).

క. కలయఁగఁ గరములఁ జరణం । బుల నురమున శోణితంబు బోరనఁ దొరఁగం
దలి రెసఁగిన నడమామిడి । చెలువునఁ బఱతెంచె భీమసేనుఁ డచటికిన్. 223

ప్రతిపదార్థం: భీమసేనుఁడు= భీముడు; కలయఁగన్= అంతటినుండి; కరములన్= చేతులనుండి; చరణంబులన్= కాళ్ళనుండి; ఉరమునన్= రొమ్మునుండి; శోణితంబు= నెత్తురు; బోరన= వేగంగా; తొరఁగన్= కారుతుండగా; తలిరు+ఎసఁగిన= చిగుళ్ళతో ఒప్పియున్న; నడమామిడి చెలువునన్= నడిచే మామిడిచెట్టుమాదిరి; అచటికిన్= ధర్మరాజున్న చోటికి; పఱతెంచెన్= వచ్చాడు.

తాత్పర్యం: భీముడు చేతులు, కాళ్ళు, రొమ్ము - వీటి నుండి నెత్తురు ఎక్కువగా కారుతూ ఉండగా, ఒళ్ళంతా రక్తమయంకాగా ఎఱని చిగుళ్ళతో ఒప్పినట్టి నడిచే మామిడిచెట్టు మాదిరి ధర్మరాజు కడకు వచ్చి చేరాడు.

విశేషం: అలం: ఉపమ.

వ. అంతకు మున్న ధృష్టద్యుమ్న శిఖండి విరాటద్రుపదులు ధర్మనందనున కడ్డపడి భీష్ముపై నడరి బహుప్రకార
విశిఖంబుల వెగడు పఱచిన నతం డలిగి శిఖండి నేయనొల్లక యమ్ములవ్వరను మూఁడేసి వాఁడితూపుల
నేసిన నావీర రథికులు హుతాగ్నిత్రయంబునుం బోలెఁ బ్రజ్వలించి బాణజ్వాలలు నిగిడించి యతని నొప్పించిరి

వృకోదరుఁడద్దెసం గవియుటం గనుంగొని కేకయగణశైనేయద్రౌపదేయులు గూడుకొని కవిసినం గౌరవసేనం జేయంగలమేటిమగ లెల్లను మిన్నేటికొడుకునకుం దలకడచి వారిం దలపడిన నిరుదెఱంగుల దొరలును, బలంబులును నొక్కుమ్మడిం గ్రందుకొన బెరసి పోట్లాడుచుండం జండరశ్మి వినువీథి చక్క సగంబునకుం జనుదెంచె నట్టియెడ. 224

ప్రతిపదార్థం: అంతకుమున్న= భీముడు రావడానికి ముందుగానే; ధృష్టద్యుమ్న; శిఖండి; విరాట; ద్రుపదులు; ధర్మనందనునకున్= ధర్మరాజుకు; అడ్డపడి= అడ్డంగా వచ్చి; భీష్మునిపైన్= భీష్ముడిమీదికి; అడరి= విజృంభించి; బహుప్రకారవిశిఖంబులన్= అనేక విధాలైన బాణాలతో; వెగడుపఱచినన్= తల్లడిల్లజేయగా; అతండు= ఆ భీష్ముడు; అలిగి= కోపగించి; శిఖండిన్= శిఖండిని; ఏయన్= కొట్టడానికి; ఒల్లక= ఇష్టపడక; ఆ+మువ్వురనున్= ధృష్టద్యుమ్నవిరాటద్రుపదులను; మూఁడేసి= మూడుమూడు; వాఁడి= పదునుగల; తూపులన్= బాణాలతో; ఏసినన్= కొట్టగా; ఆ వీరరథికులు= వీరులూ, రథికులు అయిన ఆ ముగ్గురు; హుతాగ్నిత్రయంబున్+పోలెన్= వేల్చబడిన మూడగ్నుల చందంగా; ప్రజ్వలించి= మండిపడి; బాణజ్వాలలు= బాణాలనే అగ్నిశిఖలను; నిగిడించి= ప్రయోగించి; అతనిన్= ఆ భీష్ముని; నొప్పించిరి= బాధపెట్టారు; వృకోదరుఁడు= భీముడు; ఆ+దెసన్= అటుప్రక్కకు; కవియుటయున్; కనుంగొని= చూచి; కేకయ= కేకయదేశీయుల యొక్క; గణ= గుంపు; శైనేయ= శిని వంశంవాడైన సాత్యకి; ద్రౌపదేయులు= ద్రౌపదికొడుకులున్నూ; కూడుకొని= ఒక్కటై; కవిసినన్; కౌరవసేనన్; చేయంగల= సమర్థులైన; మేటిమగలు= గొప్పవారైన శూరులు; మిన్నేటి కొడుకునకున్= భీష్ముడికి; తలకడచి= ముందువైపునకుదాటి; వారిన్= ఆ ముగ్గురిని; తలపడినన్= ఎదుర్కోగా; ఇరుతెఱంగుల= రెండువైపుల ఉన్నట్టి; దొరలును= రాజులున్నూ; బలంబులును= సైన్యాలున్నూ; ఒక్కుమ్మడిన్= ఒక్కసారిగా; క్రందుకొనన్= అతిశయింపగా; బెరసి= దగ్గరకు చేరుకొని; పోట్లాడుచుండన్= పోట్లాడే సమయంలో; చండరశ్మి= వేడి కిరణాలు కలవాడు(సూర్యుడు); వినువీథిన్= ఆకాశమార్గంలో; చక్క సగంబునకున్= సరిగ్గా మధ్యభాగానికి; చనుదెంచెన్= వచ్చి చేరాడు; అట్టియెడన్= ఆ సమయంలో.

తాత్పర్యం: భీముడు వచ్చి చేరటానికి ముందే ధృష్టద్యుమ్నుడు, శిఖండి, విరాటుడు, ద్రుపదుడు - వీరు నలుగురూ ధర్మరాజుకు అండగా అడ్డంగా నిలిచి, భీష్ముడిపైన నానా విధాల బాణాలు ప్రయోగించి, అతడిని చాలా బాధపెట్టారు. అతడు కోపగించి, శిఖండిని వదలిపెట్టి మిగిలిన ముగ్గురిపైనా మూడేసి పదునైన బాణాలు వేశాడు. దానికి ఆ రథికులు త్రేతాగ్నుల చందంగా మండిపడుతూ, మండుతున్న బాణాలను అతడి మీదికి వేసి బాధించారు. భీముడు ఆ ప్రక్కకు రావటాన్ని చూచి కేకయులు, సాత్యకి, ద్రౌపదేయులు ఒక్కటిగా చేరి కలిశారు. అప్పుడు కౌరవసేనలో ఉండే సామర్థ్యం గల మహా వీరులందరూ భీష్ముడికి అండగా ముందుగా నిలబడి ఆ కేకయ సాత్యకి ద్రౌపదేయులను ఎదిరించారు. అప్పుడు పాండవసేనలో, కౌరవసేనలో ఉండే సమర్థులు అయిన రాజులు, వారి వారి సైన్యాలూ ఒక్కపెట్టున ఏకమై విజృంభించి, దగ్గరికి చేరి, యుద్ధం చేస్తూండగా సూర్యుడు ఆకాశం మధ్యకు చేరుకొన్నాడు. (అప్పుడు మిట్టమధ్యాహ్నమైందన్నమాట.)

విశేషం : అగ్నిత్రయంబు= 1. ఆహవనీయము; 2. దక్షిణాగ్ని; 3. గార్హపత్యం.

**తే. రథములను సామజములఁ దురంగములఁ, నుఱక నెత్రుటేఱుల నీఁది తఱియ నడచి
పోరి రేటును వ్రేటును బోటు నొక్క, యలవిఁ జెలఁగంగ నుభయసైన్యములవారు. 225**

ప్రతిపదార్థం: ఉభయసైన్యములవారున్= రెండు సైన్యాలలోని యోధులు; రథములను= తేరులను; సామజములన్= ఏనుగులను; తురంగములన్= గుర్రాలను; ఉఱక= దాటటానికి; నెత్రు+ఏరులన్= నెత్తురు ప్రవాహాలలో; ఈఁది= ఈతకొట్టి; తఱియనడచి=

దగ్గరకు చేరడానికి నడిచి; ఏటును= బాణాలు ప్రయోగించుకోవడం; వ్రేటును= బాదటం; పోటునున్= పొడుచుకోవటం-వీటిలో; ఒక్క+అలవిన్= ఒకే (సామర్థ్యంలో); చెలఁగంగన్= ఒప్పి ఉండేటట్లుగా; పోరిరి= యుద్ధం చేశారు.

తాత్పర్యం: పాండవ కౌరవసేనలలోనివారు రథాలు, ఏనుగులు, గుర్రాలు - వీటిని నరికివేయటంచేత ఏర్పడిన రక్తపుటేరులలో కొంతదూరం ఈతాడి, మరికొంత దూరం దూకి, నడచి, బాణప్రయోగంతో కొట్టుకొనటంలో, పొడుచుకొనటంలో ఒకరికొకరు తీసిపోకుండా, సమతూకంగా విజృంభించి యుద్ధం చేశారు.

వ. అప్పుడు మన బలంబుల జనంబులు. 226

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో; మనబలంబుల= మన సేనలో ఉండే; జనంబులు= జనులు.

తాత్పర్యం: రెండు సైన్యాలు సమానంగా పోరే సమయంలో, మన కౌరవ సేనలలో ఉండే జనాలు ఏమనుకొంటున్నారంటే.

క. ‘ధృతరాష్ట్రుండును బుత్త్రులు । నతిలోభంబునఁ బ్రజాక్షయము సేసిరి ధ
ర్మతనూజు గెలువ వచ్చునె? । మతి లేరై రింక నేటిమాటలు? మనకున్’ 227

ప్రతిపదార్థం: అతిలోభంబునన్= మితిమీరిన ఆశతో; ధృతరాష్ట్రుండును= ధృతరాష్ట్రుడు; పుత్త్రులున్= అతని కొడుకులు; ప్రజాక్షయము= జననాశాన్ని; చేసిరి= చేశారు; ధర్మతనూజున్= ధర్మరాజును; గెలువన్ వచ్చునె?= జయించటం సాధ్యమా?(కాదు); మతిలేరు+ఐరి= (కౌరవులు) బుద్ధిలేని వారయ్యారు; ఇంకన్= ఇకమీద; మనకున్= కౌరవపక్షంలోని మనకు; ఏటిమాటలు?= ఏమి భవిష్యత్తు?

తాత్పర్యం: ‘ధృతరాష్ట్రుడు, అతడి కొడుకులు చాలా దురాశాపరులై పాండవులతో యుద్ధానికి దిగారు. ఆ ఆశబోతులవల్ల అమాయిక ప్రజలెందరో యుద్ధంలో మరణిస్తున్నారు. ధర్మరాజు నీతి, నిజాయితీ గలవాడు. ఆయనను జయించటం సాధ్యమయ్యే పనేనా? (కాదు). కౌరవులు ఓడిపోయి, పాండవులు జయిస్తారు. అప్పుడు కౌరవపక్షంలో ఉన్న మన సంగతేమిటి?’

ఆ. అనుచు వగచు పలుకు లాలించు భీష్మాది । యోధవరులతో సుయోధనుండు
‘చెనఁటి మాటలేమి వినియెద?’రనిన వా । ర దియు నదియు విననియట్ల పోలె. 228

ప్రతిపదార్థం: సుయోధనుండు= దుర్యోధనుడు; అనుచున్= అని; వగచు పలుకులు= చింతించే మాటలు; ఆలించు= వినే; భీష్మ+ఆది యోధ వరులతోన్= భీష్ముడు మొదలుగా గల వీరాగ్రేసరులతో; చెనఁటిమాటలు= కుత్సితుల మాటలు; ఏమి వినియెదరు?= ఎందుకు వింటారు? అనినన్= అనగా, వారు= ఆ భీష్మాదులు; అదియున్+అదియున్= ఆయా మాటలను; విననిన+అట్ల పోలెన్= ఆలకించని విధంగా.

తాత్పర్యం: దుర్యోధనుడు తనసేనలోని వారి యొక్క నిరుత్సాహపరచే శోకంతో కూడిన మాటలు వినే, భీష్మాదులతో ‘కుత్సితపు మాటలు ఎందుకు వింటారు?’ అన్నాడు. ఆ యోధవరులు, ఆ కుత్సితపు మాటలూ, దుర్యోధనుని మాటలూ వినని విధంగా మామూలుగా యుద్ధం చేస్తున్నారు.

వ. పరాక్రమక్రీడలు సలుపుచుండి రాసందడికయ్యంబునం గిమ్మీరమర్దనుండు గదపండువు సేయుచుండె
నప్పుడు. 229

ప్రతిపదార్థం: పరాక్రమ క్రీడలు= పరాక్రమంతో కూడిన ఆటలు; సలుపుచుండిరి= చేస్తూ వుండినారు; ఆ సందడి కయ్యంబునన్= ఆ సంకులసమరంలో; కిమ్మీర మర్దనుండు= కిమ్మీరుడనే రాక్షసుడిని చంపినవాడు(భీముడు); గదపండువు(న్)= (తన) గదకు పండుగను; చేయుచుండెన్= చేస్తూ ఉండినాడు; అప్పుడు.

తాత్పర్యం: వీరులందరూ యథాప్రకారంగా తమ శౌర్యాన్ని చూపిస్తూ, ఆటమాదిరి యుద్ధం చేస్తూ ఉన్నారు. అప్పటి యుద్ధం సంకులసమరంగా ఉన్నది. భీముడు తన గదకు పండుగ చేస్తున్నాడు. అప్పుడు. (తరువాతి పద్యంతో అన్వయం).

క. సరభసముగ సారథి దన । యరదముఁ దెచ్చుటయు నెక్కి యతినిశితశర
స్ఫురణాపరిణతి బాహ్లికు । విరథుం గావించె సురలు వినుతింపంగన్. 230

ప్రతిపదార్థం: సారథి= రథంతోలేవాడు; సరభసముగ(న్)= వేగంగా; తన= (తన) భీమునియొక్క; అరదమున్= రథాన్ని; తెచ్చుటయున్= తేగా; ఎక్కి; అతి= మిక్కుటంగా; నిశిత= పదునైన; శర= బాణాలయొక్క; స్ఫురణా= కదలికయందలి; పరిణతి(న్)= పరిపక్వతతో; సురలు= దేవతలు; వినుతింపంగన్= పొగడుతూ ఉండగా; బాహ్లికున్= బాహ్లికుడిని; విరథున్= రథంలేని వాడినిగా; కావించెన్= చేశాడు.

తాత్పర్యం: తన సారథి తొందరగా రథాన్ని తీసికొని రాగానే, భీముడు దానిలోనికి ఎక్కి, చాలా పదునైన బాణాలు వేశాడు. బాణాలను అడరేటట్లు చేయడంలో తనకు గల నేర్పుతో బాహ్లికుడి రథాన్ని కూల్చాడు. అప్పుడు దేవతలు ఆతడిని పొగిడారు.

తే. చిత్రసేనుండు సౌభద్రుఁ జిత్రబాణ । పాతమున నొంచి యార్చినఁ బాండుపౌత్రుఁ
డతని సారథిఁ బడ నేసి యంతఁ బోక । తురగములఁ జంపి యాతని త్రు ళ్ళడంచె. 231

ప్రతిపదార్థం: చిత్రసేనుండు= చిత్రసేనుడు(కౌరవుల పక్షంవాడు); సౌభద్రున్= అభిమన్యుని; చిత్రబాణపాతమునన్= చిత్రములైన బాణాలతో కొట్టడంవల్ల; నొంచి= నొప్పచేసి; ఆర్చినన్= బొబ్బపెట్టగా; పాండుపౌత్రుఁడు= పాండురాజు మనుమడు(అభిమన్యుడు); అతని సారథిన్= ఆ చిత్రసేనుడి సారథిని; పడన్+ఏసి= పడగొట్టి; అంతన్+పోక= అంతటితో ఆగక; తురగములన్= గుర్రాలను కూడా; చంపి= వధించి; ఆతని త్రుళ్ళు= ఆ చిత్రసేనుడి ఎగిరిపాటును; అడంచెన్= నశింపచేశాడు.

తాత్పర్యం: చిత్రసేనుడు అభిమన్యుడిని బలమైన బాణాలతో కొట్టి, నొప్పి కలిగించి గర్జన చేశాడు. అభిమన్యుడు చిత్రసేనుడి సారథిని చంపి, అంతటితో వదలిపెట్టకుండా, గుర్రాలను కూడా చంపి వాడి పొగరణచాడు.

విశేషం : చిత్రసేనుడు: ధృతరాష్ట్రుడి కొడుకులలో ఒకడు - ధృతరాష్ట్రుని కుమారులలో ప్రధానులు నలుగురు: 1. దుర్యోధనుడు, 2. దుశ్శాసనుడు, 3. వికర్ణుడు, 4. చిత్రసేనుడు.

వ. అక్కుమారుండును దుర్ముఖునిరథంబెక్కెఁ బాంచాలపతి గుంభసంభవుపై నడరి యతనిమేన నానాస్త్రంబులు
నించిన. 232

ప్రతిపదార్థం: ఆ+కుమారుండును= ఆ చిత్రసేనుడును; దుర్ముఖుని రథంబు; ఎక్కెన్= ఎక్కాడు; పాంచాలపతి= ద్రుపదుడు; కుంభసంభవుపైన్= ద్రోణుడిమీదికి; అడరి= విజృంభించి; అతనిమేనన్= ఆ ద్రోణుడి శరీరంపైన; నానా+అస్త్రంబులు= పలు మంత్రపూర్వకములైన బాణాలు; నించిన(న్)= నింపగా.

తాత్పర్యం: ఆ చిత్రసేనుడు దుర్ముఖుడి రథంలోనికి ఎక్కాడు. ద్రుపదుడు ద్రోణుడి మీదికి విజృంభించి, పలు బాణాలతో అతడి శరీరాన్ని నింపివేశాడు.

విశేషం: పాంచాలదేశము: అయిదు ముఖ్య నదులచే చుట్టబడినది - పాంచాలములో పంచాలశబ్దం పైన స్వార్థంలో 'అణ్' ప్రత్యయం రాగా, 'పాంచాలము' అనే రూపమైనది. ఆ పాంచాల నగరానికి రాజు ద్రుపదుడు. ఇప్పు డా నగరానికి 'ఫరక్కాబాద్' అని వాడుక.

క. ద్రోణుఁడు గోపించి తను । త్రాణం బఱువుళ్ళు సేసి తనువున రాజ
ద్బాణంబులు గ్రుచ్చిన సం । క్షీణబలుండై యతండు సిగ్గఱి తొలఁగెన్. 233

ప్రతిపదార్థం: ద్రోణుఁడు= ద్రోణాచార్యుడు; కోపించి= కోపంచెంది; తనుత్రాణంబు= ద్రుపదుడి కవచాన్ని; అఱువుళ్ళు+చేసి= శిథిలాలుగా చేసి; తనువునన్= శరీరంలో; రాజత్+బాణంబులు= జ్వలించే బాణాలను; గ్రుచ్చినన్= గ్రుచ్చుకొనేట్లు చేయగా; అతండు= ఆ పాంచాలరాజు; సంక్షీణబలుండు+ఐ= తగ్గిపోయిన బలం గలవాడై; సిగ్గు+అఱి= సిగ్గుచెడి; తొలఁగెన్= తొలగిపోయాడు.

తాత్పర్యం: ద్రోణుడికి గొప్ప కోపం వచ్చింది. ఆ పాంచాలరాజు కవచాలను ఏ భాగాని కాభాగం వదలిపోయేట్లు చేసి, అతడి శరీరాన్ని మెరిసే బాణాలతో నింపేశాడు. అతడు సిగ్గుతో తొలగిపోయాడు.

విశేషం : ద్రోణుడు- కలశం ఇతనికి ఉత్పత్తి స్థానం కనుక ద్రోణుడు. కురు పాండవులకు ఆచార్యుడు. ఇతడి తండ్రి భరద్వాజుడు. అతడొకనాడు గంగానదిలో స్నానం చేయటానికి వెళ్ళి గంగలో స్నానం చేసిన ఘృతాచి అనే అప్సరసను చూచి, మోహించాడు. ఆమెను కలిశాడు. తననుండి స్ఖలించిన రేతస్సును ద్రోణం (కలశం)లోకి పట్టగా, అందు పుట్టాడు ద్రోణుడు. (ఇతడిని ద్రుపదమహారాజు కొడుకు ధృష్టద్యుమ్నుడు యుద్ధంలో సంహరిస్తాడు.)

సీ. తఱిమి సుశర్ముండు దాఁకి యర్జును నొంచి । కృష్ణపై నమ్ములు గీలుకొలుప
నలిగి యన్నరుఁడు వాలంపకాలువ లోలి । నడరించుటయు వానియఖిలబలముఁ
జేతిసమ్మెటలను జేరుకోలల వ్రేసి । యంకుశంబుల నూఁటి యతిరయమున
వాహనంబులఁ దోలువారును విండ్లును । బలకలు వైచుచుఁ బఱచువారు

తే. నైన మీ తండ్రి క్రీడిపై నడర నడుమఁ । జొచ్చె సాత్యకి యన్నదీసుతుఁడు శక్తి
వైవ మెయి వాల్చి యది పట్టి వైచె మగుడ । నాతఁ డా భీష్ము డెడఁ దునుమాడె నధిప! 234

ప్రతిపదార్థం: అధిపా!= ఓ ధృతరాష్ట్ర మహారాజా! సుశర్ముండున్= సుశర్మ అనేవాడు; తఱిమి= త్వరపడి; అర్జునున్= అర్జునుడిని; తాఁకి= మార్కొని; నొంచి= నొవ్వచేసి; కృష్ణపైన్= కృష్ణుడిమీద; అమ్ములు= బాణాలను; కీలుకొలుపన్= గ్రుచ్చగా; ఆ+నరుఁడు= ఆ అర్జునుడు; అలిగి= కోపించి; వాలు+అంపకాలువల= పొడవైన బాణాల కాలువల; ఓలిన్= వరుసగా; అడరించుటయున్= అతిశయింపచేయగా; వాని+అఖిలబలమున్= ఆ సుశర్మ సైన్యమునంతయు; చేతి సమ్మెటలను; చేరుకోలలన్= జాటీలతోనూ; వ్రేసి= కొట్టి; అంకుశంబులన్; ఊఁటి= పొడిచి; అతిరయమునన్= చాల వేగంతో; వాహనంబులన్= ఏనుగులను, గుర్రాలను; తోలువారును= తోలేటటువంటివారున్నూ; విండ్లును= ధనుస్సులు; పలకలు= కేడెములు; వైచుచున్= పడవేయుచు; పఱచువారున్ ఐనన్= పరుగులు తీసేవారుకాగా; మీ తండ్రి= మీ తండ్రియైన భీష్ముడు, క్రీడిపైన్= అర్జునుడిమీదికి; అడరన్= విజృంభించగా; సాత్యకి= పాండవుల పక్షంవాడు; నడుమన్= మధ్యలో; చొచ్చెన్= చొరబడ్డాడు; ఆ+నదీసుతుఁడు= ఆ భీష్ముడు; శక్తివైవన్= శక్తి అనే ఆయుధాన్ని ప్రయోగించగా; మెయిన్= శరీరాన్ని; వాల్చి= వంచి; ఆతఁడు= ఆ సాత్యకి; అది పట్టి= ఆ శక్తి అనే ఆయుధాన్ని పట్టుకొని; మగుడన్= మరల; వైచెన్= వేశాడు; ఆ+భీష్ముఁడు; ఎడన్= మధ్యలోనే; తునుము+ఆడెన్= త్రుంచివేశాడు.

తాత్పర్యం: సుశర్మ అర్జునుడిని ఎదిరించి, ఆతడికి నొప్పి కలిగించాడు. కృష్ణుడిమీద కూడా బాణాలు గుప్పించాడు. దానితో అర్జునుడికి కోపం వచ్చింది. బాణాలను ప్రవాహాలుగా ప్రయోగించి ఆ ప్రవాహాలలో శత్రువులను

ఓలలాడించాడు. ఆ ధాటికి సుశర్మ సైన్యమంతా కూడా తమ తమ ఆయుధాలతో, సమ్మెటలు, జాటీలు, అంకుశాలు - వీటితో తమ వాహనాలు, గుర్రాలు, ఏనుగులను కొట్టి, పొడిచి, వేగంగా తోలుకొని పోయారు. బంట్లు తమ ధనుస్సులను, కేడెములను పారవైచి, పరుగులు తీశారు. అప్పుడు భీష్ముడు అర్జునుడి మీదికి విజృంభించగా సాత్యకి మధ్యలో అడ్డం తగిలాడు. భీష్ముడు సాత్యకి మీదికి శక్తిని ప్రయోగించాడు. అప్పుడు సాత్యకి వంగి, ఆ శక్త్యాయుధాన్ని పట్టుకొని, మళ్ళీ భీష్ముడిపైకే విసరగా, మధ్యలోనే దాన్ని ఖండించాడు భీష్ముడు.

వ. ఇట్లు త్రుంచి. **235**

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; త్రుంచి= విరుగగొట్టి.

తాత్పర్యం: సాత్యకి తిప్పివేసిన శక్తి ఆయుధాన్ని విరిచి. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. ఆలోనన మెయిఁ దొమ్మిది । వాలమ్ములు నాటఁ బాండవవ్యూహము శుం
డాలరథఘోటసుభటా । భీలతఁ దలకడచి పాదివె భీష్ముని నంతన్. **236**

ప్రతిపదార్థం: ఆలోనన్+అ= అంతలోపలనే; మెయిన్= సాత్యకి దేహంమీద; తొమ్మిది వాలు+అమ్ములు= తొమ్మిది పదునైన బాణాలు; నాఁటన్= (భీష్ముడు)గ్రుచ్చుకొనేటట్లు చేయగా; అంతన్; పాండవవ్యూహము= పాండవుల సైన్యం; శుండాల= ఏనుగులు; రథ= రథాలు; ఘోట= గుర్రాలు; సుభట= కాల్బలము; ఈ చతురంగ బలం; ఆభీలతన్= భయంకరంగా; తలకడచి= దాటివచ్చి; భీష్మునిన్= భీష్మాచార్యుడిని; పాదివెన్= కమ్ముకొన్నది.

తాత్పర్యం: అంతలోనే భీష్ముడు తొమ్మిది బాణాలు సాత్యకి ఒంటి మీద గ్రుచ్చుకొనేటట్లుగా ప్రయోగించాడు. పాండవసేనలోని ఏనుగులు, రథాలు, గుర్రాలు, కాల్బలం - అంతా భయంకరంగా దాటివచ్చి, ఆ భీష్ముడిని క్రమ్ముకొన్నాయి.

దుర్యోధనుఁడు శకునిదుశ్శాసనుల భీష్మునకు సహాయంబుఁగా బంపుట (సం. 6-101-1)

క. కని కౌరవపతి దుశ్శా । సనుతో నిట్లనియెఁ గంటె? శాంతనవునిపై
ఘన సేన ద్రోచెఁ జని కై । కొనుఁ డీవును సౌబలుఁడు నకుంఠితవృత్తిన్.' **237**

ప్రతిపదార్థం: కౌరవపతి= కురురాజు దుర్యోధనుడు; దుశ్శాసనుతోన్; ఇట్లు+అనియెన్; శాంతనవునిపైన్= శంతనుడి కుమారుడైన భీష్ముడిమీదకి; ఘనసేన= గొప్పదగు సైన్యం; త్రోచెన్= వ్యాపిస్తున్నది; కంటె?= చూచావా?; ఈవును= నీవున్నూ; సౌబలుఁడు= శకుని; చని= వెళ్ళి; అకుంఠితవృత్తిన్= మొక్కపోని విధంగా; కైకొనుఁడు= అతడి సహాయానికి పూనుకోండి.

తాత్పర్యం: దుర్యోధనుడు దుశ్శాసనుడితో ఇట్లా అన్నాడు: 'భీష్ముడి మీదికి పాండవులదైన గొప్ప సైన్యం విరుచుకపడుతూ ఉన్నది. చూచావా? నీవు, శకుని వెళ్ళి, ఏ మాత్రం జంకూగొంకూ లేక ఆయన్ని ఆదుకోండి.'

క. అనవుడు నయ్యిరువురు నే । పునఁ గదియుడుఁ జూచి ధర్మపుత్త్రుఁడు మాద్రీ
తనయులు నడరిన దుర్యో । ధనుఁ డపుడు తురంగమాయుతముఁ బురికొలిపెన్. **238**

ప్రతిపదార్థం: అనవుడున్= అని చెప్పగా; ఆ+ఇరువురున్= ఆ శకుని దుశ్శాసనులిద్దరూ; ఏపునన్= విజృంభణంతో, కదియుడున్= దగ్గరకు రాగా; చూచి; ధర్మపుత్త్రుఁడు= ధర్మరాజు; మాద్రీతనయులున్= మాద్రి కొడుకులు నకుల సహదేవులున్నూ; అడరినన్=

విజృంభించగా; అపుడు= ఆ సమయంలో; దుర్యోధనుఁడు; తురంగమ+అయుతమున్= పదివేల గుర్రాల(రౌతుల)ను; పురికొల్పెన్= కవ్వింపచేశాడు.

తాత్పర్యం: దుర్యోధనుడు చెప్పగానే, శకుని దుశ్శాసను లిద్దరూ భీష్ముడి దగ్గరకు వచ్చారు. దీన్ని చూచి ధర్మరాజు, నకులుడు, సహదేవుడు అక్కడికి వచ్చి, విజృంభించారు. దాన్ని చూచి దుర్యోధనుడు పదివేల గుర్రపు రౌతుల్ని వారి మీదికి కవ్వింపజేశాడు.

వ. ఆ పదివేవురు నెఱరావుతులును నొక్కపెట్ట శకునిదుశ్శాసనులకుం దలకడచి యెక్కినం బాండవబలంబు మహామత్స్యసమూహావిహారంబునం గలంగు మడువునుంబోలె సంక్షోభించినం గోపించి కౌంతేయాగ్రజుండును గవలును, వివిధవిశిఖపరంపరలు వరగింప ముందటికాళ్ళు దునిసిన మ్రొగ్గ తిలంబడియును మోరలు పఱియలైన నెఱి దప్పం గూలియు, గుండియ లవిసిన నెగసి కెడసియు వాగెలు ద్రెవ్విన వలియం బాఱియు నాశ్వికులు నేల కొఱగినం జెనటి దిరిగియు, ననేకఘోటకంబులు రూపఱిన నేపఱి యత్తురంగనికరంబు లేటమొగంబు వడి చెదరి కనుకనిం బఱచిన. 239

ప్రతిపదార్థం: ఆ పదివేవురు= ఆ పదివేలు; నెఱరావుతులును= సమర్థులైన గుర్రపు రౌతులు; ఒక్కపెట్ట= ఒక్కసారిగా, శకుని దుశ్శాసనులకున్; తలకడచి= ముందుకు వెళ్ళి; ఎక్కినన్= అతిశయించగా; పాండవబలంబు= పాండవుల సేన; మహా= గొప్ప; మత్స్య= చేపల; సమూహ= గుంపుయొక్క; విహారంబునన్= తిరగటంచేత; కలంగు= కలత చెందునట్టి; మడువునున్+పోలెన్= మడుగుమాదిరి; సంక్షోభించినన్= కలతచెందగా; కౌంతేయ+అగ్రజుండునున్= ధర్మరాజున్నూ; కవలును= నకుల సహదేవులున్నూ; కోపించి; వివిధ విశిఖ పరంపరలు= నానా విధాలైన బాణాల వరుసలు; పరగింపన్= ప్రయోగించగా; ముందటి కాళ్ళున్= ముందుకాళ్ళు; తునిసినన్= తుంటలుకాగా; మ్రొగ్గతిలన్+పడియును= మోకరిల్లిపడియు; మోరలు= ముఖాలు; పఱియలు+ఐనన్= బద్దలుకాగా; నెఱి= అందం; తప్పన్= తప్పిపోగా; కూలియున్= క్రిందపడియు; గుండియలు= గుండెకాయలు; అవిసినన్= పగిలిపోగా; ఎగసి= ఎగిరి; కెడసియు(న్)= పడియు; వాగెలు(న్)= కళ్ళెమునకు తగిలించే పగ్గాలు; త్రెవ్వినన్= తెగిపోగా; వలియ బాఱియు(న్)= బలహీనపడి; అలసిపోయి; ఆశ్వికులు= రౌతులు; నేలకున్= నేలమీదికి; ఒఱగినన్= వాలిపోగా; చెనఁటి= దండుగగా; తిరిగియున్; అనేక ఘోటకంబులు= పలుగుర్రాలు; రూపఱినన్= అంగహీనాలుకాగా; ఏపు+అఱి= విజృంభణం తగ్గి; ఆ+తురంగనికరంబు= ఆ గుర్రాల గుంపు; లేటమొగంబు+పడి= పక్కకు త్రిప్పుకొనిన ముఖాలు కలవై; చెదరి= కలతపడి; కనుకనిన్= తొందరపాటుతో; పఱచినన్= పారిపోగా.

తాత్పర్యం: ఆ పదివేల మంది రౌతులు ఒక్కసారిగా శకునిదుశ్శాసనుల ముందుకు వచ్చి విజృంభించారు. అప్పుడు పాండవుల సేన అంతా కూడా, గొప్ప గొప్ప చేపల గుంపులు ఇటూ అటూ తిరగటంచేత కలత చెందిన కొలను చందంగా అయింది. అప్పుడు ధర్మరాజుకు, నకులసహదేవులకు తమ సేన పాటు చూచి కోపం వచ్చి, వారు రకరకాలైన బాణాల వరుసలు ఆ గుర్రాలపై గుప్పించారు. దాని ఫలితంగా, చాలా గుర్రాలు ముందు కాళ్ళు విరిగి మోకరిల్లి పడ్డాయి. ఇంకా కొన్ని గుర్రాలు - ముఖాలు బద్దలుగా పగిలిపోగా, అందం తప్పి, కుప్పకూలాయి. మరికొన్ని గుండెకాయలు పగిలి ఎగిరి నేల కూలాయి. పలుగుర్రాలు నోటికి కళ్ళెంతో పాటు తగిలించే తాళ్ళు తెగిపోగా పెడదారిని పారిపోయాయి. మరికొన్ని గుర్రాలు తమ రౌతులు నేలవ్రాలగా ఇటూ అటూ తిరిగాయి. చాలా గుర్రాలు అంగవిహీనాలై, తమ పటాటోపం పాడుకాగా ముఖాలు అడ్డంగా త్రిప్పుకొని కలతపడి తొందరపాటుతో ఇటూ అటూ పరుగెత్తాయి.

క. భేరీశంఖాదిరవ । స్ఫారత నప్పాండుపుత్ర బలమేచుటయుం
గౌరవపతి శల్యునితో । గారవమున నిట్టు లనియెఁ గడు దీనుం డై. 240

ప్రతిపదార్థం: ఆ+పాండుపుత్రబలము= ఆ పాండురాజు కొడుకు సైన్యం; భేరీ= దుందుభులు; శంఖ= శంఖాలు; ఆది= మొదలగు వాద్యాల, రవ= చప్పుళ్ళయొక్క.; స్ఫారతన్= ఆధిక్యంతో; ఏచుటయున్= అతిశయించగా; కౌరవపతి= దుర్యోధనుడు; కడు దీనుండు+ఐ= మిక్కిలి శోచనీయమైన స్థితిని పొందినవాడై; శల్యునితోన్; గారవమునన్= ప్రేమతో; ఇట్టులు= ఈ విధంగా; అనియెన్.

తాత్పర్యం: కౌరవుల అశ్వాల హీనస్థితినిచూచి, పాండవుల సేనలో భేరీశంఖాది వాద్యాల ఘోష మిన్నుముట్టింది. దాన్ని చూచి, దుర్యోధనుడు చాలా దీనస్థితికి లోనై, సగౌరవంగా శల్యుడితో ఈ విధంగా అన్నాడు.

క. ‘ వెలివిరిసి వచ్చు జలనిధి । పాలుపునఁ దోఁతెంచు ధర్మపుత్రుని బలు గో
ల్తల నిలువరింప నీ వొక । చెలియలికట్ట వయి మమ్ము జేకొను మిచటన్.’ 241

ప్రతిపదార్థం: వెలివిరిసి= పెల్లుబికి; వచ్చు= పైకి వచ్చెడి; జలనిధి పాలుపునన్= సముద్రం ఒప్పుతో; తోఁతెంచు= వచ్చుచున్నట్టి; ధర్మపుత్రుని= ధర్మరాజుయొక్క.; బలుకోల్తలన్= అధికములగు యుద్ధసన్నాహాలను; నిలువరింపన్= ఆపడానికి; ఈవు= నీవు(శల్యుడు); ఒక చెలియలికట్టవు+అయి= ఒక సముద్రపు ఒడ్డుగా తయారై; ఇచటన్= ఈ ప్రమాద స్థలంలో; మమ్మున్; చేకొనుము= ఆదరించుము.

తాత్పర్యం: ‘పొంగి పొరలి వచ్చే సముద్రంలాగా, పాండవసేనలు యుద్ధ సన్నాహాలు చేసికొంటూ మన మీదికి వస్తున్నాయి. వారి సన్నాహ ప్రవాహాన్ని ఆపడానికి నీవు ఒక చెలియలి కట్టలాగా మమ్ములను ఈ ఆపత్సమయంలో ఆదుకొమ్ము.’

ఆ. అనుడు నతఁడు పాండవాగ్రజుఁ గవలను । దాఁకి విపులబాహుదర్ప మొప్ప
నారసములఁ బొదివి మారిమసంగిన । ట్లయినఁ జూచి నరుఁడు ననిలసుతుఁడు. 242

ప్రతిపదార్థం: అనుడున్= అని చెప్పగా; అతఁడు= ఆ శల్యుడు; పాండవ+అగ్రజున్= ధర్మరాజును; కవలనున్= నకుల సహదేవులను; తాఁకి= మార్కొని; విపుల బాహుదర్పము= అధికమైన చేతుల పొగరు; ఒప్పన్= తగియుండగా; నారసములన్= బాణాలతో; పొదివి= కప్పి; మారిమసంగిన+అట్లు+అయినన్; మసూరికా రోగం విజృంభించినట్లు కాగా; నరుఁడు= అర్జునుడు; అనిలసుతుఁడు= భీముడు; చూచి.

తాత్పర్యం: దుర్యోధనుడు కోరిన విధంగా శల్యుడు ధర్మరాజుపైకి, నకులసహదేవులపైకి కవిసి తన బాహుబలం చూపి బాణాలతో వారిని కప్పివేయగా, అక్కడ మహమ్మారి రేగినట్లయింది. దాన్ని చూచి అర్జునుడు, భీముడు. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. ఒక్కటఁ గడంగి శల్యునిఁ । బెక్కమ్ముల నొంచుటయును భీష్మద్రోణుల్
గ్రక్కునఁ దతిమిన నయ్యురు । దిక్కులసైన్యములు నత్యుదీర్ణత బెరసెన్. 243

ప్రతిపదార్థం: ఒక్కటన్= ఒకే మాదిరిగా; కడంగి= యత్నించి; శల్యునిన్; పెక్కు+అమ్ములన్= చాలా బాణాలతో; నొంచుటయును(న్)= బాధించగా; భీష్మద్రోణుల్= భీష్ముడు, ద్రోణుడును; గ్రక్కునన్= వెంటనే; తతిమినన్; ఆ+ఇరుదిక్కుల సైన్యములున్= ఆ రెండు పక్షాల సేనలు; అతి+ఉదీర్ణతన్= మిక్కిలి అతిశయంగా; బెరసెన్= తారసిల్లాయి.

తాత్పర్యం: ఆ అర్జునుడు, భీముడు ఒకేసారి శల్యుడిపైకి ఎగబడి చాలా బాధ కలిగించారు. వెంటనే భీష్ముడు, ద్రోణుడు కవియగా ఆ రెండు సేనలూ విజృంభించి పెనగులాడాయి.

వ. ఇట్లు గలయన్ బెరసి యపరాహ్ణంబున నుభయ చతురంగమథనం బగు ప్రధనంబు చెల్లె నట్టియెడ భీష్మ గ్రీష్మాదిత్యుండు వేఁడి మిగిలి వాఁడి మెఱసిన నారసంబులను కిరణంబుల పరగించి. 244

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; కలయన్= కలిసేటట్లుగా; బెరసి= చేరి; అపరాహ్ణంబునన్= దినముయొక్క నాల్గవ భాగాన; ఉభయ= రెండు పక్షాలవారియొక్క; చతురంగ= చతురంగ బలములయొక్క; మథనంబు+అగు= చిలుకుట అగు; ప్రధనంబున్= యుద్ధం; చెల్లెన్= ఒప్పెను; అట్టి+ఎడన్= ఆ సమయంలో; భీష్మ గ్రీష్మ+ఆదిత్యుండు= భీష్ముడనే ఎండకాలంలోని సూర్యుడు; వేఁడి మిగిలి= చురుకుదనంచేత అతిశయించి; వాఁడి= పదనుచే; మెఱసిన= ప్రకాశించే; నారసంబులు+అను= బాణాలనే; కిరణంబులు= కిరణాలను; పరగించి= ప్రసరింపచేసి.

తాత్పర్యం: పాండవసైన్యం, కౌరవసైన్యం రెండూ కలిసి కలియబడి, యుద్ధం చేసేటప్పుడు అపరాహ్ణకాలం అయింది. ఆ రెండు సేనలలోని చతురంగ బలాలు సముద్రాన్ని చిలికినట్టుగా, ఒక దాన్ని మరొకటి బాగా కలత చెందేటట్లుగా చేశాయి. అప్పుడు ఎండాకాలంలో మండుతుండే సూర్యుడిలాగా భీష్ముడు వేడి, వాడిగల బాణాలనే కిరణాలను అంతటా ప్రసరింపచేశాడు.

విశేషం: చతురంగబలము: చతుః +అంగబలము= నాలుగు అంగాలు కల సైన్యం. 1. రథాలు, 2. ఏనుగులు, 3. గుర్రాలు, 4. కాల్బలం. అలంకారం: రూపకం.

సీ. పండ్రెంటఁ బండ్రెంటఁ బాండవాగ్రజుని భీమని మాద్రికొడుకుల మూఁట మూఁట
నేడింట నేడింట నేచి సాత్యకిని ధృష్టద్యుమ్ను నొప్పించి సమదవృత్తి
నార్చిన మాత్స్యపాండ్యానీకములును సోమకవరూథినియును మగధబలముఁ
గాశసైన్యంబుఁ గరూశసేనయు నొక్క పెట్ట రయంబున భీష్ముమీఁద

తే. నురవడించినఁ బాండవోత్కరముఁ గృష్ణ। తమ్ముఁ బాంచాలనందను సమ్ముఖమున
కడరనీ కాఁగి యందఱ కన్నిరూపు। లై మహారణ మొనరించె నస్త్రగురుఁడు. 245

ప్రతిపదార్థం: పాండవ+అగ్రజుని(న్)= ధర్మరాజును; భీముని(న్)= భీముడిని; పండ్రెంటన్+పండ్రెంటన్= పన్నెండుపన్నెండు బాణాలతో; మాద్రికొడుకులన్= నకుల సహదేవులను; మూఁటన్+మూఁటన్= మూడేసి బాణాలతో; సాత్యకిన్= సాత్యకిని; ధృష్టద్యుమ్నున్= ధృష్టద్యుమ్నుడిని; ఏడింటన్+ఏడింటన్= ఏడేసి ఏడేసి బాణాలతో; ఏచి= విజృంభించి; నొప్పించి= బాధ కలిగించి; సమదవృత్తిన్= మదంతో కూడిన తీరుతో; ఆర్చిన(న్)= బొబ్బరించగా; మాత్స్య, పాండ్య+అనీకములును= మత్స్య, పాండ్య దేశాల రాజుల సేనలు; సోమకవరూథినియును= సోమకుడి సైన్యమున్నూ; మగధబలమున్= మగధ రాజు సేనయు; కాశసైన్యంబున్= కాశదేశపు సేనయు; కరూశసేనయున్= కరూశదేశపు బలమున్నూ; ఒక్కపెట్ట= ఒక్కసారిగా; రయంబునన్= వేగంతో; భీష్ముమీఁదన్= భీష్ముడిమీదికి; ఉరవడించినన్= వేగంగా కవియగా; అస్త్రగురుఁడు= ద్రోణాచార్యుడు; పాండవ+ఉత్కరమున్= పాండవుల గుంపును; కృష్ణతమ్మున్= కృష్ణుడి తమ్ముడు సాత్యకిని; పాంచాల నందనున్= ధృష్టద్యుమ్నుడిని; సమ్ముఖమునకున్= ఎదుటికి; అడరన్+ఈక= రానీకుండా; ఆఁగి= అడ్డగించి; అందఱకున్= ఎదిరించే సైనికులందరికి; అన్నిరూపులు+ఐ= అంతమంది ద్రోణులుగా అయి; మహా+రణము= గొప్ప భయంకరమైన యుద్ధాన్ని; ఒనరించెన్= చేశాడు.

తాత్పర్యం: భీష్ముడు పన్నెండు బాణాలతో ధర్మరాజును, మరో పన్నెండు బాణాలతో భీముడిని, మూడు బాణాలతో నకులుడిని, మరి మూడింటితో సహదేవుడిని, ఇంకో ఏడు బాణాలతో సాత్యకిని, మరి ఏడింటితో ధృష్టద్యుమ్నుడిని బాగా విజృంభించి, కొట్టి, బాధ కలిగించి, బిగ్గరగా బొబ్బరించాడు. అప్పుడు మాత్స్య, పాండ్య, సోమక, మగధ,

కాశ, కరూశ దేశాల సేనలు ఒక్కసారిగా వేగంగా భీష్ముడి మీదికి ఉరికాయి. అప్పుడు ద్రోణాచార్యుడు పాండవు లందరినీ, సాత్యకిని, ధృష్టద్యుమ్నుడిని భీష్ముడి ఎదుటికి రానీయకుండా ఆపి, సేనలోని ప్రతివాడికి ఒక్కొక్క ద్రోణుడివలె కనిపిస్తూ చాలా నేర్పుగా భయంకరంగా యుద్ధం చేశాడు.

ఉ. శాంతనవుం డనేకబలసంతతి నుద్భట శౌర్యసారదు
ర్దాంతపరాక్రమస్ఫురణఁ దాఁకి సముజ్జ్వలశాతసాయక
క్రాంతపరీతనిర్మథితకంపితపాతితమూర్తిఁ జేసి య
త్యంతరయంబునం దనరథంబుగతుల్ మెఱయం బ్రదీప్తుఁ డై. 246

ప్రతిపదార్థం: శాంతనవుండు= భీష్ముడు; అనేకబల సంతతిన్= చాలా సైన్యాల సమూహాన్ని; ఉద్భట= అధికమైన; శౌర్య= శూరత్వము యొక్క; సార= బలంచేతను; దుర్+దాంత= అణచరాని; పరాక్రమ= పరాక్రమం యొక్క; స్ఫురణన్= తోచుటచేత; తాఁకి= మార్కొని; సమ్+ఉత్+జ్వల= చక్కగా వెలుగుతున్న; శాత= పదునుగల; సాయక= బాణాలచేత; క్రాంత= ఆక్రమింపబడిన; పరీత= చుట్టబడిన; నిర్+మథిత= బాగా చిలకబడిన; కంపిత= కదలింపబడిన; పాతిత= పడవేయబడిన; మూర్తిన్= శరీరాలు కలవారినిగా; చేసి; అతి+అంత రయంబునన్= చాలావేగంతో; తన= భీష్ముడియొక్క; రథంబుగతుల్= రథము యొక్క పోకడలు; మెఱయన్= ప్రకాశింపగా; ప్రదీప్తుడు+ఐ= మండిపడుతున్నవాడై.

తాత్పర్యం: భీష్ముడు పాండవుల చాలా సేనలను అధికమైన శౌర్యంతో, బలంతో, అడచరాని పరాక్రమంతో ఎదిరించి, మంటలు కక్కుతున్న తన పదునుగల బాణాలు ప్రయోగించి, విరోధిసేనలోని చాలామందిని ఆక్రమించాడు. మరికొందర్ని బాణాలతో చుట్టివేశాడు. ఇంకా కొందరిని చిలికి, తుక్కుచేశాడు. మిక్కిలి వేగంతో తన తేరు నడకలు ప్రకాశిస్తూండగా, తాను కోపోద్దీపితుడై (తరువాతి పద్యంతో అన్వయం.)

మ. గజరాజోజ్జ్వలఘంటికావళిఁ దురంగప్రస్ఫురత్కింకిణీ
వ్రజముం గాహళ దుందుభిప్రభృతితూర్య శ్రేణులన్ సుందర
ధ్వజఘంటాతతులన్ శరాసనగుణవ్రాతంబుఁ దున్మాడి ధ
ర్మజసేనాతతి ముంపఁ జేసెఁ బటుదోర్గర్వం బఖర్వంబుగన్. 247

ప్రతిపదార్థం: పటు+దోః+గర్వంబు= సమర్థములైన చేతుల పొగరు; అఖర్వంబు+కాన్= అధికంకాగా; గజరాజ= శ్రేష్ఠములగు ఏనుగుల యొక్క; ఉజ్జ్వల= ప్రకాశించెడి; ఘంటికా= గంటలయొక్క; ఆవళిన్= వరుసను; తురంగ= గుర్రాలయొక్క; ప్రస్ఫురత్= కదలుతున్న; కింకిణీ= చిరుగంటలయొక్క; వ్రజమున్= సమూహాన్ని; కాహళ= కొమ్ములు; దుందుభి= భేరులు; ప్రభృతి= మున్నుగాగల; తూర్య= వాద్యవిశేషముల యొక్క; శ్రేణులన్= వరుసలను; సుందర= అందమైన; ధ్వజ= టెక్కెములయొక్క; ఘంటా= గంటలయొక్క; తతులన్= సమూహాలను; శరాసన= ధనుస్సులయొక్క; గుణ= అల్లెత్రాళ్ళయొక్క; వ్రాతంబున్= సమూహాన్ని; తున్మ+ఆడి= తుంటలుచేసి; ధర్మజ సేనాతతి(న్)= ధర్మరాజు యొక్క సేనా సమూహాన్ని; ముంపన్+చేసెన్= బాణాలతో మునిగిపోయేటట్లుగా చేశాడు.

తాత్పర్యం: భీష్ముడు బలమైన తన భుజాలబలగర్వం అతిశయించేటట్టుగా, ఏనుగులకు ఉండే గంటలను, గుర్రాల శరీరాలపైన కదలుతుండే చిరుగంటల సముదాయాన్ని, కొమ్ములు దుందుభులు మొదలైన వాద్యాల సముదాయాన్ని, అందంగా ధ్వజాలకు కట్టి ఉండే గంటల సమూహాన్ని, విండ్లయొక్క అల్లెత్రాళ్ళను తునాతునకలు చేసి, ధర్మరాజు సేనాసమూహాన్ని బాణాలతో ముంచివేశాడు.

విశేషం: ఈ వచనంలో భీష్ముడి శౌర్యాతిశయాన్నే గాక, యుద్ధవర్ణనలో తనకు గల నేర్పరితనాన్ని కూడా తిక్కన చక్కగా, చిక్కగా ప్రదర్శించాడు. సహజ సుందరాలైన ఉపమానాలను కూడా అక్కడక్కడ చూపాడు.

వ. ఇట్లు బల్లిదుం డయి మల్లడిగొని మార్కొనుమగలు లేక మదంబునం బొంగి గాంగేయుండు పాండవేయులు వెఱఁగుపడియుండ మఱియునుం గడంగి దుర్వారంబు లగు దివ్యాస్త్రంబులు వీటుకొల్పి యే దిక్కు సూచినం దాన యై రథికులను, హాస్తికులను, నాశ్వికులనుం దునిమిన గంధసింధురక్రీడనంబున మ్రోడుపడిన యుద్యానంబు చందంబున నగుచున్న చోట్లును, గాలుబలంబులం గనుపుకొట్టిన గాలు, చేయి, తల, డొక్క యని యేఱుపాటు లేక వండం దఱిగినయ ట్లున్న యెడలును, బెక్కుదెఱంగుల చప్పుళ్ళు నిగుడ రథచయంబు నవయవంబులుం గరిహయనికరంబుల యెమ్ములు వియుగం గార్చిచ్చు పొదివిన వెదురుటడవి తెఱంగునం దోఁచుపట్లును, దఱచు గొడుగులు విట తాటనంబు సేసినం బెనుగాలిం జిక్కువడిన కుసుమితకాశవనంబునుం బోలు చక్కట్లును, బహురత్నమయ మకుటాది భూషణ వ్రజంబు వివిధ వర్ణ చామరజాతంబు నటికి పడవైచినం బ్రబలోద్ధతులాయలులితంబయి కమలకైరవోత్పలాకీర్ణం బగుకొలని ననుకరించు ప్రదేశంబులును నై పాండవసైన్యంబులు దైన్యంబు నొందియుఁగలగుండుగొనియు బెండువడియుఁగలంగంబాఱియుఁ దొలంగం దెరలియుం గోలాహలబహుళంబు లగుటం గనుంగొని గోవిందుండు. 248

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; బల్లిదుండు+అయి= మిక్కిలిబలంగలవాడై; మదంబునన్= గర్వంచేత; పొంగి=ఉబ్బి; గాంగేయుండు; మల్లడిగొని యుద్ధం చేయగా; మార్కొనన్= ఎదిరించటానికి; మగలులేక= శూరులు లేకపోగా; పాండవేయులు= పాండురాజకుమారులు; వెఱఁగుపడి ఉండన్= నిశ్చేష్టులు కాగా; మఱియును(న్)= మరలకూడా; కడంగి= పూనుకొని; దుర్వారంబులు+అగు= అడ్డగింపరానివైన; దివ్య+అస్త్రంబులు= అమోఘములైన ఆయుధాలను; దీటుకొల్పి= నిండింపచేసి; ఏ దిక్కు= ఏ వైపు; చూచినన్; తాను+అ+ఐ= తానే(భీష్ముడు) అగపడుతూ; రథికులను= రథంలోని వాళ్ళను; హాస్తికులను= ఏనుగుల నెక్కి యుద్ధం చేసేవారిని; ఆశ్వికులనున్= గుఱ్ఱపు రౌతులను; తునిమిన(న్)= తుంటలు చేయగా; గంధ సింధుర క్రీడనంబున(న్)= మదపుటేనుగు యొక్క విహారంచేత; మ్రోడుపడిన; ఉద్యానంబు చందంబున(న్)= ఉద్యానవనం మాదిరి; అగుచున్+ఉన్న= అవుతూ ఉన్నట్టి; చోట్లును= స్థలాలున్నూ; కాలుబలంబులన్= కాల్బంట్లను; కనుపుకొట్టినన్= ఖండించగా; కాలు; చేయి; తల; డొక్క; అని; ఏఱుపాటు= భేదం; లేక; వండన్= వంటచేయటానికి; తఱిగిన+అట్లు= తరిగిపెట్టిన కూరల మాదిరి; ఉన్న= ఉన్నట్టి; ఎడలును(న్)= చోట్లున్నూ; పెక్కు తెఱంగుల= నానా విధాలైన; చప్పుళ్ళు= శబ్దాలు; నిగుడన్= అతిశయించగా, రథచయంబు= రథాల సమూహాలయొక్క; అవయవంబులున్= భాగాలున్నూ; కరిహయనికరంబుల= ఏనుగుల యొక్క, గుర్రాలయొక్క, ఎమ్ములు= ఎముకలు; వియుగన్= విరుగుచుండగా; కార్చిచ్చు= దావానలం(అడవిలో పుట్టే అగ్ని); పొదివిన= వ్యాపించినట్టి; వెదురు+అడవి= వెదుళ్ళగల అరణ్యం; తెఱంగునన్= వలె; తోఁచు= కనిపించునట్టి; పట్లును= చోట్లున్నూ; గొడుగులు= ఛత్రాలు; తఱచు= అధికంగా; విటతాటనంబు+చేసినన్= తారుమారుకాగా; పెనుగాలిన్= పెద్దగాలిచేత; చిక్కువడిన= చిందరవందరైనట్టి; కుసుమిత కాశ వనంబును(న్)= పూచిన రెల్ల వనాన్ని; పోలు= అనుకరించునట్టి; చక్కట్లును= ప్రదేశాలున్నూ; బహు= అనేకాలైన; రత్నమయ= మణులు తాపిన; మకుట+ఆది= కిరీటాలు మొదలగు; భూషణ= నగలయొక్క; వ్రజంబు(న్)= సమూహము; వివిధ= పలురకాలైన; వర్ణ= రంగులుగల; చామర= చామరాల యొక్క; జాతంబును= సముదాయమున్నూ; నటికి= ఖండించి; పడవైచినన్= పడవేయగా; ప్రబల= అధికంగా; ఉద్ధత= గర్వించిన; లులాయ= దున్నచేత; లులితంబు= కలత నొందింపబడ్డదై; కమల= పద్మాలు; కైరవ= కుముదాలు; ఉత్పల= కువలయాలు - వీనిచే; ఆకీర్ణంబు+అగు= ఒకదానితో నొకటి కలిసిపోయినదగు; కొలని(న్)= సరస్సును; అనుకరించు= పోలునట్టి; ప్రదేశంబులును(న్)+ఐ= చోట్లును అయి; పాండవ సైన్యంబులు= పాండవుల సేనలు; దైన్యంబున్= నిస్సహాయస్థితిని; పొందియు(న్)= పొందియు; కలగుండు+కొనియున్= కలతచెందియు; బెండు+పడియున్=

తేలికదనం చెందియు; కలంకన్+పాటియు(న్)= కలత చెందియు; తొలంగన్= చలనమునకు; తెరలియున్= తొలగియు; కోలాహల బహుళంబులు= కలకల శబ్దాలచే నిండినట్టివి; అగుటన్= కాగా; గోవిందుండు= కృష్ణుడు; కనుంగొని.

తాత్పర్యం: పాండవ సేనకు పట్టిన దుస్థితిని చూచి, ఎదిరించే మగధీరులు లేకపోగా, భీష్ముడు మహాబలపరాక్రమాలతో కూడుకొన్నవాడై గర్వంతో ఉప్పొంగి, పాండవులు మరీ భయపడేటట్లుగా మరల మరల సమర సన్నాహంతో, అడ్డగింపరాని అమోఘములైన ఆయుధాలతో ఆ యుద్ధభూమిని పూర్తిగా నిండింపచేశాడు. ఏ ప్రక్క చూచినా తానే అగపడుతూ, చకచకా తిరుగుతూ యుద్ధం చేశాడు భీష్ముడు. రథికులను, హస్తికులను, ఆశ్వికులను తునుకలు చేయగా, అట్టిచోట్లు మదపుటేనుగు విహారంచేత మొక్కపోయిన ఉద్యానవనంవలె కళాహీనమై పోయాయి. అతడు కాల్బలాన్ని తుంటలుతుంటలు చేయగా, కాలు, చెయ్యి, తల, డొక్క అనే అవయవభేదాలు తెలియకుండా, వంటచేయడానికి తరిగిపెట్టిన కూరగాయల ముక్కలలాగా కొన్ని స్థలాలు కన్పడ్డాయి. రథాలనొగలు, చక్రాలు మొదలైనవాటిని, ఏనుగులు, గుర్రాలు - వీటి ఎముకలను విరగబాదేటప్పుడు విస్తరించిన వివిధ శబ్దాలు, కార్చిచ్చు అలముకోగా, చిటచిటమని, పటపట మని మండి బీడుపడిన వెదురు పొదలుగల అరణ్యం మాదిరి కొన్ని తావులు అగపడ్డాయి. గొడుగులు మాటిమాటికి తారుమారై కొన్ని మరికొన్నిటితో పెనవేసికొని ఉండే ప్రదేశాలు పెనుగాలిచేత చిక్కుపడిన పూచిన రెల్లువనం వలె అనిపించాయి. మణులు తాపిన కిరీటాలు, భుజకీర్తులు, హారాలు, పలురంగుల చామరాలు-వీటన్నిటినీ భీష్ముడు తుత్తునియలు చేసి నేలమీద పడవేయగా, అట్టిచోట్లు బలం, గర్వంగల దున్నపోతుచే చిందరవందరచేయబడ్డ ఎర్ర, తెల్ల తామర పూలు, కలువలుగల కొలనుగా తోచింది. పాండవసేన హీనమైన స్థితిని పొందినది, కలతచెందినది. బలహీనమైపోయినది. దాగి ఉండటానికి తొలగిపోయింది. సేనలో పెద్దగా కోలాహలం ఏర్పడింది. శ్రీకృష్ణుడు దీనిని గమనించి. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: అలంకారం: ఉపమ. యుద్ధాన్ని వర్ణించడంలో సోమయాజి అందెవేసిన చేయి. కనుకనే ఈ వచనంలో, యుద్ధరంగంలోని పలుతావులను వర్ణించడంలో అయిదు ఉపమానాలతో వాటిని అలంకరించాడు.

ఉ. ‘ అర్జున! చూచితే? మనబలావళి నెల్లఁ గలంచుచున్నవాఁ
డూర్జితశౌర్యసంపదయు నుగ్రభుజాబలవైభవంబు వి
స్ఫూర్జితవిక్రమోద్ధతియుఁ జూపె నదీసుతుఁ డిట్టి చోట నీ
దుర్జయదర్పవిభ్రమము దోఁ పఁగఁ జేయకయున్కి యొప్పనే?’ **249**

ప్రతిపదార్థం: అర్జున!= ఓ అర్జునా! నదీసుతుఁడు= భీష్ముడు; మన= మనయొక్క; బల+ఆవళిన్+ఎల్లన్= మన పాండవసేననంతటినీ; కలంచుచున్+ఉన్నవాఁడు= కలతపెట్టుచున్నాడు; చూచితే?= చూచితివా?; ఊర్జిత శౌర్య సంపదయున్= దృఢమైన పరాక్రమముయొక్క సంపత్తియు; ఉగ్ర= భయంకరాలైన; భుజా= చేతులయొక్క; బల= సారముయొక్క; వైభవంబు(న్)= విభవాన్ని; విస్ఫూర్జిత= మిక్కిలి ప్రకాశించిన; విక్రమ= పరాక్రమముయొక్క; ఉద్ధతియున్= గర్వాన్ని; చూపెన్= కనపరుస్తున్నాడు, ఇట్టిచోటన్= ఇట్లాంటి స్థలంలో; విభ్రమమున్= విలాసాన్ని; తోఁపగన్= తెలిపేటట్టుగా; చేయక+ఉన్కి= చేయకుండా ఉండటం; ఒప్పునే?= తగునా?

తాత్పర్యం: ‘ఓ అర్జునా! భీష్ముడు మన సైన్యాన్ని ఎంతగా కలత పెడుతున్నాడో చూచావా? స్థిరమైన తన పరాక్రమం యొక్క సమృద్ధిని, భయంకరమైన తన చేతుల బలవైభవాన్ని, ప్రకాశించే పరాక్రమాటోపాన్ని బాగా ప్రదర్శిస్తున్నాడు. ఇట్టిపట్టులో జయింపరాని నీ శౌర్యాన్ని చూపకుండా ఉండడం తగదు.’

వ. అనిన విప్పచ్చుండు విచారడోలాయత్తం బగుచిత్తంబుతోడ నిరుత్సాహుం డై యున్నం జూచి వెన్నుం డతని కి ట్లనియె. 250

ప్రతిపదార్థం: అనిన(న్)= అని చెప్పగా; విప్పచ్చుండు= అర్జునుడు; విచార= బాధతో; డోలా+ఆయత్తంబు+అగు= ఊగిసలాడుతున్న; చిత్తంబుతోడన్= మనస్సుతో; నిర్+ఉత్సాహుండు+ఐ= ఉత్సాహంలేనివాడై; ఉన్నన్= ఉండగా; వెన్నుండు= కృష్ణుడు; చూచి; అతనికిన్= ఆ అర్జునుడికి; ఇట్లు+అనియె(న్).

తాత్పర్యం: కృష్ణుడు పై విధంగా అనగా, అర్జునుడు బాధతో ఊగిసలాడే మనస్సుతో ఉత్సాహం లేనివాడై ఉండగా చూచి కృష్ణుడు, అర్జునుడితో ఇట్లా అన్నాడు:

క. ' మును మత్స్యనాథునగరం । బున సంజయుతోడ నీవు పొంగుచు బె ట్టా
డినమాట లెల్ల మఱచిన । నిను నగరే రథికవరు లనింద్యచరిత్రా! 251

ప్రతిపదార్థం: అనింద్యచరిత్రా!= నిందింపరాని చరితగల ఓ అర్జునా!; మును= మునుపు; నీవు; మత్స్యరాజు నగరంబునన్= విరాటరాజు యొక్క పట్టణంలో; సంజయుతోడ(న్); బెట్టు= అధికంగా(గొప్పగా); పొంగుచున్= ఉబ్బిపోతూ; ఆడినమాటలు= పలికిన పలుకులు; ఎల్ల(న్)= అన్నిటిని; మఱచిన(న్)= మరిచిపోతే; రథికవరులు= మహారథులు; నిను(న్)= నిన్నుచూచి; నగరే?= నవ్వరా?

తాత్పర్యం: 'మంచి స్వభావంగల ఓ అర్జునా! నీవు మునుపు మత్స్యరాజు నగరంలో విజృంభించి, భీష్ముడిని గెలుస్తానని సంజయుడితో అన్నావు కదా! ఆ మాట ఇప్పుడు నీవు మరచిపోతే, వీరులందరు నిన్ను చూచి నవ్వుతారు కదా! (కనుక అప్పుడన్న మాట లిప్పుడు గుర్తుకు తెచ్చికొని, బాగా యుద్ధం చేయుము.)

వ. అనుటయు నర్జునుండు. 252

ప్రతిపదార్థం: అనుటయున్= అని చెప్పగా; అర్జునుండు.

తాత్పర్యం: కృష్ణుడు పైవిధంగా చెప్పగా అర్జునుడు. (తరువాతి పద్యంతో అన్వయం.)

ఆ. ' సకల బంధుజనులఁ జంపి కౌరవ హీన । మైన రాజ్యమహిమ యేను బడసి
యనఘ! యేమిసుకృత మాచరించినవాఁడ । నగుదు? మనసు గొలుపదయ్యె ననికి. 253

ప్రతిపదార్థం: అనఘ!= పాపంలేనట్టి కృష్ణా! ఏను= నేను(అర్జునుడు); సకల బంధు జనులన్= బంధుజాలాన్ని అంతా; చంపి; కౌరవహీనము+ఐన= కురు వంశంవారు లేనట్టి; రాజ్యమహిమన్= రాజ్యము యొక్క మహిమను; పడసి= పొంది; ఏమి సుకృతము= ఏమి పుణ్యాన్ని; ఆచరించినవాఁడన్= చేసినవాడనుగా; అగుదున్?= కాగలను?; అనికి(న్)= యుద్ధానికి; మనసు+కొలుపదు+అయ్యెన్= మనసు ఒప్పదాయెను.

తాత్పర్యం: 'ఓ కృష్ణా! చుట్టాల నందర్నీ మట్టుపెట్టి, కురు వంశం వాడే లేనట్టి ఈ రాజ్యాన్ని నేను సంపాదించికొని, ఎట్టి పుణ్యం చేసిన వాడనౌతాను? పాపమే కదా నాకు మిగిలేది? కాబట్టి యుద్ధం చేయడానికి మనసు పుట్టడంలేదు.

వ. అయిన నీతో నప్పటప్పటి కేటి మాటలు గలవు మిన్నేటి కొడుకుం బడవైచెదం దేరు నడపు' మనుటయు నారాయణుండు నదీనందనుస్యందనంబునకు సమ్ముఖంబుగా రథ్యమ్ములం ద్వరితగతి నడపినం దెరలిన సైన్యంబులు గూడికొని గాంగేయుపయిం గవియ నతండు సెలంగి మహాస్త్రనికరంబులు నిగిడించి యబ్బలంబు నిలువరించి సింహనాదంబు సేసి. 254

ప్రతిపదార్థం: అయినన్; నీతో; అప్పటికిన్+అప్పటికిన్= మాటిమాటికి; ఏటిమాటలు; కలవు= ఉన్నవి?; మిన్ను+ఏటికొడుకు(న్)= ఆకాశగంగా పుత్రుడైన భీష్ముని; పడవైచెదన్= పడగొట్టుతాను; తేరు నడపుము= రథాన్ని పోనిమ్ము; అనుటయు(న్)= అని చెప్పగా; నారాయణుండు= కృష్ణుడు; నదీనందను స్యందనంబునకు(న్)= భీష్ముడి రథానికి; సమ్ముఖంబు+కాన్= ఎదురుగా; రథ్యంబులన్= తేరి గుర్రాలను; త్వరితగతిన్= వేగంతో కూడిన పోకతో; నడపింపన్= పోనీయగా; తెరలిన సైన్యంబులు= తొలగిపోయిన సేనలు; కూడికొని= కలిసికొని; గాంగేయుపయిన్= భీష్ముడిమీద; కవియన్; అతండు(న్)= ఆ భీష్ముడు; చెలంగి= అతిశయించి; మహా+అస్త్రనికరంబులు(న్)= గొప్ప అస్త్రాల సమూహాలను; నిగిడించి= వ్యాపింపజేసి; ఆ+బలంబు(న్)= ఆ సేనను; నిలువరించి= ఆపి; సింహనాదంబు+చేసి.

తాత్పర్యం: అయినా నీతో మాట్లాడటానికి మాటిమాటికి ఏమిమాటలున్నాయి. భీష్ముడిని పడగూలుస్తాను. రథాన్ని పోనిమ్ము అనగా నారాయణుడు భీష్ముడి రథానికి ఎదురుగా గుర్రాలను వేగంగా తోలాడు. అంతట చెదరిపోయిన తనసేనలను కూడుకొని అర్జునుడు భీష్ముని మీదికి విజృంభించాడు. అపుడు గంగా పుత్రుడు చెలరేగి మహాస్త్రముల గుంపులు గుప్పించి ఆ సైన్యాన్ని ఆపి సింహనాదం చేసి (తరువాతి పద్యంతో అన్వయం)

మ. ఖరనారాచపరంపరోగ్రనిహతిన్ గాండీవియంగంబు లా
తురతం బొందఁగ నేసి బాణమయగాత్రుం జేసి గోవిందు ని
ష్ఠురలీలం దురగంబులం బటుశరస్యూతాస్యముల్ గాఁగ స
త్వరుఁడై యేసి, రథంబు గూడఁ బొదివెన్ వాలంప మొత్తంబులన్. 255

ప్రతిపదార్థం: ఖర= పదునైన; నారాచ= బాణాలయొక్క; పరంపరా= వరుసలచేత; ఉగ్ర= భయంకరంగా; నిహతిన్= కొట్టటంచేత; గాండీవి= అర్జునుడియొక్క; అంగంబులు= అవయవాలు; ఆతురతన్= బాధను; పొందఁగన్= పొందేట్టుగా; ఏసి= కొట్టి; గోవిందున్= కృష్ణుని; బాణమయగాత్రున్= బాణాలతో నిండిన శరీరంగలవానిగా; చేసి; సత్వరుఁడై= వేగంతో కూడిన వాడై; నిష్ఠుర లీలన్= క్రూరమైనవిధంగా; తురగంబులన్= గుర్రాలను; పటు= సమర్థములైన; శర= బాణాలచేత; స్యూత= గుచ్చబడిన; ఆస్యములన్+కాఁగన్= ముఖాలు కలుగునట్లుగా; ఏసి= బాణాలు ప్రయోగించి; రథంబు+కూడన్= తేరును కూడా; వాలు+అంప+మొత్తంబులన్= పదునైన బాణాల సమూహాలతో; పొదివెన్= కప్పివేశాడు.

తాత్పర్యం: భీష్ముడు పదునైన బాణాల వరుసలతో భయంకరంగా కొట్టటంవలన, అర్జునుడి అవయవాలు గాయపడ్డాయి. కృష్ణుడి శరీరమంతా బాణమయమైనది. వేగంగా, క్రూరములైన గట్టి బాణాలు ప్రయోగించి గుర్రాల ముఖాలను గ్రుచ్చివేశాడు. పదునైన బాణాల సమూహాలతో అర్జునుడి రథాన్ని కప్పివేశాడు.

వ. అప్పుడు. 256

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో.

తాత్పర్యం: భీష్ముడు పై విధంగా చేసినప్పుడు (తరువాతి పద్యంతో అన్వయం.)

తే. బీఱువోయి రథ్యంబులు మాఱు మొగము । వడినఁ దా నొచ్చి యుండియుఁ దడవి శౌరి
నూలుకొనఁ జేసి తఱిమిన వ్రాలి తీవ్ర । భల్లమునఁ గ్రీడి భీష్మునివిల్లు దునిమె. 257

ప్రతిపదార్థం: రథ్యంబులు= గుర్రాలు; బీఱువోయి= ఉపయోగం లేనివై; మాఱుమొగము పడినన్= పెడమొగంపెట్టినవి కాగా; శౌరి= కృష్ణుడు; తాన్= తాను; నొచ్చియుండియున్= బాధచెందికూడా; తడవి= చేతులతో అటూ ఇటూ తాకి; నూలుకొనన్+చేసి=

కుదుటపడజేసి; తటిమిన(న్)= తోలగా; క్రీడి= అర్జునుడు; వ్రాలి= మీరి(అతిశయించి); తీవ్ర భల్లమునన్= తీవ్రమైన బల్లెముతో; భీష్మునివిల్లున్; తునిమెన్= త్రుంచివేశాడు.

తాత్పర్యం: అర్జునుడి రథానికి కట్టిన గుర్రాలు చచ్చుపడి, పెడమొగం పెట్టాయి. కృష్ణుడు తాను బాణాల దెబ్బలతో బాధపడుతూ ఉండి కూడా, తన చేతులతో వాటిని ఇటూ అటూ నిమిరి, తోలగా, ఒక కరుకైన బల్లెంతో అర్జునుడు భీష్ముడి విల్లు తుంటలు అయ్యేటట్లుగా చేశాడు.

క. అతఁ డొండొక విల్లెత్తిన । నతిరయమున నదియుఁ దునుమ నాతం డొరా
శతమఖనందన! యనుచును' ధృతి వేఱొకవింట శరతతిం బరగించెన్. 258

ప్రతిపదార్థం: అతఁడు= ఆ భీష్ముడు; ఒండు+ఒక= మరొక; విల్లు= ధనుస్సును; ఎత్తినన్; అతిరయమునన్= మిక్కిలివేగంతో; అదియున్= ఆ వింటినికూడా; తునుమన్= ముక్కలు చేయగా; ఆతండు= ఆ భీష్ముడు; శతమఖనందన!= అర్జునా!; ఔరా! అనుచున్= ఆశ్చర్యాన్ని వెలిపుచ్చుతూ; ధృతిన్= ధైర్యంతో; వేఱు+ఒక వింటన్= వేరొక విల్లునుండి; శరతతిన్= బాణ సమూహాన్ని; పరఁగించెన్= ప్రయోగించాడు.

తాత్పర్యం: భీష్ముడు మరో విల్లు ఎత్తుకోగా, దాన్ని కూడా అర్జునుడు వేగంగా తుంటలు చేశాడు. భీష్ముడు, 'ఔరా! అర్జునా!' అని మెచ్చుకొంటూ ధైర్యంతో ఇంకొక విల్లెత్తుకొని పెల్లుగా బాణాలు వెల్లువై వెల్లివిరిసేటట్లు ప్రయోగించాడు.

క. ఆ బెట్టిదంపు టంపఱి । చే బీభత్సుండు నొచ్చి చేడ్పడి మఱియుం
దా బంటుతనమ పటుబా । హాబలముగఁ బోరుచుండె నంగము దూలన్. 259

ప్రతిపదార్థం: బీభత్సుండు= అర్జునుడు; ఆ బెట్టిదము+అంపఱిచేన్= క్రూరములైన ఆ బాణాల సమూహంచేత; నొచ్చి= నొప్పిచెంది; చేడ్పడి= చలించి; మఱియున్= మరల; తాన్= తాను(అర్జునుడు); బంటుతనము+అ= శూరత్వమే; పటుబాహాబలముగన్= పటువైన భుజబలంగా; అంగము= శరీరము; తూలన్= వాలిపోతుండగా; పోరుచున్+ఉండెన్= యుద్ధంచేస్తుండినాడు.

తాత్పర్యం: భీష్ముడు వేసిన కఠోరబాణాల చేత అర్జునుడు చాలా బాధ అనుభవించాడు. వణకిపోయాడు. అయినా కూడా తన శౌర్యమే బాహుబలంగా కలిగి, శరీరం వాలిపోతూంటే కూడా, యుద్ధం చేస్తూనే ఉన్నాడు.

క. విప్పచ్చునొప్పు నెంతయుఁ । గ్రొప్పున భీష్ముండు గడఁగుకోల్తలయుం ద
క్కెవ్వరు నాతనిఁ జేరక । దవ్వుల నిల్చుటయుఁ జూచి తన చిత్తమునన్. 260

ప్రతిపదార్థం: ఎంతయున్= అధికమైన; విప్పచ్చునొప్పున్= అర్జునుడి వేదనను; భీష్ముండు= భీష్ముడు; క్రొప్పునన్= మదంతో; కడఁగు= ప్రయత్నపడు; కోల్తలయున్= ఎదుట నిలచియుద్ధం చేయటాన్ని; తక్కు+ఎవ్వరున్= మిగిలినవారు ఎవరుగాని; ఆతనిన్= ఆ భీష్ముడిని; చేరక= దగ్గరకురాక; దవ్వులన్= దూరంగా; నిల్చుటయున్= నిలబడి ఉండటాన్ని; చూచి; తన చిత్తమునన్= (కృష్ణుడు) తన మనస్సులో.

తాత్పర్యం: శ్రీ కృష్ణుడు అర్జునుడు చాలా బాధపడుతూండటాన్ని చూచాడు. భీష్ముడు మదంతో ప్రయత్నంతో అర్జునుడికి ముఖాముఖిగా నిలబడి యుద్ధం చేస్తూండడం గమనించాడు. వేరే ఎవరూకూడా భీష్ముడి అండచేరకుండా దూరంగా ఉండటాన్ని కూడా తిలకించి, తన మనస్సులో. (తరువాతి పద్యంతో అన్వయం).

క. దారుణరోషం బడరఁగ । నారాయణుఁ డపుడు సైరణం దొఱఁగి వెసం
దేరి నొగలఁ బగ్గము లిడి । క్రూరత మునికోల యెత్తికొని యిల కుఱికెన్. 261

ప్రతిపదార్థం: అపుడు; నారాయణుఁడు= శ్రీకృష్ణుడు; దారుణరోషంబు= భయంకరమైన కోపం; అడరఁగన్= అధికం కాగా; సైరణన్= ఓర్పును; తొఱఁగి= విడిచిపెట్టి; వెసన్= వేగంతో; పగ్గములు; తేరినొగలన్= రథం నొగలమీద; ఇడి= పెట్టి; మునికోల= జాటీని; ఎత్తికొని= తీసికొని; క్రూరతన్= భయంకరంగా; ఇలకున్= నేలమీదికి; ఉఱికెన్= దూకాడు.

తాత్పర్యం: ఆ దృశ్యాన్ని చూచిన కృష్ణుడికి భయంకరమైన కోపం వచ్చింది. ఓర్పు కోల్పోయాడు. గుర్రాల కళ్యాలకు కట్టి ఈడ్చి పట్టే పగ్గాలను రథం నొగలమీద పడవేశాడు. జాటీ పట్టుకొన్నాడు. భయం కలిగిస్తూ నేలకు దూకాడు.

శ్రీకృష్ణుఁడు రథంబు డిగి భీష్మునిపైకిఁ బోవుట (సం. 6-102-52)

వ. ఇట్లు లంఘించి. **262**

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; లంఘించి= దూకి

తాత్పర్యం: ఈ మాదిరి కృష్ణుడు నేలపైకి దూకి. (తరువాతి పద్యంతో అన్వయం.)

మ. ధరణీచక్రము గ్రక్కునం గదల దిగ్దంతావళశ్రేణి కం
ధరముల్ మ్రొగ్గఁబడన్ దిశావలయ ముత్కంపంబుగా నీబలం
బురులం బాఱఁగ భీష్ముపైఁ గవిసె రౌద్రోద్రేకముం జూచి ఖే
చరలోకంబును సంచలింప హరి చంచద్బాహుఘోరాకృతిన్. **263**

ప్రతిపదార్థం: ధరణీచక్రము= చక్రం మాదిరి గుండ్రంగా వుండే భూమి; గ్రక్కునన్= వెంటనే; కదల(న్)= చలించగా; దిక్= దిక్కులందుండే; దంతావళ= ఏనుగుల యొక్క; శ్రేణి= వరుసయొక్క; కంధరముల్= మెడలు; మ్రొగ్గన్+పడన్= వంగిపోగా; దిశావలయము= దిక్‌చక్రము; ఉత్+కంపంబు+కాన్= మిక్కుటంగా వణికేది కాగా; నీ బలంబు= (ధృతరాష్ట్రుడవైన) నీ యొక్క సైన్యము; ఉరులన్+పాఱఁగన్= చలించిపోగా; రౌద్ర+ఉద్రేకమున్= రౌద్ర రసాధిక్యాన్ని; చూచి= తిలకించి; ఖేచరలోకంబును= దేవలోకం కూడా; సంచలింపన్= వణకగా; హరి= శ్రీకృష్ణుడు; చంచత్= అదురుచున్న; బాహు= భుజాలచేత; ఘోర= భయంకరమైన; ఆకృతిన్= ఆకారంతో; భీష్మునైన్= భీష్ముడిమీదికి; కవిసెన్= దుమికాడు.

తాత్పర్యం: భూమండలం కదలుతూ ఉండగా, దిక్కులందుండే ఏన్గుల మెడలు వంగిపోగా, దిక్కులు వణకిపోగా, నీసైన్యం బెదురుతూ చెదిరిపోతూండగా, తన రౌద్రావేశాన్ని చూచి దేవతలు కూడా గడగడలాడగా కృష్ణుడు, అదురుతూ ఉన్న బాహువులతో, భయంకరమైన ఆకారంతో భీష్ముడిపైకి లంఘించాడు.

తే. లలితపీతాంబరంబు విలాస మొప్పసింహనాదోద్భటం బగు చెలువుతోడ
మెఱుఁగు వెలుఁగును గర్జయు మెఱయ వచ్చు కారుమొగిలనఁ గృష్ణనాకార మొప్పె. **264**

ప్రతిపదార్థం: లలితపీత+అంబరంబు= సుందరమైన పసుపు వస్త్రం యొక్క; విలాసము= హొయలు; ఒప్పన్= తగియుండగా; సింహనాద+ఉద్భటంబు+అగు= సింహనాదం చేత మిక్కుటమైన; చెలువుతోడన్= అందంతో; మెఱుఁగు వెలుఁగును= మెరుపువంటి కాంతియు; గర్జయున్= ఉరుమున్నూ; మెఱయన్= ప్రకాశింపగా; వచ్చు= వచ్చునట్టి; కారుమొగిలు+అనన్= వర్షాకాలంలోని మేఘంవలె; కృష్ణ+ఆకారము= కృష్ణుడి ఆకారం; ఒప్పెన్= తగి ఉండింది.

తాత్పర్యం: ధరించిన పచ్చటి పచ్చడం అందాలు చిలుకుతూంటే, సింహనాదంతో చెలరేగిన సౌందర్యంతో భీష్ముడి మీదికి వస్తూఉన్న కృష్ణుడి ఆకారం వర్షాకాలంలో మెరుపులతో, ఉరుములతో దిగివచ్చే మేఘాన్ని పోలి ఉన్నది.

విశేషం : పసుపురంగు వస్త్రాన్ని ధరించి సింహనాదం చేస్తూ నల్లని శరీరచ్ఛాయ కలిగిన కృష్ణుడు మెరుపులతో, ఉరుములతో కన్పించే కారు మేఘం లాగా ఉన్నాడనటంలో ఉపమాలంకారం.

వ. అట్టియెడ. **265**

తాత్పర్యం: ఆ సమయంలో.

క. బలు జీవము వోయిన వెల వెలఁ బాఱుచు నీదుయోధవీరులు పాలిసెం
బొలిసె నదె భీష్ముఁ డనుచును గలఁగంబడి యఱ్ఱు లెత్తి కనుఁగొనుచుండన్. **266**

ప్రతిపదార్థం: నీదు యోధవీరులు= నీ (ధృతరాష్ట్రుని) యొక్క భటులు శూరులున్నూ; బలుజీవము= అధికమగు జీవశక్తి; పోయినన్= చెడిపోగా; వెలవెల+ పాఱుచున్= తెల్లపోయి (వివర్ణత చెంది); అదె= అల్లదిగో; భీష్ముఁడు= భీష్ముడు; పాలిసెన్ పాలిసెన్= చచ్చాడు, చచ్చాడు; అనుచునున్= అంటూ; కలఁగన్+పడి= కలతచెంది; అఱ్ఱులు+ఎత్తి= మెడలు పైకెత్తి; కనుఁగొనుచున్+ఉండన్= చూచుచుండగా.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! కృష్ణుడు భీముడిపైకి దూకినప్పుడు నీ భటులు, శూరులు అందరూ బలాన్నీ, ధైర్యాన్నీ కోల్పోయి, ముఖాల నెత్తురు లేనివారై, కలతచెంది, అదిగో భీష్ముడు చచ్చాడు చచ్చాడు అని మెడలు పైకి చాచి చూడసాగారు.

చ. కనుఁగొని భీష్ముఁ డుల్లము వికాసము నొందఁగ నల్ల నవ్వి యి
ట్లనుఁ 'జనుదెమ్ము వేగమ మహాత్మ! వికస్వరపుండరీకలో
చన! యిది లెస్స నా కిచట శాశ్వత మైనయశంబు నచ్చట
న్వినుతికి నెక్కు సద్గతియు నీ దయఁ జేకుఱఁజేయు మిష్టమున్.' **267**

ప్రతిపదార్థం: భీష్ముఁడు= భీష్ముడు; కనుఁగొని= చూచి; ఉల్లము= మనస్సు; వికాసమున్= ప్రసన్నతను; ఒందఁగన్= పొందగా; అల్లనవ్వి; ఇట్లు+అనున్= ఈ విధంగా అన్నాడు; మహాత్మ!= మాహాత్మ్యం కలవాడా!; వికస్వర పుండరీక లోచన!= పూచిన తెల్లతామరలవంటి కన్నులుగల కృష్ణా! వేగము+అఁ= త్వరితంగా; చనుదెమ్ము= రమ్ము; ఇది= ఈపని; లెస్స= మంచిది; నాకున్; ఇచటన్= ఈ లోకంలో; శాశ్వతము+ఐన= స్థిరమైన; యశంబున్= కీర్తియు; అచ్చటన్= పై లోకంలో; వినుతికిన్+ఎక్కు= పొగడ్తకెక్కునట్టి; సత్+గతియున్= ఉత్తమగతీ; ఇష్టమున్= నాకిష్టమగు ఈ రెంటిని; నీదయన్= నీ దయచేత; చేకురన్= కలిగేటట్టుగా; చేయుము.

తాత్పర్యం: కృష్ణుడు తన పైకి దూకటాన్ని భీష్ముడు చూచాడు. మనస్సులో ఉల్లాసం కలిగింది. ఒక్క నవ్వు నవ్వి ఇట్లా అన్నాడు. 'మహాత్మా! పూచిన తెల్ల తామరలను పోలిన కన్నులుగల ఓ కృష్ణా! వేగంగా రమ్ము. నన్ను కడతేర్చుము. ఇది నాకు ఇష్టమైనది. ఈ లోకంలో నాకు స్థిరమైన కీర్తీ, పరలోకంలో పొగడిక కెక్కే ఉత్తమ గతీ, పునరావృత్తిరహితమైన మోక్షం, కూడా నీ దయావిశేషంచేత నాకు అబ్బేటట్లు చేయుము.'

వ. అని పలుకు నంత జంభాంతకసూనుండు సరభసంబుగా రథంబు డిగ్గనుఱికి వెన్నుని వెనుక నెయిది కరంబులఁ గ్రుచ్చి పట్టిన నతండును దిగిచికొని వెండియుం బోవం బోవఁ బదియడుగులకొలంది నా కౌంతేయుండు పదస్థైర్యంబును, బాహు వీర్యంబును మెఱయ మహీతలం బూని మెట్టి నిలువం బట్టి నిట్టూర్పు నిగిడించుచు నద్దనుజమర్దనుతో ని ట్లనియె. **268**

ప్రతిపదార్థం: అని పలుకు+అంతన్= అని చెప్పేలోపల; జంభ+అంతక సూనుండు= జంభుడనే రాక్షసుడిని చంపిన యింద్రుడి కుమారుడు - అర్జునుడు; సరభసంబు+కాన్= తొందరగా; రథంబున్= రథాన్నుండి; డిగ్గన్= దిగటానికి; ఉటికి= గంతువేసి; వెన్నుని వెనుకన్= కృష్ణుడి వెనుక ప్రక్క; ఎయిది= వెంబడించి; కరంబులన్= చేతులను; గ్రుచ్చి= దూర్చి; పట్టినన్= పట్టుకోగా; అతండునున్= ఆ కృష్ణుడుకూడా; తిగిచికొని= లాగికొని; వెండియున్= మరియు; పదియడుగుల కొలంది= పదడుగుల దూరం; పోవన్+పోవన్= పోతూ పోతూ ఉండగా; ఆ కొంతేయుండు= ఆ అర్జునుడు; పదస్థైర్యంబును= అడుగుల గట్టిదనం; మెఱయన్= ప్రకాశింపగా; మహీతలంబు= భూమిని; ఊని= ఆనించి; మెట్టి= తొక్కిపట్టి; బాహువీర్యంబును= భుజబలం; మెఱయన్= ప్రకాశింపగా; నిలువన్+పట్టి= (కృష్ణుని) ఆగేటట్లుగా చేసి; నిడుద+ఊర్పున్= దీర్ఘ నిశ్శ్వాసాన్ని; నిగిడించుచున్= వ్యాపింపజేస్తూ; ఆ+దనుజమర్దనుతోన్= ఆ కృష్ణునితో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: భీష్ముడు పై విధంగా అంటూండగా, అర్జునుడు తొందర తొందరగా రథంనుండి క్రిందికి దూకి, కృష్ణుడిని వెంబడించి, చేతులతో గ్రుచ్చి పట్టుకొన్నాడు. అయినప్పటికీ కృష్ణుడు అతడి చేతులు లాగికొని ఇంకా పదడుగుల దూరం పోతూ ఉండగా, తనపాదాల బలంతో నేలను గట్టిగా తొక్కిపట్టి, భుజబలంతో కదలకుండా నిలబెట్టి, పెద్దగా నిట్టూర్చుతూ కృష్ణుడితో అన్నాడు.

ఉ. కయ్యము సేయ నే నని యకల్మషబుద్ధిఁ బ్రతిజ్ఞ సేసి నీ
వియ్యెడఁ దప్పితేని జగ మేమను? నించుకసేపు పోరులన్
డయ్యుట దప్పె? నాపయిఁ గడంగిన భీష్మునిపాటు సూతు రా
వయ్య, రథంబుమీఁది కిటు లాశ్రితమానము వీటిఁబుత్తురే?' 269

ప్రతిపదార్థం: ఏను= నేను; కయ్యము= యుద్ధమును; చేయన్+అని= చేయనంటూ; అకల్మషబుద్ధిన్= పాపంలేని బుద్ధితో; ప్రతిజ్ఞన్+చేసి= ప్రతినబూని; నీవు; ఈ+ఎడన్= ఈ చోటున, తప్పితి(వి)+ఏనిన్= ప్రతిజ్ఞ తప్పితే; జగము= లోకము; ఏమి+అనున్?= ఏమంటుంది?; పోరులన్= యుద్ధాలలో; ఇంచుకసేపు= కొంచెంసేపు; డయ్యుట+తప్పు+ఎ?= శ్రమచెందడం కూడా తప్పేనా?; నాపయిన్= నాపైకి; కడంగిన= ఉద్యమించిన; భీష్మునిపాటు= భీష్ముడి ఆపదను; చూతు(వు)= చూస్తావు; రథంబు మీఁదికిన్= తేరుపైకి; రావయ్య= రమ్ము; ఇటులు= ఈ మాదిరి; ఆశ్రిత మానమున్= ఆశ్రయించినవారి అభిమానాన్ని; వీటిన్+పుత్తురు+ఏ?= (ఎవరైనా) పోగొట్టుతారా?

తాత్పర్యం: 'ఓ కృష్ణా! నేను యుద్ధంచేయను-అని నీవు శుద్ధమైన బుద్ధితో, ప్రతిజ్ఞ చేశావుగదా! నీవు ఇప్పుడా ప్రతిజ్ఞను పాటించకపోతే (లోకం) జనం నిన్నేమంటుంది? దూషించదా? కొంచెం సేపు యుద్ధాలలో బడలిక చెందడం తప్పవుతుందా? కాదుకదా! నా మీదికి కవిసిన ఆ భీష్ముడికి ఇప్పు డే గతిపట్టిస్తానో చూతువుగాని, రమ్ము, రథంమీదికి వచ్చి కూర్చొనుము. నీవంటి మహాత్ములు ఆశ్రయించి ఉండేవారి యొక్క ఆత్మాభిమానానికి నష్టం, కష్టం కలిగిస్తారా?'

వ. అని ప్రార్థించినం బార్థుపలుకులకుం బ్రియం బంది ముకుందుం డూరక మరలె నయ్యురువురు నెక్కిన యరదంబు శిఖిరద్వయసుందరం బైన శైలంబునుంబోలెఁ బొలిచి నిలిచినం బ్రళయకాలభైరవరవం బగు వారిదంబు కరణిగర్జిల్లుచుఁ బటునారాచపటలాసారంబు నిగిడించి వారల వెగడు వఱిచి యచ్చట నొండొరుల మెచ్చక యఱిమి తఱిమిన వైరుల రూపు మాపి భీష్ముండు భీషణాకారుండై పరిశ్రాంతులయిన కృష్ణార్జునులును, భీతు లగు భీమసేన ప్రముఖులును, జేయునది లేక చూచుచుండం బాంచాలబలంబుల బారిసమరునప్పుడు బలుమానిసి చలిచీమలం గాలం జమురు చందంబు దోఁచె నయ్యవసరంబున. 270

ప్రతిపదార్థం: అని= పై విధంగా; ప్రార్థించినన్= వేడుకోగా; పార్థపలుకులకున్= అర్జునుడి మాటలకు; ప్రియంబు+అంది= ఇష్టపడి; ముకుందుండు= కృష్ణుడు; ఊఱక= బదులు చెప్పకుండా; మరలెన్= వెనక్కి తిరిగాడు; ఆ+ఇరువురున్= ఆ కృష్ణార్జునులిద్దరు; ఎక్కిన= ఎక్కినట్టి; అరదంబు= రథము; శిఖరద్వయ సుందరంబు+ఐన= శిఖరాల రెంటిచే అందమైన; శైలంబునున్+పోలెన్= పర్వతం మాదిరి; పొలిచి= ఒప్పి; నిలిచినన్= ఉండగా; భీష్ముండు; భీషణ+ఆకారుండు+ఐ= భయం కలిగించే ఆకారం కలవాడై; ప్రళయకాలభైరవరవంబు+అగు= యుగంయొక్క అంతంలోని భయంకరమైన గర్జనగల; వారిదంబు కరణిన్= మేఘంవలె; గర్జిల్లుచున్= గర్జన చేస్తూ; పటు= సమర్థమైన; నారాచ= బాణాలయొక్క; పటల= సమూహమనే; ఆసారంబున్= జడివానను; నిగిడించి= క్రమ్ముకొనచేసి; వారలన్= ఆ కృష్ణార్జునులను; వెగడు పఱిచి= తల్లడపడచేసి; అచ్చటన్= ఆచోట; ఒండు+ఒరులన్= ఒకరినొకరిని; మెచ్చక= లెక్కచేయక(లక్ష్యపెట్టక); అఱిమి= ఆక్రమించి; తఱిమిన= వెంబడిపడి పరుగుదీయించిన; వైరులన్= శత్రువులగు యోధులను; రూపుమాపి= నశింపజేసి; పరిశ్రాంతులు+ఐన= మిక్కిలి బడలిక చెందినవారైన; కృష్ణ+అర్జునులునున్= కృష్ణుడు, అర్జునుడును; భీతులు+అగు= భయపడ్డవారైన; భీమసేన ప్రముఖులును= భీముడు ప్రధానుడుగా గలవారును; చేయునది లేక= ఏమీ చేయడానికి చేతగాక; చూచుచున్+ఉండన్= చూస్తూ ఉండగా; పాంచాల బలంబులన్= పాంచాల రాజు సేనలను; బారి+చమరు+అప్పుడు= హింసించే సమయంలో; బలుమానిసి= బలంగల మనుష్యుడు; చలిచీమలన్= చలిచీమలను; కాలన్= అరికాలితో; చమురు చందంబున్= రాచే విధంగా; తోఁచెన్= అనిపించింది; ఆ+అవసరంబునన్= అట్టి సమయంలో.

తాత్పర్యం: అర్జునుడు పై విధంగా ప్రార్థించగా, కృష్ణుడు ప్రియపడి, ఏమీ మాట్లాడకుండా వెనుకకు తిరిగి వచ్చాడు. ఆ కృష్ణార్జునులు ఇద్దరూ ఎక్కిన తేరు రెండు శిఖరాలు కల పర్వతంలా అండగా నిలిచి ఉన్నది. భీష్ముడు భయంకరమైన ఆకారంతో ప్రళయకాలంలో భయంకరంగా గర్జించే మేఘం మాదిరి బొబ్బలు పెట్టుతూ, బాణ పరంపర లనే జడివాన కురిపించి ఆ ఇద్దరినీ తల్లడిల్లచేశాడు. అక్కడుండే వారినెవరినీ లెక్కచేయకుండా, మీదపడి పరుగులెత్తించాడు. శత్రువుల భటులను నశింపజేశాడు. బాగా బడలికచెందిన కృష్ణార్జునులు, భయపడ్డ భీమాదులు ఏమీ చేయలేక ఊరక చూస్తూండగా, పాంచాలరాజు సేనను అప్పుడు భీష్ముడు చంపటాన్ని చూస్తుంటే ఒక బలవంతుడైనవాడు అరికాలితో చీమల్ని రాచివేసే మాదిరి గోచరించింది. ఆ సమయంలో. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: అలం: ఉపమ. 1.కృష్ణార్జునులు ఇద్దరెక్కిన రథం, రెండు శిఖరాలు గల పర్వతం మాదిరి ఉన్నది - అనటంలో, రథం - ఉపమేయం. పర్వతం - ఉపమానం, కృష్ణార్జునులు - ఉపమేయాలు, రెండు శిఖరాలు - ఉపమానం. పోలెన్ - అనేమాట ఉపమావాచకం. ఒప్పియుండుట సాధారణ ధర్మము- ఇది పూర్ణోపమాలంకారము.

2. భీష్ముడు - ఉపమేయం; వారిదము - ఉపమానము; కరణి అనేమాట ఉపమావాచకం. కురియడం సాధారణ ధర్మం. ఉపమాన ఉపమేయ - సాధారణ ధర్మ ఉపమావాచకాలు అప్పటంగా చెప్పటంచేత ఇక్కడకూడా పూర్ణోపమాలంకారమే. మేఘం కొండ శిఖరాలను తాకి వర్షిస్తుంది. భీష్ముడు కృష్ణార్జునులను చేరి బాణ వర్షం కురిపించాడు.

3. భీష్ముడు - ఉపమేయం; బలుమానిసి - ఉపమానం; పాంచాల బలాలు - ఉపమేయం ; చలిచీమలు - ఉపమానం హింసించడం - సాధారణధర్మం. 'చందంబు' అనే మాట ఉపమావాచకం. ఇచ్చట కూడా పై వాటి వలె పూర్ణోపమాలంకారమే.

క. తా నస్తశిఖరి మఱువడఁ, బోనియపుడు పాండురాజపుత్ర విరాజ
త్సేన పాడవడఁగు ననుకృప, నో నలినాప్తుండు గ్రుంకె నుర్వీనాథా! 271

ప్రతిపదార్థం: ఉర్వీనాథా!= భూమికి భర్తవైన ధృతరాష్ట్రమహారాజా!; తాన్= తాను(సూర్యుడు); అస్తశిఖరి= పడమటి కొండలో; మఱు+పడన్= అస్తమించటానికి; పోని+అపుడు= పోకుండా ఉన్నప్పుడు; పాండురాజు= పాండురాజుయొక్క; పుత్ర= కొడుకులైన

ధర్మరాజాదులయొక్క; విరాజత్= ప్రకాశించెడి; సేన= సైన్యము; పొడవు+అడఁగున్= రూపుచెడిపోవును; అనుకృపనో?= అనే దయతోనే ఏమో?; నలిన+ఆప్తుండు= తామరలకు మిత్రుడు అయిన సూర్యుడు; క్రుంకెన్= అస్తమించాడు.

తాత్పర్యం: తాను (సూర్యుడు) అస్తగిరిని చేరి మరుగుపడకపోతే ఈ పాండవ సైన్యమంతా రూపుమాసిపోతుంది. అనే దయతో కాబోలు - సూర్యుడు అస్తమించాడు.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. సూర్యుడు సహజంగా అస్తమించడాన్ని కవి ఈ విధంగా ఉత్ప్రేక్షించాడు. సూర్యాస్తమయానికి, పాండవసేన రూపుమాసిపోవడం కారణం కాకపోయినా, దాన్ని కారణంగా చెప్పాడు.

వ. అట్టియెడ ధర్మతనయుం డతిఘోరం బగు సంధ్యాసమయంబునం బంకనిర్మగ్నయైన గోవునుం బోలె నున్న నిజసేనం జూచి యొక్కింతసేపు చింతా క్రాంతుండై యప్పటికిం దిగుటయ కర్జంబుగాఁ దలంచి తగువారల నెల్లం దివియ నియమించి. 272

ప్రతిపదార్థం: అట్టి+ఎడన్=ఆలాంటి సమయంలో; ధర్మతనయుండ; అతి ఘోరంబు+అగు=మిక్కిలిభయంకరమైనట్టి; సంధ్యాసమయంబునన్=సంధ్యాకాలంలో; పంక నిర్మగ్న+ఐన=బురదలోబాగాదిగబడిన; గోవునున్+పోలెన్=ఆవువలె; ఉన్న=ఉన్నట్టి; నిజసేనన్=తన యొక్కసైన్యాన్ని; చూచి; ఒక్క+ఇంతసేపు= కొంచెంకాలం, చింతా+ఆక్రాంతుండు+ఐ= బాధచేత ఆక్రమింపబడినవాడై; అప్పటికిన్=ఆసమయానికి; తిగుట+అ=వెనక్కు తగ్గటమే; కర్జంబు+కాన్=చేయతగ్గపనిగా; తలంచి; తగువారలన్=తగినవారిని; ఎల్లన్=అందరిని; తివియన్=వెనుదిరుగుటకు; నియమించి=ఆజ్ఞాపించి;

తాత్పర్యం: అప్పుడు మిక్కిలి దారుణమైన సంధ్యాసమయంలో బురదలో బాగా దిగబడ్డ ఆవు మాదిరి తనసైన్యం చాలా సంకటపడుతూండగా ధర్మరాజు చూచి, కొంచెంసేపు, బాధపడి, యుద్ధం నుండి తన బలాన్ని చాలిం(ఉపసంహరిం)ప చేయటమే ఆసమయానికి తగినపని అని అనుకొని, సైన్యాన్ని వెనుదిరగటానికి ఆజ్ఞాపించాడు.

విశేషం: అలం: ఉపమ.

క. గాంగేయుచేత నెంతయు । భంగపడితి మనుచు వగచు పార్థాదులు ద
న్నుం గొలిచి చనఁగ విడిదల । కుం గడువిన్నయిపోయెఁ గురువంశనిధీ! 273

ప్రతిపదార్థం: కురువంశనిధీ= కురుకులానికిగనియైన ధృతరాష్ట్రమహారాజా!; గాంగేయుచేతన్= భీష్ముడిచేత; ఎంతయున్= ఎంతో అధికంగా; భంగము+పడితిమి+అనుచున్= అవమానపడ్డామని అనుకుంటూ; వగచు=దుఃఖపడుతున్న; పార్థ+ఆదులున్= అర్జునుడు మున్నగు పాండవులు; తన్నున్= తన(ధర్మరాజు)ను; కొలిచి= సేవించి(అనుసరించి); చనఁగన్= నడువగా; విడిదలకున్= తమ నివాసస్థానాలకు; కడున్= మిక్కిలి; విన్నన+అయి= వెలవెలబారినవాడై; పోయెన్= (ధర్మరాజు) వెళ్ళాడు.

తాత్పర్యం: అర్జును డాదిగా గల మహామహులందరు భీష్ముడిచేత, చాలా అవమానపడ్డామని దుఃఖపడుతూ, తన్ను (ధర్మరాజును) అనుసరించిరాగా, ముఖం చిన్నబుచ్చుకొని ధర్మరాజు తన నివాసానికి చేరుకొన్నాడు.

వ. ఇట్లు పాండవ వ్యూహంబు లోహటించి పోయినం దారును దమబలంబులఁ దివియ నియమించి.274

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; పాండవవ్యూహంబులు= పాండవుల సేనలు; ఓహటించి= వెనుకకు తిరిగి; పోయినన్= పోగా; తారునున్= తాము(కౌరవులు)న్నూ; తమ బలంబులన్= తమయొక్క సేనలను; తివియన్= యుద్ధం నిలపడానికి; నియమించి= ఆజ్ఞచేసి.

తాత్పర్యం: పై విధంగా పాండవసేనలు వెనుకకు మరలి వెళ్ళాయి. అప్పుడు కౌరవులుకూడా తమ బలాలకు యుద్ధం చాలించండి అని ఉత్తరువు చేసి. (తరువాతి పద్యంతో అన్వయం.)

చ. ఎలమి నమస్కరించుచు నహీనపరాక్రమభంగు లేర్పడం
బలికి యుదాత్తవాక్యములఁ బ్రస్తుతి సేయుచు భీష్ము నందఱున్
బలసి భవత్తనూజులు మనంబులు నిండి ముదంబు మోములన్
వెలి విరియంగ నేఁగిరి నవీనవిభూతి నివాసభూమికిన్. 275

ప్రతిపదార్థం: భవత్+తనూజులు= నీ (ధృతరాష్ట్రుని) యొక్క కుమారులు; అందఱున్= యావన్మంది; భీష్మున్= భీష్ముని; బలసి= చుట్టుకొని; ఎలమిన్= సంతోషంతో; నమస్కరించుచున్= దండాలు పెట్టుతూ; అహీన= తక్కువకాని; పరాక్రమ= భీష్ముని పరాక్రమముయొక్క; భంగులు= విధాలు; ఏర్పడన్= తేటతెల్లంగా; పలికి= చెప్పి; ఉదాత్తవాక్యములన్= గొప్ప గొప్ప మాటలతో; ప్రస్తుతి+చేయుచున్= పొగడుతూ; ముదంబు= సంతోషము; మనంబులు నిండి= మనస్సులందు నిండిపోయి; మోములన్ = ముఖాలయందు; వెలివిరియంగన్= ఉబ్బుచుండగా; నవీన= క్రొత్తదైన; విభూతిన్= ఐశ్వర్యంతో; నివాసభూమికిన్= తాము ఉండేచోటుకు; ఏఁగిరి= వెళ్ళిపోయారు.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! నీ కుమారులందరూ భీష్ముడిని చుట్టి నిలిచి, దండాలు పెడుతూ, ఆయన యొక్క గొప్ప పరాక్రమాల పోకడలను ఎత్తి చెప్పుతూ, అర్థయుక్తమైన పదజాలంతో అతడిని పొగడుతూ, తమ మనస్సులలోని ఆనందం ముఖాలలో తాండవిస్తూ ఉండగా తమ తమ నివాసభవనాలకు వెళ్ళిపోయారు.

వ. ఇట్లు ధర్మతనయుండు దొమ్మిదవ నాఁటి బవరంబున బెండువడి యా నిశాసమయంబునందు రహస్య ప్రకారంబున. 276

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ మాదిరిగా; ధర్మతనయుండు= ధర్మరాజు; తొమ్మిదవనాటి= తొమ్మిదో దినం యొక్క; బవరంబునన్= యుద్ధమందు; బెండు+పడి= బలహీనపడి; ఆ+నిశా సమయంబునందున్= ఆనాటి రాత్రి కాలంలో; రహస్యప్రకారంబునన్= రహస్యమైన రీతిలో.

తాత్పర్యం: తొమ్మిదవనాటి యుద్ధంలో ధర్మరాజు చాలా బలహీనపడ్డాడు. ఆనాటి రాత్రి ఆతడు రహస్యంగా (తరువాతి పద్యంతో అన్వయం.)

క. మనమున విషాద మడరఁగ । ననుజులఁ గూర్చికొని దానవాంతకుసదనం
బునకుం జని యి ట్లను నా । తనితో నాత్మీయకార్యదశ దెలియుటకున్. 277

ప్రతిపదార్థం: మనమునన్= మనస్సులో; విషాదము= దుఃఖము; అడరఁగన్= అధికంకాగా; అనుజులన్= తమ్ముళ్ళను; కూర్చికొని= వెంటబెట్టుకొని; దానవ+అంతకు సదనంబునకున్= రాక్షసులను చంపిన కృష్ణుడి భవనానికి; చని= వెళ్ళి; ఆత్మీయ కార్యదశన్= తనదైన చేయతగ్గ పని యొక్క స్థితిని; తెలియుటకున్= తెలుసుకోవడానికి; ఆతనితోన్= ఆ కృష్ణుడితో; ఇట్లు+అనున్.

తాత్పర్యం: ధర్మరాజుకి మనస్సులో దుఃఖం పెచ్చురేగింది. తన తమ్ముళ్ళను వెంటతీసికొని శ్రీకృష్ణుడి భవనానికి వెళ్ళాడు. తను ఇకముందు చేయదగ్గ పనిని తెలిసికోవటానికి ఆయనతో ఇట్లా అన్నాడు:

క. 'కార్చిచ్చు గవిసి మృగతతి । నేర్చుకరణి నేఁడు భీష్ముఁ డేచిన కడిమిం
బేర్చి మనసేనఁ బొదివె శ । రార్చుల నవ్వీరుఁ గన్నులారం గంటే? 278

ప్రతిపదార్థం: భీష్ముఁడు; నేఁడు= ఈనాడు; ఏచినకడిమిన్= అతిశయించిన పరాక్రమంతో, పేర్చి= అతిశయించి; మనసేనన్= మన పాండవుల యొక్క సైన్యాన్ని; కారు+చిచ్చు= అడవిలో పుట్టే అగ్ని; కవిసి; మృగతతిన్= జంతు సముదాయాన్ని; ఏర్చు కరణిన్= కాల్చే మాదిరిగా; శర+అర్చులన్= బాణాలనే అగ్ని జ్వాలలతో; పొదివెన్= కప్పివేశాడు; ఆ+వీరున్= ఆ వీరుడిని; కన్నులారన్= నీ కండ్లతో చక్కగా; కంటే?= చూచావా?

తాత్పర్యం: 'భీష్ముడు ఈ దినం యుద్ధంలో బాగా విజృంభించిన పరాక్రమంతో మనసేనను వరుసపెట్టి, దావాగ్ని అరణ్యంలోని జంతుజాలాన్ని భస్మంచేసే విధంగా బాణాగ్నిజ్వాలలతో కప్పివేశాడు. ఓ కృష్ణా! నీవు ప్రత్యక్షంగా కన్నులారా ఆ వీరుడిని చూచావుగదా!

విశేషం : అలం: ఉపమ. 'భీష్ముడు మనసేనన్'... పొదువుట - ఉపమేయవాక్యం. 'కార్చిచ్చు మృగతితిన్...' ఏర్చుట - ఉపమానవాక్యం; ఏర్చుట, పొదువుట - సాధారణ ధర్మం; కరణి - ఉపమావాచకం. శరార్చులు అనే చోట రూపకం. శరములనెడి అర్చులు.

మ. మనవా రెవ్వరు నోర్వ రాతనికి దుర్మానంబునం జేసి యే
మును గార్యస్థితిఁ గాన నైతి విను నిర్మూలంబుగాఁ బోరఁ జ
చ్చిన సామ్రాజ్యము గొన్న యట్లగునె? నిశ్చింతంబునం గాననం
బునకుం బోయెదఁ దమ్ములం గొని తపఃపూజ్యుండ నై యుండెదన్. 279

ప్రతిపదార్థం: ఆతనికిన్= ఆ భీష్ముడికి; మనవారు= పాండవపక్షంలోనివారు; ఎవ్వరున్= ఎవరుగాని; ఓర్వరు= ఎదురు నిలబడలేరు; ఏన్= నేను; మును= ముందు; దుర్+మానంబునన్+చేసి= దురహంకారంతో; కార్యస్థితిన్= కాగల కార్యం యొక్క నిజస్థితిని; కానన్+ఐతిన్= తెలియలేకపోయాను; వినుఁ= ఓ కృష్ణా!, ఆలకించు; పోరన్= యుద్ధంలో; నిర్+మూలంబు+కాన్= మొదలంట; చచ్చినన్= బందుగులు చనిపోగా; సామ్రాజ్యమున్= సకల భూమికి రాజగుట(చక్రవర్తిత్వము); కొన్న+అట్లు+అగునె?= తీసికొన్నట్లగునా?; నిస్+చింతంబునన్= చింతలేనట్లుగా; తమ్ములన్= నా తమ్ముళ్ళను - భీమాదులను; కొని= తీసికొని; కాననంబునకున్= అరణ్యానికి; పోయెదన్= వెళ్ళుతాను; తపఃపూజ్యుండన్+ఐ= తపస్సుచేత పూజింపతగ్గవాడనై; ఉండెదన్= ఉంటాను.

తాత్పర్యం: ఓ కృష్ణా! మన పాండవులసేనలో ఏ ఒకడూ కూడా భీష్ముడు ఢీకొంటే ఎదుట నిలబడగలవాడు లేడు. యుద్ధానికి దిగేముందే, వ్యర్థమైన అహంకారంతో భీష్ముడి తాకిడికి తట్టుకోలేమనే సంగతిని నేను ఊహించలేకపోయాను. యుద్ధంలో బంధుజనం, జనం అసలు లేకుండా చావగా వచ్చిన సామ్రాజ్యం ఎందుకు? జనంలేని సామ్రాజ్యాన్ని తీసుకోవటం, ఒక రాచరికమౌతుందా? కనుక జనం లేని సామ్రాజ్యం నాకు అక్కరలేదు. నేను నిశ్చింతగా నా తమ్ముళ్ళను వెంటబెట్టుకొని అరణ్యానికి వెళ్ళుతాను. అక్కడ తపస్సు చేసికొంటూ, పూజార్హుడుగా ఉండిపోతాను. ఇక్కడ ఈ యుద్ధంవల్ల నాకు నింద కలుగుతుంది.

క. మున్నును నేఁగారణముగ । నన్నియిడుమ లనుభవించి రనుజులు వీరిం
గన్నారఁ జూతుఁ గాని జ । గన్నుత! భీష్మునకుఁ గోలుగా నీఁ జాలన్. 280

ప్రతిపదార్థం: జగత్+నుత!= లోకంచేత కీర్తింపబడే ఓ కృష్ణా!; మున్నునున్= మునుపు; ఏన్+కారణముగన్= నేను కారణంకాగా; అనుజులు= నా తమ్ములు; అన్ని+ఇడుమలు= అన్ని కష్టాలను; అనుభవించిరి= అనుభవించారు; వీరిన్= అట్టి ఈ నా తమ్ముళ్ళను; కన్నారన్= కనులపండువుగా; చూతున్+కాని= చూస్తానుగాని; భీష్మునకున్= భీష్ముడికి; కోలు+కాన్= దోపిడి అయ్యేటట్లుగా; ఈన్+చాలన్= ఈయలేను.

తాత్పర్యం: ఓ కృష్ణా! జూదమాడిన నావల్ల నా తమ్ముళ్ళు ఎన్నో కష్టాలు అనుభవించారు. అట్టివారిని కన్నులార చూచి, సంతోషించుతానుగాని భీష్ముడికి దోపిడిగా ఒప్పగించలేను.

వ. నీకు మా దెస ననుగ్రహంబు గలదేని కయ్యంబు దక్కి ధర్మ విరోధంబు గాకుండునట్టి యొక్క తెరువు సెప్పు' మని సకరుణంబుగాఁ బలికిన విని శౌరి సాంత్వనవచనంబుల ననునయించి యతని కి ట్లనియె. 281

ప్రతిపదార్థం: నీకున్= (కృష్ణుడవగు) నీకు; మాదెసన్= మాయందు; అనుగ్రహంబు= దయ; కలదు+ఏనిన్= ఉన్నట్లయితే; కయ్యంబు= యుద్ధాన్ని; తక్కి= వదలిపెట్టి; ధర్మవిరోధంబు= ధర్మానికి విరోధము; కాక+ఉండు+అట్టి= కాకుండా ఉండేటువంటి; ఒక్క తెరువు= ఒక మార్గాన్ని; చెప్పుము+ అని= సెలవీయవలెనని; సకరుణంబు+కాన్= దయతో కూడునట్లుగా; పలికినన్= చెప్పగా; విని; శౌరి= కృష్ణుడు; సాంత్వనవచనంబులన్= ఊరడింపు మాటలతో; అనునయించి= బుజ్జగించి; అతనికిన్= ఆ ధర్మరాజుకు; ఇట్లు+అనియె.

తాత్పర్యం: ఓ కృష్ణా! నీకు మా పట్ల దయ ఉంటే, యుద్ధాన్ని తప్పనిచ్చి, ధర్మానికి విరోధం లేకుండా ఉండే ఏదో ఒక ఉపాయాన్ని (మార్గం) చెప్పు' అని చాలా జాలిగా ధర్మరాజన్నాడు. కృష్ణ డితడి మాటలు విని, అతన్ని ఊరడింపు మాటలతో బుజ్జగించి, ఈ విధంగా అన్నాడు.

క. ' సత్యప్రతిజ్ఞుఁడవు నీ । వత్యద్భుత బాహువీర్య లనుజన్ములు దౌ
ర్గత్యము గల్గునె? నీకు న । మాత్యుఁడ నై యేను రాజ్యమహిమ నొనర్తున్. 282

ప్రతిపదార్థం: నీవు; సత్యప్రతిజ్ఞుఁడవు= సత్యమైన ప్రతిజ్ఞ కలవాడివి; అనుజన్ములు= నీ తోబుట్టువులు; అతి+అద్భుత బాహు వీర్యులు= చాలా గొప్ప భుజబలం గలవారు; నీకున్= నీకు; దౌర్గత్యము= దుర్గతి (హీనత్వము); కల్గునె?= ఏర్పడునా?; ఏర్పడదనుట; ఏను= నేను (శ్రీకృష్ణుడు); అమాత్యుఁడన్+ఐ= మంత్రిగా ఉండి; రాజ్యమహిమన్= నీ రాజ్యానికి ఐశ్వర్యాన్ని; ఒనర్తున్= కలిగించుతాను.

తాత్పర్యం: 'ధర్మరాజా! నీవు సత్యమైన ప్రతిజ్ఞ కలవాడివి, అంటే నీవు ప్రతిజ్ఞ చేశావంటే దాన్ని తప్పక నెరవేర్చేవాడివి. ఇక నీ తమ్ముళ్ళూ ఆశ్చర్యం కలిగించే బాహుబలంగలవారు. అటువంటి నీకు (దుఃస్థితి) హీనదశ కలుగనేరదు. పైగా నేను మంత్రిగా ఉండి నీ రాజ్యానికి ఐశ్వర్యాన్ని సమకూరుస్తాను.

క. వగవఁగ నేటికిఁ బార్థుఁడు । దెగువకుఁ జొరకున్న భీష్ముఁ దెగఁ జూచి వెసం
బగ యడఁగించెద నన్నున్ । మగిడింపక చూచుచుండు మనుజాధీశా! 283

ప్రతిపదార్థం: మనుజ+అధీశా!= ఓ ప్రభూ ధర్మరాజా!; వగవఁగన్+ఏటికిన్= దుఃఖించడం ఎందుకు?; పార్థుఁడు= అర్జునుడు; తెగువకున్= సాహసానికి; చొరక+ఉన్నన్= దిగకుండా ఉంటే; భీష్మున్= భీష్ముడిని; తెగన్+చూచి= చంపి; వెసన్= వెంటనే; పగ= విరోధాన్ని; అడగించెదన్= పోగొడతాను; నన్నున్= కృష్ణుడగునన్ను; మగిడింపక= మరల్పకుండా; చూచుచుండుము.

తాత్పర్యం: ధర్మజా ! దుఃఖ పడటమెందుకు? అర్జునుడు భీష్ముడిని చంపడానికి తెగించకపోతే నేనే భీష్ముడిని చంపి పగను పోగొడతాను. అర్జునుడు నన్ను వెనుకకు మరల్చకుండా చూడు.

తే. సఖుఁడు సంబంధి శిష్యుండు సవ్యసాచి । నాకు, నతనికి నై యేను నరవరేణ్య!
కూర్మిమై నిత్తుఁ గండలు గోసి యైన । నరయ నాతండు నాయెడ నట్టివాఁడ. 284

ప్రతిపదార్థం: నరవరేణ్య!= ఓ మానవశ్రేష్ఠుడా!; సవ్యసాచి= అర్జునుడు; నాకున్; సఖుఁడు= చెలికాడు; సంబంధి= చుట్టం; శిష్యుండు; ఏను= నేను; అతనికిన్+ఐ= ఆతడికొరకై; కూర్మిమైన్= ప్రేమతో; కండలుకోసి+ఐనన్= నా శరీరంలోని కండలు కోసి అయినా; ఇత్తున్; అరయన్= చూడగా; ఆతండున్= ఆ అర్జునుడుకూడా; నా+ఎడన్= నా విషయంలో; అట్టివాఁడు+అ= అట్టివాడే.

తాత్పర్యం: ఓ ధర్మరాజా! నాకు అర్జునుడు - స్నేహితుడు, సంబంధి (మా సోదరి సుభద్రకు భర్త) అంతేకాదు. నాకు శిష్యుడు కూడా. అతని మేలు కోసం సంతోషంతో నా శరీరంలోని కండలైనా కోసి ఇస్తాను. ఆలోచించి చూడగా అర్జునుడు కూడా నాపట్ల అంతప్రేమకలవాడే. మా ఇద్దరి కలయిక అంత దృఢమైనది.

వ. ఉపప్లావ్యంబున నతండు సంజయుతో నాడినబలుమాటలకు, నులూకుండు వచ్చినప్ప డతని పలుకులం బుట్టిన బెట్టిదంపుఁదనంబునకుం దగినయంత నాకుం జేయవలయు నేను నీ రెండెడలం బెక్కులు వలికినవాఁడ మా కిరువురకు నొండొరువుల పలుకులు పరిపాలించుట సమయంబయి యుండు ననిన వసుదేవనందనునకు ధర్మనందనుం డి ట్లనియె. 285

ప్రతిపదార్థం: ఉపప్లావ్యంబునన్; ఇతండు= అర్జునుడు; సంజయుతోన్; ఆడిన= పలికిన; బలుమాటలకున్= పెద్దమాటలకు; ఉలూకుండు; వచ్చిన+అప్పుడు= వచ్చిన సమయంలో; అతని పలుకులన్= అతడి మాటలవల్ల; పుట్టిన= కలిగిన; బెట్టిదము+తనంబునకున్= క్రూరత్వానికి; తగిన+అంత; నాకున్+చేయవలయున్= నేను చేయవలసివుంది; ఏనున్= నేను(కృష్ణుడు)కూడా; ఈ రెండు+ఎడలన్= ఈ రెండు చోట్ల; పెక్కులు= చాలా చాలా; పలికినవాఁడన్= మాట్లాడాను; ఒండు+ఒరుల; ఒకరొకరియొక్క; పలుకులు= మాటలు; పరిపాలించుట= నెరవేర్చుట; మాకున్+ఇరువురకున్= మా ఇద్దరికి; సమయంబు+అయి+ఉండున్= ఒడంబడికగా ఉన్నది; అనినన్; ధర్మనందనుండు; వసుదేవనందనునకున్= వసుదేవుడి కొడుకు - కృష్ణుడికి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఉపప్లావ్యంలో అర్జునుడు సంజయుడితో అన్న మాటలకు, ఉలూకుడు వచ్చిన సమయంలో అతడి మాటల వల్ల ఏర్పడ్డ క్రూరత్వానికి తగినట్లుగా నేను కూడా చేయవలసి ఉన్నది. ఈ రెండు సందర్భాలలో నేను కూడా హెచ్చులు పలికాను. మా ఇద్దరిలో, ఒకరి మాటలను మరొకరు నెరవేర్చడమనేది మా ఇద్దరి ప్రతిజ్ఞ' అనగా విని, ధర్మరాజు కృష్ణుడితో ఇట్లా అన్నాడు.

విశేషం: ఉలూకుడు: ఇతడు భారత యోధుడు. శకుని యొక్క కొడుకు. **"ఆహూయోపహ్వరే రాజన్నులూక మిదమబ్రవీత్ । ఉలూక గచ్ఛకౌరవ్య పాండవాన్ సహసోమకాన్"** ॥ (మహాభారతం)

క. ' కయ్యము సేయక తగు సా । హాయ్యము సేయఁగలవాఁడ నని పలికితి ని
న్ని య్యెడ నేఁ బొంకింతునె? । దయ్యము నా కేల యిట్టి దైన్యము దెచ్చెన్? 286

ప్రతిపదార్థం: కయ్యము= యుద్ధం; చేయక; తగు= తగినట్టి; సాహాయ్యమున్= సహాయాన్ని; చేయన్+కలవాఁడన్+అని= చేస్తానని; పలికితి(వి)= చెప్పావు; నిన్నున్= అట్లా చెప్పినట్టి నిన్నున్; ఈ+ఎడన్= ఈ పట్టులో; ఏన్= నేను (ధర్మరాజు); బొంకింతున్+ఎ?= అబద్ధమాడించగలనా?; దయ్యము= విధి; నాకున్= ధర్మరాజగు నాకు; ఇట్టి దైన్యమున్= ఈలాంటి హీనస్థితిని; ఏల తెచ్చెన్?= ఎందుకు తెచ్చిపెట్టింది?

తాత్పర్యం: 'ఓ కృష్ణా! నీవు యుద్ధం చేయకుండా ఉండి, తగు సహాయంచేస్తానని అన్నావుకదా! ఈ కష్టసమయంలో నిన్ను అబద్ధాలాడే వాడినిగా నేనెట్లా చేయను? నీవు యుద్ధం చేస్తే నా కోసం నీవు అబద్ధాలాడే వాడవవుతావు కదా! దైవం నాకు ఇంతగా సంకటమైన స్థితిని తెచ్చిపెట్టింది కదా!

వ. నాకు దేవవ్రతునకు నొక్క సమయంబు గల దమ్మహాత్ముండు కౌరవులకు నయి కయ్యంబు సేయుటకును, నాకు హితం బగు కార్యంబు బుద్ధిం దలకొనుటకుం బూనినవాఁ డతండు రాజ్యం బొసంగు నని పలికి సఖేదంబుగా ని ట్లనియె. 287

ప్రతిపదార్థం: నాకున్= ధర్మరాజైన నాకు; దేవవ్రతునకున్= భీష్ముడికిని; ఒక్క సమయంబు+కలదు= ఒక ఒడంబడిక ఉన్నది; ఆ+మహాత్ముండు; కౌరవులకున్+అయి= కౌరవులకొరకు; కయ్యంబున్= యుద్ధాన్ని; చేయుటకును= చేయడానికి; నాకున్; హితంబు+అగు= మంచిదైనట్టి; కార్యంబు= పనిని; బుద్ధిన్=బుద్ధియందు; తలకొనుటకున్= కలిగియుండుటకు; పూనినవాఁడు= పూనుకొన్నవాడు; అతండు= ఆ భీష్ముడు; రాజ్యంబున్= రాజ్యాన్ని; ఒసంగున్= ఇచ్చును; అని; పలికి; సఖేదంబు+గాన్= దుఃఖంతో కూడుకొన్నవాడై; ఇట్లు+అనియెన్= ఇలాగన్నాడు.

తాత్పర్యం: నాకున్నూ, భీష్ముడికీ ఒక ఒడంబడిక ఉన్నది. అదేమంటే, అతడు కౌరవుల పక్షంలో ఉండి యుద్ధం చేస్తాడు. నాకు మంచి కలిగించే ఆలోచన కలిగియుంటాడు. కాబట్టి రాజ్యం నాకు దక్కే ఉపాయం చెప్పుతాడు.' అని ధర్మరాజు అని, దుఃఖంతో మరలా ఇట్లా అన్నాడు:

విశేషం : దేవవ్రతుడు - దేవుని యొక్క వ్రతంవంటి వ్రతం గలవాడు. అనగా స్థిరమైన ప్రతిజ్ఞ కలవాడు. **'చిత్రాంగదం తతో రాజ్యే స్థాపయామాస వీర్యవాన్ । స్వయం న కృతవాన్ రాజ్యం తస్మాద్దేవవ్రతోఽభవత్ ॥** దేవీ భాగవతే (1 - 20 - 16)

ఆ. ' అకట! తండ్రి సచ్చినంతనుండియు మమ్ము । నరసి ప్రోచినట్టి యనుఁగుఁ దాతఁ
జంప మదిఁ దలంచుతెంపు సూచితె? రాజ । ధర్మ మింత క్రూరకర్మమగునె?' 288

ప్రతిపదార్థం: అకట!= అయ్యో!; తండ్రి= తండ్రియైన పాండురాజు; చచ్చిన+అంతన్+ఉండియున్= చచ్చిపోయింది మొదలు; మమ్మున్= పాండురాజు కొడుకులమైన మమ్ములను; అరసి= విచారించి, (చూచి); ప్రోచిన; అట్టి= కాపాడినట్టి; అనుఁగు= ప్రియమైన; తాతన్= తాతగారిని; చంపన్= చంపటానికి; మదిన్= మనస్సులో; తలంచుతెంపు= తలచే తెగువ; చూచితే?= (ఓకృష్ణా!); చూచావా?; రాజధర్మము= క్షత్రియులయొక్క ధర్మం; ఇంత= ఇంతగా; క్రూరకర్మము= భయంకరమైన పని; అగునె?= అగునా?

తాత్పర్యం: అయ్యయ్యో! తండ్రి చనిపోయింది మొదలు మమ్ములను ఎంతో గారాబంగా చూచుకొంటూ వచ్చినవాడు, మాకు చాలా ప్రియమైనవాడు, అయిన తాతగారినే చంపాలనే తలంపు మనస్సులో పుట్టడం - చూశావా? రాజధర్మం ఇంత ఘోరమైనదా?

వ. అనవుడు. 289

ప్రతిపదార్థం: అనవుడు(న్)= అని చెప్పగానే.

తాత్పర్యం: ధర్మరాజు ఈ విధంగా కృష్ణుడితో చెప్పగానే (తరువాతి పద్యంతో అన్వయం.)

తే. విని మురాంతకుఁ డితఁడు శాంతనవుకడకు । నరుగఁ జూచినవాఁ డని యాత్మ నెఱిఁగి
క్రమ్మఱంగ 'నేతెంచెదు గాక!' యనిన । యన్నదీసూనుతొంటి వాక్యములు దలఁచి. 290

ప్రతిపదార్థం: మురఁ+అంతకుఁడు= మురుడనే రాక్షసుడిని చంపిన శ్రీకృష్ణుడు; విని= ధర్మరాజు మాటలు ఆలకించి; ఇతఁడు= ఈ ధర్మరాజు; శాంతనవు కడకున్= భీష్ముడి దగ్గరికి; అరుగన్= వెళ్ళడానికి; చూచినవాఁడు+అని= యత్నిస్తున్నాడని; ఆత్మన్=

మనస్సులో; ఎఱిఁగి= తెలుసుకొని; క్రమ్మఱంగన్= మరల తిరిగివచ్చుటకు; ఏతెంచెదుగాక!= వచ్చెదవులెమ్ము!; అనినన్= అంటూ; ఆ+నదీసూను= ఆ భీష్ముడియొక్క; తొంటి వాక్యములు= మొదట అన్న మాటల్ని; తలఁచి= జ్ఞప్తికి తెచ్చికొని.

తాత్పర్యం: కృష్ణుడు ధర్మరాజన్న మాటలు విన్నాడు. ఇతడు భీష్ముడి దగ్గరకు పోవాలని ఉన్నాడని మనస్సులో గ్రహించాడు. తరువాత వచ్చెదవుగాక అని భీష్ముడు యుద్ధ ప్రారంభానికి ముందు ధర్మజునితో అనిన వాక్యాలు జ్ఞప్తికి తెచ్చుకొని (తరువాతి పద్యంతో అన్వయం)

వ. అజాతశత్రున కిట్లనియె. **291**

ప్రతిపదార్థం: అజాత శత్రునకున్ ధర్మరాజుతో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు ధర్మరాజుతో ఈ చెప్పబోయే విధంగా అన్నాడు.

విశేషం: అజాతశత్రుడు(వు) - పుట్టని శత్రువులు కలవాడు - ధర్మరాజు (ఇతడికి శత్రువులే లేరన్నమాట.)

ధర్మరాజు రహస్యప్రకారంబున భీష్మునియొద్దకుఁ బోవుట (సం. 6-103-50)

ఆ. నీ తలంపు లెస్స నీవు మున్ననినట్ల । కాక భీష్ముఁ డలుక గదిరిపోరఁ
జక్కఁ జూచెనేని శత్రువుల్ వొలియరె? । యిప్పుడతని పాలికేఁగు మధిప! **292**

ప్రతిపదార్థం: అధిప!= ఓ ధర్మరాజా!; నీ తలంపు= నీ యొక్క ఆలోచన; లెస్స= మంచిది; నీవు= ధర్మరాజు; మున్ను= ముందు; అనిన+అట్లు+అ+కాక= నీవు అన్నట్లే; భీష్ముఁడు = భీష్మాచార్యుడు; అలుక= కోపం; కదిరి= విజృంభించి; పోరన్= యుద్ధంలో; చక్కన్+చూచెన్+ఏని= చంపదలచుకుంటే; శత్రువుల్= విరోధులు; పొలియరె?= చావరా?; ఇప్పుడు; అతని పాలికిన్= ఆ భీష్ముడి దగ్గరకు; ఏఁగుము= పొమ్ము.

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! భీష్ముడి వద్దకు వెళ్ళాలనే నీ ఆలోచన చాలామంచిది. భీష్ముడు కౌరవుల వైపు ఉండి, యుద్ధం చేస్తాడని, మనస్సులో మీ హితాన్ని కోరుతూ మంచి కలిగించడానికి పూనుకొని ఉంటాడని, అతడు నీకు రాజ్యం చెందేట్టు చేస్తాడని - అన్నావు కదా! అట్లా కాకపోతే, అతడనుకుంటే శత్రులనందరినీ చంపివేయగలడు. కాబట్టి నీవు ఇప్పుడు అతనివద్దకు వెళ్ళటం చాలా మంచిది.

సీ. నీవు దన్నడిగిన నిజవధోపాయం బవశ్యంబుఁ జెప్పు దేవవ్రతుండు
మనము రహస్యవర్తనమున నందఱమును జని య మ్మహాత్మునకు భక్తి
నెరఁగి తెల్లంబుగ హితకార్యగతి వినయంబుమైఁ బ్రార్థించి యడిగి యతని
సదయమంత్రోపదేశంబున నెగడుద' మని యిట్లు హరి నిశ్చయంబు సేయ

ఆ. నయ్యజాతశత్రుఁ డనుజులు నతఁడును । దాను సౌమ్యవేషధరణమొప్ప
నతినిగూఢ వృత్తి నాపగాసుతుమంది । రమున కరిగి సముచితముగఁ జొచ్చి. **293**

ప్రతిపదార్థం: నీవు= ధర్మరాజైనట్టి నీవు; తన్నున్= ఆ భీష్ముడిని; అడిగిన(న్)= అడిగితే; దేవవ్రతుండు= భీష్ముడు; నిజవధ+ఉపాయంబున్= తన మరణానికి ఉపాయాన్ని; అవశ్యంబున్= తప్పకుండా; చెప్పున్= చెప్తాడు; మనము; మనమందరం; రహస్య వర్తనమునన్= చాటుగా; చని= అతడివద్దకుపోయి; ఆ+మహాత్మునకున్= ఆ మహానుభావుడికి; భక్తిన్= భక్తితో; ఎరఁగి=

నమస్కరించి; తెల్లంబుగన్= స్పష్టంగా; హితకార్యగతిన్= మేలు గల్గించు కార్యవిధానమును; వినయంబుమైన్= వినయంతో; ప్రార్థించి; అడిగి; అతని= ఆ భీష్ముడియొక్క; సదయమంత్ర+ఉపదేశంబునన్= దయతో కూడిన రహస్యమైన హితవచనంతో; నెగడుదము+అని= వృద్ధి పొందుదామని; ఇట్లు; నిశ్చయంబు= నిర్ణయాన్ని; చేయన్= చేయగా; అతఁడునున్; ఆ+అజాతశత్రుఁడున్= ఆ ధర్మరాజు; అనుజులున్= తమ్ములు; తాను= కృష్ణుడు; సౌమ్యవేషధరణము= సాధారణమైన వస్త్రాదులు ధరించుట; ఒప్పన్= తగియుండగా; అతి నిగూఢమైన వృత్తిన్= అతి రహస్యమైన రీతిలో; ఆపగాసుతుమందిరమునకున్= భీష్ముడి భవనానికి; అరిగి= వెళ్ళి; సమ్+ఉచితముగన్= చక్కగా, తగిన రీతిగా; చొచ్చి= లోనికి వెళ్ళి.

తాత్పర్యం: ఓ ధర్మరాజా! నీవు ఆ భీష్ముడిని తన వధకు ఉపాయమేమిటో అడిగితే అతడు నీకు తప్పకుండా చెప్పుతాడు. మన మందరం కలిసి, ఎవ్వరికి తెలియకుండా ఆయన దగ్గరకు వెళ్ళాలి. ఆ మహాత్ముడికి భక్తితో దండాలు పెట్టాలి. మనకు మేలు కలిగే కార్యవిధానాన్ని బాగా మనకు తెలియజెప్పవలెనని ఆయనను వేడికొని అడగాలి. అప్పు డతడు దయగలవాడై, మనకు మేలు కలిగించే ఉపాయాన్ని చెప్పగలడు. ఆయన ఉపదేశంతో పెంపొందెదము'' అని కృష్ణుడు నిశ్చయించగా, ధర్మరాజు, అతడి తమ్ములు, తాను (కృష్ణుడు) ఆర్భాటం లేకుండా, సాధారణమైన వస్త్రాలు, అలంకారాలు ధరించి, ఎవరికంటా పడకుండా రహస్యంగా భీష్ముడి భవనానికి వెళ్ళి, తగిన రీతిగా వినయంగా లోపలికి ప్రవేశించారు.

వ. అతనిం గాంచి యధికభక్తిం బ్రస్తవనపూర్వకంబుగాఁ దత్పాదంబులకుం బ్రణమిల్లిన నతం డత్యాదరంబునఁ బేరుపేర వారలందఱసేమంబు లడిగి యి ట్లనియె. 294

ప్రతిపదార్థం: అతనిన్= ఆ భీష్ముడిని; కాంచి= చూచి; అధికభక్తిన్= మిక్కుటమగు భక్తితో; ప్రస్తవన పూర్వకంబుగాన్= పొగడ్త ముందు కలుగునట్లుగా; తద్+పాదంబులకున్= ఆయన పాదాలకు; ప్రణమిల్లినన్= నమస్కారం చేయగా; అతండు= ఆ భీష్ముడు; అతి+ఆదరంబునన్= మిక్కిలి ఆదరణతో; పేరు+పేరన్= పేరుపేరునా; వారల+అందఱ= వారందరియొక్క; సేమంబులు= క్షేమాలను; అడిగి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: కృష్ణుడూ, పాండవులూ ఆ భీష్ముడిని చూచి చాలా భక్తితో పొగడుతూ, ఆతడి పాదాలకు దండాలు పెట్టారు. భీష్ముడు చాలా ఆప్యాయంగా వారందరినీ ప్రతి ఒక్కరినీ పేరుపేరునా పిలిచి, పలుకరించి, వారి క్షేమాలను గూర్చి అడిగి, ఇట్లా అన్నాడు:

క. ' ఇచ్చటికి మీర లందఱు । వచ్చిన పనియేమి? యేది వలసిన నడుగుం
డిచ్చెద దుష్కరమైనను । జెచ్చెరఁ దలకొని ఘటింపఁ జేసెదఁ బ్రీతిన్.' 295

ప్రతిపదార్థం: ఇచ్చటికిన్= ఈ నా ఉన్న చోటికి; మీరలు+అందఱున్; కృష్ణుడు, పాండవులు అగు మీరు యావన్మందిన్నీ; వచ్చిన పని+ఏమి?; ఏది వలసినన్= ఏది కావలసి ఉంటే అట్టిదానిని; అడుగుండు= కోరండి; ఇచ్చెదన్= ఇస్తాను; దుష్కరము+ ఐననున్= చేయరాని పని అయినా గూడా; చెచ్చెరన్= త్వరగా; తలకొని= ప్రయత్నించి; ప్రీతిన్= ప్రీతితో; ఘటింపన్+చేసెదన్= కలిగేటట్లు చేస్తాను.

తాత్పర్యం: 'మీరందరూ కలిసి ఇక్కడికి నేనుండే చోటికి ఏం పనిమీద వచ్చారో, మీకేం కావాలో అడగండి - ఇస్తాను. అదెంత కష్టసాధ్యమైన పనైనా సరే - ప్రేమతో యత్నించియైనా మీకా పని నెరవేరేటట్లుగా చేస్తాను.'

వ. అని తెలివొందిన మొగంబుతో నడిగిన దీనాననుం డగుచు ధర్మసూనుం డతని కి ట్లనియె. 296

ప్రతిపదార్థం: అని= పై చెప్పినరీతిగా; తెలివి+ఒందిన మొగంబుతోన్= ప్రసన్నమైనముఖంతో; అడిగినన్; ధర్మసూనుండు= ధర్మరాజు; దీన+ఆననుండు+అగుచున్= దీనత్వంతో కూడిన ముఖం గలవాడౌతూ; అతనికిన్= ఆ భీష్ముడికి; ఇట్లు+ అనియెన్.

తాత్పర్యం: 'మీకేం కావాలన్నా ఇస్తా'నని భీష్ముడు నవ్వు ముఖంతో వాళ్ళని అడిగాడు. అప్పుడు ధర్మరాజు ముఖం చిన్నబుచ్చుకొని భీష్ముడితో ఇలా అన్నాడు.

క. ' మా కెమ్మెయి సామ్రాజ్యము । సేకుఱు నెబ్భంగి బహుళసేనోత్పాద
వ్యాకులత రాక తక్కుం । జేకొని యత్తెఱఁగు కరుణఁ జెప్పఁగ వలయున్.' 297

ప్రతిపదార్థం: మాకున్= పాండవులైనట్టి మాకు; ఏ+మెయిన్= ఏ విధంచేత; సామ్రాజ్యము= సార్వభౌమత్వము; చేకుఱున్= కలుగునో; ఏ+భంగిన్= ఏ విధంచేతనైతే; బహుళ= అధికమైన; సేనా= సైన్యంయొక్క; ఉత్పాద= నాశముచేనైన; వ్యాకులత= కలవరపాటు; రాక= రాకుండా; తక్కున్= తప్పిపోవునో; చేకొని= ఆదరించి; ఆ+తెఱఁగు= ఆ మార్గాన్ని; కరుణన్= దయతో; చెప్పఁగన్ వలయున్= చెప్పాలి.

తాత్పర్యం: 'మాకు ఏ విధంగా సామ్రాజ్యం వస్తుందో, ఏ మాదిరి, ఎక్కువ సేన నాశమైనదనే వ్యాకులత(కలవరపాటు) లేకుండా పోతుందో అట్టి ఉపాయాన్ని ఆదరభావంతో, దయతో మాకు సెలవీయుమని కోరాడు ధర్మరాజు.

క. అనవుడు'నేఁ బెనఁగఁగ మీ । కనఘా! సైన్యక్షయంబు నగు సామ్రాజ్యం
బును గానేరదు గావున । నను నిర్జింపంగ శోభనము లెల్ల నగున్.' 298

ప్రతిపదార్థం: అనవుడున్= అని చెప్పగా; అనఘా!= పాపములేని ధర్మజా!; ఏన్= నేను(భీష్ముడు); పెనఁగఁగన్= యుద్ధం చేస్తూండగా; మీకున్= పాండవులైన మీకు; సైన్యక్షయంబున్= సేనయొక్క నాశమున్నూ; అగున్= కలుగును; సామ్రాజ్యంబునున్= సామ్రాజ్యంకూడా; కానేరదు= ప్రాప్తించదు; కావునన్= కాబట్టి; ననున్= భీష్ముడనగు నన్ను; నిర్జింపంగన్= జయిస్తే; ఎల్లన్= సకల విధాలైన; శోభనములు= శుభములు(మేళ్ళు); అగున్= కలుగును.

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! నేను యుద్ధం చేస్తూండేదాకా మీకు, సైన్యం నాశనం కాక తప్పదు. మరి సామ్రాజ్యం కూడా మీకు దక్కదు. కాబట్టి నన్ను జయిస్తే మీకు అన్నివిధాల శుభాలు సైన్యం బ్రతకడం, సామ్రాజ్యం ప్రాప్తించడం జరుగుతుంది.'

విశేషం: భీష్ముడు, ధర్మజుడిని, 'అనఘా!' అనటంలో అతడిపై అంతరంగంలో గల అభిమానం బాగా తేటతెల్లమౌతున్నది.

వ. అని పలికిన శాంతనవునకుం గౌంతేయాగ్రజుం డి ట్లనియె. 299

ప్రతిపదార్థం: అని పలికిన= అని చెప్పిన; శాంతనవునకున్= భీష్ముడితో; కౌంతేయ+అగ్రజుండు= కుంతీపుత్రులలో మొదటివాడైన ధర్మరాజు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: అని పలుకగగా, కుంతీపుత్రులలో మొదటివాడైన ధర్మరాజు భీష్ముడితో ఇట్లా అన్నాడు:

ఉ. ' చిచ్చఱకన్ను మూసికొని చేతిత్రిశూలము డాఁచి లీలమై
వచ్చిన రుద్రుచందమున వ్రాలుదు వీ వనిలోన నోర్వఁగా
వచ్చునె నిన్ను నెట్టి మగవారికి? నీకృప నాశ్రయింపఁగా
వచ్చితి మెవ్విధిన్ గెలువవచ్చు మహాత్మ! యెఱుంగఁ జెప్పవే?' 300

ప్రతిపదార్థం: మహాత్మ!= ఓ మహాత్ముడా!; చిచ్చఱ+కన్ను= అగ్నిమయమైన మూడో నేత్రాన్ని; మూసికొని; చేతి త్రిశూలమున్= చేతనుండే త్రిశూలాన్ని; డాఁచి= దాచిపెట్టి; లీలమైన్= విలాసంగా; వచ్చిన= యుద్ధానికి వచ్చినట్టి; రుద్రుచందమునన్= ఈశ్వరుడి మాదిరిగా; ఈవు= నీవు, వ్రాలుదువు= యుద్ధంలోకి దిగుతావు; అని లోనన్= యుద్ధంలో; నిన్నున్= భీష్ముడవైన నిన్ను; ఎట్టిమగవారికిన్= ఎంతటి శూరులకైనా; ఓర్వఁగాన్+వచ్చునె?= ఎదిరించడానికి సాధ్యమా?; నీ కృపన్= నీ దయను; ఆశ్రయింపఁగాన్= ఆశ్రయించటానికి; వచ్చితిమి= వచ్చాము; ఏ+విధిన్= ఏ విధంగా; గెలువన్‌వచ్చున్; ఎఱుంగన్= తెలిసేవిధంగా; చెప్పవు+ఏ= చెప్పుము.

తాత్పర్యం: 'ఓ మహానుభావా, భీష్మా! మూడో కన్ను మూసికొని, చేతిలో ఉండే త్రిశూలాన్ని దాచిపెట్టి, విలాసంగా యుద్ధం చేయటానికి వచ్చిన ఈశ్వరుడి మాదిరి నీవు యుద్ధానికి దిగితే, ఎంత ధీరుడైనా, శూరుడైనా నిన్నెదిరించగలడా? మేము నీ దయకు పాత్రులం కావటానికే వచ్చాము. నిన్ను ఏ విధంగానైతే గెల్వవచ్చునో - మాకు తెలియచెప్పాలి.'

విశేషం: అలం: ఉపమ.

క. అనుటయు ని ట్లను గంగా । తనయుఁడు 'నీ చెప్పినట్ల తథ్యం బది న
న్ననిమిషులు గెలుతు రే? చే । ధనువుండఁగ వినుము తద్విధము దేటవడన్. 301

ప్రతిపదార్థం: అనుటయున్= ధర్మరాజు పైవిధంగా అనగా; గంగాతనయుఁడు= భీష్ముడు; ఇట్లు+అనున్; నీచెప్పిన+అట్ల= నీవు చెప్పిన విధంగానే; అది= ఆ మాట; తథ్యంబు= నిజము; చే ధనువుండఁగన్= చేతిలో ధనుస్సు ఉండగా; నన్నున్= నన్ను(భీష్ముడిని); అనిమిషులు= దేవతలు; గెలుతురు+ఏ?= గెలుస్తారా?; తద్+విధమున్= నన్ను గెలిచే రీతిని; తేటపడన్= బాగా తెలిసేట్లుగా; వినుము= ఆలకింపుము.

తాత్పర్యం: ధర్మరాజు అడిగినదానికి భీష్ముడు ఇట్లా అన్నాడు: 'ధర్మజా! నీవన్నమాట నిజమే. నా చేతిలో ధనుస్సు ఉన్నంతసేపు నన్ను దేవతలు కూడా జయించలేరు సుమా! నా వధోపాయం చెప్తాను. బాగా తెలిసికొనుము.

తే. ఇట్టివానిఁగ నన్ను మీరెఱిఁగి యిచటి । కిందఱును వచ్చి యక్కటా! యిట్టు లడుగ
మీకుఁ బ్రియమైన కార్యంబు మెయికొనంగఁ । గనుట కంటెను సుకృతంబు గలదె నాకు? 302

ప్రతిపదార్థం: నన్నున్= భీష్ముడగు నన్ను; ఇట్టివానిఁగన్= ఇంతగొప్పవీరునిగా; మీరు= పాండవాదులైన మీరు; ఎఱిఁగి= తెలిసికొని; ఇచటికిన్= నేనుండే ఈ చోటికి; ఇందఱును= ఇంతమందికూడా; వచ్చి= వచ్చి; అక్కటా!; ఇట్టులు= ఇంత దీనంగా; అడుగన్= ప్రార్థిస్తూంటే; మీకున్= కృష్ణుడు; పాండవులు అగుమీకు; ప్రియము+ఐన= ఇష్టమైన; కార్యంబున్= పనిని; మెయికొనంగన్= సమ్మతమయ్యేటట్లు; కనుటకంటెను= తెలిసికొనటంకంటె; నాకున్= నాకు; సుకృతంబు= పుణ్యము; కలదె?= కలదా?

తాత్పర్యం: మీరందరు నన్నింత గొప్పవాడుగా అనుకొని, నా దగ్గరికి వచ్చి, అయ్యో పాపం - ఎంతో దీనంగా బతిమాలుతుంటే, మీకు ఇష్టమైన కార్యాన్ని, అందరికి సమ్మతంగా వుండేదాన్ని తెలుసుకొని మీకు చెప్పటానికంటే మించిన పుణ్యం నాకేముంటుంది? (ఉండదని భావం.)

వ. ఏ నా యుధ వ్యాపారంబువలన నుదాసీనత్వంబు నొందిన నన్ను జయింప సమకూరు జోడు వుచ్చినవానిని, గైదువు బెట్టినవానిని, సిడంబు డించినవానిని, నంగనను, నంగనాపూర్వుని, నంగనాభిధానునిఁ దలచీర వీడినవానిని, భ్రాతృహీనుని, నపుత్రకునిం గని యేటుఁ బోటుఁ దక్కి సమరంబు సేయ మానుదు. మఱియు

నొక్క వ్రతంబు పూనినవాఁడం బుట్టి నప్పుడు లేక నడుమ దైవం బిచ్చిన పురుషత్వంబు గలవానితోడఁ గయ్యంబు సేయం గావున మీకు నొక్కయుపాయంబు సెప్పెద. ద్రుపదు నపత్యం బైన శిఖండి యట్టివాఁడగుట మీరెఱుంగు దుర కాదె? విశేషించి ముందటి పుట్టువున నంగన యగుట వాని కెదు రేయకుండుదు నర్జునుండు వానిం బురస్కరించుకొని వచ్చి యే నేయుట మానినయెడ నొప్పించి పడవైచునది. పదంపడి బంధుమిత్రు లగు ధార్తరాష్ట్రుల గెలుచుట సుకరం బగునిది నాపను పేను బనిచి నట్ల చేయుం డని సహృదయంబుగాఁ జెప్పిన నట్లు దేవవ్రతుచేత ననుజ్ఞాతు లై వార లతనికి నమస్కరించి వీడ్కొని విడిదలకుం బోవుచున్న సమయంబున బీభత్సుండు. 303

ప్రతిపదార్థం: ఏను= నేను; ఆయుధవ్యాపారంబు వలనన్= ఆయుధాలు ప్రయోగించే పని నుండి; ఉదాసీనత్వంబున్= ఉపేక్షా భావాన్ని; ఒందినన్; పొందినప్పుడున్ను; నన్నున్= భీష్ముడగు నన్ను; జయింపన్ సమకూరున్= జయించడం సిద్ధిస్తుంది; జోడు+పుచ్చిన వానినిన్= కవచం తీసివేసినవాడిని; కైదువున్ పెట్టిన వానినిన్= ఆయుధాన్ని దిగువపెట్టేసినవాడిని; సిడంబున్= ధ్వజాన్ని; డించినవానినిన్= కిందికి దించినవాడిని; అంగననున్= ఆడుదానిని; అంగనా పూర్వునిన్= ముందు అంగన ఐనవానిని; అంగనా+అభిదానునిన్= ఆడదాని పేరుగలవాడిని; తలచీర వీడినవానిని= తలపాగా వీడిపోయినవాడిని; భ్రాతృహీనునిన్= అన్నదమ్ములు లేనివాడిని; అపుత్రకునిన్= బిడ్డలు లేనివాడిని; కని= చూచి; ఏటున్= బాణప్రయోగాన్ని; పోటున్= పొడవటాన్ని; తక్కి= మాని; సమరంబు= యుద్ధం; సేయమానుదున్= చేయడం మానివేస్తాను; మఱియున్= ఇంకా కూడా; ఒక్క వ్రతంబున్= ఒక నియమాన్ని; పూనిన వాఁడన్= కలిగి ఉన్నాను; పుట్టిన+అప్పుడు= పుట్టిన సమయంలో; లేక= లేకుండా; నడుమన్= మధ్యకాలంలో; దైవంబు= దేవుడు; ఇచ్చిన= ఇచ్చినట్టి; పురుషత్వంబున్= మగతనాన్ని; కలిగినవానితోడన్= పొందినట్టివాడితోకూడా; కయ్యంబున్=యుద్ధాన్ని; చేయన్= చేయను; కావున; మీకున్; ఒక్క; ఉపాయంబున్; చెప్పెదన్=చెప్తాను; ద్రుపదు+అపత్యంబు+ఐన= ద్రుపదుని కొడుకై నట్టి; శిఖండి; అట్టివాఁడు; అగుటన్= కావటాన్ని; మీరు= పాండవులు; ఎఱుంగుదురు+అ+కాదు+ఎ?= తెలిసికొన్నవారే కదా!; విశేషించి= మీదు మిక్కిలి;ముందటి పుట్టువునన్= కడచిపోయిన జన్మలో, అంగన+అగుటన్= ఆడుది కాబట్టి; వానికిన్+ ఎదురు+ఏయక+ఉండుదున్= వాడికి ఎదురుగా బాణాలు వేయను; అర్జునుండు; వానిన్= ఆ శిఖండిని; పురస్కరించుకొనివచ్చి= ముందు పెట్టుకొనివచ్చి; ఏన్= నేను; ఏయుటన్= బాణాలు ప్రయోగించడాన్ని;మానిన+ఎడన్= మానుకొన్న వేళలో; నొప్పించి= బాధ కల్గించి; పడన్ వైచునది= నన్ను పడగొట్టవలెను; పదంపడి= అటుపైన; బంధుమిత్రులు+అగు= చుట్టాలు, స్నేహితులు అయినట్టి; ధార్త రాష్ట్రులన్= ధృతరాష్ట్రుడి కొడుకులను; గెలుచుట; సుకరంబు+అగున్= సులభమౌతుంది; ఇది నా పనుపు= నాయొక్క ఉత్తరువు; నేను పనిచిన+అట్లు+అ= నేను ఉత్తరువు చేసిన విధంగానే; చేయుండు; అని+సహృదయంబు+కాన్= మనస్ఫూర్తిగా; చెప్పినన్; అట్లు; దేవవ్రతుచేతన్= భీష్ముడిచేత; అనుజ్ఞాతులు+ఐ= ఆజ్ఞాపించబడినవారై; వారలు= ఆ ధర్మరాజాదులు; ఆతనికి(న్)=ఆ భీష్ముడికి; నమస్కరించి; వీడ్కొని= పోయి వచ్చెదమని చెప్పి; విడిదలకున్= తమ నివాసాలకు; పోవుచున్న సమయంబునన్=వెళ్ళే సమయంలో; బీభత్సుండు= అర్జునుడు.

తాత్పర్యం: నేను ఆయుధం పట్టకుండా ఉండే సమయంలో నన్ను జయించవచ్చును. కవచంలేనివాడిని, ఆయుధం క్రిందపడవేసిన వాడిని, ధ్వజాన్ని క్రిందికి దించినవాడిని, ఆడదాన్ని, పూర్వం ఆడది అయినవాడిని, ఆడదానిపేరుగలవాడిని, తలపాగా ఊడిపోయినవాడిని, అన్నదమ్ములు లేనివాడిని, బిడ్డలు లేనివాడిని - బాణాలతో కొట్టను. ఆయుధాలతో పొడువను. అట్లాంటివారితో యుద్ధం చేయను. మరొక వ్రతం కూడా నాకున్నది. అదేమిటంటే పుట్టినప్పుడు మగతనం లేకుండా మధ్యలో దైవంచేత మగతనం పొందినవాడితో కూడా యుద్ధం చేయను. కాబట్టి మీకో ఉపాయం చెపుతాను. ద్రుపదుడి కొడుకు శిఖండి అట్లాంటి వాడనే సంగతి మీకు కూడా

తెలియునుకదా! పైపెచ్చు - వాడు గడచిన జన్మలో ఆడుది కాబట్టి, వాడిని ముందు పెట్టుకొని అర్జునుడు వచ్చి, నేను బాణాలు వేయడం చాలించినప్పుడు నన్ను బాధించి పడవేయాలి. అటు తరువాత చుట్టపక్కాలైన ధృతరాష్ట్రుడి సంతానాన్ని గెలవటం సులభమౌతుంది. ఇది నా ఉత్తరువు. ఈ విధంగా చేయండి.' అని హృదయపూర్వకంగా భీష్ముడు చెప్పాడు. వెళ్ళటానికి ఆయనచేత ఆజ్ఞాపింపబడ్డవారై నమస్కారంచేసి సెలవు తీసికొని పాండవులు తమ తమ స్థావరాలకు వెళ్ళే సమయంలో అర్జునుడు. (తరువాతి పద్యంతో అన్వయం.)

ఆ. సురనదీసుతుండు పరలోకగతి నిరీ । క్షించుటకును దాను గృతకవృత్తిఁ
జంపవలయుటకును సవిషాదమానసుం । డగుచు నిట్టు లనియె నచ్యుతునకు. 304

ప్రతిపదార్థం: సురనదీసుతుండు= భీష్ముడు; పరలోకగతి= ఇతర(స్వర్గ) లోకానికి వెళ్ళటానికి; నిరీక్షించుటకునున్= ఎదురుచూడటానికి; తాను= అర్జునుడు; కృతకవృత్తిన్= మోసపు విధానంతో; చంపవలయుటకును= చంపవలసి వచ్చినదానికిన్నీ; సవిషాదమానసుండు +అగుచున్= బాధతో కూడిన మనస్సుగలవాడౌతూ; అచ్యుతునకున్= కృష్ణుడికి, ఇట్టులు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: భీష్ముడు స్వర్గానికి వెళ్ళటానికి ఎదురుచూస్తూండటానికి, తాను మోసంగా ఆయనను చంపవలసిందిగా ఏర్పడ్డందుకు, మనస్సులో చాల చింత కలవాడై కృష్ణుడితో అర్జునుడు ఈ విధంగా అన్నాడు.

క. ' గురునిఁ గృతప్రజ్ఞుని ధ । ర్మ రతు వయోవృద్ధ లోకమాన్యు దయాళున్
సురతటినీసుతు వంచనఁ । బురుషోత్తమ! చంపబుద్ధి పుట్టదు నాకున్. 305

ప్రతిపదార్థం: పురుషోత్తమ!= పురుషులలో ఉత్తముడవగు ఓ కృష్ణా!; గురునిన్= శ్రేష్ఠుడిని; (గురువుతో సమానుని) కృతప్రజ్ఞునిన్= గొప్ప బుద్ధి కలవాడిని; ధర్మరతున్= ధర్మమందు+ఆశ గలవాడిని; వయఃవృద్ధున్= వయసుచేత పెద్దవాడిని; లోకమాన్యున్= జనులచేత పూజింపదగ్గవాడిని; దయాళున్= కరుణగలవాడిని; సురతటినీ సుతున్= ఆకాశగంగానది కొడుకైన భీష్ముడిని; వంచనన్= మోసంతో; చంపన్= చంపడానికి; నాకున్= (అర్జునుడగు)నాకు, బుద్ధి పుట్టదు= బుద్ధి పుట్టటంలేదు.

తాత్పర్యం: 'ఓ కృష్ణా! చాలా గొప్పవాడు, మంచి ప్రజ్ఞ గలవాడు, ధర్మాత్ముడు, వయసులో చాలా పెద్దవాడు, జనులచే పూజింపదగ్గవాడు, దయామయుడు, అయినట్టి భీష్ముడిని మోసంతో చంపడానికి నాకు బుద్ధి పుట్టడంలేదు.

ఆ. నన్నుఁ బాంసుకేళి నున్న నర్మిలి నెత్తి । మేనిధూళి దనదు మేను వొరయఁ
బ్రీతిఁ గౌఁగిలించి మా తండ్రి గుణము ల । గ్గించి కన్ననీరు నించునతఁడు. 306

ప్రతిపదార్థం: అతఁడు= ఆ భీష్ముడు; పాంసుకేళిన్= మట్టి ఆటలో; ఉన్నన్= ఉండగా; నన్నున్; ఆర్మిలిన్= ప్రేమతో; ఎత్తి= ఎత్తుకొని; మేనిధూళిన్= నా శరీరం దుమ్ము; తనదు= తన (భీష్ముడి) యొక్క; మేనున్= శరీరాన్ని; ఒరయన్= రాచుకొంటూండగా; ప్రీతిన్= ప్రేమతో; కౌఁగిలించి= ఆలింగనం చేసికొని; మా తండ్రిగుణములు= మా తండ్రియైన పాండురాజు యొక్క గుణాలను; అగ్గించి= పొగడి; కన్ను నీరు నించున్= కన్నులందు నీరు నింపికొనేవాడు.

తాత్పర్యం: ఆ భీష్ముడు నేను మట్టిలో ఆడుకొంటూ ఉంటే, ప్రేమతో నన్ను ఎత్తికొనేవాడు. నా ఒంటిమీది మట్టి ఆతడి శరీరానికి రాచికొంటూండగా కౌగిలించుకొని, మా తండ్రి పాండురాజు గుణాలను పొగడుతూ, కన్నుల నిండా నీరు నింపుకొనేవాడు.

ఉ. అక్కట! తండ్రి లేని మము నమ్మెయిఁ బెంచిన తాత ని మ్మెయిం
ద్రెక్కొనఁగా దతండు సముదీర్ణభుజాబలశౌర్యశాలియై
యిక్కడి సేనఁ జక్కడిచెనేనియుఁ జూతున కాక ధర్మముం
దక్కుట కోర్వఁ జాలుదునె? ధర్మజుతమ్ములు క్రూరకర్ములే?' 307

ప్రతిపదార్థం: అక్కట!= అయ్యో! తండ్రిలేని మమున్= తండ్రిలేనట్టి పాండవులైన మమ్ములను; ఆ+మెయిన్= ఆ విధంగా; పెంచిన= పెద్దచేసినట్టి; తాతన్= తాతగారిని; ఈ+మెయిన్= ఈ విధమైన మోసంతో; త్రెక్కొనన్+కాదు= చంపదగదు; అతండు= ఆ భీష్ముడు; సముదీర్ణ= మిక్కిలి గొప్పదైన; భుజాబల= బాహుబలము; శౌర్య= శూరత్వము - వీటిచే; శాలి+ఐ= ప్రకాశించెడివాడై; ఇక్కడిసేనన్= ఇక్కడ ఉన్నట్టి మన సైన్యాన్ని; చక్కడిచెన్+ఏనియున్= చంపినప్పటికిని; చూతును+అ కాక= చూస్తానేకాని; ధర్మమున్= యుద్ధ ధర్మాన్ని; తక్కుటకున్= విడువటానికి; ఓర్వన్+చాలుదున్+ఎ?= ఓర్చుకోగలుగుదునా?; ధర్మజు తమ్ములు= ధర్మరాజు యొక్క తమ్ములు; క్రూరకర్ములు+ఏ?= క్రూరమైన పనులు చేసేవారా?; కాదనుట.

తాత్పర్యం: అక్కటా! చిన్ననాడే తండ్రిని పోగొట్టుకొన్నట్టి పాండవులను మమ్ములను ఏ విధంగానో చాలా ప్రయాసతో పెంచి పెద్ద చేసినట్టి తాతగారినే ఈ మాదిరి మోసంగా చంపటం ఏ మాత్రం న్యాయంకాదు. ఆ భీష్ముడు తన భుజబలంతో, శౌర్యంతో, ఈ మన సేననంతా బాగా నశింపచేసినప్పటికీ చూస్తూ ఉంటానే కాని, యుద్ధధర్మాన్ని తప్పటానికి మాత్రం నే నొప్పుకొనను. ధర్మాత్ముడని ప్రసిద్ధి కెక్కిన ధర్మరాజు తమ్ములళ్ళమగు మేము, క్రూరపు పనులు చేస్తామా?'

వ. అనిన విని కృష్ణుం డా జిష్ణున కిట్లనియె. 308

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; విని; కృష్ణుండు; ఆ జిష్ణునకున్= ఆ అర్జునుడికి; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అర్జునుడు పై విధంగా చెప్పగా, కృష్ణుడు అర్జునుడితో ఈ విధంగా అన్నాడు.

ఉ. 'క్రూరత కోర్చి యించుకయు రోయక పైకొని యెల్లభంగులన్
వైరులఁ జంపి భూప్రజకు వర్ధనముం గలిగించి పాడిమైఁ
గో రరి గొంచు సద్వ్యయము గోరి యొనర్చుట రాజధర్మవి
స్తారముగా బలారికి వచస్పతి సెప్పట యప్రసిద్ధమే? 309

ప్రతిపదార్థం: క్రూరతకున్= కఠినత్వానికి; ఓర్చి= సహించి; ఇంచుకయున్= కొంచెంకూడా; రోయక= ఏవగించుకొనక; పైకొని= కవిసి; ఎల్లభంగులన్= అన్నివిధాలా; వైరులన్= శత్రువులను; చంపి= వధించి; భూప్రజకున్= భూమిపై ఉండే జనానికి; వర్ధనమున్= అభివృద్ధిని; కలిగించి= కలుగచేసి; పాడిమైన్= న్యాయంగా; కోరు= పంటలో కొంతభాగము; అరిన్= సిస్తుగా; కొంచున్= తీసికొంటూ; సత్+వ్యయమున్= ఉత్తమవ్యయం; కోరి= ఇష్టపడి; ఒనర్చుట= చేయటం; రాజధర్మ విస్తారముగాన్= రాజుల ధర్మం యొక్క అతిశయంగా; బల+అరికిన్= బలుడనే రాక్షసుడికి విరోధియైన ఇంద్రుడికి; వచన్+పతి= బృహస్పతి; చెప్పుట= చెప్పడం; అప్రసిద్ధము+ఏ?= ప్రసిద్ధి చెందినది కాదా?.

తాత్పర్యం: కఠినత్వానికి ఓర్చికొని, కొంచెం కూడా ఏవగింపు లేకుండా, ఎదిరించి ఏ విధంచేతనైనా శత్రువులను చంపాలి. జనానికి అభివృద్ధి కలిగించాలి. న్యాయంగా ప్రజలనుండి పంటలో కొంతభాగము సిస్తుగా వసూలు

చేసికొని, దానితో ప్రజలకు, దేశానికి ఉపయోగపడే మంచి మంచి పనులు చేయాలి. ఇది మంచి రాజుల ధర్మం అని బృహస్పతి (దేవగురువు) దేవేంద్రుడికి చెప్పాడు. అది ప్రసిద్ధమైన విషయమే కదా!

చ. అనిమొన నోర్తు భీష్ము నని యాడిననీదగు పూన్కి లోక మె
ల్లను వినియుండఁగా నిటు చలం బెడలం జన దెట్టు లైనఁ జం
పన తగు రాజధర్మపరిపాలన గా కిది క్రూరకర్మమే?
నిను విధిపంచె శాంతనవునిం దెగటార్పఁగ వేయు నేటికిన్.' 310

ప్రతిపదార్థం: అనిమొనన్= యుద్ధంలో ప్రముఖమైన తావులో; భీష్మున్= భీష్ముడిని; ఓర్తున్+అని= ఓడిస్తానని; ఆడి= చెప్పినట్టి; నీది+అగు పూన్కి= నీ యొక్క పట్టుదల; లోకము ఎల్లనున్; జనులందరు; వినియుండఁగాన్= ఆలకించి ఉండగా; ఇటు= ఈ విధంగా; చలంబు= మాత్సర్యం; ఎడలన్+చనదు= విచ్ఛిన్నం కారాదు; ఎట్టులు+ఐనన్= ఏ విధంచేతనైనా; చంపన+తగున్= చంపడమే తగినది; ఇది= ఈ భీష్ముడిని చంపటం; రాజధర్మ పరిపాలన+కాక= రాజధర్మాన్ని పాలించటం గాక; క్రూరకర్మము+ఏ?= క్రూరమైనపనా?; వేయున్+ఏటికిన్= వెయ్యి మాటలెందుకు?; శాంతనవునిన్= భీష్ముడిని; తెగటార్పఁగన్= చంపటానికి; విధి= దైవము; నినున్; పంచెన్= పంపించాడు.

తాత్పర్యం: ఓ అర్జునా! యుద్ధ మధ్యంలో భీష్ముడిని ఓడిస్తానని నీవన్నమాటలు జనానికంతా బాగా తెలుసు. ఇప్పుడు నీవన్న మాట ఆ పూనికను సడలించివేస్తున్నది. నీవు ఆ మాత్సర్యానికి భంగం కలిగిస్తే జనమంతా నిన్ను ఎగతాళి చేస్తారు. ప్రత్యక్షంగాకాని పరోక్షంగాకాని ఏ విధంగానైనా నీవు భీష్ముడిని చంపవలసినదే. అట్లా చంపడం రాజధర్మమే కాని, క్రూరమైన పని కానే కాదు. ఇంతెందుకు? ఆ విధి యీ భీష్ముడిని చంపడానికే నిన్ను పంపించినది.'

చ. అనుటయుఁ గ్రీడి యిట్టు లను నాద్రుపదాత్మజుజన్మ మాపగా
తనయవధార్థ మం ద్రదియుఁ దప్ప దతండును వాని నేయఁ డే
ను నతని నేయుచందమున నూల్కొని యన్యుల నేయుచుండు వాఁ
డనితరవధ్యకాయుఁ డగు నాయనఁ దాఁ బడ నేయు నుగ్రతన్. 311

ప్రతిపదార్థం: అనుటయున్= కృష్ణ డీ విధంగా చెప్పగా; క్రీడి= అర్జునుడు; ఇట్టులు+అనున్= ఈ విధంగా అన్నాడు; ఆ ద్రుపద+ఆత్మజు జన్మము= ద్రుపదుని కొడుకు ఆ శిఖండియొక్క పుట్టుక; ఆపగాతనయ వధ+అర్థము= భీష్ముని చంపటానికే; అండ్రు= అని అంటారు; అదియున్= ఆ మాట; తప్పదు= పొల్లుకాదు; అతండునున్= ఆ భీష్ముడున్నూ; వానిన్= ఆ శిఖండిని; ఏయఁడు= కొట్టడు; ఏనున్= నేనుకూడా; అతనిన్= ఆభీష్ముడిని; ఏయుచందమునన్= కొట్టే మాదిరిగా, నూల్కొని= కుదురుకొని; అన్యులన్= ఇతరులమీద; ఏయుచు+ఉందున్= బాణాలు ప్రయోగిస్తూ ఉంటాను; వాఁడు= ఆ శిఖండి; అనితర వధ్యకాయుఁడు+అగున్= ఇతరులచే చంప తగని శరీరం కలవాడు అగును; ఆయనన్= ఆతని(భీష్ముడిని); ఉగ్రతన్= భయంకరంగా; తాన్= తాను(శిఖండి); పడన్+ఏయున్= పడగొట్టుతాడు.

తాత్పర్యం: కృష్ణుడన్న మాటలు విని అర్జునుడు ఇట్లా అన్నాడు: 'శిఖండి పుట్టుక భీష్ముడిని చంపటానికే అని అంటారు కదా! ఆ మాట అబద్ధమౌతుందా? ఆ భీష్ముడేమో శిఖండిని బాణాలతో కొట్టడు - నేను భీష్ముడిని కొట్టుతున్నట్లు నటన చేస్తూ ఇతరులను బాణాలతో కొట్టుతాను. శిఖండిని తప్పించి ఇతరులచే చంపబడని ఆ భీష్ముడిని, ఆ శిఖండి భయంకరంగా తానే కూల్చుతాడు.

వ. అనవుడు నవ్వి కవ్వడికిం గమలనాభుం డి ట్లనియె. 312

ప్రతిపదార్థం: అనవుడున్= అని చెప్పగా; కమలనాభుండు= కమలం బొడ్డున గలవాడు - కృష్ణుడు; నవ్వి= ఎగతాళిచేసి; కవ్వడికిన్= అర్జునుడికి; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అర్జునుడన్న మాటలు కృష్ణుడు విని, ఎగతాళిగా నవ్వి అతడితో ఇట్లా అన్నాడు.

ఉ. ' నీ వొకరుండు దక్కఁగ ననింద్య పరాక్రమశాలి భీష్ముని
జావఁగ నేయ నెవ్వఁడును జాలఁడు నీతలఁ పెన్నిభంగులన్
దైవము చూపువోలెఁ దుదిదాఁకునె? యవ్విధ మిట్టు లుండఁగాఁ
ద్రోవఁగ వచ్చునే? యెటులు ద్రోచినఁ బోవదు చూచి యుండుమీ.' 313

ప్రతిపదార్థం: అనింద్య పరాక్రమశాలి= నిందింప తగని పరాక్రమం చేత ప్రకాశించునట్టి; భీష్మునిన్= భీష్ముడిని; చావఁగన్+ఏయన్= చావగొట్టడానికి; నీవు ఒకరుండున్+తక్కఁగన్= నీ వొకడవు తప్పితే; ఎవ్వఁడునున్= మరెవ్వడుగాని; చాలఁడు= సమర్థుడు కాలేడు; ఎన్ని భంగులన్= ఎన్ని విధాలచేతనైనా; నీతలఁపు= నీ యొక్క కోరిక; దైవము చూపు+పోలెన్= విధి దృష్టి విధంగా; తుదిన్+తాఁకునె?= తుదముట్టునా?; ఆ+విధము= భీష్ముడిని చంపే ఆ విధానము; ఇట్టులు= ఈ విధంగా; ఉండఁగాన్; త్రోవఁగన్ వచ్చునే?= ఆ విధానాన్ని త్రోసివేయటానికి సాధ్యమౌతుందా?; ఎటులు+త్రోచినన్= ఎట్లాగైనా త్రోచివైచినా కూడా; పోవదు= నీవు భీష్ముడిని చంపటమనేది తప్పదు; చూచి+ఉండుమీ.

తాత్పర్యం: 'పొగడ్తకెక్కిన పరాక్రమంతో ప్రకాశించే ఆ భీష్ముడిని నీవు తప్ప మరెవ్వరూ చంపలేరు. భీష్ముడిని కొట్టననే నీతలంపు ఎన్నటికి నెరవేరదు. నీవే భీష్ముడిని కూలద్రోస్తావు. నీవు భీష్ముడిని చంపవలసిందిగా దైవ నిర్ణయం ఉండగా ఆ నిర్ణయాన్ని కాదనటానికి నీ తరమా? కాదంటే మాత్రం అది తప్పుతుందా? అంతా నీవే ముమ్మందు చూడగలవులెమ్ము.'

వ. అనిపలికిన వినియతండట్లు కాకయప్పటికి నెట్లయిన నట్లయ్యెడు నని యర్జునుం డియ్యకొనిన గోవిందుండును, ధర్మనందనాదులుం బ్రమోదంబు నొంది రివ్విధంబున శిబిరంబున కరిగి పాండవులు పుండరీకాక్షుని నిజ నివాసంబున కనిచి తమ తమ నికేతనములకుం జని యా రాత్రి సుఖనిద్ర సేసి' రని చెప్పిన సంజయునకు ధృతరా ష్ట్రుం డి ట్లనియె. 314

ప్రతిపదార్థం: అని పలికినన్= అని చెప్పగా; విని; అతండు= ఆ అర్జునుడు; అట్లు+అ+కాక= ఆ విధంగానే అగుగాక; అప్పటికిన్= ఆ సమయానికి; ఎట్లు+అయినన్= ఎట్లాగయితే; అట్లు+అయ్యెడున్= అట్లా అవుతుంది; అని; అర్జునుండు; ఇయ్యకొనినన్= ఒప్పుకోగా; గోవిందుండును= కృష్ణుడునూ; ధర్మనందన+ఆదులున్= ధర్మరాజు మొదలుగా గల పాండవులు; ప్రమోదంబున్= సంతోషాన్ని; ఒందిరి= పొందారు; ఈ+విధంబుననన్= ఈ మాదిరిగా; శిబిరంబునకున్= గుడారానికి; అరిగి= వెళ్ళి; పాండవులు; పుండరీక+అక్షుని(న్)= కృష్ణుని; నిజనివాసంబునకు(న్)= అతడుండే చోటికి; అనిచి= పంపి; తమ తమ నికేతనములకున్= వారి వారి భవనాలకు; చని; ఆ రాత్రి; సుఖ నిద్ర+చేసిరి; అని చెప్పిన= అని చెప్పగా; ధృతరాష్ట్రుండు; సంజయునకున్; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు:

తాత్పర్యం: కృష్ణుడు పై విధంగా అనగా, ఆ మాటలు విని, అర్జునుడు 'అటులే కానిమ్ము. కానున్నది కాకమానదు.' అని ఒప్పుకొన్నాడు. దానితో గోవిందుడు, పాండవులు సంతోషపడ్డారు. అందరూ గుడారానికి వెళ్ళారు. పాండవులు కృష్ణుడిని ఆయన నివాసానికి పంపి, వారి వారి భవనాలకు చేరుకొన్నారు. అర్జునుడు భీష్ముడిని చంపడానికి

ఒప్పుకొన్నాడు కాబట్టి, అందరూ ఆ రాత్రి బాగా నిద్రపోయారు.' అని సంజయుడు చెప్పాడు. అది విని, ధృతరాష్ట్రుడు సంజయుడితో ఇట్లా అన్నాడు:

క. పాండుసుతు లేమిభంగి శి । ఖండిం గూర్చికొని యాపగాసుతుపై ను
ద్దండగతి నడచి రెట్లు? ప్ర । చండతతో సమరకేలి సలిపిరి? చెపుమా.' 315

ప్రతిపదార్థం: పాండుసుతులు= పాండురాజు కుమారులు ధర్మరాజాదులు; శిఖండిన్; ఏమిభంగిన్= ఏ విధంగా; కూర్చికొని= కూడగట్టుకొని; ఆపగాసుతుపైన్= భీష్ముడి మీదికి; ఉద్దండగతిన్= ఎక్కువైన పోకడతో; నడచిరి?; ప్రచండతతోన్= సాధ్యంకాని విధంగా; ఎట్లు= ఏ మాదిరి; సమరకేళిన్= యుద్ధ క్రీడను; సలిపిరి?= చేశారు?; చెపుమా= ఓ సంజయా! తెలుపుము.

తాత్పర్యం: సంజయా! పాండవులేవిధంగా శిఖండిని తమతో చేర్చికొన్నారో, వేగంతో కూడిన గమనంతో భీష్ముడి మీదికి ఏ విధంగా వచ్చారో, ఏ విధంగా అసాధ్యమైన రీతిలో యుద్ధం చేశారో బాగా చెప్పుము.'

భీష్ముని దశమ దివసయుద్ధానుక్రమము (సం. 6-104-2)

వ. అనుటయు నా సూతనందనుం డతని కిట్లను సూర్యోదయ సమయంబునఁ బాండుసూనులు సేనా సమేతులై వెడలి మోహరించునప్పుడు ముందట శిఖండిని నిలిపి యతనికెలంకుల భీమార్జునులును, వెనుక నభిమన్యు ద్రౌపదేయులును వారియిరువంకలం జేకితాన శైనేయులును, నట పిఱుంద ధృష్టద్యుమ్నాది పాంచాల కుమారుల మున్నిడుకొని కవల నుభయపార్శ్వంబులం బెట్టికొని, యుధిష్ఠిరుండును వీరి సూరెలం బొదివికొని విరాటద్రుపదముఖ్యులగు పృథ్వీపతులును గేకయపంచక ధృష్టకేతులును నిలిచి రిత్తెఱంగున గట్టి మోహరంబు దీర్చుకొని నడచి రంతకు మున్న మనవారును వెడలి భీష్ముం డగ్ర భాగంబున నుల్లసిల్ల నీ కుమారు లమ్మహోత్ముం బరివేష్టింపఁ గుంభసంభవతత్సంభవులుం దక్షిణవామభాగంబులను, గృపకృతవర్మ భగదత్తపురస్సరుండై కురురాజు మధ్యభాగంబునను, బృహద్బల కాంభోజ ముఖ్యు లైన మహీపతు లమ్మనుజేంద్రు చుట్టును, ద్రిగర్తు లపరభాగంబునను, బన్ని బలుమొన యమర్చి కొని త్రోచి నడచి రి ట్లిరువాఁగునుం గవిసి వివిధతూర్యస్వనంబులు నింగిముట్ట నొండొంటిం దాఁకిన. 316

ప్రతిపదార్థం: అనుటయున్= అని అడగ్గా; ఆ సూతనందనుండు= సంజయుడు; అతనికిన్= ఆ ధృతరాష్ట్రుడికి; ఇట్లు+అనున్; సూర్య+ఉదయ సమయంబునన్= సూర్యుడు ఉదయించే సమయంలో; పాండు సూనులు= పాండురాజు కొడుకులు; సేనా+సమేతులు+ఐ= సేనలతో కూడినవారై; వెడలి= బయలుదేరి; మోహరించు+అప్పుడు= వ్యూహం పన్నేటప్పుడు; ముందటన్= ముందు భాగంలో; శిఖండిన్= శిఖండిని; నిలిపి; అతని కెలంకులన్= ఆ శిఖండి ప్రక్కలందు; భీమ+అర్జునులున్నూ; వెనుకన్; అభిమన్యు ద్రౌపదేయులును; వారి+ఇరువంకలన్= వారికి రెండువైపుల; చేకితాన శైనేయులునున్= చేకితానుడు, సాత్యకి; అట పిఱుందన్= ఆ వెనుక; ధృష్టద్యుమ్న+ఆది పాంచాలకుమారులన్= ధృష్టద్యుమ్నుడు మొదలైన పాంచాలకుమారులను; మున్ను+ఇడుకొని= ముందుంచికొని; కవలన్= నకుల సహదేవులను; ఉభయ పార్శ్వంబులన్= రెండువైపులా; పెట్టికొని= ఉంచికొని; యుధిష్ఠిరుండునున్= ధర్మరాజున్నూ; వీరి సూరెలన్= వీరికి ప్రక్క భాగములందు; పొదివికొని= క్రమ్ముకొని; విరాట ద్రుపద ముఖ్యులు+అగు= విరాటుడు, ద్రుపదుడు, ముఖ్యులుగా గల; పృథ్వీపతులును= రాజులున్నూ; కేకయ పంచక ధృష్టకేతులును= కేకయ దేశీయులగు అయిదుగురు, ధృష్టకేతువున్నూ; నిలిచిరి= నిలబడ్డారు; ఈ+తెఱంగునన్= ఈ మాదిరిగా; గట్టి మోహరంబున్= దృఢమైన వ్యూహాన్ని; తీర్చుకొని= ఏర్పాటు చేసికొని; నడచిరి; అంతకున్మున్ను+అ= దానికి ముందుగానే; మనవారును= మన కౌరవులుకూడా; వెడలి= బయలుదేరి; భీష్ముండు; అగ్రభాగంబునన్= ముందుప్రక్క; ఉల్లసిల్లన్= ప్రకాశిస్తూండగా; నీ

కుమారులు= కౌరవులు; ఆ+మహాత్మున్= ఆ పూజ్యుని; పరివేష్టింపన్= చుట్టియుండగా; కుంభసంభవ తద్+సంభవులున్= ద్రోణుడు అతడి కుమారుడు అశ్వత్థామయు; దక్షిణ వామభాగంబులనున్= కుడి యెడమలందును; కృపకృతవర్మ భగదత్త పురస్సరుండు+ఐ= కృపుడు, కృతవర్మ, భగదత్తుడు ముందు భాగంలో కలవాడై; కురురాజు= దుర్యోధనుడు; మధ్యభాగంబునన్= నడిమి భాగంలో; బృహద్బల కాంభోజ ముఖ్యులు+ఐన= బృహద్బలుడు, కాంభోజరాజు ప్రధానులుగా గల; మహీపతులు= రాజులు; ఆ+మనుజేంద్రు చుట్టునున్= ఆ దుర్యోధనుడి చుట్టున్నా; త్రిగర్తులు= త్రిగర్త దేశపు వీరులు; అపరభాగంబునను(న్)= వెనుకవైపునందు; పన్ని= యుద్ధానికి సిద్ధపడి; బలుమొన అమర్చికొని= బలమైన వ్యూహాన్ని ఏర్పాటు చేసికొని; త్రోచి; నడచిరి= ముందుకు సాగారు; ఇట్లు= ఈ విధంగా; ఇరువాఁగునున్= రెండు సేనలున్నూ; కవిసి; వివిధ తూర్యస్వనంబులు= నానా విధాలైన వాద్యాల చప్పుళ్ళు, నింగిముట్టన్= ఆకాశాన్నంటగా, ఒండొంటిన్= ఒకసేన మరొక సేనను; తాఁకినన్= ఎదుర్కొనగా;

తాత్పర్యం: పాండవులు భీష్ముడితో యుద్ధం చేసిన రీతిని గూర్చి ధృతరాష్ట్ర డడుగగా సంజయు డిట్లా బదులు చెప్పాడు. 'సూర్యోదయం కావటంతోనే పాండవులు తమ తమ సేనలతోపాటు యుద్ధరంగానికి వెళ్ళి మోహరించేటప్పుడు శిఖండిని ముందు నిలిపారు. ఆతడికి రెండు ప్రక్కల - భీమార్జునులు, వెనుకప్రక్క- అభిమన్యుడు, ద్రౌపది కొమాళ్ళున్నా, వారికి రెండువైపుల - చేకితానుడు, సాత్యకియూ నిలిచారు. వారికి వెనుకవైపు ధర్మరాజు, ధృష్టద్యుమ్నుడాదిగా గల పాంచాల కుమారులను ముందు ఉంచికొని, నకుల సహదేవులను ఇరు ప్రక్కల పెట్టుకొన్నాడు. వీరికి ప్రక్క భాగాలలో క్రమ్ముకొని విరాటుడు, ద్రుపదుడు ప్రధానులుగా ఉండే రాజులున్నా, కేకయపంచకం, ధృష్టకేతువు నిలిచారు. ఈ మాదిరి గట్టి మోహరాన్ని ఏర్పాటుచేసికొని పాండవులు యుద్ధానికి సిద్ధమయ్యారు. అంతకుముందే కౌరవులు కూడా యుద్ధ రంగానికి వెళ్ళారు. భీష్ముడు అగ్రభాగంలో ఉండగా, నీ కొడుకులు కౌరవులు అతని చుట్టూ చేరారు. ద్రోణుడు, అశ్వత్థామ కుడి ఎడమ భాగాల్లోను, దుర్యోధనుడు కృపుడు, కృతవర్మ - వీరుముందు నిలబడగా తాను మధ్యభాగంలో నిలిచాడు. బృహద్బలుడు, కాంభోజుడు ముఖ్యులుగా గల రాజులు ఆ దుర్యోధనుడి చుట్టూ నిలిచారు. త్రిగర్తులు వెనుకవైపు నిలిచి, బలిష్ఠమైన సేనను ఏర్పాటుచేసికొని, ముందుకు నడిచారు. ఈ విధంగా రెండు పక్షాలవారూ కవియగా, నానా విధాలైన వాద్యాల శబ్దాలు ఆకాశాన్ని అంటుతూండగా ఒకరినొకరు డీకొన్నారు.

క. సమరం బప్పుడు దనుజులు। నమరులునుం బెనఁగుచందమై తోఁపఁగ భూ
రమణ! వినుమేమిసెప్పుదు?। జముపురమున నగ్గలంపుసందడి యయ్యెన్. **317**

ప్రతిపదార్థం: భూరమణ!= భూమికి భర్తైన ధృతరాష్ట్ర మహారాజా; వినుము= ఆలకింపుము; ఏమి చెప్పుదున్?= ఏమి చెప్పగలను; అప్పుడు= ఆ సమయంలో; సమరంబు= కౌరవపాండవయుద్ధం; దనుజులును= రాక్షసులున్నూ; అమరులునున్= దేవతలున్నూ; పెనఁగు చందము+ఐ= యుద్ధం చేసే మాదిరిగా; తోఁపగన్= తోపింపచేయగా; జముపురమునన్= యమధర్మరాజు పట్టణంలో; అగ్గలము+సందడి= అధికమైన జనాల తోపిడి; అయ్యెన్= అయింది.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! వినుము. కౌరవపాండవుల యుద్ధం దేవదానవయుద్ధంవలె కన్పించింది. అప్పుడు, యమధర్మరాజుపట్టణంలో జనాల తోపిడి ఎక్కువయింది.

వ. అట్టియెడ. **318**

ప్రతిపదార్థం: అట్టి= అట్లాంటి, ఎడన్= సమయంలో.

తాత్పర్యం: అట్లా కౌరవపాండవులు యుద్ధం చేసే సమయంలో.

మ. కవ లుద్దామపరాక్రమస్ఫురణమైఁ గౌరవ్యసైన్యంబు సి
క్కువడంజేయఁగ భీమపార్థులును గోకొమ్మంచు నొక్కుమ్మడిం
గవియం బాండవసేన యుబ్బి యడరంగాఁ జూచి కల్పాంతభై
రవభీమాకృతి నేచి భీష్ముఁడు శరవ్రాతంబు గుప్పించినన్. 319

ప్రతిపదార్థం: కవలు= నకుల సహదేవులు; ఉద్దామ= గొప్ప; పరాక్రమ స్ఫురణమైన్= పరాక్రమం తోచుటచేత; కౌరవ్య సైన్యంబు= కౌరవులసేనను; చిక్కు+పడన్+చేయఁగన్= చిక్కులో పడేటట్లు చేయగా; భీమపార్థులునున్= భీముడు, అర్జునుడున్నూ; కో కొమ్ము+అంచున్= 'కో' అనే ధ్వనిని అనుకరిస్తూ; ఒక్క+ఉమ్మడిన్= ఒకేసారిగా; కవియన్; పాండవసేన= పాండవుల సైన్యం; ఉబ్బి= పొంగి; అడరంగాన్= విజృంభించగా; భీష్ముడు; చూచి; కల్ప+అంత= ప్రళయకాలంలోని; భైరవ= రుద్రుడివలె; భీమ+ఆకృతిన్= భయంకరమైన ఆకారంతో; ఏచి= విజృంభించి; శరవ్రాతంబున్= బాణాలసమూహాన్ని; గుప్పించినన్= ప్రయోగించగా.

తాత్పర్యం: నకుల సహదేవులు హద్దుమీరిన పరాక్రమం గలవారై, అప్పటికప్పటికి తోచే విధంగా యుద్ధం చేసి కౌరవసేనను ఇరకాటంలో పెట్టారు. అదే సమయంలో భీముడు, అర్జునుడు 'కో' అని అరచుచూ ఒకేసారిగా కౌరవుల సేన మీదకు ఎగబడ్డారు. దీన్ని చూచి, పాండవసేన ఉత్సాహంతో పొంగి, కురుసేన మీదకు విజృంభించింది. ఇంతలో భీష్ముడు ఈ పరిస్థితిని చూచి, ప్రళయకాలంలో రుద్రుడివలె భయానకమైన ఆకారంతో బాణాల మొత్తాన్ని వారిపైన కుప్పలు తెప్పలుగా పడవైచాడు.

ఆ. కాలుకాలు పెనఁగి కాలుబలంబులు। నొడ్డగెడవుగా రథోత్కరంబు
మ్రొగ్గతిలఁగ గుఱ్ఱములు నేల యద్రువ మా। తంగఘటలు గూలెఁ దత్క్షణంబ. 320

ప్రతిపదార్థం: తద్+క్షణంబు+అ= యుద్ధం చేసే ఆ సమయంలోనే; కాలుబలంబులు= పదాతిసేన; కాలుకాలు పెనఁగి= ఒకడి కాలితో మరొకడి కాలు పెనవైచికొని; రథ+ఉత్కరంబు= రథాల సమూహము; ఒడ్డగెడవు కాన్= ఒక ప్రక్క కిందికి ఒరిగి మరొక ప్రక్క పైకి లేచి; గుఱ్ఱములు; మ్రొగ్గతిలఁగన్= పెడమొగంపెట్టినవై; మాతంగ ఘటలు= ఏనుగుల గుంపులు; నేల= భూమి; అద్రువన్= అదిరిపోయేటట్లుగా; కూలెన్= కూలిపోయాయి.

తాత్పర్యం: భయంకరంగా యుద్ధం జరిగే ఆ సమయంలో కాలిబంట్లు ఒకరి కాళ్ళు మరొకరి కాళ్ళతో పెనవేసుకొని, రథాలు పైచ్చుతగ్గులుగా ఒరిగి, గుర్రాలు పెడమొగం పెట్టికొని, ఏనుగు గుంపులు నేల అదరిపోయేటట్లుగా కింద పడ్డాయి.

క. కనుఁగొని శిఖండి వెస మా। ర్కొని భీష్ముని నేసె మూఁడు క్రూరాస్త్రములం
గని యతఁడు మరల చూడ క। తని నుద్దేశించి పలికె దరహాసముతోన్. 321

ప్రతిపదార్థం: శిఖండి; భీష్మునిన్= భీష్మాచార్యుడిని; కనుఁగొని= చూచి; వెసన్= వేగంగా; మార్కొని= ఎదిరించి; మూఁడు= మూడైన; క్రూర+అస్త్రములన్= గట్టి బాణాలతో; ఏసెన్= కొట్టాడు; అతఁడు= ఆ భీష్ముడు; కని= చూచి; మరలచూడక= తిరిగిచూడకుండా; అతనిన్= ఆ శిఖండిని; ఉద్దేశించి; దరహాసముతోన్= చిరునవ్వుతో; పలికెన్= పలికాడు.

తాత్పర్యం: శిఖండి భీష్ముడిని గుర్తు పట్టి, వెంటనే ఎదిరించి, మూడుబాణాలతో అతడిని కొట్టాడు. భీష్ముడు శిఖండిని ఒక్కసారి చూచి, మరలా వాడి ముఖం చూడకుండా అతడిని ఉద్దేశించి చిరునవ్వుతో ఇట్లా అన్నాడు:

ఉ. ' ఎవ్వత నేని ధాత సృజియించెఁ దగన్ మగవానిఁ గాఁగ నా
కొవ్వమిఁ జేసి యట్టి నిను నుగ్మలి నేయఁగ నొల్ల నాపయిం
గ్రొవ్వెసలార నీవు శరకోటి వెసం బరగించితేని నే
నవ్వుదుఁ గాని కోపము మనంబునఁ బుట్టదు సూ శిఖండినీ!' 322

ప్రతిపదార్థం: శిఖండినీ!= ఓ శిఖండినీ!; ఎవ్వతన్+ఏనిన్= ఏ ఆడదాన్నయితే; ధాత= బ్రహ్మదేవుడు; తగన్= ఒప్పిదంగా; మగవానిన్+కాఁగన్= మగవాడుగా; సృజియించెన్= సృష్టిచేశాడో; నాకున్= భీష్ముడనైన నాకు; ఒవ్వమిన్+చేసి= గిట్టనికారణంగా; అట్టి= ఆలాంటి; ఉగ్మలిన్ నినున్= ఆడుదైన నిన్ను; ఏయఁగన్ ఒల్లన్= కొట్టడానికి ఇష్టపడను; నీవు= శిఖండివైన నీవు; క్రొవ్వు+ఎసలారన్= మదము హెచ్చగా; శరకోటిన్= బాణాలకోట్లను; వెసన్= వేగంతో; పరఁగించితి+(వి)+ఏనిన్= ప్రయోగించినప్పటికి; ఏన్= ఏను; నవ్వుదున్+కాని= నవ్వుతూ ఉంటానేగాని; మనంబునన్= నా మనస్సులో; కోపము= క్రోధము; పుట్టదుసూ= కలుగదు సుమా!

తాత్పర్యం: ఓ శిఖండినీ! నీవు ద్రుపదమహారాజుకు కూతురుగా పుట్టావు. పిదప బ్రహ్మదేవుడు నిన్ను మగవాడుగా సృష్టి చేశాడు. అట్లాంటి ఆడుదియైన నీ మీద బాణాలు వేయడం నాకు ఇష్టంకాదు. కాబట్టి నీవు నీకు గల మదం కొద్దీ నా మీద ఎన్ని బాణాలు వేసినా సరే - నేను నవ్వుతూ ఊరక ఉంటానే గాని, నా మనస్సులో నీ మీద కోపం పుట్టదు సుమా!

విశేషం: శిఖండిని - ద్రుపదరాజు కూతురు. 'కన్యా శిఖండినీ జాతా, పురుషో వై నివేదితః (సం. మహాభారతం). యక్షుని మగతనాన్ని ఆ శిఖండిని గ్రహించటంచేత 'శిఖండి' అని ప్రసిద్ధి చెందినది.

వ. అనినం గోపించి శిఖండియు నతని కిట్లనియె. 323

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; శిఖండియున్= శిఖండికూడా; కోపించి= కోపం చెంది; అతనికిన్= భీష్ముడితో; ఇట్లు+అనియె(న్)= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: భీష్ముడు పై విధంగా చెప్పగా, శిఖండి కోపగించినవాడై అతనితో ఇట్లా అన్నాడు.

క. ' గెలిచితి రాజుల నెల్లను । బలియుండగు పరశురాముప్రతివీరుఁడవై
యలవుకలిమి నెఱపిన । నీ చలము బలము నాకుఁ జూపఁ జాలవు కంటే? 324

ప్రతిపదార్థం: రాజులన్= రాచవారిని; ఎల్లను= అందరినీ; గెలిచితివి= గెలిచావు; బలియుండు+అగు= బలవంతుడైనట్టి; పరశురాము ప్రతివీరుఁడవు+ఐ= పరశురాముడికి సమానుడైన వీరుడుగా అయి; అలవు+కలిమిన్= బలముయొక్క అతిశయాన్ని; నెఱపిన= వ్యాపింపజేసిన; నీ చలము= నీ యొక్క మాత్సర్యాన్ని; బలము= బలాన్ని; నాకున్= శిఖండినైన నాకు; చూపన్+చాలవు= చూపలేకున్నావు; కంటే?= చూచావా!

తాత్పర్యం: 'ఓ భీష్మా! నీవు రాజుల నందరినీ గెలిచావు. మహాబలపరాక్రమం గల పరశురాముడికి సమ ఉజ్జి అయినవాడివి. నీ బలాతిశయాన్ని లోకంలో బాగా విస్తరింపజేశావు, అట్టి నీవు నీబలం, చలం నాకు చూపలేకున్నావు కదా!

క. ఏయు మొకనేర్పుమై ని । ట్లేయక క్రీడించి యరుగు మెట్లయినను మ
త్సాయకముల నినుఁ గూల్చెదఁ । జూ యెవ్వత నైతి నేమి సూచెదు? నన్నున్. 325

ప్రతిపదార్థం: ఒక నేర్పుమైన్= ఏ కొద్ది నేర్పుతోనైనా; ఏయుము= బాణాలతో కొట్టుము; ఇట్లు= ఈ విధంగా; ఏయక= బాణాలు ప్రయోగించక; క్రేడించి= తొలగి; అరుగుము= వెళ్ళు; ఎట్లు+అయిననున్= ఏ విధంచేతనైనా; మత్+సాయకములన్= నా బాణాలతో; నినున్= నిన్ను; కూల్చెదన్= చంపుతాను; చూ= సుమా!; ఎవ్వతన్+ఐతిన్= నేనెవరైతే నేమి?; నన్నున్= నన్ను; ఏమి చూచెదు?= ఏమి చూస్తావు?

తాత్పర్యం: ఓ భీష్మా! నీలో ఏ కొద్ది నేర్పున్నా నా పైన బాణాలు ప్రయోగించు. చేతకాకపోతే బాణాలు ప్రయోగించకుండా అవతలికి వెళ్ళిపొమ్ము. నీవు నిలిచి బాణాలు వేసినా, తొలగిపోయినా - ఎట్లయినా సరే నేను బాణాలు వేసి నిన్ను చంపుతాను. నేను ఆడదాననైతేనేమి? మగవాడనైతేనేమి? నన్నేం చూస్తావు?

క. నేఁ డెమ్మెయి నైనను నీ । పోఁడిమిఁ సెడఁ దోన తవిలి పాదువుదు నిన్నున్
వాఁడిమగఁ డనుట యుడుపుదు । వేఁడిమి సాం పెసఁగ నస్త్రవిద్య మెఱయుదున్. 326

ప్రతిపదార్థం: నేఁడు= ఈనాడు; ఏ+మెయిన్+అయిననున్= ఏ విధంగానైనా సరే; నీ పోఁడిమి= నీ యొక్క ఒప్పిదము; చెడన్= చెడిపోయేట్లుగా; తోనన్ తవిలి= వెంబడి తగులుకొని; నిన్నున్ నిన్ను; పాదువుదున్= క్రమ్ముకొంటాను; వాఁడి మగఁడు+అనుటన్= చురుకుతనం గల మగవా డనే ప్రసిద్ధిని; ఉడుపుదున్= పోగొట్టుతాను; అస్త్రవిద్యకున్= ఆయుధాల విద్యలో; వేఁడిమి సాంపు= తీక్ష్ణతయొక్క ఆధిక్యం; ఎసఁగన్= అతిశయించగా; మెఱయుదున్= ప్రకాశిస్తాను.

తాత్పర్యం: ఓ భీష్మాచార్యా! ఈ దినం ఏవిధంగానైనా, నీ వాక్యం చెడిపోయేటట్లుగా నీ వెంబడిపడి నిన్ను క్రమ్ముతాను. చురుకుదనం గల మగవాడివనే ప్రసిద్ధిని రూపుమాపుతాను. ఆయుధాలు ప్రయోగించే విద్యలో నాకున్న నిశితత్వం ప్రదర్శిస్తాను.'

వ. అనుచు మఱియు నైదమ్ము లేసె నప్పలుకులు విని ఫల్గునుం డాత్మగతంబున నేఁడు శిఖండి చందంబు వింత యయియున్న యది. నదీనందనుండు సమయుటకు సమయం బైన దైవదత్తోత్సాహంబున నేఁచి పలికెం గావలయు'నని యూహించి యుపోద్బలంబుగా నతని కిట్లనియె. 327

ప్రతిపదార్థం: అనుచున్= అని చెప్పుచు; మఱియున్= ఇంకాకూడా; ఐదు+అమ్ములు= ఐదు బాణాలను; ఏసెన్= ప్రయోగించాడు; ఫల్గునుండు= అర్జునుడు; ఆ+పలుకులు= ఆ మాటలు; విని; నేఁడు= ఈనాడు;శిఖండి చందంబు= శిఖండియొక్క విధము; వింత+అయి= ఆశ్చర్యమై; ఉన్న+అది; నదీనందనుండు= భీష్ముడు; సమయుటకున్= చావడానికి; సమయంబు+ఐనన్= సమయంకాగా; దైవదత్త+ఉత్సాహంబునన్= విధిచే ఈయబడ్డ ఉత్సాహంబుతో; ఏచి= విజృంభించి; పలికెన్+కావలయున్+అని= పలికాడు కాబోలు అని; ఆత్మగతంబునన్= తనలో; ఊహించి; ఉప+ఉద్బలంబు+కాన్= ప్రోత్సాహం కలిగేట్టుగా; అతనికిన్= ఆ శిఖండికి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అని ఈ విధంగా శిఖండి భీష్ముడిని తూలనాడుతూ మరల ఐదు బాణాలతో అతడిని కొట్టాడు. అప్పుడు వాడాడిన మాటలు అర్జునుడు విని, 'ఓహో! నేడు వీడి విధానం వింతగా కన్పిస్తున్నది. భీష్ముడు చావటానికి సమయం ఆసన్నమైంది కాబట్టే, దైవ ప్రేరణచేత ఉత్సాహం కలిగి విజృంభించి పలికాడు, కాబోలు' అని తన మనస్సులో ఊహించి వాడి ఉత్సాహాన్ని హెచ్చుచేసేట్లుగా ఇట్లా అన్నాడు:

అర్జునుఁడు శిఖండికిఁ బ్రోత్సాహంబు గలిగించి భీష్ముపైఁ గవియించుట (సం. 6-104-51)

ఆ. ' ఇట్టు లాడి పిదప నేమియుఁ జేయంగఁ । జాలకున్న మనల జగము నవ్వు
నేను గలుగ నిన్ను నెవ్వరి కేమియుఁ । జేయరాదు భీష్ము నేయు మడరి.' 328

ప్రతిపదార్థం: ఇట్టులు= ఈ మాదిరి; ఆడి= మాటలాడి; పిదపన్= అటుపైన; ఏమియున్= ఏమీకూడా; చేయంగన్+చాలక= చేయలేక; ఉన్నన్= ఉన్నట్టయితే; మనలన్= మనలను; జగము= లోకము; నవ్వన్= నవ్వుతుంది; ఏనున్= అర్జునుడనగు నేను; కలుగన్= ఉండగా; నిన్నున్; ఎవ్వరికిన్= ఎవరికిగాని; ఏమియున్+చేయరాదు= ఏమీ చేయడానికి సాధ్యంకాదు; అడరి= విజృంభించి; భీష్మున్+ఏయుము= భీష్ముడిని బాణాలతో కొట్టుము.

తాత్పర్యం: 'ఓ శిఖండీ! ఈ విధంగా బీరాలు పలికి అటుపై బలంగా యుద్ధం చేయకుండా ఊరకుంటే, మనలను చూచి జనం నవ్వుతారు. నేను నీకు అండగా ఉండగా నీ కేమి భయం? ఎవ్వరూ నిన్నేమీ చేయలేరు. విజృంభించి భీష్ముడితో తలపడు'మని అర్జునుడు అన్నాడు.

వ. అనియె నప్పుడు గాంగేయుండు దొలంగి పాంచాలబలంబులపైఁ దఱిమినం దెఱపి గని పాండవబలంబులు గాండీవి మున్నగాఁ గవిసినం గౌరవసేన దెరలి మరలినం జూచి కురురాజు సురనదీసూనుతోడ 'నీవు గలుగ మన సైన్యంబు ధైన్యంబు నొంద నగునే?' యనవుడు రారాజుతో నతండు. 329

ప్రతిపదార్థం: అనియెన్= అన్నాడు; అప్పుడు; గాంగేయుండున్; తొలంగి; పాంచాల బలంబులపైన్= పాంచాల రాజు సేనలపైకి; తఱిమినన్= కవియగా; పాండవ బలంబులు= పాండవుల సేనలు; తెఱపిన్+కని= సందుచూచికొని; గాండీవిమున్ను+కాన్= అర్జునుడు ముందు నిలబడగా; కవిసినన్; కౌరవసేన; తెరలి= తొలగి; మరలినన్= వెనుకకు మళ్ళగా; కురురాజు= దుర్యోధనుడు; సురనదీసూనుతోడన్= భీష్ముడితో; నీవు+కలుగన్= నీవు ఉండగా; మన సైన్యంబు= మనయొక్క సేన; ధైన్యంబున్= హీనమైన దశను; పొందన్+అగున్+ఏ?= చెంద తగునా?; అనవుడున్= అని చెప్పగా; అతండు= ఆ భీష్ముడు; రారాజుతోన్= దుర్యోధనుడితో.

తాత్పర్యం: పై విధంగా అర్జునుడు శిఖండితో చెప్పిన సమయంలో, భీష్ముడు తొలగిపోయి పాంచాలరాజు సేనల మీద పడ్డాడు. ఆ సందు చూచికొని పాండవబలాలు, గాండీవి ముందు నిలబడగా శత్రు సైన్యం మీదికి కవిశాయి. అప్పుడు కౌరవుల బలం భయంతో ఒదిగి ఒదిగి, వెనుకకు మళ్ళింది. దుర్యోధనుడు చూచి, 'నీవు ఉండగానే మన సేనలకు ఇంత దుఃస్థితి పట్టటమా? అని భీష్ముడితో అన్నాడు. దానికి భీష్ముడు దుర్యోధనుడికి ఈ విధంగా బదులు చెప్పాడు.

విశేషం: భీష్ముడు తాను ఋణం తీర్చుకొన్నానని, పాండవు లజేయులని దుర్యోధనుడితో అంటాడు.

క. ' మును పదివేవురఁ జంపుదు । ననియిచ్చినబాసవచ్చె నవనీశ్వర! నీ
మనిచినఋణంబు దీర్చితి । విను లా విటమీఁదఁ దఱుఁగువిధమై తోఁచెన్. 330

ప్రతిపదార్థం: అవనీశ్వర!= ప్రభువగు దుర్యోధనా! పదివేవురన్= పదివేల మందిని; చంపుదున్+అని= చంపుతానని; మును= ముందు; ఇచ్చిన= ఒసగిన; బాస= ప్రతిజ్ఞ; వచ్చెన్= పూర్తి అయింది; నీ మనిచిన ఋణంబు= నీవు పోషించడంచేతనైన అప్పును; తీర్చితిన్; తీర్చివేశాను; వినుము= వినుము; ఇటమీఁదన్= ఇకమీదట; లావు= బలము; తఱుఁగు విధము+ఐ= తగ్గిపోయే మాదిరిగా; తోఁచెన్= అనిపిస్తోంది.

తాత్పర్యం: 'ఓ దుర్యోధనా! మునుపు పదివేల యోధులను చంపుతానని నేను చేసిన ప్రతిజ్ఞ పూర్తయింది. నీవు ఇన్నాళ్ళు నన్ను పోషించావు. ఆ ఋణం తీర్చికొన్నాను. అయ్యా, వినుమా! ఇక నా బలం తగ్గిపోతూన్నట్లుగా అనిపిస్తున్నది.

ఆ. నేఁటిభంగి సూడ నృపవర । పాండవు లొండె నన్ను, వారి నొండె నేను
సమయఁజేత గలుగు సమసెదరే? యొక । మర్ముచేత వా రమర్త్యబలులు. 331

ప్రతిపదార్థం: నృపవర!= రాజులలో గొప్పవాడైన దుర్యోధనా!; నేఁటిభంగిన్= ఈ నాటి విధానాన్ని; చూడన్= చూడగా; పాండవులు; నన్ను ఒండెన్= నన్నుగాని; నేను; వారిన్ఒండెన్= వాళ్ళను గాని; సమయన్+చేత= చంపటం; కలుగున్= జరుగుతుంది; అమర్త్యబలులు= చావులేని దేవతల బలంవంటి బలంగలవారైన; వారు= ఆ పాండవులు; ఒక మర్త్యచేతన్= ఒక మానవుడిచేత; సమసెదరు+ఏ?= చస్తారా?

తాత్పర్యం: ఓ దుర్యోధన మహారాజా! నేటి పరిస్థితి చూస్తే, పాండవులు నన్నుగాని, నేను పాండవులనుగాని చంపడం తప్పకుండా జరుగుతుంది. ఆ పాండవులు దేవతల బలంవంటి బలంగలవారు కావటంచేత, ఒకానొక మానవుడైన నావంటి వాడిచేత చస్తారా? (ఈ పద్యంలో తాను చావటం ఖాయమని, పాండవులు జయించడం నిజమని నిక్కచ్చిగా భీష్ముడు దుర్యోధనుడికి చెప్పాడు.)

వ. ఐనను నా చేతి బలుపు సూడుమీ యని పలికి పేర్చి పటుతరశరార్చులం బ్రచండ నరనాథ యూథంబులం బొదివికొని పాండవులకుం దేఱిచూడరాక నిర్ధూమదహనస్వభావుండైన పితామహు ప్రాపున భవత్పుత్రులు శత్రుబలంబుల బడలువడంజేయందొడంగిన వారిం గనుంగొని. 332

ప్రతిపదార్థం: ఐనను= అయినప్పటికి; నా చేతి బలువు= నా చేతియొక్క బలాన్ని; చూడుమీ= చూడు; అని పలికి; పేర్చి= విజృంభించి; పటుతరశర+అర్చులన్= మిక్కిలి సమర్థములైన బాణాల జ్వాలలతో; ప్రచండ నరనాథ యూథంబులన్= అసాధ్యమైన రాజుల గుంపును; పొదివికొని= ఆక్రమించి; పాండవులకున్; తేఱిచూడరాక= రెప్పవేయక చూడటానికి సాధ్యంకాక; నిర్+ధూమ= పొగలేని; దహన+అగ్నియొక్క; స్వభావుండు+ఐ= స్వభావంగలవాడైన; పితామహు ప్రాపునన్= తాతగారైన భీష్ముని ఆశ్రయం(అండ)తో; భవత్+పుత్రులు= నీ కొడుకులు కౌరవులు; శత్రుబలంబులన్= శత్రువులైన పాండవుల సేనలను; బడలు+పడన్+చేయన్= బడలిక చెందేటట్లు చేయటానికి; తొడంగినన్= మొదలుపెట్టగా; వారిన్= ఆ కౌరవుల సేనలను; కనుంగొని= చూచి.

తాత్పర్యం: అయినప్పటికీ నా బాహుబలం చూడు, అని అంటూ బాగా దిట్టమైన బాణాల జ్వాలలతో అసాధ్యమైన రాజుల గుంపును ఎదుర్కొన్నాడు భీష్ముడు. అప్పు డాయనను పాండవులు తేరిపార చూడలేకపోయారు. అప్పుడు భీష్ముడు పొగలేని అగ్గిలా మండిపడుతూ ఉండగా నీ కొడుకులందరూ అతని అండన చేరి, పాండవుల బలగాలను నొచ్చిపోయేటట్లు చేయసాగారు. ఆ కౌరవసేనలను చూచి. (తరువాతి పద్యంతో అన్వయం.)

ఆ. పాండవేయమాత్స్యపాంచాలయాదవ । పాండ్యకేకయాదిబలము లొక్క
మొగిన త్రోవ నీదుమొనలు మార్కొనుటయు । నపుడు పోరు ఘోర మయ్యె నధిప! 333

ప్రతిపదార్థం: అధిప!= ఓ ధృతరాష్ట్రా!; పాండవేయ= పాండవులకొడుకుల; మాత్స్య= మత్స్యదేశపురాజు; పాంచాల= పాంచాలరాజు; యాదవ= యాదవులు; పాండ్య= పాండ్య దేశపురాజు; కేకయ= కేకయరాజు; ఆది= మొదలుగాగల వారియొక్క; బలములు= సేనలు; ఒక్క మొగిన= ఒక్కసారిగా; త్రోవన్= కవియగా; నీదు= నీయొక్క; మొనలు= సైన్యాలు; మార్కొనుటయున్= ఎదిరించగా; అపుడు; పోరు= కౌరవ పాండవుల యుద్ధం; ఘోరము= భయంకరమైందిగా; అయ్యెన్.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! పాండవుల కొడుకులు, మత్స్యదేశపురాజు, పాంచాలరాజు, యాదవులు, పాండ్యుడు, కేకయరాజు మొదలుగా గల వారి సైన్యాలు ఒక్కుమ్మడిగా కవియగా, నీ కొడుకు దుర్యోధనుడి సేనలు కూడా ఎదిరించగా యుద్ధం చాలా భయంకరంగా జరిగింది.

వ. అట్టియెడ నర్జునుండు శిఖండి నాలోకించి. 334

ప్రతిపదార్థం: అట్టి+ఎడన్; అర్జునుండు; శిఖండిన్; ఆలోకించి= చూచి.

తాత్పర్యం: అప్పుడు అర్జునుడు శిఖండిని చూచి. (తరువాతి పద్యంతో అన్వయం.)

తే. ' నీవు భీష్మున కలికినఁ బోవ దేను । గలుగ వెఱపేల? యతనిపైఁ గవియు మెయిది
కొని మదీయబాణంబులఁ గుప్పఁగూరఁ । బఱపి కూల్చెద నీతనిఁ బటురయమున.' 335

ప్రతిపదార్థం: నీవు; భీష్మునకున్= భీష్ముడికి; అలికినన్= భయపడినా కూడా; పోవదు= భీష్ముడి మరణం తప్పదు; ఏను= నేను; కలుగన్= ఉండగా; వెఱపు+ఏల?= నీకు భయమెందుకు?; ఎయిదికొని= వెంబడించి; అతనిపైన్= ఆ భీష్ముడి మీదికి; కవియుము= పర్వుము; మదీయబాణంబులన్= నా దగ్గరుండే బాణాలను; కొని= తీసికొని; కుప్పఁగూరన్= కుప్పలుకుప్పలుగా; పఱపి= ప్రయోగించి; పటురయమునన్= మిక్కిలి వేగంతో; ఈతనిన్= ఈ భీష్ముడిని; కూల్చెదన్= చంపుతాను.

తాత్పర్యం: 'ఓ శిఖండీ! నీవు భీష్ముడి దెబ్బకు భయపడినా కూడా ఆతడి చావు తప్పదు. నే నున్నానుకదా! ఇక నీకు భయం దేనికి? అతడి వెంటపడుము. నేను నా బాణాలన్నీ ప్రయోగించి కుప్పలు కుప్పలుగా గుప్పించి చాలా వేగంతో ఈనా డీ భీష్ముడిని కడతేర్చుతాను.

వ. అనిన నాతని పలుకులు విని యెలుంగెత్తి ధృష్టద్యుమ్నుండు. 336

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; ఆతని పలుకులు= ఆ అర్జునుడి మాటలు; విని; ఎలుంగు+ఎత్తి= గొంతెత్తి; ధృష్టద్యుమ్నుడు.

తాత్పర్యం: అని అనగా , ఆ అర్జునుడి మాటలను విన్నట్టి ధృష్టద్యుమ్నుడు బిగ్గరగా (తరువాతి పద్యంతో అన్వయం.)

క. ' మన యోధులందఱును శాం । తనవునిపైఁ దఱుముఁ డింద్రతనయుఁడు గలుగన్
మన మతనికి శంకింపఁగఁ । బనిలే' దని పలికి యార్చి బలువిడి నడరెన్. 337

ప్రతిపదార్థం: మన యోధులు= మన పక్షంలోని వీరులు; అందఱును= అందరూకూడా; శాంతనవునిపైన్= భీష్ముడిమీదికి; తఱుముఁడు= కవియుడు; ఇంద్ర తనయుఁడు= ఇంద్రుడి కుమారుడు - అర్జునుడు; కలుగన్= ఉండగా; మనము; అతనికిన్= ఆ భీష్ముడికి; శంకింపఁగన్+పనిలేదు= భయపడనక్కరలేదు; అని పలికి; ఆర్చి= బొబ్బరించి; బలువిడిన్= బలంగా; అడరెన్= విజృంభించాడు.

తాత్పర్యం: 'మన యోధులందరు ఏకంగా భీష్ముడిని చుట్టుముట్టండి. అర్జును డుండగా మనకేం భయం? ఆ భీష్ముడిని చూచి మనం జంక పనిలేదు' అని అంటూ, పెనుబొబ్బపెట్టి ధృష్టద్యుమ్నుడు బలంగా విజృంభించాడు.

వ. అప్పుడు ధర్మజభీమనకులసహదేవులును సుభద్రాతనయద్రౌపదేయులును ద్రుపదవిరాటులును, సాత్యకి చేకితాన ధృష్టకేతు కేకయ మాగధులును మఱియునుం జేయంగల దొరలు నొక్కపెట్ట బెట్టఁడరిన నిక్కడ గురుపుత్రభూరిశ్రవసులును, గృతవర్మకృపకాంభోజపతులును, వికర్ణదుర్ముఖ వివింశతిచిత్రసేనులును లోనైన యోధులు దేవవ్రతునకుం దలకడచి వారిం దలపడి రిట్లు మందాకినీనందనుపయిం గవియు పాండవసైనికులను నతని కడ్డపడు కౌరవ్యవీరులును జూచునెడ సురల కనిమిషత్వంబు సార్థకం బయ్యె నయ్యవసరంబున. 338

ప్రతిపదార్థం: అప్పుడు; ధర్మజ; భీమ; నకుల; సహదేవులును సుభద్రాతనయ= సుభద్ర కుమారుడు అభిమన్యుడు; ద్రౌపదేయులును= ద్రౌపదికుమారులునూ; ద్రుపద విరాటులును; సాత్యకి; చేకితాన; ధృష్టకేతు; కేకయ; మాగధులును; మఱియునున్; చేయన్+కల= సమర్థులైన; దొరలును; ఒక్కపెట్టన్= ఒకేసారిగా; బెట్టు= అధికంగా; అడరినన్= విజృంభించగా; ఇక్కడ= ఈ కౌరవసేనలో; గురుపుత్ర భూరిశ్రవసులును= అశ్వత్థామయు, భూరిశ్రవసుడును; కృతవర్మ; కృప; కాంభోజ పతులును; వికర్ణ; దుర్ముఖ; వివింశతి అనే వారు; చిత్రసేనులును; లోను+ఐన యోధులు= మొదలుగా గల వీరులు; దేవవ్రతునకున్= భీష్ముడికి; తలకడచి= అతిక్రమించి; వారిన్= ఆ పాండవపక్షంలోనివారలను; తలపడిరి= ఎదుర్కొన్నారు; ఇట్లు; మందాకినీ నందను పయిన్= భీష్ముడిమీద; కవియు; పాండవసైనికులను= పాండవుల సేనలో ఉండేవారిని; అతనికిన్= ఆ భీష్ముడికి; అడ్డపడు= అండగా ముందు అడ్డుకొనే; కౌరవ్యవీరులునున్= కౌరవుల సేనలోని శూరులను; చూచు+ఎడన్ చూచే సమయంలో; సురలకున్= దేవతలకు; అనిమిషత్వంబు= రెప్పపాటు లేకుండుట; సార్థకంబు+అయ్యెన్= సఫలమైంది; ఆ+అవసరంబునన్= ఆ సమయంలో.

తాత్పర్యం: ధృష్టద్యుమ్నుడు బొబ్బలుపెట్టుతూ విజృంభించినప్పుడు ధర్మరాజు, భీముడు, నకులుడు, సహదేవుడున్నూ, అభిమన్యుడు, ద్రౌపది కొడుకులున్నూ, సాత్యకి, చేకితానుడు, కేకయమాగధరాజులున్నూ ఇంకా ఉండే రాజులందరూ ఒకే ఊపుతో బాగా విజృంభించారు. ఇక్కడ కౌరవసేనలో అశ్వత్థామ, భూరిశ్రవసుడు, కృతవర్మ, కృపాచార్యుడు, కాంభోజరాజున్నూ, వికర్ణుడు, దుర్ముఖుడు, వివింశతి, చిత్రసేనుడు మొదలుగా కలిగిన శూరులు, భీష్ముడికి రక్షణగా ముందు భాగంలో నిలిచి, పాండవ సైనికులను ఎదిరించారు. ఈ యుద్ధపుపట్టును చూస్తూన్న దేవతలకు రెప్పపాటు లేకుండటం సఫలమైంది. (అంటే ఘోరంగా యుద్ధం జరిగిందని, దేవతలు ఆ యుద్ధాన్ని రెప్పవేయకుండా చూశారని భావం.)

క. మొనసి శిఖండిని మున్నిడి । కొనియురవడిఁ దఱుము నరునకును వెస దుశ్శా
సనుఁ డడ్డపడియెఁ బొంగిన । వననిధికిని వేలపోలె వసుధాధీశా! 339

ప్రతిపదార్థం: వసుధా+అధీశా!= భూమికి భర్తవైన ధృతరాష్ట్ర మహారాజా!; మొనసి= పూనుకొని; శిఖండిని= శిఖండి అనేవాడిని; మున్ను+ఇడికొని= ముందుగా పెట్టుకొని; ఉరవడిన్= చాలావేగంగా; తఱుము= కవియుచున్నట్టి; నరునకున్= అర్జునుడికి; వెసన్= వేగంతో; దుశ్శాసనుఁడు; పొంగిన= ఉబ్బిన; వననిధికిన్= సముద్రానికి; వేల+పోలెన్= చెలియలికట్టలాగా; అడ్డపడియెన్= అడ్డువచ్చాడు.

తాత్పర్యం: ప్రయత్నంతో శిఖండిని ముందు ఉంచికొని వేగంగా ముందుకు దూసుకొనిపోతున్న అర్జునుడికి - సముద్రానికి చెలియలికట్ట మాదిరిగా దుశ్శాసనుడు అడ్డుతగిలాడు.

విశేషం: అలం: ఉపమ. సముద్రానికి చెలియలికట్ట ఎట్లాగో - వేగంగా ముందుకు పోతున్న అర్జునుడికి దుశ్శాసనుడు అట్లాగ.

వ. ఇట్లు నిలువరించి. 340

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; నిలువరించి= ఆపి.

తాత్పర్యం: పైన చెప్పినరీతిగా దుశ్శాసనుడు పాండవసేనను నిలబడేటట్లుగా చేసి (తరువాతి పద్యంతో అన్వయం.)

క. ఇరువురఁ గృష్ణుల నాతం । డిరువదిబలునారసముల నేసెం గ్రోధ
స్ఫురితుఁ డయి నొంచెఁ గ్రీడియు । నరనాయక! యతని నూఱునారాచములన్. 341

ప్రతిపదార్థం: నరనాయక!= ప్రభూ; ఆతండు= ఆ దుశ్శాసనుడు; ఇరువురన్= ఇద్దరైన; కృష్ణులన్= కృష్ణుడిని, అర్జునుడిని; ఇరువది బలు నారసములన్= ఇరవై వాడి బాణాలతో; ఏసెన్= కొట్టాడు; క్రీడియు(న్)= అర్జునుడున్నూ; క్రోధస్ఫురితుఁడు+అయి= కోపంచే అదరుతున్నవాడై; నూఱు నారాచములన్= నూరు బాణాలతో; అతని(న్)= ఆ దుశ్శాసనుడిని; నొంచెన్= బాధించాడు.

తాత్పర్యం: రాజా! ఆ దుశ్శాసనుడు ఇరువది బాణాలతో, ఆ కృష్ణార్జును లిద్దరినీ కొట్టాడు. అర్జునుడు మిక్కిలి కోపించి నూరు బాణాలు వేసి దుశ్శాసనుడిని నొవ్వజేశాడు.

తే. అతఁడు నొచ్చియు నాటించె నైదుతూపు । లింద్రసుతుఫాలమున నాతఁ డేచి విల్లు
దునిమి పెల్లేయఁ దలఁకక దుస్ససేనుఁ । డన్యధనువున నిరువదేనమ్ము లేసె. 342

ప్రతిపదార్థం: అతఁడు= ఆ దుశ్శాసనుడు; నొచ్చియున్= బాధపొందికూడా; ఇంద్రసుతు ఫాలమునన్= అర్జునుడి నొసటన; ఐదు+తూపులు= అయిదు బాణాలు; నాటించెన్= గుచ్చినాడు; ఆతఁడు= ఆ అర్జునుడు; ఏచి= విజృంభించి; విల్లున్= దుశ్శాసనుడి వింటిని;తునిమి= తునకలు చేసి; పెల్లు= అధికంగా; ఏయన్= బాణాలతో కొట్టగా; దుస్ససేనుఁడు= దుశ్శాసనుడు; తలఁకక= చలించకుండా; అన్యధనువునన్= వేరే విల్లుతో; ఇరువది+ఏను= ఇరవై అయిదు;అమ్ములు= బాణాలు; ఏసెన్= ప్రయోగించాడు.

తాత్పర్యం: దుశ్శాసనుడు చాలా దెబ్బతినికూడా, అర్జునుడి నొసట అయిదు బాణాలు గ్రుచ్చాడు. ఆ అర్జునుడు మిక్కిలి విజృంభించి, దుశ్శాసనుడి వింటిని తునుకలు చేసి, చాలా బాణాలు వేశాడు. కాని దుశ్శాసనుడు ఏ మాత్రం చలించకుండా, వేరే విల్లందుకొని ఇరవైఅయిదు బాణాలు ప్రయోగించాడు.

క. ఆ తూపులు నటికి పరి । స్ఫీతంబగు నారసంబు పృథుతరవక్ష
స్స్థానంబు సేసి విజయుఁడు । నీ తనయుని మూర్ఛ వుచ్చె నిష్ఠురవృత్తిన్. 343

ప్రతిపదార్థం: విజయుఁడు= అర్జునుడు; ఆ తూపులు= దుశ్శాసనుడు వేసిన ఆ బాణాలను; నటికి= తుంటలు చేసి; పరిస్ఫీతంబు+అగు= మిక్కిలి విశాలమయిన; వక్షన్= రొమ్మున; స్థానంబున్+చేసి= గ్రుచ్చుకొనేటట్లుగా చేసి; నీ తనయునిన్= దుశ్శాసనుడిని; నిష్ఠురవృత్తిన్= కఠోరంగా; మూర్ఛపుచ్చెన్= మూర్ఛ చెందేట్లుగా చేశాడు.

తాత్పర్యం: దుశ్శాసనుడు తనపై ప్రయోగించిన బాణాలను అర్జునుడు తుంటలు చేసి, చాలా శక్తి గల ఒక బాణాన్ని ప్రయోగించాడు. ఆ బాణం దుశ్శాసనుడి విశాలమైన రొమ్ములో బాగా గ్రుచ్చుకొన్నది. ఆ దెబ్బతో నీ కొడుకు దుశ్శాసనుడు మూర్ఛపోయాడు.

వ. ఇట్లు దుశ్శాసనుండు సోలి వ్రాలుటయు. 344

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ మాదిరి; దుశ్శాసనుండు= దుశ్శాసనుడు; సోలి= సొమ్మసిల్లి; వ్రాలుటయున్= ఒరిగిపోగా.

తాత్పర్యం: దుశ్శాసనుడు మూర్ఛ చెంది, రథంలో వాలిపోగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. సారథి యరదము భీష్ముని । తేరివెనుక కెగిచె నంతఁ దెలివొంది ధృతి
స్ఫారుఁ డగు న క్కుమారుఁ డు । దారగతిన్ మగిడి వచ్చి తాఁకెం గ్రీడిన్. 345

ప్రతిపదార్థం: సారథి= దుశ్శాసనుడి సారథి; అరదమున్= రథాన్ని; భీష్ముని తేరి వెనుకకున్= భీష్ముడి రథం వెనుకప్రక్కకు; ఎగిచెన్= తరిమాడు; అంతన్= అంతలోపల; ధృతిస్ఫారుఁడు+అగు= ధైర్యంచే గొప్పవాడైన; ఆ+కుమారుఁడు= ఆ దుశ్శాసనుడు; తెలివి+ఒంది= స్పృహపొంది; ఉదారగతిన్= గొప్పదైన గమనంతో; మగిడివచ్చి= తిరిగివచ్చి; క్రీడిన్= అర్జునుడిని; తాఁకెన్= మార్కొన్నాడు.

తాత్పర్యం: దుశ్శాసనుడు మూర్ఛ చెందగానే, అతడి సారథి భీష్ముడి రథానికి వెనుక ప్రక్కకు తన రథాన్ని తరుముకొని పోయాడు. అంతలోనే, మహాధైర్యవంతుడైన ఆ దుశ్శాసనుడు తెప్పరిల్లుకొని, హుందాగా తిరిగివచ్చి అర్జునుడిని ఎదుర్కొన్నాడు.

వ. తదవసరంబున సాత్యకితో నలంబుస భగదత్తులును, నభిమన్యునితో సుదక్షిణుండును, విరాటద్రుపదులతో నశ్వత్థామయు, సహదేవునితోఁ గృపాచార్యుండును, నకులునితో వికర్ణుండును, ఘటోత్కచునితో దుర్ముఖుండును, భీమసేనుతో భూరిశ్రవసుండును, జేకితానుతోఁ జిత్రసేనుండును, ధర్మనందనుతో నస్త్రగురుండును దలవడిన బెట్టిదంబగు బవరం బయ్యె నందిరుదెఱంగుల యోధులు నన్యోన్యధ్వజభంజనంబును, బరస్పరతురగహాననంబును, నితరేతరసూతనిపాతనంబును, మిథఃకోదండ ఖండనంబును జేయుచుండం బటుతరశరసంపాతసంపాదితశంపాజాలకాభీలంబును, భీషణ గుణరణనగర్జాస్ఫూర్జితంబును, రక్తధారాసారఘోరంబును, నగు నపూర్వ పర్జన్యసమయంబు దోఁచె నప్పుడు గయ్యంబు కలరూపంతయుం గనుంగొనుటకు మింటి క్రేవ నున్న వెరవు గా దను పరుసున సవితృండు సగమింటికిం జనుదెంచె; నట్టియెడ. 346

ప్రతిపదార్థం: తద్+అవసరంబున్= ఆ సమయంలో; సాత్యకితోన్; అలంబుస భగదత్తులునున్; అభిమన్యుతో; సుదక్షిణుండునున్= సుదక్షిణుడనేవాడున్నూ; విరాటద్రుపదులతోన్; అశ్వత్థామయున్; సహదేవునితోన్; కృపాచార్యుండును; నకులునితో; వికర్ణుండును; ఘటోత్కచునితోన్; దుర్ముఖుండును; భీమసేనుతోన్ ; భూరిశ్రవసుండున్; చేకితానుతోన్; చిత్రసేనుండును; ధర్మనందనుతోన్= ధర్మరాజుతో; అస్త్రగురుండున్= విలు విద్య నేర్పిన గురువైన ద్రోణాచార్యుడున్నూ; తలపడినన్= మార్కొనగా; బెట్టిదంబు+అగు= క్రూరమైన; బవరంబు+అయ్యెన్= యుద్ధం జరిగింది; అందున్= ఆ యుద్ధంలో; ఇరు+తెఱంగుల యోధులున్= రెండు పక్షాలలోని వీరులున్నూ; అన్యోన్య ధ్వజ భంజనంబును= ఒండొరుల యొక్క టెక్కెములను విరుచుకోవడం; పరస్పర తురగ హాననంబునున్= ఒకరి గుర్రాలను మరొకరు చంపుకోవడం; ఇతరేతర సూత నిపాతనంబును= ఒండొరుల సారథులను పడవేయటం; మిథఃకోదండ ఖండనంబును= అన్యోన్యం ధనువులను త్రుంచివేయటం; చేయుచుండన్= చేస్తూండగా; పటుతర= మిక్కిలిగట్టివైన; శర= బాణాలయొక్క, సంపాత= బాగా పడవేయటంచేత; సంపాదిత= కలుగజేయబడిన; శంపా= మెరుపుతీగల యొక్క; జాలక= సమూహంచేత; ఆభీలంబును= భయంకరమైనదిన్నీ, భీషణ= భయంకరమైన; గుణ= అల్లెత్రాళ్ళయొక్క; రణన= ధ్వనుల; గర్జా= ఉరుములయొక్క; స్ఫూర్జితంబును= ప్రతిధ్వనులు కలదియు; రక్తధారా= నెత్తుటిధారలనే; ఆసార= జడివానచేత; ఘోరంబును(న్)= భయంకరమైనదియు; అగు= అగునట్టి; అపూర్వ పర్జన్యసమయంబు= మునుపు లేనట్టి వర్షాకాలం; తోఁచెన్= తోపింపచేసింది; అప్పుడు= ఆ సమయంలో; కయ్యంబుకలరూపు= యుద్ధం ఉన్నదున్నట్టుగా; అంతయున్= పూర్తిగా; కనుంగొనుటకున్= చూడటానికి; మింటి క్రేవన్= ఆకాశంలో ఒక వైపు; ఉన్నన్= ఉండగా; వెరవు గాదు= సాధ్యం కాదు; అనుపరుసునన్= అనే విధంగా; సవితృండు= సూర్యుడు; సగమింటికిన్= ఆకాశం మధ్యభాగానికి; చనుదెంచెన్= వచ్చాడు; అట్టి+ఎడన్= ఆ సమయంలో.

తాత్పర్యం: ఆ యుద్ధంలో సాత్యకితో అలంబుసుడు, భగదత్తుడు; అభిమన్యుడితో సుదక్షిణుడు; విరాటరాజు,ద్రుపదుడు - వీరిద్దరితో అశ్వత్థామ; సహదేవుడితో - కృపుడున్నూ, నకులుడితో - వికర్ణుడు; ఘటోత్కచుడితో దుర్ముఖుడు; భీముడితో భూరిశ్రవసుడు; చేకితానుడితో చిత్రసేనుడు; ధర్మరాజుతో ద్రోణాచార్యుడు తలపడ్డారు. పోరుఘోరంగా ఉండినది. ఆ యుద్ధంలో రెండుపక్షాల వారు ఒకరొకరి ధ్వజాలను విరచటం, ఒండొరుల గుర్రాలను చంపుకోవటం, ఇరుపక్షాలవారి సారథులను పడవేయటం, వీరి విండ్లను వారు, వారి విండ్లను వీరు

త్రుంచివేయటం జరుగుతూ ఉంటే, విరివిగా బాణాలు విసురుకోవటం చేత కలిగిన మెరుపుల గుంపులచే భయంగొలిపేది, భయంకరమైన అల్లెత్రాళ్ళ ధ్వనులనెడి ఉరుముల కదలికలు కలది, నెత్తుటి ధారలనే జడివానచే ఘోరమైనది అవుతూ, మునుపెన్నడూ లేని వర్షాకాల సమయంగా అనిపించింది. అప్పుడు సూర్యభగవానుడు ఆకాశంలో ఒకవైపు యుద్ధం జరుగుతున్నట్టిది జరుగుతున్నట్టుగా చూడటానికి సాధ్యంకాదని అనుకొన్నాడో అన్నట్లు ఆకాశంలో మధ్య భాగానికి చేరుకొన్నాడు. అట్టి సమయంలో. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: అలం: ఉత్ప్రేక్షం.

మ. పటుదుశ్శాసనబాణపంక్తి నతిదర్పస్ఫూర్తిమైఁ ద్రుంచి యు
త్కటకోపానలదీప్తవక్త్రుఁ డగుచున్ గాండీవి పెల్లేయుడుం
ద్రుటితజ్యాలతికాధనుర్ధ్వజుఁడు నిర్లూనాఖిలాంగుండు నై
రటదశ్వం బగుతేరితో నతఁడు సంత్రాసంబునం బాఱినన్. 347

ప్రతిపదార్థం: గాండీవి= అర్జునుడు; పటు; దుశ్శాసన= దుశ్శాసనుడిచే ప్రయోగింపబడ్డ, బాణ= బాణాలయొక్క; పంక్తిన్= వరుసను; అతిదర్ప స్ఫూర్తిమైన్= మిక్కుటమైన గర్వంచేతనైన కదలికతో; త్రుంచి= తునుకలు చేసి; ఉత్కట= ఎక్కువైన; కోప= కోపమనెడి; అనల= అగ్గిచే; దీప్త= జ్వలించెడి; వక్త్రుఁడు+అగుచున్=ముఖంగల వాడౌతూ; పెల్లు= అధికంగా బాణాలను; ఏయుడున్= ప్రయోగించగా; అతఁడు= ఆ దుశ్శాసనుడు; త్రుటిత= తునిగిపోయిన; జ్యాలతికా= తీగవంటి అల్లెత్రాడు; ధనుఃధ్వజుఁడు+ఐ= ధ్వజం ఇవి అన్నీకలవాడై; నిర్లూన+అఖిల+అంగుండున్+ఐ= గాయపరచబడిన ఎల్ల అవయవాలు కలవాడై; రటత్+అశ్వంబు+అగు= సకిలిస్తున్న గుర్రాలుగల; తేరితోన్= రథంతో; సంత్రాసంబునన్= మిక్కుటమైన భయంతో; పాఱినన్= పారిపోగా.

తాత్పర్యం: దుశ్శాసనుడు వేసిన గొప్ప బాణాలన్నిటినీ, అర్జునుడు చాలా కోపంతో త్రుంచివేశాడు. కోపాగ్నితో జ్వలిస్తుండే ముఖంతో చాలా బాణాలను దుశ్శాసనుడి మీద ప్రయోగించాడు. దానితో ఆ దుశ్శాసనుడి అల్లెత్రాడు, విల్లు - ధ్వజం తునాతునక లయ్యాయి. అంతేకాదు, అతడి అవయవాలన్నీ దెబ్బతిన్నాయి. తన తేరి గుర్రాలు భయంతో సకిలిస్తుండగా, భయపడి అతడు పారిపోయాడు.

తే. ఫల్గునుఁడు భీష్ముముందటిబలము నెల్లఁ । జటులరథవల్గనుం డయిఁ చంపుచున్నఁ
జూచి ద్రోణుండు గుణరవస్ఫురణఘూర్ణ । రోదసీభాగుఁ డగుచు మార్కొనఁ గడంగి. 348

ప్రతిపదార్థం: ఫల్గునుఁడు= అర్జునుడు; చటుల= చలించుచున్న; రథంయొక్క+వల్గనుండు+అయి= గుర్రాల గమన భేదం కలవాడై; భీష్ము ముందటి బలమున్+ఎల్లన్= భీష్ముడి ముందు నిలబడియుండే సైన్యాన్నంతా; చంపుచున్+ఉన్నన్= చంపుతుండగా; ద్రోణుండు; చూచి; గుణ= అల్లెత్రాటియొక్క; రవ= శబ్దముయొక్క; స్ఫురణ= అనుకంపనాల చేత; ఘూర్ణ= తిరుగుడు పడుతూ ఉండే; రోదసీభాగుఁడు+అగుచున్= భూమ్యాకాశమధ్యభాగం కలవాడౌతూ; మార్కొనన్= ఎదుర్కోవటానికి; కడంగి= ప్రయత్నపడి.

తాత్పర్యం: అర్జునుడు, తన రథాల గుర్రాలు గతిభేదాలతో నడుస్తూ ఉండగా, భీష్మాచార్యుడికి ముందుండే సైన్యాన్నంతా చంపుతూ వచ్చాడు. దాన్ని చూచి ద్రోణాచార్యుడు తన వింటినారిని బాగా శబ్దింపజేశాడు. ఆ శబ్దం వల్ల ఏర్పడ్డ కంపనం భూమి, ఆకాశాల మధ్యభాగాన్ని తిరుగుడు పడేటట్లు చేసింది. అప్పుడు ద్రోణుడు ఎదుర్కొనటానికి సిద్ధపడుతూ ఉండగా (తరువాతి పద్యంతో అన్వయం.)

ద్రోణాచార్యు అశ్వత్థామను భీష్మునకు సహాయంబుగాఁ బంపుట (సం. 6-108-1)

వ. అక్కడ నడచినం గౌంతేయాగ్రజుండు తోడన తవిలి సేనాసమేతంబుగా నడ్డపడి పోనీక పెనంగుచుండ నక్కుంభసంభవుండు. 349

ప్రతిపదార్థం: ఆ+కడన్= ఆ చోటికి; నడచినన్= ద్రోణుడు వెడుతూ ఉండగా; కౌంతేయ+అగ్రజుండు= ధర్మరాజు; తోడన్+అ= వెంటనే; తవిలి= వెంబడించి; సేనాసమేతంబుగాన్= సైన్యంతో కూడుకొని ఉన్నట్లుగా; అడ్డపడి= ఎదురునిలిచి; పోనీక= పోనీకుండా; పెనంగుచున్+ఉండన్= యుద్ధం చేస్తూ ఉండగా; ఆ+కుంభసంభవుండు= ఆ ద్రోణాచార్యుడు.

తాత్పర్యం: ద్రోణుడు అర్జునుడున్న దిక్కుకు నడుస్తూ ఉండగా, ధర్మరాజు తనసేనతో కూడా, ద్రోణుడిని వెంబడించి, అడ్డు తగిలి అతడిని పోనీయక యుద్ధం చేస్తూ ఉండగా, ద్రోణాచార్యుడు. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. అప్పుడు క్రోధమునం గను । నిప్పలు రాలంగఁ దనకు నెఱసంగడ మై
యొప్పిన తనయున కి ట్లని । చెప్పెం దత్కాలగతి విశేషము లెల్లన్ 350

ప్రతిపదార్థం: అప్పుడు; క్రోధమునన్= కోపంచేత; కను నిప్పులు= కన్నుల నుండి నిప్పు కణికలు; రాలంగన్= రాలుతూ ఉండగా; తనకున్= ద్రోణుడికి; నెఱసంగడము+ఐ= చాలా చేరికగా; ఒప్పిన= ఉన్నటువంటి; తనయునకున్= కొడుకైన అశ్వత్థామకు; తద్+కాలగతి విశేషములు= ఆ సమయాన జరుగుతుండే విశేషాలను; ఎల్లన్= అన్నింటిని; ఇట్లు+అని+చెప్పెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: ఆ సమయాన ద్రోణాచార్యుడు, కన్నులనుండి నిప్పులు రాలుతుండగా, చాలాకోపంగా తనకు చాలా దగ్గరలో ఉన్న తన కొడుకైన అశ్వత్థామను చూచి, ఆ సమయంలో తనకు ఏర్పడ్డ పరిస్థితిని గూర్చి ఈ విధంగా చెప్పాడు.

చ. ‘ తడఁబడె దివ్యబాణముల తంత్రము, మంత్రముఁ దప్పెడుం గడు
న్వడఁకెడుఁ జాపదండము, మనంబును నాకు వశంబుగాదు, వీ
డ్వడియెడుఁ జెయ్వు లంగము గడంక దొఱంగెడు, నేఁటి భంగిఁ గ
వ్వడి తనపూన్కిఁ దీర్చుట ధ్రువంబని బుద్ధి జనించెఁ బుత్రకా! 351

ప్రతిపదార్థం: పుత్రకా!= ఓ కుమారుడా! అశ్వత్థామా!; దివ్యబాణముల తంత్రము= అమోఘాలైన బాణాల కార్యసాధనోపాయం; తడఁబడెన్= తడబాటు చెందుతున్నది; మంత్రము= అస్త్రాలకు సంబంధించిన మంత్రము; తప్పెడున్= తప్పిపోతూ ఉన్నది; చాపదండము= ధనుస్సుయొక్క దండము; కడున్= మిక్కిలిగా; వడఁకెడున్= వణకుతున్నది; నాకున్; మనంబును= మనస్సు కూడా; వశంబు+కాదు= అధీనంలో ఉండటంలేదు; చెయ్వులు= పనులు; వీడు+పడియెడున్= వదలిపెట్టిపోతున్నవి; అంగము= శరీరం; కడంకన్= ప్రయత్నాన్ని; తొఱంగెడున్= విడిచిపెట్టుతున్నది; నేఁటిభంగిన్= ఈ నాటి యుద్ధపురీతితో; కవ్వడి= అర్జునుడు; తన పూన్కిన్= తన యొక్క ప్రయత్నాన్ని; తీర్చుట= నెరవేర్చటం; ధ్రువంబు+అని= నిజమని; బుద్ధి= ఆలోచన; జనించెన్= పుట్టింది.

తాత్పర్యం: ద్రోణాచార్యుడు తత్కాలంలో తనకు కల్గిన తారుమారు స్థితిని తన కొడుకుతో ఈ విధంగా తెలుపుతున్నాడు. ‘కుమారా! అమోఘాలైన బాణాలన్నీ తడబడుతున్నాయి. ఆయా ఆయుధాల అధిదేవతల మంత్రాలు మరచిపోతున్నాను. ధనుస్సున ఉండే దండం వణకుతున్నది. నా మనస్సు నా అధీనంలో ఉండటం

లేదు. ఆయా సమయంలో చేయవలసిన పనులు జ్ఞప్తికి రావటంలేదు. శరీరం ప్రయత్నాన్ని విడిచిపెట్టుతున్నది. ఈనాటి యుద్ధ విధానాన్ని చూస్తే అర్జునుడు తన (భీష్ముడిని చంపుతాననే) నిర్ణయాన్ని నిజంగా నెరవేర్చుతాడని నాకు తోస్తున్నది.

వ. అతని మును మటు తలయెత్తి చూడుము. 352

ప్రతిపదార్థం: అటు= అటువైపు; అతని మునుము= ఆ అర్జునుడి సేన యొక్క అగ్రభాగాన్ని; తలయెత్తి= తలను పైకెత్తి; చూడుము.

తాత్పర్యం: ఓ అశ్వత్థామా! అటు బాగా తల పైకెత్తి, అర్జునుడు చేసే బీభత్సాన్ని చూడుము.

క. కూలెడు గుఱ్ఱంబులు ధర । వ్రాలెడు నేనుఁగులుఁ గెడయు రథములు నై యా
భీల యుగాంత సముద్భట । కాలపురోభాగరేఖ గానఁగనయ్యెన్. 353

ప్రతిపదార్థం: కూలెడు= పడిపోతున్న; గుఱ్ఱంబులు= గుర్రాలు; ధరన్= నేలమీద; వ్రాలెడు= వాలిపోతుండే; ఏనుఁగులున్= ఏనుగులున్నూ; కెడయు= పడిపోతున్న; రథములున్+ఐ= రథములున్నూ కలిగి; ఆభీల= భయంకరమైన; యుగాంత= మహా ప్రళయ కాలంలోని; సమ్+ఉద్భట= భయంకరమైన; కాల= సమయము యొక్క; పురోభాగ= ముందటి భాగమందు ఏర్పడే; రేఖ= గుర్తు గీర; కానఁగన్+అయ్యెన్= కన్పిస్తుంది.

తాత్పర్యం: గుర్రాలు కుప్పకూలుతున్నాయి. ఏనుగులు నేలమీదికి ఒరిగిపోతున్నాయి. రథాలు పడిపోతున్నాయి. భయం కలిగించే మహాప్రళయంలో దానికిముందు కాలంలో కన్పించే చిన్నెలు ఎన్నో అగుపడుతున్నాయి.

వ. అదియునుం గాక. 354

ప్రతిపదార్థం: అదియునున్+కాక= అంతమాత్రమే కాకుండా.

తాత్పర్యం: సేనానష్టమే కాకుండా, చాలా దుశ్శకునాలు కూడా కలుగుతున్నాయి.

తే. అడరి కురుసేనపై గ్రద్దలాడఁ జొచ్చెఁ । బడుచునున్నవి యుల్క లిక్కడ వినంగ
వచ్చె నతిరూక్షభంగి శివారుతంబు । లాపగానందనునకుఁ గీ డావహిల్లు. 355

ప్రతిపదార్థం: గ్రద్దలు= గద్దలు; అడరి= విజృంభించి; కురుసేనపైన్= కురురాజుల సేనమీద; ఆడన్+చొచ్చెన్= తిరుగాడ సాగాయి; ఇక్కడన్; ఉల్కలు= కొరవులు; పడుచున్+ఉన్నవి= పడిపోతున్నాయి; శివారుతంబులు= ఆడనక్కల ఊళలు; అతిరూక్షభంగిన్= చాలా కరకుగా; వినంగన్ వచ్చెన్= వినవస్తున్నాయి; ఆపగానందనునకున్= భీష్ముడికి; కీడు= చెడ్డ(అశుభం); ఆవహిల్లున్= కలుగును.

తాత్పర్యం: కురుసేనపైన గద్దలు తిరుగుతున్నాయి. మనం ఉన్న తావులో నిప్పులేని కొరవులు పడుతున్నాయి. చాలా కటువుగా ఆడనక్కల అరుపులు వినవస్తున్నాయి. అందుచేత భీష్ముడికి ముప్పు తప్పదు.

వ. యుధిష్ఠిరు మొగంబునం గ్రోధం బగ్గలం బై తోఁచుచున్నయది ద్రౌపదేయ నకులసహదేవసహితుం డయి తఱుము నతని మిగిలి నాకు రా రాదు నీవు దేవవ్రతుపాలికిం బోయి యతనికి దాపట వలపటం బ్రాపై నిలువు మిది ప్రాణంబులు డాఁచు సమయంబు గా దని పలికి పనిచిన నశ్వత్థామ యుద్దామగతిం జనియె నక్కడ భీమసేనుండు. 356

ప్రతిపదార్థం: యుధిష్ఠిరు మొగంబునన్= ధర్మరాజు ముఖంలో; క్రోధంబు= కోపం; అగ్గలంబు+ఐ= ఎక్కువై; తోచుచున్నయది= కనుపించుచున్నది; ద్రౌపదేయ; నకుల; సహదేవ; సహితుండు+అయి= వీరందరితో కూడుకొన్నవాడై; తఱుము= కవియుచుండే; అతనిన్= ఆ ధర్మరాజును; మిగిలి= అతిశయించి; నాకున్; రారాదు= రావటానికి సాధ్యంకాదు; నీవు; దేవవ్రతుపాలికిన్= భీష్ముడి దగ్గరకు; పోయి; అతనికిన్= ఆ భీష్ముడికి; దాపటన్= ఎడమప్రక్క; వలపటన్= కుడిప్రక్క; ప్రాపు+ఐ= అండగా(ఆధారంగా); నిలుపుము; ఇది= ఈ సమయం; ప్రాణంబులు; డాఁచు సమయంబు+కాదు= దాచుకోడానికి అదనుగాదు; అని పలికి; పనిచినన్= పంపగా; అశ్వత్థామ; ఉద్దామగతిన్= గొప్ప నడకతో; చనియెన్= వెళ్ళాడు; అక్కడన్= భీష్ముడు యుద్ధం చేస్తూ ఉన్నచోట; భీమసేనుండు.

తాత్పర్యం: ధర్మరాజు ముఖం కోపావేశంతో కూడుకొని ఉన్నట్లు అనిపిస్తోంది. అతడు ద్రౌపది కొడుకులు, నకుల సహదేవులతో కూడి నాపైకి ఉరుకుతున్నాడు. అతడిని దాటుకొని రావటానికి నాకు సాధ్యంకాదు. కనుక నీవు ఆ భీష్ముడి దగ్గరకు వెళ్ళి, అతనికి కుడియెడమ భాగాలలో అండగా నిలబడు. ప్రాణాలు దాచుకోడానికి ఇది సమయంకాదు.' అని చెప్పగానే, అశ్వత్థామ తీవ్రమైన గమనంతో అక్కడికి వెళ్ళాడు. అక్కడ భీముడు (తరువాతి పద్యంతో అన్వయం.)

క. నరుఁ డేచి శిఖండిఁ బుర । స్సరుఁగాఁ గొని యపుడు భీష్ము సమయింపఁగ స
త్వరుఁ డగుటకుఁ దగ రణత । త్పరుఁ డై కురుసేనమీఁదఁ దఱిమెం బెలుచన్. 357

ప్రతిపదార్థం: అపుడు= ఆ సమయంలో; నరుఁడు= అర్జునుడు+ఏచి= విజృంభించి; శిఖండిన్= శిఖండిని; పురస్సరుఁగాన్+కొని= ముందు పెట్టుకొని; భీష్మున్= భీష్ముడిని; సమయింపఁగన్= చంపడానికి; సత్వరుఁడు+అగుటకున్= వేగిరపాటుతో కూడిన వాడు కావటానికి; తగన్= తగునట్లు(అనుకూలం)గా; రణతత్పరుఁడు+ఐ= యుద్ధమందాసక్తి గలవాడై; కురుసేనమీఁదన్= కౌరవసైన్యం మీదికి; పెలుచన్= ఆగ్రహంతో; తఱిమెన్= కవిశాడు.

తాత్పర్యం: అర్జునుడు విజృంభించి, శిఖండిని ముందుంచుకొని, భీష్ముడిని చంపటానికి త్వరపడేదానికి అనుకూలంగా భీముడు యుద్ధంమీది ఆసక్తితో, కురుసేనమీదికి ఉరికాడు. (భీముడు కురుసేనమీదికి కవియటం వలన, అర్జునుడికి భీష్ముడిని చంపడానికి మంచి అవకాశం కలిగిందన్నమాట.)

వ. ఇట్లు దఱిమి గాంగేయుముందటిబలంబుల బారిసమరం దొడంగిన భగదత్తకృపకృతవర్మశల్యసైంధవ చిత్రసేనదుర్మర్షణవిందానువిందవికర్ణులు పదుండ్రు నొక్కపెట్ట భీమునిం బొదివి నానాస్త్రసంతానంబుల నొప్పించిన నొచ్చియుం జలింపక పోరునమ్మారుతిం గనుంగొని క్రీడి తోడై తఱియ నుఱికి ధనువుల తునియలను, బాణంబులపఱియలను, గేతుచ్ఛత్రచామరంబులచెక్కలను, భూషణంబులపాళ్ళను, బుడమిం గప్పినం జూచి సుయోధనుండు సుశర్మాదిభూపాలకుల నాలోకించి యా భీమార్జునులం దాఁక నియోగించిన. 358

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; తఱిమి= కవిసి; గాంగేయు ముందటి బలంబులన్= భీష్ముడి ముందుండే సేనలను; బారి+చమరన్= చంపటానికి; తొడంగినన్= ఆరంభించగా; భగదత్త; కృప; కృతవర్మ; శల్య; సైంధవ; చిత్రసేన; దుర్మర్షణ; విందు; అనువింద; వికర్ణులు; పదుండ్రున్= పదిమందికూడా; ఒక్కపెట్ట= ఒకేసారిగా; భీమునిన్= ఆ భీముడిని; పొదివి= క్రమ్ముకొని; నానా+అస్త్ర సంతానంబులన్= పలురకాల ఆయుధాల గుంపులతో; నొప్పించినన్= బాధించగా; నొచ్చియున్= బాధపడికూడా; చలింపక= కదలకుండా; పోరు= యుద్ధం చేస్తుండే; ఆ+మారుతిన్= ఆ భీముడిని; క్రీడి= అర్జునుడు; కనుంగొని= చూచి; తోడు+ఐ=

భీముడికి సహాయుడై; తఱియన్= దగ్గరకు రావటానికి; ఉఱికి; ధనువుల తునియలను= విండ్లతునుకలతో; బాణంబుల పఱియలను= బాణాల బద్దలతో; కేతుచ్ఛత్ర చామరంబుల చెక్కలను; ధ్వజాలు, గొడుగులు చామరాలు - వీటియొక్క ముక్కలతో; భూషణంబుల పొళ్ళను= ఆభరణాల చూర్ణంతోను; పుడమిన్= భూమిని; కప్పినన్= కప్పివేయగా; చూచి; సుయోధనుండు; సుశర్మ+ఆది భూపాలకులన్= సుశర్మ మొదలైన రాజులను; ఆలోకించి= చూచి; ఆ భీమ+అర్జునులన్= ఆ భీముడిని, అర్జునుడిని; తాఁకన్= ఎదిరించటానికి; నియోగించినన్= ఆజ్ఞాపించగా.

తాత్పర్యం: ఈ విధంగా భీముడు కవిసి, భీష్ముడికి ముందు భాగాన ఉండే సైన్యాన్ని చంపటాన్ని ఆరంభించాడు. భగదత్తుడు, కృపుడు, కృతవర్మ, శల్యుడు, సైంధవుడు, చిత్రసేనుడు, దుర్మర్షణుడు, విందుడు, అనువిందుడు, వికర్ణుడు - అనే పదిమంది ఒక్కసారిగా ఆ భీముడిని చుట్టుముట్టి, పలు రకాల ఆయుధాలు ప్రయోగించి, బాధించారు. తాను బాధపడి కూడా కదలకుండా నిలబడి యుద్ధం చేస్తున్న భీముడిని చూచి సాయపడటానికై అర్జునుడు తోడుగా వచ్చాడు. ధనుస్సుల తునుకలతో, బాణాల బద్దలతో, ధ్వజాల తుంటలతో, గొడుగుల తునుకలతో, చామరాల ముక్కలతో, నగల పొడులతో నేలను కప్పివేశారు. సుయోధనుడు ఆ దృశ్యాన్ని చూచాడు. సుశర్మ ముఖ్యుడుగా గల రాజులను చూచి, ఆ భీమార్జునులను ఎదుర్కొనుడని ఆజ్ఞాపించాడు.

క. ముందటిపదుండ్రు నా నృపు । లందఱునుం గూడి పెనఁగి యయ్యిరువురచే
తం దూలపోవఁ జొచ్చినఁ । గ్రందుగ బలుమొనల నెల్లఁ గవియం బనిచెన్. 359

ప్రతిపదార్థం: ముందటి పదుండ్రున్= ముందు చెప్పిన ఆ పదుగురు రాజులున్నూ; ఆ నృపులు= దుర్యోధనుడు ఆజ్ఞాపించిన సుశర్మ మున్నగు రాజులున్నూ; అందఱునున్= వారు, వీరు - అందరున్నూ; కూడి= ఏకమై; పెనఁగి= యుద్ధం చేసి; ఆ+ఇరువురచేతన్= ఇద్దరైన ఆ భీమార్జునులచేత; తూలపోవన్= చిన్నపోవడానికి; చొచ్చినన్= ఆరంభించగా; క్రందుగన్= ఎక్కువగా; బలు మొనలన్+ఎల్లన్= నానావిధాలైన సైన్యాన్నంతయు; కవియన్; పనిచెన్= ఆజ్ఞ చేశాడు.

తాత్పర్యం: మొదట భీముడిని ఎదుర్కొనటానికి వచ్చిన భగదత్తాదులు పదిమంది రాజులు, ఇప్పుడు దుర్యోధనుడి ఆజ్ఞచే వచ్చిన సుశర్మ మొదలుగా గల వీరులు - వీరందరూ కూడా, ఆ భీమార్జునుల దెబ్బలకు తూలిపోసాగారు. దీన్ని గమనించి, దుర్యోధనుడు తనకు గల సకలవిధాలైన సైన్యాలను ఆ భీమార్జునులను ఎదుర్కోవలసిందిగా ఆజ్ఞాపించాడు.

వ. ఇవ్విధంబునం బెక్కు మొనలు పయింబడిన నయ్యిరువురకుఁ బోరు భరం బగుట యెఱింగి సౌభద్రసాత్యకి ప్రముఖులగు రథికజనంబులు సైన్యోపేతంబుగాఁ ద్రోచి యేచిన. 360

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ మాదిరిగా; పెక్కు= అనేకములైన; మొనలు= సేనలు; పయిన్= మీద; పడినన్= పడగా; ఆ+ఇరువురకున్= ఆ భీమార్జునుల కిద్దరికి; పోరు= యుద్ధము; భరంబు= బరువైనదిగా; అగుట= కావటాన్ని; ఎఱింగి= తెలిసికొని; సౌభద్ర సాత్యకి ప్రముఖులు+అగు= అభిమన్యుడు, సాత్యకి ముఖ్యులుగా గల; రథికజనంబులు= రథాన్నెక్కి యుద్ధం చేసేవారు; సైన్య+ఉపేతంబు+కాన్= సేనలతో కూడునట్లుగా; త్రోచి= ముందుకు నడిచి; ఏచినన్= విజృంభింపగా.

తాత్పర్యం: కౌరవసేన మొత్తంగా కూడి, భీమార్జునుల మీదికి కవియగా - వారిద్దరికి అపుడు యుద్ధం చాలా దుర్భరమైంది. ఈ పరిస్థితిని గుర్తించి, అభిమన్యుడు సాత్యకి ముఖ్యులుగా గల పాండవసేనలో గల రథికులందరూ, తమ తమ సైన్యాలతో బాగా ముందుకు సాగి విజృంభించి యుద్ధం చేయసాగారు.

క. పాండవబలముల యత్యు ద్దండపరాక్రమము సూచి దర్పోద్ధతవే
దండములఁ గనిన కేసరి చండత భీష్ముండు వొదివె శరనఖరములన్. 361

ప్రతిపదార్థం: భీష్ముండు= భీష్ముడు; పాండవబలముల= పాండవుల సేనలయొక్క; అతి+ఉద్దండ పరాక్రమము= మిక్కిలి అధికమైన శౌర్యాన్ని; చూచి; దర్ప+ఉద్ధత= గర్వం యొక్క అతిశయంగల; వేదండములన్= ఏనుగులను; కనిన= చూచిన; కేసరి చండతన్= సింహం యొక్క కోపం వంటి కోపం గలవాడై; శరనఖరములన్= బాణాలవంటి గోళ్ళతో; పొదివెన్= క్రమ్ముకొన్నాడు.

తాత్పర్యం: భీష్ముడు పాండవసేనల యొక్క ఉద్దండ పరాక్రమాన్ని చూచాడు. దానితో ఆయనకు దర్పం పెల్లుబికింది. కోపగించిన సింహం ఎట్లాగయితే తనవాడి గోళ్ళతో ఏనుగులను కప్పివేస్తుందో ఆ మాదిరి తన పదనైన బాణాలతో పాండవుల సేనలను కప్పివేశాడు.

విశేషం: అలం: ఉపమ. 'శరనఖరములన్' అనేమాటలో రూపకాలంకారం. దీనిచే ఉపమాలంకారం ఉపజీవ్యమైంది.

క. డొల్లెడుసూతులుఁ బెలుచం ద్రెళ్ళెడు తురగములుఁ గా నతిక్రూరగతిం
బె ల్లేయుచు సత్వరముగ నెల్లెడలం దాన యగుచు నేడ్తెఱఁ బొదివెన్. 362

ప్రతిపదార్థం: డొల్లెడు= పడునట్టి; సూతులున్= సారథులున్నూ; పెలుచన్= అధికంగా; త్రెళ్ళెడు= ఎగిరిపడేటువంటి; తురగములున్+కాన్= గుర్రాలు కలుగునట్లుగా; అతి క్రూరగతిన్= మిక్కిలి కఠోరమైన రీతితో; పెల్లు= అధికంగా; ఏయుచున్= బాణాలతో కొట్టుతూ; సత్వరముగన్= వేగంతో కూడునట్లుగా; ఎల్ల+ఎడలన్= అన్నిచోట్ల; తాను+అ= తానే; అగుచున్= ఉంటున్నవాడై; ఏడ్తెరన్= పరాక్రమంతో; పొదివెన్= కవిశాడు.

తాత్పర్యం: సారథులు కిందపడేటట్లుగా గుర్రాలు ఎగిరిపడేటట్లుగా చాలా కఠినంగా విజృంభించి, వేగంతో అన్ని చోట్లా తానే ఔతూ, బాణాలతో పాండవసేనను పరిమార్చుతూ, భీష్ముడు ఆశ్చర్యకరంగా యుద్ధం చేశాడు.

వ. ఇట్లు పెద్దయుంబ్రొద్దు విహరించి యపరాహ్ణం బగుటయు నతం డాత్మగతంబున. 363

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ చెప్పిన విధంగా; పెద్దయున్+ప్రొద్దు= చాలాసేపు; విహరించి= విహారం చేసి;అపరాహ్ణంబు+అగుటయున్= పగటిలో నాల్గవభాగంకాగా; అతండు= ఆ భీష్ముడు; ఆత్మగతంబునన్= తనలో.

తాత్పర్యం: ఈ విధంగా చాలాసేపు యుద్ధం చేసి, భీష్ముడు అపరాహ్ణ కాలం కాగా తన మనసులో. (తరువాతి పద్యంతో అన్వయం.)

తే. ' ఉత్తమక్షత్రియుల నెల్ల నుగ్రవృత్తి నేఁడు పదినాళ్ళగోలె నా నిశితశరచ
యములఁ గూల్చితి వేసరినట్టులయ్యె మేనితోడి పాత్తిం కిట మానుటొప్ప.' 364

ప్రతిపదార్థం: ఉత్తమ క్షత్రియులన్= ఉత్తములైన రాజులను; ఎల్లన్= అందరిని; ఉగ్రవృత్తిన్= భయంకరమైన ప్రవర్తనతో; నేఁడు పదినాళ్ళగోలెన్= ఈ పది దినాలు మొదలుకొని; నా నిశిత శరచయములన్= నాయొక్క పదునైన బాణాల సమూహాలతో; కూల్చితిన్= చంపివేశాను; వేసరినట్టులు+అయ్యెన్= విసుగుచెందినట్టైంది; ఇంకన్= ఇకమీదట; ఇటన్= ఈ లోకంలో; మేని తోడిపాత్తు= శరీరంతోడి సంబంధాన్ని; మానుట= వదలిపెట్టడం; ఒప్పున్= తగినది.

తాత్పర్యం: భీష్ముడు ఇట్లా అనుకొన్నాడు 'ఈనాటితో పది దినాలుగా చాలా భయంకరంగా మహామహా రాజుల నెందరినో పదునైన బాణాలు గుప్పించి చంపాను. ఇప్పుడు నాకే విసుగు పుట్టుతున్నది. ఇక ఈ శరీరాన్ని వదలిపెట్టటం తగినపని.'

వ. అని తలంచి తొలంగి బలంబులం దెరల్చికొనుచుం గయ్యంబు సేయు చందంబునం గొంతేయాగ్రజుం గదిసి యల్లన యతనితో ని ట్లనియె. 365

ప్రతిపదార్థం: అని తలంచి= పై విధంగా అనుకొని; తొలంగి= అవతలకు వెళ్ళి; బలంబులన్= సేనలను; తెరల్చికొనుచున్= తొలగించుకొంటూ; కయ్యంబు= యుద్ధాన్ని; చేయు చందంబునన్= చేసే మాదిరిగా; కొంతేయ+అగ్రజున్= ధర్మరాజును; కదిసి= సమీపించి; అల్లన= మెల్లగా; అతనితోన్= ఆ ధర్మరాజుతో; ఇట్లు+ అనియెన్= ఇలా అన్నాడు.

తాత్పర్యం: భీష్ముడు పై విధంగా అనుకొని, అక్కడినుంచి అవతలికి పోయి, సైన్యాలను ఇటూ అటూ నెట్టుకొంటూ - యుద్ధం చేసే మాదిరి కనిపించుతూ ధర్మరాజు దగ్గరకువెళ్ళి ఎవరికీ వినబడకుండా సన్నగా అతడితో యిట్లా అన్నాడు:

క. ‘ జనియించినంతనుండియు । జనపతులం గ్రూరవృత్తిఁ జంపుచు నుండం
జనియెం గాలము విసివితి । నఘా! యే నింకఁ జాల నాసురవిధికిన్. 366

ప్రతిపదార్థం: అనఘా!= పాపములేని ధర్మజా! జనియించిన+అంత+ఉండియున్= పుట్టినది మొదలుకొని; జనపతులన్= రాజులను; క్రూరవృత్తిన్= కఠినంగా; చంపుచున్+ఉండన్= చంపుతూ ఉండగా; కాలము= సమయము; చనియెన్= కడచిపోయింది; విసివితిన్= విసుగుచెందాను; ఏను= నేను; ఇంకన్= ఇకమీదట; ఆసురవిధికిన్= రాక్షసకృత్యానికి; చాలన్= సమర్థుడనుకాను.

తాత్పర్యం: ఓ ధర్మరాజా! నేను పుట్టినది లగాయతు ఇంతవరకు ఎంతోమంది రాజులను చాలా క్రూరంగా చంపటంతోనే నా కాలం గడచిపోయింది. ఇప్పుడు నేను బాగా విసుగుచెందాను. ఇకమీద ఈ రాక్షసకృత్యానికి నేను ఒప్పుకోను; యుద్ధంలో సైనికులను నేను చంపజాలను.

ఆ. మీరు నా హితంబుఁ గోరుదురేని శి । ఖండి మున్ను గాఁగఁ గడఁగి యంత
వట్టు వారు నొక్క పెట్టకాఁ బైఁబడి । యేయుఁ డింకఁ దడవు సేయ వలదు.’ 367

ప్రతిపదార్థం: మీరు= పాండవులైనట్టి మీరు; నా హితంబున్= నాయొక్క మేలును; కోరుదురు+ఏనిన్= కోరేవారైతే; శిఖండిమున్ను+కాఁగన్= శిఖండి ముందుండేటట్లుగా; కడఁగి= ప్రయత్నించి; అంత+వట్టువారున్= అందరున్నూ; ఒక్క పెట్టకాన్= ఒకేసారిగా; పైన్+పడి= నామీద పడి; ఏయుఁడు= బాణాలు ప్రయోగించండి; ఇంకన్= ఇకపైన; తడవు= ఆలస్యం; చేయవలదు.

తాత్పర్యం: ఓ ధర్మరాజా! మీరు నామేలు కోరేవారైతే, శిఖండిని ముందుపెట్టుకొని, పూనికతో మీ సేనలోని వారందరూ ఒక్కుమ్మడిగా నా పైకి ఉరికి, బాణాలతో కొట్టండి. ఇంక ఏ మాత్రం ఆలస్యం చేయకండి.

వ. అని పలికి సమరప్రకారంబునం దేరు గ్రేళ్ళుదోలి పాంచాలబలంబులపయి నడరె నప్ప డయ్యజాతశత్రుండు సమీపవర్తి యగు ధృష్టద్యుమ్ను నాలోకించి. 368

ప్రతిపదార్థం: అని పలికి= అని చెప్పి; సమరప్రకారంబునన్= యుద్ధం చేసే మాదిరిగా; తేరున్= రథాన్ని; క్రేళ్ళు+తోలి= పరుగులెత్తించి; పాంచాలబలంబులపయిన్= పాంచాలరాజుయొక్క సేనలమీదికి; అడరెన్= విజృంభించాడు; అప్పుడు= అట్టి పట్టులో; ఆ+అజాతశత్రుండు= ఆ ధర్మరాజు; సమీపవర్తి+అగు= దగ్గరగానున్నట్టి; ధృష్టద్యుమ్నున్; ఆలోకించి= చూచి.

తాత్పర్యం: భీష్ముడు పైవిధంగా ధర్మరాజుతో చెప్పి, తానేమో యుద్ధంచేసే విధంగా, తన రథాన్ని జోరుగా పోనిచ్చి, పాంచాలరాజు సేనల మీదికి విజృంభించాడు. అప్పుడు ధర్మరాజు తనకు సమీపంలో ఉండే ధృష్టద్యుమ్నుడిని చూచి. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. ‘దేవవ్రతు పలుకులు విం । టే? వేగమ పనుపు మొక్కటిగఁ దఱుమఁగ యో
ధావళి నెల్లను భీముఁడు । నీవును నరుతోడఁ గూడి నిగుడుఁడు పెలుచన్.’ **369**

ప్రతిపదార్థం: దేవవ్రతు పలుకులు= భీష్ముడు చెప్పినమాటలు; వింటే?= విన్నావా?; యోధ+ఆవళిన్+ఎల్లనున్= వీరుల సమూహాన్నంతటిని; ఒక్కటిగన్= ఒకే మారుగా; తఱుమఁగన్= కవియటానికి; వేగము+అ= వెంటనే(త్వరితంగా); పనుపుము= ఆజ్ఞాపించుము; భీముఁడు; నీవును= నీవు (ధృష్టద్యుమ్నుడు)న్నూ; నరుతోడన్+కూడి= అర్జునుడితో చేరి; పెలుచన్= ఆటోపంతో; నిగుడుఁడు= విజృంభించండి.

తాత్పర్యం: ‘ధృష్టద్యుమ్నా! భీష్ముడు చెప్పిన మాటలు విన్నావు గదా! మన సేనలో ఉన్న యోధులందరినీ ఒకేసారిగా భీష్ముడి మీదికి కవియవలసినదిగా ఆలస్యం చేయకుండా వెంటనే ఆజ్ఞాపించుము. భీముడు, నీవు అర్జునుడితోకూడి, కోపోద్దీప్తులై, ఆతడి మీదికి బాగా విజృంభించండి.’

వ. అనవుడు నతండు. **370**

ప్రతిపదార్థం: అనవుడున్= అని చెప్పగా; అతండు= ఆ ధృష్టద్యుమ్నుడు.

తాత్పర్యం: ధర్మరాజు పై విధంగా చెప్పగానే ఆ ధృష్టద్యుమ్నుడు (తరువాతి పద్యంతో అన్వయం.)

సీ. మాత్స్య కైకేయాది మనుజేంద్రులకుఁ జేయఁ । గలయట్టి యోధవీరులకుఁ జేయి
సూపి మరున్నదీసూనుపైఁ గవియింపఁ । బవనజపార్థుల ప్రాపుకలిమి
వెఱ పేది యందఱుఁ దఱుమఁ గౌరవపతి । తమ్ములు దొరలును, దానుఁ దాతఁ
గడచి తాఁకినఁ బోరు ఘన మయ్యె నప్పుడు । సౌభద్రుఁ డమ్మహీశ్వరుని నొంచె;

తే. ద్రోణతనయుండు శైనేయు బాణమయ శ । రీరుఁ గావించెఁ జేదీశ పౌరవు లస
మాన విక్రము లై యొప్ప మారుతాత్మ । జుండు రారాజు నేనిక పిండుఁ జదిపె. **371**

ప్రతిపదార్థం: మాత్స్య= మత్స్య దేశపురాజు; కైకేయ= కేకయదేశపురాజు; ఆది= ముందుగాగల; మనుజ+ ఇంద్రులకున్= రాజులకు; చేయన్+కల+అట్టి= సమర్థులైనట్టి; యోధవీరులకున్= యోధులకును, వీరులకును; చేయి+చూపి= చేతితో చూపించి; మరుత్+నదీసూనుపైన్= భీష్మాచార్యుడి మీదికి; కవియింపన్; పవనజపార్థుల= భీమార్జునులయొక్క; ప్రాపుకలిమి= అండ అధికంగా ఉండటంచేత; వెఱపు+ఏది= భయంలేకుండా; అందఱున్= పాండవసేనలోని వారందరున్నూ; తఱుమన్= వెంబడిబడగా; కౌరవపతి; అతడి తమ్ములు; దొరలును= ఇతర రాజులును; తాను; తాతన్= తాతను(భీష్ముడిని); కడచి= అతిక్రమించి; తాఁకినన్= మార్కొనగా; పోరు= యుద్ధం; ఘనము+అయ్యెన్= భయంకరంగా ఉండినది; అప్పుడు= అట్టి సమయంలో; సౌభద్రుఁడు= అభిమన్యుడు; ఆ+మహీ+ఈశ్వరునిన్= ఆ దుర్యోధనుడిని; నొంచెన్= నొప్పించాడు; ద్రోణతనయుండు= ద్రోణాచార్యుడి కొడుకు అశ్వత్థామ; శైనేయున్= శినివంశం వాడైన సాత్యకిని; బాణమయ శరీరున్= బాణాలతో నిండిన శరీరం కలవాడినిగా; కావించెన్= చేశాడు; చేదీశ పౌరవులు= చేదిరాజు, పురువంశపురాజు; అసమాన విక్రములు+ఐ= సాటిలేని పరాక్రమం కలవారై; ఒప్పన్= ఒప్పియుండగా; మారుత+ఆత్మజుండు= వాయుపుత్రుడు భీముడు; రారాజు+ఏనికపిండున్= దుర్యోధనుడి యొక్క ఏనుగుల గుంపును; చదిపెన్= చంపివేశాడు.

తాత్పర్యం: ధర్మరాజు చెప్పినట్లుగా, ధృష్టద్యుమ్నుడు చేసైగతో మత్స్యదేశపురాజు, కేకయరాజు మొదలైన రాజులను, బాగా యుద్ధం చేయగల యోధులను వీరులను భీష్ముడి మీదికి కవ్వింపజేశాడు. వీరందరూ భీమార్జునులు అండగా

ఉండడంచేత ఎంతమాత్రం జంకుగొంకు లేకుండా భీష్ముడి మీదికి విరుచుకపడ్డారు. దీన్ని చూచి, దుర్యోధనుడి అందరు తమ్ముళ్ళు, ఇంకా ఉన్న రాజులు, దుర్యోధనుడు - వీరంతా ఏకమై భీష్ముడికి ముందుగా ఆయనకు రక్షణగా నిలిచి, పాండవసేనను ఎదుర్కొన్నారు. అప్పుడు యుద్ధం చాలా భయంకరంగా జరిగింది. అభిమన్యుడు దుర్యోధనుడిని నొచ్చిపోయేట్టు చేశాడు. అశ్వత్థామ సాత్యకి శరీరాన్ని బాణమయం చేశాడు. చేదిపౌరవుల యుద్ధం సాటిలేనిదిగా ఒప్పినది. భీముడేమో దుర్యోధనుడి ఏనుగుల గుంపునంతటినీ చంపివేశాడు.

వ. మఱియు నందు నిందును మందాకినీనందనుపయిం ద్రోవను నతనిం గావను దలంచి గడంగిన సైనికు లనేకులు నానాప్రకారంబుల వివిధాయుధంబులం బెనంగుచుండ. 372

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకా కూడా; అందున్= ఆ పాండవుల సైన్యంలో; ఇందును(న్)= ఈ కౌరవసేనలోను; మందాకినీ నందనుపయిన్= భీష్ముడి మీదికి; త్రోవను= పడదోయడానికి; అతనిన్= ఆ భీష్ముడిని; కావను= కాపాడటానికి; ఉద్దేశించి; కడంగిన= పూనుకొన్న; అనేకులు= పలువురు; సైనికులు= భటులు; నానా ప్రకారంబులన్= పలు రకాలుగా; వివిధ+ఆయుధంబులన్= పలు విధాలైన ఆయుధాలతో; పెనంగుచున్+ఉండన్= యుద్ధం చేస్తూండగా.

తాత్పర్యం: పాండవ పక్షంలోని చాలామంది భటులు ఆ భీష్ముడిని కూలదోయడానికి, కౌరవుల భటులు పలువురు ఆ భీష్ముడిని కాపాడటానికి, ప్రయత్నించుతూ నానా విధాలుగా, నానా విధాలైన అస్త్రశస్త్రాలతో యుద్ధం చేస్తుండగా.

క. మొనసి మృగేంద్రుఁ మృగేంద్రుఁడు । చెనయంజను పగిది నరుఁడు శీఘ్రగతిన్ శాం
తనవుపయిఁ గవియ దుశ్శా । సనుఁ డడ్డము సొచ్చె దేవసంఘము వొగడన్. 373

ప్రతిపదార్థం: మృగ+ఇంద్రుఁడు= మృగములకు రాజు - సింహము; మొనసి= పూనుకొని; మృగ+ఇంద్రున్= మృగాల రాజు సింహాన్ని; చెనయన్= ఎదిరించటానికి; చనుపగిదిన్= వెళ్ళే మాదిరి; నరుఁడు= అర్జునుడు; శీఘ్రగతిన్= వేగంతో కూడిన నడకతో; శాంతనవుపయిన్= భీష్ముడి మీదికి; కవియ(న్); దేవసంఘము= దేవతలసమూహం; పొగడన్= పొగడగా; దుశ్శాసనుఁడు; అడ్డము+చొచ్చెన్= అడ్డంగా ప్రవేశించాడు.

తాత్పర్యం: పూనికతో సింహం మరో సింహాన్ని ఎదుర్కొనటానికి వెళ్ళేమాదిరి అర్జునుడు త్వరత్వరగా భీష్ముడి మీదికి కవిశాడు. అంతలో శాంతనవుడిని కాపాడటానికి దుశ్శాసనుడు ఇద్దరికీ అడ్డంగా వచ్చాడు. ఈ సన్నివేశాన్ని తిలకించిన దేవతలు దుశ్శాసనుడి శౌర్యాన్ని పొగిడారు.

విశేషం: అలం: ఉపమ.

ఆ. ఆతని కప్ప డెదుర నమ్మొన నెవ్వరుఁ । జాలరైరి సవ్యసాచి యొకఁడ
నిశితవిశిఖపంక్తి నిగిడించి నొప్పించి । యొత్తి భీష్మువెనుక కొదుఁగఁ జేసె. 374

ప్రతిపదార్థం: అప్పుడు; ఆ+మొనన్= ఆ పాండవుల సేనలో; ఎవ్వరున్= ఏ యోధులుగాని; ఆతనికిన్= ఆ దుశ్శాసనుడికి; ఎదురన్= ఎదిరించడానికి; చాలరు+ఐరి= సమర్థులు కాలేకపోయారు; సవ్యసాచి= అర్జునుడు; ఒక్కఁడు+అ= ఒకడే; నిశిత విశిఖ పంక్తిన్= పదునైన బాణాల వరుసలను; నిగిడించి= వ్యాపింపచేసి; నొప్పించి= బాధపెట్టి; ఒత్తి= పొడిచి; భీష్ము వెనుకకున్= భీష్ముడి వెనుకవైపునకు; ఒదుఁగన్+చేసెన్= తొలగేట్లుగా చేశాడు.

తాత్పర్యం: దుశ్శాసనుడు దేవతల పొగడ్తలందుకుంటూ యుద్ధంచేస్తున్నాడు. అప్పుడు అతన్ని ఎదిరించగల వీరుడే పాండవసేనలో ఎవడూ లేకపోయాడు. ఒక్క అర్జునుడు మాత్రం ఎదుట నిల్చి, పదునుగల బాణాల కుప్పలు గుప్పించి, నొప్పించి, దుశ్శాసనుడిని నొక్కి భీష్ముడి వెనుక నక్కేటట్లు చేశాడు.

వ. తదవసరంబున సరభసంబున. 375

ప్రతిపదార్థం: తద్+అవసరంబునన్= ఆ సమయంలో; సరభసంబునన్= తొందరపాటుగా.

తాత్పర్యం: అర్జునుడు బాణాలు గుప్పించే సమయంలో తొందరపాటుతో. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. భగదత్తుని నా కవ్వడి । వెగ డొందఁగఁ జేసి యతని వెల్లేనుఁగుఁ గెం
పుగఁ జేసిన నాతండును । నిగిడెం బాంచాలమేదినీపతిమీఁదన్. 376

ప్రతిపదార్థం: ఆ+కవ్వడి= ఆ అర్జునుడు; భగదత్తునిన్= నరకాసురుడి కొడుకును; వెగడు+ఒందఁగన్+చేసి= తల్లడపడేటట్లు చేసి; అతని వెల్ల+ఏనుఁగున్= అతడి తెల్ల ఏనుగును; కెంపుగన్+చేసినన్= ఎర్ర బారేటట్లు చేయగా; ఆతండునున్= ఆ భగదత్తుడున్నూ; పాంచాల మేదినీ పతి మీఁదన్= ద్రుపదుడి మీదికి; నిగిడెన్= విజృంభించాడు.

తాత్పర్యం: అర్జునుడు భగదత్తుడిని తల్లడిల్లజేశాడు. అతడి తెల్ల ఏనుగును బాణాలతో కొట్టి రక్తసిక్తం చేసి ఎరుపురంగు గల దానినిగా చేశాడు. ఆ భగదత్తుడు ద్రుపదమహారాజు మీదికి విజృంభించాడు.

వ. ఆఖండలనందనుండును శిఖండిం దటిమి తెఱపి సూపి దేవవ్రతు నేయుమని పురికొలిపె నంత. 377

ప్రతిపదార్థం: ఆఖండల నందనుండును= ఇంద్రుని కొడుకు అర్జునుడును; శిఖండిన్; తటిమి= వెంబడిబడి ; తెఱపి= అవకాశాన్ని, చూపి= కనుపరచి; దేవవ్రతున్= భీష్ముడిని; ఏయుము+అని= బాణాలతో కొట్టుము అని; పురికొలిపెన్= ప్రోత్సహించాడు; అంతన్= అప్పుడు.

తాత్పర్యం: అర్జునుడు శిఖండిని బలాత్కరించి, అవకాశాన్ని చూపించి 'భీష్ముడిని బాణాలతో కొట్టుము' అని ప్రోత్సాహపరిచాడు. అప్పుడు. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. మనయోధప్రకరము శాం । తనవుం దలకడచి యత్యుదగ్రత నయ్య
ర్జునుఁ బొదివె నతం డలిగినఁ । బెనుగాలిం దూలు మొగిలుపిండునుబోలెన్. 378

ప్రతిపదార్థం: మనయోధప్రకరము= మన(కౌరవ) వీరులసమూహం; శాంతనవున్= భీష్ముడిని; తలకడచి= అతిక్రమించి ముందునిలబడి; అతి+ఉదగ్రతన్= చాలాభయంకరంగా; ఆ+అర్జునున్= ఆ అర్జునుడిని; పొదివెన్= కప్పివేసింది; అతండు= ఆ అర్జునుడు; అలిగినన్= కోపించినవాడుకాగా; పెనుగాలిన్= తుపానుగాలిచేత; తూలు= తొలగిపోవు; మొగిలుపిండును+పోలెన్= మబ్బులసమూహం మాదిరి (చెదరిపోయింది).

తాత్పర్యం: కౌరవసేనలోని యోధులందరూ భీష్ముడిని కాపాడడానికి ఆయనకు ముందుభాగంలో నిలబడి చాలా భయంకరంగా అర్జునుడిని కమ్మివేశారు. ఆ అర్జునుడు అలుగగా, మనసేనలంతా పెనుగాలికి తుత్తునియలై చెదిరిపోయే కారుమబ్బుల మాదిరి చెదరిపోయాయి.

విశేషం : ఈ పద్యంలో 'పెనుగాలిం దూలు మొగిలిపిండును బోలెన్' అను ఉపమానవాక్యం వాచ్యంగా చెప్పబడినది. 'అర్జునుడలిగితే మన సేనాసమూహం చెల్లాచెదరై పోతుంది' అనే ఉపమేయవాక్యం, గమ్యమానంగా ఉన్నది. ఇది ఒక విధమైన రచనా వైఖరి అనుకోదగినది.

వ. (తూలె) నట్లు దూలిన. 379

ప్రతిపదార్థం: తూలెన్; అట్లు+తూలిన= ఆ విధంగా తొలగిపోగా.

తాత్పర్యం: ఆ విధంగా మన సేనలు తొలగిపోగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

ఆ. అట్టియెడ శిఖండి యాపగాసుతుమీఁద । వాలుటమ్ము లేయ వాని నేయ
నొల్ల కతఁడు గెలని యోధవీరావళి । నేయుచుండె శౌర్య మెసకమెసఁగ. 380

ప్రతిపదార్థం: అట్టి+ఎడన్; శిఖండి; ఆపగాసుతుమీఁదన్= భీష్ముడిమీద; వాలు+అమ్ములు= పదునుగల బాణాలు; ఏయన్= ప్రయోగించగా; వానిన్= ఆ శిఖండిని; ఏయన్+ఒల్లక= బాణాలతో కొట్టడానికి ఇష్టపడక; అతఁడు= ఆ భీష్ముడు; కెలని= ప్రక్కన ఉన్న; యోధవీర+ఆవళిన్= యోధవీరుల వరుసను; శౌర్యము= పరాక్రమము; ఎసకము= విజృంభణము; ఎసఁగన్= అతిశయింపగా; ఏయుచుండెన్= బాణాలతో కొట్టుతూ ఉన్నాడు.

తాత్పర్యం: ఆ సమయంలో శిఖండి భీష్ముడి మీద పదునైన బాణాలు ప్రయోగించాడు. భీష్ముడు వాడిమీద బాణాలు వేయకుండా, యుద్ధభూమిలోనుండే వీరులమీద, యోధులమీద, తన శౌర్య విజృంభణం అతిశయించగా, బాణాలు చాలా ప్రయోగించాడు.

క. నరుఁడు శిఖండిం దటిమిన । శరము లతఁడు భీష్మునురుభుజామధ్యమునం
గురియఁగ నవ్వుచునుండెం । గరి యంత్రజలంబు దొరఁగఁగా నున్న క్రియన్. 381

ప్రతిపదార్థం: నరుఁడు= అర్జునుడు; శిఖండిన్; తటిమినన్= బలవంతపెట్టగా; అతఁడు= శిఖండి; భీష్మున్= భీష్మునియొక్క; ఉరు భుజామధ్యమునన్= విశాలమైన రొమ్ముపై; శరములు= బాణాలను; కురియఁగన్= వర్షింపజేయగా; యంత్రజలంబు= యంత్రమునుండి నీరు; తొరఁగన్+కాన్= ప్రవహించుచుండగా; కరి= ఏనుగు; ఉన్న క్రియన్= ఉండే విధంగా; నవ్వుచున్+ఉండెన్= నవ్వుతున్నాడు.

తాత్పర్యం: అర్జునుడు నిర్బంధపెట్టగా, శిఖండి భీష్ముడి విశాలమైన వక్షస్ స్థలంపైన బాణవర్షం కురిపించాడు. దానికి, జలయంత్రం నుండి నీరు బయటికి వస్తూ ఉంటే వినోదిస్తున్న ఏనుగుమాదిరిగా భీష్ముడు నవ్వసాగాడు. కాని, ఏ మాత్రమూ కష్టపడలేదు.

వ. ఇట్లు దేవవ్రతుండు శిఖండి యేయుట సరకుసేయక యతండగ్గమైననేయక సాయకంబులు సవ్యసాచిపయి నిగిడింప మగిడి దుశ్శాసనుండు గడంగి కవ్వడి వెగడుపడునంతకయ్యంబు సేసి నొచ్చి పాసినం గౌరవపతి గనుంగొని యెలుంగు సూపి చేయివీచి పురికొల్పినం గళింగమాళవ బాహ్లిక విదేహ శూరసేన ప్రముఖ బలంబులు బలమర్దనుతనయు దెసకుం గవిసిన 382

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; దేవవ్రతుండు= భీష్ముడు; శిఖండి+ఏయుట= శిఖండియొక్క బాణ ప్రయోగాన్ని; సరకు+చేయక= లెక్కచేయకుండా; అతండు= ఆ శిఖండి; అగ్గము+ఐనన్= అధీనం(అందుబాటు)లో ఉన్నప్పటికీ; ఏయన్= బాణాలతో కొట్టక; సవ్యసాచిపయిన్= అర్జునుడిమీదికి; సాయకంబులు= బాణాలు; నిగిడింప(న్)= వ్యాపింపజేయగా; దుశ్శాసనుండు; మగిడి= తిరిగి; కడంగి= పూనుకొని; కవ్వడి= అర్జునుడు; వెగడుపడునంత= తల్లడపడేటంతగా; కయ్యంబు+చేసి= యుద్ధంచేసి; నొచ్చి= బాధచెంది; పాసినన్= తొలగిపోగా; కౌరవపతి= దుర్యోధనుడు; కనుంగొని= తెలిసికొని; ఎలుంగు+చూపి= కంఠస్వరాన్ని

వినిపింపజేసి(గొంతిచ్చి); చేయివీచి= చేతితో సైగచేసి; పురికొల్పినన్= ప్రోత్సాహపరచగా; కళింగ= కళింగదేశపురాజు; మాళవ= మాళవదేశపురాజు; బాహ్లిక= బాహ్లిక దేశపురాజు; విదేహ= ఆ పేరుగల దేశపురాజు; శూరసేన= ఆ దేశపురాజు; ప్రముఖ= మొదలుగాగల రాజుల యొక్క; బలంబులు= సేనలు; బలమర్దను తనయు దెసకున్= అర్జునుడున్న వైపునకు; కవిసిన(న్).

తాత్పర్యం: భీష్ముడు శిఖండి తన మీద ప్రయోగించే బాణాలను లెక్కచేయలేదు. ఆ శిఖండి అందుబాటులో దగ్గరగా ఉన్నాకూడా బాణాలతో కొట్టలేదు. అర్జునుడి మీద బాణాలు ప్రయోగించాడు. దుశ్శాసనుడు తిరిగి, వచ్చి అర్జునుడు ఓర్చుకోలేనంతగా యుద్ధంచేసి, తాను నొచ్చి, పారిపోయాడు. ఈ విషయం తెలిసికొన్నట్టి దుర్యోధనుడు ఎలుగెత్తి అరచి చేయి విసరుతూ, కళింగ మాళవ బాహ్లిక విదేహ శూరసేనులు ముఖ్యులుగా, గల బలాలను ప్రోత్సాహపరచాడు. వీరందరు అర్జునుడి మీదికి కవియగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

తే. అతఁడు దివ్యాస్త్రజాలంబు నతిశయంబు । సూపి చతురంగబలముల రూపు మాపి
యుఱక తఱిమి శిఖండికిఁ దెఱపి సూప । వాఁడి తూపులు భీష్ముపై వాఁడు నినిచె. 383

ప్రతిపదార్థం: అతఁడు= ఆ అర్జునుడు; దివ్య+అస్త్రజాలంబున్= అమోఘాలైన ఆయుధాల సమూహంయొక్క; అతిశయంబున్= గొప్పతనాన్ని; చూపి= కనపరచి; చతురంగబలములన్= రథ, గజ, తురగ పదాతులనే నాలుగు రకాల సేనలను; రూపుమాపి= నాశనంచేసి; ఉఱుక= మాటాడక; తఱిమి= పరుగెత్తించి; శిఖండికిన్= శిఖండికి; తెఱపి= అవకాశాన్ని; చూపన్= చూపించగా; వాఁడు= ఆ శిఖండి; వాఁడితూపులు= పదునైన బాణాలు; భీష్మునిపైన్= భీష్ముడిమీద; నినిచెన్= నింపాడు.

తాత్పర్యం: ఆ అర్జునుడు దివ్యాస్త్రాల గొప్పతనాన్ని చూపించుతూ, మన చతురంగ బలాన్ని నాశనంచేసి, పరుగెత్త చేశాడు. శిఖండికి సందు చూపాడు. అప్పుడు అతడు భీష్ముడిపైన పదునైన బాణాలను బాగా నాటాడు.

వ. ఆ సమయంబునం గృపశల్యవివింశతివికర్ణులం గూర్చికొని పేర్చి దుశ్శాసనుండు శాంతనవున కడ్డపడినం
బార్థుం డయ్వేవురను విరథులం జేసిన. 384

ప్రతిపదార్థం: ఆ సమయంబునన్= అట్టి సమయంలో; దుశ్శాసనుండు; కృప; శల్య; వివింశతి; వికర్ణులన్= వికర్ణుడు అనే నలుగురిని; కూర్చికొని= వెంటతీసికొని; పేర్చి= విజృంభించి; శాంతనవునకున్= భీష్ముడికి; అడ్డపడినన్= అడ్డంగా నిలబడగా; పార్థుండు= అర్జునుడు; ఆ+ఏవురను= ఆ ఐదుగురిని; విరథులన్= రథాలు లేనివాళ్ళనుగా; చేసినన్= చేయగా.

తాత్పర్యం: అప్పుడు దుశ్శాసనుడు, కృపుడిని, శల్యుడిని, వివింశతిని, వికర్ణుడిని వెంటబెట్టుకొని విజృంభించుతూ, భీష్ముడికి రక్షణగా ఆయనముందు నిలబడ్డాడు. అర్జునుడు ఆ ఐదుగురు యోధుల రథాలనూ ధ్వంసం చేయగా.

క. కురుపతియు ననుజవర్గముఁ । బరమక్రోధమునఁ దెంపు బలుపును మెఱయన్
సురనాథనందనునిపై । నురవడిఁ ద్రోచుటయు సేన లుగ్రత నడరెన్. 385

ప్రతిపదార్థం: కురుపతియున్= కురురాజు దుర్యోధనుడు; అనుజవర్గమున్= అతని తమ్ముళ్ళగుంపు; పరమక్రోధమునన్= అధికమైన కోపంతో; తెంపు= తెగువ; బలుపును= బలము; మెఱయన్= బయల్పడగా; సురనాథనందనుని పైన్= అర్జునుడిమీద; ఉరవడిన్= అతివేగంతో, త్రోచుటయున్= కవియగా; సేనలు= సైన్యాలు; ఉగ్రతన్= భయంకరంగా; అడరెన్= విజృంభించాయి.

తాత్పర్యం: దుర్యోధనుడు, అతడి సోదరులూ కోపోద్దీపితులై, తమ తెగువ, బలం బయటపడేటట్లు అర్జునుడి మీదికి చాలా వేగంతో కవిశారు. అప్పుడు రెండు పక్షాల సేనలూ బాగా విజృంభించాయి.

క. పాండవ బలములు దలపడి । భండన మొనరింప నగ్ర భాగంబున ను
ద్దండతఁ బోరెడు మనుమల । తండము గని మెచ్చి య ప్పితామహుఁడు వెసన్. 386

ప్రతిపదార్థం: పాండవబలములు= పాండవులయొక్క సేనలు; తలపడి= తాకి; భండనము+ఒనరింపన్= యుద్ధంచేయగా; అగ్రభాగంబునన్= తనకు ముందరభాగంలో; ఉద్దండతన్= అతిశయంగా; పోరెడు= యుద్ధంచేస్తూ ఉండే; మనుమల తండమున్= దుర్యోధనాదులగు మనుమల గుంపును; ఆ+పితామహుండు= ఆ భీష్ముడు; కని= చూచి; మెచ్చి= మెచ్చుకొని; వెసన్= వేగంతో.

తాత్పర్యం: పాండవులు ఎదురెక్కి యుద్ధం చేస్తూండగా, తనముందు భాగంలో నిలిచి అతి గొప్పయుద్ధం చేస్తూ ఉన్న తన మనుమళ్ళందరినీ భీష్ముడు చూచి, మెచ్చుకొంటూ వెంటనే. (తరువాతి పద్యంతో అన్వయం.)

తే. అరిబలంబుపై నొక్క దివ్యాస్త్ర మేయఁ । దలఁచి యరిఁబోసి తిగిచి యుదగ్రవృత్తిఁ
గవిసి ముందట నున్నశిఖండిచూడ్కి । దొడరుటయుఁ దాల్మిమైఁ దెగ యుడిపె నధిప! 387

ప్రతిపదార్థం: అధిప!= ఓ ధృతరాష్ట్ర మహారాజా! అరిబలముపైన్= శత్రుసైన్యంమీద; ఒక్క= ఒకానొక అపూర్వమైన; దివ్య+అస్త్రము= దివ్యమైన ఆయుధాన్ని; ఏయన్= ప్రయోగించాలని; తలఁచి= అనుకొని; అరి= శరసంధానస్థానమైన అల్లెత్రాటి నడిమిభాగంలో; పోసి= బాణాన్ని సంధించి; తిగిచి= ఆకర్షించి(లాగి); ఉదగ్రవృత్తిన్= భయంకరమైన నడవడితో; కవిసి= మార్కొని; ముందటన్+ఉన్న= తనకు ముందు ప్రక్కన ఉన్నట్టి; శిఖండి; చూడ్కి= కంటికి; తొడరుటయున్= కనపడగానే; తాల్మిమైన్= ఓర్పుతో; తెగ= ఎక్కుపెట్టిన అల్లెత్రాటిని; ఉడిపెన్= ఉడిగింపజేశాడు. (దించివేశాడు)

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్రమహారాజా! భీష్ముడు ఒకానొక మహాస్త్రాన్ని శత్రుసైన్యాల మీద వేయాలని అనుకొన్నాడు. విల్లు ఎక్కుపెట్టాడు. అల్లెత్రాటి మధ్యలో బాణాన్ని పెట్టాడు. ఆ బాణం వేగంగా దూరంగా పోవడానికి బాగా లాగాడు. భయంకరంగా కవిశాడు. ఇంతలో తనకు ముందు (పేడి) శిఖండి తన కంటికి అగుపడ్డాడు. దానితో, భీష్ముడు ఎంత కోపంతో ఉరికాడో, అంత శాంతంతో వెనుకకు తగ్గాడు. ఎక్కుపెట్టిన వింటిని దించివేశాడు.

వ. అంత. 388

తాత్పర్యం: ఆ తరువాత.

క. సోమక మాత్స్యప్రముఖో । ద్దామబలము లేచి పెలుచఁ దఱుముటయును సం
గ్రామతలము సేనాంగ । స్తోమాంగమయంబు సేసె దుర్దాంతగతిన్. 389

ప్రతిపదార్థం: సోమక= ద్రుపదుడు; మాత్స్య= విరటుడు; ప్రముఖ= ముఖ్యులుగా గలవారి యొక్క; ఉద్దామబలములు= గొప్ప సేనలు; ఏచి= విజృంభించి; పెలుచన్= కోపంతో; తఱుముటయునున్= కవియగా; (భీష్ముడు)దుర్దాంతగతిన్= అణచరాని పోకడతో; సంగ్రామతలమున్= యుద్ధభూమిని; సేనా= సైన్యానికి; అంగ= అంగాలైన రథ, గజ, తురగ, పదాతులయొక్క; స్తోమ= సమూహాలయొక్క; అంగమయంబున్= అవయవా(శరీరా)లతో నిండిన దానినిగా; చేసెన్= చేశాడు.

తాత్పర్యం: ద్రుపదుడు, విరాటుడు మొదలైనవారి బలాలు విచ్చలవిడిగా విజృంభించి భీష్ముడిపై కవిశాయి. అప్పుడు భీష్మాచార్యుడు అడచరాని పోకడతో ఆ యుద్ధభూమినంతా శత్రువుల చతురంగబలాల అంగాలతో నింపివేశాడు. అనగా శత్రువుల, రథాలను, ఏనుగులను, గుర్రాలను, కాల్బలాన్ని తునాతునకలు చేశాడు.

క. సేనల నిమ్మెయి భీష్ముఁడు । దీనతఁ బొందింప నలిగి ధీరత్వము వీ
రానీకం బగ్గింప శతానీకుఁ । డెదిర్చె నతని నాసురభంగిన్. 390

ప్రతిపదార్థం: భీష్ముఁడు; ఈ+మెయిన్= ఈ విధంగా; సేనలన్= సైన్యాలను; దీనతన్= భయాన్ని; పొందింపన్= కలిగింపగా; అలిగి= కోపించి; వీర+అనీకంబు= శూరులసమూహం; ధీరత్వము= (తన) ధైర్యాన్ని; అగ్గింపన్= పొగడుతుండగా;శతానీకుఁడు= విరాటరాజు తమ్ముడు; అతనిన్= ఆ భీష్ముడిని; ఆసురభంగిన్= రాక్షస సంబంధమైన రీతిలో; ఎదిర్చెన్= ఎదిరించాడు.

తాత్పర్యం: భీష్ముడు పైన చెప్పిన విధంగా పాండవుల సేనలకన్నింటికీ మహాభయాన్ని కలిగించాడు. అక్కడ ఉన్న వీరులందరూ తన ధైర్య శౌర్యాలను పొగడగా శతానీకుడు (విరాటరాజు తమ్ముడు) రాక్షసుడి మాదిరి ఆ భీష్ముడి మీదికి ఎగబడినాడు.

విరటుతమ్ముఁడగు శతానీకుండు భీష్మునిచేఁ జచ్చుట(సం. 6-113-24)

వ. ఇట్లు దాఁకి విరటుతమ్ముండు వాలమ్ముల నొప్పించినం గోపించి. 391

ప్రతిపదార్థం: విరటు తమ్ముండు= విరాటరాజు తమ్ముడు శతానీకుడు; ఇట్లు= పైన చెప్పిన ప్రకారం; తాఁకి= మార్కొని; వాలు+అమ్ములన్= పదునుగల బాణాలతో; నొప్పించినన్= నొప్పి కలిగేటట్లు చేయగా; కోపించి= భీష్ముడు కోపంచెంది.

తాత్పర్యం: పైన చెప్పిన విధంగా శతానీకుడు భీష్ముడిని మార్కొని, చురుకైన బాణాలను ప్రయోగించి, అతడికి బాధను కలిగించగా భీష్ముడు కోపించి. (తరువాతి పద్యంతో అన్వయం.)

శా. విల్లుం గేతువుఁ ద్రుంచి సూతు వెస నుర్విం గూల్చి రథ్యంబులన్
డొల్లం దీవ్రత నేసి యాతఁడు భుజాటోపంబు శౌర్యంబు శో
భిల్లన్ వైచిన శక్తియుం దునిమి యాభీలద్యుతిప్రస్ఫుర
ద్భల్లం బొక్కటి భీష్ముఁ డేసి నఱకెం దన్మస్తకం బుగ్రతన్. 392

ప్రతిపదార్థం: భీష్ముఁడు; విల్లున్= వింటిని; కేతువున్= ధ్వజాన్ని; త్రుంచి= తునుకలు చేసి; వెసన్= వెంటనే; సూతున్= సారథిని; ఉర్విన్= నేలమీద; కూల్చి= కూలదోసి; రథ్యంబులన్= గుర్రాలను; డొల్లన్= కిందపడేట్టుగా; తీవ్రతన్= గట్టిగా; ఏసి= బాణాలు ప్రయోగించి; ఆతఁడు= ఆ శతానీకుడు; భుజ+ఆటోపంబు= చేతుల విజృంభణం; శౌర్యంబు= శూరత్వము; శోభిల్లన్= ప్రకాశింపగా; వైచిన= ప్రయోగించినట్టి; శక్తియున్= శక్తి అనే ఆయుధాన్ని; తునిమి= తుంటలుగా చేసి; ఒక్కటి= ఒకానొకటైన; ఆభీల= భయంకరమైన; ద్యుతి= కాంతితో; ప్రస్ఫురత్= ప్రకాశిస్తున్న; భల్లంబున్= బల్లెమును; ఏసి= ప్రయోగించి; ఉగ్రతన్= భయంకరంగా; తద్+మస్తకంబు= ఆ శతానీకుడి తలను; నఱకెన్= ఖండించాడు.

తాత్పర్యం: భీష్ముడు ఆ శతానీకుడి వింటిని, పతాకాన్ని తునకలు చేశాడు. అతడి సారథిని నేలపై పడేటట్లు కొట్టాడు. రథానికుండే గుర్రాలను నేల దొరలేటట్లుగా చేశాడు. ఆ శతానీకుడు, భుజబలం, శూరత్వం ఒప్పుతూ ఉండగా 'శక్తి' అనే ఆయుధాన్ని భీష్ముడి మీదికి ప్రయోగించగా, భీష్ముడు దాన్ని తునుకలు చేశాడు. కాంతితో జ్వలిస్తూండే ఒకానొక బల్లేన్ని అతడి మీదికి ప్రయోగించి, భయంకరంగా ఆ శతానీకుడి తలను భీష్ముడు ఖండించాడు.

వ. ఇవ్విధంబున శతానీకుం జంపిన. 393

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ చెప్పిన ప్రకారంగా; శతానీకున్; చంపినన్.

తాత్పర్యం: పైన చెప్పిన ప్రకారంగా భీష్ముడు విరాట మహారాజు తమ్ముడగు శతానీకుడిని చంపివేశాక. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. మొనలెల్ల విఱుగ మధ్యం । దినమున యినుమాడ్కి బయలఁ దేజోనిధి శం
తను సూనుఁ డొప్పె నప్పుడు । గనుఁగొని యిట్లనియె శౌరి గాండివితోడన్. 394

ప్రతిపదార్థం: మొనలు= సైన్యాలు; ఎల్లన్= అన్నియు; విఱుగన్= ఓడిపోగా; తేజోనిధి= తేజస్సుకు గనివంటివాడైన; శంత నుసూనుఁడు = శంతను మహారాజు యొక్క కుమారుడు - భీష్ముడు; బయలన్= శూన్య ప్రదేశంలో (ఆకాశంలో); మధ్యందినమునన్= మధ్యాహ్న సమయంలోని; ఇనుమాడ్కిన్= సూర్యుడి విధంగా; ఒప్పెన్= ప్రకాశించాడు; అప్పుడు= అట్టి సమయంలో; శౌరి= కృష్ణుడు; కనుఁగొని= చూచి; గాండివితోడన్= అర్జునుడితో; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: శతానీకుడు చావగానే, సైన్యాలు భయపడి పారిపోయాయి. ఆ సమయంలో నిర్మానుష్యంగా ఉన్న ఆ యుద్ధరంగంలో తేజఃపుంజంతో వెలిగే భీష్ముడు ఆకాశంలో ప్రకాశించే సూర్యుడి మాదిరి అగుపడ్డాడు. శ్రీకృష్ణుడు, ఈ పరిస్థితిని బాగా గమనించి, అర్జునుడితో ఇట్లా అన్నాడు:

విశేషం: అలం: ఉపమాలంకారం. భీష్ముడికి సూర్యుడితో పోలిక. ఇద్దరూ తేజోనిధులే. 'మాడ్కి' ఉపమావాచకం, ఒప్పి ఉండటం సమానధర్మం.

క. ' మనమోహరములు సెడి, కను । కనిఁ బాఱెడు నిప్ప డాపగాసుతునకు గ్ర
క్కున నీవు మార్కొనక త । క్కినఁ గార్యము దప్పఁ బోదివి గెలువుము కడఁకన్.' 395

ప్రతిపదార్థం: ఇప్పుడు= ఈ సమయంలో; మనమోహరములు= మనయొక్క వ్యూహాలు; కనుకనిన్= తొట్రుపాటుతో; చెడి= కనబడకుండా పోయి; పాఱెడున్= పరుగెత్తిపోతున్నాయి; గ్రక్కునన్= వెంటనే; నీవు; ఆపగాసుతునకున్= భీష్ముడికి; మార్కొనక= ఎదురు నిలబడకుండా; తక్కినన్= తప్పుకొన్నట్లయితే; కార్యము= పని; తప్పున్= చెడిపోవును; కడఁకన్= ప్రయత్నంతో; పొదివి; గెలువుము= జయించుము.

తాత్పర్యం: 'ఓ అర్జునా! మన సైన్యాలు శతానీకుడి మరణం రణంలో చూచి, అదిరి, బెదిరి, కనబడకుండా పారిపోతున్నాయి. కనుక ఇప్పుడు నీవు భీష్ముడిని మార్కొనకుండాపోతే మన పని చెడిపోతుంది. కాబట్టి, నీవు ప్రయత్నంతో భీష్ముడిని కవిసి జయించుము.

వ. అనిన విని యతండు రథరథ్యసారథిసహితంబుగా సురనదీనందను నమందమార్గణపుంజంబునం బొదివె శిఖండియుం జేరి నారాచంబుల నొప్పించిన దేవవ్రతుండు వాని నేయ నొల్లనిసందున నాసవ్యసాచి యతని విల్లు దునిమి పెల్లేయుచున్నం జూచి సైరింపక శలశల్యకృప కృతవర్మచిత్రసేనభూరిశ్రవః ప్రభృతివీరలోకం బతిలోకంబుగ దివ్యాస్త్రజాలంబులు నెఱపుచు నేయుచు భీష్మున కడ్డపడుండు దలకడవుం'డను నెలుంగులు నింగి ముట్ట బలసమేతంబుగా నడరినం గని సమీర నందన సాత్యకి సౌభద్ర విరాట ద్రుపద ఘటోత్కచ ప్రముఖ యోధవర్గం బనర్గళభంగిం దఱుమం దత్సైన్యంబులు గూడుకొని కవిసిన దివిజదానవసంపాతసమయ సమరం బయ్యె నందుఁ బురందరనందనుండు మన సైనికుల కందఱ కన్నిరూపులయి యైంద్రవారుణాగ్నేయాది

మహాశరంబులం దెరల్చుచు సురక్షితుం డైన శిఖండిం బురికొల్పికొని మీ తండ్రి నేయించుచు నతండెన్ని విండ్లెత్తిన నన్నిటిం దోడ్తోన తునుమాడుచుండె నా క్రీడిపై నతం డుగ్రశక్తి ప్రయోగింప నదియునుం ద్రుంచి సూతునిం గేతనంబునుం గూల్చిన. 396

ప్రతిపదార్థం: అనినన్; విని; అతండు= ఆ అర్జునుడు; రథ= రథాలు; రథ్య= గుర్రాలు; సారథి= రథంనడిపేవాడు - వీటితో; సహితంబుగాన్= కూడునట్లుగా; సురనదీనందనున్= భీష్ముడిని; అమందమార్గణ పుంజంబునన్= తక్కువకాని బాణాల సమూహంతో; పొదివెన్= కప్పివేశాడు; శిఖండియున్= శిఖండికూడా; చేరి= కలిసికొని; నారాచంబులన్= బాణాలతో; నొప్పించినన్= బాధను కలిగించగా; దేవవ్రతుండు= భీష్ముడు; వానిన్= ఆ శిఖండిని; ఏయన్= బాణాలతో కొట్టడానికి; ఒల్లని సందునన్= ఇష్టపడకుండా ఉండే సమయంలో; ఆ సవ్యసాచి= ఆ అర్జునుడు; అతని విల్లున్= ఆ భీష్ముడి వింటిని; తునిమి= తుంటలు చేసి; పెల్లు= అధికంగా; ఏయుచున్నన్= బాణాలు ప్రయోగిస్తూ ఉండగా; చూచి; సైరింపక= ఓర్చుకోకుండా; శల; శల్య; కృప; కృతవర్మ; చిత్రసేన; భూరిశ్రవః= భూరిశ్రవసుడు; ప్రభృతి= ముఖ్యులుగాగల; వీరలోకంబు= వీరులయొక్క సమూహం; అతిలోకంబుగ(న్)= లోకాతీతంగా; దివ్య+అస్త్రజాలంబులు= అమోఘాలైన ఆయుధాల సమూహాలను; నెఱపుచు(న్)= వ్యాపింప జేయుచు; ఏయుచున్= బాణాలు ప్రయోగిస్తూ; భీష్మునకున్= భీష్ముడికి; అడ్డపడుండు= అడ్డుపడండి; తలకడవుండు= ఉన్నచోటిని దాటిరండి; అను= అనునట్టి; ఎలుంగులు= కంఠస్వనాలు; నింగిముట్టన్= ఆకాశాన్నంటుతూ ఉండగా; బలసమేతంబుగాన్= సైన్యాలతో కూడునట్లుగా; అడరినన్= విజృంభించగా; కని; సమీరనందన= భీముడు; సాత్యకి; సౌభద్ర= సుభద్రకుమారుడు - అభిమన్యుడు; విరాట; ద్రుపద; ఘటోత్కచ ప్రముఖ= ప్రధానులుగాగల; యోధవర్గంబు= యోధులగుంపు; అనర్గళభంగిన్= అడ్డులేని విధంగా తఱుమన్= ఎదుర్కొనగా; తద్+సైన్యంబులు(న్)= ఆ కౌరవసైన్యాలు; కూడుకొని= ఏకమై; కవిసిన(న్); దివిజదానవ= దేవతలరాక్షసులయొక్క; సంపాత= చక్కని పాటు కల్గిన; సమయ= సమయమందలి; సమరంబు+అయ్యెన్= యుద్ధంవంటి యుద్ధం జరిగింది; ఆలాటి యుద్ధంలో; పురందర నందనుండు= అర్జునుడు; మన సైనికులకున్= మన(కౌరవ) సైన్యంలోని వారికి; అందఱకున్= అందరికీ కూడా; అన్ని రూపులు+అయి= అంతమంది అర్జునులుగా అగపడి; ఐంద్ర= ఇంద్ర దేవతాకములు; వారుణ= వరుణ దేవతాకములు; ఆగ్నేయ= అగ్ని దేవతాకములు; ఆది= మున్నుగాగల; మహాశరంబులన్= గొప్ప బాణాలతో; తెరల్చుచు(న్)= తొలగించుకొంటూ; సురక్షితుండు+ఐన= బాగా కాపాడబడ్డవాడైన; శిఖండిన్; పురికొల్పికొని= ప్రోత్సాహపరిచి; మీ తండ్రిన్= మీ తండ్రియైన భీష్ముని; ఏయించుచున్= బాణాలతో కొట్టించుతూ; అతండు= ఆ భీష్ముడు; ఎన్ని విండ్లు= ఎన్ని ధనుస్సులను; ఎత్తినన్= ఎత్తికొన్నప్పటికీ; అన్నింటిన్= అన్ని విండ్లనూ; తోడ్తోన= వెంటనే; తునుమాడుచుండెన్= తునుకలు చేస్తూ వచ్చాడు; అతండు= ఆ భీష్ముడు; ఆ క్రీడిపైన్= ఆ అర్జునుడిమీద; ఉగ్రశక్తిన్= భయంకరమైన శక్త్యాయుధాన్ని; ప్రయోగింపన్= వేయగా; అదియునున్= ఆ శక్తి ఆయుధాన్ని కూడా; త్రుంచి= తునుకలుచేసి; సూతునిన్= సారథిని; కేతనంబునున్= ధ్వజాన్ని కూడా; కూల్చిన(న్)= కూలద్రోయగా.

తాత్పర్యం: అర్జునుడు కృష్ణుడన్న మాటలు విన్నాడు. భీష్ముడిని, ఆయన రథాన్ని, గుర్రాలను, సారథిని, చురుకైన బాణాల సమూహంతో కప్పివేశాడు. శిఖండి కూడా అర్జునుడితో కూడా చేరుకొని బాణాలతో భీష్ముడిని నొప్పించాడు. శిఖండి పేడి కాబట్టి వాడిమీద బాణాలు వేయడానికి భీష్ముడు ఇష్టపడకుండా ఉండే సమయంలో అర్జునుడు అతడి విల్లును విరిచివేసి, పెల్లుగా బాణాలను గుప్పించాడు. దీన్ని చూచి, శలశల్యాదులైన వీరులందరూ ఓర్చుకోలేక చాలా భయంకరాలైన, అమోఘాలైన అస్త్రశస్త్రాలతో యుద్ధభూమినంతా కప్పివేస్తూ, బాణాలతో కొట్టుతూ, భీష్ముడికి అండగా ముందు నిలబడండి, మీరుండే చోటినుండి కదలిరండి.' అనే అరుపులు ఆకాశాన్ని అంటుతుండగా, సేనలతో వారు విజృంభించారు. భీముడు, సాత్యకి, అభిమన్యుడు ముఖ్యులుగా ఉండే యోధవర్గం వారి విజృంభణాన్ని చూచారు. అడ్డు, ఆపు లేకుండా శత్రుసైన్యాన్ని తరిమారు. శత్రుసేనలంతా ఒక్కటిగా చేరుకొని కవిశారు. అప్పటివారి

యుద్ధం దేవతల రాక్షసుల యుద్ధంవలె అనిపించింది. అట్టిపట్టులో అర్జునుడు మన సైనికులకు ఒక్కొక్కడికి ఒక్కొక్క అర్జునుడుగా అగుపడుతూ, ఐంద్రవారుణాగ్నేయాది దివ్యాస్త్రాలు ప్రయోగించి దారి ఏర్పరచుకొంటూ, తనచే చక్కగా కాపాడబడుతూ ఉన్న శిఖండిని దండిగా ప్రేరేపించి, (మీతండ్రి) భీష్ముడిని బాణాలతో కొట్టించాడు. భీష్ముడు ఎన్ని విండ్లెత్తుకున్నా అన్నిటిని వెంట వెంటనే తునాతునుకలు చేశాడు. ఆ భీష్ముడు అర్జునుడి మీదికి భయంకరమైన ఒక శక్తి ఆయుధాన్ని ప్రయోగించాడు. అర్జునుడు దాన్నికూడా తునుమాడి, అంతటితో ఊరకొనక, ఆ భీష్ముడి సారథిని, రథటెక్కాన్ని కూడా కూల్చివేశాడు.

సీ. మనమున భీష్ముఁ డిట్లని వితర్కించుఁ । 'బాండవుల నాయొక్క వింటన కడంగి
గెలువనే? వీరికిఁ గృష్ణుండు ప్రాపు గా । కున్న నిం కది యట్టు లుండనిమ్ము
కృష్ణుఁ దోడుగఁ గొని కీడ్పడి వీరలు । వచ్చినఁ జెప్పితి వధవిధంబు
సమర ముపేక్షించి శాంతిమై నుండెద । నడిచిపాటేటికి?' ననఁగ నెఱిఁగి

తే. చదల సుర లిట్లు 'మే లిది సమ్మతంబు । మాకు' నని ప్రీతిమైఁ జెప్పుమాట లాతఁ
డొక్కరుండును వినియె; నే నొకఁడు వింటి । మునిమహానుభావంబున మనుజనాథ! 397

ప్రతిపదార్థం: మనుజనాథ!= ప్రభువగు ధృతరాష్ట్ర మహారాజా!; మనమునన్= మనస్సులో; భీష్ముఁడు; ఇట్లు+అని; వితర్కించున్= ఊహించుకొంటున్నాడు; వీరికిన్= ఈ పాండవులకు; కృష్ణుండు= కృష్ణుడు; ప్రాపు= ఆశ్రయము; కాక+ఉన్నన్= కాకుండా ఉంటే; పాండవులన్= పాండురాజు కొడుకులను; నా+ఒక్కవింటన్+అ= నా ఒక్క ధనుస్సుతోనే; కడంగి= యత్నించి; గెలువనే?= గెలువనా?; ఇంకన్= ఇకమీద; అది= ఆ సంగతి; అటులు+ఉండనిమ్ము= అట్లా ఉండనీ; వీరలు= ఈ పాండవులు; కీడు+పడి= తక్కువపాటు చెంది; కృష్ణున్= కృష్ణుడిని; తోడుగన్+కొని= సహాయంగా తీసికొని; వచ్చినన్= రాగా; వధవిధంబున్= నన్ను చంపేరీతిని; చెప్పితిన్= చెప్పాను; సమరము= యుద్ధమును; ఉపేక్షించి; అశ్రద్ధచేసి; శాంతిమైన్= ఓర్పుతో; ఉండెదన్= ఉంటాను; అడిచిపాటు= తొందరపడటం; ఏటికిన్?= ఎందుకోసం?; అనఁగన్= అని వితర్కించుకుంటూ ఉండగా; చదలన్= ఆకాశాన; సురలు= దేవతలు; ఎఱిఁగి= భీష్ముడి తర్కాన్ని తెలుసుకొని; ఇట్లు;మేలు+ఇది= ఇది బాగున్నది; మాకున్= దేవతలమగు మాకు; సమ్మతంబు= ఇష్టం; అని= అంటూ; ప్రీతిమైన్= ప్రేమతో; చెప్పుమాటలు= చెప్పెడి మాటలను; ఆతఁడు= ఆ భీష్ముడు; ఒక్కరుండును= ఒక్కడు మాత్రమే, వినియెన్= విన్నాడు; మునిమహానుభావంబునన్= వ్యాస మహర్షి యొక్క మహిమవల్ల; ఏన్+ఒకఁడు= నే నొకడు మాత్రమే; వింటిన్= విన్నాను.

తాత్పర్యం: భీష్ముడు తన మనస్సులో ఈ విధంగా అనుకొంటున్నాడు. 'ఈ పాండవులకు కృష్ణుడు ఆశ్రయంగా లేకుండా ఉండిఉంటే నా ఒక్క ధనుస్సుతోనే వీరినంతా నేను గెలువనా? సరే, ఆ సంగతి అట్లా ఉండనీ. ఈ పాండవులందరూ లొచ్చుపడి, చచ్చుదేలి, కృష్ణుడిని సహాయంగా తీసికొని నా దగ్గరకు వచ్చారు. నా మరణానికి ఉపాయాన్ని వీరికి చెప్పాను. ఇకమీద యుద్ధంలో శ్రద్ధ చూపకుండా ప్రశాంతంగా ఉంటాను. వేగిరపాటెందుకు?' అనే ఈ మాటలు ఆకాశంలో ఉండే దేవతలు విన్నారు. 'ఇదే మేలైనపని. మా ఇష్టం కూడా ఇదే' అని ప్రేమతో వారు చెప్పే మాటలు ఆ భీష్ముడు ఒకడు మాత్రమే విన్నాడు. వ్యాసమహర్షి ప్రభావం వలన నేను కూడా విన్నాను.

వ. తదవసరంబున సూక్ష్మజలశీకరశిశిరంబగు మారుతంబు మరుత్తటినీతనయు మీఁదసుడిసె సురదుందుభులు
మ్రోసెఁ గుసుమవర్షంబులు గురిసె నవియు ననన్యగోచరంబులయ్యె నిట్లు నిశ్చయించియు న మ్మహాత్ముం
డూరకున్నం గెలని కొకభంగియై తోఁచు నని తలంచి. 398

ప్రతిపదార్థం: తద్+అవసరంబునన్= ఆనాటి సమయంలో; మరుత్+తటినీతనయుమీఁదన్= దేవనదికొడుకైన భీష్ముడిమీద; సూక్ష్మ= కొద్దిపాటివైన; జల= నీటియొక్క; శీకర= తుంపరల చేత; శిశిరంబు+అగు= చల్లనైన; మారుతంబు= గాలి; సుడిసెన్= చుట్టిముట్టి వీచింది; సురదుందుభులు= దేవదుందుభులు; మ్రోసెన్= మ్రోగాయి; కుసుమవర్షంబులు= పూలవానలు; కురిసెన్; అవియున్= ఈ చెప్పినవన్నీ; అనన్యగోచరంబులు+అయ్యెన్= ఇతరులకు అగుపడకుండా ఉండినాయి; ఆ+మహాత్ముండు= ఆ మహానుభావుడు; ఇట్లు= ఈ విధంగా; నిశ్చయించియున్= నిశ్చయం చేసికొని కూడా; ఊరక+ఉన్నన్= యుద్ధం చేయకుండా వుంటే; కెలనికి(న్)= తన పక్షంవారికి; ఒక భంగి+ఐ= ఒక విధంగా(మోసం)గా; తోఁచున్+అని= అనిపించవచ్చునని; తలంచి= అనుకొని.

తాత్పర్యం: భీష్ముడు దేవతలన్న మాటలు విన్న సమయంలో, ఆ భీష్ముడి మీద నీటి బిందువులతో నిండిన చల్లని పిల్లగాలులు వీచాయి. దేవదుందుభులు మ్రోగాయి. పూలవానలు కురిశాయి. ఈ వింతలంతా వేరెవరికీ అగుపించలేదు. ఆ మహాపురుషుడు తానిక యుద్ధం చేయకూడదని, ప్రశాంతంగా ఉండాలని నిశ్చయం చేసికొని కూడా ఊరకనే ఉంటే తన పక్షంవారికి, కౌరవులకు తన వైఖరి మోసం(కపటం)గా అనిపిస్తుందేమో అని తన విల్లు ఎక్కుపెట్టాడు.

తే. ఒక్క వి ల్లెక్కుపెట్టంగ నుఱక వెస శి । ఖండి పటు మార్గణంబులఁ గడఁగి యేయ
నతఁడు మిసిమింతుఁడును గామి కల్ల నవ్వి । పఱపెఁ దనయమ్ము లతనిపై ఫల్గునుండు. 399

ప్రతిపదార్థం: ఒక్కవిల్లు= ఒకవింటిని; ఎక్కుపెట్టంగన్; శిఖండి= ద్రుపదుని పుత్రుడు; ఉఱుక= లెక్కచేయక; కడఁగి= ప్రయత్నించి; వెసన్= వేగంగా; పటుమార్గణంబులన్= సమర్థములైన బాణాలను; ఏయన్= ప్రయోగింపగా; అతఁడు= ఆ భీష్ముడు; మిసి మింతుఁడునున్= అలసిపోయినవాడుగా కూడా; కామికిన్= కాకున్నదానికి; ఫల్గునుండు= అర్జునుడు; అల్ల నవ్వి= సన్నగా నవ్వి; తన+అమ్ములు= తన బాణాలను; అతనిపైన్= ఆ భీష్ముడిమీద; పఱపెన్= ప్రయోగించాడు.

తాత్పర్యం: భీష్ముడు ఒక వింటిని ఎక్కుపెట్టాడు. అంతలో శిఖండి దానిని లెక్కచేయక ప్రయత్నంతో వేగంగా మంచి మంచి బాణాలను ఆ భీష్ముడిమీదికి ప్రయోగించాడు. ఆ బాణాల దెబ్బలకు భీష్ముడు కొంచెం కూడా అలసట చెందలేదు. దీన్ని చూచి అర్జునుడు నవ్వి, తన బాణాలను అతడి మీద ప్రయోగించాడు.

వ. శాంతనవుండును సముల్లాసంబున నేసిన. 400

ప్రతిపదార్థం: శాంతనవుండును= శంతనుమహారాజు కుమారుడు భీష్ముడును; సమ్+ఉల్లాసంబునన్= ఉత్సాహంతో; ఏసినన్= బాణాలు ప్రయోగించగా.

తాత్పర్యం: అర్జునుడు తనపై బాణాలు ప్రయోగించగా, భీష్ముడున్నూ ఉత్సాహంతో మళ్ళీ బాణాలు ప్రయోగించగా. (తరువాత పద్యంతో అన్వయంతో.)

క. నరుఁడు, దనమీఁదఁ దొరఁగెడు । శరములు వారించి యతని చాపం బధిక
త్వరితగతిఁ ద్రుంచి యతిని । ష్కర నారాచంబు దనువు సొర నేయుటయున్. 401

ప్రతిపదార్థం: నరుఁడు= అర్జునుడు; తనమీఁదన్= తన(అర్జునుడి)మీద; తొరఁగెడు శరములు= పడునట్టి బాణాలను; వారించి= అడ్డగించి(నివారించి); అధిక త్వరితగతిన్= మిక్కిలి వేగంతో కూడిన విధంగా; అతని చాపంబున్= ఆ భీష్ముడి ధనుస్సును; త్రుంచి= తునుకలు చేసి; అతినిష్కర నారాచంబున్= మిక్కిలి క్రూరమైన బాణాన్ని; తనువు+చొరన్= భీష్ముడి శరీరంలోకి చొచ్చుకొని పోయేటట్లుగా; ఏయుటయున్= వేయగా.

తాత్పర్యం: భీష్ముడు తనమీద ప్రయోగించే బాణాలను నివారిస్తూ, అర్జునుడు చాలావేగంతో ఆ భీష్ముడి వింటిని విరుగగొట్టాడు. ఒక కఠోరమైన బాణాన్ని ఆ భీష్ముడి శరీరంలోనికి చొచ్చుకుపోయేటట్లుగా ప్రయోగించగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

వ. తమకుం దమ యోధవరులకును వారింపం జేరం జెనయం గొలఁది గాక వెల్లివిరిసిన శరనిధిభంగిం బొంగిన వివ్వచ్చు వెఱఁగుపడి చూచుచుం దన్ను విడువక కెలంకులనున్న నీ కొడుకులం గలయం గనుంగొని మీ తండ్రి రారాజుతో నిట్లనియె. 402

ప్రతిపదార్థం: తమకున్= తమకుగాని; తమ యోధవరులకును= తమ పక్షంలోని వీరాగ్రేసరులకుగాని; వారింపన్= అడ్డగించడానికి; చేరన్= దగ్గరకువచ్చుటకుగాని; చెనయన్= ఎదిరించడానికి గాని; కొలఁదికాక= సాధ్యం కాకుండా; వెల్లివిరిసిన= పెల్లుగా ఉబ్బిన; శరనిధిభంగిన్= సముద్రం(బాణాల గని)వలె; పొంగినన్= అతిశయించగా; వివ్వచ్చున్= అర్జునుడిని; వెఱఁగుపడి= చేష్టలుమాని; చూచుచున్= కనుగొంటూ; తన్నున్= (భీష్ముడగు) తనను; విడువక= వదలిపెట్టకుండా; కెలంకులన్= ప్రక్కభాగాలలో; ఉన్న= ఉన్నటువంటి; కొడుకులన్= కుమారులను; కలయన్+కనుంగొని= కలయజూచి; తండ్రి= మీ తండ్రియగు భీష్ముడు; రారాజుతోన్= దుర్యోధన మహారాజుతో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు:

తాత్పర్యం: తనకు(భీష్ముడికి), దుర్యోధనాదులకు, తమ పక్షంలో వుండే గొప్పవీరులకుగాని, అడ్డగించటానికి, దగ్గరకు పోవటానికి, ఎదిరించటానికి సాధ్యం కాకుండా ఉప్పొంగిన సముద్రంలాగా, ఆటోపంతో వస్తున్న అర్జునుడిని చూచి భీష్ముడు చేష్టలుడిగి, తననెప్పుడూ వదలకుండా రక్షణగా రెండుప్రక్కల ఉండే కుమారు (వయసువార)లను చూస్తూ, దుర్యోధనమహారాజుతో ఇట్లా అన్నాడు:

మ. ‘ అని దేవాసురకోటి కైనను నశక్యం బిమ్మహావీరు మా
ర్కొన వీఁ డల్గిన మర్త్యు లే యెదు రుదారుండైన యీ క్రీడి ద
క్కిన ని ప్పాండవసైన్య మింతయును మ్రుగ్గింపంగ నేఁ జాలుదున్
విను, సత్యం బిది వీని వింటి కెదురన్ విల్లెత్తలేఁ డెవ్వఁడున్.’ 403

ప్రతిపదార్థం: అనిన్= యుద్ధమందు; ఈ+మహావీరున్= గొప్ప వీరుడైన యీ అర్జునుడిని; మార్కొనన్= ఎదిరించడానికి; దేవ+అసురకోటికైననున్= కోటి సంఖ్యగల దేవతలకు గాని, రాక్షసులకుగాని; అశక్యంబు= సాధ్యంకాదు; వీఁడు= ఈ అర్జునుడు; అల్గినన్ కోపంచెందిన వాడైతే; మర్త్యులు= మనుష్యులు; ఏయెదురు= ఎదుట నిల్తురా?; నిలువలేరు; ఉదారుండు+ఐన= గొప్పవాడైనట్టి; ఈ క్రీడి= ఈ అర్జునుడు; తక్కినన్= లేకుంటే; ఏన్= నేను(భీష్ముడు); ఈ+పాండవ సైన్యము= ఈ పాండవుల సేనను; ఇంతయును= అంతటిని; మ్రుగ్గింపంగన్= చంపటానికి; చాలుదున్= సమర్థుడనగుదును; వినుం= ఆకర్ణించుము; వీని వింటికిన్= ఈ అర్జునుడి ధనుస్సుకు; ఎదురన్= ఎదురుగా; ఎవ్వఁడున్= ఎట్లాంటి వీరుడైనా సరే; విల్లు+ఎత్తలేడు= విల్లు పట్టుకొనలేడు (ఎక్కుపెట్టలేడు); ఇది= ఈ మాట; సత్యంబు= నిజము.

తాత్పర్యం: ‘కోటిమంది దేవతలుగాని, కోటిమంది రాక్షసులుగాని ఈ అర్జునుడిని ఎదిరించలేరు. ఈ అర్జునుడిని ఎదుర్కోవటానికి దేవరాక్షసకోటికే సాధ్యం కాదంటే ఇక మానవులకెట్లు సాధ్యం? (మానవులకు, అర్జునుడిని ఎదిరించడం ఎంతమాత్రం సాధ్యంకాదన్నమాట.) మహావీరుడైన ఈ అర్జునుడు ఒక్కడు పాండవసైన్యంలో లేకుంటే, ఈ సైన్యాన్ని మొదలంటా మట్టుపెట్టటానికి నేనొకడనే చాలేవాడిని. ఓ దుర్యోధనా! నా మాట వినుం. ఈ అర్జునుడు

ధనుస్సు చేతపట్టుకొంటే, వీడికి ఎదురుగా ఏ మహావీరుడూ కూడా ధనుస్సు పైకెత్తలేడు. ఇక వీడిపై బాణాలు ప్రయోగించే దెక్కడ? ఇది నిజం.'

క. అనునెడ శిఖండిచాపము । వెనుకం దనవిల్లు నిల్పి వెస నాతం డే
సిన భంగిగ నరుఁ డేసెను । జననాయక! దొడ్డనారసంబులు భీష్మున్. 404

ప్రతిపదార్థం: జననాయక!= జనులకు ప్రభువువైన ధృతరాష్ట్రా!; అనున్+ఎడన్= భీష్ముడు ఈవిధంగా చెప్పుతున్న సమయంలో; నరుఁడు= అర్జునుడు; వెసన్= వేగంగా; శిఖండి చాపము వెనుకన్= శిఖండియొక్క వింటికి వెనుకప్రక్కన; తనవిల్లు= తన (అర్జునుడి) యొక్క ధనుస్సును; నిల్పి= ఉంచి; ఆతండు= ఆ శిఖండి; ఏసిన భంగిగన్= బాణాలు ప్రయోగించిన మాదిరిగా; దొడ్డ నారసంబులు= గొప్ప బాణాలతో; భీష్మున్= భీష్మాచార్యుడిని; ఏసెను= కొట్టినాడు.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! భీష్ము డీ విధంగా దుర్యోధనుడితో చెపుతున్న సమయంలో సందు చూచికొని అర్జునుడు శిఖండి వింటికి వెనుకనే తనవింటిని ఎవ్వరికీ కనిపించకుండా ఆనించి, ఆ శిఖండే బాణాలు ప్రయోగిస్తున్నట్లు చూచేవారికి అనిపించేటట్లుగా గొప్ప బాణాలను ఆ భీష్ముడి మీద ప్రయోగించాడు.

వ. అప్పుడు దేవవ్రతుండు దుశ్శాసను నాలోకించి. 405

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో; దేవవ్రతుండు= భీష్ముడు; దుశ్శాసనున్= దుశ్శాసనుని; ఆలోకించి= చూచి

తాత్పర్యం: ఆ విధంగా బలమైన బాణాలను తన మీదికి అర్జునుడు ప్రయోగించినప్పుడు భీష్ముడు దుశ్శాసనుడిని చూచి. (తరువాతి పద్యంతో అన్వయం.)

సీ. "అశనికల్పము లివి యర్జును బాణముల్ । గాని శిఖండివి గావు సుమ్ము;
కర్కటిగర్భంబు కరణి గాత్రము వ్రచ్చె । నిట్టివి వీనికి నెందుఁ గలవు?
బహ్మదండంబులపాటి యై మర్మంబు । లిట్టు నోనాటునే? యితని చేత
జముదూత లట్లు ప్రాణముల వెలార్పంగ । నీ ద్రుపదాత్మజుఁ డెన్నఁ డేసె?

ఆ. దృఢవిముక్తములును దీప్తాకృతులు లక్ష్య । శుద్ధిమంతములును సునిశితములు
నైననారసంబు లతనివి గాక యీ । తనివి యగునె? యెవ్విధమునఁ జూడ.' 406

ప్రతిపదార్థం: ఇవి= ఈ బాణాలు; అశనికల్పములు= పిడుగులతో సమానాలు; అర్జును బాణముల్+కాని= అర్జునుడి బాణాలే గాని; శిఖండివి= శిఖండి ప్రయోగించినట్టివి; కావుసుమ్ము= కావుసుమా!; కర్కటిగర్భంబు కరణిన్= ఎండ్రకాయ కడుపులోని పిండంవలె; గాత్రము= శరీరాన్ని; వ్రచ్చెన్= చీల్చివేస్తున్నది; ఇట్టివి= ఈలాంటి బాణాలు; వీనికిన్= ఈ శిఖండికి; ఎందున్+కలవు= ఎక్కడున్నాయి?; బ్రహ్మదండంబుల పాటియై= బ్రహ్మదండాలతో సమానమై; ఇతనిచేతన్= ఈ శిఖండిచేత; మర్మంబులు= జీవస్థానాలను; ఇట్టు= ఇంతగా; నోనాటున్+ఏ?= నొప్పించేటట్టు గుచ్చుకుంటాయా?; జముదూతలు+అట్లు= యముడి దూతల మాదిరిగానే; ప్రాణములన్; వెలార్పంగన్= బయటికి లాగేట్టుగా; ఈ ద్రుపద+ఆత్మజుఁడు= ఈ శిఖండి; ఎన్నఁడు= ఏనాడు; ఏసెన్?= బాణాలు ప్రయోగించాడు?; దృఢవిముక్తములునున్= గట్టిగా ఎక్కువగా వదలబడ్డవియు; దీప్త+ఆకృతులు= మండుతూ ఉండే ఆకారం కలవియు; లక్ష్యశుద్ధిమంతములును= గురితప్పకున్నట్టివియు; సునిశితములున్+ఐన= బాగా పదునుగలవియునైన; నారసంబులు= బాణాలు; అతనివిగాక= ఆ అర్జునుడివి కాకపోతే; ఏ+విధమునన్= ఏ విధంగా గాని; చూడన్= చూచినప్పటికీ; ఈతనివి= ఈ శిఖండికి సంబంధించినట్టివి; అగున్+ఎ?= అగునా?

తాత్పర్యం: భీష్ముడు, దుశ్శాసనుడితో ఇట్లా అంటున్నాడు: 'ఇప్పుడు నా మీదపడ్డ బాణాలు పిడుగుల్లా ఉన్నాయి. ఇవి అర్జునుడు ప్రయోగించిన బాణాలే గాని, శిఖండి వేసిన బాణాలు ఎంత మాత్రం కావుసుమా! ఎండ్రకాయ గర్భంలోనుండే పిండం మాదిరి శరీరాన్ని పేల్చివేస్తున్నది. ఇంత ప్రభావంగల బాణాలు వీడి(శిఖండి)కి ఎక్కడున్నాయి? పలు బ్రహ్మదండాలు పైన పడినట్లు ఆయువు పట్టులందు గాఢంగా నాటి నొప్పజేసే బాణాలు వేయటానికి వీడి (శిఖండి) చేత ఏమౌతుంది? యముడి దూతలు పలువురు ప్రాణి ప్రాణాలను వెలికిలాగే మాదిరి బాణాలు ఈ శిఖండి ఏనాడు ప్రయోగించగలిగాడు? నాపైన బడ్డ ఈ బాణాలు గట్టిగా ఎక్కువగా వేగంగా వదలబడ్డవి, జ్వలిస్తున్నవి, గురితప్పకుండా ఛేదించేవి, చాలా పదును గల్గినట్టివి, అయిన - ఈ బాణాలు అర్జునుడివే సుమా! మన అనుభవంలో ఏనాడూ శిఖండి ఇట్టి తీవ్రమైన ఆయుధాలు ప్రయోగించినవాడు కాడు. పైగా శిఖండి బాణాలకు ఇంతగట్టితనం, వెలుగు, గురితప్పకుండటం, పదును, లేనేలేవు. ఎన్ని విధాల చూచినా ఈ బాణాలు శిఖండివి కానేకావు.'

విశేషం: అలంకారం: మాలోపమ. కర్కటి గర్భము. (ఇది ఒక న్యాయము) ఎండ్రి గర్భం ధరించడం అని అర్థం. ఎండ్రకాయ,గర్భంలో వుండే ప్రాణి, తల్లిఎండ్రిని బ్రద్దలుచేసి బయట పడుతుంది. ఈ బాణాలు మనిషిని చంపిగాని ఇవతలకు రాకున్నవన్నమాట.

బ్రహ్మదండము: బ్రాహ్మణుడి చేత ఉండే యష్టికి సాధారణంగా ఈ పేరు. వసిష్ఠమహర్షిచేతిలోని యోగదండాన్ని కూడా బ్రహ్మదండమంటారు. శ్రీమద్రామయణంలో 'ధి క్బలం క్షత్రియబలం బ్రహ్మతేజోబలం బలమ్। ఏకేన బ్రహ్మదండేన బహవోనాశితా మమ' అని విశ్వామిత్రు డంటాడు. ఒక్క బ్రహ్మదండంతోనే విశ్వామిత్రుడి వాళ్ళు చాలామంది చచ్చారట. ఇక్కడ అనేక బ్రహ్మదండాలతో సాటియైన బాణాలు ఒక్క భీష్ముడి మీద పడ్డాయంటే ఇక వాటి బాధ ఎంతగా వుంటుందో, అట్టి బాధను ఓర్చుకోగలవాడు ఎంత మహావీరుడో ఊహించుకొనవచ్చును. 'జముదూతలట్ల' అని బహువచనంవల్ల, ఒక వ్యక్తిపైన పలువురు యమకింకరులు పడ్డారంటే, ఆ యాతన ఎంతగా ఉంటుందో, అట్టి యాతనను ఓర్చుకోగలిగన దిట్ట ఎట్టి దేవాంశతో పుట్టాడో ఊహించుకోవచ్చు.

శిఖండి వేసినట్టుగా అర్జునుడు, భీష్ముడి మీదికి ప్రయోగించిన బాణాలను, క్రమంగా, అశనికల్పాలు, కర్కటిగర్భం, బ్రహ్మదండాలు, జముదూతలు, అని నాలుగు ఉపమానాలతో క్రమంగా చెప్పబడింది. మొదటి ఉపమానం వలన శరీరంపై భాగానికి బాగా దెబ్బఅని, రెండవ ఉపమానంవల్ల కడుపులో బాధ అని, మూడోదానివలన ఆయువుపట్టుకు ఆపత్తని, నాలుగో ఉపమానం వలన శరీరంలోని ప్రాణాలు బైటపడతాయని సూచిస్తూ ఇన్నిటిని ఓర్చుకోగల్గిన మహానుభావుడు ముమ్మాటికీ దేవాంశ వల్ల పుట్టిన వాడేనని ఊహించుకోవచ్చును. ఇంతకుముందు వచ్చిన ఒక పద్యంలో 'వినుసత్యం బిది వీని వింటికెదురన్ విల్లెత్తలేఁ డెవ్వఁడున్' అని భీష్ముడు రారాజుతో అంటాడు. ఈ పద్యంలో అర్జునుడి బాణాల ధాటికి తట్టుకోలేమంటూ నాలుగు ఉపమానాలతో చక్కగా దుశ్శాసనుడికి నొక్కిచెప్పాడు భీష్ముడు. ఈ అనర్థానికి కారకులైన వారిలో ఈ ఇద్దరూ (దుర్యోధన దుశ్శాసనులు) ముఖ్యులు. ఎంతో సామర్థ్యంతో యుద్ధం చేసి, శత్రుసైన్యాన్ని చించి చెండాడి, ఇప్పుడు విరమించుకుంటూ, ఇక మీరు పాండవులను జయించడం కల్ల. సంధి చేసికొని ప్రాణాలతో బ్రతికి బయటపడండి' అనే సంగతిని వారికి చెప్పక చెప్పినట్లు అనిపిస్తుంది.

క. అనుచుఁ బటుశక్తి నప్పా। ర్థుని వైచిన నది యతండు దునుమాడుడు శాం
తనవుఁడు వాలుం బలకయుఁ। గొని యరదము డిగ్గఁజూచుకొలఁదిం బెలుచన్. 407

ప్రతిపదార్థం: అనుచున్= అని చెపుతూ; పటుశక్తిన్= బలిష్ఠమైన శక్త్యాయుధంతో; ఆ+పార్థుని= ఆ అర్జునుడిని; వైచినన్= విసిరికొట్టగా; అతండు= ఆ అర్జునుడు; అది= ఆ శక్త్యాయుధాన్ని; తునుమాడుడున్= తుంటలు చేయగానే; శాంతనవుఁడు= భీష్ముడు; వాలున్= కత్తిని; పలకయున్= కేడెమును; కొని; అరదము= రథాన్ని; డిగ్గన్= దిగటానికి; చూచుకొలఁదిన్= అనుకొనేంత సమయంలో; పెలుచన్= తేలికగా;

తాత్పర్యం: భీష్ముడు దుశ్శాసనుడితో పై విధంగా చెప్పుతూ ఒక దృఢమైన శక్త్యాయుధాన్ని అర్జునుడిపైకి ప్రయోగించాడు. దాన్ని అర్జునుడు తుంటలు చేశాడు. భీష్ముడు కత్తి, డాలు తీసికొని రథంనుండి దిగేటంతలోపలనే, కోపంతో. (తరువాతి పద్యంతో అన్వయం.)

తే. ఏసి యా రెంటిఁ దునియలు సేసి యెలుఁగు । సూపి యే నుండ వెఱ పేల? నాపగాత
నూజుఁ బొదువుఁడు మీ' రని యోజఁ జెప్పె । శక్రతనయుండు దనయోధజనుల కెల్ల. 408

ప్రతిపదార్థం: శక్రతనయుండు= ఇంద్రపుత్రుడు - అర్జునుడు; ఏసి= బాణాలు ప్రయోగించి; ఆరెంటిన్= ఆ కత్తిని, కేడెమును; తునియలు+చేసి= ముక్కలు చేసి; తన యోధ జనులకున్+ఎల్లన్= తన పక్షంలోని వీరులందరికీ; ఎలుఁగున్+చూపి= తన గొంతు సవ్వడి వినిపించి; ఏను+ఉండన్; వెఱపు+ఏల?= భయమెందుకు?; మీరు= మా వైపున ఉండే వీరులైన మీరు; ఆపగాతనూజున్= భీష్ముడిని; పొదువుఁడు= కవియండి; అని; ఓజన్= ఉత్సాహంతో; చెప్పెన్= చెప్పినాడు.

తాత్పర్యం: అర్జునుడు బాణప్రయోగం చేసి, భీష్ముడికత్తిని, పలకను పలుకులు చేసి, గొంతెత్తి తనవైపు ఉన్న వీరవరులకందరితో "నేనున్నానుగా? మీకేమి భయం? మీరందరూ భీష్ముడిని కమ్ముకొనండి' అని ఉత్సాహంతో పలికాడు.

వ. అ ప్పలుకు లాకర్ణించి. 409

ప్రతిపదార్థం: ఆ+పలుకులు= ఆ మాటలు, ఆకర్ణించి= విని.

తాత్పర్యం: అర్జునుడన్న ఆ మాటలు యోధులు విని. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. ఏయుఁడు పొడువుం డడువుఁడు । వ్రేయుఁ డనుచు వారు జాహ్నవీతనయుఁ గడున్
డాయుఁడు, మన సైనికులుం । గో యని తలపడ్డఁ బోరు ఘోరం బయ్యెన్ 410

ప్రతిపదార్థం: వారు= ఆ పాండవయోధులు; ఏయుఁడు= బాణాలు ప్రయోగించండి; పొడువుండు= పొడవండి; అడువుఁడు= కొట్టండి; వ్రేయుఁడు= నరకండి; అనుచున్= అంటూ; జాహ్నవీతనయున్= భీష్ముడిని; కడున్ డాయుఁడు= చాలా దగ్గిరికి చేరగా; మన సైనికులున్= మన(కౌరవ) సేనలోనివారున్నూ; కో+అని= 'కో' అని అరుస్తూ; తలపడ్డన్= తాకగా; పోరు= యుద్ధం; ఘోరంబు+అయ్యెన్= భయంకరంగా జరిగింది.

తాత్పర్యం: పాండవపక్షంలోని యోధులు 'బాణాలు ప్రయోగించండి. బల్లేలతో పొడవండి. గుదియలతో కొట్టండి. కత్తులతో నరకండి' అని కేకలు వేస్తూ, భీష్ముడికి చాలా దగ్గరికి వచ్చారు. అప్పుడు మన(కౌరవ) సైనికులు కూడా బొబ్బలు పెడుతూ శత్రుసైన్యంతో తలపడ్డారు. దానితో యుద్ధం చాలా భయంకరంగా కనిపించింది.

వ. అప్పుడు. 411

ప్రతిపదార్థం: అప్పుడు= ఆ సమయంలో.

తాత్పర్యం: కౌరవ పాండవులకు ఘోరంగా యుద్ధం జరిగే ఆ సమయంలో. (తరువాతి పద్యంతో అన్వయం.)

తే. ఏసి గాండీవి కురుసేన నెగువ నతని । వారు వెఱవక భీష్మునిఁ జేరి యొడల
వ్రేలెఁ డెడ లేనియట్లుగ వివిధభంగి । నిష్ఠురాస్త్రశస్త్రంబుల నినిచి రధిప! 412

ప్రతిపదార్థం: అధిప!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; గాండీవి= అర్జునుడు; ఏసి= బాణప్రయోగం చేసి; కురుసేనన్= కౌరవుల సైన్యాన్ని; ఎగువన్= తరుమగా; అతనివారు= ఆ అర్జునుడికి సంబంధించిన వీరులు; వెఱవక= భయంలేకుండా; భీష్మునిన్+చేరి= భీష్ముడి దగ్గరకువచ్చి; ఒడలన్= శరీరంమీద; వ్రేలెఁడు+ఎడ= వేలుపట్టే మాత్రంసందు కూడా; లేని+అట్లుగన్= లేకుండా వుండేట్లుగా; వివిధభంగిన్= నానా విధాలుగా; నిష్ఠుర+అస్త్రశస్త్రంబులన్= కఠినములైన బాణాలను ఆయుధాలను; నించిరి= నింపేశారు.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్రా! అర్జునుడు బాగా విజృంభించి, కౌరవ సైనికులను చిందరవందర చేశాడు. అప్పుడు అర్జునుడి పక్షపు వీరులందరూ ఏ మాత్రం జంకూ గొంకూ లేకుండా భీష్ముడికి చాలా దగ్గరగా మూగారు. ఆతడి శరీరంలో వేలెడు చోటు కూడా కాళీ లేకుండా బాణాలతో పరిఘాదులగు ఆయుధాలతో నింపివేశారు.

భీష్ముఁడు శరతల్పగతుఁ డగుట (సం. 6-114-80)

వ. అంతనంశుమంతుండు శాంతుండగుచువచ్చె;నట్టియెడంగదిసి కవ్వడిగాంగేయుపైఁగ్రూరనారాచనికరంబు నిగిడించి పడం ద్రోచిన. 413

ప్రతిపదార్థం: అంతన్= ఆ సమయంలో; అంశుమంతుండు= సూర్యుడు; శాంతుండు+అగుచున్+వచ్చెన్= చల్లబడుతూ వచ్చాడు; అట్టి+ఎడన్= ఆలాంటి సమయంలో; కవ్వడి= అర్జునుడు; గాంగేయు+పైన్= భీష్ముడిమీద; క్రూరనారాచనికరంబులు= కఠినములైన బాణాల పరంపరను; నిగిడించి= ప్రయోగించి; పడన్+త్రోచినన్= పడద్రోయగా.

తాత్పర్యం: అట్టి సమయంలో తన ప్రతాపాన్ని బాగా చూపిన సూర్యుడు శాంతించి అస్తమించబోతున్నాడు. అప్పుడు అర్జునుడు సమీపానికి వచ్చి భీష్ముడి మీద కఠోరమైన బాణాల వరుసను గుప్పించి, కూలద్రోశాడు.

క. తూర్పు తలఁ గాఁగ నీ సుతు । లేర్పడఁ గనుఁగొనుచునుండ నిల గంపింపన్
దర్పోజ్జ్వలుఁ డా భీష్ముఁ డహర్పతి । యస్తాద్రి సేరునట్లుగఁ బడియెన్. 414

ప్రతిపదార్థం: నీ సుతులు= ధృతరాష్ట్రుడవైన నీ యొక్క కుమారులు; ఏర్పడన్= బాగా తెలిసేటట్టు; కనుఁగొనుచున్+ఉండన్= చూస్తూ ఉండగా; ఇల= భూమి; కంపింపన్= వడకుచుండగా; దర్ప+ఉజ్జ్వలుఁడు= పౌరుషంతో ప్రకాశిస్తుండే; ఆ భీష్ముఁడు; అహర్పతి= సూర్యుడు; అస్త+అద్రి= పడమటికొండను; చేరు+అట్లుగన్= చేరేమాదిరిగా; తూర్పుతలఁగాఁగన్= తూర్పుదిక్కు తల ఉండేటట్లుగా; పడియెన్= పడ్డాడు.

తాత్పర్యం: కౌరవకుమారులందరు చూస్తూ ఉండగా, భూమి వణకిపోతూ ఉండగా, దర్పంతో వెలిగే ఆ భీష్ముడు సూర్యుడు పడమటికొండకు చేరే విధంగా, తూర్పుతలగా ఒరిగాడు.

విశేషం: అలం: ఉపమ.

తే. తనువు ధరఁ బొందకుండఁగఁ దల్పభంగి । శరము లూఁత యై పాలుపారె నరవరేణ్య!
యట్లు శరతల్పగతుఁ డగు నమ్మహాను । భావు దేవవ్రతుని దేవభావ మొందె. 415

ప్రతిపదార్థం: నరవరేణ్య!= ధృతరాష్ట్రమహారాజా! తనువు= శరీరం; ధరన్= భూమిని; పొందక+ఉండఁగన్= తాకకుండా ఉండేటట్లుగా; తల్పభంగి= పాన్పుమాదిరి; శరములు= బాణాలు; ఊఁత+ఐ= ఆధారంగా; పాలుపు+ఆరెన్= ఒప్పింది; అట్లు= ఆ విధంగా; శరతల్పగతుఁడు+అగు= బాణాలపాన్పును కలిగినట్టి; ఆ+మహానుభావున్= ఆ మహానుభావుడైన; దేవవ్రతునిన్= భీష్ముడిని; దేవభావము= దేవత్వము(దేవునితనము); ఒందెన్= పొందింది.

తాత్పర్యం: భీష్ముడి శరీరం భూమిని తాకకుండా, పానుపుమాదిరి, బాణాలు ఆధారంగా అమరాయి. ఆ విధంగా బాణాల పాన్పుపై పరుండిన ఆ మహాశయుడిని దేవత్వం ఆవహించింది. అంటే ఆయన దేవుడుగా అగుపడ్డాడు.

చ. అనిమిషు లప్డు సూచి 'మృతుఁ డయ్యెడు నక్కట! దక్షిణాయనం
బునఁ గృతపుణ్యుఁ డంచు వగఁ బొందిన భీష్ముఁ డెఱిఁగి వారి కి
ట్లను 'సురలార! కాలగతి నాత్మఁ దలంచియ కాదె? మేనిలో
నునిచినవాఁడఁ బ్రాణముల నుమ్మలికింపకుఁ డించుకేనియున్. 416

ప్రతిపదార్థం: అప్డు= ఆ సమయంలో; అనిమిషులు= దేవతలు; చూచి= భీష్ముడు పడటం తిలకించి; అక్కట!= అయ్యో! కృతపుణ్యుఁడు= చేయబడ్డ పుణ్యంకలవాడు(పుణ్యాత్ముడు); దక్షిణ+అయనంబునన్= దక్షిణాయనంలో; మృతుఁడు+అయ్యెడున్= చనిపోతాడు; అంచున్= అనుకొంటూ; వగన్= పరితాపాన్ని; పొందినన్= చెందగా; భీష్ముఁడు; ఎఱిఁగి; వారికిన్= ఆ దేవతలకు; ఇట్లు+అనున్= ఇట్లా అంటాడు; సురలార!= ఓ దేవతలారా!; కాలగతిన్= కాలముయొక్క గతిని(మరణాన్ని); ఆత్మన్= మనస్సులో; తలంచి+అ+కాదె?= ఎరిగేకదా; ప్రాణములన్= ప్రాణాలను; మేనిలోన్= శరీరంలో; ఉనిచినవాఁడన్= ఉంచికొన్నాను; ఇంచుక+ఏనియున్= కొంచెంకూడా; ఉమ్మలికింపకుఁడు= బాధపడకండి.

తాత్పర్యం: ఆ భీష్ముడు నేల కొరగడాన్ని దేవతలు చూచి 'అయ్యో! పాపం ఇతడెంతో పుణ్యాత్ముడే! నరకానికి మార్గమైన దక్షిణాయనంలో మరణిస్తున్నాడే!' అని వాపోవటాన్ని భీష్ముడు తెలిసికొని వారితో 'దేవతలారా! దక్షిణాయనకాలము యొక్క గమనా(మరణాన్ని)న్ని మనస్సున ఎరిగేకదా - ప్రాణాలను నా బొందిలో నిల్పుకొన్నాను. మీరు కొంచెం కూడా విచారించకండి'.

వ. సత్యవతీవివాహం బొనర్చుటకు మాతండ్రి మెచ్చి నా కవధ్యత్వంబును స్వచ్ఛందమరణంబును నిచ్చినవాఁడు
గావునఁ దద్వరప్రభావంబున నావధంబున కే నొడంబడక కానేరదయ్యెఁబ్రాణంబులు నా వశంబ' యనిన
విని వారలు సంతోషించి రాసమయంబున భాగీరథి పనుపునం గొందఱు మునివరులు హంసరూపంబుల
నమ్మహాత్మునకు దక్షిణాయనం బెఱిఁగింపం జనుదెంచి యతండు దెలిసియునికి నతనిచేత నెఱిఁగి
ప్రియం బంది యేఁగి రట్టియెడ దుర్యోధనుండు వుచ్చిన దుశ్శాసనుండు గుంభసంభవుపాలికింబోయి
భీష్ముపాటు సెప్పిన నతండు మూర్ఛిల్లి యొక్కింత దేఱి దీనాననుం డగుచు నమ్మహీనాథుకడకుం జనియె
నయ్యవసరంబున. 417

ప్రతిపదార్థం: సత్యవతీ వివాహంబున్= దాశరాజ కన్యక సత్యవతితో పెండ్లిని; ఒనర్చుటకున్= చేసినదానికి; మా తండ్రి= మా తండ్రి శంతను మహారాజు; మెచ్చి= సంతోషపడి; నాకున్= నాకు; అవధ్యత్వంబును= చంపబడకుండటాన్ని; స్వచ్ఛందమరణంబునున్= ఇష్టం వచ్చినపుడు చనిపోవడాన్ని; ఇచ్చినవాఁడు= ఇచ్చాడు; కావునన్= కాబట్టి; తద్+వరప్రభావంబునన్= ఆ వరాల మహిమవల్ల; నా వధంబునకున్= నా యొక్క మరణానికి; ఏన్+ఒడంబడక= నే నొప్పుకోకుండా; కానేరదు+అయ్యెన్= జరగదాయెను; ప్రాణంబులు= ప్రాణాలు; నా వశంబు+అ= నా అధీనమే; అనినన్= అని చెప్పగా; వారలు= ఆ దేవతలు; సంతోషించిరి; ఆ సమయంబునన్; భాగీరథి పనుపునన్= గంగానది పంపగా; హంసరూపంబులన్= హంసల ఆకారాలతో; కొందఱు మునివరులు= కొంతమంది ఋషిపుంగవులు; ఆ+మహాత్మునకున్= ఆ మహాత్ముడికి; దక్షిణాయనంబు= ఇప్పుడు దక్షిణాయనమని; ఎఱిఁగింపన్= తెలియచెప్పడానికి; చనుదెంచి= వచ్చి; అతండు= ఆ భీష్ముడు; తెలిసియునికిన్= తెలిసికొని ఉండటాన్ని; అతనిచేతన్= ఆ భీష్ముడిచేత; ఎఱిఁగి= తెలిసికొని; ప్రియంబు+అంది= సంతోషంచెంది; ఏఁగిరి= వెళ్ళారు; అట్టి+ఎడన్; దుర్యోధనుండు;

పుచ్చిన(న్)= ఆజ్ఞాపించగా; దుశ్శాసనుండు; కుంభసంభవు పాలికిన్= ద్రోణాచార్యుడి దగ్గరకు; పోయి= వెళ్ళి; భీష్ముపాటు= భీష్ముడు పడడాన్ని; చెప్పినన్= చెప్పగా; అతండు= ఆ ద్రోణుడు; మూర్ఛిల్లి= మూర్ఛచెంది; ఒక్క+ఇంతన్= ఒక కొంచెం; తేటి= తెప్పిరిల్లుకొని; దీన+ఆననుండు+అగుచున్= తెల్లబోయిన మొగం కలవాడై; ఆ+మహీనాథుకడకున్= ఆ భీష్ముడి వద్దకు; చనియెన్= వెళ్ళాడు; ఆ+అవసరంబునన్= ఆ సమయాన.

తాత్పర్యం: సత్యవతిని పెండ్లాడడానికి అనుకూలపడటం వల్ల మా తండ్రి శంతనుడు సంతోషపడి నాకు ఎవ్వరిచేతనూ చంపబడకుండటం, నా ఇష్టానుసారంగా చనిపోవటం - అనే రెండు వరాలిచ్చాడు. ఆ వరాల ప్రభావంవల్ల నేననుకొంటేనే గాని నాకు మరణం కలుగదు. నా ప్రాణాలు నా చెప్పుచేతల్లో ఉంటాయి' అన్నాడు భీష్ముడు. దేవతలు విన్నారు - సంతోషపడ్డారుకూడా. అదే సమయంలో గంగానది చెప్పి పంపగా కొందరు ఋషులు హంసల రూపాలలో భీష్ముడి దగ్గరకు అది దక్షిణాయనమని తెల్పడానికి వచ్చారు. భీష్ముడది ఎరిగి ఉన్నాడని అతనివల్లే తెలిసికొని, ప్రియంతో వెళ్ళిపోయారు. అప్పుడు దుర్యోధనుడు ఆజ్ఞచేయగా దుశ్శాసనుడు ద్రోణాచార్యుడి వద్దకు వెళ్ళి, భీష్ముడి పతనాన్ని గూర్చి చెప్పాడు. ద్రోణుడు మూర్ఛపోయి, కొంచెం సేపటికి తెప్పిరిల్లాడు. బిక్కమొగం వేసికొని తొందరగా భీష్ముడి దగ్గరకు వెళ్ళాడు. (ఆ సమయంలో పాండవులు సంతోషపడ్డారు. కౌరవులు ఏడ్చారు.)

సీ. పాండవేయులు మాత్స్య పాంచాలయాదవ । సహితంబుగా సంతసమునఁ బొదలి;
రాదెస బొబ్బలు నార్పులు బహుతూర్య । కోటియుఁ జెలఁగె; నీకొడుకుగమియు
నీదిక్కుదొరలును నెలుఁగెత్తి యేడ్వంగ । నంబరచరుల హాహారవంబు
లులియంగ రోదసి గలయంతవట్టును । ఘనశబ్దమయమయ్యె మనుజనాథ!

తే. కాలుసేయార్చుటలు లేక కన్నుఁగవల । నశ్రు లొలుకంగఁ జిత్తంబు లడలఁ బాండు
సూనుతతిఁ జూచుచుండిరి గాని యించు । కయును గడఁగరు మనవారు గయ్యమునకు. 418

ప్రతిపదార్థం: మనుజనాథ!= ప్రభువగు ధృతరాష్ట్రా!; ఆ దెస= పాండవపక్షంలో; పాండవేయులు= పాండవుల సంతానము; మాత్స్య= మత్స్య దేశరాజు; పాంచాల= ద్రుపదుడు; యాదవ= యదువంశంవారు; వీరితో; సహితంబుగాన్= కూడుకొన్నట్లుగా; సంతసమునన్= ఆనందంతో; పొదలిరి= ఉప్పొంగిపోయారు; బొబ్బలు= గర్జనలు; ఆర్పులు= బిగ్గరగా అరవటాలు; బహుతూర్య కోటియున్= నానావిధాలైన వాద్య విశేషాల అనేకాలున్నూ; చెలఁగెన్= చెలరేగాయి; నీ కొడుకు గమియున్= నీ కొడుకుల సమూహం; ఈ దిక్కుదొరలును= ఈ కౌరవుల పక్షాన ఉన్న రాజులున్నూ; ఎలుఁగు+ఎత్తి= గొంతెత్తి; ఏడ్వంగన్; అంబరచరుల= ఆకాశంలో తిరిగేవారి యొక్క; హాహారవంబులు= హాహా అనే అరుపులు; ఉలియంగన్= మ్రోయగా; రోదసిగలయంత+పట్టును= భూమి ఆకాశాల మధ్యభాగం అంతా కూడా; ఘనశబ్దమయము+అయ్యెన్= గొప్ప(మేఘములయొక్క అని అర్థాంతరము) ధ్వనితో నిండిపోయింది; మనవారు= కౌరవసేనలోనివారు; కాలు+చే= కాలు చేతులు; ఆర్చుటలులేక= కదలించటాలు లేకుండా; కన్ను+కవలన్= రెండుకళ్ళనుండి; అశ్రులు= కన్నీటిబొట్లు; ఒలుకంగన్= చిందగా; చిత్తంబులు= మనస్సులు; అడలన్= భయంచెందగా; పాండుసూనుతతిన్= పాండవుల సంఘాన్ని; చూచుచుండిరి+కాని= చూస్తూ నిలబడ్డారేగాని; కయ్యమునకున్= యుద్ధానికి; ఇంచుకయున్= కొంచెంకూడా; కడఁగరు= పూనుకొనరు.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా!, పాండవులు, వారి సంతానం, మత్స్య ద్రుపద యాదవులతోపాటు ఆనందంతో ఉబ్బిపోయారు. గర్జనలు చేశారు. పొలికేకలు పెట్టారు. దీనికి తోడు వారి బహువిధాలైన భేరీ భాంకారాదుల చప్పుళ్ళు ఉప్పతిల్లాయి. నీ అందరు కొడుకులు, ఈ పక్షంలో ఉండే రాజులు గొంతు విప్పి

బోరుమంటూ ఏడవసాగారు. ఆకాశంలో సంచారం చేసే దేవగంధర్వకిన్నరాదుల హాహాకారాలు దీనికి తోడు కాగా, భూమి ఆకాశాల మధ్య గల భాగమంతా పెద్ద (మేఘ) ధ్వనితో నిండిపోయింది. ఇక మన (కౌరవ) పక్షంలోని వారు కాలు, చేయి కూడా కదల్చలేక పోయారు. కన్నీటి ధారలను కార్చుతున్నారు. మనస్సుల్లో హడలెత్తగా, ఊరకే పాండవుల దండును చూస్తూ ఉండిపోయారే గానీ, యుద్ధం చేయడానికి కొంచెం కూడా యత్నించనే లేదు.

విశేషం: 'ఘనశబ్దమయమయ్యె' - గొప్ప ధ్వనితో నిండినదయ్యెను - ఉఱుములతో నిండిన దయ్యెనని అర్థాంతరము, ఘన శబ్దము శ్లిష్ట పదము గొప్పదని, మేఘమని దానికర్థము.

వ. తదవసరంబున నంబరమణి యపరరత్నాకరంబు సొచ్చె ననిన విని ధృతరాష్ట్రుండు సంజయున కిట్లనియె. 419

ప్రతిపదార్థం: తద్+అవసరంబునన్= ఆ సమయంలో; అంబరమణి= సూర్యుడు; అపరరత్నాకరంబున్= పడమటి సముద్రాన్ని; చొచ్చెన్= ప్రవేశించాడు; అనినన్= అని చెప్పగా; విని; ధృతరాష్ట్రుండు; సంజయునకున్; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు:

తాత్పర్యం: అప్పుడు సూర్యుడు అస్తమించాడు.' అని సంజయు డనటాన్ని విన్నట్టి ధృతరాష్ట్రుడు అతడితో ఇట్లా అన్నాడు:

క. ' నాయుల్ల మరయ నినుమో? । ఱాయో? కా కిట్లు రూపఱక విన నోర్చెన్
సాయకసముదయఖరభవ । దీయవచనచయము గవియుదేరం దిర మై. 420

ప్రతిపదార్థం: అరయన్= చూడగా; నా ఉల్లము= నాయొక్క మనస్సు; ఇనుము+ఓ?= ఇనుపముద్దయో?; ఱాయి+ఓ?= బండయో?; కాక= కాకుంటే; సాయక= బాణాలయొక్క; సముదయ= వరుసవలె; ఖర= పదునైన; భవదీయ= నీ నుండి వచ్చేవైన; వచన= మాటలయొక్క; చయము= గుంపు; కవియుదేరన్= వ్యాపిస్తూ ఉన్నప్పటికి; తిరము+ఐ= స్థిరంగా ఉన్నట్టిదై; ఇట్లు; రూపు+అఱక= నశించిపోకుండా; వినన్+ఓర్చెన్= వినగల్గింది.

తాత్పర్యం: 'ఓ సంజయా! ఆలోచిస్తే నా మనస్సు (హృదయం) ఇనుప ముద్దయో, రాయియో అయి ఉంటుంది. లేకపోతే అనేక బాణాల వలె కరకైన నీ మాటల వరుసలు నాపై వ్యాపించినా కూడా దిట్టంగా, బద్దలు కాకుండా ఉండి వినగల్గుతున్నది.

వ. ఇంక నేనేమియుం జెప్పఁ గొఱంత గలదే' యనుటయు నాసూతనందనుం డి ట్లనునప్పుడు కౌరవులుం దారును దమవారును మైమఱువులూడ్చి యాయుధంబులు వెట్టి గాంగేయుకడకుం బోయిరి. కౌంతేయులు నట్ల బంధుమిత్రసహితు లయి యచటికిం జనిరి. ధనంజయుం డొక్కరుండును ధనుష్పాణి యై యరిగె ని ట్లయ్యురుదెఱంగులవారలుం దత్కాలప్రశాంతస్వాంతులైయన్యోన్యవిషయరోషంబులు దక్కితన్నుం బరివేష్టించినం గులగురుం డగు నమ్మందాకినీనందనుండు వారి నభినందించి కొలిపించికొని యుండె. 421

ప్రతిపదార్థం: ఇంకన్= ఇకమీద; ఏను= నేను(ధృతరాష్ట్రుడు); ఏమియున్= ఏమైనా; చెప్పన్= చెప్పడానికి; కొఱంత= తక్కువ; కలదు+ఏ?= ఉన్నదా?; అనుటయున్= అని చెప్పగా; సూతనందనుండు= సంజయుడు; ఇట్లు+అనున్= ఈ విధంగా అన్నాడు; అప్పుడు= ఆ సమయంలో; కౌరవులున్= కౌరవులును; తారును= తామున్నూ; తమవారును= తమకు సంబంధించిన వారున్నూ; మైమఱువులు= కవచాలు; ఊడ్చి= తీసిపెట్టి; ఆయుధంబులు= అస్త్రశస్త్రాలను; పెట్టి= ప్రక్కనపెట్టి; గాంగేయుకడకున్= భీష్ముడివద్దకు; పోయిరి= వెళ్ళారు; కౌంతేయులు= కుంతికొడుకులు; అట్లు+అ= ఆవిధంగా; బంధుమిత్ర సహితులు+ అయి=

చుట్టాలతో, స్నేహితులతోకూడి; అచటికిన్= భీష్ముడున్న ఆ చోటికి; చనిరి= పోయారు; ధనంజయుండు= అర్జునుడు; ఒక్కరుండును= ఒకడు మాత్రం; ధనుస్+పాణియై= విల్లుచేతియందు కలవాడై; అరిగెన్= వెళ్ళాడు; ఇట్లు= ఈ విధంగా, ఆ+ఇరుతెఱంగులవారలున్= ఆ రెండు పక్షాలవారున్నూ; తద్+కాల ప్రశాంత స్వాంతులు+ఐ= ఆ సమయానికి కోపం లేని మనస్సు కలవారై; అన్యోన్య విషయ రోషంబులు= ఒండొరుల విషయమైన కోపం; తక్కి= వదలి; తన్నున్= ఆ భీష్ముడిని; పరివేష్టించినన్= చుట్టి ఉండగా; కులగురుండు+అగు= వంశానికే, (గొప్పవాడు); గురువు అయినట్టి, ఆ+మందాకినీ నందనుండు= ఆ భీష్ముడు; వారిన్= ఆ వచ్చిన కౌరవ పాండవులను; అభినందించి= పొగడి; కొలిపించుకొని యుండెన్= సేవలు చేయించుకొన్నాడు.

తాత్పర్యం: ఇంక నేనేమైనా చెప్పడానికి ఉన్నదా?' అన్నాడు ధృతరాష్ట్రుడు. దానికి సంజయుడు ఇట్లా అన్నాడు: 'అప్పుడు తాము కౌరవులు, వారికైనవారు, కవచాలు ఊడదీసిపెట్టి, ఆయుధాలన్నీ ఒకచోట పెట్టి, భీష్ముడి వద్దకు వెళ్ళారు. ధర్మరాజాదులు కూడా తమ బంధువులతో, మిత్రులతో కూడా ఆ భీష్ముడున్న చోటికి వెళ్ళారు. ఒక్క అర్జునుడు మాత్రం ధనుస్సు చేతబట్టుకొని ఆయన దగ్గరికి వెళ్ళాడు. ఇట్లు ఆ ఇరువర్గాలవారున్నూ ఆ సమయానికి వారికి గల కోపాలు మానుకొని ఆ భీష్ముడి చుట్టూ మూగారు. కులానికంతా పెద్దయైన ఆ భీష్ముడు వారిని కొనియాడి, తత్కాలానికి తనకు కావలసిన ఉపచారాలను వారిచే చేయించికొన్నాడు.

తే. తనకుఁ గ్రీఁదల యని భవత్తనయులకు నె । ఱుంగఁ జెప్పిన వారు గడంగి మెత్తఁ
దనముగల తలగడలు దేఁబనుచుటయును । జూచి చిఱునవ్వుతో సవ్యసాచిఁ బిలిచె.' 422

ప్రతిపదార్థం: తనకున్= భీష్ముడికి; క్రీఁదల= తల అడుగు భాగం - తలగడ; అని; భవత్తనయులకున్= నీ కొడుకులకు; ఎఱుంగన్+చెప్పినన్= (తనకు తలగడ కావాలని) తెలియచెప్పగా; వారు= నీ కొడుకులు; కడంగి= ప్రయత్నించి; మెత్తఁదనమున్+కల= మృదుత్వం కలిగినట్టి; తలగడలున్= దిండ్లు; తేన్+పనుచుటయునున్= తేవటానికి పంపగా; చూచి= భీష్ముడు తిలకించి; చిరునవ్వుతో; సవ్యసాచిన్= అర్జునుడిని; పిలిచెన్= పిలిచాడు.

తాత్పర్యం: భీష్ముడు తనకు తల క్రిందకు దిండు(తలగడ) కావాలని నీ పుత్రులతో చెప్పాడు. వారు మెత్తని దిండ్లు తెండని పనివారికి ఉత్తరువు చేశారు. భీష్ముడు చిరునవ్వుతో అర్జునుడిని చూచి దగ్గరకు పిలిచాడు.

క. పిలుచుటయు నతఁడు బాష్పము । లొలుకఁగ గాండివము వెట్టి యొయ్యన చనినం
'దలగడతూపులు సెజ్జకు । నలవడఁ బెట్టు' మని భీష్మఁ డాతనిఁ బనిచెన్. 423

ప్రతిపదార్థం: పిలుచుటయున్= పిలువగా; అతఁడు= ఆ అర్జునుడు; బాష్పములు= కన్నీళ్ళు; ఒలుకఁగన్= కారుతుండగా; గాండివమున్= గాండీవమనే తన వింటిని; పెట్టి= ప్రక్కన ఉంచి; ఒయ్యనన్= మెల్లగా; చనినన్= దగ్గరకుపోగా; సెజ్జకున్= పాన్పునకు; తలగడ తూపులు= దిండైన బాణాలు; అలవడన్= తగినట్టుగా; పెట్టుము+అని= ఉంచుము అని; భీష్ముడు; ఆతనిన్= ఆ అర్జునుడిని; పనిచెన్= ఆజ్ఞాపించాడు.

తాత్పర్యం: భీష్ముడు తనను పిలవగానే, అర్జునుడు కంటనీరు కార్చుకొంటూ, తన గాండీవాన్ని (వింటిని) అవతలపెట్టి, వినయంతో మెల్లగా అతడి దగ్గరకు వెళ్ళాడు. అప్పుడు భీష్ముడు 'ఈ బాణాల పాన్పునకు సరిపడేటట్లుగా తూపుల దిండుపెట్టుము' అని ఆనతిచ్చాడు.

వ. ఇట్లు పనిచినం బార్థుం డట్ల చేయుదు నని గాండివంబు పుచ్చికొని మఱియు ననుజ్ఞ గొని మూఁడు వాలమ్ము
లభిమంత్రించి పెడతలఁ దాకి యెత్తి పట్టుకొని పుంఖంబులు భూమి మోచి నిలుచునట్లుగా నేసినం దాత

ప్రీతుండైతల్పంబునకుందగిన యుపధానంబు వెట్టి తనియతనిఁగొనియాడి సకలపౌత్రులను ధాత్రీపతులను నవలోకించి. 424

ప్రతిపదార్థం: ఇట్లు; పనిచినన్= ఉత్తరువు చేయగా; పార్థుండు; అట్ల చేయుదున్+అని= అట్లే చేస్తానని అంటూ; గాండివంబున్; పుచ్చికొని= తీసికొని; మఱియున్= మరల; అనుజ్ఞన్= ఆజ్ఞను; కొని= పొంది; మూఁడు; వాలు+అమ్ములు= పదునుగల బాణాలు; అభిమంత్రించి= మంత్రంవేసి; పెడతలన్= తలయొక్క వెనుక ప్రక్క; తాఁకి= ముట్టి; ఎత్తిపట్టుకొని= పైకెత్తి పట్టుకొని; పుంఖంబులు= బాణాల క్రిందికొనలు; భూమి(న్)= నేలమీద; మోచి= ఆనుకొని; నిలుచున్+అట్లు+కాన్= నిలబడే విధంగా; ఏసినన్= బాణాలు వేయగా; తాత= పితామహుడైన భీష్ముడు; ప్రీతుండు+ఐ= ప్రీతి చెందినవాడై; తల్పంబునకున్= పానుపునకు; తగిన= తగ్గట్టి; ఉపధానంబున్= తలగడను; పెట్టితి(వి)+అని= పెట్టావని; అతనిన్= ఆ అర్జునుడిని; కొనియాడి= పొగడి; సకలపౌత్రులను= అందరు మనుమలను; ధాత్రీపతులనున్= దొరలను; అవలోకించి= చూచి.

తాత్పర్యం: పై విధంగా భీష్ముడు అర్జునుడిని ఆజ్ఞాపించాడు. అట్లే చేస్తానని అర్జునుడు తన గాండీవాన్ని ఎత్తుకొన్నాడు. మళ్ళీ అనుజ్ఞ తీసికొన్నాడు. మూడు పదునుగల బాణాలను బాగా మంత్రించి, భీష్ముడి తలయొక్క వెనుక భాగాన్ని ఎత్తి పట్టుకొని, ఆ మంత్రించిన బాణాలను ప్రయోగించాడు. వాటి కొనలు నేలకు గట్టిగా గుచ్చుకొని, చక్కగా నిలబడ్డాయి. భీష్ముడు చూచి, సంతోషపడ్డాడు. అంపశయ్యకు అనువైన దిండు పెట్టినందుకు అతడిని పొగిడాడు. తన మనుమ లందరనూ దొరలనూ చూచి. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. ‘ రవిఁ గొల్చి యుత్తరాయణ । మవునంతకు నంపపాన్పునం దిట్లు మహో
త్సవలీల నిలుతు నా కీ । దివసంబులఁ జేయవలయుఁ దృఢతరరక్షన్. 425

ప్రతిపదార్థం: రవిన్= సూర్యుడిని; కొల్చి= ఆరాధించి; ఉత్తర+అయనము= ఉత్తరాయణము; అవు+అంతకున్= అయ్యేటంతవరకు; అంపపాన్పునందున్= బాణాల శయ్యపై; ఇట్లు= ఈ విధంగానే; మహా+ఉత్సవలీలన్= మహానందాన్ని కలిగించే రీతులతో; నిలుతున్= ప్రాణాలతో ఉంటాను; నాకున్= భీష్ముడనైన నాకు; ఈ దివసంబులన్= పాన్పున ఉండే ఈ దినాలలో; తగన్= తగినట్లుగా; దృఢతర రక్షన్= గట్టికాపలాను; చేయవలయున్.

తాత్పర్యం: ‘సూర్యుడిని ఆరాధిస్తాను. ఉత్తరాయణం వచ్చేదాకా ఈ బాణాల పడకపైన ఇట్లాగే ఉండి ఆనందంతో, ఉత్సాహంతో కాలం గడుపు ఈ దినాలలో నాకు తగినవిధంగా చక్కని కాపలా మీరు ఏర్పాటు చేయాలి.

క. అలయ కరయ నోపినవా । రలు గ్రక్కునఁ బరిఖతోడి ప్రాకారం బి
ట్టలముగఁ గావింపుఁ’ డనుడుఁ । దలకొని నీసుతులుఁ బాండు తనయులు భక్తిన్. 426

ప్రతిపదార్థం: అలయక= శ్రమము లేకుండా; అరయన్= చూసుకోవడానికి; ఓపినవారలు= చాలినవారు; గ్రక్కునన్= వెంటనే; పరిఖతోడి= అగడ్తలతో కూడిన; ప్రాకారంబున్= ప్రహరీగోడలను; ఇట్టలముగన్= బాగా ఎత్తుగా; కావింపుఁడు= ఏర్పరచండి; అనుడున్= అని చెప్పగా; భక్తిన్= భక్తితో; నీ సుతులు= నీ కుమారులు, పాండుతనయులు= పాండురాజు కొడుకులు; తలకొని= ప్రయత్నపడి

తాత్పర్యం: శ్రమ లేకుండా చూచుకొనగల వారు నాకు బాగా కాపుగా ఉండాలి. వెంటనే అగడ్తలు గల ప్రాకారాన్ని ఎత్తుగా నా చుట్టూ కట్టించండి’. అనగానే భక్తితో కౌరవులు, పాండవులు కూడా ప్రయత్నపడి

వ. అత్తెఱం గాచరింపనుం దాత్పర్యంబున రక్షింపనుం దమతమయందుఁ దగినవారల నియోగించి రంతఁ జికిత్సకులు వచ్చి శల్యచికిత్స సేసెద మని తొడంగిన గాంగేయుండు వారించి వారి కభిమతార్థంబు లొసంగి వీడుకొల్పె గీతవాద్యనృత్తప్రవీణంబు లగు పాత్రంబు లమ్మహాత్మునకు వినోదంబు సలుపుచుండె నట్టియెడ నాదేవవ్రతుండు నీళ్కు ద్రావ నడిగినం దనుపారు నీ రనేకులు గొనివచ్చిన నతండు. 427

ప్రతిపదార్థం: ఆ+తెఱంగు= ఆ విధంగా; ఆచరింపనున్= చేయటానికిన్నీ; తాత్పర్యంబునన్= తత్పరతతో; రక్షింపనున్= కాపాడ్డానికి; తమ తమ యందున్= వారి వారిలో; తగినవారలన్= అర్హులైనవారిని; నియోగించిరి= ఏర్పాటు చేశారు; అంతన్= అంతట; చికిత్సకులు= వైద్యులు; వచ్చి= సమీపించి; శల్యచికిత్సన్= ఎముకలకు సంబంధపడిన వైద్యాన్ని; చేసెదము+అని= చేస్తామని; తొడంగినన్= ఆరంభించగా; గాంగేయుండు= భీష్ముడు; వారించి= వద్దని చెప్పి; వారికిన్= ఆ వైద్యులకు, అభిమత+అర్థంబులు= ఇష్టమైన వస్తువులు; ఒసంగి= ఇచ్చి; వీడుకొల్పెన్= పంపివేశాడు; గీతవాద్యనృత్త ప్రవీణంబులు+అగు= పాటలో; వాద్యంలో; ఆటలో నేర్పరులైన; పాత్రంబులు= వేషధారులు; ఆ+మహాత్మునకున్= ఆ మహానుభావుడి(భీష్ముడి)కి; వినోదంబు= కాలక్షేపాన్ని(వేడుకను); సలుపుచుండెన్= కలిగిస్తూ ఉండిరి; అట్టి+ఎడన్= ఆ సమయంలో; ఆ దేవవ్రతుండు= ఆ భీష్ముడు; నీళ్ళు= నీటిని; త్రావన్= త్రాగటానికి; అడిగినన్= కోరగా; అనేకులు= చాలామంది; తనుపు+ఆరు= తృప్తిగలిగించే; నీరు= నీళ్ళను; కొనివచ్చినన్= తీసికొని రాగా; ఆతండు= ఆ భీష్ముడు.

తాత్పర్యం: అగడ్తతోపాటు ప్రాకారాన్ని కట్టటానికి, కంటిని రెప్పవలె ఏమరకుండా కాపాడుతూ ఉండటానికి, ఇరుపక్షాలవారు (కౌరవపాండవులు) తమలో సమర్థులైన వారిని నియమించారు. ఇంతలో వైద్యులు దెబ్బతిన్న ఎముకలకు వైద్యం చేస్తామంటూ వచ్చారు. భీష్ముడు వైద్యం అక్కరలేదంటూ, వారికి కావలసిన అమూల్యాలైన వస్తువుల నిచ్చి సత్కరించి పంపించివేశాడు. సంగీతం పాడేవారు, వీణా వేణు మృదంగాది వాద్యాలు బాగా వాయించేవారు, నాట్యం, అభినయం బాగా చేయగలవారు ఆ మహనీయుడికి ఉబుసుపోక (వేడుక)ను కల్గిస్తున్నారు. ఇంతలో ఆతడికి (భీష్ముడికి) గొంతెండిపోయింది. త్రాగటానికి నీళ్ళు కావాలన్నాడు. చాలామంది చల్లని పానీయాలు తెచ్చి ఇచ్చారు. కాని ఆతడు. (తరువాతి పద్యంతో అన్వయం).

తే. ‘ వినుఁడు శరతల్పగతుఁడ నై యునికిఁజేసి । యన్యసలిలంబు సేవించు టనుచితంబు
నాకుఁదేజోమయాస్త్రవిన్యాసవిధి స । ముత్థితం బైన భూజల మొకఁడు దక్క’. 428

ప్రతిపదార్థం: వినుఁడు= వినండి; శరతల్పగతుఁడన్+ఐ= బాణాల పాన్పులో పడుకొన్నవాడనై; ఉనికిన్+చేసి= ఉండే కారణం వల్ల; నాకున్= నాకు; తేజోమయ= తేజస్సుతో నిండిన; అస్త్ర= మంత్రపూతమైన బాణం యొక్క; విన్యాసవిధి= ప్రయోగించే విధానము చేత; సముత్థితంబు+ఐన= పుట్టినట్టి; భూజలము= భూమిలోపలినుండి వెలువడినట్టి నీరు; ఒకఁడు= ఒకటి; తక్కన్= తప్ప; అన్యసలిలంబు= ఇతరమైన నీరు; సేవించుట= త్రాగుట; అనుచితంబు= తగదు.

తాత్పర్యం: ‘వినండి. నేనిప్పుడు బాణాల పాన్పుపై పడుకొని ఉన్నాను కాబట్టి, తేజోమయమైన బాణాన్ని ప్రయోగించడం వల్ల భూమి లోపలినుండి వెలికి పుట్టుకొనివచ్చే నీళ్ళను మాత్రమే త్రాగుతాను కానీ ఇతరమైన నీటిని త్రాగను. కావున మీరిచ్చిన ఈ నీరు నాకు తగదు’.

తే. అనుటయుఁ గౌరవులును దక్కటి రాజులును వెఱఁగుపడియున్నం గవ్వడిం గనుంగొని గాంగేయుండు. 429

ప్రతిపదార్థం: అనుటయున్= అని చెప్పగా; కౌరవులును(న్)= దుర్యోధనుడు మున్నుగా గలవారు; తక్కటి రాజులును= ఇతరులైన దొరలున్నూ; వెఱఁగుపడి= ఆశ్చర్యపడి; ఉన్నన్= ఉండగా; గాంగేయుండు= భీష్ముడు; కవ్వడిన్= అర్జునుడిని; కనుంగొని= చూచి.

తాత్పర్యం: ఆ మాటలు విని కౌరవులు, వారివైపుండే దొరలందరు ఆశ్చర్యపోగా; ఆ సమయంలో భీష్ముడు అర్జునుడిని చూచి. (తరువాతి పద్యంతో అన్వయం).

క. ‘ శరవేదన సర్వాంగము । లెరియఁగ నా కిపుడు పెదవు లెండెడుఁ దృష్ణా
భర ముడుపఁదగిన నీళులు । వెరవునఁ దే నేర్తు వీవ వే తె మ్మనఘా!’ **430**

ప్రతిపదార్థం: అనఘా!= పాపంచేయని అర్జునా!; శరవేదనన్= బాణాల వలని బాధవల్ల; సర్వ+అంగములున్= శరీరభాగాలన్నీ; ఎరియఁగన్= మండుతూ ఉండగా; ఇపుడు; నాకున్; పెదవులు; ఎండెడున్= ఎండిపోతున్నాయి; ఈవు+అ= నీవే; తృష్ణాభరము= దప్పి యొక్క అతిశయాన్ని; ఉడుపన్= పోగొట్టడానికి; తగిన= అనువైన; నీళులు= నీళ్ళు; వెరవునన్= ఉపాయంతో; తేనేర్తువు= తీసికొని రాగలవు; వేతెమ్ము= వేగంగా తీసికొనిరా.

తాత్పర్యం: ‘అర్జునా! బాణాల బాధవల్ల నా శరీరమంతా మండిపోతున్నది. దప్పిక ఎక్కువైనది. పెదవులు కూడా ఎండిపోతున్నాయి. నా ఈ సహింపరాని దప్పికను పోగొట్టటానికి తగినట్టి నీటిని ఉపాయంతో తేవటానికి నీ కొక్కడికే చేతనౌతుంది. కనుక, ఆలస్యం చేయకుండా నాకు తగ్గనీరు తీసికొనిరమ్ము.’

వ. అనిన నట్లకాక యని యతం డతనికిం బ్రదక్షిణంబు సేసి తేజోమయంబయిన మార్గణంబు పర్జన్యమంత్రాభిమంత్రితంబు గావించి మహీతలంబు గాఁడనేసిన భాసురచ్ఛాయం బగుతోయంబు ధారా రూపంబున దివ్యగంధరసోపేతం బయి యెగసిన. **431**

ప్రతిపదార్థం: అనినన్= అనిచెప్పగా; అట్ల+కాక అని = ఆ విధంగానే అగునుగాక అని; అతండు= ఆ అర్జునుడు, అతనికిన్= ఆ భీష్ముడికి; ప్రదక్షిణంబు+చేసి= చుట్టూ తిరిగి; తేజోమయంబు+అయిన= తేజోరూపమైనట్టి; మార్గణంబున్= బాణాన్ని; పర్జన్యమంత్ర= వర్షాధిదేవత ఇంద్రుడు దేవతగా గల మంత్రాలతో; అభిమంత్రితంబున్= బాగా మంత్రింపఁబడిన దానినిగా; కావించి= చేసి; మహీతలంబున్= నేలమీదను; కాడన్= సందుపడేట్టుగా; ఏసినన్= ప్రయోగింపగా; భాసురచ్ఛాయంబు+అగు= పటికరాయి కాంతివంటి కాంతిగల; తోయంబు= నీరు; ధారారూపంబునన్= ప్రవాహరూపంగా; దివ్య గంధరస+ఉపేతంబు+అయి= దివ్యమైన వాసనతో, రుచితో కూడినదై; ఎగసినన్= పైకిరాగా.

తాత్పర్యం: పై విధంగా భీష్ముడు చెప్పగా, అర్జునుడు అలాగే చేస్తానని భీష్ముడికి ప్రదక్షిణం చేశాడు. తేజోరూపంగా ఉండే ఒక బాణాన్ని తీసికొన్నాడు. దాన్ని మేఘాలకునాయకుడైన ఇంద్రుడు దేవతగా గల మంత్రాలతో బాగా మంత్రించాడు. ఆ బాణాన్ని నేలలో బాగా గుచ్చుకొనేటట్లుగా ప్రయోగించాడు. దానితో, పటిక మాదిరి తెల్లగా ఉండే నీరు పైకి ఎగజిమ్మినది. దివ్యమైన సువాసన, రుచి కలిగి ఉన్న నీరు ప్రవాహరూపంగా పైకిరాగా.

ఆ. కౌరవులు ప్రకంపగాఢ విస్మయు లైరి । పాండుసుతులు వారిబలము నుబ్బి
యార్చి సంకు లొత్తి రా జలంబుల నమ్మ । హాత్ముఁ దృప్తుఁ జేసె నర్జునుండు. **432**

ప్రతిపదార్థం: కౌరవులు= ధార్తరాష్ట్రులు; ప్రకంపగాఢ విస్మయులు= ఎక్కువ వణకు, అధికంగా ఆశ్చర్యం కలవారు; ఐరి= అయ్యారు; పాండుసుతులు= పాండురాజు కొడుకులు; వారి బలము= ఆ పాండవుల సేన; ఉబ్బి= సంతోషపడి; ఆర్చి= బొబ్బలు పెట్టి; సంకులు= శంఖాలు; ఒత్తిరి= ఊదారు; అర్జునుండు; ఆ జలంబులన్= పాతాళం నుండి వచ్చిన ఆ నీటితో; ఆ+మహాత్మున్= మహాత్ముడైన ఆ భీష్ముడిని; తృప్తున్= తృప్తి చెందినవాడినిగా; చేసెన్= చేశాడు.

తాత్పర్యం: కౌరవులకు బాగా వణకు, ఆశ్చర్యం కలిగింది. పాండవులు, వారి బలగం సంతోషంతో ఉబ్బిపోయారు. గర్జించారు. శంఖాలు పూరించారు. అర్జునుడు ఆ జలంతో భీష్ముడికి తృప్తి కలిగించాడు.

వ. ఇట్లు తృప్తిఁ బొంది మందాకినీనందనుండు పురందరనందనున కి ట్లనియె. 433

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా మందాకినీ నందనుండు= భీష్ముడు; తృప్తిన్= తనివిని; పొంది= చెంది; పురందర నందనునకు(న్)= అర్జునుడికి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: భీష్ముడు, ఈ విధంగా పైకి వచ్చిన నీరు త్రాగి తృప్తి చెంది అర్జునుడితో ఇట్లా అన్నాడు.

ఉ. ' నారదుచేత నిన్ను మునినాథునిఁ గాఁగ నెఱింగి యుండుదున్
శౌరియు నీవుఁ గూడిన నసాధ్యము లెవ్వియు లేవు దర్పదు
ర్వారుఁడ వైన నీవలనివైరము గీ డని చెప్పఁ జెప్ప నీ
కౌరవరాజు మానఁడు దెగం జెడుఁ గా కిటమీఁద భీముచేన్.' 434

ప్రతిపదార్థం: నిన్నున్; నారదుచేతన్= నారదమహర్షివల్ల; మునినాథునిన్+కాఁగన్= ఋషిపుంగవుడినిగా; ఎఱింగి ఉండుదున్= తెలిసికొని ఉన్నాను; శౌరియున్= శ్రీకృష్ణుడున్నూ; నీవున్+కూడినన్= నీవున్నూ చేరితే; అసాధ్యములు= సాధింపరానివి; ఎవ్వియున్ లేవు= ఏవీకూడా ఉండవు; దర్ప దుర్వారుఁడవు+ఐ= గర్వంచేత అడ్డగింపరానివాడవైన; నీవలని వైరమున్= నీతోడి విరోధం; కీడు+అని= చెడుపు అని; చెప్పన్ చెప్పన్= ఎంతగా చెప్పినా కూడా; ఈ కౌరవరాజు= ఈ దుర్యోధనుడు; మానఁడు= వదలిపెట్టడు; ఇటమీఁదన్= ఇకపైన; భీముచేన్= భీముడిచేత; తెగన్+చెడున్+కాక= సమూలంగా నశించిపోతాడు.

తాత్పర్యం: 'అర్జునా! నీవు నరనారాయణావతారంలోని నరుడనే మహర్షివని నారదుడు చెప్పగా విని ఉన్నాను. నీవు, శ్రీకృష్ణుడు ఒకచోట చేరారంటే ఇంక మీకు సాధ్యం కాని పనులంటూ ఏవీ ఉండవు. గర్వంతో ని న్నెవరూ ఏమీ చేయలేరు. నీ తోడి విరోధం నాశనానికి కారణమని ఎన్నో మార్లు చెప్పినా ఈ దుర్యోధనుడు నీతో విరోధం మానుకోలేదు. ఇక ఇతడు భీముడిచేత బొత్తిగా సమూలంగా వినాశం పొందుతాడు.'

వ. అని పలికి దీనమానసుం డగుచున్న భవత్సూనుతో ని ట్లనియె. 435

ప్రతిపదార్థం: అని పలికి= అని చెప్పి; దీన మానసుండు+అగుచున్న= చిన్నపోయిన మనస్సు కలవాడౌతున్న; భవత్+సూనుతోన్= నీ కొడుకుతో; ఇట్లు+అనియెన్= ఈ మాదిరి అన్నాడు.

తాత్పర్యం: భీష్ముడు అర్జునుడితో పై రీతిగా చెప్పగా మనస్సు చిన్నబుచ్చుకొని ఉన్న నీ కుమారుడు దుర్యోధనుడితో ఇట్లా అన్నాడు.

మ. ' నరుఁ డత్యద్భుతవిక్రముం డతని కానారాయణుం డాప్తుఁ డె
వ్వరికిన్ వీరి జయింపరాదు సమరావష్టంభముం దక్కి ధ
ర్మరతుం డైనయజాతశత్రునకు నింద్రప్రస్థ మి మ్మర్థరా
జ్యరమం బొందుము మీరు గొందఅయినం జాకున్న నీ కొప్పదే?' 436

ప్రతిపదార్థం: నరుఁడు= అర్జునుడు; అతి+అద్భుతవిక్రముండు= మిగుల ఆశ్చర్యకరమైన పరాక్రమం కలవాడు; అతనికిన్= ఆ అర్జునుడికి; ఆ నారాయణుండు= జగత్ప్రసిద్ధి చెందిన కృష్ణుడు; ఆప్తుఁడు= ఎప్పుడు వదలక వెంట ఉండేవాడు; వీరిన్=

అట్టి ఇద్దరినీ; ఎవ్వరికిన్= ఎట్టి శూరులకు గాని; జయింపన్+కాదు= జయించడానికి సాధ్యంకాదు; సమర+అవష్టంభమున్= యుద్ధసంబంధమైన గర్వా (ప్రయత్నా)న్ని; తక్కి= వదలిపెట్టి; ధర్మరతుండు+ఐన= ధర్మమందు ఆసక్తిగల; అజాతశత్రునకున్= శత్రువులే లేనట్టి ధర్మరాజుకు; ఇంద్రప్రస్థము+ఇమ్ము= ఇంద్రప్రస్థాన్ని ఇచ్చివేయుము; అర్ధరాజ్యరమన్= సగపాలు రాజ్యలక్ష్మిని; పొందుము= కలిగి ఉండుము; కొందఱు+అయినన్= కొంతమందైనప్పటికీ; మీరు= కౌరవులు; చాక+ఉన్నన్= చావకుండా వుంటే; నీకున్; ఒప్పదు+ఏ?= ఒప్పిదం(సమ్మతం) కాదా?

తాత్పర్యం: 'అర్జునుడు చాలా ఆశ్చర్యం కొలిపే పరాక్రమం కలిగినవాడు. అతడికి అనుక్షణం తోడు నీడగా ఉండేవాడు ప్రఖ్యాతి కెక్కిన శ్రీకృష్ణుడు - సాక్షాత్తు నారాయణమూర్తి. ఇక వీరిద్దరూ ఏకమై నిలిస్తే ఎంత గొప్ప వీరులైనా జయించలేరు. కాబట్టి అట్టి యుద్ధ ప్రయత్నాన్ని, గెలుస్తామనే గర్వాన్ని ఇకనైనా విడిచిపెట్టుము. ధర్మదేవత అంశాన పుట్టినవాడు, పుట్టని శత్రువులు గలవాడు అయిన ఆ ధర్మరాజుకు ఇంద్రప్రస్థాన్ని ఇచ్చివేయుము. మిగిలిన సగంరాజ్యాన్ని నీవు ఏలుకొమ్ము. యుద్ధాన్ని చాలిస్తే మీలో కొందరైనా బ్రతుకుతారు కదా! అది నీకు మంచిది.'

విశేషం: నరుఁడు: అద్భుత విక్రముడు; నారాయణుడు: ఆప్తుడు; ధర్మరతుడు - అజాతశత్రుడు; ఇవి సాభిప్రాయాలు. నరుడు నరనారాయణులలో ఒకడు. అనగా భగవంతుడి అంశతో పుట్టినాడనుట. అద్భుత విక్రముడే అంపశయ్యకు అనువైన తలగడ ఏర్పాటు చేయటం, పాతాళగంగను పైకి రప్పించటం వంటి అద్భుతకార్యాలను చేయగలడు. నారాయణుడు సాక్షాత్తు పరమాత్మస్వరూపుడు - ఆప్తుడు - భగవంతుడే ఆప్తుడైన వారికి కొదవేమిటి? ధర్మరతుడు - ధర్మరాజు ధర్మం వదలనివాడు, **'యతో ధర్మస్తతో జయః'** అనే వాక్యం వల్ల **'యత్రయోగేశ్వరః కృష్ణః యత్ర పార్థో ధనుర్ధరః తత్ర శ్రీర్విజయోభూతిః ధ్రువా నీతిర్మతిర్మమ.'** అనే న్యాయం చేత పాండవులకు విజయం తప్పదని సూచిస్తున్నాడు. అజాతశత్రుడు: సహజంగా ఆయనకు శత్రువులంటూ ఎవరూలేరు- 'నీ మూర్ఖత్వం వలన యుద్ధం ఏర్పడింది. ఇకనైనా వైరం మానుకొని ఇంద్రప్రస్థం వారికిచ్చి, మిగిలిన సగం రాజ్యాన్ని ఏలుకుంటూ మిగిలిన మీ వారితో సుఖంగా ఉండుము అని భీష్ముడు దుర్యోధనుడికి బుద్ధి చెప్పాడు.

వ. అని పలికి యూరకుండెం; గౌరవ పాండవులును మాఱు పలుకక యతనికి నమస్కరించి నిజనివాసంబులకుం జని; రట్లు సనునెడ గోవిందుండు కౌంతేయాగ్రజుం గనుంగొని. 437

ప్రతిపదార్థం: అని పలికి= అని చెప్పి; ఊరక+ఉండెన్= ఏమీ మాట్లాడకుండా ఉన్నాడు; కౌరవపాండవులును= కౌరవులు, పాండవులు; మాఱుపలుకక= బదులుమాట్లాడక; అతనికిన్= ఆ భీష్ముడికి; నమస్కరించి; నిజనివాసంబులకున్= తమతమ ఉనికిపట్టులకు; చనిరి= వెళ్ళారు; అట్లు= ఆ విధంగా; చను+ఎడన్= వెళ్ళే సమయంలో; గోవిందుండు= కృష్ణుడు; కౌంతేయ+అగ్రజున్= కుంతి కొడుకులలో పెద్దవాడైన ధర్మరాజును; కనుంగొని= చూచి.

తాత్పర్యం: భీష్ముడు పై విధంగా దుర్యోధనుడికి బుద్ధి చెప్పి, ఏమీ పలకకుండా ఊరుకొన్నాడు. కౌరవులు, పాండవులు కూడా ఏమీ బదులు చెప్పకుండా భీష్ముడికి నమస్కారాలు చేసి వారి వారి నివాసాలకు వెళ్ళిపోయారు. అట్లా పోతూ ఉండేటప్పుడు శ్రీకృష్ణుడు ధర్మరాజును చూచి (ఇట్లా అన్నాడు.)

క. ' సురలకు నజయ్యుఁ డగు నీ । సురసరిదాత్మజుని గెలువఁ జొప్పడునే? యె
వ్వరికైన నద్భుతావహ । పరికరులగు మీకుఁ దక్కఁ బౌరవముఖ్యా!' 438

ప్రతిపదార్థం: పౌరవముఖ్యా!= పురువంశంలో ప్రముఖుడైన ధర్మరాజా!; సురలకున్= దేవతలకు; అజయ్యుఁడు+అగు= జయించటానికి అసాధ్యుడైన; ఈ సురసరిత్+ఆత్మజునిన్= దేవనది కొడుకైన ఈ భీష్ముడిని; గెలువన్= జయించటానికి;

అద్భుత+ఆవహపరికరులు+అగు= ఆశ్చర్యం కలిగించే; ఆయుధాలు, పరివారం కల్గినట్టి; మీఁకున్+తక్కన్= మీకుతప్ప; ఎవ్వరికిన్+ఐనన్= ఏ వీరులకైనా; చొప్పడును+ఏ?= సరిపడునా? (సరిపడదు)

తాత్పర్యం: 'ధర్మరాజా! భీష్ముడిని, గెలవటానికి దేవతలకు కూడా అలవికాదు. అట్టివానిని జయించడానికి ఆశ్చర్యకరములైన అస్త్రశస్త్రాది పరికరాలు, పరివారాలు కలిగి ఉండే మీకు తప్పితే, మరెవ్వరికీ శక్యంగాదు.'

క. అనుటయు నతఁడిట్లను 'నే। మనఁగా నొక మానిసులమె? యప్రతిహతవీ
రుని నిన్నుఁ బడసి యింతటి। పనులకుఁ జాలితిమి గాక భక్తాధీనా! 439

ప్రతిపదార్థం: అనుటయున్= అని శ్రీకృష్ణుడంటే; అతఁడు= ఆ ధర్మరాజు; ఇట్లు+అనున్= ఇట్లా అంటాడు; భక్త+అధీనా!= భక్తులకు అధీనుడవైన కృష్ణా!; ఏము+అనఁగాన్= మేమంటే; ఒక మానిసులము+ఎ?= మానవమాత్రులమే?; అప్రతిహతవీరునిన్= అడ్డులేని వీరుడవైన; నిన్నున్= శ్రీకృష్ణుడవైన నిన్ను; పడసి= పొంది; ఇంతటి పనులకున్= ఇంతింత గొప్ప పనులకు; చాలితిమి+కాక= సమర్థులమయ్యాము తప్ప వేరుకారణం లేదు.

తాత్పర్యం: కృష్ణుడు పై విధంగా అన్నప్పుడు ధర్మరాజు అంటున్నాడు. 'భక్త పరాధీనుడవైన కృష్ణా! మేమంటే మనుష్య మాత్రులమే కదా! ఎదురులేని పరాక్రమం గల నీవు మాకు చేదోడు వాదోడుగా ఉండటం బట్టిగానీ, లేకుంటే ఇంతింత అసాధ్యాలైన పనులు చేయగలిగేవాళ్ళమా?'

కర్ణుఁడు భీష్మునియొద్దకుఁ బోయి వినతుం డగుట (సం. 6-117-1)

వ. అని యిట్లయ్యిరువురు నొండొరులం బ్రశంసించుచు నఖిలజన పరివృతు లై శిబిరంబుల కరిగిరి తదనంతరంబ కర్ణుండుగాంగేయుకడకుంబోయి భక్తివినయంబులు దోఁపంబాదప్రణామంబాచరించి.440

ప్రతిపదార్థం: అని; ఇట్లు; ఆ+ఇరువురున్= ఆ ఇద్దరున్నూ; ఒండొరులన్= ఒకరినొకరు; ప్రశంసించుచున్= పొగడుకుంటూ; అఖిలజన పరివృతులు+ఐ= సమస్తజనంచేత చుట్టబడినవారై; శిబిరంబులకున్= తమ గుడారములకు; అరిగిరి= పోయారు; తద్+అనంతరంబు+అ= ఆ వెనువెంటనే; కర్ణుండు= రాధేయుడు; గాంగేయుకడకున్= భీష్ముడివద్దకు; పోయి; భక్తివినయంబులు= భక్తియు, వినయమున్నూ; తోఁపన్= తెలిసేట్లుగా; పాదప్రణామంబు= అడుగులకు నమస్కారాన్ని; ఆచరించి= చేసి.

తాత్పర్యం: ఈ ప్రకారం కృష్ణుడు, ధర్మరాజు ఒకరినొకరు పొగడుకొంటూ, జనమంతా మూగిరాగా తమ స్థావరాలకు వెళ్ళారు. ఆ వెంటనే కర్ణుడు భీష్ముడి దగ్గరకువచ్చి భక్తి వినయాలతో ఆయనకు సాష్టాంగ నమస్కారం చేసి. (తరువాతి పద్యంతో అన్వయం.)

ఆ. ' అలుక దక్కి నన్ను నధికవాత్సల్యశీ। తలము గాఁగఁ జూచి తగినమాట
లాడవే? మహాత్మ!' యనుటయు నాతండు। గారవమున నతనిఁ జేరఁ బిలిచి. 441

ప్రతిపదార్థం: మహాత్మ!= మహానుభావా!; అలుక+తక్కి= కోపం విడిచిపెట్టి; అధికవాత్సల్య శీతలము+కాఁగన్= మిక్కుటమైన పుత్రాదులందుండెడు స్నేహంతో చల్లగా; చూచి; తగిన మాటలు= ఉచితమైన మాటలు; ఆడవు+ఏ?= పలుకవా?; అనుటయున్= అనిచెప్పగానే; ఆతండు= ఆ భీష్ముడు; గారవమునన్= గౌరవంతో; అతనిన్= ఆ కర్ణుడిని; చేరన్+పిలిచి= దగ్గరకు రమ్మని పిలిచి.

తాత్పర్యం: 'కోపం మానుకొని, పుత్రవాత్సల్యంతో, చల్లని చూపుతో చూచి, ఒప్పిదమైన పలుకులతో నను పలుకరింపవా మహాత్మా!' అని కర్ణు డనగానే భీష్ముడతడిని దగ్గరకు రమ్మని పిలిచి. (తరువాతి పద్యంతో అన్వయం).

వ. ఒక్కకరంబు మలంచి కౌఁగిలించుకొని యచ్చట నున్నరక్షకాదిజనంబుల నవులం బోవం బనిచి యతనితో ని ట్లనియె. 442

ప్రతిపదార్థం: ఒక్క కరంబు= ఒకచేతిని; మలంచి= తిప్పి; కౌఁగిలించుకొని= ఆలింగనం చేసికొని; అచ్చటన్= ఆ భీష్ముడివద్ద; ఉన్న= ఉన్నట్టి; రక్షక+ఆది జనంబులన్= కాపలాగా ఉండే వారిని; అవులన్+పోవన్+పనిచి= అవతలకు వెళ్ళుడని ఆజ్ఞచేసి; అతనితోన్= ఆ కర్ణుడితో; ఇట్లు+అనియె(న్)= ఇలా అన్నాడు.

తాత్పర్యం: ఒక చేతిని అడ్డంగా తిప్పి కర్ణుడిని కౌగిట చేర్చికొని, అక్కడ ఉన్న రక్షకాది పరివారాన్నంతా అవతలకు దూరంగా వెళ్ళండని చెప్పి, కర్ణుడితో భీష్ముడిలా అన్నాడు.

క. ' నీ దెసఁ గోపింతునె? కుల । భేదముగాఁ బలుకుటయును బిడ్డలఁ జెఱుపం
గా దని కినియుదు లే దన । రా దదలుతు నిన్ను నిష్ఠురంపుఁ బలుకులన్. 443

ప్రతిపదార్థం: నీ దెసన్= నీపట్ల; కోపింతును+ఎ?= కోపపడతానా?; కులభేదముగాన్= కులం పేరిట వ్యత్యాసంతో; పలుకుటయును= పలకటంచేతను; బిడ్డలన్= కౌరవసంతానాన్ని; చెఱుపన్+కాదు+అని= చెరచటం మంచిదికాదని; కినియుదున్= కోపపడతాను; నిష్ఠురంపు+పలుకులన్= కటువైన మాటలతో; నిన్ను= కర్ణుడవైన నిన్ను; అదలుతున్= గద్దిస్తాను; లేదు అనరాదు= అది వాస్తవమే.

తాత్పర్యం: 'కర్ణా! నీ మీద నాకేమి కోపం? పాండవులపట్ల కౌరవులకు భేదబుద్ధి కలిగించే మాటలు మాట్లాడుతావని, కురుసంతానాన్ని చెరచటం తగదని నిన్ను కఠినమైన మాటలతో అదలించిన మాట నిజం. అంతేకాని, నాకు నీ మీద నిజంగా కోపం లేదు.

వ. అది శిక్షగాని రోషంబు గా దట్లుం గాక. 444

ప్రతిపదార్థం: అది= ఆ కోపించడం, విసిగించడం; శిక్షగాని= బోధించటమేగాని; రోషంబు= కోపం; కాదు= కాజాలదు; అట్లున్+కాక= అదీకాకుండా.

తాత్పర్యం: ఆ విధంగా నేను కోపపడినది, నిన్ను విసిగించినది, నీకు మంచిని నేర్పించటానికే గాని నీపైన నాకు కోపంలేదు. అదీగాక. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. నీ యుదయము దైవిక గ । ర్భాయత్తము నీకు మర్త్యు లసదృక్షులు గౌం
తేయుఁడవు గాని విను రా । ధేయుండవు గావు నీవు ధీరవిచారా! 445

ప్రతిపదార్థం: ధీరవిచారా!= స్వతంత్రంగా ప్రమాణ రీతితో విషయాన్ని పరిశీలించగల కర్ణా!; నీ+ఉదయము= నీయొక్క పుట్టుక; దైవిక+గర్భ+ఆయత్తము= దేవసంబంధమైన గర్భానికి అధీనమైనది; నీకున్; మర్త్యులు= మానవులు; అసదృక్షులు= సాటివారుకారు; విను; నీవు; కౌంతేయుఁడవుగాని= కుంతికొడుకువేగాని; రాధేయుండవుకావు= రాధ కొడుకువుకావు.

తాత్పర్యం: మంచి చెడ్డలు స్వయంగా ఆలోచించగల కర్ణా!, నీ పుట్టుక దేవ సంబంధంతో ఏర్పడిన గర్భం వల్ల కలిగినట్టిది కాబట్టి, మానవులెవ్వరూ నీకు సమానులు కారు. నా మాట బాగా ఆలకించు. నీవు కుంతి కొడుకువేగాని రాధ కొడుకువు కానేకావు.

వ. ఇది కృష్ణద్వైపాయనుండు నాకు నేకాంతంబున నెఱింగించె. నేనును భవదీయతేజోవిశేషంబువలననుం గనుంగొనియుండుదుఁ బాండుతనయుండవగుటంజేసి నీ యెడ వాత్సల్యంబు కాని మాత్సర్యంబు లే దింక నొక్కటి సెప్పెద వినుమేను గురుపాండవులవైరం బుడిపిపుచ్చితి నప్పాండవేయు లజయ్యు లప్రమేయుండగు కృష్ణుండు వారికి విధేయుండు గావున వారలతోడి విరోధం బొప్పదు నీవును నొండుదలంపు దక్కి యక్కొంతేయులం గలిసి యుండు మనినఁ గర్ణుం డతని కి ట్లనియె. 446

ప్రతిపదార్థం: ఇది= ఈ విషయం; కృష్ణద్వైపాయనుండు= వేదవ్యాస మహర్షి; నాకున్= (భీష్ముడనైన) నాకు; ఏకాంతంబునన్= ఒంటరిగా వుండేటప్పుడు; ఎఱింగించెన్= తెలియచెప్పాడు; ఏనును= నేనుకూడా; భవదీయ తేజః+విశేషంబు వలననున్= నీదైన తేజస్సుయొక్క అతిశయంవల్లకూడా; కనుంగొని; ఉండుదున్= తెలిసికొని ఉన్నాను; పాండుతనయుండవు= పాండురాజు కుమారుడివి; అగుటన్+చేసి= కావటంవల్ల; నీ+ఎడన్= నీమీద; వాత్సల్యంబు+అ+కాని= పుత్ర(ప్రేమయేగాని; మాత్సర్యంబులేదు= ద్వేషములేదు; ఇంకన్+ఒక్కటి+చెప్పెదన్= మరొకమాట చెప్తాను; వినుము; ఏను= భీష్ముడనగు నేను; కురుపాండవుల వైరంబున్= కౌరవులకు పాండవులకు గల విరోధాన్ని; ఉడిపి పుచ్చితిన్= తగ్గింపజేశాను; ఆ+పాండవేయులు= ఆ పాండురాజు సంతతివారు; అజయ్యులు= జయింపశక్యం కానివారు; అప్రమేయుండు+అగు= ఈపాటివాడనటానికి వీలుపడని; కృష్ణుండు; వారికి; విధేయుండు+కావునన్= లోబడ్డవాడు కావడంచేత; వారలతోడి= ఆ పాండవులతో; విరోధంబు= వైరము; ఒప్పదు= తగదు; నీవునున్= నీవు(కర్ణుడవు)కూడా; ఒండు+తలంపు+తక్కి= వేరే ఆలోచన మాని; ఆ+కౌంతేయులన్= ఆ కుంతి కొడుకులను; కలిసి యుండుము= చేరుకొని ఉండుము; అనినన్= అని చెప్పగా; కర్ణుండు; అతనికిన్= ఆ భీష్ముడికి; ఇట్లు+అనియెన్= ఇలా అన్నాడు.

తాత్పర్యం: కర్ణా! నీ పుట్టుకను గూర్చి వేదవ్యాస మహర్షి నాకు రహస్యంగా చెప్పాడు. నేనుకూడా నీ దివ్యతేజస్సును చూచి, దేవాంశ వలన పుట్టావని తెలిసికొన్నాను. పాండురాజు కొడుకువు కాబట్టి, నీమీద నాకు పుత్రవాత్సల్యమే ఉన్నదిగానీ ద్వేషం కొంచెం కూడా లేదు. నే నొకమాట చెపుతాను బాగా వినుము. నేను కురు పాండవుల వైరాన్ని అంతమయ్యేటట్లు చేశాను. ఆ పాండవేయులా జయింపశక్యం కానివారు. పైపెచ్చు ఈపాటి వాడనడానికి వీలుకాని కృష్ణుడే వారికి విధేయుడై ఉన్నాడు. కనుక వారితో విరోధం మానుకొమ్ము. నీవు వేరే ఆలోచన పెట్టుకొనకుండా పాండవులతో కలిసి మెలిసి ఉండుము' అన్నాడు. కర్ణుడు భీష్ముడితో ఇట్లా అంటున్నాడు.

క. ' కౌంతేయుండ నగుదు నిది । యంతయుఁ దొల్లియును వింటి నార్యులచే ని
ట్లింతయు నెఱిఁగినఁ గుంతీ । సంతానముతోడి పొత్తు సనునే? నాకున్. 447

ప్రతిపదార్థం: కౌంతేయుండన్= కుంతికొడుకు; అగుదున్= ఔతాను; ఇది అంతయున్= ఈ విషయమంతా; తొల్లియును= ముందుకూడా; ఆర్యులచేన్= పెద్దలవల్ల; వింటిన్= విన్నాను; ఇట్లు+ఇంతయున్= ఈ విధంగా నా పుట్టుకనంతా కూడా; ఎఱిఁగినన్= తెలిసినప్పటికినీ; కుంతీసంతానముతోడి పొత్తు= పాండవులతో స్నేహం; నాకున్; చనును+ఏ?= తగునా? (తగదు).

తాత్పర్యం: ' నేను కుంతికొడుకునే. ఆ సంగతి ముందే పెద్దలు చెప్పగా విన్నాను. ఈ సంగతి అంతా బాగా తెలిసి యుండగా పాండవులతో నాకు స్నేహం ఎట్లా పొసగుతుంది? బొత్తిగా పొత్తు పొసగదు.

ఉ. వారు మహాబలుల్ హరియు వారికిఁ బ్రాపు గలండు వారలం
బోర జయింపరామియును బుద్ధి నెఱుంగుదు నైనఁ గౌరవ
క్ష్మారమణుండు సేయుతగుమన్నన లెల్లఁ దలంచి చూచినన్
భూరివివేక! యే విడిచిపోవుట ధర్మమె? వీరకర్మమే? 448

ప్రతిపదార్థం: భూరి వివేక!= అధికమైన జ్ఞానం కల భీష్మా!; వారు= ఆ పాండవులు, మహాబలుల్= గొప్పబలంగలవారు; హరియు(న్)= కృష్ణుడున్నూ; వారికిన్= ఆ పాండవులకు; ప్రాపు= అండగా; కలండు= ఉన్నాడు; వారలన్= ఆ పాండవులను; పోరన్= యుద్ధంలో; జయింపరామియును= జయించలేక పోవటం; బుద్ధిన్= మనస్సులో; ఎఱుంగుదున్; ఐనన్= అట్లయినప్పటికీ; కౌరవక్ష్మారమణుండు= కురురాజు దుర్యోధనుడు; చేయు= చేస్తున్న; తగు మన్ననలు= ఉచితమైన సత్కారాలు; ఎల్లన్= అన్నిటిని; తలంచి= ఆలోచించి; చూచినన్= చూడగా; ఏన్= నేను(కర్ణుడు); విడిచిపోవుట= కౌరవుల్ని వదలివేసి వెళ్ళటం; ధర్మము+ఎ?= న్యాయమా?; వీరకర్మము+ఏ?= వీరులు చేసే పనేనా?

తాత్పర్యం: ఆ పాండవులు మంచిబలం గలవారు. అదీగాక, కృష్ణుడు వారికి అండగా ఉన్నాడు. అట్లాంటివారిని యుద్ధంలో జయించలేమనే విషయం కూడా నాకు బాగా తెలియును. అయినా దుర్యోధనుడు నాకు చేసే సమ్మానాలు, గౌరవాలు ఎన్నో! వాటిని అంతా తలచుకొని ఆలోచిస్తే, కౌరవులను వదలిపెట్టి, పాండవుల పక్షంలో చేరటం ఏం న్యాయం? అది వీరులకు ఉచితమైన పని కానే కాదు.

వ. అదియునుం గాక. **449**

ప్రతిపదార్థం: అదియునున్+కాక= అంతమాత్రమే కాకుండా,

తాత్పర్యం: అంతేకాకుండా. (తరువాతి పద్యంతో అన్వయం.)

ఉ. మాటలు పెక్కు లాడి యనుమానము లేక సభం గడంగి ప
ల్మాటుఁ బరాభవించితిఁ జలంబునఁ బాండవకోటి కెప్పుడుం
జేటు దలంచి యే బలువు సేసితి వైరము నాకు నింక నీ
వీటికి వారివీటికిని వెక్కస మయ్యెడు కయ్య మొప్పగున్. **450**

ప్రతిపదార్థం: సభన్= కొలువుకూటంలో; కడంగి= ప్రయత్నపడి; అనుమానములేక= సందేహంలేకుండా; పెక్కులు మాటలు= నానా మాటలు; ఆడి= పలికి; పలు+మాటున్= చాలా తడవులు; పరాభవించితిన్= అవమానపరచాను; ఏన్= నేను; చలంబునన్= మాత్సర్యంతో; పాండవకోటికిన్= పాండవుల బృందానికి; ఎప్పుడున్= ఎల్లప్పుడు; చేటు= వారి నాశనాన్నే; తలంచి= కోరి; వైరము= విరోధాన్ని; బలువుచేసితిన్= బలపడేటట్టు చేశాను; నాకున్= అటువంటి నాకు; ఇంకన్; ఈ వీటికిన్= ఈ కౌరవసైన్యానికి; వారి వీటికినిన్= ఆ పాండవుల సైన్యానికిన్నీ;వెక్కసము+అయ్యెడు= దుస్సహమైన; కయ్యము= యుద్ధం; ఒప్పు+అగున్= సమ్మతమైనదౌతున్నది.

తాత్పర్యం: నేను కొలువుకూటంలో కావాలని ఎన్నోసార్లు జంకూగొంకూ లేకుండా దుర్భాషలాడి వారిని అవమానపరచాను. వారిమేలు(గొప్ప) చూచి ఓర్చుకోలేక వారు చెడిపోవాలని విరోధాన్ని బాగా పెంచాను. ఈ కౌరవసేనకు, ఆ పాండవసేనకు, దుస్సహమైన యుద్ధమే తగింది.

శా. దైవాధీనము సర్వమున్ మనమతిం దప్పింపఁగా వచ్చునే?
నీ వింకన్ ననుఁ నొండు వల్కక పరానీకంబుపైఁ బంపు మ
త్సేవాధర్మము నిర్వహించెద బలోత్సేకంబు లోకంబు సం
భావింపన్ విహరించెదన్ మురరిపుం బార్థుం దలంకించెదన్.' **451**

ప్రతిపదార్థం: సర్వమున్= అంతా కూడా; దైవ+అధీనము= దైవానికి అధీనమే; మనమతిన్= మనయొక్క కోరికను; తప్పింపఁగాన్= తొలగించడానికి; వచ్చును+ఏ?= సాధ్యమా?; ఇంకన్= ఇకమీద; నీవు= (భీష్ముడవైన) నీవు; ఒండు+పల్కక= వేరేమాటలు

చెప్పకుండా; ననున్; పర+అనీకంబుపైన్= శత్రువుల సేనమీదికి; పంపుము= పంపించుము; మత్+సేవాధర్మము= నా సేవాధర్మాన్ని; నిర్వహించెదన్= నెరవేరుస్తాను; బల+ఉత్సేకంబున్= నా బలాతిశయాన్ని; లోకంబు= జనము; సంభావింపన్= గౌరవించేటట్లుగా; విహరించెదన్= రణరంగంలో విహరిస్తాను; మురరిపున్= కృష్ణుడిని; పార్థున్= అర్జునుడిని; తలంకించెదన్= అదురగొట్టుతాను.

తాత్పర్యం: అంతా దైవాధీనం. 'బుద్ధిః కర్మానుసారిణీ' ఒక్కొక్కడి కర్మకు తగినట్టు వాడికి బుద్ధి పుడుతూ ఉంటుంది. దానిని తప్పించడం ఎవరి వల్లా కాదు. నీవిక వేరే మాటలు చెప్పడం చాలించి, శత్రుసైన్యాల మీదికి నన్ను పంపించు. నేను దుర్యోధనుడికి చేయవలసిన సేవారూపమైన ధర్మాన్ని నెరవేర్చికొంటాను. నా బలాధిక్యాన్నిలోక మంతా కీర్తించేటట్లుగా యుద్ధ రంగంలో స్వైరవిహారం చేస్తాను. ఆ కృష్ణుడిని, అర్జునుడిని కల్లోలపెట్టుతాను'.

చ. అన విని భీష్ముఁ డిట్టులను నంతకుఁ జాలు టెఱుంగనే? సుయో
ధనునకు నెప్డు నీదుభుజదర్పము కాదె? సహాయ మెద్ది యా
తనికిఁ బ్రియంబు దానిన యుదాత్తమతిం దగ నాచరింపు నీ
మనమున సంతసిల్లు మనుమానము దక్కు మనుజ్ఞ యిచ్చితిన్.' 452

ప్రతిపదార్థం: అనన్= అని చెప్పగా; విని= ఆలకించి; భీష్ముఁడు= భీష్ముడు; ఇట్టులు= ఈ విధంగా; అనున్= అంటున్నాడు; అంతకున్= నీవన్నంత పనికి; చాలుట= తగినవాడవగుట; ఎఱుంగన్+ఏ= ఎరుగనా?(ఎరుగుదును); ఎప్డున్= ఎప్పుడున్నూ; సుయోధనునకున్= దుర్యోధనుడికి; నీదు= నీ యొక్క; భుజదర్పము+అ= బాహుబలమే; సహాయముకాదు+ఎ?= తోడు కాదా?; ఆతనికిన్= ఆ దుర్యోధనుడికి; ఎద్ది ప్రియంబు= ఏది ఇష్టమో; దానిన్+అ= అట్టిదానినే; ఉదాత్తమతిన్= ఉదారమైన బుద్ధితో; తగన్= తగినట్లుగా; ఆచరింపు(ము)= చేయుము; నీ మనమునన్= నీ మనస్సులో; సంతసిల్లుము= సంతోషపడుము; అనుమానమున్= సందేహాన్ని; తక్కుము= వదలుము; అనుజ్ఞ= అనుమతిని; ఇచ్చితిన్= ఇచ్చాను;

తాత్పర్యం: కర్ణుడన్న మాటలు విన్న తరువాత భీష్ముడు ఇట్లా అన్నాడు: 'కర్ణా! నీ వన్న మాదిరి అన్నీ చేయటానికి నీవు సమర్థుడవే అని నాకు బాగా తెలియును. నీ భుజబలమే కదా దుర్యోధనుడికి ఎప్పుడూ సహాయం! అతడికి ఏది ఇష్టమో దానినే నీవు చేయుము. నీవు మనస్సులో ఆహ్లాదంగా ఉండుము. సందేహం వదలివేయుము. అనుజ్ఞ ఇచ్చాను. (ఇక ముందుకు సాగుము.)

విశేషం : భీష్ముడు కర్ణుడిని అర్ధరథుడన్నాడు. అందుకు అలిగి కర్ణుడు - భీష్ముడు యుద్ధం చేసే రోజులలో, తనుగాని తన పరివారంగాని యుద్ధంలో పాల్గొనమని, భీష్ముడు జయిస్తే తాను అడవిపాలౌతానని, లేక భీష్ముడు ఓడిపోతే, అతడిని జయించినవాడిని తాను జయిస్తానని శపథం చేశాడు. కనుకనే ఇప్పుడు అలుక మాని, వాత్సల్యంతో చూచి, మంచిమాటలు వచించుమని ఆ మహాత్ముడిని కోరాడు. భీష్ముడు కూడా కర్ణుడిని బుజ్జగించి ఎన్నో హితోక్తులు పలికాడు. కాని, దైవనిర్ణయాన్నే కాక, కర్ణుడి నిర్ణయాన్ని కూడా భీష్ముడు మార్చలేకపోయాడు.

వ. అని తెలి యొంది పలికిన దేవవ్రతుబంధుభావంబునకుం బరమానందంబు నొంది రాధేయుండును నిజ నివాసంబునకుం జనియె'ననిసంజయుండు ధృతరాష్ట్రునకుంజెప్పెననిజనమేజయునకువైశంపాయనుండు సెప్పుటయు. 453

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారంగా; తెలివిఒంది= ప్రజ్ఞ కలిగి; పలికిన= చెప్పినట్టి; దేవవ్రతుబంధుభావంబునకున్= భీష్ముడి చుట్టరికపు వాత్సల్యానికి; పరమ+ఆనందమున్= మిక్కుటమైన సంతోషాన్ని; ఒంది= పొంది; రాధేయుండును= కర్ణుడు; నిజ

నివాసంబునకున్= తన నివాసానికి; చనియెన్+అని= వెళ్ళాడని; సంజయుండు; ధృతరాష్ట్రునకున్; చెప్పెన్+అని= చెప్పాడని; జనమేజయునకున్= పరీక్షిత్తు కుమారుడికి; వైశంపాయనుండు; చెప్పుటయున్= చెప్పగా.

తాత్పర్యం: ప్రజ్ఞతో గూడిన భీష్ముడు చెప్పిన మాటలు కర్ణుడు విన్నాడు. ఆయనకు గల బంధుప్రీతికి చాలా సంతోషపడ్డాడు. తన నివాసానికి వెళ్ళాడు' అని సంజయుడు ధృతరాష్ట్రుడికి చెప్పా డని జనమేజయుడికి వైశంపాయనుడు చెప్పగా.

ఆశ్వాసాంతము

ఉ. మర్దితతాపసంకలన మంజులనామ! దురంత దుర్దశా
కర్దమలేప నిర్హరణకారి కృపామృత పూర! కర్మసం
మర్ద నిరాస కర్మఠ! సమత్వ పరిస్ఫుట రూప భావనా
నిర్దళితారి వర్గ! మహనీయ! మనోరమణీయవైభవా! 454

ప్రతిపదార్థం: మర్దిత= అణచబడిన; తాప= ఆధ్యాత్మికం, ఆధిదైవికం, ఆధిభౌతికం అనే మూడు రకాల తాపాలయొక్క; సంకలన= సంబంధం కల; మంజులనామ!= మనోహరమైన నామం (పేరు) కలవాడా!; (హరిహరనాథ నామం స్మరిస్తే చాలు తాపత్రయాల సంబంధం నశిస్తుందని భావం); దురంత= దుఃఖాంతమైన లేదా దాటటానికి శక్యం కాని; దుర్దశా= దురవస్థ అనెడి; కర్దమలేప= బురదపూతను; నిర్హరణకారి= పోగొట్టే; కృప+అమృతపూర!= దయ అనే అమృత ప్రవాహరూపం కలవాడా!; కర్మ= సంసార హేతువు లైన కర్మలయొక్క; సంమర్ద= సమూహాన్ని; నిరాస= పోగొట్టటమనే; కర్మఠ!= కార్యాన్ని ఆచరించేవాడా!; సమత్వ= సుఖదుఃఖాలవంటి ద్వంద్వాల పట్ల సమభావంచేత; పరిస్ఫుటరూప= స్పష్టంగా తెలియబడేరూపం గల; భావనా= మనోవ్యాపారరూపమైన భావంచేత; నిర్దళిత= పోగొట్టబడిన; అరివర్గ!= కామక్రోధాదులైన అంతశ్శత్రువులు కలవాడా!; (సుఖదుఃఖాలపట్ల సమభావం కలిగిన చిత్తం కలవారి అరిషడ్వర్గాన్ని నశింపచేసేవాడని భావం); మహనీయ!= గొప్పవాడా!; మనోరమణీయ= మనస్సును రంజింపజేసే; వైభవా!= వైభవం కలవాడా! - హరిహరనాథా!

తాత్పర్యం: భక్తుల తాపత్రాయలను పోగొట్టే మనోహరమైన నామం కలవాడా! దుఃఖదాయకమైన దురవస్థలనే బురద పూతను పోగొట్టే కృప అనే అమృత ప్రవాహం కలవాడా! బలమైన కర్మల బారినుండి భక్తులను తప్పించే సత్కార్యాలను నిర్వహించేవాడా! సుఖదుఃఖాది ద్వంద్వ భావాలయందు సమభావం కలవారి అంతశ్శత్రువులను నశింపజేసేవాడా! భావించిన కొలది మనస్సుకు ఆనందం కలిగించే గొప్పదైన మహిమ కలవాడా! హరిహరనాథా!

క. భసిత పరభాగ! హేలా । లసిత శ్రీవత్స లలిత లాంఛన! పించ
ప్రసృమర రుచి శబలోరగ । విసృమర దీధితి కలాప వేష్టిత మౌళీ! 455

ప్రతిపదార్థం: భసిత= బూడిదతో ఒప్పారే; పరభాగ!= శరీరంలోని ఒక (సగ) భాగం కలవాడా! (హరుడా!); హేలా= విలాసంగా; లసిత= ఒప్పారే; శ్రీవత్స= శ్రీవత్సమనే; లలిత= కోమలమైన, అందమైన; లాంఛన= గుర్తు (గుండెమీద పుట్టుమచ్చవంటి గుర్తు) కలవాడా!; (హరిరూపా); పించ= నెమలి ఈక యొక్క; ప్రసృమర= వ్యాపించే; రుచి= కాంతిచేత; శబల= చిత్రమైన వర్ణం కల; ఉరగ= (మెడలో హారంగా వ్రేలాడే) పాముయొక్క; విసృమర= వ్యాపించే; దీధితి= కాంతిగల; కలాప= చంద్రవంకచేత; వేష్టిత= చుట్టబడిన(అలంకరించబడిన); మౌళీ!= శిరస్సు కలవాడా!

తాత్పర్యం: శరీరంలో ఒక భాగం భస్మంతో అలంకరించుకొన్నవాడా! (హరరూపుడా!), మరొకవైపు విలాసంగా ఒప్పారే శ్రీవత్సమనే అందమైన గుర్తును అమర్చుకొన్నవాడా!(హరిరూపుడా!) తలపై ధరించిన పించం నుండి వెలువడే

కాంతులచేత చిత్రవర్ణాలతో వెలుగొందే సర్పహార కాంతులు ప్రసరించే చంద్రవంకతో అలంకరించబడిన శిరస్సుకలవాడా! హరిహరనాథా!

విశేషం: మొదటి రెండు సంబుద్ధులలో వరుసగా హరుడిని, హరిని కీర్తించి. ఆ తరువాత సంబుద్ధితో హరిహరనాథులను సంయుక్తంగా వర్ణించి తిక్కన హరిహరాభేద తత్వాన్ని ప్రదర్శించాడు.

మాలిని.

క్షరణరహిత వృత్తీ! గ్రాహ్యభక్త ప్రవృత్తీ !
కరణ గమన లీలా! గాఢకారుణ్య శీలా!
స్మరణ శుభదమూర్తీ! మధ్యరశ్మి ప్రవర్తీ !
చరణ వినమదింద్రా! సంతతానంద సాంద్రా! 456

ప్రతిపదార్థం: క్షరణ= నాశనం; రహిత= లేని; వృత్తీ!= ప్రవృత్తి కలవాడా!; గ్రాహ్య= తెలియదగిన; భక్త, ప్రవృత్తీ!= భక్తుల ప్రవృత్తి కలవాడా!; కరణ= ఇంద్రియాల యొక్క; గమన= ప్రసరణం యొక్క; లీలా!= విలాసం కలవాడా!; గాఢ, కారుణ్య, శీలా!= దట్టమైన దయాస్వభావం కలవాడా!; స్మరణ= తలచిన మాత్రంచేతనే; శుభ,ద, మూర్తీ!= మంగళం చేకూర్చే ఆకారం కలవాడా!; మధ్యరశ్మి= ఇడ, పింగళ, సుషుమ్న అనే మూడు నాడులలో మధ్య స్థానంలో ప్రసరించే సుషుమ్నా నాడి ద్వారంలో; ప్రవర్తీ!= ప్రసరించేవాడా!; చరణ, వినమత్+ఇంద్రా!= పాదాలకు నమస్కరించే ఇంద్రుడు కలవాడా! (అంటే పాదాలకు ఇంద్రాదులు సదా నమస్కరిస్తూ ఉంటారని భావం); సంతత+ఆనంద, సాంద్రా!= ఎడతెగని ఆనందంచేత సాంద్రమైనవాడా!

తాత్పర్యం: నాశనం లేని ప్రవృత్తి కలవాడా! భక్తులచేత తెలియదగిన ప్రవృత్తి కలవాడా! ఇంద్రియ ప్రసరణముయొక్క విలాసం కలవాడా! పరమ దయాస్వభావం కలవాడా! తలచినంత మాత్రంలోనే శుభాన్ని ప్రసాదించేవాడా! సుషుమ్నా నాడిలో ప్రవర్తిల్లేవాడా! ఇంద్రాదులు పాదాలకు చేసే నమస్కారాలను స్వీకరించేవాడా! నిరంతరమైన ఆనంద సాంద్రమైన స్వరూపం కలవాడా! హరిహరనాథా!

విశేషం: మాలిని వృత్త లక్షణం: ఒక్కొక్క చరణంలో న,న,మ,య,య గణాలు వరుసగా ఉంటాయి. తొమ్మిదవ అక్షరం యతిమైత్రి. ప్రాస నియమం ఉన్నది.

గద్యము.

ఇది శ్రీమదుభయ కవి మిత్ర కొమ్మనామాత్య పుత్ర బుధారాధన విరాజి తిక్కన సోమయాజి ప్రణీతం బయిన శ్రీమహాభారతంబున భీష్మపర్వంబునందు సర్వంబును తృతీయాశ్వాసము.
శ్రీమదాంధ్ర మహాభారతమునందలి భీష్మపర్వము సమాప్తము.

తాత్పర్యం: ఇది శుభంకరంగా ఉభయకవి మిత్రుడు, కొమ్మనామాత్యుడి పుత్రుడు, పండితులను గౌరవించటం వలన విరాజిల్లేవాడు అని కీర్తించబడే తిక్కన సోమయాజి రచించిన శ్రీ మహాభారతంలోని భీష్మపర్వం ముగిసే మూడవ అశ్వాసం.

భీష్మపర్వంలోని తృతీయాశ్వాసం సమాప్తం.

శ్రీమదాంధ్ర మహాభారతంలోని భీష్మపర్వం ముగిసింది.

శ్రీమదాంధ్ర మహాభారతము

భీష్మ పర్వము

గద్య పద్య ప్రథమ పాద సూచి

పద్యము	పుట
అ	
అంచిత తాలకేతు కిరణాళి	25
అంత	267
అంత	267
అంత	353
అంత	430
అంతఁ దెప్పిరి నీ కొడు కనికి	189
అంతఁ బోవక సూతు	231
అంతక విక్రముండు	125
అంతకుమున్న ధృష్టద్యుమ్న	374
అంతకు సేదదేఱి	232
అంత నంశుమంతుండు	440
అంత నపరాహ్ణంబయ్యె	137
అంత నపరాహ్ణంబయ్యె	200
అంత నరుణకిరణుం డస్వర్ధా	287
అంత నొండొక సారథి	284
అంతయుఁ గనుంగొని	179
అంత వియత్తలం బుదాత్త	335
అంత విరాటుఁడు లయ	257
అందఱమేనుల గంగా	134
అందు నడుమ నరనాథుం	298
అంబకై పూనివచ్చి	27
అంబరము వగుల నార్చి	229
అంబు పవమానసూర్య	103
అంహోమర్దనుఁ డాజనార్దనుఁడు	203
అకట తండ్రి సచ్చినంత	397
అకట నితాంతలోభమున	87
అక్కట తండ్రిలేని మము	404
అక్కట పూజార్హులగు	90
అక్కడ నడచినం గొంతేయా	419
అక్కడి బంధులఁ జంపుచు	86
అక్కుమారుండును దుర్ముఖుని	376
అగ్గలిక దూది దరికొను	207
అచలనిభుఁడగు నలంబసుఁ	122
అజాతశత్రున కిట్లనియె	398
అట్టియెడ	37
అట్టియెడ	117
అట్టియెడ	155
అట్టియెడ	194
అట్టియెడ	258
అట్టియెడ	331
అట్టియెడ	389
అట్టియెడ	408
అట్టియెడం గనుంగొని	123
అట్టియెడం గురుపితా	322
అట్టియెడం గౌరవసైన్యంబు	313
అట్టియెడఁ గృష్ణార్జునులు	65
అట్టియెడ జయద్రథుండు	289
అట్టియెడ ధర్మతనయుం	392
అట్టియెడ ధృష్టద్యుమ్నుండు	175
అట్టియెడ నకులనందనుం	291
అట్టియెడ నర్జునుండు	413
అట్టియెడ నీకొడుకు	159
అట్టియెడ నీకొడుకు	249
అట్టియెడ భీష్ముండు	44
అట్టియెడ శిఖండి	428
అట్టియెడ సౌబలుండు	304
అట్టి సంకులసమరంబున	306
అట్టి సంకులసమరంబున	368
అట్టి సమయంబున	267
అట్టి సమయంబున శిఖండి	302
అట్లు దనవారు మేలుచే	144
అట్లు దాఁకుటయు వారల	372
అట్లు దాఁకుటయు	323
అట్లు వచ్చునా గదఁగని	317
అట్లు శ్రుతాయువు మూర్ఛిల్లినం	173
అడరి కురుసేనపై	420
అడరిన దానవుండు	334
అడరెఁ గాళింగనాయకుం	167
అడవి దరికొనిన	227
అడిదముఁ బలుకయునుం	317
అడుగుటయు నతండతని	296
అతఁడు దానికిఁ దలఁకక	368
అతఁడు దివ్యాస్త్రజాలంబు	429
అతఁడు ధన్వియగుట	331

పద్యము	పుట	పద్యము	పుట	పద్యము	పుట
అతఁడు నొచ్చిన తఱి	27	అధిప యోగీశ్వరేశ్వరుండైన	111	అనిన నాతని పలుకులు	414
అతఁడు నొచ్చియు నాఁటించె	416	అనఘ నీకెదిర్చి యని	71	అనిన నా సూతనందనుండు	370
అతఁడు మఱియును	106	అనయము నుగ్రంబగు	83	అనిన విని కుంభసంభవుండు	250
అతఁ డెంత సాటిచెప్పిన	273	అనల జ్వాలలు పర్వ	102	అనిన విని కృష్ణుం	404
అతఁడొండొక విల్లెత్తిన	387	అన విని గాంగేయుఁ డక్కట	72	అనిన విని చిఱునవ్వు	191
అతనింగాంచి యధిక	399	అన విని నవ్వి పాండవుల	346	అనిన విని దేవకీనందనునకు	77
అతని కప్పుడెదుర	426	అన విని నవ్వి యొక్కఁడు	265	అనిన విని ధృతరాష్ట్రుం	64
అతని జయించునంచు	146	అన విని భీష్మఁ డిట్టులను	454	అనిన విని ధృతరాష్ట్రుం	111
అతనితో నిట్లనియె	59	అని విని యూఱడి నిద్రా	297	అనిన విని ధృతరాష్ట్రుండు	219
అతని మునుమటు	420	అనవుడు	357	అనిన విని నదీసూనుండు	326
అతని యరదంబు	174	అనవుడు	397	అనిన విని నవ్వి యతఁడి	297
అతని రథరక్షకులు	314	అనవుడు ధర్మతనయుండు	149	అనిన విని నీ పుత్రుండు	78
అతిగుహ్యం బిది	97	అనవుడు నతండు	425	అనిన విని పరాశర	08
అతి దృఢంబగు పాఁతు	13	అనవుడు నతండు దుర్దమ	365	అనిన విని యచ్యుతుం	97
అతిరయమున గురుఁడు	211	అనవుడు నప్పరమేశ్వరుం	102	అనిన విని యతండట్ల	151
అతులిత రథప్రతానో	50	అనవుడు నప్పలుకులకు	77	అనిన విని యతండట్ల	183
అత్తఱి నీతనయుం	279	అనవుడు నయ్యిరువురు	378	అనిన విని యతండట్ల	363
అత్తఱి సురఖచరాదుల	68	అనవుడు నవ్వికవ్వడికిం	405	అనిన విని యతండు	432
అత్తెఱంగాచరింపనుం	446	అనవుడు నాంబికేయ	370	అనిన విని యనిమిష	160
అదలిచి ద్రోణుఁడు భీష్ముఁడు	188	అనవుడు నేఁబెనఁగఁగ	400	అనిన విని యమ్మనుజపతికి	17
అది యట్లుండెనప్పుడు	325	అని తలంచి కుంభసంభవాది	269	అనిన విని యర్జునుం	198
అది యట్లుండె నమానుష	60	అని తలంచి తొలంగి	424	అనిన విని యాంబికేయుండు	22
అది యా బాణములెల్ల	299	అనితల నీవు పాండు	241	అనిన విని యాంబికేయుఁడు	58
అదియునుంగాక	11	అని తెలివొందిన మొగంబుతో	399	అనిన విని యా భూపాల	301
అదియునుంగాక	420	అని తెలివొంది పలికిన	454	అనిన విని యోధవీరులగు	280
అదియునుంగాక	453	అని దేవాసురకోటి	436	అనిన విని వారలందఱు	45
అదియునుంగాక	11	అనినం గోపించి శిఖండియు	410	అనిన విని విష్ణుఁడాజిష్ణుని	156
అది శిక్షగాని రోషంబు	451	అనినం బ్రాగ్జ్యోతిషపతి	347	అనిన విని వైచిత్రవీర్యుండు	15
అధిప నానాప్రకార	10	అనినఁ బ్రియమంది నగరికి	360	అనిన విని సంజయుండతని	10
అధిప నీ తనయుండు	65	అనిన గుడాకేశు పలుకు	84	అనిన విని సంజయుండతని	31
అధిప నీవు సెప్పినట్టిద	31	అనిన నట్లకాక యని	447	అనిన విని సంజయుండతనికి	80
అధిప పాండుసుతుల	17	అనిన నట్లకాక యని	240	అనిన విని సంజయుండతనికి	193
అధిప భీమసేనుఁ డడరిన	273	అనిన నాంబికేయుండు	32	అనిన విని సంజయుం	306

పద్యము	పుట	పద్యము	పుట	పద్యము	పుట
అనిన విప్పచ్చుండు	385	అనిమొన దేవదానవుల	357	అనుటయుఁ గౌరవులును	446
అనిన విశోకుండు	278	అనిమొన నోర్తుభీష్మ్ము	405	అనుటయుఁ గ్రీడియిట్టు	404
అనిన సవ్యసాచిసమయ	207	అని యగ్గించినం బొంగి	149	అనుటయు నట్లకాక	198
అని నియమించి కొలువు	35	అని యగ్గించిరంత	162	అనుటయు నతఁడిట్లను	450
అని నియోగించిన నతం	362	అని యగ్గించెనంత	176	అనుటయు నర్జునుండు	385
అని పలికి గాంగేయుం	190	అని యతనికి దివ్యదృష్టి	98	అనుటయు నాతండిట్లను	242
అని పలికి గొనయంబు	299	అని యవ్వల నెఱిఁగించిన	278	అనుటయు నా సూతనందనుం	407
అని పలికి దీనమానసుండగు	448	అని యాడుతులువ మాటలు	361	అనుటయు నిట్లను గంగా	401
అని పలికినం బద్మనాభుండు	352	అని యాతనివలనను	333	అనుటయు వైశంపాయను	03
అని పలికిన విని	406	అని యిట్లయ్యిరువురు	450	అనుటయు సంజయుండతని	111
అని పలికిన విని దుశ్శా	355	అని యిట్లు నాలవనాఁడు	241	అనుటయు సంజయుండది	58
అని పలికిన శాంతనవునకుం	400	అనియె నని చెప్పిన	327	అనుడు దయార్ద్రచిత్తు	105
అని పలికి పారాశర్యం	32	అనియె నప్పుడు గాంగేయుండు	412	అనుడు నతండు	04
అని పలికి పార్థునిం	91	అని యెఱిఁగించి బ్రహ్మ	246	అనుడు నతఁడు పాండవా	380
అని పలికి యచ్యుతుండుచిత	157	అని రట్టియెడ	260	అను నట్టియెడ నర్జునుండు	205
అని పలికి యప్పరమ	110	అనిలజ భీష్ములు దమతమ	253	అనునెడ శిఖండి చాపము	437
అని పలికి యలుకవొడమి	358	అని తనూజుఁ డొక్కరుఁడు	323	అనురూపములగుమాటొడ్డనముల్	154
అని పలికి యూరకుండెం	449	అని వారలవలను సూప	312	అపరాహ్ణసంగతుండగు	267
అని పలికి సంజయు కరంబు	30	అని వెండియు	64	అపరాహ్ణసమయమున	286
అని పలికి సంరంభంబున	192	అని వెండియుఁ బుండరీకాక్షుండు	109	అపుడు సేరి భీముఁడతనికి	350
అని పలికి సమరప్రకారంబునం	424	అని వెండియు వివిధ	94	అప్పలుకు లాకర్ణించి	439
అని పలికి సుదర్శనంబుం	203	అని వేడికొని వినతుండయి	245	అప్పుడనూపభూపాలుండును	344
అని పలుకునంత	389	అని సంజయుండు పలవించు	25	అప్పు డపరాహ్ణంబయ్యె	233
అని పలుమాటలాడి	29	అని సంజయుండు భీష్మా	140	అప్పు డర్జునుండు కేశ	209
అని పురికొల్పికొని	234	అని సంప్రార్థనంబు సేసి	104	అప్పు డా కళింగపతి	169
అని ప్రార్థించినం	390	అని సకౌతుకంబుగా	292	అప్పుడింద్రనందనుండు	299
అని బహుప్రకారంబులం	27	అని సమయంబుసేసి	67	అప్పుడిరావంతుండు	330
అని భీష్ముండు పలికినం	347	అనుచుఁ బటుశక్తి నప్పార్థుని	438	అప్పుడు	386
అని మఱియు ననేక	244	అనుచు నేచి యెదిరిన	202	అప్పుడు	439
అని మఱియు నీదృశంబు	96	అనుచు మఱియు నయిదమ్ము	411	అప్పుడు కృష్ణార్జునులు	83
అని మఱియును	89	అనుచు మొన గడచి	250	అప్పుడు క్రోధమునంగను	419
అని మఱియును	359	అనుచు వగచు పలుకు	375	అప్పుడు గయ్యంబు సాలించి	140
అనిమిషులప్డు సూచి	441	అనుజుఁడు వడ్డ శంఖుఁడు	136	అప్పుడు గాంగేయుండు సేయు	373

పద్యము	పుట
అప్పుడు దేవవ్రతుండు	437
అప్పుడు ద్రౌపదేయులు	365
అప్పుడు ధర్మజ భీమ నకుల	414
అప్పుడు పెక్కండ్రు రథికుల	368
అప్పు డుబ్బి దుర్యోధనుఁ డతి	235
అప్పు డుభయ సైన్యంబుల	366
అప్పుడు భీష్ముఁ డెంతయు	204
అప్పుడు మధ్యందినమున	282
అప్పుడు మన బలంబుల	375
అప్పుడు రెండు సైన్యములు	67
అప్పుడు శల్యనందనుండు	216
అభిమన్యు ద్రుపదసుత	225
అమరతటినీతనూజుపై	77
అమరతరంగిణీ తనయు	132
అమరు తొడవుల వజ్రాంశు	43
అమ్మాట మనమునకు	357
అమ్ముల నేనుఁగు కొమ్ముల	237
అమ్మెయిఁ గౌరవులును	252
అయిదు నారసముల	173
అయిన నీతో నప్పటికప్పటి	385
అయ్యవసరంబున	236
అయ్యవసరంబున గాంగేయుండు	45
అయ్యవసరంబున దుర్యోధనుండు	153
అయ్యాదవసింహుండు	310
అయ్యిరావంతుం డొక్కరుండును	333
అయ్యేడ్పులో నిట్లని	23
అరదంబు రవము సెలఁగఁగ	229
అరదంబులు పొడిపొడియై	276
అరదములు దీవులున్నత	62
అరదములు రథికవరులును	184
అరదములు సవరణలతో	37
అరిబలంబుపై నొక్క దివ్యాస్త్ర	430
అరుణములును సితంబులు	63
అర్కునుదయాస్తమయముల	06
అర్జున చూచితే మన	384
అర్జునుం డడరి ద్రోణాచార్యు	371
అర్జునుఁ డప్పు భీష్ముఁ గని	117
అఱవఱలైన రథంబులు	195
అటిముటి గుట్టపుదడముల	325
అటిముటి నడరిన	178
అటిముటి నీకుమారవరు	254
అలయ కరయనోపిన	445
అలవి యెఱుంగనేరక	145
అలికి యతఁడు సూతుతల	257
అలిగి దశార్ణాధీశుఁడు	349
అలుకదక్కి నన్ను నధిక	450
అవని గంపింప లలిత	203
అవియెల్లను బైఁగురియఁగ	158
అశని కల్పము లివి యర్జును	437
అసుర కినిసి కృతాంత	338
అసురదళన లీలావ్యాప్తి	293
అసుర వెండియుఁ బెక్కు	367
అస్త్రవర్షంబుఁ గురియంగ	280

ఆ

పద్యము	పుట
ఆఖండల నందనుండును	427
ఆ ఘటోత్కచుండు దివిజులకు	339
ఆచార్య ప్రభృతులగు	239
ఆచార్యుఁ దీవ్రఘననారాచము	163
ఆతఁడు చిత్రసేనుని	261
ఆ తూపులు నటికి పరిస్ఫీతం	416
ఆత్మయోధులకెల్ల	23
ఆ ధృష్టద్యుమ్నుండును గలయ	61
ఆ ధృష్టద్యుమ్నుండు సక్రోధుండై	163
ఆ నినదము విని పాండవ	66
ఆపగానందనుండు మురారి	161
ఆ పదివేవురు నెఱ	379
ఆ పన్నిద్దఱు సైన్యాటోప	282
ఆ పృషతపౌత్రుఁ డుద్ధత	216
ఆ బెట్టిదంపుటంపఱిచే	387
ఆ రథనివహంబులు	254
ఆరయ వివృత స్వర్గద్వారము	44
ఆ రాత్రి ధర్మతనయుండు	144
ఆ రాత్రి నిన్ను వీడుకొని	33
ఆ రెండు బలములందును	64
ఆ రౌతులు వీఁడు గాలుమానిసి	332
ఆర్తుఁడై యవ్విశోకుని	277
ఆర్వురును గడంగి హయముల	332
ఆలోనన తెప్పిలిలయ	365
ఆలోనన తెలిసి మెఱుఁగు	369
ఆలోనన మెయిఁ దొమ్మిది	378
ఆ విల్లు ద్రుంచి రౌద్రరసావేశం	283
ఆ వెల్లవ శరజిహ్వాల	161
ఆ శౌర్యం బాసత్త్వం బాశీలం	27
ఆ సమయంబునం గృపశల్య	429
ఆ సాత్యకి వేటొక విల్లాసుర	369
ఆ సేనకుం దలకడచి	207
ఆ సౌభద్రుం డుగ్రపు వేసవి	262

ఇ

పద్యము	పుట
ఇంకఁ బశ్చాత్తాపం బుడిగి	274
ఇంక నమ్మాటలాడుట	327
ఇంక నేమేనియుం జెప్పఁ	443
ఇంటం దెవులనఁ జచ్చుట	44
ఇంత పాపంబు సేయంగ	88
ఇచ్చటికి మీర లందఱు	399
ఇటు దగునయ్య కృష్ణ	206
ఇట్టి వానిఁగ నన్ను మీరెఱిఁగి	401
ఇట్టు లగుటఁ జేసి యెవ్వరి	92
ఇట్టులాడి పిదప నేమియు	411
ఇట్లతిరథ మహారథులం	341

పద్యము	పుట	పద్యము	పుట	పద్యము	పుట
ఇట్లాభీలంబుగా భగదత్తు	237	ఇట్లు పాండవవ్యూహంబు	392	ఇట్లొప్పి సేనాపతియగు	55
ఇట్లు కర్ణసౌబలుల	355	ఇట్లు పాండవ సైన్యంబు	139	ఇతఁడు పాంచాలురాదిగ	361
ఇట్లుక్కు మిగిలి యెక్కిన	330	ఇట్లు పితామహునెత్తి	46	ఇతని తలం పే నెఱింగితి	70
ఇట్లు క్రూర నారాచంబు	302	ఇట్లు పుత్రశోకానల	351	ఇతరేతర శరకృత	367
ఇట్లు క్రేడించి గాంగేయు	159	ఇట్లు పెక్కండ్రతోడం	215	ఇత్తఱి మనుష్యభువనం	244
ఇట్లు గలయన్‌బెరసి	381	ఇట్లు పెద్దయుం బ్రొద్దు	423	ఇత్తెఱంగునం దలపడి	230
ఇట్లు గవిసి	138	ఇట్లు పేర్చి కురుబలంబు	262	ఇత్తెఱంగున నిజ పుత్రుఁ	219
ఇట్లు గవిసి	217	ఇట్లు ప్రతిభటతురంగ	113	ఇత్తెఱంగున నెక్కువ	162
ఇట్లు గవిసి	364	ఇట్లు ప్రళయ కాలతాండవం	131	ఇది కృష్ణద్వైపాయనుండు	452
ఇట్లు గాంగేయుఁ డేయు	199	ఇట్లు బలంబుల నిలిపి	190	ఇది మున్న యేనుద్రోణుఁడు	326
ఇట్లు చిత్రసేనుండు	317	ఇట్లు బల్లిదుండయి	383	ఇదె యేనుఁ గూడవచ్చితి	279
ఇట్లు తృప్తిఁ బొంది మందాకినీ	448	ఇట్లుభయ సైన్యంబులుం	347	ఇద్దెస సుబల తనూజుఁడు	311
ఇట్లు దండ్రినొచ్చినఁ బాండు	343	ఇట్లు భానుమంతునంతకు	170	ఇనుమును రాగియుఁ దగరం	19
ఇట్లు దన్ను బెట్టుగిట్టిన	336	ఇట్లు భీమసేనుఁ జేరంబోయి	279	ఇప్పరమోపాయంబు	108
ఇట్లు దఱిమి గాంగేయు	421	ఇట్లు భూచారియయిన	331	ఇప్పు డే నూరకున్నం	201
ఇట్లు దాఁకి తోమరప్రాస	212	ఇట్లు మాఱులేక తఱుము	364	ఇమ్మెయిఁ గిట్టి వాయుసుతు	325
ఇట్లు దాఁకి విరటు తమ్ముండు	431	ఇట్లు మూర్ఛితుండయిన	308	ఇరుపదేనమ్ముల	158
ఇట్లు దుశ్శాసనుండు సోలి	416	ఇట్లు మెఱసిన	117	ఇరువురఁ గృష్ణుల	415
ఇట్లు దేవవ్రతుండు	428	ఇట్లు లంఘించి	388	ఇలఁ గ్రీడగఁ బుట్టిన	246
ఇట్లు దొడంగి యుద్భట	214	ఇట్లు వడిన కొడుకులం	266	ఇలఁబడిన సహచరుల	314
ఇట్లు ద్రుంచి	378	ఇట్లు వఱపిన నతని	271	ఇల ధూళి యెగసిన	55
ఇట్లు ద్రోణుండు ద్రుపదుం	281	ఇట్లు విరథుండునువిశిఖ	305	ఇవ్విధంబున	240
ఇట్లు ధర్మతనయుండు	393	ఇట్లు వెడలి మకరవ్యూహం	247	ఇవ్విధంబున	217
ఇట్లు ధృతరాష్ట్రునకుం	05	ఇట్లు శ్రుతాయువు సేయివీచిన	171	ఇవ్విధంబునం జెప్పిన	97
ఇట్లు ధృష్టద్యుమ్నుండు	216	ఇట్లు సన్నద్ధుండయి	360	ఇవ్విధంబునం బెక్కు	422
ఇట్లు ధృష్టద్యుమ్నుండు	284	ఇట్లు సారథి వడుటయు	175	ఇవ్విధంబునం బోరు	350
ఇట్లు నడచి కురుక్షేత్రంబు	56	ఇట్లు సునాభుండువడుట	324	ఇవ్విధంబున బ్రతి	52
ఇట్లు నిలిపి యార్చి	227	ఇట్లు సుస్థిరుండై	158	ఇవ్విధంబునఁ గ్రందు	185
ఇట్లు నిలువరించి	415	ఇట్లు సేన మొగ తిరిగినం	255	ఇవ్విధంబునఁ బార్థున	106
ఇట్లు నీ కొడుకులు	275	ఇట్లు సేసిన విని	339	ఇవ్విధంబున గజంబులు	337
ఇట్లు నొచ్చిన వికర్ణుం	290	ఇట్లు సొచ్చి వృకోదరుండు	166	ఇవ్విధంబున ధర్మనందన	273
ఇట్లు పనిచినం బార్థుం	444	ఇట్లెదిర్చినం జూచి	229	ఇవ్విధంబునఁ దాఁకి	229
ఇట్లు పలువురు ధరణీశు లురవ	318	ఇట్లేసి యార్చి వెండియు	349	ఇవ్విధంబున నద్భుత	168

పద్యము	పుట
ఇవ్విధంబున నాచార్యుం	320
ఇవ్విధంబున నాచార్యు	281
ఇవ్విధంబున భూమధ్యంబున	13
ఇవ్విధంబున విషమంబగు	196
ఇవ్విధంబున వృకోదరు	113
ఇవ్విధంబున వెండియు	126
ఇవ్విధంబున శతానీకుం	431
ఇవ్విధంబున శోకసంవిగ్న	88
ఇవ్విధంబున హిడింబాసూనుండు	345
ఇవ్విధమున నాయితమై	111
ఈ	
ఈయనతో రణ మిప్పుడు	240
ఈసునఁ దానుఁ దమ్ములు	230
ఉ	
ఉక్కుటి యొండొకనిరథం	316
ఉక్కున మూఁడు లోకములు	190
ఉక్కు మిగిలి జగతీశులు	312
ఉగ్ర గ్రహములు లయకాల	275
ఉత్తమ క్షత్రియులనెల్ల	423
ఉత్తర సముద్రంబు	14
ఉద్యతులై కవలును	113
ఉద్యద్విక్రములైన	148
ఉన్నచోటన కదలక	189
ఉపప్లావ్యంబున నితండు	396
ఉభయ బలదీప్త కేతు	62
ఉభయసేనలుఁ దమ	140
ఉరమునఁ గటిమైఁ దొడలం	228
ఉరవడించు సమయంబున	112
ఉఱక నరుఁ డట్టు	259
ఉఱక విరాటుబలముపై	138
ఊ	
ఊర్జిత శాత్రవసేనా	189
ఎ	
ఎండిన యడవిన్ దరికొని	138
ఎడఁజొచ్చి చిత్రసేనుఁడు	316
ఎడనెడఁ బఱపై యొప్పెడి	20
ఎన్నఁడును మున్ను వారల	250
ఎన్ని శరముల నభిమన్యు	261
ఎరగలి చిచ్చు గాఱడవి	145
ఎలమి నమస్కరించుచు	393
ఎలసి పయివారి దంతి	65
ఎల్లభంగుల గురు	90
ఎల్లభువనములను	87
ఎల్లవారిఁ గాచు	34
ఎవ్వతనేని ధాత	410
ఎవ్వరికిఁగాఁగ ధరణియు	86
ఏ	
ఏచి దుర్యోధనుండును	155
ఏచి ధృష్టద్యుమ్నుఁ డేడ్తెఱ	121
ఏనవనాఁటి రాత్రి సనుటయు	269
ఏ నాయుధవ్యాపారంబువలన	401
ఏనిక మదమున	48
ఏనుంగు వడిన నచ్చటి	338
ఏనుఁగు నెత్తుట గదయుం	226
ఏనుఁగుల మదము తావియు	57
ఏనును నాదళమున	360
ఏపున హిడింబసుతుఁడును	344
ఏమఱి రక్షసాలని	35
ఏ మెల్లనుండ నీ విట్లుంటి	69
ఏయుఁడు పాడువుం	439
ఏయుమొక నేర్పుమై	410
ఏవురు ద్రౌపదేయులును	290
ఏసి గాండీవి కురుసేన	439
ఏసి తురంగంబుల	258
ఏసి యా రెంటిఁ దునియలు	439
ఐ	
ఐనను గ్రౌంచవ్యూహ	153
ఐనను నాచేతి బలుపు	413
ఐనను నోపిన భంగిని	192
ఒ	
ఒంటిమైఁ గళింగు నురవడి	176
ఒండొక చాపమెత్తి	165
ఒండొరు చండవిక్రమము	162
ఒండొరుల గెలుచు తలఁపున	02
ఒకఁ డొకఁడ పాండుపుత్రుల	153
ఒకని నొకని నై దైదు	366
ఒక్క విల్లెక్కుపెట్టంగ	435
ఒక్క కరంబు మలంచి	451
ఒక్కటఁ గడంగి శల్యుని	380
ఓ	
ఓర్వరాక దానవోత్తము	341
క	
కంటె గాంగేయు నతని	363
కడఁగి నడచి మాయగావింప	333
కడఁగి సుయోధన ప్రభృతి	194
కడుఁ బెద్దకాలంబు గాంక్షించి	288
కడు వడిఁ జని యంతంతం	279
కడువడితోడ నప్పుడు	251
కడువెసఁ గవిసిన	268
కనక భూషణజాలంబు	36
కని కడు నలిగి సుభద్రా	232

పద్యము	పుట
కని కృప బాహ్లికాది	343
కని కౌరవపతి దుశ్శాసనుతో	378
కని తమకించి బలంబులు	185
కని తే రుప్పరవీదిఁ దోలుకొని	178
కని యతఁడు దెలిసి నీచే	351
కని యభిమన్యు ముఖ్యు	235
కని యల్లన నవ్వుచు	214
కనుంగొను జనంబులు	260
కనుఁగొని కురుపతి	251
కనుఁగొని కోపంబున	161
కనుఁగొని పార్షతుం డపుడు	283
కనుఁగొని భీష్ముఁడుల్లము	389
కనుఁగొని శిఖండి వెస	409
కనుఁగొని సాత్యకి యేనుం	256
కనుఁగొని సైన్యముల్ వితిగి	345
కన్నాకు మనకు భీష్ముం	34
కప్పారు రేణువు గమలాప్త	114
కయ్యము సేయక తగు	396
కయ్యము సేయనేనని	390
కరదంత కర్ణమస్తక	336
కరమున నున్న శూలమున	335
కరికర శీకర తురగో	116
కరిఘంటా నిచయస్వనంబులు	115
కరిఘటలు మీఁద భీముఁడు	329
కరుల సందడి నొప్పు	52
కలయఁగఁ గరముల	373
కల్పిత దృఢ చతురంగా	39
కవలుద్దామ పరాక్రమ	409
కవిసి బలముఁ జంపఁగ	235
కవిసి యుగాంతదండధరు	276
కవిసి వ్రేసిన గ్రక్కున	218
కాంచనమయ వేదికా	38
కాంభోజరాజగు సుదక్షిణుం	41
కారుకొని మేఘమాలా	211
కార్చిచ్చు గవిసి మృగతతి	393
కాలంబగుటయు నృపులకు	04
కాలు కాలు వెనఁగి కాలు	409
కాల్పఁడే మహనీయఖాండవం	358
కావున	63
కావునఁ గౌరవపాండవు	22
కావున నీ యుద్భటరథి	35
కినుక వొడమి గంగా	77
కిమ్మీరమర్దనునిచే	292
కిరణంబు లడఁగి యంతకు	268
కీడొనరించిన వారికి	31
కుంతీసూనుఁడు సింహనాదమున	170
కురుపతికిఁ జిత్రసేనుఁడు	260
కురుపతియు ననుజవర్గము	429
కురుపతి యొక నారాచంబు	285
కురు పాండవ సైన్యంబుల	116
కురురాజు యోధవీరుల	263
కురువిభుఁడు నగరు సొచ్చియు	354
కురుసేనఁ జూచి యప్పుడు	211
కులగురువృద్ధు నిర్మలచిత్తు	28
కులనాశము సేసిన	87
కూలెడు గుట్టంబులు ధర	420
కృతవర్మ యేచి మారుత సుతు	305
కృతవర్మ రథము డిగి	137
కృపగురు భీష్మయుక్తముగ	197
కృష్ణసారథ్యమున నొప్పు	180
కృష్ణార్జునాదులుం దోడన	74
కెడసె హయము లొడ్డగెడవయ్యె	209
కేకయు లేవుర బలములు	138
కైలాస శైలాకారంబును	236
కొందఱ సూతులు వొలిపిరి	341
కొడుకుపాటుఁ జూచి కోపించి	169
కొడుకుల దెస నెవ్వగ	22
కొడుకులుఁ దమ్ములు గుట్టపు	40
కొన్నిటి హస్తముల్ సదియ	225
కొన్ని భూముల బలములు	63
కొఱవియుఁ గొఱవియు	137
కోదండదశక శీఘ్రుచ్ఛేదం	266
కోపము సంహరింపు యదుకుం	206
కౌంతేయుండు నగుదునిది	452
కౌరవబలములు దిరిగిన	203
కౌరవబలములు నుడివడ	342
కౌరవ వ్యూహమునకు	61
కౌరవులలోన నిప్పు డెవ్వారితోడ	84
కౌరవులు ప్రకంపగాఢ	447
క్రందుఁ గయ్యంబులోన నరాతి	282
క్రందుకొని యిట్లు మాతంగ	373
క్రందుకొను సర్వధర్మ	107
క్రమ్మఱంగ నేతెంచుగాక	73
క్రూరతకోర్చి యించుకయు	404
క్షరణ రహిత వృత్తి	456
క్షాత్రము దలకొని సంగర	370

గ

గంగయుఁ దుంగభద్రయు	19
గంగానందనుఁ గూల్చి ద్రోణుపని	202
గంగానందనుఁ దాఁక నర్జునుఁడు	258
గంగాపుత్రుఁడు పాండవాగ్రజుని	318
గజఘటలం గనుంగొని	223
గజారాజోజ్జ్వల ఘంటికావళి	382
గజిబిజి లేక యుబ్బక	156
గతి గుందియుఁ బైఁదొరఁగెడు	166
గర్వంబు మెఱయ శిఖండి	122
గాంగేయుచేత నెంతయు	392
గాండీవం బింద్రచాపంబు	50

పద్యము	పుట
గాండీవి గెలువరాదు	359
గిరి డిగు కేసరి చాడ్పున	372
గురుఁడను నురుతరగిరి	165
గురుఁడు భీష్ముండుఁ గలుగంగ	327
గురుఁడు మొదలైన	345
గురుఁడు విరాటుని కోదండ	301
గురు వంపవెల్లి నాఁగుచు	352
గురునిఁ గృతప్రజ్ఞుని	403
గురుసుతు బెడిదపు	259
గెలిచితి రాజులనెల్లను	410
గొదగొని ధార్తరాష్ట్ర లతిఘోర	278

ఘ

ఘోరఖడ్గంబున వానిం దునుమ	339
ఘనతర గర్జాధ్వనులును	112
ఘనతర శోకవేగమున	351
ఘనమయి తోఁచుచున్న యది	59
ఘనశక్తి వైవ నది	174

చ

చండభుజాబలంబు	53
చండవిరోధి తిమిరమార్తాండు	260
చంద్రార్కులు లోచనంబులుగా	101
చలదుర్వీధరలీలఁ గ్రాలు	40
చలముకొని యొరుల	45
చాపము వేడ్కఁ బుచ్చికొని	172
చాపవక్త్రుండు భల్లదంష్ట్రా	24
చావును నోవును మన	219
చిచ్చఱ కన్నుమూసికొని	400
చిత్రసేనుండు సౌభద్రు	376
చిన్నఁబోయి నీ కొడుకులు	241
చుట్టరికంబునన్ మనసుసొచ్చి	73
చూడు మాచార్య నీదు	81
చెంగట నభిమన్యుండు పిశంగ	364
చెప్పిన నతండు వారిం	354
చేకితానుండు గృపునిపై	310
చేదిపతియగు ధృష్టకేతుండు	311
చేయంగల పని యెయ్యది	147
చేయఁ దొడంగిన గాంధారేయులు	184
చొచ్చి చతురంగ వితతులు	287
చొచ్చి పితామహుంగని	248

జ

జంబూనది యనంబరఁగిన	12
జగములకు నాదికారణమగు	101
జగ మెఱుగంగ ద్రోణు నని	150
జననాథులపైఁ బెల్లేసిన	299
జననీవంశంబునఁగల	334
జనియించినంతనుండియు	424
జలరుహంబులు పాండవ	139

డ

డొల్లెడు తలయును	130
డొల్లెడు సూతులు	423

త

తగని పనియని తలంపక	359
తగునె యర్జున యీ	89
తడఁబడె దివ్యబాణముల	419
తదనంతరంబ	116
తదనంతరంబ	178
తదనంతరంబ	259
తదనంతరంబ యుధిష్ఠిరుండు	150
తదనంతరంబ శస్త్ర	83
తదనంతరంబ సాత్యకియు	134
తదవసరంబునం బతి	187
తదవసరంబునఁ బొదివి	286
తదవసరంబున	282
తదవసరంబున నంబర	443
తదవసరంబున నితని	79
తదవసరంబున నుభయ	67
తదవసరంబున వృకోదరుం	348
తదవసరంబున శిఖండి	315
తదవసరంబున సరభసంబున	427
తదవసరంబున సాత్యకి	175
తదవసరంబున సాత్యకితో	417
తదవసరంబున సూక్ష్మజల	434
తనకుఁ గ్రీఁదల యని	443
తనతన శంఖంబును	82
తనతోఁ గాల్వురు సాల	41
తనదు నొవ్వున కలుకక	198
తన భుజసార మేర్పడఁగ	159
తన ముందటి యోధులు	271
తన యురదంబు విశోకుఁడు	284
తనయుఁడు నొచ్చిన	177
తన విక్రమంబు సేనలు	136
తనువుధరఁ బొందకుండఁగఁ	440
తన్నుం దాన యుపశమించుకొని	361
తమకుం దమ యోధవీరులకు	436
తమతమ దేశంబులకై	17
తమ్ములఁ దోలిన నతిరౌద్ర	286
తమ్ముల నొంచిన నగ్రజు	318
తమ్ములు వీఁగినం బతి	231
తటికింజొచ్చి కడంగి	215
తటిమి వికర్ణుడప్పు	290
తటిమి సాత్యకి గృతవర్మ	118
తటిమి సుశర్ముండు దాఁకి	377
తలఁకెడు వాఁడు గాఁడు	238
తలకడచి నడచు ద్రోణుని	271

పద్యము	పుట
తలకొని నీకుం బ్రాణంబులు	358
తలపడి నానాస్త్రముల	262
తలపడి యంత్యకాలశిఖి	264
తలపడి యగ్గురు నందను	344
తల వ్రయ్యలైనఁ బ్రాణంబులును	218
తాఁకి యుజ్జ్వలబాణతతి	250
తాటి సిడము వెఱిగి	132
తాతల మామలన్ సుతుల	86
తాన స్తశిఖరి మఱువడ	399
తిమిరము గవిసినఁ బాండవ	354
తిరిగిన పందల నేటికి	206
తుంగమడువున నాడు	228
తుండంబులు గావించి	303
తునిమి తోడన క్రొవ్వాఁడి	342
తునిసిన బాహా మస్తక	195
తురగనికరంబు తోడం	89
తూర్పు తలగాఁగ నీ సుతు	440
(తూలె) నట్లు దూలిన	428
తెరలక లక్ష్మణుండు	263
తొమ్మిది ఖండములై	14
తొల్లి గురుండు దానవులతోడి	151
తోడంబుట్టువుపాటు సూచి	335
త్రిగర్తపతి మొదలయిన	300
త్రుంచి నవ్వుచు	366

ద

పద్యము	పుట
దనుజ ఖండితుండయి పడి	351
దనుజపతి యేచి దుర్యో	237
దనుజుఁడు మాయాధికుఁ డర్జున	366
దనుజు లొనరించు మాయలు	347
దనుజేంద్రు నిలుచుట	307
దనుజేశ్వరుండు మాయం	367
దాని కతండు చలింపక	285
దాని కయ్యుధిష్ఠిరుండు	57
దానికిం గినిసి శినిమనుమండు	369
దానికిఁ జల మెడలక	338
దానికి ద్రోణకృతవర్మలు	182
దారుణరోషం బడరఁగ	387
దిక్కులఁ దన బాణంబులు	137
దివ్యరథస్ఫార దీప్తిజాలంబులు	49
దుర్యోధను దుర్నయంబున	220
దుర్యోధను మాటకు భుజ	193
దుశ్శాసన వికర్ణ చిత్రసేనులతో	311
దుశ్శాసన వికర్ణ విందాను	354
దూరాంతిక దుర్గమ విస్తార	141
దెప్పరపుఁజోట నీకీయొప్పని	89
దేవ నీదగు దివ్యదేహంబు	100
దేవవ్రతుండు దెగిన	28
దేవవ్రతు పలుకులు	425
దేవా వైశంపాయనుండు	144
దేవా వైశంపాయనుండు	295
దేవా జనమేజయ వసుధా	02
దేవా సురవరు లొక్కటియై	25
దొల్లెడు సూతులుఁ బెలుచం	423
దైవాధీనము సర్వమున్	453
ద్విరదము లొఱగెడివియు	225
ద్రోణాచార్యుండు సుతత్రాణ	369
ద్రోణాచార్యుండు ద్రుపద	328
ద్రోణుండలిగి శరాసనంబు	164
ద్రోణుఁడు గోపించి తనుత్రాణం	377

ధ

పద్యము	పుట
ధనంజయుండును దనకు	314
ధనురాచార్యునిఁ జూచి	343
ధరణినాథ చేకితానుండు	124
ధరణి నెత్తుటఁ దోఁగి	353
ధరణీచక్రము గ్రక్కునం గదల	388
ధాత్రీశ మేరువు దక్షిణంబున	11
ధూళుల మేఘంబులు	352
ధృతరాష్ట్రుండును బుత్రులు	375
ధృతి బలుపొప్ప నిల్చి	308
ధృష్టకేతుండు కౌరవోత్కృష్టుఁడైన	121
ధృష్టద్యుమ్నుఁడు నుజ్జ్వల	224

న

పద్యము	పుట
నకులుఁడు సహదేవుఁడు	221
నగపతియుఁ బోని గజతతి	347
నడచిరనిన విని సంజయునకు	193
నడికిరేయి వచ్చినను నొవ్వ	360
నను మార్కొని గెలువఁగ	73
నన్నుఁ బాసుకేళి నున్న	403
నరనాథ యింక భీష్ముని	355
నరపతులనెల్ల భీష్మున	146
నరసఖుఁడ నీవు సఖుఁడును	245
నరుఁడత్యద్భుత విక్రముం	448
నరుఁడు దనమీఁదఁ దొరఁగెడు	435
నరుఁడు శిఖండిం దటిమిన	428
నరుఁడేచి శిఖండి	421
నరుఁడు ధనుర్గుణారావ	350
నరుఁడు రథికజనంబుపై	329
నలువురు నేవురు బిడ్డలు	06
నాఁడు సభనాడి నంతయు	324
నాఁడె చెప్పఁగన్న నాకు	191
నాకు దేవవ్రతునకు	397
నానాస్త్రంబుల హయముల	311
నానాస్ఫుటవర్ణంబులు	98
నామములఁ బితృపితామహ	185
నాయుల్లమరయ నిను	443